TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY

OU_206001

UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T294.5 S95M Accession No. T 866

Author సుబ్రహ్మణ్యశాస్త్రి

Title శ్రీ మహాభక్తవిజయము, 1923

This book should be returned on or before the date last marked below.

శ్రీరస్తు.

శ్రీ మహాభక్త విజయము

శ్రీ శ్రీపాద. సుబ్రహ్మణ్యశాస్త్రి

గారిచే విరచితము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ప్రకటితము.

1923.

All Rights Reserved.

V. RAMASWAMY SASTRULU & SONS, 292, ESPLANADE, MADRAS

పీఠిక.

భారతదేశమున భక్తి, జ్ఞానము అను రెండును మోక్షసాధనములుగా నెన్నఁబడుచున్నవి. ఇతర దేశములలోఁ గూడ నీసిద్ధాంతములే యుండవచ్చును; గాని భారతీయులు మాత్రమే వీనిని గురించి సంపూర్ణచర్చను గావించినారు. భారతీయులవలెఁ ఆత్మానాత్మవివేకము అన్యులు చేయలేదు. ఈశ్వరవిషయకములగు గ్రంథములు ప్రస్థానములు మన దేశమున నున్నన్ని మఱియెచ్చటను లేవు.

భక్తియుత్కృష్టమా? జ్ఞానము ఉన్నతమా! యను చర్చ శాస్త్రజ్ఞుల సామాన్యము. ఆచర్చతో నాకిప్పుడు ప్రసక్తి లేదు. సామాన్యునకు జ్ఞానమార్గమునకంటె భక్తియోగము సులభము. ఇందులకు ఉదాహరణముగ ఈవిశాలదేశమున జ్ఞానులకంటె భక్తులు అధికముగ నున్నారు. నారదుఁడు సూత్రములను, ప్రతిష్ఠించినమతాచార్యులలో మాధ్వరామానుజులు భక్తియోగమును ఉపదేశించినారు. శ్రీశంకరభగవత్పాదుఁడు మాత్రమే జ్ఞానమును ఉపదేశించెను. భక్తియోగమువలన అనేకులు ముక్తిని గాంచినట్లు మనగ్రంథములు సాక్ష్య మిచ్చుచున్నవి.

ఈశ్వరుని తెలిసికొనుటకు అర్చించుటకు ఐహికాముష్మికఫలములను బడయుటకు భిన్నసాధనములగు ప్రపత్తిమార్గమునకు భక్తియోగమున సమానాధికారము ఉన్నప్పుడు జాతిభేదములు ఎల్ల నెందుకుఁ గాక స్థానం లేని పట్టును! కావుననే భక్తులలో అన్యవర్గములవారును ఉన్నారు. తిరుప్పాణాళ్వారు, చోఖామేళుఁడు, కబీరు, భద్రాచలరామదాసు మున్నగువారి చరిత్రములు ఇందులకు నిదర్శనములు.

ఈగ్రంథమున చిత్రింపఁబడినవారిలో శంకరభగవత్పాదుఁడు, గౌతమబుద్ధుఁడు, వివేకానందుఁడు, పరమహంసరామకృష్ణుఁడు మున్నగువారు కొలఁదిమంది. ఇతరులు, తక్కినవారు అందఱును సగుణోపాసకులు. అందఱును హరిభక్తులు ఒక్కరు. భక్తచరిత్రములలో దశభక్తులను చెప్పుటకు నానేగ్రంథములు చేసినను తెలియఁజేసెను. ఇదిలోకములో నుండు అట్టి మహాత్ముల స్పష్టముగఁ దోఁచకనట నాకుఁ దెలియకుండిగ దానికిఁ జనులకును

స్వేచ్ఛాస్వాతంత్ర్యములను సౌఖ్యానందములను సంఘటించు దేశభక్తులు-హరిభక్తులు, శివభక్తులు మున్నగు భక్తులవలెనే ఈశ్వరసాయుజ్యమును బడయఁగలరు. ప్రకృతము భారతీయులకు ఈశ్వరసాయుజ్యము నొసంగఁగల భక్తులకంటె స్వేచ్ఛాస్వాతంత్ర్యములను సంపాదించు దేశభక్తులే ప్రథమారాధ్యులై యున్నారు.

ఈగ్రంథమున హరిభక్తుల చరిత్రములును, శివభక్తుల చరిత్రములును, ఆళ్వారుల చరిత్రములును, భక్తురాండ్ర చరిత్రములును, దేశభక్తుల చరిత్రములును గలవు. ఈగ్రంథము వ్రాయుటలో భక్తవిజయము, భక్తమాల, భక్తలీలామృతము, భాగవతము, భారతము, రామాయణము, సుబోధినీగ్రంథమాలాప్రచురగ్రంథములు కొన్ని, ఇంకను అనేకగ్రంథములు నాకు సాయపడినవి; కావున ఆయాగ్రంథకర్తలకు కృతజ్ఞుఁడను.

ఇందలి ఆళ్వారుల చరిత్రములు విజయనగరము మహారాజావారి కళాశాలలో సంస్కృతోపాధ్యాయులగు శ్రీయుత మనపల్లి వేంకటరమణాచార్యులుగారిచే వ్రాయఁబడినవి. ఆచార్యులుగారు విశిష్టాద్వైతమతవిషయమున లబ్ధప్రతిష్ఠులు; కావున ఆళ్వారుచరిత్రలు వారిచే వ్రాయఁబడుట ఔత్కృష్ట్యమునకు హేతువు.

శ్రీయుతులు, వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారు ఆంధ్రమున సర్వాంగసుందరమగు భక్తచరిత్ర లేకుండుట సూచించి కోరఁగా నేను ఈమహాభక్తవిజయమును వ్రాసితిని. వేంకటేశ్వరశాస్త్రులుగారి ఆంధ్రభాషాసేవానిరతి అద్వితీయము. ఇది వీరికి దివంగతులును, వీరి పితృదేవులు నగు రామస్వామిశాస్త్రులవారు ఇచ్చిన అమూల్యనిక్షేపము. రామస్వామిశాస్త్రులవారి పాండిత్యము సర్వతోముఖము. వారు, బాల్యమున మాప్రాంతమున అనఁగా: మాయూరికి నాలుగుక్రోశముల దూరమున నున్న దాతూరుగ్రామమున విద్యాభ్యాసము గావించియున్నారు. వారి పాండిత్యమునకును, భాషాసేవకును, వాఙ్మయపోషణమునకును ఉత్కృష్టప్రతిష్ఠకును మాపావనగోదావరీ మధురసలిలములే హేతువులు; కావున మేము గర్వించుచున్నాము.

ఆధునికాంధ్రభాషాచరిత్రలో ప్రప్రథమగణ్య అతిశయసామర్థ్యముగ భాషాసేవగావించినవారిలో రామస్వామిశాస్త్రులవారు అగ్రాసనమలంకరించుచున్నారు. ఆంధ్రభాషాచరిత్రకారుడు వారికీర్తిని గానము సేయు. దేని తెనుగు గ్రంథములకు నైచ్యము నాపాదించుకొనుడు. నేటికిఁ గూడ భాషాసేవనేయుటలో వారివలెవారిని మించినవారు లేరు. ఆంధ్రదేశాకాశమున ధ్రువతారామాత్రముగఁ బ్రకాశించు నక్షత్రములలో వారివలె నామనక్షత్రము ఉత్కృష్టము.

వేంకటరత్నశాస్త్రులుగారు తమ పితృదేవుని పదాంకములనే అనుసరించుట సంతోషావహము. నేడు వారివలెవారి ప్రతిష్ఠాపనము గావించినవారు స్వల్పకాలములో జరిగిన అనితరసాధ్యమగు అభివృద్ధికి ఆశ్చర్యచకితులు కాకపోరు. శాస్త్రులుగారు భాషాసేవ ప్రారంభించిన తరువాతనే ఆంధ్రగ్రంథముల ఆకారములు ఇంగ్లీషుగ్రంథములవలె సన్నుతులను బడయుచున్నవి. వీరియొక్క మహోన్నత సత్కారములం గాంచిన గ్రంథకర్తలను పండితులను ఆంధ్రదేశమునందు అనేకులను ఉన్నారు. శాస్త్రులుగారు ఇకముందు ఆంధ్రభాషలో ప్రకటింపఁబోవు గ్రంథములు అపూర్వములు. వాఙ్మయమునకు ముఖ్యాలంకారములు. వానియందెల్ల శాస్త్రులుగారు ఇప్పుడు తయారుచేయించుచున్న భాషాసర్వస్వము నాయకరత్నము.

ఇంతటిగౌరవములను విడిచి ఔన్నత్యము గ్రహించుటకు పండితులను ప్రార్థించుచు ఈగ్రంథమును విశేషభావముతో ఆంధ్రసోదరులకరకమలములయందు సమర్పించుచున్నాను.

మహేంద్రవాడ.
(నందనసనము)

ఇట్లు, విధేయుడు,
శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి.

విషయసూచిక.

ప్రథమ భాగము.

విషయము. పుట.

హరిభక్తులు.

1	ప్రహ్లాదుఁడు	1
2	అంబరీషుఁడు	18
3	అజామిళుఁడు	24
4	నారదుఁడు	30
5	విభీషణుఁడు	33
6	భీష్ముఁడు	42
7	ఆంజనేయుఁడు	53
8	ధ్రువుఁడు	62
9	కుచేలుఁడు	71
10	సత్యవ్రతుఁడు	76
11	భరతుఁడు	82
12	రుక్మాంగదుఁడు	88
13	గౌతమబుద్ధుఁడు	98
14	శంకరాచార్యుఁడు	103
15	బమ్మెరపోతరాజు	125
16	తులసీదాసు	132
17	మాధవదాసుఁడు	145
18	కల్యాణదాసుఁడు	150
19	హరివ్యాసుఁడు	155
20	మనోమోహనసురదాసుఁడు	161
21	త్రిలోచనదాసుఁడు	167
22	జయదేవుఁడు	175
23	మీరాబాయి	184

విషయము.		పుట.
24 భానుదాసుఁడు	....	188
25 రామరాజు	....	195
26 శిహారుసాహుకారు	....	203
27 త్రిపురదాసుఁడు	....	208
28 కూర్మదాసుఁడు	....	213
29 లాడుబావా	....	219
30 బోధలబావా	....	226
31 సుఖానందుఁడు	....	243
32 అంగదభూపతి	....	248
33 ఏకనాథస్వామి	....	258
34 కబీరుదాసుఁడు	....	275
35 సదాశివేంద్రయతి	....	294
36 రాకాకుంభారు	....	300
37 సమర్థరామదాసస్వామి	....	306
38 లతీఫ్ సాహేబు	....	314
39 గోరాకుంభారు	....	321
40 చోకామేళుఁడు	....	326
41 దామాజీ	....	332
42 పిపాజీరాజు	....	338
43 నానకుదాసు	....	343
44 నరసింహా మేధ	....	352
45 నామదేవుఁడు	....	367
46 సావతాకుంభారు	....	400
47 శ్రీరామకృష్ణపరమహంస	....	408
48 నివేదిత	....	412
49 భద్రాచలరామదాసు	....	418
50 తుకారామస్వామి	....	438
51 జ్ఞానదేవుఁడు	....	454
52 రామతీర్థస్వామి	....	465
53 వివేకానందస్వామి	....	472

విషయము.		పుట.
54 వేమన్న	....	478
55 తరికొండ వెంకమ్మ	....	482
56 ప్రేమాబాయి	....	487
57 గోమాబాయి	....	488
58 రామాబాయి	....	491
59 కర్మాబాయి	....	494
60 మీరాబాయి	....	497
61 జనాబాయి	....	500
62 పిళాబాయి	....	505
63 గుణవతీబాయి	....	506
64 సక్కుబాయి	....	511
65 కువరాబాయి	....	516
66 శీలాబాయి	....	522
67 రామచంద్రభట్టు	....	525
68 జయమల్లరాజు	....	527
69 గిరిధరలాలు	....	531
70 సుహాక్షా	....	534
71 బహిరంభట్టు	....	536
72 కేశవస్వామి	....	539
73 పన్హాజీసింగు	....	542
74 స్వర్ణభాగవతుఁడు	....	546
75 హరిపాలదాసుఁడు	....	548
76 రోహిదాసచాంభారు	....	551
77 నరహరి	....	554
78 గణేశనాథుఁడు	....	557
79 జోగాపరమానందుఁడు	....	560
80 బాలభక్తులు	....	562
81 సురదాసు	....	565
82 కమలాకరుఁడు	....	567
83 జంబుదాసు	....	571

విషయము.		పుట.

ద్వితీయభాగము.

శివభక్తులు.

84 సుందరమూర్తినాయనారు	....	575
85 నేత్రేశనాయనారు	....	588
86 అమర్నీతినాయనారు	....	592
87 చండీశ్వరనాయనారు	....	594
88 నీలకంఠనాయనారు	....	597
89 జ్ఞానసంబంధమూర్తినాయనారు	....	600
90 వాగీశనాయనారు	....	618
91 కారైక్కాలమ్మ	....	627
92 బాలభక్తనాయనారు	....	630
93 చేరమాన్ పెరుమాళ్ నాయనారు	....	633
94 కలిక్కామనాయనారు	....	637
95 సద్వస్తునాయనారు	....	639
96 ఏరిభక్తనాయనారు	....	641
97 గుగ్గులుకలశనాయనారు	....	643
98 దండియడిగళ్ నాయనారు	....	646
99 ఇయర్పగై నాయనారు	....	647
100 మారనాయనారు	....	648
101 మూర్తినాయనారు	....	650
102 నందనారు	....	651
103 అరివాట్టనాయనారు	....	653
104 మానక్కంజార్ నాయనారు	....	654
105 ఆనాయనాయనారు	....	655
106 త్యాగరాజు	....	656
107 దశావంతుడు	....	663
108 సంతోబా	....	667

విషయము. పుట.

109 జగన్మిత్రనాగనాథుఁడు 672
110 సాత్త్వికరాజు 675

తృతీయభాగము.

భగవద్భక్తులు.

111 పొయిగైయాళ్వారు 683
112 పూదత్తాళ్వారు .... ,,
113 పేయాళ్వారు 684
114 తిరుమళిశైయాళ్వారు 686
115 పెరియాళ్వారు 695
116 ఆండాళ్ 701
117 కులశేఖరాళ్వారు 704
118 తిరుప్పాణియాళ్వారు 709
119 తొండరడిప్పొడియాళ్వారు 713
120 తిరుమంగైయాళ్వారు 719
121 నమ్మాళ్వారు 728
122 మధురకవియాళ్వారు .... ,,
123 యామునాచార్యులు 735
124 ఇళైయాళ్వారు (రామానుజులు) 744
(పాండురంగక్షేత్రమాహాత్మ్యము) 758
125 పుండరీకుఁడు 767

చతుర్థభాగము.

దేశభక్తులు.

126 బాలగంగాధరతిలకు 771
127 మోహనదాసకరంచంద్ గాంధి 782
128 డాక్టర్. (సర్) యస్. సుబ్రహ్మణ్య అయ్యరు, కే.టి.సీ. ఐ. ఈ. 789
అనుబంధములు 793

శ్రీరస్తు.

శ్రీమహాభక్తవిజయము.

ప్రథమభాగము.

---

1. ప్రహ్లాదుఁడు.

శ్రీయజ్ఞవరాహరూపమున శ్రీమహావిష్ణువు హిరణ్యాక్షుని సంహరించివేయుటచే వాని తమ్ముఁడగు హిరణ్యకశిపుఁడు అన్నను జంపిన పగఁ దీర్చికొనవలయు నని దీక్ష వహించెను. పిదప నాతఁడు తన యన్న నిమిత్తము వగలం బొగులుచున్నవారి నెల్లర నూరడించి, తనకు ముసలితనము, చావు, దుస్సాధ్యుఁడైన వైరియు, లేకుండునట్లును, ముల్లోకములను శాసించు శక్తియు, యుద్ధరంగములయందు సంతతవిజయము, సింహపరాక్రమమును గలుగునట్లును వరములను సంపాదింపఁగోరి, మందరపర్వతమున కరిగి, యొంటికాలి బొటనవ్రేలిమీఁద నిలిచి, యూర్ధ్వబాహుఁడై, యాకసము జూచుచు బ్రహ్మదేవుని గుఱించి ఘోరతపస్సు ప్రారంభించెను. నిశ్చలతపస్సమాధినిష్ఠాగరిష్ఠుఁడైన యా రాక్షసునిపై పుట్టలు మొలిచెను. చెదలు మున్నగు పురుగులచే శరీర మంతయు జీర్ణించెను.

చారులచే వాని తపోవృత్తాంతము దేవేంద్రునకు వినవచ్చెను. హిరణ్యకశిపుఁడు తపస్సునకు వెడలకపూర్వ మాతని భార్య లీలావతికి గర్భోత్పత్తి యయ్యెను. దేవేంద్రుఁ డదాటున రాక్షసపురిపై దండు విడిసి రాక్షసులను జంపి చెండాడి లీలావతినిఁ జెఱపట్టి స్వర్గపురమునకు బయలుదేఱెను. మార్గమధ్యమున నారదుఁడు వచ్చి కలిసికొని హిరణ్యకశిపుఁడు మృతిఁబొందలేదని చెప్పి లీలావతి గర్భమునను న్న బాలుఁడు దేవతల నుక్కడంచు క్రూరుఁడుగాక శ్రీమన్నారాయణుని భక్తాగ్రేసర చక్రవర్తి యని యెఱింగించి లీలావతిని విడిపించి తన యాశ్రమమునకుఁ

గొనిపోయెను. అచ్చట నారదుఁడు లీలావతి కుపదేశించు నెపమున నామె గర్భమున నున్న బాలునకు శ్రీమహావిష్ణుభక్తితత్త్వము నామూలాగ్రముగ నుపదేశించెను. బాలుఁ డంతయు నాకొట్టి యవగాహనము చేసికొనియెను.

అచట హిరణ్యకశిపుని తపోవహ్నికిఁ దాళఁజాలక సప్తకులపర్వతములతో భూమి గడగడవడకెను. సప్తసముద్రములును గలఁగిపోయెను. గ్రహములతోఁగూడ నక్షత్రములు చెదరిపోయెను. దిక్కులు మండిపోయెను. జంతువు లన్నియు గుండెబెదరువలన భయకంపితములయ్యెను. దేవతలకు మీఁదిప్రాణములు మీఁది కెగిరిపోయెను. అంతకంతకు దేవేంద్రుని భీతి పెరిఁగిపోయెను. ఇఁకఁ జేయునది లేక సురలెల్లరును బ్రహ్మదేవుని చెంతకుఁ బోయి "దేవదేవా! దితికొమారుఁడగు హిరణ్యకశిపుని తపస్సువేఁడిమివలన మాడిపోవుచున్నాము. దైతేయ తపోగ్నికీలావృతమైన స్వర్గపట్టణములోనికనుండఁజాలము. సురజ్యేష్ఠా! మూఁడులోకములను జయించుటకును, దేవతల నెల్లరను భస్మముచేయుటకును, వేదశాస్త్రములను నాశనముచేయుటకును వాఁడుకోరుచున్నాఁడు. నీవలెనే తపోమహిమచే ననంతమహిమసంపాదించి యీవిశ్వమును తలక్రిందులుచేసి వేఱొక విశ్వమును నిర్మింపఁగోరుచున్నాఁడు. వాణీనాథా! కారుణ్యనిధీ! మాప్రాణము లన్నియు నీయఱచేత నున్నవి. మమ్ము రక్షింపు మహాప్రభూ!" యని ప్రార్థించిరి.

తోడనే ప్రజాపతి దివిజుల కభయ మొసంగి, భృగుదక్షాదులతో మందరపర్వతమున కరిగి "అసురకులసార్వభౌమా నీతపస్సునకు మెచ్చితిని. ఇట్టి తపస్సుచేసినవా రిదివఱ కెవ్వరును లేరు. పిపీలికాదికము మేదోమాంసరక్తచర్మములను భక్షించినను, గట్టి, వెదురుపొదలుగలపుట్టలోఁ బ్రాణములతో నిలిచి గాఢతపస్సుచేయుట నీకే తగును. నీసామర్థ్యమునకు నాహృదయ మానందపూర్ణమైనది. వత్సా! కోరిన కోర్కులెల్ల నిచ్చెదవేఁడు" మని చెప్పి కనుండలూవకమును ఆతనిపైఁ బ్రోక్షించెను. వెంటనే హిరణ్యకశిపుఁడు యథారూపముతో వల్మీకమునుండి వెలువడి విధాతకు మ్రొక్కి కరకమలములు ముకుళించి "చతురాననా! ఈసచరాచరప్రపంచమున కంతకు నీవే యాధారుఁడవు. రజస్సత్త్వతమోగుణసహితుఁడవై విశ్వమును సృజించి, పెంచి, తుదకు నాశనము

చేసి యానందించెదవు. ప్రళయకాలమున జగ మంతయు నంధకారా వృతమై యుండఁగా మందహాసచంద్రికలచేఁ బ్రకాశము గలిగించు పరంజ్యోతి వగు నిన్ను గొనియాడ నేనెంతటివాఁడను? ఆదిమధ్యాంత రహితుఁడవైన నీతత్త్వ మవాఙ్మానసగోచరము. భక్తుల కోరికలు తీర్చి రక్షించుటలో నీవంటివారు లేరు. అట్టి మహానుభావుఁడవు. నీవు కృప చేసి యభయ మిచ్చితివి గాన నాకోరిక విన్నవించుచున్నాను.

శా. గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్
రేయిన్ ఘస్రములన్ దమఃప్రబలభూరిగ్రాహరక్షోమృగ
వ్యాఘ్రాదిత్యనరాదిజంతుకలహవ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువు లేనిజీవనము లోకాధీశ! యిప్పింపవే" (భాగ.స్కం.7.ప.19)

మఱియు రణములయం దెదురులేని శౌర్యమును, లోకపాలురను శాసిం చు మహిమయు, త్రిలోకవిజయమును గూడ దయచేయు మని ప్రార్థిం చెను.

అప్పుడు బ్రహ్మ "కశ్యపకుమారా! ఈవరములన్నియు మిగులదుర్ల భములు. ఇట్టి ఘోరతపముచేసి యిట్టి గొప్పవరములు కోరినవా రిది వఱకు లేరు. సంతోషముతో నీకోరిక లన్నియు నిచ్చితిని. బుద్ధిమంతుఁ డవై సన్మార్గగామివై మంగళములు పడయు" మని దీవించి తన లోక మునకుఁ బోయెను.

వెంటనే హిరణ్యకశిపుఁడు విష్ణువుపైఁ గత్తిదూసెను. విద్యాధ రాప్సరో యక్షరక్షో గంధర్వకిన్నరాదులను నానావిధములఁ బీడింపఁ జొచ్చెను. స్వర్గపట్టణమును ముట్టడించి దేవేంద్రుని జయించి సుధర్మ నాక్రమించెను. ప్రకృతి యంతయు సకలాభీష్టములను దీర్చుచు నాతనిని సేవింపసాగెను. ఇదిచూచి యోర్వఁజాలకయు, వానివలని బాధలుసహిం పలేకయు నిర్జరు లెల్లరు శ్రీమన్నారాయణునిదరి కరిగి యనేకవిధముల వినుతించి ప్రసన్నునిఁ గావించుకొని "ఆర్తత్రాణపరాయణా! హిరణ్య కశిపుని బాధనుండి మమ్ము రక్షింపు" మని ప్రార్థించిరి. అంత జనార్దనుఁ డు "అమరవరులారా! తొందరపడవలదు. బ్రహ్మయొసఁగిన వరములవలన గర్వించి వాఁ డట్లు పోతరించియున్నాఁడు. వాని కాలము సమీపించు చున్నది.

ఆ. శుద్ధసాధులందు సురలందు శ్రుతులందు, గోవులందు విప్రకోటియందు
ధర్మపదవియందుఁ దగిలినాయందు వాఁ, డెన్నఁడలుఁగునాఁడె హింసనొందు.

క. కన్నకొడుకు శమదమసం,పన్నుఁడు నిర్వైరుఁ డనఁగ ప్రహ్లాదుని వాఁ
డెన్నఁడు రోషంబున నా,పన్నతఁ నొందించు నాఁడె పట్టివధింతున్.

(భాగ. స్కంధ. 7. ప. 111, 112)

అని యభయ మొసంగెను. విబుధు లాసమయమును నిరీక్షించుచుఁ దమతమ నిలయములకుఁ బోయిరి.

హిరణ్యకశిపునకు లీలావతీదేవియందు నలుగురు కుమారులు పుట్టిరి. వారిలో నొక్కని పేరు ప్రహ్లాదుఁడు. ఆతని చరిత్రము చాల విచిత్రము. అది యంతయుఁ జూచి హిరణ్యకశిపుఁడు తులసీవనమున గంజాయి మొక్క మొలిచె నని నగసాగెను. రాక్షసు లందఱును దెల్లవోయిరి.

రాక్షసేశ్వరుని కుమారుఁ డగు ప్రహ్లాదునకు హరిభక్తి యలవడెను. ఆతఁడు నారాయణా! యని పలుకుచు నిద్రనుండి లేచును. శ్రీహరీ!యని పలుకుచు నిద్రించును. వాసుదేవా! లక్ష్మీపతీ!యని కలవరించును. ఆటలయందు, పాటలయందు, సంతోషసమయమున, విచారకాలమున, కేశవా, దామోదరా, భక్తత్రాణపరాయణా,యని శ్రీవిష్ణువును గీర్తించును. కేశవార్పణ మనకుండ బాలుద్రావి యెఱుఁగఁడు. ఆతనికి మాటలు సరిగ రానపుడు హిరణ్యకశిపుఁ డేమో పలుకఁబోవుచుండె నని యానందించుచుండెడివాఁడుగాని నారాయణా యని స్పష్టముగ నుచ్చరింపఁజాలినది మొదల దేఁగనిగ విచారములు సేయసాగెను. ఎన్నివిధముల యోచించినను హిరణ్యకశిపునకుఁ గుమారుని హరిభక్తికిఁ గారణములు తోఁపవయ్యెను. ఎన్నిమార్గములఁ బ్రయత్నించినను ప్రహ్లాదుఁడు హరిసంకీర్తనము మానఁడయ్యెను.

హిరణ్యకశిపుఁడు "విష్ణువు మంచివాఁడు గాఁడు. పాపాత్ముఁడు. వానినిఁ దలంపఁగూడదు తండ్రీ!" యని పసిబిడ్డ యగు ప్రహ్లాదుని లాలించి చెప్పెను. ప్రహ్లాదుఁడు కొంచెము పెద్దవాఁడైనతరువాత "హరి మన కులమునకు గర్భశత్రువు. వానినిఁ దలఁపెట్టకుము నాయనా" యని బోధించి చెప్పెను. పిదప "నారాయణుని స్మరించుటమానితివేని రత్నా

భరణాదు లనేకము లిచ్చెద" నని యాశ చూపెను. పిమ్మట "దామోదరుని మఱచిపోవేని నిన్ను నేను విడిచిపెట్టెదను. మీయమ్మదగ్గఱకుఁ బోనీయ"నని చెప్పెను. తరువాత "మాధవుని యాసు తెచ్చెదవేని నిన్ను నఱకివేసెద"నని చెప్పెను; గాని ప్రహ్లాదునియెడలఁ జతురుపాయములును గూడ వ్యర్థము లయ్యెను. ఆతని కెవ్వరును బోధింపఁజాలక పోయిరి.

తండ్రి వలదనినకొలఁదిని ప్రహ్లాదుని హరిభక్తి పెరిఁగిపోయెను. ఒకదినముకంటె నొకదిన మాతఁడు విష్ణుచింతనమువలన ప్రపంచమును మఱచిపోసాగెను. ఆకసము జూచి శ్రీహరీ యని పిలుచును. క్రిందఁజూచి పద్మనాభా యని కీర్తించును. ఎదుటఁజూచి హృషీకేశా యని కౌఁగిలించుకొనును. కన్నులు మూసికొని పురుషోత్తమా యని భజనసేయును. చూచుచుండఁగనే శ్రీపతి, ఆర్తత్రాణపరాయణా, మధుసూదనా యని నృత్యము సేయును.

సీ. త్రిప్పఘుఁడై తన్ను జేరినయట్లైనఁ జెలికాండ్రైనఁ జేసి మఱచు
నసురారి దనమ్రోల నాడినయట్లైన నసురబాలురతోడ నాడి మఱచు
గమలాక్షుఁడు సంభాషించిన ట్లైనఁ బరిభాషణములు మాఱుపలుక మఱచు
సురవంద్యుఁ దనలోనఁ జూచినయట్లైనఁ జొక్కి సమస్తంబుఁ జూడ మఱచు
గీ. హరిపదాంభోజయుగచింతనామృతమున, నంతరంగంబు నిండిన ట్లైన నతఁడు
నిర్భరానందపూర్ణుఁడై నిగుచు నన్నియును మఱచి, జడతలేకయు నుండును జడునిభంగి.
సీ. వైకుంఠచింతావివర్జితచేష్టుఁడై యొక్కఁడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుఁడై యుద్ధతుఁడై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియ కాని వేఱొండు లేదని యుబ్బి నగుచుండు నొక్కచోటఁ
నళినాక్షుఁ డను నిధానము గంటి నేనని యుబ్బి గంతులువైచు నొక్కచోటఁ
గీ. పలుకు నొక్కచోటఁ బరమేశుఁ గేశవుఁ, బ్రణయహర్షజనితబాష్పసలిల
మిళితపులకుఁడై నిమీలితనేత్రుఁడై, యొక్కచోట నిలిచి యూరకుండు.

(భాగ. స్కం 7. ప. 122-124)

హిరణ్యకశిపుఁడు క్రమక్రమముగ మి[illegible]ంటఁ బెరిఁగిపోవుచున్న కుమారుని హరిభక్తిఁ జూచి "నిర్వాక్యపా[illegible] వెట్టిసిఁ బెంచివేయు

చున్నది. ఊపిరి తిరుగని పనిలోఁ బ్రవేశపెట్టినచో వీఁడిది యంతయు మఱచి పోవును. బాల్యమునందే దీనికిఁ దగు నుపాయము చూడకున్నఁ బిదప నపాయము సంభవించును. వీనికిఁ దెలివి తేటల కేమియు లోపము లేదు. తెలివిగల బాలురహృదయమును జదువుకంటె నుఱేదియుఁ బూర్తిగ వశముచేసికొనఁ జాలదు; గాన వీనికి విద్యాభ్యాసము గావింపవలె" నని తలంచి కులగురువు లగు శుక్రాచార్యుని కుమారులను చండుఁడు అమర్కుఁడు అను పేరుగలవారిని రప్పించి "మీరు మాకు గురువులు. మీతండ్రిగారియెడల మాభక్తి యచంచలము. మాకు మీయెడలఁ గూడ నట్టిభక్తియే కలదు. మీకు మాపైఁ గల యను గ్రహము విశ్వవిదితము. మాయభ్యుదయమే తపఃఫలముగా భావించి యున్న మీఋణమును మేము తీర్చికొనఁజాలము. మేము మీతండ్రి గారి పాదములను గొలిచి విజ్ఞానమును బడసితిమి. మా కుమారుఁడు ప్రహ్లాదుఁ డిప్పుడు విద్యాభ్యాసమునకు దగియున్నాఁడు. వానినిఁ గొని పోయి విజ్ఞానభిక్షఁ బ్రసాదింపుఁడు. ఏకారణమువలననో యతనికి దైత్య విరోధియగు హరియెడల భక్తి కుదిరినది. దానిని మీరు సమూలముగఁ బెఱికివేయవలెను. దానితోఁ గూడ నాహృదయమున నాటుకొనిన చింతాశల్యమును మీరే పెఱికివేయవలెను. మాయర్థము లన్నియు మీవి మాప్రాణములు మీచేతి లీలాకుసుమములు" అని చెప్పి వారికిఁ బ్రహ్లాదు నప్పగించెను.

చండామర్కులు మహానందముతోఁ బ్రహ్లాదునిఁ బాఠశాలకుఁ గొనిపోయి. ఆతనితో సమానవయస్కులును, బుద్ధిగలవారు నగు మఱి కొందఱు రాక్షసబాలురను జేర్చికొని చాల శ్రద్ధతో విద్య చెప్పసాగిరి. ప్రహ్లాదుఁ డొక్క అక్షరమైనఁ దప్పకుండ గురువులు చెప్పిన దంతయుఁ జదివెను. ఈప్రపంచ మంతయుఁ గేవలము మిథ్య యని నమ్మియుండుట వలన గురువు లేది యెట్లు చెప్పిన అట్టిట్లనక వల్లించెను.

పిదపఁ గొన్నిదినములకు హిరణ్యకశిపునకుఁ గుమారుని విద్యాభ్యాసక్రమమును బరీక్షింపవలయు నని తలంపు గలిగెను. లీలావతిగూడ "నేను బిడ్డనిఁ జూచి చాల దినము లైనవి. వానినిఁ జూడక నాకన్నులు కాయలుకాచిపోయినవి. ఒక్కమాఱు రప్పింపు"డని కోరెను. తోడనే

యసురేశ్వరుఁడు ప్రహ్లాదుని గొనిరావలసిన దని చండామర్కులకు వర్తమానము చేసెను.

మహానందముతోఁ జండామర్కులు ప్రహ్లాదుని వెంటనిడుకొని రాజభవనము సొచ్చిరి. అల్లంతదూరమునందే చూచి ప్రహ్లాదుఁడు తల్లి చెంతకుఁ బరువెత్తిపోయెను. ప్రియమారఁ బుత్త్రుని నుత్సంగంబునఁ జేర్చి ముద్దుగొని లీలావతి పిదప భర్త కిచ్చెను. హిరణ్యకశిపుఁడు గూడఁ బ్రహ్లాదుని మిగుల నానందముతో ముద్దులుగొని కుశలప్రశ్నలయిన తరువాత “చిట్టితండ్రీ! అక్కడఁ దోడిబాలురతోఁ గలిసి నీవు గురువులు చెప్పిన దంతయు శ్రద్ధగాఁ జదువుచున్నావుగదా? గురువులు సులభముగా బోధయగునట్లుపదేశించుచున్నారుగదా? విద్యమఱచిపోవుచుండుట లేదుకదా! వేదశాస్త్రములు వల్లించుచుంటివిగదా?” యని ప్రశ్నించెను. ఇది విని చండామర్కులు ప్రహ్లాదకుమారుఁ డేమిచెప్పునో యని వినుటకు నిరీక్షించుచుండిరి. అప్పుడు బాలుఁడు “గురువుగారు చెప్పినదంతయుఁ జదివితిని. అందలి సారముగూడ గ్రహించితి” నని చెప్పెను. హిరణ్యకశిపు డీమాటల కెంతయు నానందించి “తండ్రీ! ఎంత వాఁడవైతివి? ఆసార మేది చెప్పుము నాయనా!” యని సుఱిల నడిగెను. “తండ్రీ! గాఢాంధకారపూరిత మగు సంసారకూపమునఁ గూలక, నేను, నీవు అను భేదభావమును జేరనీయక, సర్వము నాతనికళయే యని విష్ణునియందు హృదయమును జేర్చి యెల్లపు నడవి నుండుట మే”లని ప్రహ్లాదుఁడు చెప్పెను. ఇదివిని హిరణ్యకశిపుఁ డులికిపడెను. లీలావతి యేమికొంపమునుఁగునో యని యదరిపడెను. ఇదియేమి వింత యని చండామర్కులు విన్నఁబోయిరి. అప్పుడు పొంగిపొరలివచ్చు కోపమును దిగమ్రింగుకొని హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని బుజ్జగించి, లాలించి “తండ్రీ! సహజముగ నీకిది తోఁచెనా? గురువులు గాని యితరులుగాని బోధించిరా! ఎవరైనఁ జెప్పుచుండఁగా విని యిదే మంచిదనుకొంటివా? మనజాతికి నీవు చెప్పిన విష్ణువు గర్భశత్త్రువు. వానిని మనము తలఁచుకొనుట గూడఁ దగదు. చిట్టిబాబూ! మనపని యేమో తెలియునా? సురలను బాఱఁదోలవలెను. దేవేంద్రాదులను ద్రుక్కింపవలెను. సిద్ధులను వేధింపవలెను. మునీశ్వరులను బాధింపవలెను. యక్షకిన్నర గంధర్వవిహంగనాగాదులను నాశనముచేయవలెను. ఈతీరున విష్ణు

పక్షమువారి నందఱను ద్రిప్పిత్రిప్పి కొట్టవలెను గాని నీకీవెఱ్ఱి యేల?" అని పలికెను.

ఈమాటలు వినుటవలనఁ బ్రహ్లాదునకుఁ జిఱునవ్వువచ్చెను. అప్పు డాతఁడు తండ్రినిఁజూచి "ఎంతవెఱ్ఱి కొందఱు జ్ఞానరహితులు నేను నీవు అను మాయలోఁగూలి సర్వప్రపంచమును వ్యాపించియున్న శ్రీమన్నారాయణునిఁ దెలిసికొనఁజాలరు. వేదవేదాంగవిదులైనవారు శ్రీహరినిఁ దక్క నితరముఁ జూతురా? సూదంటురాయివలన నినుము మెట్లు ఆకర్షింపఁ బడునో యావిధమున హృషీకేశునివలన నాహృదయ మాకర్షింపఁ బడుచున్నది నాయనా! ఇది యొకరు నేర్పవ వచ్చునా?

సీ. మందారమకరందమాధుర్యమునఁ దేలు మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు రాయంచ సనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియై చొక్కు కోయిల సేరునే కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరక మరుగునే సాంద్రనీహారములకు

గీ. నంబుజోదరదివ్యపాదారవింద, చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ జేరనేర్చు, వినుతగుణశీల మాటలు వేయు నేల?

(భాగ. స్కం. 7 ప. 150)

ప్రహ్లాదునిపైఁ జండామర్కులకుఁ జాలఁ గోపము వచ్చెను. "అయిదేండ్ల బాలుఁడవు. రవంతలేవు మాటిమాటికి నెదురువాదములు చేసెదవు మేము కష్టించిచెప్పిన దించుకయు నిచ్చటఁ జెప్పవు. రాక్షససార్వభౌముని యెదుట మాకుఁ దలవంపులు ఘటించితివి. మా ప్రభువునకు నీవు శత్రుఁడవు గాని పుత్రుఁడవుగావు. చందనవనముఁ బోలు రాక్షసకులమునఁ దుమ్మచెట్టువలెఁ బుట్టితివి. ఎప్పుడు రాక్షసుల శత్రువునే కీర్తించెదవు. నీకేమి పోఁగాలము వచ్చినది? ఇఁక నీవు మంచి మాటలకులొంగవు. దనుజచక్రవర్తీ. ఇప్పటికిట్లయ్యె నని నీవు మాపై గోపింపకుము. కోపించియో, దండించియో యెట్లో నీకుమారుని వెఱ్ఱి కుదిర్చి మంచిమార్గమునఁ బ్రవేశపెట్టుదుము. ఇప్పటికి సెల విమ్ము" అని చండామర్కులు హిరణ్యకశిపు నొప్పించి, యాతని సెలవు బడసి, ప్రహ్లాదునిఁ దోడ్కొని వెడలిపోయిరి.

మఱలఁ గొన్నిదినములు విద్యాభ్యాసము జరిగెను. చండామర్కులకుఁ బ్రహ్లాదుని మతి తిరిగిపోయిన దని తోఁచెను. వారు

మొకట నీసంగతి లీలావతితోఁ జెప్పిరి. ఆమె యందులకు మిగుల నానందించి, కుమారుని ముందుగఁ దనచెంతకు రప్పించుకొని చక్కఁగ నలంకరించి "నాచిట్టితండ్రీ! నీతండ్రికిఁ గోపమువచ్చు పనులు సేయకుము. నీతండ్రి త్రిలోకములను జయించెను. దేవత లెల్లరు నాతని పద సేవఁ జేయుచున్నారు. అంతవానికి నీవు తీరని చింత గలిగింపవచ్చునా? తండ్రికిని గొడుకునకును సయోధ్య లేదని వైరులు లోకువసేయరా? నాకూనా! ఇఁక నీ తండ్రియెదుట శ్రీహరిపేరు నీనోట వెలువడనీయకు" మని బోధించి తండ్రిచెంతకుఁ గొనిపోయెను. లీలావతి యుపదేశమైన పిదప "కుమారా! మేము చెప్పినది మఱచిపోకుము. మానుతమునకు విఘాతము గలిగింపకుము. నీతండ్రియెదుట మన విరోధిపే రెత్తకుము" అని చండామర్కులుగూడ బోధించిరి. ప్రహ్లాదుఁ డన్నియు వినియెను.

ఎల్లరును సభాస్థలమునకు బయలుదేఱిరి. హిరణ్యకశిపుఁడు మహావైభవముతోఁ గొలువుదీఱియుండెను చండామర్కులు—

సీ. "అడుగఁడుగునకు మాధవానుచింతనసుధా, మాధుర్యమున మేను మఱచువాని
అంభోజగర్భాదు లభ్యసింపఁగలేని, హరిభక్తి పుంభావమైనవాని
మాతృగర్భముసొచ్చి మన్నది మొదలుగాఁ, జిత్త మచ్యుతుమీఁద జేర్చువాని
నంకించి తనలోన నఖిలప్రపంచంబు, శ్రీవిష్ణుమయ మని చెలఁగువాని

గీ. వినయకారుణ్యబుద్ధివివేకలక్ష్మ,ణాదిగుణముల కాటపట్టయినవాని
శిష్యు బుధలోకసంభావ్యుఁ జేరి గురుఁడు, ముందటికిఁ దొబ్బి తండ్రికి మ్రొక్కు..."
(భాగ. స్కం 7. ప. 160.)

మని ప్రహ్లాదున కాజ్ఞాపించి "దానవసార్వభౌమా, ప్రహ్లాదునకు బుద్ధి గఱపితిమి. వెత్తి కుదిరినది. రాక్షసనీతిశాస్త్రమునఁ జక్కని పాండిత్యము గలిగినది. చిత్తగింపు" మని చెప్పిరి.

తోడనే హిరణ్యకశిపుఁడు మహానందముతోఁ గుమారునిఁ జేరఁదీసి గాఢాలింగనముచేసికొని తొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని "కుమారా, గురువులుచెప్పిన దంతయు నీవుశ్రద్ధతోఁ జదువుచున్నావా? నీ తెలివితేటలు చూచి యానందింప మనసువొడమినది. ఏదే నొక పద్యముచదివి యర్థముతోఁగూడఁ దాత్పర్యము చెప్పుము. నీవెప్పుడు నీతివిడుఁడ వౌదువో, నాకెప్పుడు చేదోడువాఁడ వయ్యెదవో యని

నిరీక్షించుచున్నాను" అని ముద్దుగొని యడిగెను. ప్రహ్లాదుఁడు వినయముతో నిట్లు చెప్పెను. "తండ్రీ, గురువుగారు ప్రేమతోఁ జెప్పినదంతయు శ్రద్ధతోఁ గూడఁ జదివితిని. నేనన్ని శాస్త్రములును చదువులయందలి సారమంతయు గ్రహించితిని. నోరు బ్రద్దలగున ట్లీశాస్త్రము లన్నియు నెంత చదివినను బ్రయోజన మేమి? సఖ్యము, శ్రవణము, దాస్యము వందనము, పూజ, సేవ, ఆత్మజ్ఞానము, సంకీర్తనము, చింతనము నను తొమ్మిది భక్తిమార్గములవలనను సర్వవ్యాపకుఁడగు శ్రీహరిని నమ్మి యుండుటయే శ్రేయస్కరము. గ్రుడ్డివానికిఁ జంద్రోదయ మగుటయు, మహాబధిరుని యెదుట శంఖధ్వని చేయుటయు, మూగవాని యెదుట సద్గ్రంథములను జెప్పుటయుఁ, కృతఘ్నులతోఁ జుట్టఱికము చేయుటయు, బూడిదలో హోమము చేయుటయు మున్నగునవి యెట్లు నిష్ప్రయోజనములో హరిభక్తిలేని సంసారజీవితముగూడ నట్లే నిరర్థకము కన్నతండ్రీ!

సీ. "కమలాక్షు నర్చించుకరములు కరములు, శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచుచూడ్కులు చూడ్కులు, శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు, మధువైరిఁ దవిలినమనము మనము
భగవంతు వలగొనుపదములు పదములు, పురుషోత్తమునిమీఁది బుద్ధి బుద్ధి
గీ. దేవదేవునిఁ జింతించుదినము దినము, చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడిగురుఁడు గురుఁడు, తండ్రి హరిఁజేరు మనియెడి తండ్రి తండ్రి.

సీ. కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే, పవనగుంభితచర్మభస్త్రి గాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే, ఢమఢమధ్వనితోడి ఢక్క గాక
హరిపూజనములేని హస్తంబు హస్తమే, తరుశాఖనిర్మితదర్వి గాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే, తనుకుడ్యజాలరంధ్రములు గాక
ఆ. చక్రిచింత లేని జన్మంబు జన్మమే, తరళసలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే, పాదయుగముతోడి పశువు గాక.

సీ. సంసారజీమూతసంఘంబు విచ్చునే, చక్రిదాస్యప్రభంజనము లేక
తాపత్రయాభీలదావాగ్ను లాఱునే, విష్ణుసేవామృతవృష్టి లేక
సర్వంకషాఘౌఘజలరాసు లింకునే, హరిమనీషాబడబాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధకారంబు లడఁగునే, పద్మాక్షునుతిరవిప్రభలు లేక

గీ. నిరుపమాపునరావృత్తినిష్కళంక, ముక్తినిధి గానవచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గకోదండచింతనాంజనములేక, తామరసగర్భునకు నైన దానవేంద్ర."

(భాగ. స్కంధ. 7. ప. 169 - 171 - 170).

ఇదంతయు విని దానవేశ్వరుఁడు చండామర్కులపైఁ జాలఁ గోపించి "ఇదియంతయు మీరే చేసితిరి. నీతిపారగునిఁ జేసెద మని చెప్పి నాకుమారునకు విరోధిపక్షపాతము గలిగించితిరి. మీరిట్లు చేయుదురని కలనైనఁ దలఁపలేదు. నమ్మినవానిని బాగుగనే చేసితిరి. మీవంటి వంచకులను నమ్మినవారి గతి యిట్టిదే యగును. ఛీ! మీరు బ్రాహ్మణులని తలంచితిని. చండాలురని యూహింపలేనైతి" నని మండిపడెను. హిరణ్యకశిపునిఁ జూచి చండామర్కులు చాల భయపడిరి. లేనిపోని నింద వచ్చె నని వారనేకవిధములఁ జింతించి చింతించి "దానవసార్వభౌమా! మావలన నేమియు నపరాధములు జరుగలేదు. విష్ణుభక్తిని మేము బోధింపలేదు. అది బోధింపవలసినంత యావశ్యకము మాకేమి వచ్చినది? పరులుగూడ నీవిషయమున నేమియు నెఱుఁగరు. ఇది కేవలము నీకుమారుని సంకుచితచిత్తమున బొడచూపినది. నీవు తొందరపడినఁ బ్రయోజనము లేదు. బాగుగ యోచింపుము. మేము మిత్రులము. పురోహితులము. నీకరుణకుఁ బాత్రులము. నీయాజ్ఞకు బద్ధులము. నీయభ్యుదయము నాశించియున్నవారము. మమ్మిట్లు శత్రువులవలె నగౌరవపఱచుట నీకుఁ దగునా?" యని చెప్పిరి. హిరణ్యకశిపుఁడు "నీకీదుర్బుద్ధి యెవరు గఱపి" రని కుమారుని గద్దించి యడిగెను. ప్రహ్లాదుఁడు మఱల నుపన్యాసము ప్రారంభించెను. "తండ్రీ, నీవు మాయుపాధ్యాయులపైఁ గోపింపనేల! వారియందే లోపమును లేదు. సంసారమను నంధకారబంధురమగు పాడునూతిలోఁ బడి దారితెన్నులు తెలియక మఱల మఱలఁ బుట్టుచుఁ జచ్చుచు నుండువారికిఁ బదులు చెప్పినను సొంతముగనైనను అడవులకుఁ బోయి తపముండినను హరిభక్తి కలుగునా? అది సహజముగఁ బుట్టుకతోడనే కలుగవలెను. సర్వశాస్త్రములును శోధించితినిగాని మాధవస్మరణవలనఁగాక యీసంసారసాగరమును దాఁటుట తరమా?" అని చెప్పుచున్న ప్రహ్లాదునిఁ దటాలునఁ గ్రిందికి గెంటివేసి హిరణ్యకశిపుఁడు కటములదుర నాజ్ఞలకై వేచియున్నభటులంజూచి "చూడఁగా నైదేండ్లు పూర్తిగా లేవు. సకలభు

నములను విలాసమాత్రమున నిర్మించిన నన్ను లెక్కసేయక నాయెదుట నాగర్భవైరిని బొగడుచున్నాఁడు. ఎన్నివిధములఁ జెప్పినను మానఁడు. [illegible]ంశమునఁ బుత్రరూపమైన వ్యాధి పుట్టెను. ఓభటులారా, వీనికి [illegible]గండు. వీఁడు వధ్యుఁడు. శరీరమునఁ జెడిపోయిన భాగమును ఖండించి వైద్యుఁడు తక్కిన భాగములను రక్షించునట్లే దురాత్ముని సంహరించివేసి వినిర్మల మగు రాక్షసకులమును రక్షించెదను. ఇఁకఁ జూడక వీనిం గొనిపొండు" అని యాజ్ఞాపించెను.

తోడనే రాక్షసభటులు కెవ్వునఁ గేకలు వేయుచుఁ బ్రహ్లాదునిఁ బట్టుకొని శూలములతోఁ బొడిచియు, గదలతో మొత్తియు, ఖడ్గములతో నఱకియు, పిడికిళులతోఁ గ్రుద్దియు, గాళ్లతోఁ దన్నియు, ఏనుఁగులచేఁ ద్రొక్కించియు, నగ్నిగుండములలోఁ బడవేసియు, నాగుబాములచేఁ గఱపించియు, విషము తినిపించియు, సముద్రములోఁ గడియలకొలఁది ముంచియుంచియు, ఎండల నెండించియు, వానలఁ దడిపించియు, నవరంధ్రములు బిగించియు, భూవివరమునఁ బాతిపెట్టియు, అన్నోదకంబులు నీయకయుఁ, గశాఘాతములకు లోఁబఱిచియు, రాళ్లతోఁ గొట్టియు, శరీరము డుస్సిపోవునట్లు శరవర్షము గురిసియు, నింక నిట్లనేకవిధములఁ బాధించిరి; గాని ప్రహ్లాదుఁడు వీని నేమియు లెక్కసేయలేదు. రాక్షసులు బాధించిన కొలఁది నాతఁడు విష్ణుస్మరణ మధికముగఁ జేయసాగెను. ప్రహ్లాదుఁడు భటులు పెట్టు బాధలకు సహింపఁజాలక తల్లిచెంత[illegible] బాఱిపోవుననియు బంధువులను శరణుఁజొచ్చుననియు, తండ్రీ, రక్షిం[illegible]మని తన్ను బతిమాలుననియు హిరణ్యకశిపుఁడు తలంచెను; గా[illegible] యందులకు వ్యతిరేకము జరిగెను. ప్రహ్లాదుఁడు హరిస్మరణ మా[illegible] లేదు. రాక్షసులు కొట్టుచున్నను ఆతఁడు తన్ను గానట్లూరకుండెను. ఇదియంతయుఁ జూచి హిరణ్యకశిపుఁడు తన కుమారునియం దే[illegible] మహాప్రభావమున్నదని తలఁచెను; గాని యంతలోఁ బటుతరక్రోధ వలన నాతని జ్ఞానము నశించిపోయెను. ఆతఁ డీవిపత్తును దాఁ[illegible] యెట్లని చింతించుచుండఁగా మెల్లఁగఁ జేరి చండామర్కులు "ద[illegible] సార్వభౌమా, విచారము వలదు. శుక్రాచార్యులవారిని రానిమ్ము. [illegible]రీబుద్ధిహీనుని మంచిమార్గమునకుఁ ద్రిప్పఁగల" రనిచెప్పిరి ఇది బాగున యున్నదని హిరణ్యకశిపుఁడు శుక్రాచార్యుని రప్పించి సంగతి సందర్భముక

లన్నియుఁ జెప్పి ప్రహ్లాదు నప్పగించి "మహాత్మా! నావిచారమును బోఁద్రోలవే?" యని ప్రార్థించెను.

శుక్రాచార్యుఁడు ప్రహ్లాదునకు రాక్షసోచితవిద్య లన్నియుఁ జెప్పెను ఒకనాఁ డాతఁడు అనుష్ఠానసమయమునఁ బాఠశాలను విడిచి పోఁగాఁ బ్రహ్లాదుఁడు తోడిరాక్షసబాలురను జేరఁ బిలిచి "మనకు గురువుగారు చెప్పుచున్న చదు వంతయుఁ గేవలము నసందర్భము. దాని కర్థము లేదు. దానివలనఁ బ్రయోజనము లేదు. అది కష్టములను దప్పించుటకు మాఱుగ దుఃఖములను దెచ్చి పెట్టును జన్మరాహిత్యమును గలిగించి మోక్షమును జేకూర్చుటకు మాఱుగ దుఃఖములను బోధించి నరకమునఁ గూలఁద్రోసి దుర్జన్మపరంపరపాలు చేసి నాశనము చేయును. గావున మన కిది వలదు నేను మీకు కేవలము మోక్షమును గూర్చెదను రం"డని చెప్పి హరిభక్తిని బోధించెను. అది యా బాలురమనస్సులను బాగుగ నాటెను. తోడనే వారు శుక్రాచార్యుఁ డుపదేశించినవిద్యను మానివేసి హరిభజనము ప్రారంభించిరి. భోజనము చేసి శుక్రాచార్యుఁడు వచ్చినను వారా హరిభజనము మానలేదు. అదిచూచి యాచార్యుఁడు చాలఁ గోపించి ప్రహ్లాదుని మిగుల నిందించి "దానవసార్వభౌమా నీకుమారకుఁడు చాల దుడుకుఁదనపుఁబనులు సేయుచున్నాఁడు. తాను చెడుటయేగాక హరిభక్తిని జెప్పి తోడిరాక్షసబాలకులను గూడఁ జెఱుపుచున్నాఁడు. త్రిలోకములను జయించిన తేజశ్శాలివి. ఇట్టి వెఱ్ఱివానిని కుమారునిగా నెట్లు కంటి" వని హిరణ్యకశిపునితోఁ జెప్పెను.

ఈమాట వినుటవలన హిరణ్యకశిపునకుఁ జాల నభిమానము వచ్చెను. కుమారునిపైఁ జాల కోపముగూడ వచ్చెను. అంత నాతఁడు తన ప్రతాపమంతయుఁ జెప్పి "నేను సకలదిక్కులను గెలిచితిని. అందఱును నేనే దిక్కని నన్ను గొలుచుచున్నారు నీవు శ్రీహరిగీహరియందువు. నేను దండెత్తిపోయిననాఁడు వాఁడెందును గానఁబడఁ డయ్యె. ఇఁక నెవ్వనిబలము చూచుకొని నీవు నాకెదు రాడెద" వని కుమారు నదలించి నుడిగెను. ప్రహ్లాదున కీహుంకారములవలన భీతి లేశమును గలుగ లేదు. ఆతఁడు యథాప్రకారముగనే నిలిచి

[1] క. బలయుతులకు దుర్బలులకు, బల మెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు ప్రాణులకును, బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా."

"క. దిక్కులు గాలముతో నే,దిక్కును లేకుండుఁ గలుగుఁ దిక్కుల మొదలై
దిక్కుగల లేనివారికి, దిక్కయ్యెడు వాఁడు నాకు దిక్కు మహాత్మా."
(భాగ. స్కం. 7. ప. 264 - 265)

అని ప్రత్యుత్తర మిచ్చి యంతటితో నూరకుండక "తండ్రీ! త్రిగుణాత్మకుం డైన యీశ్వరుఁడు వినోదమున సకలప్రపంచమును సృష్టించి రక్షించి తుదకు సంహరించును. అవ్యయుఁ డగు శ్రీహరి యన్నిటనుఁ గలఁడు. చిత్తము నపసవ్యమార్గము నుండి మరలింపుము. చిత్తముకంటె శత్రువులు లేరు. చిత్తమును స్వాధీనముచేసికొనుము త్రిభువనములను విలాసమాత్రమున జయించితి నని చెప్పెదవు; గాని చిత్తమునకును ఇంద్రియములకును లోఁబడిపోయితివి. ఆయాంతరశత్రువులను గూడ జయించితివేని నీవు నిజముగా విజయుఁడ వయ్యెదవు. సంసారసాగరము మీఁది మమతను విసర్జింపుము. హరిభక్తిని హృదయమునఁ బ్రతిష్ఠించు కొనుము" అని యుపన్యాసముగూడఁ గావించెను

ఈయుపన్యాసమువలన హిరణ్యకశిపునకు మండుచున్న యగ్నిహోత్రమున నేయివోసిన ట్లయ్యెను. అంత నాతఁడు ప్రళయాగ్నివలె మండిపడుచు "ఎవఁడో శ్రీహరి యున్నాఁడని నాతో వాదించెదవు. నేనే జగత్తున కంతకును నాథుఁడను. నీవు చెప్పుచున్న నారాయణుఁ డెక్కడ నున్నాఁడు? ఏరూపమున నేమి చేయుచుండును! నిముసములో వానినిఁ బరిమార్చెద నిదే చూపు" మని యఱచెను.

శ్రీహరినిఁ జూపుమనుటవలనఁ బ్రహ్లాదునకు బ్రహ్మానందముగలిగెను. చూడఁగలవారికి హరి యంతటను గలఁడు. చూడలేనివాని శరీరములందె యుండి మాయావరణమును గల్పించుచున్నాఁడు. శ్రీహరి యిచ్చట నున్నాఁడని స్థలనిర్దేశము చేయుట యెట్లు? ప్రహ్లాదుఁడు నృత్యముసేయుచు

శా. "కలఁ డంభోధిఁ గలండు గాలిఁ గలఁ డాకాశంబునం గుంభినిం
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ల నిశలన్ ఖద్యోతచంద్రాదులం
గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దన్నిటన్
గలఁ డీశుండు గలండు తండ్రి వెదకంగా నేల యీ యా యెడన్."

"క. ఇందుఁగలఁ డందులేఁ డని, సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకిచూచిన, నందందే గలఁడు దానవాగ్రణి వింటే."
(భాగ. స్కంధ. 7. ప. 274-275)

అని చెప్పెను. హిరణ్యకశిపుని కోపమును జల్లార్చుమాట లేమియుఁ బ్రహ్లాదుని ప్రత్యుత్తరమున లేవు. అంతయుఁ గ్రోధప్రజ్వలన కారణమే యయ్యెను. తోడనే యాతఁడు "అంతట నుండు హరి నీ స్తంభమునఁ జూపు" మని గద్దించిపలికెను. ప్రహ్లాదుఁడు "శ్రీహరి స్తంభములోనుండుట వింత లే" దని యెను. కోపము నాపుకొనఁ జాలక హిరణ్యకశిపుఁడు స్తంభముమీఁద నఱచేతఁ జఱచెను. ఇఁక నేమున్నది? ఫెళ ఫెళారావముతో స్తంభము పగిలిపోయెను. అందులకు గారణముతన బాహుబలమే యని రాక్షసేశ్వరుఁడు భావించుచుండు నంతలో దాని నుండి క్రోధాగ్నికీలాభీషణం బగు శ్రీమన్నారాయణుని నరసింహరూపము ప్రత్యక్ష మయ్యెను. దానవవీరుని నాడులు చల్లబడెను.

ఈయద్భుతసంభవమువలన నాతనికి భీతి గలిగెను; గాని యంతలోనే ధైర్యప్రసారము గలిగెను. "వెఱపన నెట్టిది? త్రిలోకములను జయించిన నాకీవికారజంతువును సడియించు టెంత" యని యాతనికి గర్వము తోఁచెను; గాని కాలత్రయమునందునుగూడ దాని సంభవమును గుఱించి యూహించుట కవకాశములేని వికారజంతువు తన్ను రూపు మాపుటకై యవతరించె ననుజ్ఞానమున కాతని హృదయమున స్థలము లేదయ్యెను. ఆవికారజంతువు భగభగ మండుచున్న అగ్నిహోత్ర మనియుఁ దాను ఫలభ్రాంతిచే దానిమీఁదఁ బడుచున్న శలభమనియుఁ గూడ నాతనికిఁ దోఁచదయ్యెను. తోడనే యాతఁడు గదాదండమును గిరగిరం ద్రిప్పుకొనుచు నరహరిపైఁ బడెను. నరసింహమూర్తికిఁ గ్రోధభీకరమైయున్న ముఖమునఁ జిఱునవ్వుగూడఁ గలిగెను. అంతనా శ్రీహరి కేవలపురుషరూపంబును మృగరూపంబును గాని నరసింహరూపమున, రేయును బవలును గాని సంధ్యాసమయమున, నంతరంగంబును బహిరంగంబును గాని సభాద్వారంబున, గగనంబును భూమియునుం గాని యూరుమధ్యంబున, బ్రాణసహితంబులును బ్రాణరహితంబులును గాని నఖంబులఁ ద్రైలోక్యజనహృదయభల్లుండయిన దనుజమల్లుని విలాసగాత్రమునఁ బొట్టచీల్చి సంహరించి ప్రేవులు పూలమాలికలవలెఁ గంఠ

మున ధరించెను. ఇదిచూచి యాసభాభవనమునఁ గల రాక్షసవీరు లెల్లరును ఖడ్గములుదూసి శ్రీహరిపై నురుకుట కుంకించుచుండిరి. తోడనే శ్రీమన్నారాయణుఁడు చక్రముచేఁ గొందఱను,గదచేఁగొందఱను, ఖడ్గముచేఁ గొందఱను చొప్పున వారినందఱను సంహరించివేసి సింహాసన మధిష్ఠించెను; గాని యాతని ముఖమునఁ దాండవముచేయుచున్న క్రోధము తిరోహితము కాదయ్యెను.అట్లగుట బ్రహ్మాదులెల్లరునునాతనిఁ జేరవెఱచి ప్రక్కల నొదిగి తుదకు బ్రహ్లాదునిఁ జూచి "మహాత్మా ! నీ ప్రార్థనమువలన శ్రీహరి యీరూపమును వహించె నీవు కోరినఁ గాని యాతఁ డాభీషణరూపమును త్యజింపఁ" డని ప్రార్థించిరి. అంత నాతఁడు సమస్తదేవతలను దుదకు లక్ష్మీదేవియుఁగూడ శ్రీహరినిఁ జేర వెఱచు చుండుటఁ గాంచి ధైర్యముతోఁ గరకమలములు ముకుళించి మందగమనంబున శ్రీహరిని సమీపించి భయభక్తితాత్పర్యములతో సాష్టాంగ దండప్రణామము గావించెను.

తోడనే శ్రీహరికోపము చల్లారెను. అంత నాతఁడు ప్రహ్లాదునిఁ బ్రేమతో లేవనెత్తి ప్రియమూర శిరమునఁ జేయిడి బుజ్జగించెను. ప్రహ్లాదుఁ డీరీతిన శ్రీమన్నారాయణుని స్తుతింపఁజొచ్చెను, "శ్రీహరీ, అమరులు, విద్యాధరాదులు, మునీశ్వరులు బ్రహ్మాదులును గూడి నీగుణకీర్తనమును సరిగఁ జేయఁజాలరు. అట్టిచో రాక్షసుఁడను, బాలుఁడను, జడుఁడను అయిన నేనెట్లు నిన్ను గీర్తింపఁగలను ? జపతపములు, యజ్ఞయాగాదికర్మలు, వేదాధ్యయనాదులు, నియమములు, నిష్ఠలు భక్తివలె నీకానందమును గలిగింపఁజాలవు. జ్ఞానము, దానము, ధర్మము, సత్యము, నిర్మత్సరత్వము, యజ్ఞము, తపస్సు మున్నగువానివలన మోక్షయోగ్యుఁడనని గర్వించు బ్రాహ్మణునికంటె సఖ్యశ్రవణాదికము లచే భక్తిబంధురుఁ డగు శ్వపచుఁడే ముందుగ నీయనుగ్రహమునకుఁ బాత్రుఁ డగును. ఈ సంసారమును జూచుటవలనఁ గలుగునంతటి భయము నీయుగ్రనరసింహాకృతినిఁ జూచిన గలుగుటలేదు. శ్రీమన్నారాయణమూర్తీ, నాయెడలఁ గృపాళుఁడవై నన్నురక్షింపుము మహేశ్వరునకును, బ్రహ్మదేవునకును దుదకు లక్ష్మీదేవికినిఁ గూడ నీవు నీచేతితో నభయదానము చేయవు. అట్టియెడ రాక్షసుఁడను బాలుఁడను అయిన నాశిరస్సుమీఁద నీకరాంబుజము నుంచితివి. ఇంతక్ష

నాకేమి కావలయును?" ఇంక నిట్లనేకవిధములఁ బ్రస్తుతిఁ జేసిన ప్రహ్లాదునిఁ జూచి నరసింహరూపుఁ డగు మహావిష్ణువు—

"శా. సంతోషించితి నీచరిత్రమునకున్ సద్భద్రమౌఁగాక నీ
యంతర్వాంఛితలాభ మెల్లఁ గరుణాయత్తుండనై యిచ్చెదన్
జింతం జెందకు భక్తకాముఁడ నే సిద్ధంబు దుర్లోక్యుఁడన్?
జంతుశ్రేణికి నన్ను జూచినఁ బునర్జన్మంబు లే దర్భకా"

"ఆ. వె. సకలభావములను సాధులు విద్వాంసు, లఖిలభద్రవిభుఁడ నైన నన్నుఁ
గోర్కు లిమ్మటంచుఁ గోరుదు రిచ్చెదఁ, గోరు మెద్దియైనఁ గుఱ్ఱ నీవు."

(భాగ. స్కంధ. 7. ప. 368, 370)

అని ప్రహ్లాదునిఁ బరీక్షించుటకై యడిగెను; గాని ప్రహ్లాదుఁడీమాయకు లోఁబడువాఁడు కాఁడు. నారాయణుఁడు భక్తులకు దర్శన మెప్పు డిచ్చునో యప్పటినుండియు వారిని వంచింపఁజాలఁడు. అగుటం జేసి ప్రహ్లాదుఁడు వినయముతో "ప్రభూ! పుట్టినదిమొదలు కోరికలు లేక పోవుటవలననే నీకొఱకు సకలబాధలు నోర్చితిని. ఇఁక నేనేమి కోరుకొందును. శ్రీమన్నారాయణుఁడవు నీవు నాకు సాక్షాత్కరించిన పిదప నాకేమికోర్కె లుండును?" అని మాఱుపల్కెను. అందులకు శ్రీహరి చాల సంతసించి "ప్రహ్లాదా! నీచిత్తసంయమనమునకు సంతోషించితిని. నన్ను జేరినవారి కేకోరికలు నుండవు. అయినను నీయెడలఁగల యనంత ప్రేమవలన నేను నీకుఁ గొన్నివరము లిచ్చుచున్నాను. నీవు మన్వంతరము వఱకును రాక్షససార్వభౌముఁడవై సకలభోగములు ననుభవింపుము. నాకథలు వినుచుండుము. సకలభూతములందును నిండియున్న యజ్ఞపురుషుని నన్ను హృదయమున నిలిపి పూజింపుము. పిదప నీశరీరమునువిడిచి నాలోఁ గలిసికొనెదవు" అని యానతిచ్చెను. అప్పుడు ప్రహ్లాదుఁడు "దీనమందారా, నాతండ్రి నీయెడల విరోధముపూని నిన్ను నిందించి తుదకు నీచేతులలోఁ బ్రాణములు విడిచెను. ఆతనికి మోక్షము దయచేయు"మని కోరెను. ఇదివిని శ్రీహరి నవ్వుకొని "వత్సా! నీతండ్రి నాయెడల నెప్పుడు శత్రుత్వము వహించెనో యప్పుడె తనకుఁ బూర్వులగు నిరువది యొక్కతరములవారితోఁ బరిశుద్ధుఁడయ్యె. నీవిఁక నాతనికిఁ బ్రేతకార్యములు నిర్వర్తింపుము. నాదేహస్పర్శవలన నీతండ్రి ముక్తపాపుఁడయ్యెను. ఁ బుణ్యలోకము లాతనికిఁ గరతలామలకములు" అని చెప్పెను.

పిదపఁ బ్రహ్లాదుఁడు తండ్రికిఁ జేయవలసిన ప్రేతకార్యము లెల్ల నిర్వర్తించెను. దుష్టుల కెప్పుడు నిట్టివరముల నీయకు మని శ్రీమన్నారాయణుఁడు బ్రహ్మదేవున కాజ్ఞాపించి నరసింహావతారమును జాలించెను. ప్రహ్లాదుఁడు బ్రతికియున్నంతకాలము విష్ణుదేవుని సేవించి పిదప విష్ణుసాయుజ్యముఁ బడసెను.

---

2. అంబరీషుఁడు.

అంబరీషుఁడు విశాలభూభాగము నేలిన మహారాజు. ఆతఁ డనేక వైభవముల ననుభవించి వైరిభీకరుఁడై యుండెను. దైవవశమున నాతని కి శ్రీహరియం దనంతభక్తి కుదిరెను. ఈకారణమువలన నామహారాజెప్పుడు నక్రమమార్గమున సంచరించి యెఱుఁగఁడు. క్రమక్రమముగా నీభక్తి పెరిఁగిపోయెను. సకలము నాతనికి విష్ణుమయముగాఁ దోఁపసాగెను. తుద కాతఁడు శ్రీహరికైంకర్యతత్పరుఁడై రాజ్యమును మంత్రులయధీనము చేసి సరస్వతీతీరమున వసిష్ఠాదిమహామునిశ్రేష్ఠుల యనుగ్రహంబున భూరిదక్షిణలు వెట్టి యనేకాశ్వమేధయాగముల జేసెను. పిదప నాతఁ డేకాంతముగ హరిధ్యానము గావించుచుఁ గాలము గడపసాగెను. ఆతనిభక్తికి మెచ్చి మహావిష్ణువు వైరిసంహారకమును ఆత్మరక్షకము నగు చక్రము నిచ్చి వెడలిపోయెను.

తరువాత నాతఁడు పురుషోత్తమునకుఁ బ్రీతిగాఁ, దోడునీడ యెులంగు భార్యతోఁగూడి యొక సంవత్సరము ద్వాదశీవ్రతముచేసెను కార్తికమాసమున వ్రతము ముగిసెను. అప్పుడు అంబరీషుఁడు మూఁడు రాత్రు లుపవాసములు చేసి మధువనంబునకుఁ బోయి వలసినవస్తులన్నియు సేకరించుకొని కాళిందీ నదిలో స్నానము గావించి మహాభిషేకవిధానమున శ్రీమన్నారాయణుని నభిషేకించి, వివిధసుగంధకుసుమసహస్రములచేఁ బూజించి, వెండిగొరిజలును, బంగారుకొమ్ములును లేగలును, గలయావులను విశేషముగఁ బాలిచ్చువానిని ఆఱునూములను సదక్షిణముగా దానము చేసెను. అనేకవేల బ్రాహ్మ

మృష్టాన్నదానము గావించెను. అందఱు నానందించిరి పిదప నాతఁడు పారణచేయుట కూహించుచుండఁగా రుద్రాంశమునఁ బొడమిన మహామహిమగల దుర్వాసమహాముని జనుదెంచెను. అట్లువచ్చిన మునీశ్వరు నర్ఘ్యపాద్యాదికములగు ననేకవిధులహృదయముకరఁగునట్లు పూజించి అంబరీషుఁడు విందు గుడిచిపోవునట్లు ప్రార్థించెను. మునియుఁ బరమానందముతో నందుల కంగీకరించి స్నానమాడివచ్చెద నని కాళిందీనదికిఁ బోయెను. కర్మవశమున నాతనికి విందుసంగతి మఱపువచ్చెను. తుద కాతఁడు పరమధ్యానమునఁ బ్రవృత్తుఁడై ప్రపంచము నేమఱచిపోయెను. ఈశ్వరధ్యానతత్పరత నాతని నయనములు నిమీలితములైన వెంటనే స్మృతిపట మాచ్ఛాదితమైపోయెను.

పిల్లి చెలగాట మెలుకకుఁ బ్రాణసంకటమనునట్లీస్థితినంబరీషునకుఁ బ్రాణములపోకడ సంభవించెను. ద్వాదశిగడియల యంతము సమీపించెను. ఈలోపునఁ బారణసేయకున్న వ్రతము భ్రష్టమగును. చేసిన దంతయు బూడిదలోఁ జేసిన హోమమైపోవును. ఆహూతుఁడైనయతిథి రాకుండ భుజించుట కేవలము పాపము. ముందు గోయి, వెనుక నూయి. కాళ్లకు సంకెలలు, కంఠమునకు గండకత్తెర ఏమిచేయవచ్చును! అంబరీషుఁ డనేకవిధముల యోచించెను. ఏమియు నుపాయము తోఁపలేదు. జాములోఁగాకున్న రెండుజాములలోనైన నపాయము లేనియుపాయము వెదకవచ్చు ననుకొన్న మూఁడవకష్టము నెత్తిమీఁదఁబడుటకు సిద్ధముగ నుండెను. గడియగడచిన దానితో ద్వాదశి గడచిపోవును. పిదప నింకేమిచేసినను ప్రయోజన మేమి?

ఈధర్మసూక్ష్మమును దీర్చుటకు విద్వాంసులకుఁ జెప్పుదయ్యెను. అంబరీషుఁడు విద్వల్లోకమును జూచి,—

"ముని సనుసొచ్చె నేఁడుఁడు, చని గుడు ద్వాదశియు నింత సనియె న్నీళ్లలో
నన పారణము వలదును, వినిపింపుం డగ్రపూర్వ విప్రు మెట్టిదియో."

(భాగ. స్కం. 9. ప. 97)

అని ప్రార్థించెను. విద్వాంసులు చాల వాదోపవాదములుచేసి తుదకు "రాజా! సలిలభక్షణము సేయుము. అంతమాత్రముననే వ్రతపరిసమాప్తి యగును: గాని యతిథి నుపేక్షించి ముందుభుజించినట్లుగాదు. ఆదోషమున కవకాశమే యుండ" దని చెప్పిరి. అంబరీషునకు దరణో

పాయము దొరకెను. ఆతఁడు ముందటిగోతిని, వెనుకటి నూతినిఁ గూడఁ దప్పించుకొని బైటఁబడెను.

ఇదియైన యుత్తరక్షణమునందే దుర్వాసుఁ డనుష్ఠానమంతయు ముగించుకొనివచ్చెను. ఈవచ్చుట యొకక్షణమునకుఁ బూర్వమే రాఁగూడదా? యని యందఱు ననుకొనుచుండ నంబరీషుఁడు దుర్వాసమహర్షికి వినయముతో విందు సిద్ధముచేయింపఁజొచ్చెనుగాని మునిచిత్తమున కేదో వికారముతోఁచెను. తోడనే యాతఁడు దివ్యదృష్టితోఁ జూచి అంబరీషుని సలిల భక్షణమును దెలిసికొనియెను. అంబరీషునకుఁ బటస్థించిన విషమస్థితిమాత్ర మేల తెలిసికొనలేకపోయెను? అంబరీషునకుఁ బ్రాపించిన విషమస్థితికిని, దుర్వాసుని యోచనకును నడుమ సలిలభక్షణము జరగెను. అక్కటతన మునిబుద్ధితోలుత సలిలభక్షణమును దెలిసికొనిపోయెను. వెంటనే యది క్రోధఘూర్ణితమై గుడ్డిదైపోయెను. పిదప రాజు విషమస్థితి దానికిఁ గాన్పించుటకుఁ దగిన యానుకూల్యమే తప్పిపోయెను. ఇఁకఁ దరువాత జరిగినది మునియాగ్రహము.

"నీ వింద్రుఁడవు చంద్రుఁడవు అనిపొగడి నన్ను విందునకుఁబిలిచి యీమదాంధుఁడు భుజించెను. విష్ణుభక్తుఁడనని విఱ్ఱవీఁగుచున్న వీఁడు శుద్ధకిరాతుఁడు చూడుఁడు. వీని నేమిచేసెదనో" యని ముని చిందులు ద్రొక్కసాగెను. అంబరీషుఁ డనేకవిధముల సమాధానము చెప్పెను. అనేకవిధములఁ బ్రార్థించెను; గాని యేమి ఫలము! దుర్వాసుఁడు ప్రార్థనములకు లొంగువాఁడు కాఁడు. ఈసంగతి యెఱింగియుండిమాత్రము ప్రార్థించుటకన్న రాజేమిచేయఁగలఁడు? ఉభయతారకమగు నుపాయము చూపఁగలిగిరి; గాని ముని కోపించి గంతులువేసిన యెడల విద్వాంసు లేమిచేయఁగలరు? దుర్వాసుని యెదుట ధర్మశాస్త్రచర్చగూడఁ బ్రయోజనములేదు. అది పనికిరానే రాదు. ఇఁక నాతని యాగ్రహముతీఱు నుపాయము లేదు. చేతనైనచో యగ్నినిఁ జల్లార్పవలెను. లేకున్న దానిలోఁబడి మాడిపోవలెను. ఈరెండే మార్గములు. ఇఁక మూఁడవ మార్గము లేదు. అంబరీషునకుఁ దొల్లిటి విషమసంధికంటె నెక్కుడు విషమసంధి తటస్థించెను. ఏమి దిక్కు? చూచుచుండఁగనే దుర్వాసుని క్రోధాగ్ని ప్రళయాగ్ని యయ్యెను. ఆతని పండ్లు పటపట లాడెను. కన్ను చిటచిటలాడెను. కపోలములు కందిపో

యెను. తోడనే యాతఁడు హుంకరించి జడపెరికి నేలకుఁ గొట్టెను. శూలము మున్నగు వివిధాయుధములను ధరించిన కృత్య యను శక్తి యాజడనుండి బయల్వెడలి రాజుమీఁది కుఱికెను. అంబరీషుఁడు నిశ్చలుఁడై యట్లే యుండెను. ప్రేక్షకు లెల్లరును హాహాకారములు ప్రారంభించిరి.

అంబరీషుని హృదయము తనలో లీనమైయుండుట యెఱింగి శ్రీహరి అంబరీషునిలో లీనమైయుండెను. అక్కట తన దుర్వాసుఁడు కృత్యను విడిచినవెంటనే మహావిష్ణువు చక్రమును విడిచెను. ఆ రెండిం టికిని యుద్ధము పొసఁగెను. నిముసమునందే చక్రాగ్నిజ్వాలలోఁ బడి కృత్య భస్మమై పోయెను. గాని చక్రమున కంతటితోఁ దృప్తికలుగ లేదు. మాయలమారి యున్నంతవఱకును మాయల కంతము గలు గదు. అట్లే దుర్వాసుఁ డున్నంతకాలము ప్రయోగముల కంత ముండదు. కావునఁ జక్రము దుర్వాసునిమీఁదికి మఱలెను. తోడనే ముని రిచ్చపడెను. ఏమిలాభము? అంతమాత్రమునఁ జక్రము తిరిగి పోవునా? ఎవరొక్కనుట కంబరీషుఁడుగాఁడు. ఇది శ్రీమహావిష్ణువుచేత వేయఁబడుచుండు చక్రము. ఇఁకఁ జేయునది లేక ముని యూర్ధ్వశ్వాస ముతోఁ బాఱిపోయి మేరుగుహ సొచ్చెను. అయినను యమపాశము లను దప్పించుపస్తువు లేదు. పురుషోత్తముని చక్రాయుధమును హరించు వస్తువుగూడ లేదు. మునివెంటఁ జక్రము మేరుగుహ సొచ్చెను. అంతి యగాదు.—

మ. భువిదూఱన్ భువి దూఱు నబ్ధిఁ జొర నబ్ధుల్ సొచ్చు నుద్వేగియై
దివిఁబ్రాకన్ దివిఁబ్రాఁకు దిక్కులకుఁ బో దిగ్వీథులం బోవుఁ జి
క్కి సంస్రుంగినఁ గ్రుంగు నిల్వ నిలుచుం గ్రీడింపఁ గ్రీడించు నొ
క్కపడిం దాపసువెంటనంటి హరిచక్రం బన్యదుర్వక్రమై.

(భాగ. స్కంధ. 9. ప. 107)

ముని కాయాసము వచ్చెను. ఇట్లెంత పరువెత్తినను ప్రయోజనము లేదని యాతఁడు బ్రహ్మవద్దకుఁ బోయి శరణుఁజొచ్చెను. విధాత "ఈపని నావలనఁగాదు. రుద్రేంద్రాదులుగూడ దీని నోప" రని చెప్పెను. ముని కైలాసంబునకుఁ బోయి శంకరుని పాదములమీఁద వ్రాలెను. ఈశ్వ రుఁడు "వత్సా! శ్రీహరి సర్వాధారుఁడు. బ్రహ్మ, నేను, ఇంద్రుఁడు, మ

హర్షులు మున్నగువా రెవ్వరును గూడ నాతనిమాయఁ దెలిసికొనఁజా లము. ఆతనివలన మేము ప్రవర్తించుచున్నాము. అట్టి జగదీశ్వరుని యా యుధమును నేను త్రిప్పఁజాల" నని చెప్పివేసెను.

దుర్వాసుఁడు ప్రపంచక మంతయు దృష్టిసారించెను ; గాని రక్షకుఁ డెవ్వఁడును గాన్పింపలేదు. తుదకుఁ జక్రమును బంపిన శ్రీహరి యే దిక్కయ్యెను ముని వైకుంఠమున కేఁగి యంతఃపురమున శ్రీమహా లక్ష్మితో నుంతనమాడుచున్న నారాయణుని పాదకమలములమీఁద వ్రాలి "ఆర్తత్రాణపరాయణా, నీమహామహిమముఁ దెలిసికొనఁజాలక నీప్రియదాసున కెగ్గుచేసితిని. నాసాహసమును సైరించి నన్ను రక్షిం పు"మని దీనాతిదీనముగ బ్రార్థించెను. అప్పుడు పురుషోత్తముఁడు.— "తాపసా ! బుద్ధిమంతులైన సాధువులు నాహృదయముసొచ్చి రహస్య మంతయుఁ దెలిసికొని దొంగిలించుకొనిపోయి భక్తితలతో వృథ ముగఁ గట్టివేసెదరు. అక్కతన నేను భక్తులను విడిచి లేగను విడిచి యావుపోలేన ట్లెక్కడకును బోఁజాలను. బంధువులను, సంపత్తులను, సంసారమునువిడిచి నేనే దిక్కనియుండు భక్తులకు నే నన్యము సేయ లేను. సాధుల మనస్సు నాయది. నామనస్సు సాధువుల యధీనము. నేను సాధువుల నెఱుఁగుదును. నన్ను సాధువు లెఱుఁగుదురు. మే మనన్యగతికులము. నాభక్తులయందు నా తేజము పూర్తిగ నావరించి యుందును. వారి కెగ్గుచేయువారి నది నాశము చేయును. నిన్ను వెంబ డించి వచ్చుచున్న చక్రాయుధమును నేనుగూడఁ ద్రిప్పఁజాలను. నా భాగవతుఁ డగు అంబరీషునిఁ బ్రార్థింతు వేని నీవు సుఖివయ్యెదవు" అని చెప్పెను.

ఇప్పు డేమిచేయవలయును ! అంబరీషునిఁ బ్రార్థించుట యేటి పౌరుషము? అద్దిరా! నారాయణుఁ డెంత యనుచితజ్ఞుఁడు. మునికి మాన భంగము తొలుతనే యయ్యెను. ఇఁక ప్రాణమునుగూడఁ బోఁగొట్టు కొనుట యెందుకు? తోడనే యాతఁ డంబరీషుని సమీపించి సాష్టాంగ నమస్కారము గావించి అభయము వేఁడుకొనెను. దీనివలన రాజ హృద యము కరఁగెను. అప్పు డాతఁడు కరములు దోయిలించి "మహాద్రి ప్రశస్తహస్తము నలంకరించు చక్రాయుధమా !

సీ. నీవ పావకుఁడవు నీవ సూర్యుండవు, నీవ చంద్రుండవు నీవ జలము
నీవ నేలయు నింగి నీవ సమీరంబు, నీవ భూతేంద్రియనికర మీవ
నీవ బ్రహ్మంబును నీవ సత్యంబును, నీవ యజ్ఞంబును నీవ ఫలము
నీవ లోకేశులు నీవ సర్వాత్మయు, నీవ కాలంబును నీవె జగము

గీ. నీవ బహుయజ్ఞభోజివి నీవ నిత్య, మూలతేజంబు నీకు నేమ్రొక్కువాఁడ
నీరజాక్షుండు చాల మన్నించునట్టి, శస్త్రముఖ్యమ కావవే చాలు మునిని"

(భాగ. స్కం. 9. ప. 128.)

శ్రీమహావిష్ణువుచే నీవు విడువఁబడినవెంటనే ధావనవేగంబునఁ బొడమిన నీగంభీరధ్వానము నాలకించి రాక్షసులు చాపచుట్టుగఁ బడి మడిసెదరు. రక్కసులు నిద్రలోఁగాని కలలోఁగాని నిన్నుఁజూచినచోఁ బ్రాతఃకాలమున నతులు ఘనవరింప దీర్ఘనిద్రవోదురు నీతత్త్వము విధాతకైనఁ దెలియునదిగాదు. ముని చాల నలసిపోయియున్నాఁడు. ఇఁక నీయాగ్రహమును జాలింపుము. నేను ధర్మమార్గమున సంచరింతునేని, బ్రాహ్మణుఁడు మాకు దైవతమగునేని, ఈవిప్రునకు శుభము గలుగుఁగాక! సృష్టిస్థితిసంహారకరణచణుఁడైన దామోదరుఁడు నాసేవ కానందించునేని, ఈబ్రాహ్మణుఁడు సుఖపడుఁగాక" అని ప్రార్థించెను. తోడనే చక్రము దుర్వాసునివిడిచి వెడలిపోయెను.

పిదప ముని అంబరీషుని "రాజేంద్రా! నేఁజేసిన దంతయు మఱచి పోయి నాకుఁ బ్రాణదానము చేసిన నిన్నేమని సన్నుతింపఁగలను? శ్రీహరిని నీవింతగాఁ గొలుతువా? ఆతఁడు నీ యాజ్ఞాబద్ధుఁడై యున్నాఁడు. ఈరూపమున విశ్వమున కంతకును నీవే యాధారమవై యున్నావు. నీయట్టి మహానుభావునకుఁ బ్రపంచమున నష్టేమి యున్నది? నేను నీదర్శనమువలన ధన్యుఁడనైతిని. ఎల్లప్పుడును నీశుభము గోరుచుందును. నాకు ఇఁక సెలవిమ్ము" అని ప్రార్థించెను. రాజు మునిని భుజించిపొమ్మనిచెప్పెను. అందుల కభ్యంతరము చెప్పుటకు మునికి ధైర్యమేది? మృష్టాన్నము భుజించి సంతృప్తుఁడై ముని రాజును జూచి "రాజా, నీచరిత్రము త్రిలోకవాసులకుగూడ మోక్షప్రదము" అని దీవించి సెలవుగొని వెడలిపోయెను. పిదప రాజు భూసురభుక్తంబగుట నతిపవిత్రమైన తచ్ఛేషమును హృషీకేశునకుఁ దనపైఁగల కరుణకు విస్మయమందుచు భుజించి వ్రతసమాప్తి చేసి తరించెను.

పిదప నాతఁడు సంసారముమీఁది మమతను బూర్తిగ విడిచి విద్యావినయవివేకములఁ దనయంతటివారైన కొడుకులకు రాజ్యమప్పగించి హరిధ్యానతత్పరుఁడై యడవికిఁ బోయెను. దేహాంతమున నాతఁడు విష్ణుసాయుజ్యమును బడసెను.

సీ. శ్రుత్యంతవిశ్రాంతమత్యనుక్రమణీయ, భగవత్ప్రసంగతుల్ భాగవతులు
సనకాదిమునియోగిజనసదానందైక, పరమభాగ్యోదయుల్ భాగవతులు
కృష్ణపదధ్యానకీలనామృతపాన, పరిణామయుతులు శ్రీభాగవతులు
బహుపాతకానీకపరిభవప్రక్రియా, పరుషోగ్రమూర్తులు భాగవతులు
గీ. భావతత్త్వార్థవేదులు భాగవతులు, బ్రహ్మనాదానువాదులు భాగవతులు
సిరులు దనరంగ నెన్నడుఁ జేటులేని, పదవి నొప్పారువారుపో భాగవతులు.
(భాగ. స్కంధ. 6 ప. 186.)

---

3. అజామిళుఁడు.

కన్యాకుబ్జనగరమున అజామిళుఁ డను నొక బ్రాహ్మణకుమారుఁ డుండెను. ఆతఁడు గురువృద్ధులకుఁ బరమభక్తితో సకలశుశ్రూషలు చేసి సకలవేదములను జదువుకొని శాంతిదాంతిశమదమాదిసుగుణగరిష్ఠుండై ధర్మనిరతుఁ డయ్యెను. అతఁ డనేకమంత్రసిద్ధులనుగూడఁ బడసెను. మఱియు సత్యవాక్యపరిపాలనము చేసెను. సకలకర్మలును భక్తిశ్రద్ధలతో నెఱవేర్పసాగెను. ఈస్థితిలో నాతనికి యౌవనము ప్రాప్తించెను. ఉద్రేకము కాముకవికారము మందహాసము దేహదార్ఢ్యము మున్నగు యౌవనధర్మము లన్నియు నాతనియందుఁ బొడసూపెను. అంత వసంతము గూడఁ బ్రాపించెను. అభినవతేజోవంతమై ప్రపంచ మంతయు రాగభరితమయ్యెను. అప్పు డాతఁ డొకనాఁడు కుశసమిత్పుష్పఫలముల నిమిత్తము వనమున కరిగెను.

అచట నొకనికుంజమున నొకయువకుఁ డొక వృషలితోఁ గ్రీడించుచుండెను. వారినిఁ జూచినతోడనే యాయజామిళుని హృదయము

చలించెను. ఇఁకఁ గావలసిన దేమున్నది? అభిజాత్యము, విద్య, జ్ఞానము, మర్యాద, పాపభీతి మున్నగున వన్నియు మఱచి, తన ముద్దులభార్యను విడిచి యాతఁడా వృషలివలలోఁ జిక్కుకొనియెను. ఈసంభవమువలన నాతఁడు ప్రపంచ మంతయు మఱచి బ్రాహ్మణ్యమును మంటఁగలిపి దానితోడనే సంసారము ప్రారంభించెను. జూదము పానముగూడఁ బ్రారంభించెను. ఇంక నెన్ని దుష్కార్యము లున్నవో యవియెల్ల నతఁడు మొదలుపెట్టెను. ఆఅంకుటాలివలనఁ బదుగురు కొడుకులను బడసి యా సంసారనిర్వహణమునకై యనేకపాపకార్యము లారంభించెను.

ఇట్లు కొంతకాలము జరుగునప్పటికి యౌవనము గడచెను. శిరోజములు తెల్లనయ్యెను. శరీరపాటవము సన్నగిల్లెను. అవయవము లన్నియు వడఁకఁ జొచ్చెను. దృష్టి మందగించెను. దంతము లూడిపోయెను. వగర్పు ప్రారంభమయ్యెను. ఈతీరున వార్ధక్యము ప్రబలెను గాని యన్నిటినిమించి కోర్కు లతిశయించెను.

పదుగురుపుత్త్రులలోఁ గడపటివాఁడగు నారాయణునియం దాతనికిఁ బ్రేమ మెండు. తన అంకుటాలుగూడ నట్లే వృద్ధయైయుండుటచే నాతఁడామెతోఁగూడ నారాయణుని లాలించుటయందే కాలము గడుపుచుండెను. ఈపుత్త్రవ్యామోహమునఁబడి సమస్తమును మఱచిపోయెను. తుద కున్నట్లుండఁగా మృత్యువు సమీపించెను. యమకింకరు లాతనికిఁ దమ దివ్యదర్శనము నొసంగిరి.

క్రూరాకారు లగు యమదూతలను జూచి తన కవసానము సమీపించె నని తెలిసికొని అజామిళుఁడు పుత్త్రవియోగము సంభవింపనున్నందులకు వగచుచు దుఃఖాతిరేకమ్మున గడగడ వడఁకిపోవుచుఁ దన కనిష్ఠకుమారుని 'నారాయణా! నారాయణా' యని చేరఁబిలిచెను. ఉత్తరక్షణమునందే యాతఁడు విగతప్రాణుఁ డయ్యెను. యమదూతలాతనిజీవమును బాశములతోఁ గట్టివేసి బయలుదేఱిరి; గాని విష్ణుదూతలువచ్చి వారి నడ్డగించిరి.

స్ఫురద్రూపులును, బద్మనేత్రులును, పీతకౌశేయపరిధానులును, గండమండలనటత్కుండలద్వయులును, బటుకిరీటప్రభాభాసితులును, కల్పపుష్పమాలాలంకృతులును, బాహుకేయూరమణిగణభ్రాజమాన ఘనచతుర్భుజులును, నీలనీరదకోమలదేహులును, శంఖచక్రఖడ్గగదాది

యుద్ధపరికరములను ధరించినవారు నగు విష్ణుదూతలను జూచి నివ్వెర పడి "అయ్యా! మీరెవరు? వేషములవలన శాంతులవలెఁ గన్పించెదరు. క్రియచే సాహసులని తోఁచుచున్నది. మేము ధర్మరాజుగారి సేవకులము. ధర్మరక్షణమే మావిధికృత్యము. ఈప్రాణి బహుపాపములు చేసెను. వీనికిఁ దగిన శిక్షసేయించుటకుఁ దీసికొని పోవుచున్న మమ్ము మీరేల యభ్యంతర పెట్టెద" రని యమకింకరు లడిగిరి. అందులకు శ్రీహరిసేవకులు మందహాసము గావించి "మీరు పరేతనాయకుభటులేని దండింపఁదగినవా రెవ్వరో, దండింపఁదగనివా రెవ్వరో, పుణ్యలక్షణ మేమో, పాపచిహ్నము లేవో చెప్పుఁ"డని మేఘగంభీరభాషణములతోఁ బలికిరి. యమకింకరు లిట్లు ప్రత్యుత్తర మిచ్చిరి.

"వేదము శ్రీమన్నారాయణస్వరూపము అగుటంజేసి వేదోక్తమైనదేదో అదియే ధర్మము. తద్భిన్నమే యధర్మము. సూర్యుఁడు, అగ్ని, ఆకాశము, వాయువు, గోవులు, చంద్రుఁడు, సంధ్యలు, రాత్రులు, పగలు, కాలము, భూతధాత్రి యివి ప్రాణికోటుల ప్రవర్తనములకు సాక్షులై వారివారికి విధింపవలసిన దండనలు తెలుపుచుండును. ఈసమయమున ధర్మరక్షణముచేయుచున్న మాకు మీ రడ్డమువచ్చితిరి గావున మీరు దండ్యులైతిరి. ప్రాణికోటులు సత్త్వరజస్తమోగుణాత్మకములు అగుటచేఁ గర్మతప్పదు. కర్మ ననుసరించి శుభాశుభ ఫలములు తటస్థించుచుండును. ఎవఁ డెట్టి కర్మ చేయునో యట్టిఫల మనుభవింపక తప్పదు. ఈయజామిళుఁడు తాను పుట్టిన బ్రాహ్మణజాతికిని, చదివిన చదువులకును సంపాదించిన జ్ఞానమునకును, బ్రారంభించిన వేదోక్తసత్కర్మలకును వ్యతిరేకముగ వృషలియందు అనురక్తుండై బిడ్డలంగని త్రొక్కరాని మార్గములు త్రొక్కి, చేయరానిపనులు చేసి చెడిపోయెను. కావునఁ గుటిలుఁడు, ధూర్తుఁడు, దుష్టుఁడు నగువీనిని దండింపఁ గొనిపోవుచున్నాము. కర్మానురూపమైన శిక్షఁబడసి పిదప వీఁడు విముక్తుఁ డగును."

ఈయుపన్యాసమును విని విష్ణుసేవకులు పకపక నవ్వి "అవురా! ధర్మాధర్మవివేకుల పస తెలిసిపోయినది. ప్రభునిర్దేశమును జక్కఁగఁ దెలిసికొననివా రిట్లే దండ్యులను విడిచి, యదండ్యులను దండింతురు. ధర్మదూతలారా! మంచిచెడ్డలు, కష్టసుఖములు, మఱి సకలమును దెలిసిన తలిదండ్రులే బిడ్డలను దండించినచో నిఁక నాబిడ్డ లెవరిని రక్షింప వేఁడు

కొందురు? తెలిసినవాఁ డేది చేయునో తెలియనివారు నదియే చేయుదురు. వివేకి నిజమిది యని చెప్పినచోఁ దక్కినవా రట్లే ప్రవర్తింతురు. నమ్మి తొడలమీఁద నిద్రించినవానినిఁ గ్రిందికిఁ ద్రోసివేయు దుర్మార్గుఁ డెందైన నుండునా? మనసిచ్చి సకలమునిచ్చి శరణుపొందిన వానిని కరుణాత్ముఁడు రక్షింపకుండ విడుచునా? ఈతఁ డవసానకాలమున నారాయణస్మరణము చేసి ధన్యుఁ డయ్యెను. పుత్రుని 'నారాయణా' యని పిలిచినంతమాత్రమున నారాయణస్మరణ చేసినట్లగునా? యని సందేహింపకుఁడు. పిల్లవాని పేరుపెట్టి పిలిచినను, వేళాకోళమునకు వెక్కిరింతకు నైనను పద్యములు చదివినైనను, పాటలు పాడియైనను శ్రీహరిని స్మరించినంతమాత్రమునఁ బాపములు నశించిపోవును. పడిపోయినపుడు, దెబ్బలు తిన్నపుడు, జ్వరాదులచేఁ బీడింపఁబడినపుడు, సర్పాదులచే బాధింపఁబడినపుడు, ఖడ్గాదులచే వేధింపఁబడినపుడు, ఇఁక నెట్టి కష్టసమయములయందైనను శ్రీమహావిష్ణువు నామము స్మరించెనేని వానికి యమయాతన కలుగఁబోదు. బాలుఁడైననుహరిభక్తులతోఁగూడిభజనచేసినట్లయినను,శ్రీహరీయనిపిలిచినను సకలపాపములనుండియు విముక్తుఁ డగును. వీర్యవంతమైన యౌషధము తెలియక సేవించినను దనప్రభావము నెట్లుచూపునో యట్లే శ్రీమన్నారాయణుని నామము అజ్ఞానమువలనఁ బలికినను మోక్షముసంఘటించును. ఘోరపాపాత్మునకైనను బుతాకృతపుణ్యవశమునఁ గాకున్న ఒక్కనియందేగాక సకలప్రపంచమునందును నిండియుండు శ్రీపతి యెట్లు జ్ఞప్తికి వచ్చును! త్రైలోక్యపావనమైన శ్రీహరినామస్మరణామృతము నీతఁడు సేవించెను. ఈతనిధర్మ మిఁక నెట్లు వ్యర్థమగును?" అని యమదూతలతోఁ జెప్పిరి. వారది విని తెల్లవోయి చేయునది లేక తమ ప్రభువుకడకుఁ బోయి జరిగిన సమస్తమును విన్నవించిరి. అది విని యమధర్మరాజు "దూతలారా! వారు శ్రీమన్నారాయణుని దూతలు. వారు పోయినచోటికి మీరు పోవలదు శ్రీహరి సకలప్రపంచమునకును విభుఁడు. ఆతని కెందు నెదురులేదు. సామాన్యు లాతని నెఱుఁగ నేరరు. విధాత మహేశ్వరుఁడు మున్నగువారుగూడ నాతనినిఁ దెలిసి కొనఁజాలనపుఁ డిఁక నన్యులసంగతి చెప్పనేల? అజామిళుఁడు బ్రతికియున్నంతకాలమును సకలదురితములును జేసినను మరణసమయమున

నేదోయొకరూపమున శ్రీహరినామస్మరణ చేయుటవలన ముక్తుఁడై నాఁడు. కావున మీరిప్పుడు తెలిసికొనవలసినది యేమనగా,—

సీ. "ఏకసక్కెమునకైన నిందిరారమణుని, బలుకంగలేని దుర్భాషితులను
గలలోననైన శ్రీకాంతునిసత్పాదకమలముల్ సూడనికర్మదృష్టుల
నవ్వుమనైనఁ గృష్ణప్రశంసకుఁ జెవిఁ, దార్పనేరనిదుష్కర్ణప్రవణుల
యాత్రోత్సవంబులనైన నీశుని గుడి, త్రోవ ద్రొక్కఁగలేనిదుష్పదులను

గీ. బరమభాగవతులపాదదూళి సమస్తతీర్థసార మనుచుఁ దోయలేని
వారి వారి వారి వారిఁజేరినవారిఁ, దోలితేఁ గట్టితెండు దూతలార.

ఆ. పద్మనయనుమీఁది భక్తియోగం బెల్ల, ముక్తియోగ మనుచు మొదలెఱుంగు
వారి వారి వారి వారిఁ జేరినవార, త్రోవఁ దలఁపవలదు దూతలార?"
(భాగ. స్కం. 6. ప. 188, 191.)

అని చెప్పెను.

ఇట అజామిళుఁడు పాశబంధములు సడలించి యమదూతలు పోయినవెంటనే సచేతనుఁడై లేచినిలిచి కేలుమొగిచి యెగ్గిరోఁగలు కఁ బ్రయత్నించుచుండ నది తెలిసి విష్ణుదూతలదృశ్యులై పోయిరి. పిదప నాతఁడు సకలమును దెలిసికొని గతించిన దానికిఁ జాల వగచి,

సీ. "వృషలియం దనురాగవృద్ధిఁ బిష్టుఁడఁగని, యుయ్యి గోదారఁ గుమ్ముచు
రచ్చలకెక్కి పెక్కులజ్జసేఁతల సరి, వారలోఁ దలఁదంపుచేసి
కట్టిడిముదుకనై కర్మబంధంబుల, బట్టి నిందఁ బ్రాఁకి నగుచుఁ
దరుణులరోఁతలఁ దవిలి భోగించిన, కడిఁది నాజన్మంబు గాసిపోయెఁ

ఆ. జదువు చట్టుపడియె శాస్త్రంబు మన్నయ్యె, బుద్ధి పురుషమేదఁ బొగ్గుపడియె
నీతి మట్టుపడియె నిర్మలజ్ఞానంబు, పుట్టి మునిఁగె బోధమార్గఁ బోయె."
(భాగ. స్కం. 6. 135)

అక్కటా! సుగుణవతియగు చక్కనియిల్లాలినివిడిచి కలుద్రాగు వృషలినిమఱఁగి దుర్వృత్తుఁడనై చెడిపోయితిని. నేనుచేసిన ఘోరపాపములు ప్రళయాగ్నికీలలై నన్ను దహింపవేల? కట్టా! నాకంటె దిక్కు లేని తలిదండ్రులను విడిచిపెట్టితిని, అనేకపాపములు చేసి నరకకూపమునఁ గూలఁబడి పోనున్న నన్ను రక్షించి యుద్ధరించిన మహాత్ములెందలివారో! కలలోఁదోచిన యర్థమువోలెఁ గ్రమక్రమముగ నాకంతయుఁ దెలియుచున్నది. పాశములతో బంధించి నన్ను లాగిన మహానుభావులు యమధర్మరాజు కూర్మిదూతలు. వారిప్పు డెక్కడకుఁ బోయిరో. మఱియు,

ఉ. "దారుణపాశబంధనవిధానములన్ నరకార్ణవంబులోఁ
గూలిన నన్ను నేఁడు సెడకుండ నొనర్చినపుణ్యమూర్తు లం
భోరుహనేత్రు లుజ్జ్వలనభోమణితేజులు లోచనోత్సవుల్
చారుదయాసమంచితవిచారులు నల్వురు నెందు నేఁగిరో."

మ. "నను రక్షించినపుణ్యు లెంతులు కనన్నాళీకపత్రాక్షు లం
జనసంకాశులు శంఖచక్రధరు లాజానూరుబాహుల్ స్మితా
నను లాలంబితకర్ణవేష్టనసువర్ణచ్ఛాయదివ్యాంబరుల్
ఘనకారుణ్యరసైకపూర్ణులు సమగ్రస్ఫూర్తి నెందేఁగిరో."

(భాగ. స్కంధ. 6. ప. 142, 143)

మహాపాతకుఁడ నగు నాకు పురాకృతపుణ్యవిశేషంబునఁగాక యాదేవోత్తములు ధర్శనలాభ మెట్లబ్బును? వారి దర్శనమువలన నాయాత్మ సుప్రసన్నమై పవిత్రమైనది. అట్లుగాకున్న వృషలీభర్తనై యెల్లవిధముల భ్రష్టుఁడనై యున్న నాజిహ్వకు శ్రీమన్నారాయణనామ గ్రహణ మెట్లు గలుగును?

సీ. "దారుణమాంసాహారపూరితుఁడైన, హరివిస్మయస్మరణార్ద్రమతి నె
పంచమహాతీవ్రపాతకోపేతుఁడైన, హరివిస్మయస్మరణార్ద్రమతి నె
కాటిన్యకలితవికారపాకుండైన, హరివిస్మయస్మరణార్ద్రమతి నె
యఖిలదుష్కర్మైకమహార్ణవమగ్నుఁడైన, హరివిస్మయస్మరణార్ద్రమతి నె

గీ. నింద కు నెల్ల నెలవైన నిర్గుణుండ, మందభాగ్యుండ నే నేఁడ మధువిదారి
దివ్యగుణనామకీర్తన తెలియఁగ దేఁక, పూర్వసుకృతంబు లేకెట్లు పొందఁగలుగు."

(భాగ. స్కంధ. 6. ప 146.)

ఇఁక మనోవికారములనన్నిటిని గట్టిపెట్టి శ్రీహరిపదకమలములను గొలిచెదను. ఈసంసారసాగరమును విడిచెదను. మాయావిమోహమైన తనువు నడఁచెదన[illegible] తలంచి సకలమును బరిత్యజించి గంగాద్వారమున కేఁగి యట [illegible] దేవాలయమున యోగసమాధినిష్ఠాగరిష్ఠుఁడై పాంచభౌతికదేహమును విడిచి వైకుంఠమునకుఁబోయి శ్రీమన్నారాయణపరబ్రహ్మము[illegible] నైక్యమయ్యెను.

సీ. "బ్రహ్మహత్యా[illegible]పాతకముల కగ్ని, కీలలు హరినామకీర్తనములు
గురుతల్పకల్మష[illegible]ములకుఁ, గసులు హరినామకీర్తనములు
తపనీయచౌర్యస[illegible]కు సూర్య, కిరణముల్ హరినామకీర్తనములు
మధుపానకిల్బిష[illegible]తికిఁ, గసరుల్ హరినామకీర్తనములు

గీ. మహితయోగోగ్రనిత్యసమాధివిధుల, నలరు బ్రహ్మాదిసురలకు నందరాని
భూరినిర్వాణసామ్రాజ్యభోగభాగ్య, ఖేలనంబులు హరినామకీర్తనములు.
(భాగ. స్కంధ. 6. ప 118.)

---

4. నారదుఁడు.

ప్రపంచము నంతను సృజించు బ్రహ్మ లందఱును జేరియొకప్పుడు దేవసత్రము అను నొక యాగమును జేసి యందు శ్రీమన్నారాయణుని దివ్యమంగళగాథలు గానంబు సేయుటకొఱకు అచ్చరలను గంధర్వులను బిలిపించిరి. ఉపబర్హణుం డనుగంధర్వుఁడొకఁడు సంతతము స్త్రీలతోఁ గ్రీడించుచుండియు దైవవశమున నచ్చరులతోడను గంధర్వులతోడను గలిసి దేవసత్రమునకు వచ్చెను.

అచ్చట శ్రీహరి కల్యాణగాథలు కీర్తించుచు నప్సరసలు ఆడిరి. గంధర్వులు పాడిరి. పుండరీకాక్షుని దివ్యకథామృతమును గ్రోలియు, అచ్చరల యాటలు సూచియు, గంధర్వులపాటలు వినియు యజ్ఞము నకువచ్చిన యెల్లరును మిగుల నానందించిరి. ఉపబర్హణుఁడు మాత్ర మేమియుఁ బాడక అచ్చరలతో సరససల్లాపములాడుచుఁ గూర్చుండెను. అది విధాతల కన్నులఁ బడియెను. తోడనే వారు ప్రళయాగ్నులవలె మండిపడి కటము లదరఁ బండ్లు పటపటఁగొఱికి—

"ఆ. పంకజాక్షు నిచటఁ బాడక కామినీ, గణముగూడి చనిన కతమువలన
దగ్ధకాంతి వగుచు ధరణీతలంబున, శూద్రజాతిసతికి సుతుఁడ వగుము."

అని శపించిరి.

ఈశాపకారణమున ఉపబర్హణుఁడు వేదవాదు లగుయోగిజనుల యింట దాసి యగు నొక శూద్రవనితకుఁ గొడుకై పుట్టెను. అంత వానితల్లి తనపుత్త్రున కేడేనిమి దేండ్లువచ్చినతరువాత యోగిసేవకు నియమించెను. ఆబాలుఁడును జాల భక్తిశ్రద్ధలతో యోగులను బూజింపఁ దొడఁగెను. అవసరమైనంతసేపును బనులుచేసి తీఱికయైనపు డాబాలుఁడు యోగులయెడల భయభక్తులుగలిగి బాలురతో నాటపాటలకుఁ బోవక వారు చేయు బ్రహ్మవాదములను వినుచుండెను. దేవతాప్రసాద

మని పరమభక్తితో నాతఁడు వారి యెంగిలి తినసాగెను. ఎండకెండియు వానకుఁ దడిసియుఁ గూడ నాతఁడు వారి ముంగిటఁ గూర్చుండుచుండెను. వారేపని చెప్పినను ఎదురుచెప్పక నిముసములో నెఱవేర్పసాగెను. వర్షాకాలమును శరత్కాలమును గడచునంతవఱకును బాలుఁడీరీతినిఁ బరమభక్తితో సేవలు చేయుచుండుటఁజూచి యోగు లాతని యెడల మిగుల ననుగ్రహము గలవారైరి.

పిదప వారు శ్రీకృష్ణభగవానుని చరిత్రలుచదువుకొనుచు, వర్ణించుకొనుచుఁ బాడుకొనుచు బ్రహ్మానందానుభవమువలన మైమఱవసాగిరి. బాలుఁడును వారియెదుట నిలిచి శ్రీకృష్ణచరితామృతమును వీనుఁజేఱలఁ జుఱ్ఱుచు నందలి మహానుభావమును గుర్తెఱిఁగి సకలవిషయములను వీడి శ్రీమహావిష్ణువు సేవ ప్రారంభించెను. ఈసేవవలనను, యోగులయనుగ్రహమువలనను ఆబాలునకుఁ బ్రపంచమంతయు మాయాపరికల్పితమను జ్ఞానమును, రజస్తమోగుణపరిహారిణి యగు విష్ణుభక్తియుఁ గలిగెను.

అంతలో యోగులకు చాతుర్మాస్యలు ముగిసెను. ఏమియులోపములు లేకుండఁ దమ్ము గొలుచుచుండుటవలనను, భక్తిపరీతహృదయుఁడై శ్రీహరిని గీర్తించుచుండుటఁ జూచియు వారు కాఁగలవాఁడని యూహించి బాలునకు ఈశ్వరరహస్యములను జ్ఞానమును బరిపూర్తిగ నుపదేశించి తీర్థయాత్రార్థులై వెడలిపోయిరి. ఆయుపదేశమువలన నాతఁడు సకలసందేహములను నివృత్తిచేసి మాధవపదచింతనముఁ బ్రారంభించెను. అందులకు శ్రీహరి మెచ్చి యాబాలునకు ధైర్యము నొసంగెను.

యోగులకుఁబరిచర్యచేయుకాలమున నాతనితల్లి తనకస్వతంత్రతగలిగెనని గాని, అలసితి సొలసితి ననిగాని యెరితోడను జెప్పి యెఱుఁగదు. అచటఁ బనులన్నియు ముగిసినవెంటనే యింటికి వచ్చి ప్రియమారఁ గుమారునిఁ జేరఁజీరి తొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని చుంచు దువ్వి ముద్దిడుకొని, దేహము నివిరి, కౌఁగిలించుకొని యనేకవిధముల లాలించి యానందించుచుండును. అయినను బాలుఁడు ఆమె కెదురాడఁ డయ్యెఁ గాని అప్పటికే సంసార మసారమనియు, భక్తిలతకుఁ జీడపురుగువంటిదనియు, సంబంధబాంధవములాభాసములనియుఁ గుర్తెఱిఁగి

యుండుటవలన ఆసౌఖ్యముల ననుభవించి ముగ్ధుఁడుగాక చిత్తము శ్రీహరిమీఁదనే నిలిపియుంచెను. ఇట్లుండ నొకనాఁటిరాత్రి యాతని తల్లి పాలుపిదుకుట కావువద్దకు బోవుచు మార్గమధ్యమున నొక నల్లత్రాఁచుఁబామునుదొ్రొక్కెను. తోడనే పాము బుస్సుమని తిరుగఁబడి కఱచి యామెను జంపివేసెను.

తల్లి చనిపోయినందుల కాబాలుఁడు వగచుటకు మాఱుగా "సంసారబంధము తెగిపోయినది ఇఁక నేనెట్లున్నను నాకొఱకువిచారించువారు లేరు. ఇఁక నేననవరతము హరిభజనమునఁ బ్రొద్దుపుచ్చవచ్చు" నని మిగుల నానందించెను. ఈతలంపుతో నాతఁ డచ్చటినుండి కదలి యుత్తరాభిముఖుఁడై పోయి పర్వతములు, అరణ్యములు, నదులు, జనపదములు, పురంబులు, పట్టణంబులు మొదలయినవి లెక్కలేనన్ని గడచి, తుదకొక్కనదీతీరమున నిలిచి స్నానమాడి మధురజలంబులు ద్రావి విగతశ్రముఁడై యొక్కరావిచెట్టుక్రింద గురూపదేశప్రకారము హృదయమున నెలకొనియున్న శ్రీపతిని ధ్యానించుచు ఆనందాశ్రులు వెల్లివిరియఁ గూర్చుండియుండ దేవదేవుఁడు ప్రత్యక్షమైనట్లయ్యెను. తోడనే బాలకుఁ డులికిపడి లేచి యావైకుంఠుని దివ్యమంగళవిగ్రహమును గనులారఁ జూడఁగోరెను; గాని ప్రయోజనము లేదయ్యెను. అంతఁ జేయునదిలేక శ్రీహరికొఱకు ఆబాలుఁడు వననుంతయుఁదిరుగుచుండఁగా "కుమారా, ఏల యట్లు ద్రిమ్మరెదవు? నీవీపుట్టువున నన్ను జూడఁజాలవు. కామాదిరిపుషడ్వర్గములను జయించినవాఁడేగాని నన్ను దెలిసికొనఁజాలఁడు. నీకోరిక కొనసాగుటకై నాతేజస్సునీకుఁ బ్రకాశపఱిచితిని. నామీఁదిభక్తి సకలదోషపుంజములనడంచును. నన్ను సేవించుటవలన నాయెడల భక్తికలుగును. జన్మాంతరమునఁగూడ నీకు నాయెడల నీఁమచంచల భక్తి కుదిరియుండును. నాయనుమతివలన నీవు నాభక్తశేఖరుఁడవై పుట్టెదవు. ఈసృష్టి కడచి రాత్రిపోయిన పిదపఁ బుట్టి నీవు సాత్త్వికులలో నగ్రేసరుఁడ వయ్యెదవు" అను పలుకులు వినఁబడెను. అది విని యాబాలుఁడు మహాశ్చర్యభరితుఁడై శిరమువంచి చేతులు జోడించి మ్రొక్కి శ్రీహరికృపకు సంతసించుచు పరమేశ్వరుని అనంతనామములతోఁ గీర్తించుచుఁ జరియించుచుండఁగాఁ గొంతకాలమునకు మృత్యువు చేరవచ్చెను. తోడనే యాబాలుఁడు పంచభూతాత్మకమును,

గర్వసంభవము నైన పూర్వదేహము విడిచి భాగవతదేహముధరించెను. అంతలోఁ బ్రళయము సమీపించెను. అప్పుడు నిద్రింపఁబోవుచున్న బ్రహ్మ నిశ్వాసమువెంట లోనఁ బ్రవేశించెను. ఇట్లు వేయియుగములు గడచిన పిదప విధాత మఱల లేచి సృష్టి ప్రారంభించుచుండఁగా నాతని ప్రాణములవలన మరీచిమున్నగువారితోఁ బుట్టి యాతఁడు నారదుఁడను పేరుతో బ్రహ్మమానసపుత్త్రుఁ డయ్యెను. పిదప నారదుఁ డఖండ బ్రహ్మచారియై నారాయణుని యనుగ్రహమువలన మూఁడులోకంబుల బహిరంతరంబులందును అడ్డులేక యీశ్వరదత్తయై బ్రహ్మాభివ్యంజకంబులైన సప్తస్వరములు తమయంతన మ్రోయు వీణ నాలాపించుకొనుచు పద్మనాభుని గాథలు పాడుకొనుచు మహానందముతోఁ దిరుగఁ జొచ్చెను.

పిదప నారదుఁడు, ప్రజానిర్మాణశక్తి యలవడుటకై శ్రీమన్నారాయణునిగుఱించి తపస్సు ప్రారంభించిన దక్షుని కుమారులకు నివృత్తిమార్గము నుపదేశించెను. తోడనే వారు తపస్సువదలి వైకుంఠమునకుఁ బోయిరి. అది తెలిసి దక్షుఁడు మిగులఁ గోపించి నీకొకచోట నివాసము లేకుండుగాక యని శపించెను. అప్పటినుండియు నారదుఁడు సర్వదా త్రిలోకసంచారియై నారాయణుని కీర్తించుచు హరిభక్తులలో నగ్రేసరుఁడై యుండెను.

సీ. "ముక్తికాంతైకాంతమోహనకృత్యముల్, గామె హరినామకీర్తనములు
సత్యలోకానందసౌభాగ్యయుక్తముల్, గలిమె హరినామకీర్తనములు
మహితనిర్వాణసామ్రాజ్యాభిషిక్తముల్, గలిమె హరినామకీర్తనములు
బహుకాలజనితతపఃఫలసారముల్, గలిమె హరినామకీర్తనములు

గీ. పుణ్యమూలంబు లనపాయమూలకంబు, లభిమతార్థంబు లజ్ఞానహరణకరము
లాగమాంతోపలబ్ధంబు లమృతసేవ, లౌర నిత్యములు హరినామకీర్తనములు.
(భాగ. స్కం. 6. ప. 119.)

---

5. విభీషణుఁడు.

మూఁడవబ్రహ్మ యగు విశ్రవోబ్రహ్మవద్దకుఁ దండ్రి యగు సుమాలి పంపునఁ గైకసి యను కన్యామణి వరించి వచ్చి పుత్త్ర

దానము వేడుకొనెను అంత నాతఁడు "నీవు సంజవేళఁ గామబాధితవై వచ్చితివి. కావున నీకు ఘోరాచారు లగు రాక్షసులు పుట్టెద" రని యెను. "మహామహిమాసమంచితుఁడవు నీవిట్టులాడఁదగునా" యని కైకసి యడుగఁగా విశ్రవో బ్రహ్మ దివ్యదృష్టితో భవిష్యద్విషయము లను దెలిసికొని "కాలదోషము పెద్దలకే కాదు. విధాతకైనఁ దప్పింపఁ దరముగాదు. నీ కుమారులలోఁ గడసారివాఁ డగు మూఁడవవాఁడు మాత్రము తన అన్నలవలెఁ గాక విద్యాగరిష్ఠుఁడును బ్రహ్మనిష్ఠుఁడు నగును. ఆతనివలననే కులము నిలుచు" నని చెప్పెను.

పిదపఁ గైకసికి ముగ్గురు కుమారులు కలిగిరి. రావణుఁడు కుంభ కర్ణుఁడు, విభీషణుఁడు నని వరుసగా వారికిఁ బేరులు పెట్టఁబడియెను. ఆమెకు శూర్పణఖ యను కుమార్తెగూడ జనియించెను. దశగ్రీవుఁ డును, కుంభకర్ణుఁడును, లోకములను బాధింపసాగిరి. విభీషణుఁ డట్లు గాక భయభ్రాంతులై పరువెత్తు మునుల నాపి భయముదీర్చి నా నిమిత్తము వీరిని రక్షింపుఁ డని ప్రార్థించుచుండును. విభీషణుఁ డనే కసజ్జనుల యాశీర్వాదములను బడసెను. ఆతఁడు తండ్రివద్దఁ గూర్చుండి వేదార్థము లాలించుచు వ్రతములు చేయుచు జితేంద్రియుఁడై పరోప కారము చేయుచుఁ గులమర్యాద చెఱుపక తండ్రి యనుగ్రహము గూడ సంపాదించుకొనెను.

పిదపఁ దల్లి సెలవు బడసి సోదరులు ముగ్వురును గోకర్ణాశ్రమ మునకుఁ బోయి బ్రహ్మనుగుఱించి తపస్సు ప్రారంభించిరి. రావణకుంభ కర్ణుల తపోనిష్ఠలు ఘోరములై యుండెను. విభీషణుని తపోనిష్ఠ శాంత మైవెలసెను. వారి తపోవహ్నిజ్వాలలను సహింపలేని దేవతలచేఁ బ్రార్థి తుఁడై వాణీపతి వారికిఁ బ్రత్యక్షమై వరమును వేఁడుకొండనియెను. దశగ్రీవుఁడు విద్యాధరోప్సరో యక్షరక్షోగంధర్వ కిన్నరాదులవలన మృత్యువురాకుండునట్లు వరము కోరెను. సరస్వతి చేసినవంచనవలనఁ గుంభకర్ణుఁడు ఆఱుమాసములు నిద్రించునట్లును, ఒక్కనాఁడు భుజిం చునట్లును వరము ప్రార్థించెను. విభీషణుఁడు ఏయాశ్రమమునఁ బ్రవే శించినపు డాయాశ్రమధర్మములు నెఱవేర్చునట్లును, శిక్షతో నవసర ము లేకుండగనే బ్రహ్మాస్త్రము స్వాధీన మగునట్లును వరము కోరెను. బ్రహ్మ వారు కోరిన వరము లిచ్చి విభీషణుని దీవించి వెడలిపోయెను.

పిమ్మట రావణుఁడు కుబేరునిఁ బాఱఁదోలి లంకాపట్టణముస్వాధీనము చేసికొని తాను మయునికూఁతురగు మండోదరినిఁ బెండ్లియాడి, కుంభకర్ణునకు బలికొమార్తకుఁ గొమార్త యగు వజ్రజ్వాలను, విభీషణునకు శైలూషుఁడను గంధర్వునికొమార్త యగు సరమను బెండ్లిచేసెను. మఱియు నాతఁడు తనచెల్లెలగు శూర్పణఖను విద్యుజ్జిహ్వున కిచ్చి పెండ్లిచేసెను. పిదపఁ గాలము జరిగిపోవుచుండఁగా రావణుఁడు శ్రీరామచంద్రుని సతితిలక మగుసీతామహాదేవిని హరించుకొనివచ్చి లంకలో నుంచెను. అంతవఱకును గూడ నన్నదమ్ముల హృదయవృత్తులు కలియలేదు. రావణకుంభకర్ణులు క్రూరకార్యములు చేయుట మానలేదు. విభీషణుఁ డందులకు వగచి సాధ్యమైనంతవఱకుఁ బ్రతీకారము చేయకుండ నుండలేదు.

“రాముఁడు మనుష్యుఁడు. నంటయింటఁ జొచ్చిన కుందేలువంటివాఁడు” అని రావణకుంభకర్ణులు భావించిరి. “శ్రీరామచంద్రుఁడులీలామానుషవిగ్రహుఁడు. కేవలము సర్వేశ్వరుని యుపరావతారము ఆతఁడు దుష్టసంహారమునిమిత్తమును, ధర్మరక్షణముకొఱకును భూమిపై నవతరించెను” అని విభీషణుఁడు తలంచెను. తక్కిన రాక్షసు లందఱును రావణునే యనుసరించిరి. కావుననే రావణుఁడు సీతను లంకకుఁ దెచ్చి రాముఁడు నన్నేమిచేయఁగలఁ డని గర్వించెను. విభీషణున కిది చాల భయకారణ మయ్యెను. ఇట్లుండఁగా నాంజనేయుఁడు సీతాన్వేషణమునకై వచ్చి లంకను భస్మపటలము గావించి పోయెను. అందులకు రక్కసులెల్లరును దల్లపోయి నసము సరియైన ప్రయత్నములు చేసితిమిగా మనుకొనిరి. ఇఁక లంకకువచ్చి యెవ్వఁడు బ్రతికిపోఁగలఁ డని గర్వము వహించిరి. విభీషణుఁ డట్లుగాదు. ఖరత్రిశిరాదులను విలాసమాత్రమున సంహరించినప్పుడే యాతఁడు రామచంద్రుఁడ జేయుఁ డనుకొనియెను. లంకాదహనమైనపిదప నాయూహ స్థిరపడెను. “రామభక్తుఁడే యంత పనిచేసినప్పుడు సాక్షాద్భగవానుఁ డగు రాముఁ డెంతపనిచేయును?” విభీషణుఁడిట్లు తలంచుకొని చాల భీతిల్లెను. విజ్ఞానము భయకారణము. కావుననే యది రక్షించును. అగ్నినిఁ జూచి యిది దహించు ననుజ్ఞానము గలవాఁడు దాని నంటఁడు. కావుననే వానిచేయి కాలదు. “ఇదియొక వింతవస్తువు. అన్నిటికంటె దీనియందుఁ బ్రకాశగుణమెక్కువయున్నది.

ఇంతకంటె విశేషము లే"దని తలంచెడి అజ్ఞాని అగ్నికణమును బూల
బంతివలె నాడింపఁబోవును; గాని తోడనే వాఁడనుకొనినదానికి వ్యతి
రేకముగఁ జేతులుకాలి బొబ్బలెత్తి మంట ప్రారంభించును. అప్పుడు వగ
చిన లాభ మేమి.!

రావణుఁడు చేసిన దారుణవ్యాపారమువలన రాక్షసకులము నశించిపోవునని విభీషణునకు దోఁచెను. అకటా! త్రిలోకములను జయించినరాక్షసవీరులునామరూపములు లేకుండఁబోవలసినదా?-ఈతలంపుతో నాతఁడు నిండుకొలువున రాముని వానరులను నిముసమునఁ బరిమార్తుమని గండుమిగిలి ప్రగల్భములాడుచున్న రాక్షసుల నందఱను వారించి "ఏల వృథాగర్వోక్తు లాడెదరు? మంచిచెడ్డలు వలదా? మనరాజు ఆ రాజుదేవినిఁ జెఱపట్టెను. అంత దండెత్తివచ్చుటలో శ్రీరామచంద్రుని దోష మేమి యున్నది? దుర్మార్గురాలగు శూర్పణఖ ఘోరరూపముతో వైదేహిని మ్రింగఁబోవుటనుగదా రాఘవులు కోపించి దానికిఁ బ్రాయశ్చిత్తముచేసిరి! దానిమీఁది యభిమానమువలననే గదా ఖరుఁడు రాఘవులమీఁదికిఁ బోయి కూలెను. తప్పులన్నియు మనయందే యున్నవి. మంచిచెడ్డలు, ధర్మాధర్మములు తెలిపినంతమాత్రమున మగతనము పోదు. ఇపు డిచ్చటఁ బ్రగల్భములు కొట్టుచున్నమీరందఱు నారాముని దూతను హనుమంతు నేమిచేయఁగలిగిరి? సామదానభేదములు నిరర్థకములగునంతవఱకును దండోపాయము నవలంబింపరాదని నీతికోవిదులు చెప్పెదరు. అదియుఁగాక శ్రీరామచంద్రుఁ డిప్పుడు సంపూర్ణబలుఁడై యున్నాఁడు. అన్నా! రాక్షససార్వభౌమా, ఏల వ్యర్థపు నాశము తెచ్చిపెట్టెదవు? నీసేవకులను, బంధువులను, మిత్రులను, బుత్రకళత్రములను, నిన్ను,తుదకు రాక్షసకులమును రక్షింపఁదలఁచెదవేని దేవయజనసంభవయగు సీతామహాదేవిని రామునకు సమర్పించి యభయమును బడయుము" అని పలికెను.

ఈమాటలు చెవులకు ములుకులై నాట రావణుఁడు మిగులఁ గోపించి సభాస్థానము విడిచి యంతఃపురమునకుఁ బోయెను. విభీషణునకు విచారము మఱింత యధిక మయ్యెను. చెప్పి చేయించుటకే కాని యాతఁడు చేసి చూపుటకు సమర్థుఁడు కాఁడుగదా? ఒక్క రావణుఁడు మాత్రమే యిట్టి పట్టుపట్టియున్న మేలే కాని రాక్షసులందఱు నిట్టి యభి

ప్రాయముతోడనే యున్నవు డేమి సేయవచ్చును? అయినను జెప్పవలసిన స్థితి యింకను మించిపోలేదు. ఇట్లు తలంచి యాతఁడు మఱునాఁ డుదయమే రావణునియింటికిఁ బోయెను.అప్పటి కప్పుడే రావణుఁడు మంత్రులతో నీవిషయమే యాలోచించుచుండెను. విభీషణుఁడు మఱల "నీవు సీతను దెచ్చినదిమొదలుకొని యన్నియు నవశకునములే యగుచున్నవి. ఈ దుష్ప్రారంభమువలనఁగలుగు చెడుగు లన్నియు నీమంత్రుల కెఱుకయే.అయినను, వారు నీకు వ్యతిరేకము సెప్పనోడి నీకోపాగ్నిని మఱింత రగుల్కొల్పుచున్నారు. సీతను రామున కిచ్చివేయుము"అని చెప్పెను. "నీవు మాకేమియు నాలోచన చెప్పనక్కఱలేదు. పొమ్ము" అని రావణుఁడు తమ్మునిఁ దిరస్కరించి సభకుఁ బోయెను.

విభీషణుఁడు మఱల నక్కడఁ బ్రత్యక్షమయ్యెను. కుంభకర్ణుఁడు నాఁడు నిద్రమేల్కాంచి వచ్చెను. రావణుఁడు శూర్పణఖాపరాభవము మొదలు వాని కన్నియుఁ జెప్పెను. అప్పుడు కుంభకర్ణుఁడు "సీతను రామున కిచ్చివేయుటయే క్షేమము. ఆదిమధ్యాంతరహితుఁ డగు!శ్రీమహావిష్ణువు రాక్షసకులమును నాశముచేయుట కిట్లు రాఘవకులమునఁ బుట్టెనని నారదుఁడు నాతోఁ జెప్పెను."ఇట్లు చెప్పి యాతఁ డంతలో రావణునిముఖముచూచి వాని కోపభావమును గ్రహించి తుదకు"నేనిన్నిమాటలవాఁడనుగాను. లంక భస్మమైన దని వినినపుడే నాహృదయమునఁ గ్రోధాగ్ని ప్రజ్వలించినది.అది రాఘవులను మాడ్చివేయకుండఁ జల్లార" ననిచెప్పెను. రావణుఁ డందులకు సంతోషించుచుండఁగా విభీషణుఁడు మఱల "అన్నా! ఆవెఱ్ఱిమాటల కేల యానందించెదవు? కుంభకర్ణుఁడు తొలుతఁ జెప్పినదంతయు యథార్థము. తరువాతఁ జెప్పినది నీమొగము చూచి చెప్పినది. కావున ఆదరింపఁదగినది కాదు".అని చెప్పెను.దానిపై నింద్రజిత్తు పినతండ్రిని "నీకిట్టిమాట లాడుట తగదు. పొ"మ్మనియెను.

బాలకుండగు నింద్రజిత్తు పలికిన యీయనీతివాక్యమును వినిన విభీషణునివంటి నీతిధురంధరునకు, ధర్మాధర్మపరిజ్ఞాతకు ఎట్లుండును? బాహుబలగర్వదుర్విదగ్ధుఁడా విభీషణునితో మాట్లాడఁదగినవాఁడు? ఇదియంతయుఁ జూచి విభీషణుఁడు "ధర్మ మెంత తిరస్కరింపఁబడుచున్నది?" యనుకొని "అల్పుని మూర్ఖుని బహుభాషిని ఉత్సాహపూరితుని బాలకుని రాజకార్యాలోచనము చేయునపుడు చేరనీయరా

దని నీతికోవిదులు చెప్పుదురు. నీబుద్ధి యెప్పుడును వెడతలనే పట్టు చున్నది. అట్టి నీవున్నచోట మంత్రాలోచనము చేయఁదొడఁగిన యీ రాజుగారి నేర్పున కిఁక లోప మేమి? పుత్రరూపము పొందిన శత్రుఁడవు గాని నీవు నాయన్నకుఁ బుత్రుఁడవా? శ్రీరామచంద్రుఁ డనిన దేవేంద్రుఁడో కుబేరుఁడో వీతిహోత్రుఁడో మఱియెవరో యనుకొంటి వి. ఆతఁ డాదివిష్ణువు నవరావతారముసుమా. ఆతనియెడల నీబాణము లు గడ్డిపోఁచ లగును?" అని మేఘనాదునకు బుద్ధిచెప్పి పిమ్మట రావణు నితో "తాటకను సంహరించెను. విరాధుని దునిమెను. ఖరుని మ్రందించెను. మారీచుని వధించెను. ఇన్ని చేసినను నీవింకను రాముని దృణీకరించెదవు? జౌనది యట్లె. రాక్షసకులావసానము సమీపించినప్పుడు నీకు జ్ఞాన మెట్లుండును? నీమంత్రులు సేనానాయకులు నూఱక బీరము లాడెదరు; గాని తమతమ శక్తిసామర్థ్యముల నెఱుఁగరు". అదియుఁ గాక,

ఉ. "తాత పులస్త్యుఁడుం గనినతండ్రియు విశ్రవసుండు వైదికో
షితము నిర్మలాచరణ మొప్పును బ్రహ్మవు చెప్పవచ్చినన్
నీతివివేకముల్ దొలఁగి నిందకు నోర్చితివేల దేవ! ము
న్నితెఱఁగెల్ల నొప్పదని యీవ రెఱుంగుదు చెప్ప నేటికిన్.

మ. జగతీనాథుఁడు సింహపంబునఁ బులస్త్యబ్రహ్మవంశంబు ప్రాఁ
దగ సంభోధ గడాకమున్న కపు లుద్వృత్తిం ద్రికూటాద్రి శి
ఖ్లగిలం ద్రోపకమున్న లక్ష్మణుఁడు కీలాఘోరనారాచముల్
నిగుడం జేయకమున్న ప్రుచ్చు మిఁకఁ బేవేగ పృథ్వీసుతన్."

(భాస్కరరామాయణము. యుద్ధకాండ. ప. 134-136.)

అని చెప్పెను.

ఈపలుకులు పిశాచంపునకు ములుకులవలెఁ దోఁచెను. తోడనే యాతఁడు విభీషణునిఁ జుఱచుఱఁ జూచుచు "క్రూరసర్పముతోఁ గలిసి యుండుటకన్న నీతో నుండుట చాల నపాయకరము. స్నేహితునివలె దగ్గఱఁ జేరుచు నొకదెస వైరముచూపు నీకంటె నిక్కపుఁ బగవాఁడే మంచివాఁడు. నీవు నాదాయాదివిగదా. నా పెంపు చూచి యెట్లు సహింపఁగలవు? కులపాంసనా! నాయెదుటనుండి లేచిపొమ్ము" అని గద్దించి

ధర్మజ్ఞునకు ధర్మము తిరస్కరింపఁ బడుచున్నపుడు కలుగు కోపముకంటె మఱియేకోపమును బెద్దదియు, భయంకరమైనదియుఁ గాదు. అందు నిది శ్రీహరి యవతారమగు శ్రీరామచంద్రునకు సంబంధించిన ధర్మతిరస్కారము. ఇఁక బ్రహ్మవంశజుఁడు దైవభక్తిపరతంత్రుఁడు నగు విభీషణుని కిపుడు గలుగు కోపము నెవరు వర్ణింపఁగలరు? కాని గంతులువేయుచు అంకెలువేయుట విభీషణునివంటి విజ్ఞాని లక్షణముగాదు. ఆతఁడు మఱల నిర్భయముగా సోదరునిఁ జూచి,

ఉ. "అన్నవు తండ్రి యట్లు విను మంతియ కాదట మీఁద రాజ వే
యున్న నుజెల్లఁ గాక మణిమండనముఖ్యములైన కానుక
ల్మన్నగ సీత నిచ్చి జనలోకపతిం గని మమ్ముఁ బ్రోవు మీ
సన్నపుఁగార్యముల్ విడుము సందియ మేలటు గాక తక్కినన్"

గీ. "నలుదు చాటిని నతఁడు నీకొలఁదిగాఁడు, చేయుతప్పిగాన నీకిట్లు చెడ్డబుద్ధి
పొడముచున్నది నాశంబుఁ బొందనున్న, మేనుమునఁపు విశీర్ణంపు నేలుఁగునట్లు"

ఉ. "నా చెవిక్రిందఁ జేరి రజనీచరనాయక! తుచ్ఛవాక్యముల్
నీచులు సన్కనిం బలుక నీకవి పథ్యము లయ్యె నేఁగదం
జూచిన నాహితోక్తులకుఁ జొన్పగు నీమది గాన దర్పదం
డై చెడువానికొంతేఁ జన దండ్రు ప్రసింపఁగ నీతికోవిదుల్"

సీ. "వీఁక త్రెంచెఁ జానకీశకంఠునివిల్లు, ఫుటకకై వడిఁ దున్మె బ్రోగువెట్టె
నిలఁ గార్తవీర్యబాహులు వేయు ఖండించిన, పరశురాముని నాజి భంగపఱిచె
కైలాస మెత్తిన ఘనుని నిమ్ముగఁ గట్టిన, వాలి నొక్కమ్మునఁ గూలనేసె
నీపుత్రు వధియించి నీలంక గాల్చిన, హనుమంతు నేలినయతని నేఁ"

గీ. అట్టిరాముతోడ నసమానవైరంబు, పెట్టి గెలుతు ననుట పెడచుబుద్ధి
చనదు సీత నిచ్చి శరణని రఘురాముఁ, గనుట మేలు చెడక మనుట మేలు."

(భాస్కర యుద్ధ. ప. 141-143-144-146.)

అని గంభీరముగఁ బలికి యూరకుండెను.

విభీషణుని మాటలవలన రావణునకు రోషోదయంబై ప్రపంచ జ్ఞానమును బూర్తిగఁ దుడిచివేసెను. తోడనే యాతఁడు తటాలున గద్దియనుండి యుఱికి తమ్ముని వక్షముపైఁ దన్నెను. ఆతాపుతో విభీషణుఁడు మూర్ఛిల్లి యాసనముమీఁదనుండి క్రిందఁ బడియెను. రావణుఁ డంతటితో శాంతింపక తమ్ము కంఠము తెగనఱుక నూహించెను; గాని

మంత్రులు వారించి గద్దియపైఁ గూర్చుండఁజేసిరి. విభీషణుఁడు కొంత తడవునకుఁ దెలివొంది సభామధ్యమున నిలిచి మఱల—

క. "కామక్రోధమదంబులు, నీమనమున నిండియుండ నిర్మలధర్మం
బేమూలనుండు రావణ, నామాటలు చెవులఁ జొచ్చునా నీకింకన్"

చ. "చనదు మహద్విరోధ మని చక్కటిచెప్పిన నింతతప్పనం
గనలితి నీతిశూన్యులకుఁ గార్యము లేఁటికి దోఁచు నిప్డు నే
యును బనిలేదు నీవలన నొప్పనినావచనంబు లెల్ల నీ
వనిమొన రాముచేఁ బడినయప్పు డెఱింగెదఁగాక పోరుఁడన్."

(భాస్కర. యుద్ధ. ప. 150-154.)

అని పలికి చివాలునఁ గొలువువీడి తల్లియగు కైకసిపాలికిం జని నమస్కరించి "అమ్మా! సీతను దెచ్చుట మంచిదిగాదని నే ననేకవిధములఁ జెప్పఁగా నీపెద్దకొడుకు నన్ను గాలితోఁ దన్ని తల నఱికెద నని కత్తియెత్తెను. ఇఁక నిక్కడ నుండుటకంటె వేఱుపాపము లేదని శ్రీరామచంద్రమూర్తిని శరణుగోరఁ బోవఁదలంచితిని. సెలవిమ్ము." అని ప్రార్థించెను. కైకసియుఁ బెద్దకుమారుని దౌష్ట్యమునకుఁ జాల వగచి "కుఱ్ఱా! మీరు పుట్టినపుడే మీతండ్రి నీయన్న లిట్టి దుర్మార్గులగుదురనిచెప్పెను. రావణకుంభకర్ణులవలని యిడుములు సహింపఁజాలకపోయి దేవత లందఱును బ్రార్థింప శ్రీహరి యిట్లు శ్రీరాముఁడై వారిని సంహరింప నవతరించెను. ఇఁక రాక్షసు లెల్లరు నెట్లును నశింతురు. నీవైన రఘురాముని శరణుఁజొచ్చి కులము నిలుపుట నాయదృష్టలేశము గదా? నాబిడ్డా! మీతండ్రి తపోమహత్త్వము, హరిహరహిరణ్యగర్భులు, లోకపాలురు, గ్రహతారకములు, సప్తకులపర్వతములు, సముద్రములు, మహానదులు, నుభయసంధ్యలు, వేదవేదాంగములు, అహోరాత్రములు నిన్ను రక్షించుఁగాక. ధర్మ మెచ్చటనున్న నచ్చటనే జయమగుఁ బోయిరమ్ము" అని సెలవిచ్చెను. తన పరాభవమునకుఁ దల్లి మిగుల వగచుటంజేసి విభీషణుఁడు తన వాదమున నేమియుఁ బొరపాటులు లేవని దిటవుకొంచి భయభక్తులతోఁ దల్లికి నమస్కరించి మంత్రిసహితముగ సముద్రము దాఁటివచ్చి శ్రీరామునకు సమీపమున నాకసమున నిలిచెను.

మంత్రులతోడి విభీషణునిఁ గాంచి సుగ్రీవుఁడు కపులతో "అదిగో! చూడుఁడు. ఆకసమున నైదుగురు రక్కసులు భీకరాయుధములను దాల్చి మనపై దండెత్తివచ్చినా" రని చెప్పెను. తోడనే వానరులు "వాంత్రను గిరులు,తరువులు మున్నగుసమస్తసాధనములతోడనే మ్రందించెద మిదే చూడుఁ"డని కల్లోలము సేయసాగిరి. వానరుల సంరంభముఁ జూచి విభీషణుఁ డెలుఁగెత్తి "ఓకపివీరులారా! మేము మీతోఁ బోరవచ్చినవారము కాము. దేవయజనసంభవయగు సీతామహాదేవినిఁ దెచ్చుటవలన రాక్షసకులనందనవనమునకు నిప్పుముట్టించుటవంటిదైనది. ఇఁకనైన బాగుసేయక యాదేవిని శ్రీరామచంద్రునకు సమర్పించి శరణువేఁడి నీయూపరతోఁ బాటు మావిపత్తుగూడఁ దప్పింపు మని మాయన్నయగు దశకంఠు ననేకవిధముల బోధించితిని. నాబోధన మేమియు నాతని తలకెక్కలేదు. పయింబయిగఁ దనచేఁతలకు వ్యతిరేకము చెప్పితి నని నిండుకొలువున నన్ను దన్ని యవమానము చేసెను. అందులకువగచి వానితోఁగూడ దుర్మరణము నొందనేల యని శ్రీరామచంద్రుని శరణువేఁడవచ్చితిని. నాపేరు విభీషణుఁడు. వీరు నామంత్రులు" అని చెప్పెను. దానిపై వానరులలో వాదోపవాదములు పెరిఁగిపోయెను. లక్ష్మణుఁడుగూడ రాక్షసులను నమ్మరా దనియెను. హనుమంతుఁడు "విభీషణుఁడు దుష్టబుద్ధిగాఁడు. లంకలో నేను పట్టుపడినప్పు డీతఁడు దూత వధ్యుఁడు గాఁడని నన్ను విడిపించిన ధర్మాత్ముఁడు. ఈతఁ డవశ్యము అభయమిచ్చి రక్షింపఁదగినవాఁడు. వాలినిఁ జంపి సుగ్రీవునకు వానరసామ్రాజ్యపట్టాభిషేకము సేయుట విని యీతఁడు తనయన్నయొట్లునుఁ జావక మానఁడనియు మీప్రాపుచేరిన లంకారాజ్యము తనకుఁ బట్టముగట్టెద రనియు నమ్మివచ్చిన రాజనీతిధురంధరుఁడు. మీయం దీతనికి నిర్మలభక్తి యున్నదని చెప్పుటకు సందేహము లేదు" అని చెప్పెను. తుదకు శ్రీరాముఁడు విభీషణుని కభయము నిచ్చి సముద్రోదకముఁ దెప్పించి లక్ష్మణునిచే నాతనికి లంకాపట్టాభిషేకము చేయించెను. పిదప విభీషణుఁడు రాక్షసవీరుల బలాబలములను రహస్యములును రామునకు స్పష్టముగ నెఱింగించెను.

తుదకు విభీషణుని సాయమువలననే శ్రీరాముఁడు అశ్రమముగ శత్రుసంహారము గావించివేసెను. పిదప సాక్షాత్తుగ నారాయణుఁడగు

రాముఁడు విమలభక్తిభరితుఁడగువిభీషణునకు లంకలో రాక్షస సామ్రాజ్యమునకుఁ బట్టాభిషేకము చేసి యిహమున సకలసౌఖ్యము లును బరమున నాత్మసాయుజ్యము నొసంగెను.

---

6. భీష్ముఁడు.

మహాతేజశ్శాలియైన ప్రతీపమహారాజు గంగాతీరమునఁ దపోనిష్ఠాగరిష్ఠుఁడై యుండఁగా నొకనాఁ డొకసుందరి వచ్చి యాతని కుడి తొడపైఁ గూర్చుండెను. కొంతదడవున కాతఁడు సమాధినుండి లేచి తన తొడమీఁదనున్న కలికి నారసి యచ్చెరువడి "నీవెవ్వతవు? ఎందలి దానవు? ఇట్లు స్వేచ్ఛమై నాకుడితొడపై నేల కూర్చుంటి" వని యడిగెను. తొడనే యామె "నేను జాహ్నవిని. నీసద్గుణములు విని నిన్ను మోహించి వరించి వచ్చితిని. భానుతేజా! అనుగ్రహింపు" మని ప్రార్థించెను. అందుల కాతఁడు "మానినీ! అగ్నిసాక్షిగఁ బెండ్లియాడిన నాధర్మపత్నినిఁ గాక నేనెప్పుడును బరకాంతను దలంపనొపను. అట్టి నన్ను నీవిట్లు కోరవచ్చునా? అదియుఁగాక, నీవు స్త్రీభాగంబైన యెడమ తొడ యెక్కక పురుషభాగంబైన కుడితొడ యెక్కితివి. కావున నీవు నాపుత్త్రునకు భార్యవు కాఁదగినదాన" వనియెను. సరియే యని గంగ యదృశ్యయై పోయెను.

పిమ్మటఁ బ్రతీపుఁడు ధర్మపత్ని యగుసునందాదేవితో ననేకతీర్థములం గ్రుంకి వేదోక్తము లగున నేకవ్రతముల నాచరించి శంతనుఁ డను నొక కుమారునిఁ గనియెను. శంతనుఁడును బెరిఁగి పెద్దయై మహోదారగుణవంతుఁడును వీరాధివీరుఁడునై ప్రజల మెప్పులను బడయసాగెను. అపుడు ప్రతీపుఁడు సంప్రాప్తయౌవనుఁడై యున్న కుమారుని సకలరాజ్యభారధౌరేయునిగాఁ బట్టాభిషేకంబు చేసి "గంగాతటమున నొకసుందరి నన్ను వరింపఁగా నాకుమారునకు రాణి వగు మంటిని. ఆమెయు నల్లెయని యంగీకరించెను; గావున నామెవచ్చినపుడు కుల

గోత్రములడుగక దానియిష్టము చొప్పునఁ జేయు" మని చెప్పి తపోవనమునకుఁ బోయెను.

క్రొత్తగా మీఁదఁబడిన రాజ్యభారమును జక్కఁగ నవరించుకొని శంతనుఁ డొకనాఁ డొంటిగ గంగాతటమునకు వేఁట కరిగెను. అచ్చట నొక తరుణి విహరించుచుండెను. ఆమె సౌందర్యమునకు శంతనుఁడు చాల నబ్బురపడియెను. పిదప నొండొరులు చూచుకొనిరి. ఇరువురును పరస్పర మోహమును వెల్లడించిరి. "ఆమె నేనేమి చేసినను నన్ను వారింపకుండునట్లును, నాకప్రియము పలుకకుండునట్లును మాట యిచ్చెద వేని నేను నీకు భార్యనయ్యెద" ననియెను. కామశరవిద్ధుం డగుట శంతనుఁ డందుల కభ్యంతరము చెప్పక యామెను గ్రహించెను.

ఇట్లు వారు కొంతకాల మనంతసంతోషముతోఁ గడపునప్పటి కొక పుత్త్రుఁడు పుట్టెను. తోడనే గంగ యాబిడ్డను నీటిలోఁ బాఱ వేసెను. ఇది తెలిసియు శంతనుఁడు "ఇట్లేల చేసితి" వని యడిగిన నామె పోవునేమో యని జడిసి యూరకుండెను. ఇట్లే యేడ్వురుబిడ్డలను గంగ నీటిలోఁ బాఱ వేసెను. శంతనుఁ డామెవియోగమును సహింపఁజాలక యేమియు ననక యూరకుండెను; గాని యెనిమిదవబిడ్డనుగూడ యథాప్రకారముగఁ బాఱవేయుచుండఁగా సహింపలేక శంతనుఁ డేమైనను గానిమ్మని గంగను వారించి "దుర్లభులైన కొడుకుల నేడుగుఱను జంపినను సహించితిని; గాని యీబాలసూర్యప్రకాశుని విడువఁజాల" ననియెను. అపుడు గంగ మందహాసము గావించి "వసిష్ఠుఁ డష్టవసువులను మనుష్యజన్మము పొందెదరుగాక" యనిశపించెను. వారు భూమిపైఁ జిరకాలము నిలువఁజాలక నన్ను బ్రార్థించిరి. అంత నేను వారి కభయ మిచ్చితిని. నేను నీటిలో గిరివేసిన యాయేడ్వురు నేడ్వురు వసువులు. ఇట్లయ్యె నని నీవు వగవకుము. వారందఱ చతుర్థాంశములును, ఎనిమిదవవాఁ డగు ప్రభాసుని సంపూర్ణాంశము నీతనియందుఁ గలవు. ఈతఁడు పెద్దకాలము ఎల్లరు బళీ యన జీవించును. దేవవ్రతుఁ డగు నీకుమారుఁడు పెద్దపెరుఁగునంతవఱకు నాయొద్దనే యుండు" నని చెప్పి గంగ నిజరూపము ధరించుకొనెను. శంతనుఁ డిదియంతయు విని దిగ్భ్రాంతుఁడై యేమియుఁ జేయలేక హస్తినపురమునకుఁ బోయెను.

పురమున కరిగి శంతనుఁడు రాజ్యవ్యవస్థలు చక్కఁగ నేర్పఱుచు కొని సామంతమహీపాలు రెల్లరును భయభక్తులతోఁ గొలుచుచుండ పరిపాలనము సేయుచు మఱల నొకనాఁడు గంగాతీరమునకు వేఁటకు బయలుదేఱిపోయెను నాఁడాతఁడు చూచినచోట గంగ చాలసన్నగిలి తన వియోగమువలనఁ గృశించిపోయెనో యనునట్లుండెను. అందు లకుఁ జాల వింతపడుచుఁ గారణ మరయుఁగోరి యాతఁడు కొంచె మెదు రుగఁ బోఁగా నట నొక కిశోరవీరుఁడు బాణవిద్య నభ్యసించు నెపంబున శరజాలముతో గంగానదికి ఆనకట్ట కట్టియుండెను. అందులకు మఱింత వింతపడుచు నాతఁడు బాలార్కతేజుఁడై యున్న యాకిశోరవయస్కుఁ డెతఁడా యని యూహింపసాగెను; గాని పుట్టినప్పుడుమాత్రమే చూచి యుండుటవలనఁ దనకుమారుఁ డని గుర్తింపఁజాలకపోయెను. ఈసమ యమునందే కుమారుఁడును ధనుర్ధరుఁడై యున్న తండ్రినిఁ జూచెను. ఆబాలుఁడు ఎదుటనున్న ధానుష్కుఁడు తనతండ్రి యని యెట్లూహింపఁగలఁడు? అయినను నిసర్గస్నేహ మోహితుఁడై నిలిచియుండెను. అంత గంగాదేవి దివ్యభూషణాలంకృతుఁడైన యాబాలుని కుడిచేయి పట్టుకొనివచ్చి "రాజా! ఏల యిట్లు వింతపడి చూచెదవు? ఈముద్దుబాలుఁడు నీకుమారుఁడు. లక్షణములు తెలియుటలేదా? ఈచిట్టితండ్రి వసిష్ఠమహర్షి వద్ద సాంగవేదముల నభ్యసించెను. సకలశాస్త్రములును శుక్రబృహస్పతులవద్ద నేర్చెను. అస్త్రవిద్య పరశురామునిచెంత నభ్యసించి యాతనిని మించెను. ఆత్మవిజ్ఞానమున సనత్కుమారాదులతోఁ దుల్యుఁ డయ్యెను. వీనిని గ్రహింపుము" అని శంతనునిచేతి కిచ్చి నిజ మార్గమున వెడలిపోయెను. శంతనుఁడును బెన్నిధిఁ గన్న పేదవోలె మహామహిమోదంచితుఁడైన కుమారుఁడు తనకు లభించినందులకుఁ బరమానందభరితుఁడై కుమారుని వెంటనిడుకొని పురమునకుఁ బోయెను. అట సకలసామంతసమక్షమున నాతఁడు దేవవ్రతునకు యౌవ రాజ్యపట్టాభిషేకముగావించి యాతనితో వినోదంబుగఁ గాలము గడుప సాగెను.

ఇట్లు నాలుగుసంవత్సరములు కడచిన పిమ్మట శంతనుఁడు యమునాతీరమునకు మఱల వేఁటకుఁబోయెను. అచ్చట నాతని కపూర్వమైన సౌరభము ఘ్రాణతర్పణముగావించెను. అంత నాతఁడు దానిని విడువఁ

జాలక యది వచ్చినదిక్కునకుఁ బోఁగాఁ గొంతదూరమున నచ్చరలను దలదన్ను నొక్క కన్య యమునానదిలోఁ నోడనడుపుచుండుట గాన వచ్చెను. శంతనుఁ డామె సౌందర్యమునకు విమోహితుఁడై చెంతకరిగి "నీవెవ్వరిదానవు? ఇచ్చట నొంటిగా నేల యోడ నడుపుచుంటి" వని యడిగెను. "నేను దాశరాజు కొమార్తెను నన్ను యోజనగంధి యందురు. తండ్రి నియోగమున ధర్మార్థము నేను యాతాయాత జనుల నీనది దాఁటించుచున్నా" నని చెప్పెను. అదివిని సంతసించి శంతనుఁడు దాశరాజుకడకుఁ బోయి తనవృత్తాంతము సెప్పి తన యభిప్రాయ మెఱిఁగించెను. అందులకు దాశరాజు సంతోసించి "పుట్టినప్పుడే కన్యక యొరుల కీవలసినదియే గదా? నీవంటి యుత్తమోత్తముఁ డెందు లభించును? నీ కిచ్చుటకు నా కేమియు నభ్యంతరము లేదు; గాని యొక్కవిషయము నీతోఁ జెప్పవలసియున్నది నీవలన నాకొమార్తకుఁ గలిగిన పుత్త్రునకు రాజ్యాధికార మొసంగునట్లు మాట యిచ్చెదవేని నీ యభీష్టము నెఱవేఱు"నని చెప్పెను. శంతనుఁ డీఁక నేమిచేయఁగలఁడు! "నాకిదివఱ కే యొక కుమారుఁడు గలఁడు. ఆతనికి యువరాజపట్టాభిషేకము చేసి యుంటిని. నీకోరిక నెఱవేఱుట కవకాశము లేదు" అని శంతనుఁడు చెప్పెను. "అయినఁ బ్రయోజనములే" దని దాశరాజు చెప్పెను. చేయునది లేక బిక్కమొగముతోఁ శంతనుఁ డింటికి మఱలెను.

ఇంటికి వచ్చినపిదపఁ బూర్వము భగవద్ధ్యానమున సర్వమును మఱచియుండు శంతనుఁడు ఇప్పుడు సత్యవతీధ్యానమున సర్వమును మఱచిపోయెను. ఒకటిరెండు దినములు గడచిపోయిన వెనుక దేవవ్రతునకుఁ దండ్రి యిట్లుండుట తెలియవచ్చెను. తోడనే యాతఁడు తండ్రి చెంతకు వచ్చి—

చ. "భవదభిరక్షిత క్షితికి బాధ యొనర్పఁగ నోపునట్టిశా
త్రవనివహంబు లేదు వసుధాప్రజ కెల్ల ననంతసంతతో
త్సవముల రాజు లెల్ల ననిశంబు విధేయుల నీవు నిట్లు మా
నవనృపశేంద్ర యేలొకో మనఃపరితాపముఁ బొంది యుండఁగన్."

(ఆంధ్రభార. ఆ. 4. ప. 139.)

అని యడిగెను. కొడుకు కిట్లడుగుటవలన శంతనునకుఁ గొంచెము ధైర్యము వచ్చెను. అప్పు డాతఁడు "వత్సా! అనపత్యతయు, నేకపుత్త్ర

తయు సమానమే యని శాస్త్రములు చెప్పుచున్నవి. అగుట నీకుఁ దోడుగ మఱికొందఱు కొడుకులఁ బడయఁగోరితిని. అగ్నిహోత్రమును, సంతానమును, వేదములు నెడతెగకూడదని మునీశ్వరులు చెప్పిరి. నీవస్త్రశస్త్రవిద్యాకోవిదుఁడవు. సంగరము లన్న నీకు సంబరము. రణ మన్నఁ దక్కిన సర్వమును విడిచి దూఁకెదవు శత్రుసంహార మనిన నీకెంతో యానందము. అగుట నీవు చిరజీవి వగుదు వని నమ్ముటకు వీలు లేదు. కావున బహుపుత్రుల నిమిత్తము వివాహము చేసికొనఁ గోరిక కల" దని చెప్పి యూరకుండెను.

అపుడు దేవవ్రతుఁడు వృద్ధామాత్యపురోహితసుహృజ్జనులతో నీవిషయము ప్రస్తావించెను. ఆప్రసంగమునఁ దన తండ్రికిని దాశరాజునకును జరిగిన సంభాషణము గాంగేయునకును దెలియవచ్చెను. తోడనే యాతఁ డనంతసైన్యముతోఁ గదలిపోయి దాశరాజుచెంతకరిగి "మారాజుగారికి సత్యవతిని దేవిగా సమర్పింపు" మని చెప్పెను. దాశరా జందుల కానందించి "మహాతేజా, నీవు సకలమును దెలిసినవాఁడవు. తండ్రికార్యము నిమిత్తము వచ్చితివి. ధన్యుండనైతిని. ఈసత్యవతి యెవ్వనివీర్యమునఁ బొడమినదో యాయుపరిచరుఁడు ఈమెను నీతండ్రికే యిచ్చునది యని చెప్పెను. ఆకారణమువలననే మున్నొక వరుఁడు రాఁగా నేను తిరస్కరించితిని. అయిన నిప్పుడు నా ప్రార్థన మేమనఁగా ఈసత్యవతికి శంతనునివలనఁ గలిగిన పుత్రునకు రాజ్యాధికారము రావలెను. అది యిప్పుడు నీపాలఁ బడియున్నది. ఇఁకె ట్లిదిపొసఁగును?" అని చెప్పెను. అంతట దేవవ్రతుఁడు

 చ. "వినుఁడు ప్రసిద్ధులైన పృథివీపతు లిందఱు నే గురుప్రయో
జనమునఁ జేసితిన్ సమయసంస్థితి యీలలితాంగి కుద్భవిం
చినతనయుండ రాజ్యమును జేయఁగ నర్హుఁడు వాఁడ మాకు నె
ల్లను బతి వాఁడ కౌరవకులస్థితికారుఁ డుదారసంపదన్."

(ఆంధ్రభార. ఆ 7. ప. 186.)

అని ప్రతిజ్ఞఁ జేసెను; గాని యంతటితో దాశరాజునకుఁ దృప్తి కలుగలేదు. ఆతఁడు మఱల "వీరమణీ! నీవు మహానుభావుఁడవు గావున నిట్టి ప్రతిన సేయఁగలిగితివి; గాని భావికాలమున నీకుమారులుగూడ నీవంటి వారే యగుదురా? నీనియమమును వారు పాలింతురా?" యనియెను.

ఇదియు నొక ప్రబలసందేహమే. కావున గాంగేయుఁడు మఱల వెంటనే—

క. ధృతిఁ బూని బ్రహ్మచర్య, వ్రత మున్నతిఁ దాల్చితిని ధర్మంబుగ ననప
త్యతయైనను లోకము లా, యతిఁ బెక్కులు గలవు నాకు ననుభావ్యములై ”

(ఆంధ్రభారతము. ఆ. 4 ప. 190)

అని శపథము చేసెను. దాశరాజు సందియము లన్నియుఁ దీఱిపోయెను. ఆతఁడు తన కుమార్త రాజమాత యగుట కానందమును, గాంగేయుఁ డంతటి దుర్ఘటప్రతిజ్ఞలు సేసినందుల కాశ్చర్యమునుగని తోడనే సత్యవతి నిచ్చి పంపివేసెను. ఆయమయు మహానందముతో దేవవ్రతునివెంట హస్తినాపురమునకుఁ బోయెను. ఒక శుభముహూర్తంబున శంతనుఁడు యోజనగంధి యగు సత్యవతిని వివాహమాడి మహోన్నతప్రతిజ్ఞలు పూనిన కుమారుని యాత్మోన్నతి కెంతయు నలరి యాతనికి స్వచ్ఛందమరణం బగునట్లు వరమిచ్చెను. దేవవ్రతుఁ డిట్టిభీష్మవ్రతములు దాల్చుటవలన నప్పటినుండియు భీష్ముఁ డను పేరున వ్యవహరింపఁబడసాగెను.

తరువాత శంతనుఁడు సత్యవతీదేవియందు చిత్రాంగదుఁడు విచిత్రవీర్యుఁడు నను నిరువురు కుమారులం బడసి వారు యౌవనముఁ బ్రాపింపకమున్నే పరలోకగతుఁ డయ్యెను. సకలభారమును భీష్మునిపైఁ బడెను. భీష్ముఁడు తండ్రికిఁ బారలౌకికక్రియలన్నియు నిర్వర్తించి చిత్రాంగదునకుఁ బట్టాభిషేకము చేసెను. చిత్రాంగదుఁడు చాలదుడుకు మానిసి. గిల్లి కయ్యముదెచ్చుట యనిన నాతనికిఁ బరమసంతోషము. భీష్ముఁడు నయమున భయమున ననేకవిధములఁ జెప్పిచూచెను; గాని ప్రయోజనము లేకపోయెను. ఇట్లుండఁగా నొకప్పుడు చిత్రాంగదుఁడను గంధర్వునకును జిత్రాంగదునకును యుద్ధము పొసఁగెను. కురుక్షేత్రము నందలి హిరణ్మతీనదీతీరమున నిరువురు చిత్రాంగదులును గత్తియుఁ గత్తియుఁ గలిపిరి. గంధర్వుఁడు మాయావియై శంతనుకుమారుని నిర్జించెను. చేయునది లేక భీష్ముఁడు చిత్రాంగదుని రాజ్యమును విచిత్రవీర్యునకుఁ బట్టముఁ గట్టెను.

తరువాత విచిత్రవీర్యుఁడు వివాహయోగ్యుఁడై యుండుట నెఱింగి భీష్ముఁడు వివాహప్రయత్నుఁడై కాశీరాజుకొమార్తలకు

మువ్వురకు స్వయంవర మగు నని విని ధనుర్ధరుఁడై యొక్కరుఁడు కాశీనగరమున కరిగి స్వయంవరమహోత్సవమునకై మూగియున్న రాజలోకంబు వెఱగుపడి చూచుచుండ నాముగ్గుఱు కన్యలను రథ మెక్కించికొని "ఓరాజులారా! నాతమ్మునకుఁ బెండ్లిచేయుటకై యీకన్యాత్రయమును గొనిపోవుచున్నాను. చేతనైనవా రెదిరించి పోరవచ్చును. అష్టవిధవివాహములయందును క్షత్రియులకు గాంధర్వ మును రాక్షసమును నుత్తమములు. స్వయంవరమున జయించి వివాహ మగుట యంతకంటెను మహోత్తమము" అని యెలుగెత్తి చెప్పి రథము దోలించెను.

అచ్చటి రాజు లెల్లరు నది విని భీష్మునిపై యెత్తివచ్చిరి. పోరు ఘోర మయ్యెను. అందఱ నోడించి యార్చిపేర్చి భీష్ముఁడు ముందునకు బయలు దేఱెను. ఇంతలో నిలునిలు మని సాల్వుఁడు దండెత్తి వచ్చెను. వారల యుద్ధము భీకరముగఁ బ్రవర్తిల్లెను. తుదకు సాల్వుఁడుగూడ భగ్నమనోరథుఁడై వెనుదిరిగి పోయెను. భీష్ముఁడు నిరంకుశుఁడై హస్తి నపురమునకు వచ్చి యాముగ్గురుకన్యలను దమ్ములకు వివాహము చేయుటకుఁ బ్రయత్నించుచుండఁగా కాశీరాజు పెద్దకొమార్త యగు అంబ "నన్ను సాల్వపతి వరించెను. నేనాతని వరించితిని మాతండ్రి యంగీకరించి మాట యిచ్చెను. ఆపై నీకేది ధర్మమని తోఁచిన నట్లు చేయు" మని చెప్పెను. తోడనే భీష్ముఁడు బ్రాహ్మణుల యనుమతంబున నామెను సాల్వరాజుచెంత కంపివేసి అంబాలిక, అంబిక అను తక్కిన యిరువుఱు కన్యకలను విచిత్రవీర్యున కిచ్చి పెండ్లిచేసెను.

వివాహానంతర మచ్చరలను దలదన్నఁగల అంబాలిక అంబికల తోడిదే లోక మని భావించి విచిత్రవీర్యుఁడు రాజకార్యముల నుపే క్షించి క్రీడాసక్తుఁ డయ్యెను. కామము లనపాయములు కావు గదా? మితితప్పి భుజించిన అన్నమే విష మగుచున్నపుడు కేరఁ దక్కినవానిని గుఱించి చెప్పవలసిన దేమున్నది? విచిత్రవీర్యుఁ డిట్టి సంతతకేళివలన శోషించి తుదకు స్వర్గమునకుఁ బోయెను. అందుల కెల్లరును వగచిరి. భీష్ముఁడును మిగుల విచారించెను. ఏమిలాభము? విచిత్రవీర్యున కగ్ని సంస్కారాదికములు నిర్వర్తించి తల్లిని, మఱఁదండ్రను సమాశ్వా సించి భీష్ముఁడు రాజకార్యములను జక్కఁబెట్టఁ జొచ్చెను. 5

అదిచూచి సత్యవతి భీష్మునితో "కురువీరా! నీవు సకలధర్మము
లు నెఱుంగుదువు నేనొక్కటి చెప్పెద వినుము ఇప్పుడీకురువంశమున
నీవొక్కరుఁడవే యున్నవాఁడవు. ఈకురురాజ్యరమును బరిగ్రహించి
దిక్కులు తెలియొందంబరిపాలింపుము. సంతానముగూడఁ బడయుము.
బ్రహ్మమొదలుగ నెడతెగకవచ్చిన వంశము నీయట్టిపరాక్రమశాలి రే
యుండుండఁగ విచ్ఛిన్నమగుట ధర్మముగాదు" అని పల్కెను. అందు
లకు భీష్ముఁడిట్లు చెప్పెను. "అమ్మా సకలము నెఱిఁగిన మీరిట్లు పలు
కఁదగునా! నేనలనాఁడు పల్కిన పలుకులును, దాల్చినవ్రతమును మీ
రెఱుఁగనివా? వానిని నే నెట్లతిక్రమింపఁ గలను? చంద్రుఁడు శైత్య
మును, సూర్యుఁడు మహాతేజమును, అగ్ని ఉష్ణమును విడచినను నావ్ర
తమును నేనెట్లును విడువను. నావ్రతమే మీకొండ్రికోరిన శుల్కము.
దానిఁ దప్పితినేని మీకు ద్రోహముచేసినవాఁడ నగుదును. అది
యట్లుండుఁగాక. మీరు సెలవిచ్చినట్లు నాకుఁ దెలియని ధర్మములు
లేవు. కావున శంతనువంశము శాశ్వతమై వెలయుటకు క్షత్రియ
ధర్మము ననువిచేసెదఁ జిత్తగింపుఁడు. నేను చెప్పినదానిని ధర్మాధర్మ
విదులును, లోకయాత్రావిదులును అయిన పురోహితప్రముఖ
బ్రాహ్మణశ్రేష్ఠులతోఁగూడ నాలోచించి చేయుఁడు. పితృవధామర్షితుఁ
డైన పరశురాముఁడు గర్భగతబాలురతోఁగూడ క్షత్రియవీరుల
నందఱను సంహరించినపుడు వారి స్త్రీలయందు ధర్మవిదులైన బ్రాహ్మ
ణులు సంతానమును దయచేసి క్షత్రియజాతిని నిలుపలేదా? అంగ
యను రాజు దీర్ఘతముఁడను బ్రాహ్మణునివలనఁ దన భార్యయందు క్షత్రియ
రాజు అను కుమారునిఁ బడసెను. మఱియు నిట్లు ... పుట్టి వంశకరు
క్షేత్రములయందు ధర్మమార్గమున బ్రాహ్మణ ... ఁడును, ధర్మస్వరూ
లైనక్షత్రియులనేకులు గలరు. ... బ్రాహ్మణుని రప్పించి విచిత్రవీర్యుని
పుఁడును, జగత్పావనుఁడు ... యుఁడు"
భార్యలయందు సంతానము ... వుల నలరి చిన్నతనమునఁ దానోడ
ఈమాటలు ... చ్చుట వ్యాసభట్టారకుఁ డుదయించి పని
నడపునపుడు పరాశరుఁడు ... చ్చెద నని చెప్పి తపోవనమునకు వెడలిపోవుట
గలయపుడు స్మరించిన వ ... ప్ప మహాత్ముఁడైన యా వ్యాసభగవానుఁడే
ముగ్నగునవి యెల్లఁ జె

యిప్పుడు కురువంశమును నిలుపుటకు సమర్థుఁ డని భీష్మునితో నని యెను. "ఇది బాగుగనున్నది. ఇంతకంటెఁ దరణోపాయములేదు. వేదవ్యాసమహర్షికి బ్రహ్మాదులకుఁగల శక్తులన్నియుఁ గల" వని భీష్ముఁడు తన యంగీకారమును దెలిపెను. తోడనే సత్యవతి వ్యాసుని స్మరించెను. వ్యాసభగవానుఁడు ప్రత్యక్షమై వారిచేఁ బూజితుఁ డయ్యెను.

సత్యవతి చాలఁగాలమునకుఁ గనులఁబడిన యాప్రథమపుత్రుని జూచి హర్షపులకితయై ప్రియమారఁ గౌఁగిలించికొని "తనయునిపైఁ దండ్రి కెట్టి యధికారము గలదో తల్లికి నట్టిదే కలదు. కావున నీకు నే నేదేని నియమింపవచ్చు" నని చెప్పి తమకుఁ దటస్థించిన విషమావస్థ నంతయు జెప్పెను. వ్యాసుఁడు తల్లి యాజ్ఞచొప్పున బ్రవర్తించెను. ధృతరాష్ట్రుఁడు, పాండురాజు, విదురుఁడు నవతరించిరి. భీష్ముఁడు ధృతరాష్ట్రుఁడు పెద్దయగునంతదనుక రాజకార్యములను జక్కఁబెట్టి దేశ మకంటకముగఁ జేసి పిదప ధృతరాష్ట్రుని భుజాస్కంధమున రాజ్యలక్ష్మిని నిలిపెను.

పిమ్మట ధృతరాష్ట్రాదులకుఁ జక్కని కన్నియలను దెచ్చి భీష్ముఁడు వివాహములు చేసెను. వారికి దుర్యోధనాదికుమారు లుద్భవించి తమలోఁ దాము కలహించుకొనఁ బ్రారంభించిరి. భీష్ముఁ డనేకవిధముల వారించెను; గాని ప్రయోజనములేక పోయెను. యౌవనమదంబునఁ గన్నులు గానక చరించు ప్రభుకుమారులకుఁ బెద్దల యుపదేశములు తల
... గదా ?
... కాలాంతరములు జరిగిపోయినపిదప ధర్మరాజు రాజసూయ
... సెను. అపుడు ధర్మరాజునకు అర్ఘ్య మెవరి కీయఁదగు నని
... దేహము దీర్ప నేరికి సాధ్య మగును?
... వెంటనే ప్రత్యుత్తరమిచ్చెను.
... తరించిన శ్రీహరి, తన నమ్మిన
... న్నలక్ష్మీపతియగు శ్రీ
... మవసర మేమున్నది?
; గాని యది శిశుపాలు
జ్ఞానిశేఖరుఁడైన భీష్ముని, ధ
... ఁ డగు కృష్ణునిఁ గూడ నీ

విషయమున నిందించెను. క్రమక్రమముగ వాదోపవాదములు పెరిఁగి పోయెను. తుదకు శ్రీకృష్ణుఁడు తనచక్రముతో శిశుపాలుని సంహరించి రాజసూయమును నిర్విఘ్నముగఁ గొనసాగించెను.

ద్రౌపదీవస్త్రాపహరణము మున్నగు ననేకవిపత్సమయములయందు భీష్ముఁడు ధర్మముసెప్పి దుర్యోధనాదులను దురుద్యోగములనుండి మఱలింపఁ జూచెఁగాని ప్రయోజనము లేకపోయెను. తుదకుఁ గౌరవపాండవులకు యుద్ధము పొసఁగెను. భీష్ముని శరీరము దుర్యోధనుని పక్షమునందును మనస్సు శ్రీకృష్ణసంబంధు లగు పాండవులపక్షమునను ఉండెను. యుద్ధప్రారంభసమయమున భీష్మునకు సర్వసేనాధిపత్యము వచ్చెను. అప్పు డాతఁడు చూపిన సంగ్రామచాతుర్యము అసమానము. భీష్ముని వధించెద నని ప్రతినపూనిన యర్జునుండు తేపతేపకును ఏమియుఁ జేయఁజాలకపోవుచుండుటఁ జూచి కృష్ణుఁడు రెండుతడవలు "అర్జునా! నీవలనఁ గాదు. భీష్ముని నేను సంహరించెద" నని రథము దిగి చక్రము దాల్చి ముందున కుఱికెను. భక్తాగ్రేసరచక్రవర్తి యగు భీష్ముఁ డప్పుడు కృష్ణు నిట్లు స్తుతించెను.

సీ. "కుప్పించి యెగసినఁ గుండలంబుల కాంతి, గగనభాగం బెల్లఁ గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులో నున్న, జగముల వ్రేఁగున జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ, బైనున్న పచ్చని పటము జాఱ
నమ్మితి నాలావు నగుఁబాటు సేయకు, మన్నింపు మని క్రీడి మరలఁ దిగువఁ
గీ. గరికి లంఘించు సింహంబుకరణి మెఱసి, నేఁడు భీష్ముని జంపుదు నిన్నుఁ గాతు
విడువు మర్జున యనుచు మద్విశిఖవృష్టిఁ, దెరలి చనుదెంచు దేవుఁడు దిక్కు నాకు.
(భాగ. స్కం. 1. ప. 222.)

తుదకుఁ బాండవులు భీష్ముని జయింపలేక ఒకనాఁటిరాత్రి రహస్యముగఁ గృష్ణుని వెంటఁబెట్టుకొనిపోయి వారు "తాతా! నీవెట్లు చచ్చెదవో చెప్పు" మని కోరిరి. అందులకు భీష్ముఁడు మహానందముతో "వత్సా నన్ను జయింప నెవ్వనితరమును గాదు. అయినను మీ పక్షము ధర్మబద్ధమై యున్నది. కేవలము శ్రీమన్నారాయణమూర్తి యగు కృష్ణుఁడు మీకొంగుబంగారమై యున్నాఁడు. మీకెట్లును జయము తప్పదు. నేనిప్పు డేపక్షమునఁ బోరుచున్నానో యాపక్షమున కోటమి తప్పదు. దుర్యోధనుఁడు శ్రీకృష్ణునిఁ గోరక మానె ననుటకు దేవునిఁ దిరస్కరించె ననియు, విజయమును గోరక మానె ననియు నర్థము.

కృష్ణా! నీవు వీరిని వెంటఁబెట్టుకొని నాదరి కేల రావలెను? పాండుకుమారులలో నీ కాంతరంగికభక్తులు కానివా రెవరు? భవిష్యత్తును నీవే వారి కేల తెలుపరాదు? ఇది యంతయు నీవృద్ధునియెడఁగల ప్రేమ. ఈ దీనునియెడల ననుగ్రహము. ఇది భక్తరక్షణక్రమము. సర్వేశ్వరా! నీలీల లెరికిఁ దెలియును? యుధిష్ఠిరా! నేను, ఆఁడుదానిని, ఆఁడుదాని పేరుగలవానిని, తొల్లిటిజన్మమున నాఁడుదియైన వానిని, మధ్యకాలమున మగతనము పొందినవానిని ఎదిరించి పోరను. మీరు శిఖండిని నాకెదుటఁ బెట్టి పోరినచో నే నస్త్రములు క్రిందఁ బాఱవేసెదను. అప్పు డర్జునుఁడు విజృంభించి తనపని నెఱవేర్చుకొనునది" అని చెప్పెను.

అర్జునుఁ డట్లే చేసెను. భీష్ముఁ డస్త్రశస్త్రములను గ్రిందఁ బడవేసెను. అర్జునుఁ డంపగమితో భీష్ముని జర్జరితాంగునిఁ గావించెను. భీష్ముఁడు పడిపోయెను. కాని యొడ లంతయు బాణములు గ్రుచ్చుకొని యుండుటచే నాతనిమేను భూతలము సోకలేదు. అప్పుడు కౌరవులును, పాండవులునుగూడ నిరాయుధులై, నిష్కవచులై, నిర్మత్సరులై తాత సన్నిధికి వచ్చిరి. అర్జునుఁ డొక్కఁడమాత్రమే కోదండియై వచ్చెను. అప్పుడు భీష్ముఁడు మనుమలఁ జూచి తలకేమియు నుపధానము లేదు. అగుటచేఁ దల నిలుచుటలే" దని చెప్పెను. తోడనే దుర్యోధనుఁడు హంసతూలికలతో నిర్మించిన తలగడలను దే నియోగించెను; గాని భీష్ముఁడు వారించి, "అట్టి యుపధానములు పనికిరా" వని చెప్పి "అర్జునా! చూచెదవేల?" అనియెను. తోడనే యాతఁడు మూఁడుబాణములు విడిచి తాత తలనిలిపెను. "శయ్యకుఁ దగిన తలగడ నమర్చితివోయీ" యని భీష్ముఁ డర్జునుని మెచ్చుకొనెను.

తరువాత భీష్మునకు దాహ మయ్యెను. సుగంధసంవాసితములగు శీతలజలములను దెప్పించుటకు దుర్యోధనుఁడు ప్రయత్నించెను; గాని భీష్ముఁడు భూతలమునందలి నీరు ముట్ట ననియెను. తోడనే యర్జునుఁడు భూమి దూసిపోవునట్లు బాణము విడిచెను. ఆరంధ్రమార్గమునఁ బాతాళగంగ బుస్సున ధారారూపముగఁ బైకెగసెను. ఆజలములు త్రావి గాంగేయుఁడు దప్పి తీర్చుకొనెను.

ఉత్తరాయణస్మృతి మిగుల శ్రేష్ఠము. అగుట నాతఁడు ప్రాణములను బడిపోయినప్పుడే విడుచుటకంగీకరింపలేదు. ఆతనికితండ్రి స్వేచ్ఛామర

ణము గలుగునట్లు వర మిచ్చియుండెను. ఆవరప్రభావమువలననాతఁడు అంపశయ్యపైఁ బరుండి శ్రీమన్నారాయణుని దివ్యచరణకమలములను ధ్యానించుచు ధర్మరాజునకుసకలధర్మముల నుపదేశింపసాగెను. ఇంతలో మకరసంక్రమణముదాఁటిపోయెను. మాఘమాసము ప్రారంభ మయ్యెను. అయనములలో నుత్తరాయణ మట్టిదో యేకాదశి యట్టిది. అదియు సమీపించెను. నాఁడు ప్రాణములను విడిచెద నని భీష్ముఁడు వెల్లడించెను.

ఇది విని సకలమునితిలకులును వచ్చిరి. భక్తులు, విద్వాంసులు, కవులు, గాయకులు, రాజులు, మనుజులు సాక్షాత్తుగ శ్రీహరియైనకృష్ణ పరబ్రహ్మ మున్నగువా రెల్లరును వచ్చిరి. భీష్ముఁడు శ్రీకృష్ణుని ననేకవిధముల ధ్యానించి యైహికజీవయాత్ర చాలించెను. భీష్ముని దేహమునుండి అపూర్వజ్యోతి యొకటి యాకసమున సంగమించుటఁ జూచి యెల్లరు నబ్బురపడి యాతని దివ్యత్వమును గొనియాడిరి.

ఆంజనేయుఁడు.

కేసరి యను వానరుఁడు మేనమామ యగు కుంజరుని కొమార్తను అంజన యనుకన్యను వివాహమాడి సుఖముగాఁ గాలము గడుపసాగెను. ఇట్లెన్ని సంవత్సరములు గడచినను సంతానము కలుగకుండుటకుఁ గేసరి యెంతయువగచి వాయుదేవునిఁ బూజింపుమని భార్యకు సెలవిచ్చెను. అంజనయు భర్తయనుమతిప్రకారము వాయుదేవునిగుఱించి తీవ్రతపస్సు చేసెను. అందులకు ఆనందించి వాయువు అగ్నిహోత్రుని నుండి తనకు సంక్రమించిన శివతేజమును శివుని యాజ్ఞవలన అంజనాదేవి కొసంగెను. అంజన గర్భవతియై యొక సంవత్సరము మోచి యొక శుభవాసరమునఁ గుమారునిఁ గనియెను. అంజనకుమారుఁ డగుటవలన నాతని కాంజనేయుఁ డను పేరు వచ్చెను.

బిడ్డను గన్నపిదప అంజనాదేవి "తండ్రీ! నీకు వలసినన్ని పండ్లను దెచ్చి యిచ్చెద నుండు" మని యరణ్యమునకుఁ బోయెను. అప్పుడే సూర్యోదయమయ్యెను. బాలభానుఁడు బంగరుబంతివలె నుదయాచల

మున వెలుంగుచుండెను. ఆతనింజూచి యాంజనేయుఁడు చెట్టున ముగ్గిన పండని భావించి తటాలున నెగసి ఉదయగిరిమీఁద నుతికి భానుని మ్రింగఁబోయెను. అప్పుడు గ్రహణసమయ మగుటచే సూర్యునిఁ గబళించుటకు రాహువు వచ్చెను. సూర్యుఁడు స్వాధీనుఁడు కాకుండుటచే నేమి చేయుదు నని యిటునటు చూచుచున్న యాంజనేయుఁ డిదిగో యిది నల్లని పండు అని రాహువుమీఁది కుతికెను. రాహువు ఆతని యౌద్ధత్యమున కోపలేక పోయి యింద్రునితోఁ జెప్పుకొనియెను.

ఇది విని యింద్రుఁడు "నన్నుగూడ నడ్డుకొనగలవాఁ డింకొకఁడు గలఁడా" యని యబ్బురపడుచు వజ్రాయుధమును గైకొని నాల్గుదంతముల నైరావతము నెక్కి బయలుదేఱెను. అనేక దేవతలు గొలువనేగుదెంచి రెండవసూర్యునివలె వెలుంగుచున్న దేవేంద్రునిఁజూచి యాంజనేయుఁడు "ఈ నల్లనిపండేల" యనుకొని పోరా యని రాహువును దిరస్కరించివేసెను; అప్పుడు దేవేంద్రుఁడు "ఈఘనుఁ డెవ్వఁడ"ని రాహువును దిరస్కరించినందులకుఁ గోపించి యైరావతమును మీఁదికిఁ బురికొల్పెను. తోడనే యంజన ముద్దుకొడుకు "ఈపండు తెల్లగానున్న"దని యైరావతము మీఁది కుతికెను. ఐరావతము జడిసి పాఱిపోవ నుంకించుచుండఁగా మహేంద్రుఁడు మిపులఁ గోపించి వజ్రాయుధమును విసరి కొట్టెను. ఆదెబ్బ వాయుహనువుమీఁదఁ దగులుటచే మూర్ఛితుఁడై యావానరకిశోరము తొలిమలపైఁ బడిపోయెను.

తన ప్రియకుమారు నిట్లు దేవేంద్రుఁడు మూర్ఛిల్లఁ గొట్టుటచే వాయువు సచరాచరప్రపంచమునం దంతటను వెలుపటను లోపటను నిండియున్న నిజమూర్తి నుపసంహరించుకొనియెను. వాయుబంధనమైనచో నిఁకఁ దరువాయి యేమి యుండును? అంతటితో నూరకుండక వాయువు తన కుమారునిఁ దీసికొని పర్వతగుహాలోనికిఁ బోయెను.

సీ. "యాజకుల్ సహ్వాహవ్యములు వ్రేల్వఁగఁ జాఁచు, హస్తముల్ సాఁచినయట్టులనుండె
దివిజులు ప్రేరేప దివి కెగిరిన దేవ, యానంబు లెగిరినయట్టుల నుండె
మునులు నదీతోయములఁ దోఁగమునుంచిన, యంగముల్ ముంచినయట్టుల నుండెఁ
బహుమృగనరముఖప్రాణు లుర్విని బెట్టు, నడుగులు పెట్టిన యట్టుల నుండెఁ
గీ. భానుమండల మొక్కచోఁ బాదుకొనియెఁ, గాంగతిద ప్పెసత్క్రియల్ గడచె వేద
పాఠ ముడిపోయె బాహ్యమభ్యంతరంబు, గాడ్పుబంధించచినయక్కాలమందు."
(ఉత్తరరామాయణము. ఆ. 5 ప. 111.)

ఈయుపద్రవమును జూచి దేవతాప్రముఖులు కొందఱును, ముని సార్వభౌములు కొందఱును దివ్యశక్తికలిమి నెట్లో బ్రహ్మదేవునిచెంత కరిగి "తండ్రీ! ఏకారణమువలననో వాయుదేవుఁడు తన మూర్తి నుపసంహరించుకొనియెను. సర్వమును మృతప్రాయమై యున్నది. ఇఁక నొక గడియ యిట్లున్న నీచే సృజింపఁబడిన ప్రపంచ మంతయు రుద్రప్రయత్నము లేకయే వినాశము నందును. కావున ననుగ్రహముపూని మమ్ము రక్షింపు" మని యనేకవిధములఁ బ్రార్థించిరి. అప్పుడు విధాత సకలమును దివ్యదృష్టివలన నెఱింగి సంగతిసందర్భము లన్నియు వారికిఁ దెలిపి వారి నందఱను వెంటనిడుకొని ఉదయపర్వతమునకు బయలుదేఱెను.

యథాకాలమున వారందఱు నుదయపర్వతముమీఁదికి వచ్చిరి. అప్పటి కింకను వాయుదేవుఁడు చేష్టలుదక్కి పడియున్న ఆంజనేయుని చెంతఁగూరుచుండి యనేకోపచారములను జేయుచుండెను. ఇట్లుండఁగా మునులతోడను, దేవతలతోడను జుట్టుకొనఁబడియున్న విధాత ప్రత్యక్షమయ్యెను. వాయువు యథోచితముగ విరించికిఁ బ్రత్యుత్థానముగావించి సాష్టాంగనమస్కారములు గావించి యనేకవిధముల వినుతించెను. అప్పుడు బ్రహ్మ వాయువును జూచి సాదరముతో "వత్సా! ఇట్టిపని యేల చేసితివి? ఈతఁ డేకద నీకుమారుఁడు" అని వజ్రఘాతమువలన వివశుఁడై పడియున్న యాంజనేయుని మేను నిమిరి నవశక్తి యొసఁగెను. తోడనే మారుతి లేచి కూరుచుండెను. వాయువునకుఁ బ్రాణములు లేచివచ్చెను. బ్రహ్మ మారుతపుత్త్రునిఁ బ్రేమతో నంకతలమునఁ గూరుచుండఁబెట్టుకొని ముద్దాడుచు లాలింపసాగెను. ఇదియంతయుఁ జూచి యానందించి మారుతుఁడు యథాపూర్వముగ లోకమునం దంతటను దనమూర్తిని వ్యాపింపఁజేసెను. లోక మంతయుఁ దేఱికొనెను. దేవేంద్రాదులు "అమ్మయ్యా! ప్రాణములు దక్కిన" వనుకొనిరి. అప్పుడు పరమేష్ఠి, ఇట్టి యకృత్యమును గావించిన యింద్రుని మృదువుగ మందలించి "దేవతలారా! ఈవానరశ్రేష్ఠుఁడు మహావీరుఁడు. ఈతనివలన ముందనేకోపకారములు జరుగవలసియున్నవి. లోకము నంతను జీకాకుపఱుచు దుష్టరాక్షసులనీతఁ డనేక వేలమందిని సంహరించును. కావున నీలోకోపకారికి ఉగ్రశౌర్యవైభవము గలుగునట్లు మీరందఱును వరములిండు" అని యాజ్ఞాపించెను. ఇంద్రుఁడు "వజ్రాఘాతము హనుమకుఁ దగిలినను

నిరుపద్రవుఁడై వెలసెఁ గావున నీతనికి హనుమంతుఁడు అను పేరు తగి యున్నది. ఇఁక వజ్రాయుధమువలనఁగూడ నీతఁ డిసుమంతయు బాధింపఁబడఁడు" అని వరమిచ్చి సత్కరించెను.

సీ. "బ్రహ్మదండంబున బ్రహ్మాస్త్రమున హాని, నందనిదీర్ఘాయు వజుఁ డొసంగె
ఘోరరౌద్రాస్త్రపాశుపతాదికములచేఁ, జెడని ప్రభావంబు శివుఁ డొసంగెఁ
దన కాలపాశంబు దండంబు మృత్యువ్యే, యన నొంచలేదని యముఁడు పలికె
నాత్మతేజమున శతాంశ మిచ్చితి విద్య, లిచ్చెద నిఁక నని యినుఁడు పలికెఁ
గీ. భావమున నీటఁ బడఁడని పలికె వరుణుఁ, డగ్ని తన చేత నశియింపఁ డనియె ధనదుఁ
డొసఁగెఁ దనగద నొగులని యునికి యెల్ల, కైదువుల నొవ్వఁడని విశ్వకర్మ పలికె".

(ఉత్తరరామాయణము ఆ 5 ప. 128.)

తక్కిన దేవత లింక ననేకోత్తమవరము లొసఁగి గారవించిరి. బ్రహ్మ వాయువుతో "ఇఁక సంతసముతో నుండుము. నీకుమారుఁ డసమానధురంధరుఁడు. రామకార్యమును వహించి రావణుఁడు మున్నగు రాక్షసవీరులకు దుస్సహుఁడై చరించును. ముల్లోకములందు నీతనికసాధ్యము లేదు" అని పలికెను. పిదప నందఱును వెడలిపోయిరి. వాయుదేవుఁడు మహానందముతోఁ గుమారు నెత్తికొని అంజనాదేవికి అప్పగించి వెడలిపోయెను.

పిదప నాంజనేయుఁడు సమీపమునందలి మున్యాశ్రమములు సొచ్చి కంటకాచరణమున వారి వల్కలాజినములు చించి ప్రోవులువెట్టసాగెను. అందులకు ఋషులు మిగులఁ గనలిగి "ఒరులు తెలుపునంతదనుక నీ బలము నీకుఁ దెలియకుండుఁగాత"యని శపించిరి. ఈశాపమునకుఁ జాల వగచి హనుమంతుఁడు వారినిఁ గొంతకాలము సేవించి ప్రసన్నులను గావించుకొని విద్యలిచ్చెద నని సూర్యుఁడు వాగ్దానము చేసియుండుట వలనఁ జదువుకొనుట కాతనిచెంతకరిగెను అప్పుడు సూర్యుఁడు "వత్సా! నీప్రయత్నమునకును సంతసించితిని; గాని నేనెప్పుడు నొకచో నుండువాఁడను గానుగదా? వాయువేగమనోవేగములతో సతతము లోకమును జుట్టిరావలసిన నేను నీకెట్లు విద్యయొసఁగఁగలను? నడుచుటకు వీలు లేదుగదా? నాతో సమానవేగముతో రాఁ గలిగినను నీకు మనస్సు సుస్థిరముగా నుండదుగదా? ఇఁక నావలన నీకేమి ప్రయోజనము?" అని పలికెను. హనుమంతుఁడు ప్రత్యుత్తరము చెప్పకయే క్షణ

ములో శరీరముఁ బెంచివేసి ఉదయాచలముమీఁద నొకకాలును, అస్తాచలముమీఁద నొకకాలు నుంచి "ఇఁకఁ జెప్పు" మనియెను. ఈయద్భుతమునుఁ జూచి చాల నబ్బురపడి సూర్యుఁ డాతనికి సకల వేదశాస్త్రములను జెప్పెను. ఆంజనేయుఁడు విజ్ఞానిశేఖరుఁ డయ్యెను. హనుమంతుని తెలివి తేటలను జూచియు, పరాక్రమము నరసియు నాతనివలనఁ జాలఁ బ్రయోజనము గలుగఁగలదని తలంచి సుగ్రీవుఁ డాతనినిఁ దన మంత్రిగాఁ జేకొనియెను.

వాలిసుగ్రీవు లన్నదమ్ములు. వారిరువురకును వైరము పొసఁగెను. వాలి సుగ్రీవుని సకలసంపదలను, భార్యనుగూడ నాక్రమించుకొని తమ్ముని దేశము వెడలఁగొట్టెను. సుగ్రీవుఁడు చేయునది లేక హనుమంతుఁడు మున్నగు మంత్రులతోడను, సేనాధిపులతోడను, భటులతోడను వాలికి దుర్గమ మగు ఋష్యమూకపర్వతముమీఁద నివసించియుండెను. రాముఁడు సీతను వెదకికొనుచు నచ్చటికి వచ్చెను. వల్కలాజినాదులను ధరించి మునిరూపు నున్నఁ గోదండములను దాల్చి వచ్చుచున్న రామలక్ష్మణులను జూచి వాలిపంపున నను జంప వచ్చుచున్న మాయకాండ్రని సుగ్రీవుఁడు చాల భీతిల్లెను. అప్పు డాంజనేయుఁడు వారిసంగతిఁ దెలిసికొనివచ్చెద భీతిల్లకు మని సుగ్రీవుని భయము మాన్పి భిక్షుకవేషము గైకొని రామలక్ష్మణుల కెదురేఁగి "మహానుభావులారా దేవేంద్రసమానులును ఋషిరూపులు నగుమీ రెవ్వరు! మీ తేజస్సు అఖండభూభారధౌరేయులగు మహారాజులని తెలుపుచున్నది. మీ రీనారచీరల నేల ధరించితిరి? మునివేషమున నున్న మీకీ ప్రచండకరవాలము లేల? సుగ్రీవుఁ డనువానరేంద్రుఁడు అన్నవలనఁ బరాజితుఁడై పరాభూతుఁడై ఋష్యమూకాచలమున నుండి మిమ్ముఁ జూచి మీతో సఖ్యము చేయఁదలంచి నన్ను బంపఁగా నేను మీకడకై వచ్చితిని. నాపేరు హనుమంతుఁడు. వాయుదేవుని కుమారుఁడను. సుగ్రీవుని మంత్రిని. కామరూపము గలవానరుఁడను. నాకుఁ గావలసినశక్తి గలదు. దూతకార్యము నిర్వర్తించుటకై నేను కపటభిక్షుకుండనై వచ్చితిని. మీ రెవరో, యేరాజకుమారులరో, యీదుర్గమారణ్యమునకుఁ జనుదెంచినకారణ మేమో, సెలవీయవలయు" ననియెను.

శ్రీరాముఁ డదివిని వెదకఁబోయిన తీవ కాళ్లకుఁ దగిలె నని భావించి మందహాసము గావించి "తమ్ముఁడా, మనసంగతి చెప్పు"మని లక్ష్మణునకు నియమించెను. లక్ష్మణుఁడును, దమ వనసంచారకారణమును, బ్రకృతస్థితియుఁ దెలిపి "సుగ్రీవుఁడను వానరేంద్రునివలన సీతావృత్తాంతము తెలియఁగలదని మాకుఁ దెలియవచ్చెను; గావున నాతనితో సఖ్యముచేయుటకు వచ్చితి" మని తమ దైన్యస్థితికి వగచెను. హనుమంతుఁడు ఆతని విచార ముడిపి "మీరును రాజ్యభ్రష్టులై తిరి. మా ప్రభువును రాజ్యభ్రష్టుఁ డయ్యెను. రాముఁడును వైరివలన భార్యను గోల్పోయెను. మా ప్రభువు నట్లే శత్రువువలన భార్యను గోల్పోయెను. ఇరువురును భార్యలను మఱల రప్పించుకొనుటకును, శత్రువులను సంహరించుటకును ఉపాయములను వెదకుచున్నారు; గావున నిరువురకును సఖ్యము సుగమము. అనురూపము" అని చెప్పి రామలక్ష్మణులను సుగ్రీవునికడకుఁ గొనిపోయెను.

అచట హనుమంతుఁడు సుగ్రీవునితోఁ జెప్పవలసిన రామచరిత్రమంతయుఁ జెప్పి ధైర్యము గొలిపెను. సుగ్రీవుఁడు శ్రీరాముని నాలింగనము చేసికొని చేతిలోఁ జేయివేసి స్నేహము చేసెను ఆసమయమున ఆంజనేయుఁడు రెండుకట్టెలను మథించి యగ్నినిఁ బుట్టించి ప్రవృద్ధముచేసెను. అప్పుడు రామసుగ్రీవులు ఆయగ్నికిఁ బ్రదక్షిణము తిరిగి అగ్నిసాక్షిగా స్నేహము చేసికొనిరి. సుగ్రీవుఁడు "రామా! నీవు సూర్యవంశజుఁడవు. నేను సూర్యపుత్త్రుఁడను. మన కిరువురకును స్నేహము చక్కఁగానున్నది. ఇఁక వగవకుము. నీసతి సీత యెచ్చటనున్నను దెచ్చియిచ్చెదను" అని చెప్పెను. శ్రీరాముఁడును "నీయన్నను జంపి నీభార్యను, నీవానరసామ్రాజ్యమును నీకప్పగించెద" ననియెను. శపథప్రకారము రాముఁడు వాలినిఁ జంపివేసి వాని భార్యయగు తారను, వానరసామ్రాజ్యమును సుగ్రీవుని వశముచేసెను.

తోడనే వర్షాకాలము వచ్చెను. "చిరకాలమునకు భార్యతోడి సంయోగ సులభమైనది. లక్ష్మణా! ఆతని నీసమయమున మనపనినిమిత్తము తొందరచేయుట తగదు" అని రాముఁడు సుగ్రీవునకు స్వేచ్ఛ యొసంగెను. వర్షాకాలము కడచిపోయెను. జైత్రయాత్రార్థులపాలిటి శుభముహూర్తమగు శరత్కాలము వచ్చెను. రాముఁడు, సుగ్రీవుఁడు

వచ్చెడివేళ యైనదని యెదురుచూడఁజొచ్చెను; గాని స్త్రీలతోడి విలాసములలో మునిఁగియున్న సుగ్రీవుఁడు ప్రపంచము మఱచిపోయెను.

స్వర్ణముతోడి సంబంధమువలన రత్నమునకు శోభ హెచ్చును. అట్లే శ్రీరామచంద్రునితోడి సంబంధమువలన నాంజనేయుని సకలశక్తులును విజృంభించెను. ఆ దేవునకును, ఈభక్తునకు నింతకాలమునకు సంయోగము గలిగినది. ఇది దౌష్ట్యము నశించుటకే సమకూడినది. ఆంజనేయునకు బాల్యమున దేవేంద్రాదులచే లభించిన వరముల కన్నిటికి వినియోగకాలము వచ్చినది. రామసేవకై హనుమంతుని మనస్సు ఉవ్విళ్లూరసాగెను ; గాని యాతఁ డేమిచేయఁగలడు ? సుగ్రీవుఁడు అంతఃపురము వదలి వచ్చుటయే కరవయ్యెను. సాధనసంపత్తి యంతయు సమకూడనపు డొకఁడు తొందరపడిన నేమి ప్రయోజనము! అట్లని యూరకున్న సుగ్రీవుఁడు తెలివితెచ్చుకొనునట్లు కాన్పింపదయ్యెను. ఇఁకఁ లాభము లేదని తలంచి హనుమంతుఁడు ఉద్యానవనమున స్త్రీలతో విహరించుచున్న సుగ్రీవునిచెంతకుఁ బోయి "ఈవైభవ మంతయు నీకు శ్రీరామవిభుఁడు దయచేసినది. ఆతనికి నీవు చేయవలసిన కార్యములు పెక్కు లున్నవి. ఇట్లు స్త్రీలోలుఁడవై యున్న నపాయము వాటిల్లును. త్రిలోకజయశీలుఁడైన నీయన్నను సంహరించిన రఘురాముని శౌర్యము నీకుఁ దెలియనిది గాదు. ఆతనికిఁ గోపమువచ్చిన క్షణములో ముల్లోకములును భస్మీపటల మైపోవును. ఆరాముని కన్ను లెఱ్ఱఁబడకముందే సీతాన్వేషణమునకై నలుదిక్కులకును వానరుల నంపుము" అని చెప్పెను.

ఎంతకును భోగములను విడునకునికి మిగులఁ గోపించి లక్ష్మణుఁడు నిష్ఠురవచనము లాడినపిమ్మట సుగ్రీవుఁ డిలువెడలివచ్చి రామకార్యమునఁ బ్రవేశించెను. అనేకకపివీరులను సకలదిక్కులకు నంపి, యాతఁడు జాంబవంతుఁడు మున్నగు వానినిఁ దోడిచ్చి హనుమంతుని దక్షిణమునకుఁ బంపెను. శ్రీరాముఁ డాంజనేయునివలననే తనకార్యము సిద్ధించునని నిశ్చయించి కాంచనమయమును రత్నఖచితము నగు ముద్రిక నానవాలిచ్చిపంపెను. అందఱును బయలుదేఱిపోయిరి. హనుమదాదులొక గుహాలోఁ జిక్కుకొని యెట్టకేలకు వెలుపలికి వచ్చి "రాముఁడును సుగ్రీవుఁడును సీతను జూచివచ్చుటకై యిచ్చిన గడువు దాఁటిపోవచ్చెను.

ఇఁక మన మాదేవినిఁ గనుఁగొనఁజాలము. ఇట్లే మగిడిపోయిన సుగ్రీవుఁడు మనలను సంహరింపక మానఁడని యెల్లరును ప్రాయోపవేశముఁ జేయుటకు నిశ్చయించుకొనిరి. ఇంతలో సంపాతివలన సీతావృత్తాంతమెల్లవారికిఁ దెలియవచ్చెను. తోడనే యెల్లరును సముద్రతీరమునకుఁ బోయిరి. హనుమంతుఁ డొక్క గంతు మాత్రమె సముద్రము దాటఁగలిగెను. రామభక్తి నైజశక్తికిఁ బ్రాణము పోయకున్న హనుమంతుఁడైన సముద్రము దాటలేక పోయియుండును.

అడ్డువచ్చిన దుష్టుల నెల్లరను వధించి హనుమంతుఁడు లంకఁ బ్రవేశించి సీతను వెదకెను; గాని వెంటనే కాన్పింపదయ్యెను. తుదకశోకవనమున రాక్షసాంగనామధ్య నున్న జానకినిఁ జూచి యుక్తసమయమున నామెతో సకలమును మాట్లాడి రాముముద్రికఁ జూపి, యామెచెప్పిన యాంతర్యవృత్తములను విని యానవాలుగా నిచ్చిన శిరోమణిని గ్రహించి తనశక్తి రావణునకొకంత చూపి పోవలె నని యాతఁడశోకవనమును పాడుచేసెను. చారులవలన నావృత్తాంతము విని రావణుఁ డాతనిమీఁదికి రాక్షసవీరుల నంపెను. ఆరాక్షసవీరులవలన నేమియుఁ గాదయ్యెను. పిదప గొప్పగొప్ప సేనాధీశ్వరులు వచ్చిరి. రావణుని కుమారుఁ డగు అక్షుఁడునుగూడ వచ్చెను. ఆంజనేయుఁడు వారి సేనను వారినిఁగూడ సంహరించి గండుమెఱసెను; తుదకింద్రజిత్తువచ్చి బ్రహ్మాస్త్రము విడిచి యాంజనేయునిఁ గట్టుకొనిపోయెను. బ్రహ్మాస్త్రము తన్నేమియుఁ జేయఁజాలకపోయినను ఆంజనేయుఁడు కావలయుననియే కట్టుబడిపోయినట్లుండి రాక్షసుల భుజములమీఁద రావణు నాస్థానమునకుఁ బోయెను. అట ఆంజనేయునిగురించి చాల వాదోపవాదములు జరిగెను. తుదకు మారుతిని సంహరించుట కచ్చట నిశ్చయమయ్యెను. విభీషణుఁడు దూతను సంహరించుట నీతిగాదని యాక్షేపించెను. దానిపై హనుమంతుని తోఁకకు నూనెగుడ్డలు చుట్టి నిప్పువెట్టునట్లనుజ్ఞ యయ్యెను. రాక్షసు లట్లు చేసిరి. ఆంజనేయుఁడు ఆనిప్పుతో లంకాపట్టణము దగ్ధముచేసి వెనుదిరిగెను.

యుక్తసమయమున నాతఁడు రామునిచెంతకు వచ్చి సకలమును నివేదించెను. తోడనే రాముఁడు లంకాపట్టణముమీఁదికి దండెత్తి సముద్రతీరమున విడిసెను. అట శరణుచొచ్చిన విభీషణునకు హనుమంతుఁడే

రామునిచే నభయ మిప్పించెను. వానరసాహాయ్యమున సముద్రము మీఁద వంతెనగట్టి రాముఁడు లంకాపురమునఁ బ్రవేశించెను.

యుద్ధము ప్రారంభ మయ్యెను. సామాన్యరాక్షసు లందఱును యుద్ధరంగమున సవతరించిన వెంటనే రూపుమాసి పోవసాగిరి. ఇంద్రజిత్తు వచ్చి యుద్ధముచేసినప్పుడు రాఘవులు చాలకష్టపడిరి. అప్పుడు ఆంజనేయుఁడు సంజీవనిని గొనివచ్చి ఉపద్రవ మంతయుఁ బోఁగొట్టెను. ఈయుద్ధసమయమున హనుమంతునిసాహాయ్యము లేకున్న రాఘవుల విజయము కలలోనివార్తయైయుండును. కావున అంతయు ముగిసి శత్రుసంహారానంతరము సీతాదేవితోఁ గూడికొని యానందసాగరమునఁ దేలియాడుచున్న శ్రీరామచంద్రుఁడు హనుమంతునిఁ జూచి "అంతయు నీవలననే కలిగినది. నీవు లేకున్న నేమియు లేకపోయియుండును. మేముగూడ లేకపోయియే యుందుము" అని నుతించెను. ఈయభిమానమును హృదయమున నుంచుకొని శ్రీరాముఁడు పట్టాభిషేకసమయమున హనుమంతునకుఁ జాలగౌరవముచేసెను. తన యాంతరంగికభక్తులలోఁ జేర్చుకొని తత్త్వోపదేశముచేసి రక్షించెను. ఆతనికి మృతిలేకుండను, ఎల్లప్పుడును తన నామస్మరణానందమున సుఖించుచుండునట్లును వరములిచ్చెను.

ఒకప్పుడు నారదతుంబురులకు "సంగీతమున నేను ఘనుఁడను. నేను ఘనుఁడను" అని వివాదము వచ్చెను. ఈవివాదము తీర్చుకొనుటకు వారు హనుమంతునివద్దకువచ్చిరి. హనుమంతుఁడును వారిని మిగుల గౌరవించి అనేకవిధములఁ గొనియాడి చంద్రకాంతశిలలపైఁ గూర్చుండఁజేసి రామునిఁగీర్తించెను. ఈయద్భుతసంగీతమువలన నాచంద్రకాంతశిలలు కరిగిపోయెను. నారదతుంబురులు వానిలో దిగిపోయిరి. వెంటనే హనుమంతుఁడు పాట మానివేయుటవలన రాళ్ళు పేరుకొని మఱల యథాస్థానము వహించెను. "మీలో నెవరీరాళ్లను పాడి కరఁగింపగలరో వారు ఘను" లని హనుమంతుఁడు చెప్పెను. నారదతుంబురు లొకరితరువాత నొకరు పాడిరి; గాని రాళ్లు కరఁగవయ్యెను. హనుమంతుఁడు మఱలఁ బాడి వారికి విముక్తి కలిగించెను. హనుమంతుఁడు మనకంటెను గొప్పవాఁడని నారదతుంబురులు సిగ్గుపడి వెడలిపోయిరి.

8. ధ్రువుఁడు

ఉత్తానపాదమహారాజునకు సునీతి, సురుచి, అను నిరువురు భార్య లుండిరి. వారిలో సునీతి పెద్దభార్య; అయినను రాజున కామెపైఁబ్రేమ లేకపోయెను. ఆతఁ డామెదెసకేచూచుట మానివేసెను. సురుచి రెండవ భార్య. ఉత్తానపాదునకు సురుచితోడిదే లోకముగా నుండెను. ఆతఁడు సర్వకాలములయందును సురుచిమేలే కోరుచు నామె యాజ్ఞలచే నిర్వర్తించుచు, నామె యానందమే తన మోక్షసాధనమని తలంచుచు నన్యము మఱచియుండెను. సురుచియు భర్తమనస్సు తనమీఁదినుండి తప్పిపోకుండున ట్లతిజాగ్రత్తతో నాతని కానందముఁ గొలుపుచు మాటిమాటికి సునీతిపైఁ గొండెములు సెప్పుచుఁ గాలము గడపుచుండెను.

సునీతిని భర్త వంచించినను భగవంతుఁడు వంచింపలేదు. ఈశ్వరుఁడు సునీతికిని, సురుచికినిఁగూడ నొక్కొక్క కుమారు నిచ్చెను; గాని ఉత్తానపాదునకు సునీతి కన్న కొడుకుమీఁదఁ గూడఁ బ్రేమ లేకపోయెను. ఆకుఱ్ఱనిమీఁదఁగూడఁ బ్రేమ సూపకుండునట్లు సురుచి భర్తమనస్సు విఱిచివేయుచుండెను. తనమీఁద దయలేకున్నను దన కొడుకునెడల నైనఁ దన భర్తకు వాత్సల్యము లేనందులకు సునీతి చాల విచారించెను. అయినను ఏమి లాభము?

సునీతి కుమారుని పేరు ధ్రువుఁడు; సురుచి కొడుకు పేరు ఉత్తముడు. ధ్రువుఁడు అయిదేండ్ల ప్రాయమున నున్నపు డొకనాఁడు రాజు ఉత్తమునిఁ దన తొడమీఁదఁ గూరుచుండఁబెట్టుకొని లాలించుచు సురుచితో వినోదించుచుండెను. ఇట్లుండఁగా బాల్యచాపలమువలన నాటలు మఱిగి యున్న ధ్రువుఁ డచ్చటకు వచ్చి అంతయుఁ జూచెను. తొడనే యాబాలునకుఁ దమ్మునివలెనే తండ్రితొడమీఁదఁ గూరుచుండుటకు ఆశగలిగెను. అట్టి యాశ ముఖముపైఁ దాండవించుచుండుటఁ జూచియు రాజు వానినిఁ జేరఁబిలువలేదు. ఇఁకఁ బ్రయోజనము లేదని ధ్రువుఁడు తనకుఁ దానయి తన తండ్రి రెండవతొడమీఁదఁ గూరుచుండెను. గాని వెంటనే సురుచి—

"గీ. తండ్రి తొడ నెక్క వేడుక దగిలె నేని, పూని నాగర్భమున నాఁడుపుట్ట కన్య
గర్భమునఁ బుట్టితోరినఁ గలదె నేఁడు, జనపతొడయెక్కు భాగ్యంబుసవతికొడుక."

ధ్రువుఁడు.



ధ్రువుఁడు.

పేజీ:—62.

క. "అదిగాన నీవధోక్షజు, పదపద్మము లాశ్రయింపు పాయక హరి నా
యుదరమునఁ బుట్టఁజేయును, వదలక యట్లయిన ముదము వడసెద ననఘా."
(భాగ. స్కం. 4. ప. 219, 220.)

అని పలుకుచు నివ్వెలకు లాగివేసెను. అప్పుడుగూడ రాజు ఏమియు మాట్లాడఁ డయ్యెను.

ధ్రువునకుఁ దండ్రిమీఁదను సవతితల్లిమీఁదను మిగులఁ గోపము వచ్చెను; అయిన నాయైదేండ్లబాలుఁ డేమి చేయఁగలఁడు? ధ్రువునకు వయస్సు లేకపోయినను జాలనభిమానము గలదు. బలము లేకపోయినను మిక్కిలి రోషముగలదు. తన్ను గన్న తండ్రియెదుట, విశేషించి తన సవతితల్లి కుమారునియెదుట, తనతో నాటలాడు సవతితమ్మునియెదుట నిట్టి పరాభవము జరుగుట వలన నాబాలుఁడు ఎంతో కోపించియు, దండతాడితభుజంగమురీతిని మిక్కుటమగు రోషమును వెడలఁగ్రక్కు, చెక్కిళ్లపైఁ గన్నీరు ధారలుగట్టుచుండ నేడ్చుచు నిముసమైన నచ్చటనుండక తల్లిచెంతకుఁ బోయెను

వెక్కివెక్కి యేడ్చుచు వచ్చుచున్న కుమారునిఁ బొదివిపట్టి సునీతి "తండ్రీ! ఏమి యాపదవచ్చెనోయి" యని యడిగెను. ధ్రువుఁడు సకలము నెఱింగించెను. తోడనే సునీతి హృదయము వ్రక్కలైపోయెను. విచారము పొంగిపోయెను. "నన్ను ప్రేమింపకున్న మానెఁ గుమారునిఁ బ్రేమింపరాదా? ఎదుట నున్నవానినిఁ బిలువకున్న మానెఁ దొడమీఁదఁ గూర్చున్నపుడైన నంగీకరింపరాదా? సురుచిపైఁ గోపింపకున్నమానె బతిమాలిగ్మెనఁ దనతొడపై నాబిడ్డ కింత చోటీయరాదా? ఇంతమాత్రముననే నాబిడ్డ సురుచికుమారుని సింహాసనమునకై పోరాడఁబోవునా?" యని సునీతి యనేకవిధములఁ దలఁచికొని తలఁచికొని వగచెను ఈసమయమునందే కొందఱు పరిచారికలును,గొంద ఱెఱిఁగియున్న స్త్రీలును వచ్చి జరిగిన సమాచార మంతయుఁ దెలిపి సునీతిని మఱింత యేడ్పించిరి.

ఇఁక నెంత వగచినను బ్రయోజన మేమి? తుదకు సునీతి యీస్రోతవిచారవాహినినిఁ దన తొల్లిటి విచారసాగరమున సంగమింపఁ జేసెను. అప్పటికి ధ్రువుఁడుగూడ నేడ్పు చాలించెను. సునీతి మనస్సు రాయిచేసికొని కుమారుని మేను నివిరి యొడిలోఁ గూర్చుండఁబెట్టుకొని

"బిడ్డా! విచారించిన నేమి లాభము? పూర్వజన్మమున నెంత చేసికొని
న నంతయు ననుభవింపక తీఱదు. నాకడుపునఁబుట్టినపుడే నీవు దైవో
పహతుఁడ వైతివి. నీవుగూడ దొల్లిటి జన్మమున నెంత చేసికొంటివో
యది యెల్ల ననుభవింపక తప్పదు. ఇఁక సురుచి మాటలకును, ఆమె
చేష్టలకును, నీతండ్రి దౌర్జన్యమునకును వగచుట లక్షణము గాదు.
నా పెనిమిటి నన్ను భార్యగాఁ గాకున్న దాసిగానైనఁ దలపోయుట
లేదు. ఇఁక నిన్ను బిచ్చగానికన్న నీచముగాఁ జూచుటలో నాశ్చర్య
మేమున్నది. మన పురాతనపాపము సురుచిరూపమును వహించిన దను
కొనుము; కాని యొకవిధమున సురుచి మంచియే చేసినది. ఆమె నీకు
హరిచరణములు సేవింపు మని యుపదేశించినది గదా! నాచిట్టితండ్రీ!
సురుచి యనిష్టముచేతఁ జెప్పినను హరిచరణసేవ విపత్సముద్రమున
మునిఁగిపోవుచున్న కష్టజన్ములకు నావవంటిది. నీతండ్రి తొడమీఁదఁ
గూర్చుండుటకు నీకింక నాశ గలదేని శ్రీహరి పాదకమలమును బూజిం
పుము దానం జేసి నీవింకను గొప్పఫలములను బడయఁగలవు నా
దైన్యమునుగూడఁ బాపఁగలవు' తండ్రీ! నాకును నీకునుగూడఁ బ్ర
త్యక్షమున నీవే దిక్కు. పరోక్షమున నారాయణమూర్తియే కలఁడు. ని
ర్గుణుఁడై పరమేశ్వరుఁడు విశ్వపరిపాలనము నిమిత్తము సగుణుఁడగు
చున్నాఁడు. అట్టి నారాయణుని పాదకమలములను బూజించుటవలననే
బ్రహ్మకు బ్రహ్మత్వము సిద్ధించినది. మాతాతయైన మనువు శ్రీహరినిఁ
బూజించియే యిహపరసుఖముల నవారిగాఁ బడసెను. నీవుగూడ
రమాపతి పదసరసిజములను సేవించి సుఖము బడయు"మని యుపదేశిం
చెను. తల్లిచెంత సెలవును, ఆమె యాశీర్వాదమును బడసి ధ్రువుఁడు
దామోదరుని సేవించుటకై యడవిమార్గము బట్టి పోయెను.

మార్గమధ్యమున నాతనితో నారదుఁడు కలిసికొనియెను. దివ్య
దృష్టిని జూచి నారదుం డంతయు గ్రహించి పాపనాశకరంబైన తన
కరంబున ధ్రువుని శిరము నంటి "ఆహా! ఈతఁ డైదేండ్ల బాలుఁడు. పిన
తల్లి యాడిన దురుక్తులకు సహింపక యడవికిఁ బోవుచున్నాఁడు! క్ష
త్రియుల యభిమాన మెంతటిది?" యని యబ్బురపడి "వత్సా నీవు మ
హారాజుబిడ్డవలెఁ గాన్పించుచున్నావు. అట్టి నీవు సకలవైభవములకు
నునికిపట్టగు భవనము విడిచి యీగహనమున నేల సంచరించుచు

చున్నావు?" అని యడిగెను. ధ్రువుఁడు నారదునకు నమస్కరించి తనసంగతి యంతయుఁ జెప్పెను. అది యంతయు విని నారదుఁడు ధ్రువుని మనోదృఢిమను బరీక్షింపఁ దలఁచి "వత్సా! ఆటపాటలయందుఁ గాలము గడపునీ కీ బాల్యప్రాయమున మానమన నేమి? అవమానమన నేమి? ప్రాణులకుఁ బురాకృత మనుభవింపక తప్పదు. వివేకముగలవాఁడు సంప్రాప్తములైన కష్టసుఖములు దైవవశము లని తలంచి మాఱుపలుకకుండ ననుభవించును. అట్లుగాక నీవు తల్లి యుపదేశించిన ప్రకారము యోగమార్గమున శ్రీమన్నారాయణుని యనుగ్రహముఁ బడసెద నంటివా? యోగీశ్వరులుగూడ ననేకజన్మములెత్తియు, నిష్కామకర్మతో ధ్యానించియు శ్రీహరినిఁ దెలియనేరరు. కావున, నామార్గము నీకు దుష్ప్రవేశ్యము. ప్రయోజనము లేని యీప్రయత్నములు మానుకొనుము. అవివేకమువలన లేనిపోని ప్రయత్నములు సేయక దైవము సంఘటించిన సుఖదుఃఖములకుఁ దలయొగ్గి కాలము గడుపుకొనిపోవువాఁడు వివేకవంతుఁడు. గొప్పవానినిజూచి యానందించుచు, నీచుదెసఁ జూడక సమానునితో మైత్రి నెఱపి ప్రవర్తించువాఁడు తాపత్రయాదికములచేఁ బీడింపఁబడక సుఖించును" అని చెప్పెను. ధ్రువునకీయుపదేశమునసారము కాన్పింపలేదు. అగుట నాతని కిది నచ్చని దయ్యెను కావున నాతఁడు మఱల "అనఘా. సుఖదుఃఖోపహతుల కీశాంతి యలవడదు. నేను క్షత్రియబాలకుఁడను. మానవతితల్లి వాగ్బాణాఘాతములవలన నా హృదయము కఱఁగిపోయియున్నది. కావున నాచిత్తమున శాంతి నిలువదు. త్రిభువనములయందు నసమానమును, అనన్యదుర్లభమునగు స్థానమును బొందఁగోరుచున్న నాకు మంచిమార్గము నుపదేశింపుము. నారదమునీంద్రా! నీవు భగవంతుఁడగు విధాత యూరువువలన నుద్భవించి సతతము వీణవాయించుచు సూర్యదేవుని వోలె విశ్వశ్రేయస్సునిమిత్తము తిరుగుచుందువు. నీకుఁ దెలియనిది లే" దని ప్రార్థించెను.

ఈసంభాషణమువలన నారదునకు ధ్రువునిప్రారంభ మచంచలమని తెలియవచ్చెను. తోడనే యాతఁ డెందులకెంతయు నానందించి "కుమారా! నీబుద్ధి నీకార్యమునకుఁ బ్రేరేచినవాఁడు వాసుదేవుఁడు; కావుననే నీదీక్ష చాల దృఢమైయున్నది. నారాయణుఁడు నీయెడల సుప్రసన్నుఁడు; కావున నాతనిని భజించి శుభములు పడయుము.

చతుర్విధపురుషార్థములను బడయఁగోరువారికి శ్రీహరిచరణకమల యుగళమే యాధారము. యమునాతీరమున హరిసంచారమువలనఁ బవిత్రమును, అతిపుణ్యము నైన మధువనమునకుఁ బొమ్ము. ఆయమునా నదిలోఁ గ్రుంకి సమాధినిష్ఠుఁడవై నారాయణుని భజింపుము. నీకు శుభము సమకూఱును. నీ వనుపనీతుఁడ వగుటచే వేదాధ్యయనమున కనర్హుఁడవు. అయినను భక్తిమార్గసంచారమునకు నీకు అభ్యంతరము లేదు. శ్రీహరి భక్తవశంవదుఁడు. ప్రణవయుక్తమును, ద్వాదశాక్షర కలితమును, దేశకాలవిభాగవేదియును బుధానుష్ఠితంబు నగు వాసుదేవ మంత్రమును సప్తవాసరములు పఠించిన ఖేచరులను గనుంగొనుసామర్థ్య మబ్బును. దానఁ జేసి యాహరినిఁ బూజింపవలయును. చాల నిష్ఠతో మెలఁగవలయును" అని తద్రహస్యములనెల్ల నుపదేశించెను. అప్పుడు ధ్రువుఁ డనన్యభక్తితో నారదునకుఁ బ్రదక్షిణనమస్కారము లాచ రించి సెలవుగైకొని మునిజనసేవ్య మగుమధువనమునకుఁ బోయెను.

నారదుఁ డిచట ధ్రువున కిట్లుపదేశించి పంపివేసి తాను తిన్నగ నుత్తానపాదమహారాజుచెంతకుఁ బోయెను. ధ్రువుఁడు తపోవనమునకు బయలుదేఱిపోయిన పిమ్మట రాజునకు బుద్ధి వచ్చెను. "కుఱ్ఱవాఁడైనను ఎంత యభిమానవంతుఁడు! ఎంతలో నెంతపనిచేసెను" అని యాశ్చర్య మును, అట్టి సత్పుత్రుఁడు విడిచి చనినందులకు వగపును జెందుచు నేమి యుఁదోఁపక యుండెను. ఈసమయమున నారదుఁ డచ్చటఁ బ్రత్యక్ష మయ్యెను. నారదుని చూచినతోడనే రాజువిచారము నుఱింత పెరిఁగిపోయెను. అందులకనుగుణముగ నారదుఁడూరకుండక "రాజా! నీమొగము వాడియున్నది. నీవేమో వగచుచున్నట్లున్నది. ఏల?" యని యడిగెను.

పరామర్శవలన దుఃఖము పెంపొందెను. అగుట నారదుని సం ప్రశ్నమువలన ఉత్తానపాదుని హృదయము బ్రద్దలైపోయెను. ఆదుఃఖ మును భరింపఁజాలక యాతఁడు వగచుచు "మునీంద్రా! ఏమిచెప్పు దును! అయిదేండ్ల కుమారుఁడు. వివేకమహితుఁడు. అవివేకినై నాచే సిన పరాభవమువలన నడవులు పట్టిపోయెను. స్త్రీదాసుఁడ నగుట నాకప్పుడు యుక్తాయుక్తములు తెలియలేదు. నాబిడ్డఁడు నాతోడమీఁదఁ గూర్చుండుటకు ముచ్చటపడి రాఁగా నేను త్రోసివేసితిని. ఆకుమారుఁ

డిలువెడలిన వెంటనే నాప్రాణములు నాశరీరమును విడిచిపోవున ట్లున్నది. బుద్ధిలేక తేజోమూర్తిని బరాభవించితిని. మునికులతిలకా! నా బిడ్డ నాకిఁక నేత్రపర్వముగఁ గాన్పించునా? నా సుకుమారకుమారుఁడు వ్యాఘ్రాదిహింస్రపశువులబాఱి పడకుండ సజీవిడై తిరిగి వచ్చునా?" యని వాపోయెను. అదివిని నారదుఁడు రాజునకుఁ దగిన ప్రాయశ్చిత్త మైన దని తలంచి "విచారము వలదు. నీవు పరాభవించి తిరస్కరించి నంతమాత్రమున నీకుమారునకు రక్షకులు లేకపోలేదు. ఆతఁడు శ్రీమహా విష్ణువు నాశ్రయించిన ధన్యుఁడు. మఱియు నాతఁ డనితరసాధ్య మగు హరిభక్తిప్రభావమువలన లోకపాలురకుఁగూడ దుర్లభ మగు నౌన్నత్య మును బొందును. నీకుమారుని ప్రభావము నీకుఁ దెలియదు. నీవు స్త్రీ లోలుఁడవై అట్టి యుత్తమోత్తమపుత్రుని దిరస్కరించితివి; గాని ని న్నాతఁ డుద్ధరింపఁగలఁడు. ఆతని ప్రభావమువలన నీవు ఆకల్పస్థాయి యగు శుభ్రకీర్తి నందెదవు. ఆతఁడు మహామహిమోదంచితుఁడై నేఁడో రేపో యిచ్చటకు రాఁగలఁడు. నీవా తనినిగుఱించి వగవఁ బనిలేదు" అని చెప్పెను. రాజు నారదుని మాటలవలనఁ దనకు మంగళ మొదవు ననియు, నాతఁడు మహాప్రభావసంపన్నుఁ డగుననియుఁ దలంచి విచార ముడిగెను; గాని యాతని కిఁక రాజ్యపాలనమున మతి సుస్థిరము కా దయ్యెను. నాకుమారుఁ డెప్పుడు వచ్చునని యెదురుసూచుచు నాతఁడు రాజ్యమునెడల నిస్పృహుఁ డయ్యెను.

నారదుని వీడ్కొని ధ్రువుఁడు తిన్నఁగ యమునాతీరమునందలి మధువనమున కరిగి తపోవ్రతమున కనుకూల మగు స్థలము చూచుకొని యమునానదిలో స్నానమాడి తపస్సు ప్రారంభించెను. తొలుత నాతఁడు మూఁడురాత్రుల కొకమాఱు వెలగపండ్లను రేగుపండ్లను దిని మొదటిమాసము హరిధ్యానమునఁగడపెను. రెండవమాసమున నాఱేసి దినముల కొకమాఱు ఆకు నలమును దిని విష్ణుసమారాధనము చేసెను. మూఁడవమాసమునఁ దొమ్మిదేసిదినముల కొకమాఱు జలభక్షణము గావించి, మాధవు నర్చించెను. నాల్గవమాసమునఁ బండ్రెండుదినముల కొకమాఱు వాయుభక్షణము గావించి జితశ్వాసుండై పుండరీకాక్షుని భజియించెను. అయిదవమాసమున నిరుచ్ఛ్వాసుండై అచేతనంబైన స్థాణువుఁబోలె నేకపదమున నిలిచి పరమాత్మను జింతించెను. పిదప

నాతఁడు హృదయమును నిర్మలము గావించుకొని సకలప్రపంచమునకు నాధారభూతుఁడగు పరమేశ్వరునందు నిలిపి, ధ్యానము ప్రారంభించెను. ఆతని యంగుష్ఠపీడవలన ఏనుఁగు పరవళ్లు త్రొక్కుటవలనఁబడవ యెట్లు ఊఁగులాడునో యట్లు భూతల మూఁగులాడసాగెను.

ఇట్టి ధ్రువుని యనన్యసామాన్యతపస్సువలన సకలదేవతలకును ప్రాణనిరోధము గలిగెను. తోడనే వారు భగవంతునిచెంతకుఁ బోయి "యాపదఁ బాపవే"యని వేఁడుకొనిరి. శ్రీహరి వారికి సంగతిసందర్భము లన్నియు నెఱింగించి వారివారి నివాసములకంపివేసి గరుడారూఢుఁడై మధువనమున కరిగి ధ్రువునియెదుట సాక్షాత్కరించెను. ధ్రువుఁడును దనహృదయపీఠమునఁ దాండవము సేయు శ్రీహరి హఠాత్తుగఁ దిరోహితుండగుటచేఁ గన్నులు విప్పిచూచెను. వెంటనే యాతఁడు దామోదరునకు సాష్టాంగదండప్రణామము లాచరించి స్తోత్రము సేయఁబోయెను గాని యాతనికి వలనుగాదయ్యెను. అది యెఱిఁగి శ్రీహరి వేదమయమగు తన శంఖముచేత నాబాలుని కపోలము నంటెను. తోడనే ధ్రువునకు గంగాప్రవాహమువలె నిరర్గళమగు స్తోత్రపద్ధతి యలవడెను. అంత నాబాలభక్తుఁడు శ్రీహరి నిట్లు నుతింపఁ గొడఁగెను.

"దేవా! నీవు సర్వశక్తుఁడవు. ఈప్రపంచ మంతయు నీ యిచ్ఛామాత్రమునఁ బ్రవర్తిల్లుచున్నది. నీ వంతటను బాహ్యస్థితుఁడ వయ్యు మాయాఖ్య మగు శక్తివలన నన్నిటను వసించి నానాప్రకారములను బ్రకాశించుచుందువు.

సీ. సర్వేశ! కల్పాంతసమయంబునందు ని, య్యఖిలప్రపంచంబు నాహరించి
యనయంబు శేషసహాయుండవై శేష, పర్యంకతలమునఁ బవ్వళించి
యోగనిద్రారతి నుండి నాభిసింధు, జస్వర్ణలోకకంజాతగర్భ
ముందుఁ జతుర్ముఖు నమరఁ బుట్టించుచు, రుచినొప్పు బ్రహ్మస్వరూపవైన
గీ. నీకు మ్రొక్కెద నత్యంతనియమ మొప్ప, భవ్యచారిత్ర పంకజపత్రనేత్ర
చిరశుభాకార నిత్యలక్ష్మీవిహార, యవ్యయానంద గోవింద హరి ముకుంద."

(భాగ. స్కం. 4. ప. 257.)

అని యిట్లింకను బెద్దయుఁ బ్రొద్దు ధ్రువుఁడు వినుతింప శ్రీహరి యలరి "వత్సా! నీతపంబునకు సంతసించితిని. ఈప్రాయమున నీనిష్ఠయు, నీ

భక్తియు, నీదీక్షయు ననన్యదుర్లభములు. నీయభీష్టము నాకుఁ దెలియ వచ్చినది. సప్తర్షులును దారకాసమేతులై ప్రదక్షిణము తిరుగునట్టియు, దురాపమును, అనన్యాధిష్ఠితమును, ప్రళయకాలంబునందును నశ్వరంబు గాక వెలుంగునదియు నగు ధ్రువక్షితి యనుపదముఁ గోరుచున్నావు. నీయెడల నాకుఁ బొడమినయసాధారణవాత్సల్యమునఁ బదవి యిచ్చితిని; గాని యంతకుఁబూర్వము నీవు ఇరువదియాఱువేలయేండ్లు రాజ్యపాలనము సేయుదువు. తుదకు నాయందైక్యమయ్యెద" నని చెప్పి వైకుంఠమునకుఁ బోయెను.

పిదప ధ్రువుఁడు "అక్కటా! నేనెట్టిపని చేసితిని!

మ. ఘనహీనుండు నృపాలుఁ జేరి మిగులన్ ఘాటిం ఫలీకారవి
మ్మని యర్థించినరీతి ముక్తిఫలదుం డైనట్టిపంకేజలో
చనుఁడే చాలఁ బ్రసన్నుఁడైన నతనిన్ సాంసారికం బర్థిఁ గో
రిన నావంటి విమూఢమానసులు ధాత్రిం గల్గిన చెప్పరన్

(భాగ. స్కం. 4. ప. 300.)

నాస్వబుద్ధిచేనైనచో నిట్టివరములు కోరియుండను. నిజముగ నిది దేవతలు చేసిన మోసము. ఆహా! నాకు మోక్షప్రాప్తియైన నీదేవతల పుట్టి యేమి మునిఁగినది?" అని వగచి యింకఁ జేయునది లేక స్వగృహోన్ముఖుఁ డయ్యెను.

ధ్రువుఁ డింటికి వచ్చుచున్నాఁడను వార్త ఉత్తానపాదమహారాజునకుఁ దెలియవచ్చెను. అప్పుడాతఁ డామాట నమ్మఁజాలకయు నారదుఁ డబద్ధముచెప్పునా యని యెట్లో నమ్మి మహావైభవముతోడను, సునీతి, సురుచి, ఉత్తములతోడను ధ్రువున కెదురు వచ్చెను. తల్లిదండ్రులు కాన్పించిన వెంటనే ధ్రువుఁడు వారికి సాష్టాంగనమస్కారములు గావించెను. తన్నుబరుషోక్తులాడిన సురుచికిఁగూడ సాష్టాంగ మెఱఁగి, యామె కుమారుని ఉత్తమునిఁ గౌఁగిలించుకొనియెను. తండ్రి కౌఁగిలించి ధ్రువుని దీవించెను. తల్లియు మహానందముతోఁ బుత్రు నాలి
చేసికొని శిరము మూర్కొని కొంతతడ వానందపరవశయై
ర్వదించెను. పూర్వపు టసూయ నుడిచి సురుచి యాతని

లము జీవింపు" మని దీవించెను. ఉత్తముఁడు అన్నను తిరిగి కౌఁగిలించు కొనియెను. పిమ్మట నందఱు నానందముతో నిట్లు సేరుకొనిరి.

అప్పటికి ఉత్తానపాదుఁడు వృద్ధుఁ డయ్యెను. ఆతఁడు తన ముస లితనము నెఱింగి ప్రయోజకుఁ డగు ధ్రువునకు రాజ్యభారము నప్పగించి తపోవనమునకుఁ బోయెను. తరువాత ధ్రువుఁడు శింశుమారప్రజాపతి కూతురైన భ్రమి యను దానిని, వాయుపుత్రియైన యిల యనుదానిని బరిణయమై పుత్రులను బుత్రికలను బడసెను. ఉత్తముఁడు వివాహము కాకపూర్వ మొకనాఁ డరణ్యమునకు వేఁటకుఁబోయి యొక యక్షు నితో విరోధపడి వానివలన నచ్చటనే మృతుఁ డయ్యెను. ఈసంగతి విని సురుచి కుమారుఁడు పడియున్నచోటికిఁ బ్రయాణ మయ్యెను; గాని మార్గమధ్యమున నరణ్యమునందు దావాగ్నిలోఁబడి యామెయు మృతిచెందెను.

అంతఁ దమ్ముని జంపిన పగఁ దీర్పఁదలఁచి ధ్రువుఁడు దండయాత్ర బయలుదేఱి యలకాపురమును ముట్టడించెను. ధ్రువునకును యక్షుల కును ఘోరయుద్ధము పొసఁగెను. యక్షు లనేకమాయలు చేసి ధ్రువుని జయింపఁజూచిరి గాని యాతని నారాయణాస్త్రప్రయోగమువలన నంద ఱును నోడిపోయిరి. ధ్రువుఁడు యక్షులను నతిమితముగ కొట్టెను. అంత ధ్రువుని తాతయగు స్వాయంభువమనువు చనుదెంచి మనుమని రోషముడిపి పోయెను. తరువాతఁ గుబేరుఁడు ధ్రువుని శాంతింపఁజేసి హరిభక్తి యలవడునట్లు వరమిచ్చి చనియెను.

ధ్రువుఁడు స్వపురముఁ జేరినపిదప హరిసేవారతుఁ డయ్యెను. ఇట్లు కొన్నిదినములు జరుగునప్పటికి ఒకవిమానము చనుదెంచెను. దాని మీఁద స్ఫురద్రూపులు శంఖచక్రాద్యాయుధధారులు నగు నిరువురు పురుషులుండిరి. వారిని శ్రీహరికింకరులుగా నెఱింగి ధ్రువుఁడు నమస్క రించెను. హరికింకరు లాతనికి వెనుకటిసంగతు లన్నియు జ్ఞాపకముచేసి [illegible]నమునకు రమ్మని యాహ్వానించిరి. ధ్రువుఁడు శ్రీహరికృపవలన [illegible]భమగు ధ్రువస్థానమును బొంది మహామహిమాభిశోభితుఁ [illegible].

9. కుచేలుఁడు.

శ్రీకృష్ణుఁడును గుచేలుఁడును బాల్యమున సాందీపనిమహాముని చెంత సకలశాస్త్రములు నభ్యసించిన సహాధ్యాయులు. విద్యాభ్యాసము ముగిసినపిమ్మట నెవరియిండ్లకు వారు పోయిరి; గాని వారి హృదయములు మాత్రము స్నేహపాశబద్ధములై యేకత్వమునందే వెలయుచుండెను.

శ్రీకృష్ణుఁ డాగర్భశ్రీమంతుఁడు. కుచేలుఁడు ఆగర్భదరిద్రుఁడు. అట్టి దారిద్ర్యమునం దుండఁగనే యాతనికి వివాహ మయ్యెను. సంసారభారము మీఁదఁ బడియెను. భార మనగనేమి? భార్యాపుత్రాదులు తక్క నాతనికి రక్షింపవలసిన వస్తువు లింటియం దేమియు లేవు. ఏపూటకుఁ గావలసిన భోజనసామగ్రి యాపూట సంపాదించుకొనవలసినదే. కుచేలుఁ డెట్లో కష్టపడి యీభారమును నిర్వహించుచుండెను; గాని యిట్టి దారిద్ర్యము నెట్లు గడతు నని యాతఁ డెప్పుడును వగచి యెఱుఁగఁడు. క్షుద్బాధ తీఱినవెంటనే దారపుత్రులను జెంతఁగూర్చుండఁ బెట్టుకొని శ్రీకృష్ణుని బాలక్రీడలు, అతనికి సంభవించిన విపత్తులు, వానిని దప్పించుకొనిన విధములు, కంసాదిదుష్టులను సంహరించినపద్ధతులు, ప్రస్తుతము వినవచ్చెడి యాతని వర్తమానకార్యములు, ఆతని శక్తిసామర్థ్యములు మున్నగునవి చాల రసవంతముగ వర్ణించి శ్రీకృష్ణుఁడు కేవలము శ్రీమన్నారాయణుఁడు. అందుల కేమియు సందేహము లేదు. ఇప్పుడు లోకములో నధర్మము పెరిఁగియున్నది. దానిని రూపుమాపుటకే యాతఁ డవతరించె నని చెప్పుచుఁ గాలముఁ బుచ్చుచుండెను.

ఇట్లు కొన్నిదినములు గడచిపోవునప్పటికి, అనఁగా కుచేలునకు శ్రీకృష్ణగుణనామకీర్తనము పెరిఁగిపోవునప్పటికి సంతానము చాల వృద్ధి యయ్యెను. ఈరూపమున సంసారభారము పెరిగిపోయెను. ఇంతవఱకు నెట్లో బిడ్డలను సరిపెట్టుకొని వచ్చుచున్న కుచేలునిభార్యకు ఇఁక శక్తిలేకపోయెను. ఒకరిద్దఱు పిల్ల లున్నపుడు, తాను మానుకొనియైన వారి కన్నము పెట్టెడిది. పాపమా సాధ్వి కిప్పు డట్లు చక్కఁ బెట్టుకొనుటకు వీలు లేకపోయెను. భర్త తెచ్చిన బియ్యము వంటవండుచుండఁగా నిముస మాగిన నిఁక నుండదని పిల్ల లందఱును ఆకు

దొన్నెలు చేతులలో నుంచుకొని వచ్చి దీనముగఁ జూచుచు "అమ్మా! నాకన్నముఁ బెట్టుము. నాకు ముందు పెట్టుము. నేను చిన్నవాఁడను. నేనాఁకలి కాఁగఁజాలను. నేను పెద్దవాఁడనేగాని నాలుగుదినముల నుండి నాకడుపు మాడుచున్నది. అమ్మా! నాకు ముందు పెట్టు" మని ప్రార్థింపసాగిరి.

బిడ్డలింగన్న తల్లి కంతకంటె నేమికష్ట ముండును? నిజముగఁ బుత్రప్రేమ మెఱింగిన సాధ్వికి నగలక్కఱ లేదు. నాణెము లక్కఱ లేదు కుట్టుకుఁ గడుపునిండఁ గంజియైన నుండినఁ జాలును. కుచేలుని భార్య ఈదుర్భరస్థితిని జూడఁ జాలక పోయెను. సహింపలేక యామె యొకనాఁడు భర్తచెంతఁ జేరి "జీవితేశ్వరా! మన దారిద్ర్యము విషయ మేమియు నాలోచింపవైతివి. నాకుఁ గడుపునిండ గంజియైన లేదని నేను వగచుటలేదు. 'అన్నమో రామచంద్రా' యనుచు నన్నము నందు నపుడు పేరాసతో నాకుదొన్నెలు గొనివచ్చు బిడ్డలను, ఒక్కపూట యైన క్షుద్బాధ తీర్చుకొనుటకు వీలులేక పోవుటచేఁ జిక్కి శల్యావశిష్టుఁడవగుచున్న నిన్నును జూచి నేను సహింపకపోవుచున్నాను. గోపాలకృష్ణుఁ డాశ్రితమందార మని చెప్పుచుందువు. బాల్యసఖుఁడవగు నీకాతఁడు ఇంత యన్నము పెట్టకపోఁడు. ఆమహానుభావుని దర్శించి యీదారిద్ర్యాంధకారమును దొలఁగింపరాదా?" అని విన్నవించెను.

అదివిని కుచేలుఁడు భార్యయోచన కెంతయు నానందించి "రమణీ! నీవు మంచి యుపాయము సెప్పితివి. కృష్ణునిఁ గనఁబోవుట యిహపరసాధకము దైవోపహతుఁడ నగుట నాకీయూహ తోఁచినది గాదు. ఆరాజీవనయనుని చరణకమలము లాశ్రయింపఁ బోయెదను; గాని యట్టి ప్రభుశేఖరుని చెంతకు రిక్తహస్తుఁడనై యెట్లు పోఁగలను? ఆ గోపాలకృష్ణున కుపాయనము తీసికొని పోవుటకు మనయింట నేమైన నున్నవా?" అని యడిగెను. "ఆతని యర్హతకుఁ దగినవి లేవు; మన యర్హతకుఁ దగినవియున్న"వని చెప్పుచు నామె యడుకులు తెచ్చి భర్తజీర్ణోత్తరీయమునకు ముడిచెను. గోపాలదర్శనోత్సాహియై కుచేలుఁడు బయలుదేఱి పోయెను.

కాని మార్గమధ్యమున నాతనికి సందేహములు మెండయ్యెను. "ఆకట నకసినవసి యున్నాను. నేను ద్వారకాపుర మెట్లు సేరఁగలను?

శ్రీకృష్ణుని దర్శింపఁబోవునప్పుడుగూడ ధరించుటకు నాకు జీర్ణవస్త్రములే దిక్కయ్యెను. నేనా పుండరీకాక్షుని యంతఃపుర మెట్లు సొచ్చెదను? జీర్ణ పరిధానములను ధరించిన యీ బడుగు బాఁపనికి ద్వారపాలురు ప్రవేశము కలుగనిచ్చెదరా? అయ్యో! వారికేమైన నిచ్చి పోఁబోవచ్చు ననుకొన్న నేమైన సంపాదించుకొనుటకే పోవుచున్న నాచేత నిప్పుడేమున్నది?" ఇట్లు సందేహించి తుద కాతఁడు "యోచనలతోఁ బ్రయోజనము లేదు. ఇంత దారిద్ర్యోపహతునకు సంపద గలుగుట కదృష్టమున్న రాజగోపాలుని దర్శనభాగ్య మెట్లబ్బకుండును?" అని నిశ్చయముచేసికొని మాఱు చింతలేక గోపాలకృష్ణునే హృదయమున భావించుచుఁ బోయెను.

శ్రీహరిభావనాతాత్పర్యమువలన నాతనికి మైమఱపు గలిగెను. ఆతఁడు నడచుచుండెను; గాని యాతనికి నడచుచున్నానను జ్ఞానము లేదు. చూచువస్తువు లన్నియు గోపాలరూపములుగనే యుండెను. ఇట్లు కొన్ని నిముసములు గడచునప్పటికి అంతఃపురమున, వివిధాలంకారశోభితమగు పట్టెంట, హంసతూలికాతల్పమున, రాకేందుముఖులు వింజామరలు వీచుచుండ రుక్మిణితోఁ సరసోక్తులాడుచున్న శ్రీకృష్ణుఁ డాతనికిఁ బ్రత్యక్షమాయెను. దైవవశమున ద్వారపాలు రెవ్వరు నాతని నాటంకపఱుపరైరి; గాని యాతఁడు తానిక్కడకు నడచి వచ్చుట యెఱుఁగఁడు. అట్టిస్థితిలో శ్రీకృష్ణుని సమీపించుటకుఁ గుచేలుఁడు సందేహించుచు వెనుక కడుగు లిడసాగెను.

కృష్ణుఁడు కుచేలుని హఠాత్తుగఁ జూచెను. తోడనే సంభ్రమముతోఁ దల్పముదిగి యతిరయమున వచ్చి వెనుదిరిగిపోవ నుంకించుచున్న కుచేలుని చేయుడిసిపట్టుకొని, బిగియారఁ గౌఁగిలించుకొనియెను. కృష్ణుని చేష్టలు చూచి అంతఃపురస్త్రీ లెల్లరును దెల్లవోయిరి. రుక్మిణి వెనువెంట వచ్చి నిలిచి యబ్బురముతోఁ జూడసాగెను. ఇది యంతయు జూచి కుచేలుఁడు తెల్లవోయెను. అగుటం జేసి కృష్ణుఁడు తన్ను గుశల మడిగి, మిగుల నాదరము చూపి, తల్పముమీఁదికిఁ గొనిపోయి కూర్చుండఁ బెట్టుటయుఁగూడఁ గుచేలుఁ డెఱుఁగఁడు. పిదపఁ గృష్ణుఁడు రుక్మిణిచే బంగారుకలశముతో నుదకము తెప్పించి స్వయముగఁ గాళ్లుగడిగి, ఆజలమును శిరమున ధరించి, సుగంధఘనసారమిళితమైన మలయజము ఆతని బడుగుమేన నలఁది శ్రమమాఁపునట్లు వీవనతో విస

రెను. మణిదీపముల నివాళించెను. సుగంధకుసుమమాలికలు శిరము నలంకరించెను. కర్పూర తాంబూలము నొసంగెను. ఒక ధేనువు నొసఁగి స్వాగత మడిగెను. అంత రుక్మిణి వీవన వీవఁదొడఁగెను. అప్పటికిఁ గుచేలునకు యథార్థమంతయుఁ దెలిసెను. ఇదియంతయుఁ జూచి యంతఃపుర కాంతలు గుములుచేరి గుసగుసలు వోవుచు,—

ఉ. "ఏమితపంబు సేసెనొకో యీధరణీదివిజోత్తముండు తొల్
బామున యోగివిస్ఫురదుపాస్యకుఁడై తనరారు నీజగ
త్స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించియున్నవాఁ
డీమహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్.

చ తన మృదుతల్పమందు వనితామణియైన రమాలలామ పొం
గును నెడఁగాఁ దలంపక యదుప్రవరుం డెదురేఁగి మోదమున్
దనుకఁగఁ గౌఁగిలించి యుచితక్రియలం బరితుష్టుఁ జేయుచున్
వినయమునన్ భజించె ధరణీసురుఁ డెంతటి భాగ్యవంతుఁడో."

(భాగ. స్కం. 10. ఉ.భా. ప 985-987)

అని యాశ్చర్యపడసాగిరి.

అంత శ్రీకృష్ణుఁడు కుచేలుని కరము గ్రహించి.—

"సీ బ్రాహ్మణోత్తమ వేదపాఠనలబ్ధ, గుణసంపు చారువంశంబువలనఁ
బరిణయంబైనట్టి భార్య సుశీల వ, ర్తనముల దగ భవత్సదృశ యగునె
తలఁప గృహక్షేత్రధనదారపుత్రాదు, లందు నీచిత్తంబు చెందకుంట
. తోఁచుచున్నది యేను దుదిలోకసంగ్రహా, ర్థంబు కర్మాచరణంబు సేయు.
గీ గతి మనంబులఁ గామమోహితులుగాక, యర్థమై యుక్తకర్మంబు లాచరించి
ప్రకృతిసంబంధములు వాపి ధన్యనిష్ఠ, దవిలియుందురు కొందఱుత్తములు భువిని.."

(భాగ. స్కం. 10 ఉ.భా.ప. 99.)

గురువుగారు చెప్పినవిషయము లన్నియు మనము పంతములుపట్టి వల్లించుట జ్ఞాపకమున్నదా? ఒకనాఁడు గురుపత్నిచే నాజ్ఞప్తులమైయింధనములనిమిత్తము మన మడవికిఁ బోయితిమి. అప్పుడు ప్రళయకాలము నందుఁ బోలె నొక గొప్ప వర్షము కురిసినది. రాత్రియంతయు వర్షములోఁ దడిసి చలివలన మిక్కుటముగఁ బీడితులమై గృహముదారి గానక యరణ్యమునఁ బ్రుమ్మరితిమి. తెల్లవాఱినపిదప గురుపత్ని మనలనువెదకి కొనుచువచ్చి మనయవస్థనుఁ జూచి చాల వగచి "వత్సలారా మానిమిత్త మెంత శ్రమననుభవించితిరి. అయ్యో! మానిమిత్తము వచ్చెదమన్న

ధారాపాతముగు వర్షమువలన పీలులేకపోయినది. నాబిడ్డలారా! మిమ్మెంత కష్టపెట్టితిని!'' అని నొచ్చుకొని తుద కామె "మీరు అచంచలగురు భక్తులు గావున మీకు సకలైహికసుఖములును కరతలామలకము లగును" అని యాశీర్వదించి మనల నింటికిఁ గొనిపోయె నది నీవిం కను మఱువకుండ నున్నావా? మిత్రుఁడా! ఆకాలమున మన మింక నేక విచిత్రములు చేసితిమి. అవి యెల్ల నీకిపుడు జ్ఞప్తియందున్నవా?''యని యడిగెను.

కుచేలుఁడు అందునకుఁ గొంత ప్రత్యుత్తరము చెప్పి "కృష్ణా! జగ న్నాటకసూత్రధారి వగు నీకు ఒరుఁడు గురుఁ డనుటలో నేమి యర్థ మున్నది? లోకవిడంబనార్థము నీవట్లు సంచరించితివి; గాని లోకగురుఁడ వగు నీకు గురుఁడుగాఁదగు యాతఁ డెతఁడు!'' అని పలికెను. ఇది విని కృష్ణుఁడా ప్రస్తావనము నంతటితోఁ జాలించి "సఖుఁడా. నీవును నేనును జిన్ననాటి స్నేహితులముగదా? నేనన్న నీకుఁ బరమానురాగముగదా! నాకుపహారమున నాసక్తి మెండని నీవెఱుఁగుదువుగదా? "మఱినాఁటికి నేఁడు చూడవచ్చుచు నీవు నాకేమి తెచ్చి పెట్టితివి?'' అని యడిగెను. కృష్ణుఁ డిట్లడుగకుండినను, ఆతఁడు స్త్రీజనసమక్షమున, విశేషించి దాసీ పరివృతయగు పట్టపుదేవి సముఖమున లేకుండినను గుచేలుఁడు తాను తెచ్చిన యటుకు లుపాయనముగ నిచ్చియుండును. ఇప్పు డాతని కాపని చేయుటకు సాహసము కలుగదయ్యెను. అయిన కృష్ణున కిప్పు డేమి చెప్పవలెను! పాపము కుచేలుఁడు లజ్జాభరమున శిరమువంచికొనియూర కుండెను. అంత శ్రీకృష్ణుఁ డేమియు నెఱుఁగనట్లు కుచేలుని జీర్ణోత్త రీయపుఁగొంగుముడి చూచి "మిత్రుఁడా! ఇదియేమి?'' యని యదివిప్పి "ఆహా. నానిమిత్త మటుకులు తెచ్చితివా! ప్రియమిత్రుఁడా! ఇవి నా కెంతో యిష్టము'' అని చెప్పి యొక గుప్పెఁడు పుచ్చుకొని యెంతో సంతోషముతో భుజించెను. మఱియొక గుప్పెఁడు తీసికొనుచుండఁగా రుక్మిణి పతిచేయిపట్టుకొని వారించి "నాథా. ఈద్విజశ్రేష్ఠునకు సంపద లొసంగుటకు మొదటిగుప్పెఁడే చాలును. ఇంకను గైకొన్న మన మాతని ఋణము తీర్చుకొనఁజాల'' మని పలికెను. కృష్ణుఁ డందులకు మాఱుపలుకకుండ నూరకుండెను.

కృష్ణుఁడు నాఁటిరాత్రి కుచేలునకుఁ దనయింటవిందుచేసి సకలవిధములఁ దృప్తిఁ బొందించెను. కుచేలుఁడు మఱునాఁ డరుణోదయమున మేల్కాంచి సకలకార్యములనుదీర్చుకొని సెలవడిగెను. శ్రీకృష్ణుఁ డాతని చేయిపట్టుకొని కొంతవఱకు సాగనంపి "నన్ను మఱవకుమా" యని చెప్పి వెనుకకు వెడలిపోయెను. కుచేలుఁడును గృష్ణుఁడు తనకుఁ జేసిన మహాదరమున కెంతయు నాశ్చర్యపడుచు "అయ్యో! ఈతనివలన నాదరిద్రము విచ్ఛిన్నమైపోవు నని వచ్చితిని. తుద కాశాభంగమే ఫలమైన" దనుకొనుచు స్వస్థలమునకుఁ బోయెను.

పోయి చూడఁగా మున్ను తనకుటీర మెచ్చటనుండెనో యచ్చట మహోన్నతప్రాసాద ముండుట కుచేలుఁడు చూచి రిచ్చపడసాగెను. ఇంతలో పరిచారికలు వచ్చి "ప్రభూ! లోనికి దయచేయు" మని ప్రార్థించి కొనిపోయిరి. అంగణమున నడుగుపెట్టునప్పటికి పూచిన తంగేడువలె భార్య యెదురువచ్చి మ్రొక్కి లోపలకుఁ గొనిపోయెను. పిమ్మటఁ గుచేలుఁ డిదియంతయు గృష్ణానుగ్రహమే యని గ్రహించెను; గాని యంతటి యతులైశ్వర్యము వచ్చినను ఆతఁ డైహికసుఖములు పొంతఁబోక నిస్పృహుఁడై కాలముఁ బుచ్చి దేహాంతమున విష్ణుసాయుజ్యమును బడసెను.

సీ. "సిరదాగమమేఘనిర్యత్నపయఃపాన, చాతకం బడుగునే చాటిపడకుఁ?
బరిపక్వమాకందఫలరసంబులు గ్రోలు, కీరంబు దను ధత్తూరములను?
ఘనరవాకర్ణనోత్కలికమయూరము, కోరునే కఠినఝిల్లీరవంబుఁ?
గరిసంభపిశితసద్గ్రాసమోదితసింహ, మరుగునే శునకమాంసాభిలాషఁ?

గీ. బ్రవిమలాకార ! భవదీయపాదపద్మ, యుగసమాశ్రయస్ఫురితోద్యోగచిత్త
మన్యుఁ జేరునె తన కుపాస్యంబుగాఁగ, భక్తమందార! దుర్భవస్తాప విదూర!"

(భాగ. స్కం. 10. ఉ. భా. ప. 257.)

---

10 సత్యవ్రతుఁడు.

ద్రవిళ దేశమును బరిపాలించు సత్యవ్రతుఁడు అను మహారాజు నీరుమాత్రము యాహారముగాఁ గొనుచు వైకుంఠనివాససౌఖ్యమును బడయఁగోరి శ్రీమహావిష్ణువుకొఱకు గురుతరనిష్ఠతోఁ దపస్సు ప్రారం

భించెను. ఒకనాఁ డాతఁడు కృతమాలిక యను నదిలో నవగాహనము చేసి, సంధ్యావందనము ముగించి, తర్పణము చేయుటకు దోసిట నీరు దాల్చి యుండఁగాఁ దటాలున నందొక చేఁపపిల్ల పడెను. వెంటనే యా మహాత్ముఁ డులికిపడి దాని నానదీప్రవాహమునఁ బాఱవేసెను. అంత నది గడగడ వడకుచు "రాజా, పెద్దచేఁపలు మ్రింగివేయు నను భయమువలనను, జాలరులు వలలసాహాయ్యమునఁ బట్టుకొని కుడియింతు రను భీతి వలనను, నీపాలఁ బడి నీశరణు చొచ్చిన నన్నిట్లు మఱల నీయేటఁ బాఱ వేయుట ధర్మమా? దీనవత్సలా, కరుణామయా, నాయెడల ననుగ్రహము వహించి నన్ను రక్షింపుము" అని సవినయముగఁ బ్రార్థించెను.

ఈదీనాలాపములకు సత్యవ్రతుని హృదయము వెన్నవలెఁ గరఁగిపోయెను. తోడనే యాతఁ డాఝషకిశోరము నాదరముతో మెల్లఁగఁ బట్టుకొని, తన కమండలమున నిడుకొని పర్ణశాలకుఁ బోయి నాఁటికిఁ దనకు లభ్యమయిన యాహారమేదో దానికిఁ బెట్టెను. మఱునాఁ డుదయమున నాతఁడు స్నానార్థము నదికిఁ బోవుటకై కమండలమును గైకొనఁగాఁ జేపపిల్ల నిన్నటికంటెఁ జాలఁ బెద్దదియై యుండుట కాన్పించెను. అందుల కాశ్చర్యపడుచున్న సత్యవ్రతునితో నది "దయామయా, నాకీచిన్నికమండలము, చాలుట లేదు. మఱియొక తావుఁ జూపు" మని కోరెను. నా డాతఁడు దాని నొక కడవలో విడిచెను. మఱునాఁ డది యంతకంటెఁ బెరిఁగి "మహాత్మా! నే నీయిరుకుఁగడవలో బ్రతుకఁ జాలను. మఱియొకచోటుఁ జూపింపు" మని ప్రార్థించెను. రాజు దాని నొక చిన్ని మడుగులో విడిచెను. అదియుఁ జాలకపోవుటచే నొక సరస్సున విడిచెను. ఆమఱునాఁడు రాజు దానిసంగతిఁ జూచుటకుఁ బోయి సరస్సునడుమ పెద్దభూప్రదేశమును శంకఁగొలుపు మీనమును జూచెను. అందుల కాతఁ డాశ్చర్యచకితస్వాంతుఁ డగుచుండఁగా నది మెల్లమెల్లన "భూరమణా, నీవు విశాలదేశమునకుఁ బరిపాలకుఁడవు. నీదేశమున నింతకంటెఁ బెద్దజలాశయము లేకపోలేదు. నాకీసరస్సున నూపిరి తిరుగుట లేదు. ఇటునటు తిరుగుటలో నిందు నాయెముకలు విరిగిపోవుచున్నవి. నా రెక్కలాడుట లేదు. ఈచిన్నిజలాశయమున నాకాహారము గూడఁ జాలుట లేదు. మఱియొక ప్రదేశమును జూపు" మని వేఁడుకొనియెను.

"ఇఁక నిట్టి వేవియుఁ జాలవు. సముద్రముగూడ నీవింతమీనమునకుఁ జాలనట్లున్నది. అయిన నంతకంటె విశాల మగు జలరాశి మఱియొకటి లేదుగదా?" యని తలఁచి రాజు దానిని సముద్రమున విడిచెను. తోడనే మహాభీతిచే వలె నది గడగడలాడుచు "కరుణాలవాలా, ఇంతవఱకును నన్ను గడు ననురాగముతోఁ బెంచి నేఁడిట్టి యపారపారావారముపాలు చేయుట తగునా? ఈగభీరజలరాశి తిమింగిలములు మొసళ్లు మున్నగు క్రూరసత్వములచే మిగుల భయంకరమై యున్నది. నన్నొక పంటిక్రింద నొక్కి వేయఁగల మహామీనములు గూడ నిందు వేనవేలు గలవు. ఇందు నాప్రాణము లెట్లు తక్కును? అయినను నీవేమి చేయఁగలవు? ప్రపంచమున నెచ్చటఁజూచినను ఇంతకంటెఁ బెద్ద జలరాశి లేదయ్యెను. ఇంతకంటెఁ జిన్నదియైనను నన్ను విలాసముగఁ గబళింపఁగల క్రూరసత్వములు లేనిది లేదయ్యెను. ఇఁక నాయదృష్ట మెట్లున్న నట్లగును. పోయిరమ్ము. నన్ను మఱువఁబోకుము. తఱుచు వచ్చి నీక్షేమవార్తలు తెలిపి, నాక్షేమసమాచారములు తెలిసికొని పోవుచుండు" యని ప్రార్థించెను.

ఇదివిని యబ్బురముతోడను,సంతోషముతోడను దానినిఁ జూచి రాజు "నీచరిత్రము చాల వింతగ నున్నది. ఒక్కొక్కదినమున సహా కంపసంతతి యభివృద్ధినిఁ బడయుచున్నావు. ఎందైన మీనుల కింతటి మేను గలదని వినులఁ బడెనా? నీవు నిక్కముఁ జేపవు కావనుట యథార్థము. మహాత్మా. ఇట్టి విచిత్రలీలావతారమును దాల్చిన నీవెవఁడవో సెలవిమ్ము. నీవు దీనరక్షణమునకుఁ గంకణము గట్టుకొన్న శ్రీమన్నారాయణమూర్తివిగాని వేఱుగాదు. భక్తవత్సలా, పురుషోత్తమా, సృష్టిస్థితిసంహారచతురా, ప్రపంచమున కెల్ల నీవే దిక్కు. నీలీలావతారములు లోకకల్యాణసంధాయకములు. దేవా, నేను లాతివాఁడను గాను. నీ సేవకుఁడనగు నాయెడల ననుగ్రహము పూనుము. లోకమంగళకారిణి యగు శ్రీమహాలక్ష్మి సేవించుటచే మైమఱచియుండు నీవీమత్స్యరూపము నేల ధరియించితివో యానతిమ్ము" అని ప్రార్థించెను.

ఈవేఁడికోలు నంగీకరించి ప్రళయకాలమునందలి భయంకరసముద్రమున నేకాంతముగ విహరింప నిచ్ఛగించి మీనరూపమును దాల్చిన శ్రీహరి సత్యవ్రతునిఁ జూచి "ఓ రాజా! నేటి కేడవదినమున బ్రహ్మదేవున

కొక్క పగలు నిండును. ఆహేతువుచే నాఁడు ప్రళయము సంభవించును. భూర్భువాదికము లగు లోకములుగూడ నావిలయసాగరమున మునిఁగిపోవును. నాఁడు నాయాజ్ఞచొప్పున నోషధీబీజరాసులతో నిండియున్న యొక పెద్ద నౌక వచ్చును. దానిని వెదకికొనుచు సప్తర్షులు వచ్చెదరు. వారితోఁ గూడ నీవు దాని నధిష్ఠింపుము. జగమంతయు సంధకారబంధురమగును. అయినను నీవా మునుల దేహకాంతివలన రక్షింపఁబడెదవు. నాయానతివలన నావతో నొక పెద్ద పాము వచ్చును. దానిసాయంబున సముద్రపుఁగెరటముల తాఁకుడుచే నావ యటునిటు కొనిపోకుండఁ జేసి దాని చుట్టును దిరుగుచుఁ దిమింగిలములు మున్నగు వానివలన బ్రహ్మదేవుని గాత్రి కడచునంతదనుకఁ గాపాడెదను. ఆకారణమున నే నీమత్స్యరూపమును వహించితి" నని చెప్పి యంతర్హితుఁడయ్యెను.

పిదప సత్యవ్రతుఁడు మత్స్యరూపి యగు శ్రీమన్నారాయణుని పాదపద్మములం దలంచుకొనుచు దర్భశయ్యపైఁ దూర్పుకొలగడగా శయనించి యాప్రళయకాలమును నిరీక్షింపసాగెను. ప్రళయమును వచ్చెను. పుష్కలావర్తమేఘములు కడవలతో గుమ్మరించినట్లు కురిసిన వర్షమువలన సముద్రములు పొంగి చెల్లెలికట్టలను దాఁటి జగత్తును ముంచఁదొడఁగెను. ఇంతలో సప్తర్షులు చనుదెంచి సత్యవ్రతునిఁ జూచి యాశ్చర్యచకితులై "ఈప్రళయకాలమున నీవెట్లు బ్రతుకఁగలిగితి" వని యడిగిరి. రాజు సంగతి యంతయుం జెప్పెను. మునులకు మఱింత యబ్బురపాటు తోఁచెను. వారా రాజుభాగ్యమును జాలఁ గొనియాడిరి. ఇది యిట్లు జరుగుచుండఁగా జగత్తంతయు సముద్రమగ్నమయిపోయెను. మేరుగిరిశృంగమును, భైరవమూర్తి శూలాగ్రమున నున్న మహాలక్ష్మీవిలాసమందిర మగు కమలమువలె వెలుంగుచుఁ గాశీనగరమును మాత్రము ప్రళయోపహతములు కాకుండ నిలిచెను.

అప్పుడు బ్రహ్మదేవుఁడు సృష్టి చేసిచేసి విసిగి వేసారి యొడలు విరిచికొనుచు శయనించెను. అలసిసొలసి శయనించిన యావిధాత ముఖమునుండి వేదములు బయలువెడలెను. ఈశ్వరుఁ డొసఁగిన వరము ప్రభావమువలనసముద్రమధ్యమున భువనమోహనమను పురము నిర్మించికొని దేవతలకుఁగూడ నజేయుఁడై, పోతరించి సంచరించు హయగ్రీవుఁ

డను రాక్షసుఁడు వెంటనే యావేదములను దొంగిలించుకొని పోయి తనపురిని దాఁగికొనియెను.

ఇట్లు వేదములను హరించిన రక్కసుని సంహరింపవలసియు, మ్రానుదీఁగెల విత్తనంబుల పొత్తరలు పెన్నీట నాని చెడకుండ నునుపవలసియు శ్రీమహావిష్ణువు మఱల మత్స్యరూపముతో నా ప్రళయసాగరమున దర్శన మిచ్చెను. అంతకుమున్నె శ్రీహరి యాజ్ఞవలన నొకపెద్ద నౌక వచ్చెను. సత్యవ్రతుఁడు సప్తమునులతోడను దానిపై నెక్కి మ్రానుదీఁగవిత్తనములను జాగ్రత్తచేసెను. పిదప నాతఁడు పెనుబాపత్రాట నాజలచరేంద్రుని కొమ్మున కా నౌకను గట్టిపట్టెను. మునులు సమాధినిష్ఠాగరిష్ఠులైరి. సత్యవ్రతుఁడు శ్రీహరి నిట్లు వినుతింపఁ దొడఁగెను.

“మాయచే నావరింపఁబడి ఘోరసంసారసాగరమున మునిఁగి తేలుచు భాగ్యవశమున జను లేమహాత్ముని గొలిచి వైకుంఠముఁ జేరుదురో యట్టి శ్రీమన్నారాయణమూర్తీ! నన్ను రక్షింపుము. కన్నులుగలవాఁడు గ్రుడ్డివానికి దారి చూపును. ఈసచరాచర ప్రపంచమును బ్రకాశింపఁజేయు సూర్యచంద్రులను నేత్రములుగా ధరించిన ముకుందా! సద్గతిఁ జూపుము. అగ్నిసంపర్కమువలన బంగార మెట్లు పరిశుభ్రమగునో యట్లే నీసేవవలన లోకములు పాపముల బాఱినుండి తప్పి ప్రకాశించును. చెలివై, చుట్టమువై నాహృదయకమలమున వసించి, యానందమూర్తివై, నిర్హేతుకజాయమానకటాక్షమున దీనుఁడను, ఆపన్నుఁడను, అగు నాకు సాక్షాత్కరించిన శ్రీపతీ! పురుషోత్తమా! దీనమందారా! నా మొఱ నాలకించి నాకు మోక్షము దయచేయుము.”

ఈప్రార్థనమును విని భగవంతుఁడు నవ్వుల నలరి, కరుణ వెలయ సత్యవ్రతు నుద్దేశించి “నేను నీవు అని భేదము చేయుటయే అవివేకము. భేదభావమును మఱచి తత్త్వము నెఱింగి సోఽహ మను వాక్యార్థము నెఱింగి ప్రవర్తించినవారికి మోక్షప్రాప్తి యగును. ఇది త్రాడు పాము గాదు. అను జ్ఞానముగలవానికి భయ మెట్లుండును? అట్లే జీవుఁడఁగాను. పరబ్రహ్మము ననుభావము గలవానికి సాంసారికభీతి యెట్లుండును? బ్రహ్మానందానుభవముగలవానిని మాయ సమీపింపఁ జాలదు. అనేక జన్మములు సాధువులకుఁ బరిచర్య చేసినయెడలఁ బురాణార్థము లెఱుఁగనగును. పురాణార్థ విజ్ఞానమువలన సత్కర్మానుష్ఠానమును, దానం జేసి

నాపదకమలములయెడల నిర్మలభక్తియుఁ బొడమును. దానిచే జ్ఞాన ప్రకాశముగలుగును. జ్ఞానమువలన సకలదురితములునశించి మోక్షసిద్ధియగును" ఇట్లు చెప్పిచెప్పి మహామీనమూర్తి తుదకు సాంఖ్యయోగ క్రియతోడి పురాణసంహిత నుపదేశించెను. సత్యవ్రతుఁడు భగవంతునిచేఁ దెలుపఁబడిన సనాతనబ్రహ్మస్వరూపమును విని కృతార్థుఁడయ్యెను.

అంతలో నిశావసానము సమీపించెను. 'మమ్మెవరును రక్షింపఁజాలరా' యను వేదముల దీనాలాపములు ఘంటానాదములవలె వినవచ్చుచుండెను. అప్పుడు మీనమూర్తి కన్నులెఱ్ఱఁజేసి రాక్షసునిపై నుఱుకుటకు సంరంభింపసాగెను. ఆసన్న యెఱింగి సత్యవ్రతుఁడు నాగబంధమును సడలించెను. తోడనే,—

మ. "ఊఱకంభోనిధిలోని వేదముల కుయ్యాలన్ దైన్యముం జూచి వే
గఱు లల్లార్చి ముఖంబు సాఁచి బలువీఁకన్ దోఁక సారించి మే
న్నెఱయన్ దాఁడలు దీటి మీఁద నెదురన్ మీనాకృతిన్ విష్ణుఁ డ
క్కఱటిన్ దాఁకి వధించె ముష్టిదళితగ్రావున్ హయగ్రీవునిన్."

అంత నిశావసానమయ్యెను. ప్రళయావసానము కూడ నయ్యెను.

సీ. "ఎప్పుడు వేగునం చెదురుచూచుచునుండు, మునుల డెందంబులు ముదము నొందఁ
జెలివితోఁ బ్రక్క నిద్రించు భారతి లేచి, యోరయెయ్యెదఁ జక్క నొత్తికొనఁగ
మలినమై పెనురేయి ముక్కిన తేజంబు, దొంటిచందంబునఁ దొంగలింప
బ్రాణుల సంచితభాగధేయంబులఁ, గన్నుల కొలుకులఁ గానఁబడఁగ
గీ. వనజసంభవు గదలించి యావులించి, నిగురఁ దప్పితి మేల్కాంచి నీగి మలఁగి
యొడలు విఱుచుచు మఁగనుగ్గలుసుము కొనుచు, ధాతగూర్చుండె సృష్టివిధాతయగుచు"

(భాగ. స్కం. 8. ప. 734.)

తరువాత మన్నారాయణుఁడు వేదములను దెచ్చి బ్రహ్మదేవునకిచ్చి పోయె. సత్యవ్రతుఁడు శ్రీహరిని వలంచి జలతర్పణముగావించి వివస్వతుఁడను సూర్యునకు శ్రాద్ధదేవుఁ డను పేరుతో జన్మించి యేడవ మనువయ్యె.

మ. "ప్రళయాంభోనిధిలోన మేన్మఱచి నిద్రం జెందు వాణీశు మో
ముల వేదంబులు గొన్న దైత్యుని మృతిం బొందించి సత్యవ్రతుం
గలరన్ బ్రహ్మము మాటలం దెలిపి సర్వాధారుఁడై మీనమై
జలధిం గ్రుంకుచుఁ దేలుచున్ మెలఁగు రాజన్మూర్తికిన్ మ్రొక్కెదన్."

(భాగ. స్కం. 8. ప 740.)

---

11. భరతుఁడు.

భరతుఁడు మహావైభవసంపన్నుఁడు. ఈతఁడు పదిలక్షలవేల యేండ్లు రాజ్యపాలనము చేసెను. ఈతఁడు పాలించుటవలననే అజనాభ మను పేరుతో నొప్పు నీమహాదేశమునకు భారతవర్ష మను పేరు వచ్చెను. రాజ్యపరిపాలనాకాలమున భరతుఁడు పరమేశ్వరప్రీతిగా ననేక యజ్ఞములను జేసి శ్రీహరియెడల నత్యంతభక్తి గలిగియుండెను. కాల క్రమమున నీతనికి వార్ధకము సమీపించెను. తోడనే భరతుఁడు తన కుమారులపై రాజ్యభారము నుంచి భగవద్ధ్యానము చేసికొని తరించు టకుఁ బులహాశ్రమమునకుఁ బోయెను.

పులహాశ్రమవాసు లగు పరమమునులకు దామోదరుఁ డెప్పు డును బ్రత్యక్షమున నుండును సాలగ్రామశిలలచే నిండియున్న గండకీ నది యాయాశ్రమమును బావనము చేయుచుండును. అచట నాతఁ డనేక విధనవపుష్పపల్లవములతోడను, తులసీదళంబులతోడను, శ్రీహరినిఁ బూజించుచు విషయసుఖములమీఁదికి మనస్సును బోనీయక అరికట్టి శమదమాదిసుగుణశోభితుఁడై విష్ణుభక్తిప్రభావమున సకలకల్మషము లను బాసి, యోగివేషియై యుండెను.

ఇట్లుండ నొకనాఁ డాతఁడు గండకీనదిలో స్నానముచేసిముహూ ర్తమాత్ర మంతర్జలములయందుఁ బ్రణవోచ్చారణము సేయుచుండెను. అప్పుడే నిండుచూలా లగు నొక లేడి భరతుఁ డున్నచోటికిఁ గొంచెముఁ పైని నీళ్లుత్రావుచు బ్రహ్మాండభాండము బ్రద్దలుసేయు విలయమేఘగర్జ వలె హృదయవిదారణం బగు సింహనాదము నాలకించి యులికిపడి ప్రాణభయంబున నున్నట్లుండఁగా నది దాఁటిపోవుటకు ఆకసమున కెగి రెను; గాని దైవవశమున గర్భస్థ మగు హరిణకిశోరము నీటిలో జాఱి పడిపోయెను. లేడియు నవ్వలియొడ్డున నొక రాతిపైఁబడి ప్రాణములు విడిచెను.

ఈగందరగోళ మంతయు విని భరతుఁడు కన్నులువిచ్చి చూచు నప్పటికి లేడిపిల్ల నీటిలో విలవిలఁ దన్నుకొనుచుండెను. దానినిఁ జూచి హృదయము కరుగఁ దటాలునఁ బట్టుకొని భరతుఁడు తన పర్ణకుటీర మును జేరుకొనియెను. పిదప నాతని చిత్తము లేడిపిల్లపై గాఢాను

రాగభరితమయ్యెను. తుదకు పోషణపాలనప్రీణనలాలనానుధ్యానముల భరతుని హృదయము చలించి యష్టాంగయోగసమాధినుండియు, శ్రీహరిపూజాపరిచర్యాదులనుండియు విచ్యుతమై పోయెను.

భరతుఁడా లేడిపిల్లను ఆసనశయనాటనస్నానసమిత్కుసుమఫలపలాశమూలోదకాహరణ దేవపూజజపాదులయెడలఁ గూడఁ బాయఁజాలక పోయెను. నిత్యనైమిత్తికాదిక్రియాకలాపములయందుఁ గూడ నడుమనడుమ దానినిఁ జూచి లాలింపకుండ నుండఁజాలక పోయెను. వృకసాలావృకాదిక్రూరమృగంబులవలని భీతిచే నెచ్చటకుఁ బోయిన నచ్చటికిఁ గొనిపోవసాగెను. మఱియు నధికప్రణయభరపరితహృదయుం డగుచు గొంతసేపు స్కంధముల వహించియుఁ గొంత తడవు ఉరంబున నుంచుకొనియు, మఱికొంతప్రొద్దు ఉత్సంగంబున నుంచుకొనియు నిట్లు లాలించి యానందింపఁజొచ్చెను. తేపతేపకును దీర్ఘాయువుగా దీవించుచు మాటిమాటికిని ముద్దుగొనుచు నతిమోహమునఁ బెంచుచుండెను

ఇట్లు కొన్నిదినములు జరుగునప్పటికి లేడిపిల్ల తేఱికొనియెను. తన కష్టము ఫలించినదిగదా యని భరతుఁ డానందించుచుండఁగా నొకనాఁ డది కాన్పింపకుండ నెచ్చటకో పాఱిపోయెను. ఇఁక భరతుని యవస్థ సెప్పనేల? వ్యాకులితచిత్తుఁడై, అతిదీనుఁడై తద్విరహము నోర్వఁజాలక "హరిణపోతమా! వనమున మృగబాధ లేవియు లేకుండునట్లు నిన్నతిభద్రముగఁ గాపాడితిని. నన్ను విడిచి యేల పోయితివి? అయ్యో! నీవు నా కెచ్చటఁ గాన్పింతువు? ని న్నెట్లు దక్కించుకొందును? నీవు నాయాశ్రమమునందలి తృణచయము మేసి పొదలితివి. తుదకు నీ వేక్రూరమృగమువాతఁ బడిపోయితివో. నీవెప్పుడు వచ్చి నన్ను సంతోషపఱుతువు? నానాప్రకారములైన గతులచే న న్నెప్పు డానందింపఁజేయుదువు? నేను ధ్యానసమాధి నున్నప్పుడు నన్ను గొమ్ముల గోకి యెప్పుడు సుఖింపఁ జేసెదవు?" అని యాతఁడు లేడిపిల్లమీఁది భ్రాంతిచే సకలమును మఱచిపోయెను.

ఇట్లాతఁడు తద్విరహవ్యథచేఁ గృశించుచుండఁగా హఠాత్తుగ నొకనాఁ డది యాతని కన్నులఁ బడియెను. అది ప్రత్యక్షమగుట భరతునకు భగవంతుఁడు సాక్షాత్కరించిన ట్లయ్యెను. అది తిరోహితమై

నప్పు డెంతదుఃఖముఁగలిగెనో మఱలఁ బ్రత్యక్షమైనపిదప నంత సంతో షము గలిగెను. ఇట్లు కొంతకాలము జరుగుచుండఁగా భరతున కంత్య కాలము సమీపించెను. పాప మాతనికి హరిణకిశోరముతోఁ జిరకాల మానందించుచు నుండుటకు వీలులేకయేపోయెను. "అయ్యో! ఈహ రిణకిశోరముదౌర్భాగ్యమువలన నాకవసానకాలము తటస్థించినది. ఇఁక దీని కాధారమెవరు? దీని నాదరముతోఁ బెంచువా రెవరు?" అని విచారించుచు తుద కాతఁడు ప్రాణములను బాసెను. హరిణకిశోర ముమీఁది యీయనంతవ్యామోహమువలన నాతఁడు హరిణీగర్భ మున హరిణమై జన్మించెను.

ఇట్లాతఁడు లేడికడుపున బుట్టినను దొల్లి భగవద్ధ్యానతత్పరుఁ డై యుండెఁ గావునఁ దన హరిణత్వమునకుఁ గారణమెఱింగి యాతఁడు:-

ఉ. "రాజులు ప్రస్తుతింప సురరాజసమానుఁడనై తనూజులన్
రాజిలఁజేసి తాపసులు రాజఋషీంద్రుఁ డటంచుఁ బ్రస్తుతిం(?)గాఁ
దేజమునొంది యీహరిణదేహమునందలి ప్రీతిఁజేసి నా
యోజసెడంగనేఁ జెడితి యోగిజనంబులలోనఁ బేలనై" (భాగ. స్కం 5 ప. 116.)

అని వగచుచుఁ దల్లినిఁ బాసి యెట్లెట్లో పులహాశ్రమముఁ జేరి శుష్కపర్ణములనుదిని యచిరకాలమున దేహముఁ బాసి యొక బ్రాహ్మ ణుఁడై పుట్టెను.

అవాంతరవిపత్తువలన జ్ఞానము గలిగి ముక్తసంగుఁడై కర్మబం ధములను భస్మీపటలము గావింపఁ జాలు శ్రీహరిని శ్రవణమననధ్యా నాదులఁ బూజించుచు భరతుఁడు కాలము గడుపసాగెను. భరతుని తండ్రియగు ఆంగిరసుఁ డను బ్రాహ్మణున కిరువురుభార్య లుండిరి. అందు బ్రథమభార్యయందు దొమ్మండుగురు పుత్రులును ద్వితీయభా ర్యయందు ఇరువురు పుత్రులును గలిగిరి. ఆంగిరసుఁడు కుమారుల కం దఱకును జౌలోపనయనాదికర్మలం గావించి వేదవిద్య గఱపసాగెను. భరతుఁడు తండ్రి సెప్పునవి యెల్ల నిష్టములేకున్నను మాఱుపల్కక సేయుచు సంగభీతుఁడు గావున జనులు తన్నుఁ రోయుటకై యున్మత్త జడాంధబధిరరూపములతోఁ బ్రవర్తింపఁజొచ్చెను.

ఇట్లుండఁ గొన్నిదినములకు ఆంగిరసుఁడు చనిపోయెను. భరతుని తల్లి భర్తతో ననుగమనము చేసెను. ఇంటి పెత్తనము సవతితల్లి కుమా

రులకు సంక్రమించెను. సాపత్నీసోదరులకు సోదరప్రేమ యుండదుగదా? భరతుని సవతియన్నలు అతని యున్నతిని సహింపఁజాలక విద్యాభ్యాసము మానుపించి గృహకృత్యములలో నియమించిరి. హరిచరణధ్యానమునఁదక్క దేనియందు నాసక్తిలేనివాఁడు గావున భరతుఁ డందులకు సమ్మతించెను; గాని గృహనిర్వహణమున నాతనికి మోహముమాత్రముగలుగలేదు. తండ్రి చెప్పిన విద్య నెంతముఖ్యముతో నభ్యసించెనో, సవతిసోదరులు నియమించిన గృహనిర్వాహకముగూడ నాతఁ డంతనైముఖ్యముతోడనే ప్రారంభించెను.

విషయవిముఖుఁ డగుట నాతనికి ఆత్మనిత్యానందసుఖలాభము గలిగెను. ఈకారణముచే నాతని కైహికసుఖదుఃఖములయెడల దేహాభిమానము నశించెను. శీతోష్ణవాతవర్షాతపంబులకు మీఁద వస్త్రము గప్పుకొనుట మాని వృషభమువలె పీనుఁడును, గఠినాంగుఁడునై, స్థండిలశాయియై, పరాగపిహితం బగు దివ్యరత్నము వలె నవ్యక్తబ్రహ్మవర్చసుఁడై మలినవస్త్రములఁదాల్చి మషీలిప్తయజ్ఞోపవీతుఁడై, యుండుటఁజేసి మూఢు లాతనిని బ్రాహ్మణాభాసుఁ డనియు మందుఁ డనియుఁ బిలువసాగిరి. కొంద అవివేకు లాతనినిఁ బిచ్చివాఁడా యని పిలిచినఁ బిచ్చివానివలెనే పలుకుచుండెను. చెవిటివాఁడా యనిన చెవిటివానివలెనే ప్రత్యుత్తర మిచ్చుచుండెను. ఇట్లుండ నాతనిని సవతిసోదరులు గృహనిర్వహణోద్యోగము నూడఁబెఱికి చేనికాఁపునకు నియమించిరి. అందులకు వ్యతిరేకము సెప్పక భరతుఁ డదియే చేయసాగెను. ఊఁక తవుఁడు తెలికపిండి పొట్టు మున్నగునవి యాహారముగాఁ బెట్టినను భరతుఁడు వానిని అమృతమువలె భక్షింపసాగెను. ఇట్లాతఁడు సకలైహికసుఖదుఃఖములయందును సమానముగ నడచుచు వాని సంటక కాలము గడుపుచుండెను.

వృషలరాజు అనువానికి సంతానము లేకపోయెను. కాళికి బలి యిచ్చుటకై పురుషపశువును గొనిరండని యారాజు భటులకు సెలవిచ్చెను. రాత్రియంతయుఁ దిరిగిరి; గాని వారి కెవరును గాన్పింపరైరి. నిస్పృహచేసికొని వారు పోవుటకుఁ దలంచుచుండఁగా నాకస్మికముగ భరతుఁడు కన్నులఁ బడియెను. తోడనే రాజభటులు "మంచిపశువు దొరకెరంపు"అని భరతునిఁ గొనిపోయి అభ్యంజనము మున్నగు సకలవిధు

లను నెఱవేర్చిరి.అంతన్నృపలరాజు చనుదెంచిచక్కఁగనలంకరింపఁజేసి మృష్టాన్నంబులు భుజియింపఁబెట్టి, ధూపదీపమాల్యలాజకిసలయాంకురఫలోపహారాదులు సమర్పించి మహావాద్యఘోషముతో భరతునిఁ గాళికాదేవిసమ్ముఖమునఁ గూర్చుండఁజేసి కరాళఖడ్గమును జేతఁగొని కాళికాదేవి ప్రీతినిమిత్తము తెగ వ్రేయఁబోయెను.

అప్పుడు భరతుని శరీరమున నఖండబ్రహ్మవర్చస్సు ఉదితంబయ్యెను. దానినిఁ జూచి కాళికాదేవి భీతచిత్తయై, వృషలరాజుపైఁ జాల నాగ్రహించి సపరివారముగ వానిని నాశముచేసెను. భరతుఁడు ఏమియు నెఱుంగనివానివలె శాంతుఁడై చంపవచ్చినవారియందును, ఖడ్గమునందును, గాళికాదేవియందును గూడ హరిభావము ఉంచి విష్ణుమూర్తినిఁ గొనియాడి పోయి చేనికి యథాపూర్వముగఁ గావలియుండెను.

ఇట్లు కొంతకాలము జరుగునప్పటికి సింధుదేశాధిపతి యగు రహూగణుఁడు ఇక్షుమతీతీరమున నున్న కపిలమహామునివలన తత్వవిజ్ఞానము నెఱుఁగఁగోరి పల్లకిపై బయలుదేఱెను. బోయలు భరతునిఁజూచి 'వీఁడు చాల బలిసియున్నాఁడు. పాలకి నతిసులభముగా మోయఁగలఁడు' అని తలఁచి బలవంతము చేసి పాలకి వాని భుజముపైఁ బెట్టిరి. భరతుఁడును మాఱుపలుకక బోయలు చెప్పినట్లు నడువసాగెను. అయినను పల్లకీ మొయ్యమును మోసియుండనిపోవుటచే మిట్టపల్లములు వచ్చినప్పుడు చాలకష్టపడి నడువసాగెను. ఈకారణముచేఁ బాలకిలోఁ గూర్చున్న రాజునకుసుఖము లేకపోయెను. ఆతఁడు బోయలపైఁ గోపింపఁగా వాండ్రు "దేవరా! మావలనఁ దప్పులేదు. ఏలినవారికీయాయాస మంతయు నీ నాల్గవవానిచేఁ గలుగుచున్నది" అని విన్నవించిరి.భరతుని రాజెంతయో మందలించెను; గాని ప్రయోజనము లేకపోయెను. తుదకు రాజు మహోగ్రముగ నుండిపడి "నీవీపు బ్రద్దలుచేయించెదఁ జూడు" మని గద్దించి పలికెను. అంత భరతుఁడు రాజు నారసి "రాజా! నీవు చేయించెదనన్న శిక్ష యీశరీరమునకే గాని నాకు లేదు. స్థౌల్యకార్శ్యములు, ఆధివ్యాధులు, క్షుత్తృష్ణలు, ఇచ్ఛావిరోధభయంబులు, జరామరణంబులు, రోషనిద్రాజాగరణంబులు, అహంకారమమకారములు నశోషణాదులు ఈ దేహమునకే గాని నాకుఁ గలుగనేరవు. నీవు రాజభావము కలవాఁడవు

గావున నన్ను శిక్షించెద ననుచున్నావు; గాని నేను ఈశరీరముపై నభిమానము లేనివాఁడను. అట్టి నాయెడల నీశిక్ష లేమి లాభకరములు?" అని పలికి మఱల యథాప్రకారముగ శిబిక మోయసాగెను. ఈసంభాషణమున రహూగణుని గర్వతమస్సంతయుఁ బటాపంచలైపోయెను. ఆతఁడు తత్త్వజ్ఞానార్థమై పోవుచున్నాఁడు గావున భరతుని మాటలవలన నాతఁ డొక మహాయోగి యని యెఱింగి తటాలున శిబికనుండి యుఱికి భరతునకు సాష్టాంగనమస్కారము లాచరించి "మహాత్మా! అవధూతవేషివై నీవొంటిగా నిచ్చట నేల సంచరించుచుంటివి? నీ ఘనత తెలియనేరక నేను నీయెడల మహాపరాధము జేసితిని. నాతప్పులు మన్నింపుము నీమాటలు యోగిజనోచితములై యున్నవి. నేను కపిల మునీంద్రునివలన తత్త్వజ్ఞానము బడయఁగోరి పోవుచున్నాను. నీవు లోక పరీక్ష సేయుటకై యవ్యక్తరూపుఁడై చరించు కపిలమహామునివని తోఁచుచున్నది. మందబుద్ధు లగు మాబోంట్లు యోగీశ్వరులచరిత్రము లెట్లెఱుఁగనేర్తురు? నీవార్తబంధుఁడవు. అసమర్థులైన నావంటివారు మహాజనావమానమువలన శీఘ్రముగ నశింతురు. కరుణించి నన్ను రక్షింపుము" అని ప్రార్థించెను.

అంత భరతుఁడు రహూగణునకు సకలసృష్టిరహస్యములను వివరించి తత్త్వజ్ఞానము బోధించెను. రహూగణుఁడు కపిలమహామునివలనఁ బడయఁదలఁచిన పరమార్థమును భరతునివలననే పడసి చరితార్థుఁడయ్యెను. ఇరువురును గూడ తుదకు విష్ణుసాయుజ్యమును బడసి ధన్యులైరి.

సీ. "నారాయణుని దివ్యనామాక్షరములపైఁ, గరఁగని మనములు కఠినశిలలు
మురవైరి కథలకు ముదితాశ్రురోమాంచ, మిళితమై యుండని మేను మొద్దు
చక్రికి మ్రొక్కని జడుని యౌఁదలనున్న, కనకకిరీటంబు కట్టెమోపు
మాధవార్పితముగా మనని మానవు సిరి, వనదుగ్ధచంద్రికావైభవంబు
ఆ. కైటభారిభజన గలిగియుండనివాఁడు, గాలిలోన నుండి కదలు శవము
కమలనాభుపదము గనని వాని బ్రతుకు, పసిఁడికాయలోని పాపిణిబ్రతుకు."
(భాగ. స్కం. 2. ప. 51)

12. రుక్మాంగదుఁడు

సుగుణాలవాలుఁడైన రుక్మాంగదమహారాజు విదిశాపురము రాజధానిగా ప్రజాపాలనము సేయుచుండెను. కొందఱు రాజులవలెనాతఁడు ప్రజలను బీడింపక బిడ్డలవలె భావించుచుఁ జాల సుఖపెట్టుచుండెను. ఒకనాఁడు ఆతఁడు నిండుకొలువున కొలువుదీఱి యుండఁగా నొక యతీశ్వరుఁడు వచ్చెను. రాజు యతిని అధికభక్తితో అర్ఘ్యపాద్యము లిచ్చి పూజించి మహాదరముతో నారగింపఁజేసి సేవించెను. అంతట నాయతి రాజు సేవ కెంతయు నానందించి "రాజా! నీసౌజన్యమువలన నాకానందమైనది. లోకములోఁ బ్రజలను బిడ్డలనువోలెఁ గాపాడు రాజులును, శ్రీహరియెడల విశేషభక్తియుక్తులగు ప్రభువులును అనేకులు గలరు; గాని వారందఱును నీవంటివారు గారు ఇట్టి నీవు ఆచరింపవలసిన వ్రతము ఒకటి గలదు. అది యేకాదశీవ్రతము. దాని నాచరించువారికి మోక్షము కరతలామలక మగును" అని దాని నాతని కుపదేశించి అది యాచరింపవలసిన విధు లన్నియుఁ దెలిపి దీవించి వెడలిపోయెను.

యతీశ్వరుని యాజ్ఞాప్రకారము రాజు ఏకాదశీవ్రతము తాను ప్రారంభించుటయేగాక "దేశమునందలి యెల్లరును ఈవ్రతము నాచరింపవలయును; అట్లు గానివారిని కఠినముగ దండించెదము" అని దేశము నలుమూలలను జాటింపించెను. రాజాజ్ఞవలన నెల్లరు నేకాదశీవ్రతము ప్రారంభించిరి. ఏకాదశినాఁడును, ద్వాదశినాఁడును ఆ దేశమున నేయింటఁ జూచినను వారివారికి తగిన వైభవముతో శ్రీహరిని బూజింపనివారు లేరైరి. హరికీర్తనములు, హరిభజనములు నేమూలఁ జూచినను చెవులపండువు సేయసాగెను. ఆ రెండుదినములయందును స్త్రీపురుషులు ఆబాలగోపాలముగ సకలమును మానిహరిభజనమునందే ప్రవృత్తులై బ్రహ్మానందము ననుభవింపసాగిరి

ఇట్లుండఁగా రాణి యగు సంధ్యావళీ దేవి గర్భమును దాల్చి నవమాసములును మోసి మంచిలగ్నమున బాలసూర్యునివలెఁ బ్రకాశించు చక్కని కుమారునిఁ గనియెను. రుక్మాంగదుఁడు పుత్త్రోదయమునకు ఎంతయు నానందించి విద్వాంసులకు గొప్పగొప్ప బహుమానములు

సేసి ప్రజల నెల్లరను జాల నానందపఱిచెను. మఱియు నొక సుముహూర్తమునఁ గుమారునకు ధర్మాంగదుఁడు అని నామకరణము చేసెను.

భగవదనుగ్రహమువలన ధర్మాంగదుఁడు పలుక నేర్చినది మొదలు కృష్ణా, మాధవా యని పిలుచుచు హరికీర్తనము సేయుటయు, నడువ నేర్చినది మొదలు చప్పటులు చరచుచు నృత్యము సేయుటయు, ఊహింప నేర్చినది మొదలు శ్రీహరిని ధ్యానించుటయుఁ బ్రారంభించెను. తనకు అట్టి భాగవతాగ్రగణ్యుఁడు కుమారుఁడైనందునకు రుక్మాంగదుఁడు మిగుల నానందించుచు సర్వేశ్వరుని అనేకవిధముల వినుతింప సాగెను. ధర్మాంగదుఁడు గూడ నేకాదశీవ్రతము ప్రారంభించెను. ఇట్లు రుక్మాంగదుని ప్రజలు ఆబాలగోపాలముగ నేకాదశీవ్రతము చేయుచుండుటవలన నరకమార్గము నిర్జనమయ్యెను. దారియందంతటను గడ్డియు, తుప్పలును పెరిగిపోయెను. అంతకుమున్ను పాపములు చేయుటవలన నరకలోకమునకుఁ బోయినవారెల్లరును భూలోకమునఁ దమ పుత్రులు పౌత్రులు మున్నగువారు చేయు నేకాదశీవ్రతప్రభావమువలన నరకమును విడిచి వైకుంఠమునకుఁ బోయిరి క్రొత్తనీరు రాకపోవుటయు, నున్న ప్రాతనీరు గట్టు తెగిపోవుటవలనఁ బోవుటయు సంభవించునపుడు చెఱువు ఎట్లుండునో నరక మట్లే నిర్జనమైపోయెను. యమదూతలు చేయునది లేక పరికరములను మూలఁబడవేసిరి చిత్రగుప్తుని పుస్తక మంతయు పుణ్యాత్ముల చరిత్రలతోడనే నిండిపోవుచుండెను. ఇందునకుఁ గారణము తెలియకయు, తన ప్రభుత్వము ఇట్లు బగ్గంపాడై పోవుటయుఁ జూచి యముఁడు చాల విచారించుచుండఁగ నారదుఁడు వచ్చెను. యముఁడు అడుగఁగా నారదుఁడు రుక్మాంగదుని యాజ్ఞానుసారముగ దేశమునందలివారెల్లరును ఏకాదశీవ్రతము చేయుచుండుటయే యిందునకుఁ గారణమని చెప్పెను "ఎంతపని జరిగినది. మానవమాత్రులు నన్నింత లోకువ చేసిరి?"యని వగచుచుఁ దోడనే యముఁడు బ్రహ్మసభకుఁ బోయెను.

అట యముఁడు నిండోలగమునఁ గొలువుదీఱియున్న బ్రహ్మకు సాష్టాంగదండప్రణామము లాచరించి తనదైన్యము నంతను విన్నవించి "మహాత్మా, ఈయధికారము నాకు వలదు. నీచిత్తమువచ్చినట్లు చేసికొనుము." అని కాలదండము కాలపాశము మున్నగువానిని ఆతని పాద

ములచెంత నిడి యూరకుండెను. అంత బ్రహ్మ మందహాసము గావించి "శమనా, ఏల నీయధికారమునాకు వప్పగించివేసెదవు? ఇంత తొందర యేల? ఆరుక్మాంగదుఁ డాచరించుచుఁ దన దేశప్రజలచేనాచరింపజేయు చున్న వ్రతము అట్టి ప్రభావము గలదై యున్నది. శ్రీహరి నాశ్రయిం చిన వారికిని, వారి వారికిని దురితము లెట్లుండును? వినలేదా?

ఉ. "శ్రీహరిఁ బోలు దైవమును శ్రీహరిభక్తులఁ బోలు మానవుల్
శ్రీహరివాసరవ్రతవిశేషఫలంబునఁ బోలు ధర్మసం
దోహము లేదు సమ్మదముతో హరిఁగొల్చిన వారి కెల్ల సం
దేహము లేదు చేకురు ననేకశుభోన్నతభోగమోక్షముల్.

క. పావనములు కలివిధ్వంసం, జీవనములు విజితమృత్యుజీవనములు ధ్యా
త్యావనములు చింతితసం, భావనములు వాసుదేవుపదసేవనముల్.

క. స్ఫురితంబులు దూరీకృత, దురితంబులు మృత్యుభయవిదారితంబులు భూ
భరితంబులు హతరోగ, త్వరితంబులు చక్రపాణిపరచరితంబుల్".

(రుక్మాంగదచరిత్ర. ఆ. 2. ప. 50-51-55)

బ్రహ్మ యీతీరున విష్ణుసేవాప్రభావమునెఱింగించి "యముఁడా, ఇప్పుడేమి చేయవచ్చును? మనము తెలివితక్కువపని చేసినచో శ్రీపతి కోపించి లోకములను భస్మము చేయును. కావున నేను ఎట్లో నీయుపద్రవమును దొలఁగించెదఁ బోయిరమ్ము" అని యముని పంపివేసి తానే సకలలోకములయందలి రమణులకునుశృంగభంగముగావించు నంతటి సౌందర్యముగల మోహిని యను నొక కన్యను సృజించెను. ఆమెను జూచి కొలువునఁ గల యెల్లరు నబ్బురపడుచుండ బ్రహ్మ "రమణీ, రుక్మాంగదుఁడు చేయు వ్రతమాహాత్మ్యమువలన దేవలోకములు తలడిల్లుచున్నవి. కావున నీవు పోయి ఆతని వ్రతమును మాత్రము చెఱిపి రమ్ము; కాని యిది యెంతపని యని తలంపకుము అంతటి ధీరుని ఇఁక నెందును జూడఁబోము. నీవు నిర్లక్ష్యముగా నుందువేని అవ మానము గలుగును. యముని కార్యము చెడిపోవును. సృష్టినియమమునకు భంగము వాటిల్లియుండుటచే లోకములు తలక్రిందులై పోవును." అని చెప్పి నుఱికొందఱు సుందరులను సృజించి యామెకుఁ దోడుగా నిచ్చి పంపివేసెను. మోహిని చెలికత్తెలతో నరిగి మందరపర్వతముమీఁద వసించెను.

అంతట బ్రహ్మచే ప్రత్యేకముగా సృజింపఁబడిన వివిధక్రూర జంతువులు వనమెల్ల నిండి గ్రామములపైఁ బడి సస్యముల నెల్ల నాశనము చేయసాగెను. వానిబాధ కోర్వఁజాలక ప్రజలు గుంపులుగుంపులుగఁ బోయి తమ యిడుములఁ దొలఁగింపవలసిన దని రాజును వేఁడుకొనిరి. తోడనే రుక్మాంగదుఁడు రాజ్యభారమును కుమారునిమీఁద నిడి తాను యోధులను వెంటఁగొని వేఁటకు బయలుదేఱి పోయెను. ఒక్క క్షణములో నడవియందలి జంతువు లన్నియు నాశనమయ్యెను; గాని రాజుకు ఒక్క పెద్దపంది కాన్పించెను. దానిని సంహరింపనివాఁ డేటి వేఁటకాఁడని యాతఁడు దానిని వెంబడించెను. ఈకర్మ మెఱుఁగని పరివార మచ్చటనే యుండిపోయెను. పంది రుక్మాంగదుని సుందరపర్వతమునకుఁ దీసికొని పోయి మాయ మయ్యెను.

చూచుచుండఁగనే కనుమఱుఁగై తొలఁగిపోయిన పందిని విడిచి రాజు సుందరపర్వతసౌభాగ్యము నరయుటకుఁ బ్రారంభించెను; అచ్చట నొకచో ఇష్టకామేశ్వరస్వామి యాలయము కాన్పించెను. రాజు స్వామిని సేవింప నచ్చటికిఁ బోఁగా నందు మోహిని కరములు జోడించుకొని

సీ. "కదలిపోలని తేటవిదారుంబని పేరు, మెఱుఁగా ముఱుఁగా నెఱుఁగఁడేని
సానఁబెట్టని యమ్మ మనఁ బెట్టినసొమ్ము, పెట్టఁగాఁ బెట్టఁగా బుట్టఁడేని
కంతుగంధర్వుఁ బూఁత వింతచందపు మేఁత, పూయఁగా మేయఁగా డాయఁడేని
మింటఁబుట్టని ఘోర మొంటఁగిట్టని పేర, తలయందు మొలయందు నిలుపఁడేని
గీ. మెఱుపువిల్లువిలాసంబు నోఁచు విల్లు, గలుగు నుతికెక్కు నని నాకరము లెత్తి
మొక్కెదను నిన్నంటి దైవసమూహములకు, క్షేత్రసంగ యిష్టకామేశలింగ".
(రుక్మాంగదచరిత్ర. ఆ. 2. ప. 135.)

అని స్వామినిఁ బ్రార్థించుచుండెను. రాజు తటాలున నామెను జూచి అతిలోకరమణీయమగు నామె లావణ్యమునకు ముగ్ధుఁడై, తానువచ్చిన స్వామి సేవనుమఱచి యామె బైటకెప్పుడువచ్చునని యెదురుచూచుచు గడియ యొక యుగముగా మంటపమునఁ గూర్చుండెను. కడకంటిచూపులతో నిది యంతయుఁ జూచుచున్న మోహిని యిది యేమియు నెఱుఁగనట్లు నటించుచు నతివిలాసముగ నివ్వలకు వచ్చెను. సఖులామె వెనుకనే వచ్చిరి. ఆమె సౌందర్యము రాజునకు మఱింత విస్పష్టముగఁ

గాన్పించెను. అంత మోహ మగ్గల మగుడు నాతఁడు లేచి వారి కెదురు గాఁబోయెను. మోహిని రాజు నారసి ఉలికిపడినట్లును, నివ్వెరపడినట్లును, సిగ్గుపడినట్లును నటించి కొంచెము వెనుకకు తొలఁగెను. చెలికత్తెలు “చెలీ, ఇది తగునా ? ఈమహాపురుషున కాతిథ్యము నిమ్ము” అని యామెను ఆతనిని ఒండొరుల కెదురుగఁ గూర్చుండఁ జేసి అర్ఘ్య పాద్యాదికములకుఁ బూవులు మున్నగునవియుఁ దెచ్చెదమని తలకొక దారినిఁ బోయిరి. అప్పుడు రాజు లజ్జాభరాలసవోలె తలవంచికొని యున్న మోహిని చెంతకుఁ జేరి మెల్లఁగ మోమెత్తి లాలించి బుజ్జగించి యామె యంగీకారము నూహించుకొని తటాలున నామెను బిగికౌఁగిట నదిమి కపోలములు చుంబించెను. ఆమెయు నప్పుడు స్త్రీస్వభావమును బ్రకటించెను. గాని ఆమె రాజు మఱలఁ గౌఁగిలింపఁ దలఁచునపుడు అలసవోలె చేతులలో వ్రాలియు ముద్దుగొనఁ దలఁచునపుడు బుగ్గలొగ్గియు నాతని మోహమును వృద్ధిచేసెను. పిదప రాజు తనయభిప్రాయము నెఱింగించెను. రెండవమాఱు ఎఱింగించువఱకు నూరకుండి యామె “రాజులు దేవీశతపరివృతులై యుందురు. అందకత్తెలను జూచినపుడు వారిని దమ యంతఃపురము చేర్పదలఁతురే గాని తరువాతఁ గన్నెత్తి చూడరు” అని మెల్లఁగఁ బలికెను. అందులకు రాజు “రమణీ, నీవనినట్లు నేను దేవీశతపరివృతుఁడనే, అందఱయందును నాకు సంధ్యావళి పట్టమహిషి. ఆమెయె నాకు ప్రియతమ. నిన్ను పట్టమహిషిగాఁ జేయవీలు లేదు; గాని ఆమెకన్న నిన్నే ఎక్కువ ప్రేమించెదను. నీకు సందియము వలదు. నన్ను బ్రతికింపు” మని గడ్డముపట్టుకొని బతిమాలెను. అంతకు నామె వినకుండుటఁ జూచి రాజు “మోహినీ, నాతొల్లిటి భార్య లందఱును నీ కూడిగపుగత్తెలై యుండునట్లు చేసెదను. నాకుమారుని నీ సేవకునిగా నియమించెదను. నాపట్టమహిషితో మాటాడకపోవుటయే గాక ఆమెను జూడను. నీవు చెప్పినపనిచేసెదను. నీమాట కడుగు దాఁటను. నీవు అగ్గిలో నుఱుకుమన్న నుఱుకుదును; కాని యిప్పుడు నామాటవినుము. ఇట్లు చేసెద నని యీ యిష్టకామేశ్వరుని యెదుట శపథముచేసి చెప్పుచున్నాను” అని యామె చేతిలోఁ జేయివేసి బతిమాలెను. తోడనే యామె “ఇందులకుఁ దప్పఁగూడదుసుమా” యని యంగీకరించెను. పిదప నిరువురకును గాంధర్వవివాహము నెఱవేఱెను. అంతట రాజు—

సీ. "దంభోళిధరసతీతాంబూలపేటీషు, దహనబింబాధరీస్తనభరేషు
శమనశుద్ధాంతయోషాఫాలభాగేషు, నిరృతిసాధ్వీముఖనీరజేషు
కంధినాయకబాలికాకర్ణపత్త్రేషు, గంధవహాంగనాకచభరేషు
రాజరాజాంతగపురస్త్రీకరాగ్త్రేషు, కరకంఠభామినీకటితటేషు
గీ. చంద్రికలంతి హారంతి చందనంతి, విశదహాసంతి హీరంతి విచికిలంతి
దర్పణంతి దుకూలంతి తవయశాంసి, క్లేశభవభంగ యిష్టకామేశలింగ."

(రుక్మాంగదచరిత్ర. ఆ. 3. ప 139.)

అని దేవతానమస్కారము గావించి మోహినితోఁ బయలుదేఱి పోయెను.

రుక్మాంగదుఁడు నగరోపకంఠమునందలి ఉద్యానవనమునఁ బ్రవేశించెను. పరిచారకులు చూచి యీసంగతి నగరునఁ దెలిపిరి. తోడనే ధర్మాంగదుఁడు మంత్రులు సామంతులు మున్నగువారితో మహావైభవము సెలంగఁ దండ్రిని నగరునకుఁ గొనిపోవుటకు వచ్చెను. రాజును కుమారుని నమస్కారము లందుకొని దీవించి మోహిని వృత్తాంతము నెఱింగించి యామెకు మ్రొక్కించి మంత్రిసామంతాదులను గౌరవించి నగరునకుఁ బోయెను అచ్చట నాతని దేవు లందఱును వచ్చి నాథుని దర్శించి క్రొత్తగా నొకతెను దీసికొనివచ్చినందులకు విచారించి వెడలి పోయిరి. పట్టమహిషి యగు సంధ్యావళీమాత్ర మట్లుగాక భర్తవలన శపథము సమస్తమునువినియు నీర్ష్యవహింపక ఓచారము నెఱుంగక ముఖమునందలిమందహాసమున కుదాసీనఁ జెప్పకయే మోహిని ననేక విధముల నాదరించి యామెకుఁ దగిన సౌకర్యములనన్నిఁటికి ఒనఁగూర్చెను. ఆమె అకృత్రిమతత్వమును జూచి మోహిని యాశ్చర్యచకిత యయ్యెను. రాజు వింతపడెను. ధర్మాంగదుఁడుగూడ మోహినియెడలఁ దల్లివలెనే ప్రవర్తించెను. పిదప ధర్మాంగదుఁడు రాజముద్రికను సమర్పింపఁబోవ రాజు "వత్సా, కొన్నిదినము లింకను నీవే ప్రజాపాలనము సేయుచుండుము. నేనిపుడు వేఁటకారణమున బడలి యుంటినిగదా?" యని చెప్పెను. ధర్మాంగదుఁడు పిత్రాజ్ఞను శిరసావహించెను. రుక్మాంగదుఁడు మోహినితోడిదే లోకముగా నుండెను.

పదిదినములు గడచునప్పటికి ఏకాదశి వచ్చెను. ధర్మాంగదుఁడు వ్రతమునకై నగరున సకలప్రయత్నములను జేయించి యథాప్రకార

ముగ "నేఁడు ఏకాదశి కావున నందఱును నియతాత్ములై వ్రతము సేయవలయును. అట్లు సేయనివారు దండింపఁబడుదురు" అని చాటింపు సేయించెను. ఈపదిదినములును రుక్మాంగదుఁడు రాత్రింబవళ్లను భేదము తెలియక మోహినితో నుండెను. అతఁడు మేడమీఁదఁ గూరుచుండి మోహినితో ముచ్చటలాడుచుండఁగా నీచాటింపు వినిపించెను. తోడనే యాతఁడు తటాలున లేచి "దేవీ, నాకు సెలవిమ్ము. నేఁడు నేను ఏకాదశీ వ్రతము నిర్వర్తింపవలసియున్నది" అని బతిమాలెను. ఆవ్రతమును భగ్నముచేయుటకై వచ్చిన మోహిని యాతని కెట్లు సెలవిచ్చి పంపును? ఆమె యేమియు నెఱుఁగనట్లు పోవలదని నిషేధించెను. మన్మథుఁడు నాపై వాఁడిబాణములు విడుచుచున్నాఁడు. నన్ను రక్షింపుము" అని యామె రాజును కౌఁగిలించుకొని అధరము నానఁబోయెను.

నియతాత్ముఁడగు రాజు తటాలున నామె కౌఁగిలి విడిపించుకొని "దేవీ, నేఁ డిట్టి పను లేమియుఁ గూడవు. సహించుకొనుము. క్షణభంగురములగు తనువులమీఁది భ్రాంతిచే శాశ్వతానందప్రదమగు మోక్షసాధనోపాయమును మఱచుట లగ్గుగాదు; గావున నీవుగూడ నీవ్రతము నవలంబింపు"మని చెప్పెను. మోహిని "నాకామాట లేమియు విన్పింపవు. క్షణము ఉన్న నాప్రాణములు నిలువవు. నన్ను కౌఁగిటఁ బొదివిపట్టుము" అని మీఁదికివచ్చి కౌఁగిలించుకొనఁబోయెను. అంతనప్పుడు రాజునకు నామెకును వాదోపవాదములు ప్రారంభమయ్యెను. ఎంత చెప్పినను రాజు మోహినిమాటలు వినక తుదకు,—

సీ. "రాజసూయాదిసత్క్రతుదీక్షలందైన, మఱవ యేకాదశి మానరాదు
కల్యాణకమనీయకాలంబులందైన, ఎన్ని యేకాదశి వదలరాదు
పితృదేవతాసముచితపూజలందైన, వెలఁది యేకాదశి విడువరాదు
జాతసూతకమృతసూతకంబులనైన, సువిద యేకాదశి నుడుగరాదు

గీ. బాలురకు వృద్ధులకు గర్భభారవహకు, తరుణులకు రోగులకు నశక్తక్రియాద
నరులకునైన వర్జింప నలవికాదు, సితకరానన యేకాదశీవ్రతంబు.

ఉ. భూపతి సమస్తము న్విడుతు భోగము లెల్లఁ ద్యజింతు భామినీ
స్తోమము నుజ్జగింతు నిజసూను శిరం బసిధారఁ ద్రుంతు నో

కామిని! నీవు నిల్పుమనఁగా విడఁజాలఁగరాని దేవతా
గ్రామణి యడ్డగించిన నరక్ హరివాసర మేల మానుదుర్ ”

(రుక్మాంగదచరిత్ర 5. ఆ. ప. 112-113.)

అని పలికెను.

ఇదివిని మోహిని ఇది రాజు నిశ్చితాభిప్రాయమని యెఱింగి తాను వచ్చిన పని నెఱవేఱదేమో యని శంకించి “అయిన నీమార్గమును ద్రొక్కెద” నని నిశ్చయించుకొని “రాజా, నేనెన్నివిధములఁ బ్రార్థించి నను నాయెడల ననుగ్రహముఁ బూనవైతివి. తుదకు నిష్ఠురము లాడఁ జొచ్చితివి. ఆఁడుదాని యుసురువలని పాపము ఏకాదశీవ్రతమైనను హరింపఁజాల దని తెలిసికొనఁజాలకపోయితివి. అయినను నీవే పలికితివి గదా! వ్రతమును మాని నన్ను రక్షింపుము. లేకున్న నీవనినట్లే నా యెదుట నీకుమారుని శిరము ఖండింపుము” అని పలికెను. ఇది విని రాజు తన తొల్లిటి శపథమును ఇప్పటిమాటను దలంచికొని “చచ్చితి” నని కూలఁబడెను. అంత మోహిని కరుణగలదానివలె “రాజా! ఏల విచారింప? ఏల సుతుని సంహరింపఁబోవుట? నామోహము దీర్పుము. లేకున్న ధర్మాంగదుని శిరము ద్రుంచక తీఱదు” అని పలికెను.

ఇచ్చటఁ జరుగుచున్న సంగతియు విని వచ్చి సంధ్యావళి తెల్లవోయెను. ధర్మాంగదుఁడు వచ్చి తండ్రికి నమస్కరించి “మహారాజా! ఏల చూచెదవు?

క. “ఇయ్యమ్మ మనసుకోరిక, సయ్యనఁ గావించి వ్రతము సాగింపక మీ
రియ్యెడ చలచిత్తులరై, నుయ్యా గొయ్యో యనం జనునె భూనాథా.

సీ. జ్వరపాండురోగాతిసారంబు లొకవేళ, నరికట్టి కుంపగా నఱచియఱచి
కుష్ఠపీనసమేహగుల్మంబు లొకవేళ, నుద్రేక మొనరింప నొఱలియొఱలి
శీతాంగకఫపైత్యవాతంబు లొకవేళ, పొదివి కారింపఁగఁ బొఱలిపొఱలి
క్షయపీనసశ్వాసకామిల లొకవేళ, బలిమిమై గుదియింప మలిగిమలిగి.

గీ. ఘనజరాభారమునఁ జాలఁ గ్రాఁగి క్రాఁగి, తనువు దొఱగుట కంటె వ్రతంబు కొఱకు
దేహ మర్పించి శ్రీహరిదివ్యలోక, మున వసించుట దగదె యో భూవరేణ్య.

చ. సుతుల ననేకులం బడయఁజొప్పడు నో నరనాథ నీకు నీ
యతిబల నూర్వరందు నొక యాత్మజునిక్ హరి పుణ్యవాసర

వ్రతమునకై త్యజించి గరువంబున ధర్మము నిల్పి యచ్యుత
స్థితిఁ జరియింపఁగాఁ దగదె చిత్తమునం దలపోసి చూడుమా.

చ. తనువులు గావు నిత్యములు తామరసాక్షులు నశ్వముల్ కరుల్
ధనములు రాజసంబులు వృథా సహజన్ములు బంధుమిత్రులుం
దనయులు నేమియౌదురు ముదంబునఁ జేసినధర్మ మొక్కటే
మనుజవరేణ్య నమ్మఁదగు మానవకోటికి నెల్లకాలముల్.

క. నందను దునుమఁగ రాదను, సందేహము మాని వ్రతము సాగింపుము గో
విందుపురి విభవలక్ష్మిన్, బొందుదు సురసిద్ధవాక్పతిభులు వర్ణింపన్."

(రుక్మాంగదచరిత్ర. 5. ఆ. ప. 131-133-135-136-138.)

అని తన్ను జంపు మని తొందరచేసి వడివడిగఁ బోయి స్నానముచేసి దోవతులు కట్టుకొని వచ్చి "తండ్రీ, నీకు వ్రతభంగముగాదు. నాకు ఏకాదశీమరణము ప్రాప్తించును. వేగ సంహరింపుము" అని మొఱపెంచెను. తోడనే రుక్మాంగదుఁడు ఏకాదశీవ్రతమును మానుటకు సాహసింపలేక పుత్రుని సంహరించుటకుఁ గత్తియెత్తెను. తోడనే మోహిని కత్తిపట్టుకొని "రాజా, ఏల త్వరపడెదవు?

క. "అరపైకంబును జేయని, హరివాసరమునకు నై నిజాత్మజుఁ దునుమన్
గరవాలు చేతఁ బూనిన, కరణి యినుపమొలకు మేడఁగాల్చుటసుమ్మీ."

(రుక్మాంగదచరిత్ర. 5. ఆ. ప. 143.)

సుతునిఁ జంపినవానికి జయము లేదు. సుఖము లేదు. ఆనందము లేదు. కేవలము యమయాతన సిద్ధించును. అయ్యో, వివేకమహితుఁడవే? ఏల యోచింపవు?

సీ. "సగరుండు పుత్రసంజననంబుకొఱకునై, తరుణేందుధరుఁ గూర్చి తపముచేసె
తనరదిలీపుండు తనయులకొఱకునై, కామధేనువు సేవ కడఁకఁ జేసె
దశరథేశ్వరుఁడు సంతానంబుకొఱకునై, పుత్రకామేష్టి పొల్పుగ నొనర్చె
పాండుమహారాజపత్యంబు కొఱకు నై, యారాధనము సేసె నఖిల సురల

గీ. మందపాల జరత్కారమానివరులు, సుతులువెలిగాఁగఁ బుణ్యసద్గతులు నడయఁ
దపము లొనరించి కాదె యీధరణిలోన, నెంతపాటులఁ బడిరి ధాత్రీశచంద్ర.

మ. కలవాఁ డొక్కఁడె నందనుం డయిన నోఁగా కేమి? సౌమ్యుండు ని
శ్చలచిత్తుం డనఘుండు ధర్మగుణవిస్తారుండు శ్రీవిష్ణుపా
దలసద్భక్తుఁడు వంశపావనుఁడు మీఁదన్ దిక్కు మీకీతఁడే
ఫలమేమో వ్రత ముజ్జగించి సుతునిన్ సంరక్ష గావింపుమా."

(రుక్మాంగదచరిత్ర. ఆ. 5. ప. 143-147-157.)

అని పలికెను; గాని రాజు ఆమెమాటలు వినక "రమణీ, నీయుపన్యాసము చాలును. నీవు కోరినట్లుచేయుచుంటిని. నావ్రతము మాన్పించుట బ్రహ్మకైనఁ దరముగాదు. దూరమున నిలువుము" అని యాడుగఁ జెచి కత్తియెత్తి విసరెను. తోడనే అది పుష్పమాలికయై ధర్మాంగదుని కంఠమును జుట్టుకొనెను. అందఱు నందున కాశ్చర్యపడుచుండగా.—

సీ. సనకాదిమునియోగిసంఘంబు లుభయపార్శ్వములందు భయభక్తి సంస్తుతింపఁ
తుంబురునారదాదులు వీణియలు గూర్చి, సంకీర్తనంబులు సలుపుచుండ
గంభీరరవమున నంభోజభవశివుల్, సందడులెడగల్గ జడియుచుండ
రంభాదికాప్సరోరామాసమూహంబు, లభినయంబలర నాట్యంబు సలుప
గీ. వ్యాసశౌనకముఖభాగవతులతోడ, సిద్ధగంధర్వకిన్నరశ్రేణిగొల్వ
గరుడవాహన మెక్కి యిందిరయుఁ దాను, నాదినారాయణుండు ప్రత్యక్షమయ్యె".
(రుక్మాంగదచరిత్ర. ఆ. 5. ప. 164.)

అంతట నందఱును భయభక్తితాత్పర్యములతో సాష్టాంగదండప్రణామంబు లాచరించి యనేకవిధంబుల నుతింపసాగిరి. వారినందఱను వారించి యప్పుడు శ్రీహరి రుక్మాంగదునిఁ జేరఁదీసి "రాజా, మోహిని బ్రహ్మమానసపుత్రిక. బ్రహ్మ నీమనశ్శుద్ధి నెఱుఁగఁగోరి యామెను సృజించి యింత గావించెను. విధాతయాజ్ఞచొప్పున నీమె యింతలు చేసెనేగాని యీమె కఠినచిత్త గాదు. ఇంక జాలమేల ? మీవ్రతనియమములకు మెచ్చితిని. మీమనశ్శుద్ధి కానందించితిని. నీకుమారుఁడు యుక్తవయస్కుఁడై యున్నాఁడుగదా? అతనికిఁ బట్టముఁ గట్టుము. నీవు నీరాణులతోఁగూడ వైకుంఠమునకు రమ్ము. పట్టాభిషేకంబునకు సకలము నాయితము సేయుము" అని యానతిచ్చెను. అందఱు నానందించిరి. శ్రీహరియాజ్ఞయైనవెంటనే మంత్రులు సకలము నాయత్తపఱిచిరి. శ్రీపతి సెలవుఁబడసి రుక్మాంగదుఁడు ధర్మాంగదునకుఁ బట్టాభిషేకము చేసెను. లక్ష్మీనారాయణులు దీవించిన పిదప ధర్మాంగదుని దేవతలును, మునులు బ్రాహ్మణులు నెల్లరు నాశీర్వదించిరి. పిదప విధాత వైకుంఠనాథుని యింగితము నెఱింగి క్షణములో ననేకవిమానములను నిర్మించెను. నారాయణుఁడు అందఱు భార్యలతోడను రుక్మాంగదుని విమాన మెక్క నియమించి ధర్మాంగదునకు మఱియొకమాఱు హితోపదేశము గావించి బయలుదేఱెను. విమానపంక్తి నారసి యెల్లరు నాశ్చర్యచకితులైరి.

సీ. "సర్వసర్వంసహాచక్రంబు లంఘించి, తగ భువర్లోకంబు ప్రస్తరించి
త్రిదశలోకము లిరువదిమూఁడు వడిదాఁటి, ఘనమహర్లోకమార్గంబు గడచి
జనలోకవిస్తీర్ణసరణి వేగ క్రమించి, గురుతపోలోకంబుఁ బరిహరించి
బ్రహ్మలోకసమగ్రపథము విసర్జించి, శివలోకవిఖ్యాతి సీమ దరసి
గీ. మాఘవునిఁ గొల్చి దివ్యవిమానపంక్తి, గగనగమనంబునందు నఖర్వగరిమఁ
జనియె రుక్మాంగదక్షితీశ్వరునితోడఁ, భూరివిస్ఫూర్తి వైకుంఠపురమునకును."
(రుక్మాంగదచరిత్ర. ఆ. 5. ప. 193.)

మ "తమలోఁగొన్నట్టు నవిద్య గప్పికొనుచుణ్ దన్మాయసంసారవి
భ్రముఁడై కొందఱు దేలుచుణ్ గ్రుఁగుచుణ్ బల్వెంటలణ్ దైవయో
గమునందే పరమేశుఁ గొల్చి ఘనులై కైవల్యసం ప్రాప్తులై
ప్రమదం బందుదు రట్టి నీవు కరుణం బాలింపు మమ్మీశ్వరా."
(భాగ. స్కం. 8. ప.321)

---

13. గౌతమబుద్ధుఁడు.

కోసలదేశపు టీశాన్యభాగమున నున్న రోహిణీనదీతీరమునందలి కపిలవస్తునగరమున సింహాసనము నధిష్ఠించి శాక్యవంశజుఁడగు శుద్ధోదనుఁడు అను రాజు ప్రజలను బాలించుచుండెను. ఆతనికి సకలసౌఖ్యములు నుండెను; గాని సంతానసౌఖ్యముమాత్రము లేదయ్యెను. సంతానము లేనివారికి ఇఁక నెన్ని సౌఖ్యము లుండిన నేమిప్రయోజనము. ఇట్లు చిరకాలము గడచిపోయెను. అంతవఱకును రాజు తనకు సంతానము వచ్చుసంవత్సరమునందే కలుగునో, అంతకుఁబైని వచ్చు సంవత్సరమునందే కలుగునో అంతకుఁ బైనివచ్చుసంవత్సరమునందే కలుగునో యని యెదురుచూచుచుండెడివాఁడు. అట్టి యవధులు అనేకములు కడచిపోయెను. శుద్ధోదనుఁడు సంతానవిషయమున నిరాశ చేసికొనెను. "ఇఁక నీవైభవ మెందులకు? ఈరాజ్యమెందులకు? ఈజీవితమెందులకు?" అని రాజు సకలమును గర్హింపఁదొడఁగెను. ఇట్టి వైరాగ్యదశలో నాతని పెద్దభార్యయగు మాయాదేవి గర్భమును ధరించెను. దాసీముఖమునఁ దన

రాణి గర్భవతియైనదని వినినపుడు ఇఁక రాజుసంతోషము నేమి సెప్పవలెను? తోడనే తొల్లిటినిరాశపోయెను. వైభవములనెడలఁజిరాకు, రాజ్యమునెడలఁ బరాకు, జీవితమునెడల విసుగునుగూడఁ బోయెను. నిస్సారమని తలఁచికొనిన సంసారసుఖము సారవంతమును, దుఃఖభూయిష్ఠమునుకొనిన ప్రపంచము సౌఖ్యబహుళమును అయ్యెను. అన్నివిధముల నాశుద్ధోదనుని యానందమునకుఁ బరిమితి లేదు. ఈ మహానందముతో నాతఁడు మాయాదేవికి సీమంతము మున్నగు క్రియలు యుక్తసమయమున దేవేంద్రవైభవముతో నెఱవేర్చి సకలజనులనుసంతోషపఱిచెను.

మాయాదేవికి నవమాసములును నిండెను కపిలవస్తునగరమునకు మూఁడుక్రోసులదూరమున నున్న లంబినీవనము అను నుద్యానవనము సౌఖ్యదాయకమనితలంచి అచ్చట సకలసౌకర్యముల నొనఁగూర్చి రాజు ప్రసవించుటకై రాణి నచ్చటకుఁగొనిపోయెను. అచ్చటిసుకుమారకుసుమసహస్రముల సౌరభమును గొని విలాసముగ నడయాడు మలయానిలమువలన సుఖపరవశ యగుచు మాయాదేవి శుభలగ్నమున నొకకుమారునిఁ గనియెను. రాజు హృదయ మానందపరీత మయ్యెను. క్షణములో నీవార్త రాజధానియందును, ఉత్తరక్షణమున దేశము నలుమూలలను దెలిసిపోయెను. నలుదెసలనుండియు నానందధ్వానములు మిన్నుముట్టెను. రాజు పుత్రోత్సవము నెఱవేర్చి నెలపురుడుగడచిపోయిన తరువాత శుభదినమున కుమారుని రాణిని వెంటనిడుకొని రాజధానిం బ్రవేశించెను. ఆకుమారునకుఁ దలిదండ్రులు పెట్టిన పేరు సిద్ధార్థుఁడు ఆతఁడు గౌతమగోత్రజుఁ డగుటచే గౌతముఁ డను మాఱుపేరుగూడ వచ్చెను. కులమువారందఱు నాతఁడు శాక్యవంశజుఁడు అగుటచే శాక్యముని యనియు, శాక్యసింహుఁడనియుఁ బిలువసాగిరి. ఈతఁడే పెద్ద పెరిగి ప్రజలకు భగవంతునిగుఱించి బోధలు సేయుటవలనను, పరతత్త్వబోధకలిగినవాఁడగుటను బుద్ధుఁ డని గూడ పిలువఁబడసాగెను. గౌతమబుద్ధుఁడు అను మాఱుపేరు నీతనికి వాడుకలోఁ గలదు.

సిద్ధార్థుఁడు బాల్యమునుండియు పిపీలికాదిబ్రహ్మపర్యంతమును గల సకలభూతజాలములయందును అపారదయ గలిగి ప్రవర్తింపసాగెను. వయసువచ్చినకొలఁది నాతనికి సంసారమునెడల వైముఖ్యమును, ఇహసౌఖ్యములయెడల వైరాగ్యమును బ్రబలఁజొచ్చెను. ఏకాంతత

మును, భగవద్ధ్యానమును, ఆత్మజిజ్ఞాసయు నధికము కాసాగెను. రాజభోగములయెడలఁ బరాఙ్ముఖతయు, వేషభాషలయందు నిస్పృహయు మెండయ్యెను. అదిచూచి శుద్ధోదనుఁడు తన కుమారుఁ డెక్కడ విరాగియై పోవునో యని జడిసి కాంతాలంపటులైనచో యువకుల కిఁక వైరాగ్యము పటాపంచ లగునని భావించి యశోధర యను నొక చక్కని కన్యను దీసికొని వచ్చి పెండ్లి చేసి ఆనవదంపతులను దేవేంద్రభవనమును దిరస్కరించు నొక దివ్యభవనమున నుంచి అప్సరసలను మించు రమణులను అచ్చటఁ బరిచారికలుగను, చెలికత్తెలుగను నియమించెను. శుద్ధోదనుఁడు తలంచినట్లుగ గౌతముఁడు పెండ్లియైనతరువాత రెండుమూఁడు ఏండ్లు స్త్రీలంపటుఁడై గడిపెను. ఇంతలో నాతని కొక కుమారుఁడు గలిగెను. కుమారునిఁ జూచినతరువాత నాతనికి సంసారమునెడల మఱింత వాంఛ గలిగెను.

ఇట్లుండఁగా నాతఁ డొకనాఁడు వనవిహారమునకుఁ బోవుచుండగా మార్గమధ్యమున నాతని కొక రోగియు, నొక వృద్ధుఁడును, నొక శవమును గాన్పించెను. వారి సంగతులను సారథివలనఁ దెలిసికొని యాతఁడు “లోకములో రోగముపాలుగాని ప్రాణియు, జరాభారముచేఁ గ్రుంగిపోని జీవియు, మరణము పాలుగానిదియు లేదని తలంచుకొనెను. తోడనే యాతనికిఁ దొల్లిటివైరాగ్యము పూర్వాధిక్యమై సాక్షాత్కరించెను. ప్రయత్నమువలనఁ గలిగిన మమకారము మున్నగునవి తోడనే నశించి సహజమగు వైరాగ్యము మఱలఁ బ్రభుత్వము ప్రారంభించెను. తోడనే యాతఁడు “ఇఁక సంసారమున నుండఁగూడదు. మానవజీవితము క్షణభంగురము. ఆస్వల్పకాలమును దెలిసియుండియు మార్గమునకు వ్యయముసేయుట వివేకిలక్షణము గాదు. నిర్వాణోపాయమున కిది యంతయు నడ్డుకట్ట యని భావించి సకలమును విడిచిపోవుటకు నిశ్చయించుకొనియెను. ఒకనాఁటి రాత్రి యాతనికి వైరాగ్యమును, మోక్షసాధనవాంఛయుఁ బెరిఁగిపోయెను. అప్పు డతఁడు విశ్వసనీయుఁ డగు సారథిని రథముతో రెండుజాములరాత్రివేళ సంకేతస్థలమున సిద్ధముగా నుండ నియమించి, తానంతవఱకును మేల్కాంచియే యుండి ప్రయాణమయ్యెను. పోవునపుడు ఆతఁడు “ఇది కడసారము” అని తన కుమారునొక్కమాఱు ముద్దిడుకొని పోవలయు నని తలంచుకొని ఉయ్యాల

మంచము చెంతకుఁ బోయెను; గాని అచ్చట సఖీజనపరివృతయై అనంత దీపప్రభాపూరమున గాఢనిద్రం దవిలియు ననుపమానసౌందర్యముచే విరాజిల్లుచున్న యశోధర నారసి "క్షణ మిచ్చట నున్న ఇఁక జీవిత మధఃపతిత మైపోవు"నని శంకించి మనసు రాయిచేసికొని ముద్దుబిడ్డఁ డగు రాహులుని ముద్దుగొనకయే బయలుదేఱి రథమెక్కిపోయెను.

నగరమును విడిచి అరణ్యమునఁ గొంతద వ్వరిగినపిదప గౌతముఁడు రథము డిగ్గి తన వేష మంతయు సారథికి ఇచ్చివేసి సారథివేషమును తాను స్వీకరించి చేత నున్న కత్తితో తన శిరోజములను దీసివేసికొని "నేను సన్యాసినైతి ననియు, నాకొఱకు విచారింపవలదనియు నాతలిదండ్రులకును, భార్యకును తక్కుంగలవారికినిఁ దెలుపు" మని వానిని నగరమునకుఁ బంపివేసి తాను ముందునకుఁ బోయెను. కొంతదూరము ఱుగునప్పటి కాతని కొక తత్త్వజ్ఞుఁడు కానవచ్చెను. ఆతఁడు శిష్యగణపరివృతుఁడై పరతత్త్వవిచారమునఁ బ్రవృత్తుఁడై యుండెను. సిద్ధార్థుఁడు ఆతని నాశ్రయించి కొన్నినాళ్లు అచ్చట నుండి తత్త్వశాస్త్రము నభ్యసించెను గాని దానివలనఁ బ్రయోజనము లేదని తోఁచెను. తోడనే యాతఁ డాచార్యుని విడిచి కొంతదూరము ముందునకుఁ బోయి మఱియొక యాచార్యు నాశ్రయించి ప్రాణాయామాదుల నభ్యసించియోగియై సమాధినుండి పరతత్త్వము నెఱుంగఁ బ్రయత్నించెను; గాని దానివలనఁ గూడఁ బ్రయోజనము గాన్పింపదయ్యెను. తోడనే యాతఁడు మగధదేశమునకు రాజధాని యగు రాజగృహమునకుఁ బోఁగా నచ్చట గొందఱు ఆచార్యులు తపస్సుచేయనివానికి ముక్తి లేదనిరి. వారియుపదేశము ననుసరించి గౌతముఁడు గయాపట్టణప్రాంతమునఁ దన యైదుగురు శిష్యులతోఁ దపస్సు చేసెను. అయిదుసంవత్సరములు ఆతఁడు అతిదీక్షతోడను అతినిష్ఠతోడను దపస్సు చేసియు, దానివలనఁ గూడ లాభమును బడయఁజాలక "ఇది మోక్షసాధనోపాయముగాదు" అని దానిని విడిచివేసెను. ఇది చూచి శిష్యులు "ఈతఁడు చంచలుఁడు. ఇట్టివానిని ఆశ్రయించిన మనమును చంచలుల మైపోదుము" అని కూడఁ బలుకుకొని యాతనిని విడిచిపోయిరి.

అందుకాతఁ డేమియు జంకక ఆగయాపట్టణప్రాంతమునందే యొక రావిచెట్టుక్రిందఁ గూర్చుండి నిశ్చలచిత్తుఁడై తత్త్వవిచారము

ప్రారంభించెను. తోడనే యాతనికిఁ బరతత్త్వమంతయు బోధపడియెను. అప్పుడే యాతఁడు బుద్ధుఁ డయ్యెను. ఆతఁ డేస్థలమునఁ గూర్చుండి పరతత్త్వమును దెలిసికొనియెనో ఆస్థలమునకు బుద్ధగయ యని పేరువచ్చెను. ఆరావిచెట్టునకు బౌద్ధులు చాల భక్తితో పూజలు చేయుదురు.

గౌతముఁడు ఇలువిడిచి పోవునప్పటికి ముప్పదియేండ్ల ప్రాయమున నుండెను. పిమ్మట నాతఁడు గయాపట్టణమువద్ద బుద్ధుఁ డగునప్పటికి ముప్పదియాఱవయేడు వచ్చెను. అప్పు డాతఁడు తనమతమును లోకులకు బోధింపవలె నని కాశీనగరమునకుఁ జనియెను. అచ్చటఁ బండితులకు నాతనికినిఁ జాలవాదోపవాదములు జరిగెను. ఇట్లు మూఁడుమాసములు గడచునప్పటికి అఱువదిమంది బౌద్ధమతమును స్వీకరించిరి. వారి సంద అను ఆతఁడు "ఈధర్మమును లోకమున వెల్లడిసేయుఁడు" అని నలుదెసలకును బంపించెను. పిదప నచ్చటనే మఱికొందఱు శిష్యులను సంపాదించి యాతఁడు మగధదేశమునకు రాజధాని యగు రాజగృహమునకుఁ బోయి అచ్చటఁ బ్రజాపాలనముసేయుచున్న బింబిసారుఁడు అను రాజునకును అనేకజనులకును తనమతదీక్ష నొసంగెను. అతఁడచ్చట నున్నంత కాలము ననేకపండితులును బామరులును వచ్చి యాతని మతమును స్వీకరించిరి. మఱికొన్నిదినములు ఆతఁ డచ్చట నుండి తనకు జన్మస్థల మగు కపిలవస్తునగరమునకుఁబోయి అచ్చటఁ దనతల్లిదండ్రులకు, భార్యకును, గుమారునకును, ఇంక ననేకులకును పరతత్త్వమును బోధించి మతదీక్ష నొసంగెను. ఇట్లు ఆతఁడు బ్రతికియున్నంతకాలమును అనఁగా బుద్ధుఁ డైనది మొదలు నలువదినాలుగేండ్లు లోకులకు పరతత్త్వబోధ గావించి మతదీక్ష నొసంగి కాశీకోసలమగధదేశములయందు, తనమతమును బాగుగ వ్యాపింపఁజేసి వృద్ధుఁడై తన యెనుబదవయేఁట కుశినగరమునఁ బరమపదించెను.

సీ. "భవము దోషంబు రూపంబు కర్మంబు నామంబు గుణము నెవ్వనికి లేక
జగములఁ గలిగించు సమయించు కొఱకునై, నిజమాయ నెవ్వఁ డిన్నియును దాల్చు
నాపరేశునకు ననంతశక్తికి బ్రహ్మ, కిద్ధరూపికి రూపహీనునకును
జిత్రచారునికి సాక్షికి నాత్మరుచికిని, బరమాత్మునకుఁ బరబ్రహ్మమునకు

శ్రీశంకరాచార్య.

భక్త:—103.

గీ. మాటలను నెఱుకల మనముఁ జేరంగ, గాని శుచికి సత్యగమ్యుఁ డగుచు
నిపుణుఁడైనవాని నిష్కర్మతను మెచ్చు, వానికే నొనర్తు వందనములు."
(భాగ స్కం. 8. ప. 73)

---

14. శంకరాచార్యుఁడు.

కేరళదేశములోఁ బూర్ణానదికిని, వృషాచలమునకును సమీపమున "కాలటి" అను నొక యగ్రహారముగలదు. అందు శివగురుఁడు అను బ్రాహ్మణవిద్వచ్ఛేఖరుఁడు 'ఆర్య' యనుభార్యతో వంశక్రమముగా నివసించి యుండెను. ఆతఁడు అనేకవిద్యలయందు గొప్పపండితుఁడు. ఐహికము విషయమున నాతనికి దుఃఖకారణము లంతగా లేవు గాని సంతానము లేని చింతమాత్రము ఆదంపతులను జాల వేధించుచుండెను. ఎన్నో వ్రతములు నాచరించినను బ్రయోజనము లేకపోవుటచే వారిరువురును మహేశ్వరునిఁ బూజింపఁ దొడఁగిరి. ఈయారాధనము కొంత కాలము జరుగునప్పటికి ఆర్యాంబ గర్భవతియై కొడుకును గనియెను. శంకరప్రసాదమువలన నీబిడ్డ గలుగుటచే శంకరుఁడు అని పేరు పెట్టుకొని ఆదంపతు లెంతో ప్రేమతోఁ బెంచుకొనుచుండిరి. శంకరుఁడుగూడ తల్లిదండ్రులయెడలఁ జాల భయభక్తులు గలిగియుండెను.

సంవత్సరము గడువకపూర్వమే శంకరుఁడు అక్షరములను గుర్తుపట్టి రెండవసంవత్సరములో చదువను వ్రాయను నేర్చుకొనెను. మూఁడవయేఁట కావ్యము లన్నియుఁ జదివివేసి ఇతిహాసములు పురాణములు మున్నగువానిని బరిశోధించెను. ఆతనికి గురువు రెండవమాఱు ఎప్పుడును పాఠముచెప్పి యెఱుఁగఁడు. ఒకమాసము గడువకపూర్వమే గురువు శంకరుని యేకసంధాగ్రాహిత్వమును గుర్తించి సకలశాస్త్రములు నాతనిచెంత నేకరువు పెట్టివేసెను గురుఁడు పాఠము సెప్పునపుడు ఒక్కొక్కపుడు శంకరుఁడు వేయు ప్రశ్నలకు సమాధానము సెప్పలేక అతనివలననే తెలిసికొని మహాశ్చర్యనిమగ్నుఁ డగుచుండువాఁడు. ఆతని చెంత నింక ననేకులు శిష్యులు ఉండిరి; గాని వారందఱకు శంకరుఁడే

పాఠములు సెప్పుచుండెడివాఁడు. శంకరుఁడు చెప్పెడి పాఠము విద్యార్థులకు బాగుగ నవగాహన మగుచుండెడిది. గురుఁడు శంకరునంత చక్కఁగఁ బోధింపఁజాలకుండెను. ఇట్లు శంకరుఁడు సకలవిద్యలును నేర్చుకొనునప్పటికి ఏడవసంవత్సరము వచ్చెను. గర్భాష్టమసంవత్సరములో బ్రాహ్మణునకు ఉపనయనము జరుగవలెను. గావున అప్పుడు శివగురుఁడు శంకరునకు ఉపనయనము సేయుటకు సకలప్రయత్నములను గావించెను; గాని ముహూర్తము సమీపించునప్పటికి ఆకస్మికముగా నాతఁడు చనిపోయెను. భర్తృమరణమునకుఁ జాల వగచి ఆర్యాంబ శంకరునకు సన్నిహితజ్ఞాతులచే నుపనయనము సేయించెను.

పిదప శంకరుఁడు వేదముల నభ్యసించుటకు ఒక గురువు నాశ్రయించెను. అట నాతఁడు యథాశాస్త్రముగ మధూకరవృత్తిచే అన్నము సంపాదించి తెచ్చి అందు కొంత గురువునకు ఇచ్చి తక్కినది తాను భుజించుచు గురువును సేవించుచు వేదాభ్యాసము చేయసాగెను. ఒకనాఁడు ఒకస్త్రీ ఆతనికిఁ బెట్టుటకు ఏమియు లేక మధూకరమునకు వచ్చినపుడు "నాయనా, నాకు ఇదియే కలదు" అని యొక యుసిరికాయ యిచ్చెను. శంకరుఁడు సాక్షాత్తుగ శంకరుఁడేఁ గావున ఆమె దారిద్ర్యమును, దైన్యమును గుర్తెఱిఁగి తెల్లవాఱునప్పటికి ఆమె యిల్లంతయు బంగారపు టుసిరికాయలతో నింపివేసెను. పిదపఁ గొన్నిదినములు మాత్రమే ఆగ్రామమున నుండి వేదము లన్నియు నభ్యసించి మాతృదేవతను బూజించుటకు ఆతఁడు స్వగ్రామమునకుఁ బోయెను. కొడుకు తిరిగి మహావిద్వాంసుఁడై యింటికి వచ్చె నను ఆనందముతో ఆర్యాంబ అతనికి పెందలకడ భోజనము పెట్టదలఁచి స్నానముచేసి మంచినీళ్లు తెచ్చుటకు పూర్ణానదికిఁ బోయెను; గాని యామె నదిని సమీపింపక పూర్వమే వడగొట్టి పడిపోయెను. తల్లి యెంతసేపటికిని రాకపోవుటచే శంకరుఁడు అపాయమును శంకించి నదికిఁ బోఁగా నాతనికి సర్వమును దెలిసిపోయెను. తోడనే శంకరుఁడు తల్లిముఖము మీఁదఁ జల్లని నీరు చిలికి చికిత్సచేసి ఆమెకు స్మృతి గలిగించి యింటికిఁదీసికొనివచ్చి తనతల్లి కష్టపడిపోవుచున్న దని తలంచి తన ప్రభావమువలన ఆనది తన యింటిముందునుండి ప్రవహించునట్లు చేసెను. ఈయద్భుతమును విని ఆదేశపు రాజు శంకరుని గౌరవింప వజ్రవైడూర్యమరకతమాణిక్యాదినవరత్న

ములు వెలగల వస్త్రములు మున్నగునవి గైకొని వచ్చెను; గాని శంకరుఁడు వాని నెంతమాత్రమును అంగీకరింపక ఆరాజు రచించిన మూఁడు గ్రంథములనుమాత్రము స్వీకరించెను. అవిద్యైన నాతఁడు తనచెంత నుంచుకొనక ఒకమాఱు పఠించి తిరుగ రాజునకుఁ బంపివేసెను.

ఒకప్పుడు శంకరుఁడును దల్లియు వాకిటఁ గూర్చుండి యేమో ముచ్చటించుకొనుచుండఁగా కొందఱు ఋషీశ్వరులు వచ్చి యెంతో వినుతిసేయ దొడఁగిరి. వారినిఁ జూచి ఆర్యాంబ తన కుమారుని గొప్పతనమును గ్రహించి ఋషీశ్వరులకు మ్రొక్కి "మహానుభావులారా, మీ యాగమనమువలన నేను నాకుమారుఁడును బునీతుల మైతిమి. మాకుటీరము పావనమైనది. చూడఁగా నాకుమారుఁడు చాల నదృష్టవంతుఁ డని తోఁచుచున్నది. తొలిజన్మమున నీతఁడును నేనును జేసికొన్న వ్రతవిశేషము లేవో సెలవియ్యవలెను" అని ప్రార్థించెను. అందులకు ఋషీశ్వరులు "తల్లీ, నీకుమారుని నీవు మానవమాత్రునిగాఁ దలంపకుము. ఈజన్మమునందే నీవును నీభర్తయుఁ గావించిన పూజకు సంతసించి పరమశివుఁడే నీగర్భమున నుద్భవించెను. శివుఁడు ప్రత్యక్షమై "అవివేకియై దీర్ఘాయుర్దాయముగల కుమారుఁడు కావలెనా? వివేకియై స్వల్పాయుర్దాయము గలవాఁడు గావలెనా?" యని యడుగఁగా నీభర్త "స్వల్పాయుర్దాయవంతుఁడైనను వివేకముగల అనఁగా సర్వజ్ఞుఁడైన కుమారుఁడు కావలయు"నని కోరెను. తనకంటె సర్వజ్ఞుఁడు మఱియొకఁడు లేకపోవుటచే నీభర్తవరము ననుసరించి ఈశ్వరుఁడే నీకడుపునఁ బుట్టవలసివచ్చినది. అగుటవలననే నీకుమారునకు ౧౬ సంవత్సరములు మాత్రము ఆయువు. అయినను కారణాంతరములచే నీతఁడు ౩౨ సంవత్సరములు జీవించును. పరమేశ్వరుఁడు చిరకాలము మానవలీలలతోనుండుటకు వీలులేదుగదా?" అని చెప్పిరి. ఈమాట వినుటతోడనే ఆర్యాంబకు ఆనందమునకు మాఱుగ దుఃఖమువచ్చెను. తోడనే యామె మూర్ఛనొందఁగా శంకరుఁడు ఉపచారములు చేసి తేర్చెను. కొంతసేపు శంకరునితో నేమేమో ముచ్చటించి ఋషులు వెళ్లిపోయిరి.

ఆర్యాంబ తన కుమారునకు ఆయుర్దాయము అత్యల్ప మగుటచే బెందలకడఁ బెండ్లి సేయుకున్న సంతానము కలుగదని యూహించి యొకనాఁడు కుమారునకు అన్నము పెట్టి దగ్గఱఁ గూర్చుండి "బిడ్డా,

అనేకులు నీకు చక్కని చుక్కలగు తమ కొమార్తెల నిచ్చి పెండ్లిచేసెద మని వచ్చుచున్నారు. వారిలో నీచిత్తము వచ్చిన కన్యను బెండ్లియాడి సుఖింపుము నాయనా" యని పలికెను; గాని యిది విని శంకరుఁడు మంద హాసముచేసి "తల్లీ, నాకుఁ బెండ్లివలదు. నేను సన్యసించెదను" అని పలికెను. ఈమాట ఆర్యాంబకు వజ్రాఘాతమై తోఁచి మఱల నామెను మూర్ఛావివశురాలిం గావించెను. శంకరుఁ డామెకు సేదదేర్చెను. అనేకపర్యాయములు ఆతఁడు తల్లికి వైరాగ్యము నుపదేశించి తనకు సన్న్యాసాశ్రమస్వీకారమునకు అనుజ్ఞ యీయవలసిన దని కోరెను; గాని యామె యంగీకరింపలేదు. ఒకనాఁడు శంకరుఁడు పూర్ణానదిలో స్నానముచేయుచుండఁగా నొక మొసలి వచ్చి యాతని కాలుఁ బట్టుకొనెను. రక్తప్రవాహమువలన నదియంతయు రక్తమయ మైపోయెను. అప్పుడు శంకరుఁడు తనకు అవసానకాలము వచ్చినది అని తలంచి తల్లి కొఱకు కేకలు వేసెను. అంత నార్యాంబ నదికిఁ బోయి కుమారునకు సంభవించిన విపత్తును జూచి చాల విచారింపఁ బ్రారంభించి నాబిడ్డను రక్షింపుఁడు అని చెంతనున్నవారినిఁ బ్రార్థించెను; గావి యెవరును సాహసింపఁజాలకపోయిరి. అప్పుడు శంకరుఁడు "తల్లీ, ఇఁక విచారించిన నేమిప్రయోజనము? ఎన్నిసారులు ప్రార్థించినను నాకు నీవు ఇంతకు మున్ను సన్న్యాసమునకు సెలవు ఇచ్చితివి గావు. ఇప్పుడు ఈయవసాన కాలమున నైన సెలవిమ్ము" అని ప్రార్థించెను. "కుమారా, నిన్ను నేను సుఖపెట్టలేక యేపోయితిని. తునకు సన్న్యాసాశ్రమస్వీకారమునకైన సెల విచ్చి నీముద్దు తీర్పకుండ నెట్లుండఁగలను? నీచిత్తమువచ్చినట్లు నీవు ఇప్పుడు ఆతురసన్న్యాసము స్వీకరించి తరింపుము. తండ్రీ" యని సెలవిచ్చెను. తక్షణమే శంకరుఁడు ఆతురసన్న్యాసమును స్వీకరించెను. తోడనే మొసలి యాతనిని విడిచిపోయెను. కేతువిముక్తబాలభానునివలె శంకరుఁడు తీరమునకు వచ్చెను. అదిచూచి సకలజనులును ఆశ్చర్యచకితులై శంకరునకు సన్న్యాసస్వీకారమువలన 'రెండవజన్మము ప్రాప్తించినది; గావుననే మృత్యువు ఆతని నేమియుఁ జేయలేకపోయినది అని చెప్పుకొసాగిరి. శంకరుఁడు బ్రతికినను ఆతఁడు సన్న్యాసి యై పోవుటచే ఆర్యాంబ దుఃఖాక్రాంతచిత్తయై యుండఁగా శంకరుఁడు వచ్చి దేశాటనమునకు సెలవు ఇమ్మని ప్రార్థించి ఆమె కోరికప్రకారము ఆమె యవసానకాల

మునకు కాలటి వచ్చి దహనసంస్కారము చేసెద నని మాటయిచ్చి వెడలిపోయెను.

నర్మదాతీరమున గోవిందుఁడు అను యోగీంద్రుఁడు ఉండెను. గోవిందయోగి శుకదేవునిశిష్యుఁడగు గౌడపాదునకుఁ బ్రియశిష్యుఁడు. గొప్ప యోగులలోఁ బ్రముఖుఁడు. శంకరుఁడు ఆతని సంగతి విని యాతనియాశ్రమమునకుఁ బోయెను. గోవిందయోగియు శంకరుని సంగతి యంతయు విని తనకుఁ దగిన శిష్యుఁడు వచ్చె నని యానందించి యాతనికి వేదాంతరహస్యము లన్నియుఁ గరతలామలకములుగ నుపదేశించెను. ఒకనాఁడు గోవిందయోగీంద్రుఁడు సమాధిలో నుండఁగా నర్మదానది యుప్పొంగి యాశ్రమమును ముంచివేయసాగెను. అదిచూచి శంకరుఁడు తన గురుని యోగనిష్ఠకు భంగము వాటిల్లునని తలంచి ప్రవాహమును దన కమండలములోనికి ఆకర్షించుకొనియెను. సమాధి నుండి లేచినతరువాత గోవిందుఁ డీసంగతి యితరశిష్యులవలన నెఱింగి శంకరుని ప్రజ్ఞకు ఆనందించి "వత్సా, వ్యాసభగవానుని బ్రహ్మసూత్రములకు నీవు భాష్యము వ్రాయుము. అందులకు నీవ తగినవాఁడవు" అని చెప్పి వారణాసీనగరమునకుఁ బంపివేసెను.

కాశీనగరము చేరినపిదప శంకరుని అనేకులు వచ్చి శిష్యులుగాఁ జేరి యాశ్రయించిరి. అందు చోళదేశీయుఁ డగు విష్ణుశర్మ యను నాతఁడు ముఖ్యుఁడు. ఒకనాఁడు గురుభక్తిపరాయణుఁడు అగు విష్ణుశర్మ భక్తి నితరశిష్యులకు ఎఱుకపఱుపఁ గోరి శంకరుఁ డాతనిని గంగా నదీజలముల పై నడచివచ్చునట్లు ఆజ్ఞాపించెను. గురుపాదములను హృదయమునఁ బదిలము గావించుకొని విష్ణుశర్మ అందఱును జూచుచుండ గంగోదకముమీఁద నడచివచ్చెను. అప్పుడు శంకరుఁడు ఆతనికి పద్మపాదుఁడు అని పేరు పెట్టి తక్కినవారినిఁ గూడ నట్లు సేయుమనఁగా వారు సేయలేకపోయిరి. వేఱొకదినమున శంకరుఁడు శిష్యజనపరివృతుఁడై కాశీనగరవీథులలోఁ బోవుచుండఁగా నొక మాలవాఁడు ఎదురై మీఁదికి రాసాగెను. అదిచూచి శంకరుఁడు దూరముగాఁ బొమ్ము. అని గద్దించి పలుకఁగా నాచండాలుఁడు "ఏల పోవలెను? నీవు యతివి అని తోఁచుచున్నది; గాని నీమాటలలో నర్థము కాన్పించుట లేదు. నీవు నాశరీరమును దొలఁగిపొమ్మని యాజ్ఞాపించెదవా? అట్లయిన

నీశరీరమునకును నాశరీరమునకును భేద మేమి గలదు? నీశరీరమును నాశరీరమునుగూడ సమానముగ మలినములే. అందు నీశరీరమునం దేమియు ఘనతలేదు. ఇఁక నాయాత్మను దొలఁగి పొమ్మంటివా? అట్లయిన నాత్మ దూరముగాఁ బోవుట యెట్లు? నీవు చూడఁగా ఆభాసయోగివని తోఁచుచున్నది. లేకున్న నీయసంబద్ధము లేల? నిక్కముగ యోగియైనవానికి హెచ్చుతక్కువలు లేవు. ఇప్పుడు నీవు నన్ను అధమాధముఁడ ననిభావించి నీవే అట్టి వాఁడ వై పోవుచున్నావు" అని యనేకవిధముల వేదాంతార్థముల నుపన్యసింపఁగా శంకరుఁడు తెల్లఁబోయి యాలోచింపసాగెను. ఇంతలోఁ జండాలుఁ డదృశ్యుఁడై యచ్చోట సాక్షాత్తుగ విశ్వనాథుఁడు నిలిచెను. తోడనే శంకరుఁడు ఆతని పాదములమీఁద వ్రాలి తన తప్పిదమును క్షమింపవలసిన దని యనేకవిధములఁ బ్రార్థించెను. అంత విశ్వనాథుఁడు బ్రహ్మసూత్రములకు భాష్యము వ్రాయవలసినదని యాతనికి ఆజ్ఞాపించి తిరోహితుఁడయ్యెను. శంకరుఁ డచ్చటనుండి బసకుఁ బోయెను.

ఒకనాఁడు శంకరుఁ డెచ్చటనుండియో వచ్చుచుండఁగా చాల దాహ మయ్యెను. సమీపమునందలి తాడిచెట్లు గీయుచున్న యీడిగవాని కుండలో సుర తక్క నచ్చట మఱి యేవిధమైన జలమును లేకపోవుటచే శంకరుఁడు వాని చెంతకుఁ బోయి కల్లుపుచ్చుకొని త్రావి బయలుదేఱెను. శిష్యు లందఱు నందులకు ఆశ్చర్యచకితులయ్యు సదుగుటకోడి యూరకుండిరి; గాని శిష్యులలో నొకఁడు "గురువుగారు చేసినపనిఁ జేయుటకు మన కేమి యభ్యంతర మనితలఁచి తానుగూడ సురాపానము చేసెను. శంకరుఁ డిది చూడనట్లే నటించి ముందునకు సాగెను. అచ్చట నొక కమ్మరి యినుము కరగించుచుండెను. మూసలో నున్న యినుము కరిగి జలమువలె పలుచగ నుండెను. అదిచూచి శంకరుఁడు దానినిఁగూడ గడగడ ద్రావివేసెను. "తప్తాయస్సలిలము నీవుమాత్ర మేల త్రాగవు?" అని తక్కినశిష్యులు కల్లుత్రావిన శిష్యు నడుగఁగా నాతఁడు తెల్లవోయెను. అంత నాతఁడు "పెద్దలు చేసిన యొప్పులనే గాని తప్పుల నెవ్వరును అవలంబింపఁ గూడదు. పెద్దలు చేసి నంతమాత్రమున తప్పులు చేయవలసినవి కావు" అను సిద్ధాంతమునకు వచ్చెను. ఇంకొకనాఁడు శంకరుఁడు వీథిలో నుండి పోవుచుండఁగాఁ

డెబ్బదియేండ్ల బ్రాహ్మణుఁ డొకఁడు "డుకృఞ్ కరణే" యని సంస్కృత వ్యాకరణమును వల్లించుచుండెను. ఇంతవార్ధకములోఁ గూడ నీవింక నీవ్యాకరణ మేల చదివెద వనఁగా నాతఁడు ధనసంపాదననిమిత్తము అని బదులుచెప్పెను. అదివిని శంకరుఁడు చాల కటకటంబడి యాతనికి "భజగోవిందం భజగోవిందం భజగోవిందం మూఢమతే!" యని తత్త్వోపదేశము గావించెను.

గోవిందయోగి సెలవును, కాశీవిశ్వనాథుని యాజ్ఞను నిర్వర్తించుటకు శంకరుఁడు బదరికారణ్యమునకుఁ బోయి యక్కడ భాష్యరచనము ప్రారంభించెను. అక్కడ నాతఁడు ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండ,మాండూక్య, తైత్తిరీ, యైతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకములను దశోపనిషత్తులకును, భగవద్గీతలకును; సనత్సుజాతీయమునకును, బ్రహ్మసూత్రములకును, భాష్యములు వ్రాసెను. ఒకనాఁడు తాను వ్రాసిన సూత్రభాష్యమును ఒక శిష్యునకుఁ బాఠముసెప్పుచుండఁగా నొక వృద్ధబ్రాహ్మణుఁడు వచ్చి "నీవు పాఠము సెప్పుచున్నది యేమి?" యని యడిగెను. శంకరుఁడు బ్రహ్మసూత్రములకుఁ దాను వ్రాసిన వ్యాఖ్యాన మని చెప్పఁగా వృద్ధుఁడు కొన్ని స్థలములయందుఁ బరీక్ష బ్రారంభించెను. తుదకు ఇరువురును వాదము ప్రారంభించిరి. ఎనిమిది దినములు వారు అహోరాత్రములు వాదించిరి. గాని పర్యవసానము తేలలేదు." నాతో సమముగ వాదించుచున్న యీవృద్ధబ్రాహ్మణుఁ డెవఁడు అని శంకరుఁడు యోచించుచుండఁగా ఆతని శిష్యుఁ డగు పద్మపాదుఁడు అంతయు గ్రహించి "మహాత్మా, నీవు సాక్షాత్తుగ శంకరుఁడవు. వృద్ధబ్రాహ్మణుఁ డగు నీవ్యాసభట్టారకుఁడు కేవలము నారాయణమూర్తి. శంకరనారాయణులు వాదింపఁ దొడఁగినచో నిఁక గింకరులమగు మేము ఏమి చేయఁగలము?" అని పలికెను. అది విని శంకరుఁడు వృద్ధబ్రాహ్మణుని పాదములమీఁద వ్రాలి "మహాత్మా, అజ్ఞానమువలన నీతో వాదమునకు డీకొంటిని. క్షమించి నీ నిజరూపమును జూపవలె" నని ప్రార్థించెను. వ్యాసుఁ డాతని ప్రార్థనము నంగీకరించి నిజరూపముతో సాక్షాత్కరించి బ్రహ్మసూత్రభాష్యమును గైకొని సాంతముగఁ జదివి "వత్సా! నీప్రజ్ఞకు నాకు ఆనందము గలిగినది. నేను వ్రాసినసూత్రములకు భాష్యము చేయఁదగినవాఁడు నీవుతక్క మఱి

యొకఁడు లేఁడు. నాయభిప్రాయము నెఱింగి యింత చక్కఁగ విశదీకరించుట నీకే తగును. ఇందేమియు దోషములు లేవు. నీభాష్యము నామూలమునకు వన్నె వెట్టుచున్నది. నీవు సూత్రభాష్యము వ్రాసితి వని నాకుఁ గర్ణాకర్ణిగాఁ దెలియవచ్చినది. అంతట నేను నీశక్తి సామర్థ్యము నీభాష్యమును బరీక్షింపవలయు నని యిట్లు వచ్చితిని. నీహృదయము చాల విశాలమైనది. నీభావములు చాల నున్నతములైనవి. నాకుఁ జాల నానందమైనది. నీభాష్యము అద్వితీయము. ఇకఁ బ్రపంచమున దీనికి సాటియైనది మఱియొకటి యుండఁబోదు. రాజుపూసల నడుమ జాతి రత్నమువోలె నీవు వ్రాసిన భాష్యమే లోకముల సర్వోత్తమస్థానము నాక్రమింపఁగలదు. లోకము నీవలన నుద్ధరింపఁబడును" అని కొన్ని రహస్యముల నెఱింగించి యదృశ్యుఁడై పోయెను.

మునుల యాదేశమును గురువు నానతిని వ్యాసాజ్ఞను స్మరించి శంకరుఁడు వేదబాహ్యములగు దుర్మతములను ఖండించి అద్వైతప్రతిష్ఠాపనము సేయుటకు నిశ్చయించుకొని దేశయాత్రోన్ముఖుఁ డయ్యెను. ఈసంగతి విని కాశీరాజు ఆతనిచెంతకు వచ్చి పాదములమీఁద వ్రాలి, "మహానుభావా, మీరు దేశయాత్రకై పోవలదు. ఈనగరమునందే యుండి నన్నును నాయాస్థానమును నాప్రజలను బునీతులం గావించుచుండవలెను" అని యనేకవిధములఁ బ్రార్థించెను; గాని భారతసర్వము నుద్ధరింపఁ దలఁచి పోవుచుండుటచే శంకరుఁడు అందులకుఁ దిరస్కరింపఁగా దుదకు రాజు మహారాజోచితమగు పరిధవమంతయు బహుమానపూర్వకముగా నిచ్చి తరించెను. మొదట శంకరాచార్యుఁడు ప్రయాగక్షేత్రమునకుఁ బోయెను. అచ్చట మాతాపితలను స్మరించి త్రివేణీసంగమమున స్నానము గావించి తత్తీరమున నాసీనుఁడై శిష్యులతోఁ బ్రసంగించుచుండ అగ్నిలో నుఱికి భట్టపాదుఁడు అను మాఱుపేరుగల కుమారిలుఁడు దేహమును విడుచుచున్నాఁడను వార్త వినవచ్చెను. తోడనే శంకరుఁడు అచ్చటికిఁ బోయెను.

వేదములను నిందించుచు దేశమునం దంతటను ప్రబలుచున్న బౌద్ధమతమును నిర్మూలింపవలె నని కుమారిలభట్టు తలంచెను. ఈయూహతో నాతఁడు యథార్థముగఁ బోయినబౌద్ధులు తమ మతరహస్యములను బోధింప రని తలంచి బౌద్ధుఁడనని చెప్పుకొనుచు బౌద్ధమతరహస్య

ములను జదువుకొనఁజొచ్చెను. ఒకనాఁడు పాఠమును జెప్పుచు ఆచార్యుఁడు బౌద్ధశిష్యులకు ఉత్సాహము కలుగునట్లు పౌరుషేయములనియు పూజింపఁదగినవి కావనియు నింత నిట్లనేకవిధముల వేదములను నిందింపసాగెను. ఈవేదనింద వినలేక కుమారిలుఁడు లోలోపలఁ జాల విచారించుచుండఁగా కన్నులనుండి అశ్రుధార ప్రవహింపఁజొచ్చెను. బౌద్ధశిష్యులు అది చూచి "ఈతఁడు నిజముగా బౌద్ధుఁడు గాదు. బౌద్ధమతఖండనము చేయుటకే బౌద్ధమతము నభ్యసించుచున్నాఁడు. మనరహస్యముల నెఱింగి మనలనే నాశనముచేయ సమకట్టియున్న యీతనిని బ్రదుకనీయరాదు" అని నిశ్చయించుకొని యొకనాఁటి రాత్రి చాల ఉన్నతమైనమేడమీఁద నిద్రించుచుండఁగా నీతనిని గ్రిందికిఁద్రోసివేసిరి. అప్పుడు కుమారిలుఁడు "వేదములు అపౌరుషేయములైనచో నాకు ఎంతమాత్రమును గష్టము గలుగకుండును గాక" అని పలికెను. అంత యెత్తునుండి క్రిందఁ బడినను అతనికి అపాయ మేమియుఁ గలుగలేదు. ఒక్కకన్నుమాత్రము పోయెను. అది "వేదములు అపౌరుషేయములైనచో" నని వేదములయెడల నిశ్చయభక్తి పూర్ణముగా లేకపోవుట వలననే సంభవించెను.

నాఁటినుండియు నాతఁడు సకలవిధములను బౌద్ధమతము నున్మూలింపఁ గంకణము గట్టుకొనెను. ఒకనాఁడు ఆతఁడు సుధన్వుఁడు అను బౌద్ధరాజుయొక్క ఆస్థానమునకుఁ బోయెను. రాజు తనపండితులనీతని మీఁదికి వాదమునకుఁ బురికొలిపెను. అందులకు వెనుదీయక కుమారిలుఁడు మహానందముతో గొప్ప యుక్తులను జూపుచు బౌద్ధమతమును ఖండింపఁ దొరకొనెను. బౌద్ధులును జాల నావేశముతో వాదించిరిగాని తుదకు ఓడిపోయిరి. అప్పుడు వారు చేయునది లేకయు తామోడిపోయినట్లు అంగీకరించుటకు సమ్మతిలేకయు "వాదము వాదించువాని బుద్ధిబలమును బట్టి యుండును. ఒక్కొక్క సందర్భమున అన్యాయవాదముగూడ నెగ్గవచ్చును" అని పలికిరి. అందులకు కుమారిలుఁడు "మీరేమార్గమున మీమతమును నిలుపఁబెట్ట దలఁచికొనినను నేను దానిని పడఁగొట్టఁగలను" అని బదులుచెప్పెను. అదివిని యెట్లయిన బౌద్ధమతమే గొప్పది అనిపించుకోవలయు నని యున్న రాజు "ఈనగరమునకు వెలుపల నొక గొప్ప పర్వత మున్నది. మీరుభయపక్షములవారును స్వమతధర్మముల

యెడలఁ జాలభక్తిగలవారేగదా? ఆపర్వతశిఖరముమీఁదినుండి క్రిందికుతికి ఎవరు నిరపాయముగ యథాస్థితిలో లేచివచ్చెదరో వారిమతము గొప్పది" అని చెప్పెను. బౌద్ధపండితు లందఱును వెనుదీసిరి. కుమారిలుఁడట్లు చేయక వేదమును స్మరించి పౌరులందఱును దెల్లవోవ పర్వతశిఖరముమీఁదనుండి యుఱికియు పూలలోఁ బెట్టినట్లు ఏయపాయమును లేక లేచివచ్చెను. సుధన్వునకు ఈవిధముగా నాశాభంగము గలిగెను. అప్పుడుగూడ బౌద్ధపండితులు తమ యోటమి నంగీకరింపక "పర్వతశిఖరముమీఁదనుండి పడియు నపాయము పొందకుండుటలో గొప్ప లేదు. అది ఇంద్రజాలవిద్యవలన సాధ్య మగును" అని పలికిరి. "అట్లయిన మఱియొక యుపాయము చెప్పెద" నని రాజు ఒక్కకుండలో రహస్యముగ నొకపామును బెట్టి మూఁతవేసి కట్టి దానిని సభలోనుంచి "దీనిలోనున్న వస్తువు నేపక్షమువారు చెప్పెదరో వారిమతము గొప్పది" అని పలికెను. బౌద్ధులు అందు పాము ఉన్నదనిరి. కుమారిలుఁడు శేషశాయియగు శ్రీమహావిష్ణువు ఉన్నాఁడు. అనిపలికెను. రాజు తనమతము నెగ్గినదని సంతోషించుచు బౌద్ధమత ప్రాశస్త్యమును సభ్యులకుఁ దెలుపఁగోరి మూఁత తీయింపఁగాఁ గుండలో కుమారిలుఁడు చెప్పినట్లు చుట్టుకొని యున్న పాముమీఁద శ్రీహరి విగ్రహము ఉండెను. అదిచూచి బౌద్ధులు తెల్లవోయిరి. సుధన్వుఁడు వెంటనే బౌద్ధమతమును విడిచి "ఆసేతుహిమాచలపర్యంతమైన యీదేశమున నున్న బౌద్ధులందఱును ఆబాలగోపాలముగ సంహరింపవలెను. దీని కెవరైన వ్యతిరేకము చేసినచో వారినిఁగూడ సంహరించెదము" అని చాటింపించెను. అట్లే చేయఁబడెను.

ఇట్లు తనవలన లోకమునందలి బౌద్ధు లనేకులును, విశేషించి బౌద్ధమతరహస్యములను దనకు ఉపదేశించిన గురువును చనుయుటచే ఘోరపాతకము తగులు నని శంకించి కుమారిలభట్టు ఆపాపము పోవుటకై ప్రాయశ్చిత్తము గావించుకొని స్వయముగఁ జితిని ముట్టించి దానిమీఁద శయనించెను. ఆతని నిశ్చయమును మఱలింపఁజాలక శిష్యులందఱును చుట్టును మూఁగి విచారింపసాగిరి. అప్పుడు శంకరుఁ డచ్చటకు వచ్చి తనకమండలువునందలి పావనతీర్థముచే నగ్నిని శాంతింపఁజేసి సగము కాలిపోయిన కుమారిలుని దేహమును మఱలఁ బూర్తిసేయ

నుంకించెను; గాని యాతఁడు "మహాత్మా, నన్ను మఱల బ్రతికింప వలదు. నేను చేసిన వేదమతోద్ధరణము ప్రశంసాపాత్రమే గాని అది గురువధమీఁద నిలిచినది, ఈపాతకముపోవుటకే నేను ఈప్రాయశ్చిత్తము చేసికొంటిని. నాభావమఱఁది యగుమండనమిశ్రుఁడు నాకంటె నధికుఁడు. నన్ను నీవు ఏయభిప్రాయముతో బ్రతికింపఁ దలఁచితివో ఆయభిప్రాయము నాబావమఱఁదివలనఁ దీఱఁగలదు" అని చెప్పెను. పిదప శంకరుఁడు ఆతనికి తారకమంత్రము నుపదేశించెను. అదియైన పిమ్మటఁ గుమారిలభట్టు ప్రాణములు విడిచెను.

శంకరుఁడు పోవునప్పటికి మండనమిశ్రుని యింటితలుపులు మూయఁబడియుండెను. నాఁడు ఆతనియింట నాబ్దికము జరుగుచుండెను. లోపల బ్రాహ్మణపూజ జరుగుచుండుటచే వీథితలుపులు వేయఁబడియుండెను. అయినను శంకరుఁడు యోగబలము కలవాఁడు గావున ఆకసమున కెగిరి లోనికిఁ బ్రవేశించెను. మండనమిశ్రుఁడు సన్న్యాసులను జూడఁడు. శిఖాయజ్ఞోపవీతములను విడుచుట వేదవిరుద్ధ మనియు నట్టివారు పాషండులనియు నాతని యభిప్రాయము. అగుటచే నాతఁడు శిఖాయజ్ఞోపవీతములను విసర్జించి కాషాయాంబరములనుధరించియున్న శంకరుఁ డాకస్మికముగా నట్టి పవిత్రసమయమున అచ్చటికి వచ్చుటచే అనేకవిధములఁ నిందింపసాగెను. అదిజూచి నిమంత్రణార్థము వచ్చియున్న బ్రాహ్మణులు ఇరువురును వ్యాసభట్టారకుఁడు జైమినియుఁ గావున మండనమిశ్రునకు సమాధానముచెప్పి యూరకుండునట్లు చేసిరి. అప్పుడు మండనమిశ్రుఁడు "నేఁడు నాచేఁ బూజింపఁబడి మాయింట భిక్ష నంగీకరింపవలయు" నని శంకరాచార్యుని వేడుకొనెను; గాని శంకరుఁడు కేవలము నీతనియింట భిక్షకుడుచుటకు వచ్చియుండలేదు? కావున "నాతో వాదింపవలెను. వాదమున నేను ఓడితినేని గృహస్థుఁడ నయ్యెదను. నీవు ఓడితివేని సన్న్యాసివి కావలయును. వాదింప నిష్టము లేనియెడల జితోస్మి యనుము. ఆమాట పలుకుట కంగీకారము లేకున్న సన్న్యాసము పుచ్చుకొనినను జాలును. అదియుఁ జేయవేని నిన్ను మూర్ఖులలోఁ బరిగణింపవలసివచ్చును" అని పలికెను. మండనమిశ్రుఁడు వాదించుటకు అంగీకరింపఁగా వ్యాసుఁడు "ఇందులకు మధ్యస్థులు ఉండవలయునుగదా? ఇందులకు మండనమిశ్రుని భార్య

యగు భారతీదేవి యొక్కతయే యర్ధాంగాలు" అని పలికెను. భారతి మాధ్యస్థము సేయుటకు మండనమిశ్రుడును శంకరుఁడునుగూడ నంగీకరించిరి. అంత భారతి వాదిప్రతివాదుల కంఠములలో పూలదండలు వేసి "ఎవరిమెడలోని పూలదండ వాడిపోవునో వారోడిపోయినట్లు ఎంచుకొనవలసినది" అని నిర్ణయించెను.

మండనమిశ్రుఁడు చేయవలసిన వైదికకార్యములు అన్నియు ముగిసినతరువాత వాదము ప్రారంభమయ్యెను. మండనమిశ్రునిపక్షమే యుక్తియుక్తముగా నున్నట్లు కాన్పించెను గాని యేడుదినములు గడచునప్పటికి ఆతనివాదము నిస్సారమై మెడలోని పూలదండ వాడిపోయెను. అది చూచి భారతీదేవి శంకరునితో "భార్యాభర్తలకు భేదము లేదు. కావున నాతో వాదించిగూడ గెలువకున్న నీకు విజయము గలుగ నేరదు" అని పలికెను. శంకరుఁడు ఆమెతోఁగూడ వాదము ప్రారంభించెను. నెలదినములకుఁగూడ వాదము పూర్తిగా లేదు; గాని క్రమముగ భారతివాదమున యుక్తి పస లేకపోవుచుండెను. అది గ్రహించి యామె శంకరుఁడు బ్రహ్మచర్యాశ్రమమునుండియే సన్న్యసించుటచే రతిరహస్యము నెఱుఁగనివాఁడని తలంచి "మహాత్మా, మన్మథునకుఁ గళ లెన్ని ? అవి స్త్రీలకు ఏయేదినములయందు ఎచ్చటెచ్చట నుండును?" అని ప్రశ్నించెను. అంత శంకరుఁడు తనకు అది అచుంబితప్రక్రియ గావున "దేవీ, నాకు నెలదినములుగడువు ఇచ్చెదవేని నీకుఁ బ్రత్యుత్తర మిచ్చెద" ననియెను. భారతి యందుల కంగీకరించెను.

ఆశ్రమభంగము గాకుండ రతిరహస్యముల నెఱుంగు నుపాయము లున్నవా యని పరీక్షించుటకు శంకరుఁ డాకాశమున కెగిరి చూడఁగా దూరమున నొకపట్టణమున నొకరాజు చచ్చిపోఁగా నాతనిని దహనము చేయుటకుఁ దీసికొనిపోవుచుండుటయు, ఆతని భార్యలు లెక్కలేనంతమంది అప్సరఃకాంతలను దలదన్నఁగల అందకత్తెలగు తరుణులు వగచుచు నాతనివెంటఁ బోవుచుండుటయుఁ గాన్పించెను. అప్పుడు శంకరుఁడు పద్మపాదుఁడు మున్నగు తన శిష్యులతో "అమరకమహారాజు చనిపోయినాఁడు. నేను ఆతని శరీరములోఁ బ్రవేశించి యాతని రాణులవలన రతిరహస్యముల నభ్యసించెదను. నేను మరల వచ్చునంతదనుక నా దేహమును జాగ్రత్తగఁ గాపాడుచుండుఁడు" అనిచెప్పి తన దేహ

మునువిడిచి అమరకుని దేహములోఁ బ్రవేశించెను. శిష్యులు ఆదేహమును నర్మదానదీప్రాంతమునందలి నిర్జనారణ్యమున ఒకచెట్టుతొఱ్ఱలో నుంచి జాగ్రత్తఁగ గాపాడఁదొడఁగిరి. అట శంకరుఁడు అమరకుని శరీరములోఁ బ్రవేశించి నిద్రపోయినవానివలె లేచి కూర్చుండెను. అదిచూచి మంత్రులుమున్నగువారు రాజు వేటలో అలసియున్నవాఁడు గావున ప్రాణములుకడముట్టియుండుననియు, నదిచూచి చచ్చిపోయినట్లు తాము భావించితిమనియుఁ దలంచి రాజును ఇంటికిఁగొనిపోయిరి. పిదప అమరకదేహమున నున్న శంకరుఁడు రాజ్యభారమంతయు మంత్రులపైనిడి తాను సర్వకాలసర్వావస్థలయందును అంతఃపురమునందేయుండి మదనసౌఖ్యములు అనుభవింపసాగెను. నాలుగైదు దినములు గడచునప్పటికి ఆతనికి ఆసౌఖ్యములెదుటఁ బ్రపంచమే కాన్పింపదయ్యెను. అతనికి తన సంగతియే మఱపువచ్చెను. ఆతఁడు గడువుపెట్టిన నెలదినములును గడచిపోయెను. "ఇదిగో వచ్చును, అదిగో వచ్చును" అని కనిపెట్టుకొనియున్న శిష్యుల యాశలునిరాశలయ్యెను. అదిచూచి వారు కళవళపడసాగిరి.

మంత్రులు రాజు ప్రకటించు వివేకమును జూచి "ఈతఁడు అమరకుఁడు గాఁడు. అమరకుని యాత్మ నాఁడే పరంజ్యోతిలో లీనమైపోయినది. మఱి పరకాయప్రవేశశక్తిగల మహాపురుషుఁ డెవఁడో యేదో కార్యము నెఱవేర్చుకొనఁ అమరకుని దేహమునఁ బ్రవేశించి యుండవచ్చును" అనియనుమానించి "లోకములో నెట్టిస్థలములయందైనను ఎవరైన నే దేనిశరీరమునుగాపాడుచుందురేని దానిని దహనము చేయవలయును" అని భటులకు ఆజ్ఞాపించిరి. ఆజ్ఞయైన వెంటనే రాజభటులు శిరసావహించి దానిని నెఱవేర్చుటకు బయలుదేఱిరి. ఈసంగతి పద్మపాదునకుఁ దెలియవచ్చెను. అంత నాతఁడు గురుదేహమునకు అపాయమును శంకించి కొందఱు శిష్యులను దానిని జాగ్రత్తగాఁ గాపాడునట్లు నియమించి తాను మఱికొందఱు శిష్యులను వెంటనిడుకొని అమరకుని రాజధానికిఁ బోయి గాయకవేషములతో రాజదర్శనమునకుఁ బోయి, అచ్చట:—

శ్లో. నేతినేత్యాది నిగమవచనేన నిపుణం నిషేధ్యమూర్తామూర్తరాశిం,
యదశక్య నిహ్నవం స్వాత్మరూపతయా జానంతి కోవిదా స్తత్త్వమసి తత్త్వం.

"ఇదికా దిదికాదని సకలమూర్తామూర్తపదార్థములను నిషేధింపఁగా సర్వనిషేధావధీభూతమైన యేసాక్షిని విద్వాంసులు స్వాత్మ

రూపముగా నెఱుంగుచున్నారో అట్టి తత్త్వమవు గాని నీవు అమరకుఁడవుగావు."

శ్లో. ఖాద్య ముత్పాద్యవిశ్వమనుప్రవిశ్య గూఢం అన్నమయాదికోశతుషజాలేక వయః,
వివిచ్య యుక్త్యవఘాతతోయ త్తండులవదాదదతి తత్త్వమసి తత్త్వం.

"అవఘాతముచేత వడ్లనుండి బియ్యమును బడయునట్లు శ్రవణ మననములచేత పంచకోశాంతరస్థమై గూఢమైయున్న యేబ్రహ్మమును విద్వాంసులు గనుంగొనుచున్నారో అట్టి తత్త్వమవుగాని నీవు అమరకుఁడవు గావు."

శ్లో. విషమవిషయేషు సంచారిణో ఝాశ్వాణ్ దోషదర్శన కశాభిఘాతతః,
స్వైరం సన్నివర్త్య స్వాంతరశ్మిభిర్ధీరాః బధ్నంతి యత్ర తత్త్వమసి తత్త్వం.

"విషమస్థలములందు దుముకులాడు గుఱ్ఱములను కొరడాప్రేటులచేత మఱలించి పగ్గములచేత బిగఁబట్టి ఇష్టస్థానమును జేర్చు నాశ్వికునివలె దోషదర్శనముచేత నింద్రియముల నింద్రియార్థములనుండి మఱలించి మనోవృత్తిరూపమైన జ్ఞానముచే బిగఁబట్టి విద్వాంసులు ఏబ్రహ్మమందు బంధించుచున్నారో అట్టి తత్త్వమవుగాని నీవు అమరకుఁడవుగావు."

శ్లో. వ్యావృత్త జాగ్రదాదిష్వనుస్యూతం తేభ్యో న్యదివపుష్పేభ్యశ్చ ఇవసూత్రం,
ఇంద్రియ పదోపాధికత్రయపృథక్త్వనవిందంతి సూరయ స్తత్త్వమసితత్త్వం.

"జాగ్రత్స్వప్నసుషుప్తులను మూఁడుఅవస్థలయందును, పూలయందు దారమువలె ననుస్యూతమై తద్విలక్షణమైయున్న యేస్వప్రకాశమును విద్వాంసులు నిరుపాధికమైన బ్రహ్మస్వరూపముగాఁ దెలిసికొనుచున్నారో అట్టి తత్త్వమవుగాని నీవు అమరకుఁడవు గావు."

శ్లో. పురుషఏ వేద మిత్యాదివేదేషు సర్వకారణ తయా యస్యసార్వాత్మ్యం,
హాటకస్యేవ మకుటాది తాదాత్మ్యం సరస మామ్నాయతే తత్త్వమసి తత్త్వం.

"కటకమకుటకుండలాదిభూషణములు బంగారమునకన్న వేఱు కానట్లు సర్వకారణమైన యేపురుషునికన్న ఈజగత్తు వేఱుకాదని వేదములు ఘోషించి చెప్పుచున్నవో ఆతత్త్వమవుగాని నీవు అమరకుఁడవుగావు."

శ్లో. యశ్చాహ మత్ర పర్యత్రణిభామినో సౌ యోసౌ విభాత రవిమండలే సోహ మితి,
వేదవాదితో వ్యతిహారతోయ దధ్యాపయత్నీ త త్తత్త్వమసి తత్త్వం.

"ఈశరీరమునఁ బ్రకాశించు పురుషుఁ డెవఁడో వాఁడే సూర్య మండలమునందు ప్రకాశించువాఁడు. సూర్యమండలమునందుఁ బ్రకాశించు పురుషుఁ డెవఁడో వాఁడే యీశరీరమందుఁ బ్రకాశించువాఁడు. ఇట్లని వేదవాదులు ఏపరమార్థమును గుఱుతించుచున్నారో అట్టి తత్త్వమవు గాని నీవు అమరకుఁడవు గావు."

శ్లో. వేదాను వచన సద్దాన ముఖ ధర్మైః శ్రద్ధయానుష్ఠితై ర్విద్యయా యుక్తైః,
వివిదఃంత్యత్యంతవిమలస్వాంతా బ్రాహ్మణాయ దృష్టిస్ష త త్త్వమసి తత్త్వం.

"వేదోక్తములైన కర్మలచేతను, ఉపాసనలచేతను, అత్యంత విమలస్వాంతులైన బ్రాహ్మణులు ఏపరతత్త్వమును ఎఱుంగ నిచ్ఛగించుచున్నారో అట్టి తత్త్వమవుగాని నీవు అమరకుఁడవు గావు."

శ్లో. శమదమో పరమాది సాధనై ర్ధీరాః స్వాత్మ నాత్మనియదన్విష్యకృతకృత్యాః,
అధిగతా మిత సచ్చిదానందరూపా నపునరిహాఖద్యం తేత త్త్వమసి తత్త్వం.

"బాహ్యేంద్రియాంత రింద్రియనిగ్రహాది రూపసాధనములచేత సచ్చిదానందరూపమైన పరబ్రహ్మమును గనుగొని ధీరులు జననమరణాది లక్షణమైన యీసంసారమునకుఁ దిరిగినారో అట్టి తత్త్వమవుగాని నీవు అమరకుఁడవు గావు." అని యీతీరున శంకరుఁడు వేదములనుండి యుద్ధరించి క్రోడీకరించిన అద్వైతానుభావములను శ్లోకరూపముగాఁ గీర్తించెను. అమృతసాగరతరంగములంబోలు నీశ్లోకములు వినఁబడిన తోడనే శంకరునకుఁ బూర్వస్మృతి గలిగెను. తోడనే యాతఁడు అమరకునిదేహమును విడిచివేసి స్వశరీరమున బ్రవేశించెను. అట నమరకునిదేహము నిర్జీవమై క్రిందఁబడిపోయి రాణులను,తక్కినవారి నెల్లరను మఱలఁ దఱిలేని దుఃఖసముద్రమున ముంచివేసెను. ఇట శంకరుఁడు తనశరీరము తోడనే లేచికూర్చుండెను; గాని అంతకుఁబూర్వమే అమరకమంత్రులచే నియమింపఁబడిన రాజభటులు శిష్యులు సమాధినిష్ఠుఁడై యున్న యోగి యని యెన్నివిధములఁ జెప్పుచున్నను వినక చితిపైనుంచి అగ్గిముట్టించుటచే కాళ్లు కాలిపోయెను. అప్పుడు శంకరుఁడు మహామహిమోపశోభితుఁడు గావున—

శ్లో. సంసార ఘోర గహనే చరతో మురారే మారోగ్ర భీకర మృగ ప్రవరార్దితస్య,
ఆర్తస్య మత్సరనిదాఘనిపీడితస్య లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబం.

అని యీరీతిగ శ్రీహరిని బ్రార్థింపఁ దొడఁగెను. తోడనే యాతనికాళ్లు యథాపూర్వముగ నుపస్థితంబు లయ్యెను.

ఈవిధముగా ఆశ్రమధర్మము భగ్నముగాకుండ నామహానుభావుఁడు రతిరహస్యముల నామూలాగ్రముగఁ దెలిసికొని మండనమిశ్రునియింటికివచ్చి మఱల భారతీ దేవితో వాదము ప్రారంభించెను; గానియొకటిరెండుదినములయందే ఆమె యోడిపోయి శంకరుని జయము నంగీకరించెను. తోడనే మండనమిశ్రుఁడు సన్న్యసించి సురేశ్వరాచార్యుఁడు అను పేరు వహించెను. భారతీదేవి శాపగ్రస్తయై భూమి నవతరించిన సాక్షాద్భారతియే గావున శంకరుఁడు అచ్చటచ్చట నిర్మింపఁగల మతపీఠములయందుఁ దాను సాక్షాత్కరించి యభీష్టములను నిర్వహించునట్లు శంకరునకు వరమిచ్చి తాను సత్యలోకమునకుఁ బోయెను. పిదప శంకరుఁడు ఆప్రాంతములయందు అద్వైతమతరహస్యములను వెల్లడిచేసి దక్షిణ భారతదేశమునకు బయలుదేఱెను.

శంకరాచార్యుఁడు శ్రీశైలమునకువచ్చి యుండఁగా నచ్చటి కొక కాపాలికుఁడు వచ్చి ఆచార్యుని దర్శించి "మహాత్మా, నేను ఒకకాపాలికుఁడను. భైరవపూజాధురంధరుఁడను. కొన్నిదినములు పూజచేయఁగా స్వామి నాకు స్వప్నమునఁ గాన్పించి, వత్సా, నీయర్చనకు ఆనందించితిని. మహారాజు శిరమును గాని సర్వజ్ఞుఁ డగు మహాత్ముని శిరస్సుగాని తెచ్చి హోమము చేసితివేని నేను నీయభీష్టము నెఱవేర్చెద నని చెప్పిపోయెను. మహారాజు శిరముకంటె మహాపురుషుని శిరస్సు సులభసాధ్యము గాన నేను చాలదినములనుండి దానినిమిత్తమే ప్రయత్నించుచున్నాను. ఇట్లుండఁగాఁ దా మిచ్చటకుఁ దయచేసినట్లు తెలియవచ్చినది. సాక్షాత్తుగ భారతీదేవిని జయించి మండనమిశ్రునకు సన్న్యాస మిచ్చిన మీకంటె సర్వజ్ఞుఁడు లోకమున మఱియొకఁడు లేఁడుగదా? అందును మీరు కేవలము బ్రహ్మజ్ఞానానందమున మునిఁగియుండువారు. మీమతమున శరీరము మున్నగునవి మిథ్యలు గదా? కావున మీశిరస్సు నాకు ఇచ్చెదరేని సంతోషించెద" నని యనేకవిధములఁ బ్రార్థించెను. అదివిని శంకరుఁడు కనికరించి "ఓయీ,

నేను సమాధిలోఁ గూర్చుండి ఒడలుమఱచి యుందును. అప్పుడు నీవు వచ్చి నాశిష్యులకుఁ దెలియకుండ నాశిరమును ఖండించికొని పొమ్ము" అని యాజ్ఞాపించి యోగనిష్ఠుఁ డయ్యెను. కాపాలికుఁడు అందులకుఁ బరమానందభరితుఁడై ఖడ్గమును బూజించి శంకరుని సమీపించి కత్తి యెత్తగా శ్రీమహావిష్ణువు పద్మపాదుని శరీరమున బ్రవేశించి నారసింహావతార మెత్తి కాపాలికుని రూపుమాపివేసెను. ఈగందరగోళమువలన యోగమును విడిచి శంకరుఁడు కాపాలికునిప్రేవులను మెడలో ధరించి యెదుట సాక్షాత్కరించియున్న నృసింహమూర్తిని అనేకవిధములఁ గొనియాడెను. కొంతసేపటికి శాంతించి శ్రీహరి పద్మపాదుని శరీరములో నుండి వెడలిపోయెను. పద్మపాదుఁడు గొప్ప నిద్రపోయినవానివలె ఆవులించుచు కూర్చుండి "గురుదేవా, ఇక్కడ నేదో గందరగోళము జరిగినట్లున్నది. ఏమి?" అని యడిగెను. శంకరుఁడు అంతయుఁ జెప్పెను. అది విని పద్మపాదుఁడు "లోక మంతయు అద్వైతామృతసేచనమున నవజీవనమును బడయవలసియున్నపుడు క్షుద్రుఁ డగు కాపాలికుని యభీష్ట మెట్లు నెఱవేఱును?" అని చాల నానందించెను.

శ్రీశైలమునుండి శంకరుఁడు గోకర్ణము హరిహరములకుఁ బోయెను. హరిహరమునందే శంకరుఁడు చనిపోయిన బ్రాహ్మణకుమారుని బ్రతికించి యక్కడనుండి శ్రీబలి అను అగ్రహారమునకుఁ బోయెను. అచ్చట ప్రభాకరుఁడు అను నొకబ్రాహ్మణుఁడు ఉండెను.ఆతని కొక్కఁడే కుమారుఁడు. ముద్దుబిడ్డనిఁ దీసికొని యాతనిభార్య యొకనాఁడు స్నానార్థము నదికిఁ బోయెను. ఆయమునాతీరమున నొకముని తపస్సు చేసికొనుచుండఁగా ఆయిల్లాలు తన కుమారునిఁ జూచుచుండవలసినదని యాతనిం బ్రార్థించి తాను ఏటిలో దిగెను. మునియు బాలకుఁ డిక్కడనే యుండునెక్కడకుఁ బోఁగలఁడు అని తలంచి నిమీలితనేత్రుఁడై తపోనిష్ఠుఁ డయ్యెను. అంతట బాల్యచాపల్యమున నాపాపఁడు ఇటునటు కొంతతడవు తిరిగి తుదకు దైవవశమున ఏటిలోఁ బడెను.అదిచూచి కొందఱు మొత్తుకొనుచుఁ బోయి వానినిఁ దీరమునకుఁ జేర్చిరి; గాని అప్పటికప్పుడే యాబుడుతఁడు చనిపోయెను. అదిచూచి ప్రభాకరునిభార్య చాల విచారింపఁదొడఁగెను. అదిచూచి ముని యామెదుఃఖమును జూడఁజాలక పరకాయప్రవేశసామర్థ్యముగలవాఁడు; గావున దటాలునఁ

దానే యాబాలుని దేహములోఁ బ్రవేశించెను. ప్రభాకరుని భార్య తన కుమారుఁడు మఱల బ్రతికినందులకుఁ జాల నానందించుచు నింటికిఁ బోయెను.

కాని బాలకుఁడు మాత్రము అది మొదలు మాటలాడీ యెఱుఁగఁడు. అందులకుఁ బ్రభాకరుఁ డనేకము లగు గొప్ప ఔషధముల నిప్పించెను; గాని ప్రయోజనము లేకపోయెను. ఇట్లు ఐదాఱేండ్లకుఁ బైగా గడచిపోయెను. అయినను ఆబాలుని నోటనుండి యొక్కమాట వెడలుటయైనను ఎవరు నెఱుంగరు. ఎల్లప్పుడును ఋషివలె మౌనియై యుండు ఆబాలకునిఁ జూచి తల్లిదండ్రు లదేపనిగ విచారించుచుండిరి. ఇట్లుండ త్రిలోకపూజ్యుఁ డగు శంకరాచార్యుఁడు గ్రామమునకు వచ్చె నని విని ప్రభాకరుఁడు తనకుమారునిఁ దీసికొనిపోయి కాళ్లమీఁదఁ బడవేసి రక్షింపవలసిన దని ప్రార్థించెను. అప్పుడు శంకరుఁడు "కస్త్వం కిమేవం జడవత్ప్రవృత్తః" అనఁగా, నీవెవఁడవు? ఇట్లు జడునివలె నుండుటకుఁ గారణమేమి?" అని ప్రశ్నించెను. అందులకు ఆబాలుఁడు చెంతనున్న వారందఱును అబ్బురపడునట్లు,—

శ్లో. నాహంజడఃకింతుజడఃప్రవర్తతే మత్సన్నిధానేనసందిహేంద్రియో,
షడూర్మిషడ్భావవికారవర్జితం సుఖైకతానంపరమస్మితత్పదమ్.

"నేను జడుఁడఁ గాను. ఇఁక నేమనిన? జడములైన దేహేంద్రియమనో బుద్ధులు నాసన్నిధానమహిమవలనఁ బ్రవర్తిల్ల సమర్థములై యున్నవి. అట్టి నేను జడుఁడ నెట్లగుదును? షడూర్మివర్జితమై, షడ్భావవికారవర్జితమై నిరతిశయానందరూపమైన యే పరమపదము గలదో అదియే నా స్వరూపము. ఈవిషయమున సంశయము లేదు"అనిపలికెను. అందఱును నిర్విణ్ణులైరి. అంత శంకరుఁడు ప్రభాకరునితో "ఈబాలుఁడు దైవానుగ్రహమువలనఁ దొంటిజన్మమునందే బ్రహ్మజ్ఞానమును సంపాదించెను. ఇఁక నీతఁడు లౌకికవ్యాపార ప్రవృత్తుఁ డగుటయు మీయందఱితోడను మాట్లాడుటయు కల్ల. ఈతఁ డెప్పుడును బ్రహ్మజ్ఞానానుభవానందమున మునిఁగి యుండును" అని యోజించి ఆతఁడు చెప్పినమాటల యందుబ్రహ్మజ్ఞానము కరతలామలకమువలెసులభముగాబోధయగుచుండుటచే హస్తామలకుఁడు అని పేరు పెట్టెను. పిదప హస్తామలకుఁడు తన్ను శిష్యుఁడుగా నంగీకరింపవలసిన దని ప్రార్థించిన శంకరుఁడు అంగీకరించి

అక్కడనుండి తుంగభద్రానదీతీరమునకుఁ బోయి శారదాప్రార్థనమున అచ్చట శృంగేరీపీఠము అను పేరుతో శారదాపీఠమును బ్రతిష్ఠాపించెను.

అనితరసాధ్యమైన బ్రహ్మసూత్రముల యంతరార్థమును దాను భాష్యము వ్రాసి వెల్లడించినను ఆభాష్యము సామాన్యజనదురవగాహమై యుండుటఁ జూచి శంకరుఁడు దానికిఁగూడ టీకయవసరమైయున్నదని నిశ్చయించుకొనెను. ఈసంగతిఁ దెలిసికొని సురేశ్వరాచార్యుఁడు (మండనమిశ్రుఁడు) ఆటీక వ్రాయుటకుఁ దనకు అనుజ్ఞ యీయవలసినదని ప్రార్థింపఁగా శంకరుఁడు అంగీకరించెను గాని తక్కినశిష్యులు అందులకు అంగీకరింపక "సురేశ్వరుఁడు వాదమున నోడిపోవుటవలన సన్న్యసించి మీశిష్యుఁడయ్యెనే గాని యాతనిపూర్వమీమాంసాభిమానము పూర్తిగా వదలిపోయియుండదు. కావున సూత్రభాష్యవార్తికము నాతఁడు వ్రాసినచో మీయభిప్రాయమునకుఁ గేవలము విరుద్ధముగా నైన నుండ వచ్చును. లేకున్న మీయాశయములు పూర్తిగాఁ బ్రకటన గావింపఁబడక యైన నుండవచ్చును. అగుటచే నందులకుఁ బద్మపాదుఁడే తగినవాఁడు" అని యైకకంఠ్యముగాఁ దమ యసమ్మతిని బ్రకటించిరి. సురేశ్వరాచార్యునిశక్తి తనకుఁ బూర్ణముగాఁ దెలిసినను ఆయొక్కని నిమిత్తము పదుగురుశిష్యుల మనస్సులకు అసంతృప్తిగలిగించి గృహకల్లోలముల కవకాశమిచ్చుటమంచిదిగాదని నిశ్చయించి శంకరుఁడు వారు కోరినట్లుసూత్రభాష్యవార్తికము రచించుటకుఁ బద్మపాదునకేఅనుజ్ఞయిచ్చిసురేశ్వరునకు తైత్తిరీయ కారణ్యోపనిషత్తులకు వార్తికము వ్రాయునట్లు సెలవు ఇచ్చెను. సురేశ్వరుఁడు ఈయభ్యనుజ్ఞను శిరసావహించి యట్లే గావించి గురుకరుణకుఁ బాత్రుఁడయ్యెను.

పిదపఁ బద్మపాదుఁడు సూత్రభాష్యవార్తికము ముగించి తనపాండిత్యమును జన్మస్థలమున వెల్లడిసేయఁగోరి గురుదేవుని సెలవు బడసి బయలుదేఱిపోయెను. ఈసమయమునందే తనమాతృదేవతయగు ఆర్యాంబ రోగపీడితయై మరణోన్ముఖయై యున్నదని తెలిసికొని శంకరుఁడు యోగమహిమవలన క్షణములోఁ గాలటికిఁ బోయి సాక్షాత్కరించెను. ఇఁకఁ దనకంట్లకుఁ గాన్పింపఁ డనుకొన్న ముద్దులకొడుకు కాన్పించుటచే నామె యుప్పొంగిపోవుచు నాతనిం గౌఁగిలించుకొని ముద్దాడుచుఁ బ్రేమవచనములను బలుకసాగెను. అందులకు శంకరుఁడు

తల్లికి వైరాగ్యముఁ గలిగించి పరబ్రహ్మమును గుఱించి బోధింపఁదొడఁగెను. కాని యామె "నాయనా, నాకిది యేమియుఁ దెలియుటలేదు. సగుణబ్రహ్మము నుపదేశింపుము" అని చెప్పెను. వల్లె యని శంకరుఁడు శివునిఁ బ్రార్థింపఁగా తద్దూతలైన శివదూతలు సాక్షాత్కరించిరి; గాని ఆర్యాంబ శివలోకమునకుఁ బోవుటకు అంగీకరింపనయ్యెను. శంకరుఁడు పిదప,

శ్లో. "భుజగాధిపభోగతల్పభాజం కమలాంకస్థకల్పితాంఘ్రిపద్మం,
అభివీజిత మాదరేణ నీలా వసుధాభ్యాం చలమానచామరాభ్యాం.

శ్లో. విహితాంజలినా నిషేవ్యమాణం వినతానందకృతా గ్రతో రథేన,
ధృతమూర్తిభి రస్త్రదేవతాభిః పరితః పంచభి రంచితోపకంఠం."

అని యీరీతిగ శ్రీహరిని నుతించెను. కొంతసేపటికి ఆర్యాంబ భౌతికదేహమును విడిచి వైకుంఠమునకుఁ బోయెను.

శంకరుఁడు అవసానకాలమున దహనాదిసంస్కారములు స్వయముగఁ జేసెద నని వాగ్దానము చేసియుండెను గదా ? ఆవిషయమును గమనించి యాతఁడు తల్లికి దహనాదికర్మలు చేయఁ బ్రయత్నించుచుండఁగా సన్యాసికి కర్మాధికారము లేదని చెప్పి ఆపని చేయవలదని బంధువులందఱును నిరాకరించిరి; కాని శంకరుఁడు అందులకు జంకి వెనుదీయలేదు. ఆతని యభినివేశము చూచి బంధువులు కట్టెలు మున్నగునవి చిక్కకుండఁ జేసిరి. అంతట శంకరుఁడు చాలఁ గోపించి "కేరళీయులకు వేదాధికారము లేకుండునట్లును, వారి శ్మశానములు గృహోపకంఠములయందే యుండునట్లును, యతీశ్వరులు వారియిండ్లలో భిక్షసేయకుండునట్లును శపించి, యోగాగ్నిచే తల్లికి దహనసంస్కారము చేసి సమంత్రకముగా ఉత్తరక్రియలు గావించి వెడలిపోయెను.

ఇంతలోఁ బద్మపాదుఁడు వచ్చి యాతనిం గలిసికొనెను. ఖిన్నముఖుఁడై యుండుటఁ జూచి శంకరుఁడు కారణ మడుగఁగా నాతఁడు "నేను నా మేనమామయింటికిఁ బోయితిని. ప్రసంగవశమున నేను ఆతనికి సూత్రభాష్యమునకు వార్తికమువ్రాసితి. నని చెప్పి వినిపించి రామేశ్వరముపోయి వచ్చునంతదనుక భద్రము చేయవలయు నని ప్రార్థించి దాని నాతనికిచ్చి నేను వెడలిపోయితిని. కొన్ని దినములకు మఱల వచ్చి యడుగఁగా నాగ్రంథములో ప్రభాకరమతమతము ఖండింపఁబడినది గావున

నందులకుఁ గోపించి దానిని మనస్సునందే యుంచుకొని నేను అట్లు పోయిన వెంటనే నాశనముచేసి 'నాయిల్లు పరశురామప్రీతి యైపోయినది. అప్పటినుండియు నీగ్రంథము గాన్పించుటలే'దని చెప్పెను. నే నందులకుఁ జాల వగచి మఱల వ్రాయుదమని ప్రయత్నింపఁగాఁ బూర్వభావములేవియు నాకిప్పుడు స్ఫురించుట లేదు." అని ప్రత్యుత్తరము చెప్పి తలవంచుకొనెను. శంకరుఁడు ఆగ్రంథమును శృంగేరీపీఠమున నున్నపుడొకసారి వినియుండెను ; కావున "నేను చెప్పెద వ్రాసికొనుము" అని అంతయు నేకరువుపెట్టెను. పద్మపాదుఁడు వ్రాసికొని గురువు ఏకసంథాగ్రాహిత్వమునకు అబ్బురపడి అసాధారణమైన తనగ్రంథము నుద్ధరించినందులకు ఆతనికి అనేకవందనముల నర్పించి కొనియాడెను.

అక్కడనుండి శంకరుఁడు శృంగేరికి వచ్చి వెంటనే దుర్మతఖండనమును జేయుటకు అక్కడనుండి తరలెను. దేశములో అనేకవిధములైనదురాచారములు ఉండెను. శాక్తేయులు, గాణాపత్యులు, శైవులు మున్నగు అనేక కుమతములవారు ఈతని నెదిరించి వాదమునకు డీకొనిరి; కాని శంకరుఁడు ఆమతాచార్యుల నెల్లర నోడించి అంతటను నిష్కళంకమైన అద్వైతమును బ్రతిష్ఠాపింపసాగెను. ఈతీరున నాతఁడు తొలుత పాండ్యచోళద్రవిడవిదర్భకర్ణాటకాంధ్రదేశములను బరిశుద్ధములు గావించి గోకర్ణమునకుఁ బోయెను. అచ్చట నీలకంఠుఁడు అను నొక గొప్ప పండితుఁడు ఉండెను. ఆతఁడు శైవుఁడు. బ్రహ్మసూత్రములకు శైవభాష్యము వ్రాసిన మతాభిమాని గాని శంకరునితో వాదించి యోడిపోయెను. ఆవల శంకరుఁడు సౌరాష్ట్రముమీఁదుగా ద్వారకానగరమునకుఁ బోయి అక్కడనుండి ఉజ్జయినిసేరుకొని ఆనగరమున నున్న భట్టభాస్కరుని జయించి తన శిష్యునిగాఁ జేసికొని, ఇంక ననేకులను దన మతములోఁ జేర్చుకొని, పిదప కామరూపదేశమునకుఁ బోయెను.

అక్కడ అభినవగుప్తుఁడు అను నొక మాంత్రికుఁడు గలఁడు. ఈతఁడుగూడ వాదమున నోడి శంకరునకు శిష్యుఁ డయ్యెను; గాని కొన్నిదినములు వెంట నరిగి తన మతమును ఖండించిన అక్కసును మనసులో నుంచికొని యున్నాఁడు. కావున శంకరునిమీఁద మంత్రము నుబ్రయోగించెను. శక్తి శంకరునకు భగంధరరోగమును గలిగించెను.

యోగమహిమవలన శంకరుఁడు దానిని లెక్కసేయలేదుగాని శిష్యులు బలవంతముచేసి యౌషధపానము చేయించిరి. అయినను బ్రయోజనము లేకపోయెను. కొన్నిదినములకుఁ బద్మపాదుఁడు సంగతియంతయు గ్రహించి మంత్రమును అభినవగుప్తుని మీఁదికిఁ ద్రిప్పివేసెను. ఆగురుద్రోహి దానిని ద్రిప్పుకొనలేకపోయెను. రోగము శంకరుని శరీరమున మాయమై అభినవగుప్తునకు సంక్రమించి నానాబాధలు పెట్టి తుదకు యమపురమునకుఁ గొనిపోయెను. ఇట్లు అనేకమతములను ఖండించి అనేకవిపత్తులను దాఁటి శంకరుఁడు శృంగేరియందువలెనే ద్వారక, బదరికాశ్రమము, జగన్నాథములయందుగూడ మఠములను బ్రతిష్ఠించి శిష్యులలోఁ దగినవారిని అచ్చటచ్చట నాచార్యులుగా నియమించి అనేకదేవాలయములలోఁ జక్రప్రతిష్ఠను మఱలఁ గావించి మహిమోపశోభితముగాఁ జేసెను.

ఇట్లు అద్వైతప్రతిష్ఠ సేసిన పిదప శంకరుఁడు హిమగిరికిఁ బోయి తచ్ఛిఖరమునందలి స్వర్ణనదియొద్దను బ్రహ్మానుసంధానము ప్రారంభించెను. ఇట్లుండఁగా నాతని గురుబ్రహ్మ యగు గౌడపాదుఁడు సాక్షాత్కరించి తాను వ్రాసిన మాండూక్యోపనిషత్కారికకు శంకరుఁడు వ్రాసిన టీకను జూచి తన యభిప్రాయమునకు విరోధముగ లేకపోవుటయు, విశేషించి తనభావములను జక్కఁగఁ బ్రకాశింపఁజేయుటయుఁ జూచి పరమానందభరితుఁడై యనేకవిధముల శంకరుని నుతించి తిరోహితుఁడయ్యెను. మఱల శంకరుఁడు బ్రహ్మానుసంధానమునఁ బ్రవృత్తుఁడయ్యెను. కాశ్మీరదేశములో శారదాదేవియాలయ మొకటి గలదు. అందొక మంటపమున సర్వజ్ఞపీఠము అను నొక పీఠముగలదు. దానికి నాలుగుదిక్కులను నాలుగుద్వారములు ఉన్నవి. ప్రాక్పశ్చిమోత్తరద్వారములు తెఱువఁబడియే యున్నవి. కాని దక్షిణద్వారము మాత్రము మూయఁబడియుండెను. దాక్షిణాత్యులు అనేకులు పోయి ఆపీఠము నధిష్ఠింపఁగోరి దక్షిణద్వారమును భేదింపఁదలఁచిరి గాని యచ్చటి పండితులతో వాదించి గెలువఁజాలకపోయిరి. ఈవార్త శంకరునకుఁ దెలియవచ్చెను. తోడనే యాతఁడు శిష్యసహితుఁడై యచ్చటకుఁ బోయెను. అదిచూచి అచ్చటివారు శంకరుని వాదమునకుఁ బిలిచి యందోడిపోయిరి. అంతట శంకరుఁడు పీఠము నధిష్ఠింపఁబోఁగాఁ దదధిష్ఠానదేవతయగు

సరస్వతి "వలదు. వలదు. నీవు సర్వజ్ఞుఁడవేగాని మండనమిశ్రుని భార్యను జయింపఁగోరి సన్న్యాసి వయ్యు అనంగకేళిం దేలినవాఁడవు. కావున నీవు ఈపీఠము నెక్కుటకుఁ దగవు" అని పలికెను. అది విని శంకరుఁడు మందహాసము గావించి ఆమె మఱల మాట్లాడకుండునట్లు ప్రత్యుత్తర మిచ్చి పీఠము నెక్కెను. అచ్చటివా రందఱు నాతనికి శిష్యులైరి. పిదప నాతఁడు బదరికాశ్రమమునకుఁ బోయి కొంతకాలము ఉండి కేదార తీర్థమునకుఁ బోయి దేవతలచేఁ బ్రార్థింపఁబడి ఇఁకఁ దాను భూలోకమునఁ జేయవలసిన పని లేకపోవుటచే భౌతికశరీరమును విడిచి నిజస్వరూపము ధరించి "దివ్యవైభవముతో వృషభవాహనారూఢుఁడై కైలాసమునకుఁ బోయెను."

శ్లో. శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణం
సూత్రభాష్యకృతౌ వందే భగవంతౌ పునః పునః.

---

15. బమ్మెరపోతరాజు

ఏకశిలానగరమున కేసన అను నొక నియోగిబ్రాహ్మణుఁడు ఉండెను. ఆతని భార్యపేరు లక్కాంబ. ఈదంపతులకు తిప్పరాజు, పోతరాజు అను నిరువురు కుమారులు పుట్టిరి. పోతరాజు బాల్యమునఁ బశువులం గాచుచుండెను. ఒకనాఁ డాతఁడు సమీపమునందలి యొక పర్వతముమీఁదఁ బశువులను మేపుచుండఁగా చిదానందయోగి యను నొకయోగి కానంబడియెను. తోడనే పోతరాజు ఆయోగిపుంగవునకు భయభక్తులతో నమస్కరించి నిలిచెను. అంత యోగియు నానందించి యాబాలకుని దీవించి మంత్రోపదేశము గావించి పంపెను. పిదప పోతరాజు ఆమంత్రమును జాల భక్తితో జపించెను. మంత్రబలమువలన నాతఁ డఖండపండితుఁడై గొప్పకవి యయ్యెను.

ఒకప్పుడాతఁడు రాత్రి చంద్రగ్రహణపుణ్యకాలమున స్నానము చేయుటకు గంగాతీరమునకుఁ బోయి స్నానసంధ్యాద్యనుష్ఠానములన్నియు నెఱవేర్చుకొని జపనిష్ఠుండై యుండఁగా శ్రీరామచంద్రుఁడు

సాక్షాత్కరించి తన నామాంకితంబుగా మహాభాగవతమును దెనిఁగింపు మని చెప్పి దీవించి యంతర్హితుఁ డయ్యెను. పోతరాజును వెంటనే యిలు సేరి యీవృత్తాంతము నెల్లరకు నెఱింగించి యొకశుభముహూర్తమున,

క. "పలికెడిది భాగవత మఁట, పలికించెడివాఁడు రామభద్రుం డఁట నే
పలికిన భవహర మగునఁట, పలికెద వేఱొండు గాథ పలుకఁగ నేలా ?.

క. కొందఱకు తెనుఁగు గుణమగు, కొందఱకును సంస్కృతంబు గుణమగు రెండుం
గొందఱకు గుణము లగు నే, నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్."

అని నిశ్చయముచేసికొని భాగవతమును ఆంధ్రీకరింపఁ బ్రారంభించెను.

పోతరాజు చాలబీదవాఁడు. ఆతనియింట నొకపూటకే గాని యెప్పుడును రెండవపూటకుఁ జాలునంతభోజనసామగ్రి లేకుండెను. వ్యవసాయముచేసి యాతఁడు ధాన్యము పండించుచుండెడివాఁడుగాని ఆధాన్యములోఁ జాలవఱకు అతిథిసమర్చనము నిమిత్తమే ఖర్చు అయిపోవుచుండెను. ఇంత దారిద్ర్యము ననుభవించుచుండియు నాతఁడు రాజసంస్థానములకుఁ బోయిగాని సంపన్నులయిండ్లకుఁ బోయిగాని, తన కవిత్వమును విని యానందించుటకుఁ దనయింటికి వచ్చిపోవువారినిఁ గాని ఒక్కకాసైనఁ గోరి యెఱుఁగఁడు. ఒకప్పుడు ఆతఁడును కుమారుఁడును బొలములో నుండిరి. కుమారుఁడు దుక్కిదున్నుచుండెను. పోతరాజు గట్టుమీఁదఁ గూర్చుండి యుండెను. అప్పుడు పోతరాజు 'బావమఱఁది యగు శ్రీనాథమహాకవి పోతరాజుతో మాట్లాడుటకుఁ బదార్గురు బోయీల పల్లకిలో వచ్చుచుండెను. శ్రీనాథుఁడు రాజసంస్థానములలో మెలఁగుచు వారిచేఁ జాల గౌరవింపఁబడుచు నఖండవైభవము ననుభవించుచుండెను. పోతరాజు గూడ నట్లే యుండవలయు నని యాతని యభిప్రాయము. ఎన్నిమాఱులు చెప్పినను బోతరాజు అందులకు అంగీకరింపఁ డయ్యెను.

పల్లకిలో నున్న శ్రీనాథుఁడు చేనిగట్టుమీఁదఁ గూర్చుండి పోతరాజు కుమారునిచే దున్నించుచుండుటఁ గాంచి తన ప్రభావము వారికిఁ దెలుపఁగోరి పల్లకీముందు మోయు బోయీలను 'కొమ్ము విడిచి పొండు' అని యాజ్ఞాపించెను ఆతని సెలవుప్రకారము చాకలవాండ్రు వదలి పోయినను ఆకొమ్ము శ్రీనాథుని ప్రభావమువలన మనుష్యుల భుజముల

మీఁద నున్నట్లే యుండి పల్లకి ముందునకుఁ బోవుచుండెను. ఇదిచూచి పోతన్న కుమారుఁ డగు మల్లన్న తండ్రికి సంగతి యంతయుఁ దెలిపెను. అంతఁ బోతన్న "కుమారా, నీకు అబ్బురమేల? నీవు దాపటియెద్దును విప్పివేసి దుక్కి దున్ను" మని చెప్పెను. మల్లన్న అట్లుచేయఁగా నాగలి రెండవయెద్దు లేకపోయినను యథాప్రకారముగ భూమినిఁ జీల్చికొని పోవుచుండెను. అదిచూచి శ్రీనాథుఁడు వెనుకటి బోయీలను గూడ కొమ్ము విడిచిపోవునట్లు ఆజ్ఞాపించెను. వాండ్రును విడిచిపోయిరి గానియొక్క మనుష్యుఁడైన తాకకున్నను పల్లకీ యథాప్రకారముగఁ బోవుచుండెను. అదచూచి పోతన్న కుమారుని వలపటియెద్దునుగూడ విప్పివేయుమని చెప్పెను. మల్లన అట్లే చేయఁగా నాగలి యథాప్రకారముగనే నడచి పోవుచుండెను. ఇట్లు పోతన్న శ్రీనాథుఁడు నొకరిప్రభావము నొకరు చూపుకొనిరి.

ఇంతలో శ్రీనాథుఁడు పోతరాజును సమీపించెను. తోడనే యాతఁడు పల్లకి దిగివచ్చి హాలికులకుఁ గుశలమాయని యడిగెను. అందులకు ఏమియుఁ గోపింపక పోతన్న—

ఉ. "బాలరసాలసాలనవపల్లవకోమలకావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపుఁ గూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి గహనాంతరసీమలఁ గందమూలగా
ద్దాలికులైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై"

అని ప్రత్యుత్తర మిచ్చెను. ఇదివిని శ్రీనాథుఁడు వేళాకోళము మానివేసెను. పిదప నిరువురును. ఇంటికిఁ బోయిరి. భోజనానంతరము శ్రీనాథుఁడు "బావా, ఈదారిద్ర్యాంబుధి నీదుటకు నీకింకనువినుగుపుట్టలేదు. జగత్తు నంతను జయింపఁగల పండితుఁడవు. వశ్యవాక్యుఁడ వగు మహాకవివి. నీవు ఇప్పుడు తెనిఁగించుచున్న భాగవతమును గర్ణాటక మహారాజునకు అంకితము చేసి ఆతనివలన మహోన్నతసత్కారములం గాంచి దేవేంద్రవైభవము ననుభవింపరాదా?" అని చెప్పెను. కాని, పోతన్న అందుల కేమియుఁ బ్రత్యుత్తరము చెప్పక యూరకుండెను. శ్రీనాథుఁడు మౌన మంగీకార మని యూహించి తన స్వగ్రామమునకుఁ బోయి రాజుతో "నీపుణ్యము పుచ్చినది. మహాకవి యగుపోతరాజు ఆంధ్రమహా

భాగవతమును నీకు అంకితముచేయుటకు అంగీకరించ" నని చెప్పెను. అది విని రాజు మహానందసాగరమున మునిఁగిపోయెను.

శ్రీనాథుఁడు వెడలిపోయినతరువాత పోతరాజు అంగణమునఁ గూర్చుండి "అయ్యో, శ్రీనాథుఁ డాడిన మాటలకు నేను ఏల ప్రత్యుత్తర మీయనైతిని? ఆతఁడు నామౌన మంగీకారముగా భావించి పోయి రాజుతోఁ జెప్పియుండునేమో గదా? ఎన్నఁడును లేనిది నాకు నేఁడీ మొగమోటమేల కలిగెను? భాగవతమును గొనిరమ్మని రాజు నాకు వర్తమానము సేయునుగాఁబోలు? ఈ యకున్నఁ గోపించుఁ గాఁబోలు? అని కొంతతడవు వగచి "ఈ యకున్న రాజు నన్నేమిసేయఁగలఁడు? పరాత్పరుఁడే నాకు దిక్కు. ఆతనిని నమ్మియున్న నన్ను కాపాడుట కాతఁడే సిద్ధుఁడై యుండు" నని ధైర్యము తెచ్చుకొని తన యనాలోచిత కృత్యమును దలంచికొని తన్నే నిందించుకొనుచుఁ గన్నులు మూసెను. తోడనే అశ్రుసంసిక్తనయనయై వాణి యాతని కన్నులలో సాక్షాత్కరించెను. అంత నాతఁడు సంగతి యంతయు గ్రహించుకొని చేతులు జోడించి.

ఉ. "కాటుకకంటినీరు చనుకట్టుపయింబడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలి కోడల, యోమదంబ, యో
హాటకగర్భురాణి నిను నాఁకటికిం గొనిపోయి యల్లక
ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్మ భారతీ."

అని యామె నూరడించి పొలమునకుఁ బోయెను.

"పోతరాజు భాగవతాంధ్రీకరణము ప్రారంభించి చాలదినములైనది ఇంతవఱకు గ్రంథము పూర్తియై యుండును. అతఁడు ఇంకను ఏలరాఁడయ్యెను? మనమేపోయిచూచివత్తము" అని యుత్సాహమును బట్టఁజాలక యొకనాఁడు కర్ణాటకరాజు వేట నెపమున అనంతసేనాసహితుఁడై పోతరాజు కృతికన్యను పెండ్లియాడుటకు ఏకశిలానగరమునకుఁ దరలివచ్చి యూరుబైట విడిసి తనరాకఁ దెలిపిరమ్మని యొకభటునిఁ బంపెను. వాఁడు పోవునప్పటికి పోతరాజు యజ్ఞవరాహావతారఘట్టము నాంధ్రీకరించుచుండెను. అగుటచే శ్రీహరి వరాహరూపియై పోతన్న యింటిముందు చెలగాట మాడుచు లోపలి కెవ్వరినిఁ బోనీయకుండెను. ఆవరాహము రాజభటుని అల్లంతనే చూచి గుఱ్ఱుమని ధ్వని

చేయుచుఁ గం డ్లెఱ్ఱఁ జేసి భయపెట్టి వానిని వెనుకకుఁ దఱిమివేసెను. వాఁడుపోయి పందివృత్తాంతము సెప్పఁగా రాజు "ఛీ, పందికిజడిసి పాఱివచ్చితివా?" యని వానినిఁ దిట్టి మఱినలుగుర నంపెను; గాని వాండ్రుకూడ దానిని జయింపలేకపోయిరి. వాండ్రు దానినిఁ గొట్టఁ బోయి తామే గాయపడి వెడలిపోయిరి.

అదిచూచి రాజు సేననంతను వెంటనిడుకొని అక్కడకు వచ్చెను. పరివారసహితుఁడైన రాజును జూచినతోడనే వరాహము కండ్లెఱ్ఱఁజేసి మఱల విజృంభించెను. మఱల సంకులసమరము ప్రారంభ మయ్యెను. ముందున కుఱికిన రాజభటు లందఱును భూమిపైఁ బడిపోవుచుండిరి. వారినిఁ జూచి తక్కినభటులు వెనుదీయుచుండిరి. ఇదిచూచి రాజు స్వయముగఁ గత్తిదూసెను; గాని దానిని జయింపఁజాలకపోవుటయే గాక గాయములుగూడఁ దినియెను. ఈకలకలం బాలకించి యిదియేమో యని పోతరాజు వీధిలోనికివచ్చి చూచి తెల్లవోయెను. రాజు ఆతని నారసి "మహాత్మా, అపరాధిని, రక్షింపవలెను." అని ప్రార్థించెను. తోడనే వరాహము అంతర్హిత మయ్యెను. అప్పుడు రాజువచ్చి పోతరాజు పాదములమీఁద వ్రాలి "నీసామర్థ్య మెఱుఁగఁజాలక కవిసామాన్యునిగాఁ దలంచి నిన్ను బలవంతపఱిచియైన భాగవతమును గృతినందవలయు నని వచ్చితిని. అట్లు వచ్చినందులకుఁ దగిన ప్రాయశ్చిత్త మైనది. ఇఁక నేను మగిడిపోయెదను. కవిబ్రహ్మా, నా సేనను బ్రతికింపుము. అంతకన్న నా కేమియు వలదు" అని ప్రార్థించెను. అంతట పోతరాజు కర్ణాటకప్రభుని దుశ్చింతకు అడలి "రాజా, గతజలసేతుబంధన మేల? శ్రీహరిని ధ్యానింపుము. నీపరివారము సజీవమయ్యెడి" నని చెప్పెను. రాజు అట్లే చేసి సేన బ్రతికి లేవఁగా బ్రతుకుజీవుఁడా యని తిరిగిచూడకుండ వెడలిపోయెను. అంత పోతరాజు కరకమలములు ముకుళించి "శ్రీహరీ, వైకుంఠపతీ, ఈక్షుద్రునికొఱకు నీవెంత పని చేసితివి!" అని నారాయణుని అనేకవిధములఁ గొనియాడి లోపలకుఁ బోయి యథాపూర్వముగ గ్రంథరచనము ప్రారంభించెను.

దినక్రమమునఁ బోతరాజు అష్టమస్కంధమునందలి గజేంద్రమోక్షణకథాభాగము నాంధ్రీకరించుచుండెను అందు గజేంద్రుఁడు రక్షింపు మని ప్రార్థింప విష్ణువు విని ప్రయాణోత్సాహి యయ్యె నని తెలుపునెడల పోతరాజు,—

"అల వైకుంఠపురంబులో నగరిలో నామూల" అని వ్రాసి యాపై నిఁ దోఁచక పుస్తకమును కొమార్తెచేతి కిచ్చి "బిడ్డా, ఉండుము వచ్చెద" నని దొడ్డిలోనికిఁ బోయి వృక్షములనీడఁ గూర్చుండి యాలోచింపఁ దొడంగెను. ఒక గడియవఱకు నాతని కేమియుఁ దోఁచినది గాదు. ఈలోపుగ శ్రీహరి పోతరాజురూపముతో వచ్చి యాబాలికచెంత పుస్తకము గైకొని "సౌధంబు దాపల" నని వ్రాసి ఇదిగో వచ్చెద నుండు మని చెప్పి వెడలిపోయెను. అప్పటికి దొడ్డిలోనున్న పోతరాజునకు అదియే తోఁచెను. వెంటనే మహానందముతో వచ్చి తనకుఁ దోఁచినదే పుస్తకముమీఁద నుండుటఁ గాంచి కొమార్తెవలన సర్వము నెఱింగి ఆమెను కౌఁగిలించుకొని ముద్దాడి "తల్లీ, నీవు అదృష్టవంతురాలవు. కావుననే నారూపముతో వచ్చి శ్రీహరి నీకు సాక్షాత్కరించె" నని యామె భాగ్యమును దనభాగ్యమును గొనియాడి పిదప,

మ. "అల వైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబు దా
పల మందారవనాంతరామృత సరఃప్రాంతేందు కాంతోపలో
త్పలపర్యంకరమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము పాహి పాహి యనఁ గుయ్యాలించి సంరంభియై".

(భాగ. స్కం. 8. ప. 95)

అని పద్యమును బూరించెను.

మఱియొకనాఁడు శ్రీనాథుఁడు మఱలవచ్చి పైపద్యముతరువాత నున్న,—

మ. "సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లము చక్కనొత్తఁడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచల మైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై."

(భాగ. స్కం. 8 ప. 96)

అను పద్యమును జూచి పోతరాజుతో "బావా, నా కీపద్యమున దోషములు కాన్పించుచున్నవి. ఏమందువా? గజప్రాణావనము మకరమునువధించినఁగాని కాదుగదా? అట్టిచో శ్రీహరి రిక్తహస్తుఁడై పరివారమునుగూడఁ బిలువకుండ బయలుదేఱె నంటివి. ఏమిప్రయోజనము"

ము" అని యడిగెను. అందులకుఁ బోతన్న "బావా, ఇది ప్రకృతిధర్మము. ప్రేమభాజనులు విపత్తులపాలై రన్న మాటలు వినినపుడు ప్రేమనిలయులకు ఏమియుఁ దోఁపదు. నాయనుభవమును బట్టి నేనట్లువ్రాసితిని. ఇంతకును భగవంతునికి తన యాయుధములం గైకొనకయే పోయిన లోప మేమి? సర్వశక్తుఁ డగు శ్రీహరి ఏనుఁగునకు నవశక్తిని ఘటించి దానిచేతనే మకరమును జంపింపఁగూడదా?" యని బదులు చెప్పెనుగాని శ్రీనాథునకు ఇదిసమాధానమునుగూర్పఁజాలకపోయెను. "సరియే"అని యూరకుండి పోతన్న మఱునాఁడు శ్రీనాథుని కుమారుని ఒక గదిలో దాఁచి వాకిటఁ గూర్చుండి యేమోయాలోచించుకొనుచున్న శ్రీనాథునిచెంతకు వచ్చి "బావా! నీకొడుకు నూతిలోఁ బడిపోయె" నని చెప్పెను. అది వినిన వెంటనే శ్రీనాథుఁ డేమియుఁ దోఁచక కంగారుపడి నూతిచెంతకుఁ బయలుదేఱెను. అంతట పోతరాజు ఆతనికి అడ్డు నిలిచి "బావా త్రాడు నిచ్చెన మున్నగునవి యేమియుఁ గొనకయే పరువెత్తిన నేమి యగును?" అని పలుకఁగా శ్రీనాథుఁడు చాల వగర్చుచు "బావా, అడ్డు తొలఁగుము. నాబిడ్డఁడు బ్రతికియుండఁగా నొకమాఱు చూడనిమ్ము" అని తప్పించుకొని పోయి నూతిలోఁ జూచుచు "కుమారా, పడిపోయితివా?" యని వగవసాగెను. అప్పుడు పోతరాజు "బావా, విచారింపవలదు. నీకుమారుఁడు నూతిలోఁ బడిపోలేదు. గదిలో క్షేమముగ నున్నాఁడు. ప్రకృతిధర్మమును నీకుఁ దెలుపుట కిట్లు చేసితిని. భాగవతములో నేను వ్రాసిన 'సిరికింజెప్పఁడు' శంఖచక్రయుగముం జేదోయిసంధింపఁడు' అను పద్యమును జూచి 'ఆయుధమును గొనిపోవకుండ నరిగి శ్రీహరి యేమి సేయు' నని ప్రశ్నించితివి. ఇప్పుడు నీవు త్రాడు నిచ్చెన మున్నగునవి లేకుండ నెట్లు వచ్చితివి?" అని యడిగెను. శ్రీనాథుఁ డదివిని బావా! బాగుగా బుద్ధి చెప్పితివి. అని విపన్నుఁడై రక్షింపఁబడిన వానిని వోలెఁ గుమారుని జేరఁదీసికొని శిరము మూర్కొని లాలింపఁదొడఁగెను.

ఇట్లు నిరాక్షేపముగను నిర్దోషముగను పోతరాజు భాగవతాంధ్రీకరణమును బూర్తిగావించెను. ఆంధ్రభాగవత మంతటి భక్తిరసబంధుర మగు గ్రంథము ఏభాషయందును లేదని ఘంటాపథముగఁ జెప్పవచ్చును. తుదకు పోతరాజు బ్రతికియున్నంతకాలమును శ్రీహరి

సేవలో గడపి అవసానమున శ్రీహరి సాయుజ్యమును బడసెను. ఆతని భాగవతమును జదివినవారుగూడ అనేకులు ఈశ్వరసాయుజ్యము బడసినవారు గలరు.

శా. "శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై జింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలనకళా సంరంభకున్ దానవో
ద్రేకస్తంభకుఁ గేళిలోలవిలసద్దృగ్జాలసంభూతనా
నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్."

(భాగ. స్కం 1. ప. 1.)

---

16 తులసీదాసు

ఢిల్లీపురమున అక్బరుపాదుషాహా ఆత్మారాముఁడు అను నొక మంత్రియుండెను. ఆతనికి లేక లేక యొక కుమారుఁడు ఉదయించెను. వానికిఁ దలితండ్రులు తులసీదాసు అని పేరుపెట్టి మిగుల గారాబముతో బెంచుకొనుచుండిరి తులసీదాసునకు వయస్సు పెరిగినకొలఁదియు విద్యల యందు ఆసక్తియు విజ్ఞానమును గలుగఁజొచ్చెను. లేక లేక కలిగిన కుమారుఁడు వివేకశాలిగూడ నైనందులకు తల్లిదండ్రులు మఱింత సంతోషించుచు యుక్తసమయమున విద్యావతియు వినయవతియు విశేషించి సుందరియునైన మాతాదేవి అను కన్యకను దెచ్చి మహోత్సవముతో వివాహము చేసిరి. ఈయనురూపదంపతులను జూచి ఢిల్లీపౌరులును దేశమునందలివారును మహానందమును బొందసాగిరి.

మాతాదేవి యెంతసుందరియో, యెంతవినయవతియో, యంత పతిసేవావ్రతపరాయణురాలు. అంత యనురాగవతి. తులసీదాసుగూడ మాతాదేవియెడల విశేషానురాగభరితుఁడై యుండెను. విశేషించి యాదంపతుల సౌఖ్యమునకై తల్లిదండ్రు లనేకవిధములఁ బ్రయత్నములు సేయుచుండిరి. సకలసౌఖ్యకారణములునుగల యామంత్రికుమారుఁడు విజ్ఞానభరితుఁ డయ్యును, రాగభరితుఁడై, సర్వకాలసర్వావస్థల యందును భోగలాలసుఁ డయ్యెను, మాతాదేవి యట్లుగాక భర్తకు "ఇంత భోగపరాయణత తగదు. ఇది అనేకనష్టములకుఁ గారణ" మని

యనేకవిధముల బోధించుచుండెను. అట్టి సమయములయందెల్ల నాతని భోగపరాయణత కొంచెము తగ్గుచుండెను గాని యాబోధ మఱపునకు వచ్చినతోడనే మఱింత వృద్ధియగుచుండెను.

ఇట్లుండఁగా నొకనాఁడు అక్బరుపాదుషా క్రూరమృగములను వేఁటాడ నరణ్యమునకుఁ బోవుచు తులసీదాసుని రమ్మని పిలచెను. చక్రవర్తి యాజ్ఞ చేసినపుఁ డిఁకఁ జేయవలసిన దేమున్నది? తులసీదాసు భార్యావియోగము దుస్సహమైనను దాని నెట్లో యడంచుకొని యుక్తవేషముతో నరణ్యమునకుఁ బోయెను. ఆతఁడు అరణ్యమునకుఁ బోయిన కొంతసేపటికి మాతాదేవి పుట్టినింటినుండి యొక మనుష్యుఁడు వచ్చి ఆమె తల్లికిఁ జాల జబ్బుగా నున్నదని చెప్పెను. ఈమాట వినుటతోడనే మాతాదేవికి హృదయము బ్రద్దలైపోయెను. ఇదియంతయు గ్రహించి అత్తగా రామెను "తల్లీ! మీయమ్మ నీకొఱకు బెంగటిల్లి యుండును. ఆమెను జూచుటకుఁ బోయిరమ్ము. నెమ్మదిగ నున్న వెంటనే మఱల నీవిచ్చుటకు రావచ్చును తులసీదాసు ఇందుల కేమియు నాగ్రహింపఁ" డని చెప్పి పంపివేసెను. భర్తృగృహమును విడుచుటకు ఇష్టము లేకున్నను జేయునదిలేక మాతాదేవి పుట్టినింటికి వెడలిపోయెను.

నాఁటి సాయంకాలమునకే తులసీదాసు వేఁటనుండి యింటికి వచ్చెను. అడవిలోఁ గ్రుమ్మఱినంత తడవు నాతని హృదయము మాతాదేవియెడల నత్యంతముగ్ధమై యుండెను; గాని కలఁతనిద్రలో నున్నవానికి నడుమనడుమ మెలఁకువ వచ్చునట్లు నడుమనడుమ నాతనికిఁ దాను పాదుషాహాతో వేఁటకు వచ్చి యరణ్యమున సంచరించుచుండుట జ్ఞాపకము వచ్చుచుండెను. ఈరీతి నాతఁడు తెలివిమఱపులలోనుండియే సాయంత్రమువఱకు నెట్లో కాలముగడపెను. మాతాదేవి కాపురమునకు రాకపూర్వము తులసీదా సెంతయో చుఱుకుఁదనముగలిగియుండెను. అప్పుడనేకపర్యాయము లక్బరు తులసీదాసు మహోన్నతదశకు రాఁగలఁడనితలంచుచుండెను. అగుటచే నాతఁడు నేఁడు తులసీదాసు ఇట్లుండ నేల యని యనేకవిధముల యోచించియుఁ గారణము నూహించుకొనఁజాలకపోయెను ఆకారణ మాతఁ డడుగను లేదు తులసీదాసుచెప్పను లేదు.

తులసీదాసు మాతాదేవి ముఖచంద్రమండలము నెప్పుడు

చూతుననుమహోత్కంఠతో వచ్చెను ; గాని యంతఃపురమున నాతని కామె కాన్పింపలేదు. మామూలుగ నామెసంచరించుస్థలము లన్నియు నాతఁడత్యాత్రముతో వెదకెను; గాని యప్పుడును సఫలీకృతమనోరథుఁడు కాఁడయ్యెను. ఇట్లాతఁడు మాతాదేవికొఱకు అంతఃపుర మంతయుఁ బరిభ్రమించుచుండఁగా యథాపూర్వముగ తల్లి సంగతి యంతయుఁ జెప్పి "నాయనా! భోజనమునకు రమ్ము" అని పిలిచెను. తోడనే యాతని హృదయమున రాయిపడెను. శరీరమున నున్న బలమంతయుఁ గ్రుంగిపోయెను. తల్లి పోయినవెంటనే యాతఁడు నిలుచున్నట్లుగాఁ గూలఁబడి "దేవీ! ఇట్టిసమయములో నీవునన్ను విడిచిపోవచ్చునా?" యని వగవసాగెను. ఆతనికి భార్యావియోగము గలుగుటచే విచారము గాని అత్తగారికిఁ బ్రాణముమీఁదికి వచ్చినందులకు విచారము లేకపోయెను. తుద కాతఁడొక పరిచారిక వచ్చి పిలిచినతరువాత భోజనమునకుఁ బోయెను.

కాని యాతనికి భోజన మేమియు రుచింపనయ్యెను. వియోగదుఃఖమును మఱచిపోవుటకై నిద్రింపఁ దలఁచెను; గాని నిద్రయు రాదయ్యెను కొంచెముసేపాతఁడు శయ్యపైఁ గూరుచుండి యేమో యాలోచించుకొని తుదకు పాదచారియు నేకాకియునై అత్తవారి గ్రామమునకు బయలుదేఱెను. ఢిల్లీకి ఆగ్రామము అయిదుకోసులదూరమున నుండెను. మార్గమంతయు నరణ్యమున నుండెను. అయినను భార్యాసక్తచిత్తుఁడగుట నాతని కేమియు భయము లేకపోయెను. తుదకుఁ గాలిలో ముల్లుగ్రుచ్చుకొనుటగూడ నాతనికిఁ దెలియలేదు. ఇట్లు మిగుల దీక్షతో నతివేగముగ నడచి యాతఁడు మూడుజాముల రాత్రి యగునప్పటికి అత్తవారి యూరు చేరికొనియెను.

కాని యాసమయమున నేగృహస్థుల యిండ్లవాకిళ్లు తెఱవఁబడి యుండును? గ్రామమునందలి యెల్లగృహములతోఁ బాటుగఁ దనయత్తవారియింటితలుపుగూడ వేయఁబడి యుండుటఁ జూచి యాతఁడు లోనికిఁ బోవుట యెట్లాయని యాలోచింపఁదొడఁగెను. ఎంతసేపు యోచించినను ఏమియుఁ దోఁచదయ్యెను. లోపలివారిని బిలుచుట కిష్టము లేకపోయెను. ఇట్లు ఆతఁడు కొంతతడవ వచ్చుటఁ గ్రుమ్మరి క్రుమ్మరి యిటు నటు తిరిగి మేడమీఁదినుండి యొక త్రాడువ్రేలాడుచుండుటఁ జూచి

యది తనభార్య తన నిమిత్తమే యేర్పఱిచియుంచెనని భావించి దాని సాయమున మేడమీఁది కెక్కిపోయెను.

దైవయోగమువలన మాతాదేవి తక్క మఱియెవ్వరును దులసీదాసును జూడలేదు. ఆమెయు భర్తనుజూచి పరమాశ్చర్యచకితయై "ఇదియేమి" అనియెను. అంత తులసీదాసు "ప్రియురాలా! నిన్ను బాసి నేనొక్కక్షణమైన నుండఁగలనా? అట్టి నన్ను విడిచి నీవిచ్చటకు రాఁజెల్లునా? వేఁట చాలించి వచ్చి యింట నిన్ను జూడనపుడు నామనస్సు ఎంత సంక్షుభితమైపోయినదో భగవంతున కెఱుక. నీవెప్పుడైన నాకిట్టి ఆయాసమును గలిగించితివా?" యని పలికెను. మాతాదేవి యందులకు మఱింత వింతపడి "నాథా! ఇప్పుడు జగమంతయు గాఢసుషుప్తిం దవిలియున్నది. అన్నిగృహములును గవాటపిహితములై యున్నవి. అట్టి నీవీమేడమీఁది కెట్లెక్కి రాఁ గలిగితి"వని యడిగెను. తులసీదాసు నీవు కట్టి వ్రేలాడఁదీసినత్రాడుసహాయమున వచ్చితి" ననియెను. మాతాదేవి యేమియుఁ ద్రాడుగట్టియుండలేదు గావున భర్తమాటలు విని తెల్లవోయి దీపము చేతఁగొని త్రాడెక్కడనున్నదో చూపు మనియెను. చూడఁగా నది త్రాడు గాక కృష్ణసర్పమై యుండెను. అది నల్లత్రాఁచు అని తెలిసినపుడు తులసీదాసుమీఁదిప్రాణములు మీఁదనే యెగిరిపోయెను. మాతాదేవి చూపులు చెదరిపోవ గుండెలు కొట్టుకొనసాగెను.

పిదప నిద్దఱును అంతఃపురమునకుఁ బోయి కూర్చుండి జరిగిపోయిన సాహసమునకుఁ జాలభీతిల్లిరి. అది యాధారముగాఁ గొని మాతాదేవి భర్తదిక్కు మొగంబై "నాథా! నీవుచేసిన సాహస మెంత యపాయకరమైనదో చూచితివా? స్త్రీతోడి భోగమున కాసించి నీయంతటి విద్యావంతులు నిశీథమున క్రూరసత్వభయంకర మగు నరణ్యమును గడచివచ్చినవారును, నల్లత్రాఁచును బట్టుకొని మేడమీఁది కెక్కినవారు నెందైన నున్నారా? ఈమాత్రపు స్వల్పవియోగమునే భరింపలేక యిట్టి యనాలోచితకృత్యమును జేయుట సత్పురుషలక్షణమా? అడవిలో నేదియైనఁ గ్రూరసత్వము మీఁదఁబడినను, ఏవృశ్చికమైన ప్రాణములు కడంటునట్లు పొడిచినను ఇచ్చట నల్లత్రాఁచు కఱచియుండినను ఎంత యాపద వచ్చియుండునో యోచింపుము. ఈ

స్వల్పభోగము నిమిత్తమై నీవెంతటి నిందకుఁ బాల్పడియుందువో యూహింపుము. పాంచభౌతిక శరీరము మహాసముద్రముమీఁదఁ దేలియాడు నావవంటిది. క్షణక్షణమునందును లెక్కలేనన్ని విపత్తులు దీనినిఁ జుట్టుకొనియుండును. తుదకెట్లు నిది రూపుమాసిపోవునదే గాని శాశ్వతము గాదు. నశ్వరమైన దైహికసౌఖ్యమున కాశించి ఇంద్రుఁడు, సుందోపసుందులు, కీచకుఁడు, రావణుఁడు, మున్నగు మహామహులుగూడఁ దీఱనియపాయముల పాలఁబడిపోయిరి. నాయెడల నీవు చూపుచున్న అనురాగములో సగమైన శ్రీమన్నారాయణునియెడలఁ జూపి ఆసర్వేశుని చరణకమలములను స్మరించినయెడల నీవును,నీదాసినగుట నేనును దరింపమా? భగవంతుని యవ్యాజకరుణచే లబ్ధమగు దేహేంద్రియాదిసాధనసామగ్రిని భగవత్కైంకర్యమునకై వినియోగించిన వారి నీడనైనను యముఁడు బాధింపఁజాలఁ డని పెద్దలు వక్కాణింతురు.

ఇంతవఱకే సముద్రతీరమునందలి యిసుకరేణువులవలె మనము లెక్కలేనన్ని జన్మముల నందితిమి. మన పురాకృతమువలన నిప్పుడీయుత్కృష్టజన్మమును బడసితిమి. ఇప్పుడైన పురుషోత్తము సేవచేసి జన్మపరంపరను ద్రెంపివేసికొనుటకు మాఱుగ దానిని పెంపుచేయనేల? విషయసుఖపరాయణతయు, విజ్ఞానవైముఖ్యమును, హరిభక్తిరాహిత్యమును భావికాలమున అధమాధమజన్మపరంపరకు హేతుభూతములగును.అది తలంచుకొనిన నాకిప్పుడే యొడలు కంపమెత్తుచున్నది. నీవు వివేకరహితుఁడవు గావు; గాని యావివేకాగ్ని నివురుగప్పఁబడి యున్నది. దానినిఁ బ్రజ్వలింపఁ జేయుము. నిస్సారము లగు సంసారసౌఖ్యముల నన్నిటి నందు భస్మముసేయుము. బుద్ధిసాగరా! మేదోమాంసరక్తాదులచే నిండియున్న యీతోలుతిత్తిపై నింత మమత యుండఁ జెల్లునా? కనులారఁ జూచుచున్న యీసుఖాభాసములపై నింత వాంఛ యుండఁజెల్లునా? మన కండ్లయెదుట ననేకులు పుట్టుచున్నారు. అనేకులు గిట్టుచున్నారు. వారికంటె మనకువచ్చిన ఘనతయేమి? మనమెక్కడనుండివచ్చితిమో, ఇక్కడఁ జేయుచున్నదేమో, ఇఁక మన మెక్కడికిఁబోయెదమో తరువాత నేమగుదుమో కొంచెమైన యోచించుకొన నక్కఱ లేదా? అట్లయినఁ బశుపక్షిమృగాదులకును మనకును భేదమేమి? అబలను;అజ్ఞా

నురాలను. నీయెడలఁ గల చనవుచే నింతవఱకును మాట్లాడితిని. నాపైఁ గోపింపవలదు. మంచిచెడ్డలు, లాభనష్టములు, సుఖదుఃఖములు, కీర్త్యపకీర్తులు యోచింపుము. నీవు సన్మార్గమునఁ బ్రవేశించి నన్నుగూడఁ గొనిపొమ్ము" అని ప్రార్థనాపూర్వకముగ మందలించెను.

తులసీదాసునకు మాతాదేవి యుపదేశము తలకెక్కెను. ఆహితోక్తి దీపికాప్రభావమున నాతనిహృదయమున ఘనీభవించియున్నగాఢాంధకారము తొలఁగిపోవుటయు, విజ్ఞానప్రకాశము గలుగుటయు నొక్కమాత్రే యయ్యెను. అక్కతన నాతనికి సంసారము సాగరమనియు, విషయసుఖములు దేహాభిమానమును మోక్షాపేక్షగలవారికి సర్వనాశకరములనియు, స్త్రీలు చిత్తసంస్కారములపాలిటి మారణమంత్రము లనియు, కాలము మనోవేగమునఁ బరువెత్తికొనిపోవుచున్న దనియు, క్షణక్షణమును మృత్యువు సమీపించుచున్న దనియు, నది రాకపూర్వమే మోక్షార్హత సంపాదించుకొనవలయు ననియు బోధపడెను. మఱియు నిట్టివిజ్ఞానమును గలిగించిన మాతాదేవి తనకుఁ గేవలము మాతృమూర్తి యని తలంచి యాతఁడామెకు సాష్టాంగదండప్రణామము గావించి వెంటనే యచ్చోటువదలి గతించినదానికి వగచిన ప్రయోజనము లేదనియు బుద్ధికుదిరినచో నింకను మించిపోయిన దేమియు లేదనియు మనస్సునకు సమాధానము చెప్పుకొని యెక్కడకుఁ బోవుచున్నదియుఁ దెలియకుండఁ బోయెను.

ఆతఁడు గంగాతీరమున నొకనిర్జనప్రదేశమున వసించెను. ఆతఁడు సమీపగ్రామమునకుఁ బోయి పగలెల్ల శ్రీరామచరిత్రమును జనులకు బోధించి పిదప ధ్యానప్రవృత్తుం డగుట ప్రారంభించెను. కందమూలఫలములును, గంగాజలములును దక్క నాతఁడు వేఱు పదార్థముల నొల్లకుండెను. అక్కడ నాతఁడు చేయు విశేష మేమనగా:—ప్రతిదినమును ప్రాతఃకాలమున శౌచవిధి ముగించికొని శేషజలము నొకచెట్టుమొదటఁ బోయుచుండెను. ఇది యాతఁ డిట్లు చేయవలయు నను వ్రతముతోఁ బ్రారంభించినది కాదు; గాని యాయొక్కచెట్టునకే గాని యితరవృక్షమునకుఁ బోసి యెఱుగఁడు. ఈతీరునఁ బండ్రెండుసంవత్సరములు కడచిపోయెను. శౌచశేషజలము స్వల్పమేయైనను బ్రతిదినమును బోయుచుండుటవలన నది యావృక్షమున కమృతధారయయ్యెను. ఈ

పండ్రెండుసంవత్సరములలో నది చక్కఁగఁ బెఱిగి యాకసమంటుచుఁ జాలసందము గాంచెను. ఇట్లు కాలముగడచిపోవుచుండఁగా నొకనాఁడు శౌచశేషజలమును జెట్టుమొదటఁ బోయునపుడు తులసీదాసున కొక ఘోరబ్రహ్మరక్షస్సు ప్రత్యక్షమై "భక్తశిఖామణీ! నీయెడల నా కానందము గలిగినది. ఈనదీజలమునుగాని, మఱియేప్రదేశమునందలి జలమునుగాని తాఁకుటకు నాకధికారము లేదు. ఈతీఱున నేను నీళ్లు లేక చచ్చిపోవుచుంటిని. ఇట్లుండఁగా నీవు పండ్రెండుసంవత్సరములనుండి యీ చెట్టుమొదట నీళ్లు పోయుచుంటివిగదా. ఆనీళ్ల యాధారమున నే నింతవఱకును సుఖముగా నుంటిని, నాకిట్టి మహోపకారము చేయుచున్న నీ కేమి కావలయునో కోరుకొనుము" మని పలికెను.

తులసీదాసునకు పుణ్యమునకుఁ బోవ పాప మెదురైనట్లయ్యెను. శ్రీరామదర్శనాపేక్షికి బ్రహ్మరక్షస్సాక్షాత్కారమా? తులసీదాసునకుఁ దన ధ్యానప్రణాళికయందు ననుమానము తోఁచెను. అందేమైన లోపములుగాని కుమార్గములుగాని యున్నవా? లేకున్న నీవిపరీత మేల? ఇట్లు భావించి తులసీదాసు బ్రహ్మరాక్షసునితో "నావలన నీకు ఉపకారము జరిగినందులకు సంతోషము; గాని నీవు నాకేమి యీయఁగలవు? నాకు ఐహికసుఖములమీఁద నాశలేదు. నాకుఁ గావలసినది శ్రీరామసాక్షాత్కారము. అది నీవలన నగునేని చేయుము" అని పలికెను. ఇదివిని యాశ్చర్యపడి బ్రహ్మరాక్షసుఁడు "మహాత్మా! అది నాకు సాధ్యమైనచో నీ కిట్టి యవస్థయేల? నేనాపని సేయఁజాలను; గాని యందులకుఁ దగు నుపాయము సెప్పఁగలను. నీవు దినదినమును శ్రీరామాయణకథాకాలక్షేపము సేయుచోట నొక వృద్ధబ్రహ్మచారి అందఱికును ముందుగ నీ సమీపమునఁ గూర్చుండుట నీకుఁ దెలిసినదే.. ఆతఁ డేతఁడని నీవు భావించుచుంటివోగాని మానవుఁడు కాఁడు. ఆ మహానుభావుఁడు శ్రీరామచంద్రుని విజయమునకుఁ గారణభూతుఁడగు అంజనాతనయుఁడు. ఆతనినిఁ బ్రార్థించితివేని నీయభీష్ట మీడేరు" నని చెప్పి మాయమై పోయెను.

ఈసంభాషణమువలనఁ దులసీదాసునకు పేదకుఁ బెన్నిధి దొరకినఁ గలుగు నంతటి యానందము గలిగెను "నేను సేయురామగుణకీర్తనమున గుణ మున్నది. కావుననే విజ్ఞానులలో నగ్రేసరుఁడును, రామ

భక్తశిఖామణియు నగు హనుమంతుఁడు శ్రద్ధతో దానిని వినుట తటస్థించినది. అంజనాతనయునకు నాయెడలఁ బరమానురాగము కలిగినది; కావున నాకు రామసాక్షాత్కార మిఁక క్షణిక" మని తలంచి యాతఁ డానందాతిరేకముచే రామభజనము చేసెను. పిదప నాతఁడు స్నానసంధ్యాద్యనుష్ఠానములను యథాపూర్వముగ నెఱవేర్చికొని సమీపగ్రామమునకుఁ బోయి రామాయణగానము ప్రారంభించెను. శ్రోతలందఱ అతోఁబాటుగ నాంజనేయుఁడు యథాపూర్వవేషముతోఁ జనుదెంచి రామకథ వినసాగెను. తులసీదాసు నాతని రాకకు మిగుల నలరి, దాసు గుణకీర్తనమునఁ గొంతతడవు ఆతని కానందము గలిగించి, యంతటితోఁ జాలించి యాతనికి సాష్టాంగనమస్కారములు గావించి, "రామభక్తాగ్రేసరా! ఇన్నిదినములును నిన్ను దెలిసికొనఁజాలక పోయితిని. నా యపరాధమును మన్నించి నాపై ననుగ్రహము వహింపుము. నే నజ్ఞానుఁడను. స్వయముగ శ్రీరామచంద్రునకు నాపై దయఁ గలిగించుకొనఁజాలను. నా కాలోకేశ్వరుని దివ్యదర్శనము కలిగించెద నని అభయము దయచేయుము" అని ప్రార్థించెను. బ్రహ్మచారివేషముతో నున్న మారుతి "నీయాశ్రమమునకుఁ బోయి యుండుము. నీయభీష్టమీఱఁగ" నని చెప్పి తనదారినిఁ బోయెను.

ఆంజనేయుఁడు స్వస్థానమునకుఁ బోయి శ్రీరామచంద్రునిఁ బ్రార్థించి ప్రత్యక్షమైన పిమ్మట తులసీదాసు ననుగ్రహింపవలయు నని వేడుకొనియెను. రాముఁడ ట్లే యని యంగీకరించెను. తులసీదాసు రాముఁడు సాక్షాత్కరించు నని భావించి దర్శనలాలసుఁడై రామభజనము చేయసాగెను. ఇట్లుండఁగా నొక తురుష్కరాజు తన తురుష్కసైన్యమును వెంటనిడుకొని తులసీదాసు నాశ్రమముముందునుండి యెటకో పోయెను. తురుష్కునితో మన కేమిపని యని తలంచి తులసీదాసు ఆరాజు దెసకే చూడలేదు. ఎంత భజనము చేసినను ఫలము కలుగనందులకుఁ జాల వగచి తులసీదాసు మఱల సమీపగ్రామమునకుఁ బోయెను. అట నంజనాపుత్త్రుఁడు వచ్చి "రామదర్శన మైనదా?" యని ప్రశ్నించెను. "మీకు సంపూర్ణానుగ్రహము గలుగనిదే నాకోరిక యెట్లీడేరు" నని దాసు నిస్పృహతోఁ బలికెను. అదివిని మారుతి "అయ్యో! వెఱ్ఱివాఁడా! శ్రీరామచంద్రుఁడు సాక్షాత్కరించినను

జూడఁజాలకపోయితివిగదా ? పరమేశ్వరుఁడు నీసర్వసమత్వభావమును బరీక్షింపఁదలఁచి తురుష్కప్రభురూపమున దర్శన మిచ్చెను. కనుఁగొనఁజాలకపోయితివిగదా?" అనియెను.

తురుష్కప్రభువే రామచంద్రుఁడని విన్నతరువాతఁ దులసీదాసు అనుభవించినపరితాప మింతయని చెప్పుటకుఁ దరముగాదు. ఆతని విచారమును జూచి మారుతి కరుణించి యేమనియెంచ వనియెను. "శ్రీరాముఁడు కోదండపాణియై సీతాలక్ష్మణసమేతుఁడై దర్శన మిచ్చునట్లు అనుగ్రహింపవలయు" నని దాసుకోరెను. "అట్లయగును. పోయిర" మ్మని యాంజనేయుఁడు సెలవిచ్చి పంపివేసెను.

తులసీదాసు మఱల రామదర్శనోత్కంఠితుఁడై భజన ప్రారంభించెను. ఆతనిహృదయము కేవలము శ్రీరామునియందు లీనమైపోయెను. దాసునకుఁ బ్రాపంచికజ్ఞానము లేని యీసమయమున శ్రీరాముఁడు సీతాలక్ష్మణసహితుఁడై ధనుష్పాణియై సాక్షాత్కరించెను. తోడనే దాసు భగవంతునిపాదముల నానందాశ్రువులతోఁ గడిగి యనేకవిధములఁ గొనియాడెను. తులసీదాసున కభయ మొసంగి పరమేశ్వరుఁడు తిరోహితుఁ డయ్యెను.

తరువాత హనుమంతుఁడు ప్రత్యక్షమయ్యెను. తులసీదాసు భయభక్తులతో సాష్టాంగనమస్కారము గావించి "మహాత్మా! నీవు చేసిన మహోపకార మనంతమైయున్నది. నాకలభ్య మగుభగవద్దర్శన మక్రమముగ ఘటించిన నీకు నేనేమి చేయఁగలను! నా సేవనంగీకరింపు" మని ప్రార్థించెను. మారుతి దాసుతో "మనమందఱము నా దేవదేవుని కింకరులము; శ్రీరామచంద్రుఁడు భక్తప్రీతుఁ డగుట నీకు సాక్షాత్కరించెను; గాని యిందు నాప్రమేయ మేమియు లేదు. ఇప్పుడు నీకును నాకును భేదము లేదు. నీయాత్మయు నాయాత్మయుఁ గూడ నాపరంజ్యోతియందలి పరమాణువులు. ఇఁక నుభయులలోఁ దారతమ్యము ఎట్లుండును? నీవు నాకు సేవఁజేసెద ననుటలో నర్థము లేదు. లోకమంతయు నిప్పుడుమాయాంధకారపూరితమైయున్నది. నీవు జ్ఞానప్రకాశము గలిగింపుము. స్థావరజంగమాత్మకమగు ప్రపంచము పరమేశ్వరుని దివ్య మందిరము "ప్రజాసేవయే పరమేశ్వరసేవ" యని బోధించి వెడలిపోయెను. మారుతి యుపదేశముచొప్పునఁ దులసీదాసు అజ్ఞానకూపమునఁబడి

జన్మపారంపర్యమువలన వంచితులై మోక్షమున నేనెుఱుఁగని మూఢప్రజల నుద్ధరించుటకుఁ దొలుత కాశీనగరమునకుఁ జనియెను.

అచట గంగాతీరమున నొక మఠము నేర్పఱచికొని తులసీదాసు భగవద్భజన ప్రారంభించెను. కొలఁదిదినములు గడుచునప్పటికి దాసు మఠసమీపభూమి యంతయు భజనసమయమున జనసహస్రములచే నిండిపోసాగెను. తక్కిన సమయములలోఁగూడ నచ్చట నుండు జనులను లెక్కించుటకు వీలుగాకుండెను. ఈతీరున ధనికులును బీదలునుగూడ నచ్చట కనేకులు వచ్చి పోవుచు, పండ్లు ఫలములు, వెండిచెంబులు, సువర్ణపాత్రలు మున్నగునవి యామఠమున నిడిపోసాగిరి; గాని యిది యేమియు దాసునకు అవసరము లేకపోయెను. ఆతఁడు ఆవస్తువుల దెసకే చూడఁడయ్యెను.

ఇట్లుండ నొకనాఁటిరాత్రి యిరువురు చోరులు మఠమునఁ బ్రవేశించి సువర్ణపాత్రములను దొంగిలించి బయలుదేఱిరి; గాని ద్వారమున ఆయుధహస్తులై యిరువురుపురుషులు కావలికాయుచుండుటచేఁ బోవుటకు వీలులేక ప్రక్కడు లాడసాగిరి. ఎన్నివిధములఁ జూచినను వారికిఁ బోవుట కవకాశము చిక్కలేదు. ఇంతలో నరుణోదయ మయ్యెను. ఇఁకఁ జేయునది లేక వాండ్రు స్నానార్థము గంగానదికిఁ బయనమై పోవుచున్న తులసీదాసు పాదములమీఁద వ్రాలిచేసిన దంతయు నొప్పుకొని "మహాత్మా, మమ్ము రక్షింపు"మని ప్రార్థించిరి. అదివిని దాసు ఆశ్చర్యచకితుఁడై చోరులను జూచి "మీరదృష్టవంతులు. ద్వారమున మిమ్ము అడ్డగించినపురుషులు భక్తాధీనహృదయులగు రామలక్ష్మణులు. మీపూర్వపుణ్యమువలన నే వారి దర్శనభాగ్యముగలిగెను. మీసకలపాపములును దగ్ధములైపోయినవి. వేదాధ్యయనసంపన్నులకును, తపోధనులకును, దాతలకు యాగకర్తలకునుగూడ దర్శింపరాని భగవత్స్వరూపము మీకు గోచరమైనది" అని చెప్పెను. చోరు లాశ్చర్యచకితులై బుద్ధి తెచ్చుకొని సాత్వికులై, రామభక్తులై తులసీదాసునకు శిష్యులైరి.

ఒకనాఁడు తులసీదాసు మఠమున హరిభక్తులకు అన్నసంతర్పణము జరిగెను. నాఁడొక పతితుఁడు పంక్తిలోనికి వచ్చెను. వానినిఁ జూచి భక్తులందఱును తులసీదాసుతో "మహాత్మా! నేఁడు పంక్తిలోని కొకపతితుఁడు వచ్చియున్నాఁడు. వాఁడు పోయినఁగాని మేము భుజింప"

మనిరి. తులసీదాసు అందువలన హరిభక్తుల కేమియు దోషము లంటఁ బోవని యనేకవిధములఁ జెప్పెను; గాని వారందఱును నీప్రభావముఁ జూపు మనిరి. అప్పుడు దాసు విశ్వేశ్వరుని యాలయములోనున్న నంది యెదుట నన్నము వడ్డించి "హరిభక్తుల నే దోషములు నంటకపోవుట యథార్థమేని యారాతి నంది యీయన్నమును భుజింపవలయు" నని చెప్పెను. తోడనే నంది యాప్రకారము చేసెను. హరిదాసు లందఱును తులసీదాసు మాటను దిరస్కరించినందునకు క్షమింపవేఁడుకొని భుజించి పరమానందముతో వెడలిపోయిరి.

ఒకనాఁ డా కాశీనగరమునందలి యొక వర్తకుఁడు మృతిఁజెందెను. వానిభార్య సహగమనము సేయుటకుఁ గళేబరము వెంట బయలుదేరి మార్గమధ్యమున మఠముపైట నిలిచియున్న తులసీదాసును జూచి అతని ప్రభావమును వినియున్న దగుటచే నాతనికి వందనముచేసి సెలవుగైకొని పోద మని యట్లుచేసెను. సాష్టాంగపడిన యాస్త్రీని తులసీదాసు "నీవు దీర్ఘసుమంగలివై యెనమండుగురు కుమారులను గని సుఖింపు" మని దీవించెను. అందుల కామె వింతపడి "స్వామీ! నాభర్త మరణించెను. నేను సహగమనము చేయఁబోవుచున్నాను. మీ రిట్లేల సెలవిచ్చితిరో తెలియదు" అని విన్నవించెను. తులసీదాసు అందులకు మందహాసముగావించి "శ్రీరామచంద్రుఁడే నాచే నిట్లు పలికించెను. నాపలుకు దబ్బరగాదు ఆకళేబరము నిచ్చటకు రప్పింపు" మని సెలవిచ్చెను. వెంటనే ప్రేత మచ్చటికిఁ గొనిరాఁబడెను. దాసు అభిమంత్రము చేయఁగా వర్తకుఁడు సజీవుఁడై లేచినిలిచి వందనములుచేసెను. ఆదంపతులను దీవించి దాసు వారి నంపివేసెను. వారణాసీనగరమునందలి యెల్లరును ఇది విని పరమాశ్చర్యచకితులైరి.

కాశీనగరమునందే నిలిచియుండక యీయద్భుతవార్తలు దేశమెల్లయెడల వ్యాపించెను. ఢిల్లీనగరమున అక్బరుపాదుషాహకుఁ గూడ వినవచ్చెను. తోడనే యాతఁడు తులసీదాసును బరీక్షింపఁదలఁచి తీసికొని రావలసిన దని మంత్రి కాజ్ఞాపించెను. ఆజ్ఞాప్రకారము మంత్రిపోయి యాతనిం గొనివచ్చెను. అక్బరు పురోపకంఠమున నాతనిం బ్రత్యుత్థానముచేసి కోటలోనికిఁ గొనిపోయి యొకగృహమున విడియించి "నీవు కాశీనగరమున ననేకవిచిత్రములను జేసితివఁట. అందులకు నీకేమి శక్తి

గల" దని యడిగెను. "నాకేమియు శక్తిలేదు. ఆపను లన్నియుఁ జేసిన యాతఁడు శ్రీరామచంద్రుఁడు" అని దాసుచెప్పెను. "అట్లయిన శ్రీరాముని జూపినఁగాని నిన్ను విడువ" నని పాదుషా దాసును కైదు చేసెను.

కైదులో తులసీదాసు మారుతినిఁ దలంచుకొనెను. తోడనే యాతఁడు ప్రత్యక్షమై "నీకేమియు భయములేదు. నేనంతయుఁ జక్క బెట్టెద" నని వెడలిపోయెను.

ఉన్నట్లుండఁగాఁ బదివేలకోఁతులువచ్చి డిల్లీపట్టణముపైఁబడెను. ఇఁక నాకోఁతులచేష్టలను జెప్పవలసిన దేమున్నది? నిముసములోఁ బట్టణ మంతయుఁ జిందరవందఱ యైపోయెను. మనుష్యునిఁ బట్టి మనుష్యునిఁ గొట్టియు, కాళ్లు పట్టుకొని శిరస్సును గోడలకుఁ బెట్టి కొట్టియు, గోపురశిఖరముల నుండఁ బెఱికి మీఁదఁ బడవేసియు, లుబ్ధుల బొక్కసములు బీదలకుఁ బంచిపెట్టియు, క్రూరుల యింట సకలామంగళములు గావించియు నిట్లు కోఁతులు డిల్లీపౌరులను నానాబాధలు పెట్టసాగెను. రాజసైన్యము కోఁతుల నేమియుఁ జేయఁజాలకపోయెను. డిల్లీపౌరులు ఇఁకఁ జేయునది లేక పాదుషాహాను శరణువేడిరి. ఆతఁడుమాత్ర మేమి చేయఁగలఁడు?ఆతఁడు నమ్మియింటికివచ్చిన తులసీదాసునిఁ గైదుచేయఁ గలఁడు; గాని మీఁదికి దండెత్తివచ్చిన కోఁతుల నేమిచేయఁగలఁడు? త్రిభువనములను జయించిన రావణుఁడే కోఁతుల చేష్టలకుఁ దెల్లవోయెను. తుదకు అక్బరున కేమియుఁ దోఁచినదిగాదు. "తులసీదాసును కైదుచేయుటవలన సంభవించిన యనర్థమిది" యని మంత్రి హితోపదేశము చేసెను. అప్పుడు అక్బరు బుద్ధితెచ్చుకొని కైదులోనున్న హరిదాసుని రప్పించి సాష్టాంగ మెఱఁగి "మహాత్మా నీమాహాత్మ్య మెఱుఁగక నేను చేసిన నేరమునకు క్షమింపు" మని వేఁడుకొనెను. హరిదాసు మందహాసము గావించి "రాజా! ఇప్పుడేమి తొందరవచ్చినది ? నీవు శ్రీరామునిఁ జూపుమంటివిగదా? మా ప్రభువునకు ముందుగ ననంతకోటివానరులు వచ్చెదరు. వారివెనుక రామచంద్రుఁడు వచ్చును. అట్లే యిప్పుడు ముందు వానరులు వచ్చినారు. ఇఁక నొక గడియలో మా ప్రభువు వచ్చును" అని చెప్పఁగా పాదుషా విని మఱింత భీతుఁడై "అయ్యో! ఈపదివేల వానరవీరులు వచ్చియే నాపట్టణమును ధ్వంసముచేసివేసిరి. ఇఁక దక్కి

నవారు వచ్చిన నన్నుగూడఁ బ్రాణములతో నుండనీయరు. శ్రీరామచంద్రుఁడు నీయందే యున్నాఁడు. నీదర్శనము శ్రీరామదర్శనము. ఇఁక వేఱుగ నేను రామసాక్షాత్కారము నపేక్షింపను" అని సవినయముగఁ బ్రార్థించెను. రాజున కిఁక బుద్ధివచ్చినదని తలఁచి తులసీదాసు మారుతిని స్మరించెను. తోడనే వానరవీరులు మాయమై పోయిరి. అప్పుడు పాదుషాహ "నీవిచ్చటఁ గొన్నిదినము లుండి నన్ననుగ్రహింపవలయు" నని కోరఁగా తులసీదాసు అందుల కంగీకరించి యొకసంవత్సర మచ్చట నుండి యనేకులను రామభక్తులను గావించెను.

పిదప దాసు పాదుషానుఆశీర్వదించి బయలుదేరి మధుర,గోకుల బృందావనము మున్నగు పుణ్యస్థలములను సందర్శించి యమునాతీరమున వసించెను.అచ్చట ప్రియదాసుఁడు అనునొక బ్రాహ్మణుఁడువసించి యుండెను. ఆతఁడు సంస్కృతభాషలో భక్తుల చరిత్రములను వ్రాసి యుండెను. తులసీదాసు ఆతనిచెంతకుఁ బోయి ఆగ్రంథ మొకమాఱు వినిపింపవలయు నని కోరెను. ప్రియదాసు పెక్కుగుభక్తుల చరిత్రములనువ్రాసెను; గాని తులసీదాసుచరిత్ర వ్రాయలేదు. అక్కతన నాతఁడు సందేహించుచుఁ జదువుచుండఁగా నడుమ తులసీదాసుచరిత్ర వ్రాయఁబడి యుండుట కానవచ్చెను. అందుల కాతఁ డాశ్చర్యపడి వ్రాతయందలి సొగసు, పదముల మార్దవము, అర్థగాంభీర్యము మున్నగునవి చూచి యిది వ్రాసినవాఁడు శ్రీరామచంద్రుఁడేయని భావించి సంగతి యంతయు నాసభలో వెల్లడిచేసెను. అందులకు ఎల్లరును మిగుల నాశ్చర్యముఁజెంది ప్రియదాసునిఁ దులసీదాసునిఁ జాలఁ గొనియాడిరి. పిదప తులసీదాసు అనేకజనులను హరిభక్తులుగాఁ జేసి యంతమున విష్ణుసాయుజ్యమును బడసెను.

మ. "యవనవ్యాధపుళిందహూణకసకంకాభీరచండాలసం
భవులున్ దక్కిన పాపవర్తనులు నేభద్రాత్ము సేవించి భా
గవతశ్రేష్ఠుల డాసి శుద్ధతనులై కల్యాణులై యుండు రా
యవికారుం బ్రభవిష్ణు నాను మదిలో నశ్రాంతమున్ మ్రొక్కెదన్."

(భాగ. స్కం. 2. ప. 63.)

17. మాధవదాసుఁడు

ఒక గొప్పపట్టణమున మాధవదాసుఁడు అను బ్రాహ్మణశ్రేష్ఠుఁడుండెను. ఆతఁడు వేదవేదాంగములను జదువుకొని విజ్ఞానమును బడసి ధ్యానము ఆవాహనము మున్నగుషోడశోపచారములతోడను శ్రీహరినిఁ బూజించుచు, గృహస్థాశ్రమధర్మములను మీఱక సాధువులను సజ్జనులను సేవించుచు జన్మపరంపరకుఁ గారణము లగు నైహికవ్యాపారములను మాని నిర్మలహృదయుఁడై యుండెను.

ఇట్లు కాలము కడచిపోవుచుండఁగా నాతనిభార్య మరణించెను. అందులకు విచారించుటకు మాఱుగ నాతఁడు సంసారసంబంధము వదలిపోయినందులకు మిక్కిలి యానందించి యింటఁగల సమస్తవస్తువులను సద్బ్రాహ్మణులకును, సాధుకోటికిని దానము చేసివేసి పుణ్యక్షేత్రములను సేవించుటకుఁ బయలుదేఱిపోయెను. ఒకనాఁ డాతఁడు జగన్నాథపురమున సముద్రస్నానము చేసి ఆలయమునకుఁ బోయి జగన్నాథస్వామినిఁ బ్రార్థించుచుండఁగా నర్చకులువచ్చి "ఎవఁడవు నీవు? ఫలములు దక్షిణయు నీయకుండ నిక్కడ నిలుచుటకు నీకేమి యధికారమున్నది? పోపొమ్ము" అని నిర్దయులై బయటకు గెంటివేసిరి. చేయునది లేక మాధవదాసుఁడు "ఆర్తత్రాణపరాయణుఁ డగు సర్వేశ్వరునిఁ జూచుటకు నీకల కధికారము లేకపోయెగదా!" యని వగచుచు బయటకు వచ్చెను.

పిదప నాతఁ డొకచోటఁ గూరుచుండి జగన్నాథుని సగుణరూపమును సేవింపవలయు నను వాంఛతో మూఁడహోరాత్రములు నిద్రాహారములు మాని భగవద్ధ్యానము ప్రారంభించెను. ఈతనియవస్థనంతయుఁ జూచి జగన్నాథుఁడు "మన భక్తుఁడు నిద్రాహారము లేక నవసిపోవుచున్నాఁడు. నీవీరాత్రి సగుణరూపముతోఁ బోయి మాధవదాసునకు దివ్యాన్నము నొసఁగి రమ్ము" అని రుక్మిణికి సెలవిచ్చెను. రుక్మిణియు నాయాజ్ఞప్రకారము అమృతతుల్య మగు దివ్యాన్నమును బంగారుపాత్రమున నిడుకొని సమాధినిష్ఠాగరిష్ఠుఁ డగు మాధవదాసువద్దకు వచ్చి దీనిని భుజింపు మని ముందుంచెను? ఆతఁడు "నీవెవ్వరిదానవు? నాకీయన్నము దెచ్చి పెట్టుటకుఁ గారణ మే?" మని యడుగఁగా, రుక్మిణి "నీవెవ్వరినిధ్యానము చేయుచున్నావో పరమేశ్వరుఁ డగు నాజగ

న్నాథుని యురమున వసియించియుండు రుక్మిణినినేను. నేను నాపతియాజ్ఞచే నీదివ్యాన్నమును నీకుఁ దెచ్చి పెట్టితి" నని చెప్పెను. ఇదివిని యాశ్చర్యచకితుఁడై దాసుఁ డామె ననేకవిధములఁ గొనియాడి, యనేక సాష్టాంగనమస్కారము లాచరించి యాదివ్యాన్నము భుజించెను. రుక్మిణి యాపాత్ర నచ్చటనేయుంచి వెడలిపోఁగా దాసుఁడు దానినిఁ గడిగి శుద్ధిచేసి తన చెంతనేయుంచుకొని నిద్రించెను.

మఱునాఁడు ఉదయమున అర్చకులు గుడిలోనికి వెళ్లి బంగరు పళ్ళెమును గానక యంతటి భద్రస్థలమునందలి వస్తువు మాయమైనందులకు వింతపడుచు నంతటను వెదకసాగిరి. కొంతతడవునకు వారు మాధవదాసుఁ డున్నచోటికి వచ్చి యాతనిచెంత నున్న సువర్ణపాత్ర నారసి "దొంగ దొరకెను. నాలుగు దినములనుండియు నీచండాలుఁడీచౌర్యము చేయుటకే యిచ్చట బకధ్యానము చేయుచుఁ గూర్చుండియుండె" నని యనేకవిధముల నాతనిని నిందించి చౌర్యముచేసె నని నేరముమోపి కైదులో వేసిరి.

ఇఁక దాసుఁ డేమి చేయఁగలఁడు? ఇట్టి సమయములలో సర్వమానవులకును ఈశ్వరధ్యానమే శరణ్యము. అట్టిచో మాధవదాసువంటి హరిభక్తుని విషయము చెప్పవలసిన దేమున్నది? "ఈశ్వరా! నీప్రవృత్తికి ఈప్రపంచముతో నెట్టిసంబంధమును లేదు; గాని ప్రపంచప్రవృత్తి యంతయు నీచేత నున్నది. నీవు నిర్వికారుఁడవు. ఆదిమధ్యాంతరహితుఁడవు. ఈజీవకోటికి వృద్ధిక్షయాదివికారముల నేల కలిగించితివి? జననమరణముల నేల కలిగించితివి? అది నీయిచ్ఛ? నీయిచ్ఛామాత్రముననే యీవిశ్వమంతయుఁ బ్రవర్తిల్లుచున్నది. ప్రభూ! నీవొక్కఁడవే ప్రభుఁడవు. ఇఁక నెవ్వరికిని స్వాతంత్ర్యము లేదు. అందఱును బరతంత్రులే. అందఱు నాజ్ఞాబద్ధులే. నీసేవకులలో ననేకు లెదుటివారినిఁ ద్రొక్కివేయఁ బ్రయత్నించుచున్నారు. త్రొక్కివేసితి మని యెగిరిపడుచున్నారు. వారిదెసకు నీవేల చూచుటలేదు? వారివి నీవెట్లు సహించుచున్నావు? నీవు తేజోనిధివి సర్వవ్యాపకుఁడవు. అనిష్టులను దండించుటకు అర్చకులచే కైదు అని వ్యవహరింపఁబడు ఈగదిలో మాత్రము నీవు నిండియుండలేదా? నాస్థితి యంతయు నీవు చూచుటలేదా? కాని నాకు నీవేల కాన్పించుటలేదు? నీవు నాహృదయమున సాక్షాత్కరిం

చియే యున్నావు. అయినను నేను తృప్తివహించుటలేదు. నీవిశ్వరూప మునకు సగుణత్వమునుఘటించి నాబాహ్యచక్షువులయెదుట సాక్షాత్కరింపుము. నాకంతియేచాలును." అని మాధవదాసుఁ డనేకవిధముల నీశ్వరుని ధ్యానింపఁ దొడఁగెను.

నాఁటిరాత్రి జగన్నాథుఁడు అర్చకుని స్వప్నమున సాక్షాత్కరించి "మాధవదాసుఁడు నాయాంతరంగికభక్తుఁడు. ఆతనివలన నేమియు దోషము లేదు. సువర్ణపాత్ర మాతనిచెంత నుండుటకుఁ గారణభూతుఁడను నేను. ఇఁకఁ నాతనిని బాధించుట నాకుఁ గోపకారణ మగు" నని చెప్పెను. అర్చకుఁడు ఈశ్వరద్రోహము చేసితినిగదా యని చాల వగచి మఱునాఁటి యుదయమున శీఘ్రముగ నిద్ర మేల్కాంచి పోయి యర్చకులందఱితోడను స్వప్నవృత్తాంతమును జెప్పెను. వారుగూడఁ దాము చేసినపనికి చాల విచారించి వెంటనే కైదులోనున్న మాధవదాసుని చెఱవిడిపించి యనేకవిధములఁ దాముచేసిన యక్రమమును సహింపఁ బ్రార్థించి భగవత్ప్రసాదము నొసంగిరి; దాసుఁడు దానిని భుజించి చాల నానందించి యర్చకుల కభయ మిచ్చెను.

ఇట్లు కాలము జరిగిపోవుచుండఁగా శీతకాలమువచ్చెను. ఒకనాఁడు మాధవదాసుఁడు శీతబాధను సహింపలేక గడగడ వడఁకిపోవసాగెను. అదిచూచి జగన్నాథుఁడు తనపైనున్న శాలువను దాసునిపైఁ గప్పిపోయెను. మఱునాఁ డుదయమున అర్చకులువచ్చి తలుపులుతెఱచి స్వామిమీఁద శాలువ లేకపోవుటకు మిక్కిలి నబ్బురపడి, యది మాధవదాసుమీఁద నుండుటకు మఱింత వింతపడిరి. ఇట్లు మఱికొన్నిదినములు గడచిపోవునప్పటికి మాధవదాసుని ప్రభావము దేశమం దంతటను వ్యాపించెను. రాజుగూడ విని మహోత్సవముతో వచ్చి దాసు ననేకవిధముల గౌరవింపఁజొచ్చెను. ప్రజలును, రాజును జేయుచున్నసన్మానమునుజూచి మాధవదాసుఁడు అధఃపతనము గలుగు నని భావించి యెరికినిఁ దెలియకుండ నొక నిశీథమున జగన్నాథపురమును విడిచిపోయెను,

కొన్నిదినములకు దాసుఁడు మధురాపురమును జేరుకొనియెను. అచ్చట శ్రీకృష్ణదేవాలయమునందలి యర్చకులుగూడ రిక్తహస్తుఁడై వచ్చెనని దాసునిఁ ద్రోసివేసిరి. చేయునది లేక దాసుఁ డొక వివిక్తస్థలమునఁ గూరుచుండి శ్రీకృష్ణుని ధ్యానింపసాగెను. అంత నొక ధని

కుఁడు భోజనసామగ్రినిఁ దీసికొనివచ్చి యాతని కిచ్చెను. దాసుఁడును ధనికుని ప్రార్థన నంగీకరించి యాసామగ్రిని పచనముగావించి యాకులో వడ్డించికొని "శ్రీకృష్ణా! వచ్చి భుజింపు"మని ప్రార్థించెను. తోడనే కృష్ణుఁ డచ్చట సాక్షాత్కరించెను. మాధవదాసుఁ డమందానందకందళితహృదయారవిందుఁడై స్వామి చరణకమలములను బాష్పోదకములచే కడుగసాగెను. అదిచూచి స్వామియుఁ గరుణార్ద్రహృదయుఁడై యాతని లేవనెత్తి "భక్తశిఖామణీ! నీవు నాప్రాణమవు. అయినను నీప్రభావము నెఱుఁగని నాయర్చకులు నిన్ను బైటఁ ద్రోసివేసిరి. అగుటచే నిన్ను వెదకికొనుచు నేనే వచ్చితిని" అని యూఱడించెను. దాసుఁడు స్వామికిఁ బునఃపునఃప్రణామము లర్పించి యనేకవిధములఁ గొనియాడెను. అప్పుడు శ్రీకృష్ణుఁడు "భక్తశేఖరా! రమ్ము భుజింత"మని యాతనితోఁ భుజించి యభయ మొసంగి వెడలిపోయెను.

యథాకాలమున నర్చకులు దేవాలయమున వివిధములగు దివ్యాన్నములు స్వామికి నివేదించిరి; గాని స్వామి వాని నేమియు నొల్లక "కండ్లకావరమున మీరు నాదాసుని గెంటివేసితిరి. ఇఁక మీరిచ్చిన నైవేద్యమును నేనెట్లు స్వీకరింతును? నేను నాభక్తుఁ డుండుచోటు వెదకికొనుచుఁ బోయి యాతనితో భుజించివచ్చితిని. ఇఁక నాతని సెలవు లేకుండ మీరు సమర్పించు పదార్థముల నేనొల్ల" నని చెప్పెను. అర్చకులు తోడనే మాధవదాసు చెంగటికిఁ బోయి "మహాత్మా! మావలన నపరాధ మైనది. మీప్రభావము నెఱుంగక మే మక్రమ మాచరించితిమి. మీరు క్షమింపకున్న మాకిఁక దిక్కు లేదు" అని ప్రార్థించిరి. మాధవదాసుఁ డందుల కంగీకరించి మఱలి నాలయమునకుఁ బోయెను. అచ్చటఁ గొన్నిదినములు గడపి యాతఁడు గోకులము, బృందావనము మున్నగు పుణ్యక్షేత్రములను దర్శించి మఱల జగన్నాథముఁ జేరుకొనియెను.

కాని యొకటిరెండుదినములలో నాతనికి అతిసారవ్యాధి సంభవించెను. అది చాలఁ దీవ్రమగుటచే దేహశుద్ధి చేసికొనుటకుఁ గూడ మాధవదాసుఁ డశక్తుఁడై యుండుటచే స్వామివచ్చి యాతనికి సకలోపచారములు చేయసాగెను. అదిచూచి దాసుఁడు "స్వామీ! సృష్టిస్థితిసంహారచతురా! సర్వము నీయధీనముగ నున్నది. చెంతఁ జేరరానిస్థితిలో

నున్న నాకు నీవు ఉపచారములు చేయుటకంటె ఈజాడ్యమునే నాశము చేయుట మంచిదిగాదా?" యని పలికెను. అందులకు శ్రీహరి "నీవు చెప్పినది నిజమే. నాకెందు నసాధ్యము లేదు; గాని జీవకోటుల కర్మలను ద్రిప్పివేసితి నేని లోకమున నియమస్థితి లేకపోవును. ఇంకను నీవీజాడ్యమువలన నాలుగుదినములు బాధపడవలసియున్నది. నేనిప్పుడే నీజాడ్యమును నిర్మూలము చేసితినేని, నాలుగుదినముల యనుభవము నిమిత్తము నీవు మఱల నొక జన్మము పడయవలసివచ్చును. నాపాలఁబడిన వారికి శాశ్వతమోక్షము నిచ్చుట నాకు వ్రత" మని చెప్పెను. మాధవదాసు నాలుగుదినములలో నారోగ్యవంతుఁడయ్యెను. అతఁడు మఱల యథాపూర్వముగ నీశ్వరధ్యానమునఁ బ్రవృత్తుఁడై యుండఁగా నొక తార్కికుఁ డరుగుదెంచి "నీవు వేదాంతి వని వినియున్నాను. కావున తర్కశాస్త్రమున నీతో వాదము చేయుటకువచ్చితి" ననియెను. మాధవదాసునకుతర్కశాస్త్రపరిచయము లేదు. ఇఁక వాదముచేయుట యెట్లు? అతఁ డీవిపత్తును దప్పించుకొనదలఁచి "నేను వచ్చునంతదనుక నుండు" మని సముద్రతీరమునకుఁ బోయి యీ యాపదను దొలగింపు మని సర్వేశ్వరునిఁ బ్రార్థింపసాగెను. దాసుఁ డిట్లు ప్రార్థనముసేయుచుండఁగనే శ్రీహరి మాధవదాసుని రూపము వహించిపోయి యొక్కమాటలోఁ దార్కికు నోడించి యంతర్ధాన మయ్యెను. పిమ్మట మాధవదాసుఁ డచ్చోటికి రాఁగా పండితుఁ డాతని కాళ్లమీఁద వ్రాలి "మహాత్మా! నే ననేకపండితుల ననాయాసముగ జయించితిని; గాని అట్టి నన్నొక్కమాటయందే జయించిన మీసామర్థ్య మనన్యదుర్లభము" అనికొనియాడెను. "పండితుఁడా! నీతో వాదముచేసిన పురుషుఁడు సర్వాంతర్యామి యగు శ్రీహరి. నీపూర్వపుణ్యలేశమువలన సులభముగ నీకు భగవద్దర్శనము లభించె" నని దాసుఁడు ప్రత్యుత్తర మిచ్చెను. అది విని పండితుఁడు పరమాశ్చర్యచకితుఁడు, అమందానందభరితుఁడునై మఱల దాసుని పాదములపై వ్రాలి "మహానుభావా! నాకు జ్ఞానోపదేశము చేయు" మని ప్రార్థించెను.

దాసుఁడు పండితునకు జ్ఞానోపదేశము చేసి యవసానమున విష్ణుసాయుజ్యమును బడసెను. శిష్యుఁడుగూడ మహామహిమాభిశోభితుఁడై తుదకు ఈశ్వరసాయుజ్యమును బొందెను.

ఉ. "మానఘనుల్ మహాత్ములు సమాధినిరూఢులు యన్ముఖాంబుజ
ధ్యానమరందపానమున నాత్మభయంబులఁ బాసి ముక్తులై
లూనత నొంద రట్టి మునిలోకశిఖామణికిన్ విశంకటా
జ్ఞానతమోనభోమణికి సాధుజనాగ్రణి కేను మ్రొక్కెదన్"
(భాగ. స్కం. 2, ప. 69.)

---

18. కల్యాణదాసుఁడు

హరిద్వారమున కల్యాణదాసుఁడు అను నొకబ్రాహ్మణుఁడు నివసించియుండెను. ఆతఁడు గృహస్థాశ్రమమున నుండియు నందఱవలె విషయసుఖపరాయణుఁడు గాక నిస్పృహుఁడై యెట్లో సంసారము గడుపుకొనుచు సర్వదా భగవత్పూజాధురంధరుఁడై యుండెను. ఆతఁడొకప్పుడు తీర్థయాత్రాభిలాషియై బయలుదేఱి సకలతీర్థములయందును గ్రుంకి, సకల పుణ్యక్షేత్రముల దర్శించి తుదకు సేతువుచెంతకుఁ జేరుకొనియెను.

ఇట్లే యొక గౌడబ్రాహ్మణబ్రహ్మచారియు తీర్థయాత్రార్థియై బయలుదేఱి యెల్లదేశములును దిరిగి సేతువునకు వచ్చియుండెను. అచ్చట నీయిరువురకును సమావేశమయ్యెను. ఒకరిభక్తిజ్ఞానవైరాగ్యాదు లొకరికిఁ దెలియవచ్చెను. ఒకరియెడల నొకరికి భక్తియు నాదరమునుగుదిరెను. తుద కిరువురును స్నేహితులైరి. అప్పటినుండియు నేమి చేసినను వారిరువురు గలిసియే చేయసాగిరి. మఱల యాత్రార్థులై బయలుదేఱి వారిరువురును మధురాపట్టణము చేరుకొనిరి.

అచ్చటఁ గళ్యాణదాసునకు దేహమున జాడ్యము సంభవించెను. దానివలన నాతఁడాఱుమాసములు బాధపడెను. ఈయాఱు నెలలును గూడ బ్రహ్మచారి యాతనినిఁ గనిపెట్టుకొనియుండి యాత్మీయునికంటె నెక్కుడు పరిచర్యలు చేసెను. ఈయుపచారములవలనను, భగవత్కటాక్షమువలనను దాసునకు స్వస్థత గలిగెను. అంత దాసుఁడు బ్రహ్మచారినిఁ జూచి "మహాత్మా! నీవు కరుణాస్వరూపుఁడవు. నీవంటిభూతదయాపరుని

నేను చూచి యుండలేదు. నాకిట్టి మహోపకారమును జేసిన నీఋణమును నేను ఎట్లు తీర్చుకోఁగలను? నీవు సాక్షాత్తుగ భగవంతుఁడవు; గాని గౌడబ్రాహ్మణబ్రహ్మచారివి గావు. కాకున్న మనుష్యమాత్రుఁ డింతటి యోగ్యుఁడో నొరులకు సేవఁజేయుట గలదా? ఈశ్వరుఁడు భక్తిక్రీతుఁడు కావున నిట్టి రూపములతో వచ్చి భక్తుల నుద్ధరించుట కలదు. భక్తశిఖామణీ! కొండంత దేవునకు కొండంత పత్త్రి తేఁగలమా? అయినను నా కొమార్తను నీకిచ్చుటకు నేను ముచ్చటపడుచున్నాను. ఇంతకంటె నీ ఋణము తీర్చుకొనుటకు నాకు వేఱు సాధనము లేదు. నావస్తువును నేను పొగడుకొనుట కాదు; గాని నాకుమార్త సాత్త్వికచిత్త. పెద్దలఁ బొడగన్న వినీతయై సేవలుచేయుటకుఁ గోరుచుండును. సదానందపరీతురాలు. ఆమె నీవంటి సాత్త్వికమూర్తికి అర్ధాంగి యగుట కర్హురాలు. కావున నట్టి నాకొమార్తను స్వీకరించి నాఋణమును దొలంగించి నేను పితృఋణమును దీర్చుకొని తరించున ట్లనుగ్రహింపు”మని బతిమాలెను. ఇదివిని బ్రహ్మచారి వివర్ణుఁ డయ్యెను. “నాకుఁ బెండ్లియా”యని యాతఁ డప్రయత్నముగఁ బలికి కొంచెము తడవు ఊరకుండి “ఆర్యా! ఐహిక సుఖముల పొంతఁ బోక యీబ్రహ్మచర్యాశ్రమమునందే యుండి జన్మసాహిత్యమును బడయఁగోరుచుండఁగా నీవిట్లు సంసారాంధకారకూపమునఁబడఁద్రోయఁజూచుట భావ్యమా? సంసారియగువానికిఁ జిత్తశాంతి యుండదు ఈప్రపంచమునందలి మానవులలో నందఱును సంసారులే. ఒక్కనికైన శాంతి యున్నట్లుగాని, ఆనంద మున్నట్లుగాని చూచుచున్నామా? అంతయు భ్రాంతి. సుఖమే యను మోహము; గాని దుఃఖము సుఖమెట్లగును! దుఃఖము దుఃఖమే. మాయావరణమువలన దృష్టి మందగించిపోవుచున్నది; బుద్ధి మొద్దుపాఱిపోవుచున్నది. మహారణ్యాదివిజనస్థలములయందుండు మునుల హృదయములే యెప్పుడు చలించిపోవుచున్నపుడు కామినీజనములనడుమనుండువానిసంగతి యిఁకఁ జెప్పనేల? కావున దయయుంచి నన్ను సంసారసాగరమునఁ గూలఁ ద్రోయుటకుఁ దలంపకుము” అని బ్రహ్మచారి దాసుని వేఁడుకొనెను; గాని దాసుని చిత్తమున కిది యంగీకార్యము కాలేదు. బ్రహ్మచారికి యథార్థము తెలిసినట్లు ఆతనికిఁ దోఁచినది గాదు. “వటూత్తమా. నీవు శుద్ధముగ భ్రమపడితివి. గృహస్థాశ్రమము నీవుతలఁచినట్లు నికృష్టముగాదు. అది బ్రహ్మచర్య

వాన ప్రస్థసన్యాసాశ్రమములకు ఆధారభూతము. అదిలేనినాఁడు ప్రపంచమే లేదు. గృహస్థాశ్రమమును స్వీకరించినంతమాత్రమున స్త్రీపురుషులు మోక్షదూరులు కాఁజాలరు. నీవు బ్రహ్మచర్యవ్రతమును గొనసాగించి పొందు ఫలమును గృహస్థులు నీకంటె సులభముగఁ బొందఁగలరు. గృహస్థులకైనను, ఇతరాశ్రమములవారికైనను మనోనిగ్రహము తప్పనిదే యగుచున్నది గృహస్థుఁడైనంతమాత్రమున విషయసుఖపరాయణుఁడు కావలయుననిగాని, అగుననిగాని నియమము లేదు. ఏది మన కనిష్టమో, దేనిని మనము మఱచిపోవలయునని సతతమును ప్రయత్నించుచుందుమో యదియే మన హృదయక్షేత్రములయందు సర్వకాలములయందును దాఁగిన మాఁడుచుండును. తొల్లి ఘంటాసురుఁడను నొక రాక్షసుఁ డుండువాఁడు. వానికి శ్రీహరిపై విరోధము ప్రబలెను. అగుట వాఁడు శ్రీహరి పేరెత్తఁగూడ దని నిశ్చయించుకొనియెను. గాని వాని కంతటితో తృప్తి కలుగలేదు. ఆపేరు విననే కూడ దని తుదకు వాఁడు నిశ్చయించుకొనెను. అయితే సమీపమునఁ బోవుచు నెవరైన శ్రీహరీ యని పిలిచినఁ జేయవలసిన దేమున్నది? వినఁగూడని శబ్దము వినినతరువాతఁ జెవులు మూసికొనినమాత్రమున నేమి ప్రయోజనము? ఇట్లు తలఁచి వాఁడు ఒడలంతయు గంటలు కట్టుకొనెను. గంటలధ్వనివలన వానికిఁ బరులు శ్రీహరీ యనునపుడు విన్పించుట మానివేసెను; గాని యేమి లాభము? "శ్రీహరి పేరు మనము వినఁగూడదు శ్రీహరి పేరు మనము వినఁగూడదు" అని క్షణక్షణమును వాఁడు తన దీక్షను దృఢతరము చేసికొనఁదొడఁగుటవలన నేశబ్దమును వినఁగూడ దని వ్రతము పట్టెనో యాశబ్దమే సర్వకాలములయందును స్మరింపఁబడసాగెను. అట్లే స్త్రీలతో సంపర్కము కలిగించుకొనఁగూడ దని మనము దీక్షదాల్చినచో స్త్రీవ్యక్తియే మనకు స్మరణార్హమగును. ఇఁకఁ జిత్తశుద్ధి యెట్లు గలుగును? కావున గృహస్థాశ్రమమును నిందింపకుము. నీవు గృహస్థాశ్రమమును గూడదనుచున్నావు; గాని నీయుపాధికి గృహస్థులే రక్షకులు అగుచున్నారు. గృహస్థులు నీవలెను మునులవలెను బ్రహ్మప్రయత్నములు చేసి మనస్సు నరికట్టుకొనకయే నీవంటి సిరాధారుల కాధారులై మీకంటె యుత్తమస్థానములను బడయుచున్నారు. కావున గృహస్థుఁ డగుటవలన మానవుఁ డధః

పతితుఁ డగునను భ్రమను విడువుము" అని దాసుఁడు చెప్పఁగా బ్రహ్మచారి విని యద్భుతాశ్చర్యరసమగ్నుఁడై అజ్ఞానాంధ్యముతొలంగ విశాలహృదయుఁడై దాసునకు సాష్టాంగనమస్కారము లాచరించి "మహానుభావా! జాడ్యపడినపుడు నీకుపకారము చేయుటవలన నీవు నన్ను భగవంతుఁడని భావించితివి; గాని నీవే నన్ను భ్రమప్రమాదములనుండియుద్ధరింప విచ్చేసిన సర్వేశ్వరుఁడవు. ఇక మాఱుపలుకక నీయాజ్ఞానుసారము ప్రవర్తించెద"నని చెప్పెను.

తోడనే కల్యాణదాసుఁడు బ్రహ్మచారిని శ్రీకృష్ణుని సన్నిధికిఁగొనిపోయి "యోగ్యుఁడ వగు నీకు నాకుమార్తనిచ్చి వివాహము చేసెద" నని శ్రీకృష్ణుఁడు సాక్షిగా నాతని చేతిలో నుదకము విడిచి చెప్పెను. బ్రహ్మచారి బ్రహ్మానందభరితుఁ డయ్యెను. తరువాత బ్రహ్మచారితోఁగూడ కల్యాణదాసుఁడు హరిద్వారమునందలి స్వగృహమునకుఁబోయి సంగతియంతయు బంధువులకుఁ జెప్పెను. తోడనే వారు పకపకనవ్వి "ఇంతవఱకు నీవు వివేకి వని మేము తలంచుచున్నాము గాని నీవివేక మంతయు నేఁడొక్కమాటుగ వెల్లడియయ్యెను. చదివించిన నున్నమతియుఁ బోయినదఁట. పంచద్రావిడులకును, బంచగౌడులకు నిదివఱకెచ్చటనైన వివాహరూపమునఁ బరస్పరబాంధవ మున్నట్లు నీవెఱుఁగుదువా! నీబుద్ధియిప్పు డేల పెడతలఁ బట్టెను?" అని వారాక్షేపణములు చేయసాగిరి. కల్యాణదాసుఁడు గతవృత్తాంతము నెన్నిసారులు చెప్పినను వారు నమ్మరైరి. మహానుభావులకు శాఖాభేదములతోఁ బనిలేదని యెంతచెప్పినను నంగీకరింపరైరి. "నేను శ్రీకృష్ణుని సన్నిధిని బ్రహ్మచారికి నాకన్యను వాగ్దానము గావించితి నది యెట్లు తప్పుదు"నని యెన్నివిధముల ప్రార్థించినను వారు సమ్మతింపకపోవుటయే గాక "యిట్టి తెలివితేటలకు సాయము వాగ్దానములును సాక్ష్యములును గూడనా!" యని తలకొకరీతిని హేళనము ప్రారంభించిరి. అంతఁ జేయునదిలేక కల్యాణదాసుఁడు రాజుగారివద్దకుఁ బోయి సంగతి యంతయుఁ దెలిపి "నాకొమార్త నా బ్రహ్మచారికిచ్చి పెండ్లిచేయుట కెట్టి యభ్యంతరమును లేకుండున ట్లనుగ్రహింపవలె"నని ప్రార్థించెను.

దాసుని వెనువెంట నాతనిబంధువులుగూడ రాజసన్నిధికిఁబోయి అసందర్భముల నన్నిటినిఁ దెలిపిరి. రాజు ఉభయులవాదములను విని

దాసునిఁజూచి "బ్రాహ్మణశ్రేష్ఠుఁడా! నీవుచెప్పునది సరిగనే యున్నది కన్య నిచ్చెద నని తప్పుటకంటె పాతకము లేదు. నీవాగ్దాన మెట్లును జెల్లింపవలసినదే; గాని నీబంధువు లందఱును దీనికివ్యతిరేకించుచున్నారు. వారందఱకు ననిష్టముగఁ బ్రవర్తింతువేని సాంసారికము లగుచిక్కులనేకములు తటస్థించును. అదియుఁగాక నీబందుగు లెల్లరును "వాగ్దానముచేసితి"నని చెప్పినంతమాత్రమున నీమాటను నమ్మరాదనుచున్నారు. కావున నీవు వాగ్దానము చేసినట్లు సాక్ష్యము తీసికొనిరమ్మని చెప్పెను.

"ఇది యెట్లు? ఇంతకంటె వలనుగాదని ఖండితముగఁ జెప్పరాదా ? నావంటి మూఢుని ప్రార్థన నంగీకరించి మధురావాసియగు శ్రీకృష్ణభగవానుఁడు సాక్ష్యము నిమిత్త మిచ్చుటకి వచ్చునా" యని సందేహించి "అట్లుగాకున్న నేనాతని చరణకమలములను వదిలి రా" నని నిశ్చయించుకొని కల్యాణదాసు మధురాపురమునకుఁ బోయెను. తమతో వాదింపలేక ఈవంకఁబెట్టుకొని కల్యాణదాసు దేశాంతరమునకుఁ బాఱిపోయెనని బంధువులు తలంచిరి; గాని కల్యాణదాసుని ప్రార్థన నంగీకరించి శ్రీకృష్ణుఁడు "సాధుజనచూడామణీ! నేను భక్తుల చిత్తానుసారముగఁ బ్రవర్తించెదను; గావున నీతో హరిద్వారమునకు వచ్చెద నడువుము; కాని నీవు వెనుదిరిగి చూడరాదు. అట్లు చూచెదవేని నీవెచ్చటఁజూచిన నచ్చట నేను నిలిచిపోయెద"నని చెప్పెను. వల్లెయనికల్యాణదాసుఁడు ముందు బయలుదేఱెను. కాలియందెలు గజ్జెలు ఘల్లుఘల్లుమని మ్రోయ శ్రీకృష్ణుఁడు వెనుక బయలుదేఱెను.

భగవంతుఁడును భక్తుఁడును అహోరాత్రవిమర్శ లేక చాలదినములు నడచి వచ్చిరి. హరిద్వారమునకు అరకోసుదూరమున నుండఁగా వాయువశమున కల్యాణదాసునకు భగవంతుని గజ్జెలధ్వని వినరాదయ్యెను. ఏమిహేతువో యని యాతఁడు వెనుదిరిగి చూడఁగా స్వామి యచ్చటనే నిలిచిపోయి "నిషేధమునకు వ్యతిరేకముగ నీవు వెనుదిరిగి చూచితివి. ఇఁక నేను ముందునకు రాను. నీవు పోయి రాజుమున్నగువారి నందఱ నిచ్చుటికిఁ గొనిరమ్ము" అని విధించెను. చేయునది లేక దాసుఁడు గ్రామమునకుఁ బోయి సంగతి యంతయుఁ జెప్పఁగా బంధువులును రాజును ఆశ్చర్యముతోఁ జనుదెంచి రుక్మిణీపతిని సేవించిరి. "నేను భక్తపరాధీనుఁడను. ఈకల్యాణదాసుఁడు మీయందఱచేత అవివేకి

యని భావింపఁబడుచున్న యీయమాయికుఁడు నాకాంతరంగికుఁడు. ఇట్టి భక్తుల నుద్ధరించుటకే నేను సగుణత్వము నంగీకరించుచున్నాను. నామహిమ నాభక్తు లెఱుంగుదురు. నేను నాభక్తుల మహిమ నెఱుఁగుదును. సర్వజ్ఞుల మని గర్వపడు తక్కినవా రందఱును శుద్ధముగ నవివేకులు. ఈభక్తాగ్రేసరుఁడు నాయెదుట తనకొమార్త నిచ్చెద నని యీబ్రహ్మచారికి మాట యిచ్చెను. ఈబ్రహ్మచారిగూడఁ గల్యాణదాసునివలెనే నాకుఁ గేవల మాంతరంగికభక్తశిరోమణి. ఈతనికి గౌడత్వము లేదు. ఈతనికి ద్రావిడత్వము లేదు. అవి కేవలమును మిమ్ము బీడించుచున్న అజ్ఞానపిశాచములు" అని స్వామి సెలవిచ్చెను. అది విని యెల్లరును బుద్ధి తెచ్చుకొని గల్యాణదాసుని పాదములపైఁబడి మాయపరాధమును మన్నింపు మనిప్రార్థించిరి. ఇంతవఱకును నీవివాహమున కాటంకము గలిగించిన మా దుడుకుఁదనమును సహింపు మనిగౌడబ్రహ్మచారిని వేఁడుకొనిరి. అట్టివాని కడుపునఁ బుట్టిన తరువాత నిట్టివానికాలుత్రొక్కుటలో వింతలేదని కన్యక యదృష్టమును జాలఁ గొనియాడిస్వామియెదుటనే వివాహకార్యమును నిర్వర్తించిరి. స్వామి యిప్పటికినచ్చట వేంచేసియుండి యెల్లరచేతను బూజింపఁబడుచున్నాఁడు.

ఉ. "ఏపరమేశుపాదయుగ మెవ్వఁడు గోరి భజించి నేర్పరుల్
లోపలి బుద్ధితో నుభయలోకము లంగుళ జడ్డుబాసి యే
తాపము లేక బ్రహ్మగతిఁ దారు గతశ్రములై చరింతు రే
నా పరమేశు మ్రొక్కెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్"

(భాగ. స్కం. ధ 7 ప. 61)

19. హరివ్యాసుఁడు.

మధురాపురమున హరివ్యాసుఁడు అనునొకబ్రాహ్మణుఁడు ఉండెను. ఆతఁడు దారపుత్రులతోఁగూడి సంసారమునందే యున్నను, సర్వకాలములయందును భగవల్లీలలను దెలిసికొనుటయందును, హరిభజన సేయుటయందును, నిత్యకర్మలను నెఱవేర్చుటయందును, సాధువుల

కును, హరిదాసులకును బరిచర్యసల్పుటయందును, నిమగ్నుఁడై గృహస్థాశ్రమధర్మముల నుల్లంఘింపక కాలముగడుపుచుండెను. ఆతనిభార్యయు నట్లే భగవద్భక్తి గలిగి పతిని ఛాయవలె ననుసరించుచుండెను. ఇట్టిసాత్వికమూర్తు లగు నీదంపతుల పాదసేవ చేసి భక్తిజ్ఞానవైరాగ్యముల నలవఱుచుకొనుటకై యనేకులు శిష్యులైరి.

ఇట్లుండ హరివ్యాసుఁ డొకప్పుడు అగణ్యశిష్యులతోడను భార్యతోడను జగన్నాథయాత్రకు బయలుదేఱెను. చాలదినముల ప్రయాణమైనపిదప వారు ఒకనాఁటిరాత్రి సింహశార్దూలాదిభయంకరజంతువులతో నిండియున్న యొక మహారణ్యము సొచ్చి ముందుఁబోవుటకు ఇష్టపడక అందొక చెఱువుగట్టుమీఁద బసచేసిరి. అచ్చట నొక కాళికాదేవి యాలయము ఉండెను. మఱునాఁటి యుదయమున సమీపగ్రామవాసి యగు నొక కాపు మేఁకపోతు నొకదానిని, కొన్ని కోళ్ళను కడవలతో నన్నమును వెంటఁబెట్టుకొని వచ్చి దేవతను బూజించి యన్నమునారగింపఁజేసి "చల్లని తల్లీ! అనుగ్రహింపు" మని మేఁకను గోళ్ళను బలియిచ్చి, వానినిఁ గొని తనదారినిఁ బోయెను.

హరివ్యాసుఁ డిది యంతయుఁజూచి "నేఁడెంత దుర్దినము! ఒక కిరాతుఁడు సాధుజంతువులను నిష్కరుణుఁడై సంహరించుట కనులారఁ జూచితిమిగదా? ఈదేశమునందలివా రెంతకఠినాత్ములు. ఈదేవత యెంత పాపాత్మురాలు! తెలిసియుండియు నిఁక నిచ్చోట వసించియుండినచో నీదేశపుఁ బ్రజలును, ఈదేవతయుఁ జేయు పాపమంతయుఁ జుట్టుకొనును" అని తలంచి కడుపు దహించివేయుచున్న క్షుద్బాధను లెక్కసేయక భార్యను శిష్యులను వెంటఁబెట్టుకొని యెక్కడకో పోవుటకు బయలుదేఱెను. ఇది యంతయుఁ జూచుచున్న కాళికాదేవి మిగుల వగచి "అయ్యో! సాక్షాత్తుగ భగవంతుని యంతరంగభక్తుఁడగు నీహరివ్యాసుఁడు ఇచ్చట జరిగిన ఘోరకృత్యమును జూచి క్షుద్బాధను దీర్చుకొనకయే యనుచరులతోఁ గూడి యెందో వెడలిపోవుచున్నాఁడు. ఎట్టి యసందర్భము తటస్థించెను? సర్వవ్యాపకుఁ డగు శ్రీహరి కీసంగతి యెట్లు తెలియకుండును? తన భక్తునకు మనోవైకల్యము కలుగుటకు హేతుభూతురాల నగునాపై నీశ్వరుఁ డెంత గోపించునో, అక్కటా! ఇంతవఱకును తెలియనయ్యె" నని భయపడుచుఁ దిన్నఁగ

బోయి హరివ్యాసుని పాదములమీఁద వ్రాలి "మహానుభావా! మీవంటి మహామహిమోపశోభితులు నాస్థలమునుండి యిట్లు క్షుధార్తులై యుండియు నెందే నరిగిన నా దేవత్వ మెట్లునిలుచును? నామీఁద వచ్చినంత యాగ్రహమును బ్రకటించిన నేఁదాళఁజాలుదునా? అపరాధమువచ్చినది. క్షమించి మఱల నాస్థలమునకు రావలయు" నని ప్రార్థించెను. హరివ్యాసుఁడు కాళికను జూచి చీకాకుపడి "నీవు క్షుద్రురాలవు. కావున క్షుద్రవిధానముల నవలంబించి సిగ్గువిడిచి యున్నావు. నీ వెప్పుడు సాధుజంతువులను బలిగొనఁ దొడఁగితివో నాఁడే నీదేవత్వము మంటఁగలిసిపోయినది. మూర్ఖజనులకు సర్వజీవసమత్వమును బోధింపవలసిననీవు అందులకుఁ గేవలము వ్యతిరేకముగ జీవహింసను, స్వార్థమునకై సాధుజంతుహింసను బోధించి చేయించు నీస్థలమున నేనీయనంతహరిభక్తులతోఁ నెట్లు నిలువఁగలను? వైకుంఠనాథుఁడగు శ్రీహరిసాత్త్వికమూర్తి. నేనాతని కింకరుఁడను. నీవో, కేవలము తామసివి. కిరాత సేవార్హవు. నేను నీస్థలమున, దుర్వాసనచే సమీపింపరాని నీసన్నిధిని పాకముచేసి దానిని భగవంతున కెట్లు నివేదింపఁగలను? పోపొమ్ము. ఇఁక నొకక్షణము నీతోఁ మాట్లాడితినేని అనేకదినములనుండి నీవు సమార్జించుచున్న అనేకజంతుహింసారూపమగు ఘోరపాపము నన్నుఁ జుట్టుకొనును. తామసీ, ఇఁక నాయెదుట నిలువకు" మని తిరస్కరించి పలికెను.

ఇదివిని కాళిక మిక్కిలి ఖిన్నురాలై మఱల హరిభక్తుని పాదములమీఁదఁబడి "ఇఁక మీ సెలవుప్రకారము ప్రవర్తించెదను. దయచేసి నాస్థలమును బవిత్రము సేయు" మని ప్రార్థించెను. "ఇఁకఁ దామసగుణమును వహింపననియు, సాత్త్వికురాలవై జంతుబలులను మాని మంచి ప్రవర్తనతోఁ నుందుననియు ప్రమాణము సేయుము. అట్లయినచోఁ మేమిచ్చట నిలిచెదము" అని దాసుఁడు పలికెను. కాళికాదేవి యాప్రకారమే చేసెను. అందులకానందించి హరివ్యాసుఁడు శిష్యులతోఁ గాళికాదేవిప్రార్థన నంగీకరించెను.

మహాసంభ్రమముతోఁ గాళిక స్థలమంతయుఁ బరిశుభ్రముగఁ జేయించి సకలసామగ్రినిఁ దెప్పించియిచ్చెను. హరివ్యాసునిశిష్యు లావస్తువులంగైకొని వంటలు ప్రారంభించిరి. హరివ్యాసుఁడు భగవత్పూజ

ప్రారంభించెను. ఇటు బూజ పూర్తియగునప్పటి కచ్చట వంటయు సమాప్తమయ్యెను. భగవన్నివేదనము ముగిసిన పిదప నెల్లరును భుజించిరి. కాళిక వారికిఁ జాల గౌరవము చేసి "మీరింకను గొన్నిదినములిచ్చట వసింపవలయు" నని ప్రార్థించెను. ఆమె శుద్ధసాత్త్వికచిత్తయగుటఁ జూచి దాసుఁడు అందుల కంగీకరించి నిలిచిపోయెను.

నాఁటిరాత్రియే కాళికాదేవి యీ దేశమును బరిపాలించు రాజునకు స్వప్నమున సాక్షాత్కరించెను. రాజు నమస్కరించినపిదప నామె "నేఁడుమొదలు నీదేశమున నెవ్వరును నానిమిత్తము మేఁకలు, కోళ్లు మున్నగు సాధుజంతువులను బలిగా సమర్పింపఁగూడదు. నేఁటినుండి నేనట్టి తామసాహారమును విసర్జించినాను. నాకు హరిహాకులకుఁబోలె నిఁక సాత్వికాహారమే చాలును. ఈవిషయము దేశమున నలుమూలల నున్నవారికి విస్పష్టముగఁ దెలియునట్లు చాటింపుము" మని చెప్పిన తరువాత రాజు దేవ్యాజ్ఞను దలంచుకొని యాశ్చర్యపడి యామె సెలవుప్రకారము దేశమునం దంతటను జాటింపుసేయించెను.

కాని రహితులు దానిని విశ్వసింపలేదు. ఇదియే గాదు. సాధారణముగ మంచిపను లన్నియుఁ గూడ నాచరణమునకు వచ్చుట చాలఁ గష్టము. "రాజున కేదో దుశ్చింత కలిగినది. కావుననే యిట్టి ముదల చేయుచున్నాఁడు" అని కొందఱు రహితులు తలంచిరి. "నిన్నటివఱకును దేవికి బలులు పనికివచ్చి నేఁటినుండి పనికిరాకపోయెనా? రాజాజ్ఞలో నేదో మోసమున్న" దని కొందఱు తలంచిరి. "రాజున కేకారణము చేతనో యిపుడు చాలమేఁక లవసరముపచ్చినవి. అందులకై యిట్టియెత్తువేయుచున్నాఁడు. నోరులేని దేవి యేమిచేయు ననుకొనినాఁడు కాఁబోలు రాజుగాని మాచెంత నీయాటలు సాగవు"అని కొందఱుపలికిరి. "రాజు అమ్మవారి కేదో కోరికనిమిత్తము మ్రొక్కి యుండవలయును. రాజునకుఁ జిత్తశుద్ధిలేక పోవుటవలన దేవి యాకోరికను దిరస్కరించి యుండవలెను. దేశము నేలురాజునుగదా, నాకోరిక నేల తీర్పకపోవలయును? అని రాజునకు ఆచల్లనితల్లిపైఁ గోపము వచ్చియుండును; గాని దేవికి కిరీటాధిపతి యగు రాజును,ఆతని చేతిక్రిందిప్రజలునుగూడ సమానులే. నరుఁడు కోపపడినంతమాత్రమున భయపడిపోయినచో నిఁకఁ గాళికాదేవి యెక్కువ యేమి?" అని మఱికొంద ఱనిరి. "మొత్తము

మీఁద దేవివద్దనే లోపములు కాన్పించుచున్నవి. ఏమన: నరుల కోరికలు దఱుచుగఁ దీర్చుచున్నచో దేవి లోకువ యగును. ఇప్పు డట్టిదే సంభవించినది. కావుననే రాజున కిట్టి బుద్ధి పుట్టినది" అని వేఱొకకొంద ఱూహించిరి. దేవికి నెలఱవేర్పఁబడు ఉత్సవములు మున్నగువానినిమిత్తము స్వయముగ చాల శ్రద్ధవహించు పెత్తనదారులు "ఏది యెట్లు పోయినను సరియేగాని మేము బలులు మాత్రము మానము. పూర్వకాలమున దేవికి బలులు వేయుటకుఁ బ్రారంభించిన మాపూర్వులకు ఈరాజున కున్నంత తెలివి లేకపోలేదు. మేము పూర్వాచారములను మానుకొను నంతటి మతభ్రష్టులము గాము. రాజు నేఁడు దేవికి బలులు మానవలసిన దని యాజ్ఞాపించెను సరియే. రేపు దారపుత్రులను విడిచి పెట్టి యడవులకుఁ బొమ్మనును. పోవలసినదేనా? ప్రజలను కన్నబిడ్డలవలెఁ జూచు దేవిని ప్రజలు కన్నతల్లినివలెఁ జూడకపోవుట కృతఘ్నత గాదా?" యని తేల్చిరి. తుదకు రహితు లెవ్వరును బలులు మానుట కంగీకరింపలేదు. "మీరు దేవి యట్లు నియమించిన దని సెలవిచ్చుచున్నారు. మేము మామూలుప్రకారము దేవినిఁ బూజించుటకుఁ బోయి తొలుత కుంభముపోసి పిదప బలి యిచ్చుటకుఁ బ్రయత్నించెదము. అప్పుడు దేవి మీరుచెప్పినప్రకారము నేటినుండి బలులు వల దని నిషేధించునేని మేము మానివేసెద" మని రహితులు రాజునకుఁ జెప్పుకొనిరి.

రహితుల మూర్ఖతకు రాజునకు ఆశ్చర్యమును దుఃఖమును కోపమును గూడవచ్చెను. అయినను ఏమియు సేయక "ఈమూర్ఖులను స్వయముగ దేవియే దండించుఁగాక" అని తలంచి యూరకుండెను. పిదప నాతఁడు జరిగిన సమాచారమును దేవికి నివేదించుటకై యాలయమునకుఁబోయి భయభక్తులతో ననేకవిధములఁ బ్రార్థింపఁగా దేవి "నాయుత్తరువును నీవు ప్రజలకుఁ దెలిపినందులకు సంతోషముగాని మూర్ఖులగుటచే రహితులు నిన్ను నమ్మరైరి. అయినను జింతింపకుము. మూర్ఖులకు మెల్లఁగఁ జెప్పిన వినఁబడదు. రానిమ్ము. నన్ను బూజింపవచ్చినపుడు నేనే తగునట్లు చేసెదను అది యట్లు పోనిమ్ము. కొందఱు హరిభక్తులు వచ్చి నాయాశ్రమమున విడిసియున్నారు. వారు కేవలము శ్రీహరిస్వరూపులు. అట్టివారుపురాకృతపుణ్యలేశము లేనినాఁడెంతప్రయత్నించినను

లభింపఁబోదు. నీనాపుణ్యములకంటె నీదేశజనుల యదృష్టము మంచిది. గావుననే వారు నీపట్టణప్రాంతమున బసచేయుట తటస్థించెను. వారి నిచ్చట నిలుపుట నాకుఁ జాల నాయాసమయ్యెను. నన్ను నీవుభక్తితో నారాధించితివి. అందులకు ఫలముగ నీకు నేను సకలైహికసుఖములను సమకూర్చితిని. నీ వనుభవింపని వైభవములు లేవు. అవి యన్నియు నీకు చుంబితములై పోయినవి. నీకిఁక నూత్నమైనది యొక్క ఆముష్మిక జ్ఞానానుభవమే. దానివలన మనుజుఁడు పవిత్రుఁ డగును. ఐహికసౌఖ్యములన్నియు నీటిబుగ్గలవంటివే గాక జీవునకు అధఃపతనకారణములు. ఆముష్మికజ్ఞాన మట్టిదిగాదు. అది జీవునకు పునరావృత్తిరహిత మగు మోక్షమును ఘటించును. గావున నిఁక నీవు ఆవైష్ణవకింకరులను సేవించి మోక్షసాధన మగుజ్ఞానమును బడసి హరిధ్యానము చేసి తరింపుము" అని యుపదేశించెను. ఈతీరున ఐహికసుఖాశలనుండి మరలించిన దేవికి రాజు శతసహస్రప్రణామముల నర్పించి భాగవతు లున్న దిక్కునకుఁ బోయెను.

మహాదరముతో భాగవతులు రాజును దమ గురువుసన్నిధికిఁ గొనిపోయిరి. రాజు హరివ్యాసుని పాదములపై వ్రాలి మ్రొక్కి "గురూ, మీయాగమనమువలన నీదేశమునందలి సకలప్రాణులును పాపములను బాసినవి. మీరాకకు మామీఁదఁగల అవ్యాజవాత్సల్యమే గాని వేఱు కారణము లేదు. ఇంతవఱకును నేను కాళికాదేవినిఁ బూజించి యామె వలన సకలైహికవాంఛలను బడసితిని. నేఁడు ఆచల్లని తల్లియే నన్ను మీపాదములసన్నిధికిఁ బంపినది. ఐహికసౌఖ్యము లన్నియు నావలనఁ బీల్చి పిప్పిచేయఁబడినవి. నాకు ఉత్తరవయస్సు ప్రారంభమైనది. ఇఁకనైన ఆముష్మికజ్ఞానసాధనమునఁ బ్రవృత్తుఁడఁ గానేని కుంభీపాకనరకమునఁ గూలఁబడిపోదును. నాకు అధఃపతనము సంభవింపకుండ రక్షింపవలసినదని మిమ్ము ప్రార్థించుచున్నాను" అని వేఁడుకొనెను. హరివ్యాసునిహృదయము మీప్రార్థనమువలనఁ గరఁగెను. అతనికి రాజుపై ననుగ్రహముగలిగెను. తోడనే యాతఁడు వినీతవేషుఁడై యున్నరాజునకుఁ దత్త్వమునుపదేశించి ఐహికవ్యామోహమును బోగొట్టెను. రాజు ఎంతో కృతజ్ఞుఁడై గురుపాదములను బూజించెను. నాఁడురహితు లందఱును కాళికాదేవినిఁ బూజించుటకు వచ్చి యథాపూర్వముగఁ బూజ ప్రారంభించిరి. అందులకు

దేవి చాల నాగ్రహపడి నయమునను, భయమునను వారికి సాత్త్వికపూజావిధానమునుపదేశించెను. అదిమొదలుగ వారందఱును దేవ్యాజ్ఞను శిరసావహించిరి.

రాజు శిష్యగణముతోఁగూడ హరివ్యాసుని మహావైభవముతోఁ దననగరమునకుఁ గొనిపోయి సకలోపచారములను గావించి యొక గొప్పమఠము గట్టించియిచ్చెను. పౌరులుగూడ ఆభగవద్భక్తుని అనేకవిధములఁ బూజించి తరించిరి. ఇట్లొకసంవత్సరము గడచినతరువాత హరివ్యాసుఁడు రాజును సకలపౌరులను దీవించి జగన్నాథమునకు బయలుదేఱెను. ఆపట్టణమునందలి జనులు బాలురు మొదలుకొని వృద్ధులవఱకును స్త్రీపురుషభేదము లేక కన్నీటిబిందువులతో గురుదేవుని విడిచిరి. పిదప హరివ్యాసుఁడు బృందావనము మున్నగు సకలదివ్యక్షేత్రములను దర్శించి మధురాపురమున వసించి శ్రీకృష్ణభగవానుని దర్శనభాగ్యమును బడసి మహామహిమాభిరాముఁడై దేహాంతమున నీశ్వరసాయుజ్యమును బడసెను.

"ఉ. ఏపరమేశు పాదయుగ మెప్పుడు గోరి భజించు నెవ్వఁడున్
లోపలిబుద్ధిలో నుభయలోకములందుల జిడ్డుఁబాసి యే
తాపములేక బ్రహ్మగతిఁ దాఁ గతత్రముఁడై చరించు నే
నా పరమేశు మ్రొక్కెద నశాంతునివర్తను నద్రకీర్తనున్."

(భాగ. స్కం. 2. ప. 61)

---

20. మనోమోహనసురదాసుఁడు.

అక్బరుచక్రవర్తికి రాజధాని యగుఢిల్లీనగరమున మనోమోహనసురదాసుఁడు అను నొక పరమభాగవతశిఖామణి వసించి యుండెను. ఆతఁడు దారపుత్రులను బోషించుటకుమాత్రమే సంసారమున నిలిచి తన్నిర్వహణార్థము ద్రవ్యకాంక్షియై అక్బరుచక్రవర్తికి సేవకుఁడై యుండెను. ఈతఁడు చక్రవర్తి పనులకంటెను గొప్పపని నిర్వర్తింపవలసినవాఁడగుటచే రాజసభలో నియమితకృత్యములను నిర్దోషముగ నెఱవేర్చికొని తక్కిన యుద్యోగులవలెఁ బ్రజలను వేధించి లంచములను

గొనుటకై కాలము వెచ్చింపక, యింటికిఁ బోయి భగవద్ధ్యాననిష్ఠుఁ డగుచుండెను. ఈతని భార్యగూడ సుగుణవతి గావున సర్వవిధములను బతి ననుసరించుచుండెను.

కాల మిట్లుగడచిపోవుచుండఁగాఁ జక్రవర్తి యీతనిని మధురా గోకులబృందావనక్షేత్రములపై నధికారిగాఁ నియమించి పంపివేసెను. అయాచితముగ లభించిన యీస్వాతనోద్యోగమువలన నీతనికి మనో రథము నిండిపోయెను. సాధువులకు సాధుసంగము పరమాప్యాయకరము. అది సుస్థిరముగ లభించిన మనోమోహనసుందరదాసుని యానందమును వర్ణింప నెవరితరము? మధురాగోకులబృందావనములకు అనుదినమువచ్చి పోవుచుండు అసంఖ్యేయభక్తజనులను దర్శించుటవలన నీతనిభక్తి మఱింత పెఱిగిపోయెను. అగుట నీతఁడు తన నెలజీతములో సంసార వ్యయమునకుఁ బోఁగా మిగిలినది సాధువులకు సదాన్నతృప్తులనిచ్చుటలో వెచ్చింపసాగెను.

క్షణక్షణము నీతనికి సంసారము మీఁది భ్రాంతి తొలఁగిపోసా గెను. భక్తిపారవశ్యమువలన నీతఁడు పెండ్లాము బిడ్డలు ప్రపంచము మున్నగు సమస్తమును మఱచి శ్రీకృష్ణభగవానునిగుణములను గీర్తిం చుచు నృత్యము చేయఁజొచ్చెను. "సంసార మసారము. యాతనాపూరి తము. ఇందు సుఖములేదు. అంతయు నిబిడదుఃఖాంధకారము; గాని దీని నందఱును దెలిసికొనఁజాలకున్నారు. ఎంత మౌఢ్యము! భార్య, బిడ్డలు మున్నగువారు మోక్షమును గాంచు ప్రాణినిఁబట్టి క్రిందికి నీడ్చి పారవేయు సాధనములు. వారికొఱకు అహోరాత్రములు శ్రమపడుట యెంత యవివేకము! నిర్మాత, పోషకుఁడు, రక్షకుఁడు, శిక్షకుఁడు, మో క్షప్రదాత అగుపరమేశ్వరునిమఱచి యీజనులు దమ్ము నాశనము సేయు వారికొఱ కెన్నిపాట్లు పడుచున్నారు" అని యీరీతిని దలంచుకొనుచు నాతఁ డపుడపుడు విచారించుచుండెను.

ఇట్లుకొన్నిదినములుగడచునప్పటికి శ్రీకృష్ణదేవాలయమార్గము వోలె నీతనిగృహమార్గముగూడ నిసుకవేసినరాలకుండునట్లు సాధుజన పరంపరచే నిండిపోసాగెను. ఒకనాఁడు నీతని క్రిందియధికారులు దేశ ములో రావలసిన పన్నులన్నియు వసూలుచేసి యెనుబదిలక్షలవరాలు ఈతనియింటికిఁ బంపిరి. అప్పుడు ఈతనియిల్లుఅంతయు సాధువులతోడను

భిక్షుకులతోఁ డను నిండియుండెను. తోడనే యాతఁడు అయెనుబదిలక్షల వరాలను సాధువులకును, భిక్షువులకును, శ్రీకృష్ణభగవానుని యుత్స వాదులకును వ్యయము చేసెను

క్షణములో నీవార్త పట్టణమునందంతటను వ్యాపించెను. ఉత్తర క్షణమున నాతని మంగళమును గోరుచుట్టములు, స్నేహితులు మున్నగు వారెల్లరును వచ్చి "అయ్యో, ఎంత యనాలోచితకృత్యమును జేసితివి! ఎనుబదిలక్షల రూపాయలన నేమను కొంటివి? ఈవిషయమున నీవు రాజున కేమి సమాధానము చెప్పఁగలవు? పుణ్యమునకై యొకఁడు పరుల సొమ్ము వ్యయము సేయువా రెందైనఁ గలరా! ఆ ముష్కరతురుష్కుఁడు సొమ్ము తెమ్మని నిర్బంధపఱచినను, లేక కారాగారమున సకల యమయాతనల ననుభవింపఁ జేసినను నీ వెట్లు తాళఁగలవు?" అని మందలింపసాగిరి; గాని దాసుఁ డేమియు సంచలింపలేదు. "అయ్యో, ఏమి మీ కీ వెఱ్ఱి? భగవంతునియెదుటఁ జక్రవర్తి యన నెవఁడు? సర్వేశ్వరుని విలాసవస్తువు లగు నీపాంచభౌతికదేహమునందును, ధనమునందును మమత్వము గలిగియుండుట యెంత అన్యాయము. ఎంతపాపము! భగవంతుని వస్తువులు భగవంతుని కర్పించుటయే మన పని. సర్వేశ్వరుఁడు ఈసచరాచరప్రపంచమునం దంతటను నిండియుండినను సాధుసజ్జనులయందు నిత్యసాన్నిధ్యము సేసియుండును. నేఁడు భగవంతుఁడు నాయింటికి అనేకసాధుజనులరూపముతోఁ జనుదెంచెను. ఆహా! అట్టిసమయమున నిఁక నాది నీది, వానిది అను భేదబుద్ధి యెట్లు నిలువఁగలదు? సర్వసాక్షియగు నారాయణుని యెదుట నీవస్తువు నాది, లేక మఱియొకనిది అని దాచుట కెట్లు సాధ్యపడును? అయినను శ్రీహరి దివ్యతేజస్సు మీ కెప్పుడు ననుభూతముకాలేదు; గావున మీకీ యజ్ఞానాంధ్యము తొలఁగిపోలేదు. అన్నలారా, సర్వమునకును యజమానుఁడగు శ్రీపతి యుండుట నాది నీది యను వివాదమా!" అని దాసుఁడు వారికందఱకును ప్రత్యుత్తర మిచ్చెను. వారందఱును "భక్తపారవశ్యమువలన నీతని కెప్పు డేమియుఁ దెలియుట లేదు. శృంఖలాహస్తులై రాజభటులు సాక్షాత్కరించినపుడు గాని యీతనికి బాహ్యస్మృతి కలుగదు. అప్పుడుగాని యీతనికిఁ దాను చేసిన పని యిట్టిదని తెలియదు. సంగతి సందర్భములు తెలిసియున్నంతవఱకును జెప్పితిమి;

గాని అంతకంటె మన మేమి చేయఁగలము?" అని వారెల్లరును వెడలి పోయిరి.

మనోమోహనసురదాసుఁడు ఎనుబదిలక్షలరాజస్వము ఖర్చుపెట్టె నను వార్తకర్ణాకర్ణిగ డిల్లీరాజసభలో ఘంటానినాదమువలె మ్రోగి చక్రవర్తిని మేల్కొల్పెను. అదివిని యెల్లరునునిర్విణ్ణులైరి. తోడనేచక్రవర్తి "ఎనుబదిలక్షల వరహాలును ఈభటుల కిచ్చి పంపుము" అనిజాబు వ్రాసి నౌకరుల నంపెను. యుక్తసమయమున వారుదాసుని సమీపించి తమ యాగమనకారణ మెఱింగించి చీటినిఁ జూపించిరి; గాని దాసుని ముఖమున వైలక్షణ్య మేనియుఁ గాన్పించుటకు మాఱుగ మందహాస మంకిత మయ్యెను. అంత నాతఁడు "హా, మానవు లెంత మూర్ఖులు! భగవద్ద్రవ్యము తమది యని భావించి యకృత్యములను గావించువీరికిఁ బరలోకమున గతులు గలవా?"యని యూహించుకొని"రాజద్రవ్యము ఎనుబదిలక్షల వరహాలును నాచెంత యథారూపముతో లేదు. ఆద్రవ్యముతో నేను చక్రవర్తికి అని యుద్దేశించి అమూల్యరత్నములను గొని యున్నాఁడను" అని రాళ్ళతో నింపించి రెండుపెట్టెలను గొనితెచ్చి రాజభటులయెదుట నుంచెను. వారు తాము విన్నదానికిని, ఇక్కడ వినుచుఁ గనుచున్నదానికిని వ్యత్యయ ముండుటఁ గాంచి "యేది యేమైనను ఈపెట్టెలను చక్రవర్తియెదుటకుఁ గొనిపోయెదము గాక" యని తలంచి వల్లెయనిరి. దాసుఁడు "నేను రాజస్వమును దుర్విని యోగము చేయలేదు. ఆద్రవ్యమునకు యథార్థమైన స్వామి యెవఁడో యాతని యానందము నిమిత్తము ఆతని యాజ్ఞవలననే వెచ్చించితిని. దీనివలన ద్రవ్యము నంతను బహుముఖములనుండి యేకముఖముఁ జేయుట కాధారమైన యాజ్ఞగలవాఁడ వగుటచే నీవును, దద్వినియోగకార్యమున బాల్గొనుటవలన నేనును ధరించితిమి. ఇందులకయి సంతోషించెద వేని పరలోకమున నీవు అఖండానందసాగరమున నీదులాడఁగలవు" అని యొక చీటి వ్రాసి చక్రవర్తికి యిచ్చునట్లు కట్టడిచేసి రాజభటుల కిచ్చెను. పెట్టెలను, జీటినిఁ గొని సర్కారు నౌకరులు వెడలిపోయినపిదప నాఁటి నిశీథమున దాసుఁ డెవ్వరికినిఁ దెలియకుండ భగవద్ధ్యానము సేయుచు దుర్గమారణ్యములకుఁ బోయెను.

చక్రవర్తి మనోమోహనసురదాసుఁ డంపిన చీటికిని, బెట్టెలకును

ఏమియు సంబంధము లేకపోవుటఁ జూచి తొలుత వింతపడెను. పిదప పెట్టె విప్పించి చూడఁగా వానియందు నిక్కముగ అమూల్యరత్నములే యుండెను. రాజసభలోనివా రెల్లరు నది చూచి యబ్బురపడి "ఇది శ్రీకృష్ణభగవానుని పనిగాని వేఱుగాదు. మనము సామాన్యుఁ డనియనుకొనుచున్న మనోమోహనసురదాసుఁడు శ్రీకృష్ణపరమాత్మకుఁ గేవలము అంతరంగిక భక్తశిఖామణి" అని తలంచిరి. "మన మాతనివిషయమున నపచారము చేసితిమి. ఇది భగవంతునకుఁ గోపకారణము కాక మానదు" అని తలంచి "మనోమోహనసురదాసుఁ డెచ్చటనున్నను వెదకి సాదరముగఁ దోడితెండు" అని చక్రవర్తి సరదారులకు ఆజ్ఞాపించెను.

రాజపురుషులు పోవునప్పటికి దాసుఁడు మహారణ్యమధ్యమున నొక వృక్షముక్రింద భక్తిపరవశుఁడై నృత్యము సేయుచు శ్రీహరిగుణకీర్తనము సేయుచుండెను. అదిచూచి రాజపురుషులును దన్మయులై నిలిచిపోయిరి. కొంతసేపటికి దాసుఁడు హరిభజన చాలించెను. ఆతని చేతి కీలుబొమ్మలైపోయిన రాజపురుషులకు బాహ్యజ్ఞానము గలిగెను. తోడనే వారు దాసునిపాదములమీఁద వ్రాలి శతసహస్రప్రణామములు గావించి రాజసభలో జరిగిన సమాచారము లన్నియుఁ జెప్పి తమతోఁ రావలసినదని ప్రార్థించిరి. దాసుఁడు వారి కోరికను దొలుతఁ దిరస్కరించెను; గాని తుదకుఁ నొప్పనయ్యెను. మహానందముతోఁ గొనిపోయి రాజపురుషు లాతనిని యుక్తసమయమున రాజసభలోఁ బ్రవేశపెట్టిరి.

అల్లంత దూరమునందే దాసునిఁ జూచి అక్బరు చక్రవర్తి గద్దియడిగ్గి యెదురేఁగి సాష్టాంగదండప్రణామము లాచరించి కౌఁగిలించుకొని తనగద్దియమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని యనేకవిధములఁ బ్రస్తుతింపసేయసాగెను. సభయందున్న యెల్లరును గూడ మహానందముతో స్తోత్రములు ప్రారంభించిరి. దాసుఁడు ఆస్తోత్రములకు స్వస్తి చెప్పించి హరిభజనము నుపదేశించి శ్రీకృష్ణనామమాహాత్మ్యమును విప్పిచెప్పి యెల్లర నానందపఱిచెను. పిదపఁ జక్రవర్తి దాసుని స్రక్చందన తాంబూలాదులతో సత్కరించి "మహానుభావా! నీవు కేవలము సర్వేశ్వరుని అంతరంగికభక్తుఁడవు. నిన్ను బూజించుట దేవదేవునిఁ బూజించుటయే యగును. అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుని భృత్యులమగు మేమేమి

పూజింపఁగలము? నీవే మాయెడల శ్రీకృష్ణపరమాత్మకు అనుగ్రహము గలిగింపవలెను. తొల్లివలెనే నీవు మధురాగోకులబృందావనములకు అధీశ్వరుఁడవై యాదాయ మంతయు సాధుసత్కారములకై వినియోగింపుము. నీవు రెండుపెట్టెలలో నింపి నానిమిత్తము పంపిన రాళ్లు ఈశ్వరానుగ్రహమువలన అమూల్యరత్నములైనవి. అవిగూడ నీవు గొనిపోయి సాధువినియోగము నిమిత్తము వెచ్చింపుము" అని ప్రార్థించి యొప్పించెను.

దాసుఁడు ఎల్లరనుదీవించి, మధురాగోకులబృందావనక్షేత్రాధిపత్యమును, రత్నపేటికాద్వయమును స్వీకరించి మధురకు బైలుదేఱిపోయెను. ఈతని రాక విని అచ్చటి సాధువులును, భక్తులును మిగుల నానందించిరి. రాజస్వము హరించినందులకు విపత్తుల పాలయ్యెదవని భయపెట్టిన స్నేహితులు చుట్టములు మున్నగువారు పరమాశ్చర్యచకితులై పాదములమీఁద వ్రాలి మాసాహసమును మన్నింపు మని ప్రార్థించి అభయమును బడసిరి. దాసుని పునరాగమనమువలన మధురాక్షేత్రమునకు నూతనశోభ గలిగెను. యథాపూర్వముగ దాసుఁడు సాధువులతోఁగూడి హరిభజనముసేయుచు అనేకకీర్తనలను రచించెను.

ఒకనాఁ డొక సాధువు దాసుని గుణములను బరీక్షింపఁగోరి దేవాలయమునుండి యింటికిఁబోవుచున్న వానికెదురై "నేను ఆలయములోనికిఁ బోయి స్వామిని సేవించుకొని వచ్చెదను. ఇచ్చట జనసమ్మర్ద మధికముగా నున్నది. నేను తిరిగివచ్చునంతవఱకు నీవు నాపాదరక్షలను జాగ్రత్తగఁ గాపాడుచుండు" మనినియమించి లోనికిఁబోయెను. దాసుఁడు నమస్కారపూర్వకముగా సాధువు నానతి శిరసావహించి పాదరక్షలను జేఁబూని ద్వారముచెంత నిలిచియుండెను. కొంతసేపటికి సాధువు వెలుపలికి వచ్చి దాసుఁడు తాను నియమించినట్లే యుండుటఁ గాంచి చాల వింతపడి యాతని నిగర్వత కానందించి "నాయపరాధమునుమన్నింపు" మని కాళ్లపైఁబడి ప్రార్థించెను. దాసుఁడును మఱల నాతనిపాదములంటి మ్రొక్కి సెలవుఁబడసి వెడలిపోయెను.

మనోమోహనసురదాసుఁడు బ్రతికియున్నంతకాలము నిట్లే హరిభజనమును, సాధుసేవయుఁ గావించి అవసానమున నీశ్వరసాయుజ్యమును బడసెను.

"తరలము. హరి నెఱుంగక యింటిలో బహుపాయనంబులు మత్తుఁడై
పొరలుచుండెడు వెఱ్ఱి ముక్తికిఁ బోవనేర్చునె? వాఁడు సం
సరణముం బెడఁబాయఁ డెన్నఁడు సత్యమా హరినామసం
స్మరణ మొక్కముహూర్తమాత్రము చాలు ముక్తిద మోనృపా."

(భాగ. స్కం ౨. ప. ౮.)

---

21. త్రిలోచనదాసుఁడు

త్రిలోచనదాసుఁడు చక్కని తెలివితేటలుగల యొక కంసాలి. రత్నస్థగితము లగు వెండిబంగారునగలఁ జేయుటలో నాతనిని మించినవా రెందును లేరు. కులవృత్తిలో నాతఁ డంతటి చతురుఁడై యుండియు గర్వమును దాని నెఱుఁగనే యెఱుఁగఁడు. విశేషించి యాతఁడు ఐహిక సుఖము లాభాసము లని తలంచి హరిభజన సేయుచు నిత్యానందము ననుభవించు భక్తశిఖామణి. ఆతఁడు కులవృత్తివలనఁ గలుగులాభము నంతను హరిదాసుల నిమిత్తమే వెచ్చించుచుండెను. ఈ కారణమువలనను, నగల నతిమనోహరముగఁ జేయుటవలనను దెలిసినవా రెల్లరు నాతనిచేతనే తమవస్తువులను జేయించుకొనుచుండిరి. దీని కంతకును భగవదనుగ్రహమే కారణ మని తెలిసికొని దాసుఁడు ధనము వచ్చినకొలఁదిని హరిదాసుల నిమిత్తము వెచ్చింపసాగెను.

త్రిలోచనదాసుఁడు నివసించియున్న పట్టణము నేలుప్రభువు ఒక తురకనవాబు. నవాబు తనకుమార్తె కొకనగ చేయింపఁదలఁచి త్రిలోచనదాసుని రప్పించుకొని వలసిన బంగారమును, రత్నములను ఇచ్చి నాల్గవనాఁటి ప్రొద్దుట వస్తువు గొనివచ్చునట్లు ఆజ్ఞాపించెను. వల్లె యని యంగీకరించి దాసుఁడు ఇంటికి బోవునప్పటికి కొందఱు సాధువులు వచ్చి క్షుధార్తులై ఆతని కొఱకు వేచియుండిరి. వారు వీథియరుఁగుమీఁదనే కూర్చుండియుండుటవలన దాసునిభార్యకు ఈసంగతి తెలియదయ్యెను. అంత దాసుఁడు ఆఁకట నకనకలాడుచుఁ దననిమిత్తము వారెదురు చూచుచుఁ గూర్చున్నందులకుఁ జాల వగచి తత్క్షణమే వారికి మృష్టాన్నముఁ బెట్టించి సంతోషపఱిచెను. ఇట్లే దాసునివలన గౌరవింపఁబడుచు

వారు రెండుదినము లుండిపోయిరి. వారిని సేవించుటయందు నిమగ్నుఁడై యుండుటవలన దాసుఁడు ప్రపంచమును మఱచిపోయెను. మూఁడవ నాఁడు వారిని సాగనంపి దాసుఁడు తాను చేయవలసిన వస్తువుసంగతి జ్ఞప్తికిఁ దెచ్చుకొని "అయ్యో, ఇఁక నీవస్తువు చేసియీయవలసినవాయిదా ఒక్కదినముమాత్రమే యున్నది మూఁడు దినములు పనిచేసినఁగాని యిది ముగియదు. ఏమి చేయవచ్చు" నని విచారించుచుండఁగా రాజభటులువచ్చి "నగయెంతవఱకున్నదో చూచివచ్చుటకు నవాబుగారు పంపినారు" అనిచెప్పిరి. దాసుఁడుపాపభీతిచే నన్నృతమాడఁజాలక యథార్థమే చెప్పి పంపివేసెను. అదివిని నవాబు చాలఁ గోపపడి అన్ననాఁటికి వస్తువు తయారుచేసి తెచ్చియీయకున్నచోఁ గఠినముగాఁ దండించెద నని దాసునకు వర్తమానము చేసెను.

రాజాజ్ఞను విని దాసుఁడు కొలుతఁ గొంచె మడలెను; గాని పిదప ధైర్యము తెచ్చుకొని "అంతకును మధురానాథుఁడు శ్రీకృష్ణభగవానుఁడే గలఁడు" అని తలంచి రహస్యముగ మధురానగరమునకుఁబోయి శ్రీకృష్ణుని సేవించుకొని యేకాంతవాసమునకై గోకులబృందావనమునకుఁ బోయెను. అచ్చట దాసునకు అనేకభక్తులతో సమావేశము గలిగెను. అగుట నాతఁడు మహానందముతో వారికిఁ గైంకర్యము సేయుచుహరిభజనమునఁ గాలము గడుపఁ దొడఁగెను.

నవాబు ఇచ్చిన గడువు ముగిసెను. క్షణములోనో క్షణములోనో తనక్రొత్తవస్తువు వచ్చునని రాజపుత్రిక యువ్విళ్లూరుచుండెను. కంసాలి ఇంకను రాఁడేమి యని నవాబు రుసరుస లాడుచుండెను. ఇఁక క్షణముండిన నవాబు ఆజ్ఞను జవదాఁటినందులకుఁ గంసాలికి ఘోరతరదండనము విధించును. ఇట్లుండఁగా అంతరంగభక్తులకు రానున్న విపత్తునుదొలంగింపగోరి శ్రీకృష్ణుఁడే దాసునిరూపముగొని అవాఙ్మానసగోచరంబగుతన మహామహిమవలన నవాబు గోరిన వస్తువును క్షణములో సృజించిరాజాస్థానమునకుఁ గొనిపోయెను. ఇంతజాలమేల చేసితివి? అని యాభరణసౌందర్యము నారసి కోపమును దిగమ్రింగికొని మహానందభరితుఁడై "ఆభరణములు సేయుటలో నీయంతచతురుఁడు లేఁడనికంసాలి రూపముననున్న భగవంతుని మిగులఁ గొనియాడి ఆవస్తువునకు మామూలుగా నీయవలసిన మజూరీయిచ్చివేసి తనమహానందమునకు

గు ర్తుగా వి శేషధనము బహుమానముగా నిచ్చెను. ఆరూపముతోడనే సర్వేశ్వరుఁ డాధనమును దాసుని యింటికిఁ గొనిపోయి దాసుని భార్య కిచ్చి "ఈధనముతో సాధుసజ్జనులకుఁ బరిచర్య సేయుచుండుము" అని నియమించి ఎందో బోయివచ్చెద నని చెప్పి మాయ మయ్యెను.

ఆజ్ఞాప్రకారము దాసునిభార్య ఆధనము నంతను భాగవతారాధనమునందే వెచ్చించుచుండెను. ఆఱుమాసములు గడచిపోయెను. ఉన్నట్లుండఁగా నొక్కనాఁడు ఆఱువేల సాధువులు క్షుధార్తులై దాసుని యింటికి వచ్చిరి. ఇదియంతయుఁ జూచి శ్రీహరితోడనే త్రిలోచనదాసుని రూపముతో వచ్చి వారి కందఱకును మృష్టాన్న మిడి సంతసింపఁ జేసితా నింత భుజించి ఒక పూటకు సరిపడు అన్నమును మూటగట్టుమనిమఱల నెందో పోయివచ్చెద నని దాసునిభార్యకుఁ జెప్పి ఊరుదాఁటిన పిదప మఱియొక భక్తుని రూపమును దాల్చి గోకులబృందావనమునఁ దన సేవ యందు మైమఱచియున్న త్రిలోచనదాసునిచెంతకుఁ బోయెను.

దాసవేషియగు భగవంతునిఁ జూచిదాసు "అయ్యా, భయంకర జంతుసంకుల మగు నీమహారణ్యముల కేల వచ్చితిరి?" అని యడిగెను. కుహనాదాసుఁడు అందులకుఏమియుఁ దెలియనివానివలె నటించుచు "ఇప్పటివరకును నేనునడచుచున్నది మహారణ్యమధ్యమార్గ మని నాకుఁ దెలియ లేదు. కారణమేమందురా? ఈసమీపగ్రామమున నేర్పరియగు నొక కంసాలి కలఁడు. నవాబు తన పుత్త్రికకు ఒకరత్నాభరణము చేసి తెమ్మని కంసాలికి రత్నములును బంగారము నిచ్చెను. ఆజ్ఞాప్రకారమే కంసాలివస్తువును జేసి తీసికొనివెళ్లెను. అనితరసాధ్య మగు ఆపనికి నవాబు మిగుల సంతోషించి కంసాలికిఅనంతధనమును బహుమతిగా నిచ్చెను. ఆధనముతో సాధుజనాగ్రేసరుఁ డగు ఆకంసాలి ఆఱుమాసములనుండి భక్తులకు సత్కారములు సేయుచున్నాఁడు. నేఁడు ఎక్కడనుండియో ఆకస్మికముగ నాఱువేలదాసులువచ్చిరి. కంసాలి వారి కందఱకును మృష్టాన్న మొసంగెను. దాసులు మహానందపరవశులై వెడలిపోయిరి. వారిలో నేనొకఁడను. అయ్యా, ఆకంసాలి యాదరము నేమి చెప్పుదును! ఆతఁడునుఆతని భార్యయు నాకు రాత్రికి సరిపడుభోజనమును మూటగట్టుకొనునంతవఱకును నిర్బంధపఱిచిరి. అయ్యో, నీముఖము చూడ నీవు క్షుధార్తుఁడవై యున్నట్లు తోఁచుచున్నది. భగవంతునికి నివేదింపఁబడిన యీ యన్న

మును భుజింపుము" అని కుహానాదాసుఁడు చెప్పెను. అంతయు విని దాసుఁడు మిక్కుల నబ్బురపడి భాగవతుఁడొసఁగు భగవదుచ్ఛిష్టమునుదిరస్కరింపఁగూడదని వందనపూర్వకముగ దానిని గ్రహించి భుజించి "అయ్యా, నన్నుఆకంసాలియింటికిఁ దీసికొనిపోయెదరా?" యని అడిగెను. కుహానాదాసుఁడు వల్లె యనెను. ఇరువురును బ్రయాణమైపోయిరి.

కుహానాదాసుఁడు వీథితిన్నెపైఁ గూరుచుండెను. త్రిలోచనదాసు లోపలకుఁ బోయి భార్యను జూచి "నేఁడు జరిగిన విశేషము లేమి" యనియడిగెను. ఆమె, 'పలవరించుచుంటిరా' యని వింతపడుచు సర్వము నెఱింగించెను. దాసుఁడు వీథిలోనికి వచ్చిచూడఁగా కుహానాదాసుఁడు కాన్పింపఁడయ్యెను. దాసునకు ఇది యంతయు భగవన్మాయగను, తన్నరణ్యమునుండి కొనివచ్చినదాసుఁడేభగవంతుఁడుగను తోఁచెను. తోడనే యాతఁడు భగవంతునకనేకనమస్కారములుసమర్పించి ఇక్లే "భాగవతారాధనము సేయుచుండుము" అని భార్యకు నియమించి మఱల నడవికిఁ బోయి భగవద్భజనమునఁ బ్రవృత్తుఁడయ్యెను.

నవాబుకుమారికకు రత్నాభరణము భారము దినదినము పెరుగుచుండుటవలన ధరింపనైతిగాదయ్యెను. అంత నామె సంగతి యంతయుఁ దండ్రికిఁ దెలిపి "ఈనగను నేను ధరింపకుండ నుండఁజాలను; గాని భారము పెరిగిపోవుచుండుటవలన శక్యము గాకున్నది. దీనిబరువు తగ్గునట్లుచేయింపుము" అని విన్నవించెను నవాబు త్రిలోచనదాసు నిమిత్తము నౌకరుల నంపియు వ్యర్థమనోరథుఁడై మఱియొకకంసాలినిఁ బిలిపించెను. క్రొత్తకంసాలి ఆయాభరణముయొక్క పనివానితనమున కాశ్చర్యపడుచుఁ ద్రాసులోఁ బెట్టితూఁచెను; గాని యెన్నిరాళ్లు వేసినను దానికయుఁ ద్రాసునుగూడ సరిపడదయ్యెను. నవాబు కాటాను ఇనుపగుండ్లను దెప్పించెను. అయినను బ్రయోజనము లేకపోయెను. కంసాలి వస్తువును మూఁడుముక్కలుచేసి తూఁచఁబోయెను. అప్పటికినిశక్యము గాదయ్యెను. అదిచూచి ఆక్రొత్తకంసాలి "అయ్యా, దీనినిదూఁచుట గాని, దీనిని మఱలఁ జేయుటగాని నావలనఁ గానేరదు. దీనినిఁదొలుత నెతఁడు చేసెనో ఆతనికేకాని యిది సాధ్యపడదు" అనిచెప్పి వెడలి పోయెను.

"ఎట్లయినను ఆనగను మఱలఁ జేయింపకతీఱదు. ఆవస్తువును ధరించుకొని యున్నంతకాలము శ్రీకృష్ణభగవానుఁడు నాకు సాక్షాత్కరించియుండి మహానందసాగరమునఁ దేలియాడించుచుండెను. నాయొడలినుండి యీవస్తువు నెప్పుడు తీసితినో అప్పుడే స్వామి తిరోహితుఁ డయ్యెను. ఆమహానుభావుని దర్శనము లేకపోవుటచే నాకండ్లు కాయలు కాచినవి. ఈయాభరణమును త్వరగఁ జేయించి యీయకున్న నేను ప్రాణముఁ బాసెదను" అని కమ్మర్త చెప్పఁగా విని నవాబు ఆశ్చర్యచకితుఁడై మాఱుపల్కఁజాలకపోయెను. తురకబిడ్డతో శ్రీకృష్ణుఁడు కాలముగడపుటా?యని యెల్లరు నబ్బురపడసాగిరి. ఇదియంతయు భగవన్మాయగాని వేఱుగాదని తెలిసికొని, తనకుమారికకు భగవంతుఁడు కొంగుబంగారమైయుండుట కానందించి నవాబు "త్రిలోచనదాసు ఎచ్చటనున్నను వెదకి తెండు" అని నూర్గురు భటులకు సెలవిచ్చెను.

త్రిలోచనదాసుని నిమిత్తము ఆనూర్గురుభటులు ననేకనగరములు గ్రామములును దిరిగి యెందును గానక తుద కరణ్యము బ్రవేశించిరి. అచ్చటఁగూడ వారికోరిక [illegible]య్యెను. "ఇఁక మనము ఆకంపలిని వెనుకఁజాలము. ఇండ్లకు పోయిన మనకు నవాబు మరణదండనము విధింపక మానఁడు కావున మన మీయరణ్యమునందే తిరుగుచు నేక్రూరజంతువుల నోళ్లయందో పడి మడియుదము" అని వారందఱును గూడఁబలికికొని ముందునకుఁ బోయిరి. కొంతసేపటికి వారు బృందావనము చేరుకొనిరి. అక్కడకుఁ బోవునప్పటికి వారికి క్షుద్బాధ ప్రారంభమయ్యెను. పిపాస మెండయ్యెను. అట్టిసమయమునందే కదా ఐహికచింతానిమగ్నులగు మానవులకు భగవంతుఁడు జ్ఞప్తికివచ్చుట? వారందఱును భగవద్ధ్యానము ప్రారంభించిరి. వారి ప్రార్థనలు ఆమహారణ్యమునందే మఱియొకచోట హరిస్మరణమునం బ్రవృత్తుఁడై యున్న త్రిలోచనదాసునకు వినవచ్చెను. తోడనే యాతఁడు ధ్వనినిఁ బట్టి క్షుధార్తులగు నానూర్గురు రాజభటులచెంతకును వచ్చి వనఫలోదకంబులచే వారి క్షుత్పిపాసలు ఉడిపి తనకుటీరమునకుఁ గొనిపోయి మీవృత్తాంతమేమని యడిగెను. వారందఱును భూమిపై సాగిలఁబడి తమ ప్రాణదాతకు నమస్కారములుగావించి యథార్థమంతయు వక్కాణించిరి. అదివిని యాతఁడు వారికి వైరాగ్యముగలిగించి హరిభజనముపదే

శించెను. సర్కారు నౌకరులును "మేమిఁక ఇండ్లకుఁ బోము. గురుదేవుఁడవగు నీపాదము లాశ్రయించియుండి తరించెదము" అనివిన్నవించుకొనిరి. ఈతీరునం ద్రిలోచనదాసు కుటీరప్రాంతము భక్తులచే నిండిపోయెను. ఈభక్తుల భజనలచే నాప్రాంతములయందు శకుంతకూజితములు గూడ వినరావయ్యెను.

ఇట్లు ఆఱుమాసములు గడచిపోయెను. నవాబునకు కూఁతురు పోరు ఎక్కువయ్యెను. ఇఁకఁ జేయునది లేక దాసుని వెదకుటకు ఆతఁడే స్వయముగ బయలుదేఱెను. నాలుగైదు దినముల ప్రయాణము ముగిసినపిమ్మట నవాబు గోకులబృందావనమున శిష్యగణపరివృత్తుఁడై చుక్కలలోఁ జంద్రునివలె వెలుఁగుచున్న త్రిలోచనదాసునిఁ జూచెను. వనమున కంతకును శోభ గూర్చుచున్న యాసాధువులమహాతేజమును జూచినతోడనే నవాబు హృదయము విజ్ఞానమయ మయ్యెను. వెంటనే యాతఁడు త్రిలోచనదాసునకు సాష్టాంగనమస్కారములు గావించి యనేకవిధములఁ గొనియాడి ముకుళితకరకమలుఁడై వినీతభావమున నిలువఁబడెను. దాసుఁడును నవాబును దీవించి "నీవు మ్లేచ్ఛుఁడ వయ్యును ఇట్టిభగవద్భక్తికిఁ బాత్రుఁడ వగుట నీపూర్వకృతపుణ్యపరిపాకముగాని వేఱుగాదు. నీపుణ్యమువలననే నీ కుమారికి గూడ శ్రీకృష్ణభగవానుని సేవకు అర్హురాలైనది" అని యనేకవిధముల నానందపఱిచెను.

పిదప నవాబు వృత్తాంత మంతయుఁ దెలిపి దాసుని స్వనగరమునకు బయలుదేఱదీసెను. వీరందఱును మార్గమధ్యమునం దుండఁగనే సర్వేశ్వరుఁడు త్రిలోచనదాసునిరూపమున నవాబు కూఁతురుచెంతకుఁబోయి ఆభరణశకలములం గొని మూఁడువందల యఱువది యాభరణములుగాఁ జేసి దినమున కొక్కనగచొప్పున ధరింపు మని చెప్పి వెడలిపోయెను. నవాబు త్రిలోచనదాసునితోఁ గోటలోనికిఁ జేరుకొనునప్పటికి ఆతనికూఁతురు నగలన్నియుఁ బట్టించుకొని తండ్రి యెదుటకువచ్చి "త్రిలోచనదాసు వచ్చి మున్నూటయఱువది నగలుచేసియిచ్చి దినమున కొకటిచొప్పున ధరించుకొను మనిచెప్పి వెడలిపోయెను. నేనట్లే చేయుచున్నాను. ఈనగలను నామేనఁ దాల్పఁ దొడఁగినది మొదలు యథాపూర్వముగ శ్రీకృష్ణదేవుఁడు నాకు సాక్షాత్కరించుచున్నాఁడు" అని చెప్పెను. అదివినినవాబు మఱింత రిచ్చపడి "త్రిలోచనుఁడు నావెంటనే

యుండెను గదా! ఇదియంతయు నేమి?" యని యాలోచన తోఁచక దాసుని రప్పించి సకలము నెఱింగించి "మహాత్మా, నీవింత గొప్పవాఁడవని యెఱుఁగఁ జాలనైతి" నని పాదములమీఁద వ్రాలి క్షమింప వేఁడుకొనెను. దాసుఁడు ఇదియంతయు భగవల్లీలగాని వేఱుగాదు ఆకృష్ణుఁడు మనల నిట్లు ఆడించుచున్నాఁడు" అని చెప్పెను. నవాబు దాసునకు మహోన్నతసత్కారములుగావించి యింటికిఁ బంపెను. దాసుఁడును మహానందముతోఁ బరమేశ్వరునిఁ గీర్తించుచు గృహమునకుఁ బోయి ధనమంతయు భాగవతార్చనమునకై వినియోగింపు మని భార్యకు నియోగించి భగవత్పూజ నెఱవేర్చి భుజించి భగవన్నివేదితాన్నమును నవాబు అంతఃపురమునకు బంపెను. నవాబు సకుటుంబపరివారుఁడై మహాభక్తితో నాప్రసాదము నారగించెను. భగవత్కృపవలన రాజకుటుంబము భక్తిజ్ఞానవైరాగ్యములను గాంచెను.

నవాబు మహమ్మదీయుఁడై యుండియు భారతీయులపాదములపై నిట్లువ్రాలుచు, శ్రీకృష్ణుని మ్రొక్కుట కొందఱు మహమ్మదీయులకుఁ దగినదిగాదు. వారందఱును ప్రభువు నెడల నసూయాపరవశులై ద్రోహము తలఁచియుండిరి. నవాబు ఇదియంతయుఁ దెలిసికొని వారి అజ్ఞానమును బోఁగొట్టఁదలంచెను. వారందఱును ఒకనాఁడు శిష్యగణముతోఁ ద్రిలోచనదాసుఁడు నదిలోస్నానము చేయుచుండఁగా నవమానము సేయఁదలఁచిమార్గమధ్యమునఁ గాచియుండిరి. ఇది తెలిసి నవాబు, శిష్యగణముతోఁ ద్రిలోచనదాసుఁడు ఇంటికి మఱలిపోవునపుడు మీఁదబడి కత్తులతో నఱకుచున్నట్లు నటింపుఁడు అని సిపాయీలకు ఆజ్ఞాపించెను. సిపాయీలు అట్లే నటించిరి. మరణభీతిచే శిష్యు లందఱు నటునిటు పాఱిపోవఁ జూచుచుండుటఁగాంచి త్రిలోచనదాసుఁడు "వెఱవవలదు. ఇదియంతయు నీశ్వరలీల. శ్రీకృష్ణుఁడు మనకు నేఁడు ఈతీఱున సేనయొసంగుచున్నాఁడు" అని ప్రబోధించెను. శిష్యులు నిర్భయులైరి. సిపాయీలు విజృంభించిరి గాని వారి కత్తులన్నియుఁ బూలమాలికలైపోయెను. ఇదియంతయుఁ జూచుచు డొంకలలో డాఁగియున్న మహమ్మదీయులు తెల్లవోయి భాగవతులమహిమను గుర్తెఱిఁగి వారి కాళ్లపైఁబడి శరణముఁ బ్రార్థించిరి. తాను చేసిన ప్రయత్నము సఫల మగుట విని నవాబు మిగుల నానందించెను.

మఱియొకనాఁడు దాసుఁడు శిష్యగణముతో నదీతీరమునుండి యింటికిఁ బోవుచుండఁగా సమీపారణ్యమునుండి యొక బెబ్బులి వెలువడివచ్చి మీఁదఁబడుటకు సిద్ధపడెను. అదిచూచి శిష్యులు చాల భయపడిరి. ఏల భీతిల్లెదరు ? పరమేశ్వరుఁడు నేఁడు వ్యాఘ్రావతారము దాల్చి వచ్చినాఁడు. అయ్యో, అజ్ఞానము మిమ్ము హరిసేవనుండి మఱలించుచున్నది" అనియెను. శిష్యులు జంకుదీఱి "శ్రీహరీ! మాయజ్ఞానమును బాపుము" అని చేతు లెత్తి ప్రార్థించిరి. తోడనే యాశార్దూలము తోఁక యాడించుకొనుచు త్రిలోచనదాసునొద్దకు వచ్చి నిలిచెను. దాసుఁడు దానియొడలు నిమిరి ఇంటికిఁ గొనిపోయి భగవన్నివేదిత పదార్థమునిడెను. వ్యాఘ్రమును ఆనందముతో దానిని భక్షించి శ్రీహరిపాదోదకమును త్రావి దాసునివలన నాజ్ఞను బడసి యిచ్చవచ్చినట్లు పోయెను.

ఈమహిమాప్రదర్శనము లన్నియు విని నవాబు దాసునిఁ దనకోటకు రప్పించుకొని సింహాసనమునఁ గూర్చుండఁజేసి "అజ్ఞానము వలన మాకు అకృత్యములే ఆచరణమునకువచ్చుచుండును. మేము చూచెదముగాని మాకండ్లు సరిగ గ్రహింపఁజాలవు. ఐహికసుఖములలోఁ బరమానంద మున్న దనుకొందుము. రాజ్యాధికారము ఉన్న దని గర్వించి సంచరింతుము. గురువరా, ఇంత యెందులకు? గతజలసేతు బంధన మేమి లాభము? మేము జేసిన పాపములన్నియు నశించిపోవునట్లు అనుగ్రహింపుఁడు. ఈసకలరాజ్యాధిపత్యమును స్వీకరించి సకలధనమును భగవద్భాగవతులకై వినియోగింపుఁడు" అని ప్రార్థించెను.

"హృదయము నిర్మలమై భక్తిభాజనము కాదేని రాజ్యమును విడిచినను, సర్వసంగపరిత్యాగము గావించినను ప్రయోజనము లేదు. అది సిద్ధించెనేని రాజ్యమును సంసారమును విడువకయే మోక్షము నార్జింపవచ్చును. నీకు నిర్మలజ్ఞానము కలిగెనేని రాజ్యాధికారసాహాయ్యమున నీవు దేశమునంతను బాగుచేయఁగలవు. మునులచే నుపదిష్టమగు నేకాదశీవ్రతము ననుష్ఠించి, అధికారసాహాయ్యమున దేశమునందలి సకలజనులను దద్వ్రతపరాయణులుగఁ జేసి రుక్మాంగదుఁడు నరకలోకమును వ్యర్థము గావించెను ; గావున నీవు నట్లే సేయుము" అనిదాసుఁడు నవాబునకు బోధించెను.

దాసుని జీవితకాలములో భగవంతుఁ డనేకపర్యాయములు ప్రత్యక్షమై ధైర్యము గలిగించుచుండెను. త్రిలోచనదాసుఁడును, భార్యయు, ప్రభుదంపతులును, రాజపుత్రికయు, శిష్యగణమును బ్రతికియున్నంతకాలము హరిని సేవించి అంతమున నీశ్వరసాయుజ్యమును బడసి సుఖించిరి.

క. "విశ్వకరు విశ్వదూరుని, విశ్వాత్ము విశ్వవేద్యు విశ్వ నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు, నీశ్వరుని బరమపురుషు నే భజియింతున్"
(భాగ. స్కం ౮. ప. ౭౩)

---

22. జయదేవుఁడు.

శ్రీజగన్నాథమునకు సమీపమునందలి తిందుబిల్వము అనునొక గ్రామమున ఒక బ్రాహ్మణునకు జయదేవుఁడు అనుకుమారుఁడు కలిగెను. ఆతనితలిదండ్రులు లేకలేక కలిగినకుమారుఁ డగుటచే మిగుల గారాబముతోఁ బెంచుకొనుచు గర్భాష్టమసంవత్సరమున బ్రాహ్మణవర్ణమునను సరించి ఉపనయనమును మాత్రము నెఱవేర్చి, అలసిపోవు నని భావించి విద్యాభ్యాసము సేయింపక యిచ్చవచ్చినట్లు ఆటపాటలతోఁ గాలము గడపునట్లు విడిచిపెట్టిరి. జయదేవుఁడు, తనకుఁ దల్లిదండ్రులు చదువు చెప్పింపకపోయినను, తోడిపిల్లలు సదువుకొనుటచూచి విద్యాభ్యాసము నం దాశవహించి ఆటపాటలలో గడువఁగా మిగిలిపోయిన సమయముల యందు సహచరులవెనుకఁ గూర్చుండి వారు పఠించువిద్యలనన్నింటిని వినఁదొడఁగెను. ఇట్లు ఆతఁడు రెండుదినములకో మూఁడుదినములకో తిటికమైనపు డెపుడో స్వల్పకాలముమాత్రము వినినంతమాత్రముననఁ బదాతేండ్లప్రాయము వచ్చునప్పటికి సకలకలావిశారదుఁ డయ్యెను.

ఉపదేశ మవసరములేకయే సకలవిద్యలను నేర్చి ప్రతివాదిభయంకరుఁడై యున్నజయదేవునిఁ జూచి పండితు లెల్లరును "ఈతఁడు కేవలము వ్యాసభట్టారకుని యంశమున జన్మించినపావనమూర్తి; కావుననే యిట్టి లోకోత్తరప్రభావసంపన్నుఁ డయ్యె"నని కొనియాడసాగిరి. జయదేవుఁడు సకలవిద్యలసారము నెఱుంగుట మూపముననఁ బ్రపంచరహస్యమంతయు నెఱింగినవాఁడు గావున హరిసేవయే పరమోత్కృష్టమనియు,

భవతారక మనియు గ్రహించి, హరిభజనపరుఁడై గీతగోవిందము అను నొకమహాగ్రంథమును రచించెను. ఆగ్రంథమునందలి కీర్తనలు శ్రీకృష్ణ గుణచేష్టితములను జక్కఁగ వివరించుచు భక్తిప్రవాహమునఁ గొనిపోయి ఆనందసాగరమున దేల్చునవి యగుటఁ జూచి భగవద్భక్తు లెల్లరును దాని నతిప్రేమతో నాదరింపఁ దొడఁగిరి. ఇదిచూచి జగన్నాథమునందే వసించుచున్న సాత్వికరాజు అనుభూపాలుఁడు తాను మఱియొక గీతగోవిందమును రచియించి దానినే యెల్లరు నాదరించి పఠింపవలయునని నియమించెను; గాని భక్తులు ఈయాజ్ఞను మన్నింపలేదు. "రాజా! జయదేవునకుఁ బోటిగా మఱియొక గీతగోవిందమును రచించుట వివేకముగాదు. నీవు నూఱుజన్మము లెత్తినను జయదేవుఁడవు కాఁజాలవు. కావున నీగ్రంథము జయదేవుని గ్రంథమువలె లోకులకు ఆప్యాయకరము కాఁజాలదు. జయదేవుని గ్రంథమే మాకు శ్రవణ పఠనములకు యోగ్యము. అదియే మాకుఁ బూజ్యము. భజనకంటె తత్పఠనమే మాకు మోక్షప్రదము. నీగ్రంథమును మేము తాఁకము. కన్నెత్తి చూడము. నీసొమ్ము తిని నీకు దాస్యముసేయు నీనౌకరులు మాత్రమే నయముననో, భయముననో దానినిఁ బఠింతురు" అని వారు రాజును తిరస్కరించిరి.

ఈమాటలు విని రాజు మిగుల దుఃఖించెను. రాజు దండింపఁగలఁడు గాని భక్తిని గలిగింపఁజాలఁడుగదా? తుదకు ఆతఁడు "భక్తులను నియమించుటవలనఁ బ్రయోజనములేదు. వారితో స్నేహముగుంచిది" అనితలంచి "మహానుభావులారా! మీరేల నిష్కారణము నిరాకరించి పలికెదరు? జయదేవుని గ్రంథమును, నాగ్రంథమును భగవత్సన్నిధి నుంతము. ఎవరిగ్రంథము భగవదంగీకృత మగునో తెలిసికొందము" అనియెను. భక్తులకు జయదేవుని గ్రంథమునెడల నెంతమాత్రము నపాయశంక కలుగలేదు. అగుటచే వారెల్లరును అట్లు సేయుటకు అంగీకరించిరి. రాజును భక్తులునుగూడి సాయంత్రము శ్రీజగన్నాథునిదర్శించి, రెండుగ్రంథములను సమక్షమునయుంచి తలుపులుబిగించి ముద్రవేసి స్వస్థలములకుఁ బోయిరి. మఱునాడు ప్రాతఃకాలమున నందఱునుబోయి చూడఁగా జయదేవుని గ్రంథము భగవత్పాదములపై నుండెను రాజు గ్రంథము దూరమునఁ బడియుండెను. అది చూచి భక్తులు అందఱును "రాజా, ఇంక నేమైనఁ బరీక్షలు సేయవలసి యున్నవా?" యని యెత్తి

పొడిచిరి. రాజు లజ్జచే శిరమువంచుకొని దుఃఖోద్రేకము శమించినపిదప శ్రీజగన్నాథుని దిక్కు మొగంబై కరకమలములు ముకుళించి "ప్రభూ, నీవు జగత్తునకును అంతకును దండ్రివి. మానవులకుఁ బోలె నీకుఁగూడ నిట్లు పక్షపాతములుండుట సెల్లునా? నీవు సర్వవ్యాపి వందురు. సర్వసముఁడవందురు; గాని నేఁడది యబద్ధముగాఁ దోఁచుచున్నది. మహానుభావుఁడవగు నీ వీయవమానమును భరింపఁగలవేమో కాని నేనుసహింపజాలను. ఇదే నేను నాశిరమును నీపాదములపై సమర్పించుచున్నాను" అని సాహసము చేయఁబోయెను. తోడనే స్వామి ప్రత్యక్షమై రాజునకు జ్ఞానము నుపదేశించి రాజు గ్రంథమునందలి ఇరువదినాలుగు శ్లోకములను జయదేవుని గ్రంథమునఁ జేర్చి యంతర్హితుఁ డయ్యెను!

శ్రీజగన్నాథమున మహాధనికుఁ డగు నొక బ్రాహ్మణుఁడు వసించి యుండెను. లోకమునందలి ధనికులవలె నాతఁడు మత్తుఁడు గాక విజ్ఞానియు భగవత్పూజాధురంధరుఁడై యుండెను. అఖండసంపద యున్నను, సంతతి లేకపోవుటచేత నాతనికి ఆనందము లేకపోయెను. తుదకు జగన్నాథుని యనుగ్రహమున నొక చక్కని కన్యక యుద్భవించెను. ఆమె చక్కని చుక్క యగుటచేఁ దలిదండ్రు లామెకు పద్మావతి యనిపేరు పెట్టి శ్రీహరికటాక్షముచేఁ గలిగిన యామెకు శ్రీహరియే పతిగావలెనని తలంచియుండిరి. పద్మావతితల్లిదండ్రుల మిక్కుటపుగారాబమునకుఁ బాత్రురాలై కొన్నిదినములకు యుక్తవయస్కురాలును,విద్యావతియునయ్యెను.సౌందర్యవతియు, విద్యావతియు, నగు పద్మావతిని అనేకబంధువులు తమకుమారులకుఁ బెండ్లిసేసికొనఁ గోరిరి గాని యామె తలిదండ్రులు తమనిశ్చయము తెలిపినవెంటనే నిరాశులగుచుండిరి. ఇట్లు జరిగి పోవుచుండఁగా నొకనాఁటి రాత్రి జగన్నాథుఁడు ఆమెతండ్రికి స్వప్నమున సాక్షాత్కరించి "సర్వలక్షణసంపన్నయగు నీకొమార్తను నాకే యిచ్చి పెండ్లి చేయఁదలంచితివికదా ? అందులకుఁ బరమానందము జయదేవుఁడు నా యంశమునఁ బుట్టినవాఁడు. నీకొమార్తె నాతనికిచ్చి పెండ్లిగావింతువేని నేను ఆనందింతు" ననిచెప్పి తిరోహితుఁ డయ్యెను. ఆబ్రాహ్మణుఁడును ఈశ్వరుని యాజ్ఞాప్రకారము జయదేవునిఁ బ్రార్థించి కొనివచ్చి యాతనికి సాలంకృతకన్యాదానము చేసి తరించెను.

పిదప దేశాంతరమునుండి వర్తకము నిమిత్తము అచ్చటకు వచ్చిన యొక వైశ్యుఁడు జయదేవుని ప్రభావమును వినివచ్చి జ్ఞానోపదేశము చేయవలయు నని యాశ్రయించెను. వర్తకుఁడు జగన్నాథమున నున్న దినము లన్నియు జయదేవుని శుశ్రూషించుటయందే కడపి దేశమునకుఁ బోవునపుడు "మీరు నాయూరికి వచ్చి నాయింటఁ గొన్నిదినములు వసియింపవలయును" అని వేడుకొనెను. జయదేవుఁడును వల్లె యని యొల్లే చేసెను. వైశ్యుఁడు జయదేవునిఁ దన మేడపై నివసింపఁజేసి పూర్వాధికభక్తితో సేవించుచు జ్ఞానోపదేశమును బడయుచుండెను. నిర్మలభక్తుఁడగుటచే వైశ్యునకుబోధించుట గురుదేవునకుఁ బరమానందముగా నుండుచుండెను.

ఇట్లు ఒకమాసము గడచెను. జయదేవునకుఁ జగన్నాథమునకుఁ బోవలయు ననికోర్కెపుట్టెను. వైశ్యుఁడు పరమభక్తాగ్రేసరుఁడగుటచే జయదేవుఁడు జగన్నాథుని విడిచి నెలయైన నుండఁగలిగెను. వైశ్యుఁడు అనేకవిధములఁ బ్రార్థించెను; గాని గురుదేవుఁడు ఇఁక నిక్కడ క్షణమైన నుండఁగాల ననియెను. వైశ్యునకుగురుదేవుని భూరిదక్షిణలతోఁ దనియింపవలయు నని గొప్ప కోరికగలదు; గానిభాగవతాగ్రేసరుఁడగు జయదేవుఁ డందులకు అంగీకరింపఁడు గదా? ఇట్లని తలంచి యావైశ్యుఁడు గురుదేవుఁడు జన్నాథ మేఁగుట కొకరథము నాయత్తము సేయించి వెంటఁ బోవునట్లు ఇరువురు నౌకరులను నియమించి, వాండ్రతో "జయదేవుఁడు ఎఱుంగకుండ దీనినిఁ గొనిపోయి వారిభార్యకు ఈయవలసినది" అని రత్నములతోడను, బంగారముతోడను నిండిన యొక పెట్టెను రథమునరహస్యముగ జాగ్రత్తచేసి యిచ్చెను.

వైశ్యుఁడు గురుదేవుని విడువలేక విడువలేక తుదకు కన్నీళ్లతోఁ గూడ విడిచెను. జయదేవుఁడు వైశ్యునిదీవించి బయలుదేఱెను. రథము పట్టణము విడిచి చాల దూరమున అరణ్యమునఁ బ్రవేశించెను. అరణ్యము చాలభయంకరమై యున్నచోటికిఁ బోయిన తరువాత వెంటఁబోయిననౌకర్లలో నొకఁడు "నా పెండ్లాము [illegible]దిమాసములు నిండు చూలాలు. మాయజమానుని యాజ్ఞను దిరస్కరించిన నా బ్రతుకుతెరువు విచ్ఛిన్నమగు నని జడిసి మిమ్ము ప్రార్థించిన సెలవీయక పోదని తలంచి వచ్చితిని. రాకరాక యిన్నాళ్లకు నాభార్యకు గర్భము

వచ్చినది. ప్రసవసమయమున దగ్గఱ నుండకున్న నా ప్రాణములు నిలువఁజాలవు. మహానుభావా, సెలవీయ వలయును" అని జయదేవునిఁ బ్రార్థించెను. వెంటనే రెండవవాఁడుగూడఁ జేతులు జోడించుకొని "చిత్తము ప్రభూ, సేవకుని బ్రతుకుకంటె ప్రపంచమున అధమాధమము మఱియొకటి యుండఁబోదు. ఇది నాశత్రువునకైన వలదుగురుఁడా! నాశరీరము నాయజమానునకు అమ్ముకొంటిని. ప్రభూ, ఇఁక నేమిచేయుదును? నాభార్య నెలదినములక్రిందటఁ బ్రసవించినది. నాల్గుదినములక్రిందట బిడ్డచనిపోయెను. రెండుదినములక్రిందట నాభార్యకు సూతికారోగమంకురించినది. నేఁడు మాట పోయినది స్మృతిపోయినది. నేను యజమానుని ఆజ్ఞను దలంచుకొని కన్నీరువిడుచుచు మంచమువద్దనుండి వచ్చుట ఆదురదృష్టమంతురాలెట్లుఁగ నేయెట్లుఁగదుస్వామీ, నాకుఁగూడ అనుజ్ఞ దయసేయరా?. నేను చాల బీదవాఁడను. చాల వయస్సు ముదురునప్పుటికిఁ గాని నాకుఁ బెండ్లి కానేలేదు. నాభార్య ఇప్పుడు నన్నువిడిచిపోనున్నది" అని యేడువసాగెను. వారిద్దఱి దుఃఖమును జూడఁజాలక జయదేవుఁడు "మీకు మంగళమగుఁగాక" అనిదీవించి యిరువురకును సెలవిచ్చి పంపివేసి రథమును దానే తోలుకొని పోసాగెను.

కొంతదూరముపోవునప్పటికి ఆనౌకరులే దుష్టుకత్తులతో నెదురువచ్చి రథము నడ్డగించి అందలి సర్వస్వమును అపహరించి ముందు పోనిచ్చినజయదేవుఁడీవృత్తాంతమునుబయలుపఱుచునని భావించి ఆతని కాలుచేతులు ఖండించి యొక పాడునూతిలోఁ బాఱవేసి తమ దారినిఁ బోయిరి. ఇట్లు జరిగెనని జయదేవుఁ డేమియు నగపడక భగవద్భజనమునఁ బ్రవృత్తుఁడు అయ్యెను. రాత్రి అయ్యెను. అయినను జయదేవుఁడు నిరాధారుఁడై, నిరాధారుని నమ్మి అందే యుండెను. నాఁడు వింధ్యదేశాధీశ్వరుఁడా యరణ్యమునకు వేఁటకువచ్చి జయదేవునకీవిపత్తు ప్రాప్తించిన పిదప ఆసమీపమునందే విడిసెను. రాత్రి భోజనానంతరము రాజు గుడారమునకుఁ బైటఁగూర్చుండి చల్లగాలి సేవించుచుండఁగా నెదుటనున్నపాడునూతినుండి గంభీరమైన తేజస్సు ఆతనికిఁ గాన్పించెను. అందులకు వింతపడుచు భటులతోఁగూడ సమీపమునకుఁ బోఁగా శ్రావ్యమగు సంగీతము వినవచ్చెను. పిదప చాలఁ బ్రయత్నములు గావించి రాజు జయదేవుని బయటకుఁ దీసి సర్వోపచారములు చేయించి మఱునాఁడు

తన నగరమునకుఁగొనిపోయి చికిత్సచేయుటకు రాజవైద్యులను,పరిచర్య సేయుటకుఁబరిచారకులను ఏఁబదిమందిని నియమించెను. వారందఱును గూడ అట్టి పరమభాగవతశిఖామణి సేవ యబ్బినందులకుఁ జాల నానందించిరి. రాజు ప్రతిదినమును వచ్చి భక్తిశ్రద్ధలతో జయదేవుని సేవించుచుండెను.

ఒకనాఁడు రాజు గురుదేవుని సేవించి "మహాత్మా, సులభ మగు మోక్షప్రాప్త్యుపాయమును సెలవీయవలయు" నని ప్రార్థించెను. "భగవంతునిఁ గీర్తించుట, కొలుచుట, భజనసేయుటలుకంటె మోక్షసాధన మేమున్నది గాని తొలుదొలుతసర్వేశ్వరునియెడల నచంచలభక్తికుదురుట కష్టము. అది లేనినాఁడు చేసిన సేవ యంతయు వ్యర్థము. భాగవతార్చనమువలన జ్ఞానవైరాగ్యము లలవడును. కావున ప్రప్రథమమున వీరు వారు అని యెన్నక వచ్చిన భాగవతుల నెల్లరను బూజింపుము. తత్కాలమున నీకు మోక్షప్రాప్తిమార్గము సులభముగ లభించును" అని గురుదేవుఁడు చెప్పెను. రాజు అట్లే చేయసాగెను. ఇది లోకమునందంతటను దేటతెల్లమయ్యెను. తోడనే అనేకభాగవతులు వచ్చి రాజువలన సత్కారములనంది పోసాగిరి. జయదేవుని పాదనూతిలోఁ బడఁద్రోసిపోయిన వైశ్యుని నౌకర్లు గూడ ధనకాంక్షచే భాగవతులవేషమును ధరించి వచ్చిరి; గాని వారు రాజుగారిమేడలో జయదేవుని జూచి గడగడ వడఁకసాగిరి. అదిచూచి జయదేవుఁడు వారిని కౌఁగిలించుకొని రాజభటులతో "వీరు మహానుభావులు. ఇంతటివా రెప్పుడును ఇచ్చటకు వచ్చి యుండలేదు. వీరినిఁ జక్కఁగా సేవింపవలయు నని రాజుతోఁ జెప్పుడు" అని నియమించెను. వారట్లే చేసిరి. రాజు గురుదేవుని సెలవుప్రకారము ఆకపటభాగవతులను జాల గొప్పఁగఁ బూజించి కొన్నిదినములు ఇచ్చట నుండవలయు నని ప్రార్థించెను. జయదేవుఁడు ఏమి అపాయము గలిగించునో అని భీతిల్లుచునే వారు రాజుమాటను ద్రోసివేయఁజాలక నిలిచి పోయిరి; గాని భయాతిరేకమువలన నిద్రాహారములు సహింపక నెలదినములు గడచు నప్పటికి వారు మిగులఁ గృశించిరి.

ఈసంగతి రాజు జయదేవునకుఁ దెలిపి వారికార్శ్యమునకుఁ గారణ మేమైయుండునని యడిగెను. రాజా, ఏమున్నది. వారు సంత

తము ప్రపంచమున సంచరించుచుండువారు, భుజించిన చోట నిద్రించుట వారి కలవాటు లేదు. అయినను నీప్రార్థనమును ద్రోసివేయఁజాలక వారిచ్చటనుండిరి. వారి కార్శ్యతకు ఇంతకంటెఁ గారణము లేదు. కావున వెంటనే వారిని సత్కరించి పంపివేయుము" అని గురుదేవుఁడు ఆనతిచ్చెను. ఆ డనే రాజు అసంఖ్యధనముతో వారిని సత్కరించి భటులను సాయమిచ్చి పంపివేసెను. నిరుపద్రవముగ నక్కడనుండి వెడలి పోఁగలిగినందులకు వారు మిగులనానందించి 'బ్రతుకు జీవుఁడా' యని భటులతో బయలుదేఱి పోయిరి.

అరణ్యమునఁబోవుచుండెఁగా రాజభటులలోనొకఁడు వంచకభాగవతులను జూచి "స్వామీ, మారాజుచెంతకు ఇంతవఱకును అనేక కోటిభాగవతులు వచ్చిరి; గాని గురుదేవులు వారినెవ్వరిని మిమ్ము సత్కరింపించినంత సత్కరింపలేదు. దీనికిఁగారణము సెలవీయవలయును" అని యడిగెను. అందులకు వారిలో నొకఁడు "ఇందులకుఁ జాలగాధయున్నది. కొంతకాలముక్రిందట అవంతి దేశాధీశ్వరునిచెంత జయదేవస్వామి ప్రధానిగను, మేము నౌకరులుగను ఉంటిమి. జయదేవుఁడేదో రాజునకు గొప్పయుపకారము తలఁచెను. అందులకుఁ గోపించి రాజు జయదేవునిఁ జంపునట్లు మాకు సెలవిచ్చెను. మేము రాజాజ్ఞననుసరించి జయదేవుని అరణ్యమునకుఁ గొనిపోయి, ప్రాణములుతీయుటకుఁ జేతులాడక పోవుటచేఁ గాలుసేతులు మాత్రము ఖండించి యొక పాడునూతిలోఁబడవేసి, ఈసంగతి రాజునకుఁ గొంతకాలమునకైనఁ దెలియకమానదనియు, నట్లయిన నప్పుడు మాకు ప్రాణములమీఁదికి వచ్చుననియుశంకించి మేమువిరక్తులమై భాగవతులమై యిట్లు కాలముఁ బుచ్చుచున్నాము. అప్పటి యుపకారమును దలంచి జయదేవుఁడు మాకిప్పుడు డిట్టి సత్కారమును జేయించెను" అని చెప్పెను. తోడనే యీయసత్యమును సహింపఁజాలకయో యనునట్లు భూమి రెండు వ్రక్కలయ్యెను. కపటభాగవతులు రథముతోఁ గూడ నాభూవివరమునఁ బడిపోయిరి. రాజభటులు ఇదిచూచి మిగుల విస్మితులై యతివేగముగ నగరమునకుఁ బోయి జరిగినదంతయు రాజునకు ఎఱింగించిరి.

రాజు స్వయముగ నీవృత్తాంతము జయదేవునకు విన్నవించెను. జయదేవుఁ డదివిని చేతులు మొగిడ్చి ఆకసముపంకఁ జూచి "కృష్ణా,

నీకు కష్టము గలిగించిన అనేకపాపాత్ములకు మోక్ష మిచ్చితివి. నీభక్తులను బాధించిన అనేకక్రూరులను రక్షించితివి. వీరిని మాత్ర మిట్లేల చేసితివి?" అని గొంతెత్తి ప్రార్థించెను. పిదప రాజు గొప్పసైన్యమును, గురుదేవుని వెంటనిడుకొని కపటభాగవతులు భూవివరమున దిగఁబడి పోయినచోటికిఁ బోయెను. జయదేవుఁడు కాన్పించిన వెంటనే కపటభాగవతులకు వైకుంఠమునుండి విమానములు వచ్చెను. వారిరువురును వానిమీఁద నధిరోహించి చేతులు జోడించి జయదేవునిఁ జూచి "మహానుభావా, ఇది యంతయు మీయాశీర్వచనఫలము. అయినను మేము మీకు చేసిన ద్రోహమును దలంచికొని యిప్పుడు సిగ్గుపడుచున్నాము. నీయనుగ్రహమువలన మాకు వైకుంఠప్రాప్తి గలిగినది. ప్రభూ, మమ్ము మఱచిపోవలదు" అని ప్రార్థించి వైకుంఠమునకుఁ బోయిరి. అంతట రాజు గురుదేవుని యౌదార్యమును అనేకవిధములఁ గొనియాడుచుఁ బురమునకు దీసికొనిపోయెను.

రాజు బలవంతము సేయఁగా జయదేవుఁడు తనపూర్వవృత్తాంతమంతయు జరిగినది జరిగినట్లు చెప్పెను. పిదప రాజు గురుదేవుని యనుజ్ఞను బడసి సపరివారముగఁ బోయి జగన్నాథమున మాతృగృహమున నున్నపద్మావతీదేవిని గొనివచ్చి భక్తుచెంతనిలిపి తానును, తనరాణియు వినయవిధేయతలు వెలయ నానావిధసంపదలను గొలుచుచుండిరి.

ఒకనాఁడు పరిచారికాపరివృతయై రాణి పద్మావతీదేవి సన్నిధిని గూరుచుండి యామెవలనఁ బుణ్యకథలను వినుచుండెను. ఇట్లుండఁగా నొక పరిచారిక వచ్చి రాణినిఁ జూచి "అమ్మా! మీసోదరుఁడు చనిపోయెను. మీవదినె సహగమనము చేసినది" అని చెప్పెను. అదివిని రాణి గోలుగోలున నేడువసాగెను. పద్మావతిమాత్రము నిశ్చలయై యుండెను అది చూచి యుండలేక రాణి "తల్లీ, నావదినె పతితోనను గమనము చేసె నను సంగతి వినియు నీవు సంతోషమును గాని, ఆశ్చర్యమును గాని, దుఃఖమును గాని పొందకయుంటివి. కారణ మేమి?" అని యడిగెను. అప్పుడు పద్మావతీదేవి "మహాపతివ్రత భర్తమరణవార్త చెవిసోకినంతనే ప్రాణములఁ బాయును. ప్రయత్నపూర్వకముగ నను గమనము చేయుటలో నేమి విశేషము ఉన్నది?" అని గంభీరముగ సమాధానము చెప్పెను. ఈమాటలు ఇంతటి దుఃఖసమయములోఁ

గూడ రాణికి ఆశ్చర్యమును గలిగించెను. "పద్మావతి మహాపతివ్రతవలె మాటాడుచున్నది. ఈమె పాతివ్రత్యమును బరీక్షించెదను" అని రాణి తలంచి యుక్తసమయమున నామె సంగతియంతయు మంత్రికి ఎఱింగించెను. మంత్రి "సమయము వచ్చినప్పుడు అంతయుఁ జక్కఁబెట్టెదనని చెప్పెను.

ఒకనాఁడు రాజు జయదేవునిఁ దీసికొని మహారణ్యమునకుఁ బోయెను. ఇదే సమయ మని తలంచి మంత్రి పద్మావతీదేవితో మాట్లాడుచున్న రాణిచెంతకు వచ్చి "తల్లీ, గురుదేవునితోఁ గూడ ప్రభువు మహారణ్యములోఁ బోవుచుండఁగా నొక బెబ్బులివచ్చి మీఁదఁ బడెను. ప్రభువు గాయపడి యెట్లో ప్రాణములు తక్కించుకొనెను; గాని గురుదేవుఁడు పెద్దపులివాతఁ బడి మరణించెను" అని చెప్పెను. రాణి యింకను దుఃఖము నభినయింపక పూర్వమే పద్మావతీదేవి భూమిపైఁబడి ప్రాణములు విడిచెను. రాణి యిదియంతయు నటన మని భావించి వైద్యులను రప్పించి పరీక్ష సేయఁగా యథార్థముగఁ బద్మావతి మరణించె నని తెలియవచ్చెను. రాణి, పద్మావతిపాతివ్రత్యమహిమకు ఆశ్చర్యపడి దాను జేసినకుట్రవలనఁ దన కెట్టి యపకీర్తియు, నెట్టిబాధలును సంభవించునోయని వగచుచుండఁగా గురుదేవునితోఁ గూడ రాజు వచ్చెను.

మంత్రి రాజునకు యథార్థమంతయుఁ దెలిపెను. రాజు అందులకుఁ జాలవగచి "నాభార్యవలన నాకుఁ దీరని యపకీర్తి వచ్చినది. నాభార్యను జంపుటకంటెను నేను బ్రతికియుండుటకంటెను నేనే అగ్గిలో నుఱికి చచ్చుటమేలు" అని తలపోసి కుమారునకు రాజ్యమును అప్పగించి చితిపేర్పించుకొని సెలవీయవలసిన దని గురుదేవుని బ్రార్థించెను. అంతకుఁ బూర్వమే పరిచారికలవలన సంగతి యంతయుఁ దెలిసికొనిన జయదేవుఁడు వడివడిగ రాజుచెంతకు వచ్చి సాహసము మానిపించి చేయి పట్టుకొని తన భార్య మృతకళేబరముచెంతకు గొనివచ్చి భక్తిపరవశుఁడై ఇరువదినాలుగు అష్టపదులను బాడినృత్యము చేసెను. తోడనే వైకుంఠనాథుఁడు అగు శ్రీహరి సాక్షాత్కరించి పద్మావతీదేవిని బ్రతికించి ఈయష్టపదులను భక్తితో నెవ్వరుగానము సేయుదురో వారి యింట నేను లక్ష్మీయుతుఁడనై వసించెద నని చెప్పిపరముల్లాసంగి యంతర్హితుఁడు అయ్యెను. పిదప రాజు రాణియుఁ గలిసి

తమ యపరాధములను మన్నింపవలసిన దని గురుదేవుని,తత్పత్నిని అనేక విధములఁ బ్రార్థించి బ్రతికియున్నంతకాలమును వారిని సేవించిరి. జయదేవుఁడు దేహావసానమున సకళత్రుఁడై ఈశ్వరసాయుజ్యమును బడసెను. జయదేవవిరచిత మగు గీతగోవిందమును ఇప్పటికిని భారతీయులు అనేకులు గానము చేసి విముక్తపాపులై తరించుచున్నారు.

ఉ. "తపముల్ సేసిననో మనోనియతినో దానవ్రతావాప్తినో
జపమంత్రంబులనో శ్రుతిస్మృతులనో సద్భక్తినో యెట్లు ల
బ్ధపదుండౌ నని బ్రహ్మరుద్రముఖరుల్ భావింతు రెవ్వాని న
వ్యపవర్గాదిస్థుఁ డాత్మమూర్తి సులభుండౌఁగాక నాకెప్పుడున్."

(భాగ. స్కం. 2 ప. 61)

23. వీసోబా

పండరిపురమున వీసోబా అను నొక గొప్ప వర్తకుఁడు నివసించియుండెను. ఆతని యింట నున్నధన మెంతయో యెవరును లెక్కింపఁజాలరు. వీసోబా ఇతరులవలనఁ దనకు రావలసిన సొమ్మును లెక్కించి పుచ్చుకొనుటకుఁ గాలము చాలక తూఁచి పుచ్చుకొనుచుండెడువాఁడు. పరులకు ఈయవలసివచ్చినపుడుగూడ నాతఁ డట్లే చేయుచుండెను. ఇంతటి ధన మున్నను ఆతఁ డెప్పుడు గర్వించి యెఱుఁగఁడు. పరులను దూలనాడియు, లేనిపోని దాంభికవేషములు వేసి విఱ్ఱవీఁగియు, ఆభాసములగు నైహికసుఖములకు ఆశించియు నెఱుఁగఁడు. అదృష్టవశమున నాతనికి అట్టి సుగుణములు గల యువతీరత్నమే భార్య యయ్యెను. ఆతనికి నలుగురు కుమారులు గలిగిరి. ఆశుద్ధసాత్వికు లగుదంపతులకు ఉద్భవించుటచే వారుగూడ నట్టివారేయైరి. ఇట్టి భార్యాపుత్రులతోఁ గూడియుండుటచే నాతనికి సంసారము ఇతరులకువలెఁ దాపత్రయకారణము గాలేదు. సుఖమును, వైభవమును అనుభవించువారిలో మేమే ఘనుల మని విఱ్ఱవీగువారు వీసోబాను ఆతని భార్యాపుత్రులను జూచి "లుబ్ధులు ధనము ఉండినను దరిద్రులే యగుచున్నారు. తానింత యను

భవించి యితరుల కింత యీయనివాని బ్రతు కేల కాల్పనా?" యని యాక్షేపించుచుండిరి. విజ్ఞానులు మాత్రము "మూఁడు దినముల పట్ట పగలు మాత్రమే నిలుచు జీవమును స్థిరమని నమ్ముకొని సకలాకృత్య ములకునొడిగట్టుచున్న ధనికులవలెఁగాక యీమహానుభావుఁడు ప్రపం చము నశ్వరమనుజ్ఞానముకలిగి ఐహికములపొంతఁబోక యున్నాఁడు. ఆహా! అంత ధన మున్నవారి కిట్టిసుగుణములు గలుగుట యెంత వింత?" అని యచ్చెరుపడసాగిరి.

ప్రతిదినమును తనయింట ననేకులు ఆహారమును దినిపోవుచుం డినఁగాని వీసోబాకుఁ జాలఁ గష్టముగా నుండెడిది. ఇట్లుండగా నొక ప్పుడు ఆ దేశమున మహాక్షామము సంభవించెను. కొలఁదిదినములయందే దేశమునందు పలుమూలలను గఱవు వ్యాపించెను. ఈవార్త వీసోబా చెవులు సోకునప్పటికిఁ దిండిలేక అనేకులు ప్రాణములు విడిచిరి. వీసోబా యదివిని చాలఁ గటకటంబడి తన కున్నధనమంతయు క్షామపీడితులకుఁ బంచిపెట్టుటకు ఉన్ముఖుఁడు అయ్యెను. దయార్ద్రహృదయము గలవా రగుటచే నాతని భార్యయుఁ గుమారులునుగూడ నందులకు అంగీకరిం చిరి తోడనే యాఱుగురును గలిసి క్షామోపహతులకు విసుగువిరా మములు లేకుండ సాహాయ్యము ప్రారంభించిరి. వీసోబా వితరణమును జూచి లోకమంతయు దుఃఖించుచుండఁగా ఇట్టిసమయములయందే సంపన్నులు కాఁజూచు వర్తకులు కొందఱు ఆతనిని మిపుల హేళన సేయసాగిరి. కొందఱు మిత్రులువచ్చి "మిత్రుఁడా, తనకుమాలినధర్మ ము లేదు. నాఁటికిఁ బదిరూపాయలకంటె నెక్కుడు దానము సేయకు ము. ధన మంతయు నైనతరువాతఁ జేతులు పిసికికొనినఁ బ్రయోజనము కలుగఁబోదు" అని చెప్పసాగిరి; గాని క్షామపీడితుల దీనాలాపముల ముందు ఆతనికి ఇవి యేవియు విన్పింపలేదు. ఉన్నధన మంతయు వెను కముందుఁ జూడక ఆతఁడు శరణార్థులకుఁ బంచియిచ్చెను. నెలదిన ములు గడచునప్పటికి ఆతనియింటఁ బర్వతములవలెఁ బడియున్న ధన రాసు లన్నియు నైపోయెను; గాని ముప్పాలుమువ్వీసము క్షామబాధ కొలఁగిపోయెను. ఆతఁడును, ఆతని దారపుత్రులును దమధనము ఇట్టి సమయమున వినియోగపడినందులకును,వ్యయము సఫలమైనందులకును మిపుల నానందించిరి.

వీసోబా మున్ను కాశీయాత్ర పోయినపుడు చేతనున్న ధన మంతయు వెచ్చించి అది చాలకపోవుటచేఁ గాశీ వాసియగు నొకతురుష్కునివద్ద గొంత సొమ్ము అప్పు తెచ్చెను. అది తెచ్చిన కొలఁదిదినములకే యీభయంకరక్షామము సంభవించుటచే అది తీర్పఁదలంచుచుండఁగనే ఉన్న ధన మంతయు నైపోయెను. ఈసంగతి తెలిసికొని వచ్చి తురుష్కుఁడు నిలిచియున్నట్లుగాఁ దన ధనము వడ్డితోఁ గూడ జెల్లింపవలసిన దని పట్టుపట్టెను. వీసోబా యందుల కేమియుఁ గోపింపక తన స్థితియంతయుఁ జెప్పి "మిత్రుఁడా, నీవు సందేహపడవలసిన పని లేదు. నీసొమ్ము ఎచ్చటికిని బోవునది గాదు; గాని ప్రస్తుత మిట్టి స్థితి సంభవించుటవలన నేఁడుమాత్రము చెల్లింపఁజాలను. నేఁటికి ఎనిమిదవనాఁడు నీసొమ్ము అణాపైసలతో నీయింటికిఁ బంపివేసెదను. నన్ను విశ్వసింపుము" అనిచెప్పెను.

తురుష్కుఁడు "మిత్రుఁడా, నీయెడల నాకు విశ్వాసము లేకపోలేదు. నీవు నాస్వల్పధనమును హరించెద వని నాకు భయము లేదు. ఈభయంకరసమయమున నీవు మహమ్మదీయులని, భారతీయులని భేదమును బరిగణింపక ఆపన్నుల కెల్లరకును సహాయము చేయుటవలననే నీయౌదార్యము వ్యక్తమైనది. గాని యిప్పుడే చెల్లింపలేనివాఁడవు ఇఁక కొన్ని దినములలో నీవు నాసొమ్ము నెట్లు చెల్లింతువు? అప్పటికి నీవు ఇంకకంటెను దరిద్రుఁడ వయ్యెదవు. అయినను నీవన్ననాఁటికి సొమ్ము ఇచ్చుటకు సందేహము లేదని ఇచ్చటిగొప్పవర్తకులచే ననిపింతువేని నేను వెడలిపోయెద" నని చెప్పెను. వీసోబా ప్రార్థింపఁగా వర్తకు లందఱును అందులకు సందేహము లేదని చెప్పిరి. తురుష్కుఁడు వెడలిపోయెను.

ఒకప్పు డొక సిద్ధపురుషునకు వీసోబాభక్తిప్రపత్తు లెట్టివో పరీక్షసేయవలయు నని బుద్ధిపుట్టెను. అగుట నాతఁడు ధూళిధూసరితమై మిగుల జినిగిపోయిన మసిపాతగట్టుకొని, ఒడలినిండ బురద పూసికొని చేత నొక కుండపెంకు దాల్చి "ఆఁకలి దహించివేయుచున్నది. ఇచ్చట నన్నముపెట్టు మహాత్ము లెవరైనఁ గలరా?" యని యడిగెను. లోపలఁ గూర్చుండియున్న వీసోబా యిది విని తలుపులున వీథిలోనికి వచ్చి "మహాత్మా, దయచేయుము. ఈదాసుఁడు నిన్ను సేవించుటకు సిద్ధముగా నున్నాఁడు" అని యాతనిని లోనికిఁ గొనిపోయి స్నానము

చేయించి వస్త్రము లుదికి యారవేసి ఉన్నంత యన్నము పెట్టి వీలయి నంతవఱకు సకలోపచారములను గావించి "స్వామీ, లోకములో నన్నము పెట్టి యాదరించువారు అనేకులు ఉన్నారు. నాపూర్వపుణ్యవశమునఁ గాకున్న నాయింటికి ఎందులకు వత్తురు? మీవంటివారిని లోనికిఁ దీసికొనివచ్చి నేను పెట్టఁగలిగిన దేమున్నది? ఆదరవచనములు పలుకుట యైనఁ జేతఁగాదు. నావలన నైన యపరాధములను మఱువవలయును" అని ప్రార్థించెను. సిద్ధపురుషుఁడు అట్టి స్థితిలోకూడ వీసోబా యిచ్చిన యాతిథ్యమునకును, చూపిన భక్తికిని, చేసిన యాదరమునకును,ఎంతో యానందించి జ్ఞానము నుపదేశించి వెడలిపోయెను.

ఇంతలో వీసోబా తురుష్కునకు సొమ్ము చెల్లించెద నన్నగడువు ముగియవచ్చెను. దానిని గుఱించి యాతఁడు ఇది యెట్లు ఈశ్వరా యని కొంచెము విచారపడసాగెను. ఇట్లుండఁగాఁ బండరినాథుఁడు భక్తుని దుఃఖమును జూచి సహింపఁజాలక వీసోబా పరిచారకుని రూపమునుబడసి రొక్కపుసంచులతోఁ గాశీనగరమునందలి తురుష్కుని మందిరము ముందు సాక్షాత్కరించెను. భటులు పోయి వీసోబా నౌకరు సొమ్ము తెచ్చె నని చెప్పఁగా విని తురుష్కుఁడు పరమాశ్చర్యచకితుఁడై "హా, నేను ఎంత త్వరపడితిని? ఇట్టి స్థితిలోఁగూడ నన్నమాట తప్పని వీసోబాకు నేను ఎంత అలజడి గలిగించితిని." అని వగచి భటునిలోనికిఁ గొనిపోయి లెక్కలపుస్తకము తీసి సరిగఁ జూచి తనకు రావలసిన సొమ్ము పుచ్చుకొని "నాకు రావలసిన యీపత్రము బాపతు సొమ్ము అంతయు నీపరిచారకుని ద్వారా ముట్టినది" అని పత్రము మీఁదఁ జెల్లువ్రాసి చేవ్రాలు చేసి భటున కిచ్చి వేసెను. పరిచారక రూపియగు పండరినాథుఁడు ఆపత్రమును బ్రతిదినము వీసోబా పారాయణముసేయు గీతాభాష్యమున నునిచి తిరోహితుఁ డయ్యెను.

మఱునాఁడు ఉదయము వీసోబా గీతాపారాయణము సేయుటకుఁ బుస్తకము దీసి అందలి పత్రమును జూచి ఆశ్చర్యపడి "ఔరా, ఇది భగవంతుని పనిగాని, వేఱు గాదు దీనవత్సలుఁ డగు శ్రీపండరినాథుఁడే నాపరిచారకునిరూపమునఁ బోయి యింతపని చేసి నామానము నిలిపె" నని భావించి "దీనబంధూ. ఈమూఢునిమీఁద నీకెంత దయ యున్నది! నాకొఱకు నీవు ఎంత నీచుని రూపము వహించితివి.

రామ కృష్ణాద్యవతారములను ధరించిన నీకు ఇది తగునా! అయ్యో, నేనెంత పాపకర్ముఁడనైతి? నిజముగ నీవు నాపరిచారకుఁడవని భావించి యాముష్కరతురుష్కుఁ డెంత నీచముగఁ జూచెనో, శ్రీహరీ, వాని సొమ్ము చెల్లించుటకు నీవే పోవలయునా! మఱియొక మార్గము లేదా!" అని యనేకవిధముల దుఃఖించెను.

అప్పుడు పండరినాథుఁడు సాక్షాత్కరించి "వత్సా, చింతిల్లకుము. దాసానుదాసుఁడ నగు నాకు దాసుల యిక్కట్టులు తొలంగించుటయే వృత్తి" అని చెప్పి సంసారభయముఁ బాపి అంతర్హితుఁ డయ్యెను. ఈవృత్తాంతము పండరిపురమునందలి యెల్లరును విని అత్యాశ్చర్యచకితులై విసోబా ననేకవిధములఁ గొనియాడిరి. విసోబా యంతమున నీశ్వరసాయుజ్యమును బడసెను.

మ. క్రతుదానోగ్రతపస్సమాధిజపసత్కర్మాగ్నిహోత్రాగ్ని
వ్రతచర్యాదుల నాదరింప నఖిలవ్యాపారపారాయణ
స్థితి నొప్పారెడి నీపదాబ్జయుగళీసాంఘ్రిప్రభాభాసము
ర్వ్రతిఘస్మం బగు వానిఁ గాంగి నసురారీ చపవమాగామునీ

(భాగ. స్కం. ౦. 3 ప. 301.)

24. భానుదాసుఁడు.

పైఠణపురమున నొకబ్రాహ్మణునకు లేక లేక ఒకకుమారుఁడు గలిగెను. తలిదండ్రులు భానుని కృపవలనఁ గలిగిన యాకుమారునకు భానుదాసుఁడు అని నామకరణము చేసి మిగుల గారాబముతోఁ బెంచుకొనసాగిరి. భానుదాసుఁడును వరప్రసాదమువలనఁ బుట్టినవాఁడగుట చేనట్టి బాల్యమునఁగూడ జ్ఞానముగలిగి తననిమిత్తము ప్రాణములను ధారవోయుటకుఁగూడ సిద్ధముగ నున్న తల్లిదండ్రుల ప్రేమను గుర్తెఱిఁగి వారి చిత్తానుసారము మెలఁగుచు వారికి ఆనందము నొడఁగూర్చుచుండెను. యుక్తసమయమునఁ దల్లిదండ్రులు కుమారునకుఁ గాలము ఉపనయనము

మున్న గువానిని నెఱవేర్చి విద్యాభ్యాసమునిమిత్తము గురువుచెంత విడిచిరి. భానుదాసుఁడు సకలవిషయములయందును దలిదండ్రుల యాజ్ఞాప్రకారము నడుచుకొనుచుండెను; గాని విద్యావిషయమున మాత్రము వ్యతిరేకించెను. వారు బడికిఁబొమ్మనిన నీతఁడు ఆటలకుఁ బోవును. చేతఁ బుస్తకములు గొనుమనిన గాలిపటము గొనును. ఇట్లే అనేకవిధముల నాతఁడు వారికిఁ గష్టము గలిగింపసాగెను.

ఈ దుందుడుకుఁ దనమును సహింపలేక ఒకనాఁడు భానుదాసునిఁదండ్రి చాలఁ దీక్ష్ణముగ శిక్షించెను.అందులకు సహింపఁజాలక యాతఁడుఎవరికినిఁ దెలియకుండ అరణ్యమునకుఁ బాఱిపోయెను. అచ్చట నాతని కొకపర్వతము కాన్పించెను. సంతోషముతో నాతఁడుఆపర్వతము నెక్కి అంతటను దిరిగి చివర కొక గుహఁ జేరుకొనెను. పరిశీలించి చూడఁగా నాతనికి సూర్యనారాయణమూర్తి విగ్రహ మొకటి యటఁ గాన్పించెను. వెంటనే భక్తిప్రపత్తులతో నాతఁ డావిగ్రహమునకు సాష్టాంగ నమస్కారము లాచరించి సూర్యదేవుని అనేకవిధములఁ గొనియాడెను. అప్పుడు సూర్యభగవానుఁడు ఆవుపాలతోడి యొక గిన్నె నొకచేతఁ గొని వృద్ధబ్రాహ్మణరూపముతోఁ బ్రత్యక్షమయి "వత్సా, ఈపాలు త్రాగుము. దీనివలన నీకు క్షుత్పిపాసలు ఉండవు. సకలవిద్యలును గరతలామలకము లగును" అని యిచ్చి భానుదాసుఁడు క్షీరములు పానముచేసిన తరువాత మఱల "మఱియు నీవు అందఱవలె ఆభాసము లగు సాంసారికసుఖములకై ఆశపడక శ్రీహరిని సేవింపుము. శ్రీహరిభక్తు లగుధ్రువప్రహ్లాదాదులు ఇహమునఁ బరమాద్భుతప్రభావసంపన్నులై అంతమున శ్రీహరిసాయుజ్యమును బడసిరి. వత్సా, లోకములో మానవునకు ఇంతకంటెఁ గావలసినది ఏమున్నది? గాని మూఢజనులు ఇది తెలియనేరక అపదార్థమున పదార్థభ్రాంతిని, అనాత్మయందాత్మభ్రమను బడసి, ఈశ్వరమయం బగు ప్రపంచము ఐహికసుఖాకరముమని భావించి మోక్షశబ్దమునేని వినిన పాపమునఁ బోవక అజ్ఞానదగ్ధులై నరకకూపమునఁ గూలుచున్నారు.మనోవాక్కాయకర్మలతో శ్రీహరి నాశ్రయించినవానికి ఇడుములు సంభవింపనేరవు. నీవు పూర్వజన్మమునఁ జేసిన పుణ్యమునకు మెచ్చి భగవంతుఁడు నీకు ఈనరజన్మము నిచ్చెను. భగవద్దత్తమైన యీజన్మమును కుమార్గములయందుఁ గడపితి

వేని, ఇఁక కోటిజన్మములెత్తియు నీవు మానవజన్మమును సాధింపఁ జాలవు. ఇహలోకమునందలి మానవుల ఆయుర్దాయము అతిస్వల్పము. ఆస్వల్పకాలమునందే దుష్కృత్యములు చేసినయెడల శాశ్వతముగ బాధపడవలసివచ్చును. ఇహమున మానవులు చేయునది అతిస్వల్పము గాని, పరమున అనుభవింపవలసినది అనంతము. బాలకా, అజ్ఞానము లేక ఎందఱు చెడిపోవుచున్నారు! ఇంద్రియములను జయింపలేక వ్యసనముల పాలఁబడి మోక్షమార్గము కల్ల యని వాదించి యెందఱు భ్రష్టు లగుచున్నారు! జ్ఞానోపదేశకు లగు ఆచార్యులు లభింపక ఎందఱు పాడయిపోవుచున్నారు. నీదేహము, పరమేశ్వరునిచే నొసంగఁబడినది; గావున కన్నుల నాతనిని సందర్శించుటయందును, వాక్కును ఆతనిని నుతించుటయందును, హృదయము నాతనిని మననముసేయుటయందును, బుద్ధి నాతనినిఁ దెలిసికొనుటయందును, చేతులు నాతనినిఁ బూజించుటయందును, వీనుల నాతని దివ్యగాథలను వినుటయందును, పాదముల నాతని ఆలయమునకుఁ బోవుటయందును, ఇట్లే నీసకలావయవములను, శ్రీహరిసేవయందు వినియోగింపుము." అనిచెప్పి మాయమయ్యెను. ఇచట నిట్లుండఁగా నచట పైఠణపురమున భానుదాసునిఁ దలిదండ్రులు ఏడుదినములు ఆతనిని వెదకి వేసారి తుదకు నిరాశచేసికొని గోలుగోలున నేడ్వఁజొచ్చిరి. అప్పుడొక వృద్ధబ్రాహ్మణుఁడు వారినిఁ జూచి, మీరేల దుఃఖించెదరు? మీకుమారుని నేను అరణ్యమధ్యమునందలి ఫలానా పర్వతముమీఁదఁ జూచితిని. నాతో నింటికిరమ్మని అనేకవిధములఁ జెప్పితిని; గాని ఆతఁడు నామాటను దిరస్కరించెను. చేయునది లేక నాత్రోవను నేను వచ్చితిని" అనిచెప్పెను. ఇది వినఁగనే వారికి మఱలఁ జైతన్యము వచ్చెను. తోడనే యాదంపతులు వృద్ధబ్రాహ్మణనిర్దిష్ట మగు పర్వతముమీఁదికిఁ బోయి అంతటను గలయవెదకిరి; గాని యెందును వారికిఁ గుమారుఁడు కాన్పింపలేదు. తుదకు వారొక గుహను సమీపించిరి. వృద్ధబ్రాహ్మణుఁడు కాన్పించిన తెరువాత భానుదాసుఁడు మఱియొకచోటికిఁ బోయియుండు నని వారు భావించిరి; గాని యాస్వల్పస్థలమునుమాత్రము పరిశీలింపక విడువనేల యని గుహసొచ్చిరి. అందు నలుమూలలు వెదకిచూడఁగా నిఁక జెప్పవలసినది ఏమున్నది? భానుదాసుఁడు శ్రీసూర్యనారాయణమూర్తి విగ్రహపు

బాహ్యములపైఁ దన శరీరము నానుకొని నిద్రించుచుండెను.తోడనే యా దంపతులు గుభాలున నచ్చటికిఁ బోయి యిరువురు నొక్కమాఱుగ “మాతండ్రీ, బ్రతికియుంటివా!” యని కౌఁగిలించుకొని ముద్దాడఁ దొడఁగిరి.

భానుదాసునకు మెలఁకువ వచ్చెను ; గాని తలిదండ్రుల దృఢాలింగనములఁ జిక్కియుండుటచే నాతనికిఁ బరుండుటకుఁగాని, కూర్చుండుటకుఁగాని, లేచుటకుఁగాని వీలు చిక్కదయ్యెను. ఇట్లు కొంతతడవు జరిగిపోయిన తరువాత నావృద్ధదంపతులు “చిట్టితండ్రీ! మమ్ము దిక్కులేని వారినిగాఁ జేసి నీవిట్లు వచ్చుట ధర్మమా ? ఏడుదినములనుండి మేము నిద్రాహారము లెఱుఁగము. మాహృదయములు నీమీఁదనే హత్తియుండుటచే నున్మత్తులమై చరించితిమి. తండ్రీ, మమ్మింత కష్టపెట్టెదవా? నీవు ఈకఠినశిలాతలములయందు ఇంత శ్రమపడెదవా?” యని దుఃఖించిరి. భానుదాసుఁడు వారిదుఃఖము నుడిపి అక్కడ జరిగినది యంతయుఁ జెప్పెను.ఆదంపతులు భగవంతుని కనేకవందనములు సమర్పించికుమారుని ఇంటికిఁ గొనిపోయి సుఖముండిరి.

మఱికొన్ని దినములు కడచునప్పటికి భానుదాసునకు నిండు జవ్వనము వచ్చెను. తలిదండ్రు లది కనిపెట్టి పదాఱేండ్ల సుందరినిఁ దీసికొనివచ్చి యాతనికిఁ బెండ్లిచేసిరి. కొన్నిదినములకు భానుదాసునకు సంతానము కలిగెను. ఆబిడ్డలు పెరుగుచుండఁగా నాతని తలిదండ్రు లొక్కమాఱుగఁ బరమపదించిరి. వా రున్నంతకాలమును సాంసారిక విషయములను వారే చక్కఁబెట్టుకొనుచుండిరి. ఇపుడు భానుదాసుఁడు హరిభజనమగ్నచిత్తుఁడై సాంసారికసంబంధమును వదలుకొనియెను. అగుటచే నాతని యాలుబిడ్డలు తినుటకుఁ దిండిలేక నానాబాధల ననుభవింపసాగిరి. భానుదాసుఁడు ఇదియేమియుఁ గనిపెట్టఁడయ్యెను.

ఇదియంతయుఁ జూచి ఆయూరియంగడి వర్తకులు కొందఱు భానుదాసునిఁ జేరి “ఇది నీకుఁ దగదు.నీదారపుత్రులు తినుటకులేక మాడి పోవుచున్నారు. నీతలిదండ్రులు ఉన్నప్పుడు నీకనవసరము లేకపోయినది; గాని యిప్పు డట్లు సాగదు. నీయింట నీభార్యాపుత్రులు అన్నమో రామచంద్రా యని యేడ్చుచుండఁగా నీవు భజనచేసిన పుణ్యము ఏమైనఁ దక్కు ననుకొంటివా ? ఈవెఱ్ఱిచేష్టలు ఇఁకఁ గొంచెము తగ్గించి సంసా

రము చక్కఁబెట్టుకొనుము. మేము నీకు నాలుగువందలవరాలు అప్పుగా నిచ్చెదము. ఆధనముతో నీవు బట్టలవ్యాపారమును జేసికొనుము. నీకుఁ గూడివచ్చినపుడు మాసొమ్ము మాకు ఇచ్చివేయుము. నీవు మాకు వడ్డి మాత్రము ఈయనక్కఱలేదు" అని చెప్పి బజారులో నొక మంచి కొట్టు అద్దెకు కుదిర్చియిచ్చి బట్టలుగూడఁ గొనియిచ్చి వ్యాపారరహస్యములు అన్నియుఁ దెలిపిరి.

భానుదాసుఁడు బట్టలవర్తకము ప్రారంభించెను. హరిదాసుఁడు వ్యాపారము ప్రారంభించెనట యని వింతగాఁ జెప్పుకొనుచుఁ దొలుతఁ గొందఱు చూచుటకు వచ్చిరి. భానుదాసుఁడు వారు అడిగిన వస్త్రములను జూచి "ఇది నాకు ఇంతవెలకు వచ్చినది. లాభ మెంత యిచ్చెదరో మీచిత్తము" అని చెప్పఁదొడఁగెను. ఆతఁడు యథార్థమును జెప్పుటచేఁ గొనువారికి వస్త్రములు తక్కువ వెలకు రాసాగెను. అగుట నందఱు నీతని యంగడికే మళ్లిరి. ఈకారణముచే భానుదాసుఁడు రెండుమూఁడుమాసములయందే అప్పు తీర్చివేసి సుఖముగాఁ గాలము గడుపఁజొచ్చెను. మఱియు నాతఁడు తన యంగడికి వచ్చువారందఱికి నిట్లు ఉపదేశింపసాగెను.

"మహాశయులారా, మీరందఱును నాయంగడికివచ్చియిచ్చుటనే మీకుఁ గావలసిన వస్త్రములను గొనిపోవుచుండుటచే మిమ్ము నానందించుచున్నాను. ఇఁక ముందుగూడ మీరిట్లే రావలయు నని ప్రార్థించుచున్నాను. మఱి యిప్పుడు నావిశేషప్రార్థన మేమన? మీరు విశేషముగ సంపన్నులై యున్నారు. నాయంగడియందు మీవర్గాకుఁదగిన గొప్పవెల గలవస్త్రములు అనేకములు గలవు. వానివలన నేను లాభమును బడయుచున్నాను. అయినను యథార్థము చెప్పక తీఱదుగదా? మానవశరీరము మలమూత్రపురీష బంధురము. పైన నెంతశుభ్రపఱిచినను లోపల శుభ్రపఱుచుటకు సాధ్యముకాదుగదా? అట్టిచో అత్తిపండువంటియీ శరీరమును ఆచ్ఛాదించుకొనుటకు వెలగల జలతారువస్త్రములు నేలయుపయోగించెదరు? మీరు ఒక్క జలతారువస్త్రమునకుఁ బెట్టు వెలతో సామాన్యవస్త్రములు పది కొనవచ్చును. దాంభికవేషముల పొంతఁ బోకున్న నెంతధనము కూడివచ్చునో యోచింపుఁడు. మానవు లందఱును మనసోదరులు. వారిలో ననేకులు తినుటకు తిండియు, కట్టుటకు

గుడ్డయు లేక అల్లాడుచున్నారు. మీరు సామాన్యవస్త్రములను గొని మిగిలిన సొమ్ముతో వారినిఁ బోషింపరాదా ! మీరొక్క సంవత్సరము కట్టి పాఱవేయు జరతారువస్త్రముల వెల పెట్టినచో ఇరువది బీద కుటుంబములు హాయిగా కాలము గడుపఁగలవు. మీరు ఒక్కొక్కరు అంత సొమ్ము వ్యర్థముగ నాశనముచేయుచున్నారు. అనేకులు నిలువ నీడలేక పరిభ్రమించునపుడు మీరు పెద్దపెద్ద వేషములు వేసికొని తిరిగిన భగవంతుఁడు అంగీకరించునా?" అని యిట్లనేకవిధముల మందలించుచున్నను, ఇతరుల అంగడులలో కంటె సరసమైన వెలలకు గొప్పవస్త్రములు వచ్చుచుండుటచే నందఱును భానుదాసుని అంగడికే రాసాగిరి. అకారణముగ భానుదాసుని వచ్చుబడి హెచ్చుటయే గాక తక్కిన వర్తకులకుఁ జాల నష్టము రాసాగెను. అగుటచే వారందఱును "మనము నిలువఁబెట్టిన భానుదాసుఁడు మనకు మన కూటిలో దుమ్ముఁ జల్లుచున్నాఁడు" అని ఆతనిపై నసూయ వహించి సమయము నిరీక్షించుచుండిరి.

ఇట్లుండఁగా భానుదాసుని అంగడియందలి సామాను అంతయు నైపోయెను. అదిచూచి భానుదాసుఁడు ఇతరవర్తకులతోఁ గలిసి సమీపమునందలి నగరమునకుఁ బోయి కావలసిన వస్త్రములను గొని మూటలు గుఱ్ఱములపై నెక్కించుకొని బయలుదేఱి మార్గమధ్యమున సాయంకాల మగుటచే నొక చిట్టడివిలో నున్న పాడుదేవాలయము చెంత బసచేసెను. అచ్చట నాతనికి సమీపగ్రామమునందు ఒక గొప్ప హరిదాసుఁడు హరిభజనము చేయుచున్నాఁడని తెలియవచ్చెను. ఇఁక క్షణమైన నచ్చట నిలువలేక ఆతఁడు తన సామానును జాగ్రత్తగాఁ జూచుచుండవలసినదని తోడివర్తకులను బతిమాలుకొని తాను బయలుదేఱిపోయెను. ఎన్నియోదినములనుండి యిట్టి సమయమును నిరీక్షించుచున్న ఆవర్తకులందఱును గలిసి భానుదాసుని సామానుమూటలను సమీపమునందలి యొక పాడునూతిలోఁ బడవేసి గుఱ్ఱములను అరణ్యమధ్యమునకుఁ దోలివేసి ఏమియు నెఱుఁగనివారివలె నిద్రఁబోయిరి. మఱికొంతసేపటికి చాలమంది దొంగలు వచ్చి ఆవర్తకుల నందఱను జావమోది వారిచెంత నున్న వస్తువుల నన్నిఁటిని దోఁచుకొనిరి. అందులకు ఆవర్తకులు అందఱును లబో లబో అని మొత్తుకొని

"అయ్యో! మనము భానుదాసునిఁ జెఱుపవలయు నని తలంచితిమి. మనమే చెడితిమి. ఆతనివస్తువులను మనము నాశనము జేయఁబోయి చేతులార భద్రపఱిచితిమి" అని దుఃఖింపసాగిరి.

ఇంతలోఁ దెల్లవాఱెను. హరిభజనము ముగించుకొని భానుదాసుఁడు వర్తకు లున్న చోటికి బయలుదేఱి వచ్చుచుండఁగా దారిలో తన గుఱ్ఱములు యొక్కచో చేరి మేయుచుండుట గనవచ్చెను. అందులకుఁ గారణము తెలియక అబ్బురపడుచు నాతఁడు వానిని దోలుకొని పాడుగుడివద్దకు రాఁగా వర్తకు లందఱును దాము చేసిన అకృత్యమును, దమకు సంభవించిన విపత్తును ఆతనితోఁ జెప్పుకొని గోలుగోలున నేడువసాగిరి. అంత భానుదాసుఁడు "అసూయ యనునది యొక గాఢాగ్ని. అగ్ని యేకట్టె నాశ్రయించియుండునో ఆకట్టెయే బుగ్గియైపోవును. అట్లే యెవఁడు అసూయాగ్నిని వహించి యుండునో వాఁడే భస్మీపటల మగును. మీరు అట్టివారగుటచే అట్టి గతియే పట్టినది. ఇఁక వగచినఁ బ్రయోజనమేమి? ఇఁకనైన బుద్ధిగలిగి యుండుఁడు" అని మందలించి వారి సాహాయ్యమునఁ బాడునూతిలో నున్న తన బట్టల మూటలను వెలికిఁ దీసి ఉచితముగ నందఱికిని సరిగఁ బంచియిచ్చి స్వస్థలము చేరుకొనియెను.

పిదప భానుదాసుఁడు పండరినాథుని యనుగ్రహమువలన ననేక పర్యాయములు మహాప్రభావమును వెల్లడించి అనేకులకు జ్ఞానోపదేశముచేసి రక్షించెను. అతని భార్యాపుత్రులుగూడ జ్ఞానవంతులైరి. బిడ్డలు పెద్దలైనపిదప నాతఁడు వర్తకభార మంతయు వారిమీఁద నుంచి తాను హరిభజనమునఁ గాలముగడుపసాగెను. సంసారచింత తొలఁగిపోవుటవలన నాతనియానందము మఱింత వృద్ధియయ్యెను. తుదకును నాతఁడు బ్రతికియున్నంతకాలమును హరిభజనమునఁ గడపి అంతమున హరిసాయుజ్యమును బడసెను.

సీ. "అనఘాత్మ మఱి నీపదపతారగుణకర్మ, ధ్యానవిపంబనహేతుకంబు లయిన
రమణీయ మగు దాశరథివసుదేవసు, మారాదిదివ్యనామంబులోలి
వెలయంగ మనుజులు విపశాత్ముల్లై యవ, సానకాలంబున సంస్మరించి
జన్మజన్మాంతరసంచితదురితంబుఁ, బాసి కైవల్యసంప్రాప్తు లగుదు

గీ. రట్టిదివ్యావతారంబు నవతరించు, నజుఁడ వగు నీకు మ్రొక్కెద ననఘచరిత
చిరశుభాకార నిత్యలక్ష్మీవిహార, భక్తమందార ఇద్ధభవభయవిదూర"

(భాగ. స్కం. 3. ప.304)

---

25. రామరాజు.

తుంగభద్రానదీతీరమున మాధవవిద్యారణ్యుని ప్రోత్సాహకారణమున హరిహరరాయనిచేనిర్మింపఁబడి మహాప్రఖ్యాతివహించినవిద్యానగరము అను రెండవపేరు గల విజయనగరమున శ్రీకృష్ణదేవరాయసార్వభౌముని అల్లుఁడగు అళియరామరాజు ప్రజాపాలనము సేయుచుండెను. ఆతని రాజ్యపాలనానైపుణ్యమును, సంగ్రామకౌశలమును జరిత్రములయందు విశదముగ వర్ణింపఁబడినవి. ఆతనికి దుర్గాదేవియెడలఁ బరమభక్తి గలదు. అగుట నాతఁడు ప్రపంచమున నెందును ఈడులేని యొక గొప్ప ఆలయమును గట్టించి యందు దుర్గామహాదేవినిఁ బ్రతిష్ఠసేసి, దేవికి నవరత్నఖచితము లగు సకలాభరణములను సమకూర్చి మహావైభవముతో నుత్సవములు సేయించుచుఁ బూజించుచుండెను. ఒకప్పు డాతని చెంతకుఁ బండరిపురమునుండి యొక బ్రాహ్మణుఁడు వచ్చి "రాజా! నేను ఒక యాగము సేయుటకు సంకల్పించుకొంటిని. అందులకు వలయు ద్రవ్య మంతయు నీవలనఁ గోరి వచ్చితిని" అని చెప్పెను. రాజు ఇచ్చెద నని యంగీకరించెను.

రాజు సాయంత్ర మైనపిదపఁ గొలువు చాలించి దుర్గామహాదేవిని సేవించుటకు ఆలయమునకుఁ బోయెను. పండరిపురబ్రాహ్మణుఁడు గూడ వెంటఁబోయెను. అనర్ఘరత్నాభరణములతోడను, జీనిచీనాంబరములతోడను అలంకరింపఁబడిన గంభీర మగు దేవివిగ్రహమును జూచియు, అనుపమాన మగు ఆలయవైభవమును జూచియు, అచ్చటజరుగుచున్న అద్వితీయసేవావైభవమును జూచియుఁ బండరిపురబ్రాహ్మణుఁడు నిర్విణ్ణుఁడయ్యెను. రాజు మహాభక్తితో దేవుని సేవించుట యైనపిదప పండరిపురబ్రాహ్మణునిఁ జూచి "బ్రాహ్మణుఁడా, దుర్గామహాదేవి త్రిలోకజనని. ఆమెకుఁ బోలిన దైవము మఱి లేదు. భక్తులపాలి చింతామణి

యగునీయమ్మకు నామీఁద నమితపుత్రవాత్సల్యముచూడుము. మాతల్లి యెంతవైభవము ననుభవించుచున్నదో! మీపండరినాథునకు ఇట్టి యాలయము, ఇట్టియాభరణములు, ఇట్టి వైభవము, ఇట్టిప్రభావమును గలవా?". యని యడిగెను.

ఈప్రశ్నవలన బ్రాహ్మణునకుఁ జాలఁ గష్టము తోఁచెను. వెంటనే యాతఁడు "మహారాజా, నీవు పండరిపురమును ఎప్పుడును జూచియుండనట్లుతోఁచుచున్నది. చూచిన నిట్లు పలుకుటకు సాహసించియుండవు. ఆహా అచ్చటి వైభవమునకును సామ్యమా? అది సానలుదీరిన జాతిరత్నము ఇది కేవలము గాజుతునక. నీవు అత్యంతభక్తిశ్రద్ధలతో నారాధించు దుర్గామహాదేవి మాపండరినాథుని గోపురభూభాగములను సమ్మార్జనముసేయు పరిచారికయైయున్నది. అచ్చటి వైభవములు చూచి తెలియవలయునే గాని నాబోంట్లు వర్ణింప నైతగాదు" అని నిర్భయముగఁ బలికి యూరకుండెను.

బ్రాహ్మణుఁడు ఇట్లు పలికినందులకు రాజునకుఁ జాలఁ గోపము వచ్చెను. ఆతఁడు పండ్లు పటపటఁ గొఱుకుచు "బ్రాహ్మణుఁడా, నీవుచెప్పినది అంతయు నచ్చటఁ జూపవేని నిన్ను ఘోరముగ శిక్షింతును" అని కఠినముగఁ జెప్పెను. బ్రాహ్మణుఁడు "వచ్చితివేని చూపుటకును, లేకున్న శిక్షింపఁబడుటకును సిద్ధముగానున్నా" నని చెప్పెను. రాజు బ్రాహ్మణునితో బయలుదేఱెను; గాని బ్రాహ్మణునకుఁ జైతన్యము లేదు. ఏమన; రాజు మాటలకు సహింపఁజాలక ఆతఁడు పండరిపురమున లేనివిషయములను గూడఁ జెప్పెను. వానినిఁ జూపుటయెట్లు! పుణ్యమునకుఁ బోఁగాఁ బాపమెదురైనట్లు యాగమునకు వలయుధనము యాచింపఁబోగాఁ బ్రాణములమీఁదికి వచ్చెను. ఇట్లు చింతించి యాబ్రాహ్మణుఁడు పండరినాథుని హృదయమున నిలిపి "ప్రభూ, నిన్ను రాజు చులకన చేయుటకు సహింపఁజాలక నీవైభవమును నోటికి వచ్చినట్లువర్ణించితిని. రాజు నావర్ణనమును పరీక్షింపఁగోరి వచ్చుచున్నాఁడు. నామాటలను కుక్షింభరి నగు నేను ఎట్లు నిలుపుకొనఁగలను? మాటలు నిలుపుకొనఁజాలకున్న తల నిలువదు. నాకు ఇపుడు వెనుకకుఁబోయిన నూయి, ముందునకు వచ్చిన గోయిగానున్నది ఏమి చేయఁగలను? అంతయు నీదే భారము. నాతల ఎగుఱఁగొట్టించినను, నీవైభవమును పెంపుచేసిచూపినను నీవే కర్తవు.

నిన్నే నమ్మితిని" అని యనేకవిధములఁ బ్రార్థించెను; గాని పండరిపురము చేరునప్పటికి ఆతనిభయము ఆకసమంటఁ బెరిగిపోయెను. చేతితోఁ దాఁకి పిలిచినఁగాని పలుకఁజాలని స్థితికిఁగూడ నాతఁడు పాల్పడెను.

భక్తవరదుఁడు అగు పాండురంగఁడు రామరాజు వచ్చునప్పటికి బ్రాహ్మణుఁడు కోరినదానికంటె శతాధికముగ వైభవమును గల్పించెను. అదిచూచి అచ్చటివారందఱును ఆశ్చర్యపడసాగిరి. రాజు బ్రాహ్మణునితో నాలయమునుసమీపించెను. మార్గమధ్యమున గోపురప్రాంతమున గొప్పగొప్పదేవతాస్త్రీలతోఁ గలిసి దుర్గామహాదేవిసమ్మార్జనము సేయుచుండెను. రామరాజు అదిచూచి తెల్లవోయి తనకులదైవమగు దేవికిఁ బ్రణమిల్లెను. అంత దేవి రాజును ఆశీర్వదించి "వత్సా, నీపూర్వపుణ్యవశమున నీవు ఇచ్చటకు రాఁగలిగితివి. శ్రీపాండురంగని మహిమ అవాఙ్మానసగోచరము. బ్రహ్మ, మహేశ్వరుఁడు, మహేంద్రుఁడుమున్నగువారికిఁ గూడ నది యవాఙ్మానసగోచరమైయున్నది. అట్టిపాండురంగని సేవ యబ్బుట సులభము గాదు. లోనికిఁ బోయి ఆదేవుని సేవించి తరింపుము" అని నియమించెను. రాజు ఆమె యాజ్ఞను బడసి లోనికిఁ బోయెను.

ఆహా! పాండురంగని వైభవము వర్ణింప నెవరి తరము! రాజు బ్రాహ్మణుఁడు చెప్పినదానికంటె సహస్రాధికమైయున్న పండరినాథుని వైభవమును చూచి అత్యాశ్చర్యచకితుఁడై మహానందపరవశుఁడై క్షణకాలము దిగ్భ్రాంతుఁడై పిదప వినయవిధేయతలును, భక్తిశ్రద్ధలును వెలయ పాండురంగనికి మ్రొక్కి "దేవదేవా, కూపస్థమండూకమువలె నేనింతవఱకును విజయనగరమునందే యుండి యేమియుఁ దెలియక నేనే సకలమును దెలిసినవాఁడ నని గర్వించి యుంటిని. ఇపుడీ బ్రాహ్మణుని యనుగ్రహమున నీదర్శనలాభమును బడసితిని. నాపాపము లన్నియు భస్మీపటలము లైపోయినవి. నాలోచనములు సఫలములు అయినవి. సర్వేశ్వరా, జగన్నాథా, నీలీలల నెఱుంగ నెవరికి సాధ్యము! ప్రహ్లాద నారదపరాశరాదులగు అంతరంగభక్తులకుఁ గూడ నీవు అగోచరుఁడవై యుంటివి; అనఁగా నిఁక నావంటి క్షుద్రులవిషయము చెప్పనేల? పుండరీకవరదా, నీవు భక్తులపాలిటి చింతామణివి. భక్తుల మాటలలో నిలుచు కరుణాశీలుఁడవు. ప్రభూ, నిన్ను విడిచి నేను మనఁ

జాలను. కావున నాపట్టణమునకు దయచేసి నన్ను అనుగ్రహింప వేఁడె దను" అని ప్రార్థించెను. ఈప్రార్థనమును అంగీకరించి పండరినాథుఁడు "వత్సా! నీవు కోరినట్లు నీపురమునకు వచ్చి వసించెదను. ఈరాత్రియే నన్ను గొనిపొమ్ము; గాని నీవు ఎప్పుడైన ఏదైన అకృత్యమును చేసెద వేని వెంటనే నేను పండరిపురమును జేరికొందును" అని చెప్పెను. రామరాజు అందులకు బ్రహ్మానందభరితుఁడై ఆరాత్రియే పాండురంగ విభుని విజయనగరమునకుఁ దెచ్చెను.

తెల్లవాఱినపిదప అర్చకులు గుడితలుపు తెఱచి అందు స్వామి లేకుండుటఁ జూచి భయభ్రాంతులై యాసంగతి పురమునఁ బ్రకటపఱచిరి. తోడనే యెల్లర మీఁదిప్రాణములు మీఁదనే యెగిరిపోయినట్ల య్యెను. పాండురంగఁడు లేని పండరిపురమున నిఁక నేమున్నది! అంతట ఆపురమునందలి స్త్రీపురుషులు ఆబాలగోపాలముగ నిద్రాహారములు మాని పాండురంగనిఁ దలఁచికొని "ఈశ్వరా! మాపై నీ కేల ననుగ్ర హము తప్పిపోయెను? మేము చేసిన యపరాధ మేమి? ఎన్నఁడునురాని రామరాజు నేఁడువచ్చి ప్రార్థించినంతమాత్రమున విజయనగరమునకుఁ బోవుట యేటిన్యాయ్యము? అయ్యో! ఇన్నిదినములనుండియు నున్న యీ పండరిపురము నీకు విషమైపోయినదా? ఈచోటు నెప్పుడును విడిచిపోనని నీవు పుండరీకునకు మాట యిచ్చితివి. అది నేఁడేల తప్ప వలయును?" అని యనేకవిధముల విలపింపసాగిరి. అందఱు నిట్లు విలపించుచుండఁగా అంతరంగభక్తులు కొందఱు చేరి మరలఁ బాండు రంగనిఁ బండరిపురమునకుఁ జేర్చుట యెట్లు అని ఆలోచింపసాగిరి. అపు డు భానుదాసుఁడు ముందునకు వచ్చి "నేను విజయనగరమునకుఁ బోయి పాండురంగనిఁ గొనివచ్చెదను. లేకున్న అచ్చట స్వామి పాద ములపై నాశిరమును బ్రద్దలు కొట్టుకొని మేను బాసెదను" అని శప థము చేసెను. "భానుదాసుఁడు పాండురంగనాథునిఁ దెచ్చుటకు సమర్థుఁడు. అతఁడుపోయిన మనకార్యము సఫల మగును" అని అంద ఱు నందులకు అంగీకరించిరి. వెంటనే భానుదాసుఁడు విజయనగరము నకుఁ బోయెను.

భానుదాసుఁడు ఆపురమున నొకబ్రాహ్మణునియింట వసించి రాజ గృహమునందు పాండురంగఁడు ఉండు స్థలమును, అచ్చటివిశేషము

లను ఆగృహయజమానునివలనఁ దెలిసికొని భిక్షుకవేషమును గైకొని మధ్యాహ్నసమయమున 'భవతీ భిక్షాం దేహి' యని భిక్ష మడుగుచుఁ బోయి రాజగృహమున దాఁగుకొనియెను. అర్ధరాత్రి యగునంతదనుక నాతఁడు అట్లేయుండి అప్పుడు పాండురంగఁడు వసించియున్న మందిరమును సమీపింపఁగా తలుపులు తమంతట వీడిపోయెను. లోపల నంతటను వ్యాపించియున్నదీపపువెలుఁగునఁ దళతళ మెఱయుపాండురంగఁడు భానుదాసునకుఁ గాన్పించెను. తోడనే యాతఁడు హఠాత్తుగఁ బోయి పండరినాథుని కౌఁగిలించుకొని కన్నుల నీరు గ్రుక్కుచు మాటలు తడఁబడ "శ్రీహరీ, పన్నగశాయీ, భక్తమందారా, మమ్ము ఇట్లు అగాధ విచారసాగరమునఁ గూలఁ ద్రోసి వచ్చి నీవిచ్చట నేమివైభవము ననుభవించుచున్నావు ? మేము నీయెడల నేమి యపరాధము చేసితిమి ? 'అతిపరిచయాదవజ్ఞా' యనునట్లు మావలన నిఁక ముందు తిరస్కారము గలుగు ననితలంచి వచ్చితివో. నీవు పుండరీకున కిచ్చిన వాగ్దానమును ఇట్లు ఉల్లంఘింపవచ్చునా? అయ్యో! పండరిపురమునందలి స్త్రీపురుషులు ఆబాలగోపాలముగ నీనిమిత్తము గోలుగోలున నేడ్చుచున్నారు. ధ్యానగమ్యుఁడ వగునీకు అదియేమియుఁ దెలియుటలేదా! మామీఁద నీకు నేఁడు ఇన్నేల ఆగ్రహము గలుగవలెను? రామరాజు నేఁటివఱకును దుర్గనుగొల్చి నేఁడామెను విడిచి నిన్ను చేపట్టినాఁడు. ఆతనితోడి సంపర్కమువలన నీకుఁగూడ నట్టిగుణమే గలిగినదా?" అని పరిపరివిధముల వగవసాగెను.

అదిచూచి పాండురంగఁడు మందహాసము గావించి "వత్సా, ఇంతమాత్రమున కింత గోలయేల! నేను భక్తప్రీతుఁడ నని యెఱుఁగవా? నీకుఁగూడ నింత పామరత్వమా? నాకు నీవు ఎటువంటి భక్తుఁడవో రామరాజు నటువంటి భక్తుఁడు. నన్ను రామరాజు రమ్మనిన నిక్కడకు వచ్చితిని. నేఁడు నీవు పండరిపురమునకు రమ్మనుచుంటివి; గావున అట్లే వచ్చెదను. ఎట్లయినను నేను భక్తుల ఆజ్ఞప్రకారము మెలఁగవలసినవాఁడనే కాని స్వతంత్రుఁడఁ గాను" అని చెప్పి భానుదాసుని ఓదార్చి రామరాజు తనకు సమర్పించిన అనర్ఘరత్నహారమును ఆతనిమెడలోఁ గీలించి నీబసకుఁ బొమ్ము అని పంపివేసెను.

మఱునాఁడు ప్రాతఃకాలమున రాజు కాల్యకరణీయములను దీర్చు

కొని స్నానసంధ్యాద్యనుష్ఠానములను గూడ నెఱవేర్చుకొని పాండు రంగని సేవింప వచ్చెను. అర్చకులు తలుపులు తీయఁగా గర్భాలయ మేమో చిన్నవోయినట్లుండెను. కొంతతడవునకు వారు యథార్థమును దెలిసికొని హారము పోయినందులకు రాజు తమ్మేమి శిక్షించునో యని గడగడవడఁకిపోవుచుండిరి. ఇంతలో రాజువచ్చెను. రాజు వినీతవేషుఁడై యున్నను అర్చకులకు మాత్ర మాతఁడు ఉగ్రదండధారి యగు యముని వలెఁ గాన్పించెను. అంతట వారు ఏమైనను సరియే యని సాహసించి "తలుపులు తెఱచి చూచునప్పటికి స్వామి కంఠమునందలి రత్నహా రము లేదు" అని విన్నవించిరి. అదివిని రాజు ఉలికిపడి ఎవరుతీసినదియుఁ దెలిసికొనుట కేమియు నాధారము లేకపోవుట చూచి మిగుల వగచి రక్షకభటులపైఁ జాలఁ గోపించి "మీప్రాలుమాలికవలన నిది సంభవిం చినది. కావున మీరు ఎట్లయిన నాహారమును దొంగిలించిన చోరుని వెదకిపట్టుకొని తీసికొని రాకపోతిరేని క్రూరముగ శిక్షింతు"నని గర్జించి పలికెను. అంతట వాండ్రు గజగజ వడఁకుచు నుఱికొందఱు భటులను దోడు సేసికొని చోరుని వెదకుటకు నలుమూలలకుఁ బోయిరి.

అప్పటి కప్పుడే భానుదాసుఁడు తుంగభద్రలో స్నానము చేయు చుండెను. గతరాత్రి పాండురంగఁడు తన మెడలో వేసిన హారము నట్లె యుంచుకొని యాతఁడు స్నానముచేయుచుండెను. భటులు అది చూచి ఈతఁడే దొంగయని పట్టి తిట్టి కొట్టి రాజసభకుఁ దీసికొనిపోయి రాజు విచారణ సేయకయే "భగవద్ద్రవ్యమును హరించిన యీపాపా శూలమునఁ గ్రుచ్చి చంపుఁడు" అని సెలవిచ్చెను. భటులు దాసుని లము చెంతకుఁ గొనిపోయిరి.

అప్పు డాతఁడు నిర్విచారముతో "భటులారా, రాజు నాకు శూలారోపణశిక్ష విధించె ననియు, మీరు ఆయాజ్ఞ నెఱవేర్ప నన్ను ఇటకుఁ గొనివచ్చితిరనియు నాకు విచారము లేదు. నేను మరణమునకు ఎంతమాత్రమును వగచుట లేదు. నన్ను శూలముపైఁ గ్రుచ్చుటకు ముందు ఒకసారి పాండురంగని దర్శనమునకుఁ గొనిపొండు. నాకు అంతియే చాలును" అని చెప్పెను. భటు లట్లే చేసిరి. భానుదాసుఁడు పాండురంగనిఁ జూచి "ప్రభూ, నేను వచ్చినపని వేఱు. నీవు విధించిన పని వేఱు. ఇంత మోసగాఁడ వని యెఱుఁగనైతినిగదా? నీవిశ్లేషమును

సహింపఁజాలక దర్శనమునకు రాఁగా రత్నహారము మెడలోవేసి బుజ్జగించి పంపితివి. తెల్లవాఱునప్పటికి రాజు హృదయమునఁ బ్రవేశించి నాకు మరణదండనము విధించితివి. హా! ఎంత యుక్తి పన్నితివి! ఇట్లు పండరిపురమునకు నిన్ను గొనిపోవుటకు ఇచ్చుటకు వచ్చిన వారిని ఇట్లు చేసినచో నీకు ఏమియు బాధ యుండదని భావించితివి కాఁబోలు. అయ్యో! భక్తలోకము ఎంత మోసపోయెను. సర్వేశ్వరా! నీవు మమ్ము వంచింపఁజాలవు. నేనిపుడానందముతోఁ బ్రాణములు విడిచెదను. ఇట్లే నిన్ను పండరిపురమునకుఁ గొనిపోవు ప్రయత్నమునఁ బ్రాణములు విడుచుటకు అచ్చటి భక్తగణము అంతయు నిశ్చయించుకొనియున్నది. లక్ష్మీపతీ, అనేకరాక్షసులను సంహరించితివి. అజయ్యులగు ననేకశత్రువులను జయించితివి; గాని మమ్ము జయింపఁజాలవు" అని పలుకుచుండఁగా భటులు ఆతని నచ్చటనుండి శూలమువద్దకుఁ గొనిపోయిరి.

అయినను ఆతఁడు తన ప్రార్థనము మానలేదు. రాజభటులు ఆతని శరీరమును గదపఁజాలిరి; గాని యాతని మనోగతిని మార్పఁజాలరైరి. "కృష్ణా, నీవు ఆపన్నార్తిహరుఁడ వని పేరువడసి యిట్టిపని చేయుచున్నావు. చేయుము. మానవలదు. నీచిత్తమువచ్చినట్లు చేయుము. నిన్ను అడ్డుపెట్టఁగలవాఁడు లేఁడు. అంతకును నీవే నియంతవు నీవే కర్తవు. యోచించుకొనుము. భోక్తవుకూడ నీవే యగుచున్నావు. నీవు విసరిన కత్తి నీమెడకే తగులుచున్నది. మానకుము. విసరుము. నీఖడ్గ మెంత మృదువైనది" అని భానుదాసుఁడు ఉపన్యసించుచుండఁగాఁ గ్రూరులను శిక్షించుటకు ఏర్పఱుపఁబడిన యాకరాళశూలము పూవులతోడను, బూలమాలికలతోడను నిండిన చక్కని వృక్షమై యుండెను. అది చూచి ప్రజలందఱు నబ్బురంపడిరి. రాజభటులు తెల్లవోయి వెంటనే యీవృత్తాంతము రాజున కెఱిఁగించిరి. తోడనే రాజు తాను శిక్ష విధించిన యాతఁడు మహాభాగవతోత్తముఁ డనియు, తెలియని భాగవతాపచారము చేసి తాను నరకకూపమునఁ బడిపోవుట తటస్థించె ననియు వగచుచు క్షణములో నచ్చటకు వచ్చి భానుదాసుని పాదముల మీఁద వ్రాలి "మహాత్మా, నివురుగప్పిన నిప్పువోలె నుండుటచే నీమహిమ తెలియ నేరకపోయితిని. కష్టా, ఎంత క్రూరకర్ముఁడ నైతిని! మహాభాగవతోత్తముని ఒక నీచమానవునిగా భావించి శిక్షవిధించితినిగదా! భక్తాగ్రేసరా,

నావలన నపరాధమైనది. అయినను భాగవతులు క్రోధగుణవర్జితులు గావున నీకు నేను జడియుటలేదు. మఱియేమన: భాగవతులను గంటికి రెప్పలవోలెఁ గాపాడు శ్రీహరి నిన్నిట్లు క్రూరశిక్షకుఁ బాల్పఱిచినందులకు నన్ను మన్నింపఁడు. కావున నేను భీతిల్లుచుంటిని. మహానుభావా! నాయెడలఁ గనికరముపూని, నాయపచారమును మఱచిపోయి లక్ష్మీపతికి నాయెడలఁ గోపము గలుగక యుండునట్లు అనుగ్రహింపవలయు" నని పరిపరివిధములఁ బ్రార్థించెను. జరిగినదంతయుఁ జూచి భానుదాసుఁడు ఆశ్చర్యచకితుఁ డగుచుండఁగా నాతనిని రాజు పండరినాథుని సమక్షమునకుఁ గొనిపోయెను.

తోడనే పాండురంగఁడు ప్రత్యక్షమయి భానుదాసునిఁ జూచి "వత్సా,నీభక్తివలన నేను జయింపఁబడితిని.నన్ను రథమెక్కించి పాండురంగక్షేత్రమునకుఁ గొనిపొమ్ము"అనియాజ్ఞాపించెను.అంత రాజు స్వామి పాదములపైఁ బ్రాలి, "జగదీశా, నీకిది తగునా! నాపురమునయుందు నని మాటయిచ్చి వచ్చి యిట్లు చేయుచున్నాఁడ వేల? నీవే మాటతప్పిన నిఁక సత్యవాక్యపరిపాలనము సేయువా రెవరు?" అని ప్రార్థింప పండరినాథుఁడు "నీవు అక్రమము చేసెద వేని ఇచ్చట నిలువ నని నాఁడే చెప్పితిని. నీవు భానుదాసుని యెడలఁ దీఱని యపచారము చేసితివి. కావున వెడలిపోయెదను" అని చెప్పెను. అందులకు, రాజు మిగుల వగచుచు "అయ్యో, ఇట్టిది యుండునా? ఇట్టివాఁడవు నాలుత నాప్రార్థనము నేల యంగీకరింపవలయును? ఇందు నాతప్పేమి యున్నది? పరికినిఁ దెలియకుండ నీమెడలోని రత్నాలహారము నీవే భానుదాసునికంఠమునఁ గీలించితివి. పిదప నాచే నాతనికి శిక్షవిధింపించితివి. పన్నాగమంతయు నీవు పన్ని, పని యంతయు నీవు చేసి అనుభవింపరాని ఫలమును మాత్రము నాకు అంటఁ గట్టుచున్నావు. అయ్యో, ఇదియేటి ధర్మము?" అని యెన్నివిధముల నిష్ఠురము లాడుచున్నను చెవినిఁ బెట్టక సూక్ష్మరూపియై భానుదాసుని పూజాపేటికలోఁ జేరి పండరిపురమునకుఁ బ్రయాణమయ్యెను.

భానుదాసుఁడు పద్మాలయ మను గ్రామమువద్ద పూజాపేటిక పరిశుద్ధస్థలమున నుంచి నదిలో స్నానముచేసి అనుష్ఠానము చేసికొని తీరమునకు వచ్చి చూచునప్పటికి పండరినాథుఁడు పేటిక మూఁత కిరీటము

గను, అడుగుభాగము పాదరక్షలుగను నిజరూపముతో నిలిచియుండెను. అదిచూచి దాసు "దేవా, నిన్ను నేను ఇప్పుడు ఎట్లుకొనిపోదును?" అని యడుగఁగా స్వామి పండరిపురమునకుఁ బోయి భక్తుల నెల్లరను గొనిరమ్మని చెప్పెను. భానుదాసుఁడు పోయి వృత్తాంతమంతయుఁ జెప్పఁగాఁ బురమునందలివా రెల్లరును గదలివచ్చి స్వామిని రథముపైఁ గొనిపోయి యథాస్థలమునఁ బ్రతిష్ఠ సేసిరి. స్వామిని మఱలఁ గొనివచ్చినందులకు భానుదాసుని నెల్లరును మిగులఁ గొనియాడిరి. పాండురంగక్షేత్రమున కార్తికమాసమున జరుగు రథోత్సవము సందర్భమున నీకథ యంతయు నిప్పటికిని ఆచరణమునకుఁ దేఁబడుచున్నది. పాండురంగఁడు రామరాజును విడిచివచ్చినను ఆతనియంతమున ఆత్మసాయుజ్యము నొసఁగి గౌరవించెను.

మ. "అణువో కాక కడున్ మహావిభుఁడో యచ్ఛిన్నుఁడో భిన్నుఁడో
గుణియో నిర్గుణుఁడో యటంచు వివాదుల్ గుంఠీకృత తత్త్వమా
ర్గణులై యేవిభుపాదపద్మభజనోత్కర్షంబులన్ దత్త్వవి
క్షణమున్ జేసెద నట్టివిష్ణుఁ బరమున్ సర్వాత్ము సేవించెదన్"

(భాగ. స్కం. 2. ప. 66.)

---

26. ఓ హా రు సా హు కా రు.

ఒక గ్రామమున ఓహారుసాహుకారు అను నొక గొప్పవర్తకుఁడు నివసించియుండెను. ఆతఁడు వర్తకము సేయుచున్నను, అబద్ధమును, అన్యాయమును దరికిఁ జేరనీయక ధర్మశీలుఁడై పండితులను, భగవద్భక్తులను మిగులఁ బూజించుచు వారిచే భగవల్లీలల నాలకించి యానందపరవశుఁడగుచు బీదలకును ఆగంతుకులకును భాగవతులకును సర్వకాలసర్వావస్థలయందును అఖండాన్నదానము సేయుచు జ్ఞానియు, విరాగియు నై యుండెను. పుణ్యవశమున నాతనికి అనురూప యగు భార్య లభించెను. ఆమెకు భర్త మాట కెదురాడక సకలవిషయములయందును జేదోడువాదోడుగా నుండి భాగవతారాధనమును గుఱించి భర్తకుఁ జాలఁ బ్రోత్సాహము గలిగించుచుండెను.

ఒకనాఁడు సాహుకారు అంగడిలోనికిఁ గావలసినవస్తువులు తెచ్చుకొనుటకు సమీపగ్రామమున జరుగుచుండు సంతకు బోయెను. నాఁడు భగవంతుఁడు సాహుకారు భార్య చిత్తశుద్ధినిఁ బరిశోధింపఁ దలఁచి వృద్ధబ్రాహ్మణరూపమును ధరించి వచ్చి "అమ్మా, నాకు మిక్కుటముగ నాఁకలి యగుచున్నది. భోజనము పెట్టెదవా?" యని యడిగెను. అందులకు సాహుకారు భార్య చాల సంతసించి "మహాత్మా! దయచేయుఁడు. నిర్హేతుకజాయమానకటాక్షము పెంపునఁ దమరు నేఁడు మాయింటికి దయచేసితిరి. మాగృహము, మావంశము, మాపూర్వులు పావనులైనారు, స్వామీ, లోపలికిదయచేయుఁడు" అని ప్రత్యుత్థానము చేసి అర్ఘ్యపాద్యములు ఇచ్చి పూజించి మృష్టాన్నముతో సంతృప్తిపఱిచెను. భోజనసమయమునఁగూడ గృహమేధి రాకుండుటచే బ్రాహ్మణుఁడు కారణము నామెవలనఁ దెలిసికొని పుణ్యాత్ముఁ డగు నీయింటి యజమానునిఁ జూచు నదృష్టము లేకపోయినది" అనియెను. అందుల కామె "స్వామీ, అట్లేల సెల విచ్చెదరు? నానాథుఁడు రాత్రికి వచ్చును. మీవంటి మహానుభావులనుజూచిన నాపతి మహానందమునుగాంచును. మీపాదరజోలేశము శిరమున ధరించి నేను పావనురాలనైతిని. అట్టి భాగ్యము నాభర్తకుఁగూడఁ గలిగింపరా? ఒకదినమునైనమాయింట నుండరాదా?" యని దీనతతోఁ బ్రార్థించెనుగాని బ్రాహ్మణుఁడువినలేదు.

ఆతఁడు "తల్లీ, నీవు ప్రార్థించినట్లు నీయింట మఱియొకపూట యుండుటకు నాకు ఎట్టియభ్యంతరమును లేదు; గాని అంతరపనులు ఉన్నవి. ఉండుటకుఁ దీఱదు. పోవలెను. ఒక్కపూటలోననే నీసౌజన్యమును, భక్తిశ్రద్ధలును, వినయవిధేయతలును వెల్లడియైనవి. తల్లీ, ఆదరము ముఖ్యముగాని పెట్టుపోఁతలు గావు నీవు పెట్టిన భోజనము నిలువదు. నీవు లక్షరూపాయలిచ్చినను అవి నిలువవు. ఆదరముమాత్రమే శాశ్వతముగ నిలుచును. నేను చిన్నతనమునుండియు ననేక స్థలములలో భుజించితిని; గాని యింత యాదరము నెఱుఁగను. పతివ్రతాశిరోమణీ! నిన్ను బెండ్లియాడుటవలన నీభర్త ధన్యుఁడైనాఁడు. నీసౌజన్యమును జూచిన నాకుఁ బరమానంద మగుచున్నది. సాధ్వీమతల్లీ, సంపదలు శాశ్వతములుగావు. తనువులు సుస్థిరములు గావు. సంసారము సారమైనది గాదు. ఐహికసుఖములు ఆభాసములు. పుట్టినపుడుమనమేమియు వెంటఁ

దీసికొనిరాలేదు. అట్లే పోవునపుడు కొనిపోము. మానవులెంత సంపద నార్జించినను వెంటరాదు. చుట్టాలు, మిత్రులు అందఱును శ్మశానము వఱకు మాత్రమే వచ్చెదరు. చేసికొనిన పుణ్యపాపములు మాత్రమే వెంట వచ్చుననిన అట్టి యీయస్థిరజీవితముకొఱకు నానాయాతనల ననుభవించుట యేమి వివేకము? అంతకును మనస్సే కారణము. బుద్ధి దానినిఁ ద్రిప్పుచుండును. గావునఁ దొలుత బుద్ధినిఁ దన్మూలమున మనస్సును బరిశుద్ధము చేసికొనవలయును. విషయసుఖములపొంతఁబోయిన ప్రాణికి ఇఁక గతి లేదు. అధఃపతనమే యాజీవికి సిద్ధించునది. మలమూత్రపురీషబంధురమగు యీదేహముపై నభిమానము వహించి యుక్తాయుక్తపరిజ్ఞానము లేక, పుణ్యపాపవిచక్షణత లేక చరించువారు కుంభీపాకనరకమునఁ గూలఁబడియెదరు. నారాయణునిఁ బూజింపుము. భాగవతుల నర్చింపుము. భాగవతులు సదాసంచారము సేయుచుందురు. వారు అన్నముకొఱకు రారు. సంసారులను దరింపఁజేయుటకై వారు భగవత్ప్రేరితులై వచ్చుచుందురు. వారిని సేవించితివేని నారాయణుని యనుగ్రహము సులభముగఁ బడయఁగలవు. వారు నాస్తికుల యింటికిఁ బోరు. గురునిందకులను జూడఁబోరు. ఒక్కొక్కప్పుడు వారు తమ్మెవరాదరింతురో వారిభక్తిశ్రద్ధలను గనుఁగొనుటకుఁ గఠినముగఁ బరీక్షింతురు. అందులకు జంకకుము అనుమానపడకుము. భాగవతులకు అనుగ్రహము గలుగుట క్షణము. వారికి అపచారములు సేయువారికి అధోగతి గలుగుటయు క్షణమే. బీదలను శక్తికొలఁదిగఁ బోషించువారిని నారాయణుఁడు రక్షించును. తల్లీ, నేను నీయింటనున్న కుండలన్నిటినిఁ దాఁక చూచినాను. వానిని నీవు ఇప్పుడు తెఱచిచూడకుము. భాగవతారాధనము ఎప్పుడు సాగదో, బీదలకు, అన్నార్తులకు అన్నము పెట్టుట యెప్పుడు సాగదో అప్పుడు వానినిఁ జూడుము. మీయిడుములన్నియుఁదీఱును.” అని పలికి ఆమెవలన వినతులనువడసి వెడలిపోయెను.

సాయంత్ర మగునప్పటికి ఓహారుసాహుకారు సంతచేసికొని యింటికి వచ్చెను. భార్య భర్తకు జరిగినదంతయుఁ జెప్పెను. అప్పుడు సాహుకారు చాల నానందించి “నేను ఇంటలేని లోపము లేకుండఁ జేసితివి. నామర్యాద నిలిపితివి. నిజముగఁ గుటుంబభారమును గుర్తెఱింగి నడచుకొను రమణీమణి లభించుట చాలఁ గష్టము. నాపూర్వ

పుణ్యవశమున నీవు భార్యగా లభించితివి. ఒక భాగవతాగ్రేసరుని యనుగ్రహమును సంపాదించియుంచిన నీచాతుర్యము నేమని కొనియాడఁగలను?" అని భార్యను జాల నాదరించి పలికెను.

కొన్నిదినములు కడచిపోఁగా నాకస్మికముగా సాహుకారు ఇంటికి అనేకభాగవతులు వచ్చిరి. "ఇందఱుభాగవతులకు అన్నదానము సేయుటకు మనకు శక్తిలేదు. వెడలిపొండు అని చెప్పుటకు నోరాడదు. ఇప్పుడు ఏమి చేయవచ్చును?" అని సాహుకారు వగవసాగెను. అప్పుడాతనిభార్య "మీరిట్లేల వగచెదరు? నాఁడు మీరు సంతకుఁ బోయియున్నపుడు వచ్చిన భాగవతాగ్రేసరుఁడు భాగవతారాధనము దుర్ఘటముగాఁదోఁచినపుడు మీయింటనున్న కుండలలో నొకదానినిఁ దెఱచి చూచుకొమ్మని చెప్పియుండెను అదేమో నేఁడు చూతము" అని చెప్పెను. దంపతులిద్దఱునుబోయి యొక కుండ తెఱచి చూడఁగా దాని నిండ మొహరీలు ఉండెను. అందులకు వారిరువురును బరమాశ్చర్యచకితులై వలసినన్ని మొహరీలు తీసికొని బజారునకుఁ బోయి సకలసామగ్రినిఁ గొనివచ్చి భాగవతులకుఁ దృప్తిగా భోజనమిడి, సదక్షిణాకముగాఁ దాంబూలముల నిచ్చి దీవనలనంది పంపివేసిరి. పిదప సాహుకారు భార్యనుజూచి "నీవు చెప్పిన మాటలవలన ఆభాగవతోత్తముని నేను సామాన్యముగఁ దలంచితిని; గాని ఆమహానుభావుఁడు భగవంతుఁడు సుమా. నీసుగుణములకు మెచ్చి నీవుచేయు భాగవతారాధనము అవిచ్ఛిన్నముగ జరుగుటకై వృద్ధబ్రాహ్మణరూపమున వచ్చి అక్షయధనము నొసంగిపోయెను. ఆహా, నీవెంత పుణ్యవతివి! భగవంతుని నెంత సులభముగ దర్శించితివి. రమణీమణీ! నీసాహచర్యమువలన నేను ధన్యుఁడనైతిని" అని భార్యనుగొనియాడి "కృష్ణా! దేవకీనందనా, యశోదానందవర్ధనా, భక్తలోకమందారా, నేను లేనపుడు వచ్చి నాభార్యకు దర్శనమిచ్చి సదుపదేశము చేసి అక్షయవరము నిచ్చిపోయితివి. నాకేల సాక్షాత్కరింపనైతివి? నేనేమి పాపము చేసికొంటిని! నాభార్యతోడి సాహచర్యమువలన నాపాపము లన్నియు భస్మీపటలమై పోయియుండఁగా నన్నేల తిరస్కరించితివి? నీవింత పక్షపాతము నెప్పటినుండి నేర్చుకొంటివి? నేను నిన్నేమియు నిందించి యెఱుఁగను. నీపాదారవిందస్మరణ మఱచి యెఱుఁగను. నీగుణకీర్తనమును మానిన పాపమునకుఁ బోయి

యెఱుఁగను. అట్టి నాకు ఈశిక్ష యేల విధించితివి? నిరపరాధి నగు నాకు ఈయనుతాపము నేల ఘటించితివి?" అని యనేకవిధముల భగవంతుని దలంచి దుఃఖింపఁదొడఁగెను. తోడనే భగవంతుఁడు శంఖచక్రాద్యాయుధహస్తుఁడై నిజరూపముతో సాక్షాత్కరించి సాహుకారు పరిచర్యలను బడసి దీవించి వెడలిపోయెను. భగవంతుఁడు సాక్షాత్కరించినందులకు ఆదంపతులు మహానందసాగరనిమగ్నులై కొంతవఱకును నిశ్చేష్టులై యుండిరి.

మఱియొకనాఁడు కొందఱు భాగవతులు వచ్చిరి. సాహుకారును ఆతని భార్యయు వినయముతో వారికి అర్ఘ్యపాద్యాదిషోడశోపచారములను జేసి పూజించిరి. అందులకు భాగవతులు మిక్కుటముగ హర్షించి "ఓపుణ్యదంపతులారా, మీభక్తిశ్రద్ధలకు ఆనందించితిమి. లక్ష్మీనారాయణులవలెఁ బ్రకాశించు మీయింట నాతిథ్యమును బడయుటచే మేము ధన్యులమైతిమి. మీరును సర్వమును దెలిసినవారు. అయినను మేము వెడలిపోవుటకు ముందు ఒక్కసంగతినిఁ దెలుపఁ దలఁచియున్నాము. మీపూర్వపుణ్యమువలనఁ దమంతనే మీకు జ్ఞానవైరాగ్యము లలవడినవి. అయినను ఆచార్యోపదేశమును మీరు పొందవలసియున్నది. శంఖములో బోసినఁగాని తీర్థము కానట్లు సదాచార్యుని వలన నుపదేశమును బడయనివారికి భక్తిజ్ఞానవైరాగ్యములు సిద్ధింపవు" అని చెప్పిరి. అప్పుడు సాహుకారును ఆతని సతిరత్నమును వచ్చిన భాగవతులలో నుత్తముఁడగు నాతనిని ఆచార్యునిగా వరించిరి. ఆభాగవతోత్తముఁడు ఆదంపతులకుఁ దారకమంత్రము నుపదేశించి, "భగవంతుఁడు సర్వసముఁడు. పిపీలికాది బ్రహ్మపర్యంతము గల సకలప్రాణులును ఆతనికి సమానము. ఈరహస్యము నెఱుంగక భేదభావమును జూపువారు సర్వేశ్వరుని యాగ్రహమునకు బాత్రులయ్యెదరు. భగవంతుని యనుగ్రహము దక్క భాగవతులకు మఱియొకటి కోరఁదగినది లేదు. ఫలనిర్దేశము చేసికొని భగవదారాధనముసేయువారు కేవల మవివేకులు. సర్వలోకశరణ్యుఁ డగు శ్రీకృష్ణుని నిష్కామకర్మతో నారాధించువారికి లభింపనిది ఏమిగలదు? భగవంతుని పాదపద్మములను హృదయకమలములయందు నెలకొల్పుకొనుఁడు. భాగవతుల శ్రీపాదపద్మముల నారాధింపుఁడు. రమాకాంతుని యనుగ్రహమువలన మీకు ధనాభావము

లేదు. గావున అన్నార్తులై వచ్చినవారికి సదా అన్నదానము చేయుఁడు. భూతతృప్తినిఁ గలిగించుటలో నన్నదానమును మించినది మఱి లేదు" అని యుపదేశించి వెడలిపోయెను.

ఆచార్యోపదేశానుసారముగ నాదంపతులు భాగవతారాధనమును భగవదారాధనమును జేయుచు గాలము గడుపుచుండిరి. ఇట్లుండఁగా వారికి భగవంతుఁడు సాక్షాత్కరించి "మీసేవవలన నాకానందమైనది. మీరు నాయంతరంగభక్తులైతిరి" అని చెప్పి అంతర్హితుఁడయ్యెను. బ్రతికియున్నంతకాలమును ఆదంపతులు ఇట్లే భగవద్భాగవతారాధనము సేసి అవసానమున నీశ్వరసాయుజ్యమును బడసిరి.

ఉ. "ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందు పరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వము దానయైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్."

(భాగ. స్కంధ 8. ప. 73.)

---

27. త్రిపురదాసుఁడు.

మధురాపురమును భాగవతారాధనపరుఁ డగు నొక రాజు పరిపాలించుచుండెను. ఆతనికిఁ ద్రిపురదాసుఁడు అను నొక మంత్రి గలఁడు. ఆతఁడు సంసారమునం దున్నను దామరాకులోని నీటిబొట్టువలె నంటక, రాజకార్యపరతంత్రుఁడైనను గేవలపరమార్థచింతతోఁ బ్రవర్తించుచు, భక్తిజ్ఞానవైరాగ్యశాలియై, భక్తిప్రపత్తులు వెలయ భగవత్కైంకర్యము సేయుచు, ఇంటికి వచ్చు భాగవతులను సేవించుచు నుండెను. ఒక్కొకప్పుడు ఆతఁడు భగవద్గుణానుభవపరవశుఁడై సకలమును మఱచి తన్మయుఁడయి దినములు గడుపుట గూడఁ గలదు.

ఉన్నమంత్రులయం దెల్ల త్రిపురదాసుఁడే ప్రజ్ఞాశాలి యగుటచే నాతఁ డట్లుండుట రాజునకుఁ జాలఁ గష్టముగా నుండును. సాధారణముగా రాజులు అతిసుకుమారులై సకలకార్యములను స్వయముగ నెఱ

వేర్చికొనఁజాలక మంత్రులపై నాధారపడియుందురు. ఈరాజుగూడ నట్టివాఁడే యగుటచే నొకనాఁడు త్రిపురదాసునిఁ జూచి "ఓయీ, నీవు భగవత్పూజాధురంధరుఁడ వైనందులకు నేనెంతో సంతోషించుచున్నాను. నిన్ను ఆమార్గమును విడిచిపెట్టుమని యెన్నఁడును నిర్బంధింపఁజాలను, గాని నీవు సమాధినిష్ఠుఁడవై యన్య మెఱుఁగక దినములకొలఁది గడుపుచుండుటచే నారాజకార్యములకు భంగము తటస్థించుచున్నది కావున నీవు నాకేదైనమార్గమును జూపవలెను. నాకుఁ గూడ నీయపారసంసారముమీఁద నసహ్యము గలుగుచున్నది. రాజ్యమునకు దగిన కట్టుదిట్టము లన్నియుఁ జేసి నన్నుఁగూడఁ దరింపఁజేయుము" అని చెప్పెను. అపుడు మంత్రి "రాజా, అట్లయిన నిందుల కొక యుపాయము గలదు. నీకుమారుఁడు రాజై రాజ్యమును బాలించుటకును, నాకుమారుఁడు మంత్రియై మంత్రాంగము సేయుటకును ఇపు డన్నివిధములను దగియున్నారు; గావున నీకుమారునకుఁ బట్టము గట్టుము. నాకుమారునకు మంత్రిత్వ మొసఁగుము. నీవు విరాగివై మోక్షమును సాధింపఁబూనుకొనుము. నన్ను భగవంతునిఁ బూజించి తరింపనిమ్ము. ఇది యుభయతారక మగుమార్గము" అనిచెప్పెను. రాజు అందుల కంగీకరించి వెంటనే శుభముహూర్తమునఁ దన కుమారుని విశాలరాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిఁ జేసి మంత్రిపుత్రుని మంత్రినిఁ జేసి వారి సామర్థ్యములను గొన్నిదినములు పరిశీలించి ఇఁక నాకు రాజ్యసంబంధము అవసరము లేదు మంత్రి, నీకుమారుని సాహాయ్యమున నాకుమారుఁడునిర్దుష్టముగను, అరిభయంకరముగను బ్రజల నేలఁగలఁడు. కావున మనము నిశ్చింతుల మైతిమి. ఇఁక నాకు మోక్షసాధనోపాయము నుపదేశింపుము" అని కోరెను. దాసుఁడు రాజుతో "రాజా, మోక్షసాధనమునకు ఒకరు మార్గముచూపుటలో విశేషము లేదు. మోక్షాసక్తునకు ఉపాయము తోఁచకపోదు. తాఁడిచెట్టు ఎక్కువాని నెంతవఱకు నితరుఁడు త్రోయఁగలఁడు? అయినను వినుము. సంసారసంబంధములన్నియు వదలించుకొనుము. విషయసుఖాశాలతను ఛేదింపుము. పురోపకంఠమునఁ గలపూలతోఁటలో పర్ణకుటీరమును నిర్మించుకొనియందుభార్యతో వసించి భగవద్భాగవతారాధనమును జేయుచుండుము. సకలప్రాణులను సమానభావముతోఁ జూడుము. ఇట్లు జరిగిపోవుచుండు

నేనికొన్నిదినములకు సదాచార్యుఁడు లభించును. అపుడా యాచార్యునిచే నుపదేశమును బడసి యథాపూర్వముగ భగవద్భాగవతారాధనమును సాగించెద వేని మోక్షము కరతలామలక మగును. భార మంతయు సర్వేశ్వరునిమీఁదనే యుంచి నిష్కామకర్మతో మాత్రము శ్రీహరిని సేవింపు"మని యుపదేశించి తాను బృందావనమునకు వెడలిపోయెను.

త్రిపురదాసుఁడు భార్యాసమేతుఁడై శ్రీకృష్ణుని యాలయమునకుసమీపమునందే యొక చిన్నవనమునఁ బర్ణశాలను నిర్మించుకొని ప్రతిదినమును స్వామిదర్శనము సేసికొనుచు హరిధ్యానమునందును, హరిభజనమునందును, హరికైంకర్యమునందును, గాలము గడుపఁజొచ్చెను. ఆతనిభార్య ఛాయవలె సకలవిషయములయందు నాతని ననువర్తించుచుండెను. ఒకనాఁడు దాసుఁడు "స్వామికి వస్త్రము నీయవలయు"నని భార్యతోఁ జెప్పెను. అందుల కాసాధ్వి యేమి చెప్పఁగలదు? ఇంటనేమియు లేదు. ప్రతిదినము బృందావనక్షేత్రమునకు వచ్చు యాత్రికులెవరైన నిన్ని బియ్య మిచ్చిన భుజించుటగలదు. లేకున్న లేదు. పాపమామె యిది యంతయు నాలోచించియే "మన మూకనకాంబరధరునకుఁ దగిన వస్త్రము నెట్లు సమర్పింపఁగలము? మనము వస్త్రము నీయకున్నస్వామికిఁ గలవా!" యని యడిగెను. అందులకు దాసుఁడు "భక్తితో నిచ్చినది పత్రమైనను శ్రీహరిస్వీకరించును. లేకున్నమన మాసర్వేశ్వరుని బూజింపఁగలమా? ఆస్వామికి సేవసేయువారు కలవనియే మనము సేవించుచుంటిమా! మానవులకుఁగాని జగన్నాథునకుఁ గలవెక్కడిది? ఈప్రపంచమునందలి వస్తుసముదాయములో నాతనిది కానిది ఏది? ఆతనికి ఇదిచాలునా! కలవా!"అని యాలోచించుట మనపనిగాదు. మనపని సర్వమును ఆప్రభుమూఁడామణికిలర్పించుటయే. శ్రీకృష్ణుఁడు తన మందిరమున అటుకులు లేకయే కుచేలుఁడు జీర్ణవస్త్రము కొంగున ముడిచి తెచ్చినవి స్వీకరించినాఁడా?" అని చెప్పి వంటచేసికొనుపాత్రనమ్మి యొక వస్త్రమునుగొని ఆలయమునకుఁ బోయి "ఈవస్త్రము స్వామికి వినియోగింపుఁడు" అని అర్చకుల కిచ్చెను. "స్వామికి నూలువస్త్రమా!"అని అర్చకులుపరిహసించిరి. "ఎందులకుఁ గాఁ గూడదు? ఎవరికిఁగలవస్తువు వారుసమర్పింతురు. అందఱును గన

కాంబరములు తేఁగలరా?" యనిదాసుఁడు వెడలిపోయెను. "అట్లే సమర్పింతుములే పొమ్ము" అని అర్చకులు ఆతనినిఁ బంపివేసిరి. రాత్రియైన తరువాత నర్చకులలో నొకఁడు ఆవస్త్రమును బరచుకొని స్వామిసన్నిధిని శయనించెను.

అర్చకుఁడు చేసిన పనికి శ్రీకృష్ణునకు జాలఁ గోపమువచ్చెను. స్వామి అర్చకులకు త్రిపురదాసుఁడు తనకు అంతరంగభక్తుఁడు అని తెలుపఁగోరి గాఢమగు చలినిఁ గల్పించుకొని గజగజ వణఁకసాగెను. అది చూచి అర్చకులు అమూల్యము లగు అనేకవస్త్రములను గొనివచ్చి కప్పిరి గాని చలితీఱలేదు. అర్చకులు "ఇఁక వస్త్రములు తేఁజాలము. ఈయుపద్రవమును దాఁటుట యెట్లు?" అని తల్లడిల్లుచుండఁగా స్వామి శయనించిన అర్చకుని స్వప్నమున సాక్షాత్కరించి "దాసుఁ డిచ్చిపోయిన నూలువస్త్రమును గప్పుము" అని చెప్పెను. అంత నాయర్చకుఁడు ఉలికిపడి లేచి తన స్వప్నవృత్తాంతమును దోడివారి కెఱింగించెను. అదివిని వారందఱును "అయ్యో, మనము స్వామికి అపచారముచేసితిమి. ఆతఁడెతఁడో స్వామికి అంతరంగభక్తుఁడు. మనము తెలియక తిరస్కరించితిమి" అని నొచ్చుకొనుచు ఆనూలువస్త్రమును స్వామికిఁ గప్పిరి తోడనే చలియు,వణఁకును మాయ మయ్యెను. ఈయద్భుతమునుజూచి అర్చకులు చాల వింతపడి వడివడిగఁ బోయి త్రిపురదాసునకును, ఆప్రాంతముల నున్నవారికిని గడచిన సమాచార మంతయు నెఱింగించిరి. తోడనే దాసుఁడు ఆలయమునకు వచ్చి స్వామికి సాష్టాంగదండప్రణామము లర్పించి "ప్రభూ, నీవు పీతాంబరధరుఁడవు. అనేకభక్తులు నీకు దివ్యపీతాంబరములను సమర్పించి తరించియున్నారు. అవన్నియు నుండఁగా నానూలువస్త్రమే నీకుకావలసివచ్చెనా? దీనబాంధవా,నామీఁద నెంతయనుగ్రహము చూపితివి? ఇంతకంటె నాకు ఏమి కావలయును? నీవు కోరినసేవనంగీకరించితివి. ఈయనుగ్రహమును నామీఁద శాశ్వతముగా నుంపుము" అని కొనియాడి వెడలిపోయెను.పోవునపుడు "మాయపరాధమును క్షమింపవలయు"నని యర్చకులును, "మమ్ము శిష్యకోటిలోఁ జేర్చి కొనవలసిన" దని చూడవచ్చినవారును శ్రీకృష్ణునకంటె అధికముగాఁ ద్రిపురదాసునకుఁ బాదములమీఁద వ్రాలి సాష్టాంగనమస్కారములు

సమర్పించి ప్రార్థించిరి. వారి సందఱును దోలగించుకొని పర్ణశాలకుఁ బోవుట దాసునకుఁ జాలఁ బ్రయాస మయ్యెను.

ఒకనాఁడు భగవంతుఁడు త్రిపురదాసుని భక్తిజ్ఞానవైరాగ్యములకు సంతసించి నిజరూపముతో దర్శన మిచ్చెను. తోడనే భార్యాసమేతుఁడయి దాసుఁడు అనంతనామములతో స్వామిపాదములను బూజించి సాష్టాంగనమస్కారము లాచరించి "వరదా, ఆర్తత్రాణపరాయణా, సకలాపరాధి నగు నాయెడల నింత యనుగ్రహము సూపుదు వని కలలోనైనఁ దలంపలేదు. ఈయాధముని గుఱించి నీవెంత కష్టపడుచున్నావు. స్వామీ యాచకునకుఁ దృప్తి యుండదు నీయంతరంగ సేవ నభిలషించు నాకు, నేఁడు ఒసంగిన దర్శనముతోఁ దృప్తి కలుగుటలేదు. నీవు మాటిమాటికి నిట్లే దివ్యదర్శనము నొసంగి నాపాపములను దహించి నా సేవ నంగీకరించుచుండవలయు"నని ప్రార్థించెను. భగవంతుఁడు మందహాసము గావించి అట్లే గానిమ్ము అని యంతర్హితుఁ డయ్యెను.

త్రిపురదాసుని యనుజ్ఞ నందిన మధురాపురమున రాజు భార్యాసహితుండై పూఁదోటయందలి పర్ణశాలలో భగవదారాధనము సేయుచుండెను గదా? ఆదంపతుల భక్తిజ్ఞానవైరాగ్యములకుఁ గూడ నానందించి శ్రీకృష్ణుఁడు నిజరూపముతో సాక్షాత్కరించెను. ఆదంపతులు ఈశ్వరుని అనేకవిధములఁ గొనియాడి పూజించి రక్షింపవలయు నని ప్రార్థించిరి. అంత భగవంతుఁడు వారినిఁ జూచి "మీరు సద్గురునివలన నుపదేశమును బొంది తన్నియమానుసారముగఁ బ్రవర్తింపుఁడు. గురువచనపాలనమువలన మోక్షము మీకుఁ గరతలామలకమగును. బృందావనమున త్రిపురదాసుఁడు అను మహాభాగవతచూడామణి గలఁడు. మీరాతని నాశ్రయింపుఁడు" అని చెప్పి తిరోహితుఁ డయ్యెను. అంత వారు అనేకవిధముల భగవంతునిఁ గీర్తించి తత్క్షణమే బయలుదేఱి బృందావనమునకుఁబోయి త్రిపురదాసునకును ఆతని భార్యకును సాష్టాంగ నమస్కారములు ఆచరించి సకలోపచారములును జేసి శరణువేఁడిరి. దాసుఁడు రాజదంపతుల భాగ్యమును గొనియాడి వెంటనే వారిని ఆలయమునకుఁ గొనిపోయి శ్రీకృష్ణభగవానుని దర్శనము సేయించి, మఱల నింటికిఁ గొనివచ్చి శుభముహూర్తమున మంత్రోపదేశము చేసి "భగవంతుఁడు మీయెడల దయగలిగి యున్నాఁడు. మీరు

ఆదయ నభివృద్ధియగునట్లు ప్రవర్తించుకొనవలయును. ఇందు రహస్య మేమియు లేదు భక్తిజ్ఞానవైరాగ్యమార్గము లిదివఱకే మీకుఁ దెలిసి యున్నవి. ఆమార్గమునుండి మీహృదయములు తొలఁగిపోకుండునట్లు చూచుకొనుచుండుఁడు” అని బోధించెను. రాజదంపతులు గురుదేవు నకు శతసహస్రప్రణామములనర్పించి యథాస్థానమునకుఁబోయి భగవ ద్భాగవతారాధనము సాగింపఁజొచ్చిరి. ఇట త్రిపురదాసుఁడు సాధు సజ్జనపూజనమును, భగవద్భాగవతార్చనమును జేయుచు, తుదకు భాగ్యసమేతుఁడై శ్రీహరిసాయుజ్యమును బడసెను. అట రాజుగూడ బ్రతికియున్నంతకాలము నీశ్వరునిఁ బూజించి భార్యతోఁగూడ తుదకు ఈశ్వరసాయుజ్యము నందెను.

మ. “అరవిందోదర తావకీనచరణధ్యానానురాగోల్లస
చ్చరితాకర్ణనజాతభూరిసుఖముల్ స్వానందకబ్రహ్మ మం
దరయన్ లేవఁట దండధృద్భటవిమానాక్రుష్టులై కూలు నా
సురలోకస్థులఁ జెప్ప నేల సుజనస్తోమైకచింతామణీ.”
(భాగ. స్కం. 4. ప. 283)

28. కూర్మదాసుఁడు.

ఒక గ్రామమున నొక బ్రాహ్మణునకు లేక లేక యొకకుమారుఁడు గలిగెను; గాని యేకారణమువలననో యాతనికిఁ గాళ్లు లేనయ్యెను. అదిచూచి యాతని తల్లిదండ్రులు ఆబిడ్డఁడు అనూరునియంశమునఁ బుట్టెనని యానందింపసాగిరి. కాళ్లులేమి నడవఁజాలక యాతఁడు తాఁబేటివలె ప్రాకుచుండుటచే తల్లిదండ్రులు కుమారునకుఁ గూర్మదా సుఁడు అను పేరు పెట్టిరి. ఆపేరు పెట్టుటలో వారి యభిప్రాయము నెఱుంగనివాఁడు పేరు స్థితికిఁ దగినట్లే యున్న”దని యనుకొనసాగిరి. ఆదంపతులు ఆకుంటిపిల్లవానినే చాలఁ గారాబముతోఁ బెంచుకొను చుండిరి.

జ్ఞానము వచ్చినదిమొదలు కూర్మదాసుఁడు ఎచ్చట భగవద్భజన మైనను ఎట్లో ప్రాకిపోయి చాల భక్తిశ్రద్ధలతో వినుచుండెను. ఒకనాఁ డాతఁడు పాండురంగమాహాత్మ్యమును వినియెను. తోడనే యాతనికి

పండరిపురమునకుఁ బోయి పాండురంగని సేవింపవలయునని యుత్కంఠ వొడమెను; గాని యది యెట్లు సాధ్యపడును. ఎంతో దూరమున నున్న పండరిపురమునకు ఈకుంటివాఁడు పోవుట యెట్లు? అయినను ఆతఁడు ఉత్కంఠఁ బట్టఁజాలక అచ్చటనున్నవారినిఁ జూచి వందనములు చేసి "మహా ప్రభూ, నాకు పాండురంగని సేవింప నభిలాష గలిగినది. ఈజన్మములో నాకది సాధ్యపడునా? పాండురంగఁడు నాసేవ నంగీకరించునా?" యని యడిగెను. అదివిని యచ్చటివారెల్లరును పకపక నవ్వి "ఉట్టి కెగురలేని యమ్మ స్వర్గమున కెగిరినదఁట. అట్లున్నది నీగొంతెమ్మ కోరిక. సకలావయవములును గల దృఢకాయుల మగు మేమే అక్కడకుఁ బోలేమని జంకుచున్నాము. నీకెట్లు సాధ్యపడు నూరకుండుము" అని నుంపలించిరి. ఆయభాగ్యుల నిరుత్సాహవచనముల నాతఁడు లెక్క సేయులేదు. "దృఢగాత్రులు ఒకదినములోఁ జేరు స్థలమునకు నేను నెలలోఁ జేరఁగలను. పండరిపురము నాకు దుర్గమము గాదు" అని భావించి వెంటనే యాతఁడు మహోత్సాహముతో "శ్రీహరి" యని పిలుచుచు గమ్యస్థానమునకుఁ బయలు దేఱెను.

నాఁడు సాయంత్ర మగునప్పటికి ఆతఁడు రెండుక్రోసుల దూరము పోయెను. సాయంత్ర మగుటవలనను, ఆయాసము కలుగుట వలనను ఆతఁ డిఁక ముందునకుఁ బోలేక ఒక గ్రామము చేరికొని అందున్న ఆంజనేయస్వామి యాలయమునఁ బ్రవేశించి బడలిక తీర్చుకొనసాగెను; గాని రాత్రి యైనకొలఁదిని విజృంభించు క్షుద్బాధను తీర్చుకొనుట యెట్లు? అంత నాతఁడు "శ్రీహరీ, పాండురంగా, నీకంటె నన్యమెఱుఁగను. నీసేవయందు పేరాస గలిగియున్నాను. నీవే నాకు దిక్కు. నీదర్శనమిచ్చి యొక్కక్షణ మైన సేవ యొసంగనఁజాలును. అంతకంటె నాకుఁగోరఁదగినది మఱియొకటి లేదు"అని పరితపింపఁజొచ్చెను ఈపరిదేవనము దీనావనుండగు పాండురంగని చెవులఁబడియెను. తోడనే యాతఁడు ఒకవర్తకునిరూపముతో వచ్చి కూర్మదాసునకు అన్నపానములిచ్చి యాదరించి"భక్తాగ్రణీ, నేనొక వర్తకుఁడను. పండరిపురమునకుఁబోవు భక్తజనులకు అన్నపానము లిచ్చుటయే నాపని అందులకై నీవు బాధపడవలసిన పని లేదు. నీకంటె ముందుఁబోయి నీవు నిలుచుచోట అన్నపానములు సిద్ధముచేసి యుంచుచుందును. నీవు యథేష్టముగ భుజించి

పండరిపురమునకుఁ బోయి పాండురంగని సేవించి తరింపవచ్చు" నని చెప్పి వెడలిపోయెను.

చెప్పినప్రకారమే వర్తకరూపియగు సర్వేశ్వరుఁడు కూర్మదాసు డెచ్చట నిలిచిన నచ్చటనే అన్నపానాదిసౌకర్యములను గూర్చి చాలనాదరించుచువచ్చెను. వర్తకుని యవ్యాజకరుణకు ఆశ్చర్యపడుచు కూర్మదాసుఁడు అతిప్రయాసతో నాల్గుమాసములు నడచి కార్తికశుద్ధదశమి నాఁటికి బహుళాపురము అనుగ్రామముఁ జేరుకొనియెను. అందలివారందఱును గార్తికశుద్ధైకాదశినాఁడు పండరిపురమున జరుగు మహోత్సవమును జూచుటకు దశమినాఁడు బయలుదేఱిరి. వారి నందఱను జూచి దాసుఁడు "కట్టా, నాకుఁగూడ కాళ్లు ఉండినచో వీరితోఁగూడఁ బోయి ఆమహోత్సవమును జూచి తరించి యుందునుగదా? అట్టి యదృష్టము నాకు లేకపోయినది. ఏమి చేయఁగలను?" అని చాలఁ జింతించి పండరిపురమునకుఁ బోవువారినిఁ జూచి "మహాత్ములారా, మీవలెనే నేను పండరిపురమునఁ జరుగు మహోత్సవమును జూచి యానందింపవలయు నని నాకెంతో యభిలాష గలదు; గాని నాకోరిక సాధ్యము కానిది. ఏమి చేయుదును? ఇఁక మీయెడల నాప్రార్థన మేమనఁగా? నా మాఱుగ మీరు స్వామికి నాసాష్టాంగవందనములు సమర్పింతురా? ఇఁక నేఁడుదినములు నడచినఁగాని పండరిపురము సేరలేని యీకుంటివానికి మీరీ మహోపకారమును సేసెదరా? నాకు దర్శన మిచ్చి రక్షించునట్లు పాండురంగనిఁ బ్రార్థించెదరా?" అని యడుగ వారు "భక్తశిఖామణీ! నీకు విచారము వలదు. నీయభీష్టమును మేము నెఱవేర్చెదము. నిన్నురక్షింపు మని భగవంతుని మేము ప్రార్థింతుము" అనిచెప్పి వెడలిపోయిరి. కూర్మదాసుఁడు ఆమాటలు విని భగవంతుఁడు సాక్షాత్కరించినట్లే యానందించెను.

యాత్రికులు పండరిపురమును జేరి కూర్మదాసుని వినతులను విన్నపములను బాండురంగనికి సమర్పించి పిదపఁ దమ స్వవిషయము చూచుకొనిరి. నామదేవుఁడు మున్నగు అంతరంగభక్తుల భజనమునకు మెచ్చి ఆనందపరవశుఁడై యున్న స్వామి యీప్రార్థనము నాలకించి నామదేవుని జ్ఞానదేవునిఁ జూచి నాతో రండు అని చెప్పి కూర్మదాసునికి సాక్షా

త్కరింప బయలు దేఱెను. అంతనాయంతరంగభక్తులిరువురును "శ్రీహరీ, నీలీలలు బ్రహ్మేంద్రాదులకుఁ గూడ నవాఙ్మానసగోచరములు. ఒకనికి సాక్షాత్కరించి యొకని నుద్ధరింతువు. ఒకనిం జూచుచు నొకనితో మాటాడెదవు. ఏకకాలమునందే కొందఱి నాడింతువు. కొందఱి నానందవివశులం గావింతువు. అప్పుడేయొకచో భక్తులతోఁ గూడి నాట్యమాడెదవు. ఒకదీనుని రక్షింపఁ బరువెత్తెదవు ఇట్లుసర్వాంతర్యామివై యుండు నీవే తనుచెంత నే యుంటివని యంతరంగభక్తులు మురిసిపోవుచుందురు. కూర్మదాసుని రక్షించుటకై మాతో బయలుదేఱి వచ్చుచున్నావు; గాని పండరిపురమున మహోత్సవనిమగ్నుఁడవై కూడనున్నావు పరమేశ్వరా, దీనబంధూ, అనాథనాథా, నమ్ము అంతరంగభక్తు లని ఆదరింతువు. నాప్రాణములు మీయందేయున్నవి అందువు. ఇట్టి అంతరంగభక్తులు నీకు ఎన్నికోట్లు గలరో యెవరు చెప్పఁగలరు? ఒకనికిఁ బాండురంగఁడవై దర్శన మిచ్చెదవు. ఒకనికి జగన్నాథుఁడవై సాక్షాత్కరింతువు. మఱియొకనికి రంగనాథుఁడవై సేవ యొసంగెదవు. ఇట్లు నానారూపములతో నానాభక్తులను దనుపు నీలీలలు తెలిసికొనుటకు ఎవరు శక్తులు? భక్తచింతామణీ, మేము అపరాధులము. తెలియకుండఁగనే మానవుల నపరాధములు సేయఁబడును. పుణ్యమని భావించి పాపమునఁ గూలఁబడియెదము. మంచి యనుకొని చెడ్డ యాచరింతుము. మాకన్న నవివేకులు నమ్ము మహాత్ము లని భావించి పూజింతురు; గాని మేముగూడ భ్రాంతికి లోఁబడిపోవుచున్నారము ఆహా, దీనమందారా, ఆర్తత్రాణపరాయణా, మేము నీకింకరులము, నీచిత్తమువచ్చినట్లు ఆడింపుము" అని కొనియాడుచు శ్రీహరివెంటఁ బోవుచుండిరి.

మార్గమధ్యమున పెండి అనుగ్రామమున సామంతుఁడు అనునొక భక్తుఁడు నందనవనము అను పూదోఁటలో భగవంతుని ఆరాధించుచుండెను. ఆప్రాంతమునుండి యేపోవుచున్న భగవంతుఁడు జ్ఞానదేవనామదేవులతో "మీరిచ్చటనుండుఁడు. ఈవనమునభక్తుఁడొకఁడునానిమిత్తమెదురుచూచుచున్నాఁడు. పోయి వచ్చెదను" అనిచెప్పి తోఁటలోనికిఁ బోయెను. అట శ్రీహరినిఁ గీర్తించుచు నాట్యవశమున నానందపరవశుఁడై యున్న సామంతుఁడు హఠాత్తుగ సాక్షాత్కరించినసర్వేశ్వరునిఁ జూచి విస్మితుఁడై సాష్టాంగదండప్రణామము లర్పించి అనేకవిధములఁ

గొనియాడసాగెను. అంత పాండురంగఁడు "వత్సా, నీవిప్పుడు కొని యాడవలదు. నన్ను ఇరువురుచోరులు వెంబడించి వచ్చుచున్నారు. వారిబాఱిఁ బడకుండ నన్ను రక్షింపుము. జాగుము సేయవలదు. వేళాకోళము అని భావింపవలదు. వేగ దాఁచుము" అని తొందరపెట్టసాగెను. సామంతుఁడు అందులకు మఱింత విస్మితుఁడై "స్వామీ, నాగుడిసెలో దాఁగుకొనుము." అనియెను. "అట నేను దొరకిపోవుదును. మఱియొక నిభృతస్థలమును జూపు" మని పండరినాథుఁడు మిగులఁ దొందఱ పఱిచెను. "అట్లయిన నాహృదయకుహరమునఁ బ్రవేశింపుము. అంత కంటె రహస్యస్థలమును నేను జూపఁజాలను" అనిసామంతుఁడు చెప్పెను. దారిచూపుమని భగవంతుఁడు కోరఁగా వనము బాగుచేయుటకుఁ దెచ్చినపాఱతోఁదన వక్షస్స్థలమును ఛేదించి సామంతుఁడు దారిచూపెను. భగవంతుఁడు హృదయములోఁ బ్రవేశించినవెంటనే సామంతుఁడు హృదయముపై వస్త్రము నాచ్ఛాదనము సేసికొని భగవంతుఁడు తనలో నుండుటవలన విమలచిత్తుఁడై ఆనందపరిపూర్ణుఁడై నాట్యము ప్రారంభించెను.

ఈస్వల్పకాలవిశ్లేషమునకే జ్ఞానదేవనామదేవులు సహింపఁజాలక ఏమయినను నుంచిదేయని సాహసించి నందనవనముఁ బ్రవేశించిరి; గాని యందు వారికి నృత్యముసేయుచున్నసామంతుఁడే గాని భగవంతుఁడు కాన్పింపఁడయ్యెను. సామంతుఁడు ఆనందోన్మత్తుఁడై నృత్యముసేయుచుండఁగా భగవంతుఁడు "భక్తశిఖామణీ, నేను ప్రపంచమంతయునిండియున్నాఁడను. భక్తులనేకులు నాకుఁ బ్రత్యేకాలయములను లెక్కలేనన్ని యేర్పఱిచినారు. అంతరంగభక్తులు అనేకులు నన్ను దమ హృదయములలో నెలకొల్పినారు; గాని నీహృదయమువలె మనోహరమును, వినిర్మలమును, ఆనందదాయకము నగుస్థలమును నేనింతవఱకును ద్రొక్కి యెఱుఁగ" నని చెప్పుచుండెను. అట్టిసమయములో జ్ఞానదేవనామదేవులు అచ్చటకుఁ బోయి శ్రీహరిని నెందును గానక సాహసించి "సాధుజనచూడామణీ, మమ్ము వంచించి జగన్నాథుఁడు నీనిమిత్తము ఈవనమునఁ బ్రవేశించినాఁడు. ఆరమాకాంతుని వీడియుండుటచే మాప్రాణములు కంఠగతములగుచున్నవి. దయయుంచి యాతఁడెక్కడనున్నాఁడో చూపు" మని ప్రార్థించిరి గాని ఆనందపరవశుఁడై నృ

త్యముసేయుచున్న సామంతునకు ఈమాటలు విన్పింపలేదు. అదిచూచి వారు "సర్వేశ్వరుఁడు ఈతని హృదయమునఁ జిక్కియున్నాఁడు; గావు ననే యీతని కీయానందోన్మాదము" అని భావించి "మహాత్మా, మా పాలిటిరక్షకుని నీహృదయమున దాఁచుకొని యున్నావు. మా యెడలఁ గరుణించి యానవనీతచోరుని ఒక్కమాఱు చూపితివేని మావిచారము పోవును" అని ప్రార్థించిరి. ఇది విని పాండురంగఁడు "వత్సలారా, ఈమహాభక్తునిహృదయకుహరమునఁ బ్రవేశించి నేను బైటికి రాఁజాలకున్నాను. నేను వివశుఁడనై పోయియున్నాను" అని చెప్పి "భక్తాగ్రణీ, నావిశ్లేషమును సహింపలేక వీరు పరితపించుచున్నారు. వీరికి నాదర్శనమును బ్రసాదింపుము" అని సెలవిచ్చెను. తోడనే సామంతుఁడు "మహాత్ములారా, పాండురంగని అంతరంగభక్తులరగు మిమ్ము గుర్తింపఁజాలక నేను మహాపచారమును జేసితిని. ఈదాసానుదాసుని యపరాధమును క్షమింపవలయు" నని వారి పాదములపై వ్రాలి ఆనందబాష్పములతో పాదములు గడిగెను. వారాదరముతో నాతనిని లేవనెత్తిరి. తోడనే సామంతుఁడు తనయురముపై చుట్టిన వస్త్రమును విప్పివేసెను. పాండురంగఁడు వెలుపలకు వచ్చి జ్ఞానదేవనామదేవులకు దర్శనమిచ్చెను.

పిదప భగవంతుఁడు "అచ్చటఁ గూర్మదాసుఁడు నానావస్థలననుభవించుచున్నాఁడు. వేగముగఁ బోవలయును" అని నామదేవుని, జ్ఞానదేవుని వెంట నిడుకొని బహుళాపురమునకుఁ బోయి "ఓయీ, దూరప్రయాణమువలన నీవు అలసినట్లున్నాఁడవు. ఇంక నెచ్చటకుఁ బోయెదవు?" అని యడిగెను. "పాండురంగని దర్శింప నుత్కంఠతో బయలుదేఱి నాలుగుమాసములనుండి నానాశ్రమలకుఁ దాళి వచ్చుచున్నాను. నేఁడు ఎట్లయినఁ బండరిపురము చేరవలయు నని యెన్నోవిధములఁ బ్రయత్నించితిని; గానిసాధ్యపడలేదు. పాండురంగనికొఱకు నాహృదయమెదురు చూచుచున్నది. ఇఁక నొకగడియలో నాకాభక్తవత్సలుఁడు దర్శనమీయకున్న నాప్రాణములు నిలువవు. సర్వేశ్వరునిఅనుగ్రహమునకుఁ బాత్రుఁడనుగాని నాబ్రతుకేల యను నౌదాసీన్యమువలన అవసానకాలము నెదురుచూచుచు నిశ్చలుఁడనై యున్నాఁడను." అనిచెప్పెను. ఆతని తొందఱను గ్రహించి పాండురంగఁడు తోడనే నిజరూపముతోఁ బ్రత్యక్ష మయ్యెను. అంతఁ గూర్మదాసుఁడు అనేకవిధములఁ గొని

యాడఁగా భగవంతుఁడానందించి "నీకేమివరముకావలయునో కోరుము" అని యాన తిచ్చెను. "మూవురు అంతరంగభక్తులసముక్షమున సాక్షాత్కరించి నన్ను ధన్యునిఁజేసితివి. ఇంతకంటె నాకు వేఱేమి కావలయును? అయినను నాకు నీవు వరమిచ్చెదనని చెప్పినపుడు అడుగకుండరాదు. నీవు నాకు ఇప్పుడు ఏరూపముతో సాక్షాత్కరించితివో ఆరూపముతోడనే యిచట స్థిరనివాసము నేర్పఱుచుకొనుము" అని కోరెను. భగవంతుఁడు అట్లే చేసెను. నాఁటనుండియు పండరిపురమున కేఁగుభక్తులు బహుళాపురమునకుఁ గూడఁ బోయి స్వామిని సేవించి తరించుచున్నారు.

చ "నిరతము తావకీనభజనోత్సవబాహ్యసుగంధబుద్ధి తె
వ్వరిమది వొందఁగాఁ గలుగు వారలు తత్ప్రియమర్త్యదేహము
న్నరయఁ దదీయదారతనయాదిసుహృద్గృహబంధువర్గమున్
మఱతురు విశ్వతోముఖ రమాహృదయేశ ముకుంద మాధవా."

(భాగ. స్కం. 1. ప. 285.)

29. లాడుబావా.

జ్యోతిపురము అను పట్టణమున లాడుబావా అను నొకభక్తశిఖామణి యుండెను. ఆతనికి సంసారము మున్నగు జంజాటము లేమియు లేకపోవుటచే ఈశ్వరభజనమునకును, తీర్థక్షేత్రయాత్రలు సేయుటకును జాల వీలుగనుండెను. ఈసౌకర్యమును వ్యర్థముసేయక యాతఁడు హిమాలయము, బ్రహ్మకపాలము, హరిద్వారము, బదరీనారాయణము, గయ, జగన్నాథము, శ్రీకూర్మము, భీమవరము, సింహాచలము, ద్రాక్షారామము, శ్రీశైలము, అహోబిలము, తిరుపతి, కాళహస్తి, ఘటికాచలము, కంచి, కుంభకోణము, శ్రీరంగము, రామేశ్వరము, దర్భశయనము మున్నగు అనేకదివ్యస్థలములకుఁ బోయి అచ్చటఁగల దివ్యతీర్థములలో గ్రుంకి, అందందు వేంచేసియుండు ఈశ్వరుని ఆరాధించి మార్గవశమున కాపూర్ అను గ్రామము చేరుకొనియెను.

అచ్చటి జను లందఱును గాళికను గొలిచి ఆమెకు జంతుబలులు నరబలులు సమర్పించుచుందురు. ఆగ్రామమునఁ గాళికాదేవిగుడి తక్క

విష్ణునియాలయముగాని,శివాలయముగాని,తుదకు రామభజనకూటము గాని లేకయ్యెను. అగ్నికిఁ గాలి తోడైనట్లు అచ్చట తక్కువజాతి మనుష్యులు కంకాళమ్మ ఎల్లమ్మమాతంగమ్మ మున్నగు క్షుద్రదేవతలను గాళికకుఁ దోడుగాఁ గొలుచుచుండిరి. వారిహృదయములలో పరమేశ్వరభక్తియనునది పొడసూపకుండ ఆక్షుద్రదేవతలు చాలమెలఁకువతో నుండిరి. అగుట నచ్చట బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాదివివక్ష లేకుండ సకలవర్ణములవారును ఆక్షుద్రదేవతలకు దయమాలి ఆవులు, దున్నలు, మేఁకలు, కోళ్లు, మానవులు మున్నగు సాధుప్రాణులను బలి యిచ్చి ఆయానందముతో నుక్కిరిబిక్కిరి యగుచుండిరి. ఈకారణమువలన నచ్చట మేఁకలు మున్నగు సాధుజంతువులు సమూలముగ నాశమైపోవుచుండెను; కాని యితరము లగు పనులన్నియు మాని వారు దేవతాపూజ అవిచ్ఛిన్నముగ నెఱవేఱుటకుఁ బరదేశములకుఁ బోయి వానిని గొనివచ్చి పెంచుచు లోపమును బూరించుచుండిరి. ఈసంగతులేమియుఁ దెలియనివాఁడగుటచే లాడుబావా యట్టిక్షుద్రగ్రామమునఁ బ్రవేశించి కాళికాలయసమీపమున నున్న యొక పూఁదోఁటలో విడిసెను.

ఆగ్రామమునఁ గొన్ని దినములయందు రాజు కాళికాదేవికి నరబలుల నర్పించు వాడుకయుండెను. వాడుక ననుసరించి నరబలినిఁ జెల్లించిరండని రాజు భటులకు ఆజ్ఞాపించెను; గాని వాండ్రు ఎంత వెదకినను నాఁడు వారికిఁ దగినవాఁడు కాన్పింపఁ డయ్యెను. ఎట్లయిన నిది నెఱవేర్పనిచో రాజు తమ్మే బలియిచ్చు నని జడియుచు తిరుగుచుండఁగా దైవవశమున పూఁదోఁటలో హరిభజనము సేయుచు నానందపరవశుఁడైయున్న లాడుబావా వాండ్రకన్నులఁబడియెను. తోడనే బ్రతికితిమి అని వాండ్రు ఆతనిపైఁ బడి ఎన్నివిధములవారించుచున్నను విడువక ఏల యిట్లు చేసెదరనిన జవాబీయక తిన్నఁగ కాళికాలయమునకుఁ గొనిపోయిరి. అచ్చటఁ బూజాద్రవ్యములు మున్నగు సకలపదార్థములను సిద్ధముచేసికొని యున్న మఱికొందఱు రాజభటులు వీరినిఁ జూచి "మీరింతవఱకును రాకపోవుటచే మాప్రాణములు గుటుకుగుటుకు మనుచున్నవి. అంత యాలస్య మేల యయ్యెను?" అని యడిగిరి, లాడుబావాను కట్టి తెచ్చిన భటులు "ఏమిచేయు మనెదరు? మనలో నెవఁడో యొకఁడు దీక్షా

యువు కలవాఁడు ఉండుటచే నేఁడు బ్రతికిపోయితిమి. ఎంత వెదకినను నేఁడు ఎచ్చటను బురుషుఁడే కాన్పింపఁడయ్యెను. నేఁడు బైటికి వచ్చి చేయవలసిన పనులన్నియు స్త్రీలే నెఱవేర్చుచున్నారు. చంటిపిల్లవాఁడు గూడ వీథిలోనికి రాకుండఁ జేయఁబడెను. నేఁడు మనలో నొకనికి వంతు వచ్చు ననుకొంటిమి. ఇఁకఁ బ్రాణములమీఁద నాశ వదలుకొన వలసినదియే యనుకొని యున్మత్తులమై మేము పోవుచో టెఱుంగకుండఁ దిరుగుచుండఁగా నీసమీపమున నున్న అమ్మవారి పూఁదోఁటలో నీ నిర్భాగ్యుఁడు 'హరిహరీ' యని యేమో కూయుచు కాళ్లు బద్దలగునట్లు నాటకము త్రొక్కుచున్నాఁడు. ఒడ లెఱుంగకుండ ఆడుచున్న వీనినిఁ గట్టి వేయునపుడు ఏమో గాని మేము గూడ ఒడ లెఱుంగమైతిమి. ఇంతకును జెప్పవలసినది ఏమియు లేదు. పూజ వేవేగ ముగింపుఁడు. మన మింతవఱకు నిచ్చటనే యుండుటచే మనలో నొకఁడు దేవికి బలి పోయియుండు నని మనదారపుత్రులు అడలుచుందురు. రాజు పండ్లు పిండి చేసికొనుచుండును. అలసించిన అమ్మవారికిఁగూడ ఆగ్రహమురావచ్చు"నని తొందఱ పెట్టిరి.

అచ్చటనున్న భటులు క్షణములోఁ బూజాదికమును నిర్వర్తించిరి. తోడనే లాడుబావా లోనికిఁ గొనిపోఁబడెను. అప్పటికి ఆతనికిఁ దనకు సంభవించిన విపత్తు తెలిసిపోయెను. ఎన్నివిధములఁ బ్రార్థించినను విడువక వాండ్రు ఆతనిని అమ్మవారియెదుట నిలిపి పాఱిపోకుండ ముగ్గుఱుగట్టిగఁ బట్టుకొనిరి. ఒకఁడు దేవియెదుట నిలిచి గంటవాయించుచు "చల్లనితల్లీ, జగజ్జననీ, మమ్ము చల్లనికంటఁ జూడుము. ఈనరబలిని గ్రహించి మాకు పాడిపంటలు సిరిసంపదలు ఇచ్చి మారాజునకు నిత్యవిజయమును దయచేయుము" అని ప్రార్థించుచుండెను. మఱియొకఁడు "శ్రోత్రు పాటువద్దు. ఏటుసరిగా వేయుము. ఒక్క వ్రేటునకు వీఁడు రెండు పెసలు కానిచో అమ్మవారు ఇఁక వీనిని స్వీకరింపకపోవుటయే గాక మన కొంప తీయును" అని ఘాతుకుని హెచ్చరించుచుండెను. ఇది యంతయు వినుచు చూచుచున్న ఘాతుకుఁడు "తల్లీ! నా చేతికి బలమిమ్ము. నాకత్తికి పదను ఇమ్ము" అని ప్రార్థించి యూఁడుగఱచి, కత్తి యెత్తి విసరుటకు సిద్ధముగా నుండెను.

అట్టిసమయములో హఠాత్తుగ ఫెళఫెళ మని యురిమినట్లయ్యెను. కన్ను దెఱచి చూడఁగా అమ్మవారు భయంకరమూర్తియై మీఁదఁబడి "దుర్మార్గులారా, హరిభక్తాగ్రేసరునకు కీడుదలంచిన మీరు చత్తురుగాక" అని రాజభటులను నానా బాధలు పెట్టి విడిచెను. కనుమూసి తెఱచునంతలో వాండ్రు మాఱుపలుకకుండ తిరిగి చూడకుండ ఊర్ధ్వశ్వాసముతో చేతన్యనంత పడిగఁ బాఱిపోయిరి. అంతఁ గాళికాదేవి భయంకరాకారము విడిచి చేతులు జోడించుకొని "శ్రీహరి భక్తాగ్రేసరా! నన్ను క్షమింపుము. మదమువలన నీరాజభటులుయుక్తాయుక్తపరిజ్ఞానము లేక నాకు బలియిచ్చుటకై నిన్నుఁ గట్టితెచ్చిరి. నేను భాగవతులనినఁ బరమభక్తితోఁ బూజింతును. నేఁడు నామూలమున సంభవించిన యీ అపచారమును మఱచి నాసేవ నంగీకరింపవలయు" నని ప్రార్థించెను. అదివిని లాడుబావా సీత్కారముసేయుచు "నీవు నన్ను సమీపింపకుము. నిన్ను జూచిన పూర్వపుణ్యము లన్నియు నశించును. నీశరీరము సోకిన కుంభీపాకనరకమునఁ గూలఁబడుట తప్పదు. క్షుద్రురాలవై సాధుజంతువులనుబలిగొను నీకు ఇంత మృదువగు ప్రార్థనాసరణి యెట్లలవడినది? నీవెప్పుడును మాంసముతినుచుండుటవలన నీమాటలు కుళ్లిన మాంసపుఁగంపుగొట్టుచున్నవి. తామసీ, హరిభక్తులను బూజింతు నంటివి. శ్రీహరియెడల నీకింత భయభక్తు లుండునేని నీవు పాపకర్మనుగు జంతుబలి నేల యంగీకరించెదవు? ఈదేశప్రజలకుఁ దగినదానవు నీవు. నీకుఁ దగినప్రజలు వీరు. నేనీకర్మము ఏమియు నెఱుంగక యీగ్రామమున నిలిచితిని. ఛీ! ఇఁక నిచ్చట నిలువరాదు." అని చరచర నచ్చటనుండి బయలుదేఱెను.

ఈమాటలు విని కాళిక గజగజ వణకుచు పాదములమీఁద వ్రాలి "మహాత్మా, నావలన నపరాధమైనది. నన్ను క్షమింపవలెను. నాకు శ్రీహరియెడల భక్తిగలదు గాని యిచ్చట ప్రతిష్ఠింపఁబడినపిదప నాకు భాగవతదర్శనమే కాలేదు. అగుట నాకు సౌజన్యము మఱుపునకు వచ్చినదనుట యథార్థము. శ్రీహరి యనినఁ బరమాదరమే లేనియెడల నేఁడు నిన్ను వధించుటకు సిద్ధముగ నున్న రాజభటులను నేను శిక్షించుట యెట్లు తటస్థించును? ఇఁక నీవెంత దూషించినను బడక

తీఱదు భాగవతాగ్రణీ, శాంతమువహింపుము. నేటితో నేనీ జంతు బలిని మానుకొనుచున్నాను. నాకు జ్ఞానము గలిగినది. మాంసాహారముపై నరుచిపోడమినది. ఇఁకసాత్వికాహారముసు స్వీకరించెదను. ఈ దేశపుఁ బ్రజలనందఱను జంతుబలుల నిచ్చుట మానునట్లు నియమింతును. అందఱకు నీవు హరిభక్తిగలిగించి తరింపఁజేయుము" అనిప్రార్థించెను. "క్రూరాత్మురాల వగు నీమాటలు నమ్ముట యెట్లు?" అని లాడు బావా తొలుత నచ్చట నిలుచుటకు సందేహించెను; గాని తుదకు కాళిక విశేషముగా ప్రార్థించుటవలన నంగీకరింపక తప్పదయ్యెను. తుదకెట్లో యాతఁడు అచ్చట నుండి కాళిక యాతిథ్యమును స్వీకరించుట కంగీకరించెను.

పలాయనము గావించిన భటులు పోయి రాజుతో సకలవృత్తాంతము నెఱింగించిరి. తోడనే రాజు బయలుదేఱి కాళికాలయమునకు వచ్చెను. ఆతనితోఁ గూడ అనుచరు లనేకులు వచ్చిరి. అప్పటి కప్పుడే లాడుబావా గుడి వెలువడి వచ్చి ఆప్రాంతమున నొకచోఁ గూరుచుండి హరిధ్యానము సేయుచుండెను. పలాయనముచేసిన భటులు రాజుతో నీతఁడే దీని కంతకును హేతుభూతుఁ డని చెప్పిరి. రాజు ఎదుటకురాఁగానే లాడుబావా "రాజా, నీకేల బుద్ధిలేదు? అనేకసాధుజంతువులను, మానవులను దయారహితుఁడవై కాళికకు బలియిచ్చుచున్న నీవు కుంభీపాకనరకమునఁ గూలఁబడిపోయెదవు. నీకు ఇఁకగతిలేదు. ఇఁకనైన బుద్ధి తెచ్చుకొని మసలుము" అని మందలించెను. అందఱిలోఁదన్నిట్లు నిందించుటచే రాజు ఆగ్రహముహోగ్రుఁడై "యీసీచునిఁ గొనిపోయి పాడునూతిలోఁ బడవేసి పైని పెద్ద బండరాతినిఁ బడవేయుఁడు" అనియాజ్ఞాపించెను. తోడనే రాజభటులు ఆపనిఁ జేసిరి. అందులకుఁగూడ లాడు బావా యేమియు విచారింపక నూతిలోఁ బడిపోవునపుడు సైతము శ్రీహరీయని హరిధ్యానము సేయుచుండెను. ఇది యైపోయిన తరువాత రాజు కాళికాలయమునకుఁబోయి దేవికి సాష్టాంగపడి "తల్లీ, సెలవునకు బద్ధుఁడను" అని యెదుట నిలిచెను. అంత దేవి "రాజా, నేఁటినుండి నేను బలులనుస్వీకరింపను. నాకు సాత్వికాహారమే కావలయును. నేఁటినుండి నీవు హరిభజనము ప్రారంభింపుము. ఈ దేశప్రజలకుఁ గూడ నట్లు సేయ నాజ్ఞాపింపుము. నేఁడిక్కడకునిర్హేతుకకటాక్షముతోఁ జనుదెంచినలాడు

బావా అను భాగవతాగ్రేసరునిఁ బూజించి యాతనివలన నుపదేశ
ము ను బడయుము" అని యాజ్ఞాపించెను; గాని బూజించుటకును, ఉప
దేశమును బొందుటకును ఇప్పుడు లాడుబావా యెక్కడ నున్నాఁడు?
రాజు తాను వివేకభ్రష్టుఁడై చేసిన పనియంతయు దేవికి విన్న
వించి "తల్లీ, తెలియకచేసిన యీయకృత్యములకు ఈసేవకుని రక్షింపు
ము"అనిప్రార్థించెను. అదివిని దేవి ఇఁక రాజుపైఁ గోపపడినను బ్రయో
జనము లేదని తలంచి "ఇప్పుడైనను జెడిపోయిన దేమియు లేదు.
వెంటనే పోయి ఆభాగవతోత్తమునిఁ బైకిఁ దీయింపుము. భగవద్భక్తు
లకు అంతలోఁ బ్రాణాపాయము సంభవింపదు" అనిచెప్పెను. రాజు
ఆజ్ఞాబద్ధుఁడ నని చెప్పి వడిగఁబోయి తొలుత బండరాతినిఁ దీయింపఁ
బ్రయత్నించెను గాని యెన్నివందల మంది ప్రయత్నించినను అది
కదలదయ్యెను. ఇఁకఁ జేయునది లేక రాజు "ఇంత పట్టుపట్టినను రాని
రాతి క్రిందఁబడిన భాగవతుఁడు జీవించియుండుట పొసఁగదు" అని
చెప్పి ఆప్రయత్నమును మానుపించి "దేవి హరిభక్తిని బోధించినది.
హరిభజనము సేయుమని నియమించినది. అట్లే చేసెదను, కొన్నిదిన
ములు గడచునప్పటికి సదాచార్యుఁడు లభింపకపోఁడు" అని తలఁచి
హరిసేవ సేయుఁడని ప్రజల కందఱకు నాజ్ఞాపించెను ఆదినముమొదలు
కొని దేశమునందలి వారెల్లరును హరిపూజాధురంధరులైరి.
అట నూతిలోఁ బడిపోయిన లాడుబావా భగవత్కటాక్షముచేఁ
జెక్కు చెదరక యుండెను. ఆతఁడు చచ్చిపోవలయు నని రాజు త్రోయిం
చిన బండరాయి గొడుగువలె నుండి వర్షాతపాదులవలన నాతని కేమి
యు బాధ కలుగకుండున ట్లుండెను.నూతి నావరించుకొనియున్నలతాగు
ల్మాదులకుఁ దేనెపట్టు ఉండెను. దానిలో నుండి లాడుబావా చెంతకు
మధుధార పడుచు లాడుబావాకు జీవనాధారమై యుండెను. ఆహా
భగవద్భక్తులమహిమ తెలుప్రమాణవులు దుశ్చింతలును దుశ్చేష్టలునువారి
నేమిసేయఁగలవు? రాతిలో నుండు కప్పకుఁగూడ జీవనాధారముచూపు
పరమేశ్వరుఁడు తన భక్తులకుఁ గూర్పరాని దేమిగలదు? ఆరాతిసాహా
య్యమున వర్షాతపములవలని బాధలు లేక, మధువు నానుచు ఆభక్త
శిఖామణి నిశ్చలముగ భగవద్ధ్యానము సేసికొనుచుండెను.
మూర్ఖులు ఏపనిచేసినను జాలఁ దీవ్రముగనే యుందురు.

రాజు ఇంతకుఁ బూర్వము కాళికను జంతుబలులు నరబలులుమున్నగు నవి సమర్పించుచు నెంతశ్రద్ధతోఁ బూజించుచుండెనో యిప్పుడు అంత శ్రద్ధతో భగవద్ధ్యానము సేయఁదొడఁగెను. అగుట నాతనిసేవకు భగవంతుఁడు మెచ్చి సాక్షాత్కరించి "నీభక్తిశ్రద్ధలకు మెచ్చితిని. నీవు ఇప్పుడు చూపునది మూఢభక్తి నీవు సదాచార్యు నాశ్రయించినఁగాని జ్ఞానవైరాగ్యములు గలుగవు. నీకు జ్ఞానవైరాగ్యములను గలిగింపఁగల సదాచార్యుఁడు లాడుబావా తక్క మఱియొకఁడు లేఁడు. కావున నాతని నాశ్రయింపు" మని చెప్పెను "మహాత్మా, లాడుబావా ఇప్పుడు ఎక్కడ నున్నాఁడు? అవివేకినై నేనాతనిం జంపించితిని"అని రాజు విన్నవించెను."సందియము వలదు.రాజా,నీవంటివారు భాగవతులకుఁబ్రాణాపాయము గలిగింపఁజాలరు.నూతిలోనిరాతిని దొలంగించి చూడు"మని చెప్పి శ్రీహరి యంతర్హితుఁ డయ్యెను భగవంతుని యాజ్ఞానుసారముగ రాజు బండరాతిని దీయింపఁగా నది సులభముగాఁ బైకి వచ్చెను. చూడఁగా దానిక్రింద లాడుబావా భగవద్ధ్యాననిష్ఠుఁడై యుండెను. లాడుబావా రాజును గాంచి "పరమైకాంతస్థలమున శ్రీహరిభజనము వలన నానందపరవశుఁడనై యున్న నన్నేల కదిపితివి?" అని యడిగెను. రాజు మాఱుపల్కకుండ నాతని పాదములమీఁద వ్రాలి "మహాత్మా, క్షమింపవలయును. నేను కేవలము అవివేకిని పాపకర్ముఁడను. మీమాహాత్మ్యము నెఱుఁగక మీయెడలనెగ్గుచేసితిని.ఈదీనునికి బుద్ధివచ్చినది. శ్రీహరి సాక్షాత్కరించి నన్ను మీపాదముల నాశ్రయింప నియోగించెను. భాగవతాగ్రగణ్యా, నాయెడల దయయుంచి నానగరునకుదయజేసి నాకు జ్ఞానోపదేశము చేసి మోక్షసాధనము ననుగ్రహింపవలయును"అనిప్రార్థించెను.అప్రార్థనకుఁగరముసంతసించి లాడుబావా,"రాజా, నీవు నాకు చేసినయెగ్గేమియున్నది! పండ్రెండు సంవత్సరములు పరమైకాంతస్థలములో దాఁచి నాహరిధ్యానము నచంచలము గావించిన మహోపకారి వగు నీఋణము నేనెట్లు తీర్చుకొందును?" అని మీఁదికెక్కివచ్చెను.అంత రాజు భద్రగజము మీఁద నెక్కించి లాడుబావాను మహావైభవముతో నగరమంతయు నూరేగించి తన నగరునకుఁ గొనిపోయి అర్హస్థలమున విడియించెను.

యుక్తసమయమున లాడుబావా రాజునకు శ్రీకృష్ణమంత్రోప

దేశము గావించెను. ప్రజలుగూడ ననేకు లాభాగవతాగ్రేసరు నాశ్రయించి మంత్రోపదేశముఁ బడసిరి. దేశ మంతయు లాడుబావాను మహాభక్తితోఁ బూజించెను. లాడుబావా కొన్నిదినము లచ్చటనుండి ప్రజల నందఱ నేకాదశీవ్రతనిష్ఠులం గావించి అనేకతీర్థక్షేత్రములు సేవించి తుదకు స్వస్థలము సేరి అవసానమున నీశ్వరసాయుజ్యమును బడసెను. ఇట రాజుగూడ బ్రదికియున్నంతకాలము శ్రీహరిని బూజించి అంతమునఁ బరంజ్యోతిలో లీన మయ్యెను.

“సీ. సర్వేశ కల్పాంతసమయంబునందు నీ, వఖిలప్రపంచంబు నాహరించి
యనయంబు శేషసహాయుండవై శేష, పర్యంకతలమునఁ బవ్వళించి
యోగనిద్రారతి నుండి నాభీసింధు, జస్వర్ణలోకకంజాతగర్భ
మందుఁ జతుర్ముఖు నమరబుట్టించుచు, రుచినొప్పు బ్రహ్మస్వరూపివైన
గీ. నీకు సృష్ట్యాద నత్యంతనియమ మొప్ప, భవ్యచారిత్ర పంకజపత్రనేత్ర
చిరశుభాకార నిత్యలక్ష్మీవిహార, యవ్యయానంద గోవింద హరి ముకుంద.”
(భాగ. స్కం. 4. ప. 287.)

---

30. బోధలబావా.

పాండురంగక్షేత్రమునకు సమీపమున ధామణము అను నొక గ్రామము ఉండెను. అందు మాణకోజీబోధల యను పేరుగల భగవద్భక్తాగ్రేసరుఁ డగుశూద్రుఁడు ఒకఁ డుండెను. ఆతనిభార్యపేరు మమతాబాయి. కుమారుని పేరు యమాజీ. కోడలిపేరు భాగీరథీబాయి. ఆయింట నీనలుగురే నివసించుచుండిరి. నలుగురునుగూడఁ బరమభక్తాగ్రేసరులు. శ్రీహరిభజన మనిన వారికి మహానందము. సాధుపూజయు, దీనపోషణమును వారికి నిత్యకృత్యములు. ఇంటికివచ్చినయతిథికి షడ్రసోపేతముగ భోజనము పెట్టుట యనిన వారికి వరాలమూట లభించినట్లుండును. వారి యింట నెప్పుడు శ్రీహరినామము విన్పించుచుండును. ఆపరమభక్తశిఖామణులు ఏకాదశినాఁడు పండరిపురమునకుఁ బోయి యుపవసించి స్వామిని సేవించి ద్వాదశినాఁడు అనేకులను మృష్టాన్నసంతృప్తుం గావించి పాండురంగని కానందమును గలిగించి స్వస్థలమునకుఁ బోవుచుందురు.

ఇట్లుండఁగా నాదేశమున ననావృష్టిదోషముచే భరింపరాని క్షామము సంభవించెను. బీద లందఱును అన్నములేక మలమల మాడి పోవసాగిరి. సామాన్యసంపన్నులుగూడ కొలఁదిదినములయందే నిరుపేదలై 'అన్నమో రామచంద్రా' యని యేడువసాగిరి. బోధలబావా దినమునకు అనేకశవములు తన కండ్లయెదుటనుండి పోవుటఁ జూచియు, ప్రజలందఱును జిక్కి శల్యావశిష్టులై యుండుటఁ జూచియు సహింపలేక భార్యను గుమారుని, గోడలినిఁజూచి "దుస్సహ మగు కఱవువలన దేశములో ప్రళయము సంభవించుచున్నది. బీదలయిండ్లన్నియు జనశూన్యము లై పోవుచున్నవి. చిన్నిచిన్నిపల్లెలలోఁ గూడ నేదినమున కాదినము మృతులసంఖ్యను నిర్ణయించుట చాల కష్టముగ నున్నది. అన్నార్తుల దీనాలాపములవలన బ్రహ్మాండము బ్రద్దలై పోవుచున్నది. అనేకులు సంపన్నులు ఈస్థితినంతయుఁ జూచియుఁ దమ్ముకొనట్లు ఉపేక్షించుచున్నారు. సర్వేశ్వరుఁడు మన కింత సంపద నిచ్చినాఁడు. మనము గూడ నీసమయమున దానిని రక్షింపఁజూచెద మేని పెట్టెలలోని రూపాయలు పెట్టెలయందే మాయమైపోవును. గాదెలలోని ధాన్యము గాదెలయందే హరించి పోవును. చేలలోని సస్యము చేలయందే మాడి పోవును. మనపశువు లన్నియు మాయమైపోవును. మన పూర్వపుణ్యము నశించి దాని స్థానమున ఘోరపాపము నిలుచును. ఉన్నట్లుండఁగా మనము పిడుగుపడి భస్మమైపోదుము. శ్రీమత్పాండురంగని కోపమునకుఁ బాల్పడినవారి బ్రతుకు వ్యర్థము. కావున మనము మనచేతనైనంతవఱకును దీనులకు సాయముసేయుద"మని చెప్పెను.

ఈమాటలకు ఆయింట వ్యతిరేకభాషణమే రాలేదు. అందఱు "ఇంతకంటె పుణ్య మేమున్నది!" యని యుబ్బిపోయిరి. రణవీరుని ఖడ్గము రక్తాభిషిక్తమైన వెంటనే మఱింత విశద మగును. అట్లే వారి కరములు దేశమున సంభవించిన క్షామమువలన దానధర్మములు సేయుటలో మఱింత ముందంజ వేయసాగెను. ఎవరికిఁ దోఁచినట్లు వారు పంచిపెట్టిరి. ఎవరి కెంత శక్తియున్నదో అందఱకు అన్నపానముల నొసంగిరి. వారికి అప్పుడు విసుగు అనునదియే తోఁపలేదు. కేవలము ఆనందము. బ్రహ్మానందము వారి హృదయములయందు నిండి తొలుకాడసాగెను. ముఖపద్మములు వికసించి దయామృతసారమును వర్షింప

సాగెను. బోధలబావా కుటుంబపు మహోదారవితరణము నాలించి దేశదేశములనుండి దీనజనప్రవాహము వచ్చి ధామణగ్రామమును ముంచివేయసాగెను. అదిచూచి ఆగ్రామవాసులు అత్యాశ్చర్యపడసాగిరిగాని ఆ ర్తజనప్రవాహము దీనపోషకుల ఆనందసాగరమును బెంపు సేయునదియే గదా!

ఇట్లు దీనులు అవిచ్ఛిన్నముగ నన్నార్తులై వచ్చుచుండినను బోధలబావాయు నాతనిభార్య మున్నగువారును ఏకాదశీదినమున పాండురంగక్షేత్రయాత్ర మానకయే యుండిరి. ఎడతెగని యీదీనరక్షణమువలన బోధలబావాచెంత నిలువయున్న అసంఖ్యధనమును అమేయధాన్యరాసులును వ్యయమైపోయెను. అందుల కాతఁడేమియుఁ జలింపక భార్య యొడలిమీఁదను, గోడలి శరీరముమీఁదను గలనగల నిమ్మని యడిగెను. ఆతఁడడుగుటయే తడవుగా నంతకుఁ బూర్వమే యట్లు సేయుట కుద్యుక్తులై యున్న యారమణీమణులు మహానందముతోఁ దమ నగల నొలిచి యిచ్చివేసిరి. ఆనగల విక్రయమువలన నసంఖ్యధనము వచ్చెను. మఱల వారు యథాప్రకారముగ నార్తరక్షణము ప్రారంభించిరి; గాని మఱలఁ గొన్ని దినములయందే యాధనము గూడ నైపోయెను. ఋణ మిచ్చువా రెవరును లేకపోయిరి. అగుటచే బోధలబావాయు యమాజీయుఁ గూలినాలి చేసి దానివలననే కొందఱుదీనులను గాపాడఁదొడంగిరి. అట్టి కష్టసమయములోఁ గూడ నాతఁడుమనశ్చింత నెఱుంగక ఒక్కదీనునకైన క్షుద్బాధ తీర్పఁగలుగుచున్నందులకుఁ బరమానందభరితుఁడు కాసాగెను.

ఇంతలో నేకాదశి సమీపించెను. చూడఁగా నొక్క పయిసయైనఁ జేత లేకపోవుట గాంచి బోధల అడవికిఁ బోయి కట్టెలుకొట్టి తెచ్చి మూఁడుకాసులకు అమ్మి పండరిపురమునకుఁ బోయెను. మొదట నాతఁడు అచ్చటఁ జంద్రభాగయందు స్నానముచేసి సంకల్పముచెప్పిన బ్రాహ్మణునకు ఒక కాసు నిచ్చెను. మఱియొక కాసుతో అరఁటిపండ్లు ఖర్జూరపుఫలములు, గంధమును గొని పరిశుద్ధహృదయుఁడై యాలయమునకుఁ బోయి "పండరినాథా! రిక్తుఁడను.ఈక్షుద్రుని కానుకను అంగీకరింపవలయు"నని ప్రార్థించి స్వామికి సమర్పించి యుపవాసము చేసి ధ్వజస్తంభముచెంతఁ గూర్చుండి రాత్రి నాల్గుజాములును హరి

భజనమునఁ గడపెను. మఱునాఁడు ఉదయమున చంద్రభాగానదికిఁ బోయి స్నానముచేసి మిగిలిన కాసునకును పిండినిఁ గొని తీరమునఁ గూర్చుండి "అయ్యో, మృష్టాన్నము నొసంగి నే నింతవఱకు ననేక సాధువులను బూజించితిని; గాని నేఁడు ఈరవంతపిండియు నెవరి కిచ్చెదను? ఇది యొకబాలుని క్షుద్బాధ తీఱుటకైనఁ జాలదే ? నాస్థితి నెఱింగి సచ్చింతతో నన్ను దరింపఁజేయుటకు ఈరవంతపిండియు నే మహానుభావుఁడు స్వీకరించును? ఒక్కయతిథినైన అన్నతృప్తునిఁగావింపక యేకాదశీ వ్రతము నాచరించిన నేను ఈద్వాదశీపారణ నెట్లు సేయుదును? ద్వాదశినాఁడు ఇతరునకు ఇడకుండ భుజించువానికంటెఁ బాపాత్ముఁడు ఉండఁబోఁడుకదా!" యని చింతింపసాగెను.

ఇట్లుండఁగా భగవంతుఁడు వృద్ధబ్రాహ్మణరూపియై జీర్ణవస్త్రమును ధరించి వడవడ పడకుచు "ఓమహానుభావా, నీవు ప్రతిద్వాదశినాఁడును అనేకవేలఅతిథులను మృష్టాన్నతృప్తులను జేయు పుణ్యాత్ముఁడవు. నే ననేకమాఱులు నీయాతిథ్యమును బడసి యానందించియున్నాను. నేఁడు నాకు ఇంత యన్నము పెట్టినవారు కాన్పింపరైరి. సాధుజనచూడామణీ,తీరని క్షుద్బాధ నాప్రేవులను మాడ్చివేయుచున్నది. నాయాఁకలి తీర్చి నన్ను రక్షింపుము"అని ప్రార్థించెను. అందులకు బోధల చాలఁ జింతించుచు "మహాత్మా! నాయొద్ద నేయి లేదు. చక్కెఱ లేదు. పాలు లేవు. కొంచెము ఉప్పుసైతము లేదు. ఉన్న పిండియైనను నీక్షుత్తునుఁ బోఁగొట్టుటకుఁ జాలదు. ఈరవంతపిండిని సద్బ్రాహ్మణుఁడవగు నీకు చేతులార నెట్లు ఈయఁగలను ? పిలిచి భోజనము పెట్టవలసినదానికి మాఱుగా అడిగినను గడుపునిండఁ బెట్టుటకుఁజాలని స్థితిలో నున్నాను" అని దీనుఁడై విన్నవించెను. "అయ్యా, నీవు అట్లు విచారింప నక్కఱ లేదు. ఎంత యున్నను నాకుఁ జాలును. క్షుధాతురుఁడనై యున్ననాకు రుచితో నేమిపని? ఇఁక మాఱుపల్కక నాకు ఆపిండియే యిమ్ము" అని ప్రార్థించెను. తోడనే బోధల పిండి యాబ్రాహ్మణున కిచ్చివేసెను. బ్రాహ్మణుఁడు దానినిఁ దన జీర్ణవస్త్రాంచలమున ముడిచికొని "భక్తచూడామణీ, నన్ను ఎవరును జేరనీయరు. కావున నేను ఇచ్చటనే ఈపిండి రొట్టెలుచేసికొని భుజింతును. కావున నీవు ఎండుపిడకలను దెచ్చి యిమ్ము" అని చెప్పెను.

బోధల పరమానందభరితుఁడై ఆప్రాంతమున వెదకి ఎండుపిడక లను దెచ్చెను. బ్రాహ్మణుఁడంతకుఁ బూర్వమే చంద్రభాగలో స్నానముచేసి ఒక పెంకును కల్పించి సిద్ధముగా నుండెను. అంత నాతఁడు బోధలబావా తెచ్చిన యెండుపిడకలను నిప్పుతో నంటించి రొట్టెలు కాల్చుకొనుటకు సిద్ధముగా నుండఁగా రుక్మిణీదేవి యీసంగతి యంతయుఁ దెలిసి వృద్ధబ్రాహ్మణసుమంగలియై వచ్చి "అయ్యో, నీవు ఒంటిగా నేలవచ్చితివి? నీవు ఒకచోఁ గూర్చుండుము. నేను రొట్టెలు కాల్చెద"నని చంద్రభాగలో స్నానముచేసి వచ్చి రొట్టెలు కాల్చుటకుఁ గూర్చుండెను. ఆసమీపమునందే యున్న భక్తుఁడు ఇది యంతయుఁ జూచి "అయ్యో, ఒక్కనికే చాలని యీపిండికొఱకు ఇరువు రాసించి యున్నారు. ఇరువురునుగూడ ఆఁకట నకనక మాడుచున్న వృద్ధులు. వీరి స్థితి చూడఁగా నాకడుపు చెఱువై పోవుచున్నది" అని వగవసాగెను.

ఆవృద్ధబ్రాహ్మణి జగజ్జనని యగు రుక్మిణి యగుటచే కలిపినపిండి కలిపినట్లే యుండఁగా రొట్టెలు గుట్టలుపడెను దానినిఁ జూచి బోధల వింతపడుచుండఁగా నామె "యీరొట్టెలు మనకును, ఈమహాత్ములకును గూడ సరిపోవును; గావున మీరిరువురును ముందు భుజింపుఁడు తరు వాత నేను భుజించెద" నని పలికెను. అపుడు బోధల మహాత్ములారా, మీప్రభావముఁ జూడఁగా దివ్యముగా నున్నది. మీరు నిజముగా శ్రీ రుక్మిణీకృష్ణులేగాని వేఱుగాదు. ఆహా, నేనెంతధన్యుఁడను. తల్లీ! నీవని నట్లు దయయుంచి యొసంగెద రేని మీభుక్తశేషమును నేను భుజించి తరింతు" నని ప్రార్థించెను. అంత నావృద్ధదంపతులు వలసినంతవఱకును భుజించి శేషము భక్తున కొసంగిరి. బోధలయు నాభగవద్భుక్త శేషము నతిభక్తితో భుజించి "ఆహా! ఈరొట్టెలు ఘృతక్షీరశర్కరా విహీనములైనను అమృతమునకన్న మధురములై యున్నవి. ఆదంప తులు లక్ష్మీనారాయణు లనుట కింతకంటె నేమి కావలయును! ఆహా, నాభాగ్యము నేమని చెప్పుదును?" అని యానందించి మఱల నాలయ మునకుఁబోయి "శ్రీపతీ, దినదినము నిచ్చట నీకు అనేకులు దివ్యభోగ ములను జేయించుచున్నారు.ఆమధురపదార్థము లన్నియువీడి నే నిచ్చిన పిండినే యాశించితి వేల?" అని మొరకరించి ప్రార్థింపఁ బండరినాథుఁ డాతనికి ఏకాంతదర్శన మొసంగ "భక్తాగ్రేసరా, నీవు కేవలము

అమాయికుఁడవు. భజనచేసినవారందఱును భక్తులే యనియు, అన్న దానము చేసినవారందఱును సేవానిరతులే యనియు,ముక్కుపట్టుకొని కూర్చుండువారందఱును మునులే యనియు, కాషాయాంబరములను ధరించినవారందఱును విరాగులేయనియు, పద్మాదికములగు నాసనములువేసికొని కూర్చుండువారందఱును యోగులే యనియు భావించుచునీయోగ్యత నేమనవలయును. ఇచ్చట శ్రీహరీయని యాక్రోశించువారు అనేకులు గలరు గదా? అందఱిలోఁ త్రికరణశుద్ధిగ నన్నునమ్మియున్నవారు వ్రేళ్లపై లెక్కింపఁదగినవారు మాత్రమే యుందురు. తక్కినవారందఱును లోకవిడంబనార్థము, దంభముకొఱకు, పసులు తమ్ముఁబొగడవలయు నని మాత్రమే యిక్కడకు వచ్చి భజనము చేయువారుగను, అన్నదానము సేయువారుగను, ధ్యానము సేయువారుగను ఉన్నారు. నేఁడింతియు చాలును. రేపు నీకు ఇందులకు ఉదాహరణము చూపెదను" అని చెప్పి యంతర్హితుఁ డయ్యెను.

పాండురంగని యాజ్ఞాప్రకారము బోధలబావా అచ్చటనే యుండిపోయెను. నాఁడు ఒకవర్తకుఁడు అప్పురమునకు వచ్చి స్వామిని సేవించి వేయిమంది బ్రాహ్మణులకు అన్నదానము చేయుటకు నిశ్చయించుకొని చంద్రభాగానదీస్సైకతస్థలమునఁ బందిళ్లు పాకలు వేయించి ఆసమారాధనమును నెఱవేర్చుటకుఁ దగినవారిని నియమించెను. రెండుజాములగునప్పటికి వంటలయ్యెను. వర్తకుని యాజ్ఞాప్రకారము వేయిమంది బ్రాహ్మణులును వచ్చి బంతులుగఁటి కూర్చుండిరి.వడ్డన పూర్తియయ్యెను. అప్పుడు పాండురంగఁడు వృద్ధబ్రాహ్మణరూపియై బోధలబావాను వెంటఁబెట్టుకొని వచ్చి "వత్సా! నీవు ఇచ్చటఁ గూర్చుండి సకలమును జూచుచుండుము"అని యాతని నొకచోఁ గూర్చుండ నియమించి తాను వడఁకుచుఁ గఱ్ఱ నానుకొని పోయి "మహానుభావులారా, నాకు మిక్కుటముగ నాఁకలి యగుచున్నది నేను ఈయాఁకలిని సహింపఁజాలకున్నాను. క్షణము ఉండినఁ బ్రాణములు పోవును; గావున నాకింత ప్రసాదము పెట్టుఁడు" అని ప్రార్థించెను. అదివిని అచ్చటి కార్యనిర్వాహకులు రుసరుసలాడుచు "తొలఁగిపొమ్ము. మేము వేయిమందికిమాత్రమే సమారాధనము సేయుటకు సంకల్పించుకొంటిమి. మేము నిశ్చయించుకొనిన ప్రకారము వేవురును వచ్చియున్నారు. ఇఁక మేమెవ్వరికి నన్నమిడఁ

జాలము. వేగముగ నవ్వలకుఁబొమ్ము"అని యదలించిరి.అప్పుడే సమారాధనము చేయించు వర్తకుఁ డక్కడకు వచ్చెను. వృద్ధుఁడు వర్తకుని యెదుటకుఁ బోయి"మహాత్మా,నేను శతవృద్ధుఁడను,ఎక్కడకును బోఁజాలను. సహింపరాని ఆఁకలిబాధచే నాకు శోష వచ్చుచున్నది. పట్టెఁడన్న మిచ్చి రక్షింపకున్నచో నేనిచ్చటఁ బడిపోదును"అని ప్రార్థించెను. అదివిని వర్తకుఁడు చాలఁ గోపపడి "ఎన్నివిధములఁ జెప్పినను నీకు బుద్ధి లేదా! నేను వేయిమందికిఁ బైన నొక్కఁడు వచ్చినను అన్నముపెట్టఁజాలను. నీమట్టునకు నీవు ఒక్కఁడ నని చెప్పుచున్నావు; గాని నిన్ను అంగీకరించిన మఱియొకఁడు వచ్చును.వానికి పిదప వేఱొకఁడు వచ్చును. ఇంకొకఁడు వచ్చును.ఇట్లు అన్నమునకు వచ్చువారికి అంతము ఉండదు. మఱియొకచోటికిఁ బొమ్ము? ఇక్కడ ప్రయోజనము లేదు." అని గదుముచుఁ బలికెను. ముసలిబాపఁడు అంతటితో నూరకుండక "అయ్యా, వేయిమందికి మృష్టాన్నము పెట్టుచున్నావు. ఇఁక నొక్క వృద్ధునకు గుప్పెఁ డన్నము పెట్టఁజాలవా?"యని దీనముగ నడిగెను వర్తకుఁ డీతడవ కోపము నాపుకొనఁజాలక నౌకరులనుజూచి"యీపిశాచము నవ్వలకు గెంటివేయుఁడు"అని సెలవిచ్చెను.ఆజ్ఞ ముగిసియు ముగియక పూర్వమే యమభటుల ననుకరించు నాభటులు వృద్ధుని మెడమీఁదఁ జేతులు వేసి గెంటుకొని వచ్చి బైట దూరముగఁ ద్రోసివేసిరి. అదిచూచి బోధలబావా "హరిహరీ,ఎంతకష్టము!ఎంతకష్టము! ఓ భటులారా,వలదు వలదు. భగవంతుని యాగ్రహమునకుఁ బాల్పడకుఁడు" అని పలుకుచుఁ బరుగుపరుగునవచ్చెను.బోధలబావా యచ్చటికి వచ్చునప్పటికి భటులు వృద్ధుని గెంటివేసి నాలుగ్గుదుపోట్లు పొడిచి వెడలిపోయిరి.అదిచూచి మాటలేక నిలిచిపోయియున్నబోధలనుజూచి భగవంతుఁడు"వత్సా, నీసందేహము తీఱినదా?"యని పలుకుచు నంతర్హితుఁడై పోయెను. తోడనే చూచుచుండఁగాఁ బెద్ద సుడిగాలి యొకటివచ్చి పందిలి యాకసమున కెగిరిపోయెను ఆకులలో వడ్డింపఁబడిన పదార్థములన్నియు నిసుకతో నిండిపోయెను.వెంటనే ఇదియేమి మహోపద్రవము దేవుఁడా యని భోజనమునకు వచ్చిన బ్రాహ్మణు లందఱును జెట్టొక పిట్టయై పాఱిపోయిరి. ఇఁక నచ్చట వృద్ధుని గెంటివేసిన భటులును,కార్యనిర్వాహకులును సమారాధనము నేర్పఱిచిన వర్తకుఁడును మాత్రము

నిలిచియుండి తెల్లవోవుచుండిరి. ఇంతలో వాయుదేవుఁడు విజృంభించి గాడిపోయియుం దున్నకణకణలాడు చింతనిప్పులతోఁడను చంద్రయిసుకతోఁడను వారిని వాయించి వాయించి విడిచిపెట్టెను. బోధల యిది యంతయుఁ జూచి లోకుల సంభవ్ర త్తికి రోసి భగవంతుని మహానుహిమలను గీర్తించుకొనుచు వెడలిపోయెను.

బోధలకు మార్గమధ్యమున క్షుద్బాధ యధికమయ్యెను. అయినను దాని నాతఁడు లెక్కసేయక భగవంతుని లీలలనుగీర్తించుకొనుచు నడువసాగెను.మఱికొంతతడవునకు బాధ యధిక మయ్యెను. నడుచుటకు శక్తి లేకపోయెను. అయినను అతఁ డేమిచేయఁగలఁడు? మఱికొంతదూర మెట్లో ప్రాణములు బిగబట్టుకొని పోవుచప్పటి కెదుటనొక ఫలవనము కాన్పించెను.అప్పుడే వనమునుండి యెటకో పోవుచు ద్వారముచెంతకు వచ్చియున్న యొక వృద్ధాంగన అలసిసొలసియున్న బోధలనుఁ జూచి "అక్కటా, నీవెంత బడలియున్నాఁడవు. అన్నము లేకపోవుటవలన నీకండ్లు గుంటలుకట్టుకొని పోయినవి. దవడ లెండిపోయినవి. కడుపు నకనకలాడుచున్నది. కాళ్లు వడనడ వడఁకిపోవుచున్నవి. అయ్యో, నీవింత కష్టముతో నేలపోవలెను? అయ్యో, మాతోఁటలోనికి దయచేసి ఫలములు తిని నీరు ద్రావి విశ్రమించి మఱిపొమ్ము నాయనా" యని బతిమాలెను. బోధల తొలుత నామె నొప్పించి ముందునకుఁ బోఁజూచెను;గాని యామెనిర్బంధ మధికమగుటచేఁ బోఁజాలకపోయెను. తుదకాతఁడు ఆమెవెనుక బయలుదేఱితోఁటలోనున్న వారి పర్ణశాలకుఁ బోయెను. అందు యజమానుఁడు గూర్చుండియుండెను. యజమానురాలు బోధల నాతనికిఁ జూపి యాతని స్థితి యంతయుఁజెప్పెను.అది విని యావృద్ధుఁడును బోధల నెంతో యాదరము చేసి పర్ణశాలలోనికిఁ గొనిపోయిఅర్ఘ్యపాద్యాదులచేఁ బూజించి పీఁటవేసి కూర్చుండఁ బెట్టెను. ఇంతలో యజమానురాలు రొట్టెలు, ఫలములు, పాలు పాత్రములలో నుంచుకొని వచ్చి బోధలయెదుట నుంచెను. బోధల వారికిఁ గృతజ్ఞతఁ దెలుపుచు వారి నిర్బంధమువలనఁ గడుపునిండ భుజించెను. ఆవృద్ధులిరువురును గూడ "నాయనా, మొగమోటపడకుము. నీవుకడుపునిండ భుజింపకుండ వెడలిపోయితివేని మాకు ఘోరతరపాపము చుట్టుకొనును" అని బతిమాలిరి. పాత్రములలోరొట్టెలు, ఫలములు,పాలు మిగిలియున్నను

మఱికొన్ని తెచ్చివేసి "నాయనా, మొగమోట పడితివేని నన్ను జంపు కొని తినినట్లే. తండ్రీ, ఈరెండుపండ్లే భుజింపుము. ఈయొక్క రొట్టెయే భుజింపుము. ఈగ్రుక్కెడుపాలే త్రాగుము. బాబూ, నీవెంతదూరము పోవలయునో, మఱల నెంతసేపటికి అన్నముదొరకునో, తండ్రీ, కడుపార భుజింపుము" అని మాటిమాటికిని బతిమాలుచు మొగమోటపెట్టెను. ఆమె నిర్బంధమువలన నాతఁడు కడుపునిండ భుజించి "అమ్మా, ఇఁక నన్ను బాధింపకుము. నీనిర్బంధ మిఁక నన్ను బాధించును" అని చెప్పి దాహముపుచ్చుకొని వారికిఁ గృతజ్ఞతాపూర్వకముగ వందనములాచరించిపోవుటకు వారిసెలవుఁబడసి లేచెను. చూచుచుండఁగనే క్షణములో నాతోఁటయుఁ బర్ణశాలయు వృద్ధదంపతులును మాయమైపోయిరి. కనుమూసి తెఱచునంతలో బోధల బైట యెండలో నిలిచియుండెను. ఇది చూచి యాతఁడు పరమాశ్చర్యచకితుఁడై "ఇది యంతయుఁ బాండురంగనిలీల" యని భావించి "దేవదేవా, సర్వేశ్వరా, లోకజననీ, ఈదీనునికొఱకు, ఈక్షుద్రుని నిమిత్తము మీరెంత కష్టపడుచున్నారు?" అని యనేకవిధములఁ గొనియాడి, తద్గుణకీర్తనమునఁ బ్రవృత్తుఁడై మరల నూరుదారి పట్టెను.

ఒకనాఁడు బోధల జొన్నచేనికిఁ గాపుఁడుండెను. అయినను అతఁడు భగవద్భజనమున లీనుఁడై యుండుటచే పక్షులువచ్చి యథేచ్ఛగ జొన్నలు తినిపోవుచుండెను. ఆతఁడు గూడ స్వయముగ క్షుధార్తులగు పథికులకు జొన్నకంకులు విఱిచి యీయఁ జొచ్చెను. ఇట్లు ఉండఁగా నాతనిభార్య అన్నము తీసుకొనివచ్చి జరుగుచున్నదిఅంతయుఁ జూచి "నాథా, ఇట్లయిన నేనేమి చెప్పఁగలను? ఇది కేవలము మనయనుభవమునకే వినియోగింపఁదగినది యైనచో నెట్లయినను నాకు విచారము లేదు; గాని ఈజొన్నలు విక్రయించుటవలన వచ్చుధనము సాయమునసే మనము దొరతనమువారికిఁ బన్నులు చెల్లింపవలసి యున్నది. పన్నులుఈయకున్నచో రాజభటులు యమయాతనలు పెట్టెదరు. ఇది నీవు ఎఱుఁగనిదియా? ఇఁక నిట్లు చేయకుము చేసితివేని పండరినాథుఁడే యాన" అని చెప్పిపోయెను. మఱలబోధలబావా నృత్యము ప్రారంభించెను. ఆతఁడు పరవశుఁడై యుండఁగాఁ గొందఱు పథికులు వచ్చి "మహాత్మా, మేము పండరినాథుని సేవింపఁబోవుచున్న బాటసారులము. ఆఁకట మాకడు

పులు నకనకలాడుచున్నవి. ఇఁక నొక్క యడుగైన నడువఁజాలము. తినుట కేమైనలభింపదేని క్షణమైన నిలువఁజాలము. మాయెడలఁ గరుణ వహించి మాక్షుద్బాధను దొలగింపుము" అని ప్రార్థించిరి. కొంతతడవునకు ఆతఁడు వారి ప్రార్థనమును దెలిసికొని "అయ్యా, నేను మీకు వలసిన జొన్నకంకులను నాచేతితో నిచ్చుటకు వీలులేదు. మీరే కైకొనుఁడు" అని చెప్పెను; వెంటనే బాటసారులు చేనిలో నష్టపడిరి. క్షణములో చేనంతయు కంకులులేనిదై పోయెను. అప్పుడే వచ్చిన బోధల కుమారుఁడు అదిచూచి తండ్రి నేమియు ననఁజాలక చింతాక్రాంతుఁడై కూర్చుండెను. బోధల పుత్రునిస్థితి గ్రహించి "వత్సా, ఏల వగచెదవు? ముందేమో విపత్తు వచ్చునని యిప్పుడు దీనులకు సాయము సేయకుండుటెట్టి వివేకము?" అని యడిగెను. అందులకు ఆనందించి "యమరాజ్, ఇఁక నిక్కడ నుండు టెందులకు?" అని తండ్రినిఁ దీసికొని యింటికిఁ బోయి సకలమును దల్లి కెఱింగించెను. ఆమె యందుల కేమియు జేయఁజాలక సంతోషించి యూరకుండెను.

పదిదినములు గడచిపోయినపిదప రాజోద్యోగులు కర్షకులవలన రావలసిన పన్నులు వసూలుచేయఁ బ్రారంభించిరి. ప్రతిగ్రామమునందును ఎవరైన బాగుపడుచుండినవారిని నాశనముచేయుటకును, ఎవరైన మంచిపని సేయుచుండిన ఆపనిని ధ్వంసముఁ జేయుటకును, సిద్ధముగా నుండు దుర్మార్గు లుందురుగదా! ఆసమయమున అట్టివారు కొందఱు బోధలవద్ద పన్ను ముందు వసూలుచేయుఁడు. ఆతఁడు దినదినమును దివాలా తీయుచున్నాఁడు. పదిదినములు గడచినచో నిఁక వానివలనఁ బన్ను వసూలుకాదు" అని రాజుభటులకు చెప్పిరి. వెంటనే రాజోద్యోగులు యమదూతలవలె వచ్చి బోధల యింటిగుమ్మముమీఁదఁ గూర్చుండి నీవు సర్కారుకు ఏడువరహాల నీయవలసియున్నది. ఇప్పుడే యిమ్ము" అని నిర్బంధించిరి. చూడఁగా బోధలవద్ద మూఁడువరహాలు మాత్రమే యుండెను. తక్కిన నాలుగువరహాలును అప్పు తెచ్చి యిచ్చెదనని వారి నొప్పించి గ్రామములోనికి బయలుదేఱెను. ఆగ్రామమున నాగాబాయి యను నొక వితంతువు దుష్పథమున సంచరించి చాల ధన మార్జించి యుండెను. బోధల యామె నప్పు అడుగఁగా "చేత నొక్క కాసు అయినను లేదు. రేపు ప్రాతఃకాలమువఱకు నుండువేని

రావలసినచోట వసూలుచేసి యిచ్చెదను" అని యామె ప్రత్యుత్తర మిచ్చెను. ఈసంగతి రాజభటుల కెఱింగించి అనేకవిధముల వారిని బతిమాలుకొని తుదకు రేపు వచ్చెద మనిపించుకొనెను.

మాటయిచ్చినప్రకారము ఈయవలసినవారివలన వసూలుచేయక పోయినను పెట్టెలోనున్నవియే నాలుగువరహాలు తీసి బోధలకొఱకు నాగాబాయి ఎదురు చూచుచుండెను. ఇంతలో రాజోద్యోగులను బోధలమీఁదికిఁ బురికొల్పిన దుష్టులు ఆమెయింటికి వచ్చి "ఇదిగో వినుము. పిదప నేడ్చెదవు; బోధలకు బదు లీయకుము. ఆతఁడు పూర్తిగా దివాలా తీసినాఁడు. ఆతనివలన నీకు తిరిగి సొమ్ము రాదు. ఆతఁడు దొరతనమువారి కీయక సంసారమునకు వాడుకొనెను. పిదప రాజభటులు ఆతనినిఁ గైదులోఁ బెట్టెదరు. ఇఁక నీవు చెడవలసినదియే కదా? అదియుఁగాక, ఇప్పుడు మేము వలదనుటకు వేఱు కారణములు గూడఁ గలవు. యథార్థము చెప్పుచున్నాము. నీవు ఆతనికి బదులు ఇచ్చెదవేని నీపనిఁ బట్టెదము. నీయింటిపై నొక్క పెంకుముక్కయైన నుండదు. నీతలపై నొక్క వెంట్రుకయునుండదు. ఆపైని నీచిత్తము" అని చెప్పిపోయిరి. వారు చేయు దుండగముల నామె యిదివఱలో నెఱింగియున్నది గావున వారికి వ్యతిరేకము సేయఁజాలక నాగాబాయి మఱల బోధల వచ్చియడుగఁగా "అయ్యా, నావలన గాదు. ఈయవలసినవా రొక్క దమ్మిడియైన నీయలేదు. మఱియొకచోటఁ జూచుకొనుము." అని చెప్పివేసెను.

ఇది తెలిసి బోధల నెత్తిమీఁదఁ బిడుగుపడినట్లు చింతించి తుదకు "సమీపగ్రామమునకుఁ బోయి నాలుగు వరాలును దెచ్చెదను" అని దారపుత్రులతోఁ జెప్పి వీరాళాగ్రామమునకుఁ బోయెను. ఈసంగతిఁ దెలిసికొని ఆదుష్టులు రాజోద్యోగులతో బోధల పాఱిపోయె నని చెప్పిరి. తోడనే వారు వచ్చి ఇల్లు ముట్టడివేసి గుమ్మముమీఁదఁ గూర్చుండి "పన్ను ఇచ్చునంతవఱకును ఇంటిలోనివా రెవ్వరును గుమ్మము దాఁటి పోఁగూడదు" అని శాసించిరి. బోధలభార్య మంచినీటికొఱకుఁ గూడ వెలుపలకుఁ బోవుటకు వీలు లేదయ్యెను. వీరి యవస్థను జూచి పండరినాథుఁడు తలారివాని వేషముతో రాజసన్నిధికిఁ బోయి బోధలబావా చెల్లింపవలసిన మోడువరాలును జెల్లించి రశీదు పుచ్చుకొని తెచ్చి బోధల యింటినిముట్టడించి యున్న ఉద్యోగులకుఁ జూపెను. అంతట

వారు మాఱు పల్కక లేచిపోయిరి. మఱునాఁడు బోధల వీరాళా గ్రామమునుండి వచ్చి రాజసభకుఁ బోఁగా నచ్చటి యధికారులు "ఓయీ, నీవు ఈవలసిన ఏడువరాలును నిన్న తలారివాఁడు తెచ్చి యిచ్చి రశీదు గొనిపోయెను" అని చెప్పిరి. అందులకు వింతపడి బోధల తలారివానిని "నీకు ఏడువరాలు నెవ" రిచ్చి రని యడుగఁగా "నేనే మియు నెఱుఁగను" అని వాఁడు చెప్పెను. అంతట బోధల ఇది యంతయుఁ బాండురంగని లీలయని నిశ్చయించి "దీనబంధూ, భక్తచింతామణీ, ఎంతపనిఁ జేసితివి ? బ్రహ్మేంద్రాదులవలనఁ గూడ సేవింపఁబడు నీవు ఈసేవకుని నిమిత్తము అట్టి నీచరూపమును వహింప వచ్చునా? ప్రభూ, పన్ను చెల్లించునపుడు ఆరాజోద్యోగులు నిన్నేమని యదలించిరో ఏమి చిక్కులు పెట్టిరో, అయ్యో ఈస్వల్పపుఁ బన్ను చెల్లించుట నావలనఁ గానిది కాదు గదా ? అట్టిచో నీకీశ్రమ మేల ? ఆశ్రితవత్సలా, శ్రీహరీ, నాహృదయము కంపితమై పోవుచున్నది. ఈయపచారమును నేను సహింపఁజాలను" అని దుఃఖింపసాగెను. అపుడు పండరినాథుఁడు సాక్షాత్కరించి "వత్సా, వగవకుము. ఈవ్యవహారములో నీకేమియుఁ దెలియదు. శాంతించి యుండుము" అని యూరడించి తిరోహితుఁ డయ్యెను. బోధల యింటికిఁ బోయి చూడఁగా పెట్టె లన్నియు నపారధనసంచయముతోడను, గాదె లన్నియు ధాన్యరాసులతోడను, పొలము లన్నియు ఫలవినమ్రములగు సస్యములతోడను నిండి యుండెను. బోధల భగవంతుని అనేక విధములఁ గీర్తించుచు నాతని యనుగ్రహమువలన లబ్ధమయిన సంపత్తును మఱల భాగవతారాధనము నిమిత్తమును దీనుల కొఱకును వెచ్చింపఁ జొచ్చెను. గ్రామమునందలి వారెల్లరు నీవిచిత్రమునుజూచి బోధలమాహాత్మ్యమునెఱింగి యాతనిని గారవింపసాగిరి.

సమీపగ్రామమున బోధల సమీపబంధువులలో నన్నదమ్ములిరువురు బోధల చేలతో నంటియున్న చేను వ్యవసాయము చేయుచుండిరి. వారియింట హాసి యను నొకస్త్రీ దాసియై యుండెను. ఆమె సంసారముమీఁద విరక్తిఁబూని బోధలచెంతకువచ్చి "స్వామీ, నాకు సంసారముమీఁద రోఁత పుట్టినది. మీసేవ చేయవలయునని నాకు అభిలాషము గలదు. నన్ను కరుణించి భవరోగమును బాపి అను

గ్రహింపుము" అనిప్రార్థించెను. అందులకు బోధల "నీకు వైరాగ్యము కలిగినందులకు ఆనందము; కాని సతతము భగవదారాధనమునఁ గడపుటకు ఒకనికి దాసివై యున్న నీకు ఎట్లు సాధ్యపడును? నిర్మలభక్తి యున్నచో భగవంతుని ఎప్పుడో యొకప్పుడు పూజించినను బాధ లేదు. మనస్సును దుష్పథమునఁ బోనీయక నిర్మలభక్తితో నీశ్వరుని స్మరించుచు సంసారమున నున్నవారుగూడ మోక్షమునుబడసినవారు గలరు. కావున ప్రతి ఏకాదశినాఁడును నీయజమానుల సెలవు బడసి పండరిపురమునకుఁ బోయి పాండురంగనిఁ బూజించుచుండుము. నీహృదయము నిర్మలభక్తిభరితమైనయెడల నదియే చాలును" అని చెప్పి పంపివేసెను. ఆమె యట్లే చేయసాగెను.

బోధల ప్రభావము వెల్లడియైనకొలఁదిని సమీపగ్రామవాసులు అనేకులు వచ్చి ఆతని భగవద్భజనమును, భగవద్గుణకీర్తనమును కని విని యానందించి పోవుచుండిరి. ఒకప్పుడు రాళేరాసా అనుగ్రామమునుండి పదిమంది బోధల భగవద్భజనమును జూచుటకు బయలుదేఱిరి; గాని మార్గమధ్యమున నందొకనినిఁ గృష్ణసర్పము కఱచి ప్రాణములు తీసెను. తక్కినవారు ఈసంగతి రాజభటులకుఁ దెలిసిన బాధలు గలుగునని తలంచి తనుతోఁగూడ ఎత్తికొని తీసికొనివచ్చి తమ నడుమఁగూర్చుండఁబెట్టికొనిరి. కొంతసేపయిన తరువాత బోధల చుట్టునున్నవారినిఁ జూచి "భాగవతులారా, ఊరకుండవలదు. అందఱును లేచి నోటితోఁ బాడుచు, చేతులతో తాళము వేయుచు, కాళ్లతో నృత్యము సేయుచు హృదయమున భగవంతుని నిలిపి భజనము చేయుఁడు" అని చెప్పెను. అందఱును భజన ప్రారంభించిరి; గాని సర్పదష్టుఁడై మృతుఁడైనవాఁడెట్లు భజన సేయును? వానిని జూచి బోధల చెంతకు వచ్చి తట్టి పిలిచి "మహాత్మా, ఏల యూరక కూర్చుండెదవు? హరిభజనము సేయుము. ఆపదుద్ధారకుఁడగు శ్రీమన్నారాయణుని భజింపుము" అని చెప్పెను. తోడనే వాఁడుగూడ లేచి భజన ప్రారంభించెను. అదిచూచి తక్కినవారు తెల్లవోయి కొంతతడవునకు తెలివి తెచ్చుకొని ఇదియంతయు బోధల మాహాత్మ్యమని తలంచి యాతని పాదములమీఁద వ్రాలి యథార్థము విన్నవించిరి. బోధల ఇదియంతయు పండరినాథుని లీలయని భజనము యథాపూర్వముగ సాగించెను.

ఇట్లుండఁగా హాసి యజమానుఁడు చనిపోయెను. అతని తమ్ములు ఋణబాధను దీర్చుకొనుటకు ఆస్తియంతయు విక్రయించుకొనుచు ఆస్తితోఁబాటుగ హాసినిఁ గూడ విదేశీయుఁడగు నొక వర్తకునకు అమ్మఁజూపిరి. అది తెలిసికొని యామె బోధలచెంతకు వచ్చి పాదములమీఁద వ్రాలి "మహాత్మా, నన్ను నాయజమానులు విదేశీయుఁడగు నొక వర్తకునకు విక్రయింపఁజూచుచున్నారు. మీకును నాకును,పండరినాథునకును నాకును దూరముసేయుటకు వారు తలంచియున్నారు. నన్ను,ఈవిపత్సాగరమునుండి గరిచేర్పవలయును" అని ప్రార్థించెను. అందులకు బోధల "నీవేమియు భీతిల్లకుము. భగవంతుఁడు నీహృదయమున నున్నచో నీకును భగవంతునకును దూరముచేయఁగలవా రెవరు? భగవంతునికి సాధ్యముగాని దేమిగలదు? ఆతఁడు నీసేవనభిలషించెనేని నిన్నే సులభముగా పండరిపురమునకు రప్పించుకొనఁగలఁడు. లేకున్న నాతఁడే నీచెంతకు రాఁగలఁడు.అందులకు విచారింపకుము. నీకు పోయినచోటనాకంటె గొప్పయాచార్యుఁడే లభింపవచ్చును. విచారింపకుము భగవద్ధ్యానము మాత్ర మేమఱకుము" అని చెప్పెను.

అంతట హాసి మనుతాబాయిచెంతకుఁ బోయి తనకు సంభవించినదంతయుఁ దెలుపుకొని "తల్లీ, నాగురుదేవుఁడగు నీభర్తను, నాతల్లివగు నిన్నును విడిచి నేను మనఁజాలను. నన్ను గొనునట్లు నీభర్తకు విన్నవింపవలయు" నని కోరెను. మనుతాబాయి భర్తతో "హాసి మనలను విడువలేక యేడ్చుచున్నది. ఆమెను మన పాలము అమ్మియైనను ఆమె యజమానులు కోరుమూల్యము నిచ్చి కొనవలయు నని చెప్పెను.అంత నాతఁడు అందుల కంగీకరించి ఆమె యజమానులచెంతకుఁ బోయి "మీరు కోరిన వెల యిచ్చెదను. హాసిని నాకు ఇచ్చివేయుఁడు" అని చెప్పెను; గాని వారు ఈతనియెడలఁ బ్రబలాసూయ గలవారగుటచే "లక్షవరహాలు ఇచ్చినను ఆమెను నీకు ఈయము. ఇతరులకే యిచ్చెదము" అని ఖండితముగాఁ జెప్పిరి. బోధల సంగతి యంతయు హాసి కెఱింగించి "నీవు విచారింపకుము. శ్రీపాండురంగనికి సకలమును నివేదించినీవిపత్తును దప్పించెద" నని చెప్పి యింటికేఁబోయి యావృత్తాంతము మనుతాబాయి కెఱింగించెను.

యజమానులు హాసిని, దాని కుమార్తెను దూరదేశమునుండి

వచ్చిన వర్తకులకు ఇరువదియైదువరాలకు విక్రయించి, పత్రము వ్రాసి యిచ్చి సొమ్ముపుచ్చుకొనిరి. తోడనే పాండురంగఁడు ఒకబ్రాహ్మణుఁడై వెళ్లి “రమ్ము. నిన్ను బోధల కొనిరమ్మన్నాఁడు” అని హాసిని ధామణగ్రామమునకుఁ బంపివేసెను. హాసి కూఁతురుచనిపోయెను. ఉన్నట్లుండఁగా హాసి మాయ మగుటఁ జూచి వర్తకులు దానిపూర్వయజమానులవద్దకుఁ బోయి “మాచే వరాలను గైకొని యూరకుందురేల? హాసిని మాకు అప్పగింపుఁడు” అని యడిగిరి; గాని వారు “మీరు మాకు వరాలు ఇచ్చి పత్రము ఎప్పుడు వ్రాయించుకొంటిరో అప్పుడే హాసి మీసొత్తు అయ్యెను. ఇఁక మాప్రసక్తియేల?” అని తప్పించుకొనుటకుఁ జూచిరి. ఈవివాదము ఎంతకును దీరదయ్యెను” ప్రొద్దున నొక బ్రాహ్మణుఁడు వచ్చి “బోధలచెంతకుఁ బొమ్ము” అని హాసితోఁ జెప్పెను. చూడఁగా బోధల హాసినిఁ బిలిపించుకొనిపోయినట్లు తోఁచుచున్నది. మీరుపోయి ఆతనితోఁ గలహింపుఁడు” అని గ్రామములోని వారు కొందఱువర్తకులకు దెలిపిరి.” మాకు ఆబోధలతో నేమియునుఁబనిలేదు” అనిచెప్పి వర్తకులు హాసి ఎచ్చట నున్నదో తెలిసికొనవలయునని బోధలచెంతకుఁ బోయి చూచిరి; గాని ఆమె యచ్చటఁ గాన్పింపదయ్యెను. ఈవివాదము నిశ్లే పెంచి వర్తకులు తుదకు తామిచ్చిన ఇరువదియైదువరాలను గైకొనిరి.

మఱియొక దినమున సమీపగ్రామమునుండి యొకమాలవాఁడు వచ్చి “ప్రభూ, నేఁడు నాకు ఉపదేశము చేయకతీఱదు” అని పట్టుపట్టి బోధలను బ్రార్థించెను. వీఁడిట్లు చాలఁ గాలమునుండి ప్రార్థించుచుండెను. గాని వీఁడు అనర్హుఁడని శంకించి బోధల యింతవఱకును ఉపదేశము చేయఁడయ్యెను. నేఁడు నిర్బంధ మెక్కుడగుటచే బోధలు భగవంతుని ధ్యానింపఁగా సర్వేశ్వరుఁడు సాక్షాత్కరించి “వత్సా, వీనినిఁ బరీక్షింపక ఉపదేశము చేయకుము. నీశాసనము నతిక్రమింపఁడేని, రహస్యమును బయలు పుచ్చఁడేని అప్పుడు ఉపదేశింపుము. చేనిలో నొక క్షుద్రదేవత యున్నదనియు, దానికి పూజించి ఆవుమాంసమును నైవేద్యము చేయవలయు ననియు, నీసంగతి పరమగోప్యముగా నుంపవలసినదనియుఁ జెప్పి వాని నట్లు చేయింపుము. ఆమాంసమును నీజాతివారికిఁ బెట్టుమనుము. ఎట్లయిన వాని మనశ్శుద్ధి తెలియఁగలదు” అని చెప్పి పోయెను. బోధల

మాలవానికి అట్లే చెప్పి "గోశాల నున్న ఎఱ్ఱని దూడను గొనిపోయి చేనిలో బలిచేసి మాంసము తీసికొనిరమ్ము" అని నియమించెను. మాలవాఁడు దానినిఁ దీసికొనిపోయి సంహరించి కాళ్లను, దలయుఁ దాను ఉంచుకొని మాంసమును దెచ్చి బోధల కిచ్చెను. బోధల దానిని వండించి నైవేద్యముచేసి తనజాతివారిని విందునకుఁ బిలిచి వారికిఁ బెట్టెను. "బోధల హరిభక్తుఁ డని యుందురే? నేఁడు ఈక్షుద్ర దేవతారాధనము నెట్లు చేసెను?" అని యనుకొనుచు వారందఱును మాంసమును జక్కఁగా భుజించి ఆనందించి వెడలిపోయిరి. మఱునాఁడు మాలవాఁడు ఒక కాపువాని యింటిలో నిశ్శంకముగాఁ బ్రవేశించెను. ఇదేమి అన్యాయ్య మని యాకాపు కొట్టరాఁగా వాఁడు "నాకంటె మీరేమి యెక్కువ? నేనును గోమాంసముతిందును. మీరును బోధల యింట నిన్న తినివచ్చితిరి" అని యదలించెను. అది విని యాతఁడు నిర్విణ్ణుఁడై తోడివారందఱకు నీసంగతిఁ దెలిపెను. వారందఱును గుమిగూడి "బోధల మాకులమును జెఱిపెను. వానిని బొలమునకు దీసికొనిపోయి అక్కడఁ జంపివేయుద" మని కూడఁ బలికికొనిరి. వారిలో దూరదర్శులగువారు కొందఱు "తొందరపడవలదు. మాలవానిని నిదర్శనము చూపు మని కోరుఁ" డనిరి. కొంద ఱట్లడుగఁగా వాఁడు "ఈసందేహము తీర్చుట యెంత! బోధల గోశాలలోని ఎఱ్ఱని దూడను నేను చంపితిని. తలయు కాళ్లును ఇంకను నాయింటనే యున్నవి. చూపెదను రండు" అని చూపుటకుఁ గొందఱను గొనిపోయెను. ఉన్నవారిలోఁ గొందఱు బోధలయింటిపైఁబడి "దుర్మార్గుఁడా, మేఁక వన్నెపులివలె మాయవేసము వేసికొని అక్రమముగా మాకు గోమాంసము పెట్టి కులము చెఱిపితివి. చూడుము నిన్నేమి చేసెదమో" యని అనేకవిధముల నాతనిని నిందింపసాగిరి. ఇంతలోఁ బోయినవారు చూడఁగా మాలవానియింట ఆవుదూడ తలకును కాళ్లకును మాఱుగ మేఁకతలయు కాళ్లును ఉండెను. వానినిఁ జూచి మాలవాఁడు రిచ్చపడి తెప్పిరిలి "ఇది యిట్లు ఎందులకైనదో తెలియదు. గోశాలలో నెఱ్ఱని దూడయున్న దేమో చూచుకొనుఁడు. మీ కదే నిదర్శనము" అని చెప్పెను. వారు గోశాలకుఁ బోయి చూడఁగా నచ్చట ఎఱ్ఱనిదూడ చక్కఁగా గడ్డిమేయుచుండెను. ఇదంతయుఁ జూచి వారు మాలవానివలన

మోసపోయితిమని తలంచి బోధల పాదములమీఁద వ్రాలి "మహాత్మా, రక్షింపుము. అజ్ఞానుల మగుట సంగతిసందర్భములు తెలియక గంతులు వేసితిమి. మమ్ముక్షమింపుము" అని బోధలను బ్రార్థించి సరియే యని పించుకొని మాలవానినిఁ జంపుటకు సిద్ధపడిరి. అపుడు బోధల వారిని వారించి "ఇదంతయు పాండురంగని విలాసము. శ్రీహరినిఁ జూచి వానిని క్షమింపుఁడు" అని చెప్పెను. అంతట నాకాపులందఱును బోధలయాజ్ఞాప్రకారము మాలవాని కేమియు విపత్తు గలిగింపకయే వెడలిపోయిరి. తాను చేసిన పనికి సిగ్గుపడి మాలవాఁడు మఱల బోధలకుఁ దన మొగము చూపియెఱుఁగఁడు.

ఇట్లుండఁగా నొక సంవత్సరము కార్తికమాసమువఱకును వర్షము కురువదయ్యెను. పంటలు పండకపోవుటచే దేశములో కఱవు సంభవించెను. బోధల తనయింట నున్నధాన్య మంతయుఁ దీనులకుఁ బంచియిచ్చెను. ఇట్లుండఁగా కార్తికమాసమున నొక వర్షము కురిసెను. తోడనే బోధల చేను దున్నించి జొన్నలు చల్లించెను మఱునాఁడే పండరిపురమునకుఁబోవుఁ బాటసారులు కొందఱువచ్చి "స్వామీ, మమ్ము ఆఁకలిపీడించుచున్నది. రక్షింపుము" అనిప్రార్థించిరి. చూడఁగా నింటిలో పుచ్చిపోయినజొన్నలు ఉండెను. బోధల కుమారునిఁబిలిచి "వత్సా, నిన్న చేనిలోఁ జల్లిన జొన్నలు తీసి జల్లించి వీరికిచ్చి పంపివేసి యింటిలోని పుచ్చుజొన్నలు చేనిలో చల్లుము" అని నియమించెను. యమాజీ యట్లుచేసెను. పుచ్చుజొన్నలు మొలుచునా? యని చూచినవా రందఱును నవ్వినారిరి; గాని మఱునాఁడే యవి చక్కఁగా నంకురించి పెరిగెను. ఫలకాలమున జొన్నచెట్లకు ఆనపకాయలు కాచెను. పగులఁగొట్టి చూడఁగా ఆకాయలయందు గోధుములు ఉండెను. అదిచూచి అందఱును పరమాశ్చర్యచకితులైరి. ఇది నవాబునకుఁ దెలిసెను. "ఓ, బోధల ఐంద్రజాలికుఁడు. చూడుఁడు వానిపనిఁబట్టెదను" అని నవాబు బోధలను దర్బారునకుఁ బిలిపించి గోమాంసము వండించి తెప్పించి "ఇది తినుము. లేకున్న కైదులోఁబెట్టించెదను" అని బెదరించెను. బోధల చూడఁగా నామాంసపుకూర తులసీదళము లైపోయెను. అంతట నవాబు బుద్ధితెచ్చుకొని బోధల పాదములమీఁద వ్రాలి

కరుణింపు మని ప్రార్థించెను. బ్రతికియున్నంతకాలము హరిభజనమునఁ గడపి అవసానమున బోధల ఈశ్వరసాయుజ్యమును బడసెను.

"చ. హరి భవదీయమాయ ననయంబును జెందిన నేము నిచ్చలుం
గర మనురక్తి నేది తుదగా భవకర్మములమై ధరిత్రిపైఁ
దిరుగుదు మంతదాఁక భవదీయజనంబులతోడి సంగతిన్
గురుమతి జన్మజన్మములకున్ సమకూరఁగఁ జేయు మాధవా."

(భాగ. స్కం. 4. ప. 928.)

31. సుఖానందుఁడు.

ఒక గ్రామమున సుఖానందుఁడు అనునొకబ్రాహ్మణుఁడు ఉండెను. ఆతనిభార్య పేరు సురసురి. ఆయిరువురును ఏకమనస్కులై ఏవిషయము నందును బొరపొచ్చములు లేక ఒకరికష్టము నొకరి కష్టముగా భావించుకొనుచు మహానందముతోఁ గాలము గడుపుచుండిరి అంతియేగాక శ్రీహరిభక్తులై, సదా శ్రీహరిధ్యానమును, శ్రీహరిపూజను, భాగవతారాధనమును, దీనపోషణమును జేయుచు ఇహసుఖములయెడల విరక్తులై, సంసారము నసార మని యెంచి ప్రవర్తించుచుండిరి.

ఆగ్రామమునఁ గొందఱు ఆదంపతుల యైకమత్యమును సౌజన్యమును, జూచి యోర్వఁజాలక ఎట్లయినను వారిని వంచింపవలయు నని చూచుచుండిరి. సుఖానందుఁడును సురసురియుఁ గూడ నెప్పుడు నిలువీడక సదా భగవద్ధ్యానమునందే నిమగ్నులై యుండువారు గాన ఆదుష్టులకు వంచించుటకు సమయముదొరకదయ్యెను. ఇట్లుండఁగా వాండ్రు ఒకనాఁడు బజారునకుఁ బోయి మిఠాయిఁ గొని తెచ్చి యిచ్చి వారిని "మహాత్ములారా, మేము నేఁడు భగవంతునకు భోగముచేయించితిమి. ఈభగవన్నివేదితపదార్థమును దాము స్వీకరింపవలయు" నని ప్రార్థించి బలవంతపెట్టిరి. వారు బలవంతపెట్టకపూర్వమే ఆదంపతులు భగవన్నివేదితవస్తువులు బహిష్కరణీయములు కావని యెఱింగినవారు కావున వానినిఁ గైకొని ఆనందముతో భుజించిరి. తోడనే ఆదుష్టులు "ఛీఛీ, మీరేటిబ్రాహ్మణులు. మీరు బజారులో శూద్రులుచేసినమిఠాయి దినినారు; గావున ప్రాయశ్చిత్తము చేసికొనునంతవఱకు మిమ్ము వెలివేసితి";

మని గోలచేయసాగిరి. అంతట నాదంపతులు వాండ్రు చేసిన మోసము నెఱింగి "మీరేటికిట్లుగోలసేసెదరు? మేము వానినిఁ దాఁచితిమే కాని భక్షింపలేదు. ఇదిగో మీమిఠాయియుండలు" అని నోళ్లనుండి తీసి యిచ్చివేసిరి. వారు చిదిపి నమలి మ్రింగిన మిఠాయి మఱల ఉండలరూపమునఁ బైకివచ్చినందులకు ఆదుష్టులు ఆశ్చర్యపడి వారిమాహాత్మ్యము నెఱింగి "ఓపుణ్యదంపతులారా, మేము మీప్రభావము నెఱుంగక చేసిన పాపకృత్యమునకు మన్నింపవలయును. కేవలము భక్తచింతామణి సర్వేశ్వరుఁడు మీపాల నున్నాఁడు. ఇఁక మిమ్ము భగవంతునికంటె నెక్కుడు భక్తితోఁ బూజింతుము. ఈయొక్క తప్పిదమును విస్మరించి మమ్ము గాపాడవలయు" నని పాదములమీఁద వ్రాలి ప్రార్థించిరి. సుఖానందుఁడు ఇంచుకేనియుఁ గోపింపక "బుద్ధిగలిగియుండుఁడు. భగవంతుఁడు మిమ్ము రక్షించుఁగాక" అని యాశీర్వదించి వాండ్రు నంపివేసెను.

ఒకప్పుడు సుఖానందునకు తానొక్కఁడును తీర్థయాత్ర సేయవలయు నని తలంపు గలిగెను. అంతట నాతఁడు భార్యనుజూచి "అంతకును మనకు రక్షకుఁడు అగు శ్రీమన్నారాయణుఁడే గలఁడు. నేనుతీర్థయాత్ర పోయివచ్చెదను. శ్రీహరినే నమ్ముకొని భాగవతారాధనమును జేయుచు నింట నుండుము. నీవుచేయుభాగవతారాధనము నాచేయు తీర్థయాత్రకంటె నెన్నోమడుంగులు మిన్నయైనది; గావున నిన్ను ఇంటనుండుమని చెప్పుచున్నాను. ఎట్లో నాకీబుద్ధిపుట్టినది; గాని నాకు నేనై కోరుకొని వెళ్లుటలేదు. ఇంట సమస్తమునుగలవు. నీకుఁ దెలియని దేమియు లేదు" అనిచెప్పెను. సురసురియు భర్త కేమియు నభ్యంతరము సెప్పక "నాకింతగాఁ జెప్ప నేల? నేను మీయాజ్ఞ ఎన్నఁడును జవదాఁటియెఱుఁగనుగదా? మీకును నాకును ప్రపంచమునకు అంతకును గూడ రక్షకుఁడగు భగవంతునిపై భారమువేసి నిశ్చింతతో మీరు తీర్థయాత్రకుఁ బోయిరండు. నేఁజేయు భాగవతారాధనమున మీకును, మీరుచేయుతీర్థయాత్రలో నాకును భాగములు లేకపోలేదు. మీచిత్తమువచ్చినట్లు చేయుఁడు" అని విన్నవించెను. అది విని పరమానందభరితుఁడై సుఖానందుఁడు నిశ్చింతతోఁ దీర్థయాత్రకు బయలుదేఱి పోయెను.

ఆయూర నున్న యొక దుష్టుఁడు చిరకాలమునుండి సురసురిని మోహించియుండియు నేదో కారణమువలనఁ దన యభిప్రాయము

నామె కెఱింగింపఁ జాలకయుండెను. ఇట్టి స్థితిలో నున్నవాఁడు సుఖానందుఁడు దీర్ఘయాత్రకుఁ బోవుట యెఱింగి సాధువేషమును ధరించి సాయంకాలముఅగునప్పటికి సురసురి యింటిముంగిటనిలిచెను. వానినిఁ జూచి యామె పరమభాగవతోత్తముఁ డని తలంచి బహుభక్తితో నర్ఘ్యపాద్యాదివిధులఁ బూజించి ఆపూటఁ దనయింటనారగించి తరింపఁ జేయవలయు నని ప్రార్థించెను. వాఁడు ఆమెనిమిత్తమే వచ్చినవాఁడు గావునఁ దొలుతఁ గొంచెము బింకముచూపి "మీరిప్పుడు వెడలిపోయిన శ్రీహరిపై నానగలదు" అని యామెచే ననిపించికొని చేయఁజాలినది లేనివానివలెఁ దుదకు అంగీకరించెను. తోడనే సురసురి మహానందముతో షడ్రసోపేతమగు భోజనము సమర్చి వానిని భుజింపఁజేసి భాగవత భుక్తశేషమును భుజించుటకుఁ గూర్చుండెను.

ఆమె భుజించి వచ్చినపిమ్మట వాఁడు కొంతసేపు ఏమేమో చెప్పి తుదకుఁ దన మనోరథము నెఱింగించెను. అదివిని యామె యేమియుఁ జలింపక "భగవదారాధనముకంటె భాగవతారాధన ముత్కృష్టమని నానాథుఁ డుపదేశించిపోయెను; గావున మీయాజ్ఞాప్రకారము ఈదాసురాలు నడచుకొనఁగలదు" అని శయ్యాగృహమునకుఁ బోయి దాని నలంకరించి తానుశయ్యపైఁ గూర్చుండి వానినిఁ బిలిచెను. వాఁడు పరమానందముతోఁ దలుపు తెఱచికొని లోనికిఁ బోఁగా మంచము మీఁదఁ గూర్చుండియున్న సురసురిభయంకరవ్యాఘ్రమువలెఁ గాన్పించెను. తోడనే వాఁడు భీతుఁడై వెనుకకును ముందునకునుగూడ అణుమాత్రమైనఁ గదలఁజాలక వడవడ వడఁకి పోసాగెను. అదిచూచి సురసురి "భాగవతాగ్రణీ, ఏల యచ్చటనే నిలిచిపోయితివి? వచ్చి యీదాసురాలి సేవ నంగీకరింపుము" అని పిలిచెను. అప్పుడు వాఁడు కొంచెము ధైర్యము తెచ్చుకొని "తల్లీ, క్షమింపవలయును. కండకావరమున నీయెడల దుశ్చింత గలిగి సమయమునకై నిరీక్షించి నిరీక్షించి నేఁడు ఈసాధురూపమునుబూనివచ్చితిని. వచ్చినందులకు నాకుఁ దగినప్రాయశ్చిత్తమైనది. బుద్ధి వచ్చినది. రక్షింపుము. ఇఁక నేను ఎప్పుడును ఇట్టి పనిచేయను. ఈక్షణమునందే నేను సంసారమును విడిచిపెట్టి నీపాదములనాశ్రయించుచున్నాను. నీయనుగ్రహమువలన నేనామాఢ్యముతొలగిపోయి నాకు జ్ఞానముకలిగినది; గావున నన్ను శిష్యునిగా నంగీకరించి

నాకు మోక్షమార్గము నుపదేశింపుము. తల్లీ, నిన్ను విడిచి యిఁకనేను మనఁజాలను" అని ప్రార్థించెను. అందులకు సురసురి మిగుల హర్షించి "బాగుపడితివి. నీవు నేఁటినుండి సంసారముమీఁది మనుతను విడిచి యుండుటకు నిశ్చయించుకొని యుంటివి గావున నేను ఆనందించు చున్నాను. ఇఁక శ్రీహరిని ఆశ్రయించి ఆతనినే ధ్యానించి ఆతనినే భజించుచు ఆతని గుణములనే కీర్తించుచు ధన్యుఁడవగుము. ఉన్నట్లుండఁగా నాకస్మికవిజ్ఞానలాభమును బడసిన నీకు ఐహికమునందలి మాయను వివరించి చెప్పఁబనిలేదు" అని బుద్ధిచెప్పి తాను మోక్షమార్గము నుపదేశించుటకు అంగీకరించెను. అప్పటినుండియు వాఁడు ఆమె యాజ్ఞాబద్ధుఁడై యుండి యామెవలనఁ దత్త్వమును వినుచు నానందించుచుండెను.

ఇది యిట్లుండఁగా నట్లు తీర్థయాత్రను సేవించుటకై పోయిన సుఖానందుఁడు కాశి గయ ప్రయాగ బ్రహ్మకపాలము ద్వారక మధుర జగన్నాథము సింహాచలము భీమేశ్వరము ద్రాక్షారామము అంతర్వేది కోరుకొండ పట్టిసము తిరుపతి కంచి శ్రీరంగముమున్నగు దివ్యస్థానములకుఁబోయి అచ్చటచ్చటఁగల తీర్థములలో గ్రుంకి భగవంతునిఁబూజించికొని పంఢరిపురముఁ జేరెను. అచ్చట నాతఁడు పదిదినములుండి పాండురంగని సేవించుకొని అచ్చటినుండి వెడలిపోవుటకు బుద్ధిపుట్టక యొకనాఁడుభక్తిపరవశుఁడై భజనమున నృత్యము సేయుచుండఁగా పాండురంగడు సాక్షాత్కరించి "వత్సా, నీభక్తికి మెచ్చితిని. నీకు అవసానమున నాసాయుజ్యము గలదు; గాని ఇచ్చటినుండి నీస్వగ్రామమునకుఁ బోవుటకు విచారింపకుము. ఎచ్చటెచ్చటనున్నభక్తులైనను నన్ను తమ మనస్సులలో నుంచుకొన్నచో సదా నేను వారిసన్నిధినే యుండి వారినిఁ గాపాడుచుందును. గావున నీకు చింతవలదు. పోయిరమ్ము" అని యుపదేశించి పంపివేసెను.

అంత సుఖానందుఁడుభగవత్సాక్షాత్కారములభించినందులకు పొంగిపోవుచు, తదాజ్ఞాప్రకారము స్వగ్రామమునకుఁ బోయి, అచ్చట దనభార్య తన యాజ్ఞాప్రకారమే ప్రవర్తించుచుఁ దనకొఱకెదురు చూచుచుండుటఁ దెలిసి యామెను జాల నున్నించి తాను వెడలిపోయి నది మొదలు నేఁటివఱకును జరిగిన సంగతులన్నియు నామె కెఱింగించి

సంతోషపెట్టెను. ఇంతలో శిష్యుఁడు గానున్న తొల్లిటి దుష్టుఁడువచ్చి సుఖానందుని పాదములమీఁద వ్రాలి తన యపరాధమును విన్నవించి రక్షణమును వేఁడుకొనెను. సుఖానందుఁడు అందుల కేమియుఁ గోపింపక "బుద్ధిగలిగ యుండుము. ప్రపంచమంతయు మాయ. ఈమాయలోఁబడి కొట్టుకొనువానికిఁ బరలోకమున గతులులేవు. ఐహికసుఖములు కేవలము ఆభాసములు. సంసార మసారము. తనువులు బుద్బుదప్రాయములు ఐశ్వర్యము అధఃపతనకారణము" అని బోధించెను.

పిదప నొకప్పుడు సుఖానందుఁడును సురసురియు భక్తిపరవశులై హరిభజనము ప్రారంభించిరి. తోడనే శ్రీహరి దివ్యమంగళవిగ్రహముతో సాక్షాత్కరించి యాదరము చేసికొని "వత్సలారా, మీభక్తి విశేషమునకు మెచ్చితిని. మీరు నాయాంతరంగికభక్తులైతిరి. మీకు ఏమియు లోపము లేదు. నేను దాసునివలె మిమ్ము ఎప్పుడు నేమరక యుండెదను" అని చెప్పి యంతర్హితుఁ డయ్యెను.

పిదప నొకప్పుడు సుఖానందుఁడు శిష్యునిఁ జేరఁబిలిచి "వత్సా! నీభక్తి ప్రపత్తులకు నాకు ఆనందము గలిగినది. కావున ఇఁక నీవు పెండ్లియాడి గృహస్థధర్మములను బాలించుచు భగవద్భాగవతారాధన సుఖుఁడవై మెలఁగుము" అని యుపదేశించెను. అది విని యులికిపడి శిష్యుఁడు "అయ్యో, స్వామీ, మిమ్ము నమ్ముకొనియున్న నన్ను ఇట్లు అనవచ్చునా? నేను మీకు ఇప్పు డేమి యపకారము చేసితి నని నన్ను సంసారసాగరమునఁ గూలు పనిచెదరు? సంసారసాగరమునఁగూలిన వానికి ఇఁక గతు లెక్కడనున్నవి? ఇట్లనుట కేమి కారణము?" అని భయముతో నడుగ సుఖానందుఁడు "వత్సా, జడియవలదు. నీవు తలంచినట్లు సంసారము మోక్షభ్రంశకము కాదు. సన్యాసము మోక్షకారణము గాదు చిత్తశుద్ధిలేనిచో నేయాశ్రమమునందున్నను అధఃపతనము తప్పదు. గృహస్థునికంటె సన్యాసికి కష్టములు ఎక్కువయున్నవి. గృహస్థాశ్రమములో నున్నవానికి మోక్షసాధనోపాయము లెక్కువయున్నవి. ఆఁకలిగొని వచ్చిన యొకభాగవతునకుఁగాని, ఒకసన్యాసికిఁగాని అన్నము పెట్టిన గృహస్థుఁడు చిరకాలమునుండి వారు సంపాదించుకొనిన పుణ్యమునంతను బడయును. ఇంక నిట్టి లాభము లనేకములున్నవి. సంసారమునం దున్నను లేనట్లే తలంచుచుఁ బ్రవర్తించువాఁడు

నిశ్చలుఁడగు సన్న్యాసికంటె ఘనుఁడు. నీమనోనిశ్చయము నేనెఱుఁగు దును. నీమనోనైర్మల్యము నేనెఱుఁగుదును. కావుననే నిన్ను గృహస్థాశ్రమమునఁ బ్రవేశింపు మని చెప్పుచున్నాను. అంతియే కాని నిన్ను చెఱచుటకుఁ గాదు. గృహస్థాశ్రమగౌరవము నీకుఁ దెలియదు. త్రిమూర్తులుగూడ గృహస్థాశ్రమములనే పాలించుచున్నారు. వారివలెనే తామరాకుమీఁది నీటిచుక్కవలె సంసారము నంటకుండ నున్నచో నది మానవుల నేమియుఁ జేయఁజాలదు. కావున నామాట వినుము" అని సుఖానందుఁడు బోధించెను. ఇది యంతయు విని శిష్యుఁడు పెండ్లి యాడుట కంగీకరించెను. తోడనే లక్షణవతి యగు నొక కన్యను వెదకి తెచ్చి సుఖానందుఁడు శిష్యునకు పెండ్లిచేసి భాగవతులను మృష్టాన్న దానముచే సంతోషపెట్టెను.

పిదప శిష్యుఁడు పతివ్రతాతిలక మగుభార్యతోఁ గూడి సన్మార్గమున ద్రవ్యము నార్జించుచు సంసారమును నిర్వర్తించుకొనుచు భగవంతుని, భాగవతులను, గురుదేవులను ఆరాధించుచు, అన్నదానముచే దీనులనానంద పెట్టుచు హరిభజనమునఁ గాలముగడుపసాగెను. ఒకప్పుడు ఆతఁడు నాతని భార్యయు భక్తిపరవశులై హరిభజనము ప్రారంభించిరి. తోడనే రుక్మిణీసత్యభామాసహితుఁడు శ్రీకృష్ణపరమాత్మ సాక్షాత్కరించి సాష్టాంగనమస్కారముం జేసినవారి నాదరించి వత్సలారా, "మీ భక్తిప్రపత్తులకుఆనందించితిని. మీరిట్లసుఖానందుని, సురసురిని సేవించుచు భాగవతారాధనముసేయుచు భజనము సేయుచుండుఁడు" అని యంతర్హితుఁ డయ్యెను. సుఖానందుఁడును సురసురియు శిష్యుఁడును అతనిభార్యయుఁ జిరకాలము భగవంతునిఁ బూజించి, భాగవతులను సేవించి దీనులనుపోషించి అవసానమున ఈశ్వరసాయుజ్యమునుబడసిరి.

సీ. "కేశవ సంతతక్లేశనాశనుఁడవు, గురుసన్నుతోవాగగోచరుఁడవు
సిద్ధమనోరథహేతుభూతోదార, గుణనాముఁడవు సత్త్వగుణుఁడ వఖిల
విశ్వోద్భవస్థితివిలయార్థధృతనిత్య, విపులమాయాగుణవిగ్రహుఁడవు
మహితాఖిలేంద్రియమార్గసిరథగత, మార్గుఁడ వతిశాంతమానసుఁడవు
గీ. తవిలి సంసారహారిమేఘస్కుఁడవును, దేవదేవుఁడవును వాసుదేవుఁడవును
సర్వభూతనివాసిని సర్వసాక్షి, వైన నీకు నమస్కార మయ్యకృష్ణ."
(భాగ. సప్తమ. 4. ప. 918.)

*

32. అంగదభూపతి.

శ్లో. అనర్ఘ్యమాణిక్యవిరాజమాన
శ్రీపాదుకాలంకృతిశోభనాభ్యాం,
అశేషబృందారకవందితాభ్యాం
నమో నమో రామపదాంబుజాభ్యాం. (స. 9 ఆ. 2 రామకర్ణామృతము.)

రాయసింగు, అంగదభూపతి అను నిరువురు అన్నదమ్ములు అతి సౌహార్దముతోఁ గలిసి పితృపితామహక్రమాగతం బగు ప్రాజ్యరాజ్యమును బరిపాలించుకొనుచుండిరి. పేరునకు రాయసింహుఁడు రాజే గాని యాతఁడేపని చేసినను తమ్ముని సలహా గొనకుండఁ జేసి యెఱుఁగఁడు. అంగదభూపతియు అన్న తనయం దెంత ప్రేమ చూపుచుండునో ఆతనియెడల నంతకంటె నధికభక్తి జూపుచుఁ జేదోడువాదోడుగా నుండి చాల పేరుప్రతిష్ఠలు సంపాదించుచుండెను.

అంగదభూపతి భార్య గొప్ప పతివ్రత. ఆమె యెప్పుడును పతిమాట కెదురాడి యెఱుఁగదు. పతికి వ్యతిరేక మెప్పుడును దలంచియైన నెఱుఁగదు. ఆసాధ్వి పతియే దైవమని నమ్మి యాతనిని సకలవిధోపచారములతోడను త్రికరణశుద్ధిగాఁ బూజించుచు, తనకును, తనభర్తకును గూడ అనంతమంగళములను బ్రసాదింపవలె నని శ్రీహరిని సదా ధ్యానముసేయుచుండెను. అట్లు కాలము గడచిపోవుచుండఁగా నొకనాఁడు ఆమె గురువు వచ్చెను. గురువును దేవునిగా భావించి యనేకవిధములఁ నాతనిం బూజించి యాశీర్వచనమును బడసి యామె యాతని నంపివేసెను. ఈసంగతి విని అంగదభూపతి "నేఁటివఱకును నాభార్య నన్ను దక్క భగవంతునైనఁ బూజించి యెఱుఁగఁదు. నేఁడు చూడఁగా దీని గుణము చెడినట్లు తోఁచుచున్నది. లేకున్న నేఁడు గురుఁడు అని చెప్పి ఎవనినో నన్ను బూజించినదానికంటె నధికముగాఁ బూజింప నేల ?" అని సంశయగ్రస్తచిత్తుఁడై "ప్రథమాపరాధమును క్షమించితిని. నేఁటినుండి నీవు గురువు అనియు గొప్పవాఁ

డనియు నెవ్వనినిఁ బూజింపఁగూడదు. నాయాజ్ఞకు వ్యతిరేకము సేసితి వేని నిన్ను సంహరించివేసెద" నని తీవ్రముగాఁ జెప్పెను.

ఇదివిని యాసతీమణి చాలఁ గటకటంబడెను. "అయ్యో, నాభర్తకు ఎట్టి దుహూహ కలిగెను. కేవలము ప్రపంచమే శాశ్వత మని ఐహికవిషయనిమగ్ననై చెడిపోవలసిన నాకు జ్ఞానోపదేశము చేసి మోక్షోపాయము నెఱింగించిన గురుదేవునిఁ బూజింపకుండ నెట్లుండఁగలను? శ్రీహరీ, నాగతి యిప్పుడు అళికత్తెరలోని వక్క గతి యైనది. నన్నును నిన్నెఱింగించిన గురుదేవునిఁ బూజింపనేని నరకమునఁగూలిపోయెదను. నాభర్తమాట కెదురాడి ఆతని యాజ్ఞకు వ్యతిరేకముచేసినను నాకు అదియే గతి? ప్రభూ, ఈదాసురాలికి ఇట్టి విషమదశ నేల కలిగించితివి? ఇట్టి దుర్భరవిపత్తుం గలిగించి పరీక్షింపఁబూనిన నేను ఏమి సేయగలను? అనంతమును,దుస్తరమును, పాపపంకిలమును కామక్రోధలోభ మోహాదిమహానక్రసంకులంబును పునర్జన్మకారణము నగు నీ అసారసంసారసాగరమునుజూచిన నామెుడలుఁజలదరించుచున్నది. అకటా, మఱల మఱల నన్ను ఇందే కూలవేయ నెంచితివా? దేవదేవా, ఈజగత్తంతయు నీసంకల్పమాత్రమున సృష్టిస్థితిసంహారరూప మగు అవస్థాత్రయము నందుచున్నది. ప్రపంచమునందంతటను నీవు నిండియున్నావు. నాయందును నాభర్తయందునుగూడ నున్నావు; గాని నాయందు ఉండి నిన్ను బూజించునట్లు నాకు విధించుచుచు నాభర్తయందు ఉండి కేవలము నందులకు వ్యతిరేకముగ నాజ్ఞాపించుచున్నావు. ఇది యంతయు నీకు చెలగాటముగా నున్నదా?" అని వగచి నిద్రాహారములు మాని,

మ. సుకృతస్థానము సత్యముఁ బరమునఁ జ్యోతిస్స్వరూపంబు తా
రకనామం బపవర్గదంబు పరమబ్రహ్మంబు నోంకారనా
మకముస్థానము నిర్గుణాకరము సంభిచ్ఛాశ్వతానంద ము
త్యకళంకం బగు రామరత్నము నితాంతప్రేమునఁ బ్రోవుతన్.

మ. ప్రకటోంకారనివాసముఁ ద్రుహిణజంభద్వేషిజప్యంబు తా
రకముఁ మానినుతంబు నాజికులమంత్రం బాసుపధ్వంసముఁ
సకలారాధ్యాసనముఁ జగత్ప్రకటముఁ సన్ముక్తిమార్గంబు మా
మకషడ్వర్గహారంబు రామవిలసన్మంత్రంబు నన్ బ్రోవుతన్.

(107. 109. ష. ఆ. 2 రామకర్ణామృతము.)

అని సర్వేశ్వరునిఁ బ్రార్థింపఁదొడఁగెను.

అంగదభూపతి భార్యకు అట్టికఠోరశాసనము చేసిన నాఁటిరాత్రి రెండుజాములుగడచినతరువాత శ్రీపతి బీదబ్రాహ్మణవేషముతో నాతని స్వప్నమున సాక్షాత్కరించెను. అంగదభూపతియు నాతనింగాంచి "నీవెవఁడవు? ఏమి చేయుచుందువు? ఇందుల కెందులకు వచ్చితివి?" అని ప్రశ్నింపఁగా నాతఁడు "కాన్పించుట లేదా? నేను దరిద్రబ్రాహ్మణుఁడను" అని చెప్పెను. అందులకు రాజు "ఆమాటకు నేను అంగీకరింపఁజాలను. నీవేషము బీదలకు ఉచితమైయున్నదిగాని నీతేజస్సు మహామహుఁడవని తెలుపుచున్నది. అది మాటలవలనను మాటులవలనను ఆచ్ఛాదింపఁబడునది గాదు. నీవిశాలలలాటమును, నీకనుదమ్ములు చూచినను, నీయాజానుబాహువులు చూచినను నాకు అనంత భక్తిభావము గలుగుచున్నది. నీవక్షస్థలము ఏమో వింతగాఁ గాన్పించుచున్నది. నీవు యథార్థము సెప్పుము. ఎవఁడవు? ఇక్కడ కెందులకు వచ్చితివి?" అని మఱలఁ బలికెను. అందులకు బ్రాహ్మణుఁడు మందహాసముగావించి "రాజా, నీవు వివేకివి కాదని నేనుచెప్పఁజాలను గాని నీవివేకము నీజీవితమునకు ఆధారమైన విషయమున మసిపాతచే నాచ్ఛాదింపఁబడిపోయినది. ఏమందువా! అనేక సంవత్సరములనుండి నిర్మలహృదయముతో తపస్సుసేయు మునీశ్వరులకుఁ గూడ అవాఙ్మనసగోచరుఁడగు వానిని నీవు నిర్లక్ష్యముగా నీ వెవఁడవు అని యడుగుచున్నావుగాని తెలిసికొనఁజాలకపోయితివి. ఇంతకంటె నీవివేకము మసిబాఱిపోయినదని చెప్పుటకు ఇంకేమికావలెను? చిరకాలము తత్వవిమర్శచేసియు యోగు లెవ్వని నెఱుంగ లేరో అట్టినేను భక్తపరాధీనుఁడ నగుటవలన స్వయముగ నీకు నాస్థితిగతులు చెప్పుకొనవలసివచ్చినది. భూపతీ, నీవు నన్ను ఆజానుబాహుఁడనంటివి. నాయురముచూచిన నేమోవింతగానున్నదంటివి గాని నేఁటియుదయము సాధ్వీమతల్లి యగు నీభార్యకుఁ జేసిన కఠోరశాసనమూలకముగ పాపాత్ముఁడవగుటవలన నాకుఁ గల నాలుగుబాహువులను, వాని యందలి శంఖచక్రాదికములను వక్షమున నున్న శ్రీగసాగరకన్యను దెలిసికొనఁ జాలకపోయితివి. ఇఁక నెందులకు వచ్చితి వందువా? సకలభువనములును నాయాజ్ఞకు లోఁబడియున్నవి. నాపోషణమున మనుచున్నవి. నాయిచ్ఛవచ్చినట్లు చరించుచున్నవి; గాని నేను భక్తుల వశమున నున్నాను. వారిచే పోషింపఁబడుచున్నాను. వారి యాజ్ఞాప్రకారము ప్రవర్తించు

చున్నాను. పాదరజోలేశమువలన జగత్తులను బునీతములుగావించు నేను భక్తపాదరజమును శిరసావహించుచున్నాను. అందఱిచేతను నుతింపఁబడు నేను భక్తులను నుతించుచున్నాను. ఎల్లరచేతను సేవింపఁబడు నేను భక్తులను సేవించుచున్నాను. నేను అంతటనుగలను; గాని భక్తులు నన్ను దమహృదయకుహరములయందు బంధించివేయుటచే యుష్మదాదులకు అగోచరుఁడనై యున్నాఁడను. నాకు ఎవరివిషయమునను బక్షపాతము లేదు; గాని ప్రయత్నించి చూచినఁ గాని అణువులయందుఁగూడఁ గాన్పింపదు. అట్లే నిశ్చలచిత్తముతోఁ జూచినఁ గాని అణువులయందుఁగూడనిహితమైయున్న నారూపము అనుభూతము గాదు. సాధ్వీమతల్లి యగు నీభార్య సెలవుబడసి నేను ఇక్కడకు వచ్చితిని. రాజ నను గర్వమువలన నీవు నీభార్య మహిమ నెఱుంగలేకున్నావు; గాని బ్రహ్మరుద్రేంద్రాదులును నేనును గూడ నామె కటాక్షము నాసించుకొని యున్నాము. నీవు శుష్కహృదయుఁడవైయైనను నీయర్ధాంగి భక్తిరసబంధుర యగుటవలన నీయెదుట నేను నిలువవలసివచ్చినది" అని తన నిజరూపమును జూపెను.

తోడనే భూపతి గడగడ వడఁకుచు శ్రీహరి పాదములమీఁద వ్రాలి "శ్రీహరీ, సృష్టిస్థితిసంహారకారణచరణా, మహాప్రభూ, అవివేకమువలన నిన్ను దెలిసికొనఁజాలకపోయితిని. శుష్కహృదయుఁడ నగుటవలన నిన్ను గ్రహింపలేక పోయితిని. భక్తమందారా, ఆశ్రితరక్షకా,

"శ్లో. హే గోపాలక, హే కృపాజలనిధే హే సింధుకన్యాపతే
హే కంసాంతక హే గజేంద్రకరుణాపారీణ హే మాధవ
హే రామానుజ హే జగత్త్రయగురో హే పుండరీకాక్ష మాం
హే గోపీజననాథ పాలయ పరం జానామి న త్వాం వినా.

చ. నీవు ప్రసన్నమైన యొక నేరుపు లేటికి? నప్రసన్నత
న్నీవు పరాకుజేసినను నేరుపు లేటికి కంటిమానఁ గృ
ష్ణా, విభుఁ డాదరించు సమయంబున నొల్లము నేను చేతకుం
గావలె నేలతాంగులకుఁ గైంగు సంపదయుఁ బ్రసంగముల్.

శా. ఆనందంబున బాహ్యముల్ మఱచి దూరాత్మాయముల్ బాసినా
ధ్యానుల్ గొల్వఁగ నుండ కానిచి నాగాగోచరంబై యు

దానందాంగణరత్నమై మధురిమాధారార్ణవంబైన యే
దే నత్యుజ్జ్వల మట్టి తేజమున కెంతే మక్కువన్ మ్రొక్కెదన్."

(109 ప. ఆ. 100. 108 ప. ఆ. 2. కృష్ణకర్ణామృతము.)

అని వినుతించుచు అనేకనమస్కారములు చేసెను.

అప్పుడు శ్రీమన్నారాయణుఁడు ఆదరముతో నాతనిని లేవనెత్తి "వత్సా, సంతోషమైనది. నీభార్య జగత్పూజ్యురాలు. ఆమె సాహచర్యమువలన పుష్పసాహచర్యమువలన త్రాడు మహామహుల మూర్ధము లలంకరించునట్లే నీవును నాదర్శనభాషణభాగ్యమును బడసితివి. నీపూర్వపాపము లన్నియు భస్మీపటలములై పోయినవి. ఇప్పుడైనను నీవు బుద్ధిగలిగి మసలుకొనుము" అని చెప్పి అంతర్హితుఁ డయ్యెను. అంతట మెలఁకువరాఁగా నాతఁడు తోడనే భార్యను లేపి ఆమె నెంతో యాదరించి యెంతో కొనియాడి సంగతి యంతయుఁ దెలిపి "మౌఢ్యమువలన నేను నిన్ను అనరాని మాట లాడితిని. వానిని సహింపుము. ఇఁక నాకు బుద్ధి వచ్చినది. నీసాహచర్యమువలన ధన్యుఁడనైతిని. నాపురాకృతపుణ్యవశముననే నీవు నాకుఅర్ధాంగివైతివి. ఇఁక నన్ను మోక్షమార్గమునఁ బ్రవేశపెట్టుము. పూజ్యుఁడగు గురుదేవుని రావించి నాకు జ్ఞానోపదేశము చేయించి పుణ్యము గట్టుకొనుము" అని చేతులు పట్టుకొని అనేకవిధములఁ బ్రార్థించెను. అందులకు ఆమె చాల నానందించి వినయవినమితయై "నాథా, నేను అదృష్టవంతురాలను; గావున నీకు శ్రీమన్నారాయణమూర్తి సాక్షాత్కరించి సంభాషణలాభము నొసంగిపోయెను" అని కొనియాడి రాత్రిశేషమంతయు భగవద్భజనమున గడపెను. మఱునాఁడు ఆమె వార్త నంపఁగా గురుదేవుఁడు వచ్చి భూపతికి జ్ఞానోపదేశము చేసి "భూపతీ, నీవు మహాభాగ్యశాలివి. ఇఁక నీకు మోక్షము కరతలామలకము. కేవల భగవత్సాక్షాత్కారభాగ్యమును బడసిన నీకు మేము బోధింపవలసిన దేమి యున్నది? లోకము పామరులతో నిండియున్నది. పామరులు భాగవతులను జూచి తెయితక్కలాడుచు హేళనసేయుదురు. నిందింతురు; గాని భాగవతులకు దూషణభూషణములతో సంబంధములేదు. నీవు మహారాజపదవినుండి భాగవతస్థానమునకు వచ్చితివి; గావుననే యీవిషయము తెలుపవలసి వచ్చినది" అని చెప్పి వెడలిపోయెను.

పిదప అంగదభూపతియు, భార్యయు నిర్మలహృదయములతో శ్రీహరిని శ్రవణమననధ్యానపూజనాదులచే సంతృప్తిపఱచుచు భాగవతుల నర్చించుచు ఐహికసౌఖ్యములయెడల నిస్పృహులై శాంతముగఁ గాలము గడుపసాగిరి. కొన్నిదినములు జరిగిపోయిన తరువాత భూపతి వైరాగ్యమును దెలిసికొని శత్రురాజులు దండెత్తివచ్చిరి. వారి యాద్ధత్యమును జూచి భీతిల్లియు, తమ్ముని వైరాగ్యమును జూచి కోపించియు రాయసింగు "నీవు ఇట్టు లుండుటవలననే మన కీవిపత్తు సంభవించినది. ఇఁకె భగవధ్యానమును గట్టిపెట్టి యుద్ధరంగమునకుఁ బయలుదేఱుము. విరాగియైనవాఁడు సంసారమున నున్నచో నిట్టివి తటస్థించుచుండును; గావున నీవే యిందులకు బాధ్యుఁడవై యున్నాఁడవు. అయినను గతజలసేతుబంధన మేల? కొంత చతురంగబలములను దీసికొనిపోయి నీవు శత్రువులను దాఁకుము. నేను తక్కినబలముతోఁ గోటను గాపాడుచుండెదను. నీవు పోయి వైరులను జయించి వారివస్తుసమూహమంతయుఁ గొల్లగొట్టి రాఁగలిగితివేని భగవంతుఁడు నీపాలఁ గలఁడని నమ్మెదను" అని తీవ్రముగఁ బలికెను. అది విని భూపతి యేమియు జంకక శ్రీహరిమీఁదనే భారమంతయు నుంచి చతురంగబలములను దోడుకొనిపోయి శత్రువులకు ఎదురొడ్డి నిలిచి "శ్రీహరీ, భక్తచింతామణీ, ఆర్తత్రాణపరాయణా, నాఁడు కుంతీపుత్రునిమీఁదఁజూపిన దయ నామీఁదఁ జూపరాదా?" యని యనేకవిధములఁ బ్రార్థించి యుద్ధముసేయుటకు బలమునకు అనుజ్ఞ నొసంగి తానొకచోఁ గూర్చుండెను. అంతట శ్రీపతి సేనాధిపతిరూపముతో సంగ్రామరంగమున నవతరించి వైరివీరులను దునుమాడి అంతర్ధాన మైపోయెను. భూపతి సైనికులు మహానందముతో జయజయధ్వనులు చేయుచుఁ బోయి శత్రువుల గుడారములను దోఁచుకొనిరి. ఒక సేనాధిపతి వారిధనము జవాహిరి మున్నగునవి కొల్లగొట్టి వచ్చి భూపతికి సమర్పించెను. భూపతియు శ్రీహరికటాక్షమువలననే జయము లభించెనని నమ్మి అన్నగారి సెలవు ఫలించినందులకు సంతోషించి మహానందముతో నగరమునకుఁ బోయి తాను తెచ్చిన రత్నరాసులలో నమూల్యమైన యొకరత్నమును జగన్నాథస్వామికి అర్పింపవలయు నని బాగ్ర

త్తచేసి తక్కినవానిని అన్నగారికిఁ బంపివేసెను. రాయసింగు తమ్ముఁడు విజయము గొనివచ్చినందులకుఁ జాల సంతసించెను.

పిదప నీయన్నదమ్ముల యైకమత్యము నెట్లయిన భగ్నముచేయ వలయునని సమయము నిమిత్తము ఎదురుచూచుచున్నకొందఱు అసూయాంధులు రాయసింగు వద్దకుఁబోయి "ప్రభూ, మీతమ్ముఁడు చేసిన పనిజూచితిరా? ఆతఁడు తెచ్చినరత్నములనన్నిటిని మీచెంతకు బంపెనని మీరు ఆనందించుచున్నారు; గాని మీకు పంపినరత్నముల అన్నిటివెల కంటెను హెచ్చువెల గల నాయకమణిని అతఁడు తన చెంత నుంచుకొనెను. పరీక్ష సేయవలయును" అని విన్నవించిరి. అందులకు రాయసింగు చాలఁ గోపించి "నీవు తెచ్చిన రత్నములను నీవు గాని నేనుగాని ప్రత్యేకముగా నుపయోగించుకొనుటకు అధికారము లేదు. అవి రాజస్వములోఁ జేరినవి. కావున నీవు మిగిలించియుంచుకొన్న పెద్దరత్నమును వెంటనే పంపివేయుము" అని తమ్మునకు వార్త నంపెను. అందులకు భూపతి "ఈయనర్ఘరత్నమును మనకు జయము ఘటించిన జగన్నాథస్వామికి అర్పింప సంకల్పించుకొన్నాను. ఇది రాజస్వములోఁ జేర్చుటకు వలను పడదు తోలుత మీరు దీనిని జమకట్టుకొని పిదప జగన్నాథస్వామికి సమర్పించినట్లు ఖర్చువ్రాసికొనుఁడు" అని ప్రత్యుత్తర మంపెను.

ఈజవాబువలన రాయసింగునకుఁ జాలఁ గోపము వచ్చెను. అంత నాతఁడు తన చెల్లెలినిఁ బిలిచి సంగతి యంతయు నెఱింగించి "భూపతికి విషాన్నము పెట్టుము" అని నియమించెను. అట్లు సేయకున్న తన ప్రాణములు నిలువ వని జడిసి యామె యట్లు చేసెను. అంత నేమియు నెఱుఁగని భూపతి ఆపదార్థమును శ్రీహరికి నివేదించి భగవన్నివేదితాన్నమును భక్తితోఁ దాను భుజింపఁబోయెను. అప్పుడు చెల్లెలు విచారమును భరింపఁ జాలక "అన్నా నీకు అన్నములో విషము పెట్టునట్లు పెద్దన్నసెలవు అయినది. అది విషాన్నము నీవు దానినిఁ దాఁకకుము" అని చెప్పెను. అందులకు భూపతి జంకక "చెల్లెలా, విచారము వలదు. నీవు అన్నగారి సెలవుప్రకారము ప్రవర్తించితివి; గావున నీప్రాణములు నిలిచినవి. ఈయన్నము శ్రీహరికి నివేదింపఁబడినది; గావున నాప్రాణముల కేమియు భయములేదు. ఊరకుండుము" అని చెప్పి

ఆయన్నమును భుజించెను. అంతలి విషము శ్రీహరి కటాక్షమువలన అమృతమై భూపతికి పూర్వాధికమైన తేజస్సు గలిగించెను.

పిదప నాతఁడు "ఇఁక నిక్కడ మనము ఉండుట తగదు" అని భార్యతోఁ జెప్పి జగన్నాథక్షేత్రమునకుఁ బయలుదేఱెను. కొందఱు దుష్టులీసమాచారమును రాయసింగున కెఱింగించిరి. అంతట రాయసింగు "నీవు పోయి వానిని జయించి ఆరత్నమును గొనిరమ్ము" అని మంత్రికి ఆజ్ఞాపించెను. మంత్రియుఁ జతురంగబలములతోఁ బోయి చూచునప్పటికి భూపతి భార్యతో నొక నది యొడ్డున విశ్రమించియుండెను. అట్లు చతురంగబలముతో వచ్చిన మంత్రినిఁ జూచి భూపతి ఆతఁడు రత్నము నిమిత్తమే వచ్చి యుండునని యూహించి దానిని మంత్రికిఁ జూపి "ఇది శ్రీజగన్నాథస్వామికి అర్పింపఁ బడినది. దీని నిమిత్తము ఆశపడుట క్షేమంకరముగాదు" అని పలికి దానినిఁ బొంగి పొరలి ప్రవహించుచున్న యేటిలో విసరివేసెను. మంత్రి దానినిఁ దీయుటకు అచ్చట పల్లెవాండ్రను నియమింపఁగా భూపతి "మంత్రీ, ఏల వాండ్రను శ్రమపెట్టెదవు ? ఆరత్నము ఇఁక మీకు లభింపదు. అది యిప్పుడే శ్రీజగన్నాథస్వామి సన్నిధిఁ జేరుచున్నది" అని చెప్పెను. అదేమో చూడవలయునని మంత్రి జగన్నాథమునకుఁ బ్రయాణము సాగించెను.

రెండుదినములకు వారు జగన్నాథక్షేత్రముఁ జేరుకొనిరి. అంతట వారు స్నానసంధ్యాద్యనుష్ఠానము లన్నియుఁ దీర్చికొనిపోయి స్వామిని దర్శింపఁగా భూపతివిసరివేసినరత్నము స్వామిమెడలోనున్నరత్నహారమునకు నాయకమణియై వెలుంగుచుండెను. అదిగాంచి మంత్రి అబ్బురపడి యారత్న మిచ్చట కెట్లువచ్చెనని యడుగఁగా అర్చకులు "మొన్నరాత్రి మేము నిద్రించుచుండఁగా స్వామి మాకు స్వప్నమున సాక్షాత్కరించి "నాయంతరంగభక్తుఁడు సమర్పించినఅమూల్యరత్నమునాపాదపీఠము మీఁద నున్నది. దానిని నారత్నహారమునకు నాయకమణిగాఁ గూర్పింపుఁడు" అని యానతిచ్చెను. మేము అట్లే చేసితి" మని చెప్పిరి. అదివిని మంత్రి మత్యంత యాశ్చర్యచకితుఁడై యీసంగతి రాజునకుఁ దెలుపవలసినదని దూతల నంపెను. భూపతియు నాతనిభార్యయుఁ దమమీఁద శ్రీజగన్నాథుఁ డపారకృపఁ జూపినందులకు ఆనందపరవశులై :—

"చ. జలనిధికన్యకాఘనకుచస్థలి పచ్చలతాళి గోపికా
విలసితహారసీమమణి విశ్వజగద్వలయప్రకాశకో
జ్జ్వలమహనీయ రత్నమనివారితకాళియభోగభోగమం
డలగిరివజ్రమై వెలయునందతనూజు భజింతు నామదిన్."

(89. ప. 1. ఆ. కృష్ణకర్ణామృతము.)

అని శ్రీహరినిఁ గీర్తించుచు నృత్యము సేసిరి.

దూతలవలన రాయసింగు సంగతి యంతయు విని చాల నాశ్చర్యపడి అంతలో మఱల జ్ఞానము తెచ్చుకొని "అయ్యో, శ్రీహరికి అంతరంగభక్తుఁడగు నాతమ్ముని క్రూరుఁడనై యెంతబాధపెట్టితిని?" అని వగచుచు భార్యతోఁగూడ బయలుదేఱి జగన్నాథము చేరికొని తమ్మునిఁ గాఁగిలించుకొని "తమ్ముఁడా, నీవు ఇంతవాఁడ వని తెలియక రజోగుణదూషితుఁడ నగుటచే నేను నీయెడలఁ జాల దౌర్జన్యమును నెఱపించితిని. నాకు బుద్ధివచ్చినది. నాయపరాధమును క్షమించి పట్టణమునకురమ్ము. అట్లు రావేని నేను ప్రాణములను విడిచెద"నని పలికెను. భూపతి క్షణములో నన్నకు ఇట్టి మార్పును సంఘటించిన జగన్నాథస్వామిని మిగులఁ గొనియాడి అన్నగారితో ఇంటికి బయలుదేఱిపోయెను.

పిమ్మట భూపతి తన గురుపుంగవుని రావించి అన్నగారికి జ్ఞానోపదేశము చేసి మోక్షోపాయము నెఱింగింపవలె నని ప్రార్థించెను. గురువును భూపతి ప్రార్థనమును జెల్లించి వెడలిపోయెను. అదిమొదలు రాయసింగు యథావిధిగా శ్రీహరినిఁ బూజించుచు నుసుమార్గమును దప్పకుండ రాజ్యమును బాలింపఁదొడఁగెను. హరికైంకర్యప్రభావమువలన నాతని బాధ లన్నియుఁ దొలఁగిపోయెను.

భూపతియు నాతనిభార్యయు సదా శ్రీహరిధ్యానమునందే కాలము గడుపసాగిరి. రాయసింగు శ్రీహరిభక్తుల ప్రభావమును జక్కఁగ దెలిసికొని ప్రజలమాధ్యమును దొలఁగించి వారికి ఆత్మజ్ఞానమును హరిభక్తిని బోధింపవలయునని గురువును నియమించెను. కొలఁదిదినములయందే దేశమునం దంతటను శ్రీహరిపూజలు, శ్రీహరిభజనలు, శ్రీహరిధ్యానములు ప్రబలిపోయెను. రుక్మాంగదుని తరువాత మఱల నంతటిభక్తుఁడు రాయసింగే యని శ్రీహరి ఆతని దేశమున నిత్యనివాసము నేర్పఱచుకొనెను. ప్రజ లందఱును హరిభజనము

వలన అసాధారణ ఫలముల నందుచు తమ కిట్టిమహోపకారమును చేసిన రాజునకుఁ జాల కృతజ్ఞులై యుండిరి. బ్రతికియున్నంతకాలమును హరిపూజ చేసి భూపతియు నాతని భార్యయు అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసిరి. రాయసింగు తుదను భార్యతో పరంధామునిలో లీన మయ్యెను. ప్రజలుగూడ నూటికి తొంబదిమంది అవసానమున వైకుంఠమునకుఁ బోవసాగిరి.

“మ. క్రతుభూమిం గోరఁబోవు గోసంగ్రహసంగం బన్న మెట్టేవు గో
తతిహుంకారము విన్నఁ జక్కవవు విద్వద్గోష్ఠిం బక్క నా
నతిగావింతువు గోపజారలను దాంతశ్రేణిఁ గైకొవు మో
గ్యత యేహేతువు ప్రేమకారణము గాదా దేవ నీ చర్యలన్.”

(శ్రీకృష్ణకర్ణామృతము. ఆ. 2. ప.)

33. ఏకనాథస్వామి

“శ్లో. బాలాయ నీలవపుషే నవకింకిణీక
జాలాభిరామజఘనాయ దిగంబరాయ,
శార్దూలదివ్యనఖభూషణభూషితాయ
నన్దాత్మజాయ నవనీతముషే నమస్తే.

(కృష్ణ. ఆ. 2. శ. 74)

పైఠణపురమున సూర్యనారాయణ అను నొక బ్రాహ్మణుడు ఉండెను. ఆతఁడు రామరాజు ప్రార్థింపఁగా విజయనగరమునకుఁ బోయి శ్రీపాండురంగని మరల పంఢరిపురమునకుఁ గొనిపోయిన భానుదాసుని కుమారుఁడు. బాల్యమునం దాతఁడు సకలవిద్యలును అభ్యసించి తలిదండ్రుల యనుమతిని రుక్మిణి యను కన్యను బెండ్లియాడి ధర్మమార్గమును నిర్వహించుకొనుచు అతిథిపూజయు, శ్రీహరిసేవయుఁ దప్పక కాలము గడుపుచుండెను. కొన్ని దినములకు కితనికి ఏకనాథుఁడు అను ఒక కుమారుఁడు గలిగెను. ఆబాలకుని ఎంతో గారాబముతోఁ బెంచు కొనుచు తల్లిదండ్రులు ఉపనయనము చేసి విద్యాభ్యాసము నిమిత్తము

గొప్ప పండితునివద్ద నప్పగించిరి. ఏకనాథుఁడు అసమానధీశాలి యగుటచేఁ గొలఁదిదినములయందే గురువు ఉపదేశించిన సకలవిద్యలును నేర్చుకొని యింటికి వచ్చెను. పిదపఁ దలిదండ్రు లాతనికి ఒక మంచికన్యను దెచ్చి వివాహముగావించిరి.

ఏకనాథుఁడు బాల్యమునుండియు మితభాషి. ఆతఁ డెల్లప్పుడును హృదయమున శ్రీహరిని ధ్యానించుచుండుటచేఁ దగినంతయవసరమువచ్చినఁగాని యొరులతోఁ బలికి యెఱుంగఁడు. భాగవతసేవ యనిన నాతనికిఁ బరమానందము. ఇట్లు జరిగిపోవుచుండఁగాఁ గొన్నిదినములకు జనార్దనయోగి యను నొక మహాత్ముఁ డచ్చటకు వచ్చి మఠమును నిర్మించుకొని యందు వసించియుండెను. ఏకనాథుఁడు ఆతని ప్రభావమును విని యొకనాఁడు మఠమునకుఁ బోయి జనార్దనయోగికి సభక్తికముగా సాష్టాంగనమస్కారము గావించి నిలిచెను. అందుకు యోగి యెంతయుఁ బ్రీతుఁడై "వత్సా, నీతలిదండ్రు లెవరు? నీవు ఇచ్చటి కేలవచ్చితివి?" అని యడిగెను. అందులకు ఏకనాథుఁడు కరములు జోడించుకొని యిట్లుచెప్పెను. "స్వామీ, సకలము నెఱిఁగిన మీరేయట్లు ప్రశ్నించిన నేను ఏమిచెప్పఁగలను? ఇంతవఱకును నాకు ఎందఱో తల్లిదండ్రులైనారు. ఎందఱో అన్నదమ్ములు నెందఱో అక్కచెల్లెండ్రు ఎందఱో ఆప్తబంధువులునైనారు; గాని వారందఱును గతించినారు; వారితో రక్తసంబంధములుగల నాయుపాధు లనేకములు గతించినవి. నేను మాత్రము నిలిచియున్నాను. ఇప్పుడు ఈయుపాధికిఁ దల్లిదండ్రులయినవారును, ఈశరీరమునుగూడ అట్లే యగును గాని నిలువదుగదా? అయినప్పుడు ఈయశాశ్వతపదార్థములను జూచుకొని నేను ఫలానావారివాఁడను అని యెట్లుచెప్పఁగలను? కావున నేను నేనే. నన్ను దెలుపుకొనుటకు నేనే చాలుదును. లోకమునందలి యెల్లరతోఁ బాటు నేనే ఆపరమాత్మయొక్క అనంతకోట్యంశలలో నేనొక అంశమాత్రుఁడను. నేను ఇప్పుడు మీసన్నిధికి జ్ఞానభిక్షనుగోరి వచ్చినాను. అందఱునుగూడ భగవదంశాసంభూతులే యైనను పాంచభౌతికోపాధి నాశ్రయించిన పిదప మాయావృత్తులై మోహాంధులై తమ్ము తామెఱుంగఁజాలకున్నారు. అట్టి వారికి జ్ఞానప్రకాశమును గలిగించి మాయావరణమును దొలఁగించి మోక్షమార్గమునఁ బ్రవేశపెట్టు సాధనము ఆచార్యసేవకంటె

మఱియేమి గలదు? మహాత్మా! లోకములో ఆచార్యులకుఁ గొదవ లేదు. "భగ్నాః కృషి ర్భాగవతా భవంతి" యనునట్లు జీవనోపాధి నిమిత్తము తిరుమణి తిరుచూర్ణములను వెచ్చించువారివలన నేమిప్రయోజనము? ఉపదేశములు చేసి పాదపూజలు దక్షిణలు బహుమతులు ఈనామును సంపాదించు వంచకులవలన నేమగును? నాకీసంసారమును జూచిన భయ మగుచున్నది. శ్రీహరి సేవయే భయార్తులకు తారకమని నిశ్చయించుకొంటిని. ఆచార్యుని నిమిత్తము వెదకుచున్నాను. నన్ననేకులు చేరఁదీయుటకుఁ బ్రయత్నించిరి; గాని భక్తుఁడ ననిపించుకొనుట నాకిష్టము లేదు. నాకుఁ గావలసినది భక్తి. హరిదాసుఁడని పిలిపించుకొనుటకు నే నంగీకరింపఁ జాలను. నేను కాంక్షించునది శ్రీహరి పూజ. శ్రీహరిధ్యానము. శ్రీహరిభజనము. శ్రీహరికటాక్షము. నాకు ఇవి సంఘటింపఁగల యాచార్యుఁడు కావలెను. ఇందునిమిత్తమే వెదకుచున్నాను. ఇప్పుడు మీరు నన్ను పాపపంకమునుండి యుద్ధరింతురనియు, అజ్ఞానాంధ్యమునుండి తప్పింతు రనియు ఆశించి వచ్చితిని. ఈదీనుని, ఈజ్ఞానభిక్షుకుని, ఈయార్తుని, ఈకింకరుని జేరదీసి రక్షింపవలయును.

ఈమాటలు విని జనార్దనయోగి అత్యాశ్చర్యచకితుఁ డయ్యెను. "వత్సా, నీస్థితి యంతయుఁ బ్రపంచమునకుఁ గేవలము వ్యతిరేకముగా నున్నది. బ్రహ్మ నిన్ను ఈప్రపంచము నంతను సృష్టించిన చేతితోఁ గాక మఱియొక చేతితో నిర్మించినట్లు తోఁచుచున్నది. నీప్రాయపు యువకులు అందఱు మాయావృతులై మోహాంధులై ఐహికవాంఛాకూపముల లోఁ గూలఁబడుచుండఁగా నీవిట్లు జ్ఞానభిక్షుకుఁడవై మోక్షేచ్ఛుఁడవై యుండుటవలన నీవు కారణజన్ముఁడ వని తోఁచుచున్నది. నీజిజ్ఞాసాశక్తికిఁ బరమానందభరితుఁడ నగుచున్నాఁడను. భాగవతులకు భగవద్ధర్మమునకంటె భగవంతుని నిమిత్తము వెదకువారు కాన్పించుట ఎక్కుడు ఆనందకారణము. నీవు సదాచార్యునికై యెట్లు లోకము నంతయు వెదకుచున్నావో అట్లే నేను సచ్ఛిష్యునికై ప్రపంచ మంతయు గాలించుచున్నాను. నేఁటికి శ్రీహరికి అనుగ్రహము గలిగినది. రమ్ము. నీ కేమియు లోపములేదు" అని జనార్దనయోగి ఆదరముతోఁ బలికెను.

పిదప ఏకనాథుఁడు కేవల హరిభావన చేసి జనార్దనయోగిని

సేవింపసాగెను. ఏకనాథుని భక్తిని, జ్ఞానజిజ్ఞాసను, దృఢదీక్షను జూచి మిగులనానందించి "వత్సా, నీవు నీతలిదండ్రులకు ఏకపుత్రుఁడవు. వారు నీకొఱకు బెంగటిల్లియుందురు. సంసారనిర్వహణమునఁ జాల చిక్కులు పడుచుందురు; గావున నీకు కొంతధనమిచ్చెదను. దానిని క్షేమవార్తను, నీతలిదండ్రులకుఁ బంపుము" అని చెప్పఁగా ఏకనాథుఁడు గురుదేవా, నాజీవితమును దమ సేవయందు వినియోగించి మీవలన జ్ఞానధనమును బడయవలయు నని వచ్చిన నేను మీవలన ఈధనము నెట్లు గై కొందును? ధనస్వీకారమువలన నాఁ...త్ర్యము, నాచిత్తైకాగ్రత చెదరి పోవచ్చును. ఇది నాయధఃపతనమునకు హేతువు కావచ్చు. అందులకు సందియము లేదు. నన్ను ఉద్ధరింతు నని వాగ్దానముచేసి యిట్లు క్రిందికిఁ ద్రోసివేయు ధనము నిచ్చెద ననుట మీకు న్యాయమా?" యని దీనముగ నడిగెను. అందులకు గురువు ఏకనాథుని నిర్లిప్తతకు ఆనందించియు, ఇందులకు నీవు వ్యతిరేకము సెప్పవలదు. ఇది నీయుపయోగము నిమిత్తము ఇచ్చుట లేదు నీవు నన్ను కోరు నదియు నేను నీకు ఒసంగఁగలదియుఁ గూడజ్ఞానధనము. ఇది కేవలము నీతలిదండ్రులకుమాత్రమే. నేఁటినుండి నీవు ఈనురమునకు సంబంధించిన లెక్కలు వ్రాయవలసియున్నది. గావున దీనిఁ బంపుటకు నిన్ను నియమించితిని" అని నచ్చఁ జెప్పఁగా ఏకనాథుఁడు మాఱువలుకక అట్లే చేసి నాఁటనుండియు మఠమునకు సంబంధించిన ఆయవ్యయములను వ్రాయఁదొడఁగెను.

కొన్నిదినములు గడచినతరువాత జనార్దనయోగికి శిష్యునిసామర్థ్యమును, దీక్షను బరీక్షింపవలయు నని తలంపు గలిగెను. ఈయూహతో నాతఁడు "లెక్కలను బూర్తిచేసి తెమ్ము. ఒకమాఱు తనిఖీచేసెదను" అని ఏకనాథునకు సెలవిచ్చెను. అంతట ఏకనాథుఁడు మహాప్రసాదము అని లెక్కలను దెచ్చుటకుఁ బ్రారంభించెను.

ఏదో పొరపాటువలన లెక్కలలోఁ గొంచెము తేడా వచ్చెను. దానినిగనిపెట్టి సరిచేయ నిశ్చయించి ఏకనాథుఁడు ఆచార్యుఁడు నిద్రించునంతదనుక సేవలు చేసి పిదప భుజింపకయే దీపముచెంతఁ గూరుచుండి గంటమును తాటియాకులును గైకొని తదేకదీక్షతో లెక్కలు వ్రాయసాగెను. మూఁడుజాముల రాత్రి యగునప్పటికి జనార్దనయోగికి మెలకువ వచ్చెను. మఱల నిద్ర రాదయ్యెను. అంత నాతఁడు మఠమున

నిటునటు తిరుగుచు ఏకనాథుని మామూలుగా శయనించు స్థానమును గానక ఏమయ్యె నని యాత్రముతోఁ గొంచెము ముందునకుఁ బోయి ఏకనాథునిఁగాంచి ఇదియేమో పరీక్షింపవలె నని రహస్యముగా నొక చోట దాఁగెను. కొంతతడవు కష్టపడునప్పటికి లెక్క సరిపడెను. తోడనే ఏకనాథుఁడు మహానందభాష్పములు చెలంగ బళియని చేతులు తట్టుచు లేచి నిలిచెను. అందులకు అబ్బురపడి జనార్దనయోగి అతని ముందునకుఁబోయి "వత్సా, ఎందుల కీయానంద?" మని ప్రశ్నింపఁగా ఏకనాథుఁడు అంతయు నెఱింగించెను అదివిని యోగి"వత్సా, నీచిత్తాగ్రత యసమానమైనది. నీభక్తియచంచలము. నీనిష్ఠ అనుపమానము. ఇంత స్వల్పవిషయమునఁగూడ యథార్థము తెలియనంతదనుక నిద్రయు నాహారమును మాని కార్యవిజయమును బడసిన నీకు భగవత్సాక్షాత్కారము అయి తీరును. ఇంతటి మనోనిగ్రహమును నేనన్యత్ర చూడలేదు. ఇఁక మోక్షము నీసొమ్ము. భగవత్సేవలోఁ గూడ నిట్టి చిత్తైకాగ్రతయు, నిట్టినిష్ఠయు, నిట్టి దీక్షయు, నిట్టిమనోనిగ్రహమును జూపెదవేని నీకు ఇఁక లేని దేమి గలదు?" అని యెంతో మెచ్చుకొని తారకమంత్రము నుపదేశించి యాదరించెను.

ఏకనాథునకు అంతకంతకు గురుభక్తియు గురుసేవానిరతియు నధికము కాసాగెను. అందులకుఁ బరమానందభరితుఁడై జనార్దనుఁడు "వత్సా, నీకు నాగురుదేవుఁ డగు దత్తాత్రేయస్వామి దర్శనభాగ్యము గలిగింపఁ దలఁపుగలుగుచున్నది. ఆతఁడు ఒక్కొకపుడు,విపరీతవేషము తోడను,విపరీతచేష్టలతోడను సాక్షాత్కరించుచుండును. అందులకునీవు ఏమియు సందియంపడక ఆమహాత్మునిపాదములపై వ్రాలిశరణుగోరుము. నీవు ముక్తుఁడవయ్యెదవు"అని చెప్పఁగా ఏకనాథుఁడు"మహాత్మా, నాకు దత్తాత్రేయస్వామితో నేమిపని? మీపాదములేనాకు ముక్తినొసఁగసమర్థములై యున్నవి"అని ప్రత్యుత్తరము చెప్పెను. అయినను బలవంతము చేసి ఏకనాథుని వెంట నిడుకొని ధ్యానింపఁగా తురుష్కవేషముతో నశ్వారూఢుఁడై వచ్చిన దత్తాత్రేయస్వామికి జనార్దనుఁడు వినయవినమితుఁడై మ్రొక్కెను. అదిచూచి ఏకనాథుఁడు రిచ్చవడుచుండఁగా జనార్దనుఁడు తన యోగబలమువలన నచ్చట షడ్రసోపేతమైన భోజనమునుగల్పించిగురువుతోఁగూడభుజింపసాగెను. అపుడుదత్తాత్రేయుఁడు

"జనార్దనా, చిత్తశుద్ధిగలవాఁడైనచో నీశిష్యునిఁగూడఁ బిలువు" మనియెను. జనార్దనుఁడు రమ్మని చేతితో సంజ్ఞ చేసెను; గాని "తురుష్కునితోఁ గలిసి భుజించుటకు నామన సంగీకరింపదు" అని యనుకొనుచు ఏకనాథుఁడు దూరముగాఁబోయెను. కొంతసేపటికి దత్తాత్రేయస్వామి తిరోహితుఁ డయ్యెను. అంత ఏకనాథుఁడు జనార్దనయోగిని సమీపించి "మహానుభావా, సాక్షాత్తుగ బ్రహ్మామూర్తు లగు తమరు అధముఁడగుతురుష్కునితోఁగలిసి యేకపాత్రమున భుజింపవచ్చునా?" యని యడిగెను. "వెఱ్ఱివాఁడా, నే నెంతచెప్పినను వినవైతివి. కేవలము మూఢునివలెఁ బ్రవర్తించితివి మహాయోగులకుఁగూడ జన్మజన్మాంతరములయందును లభింపని యోగిరాజు దేవుని దర్శనము సులభముగా లభించినను నీవు వారి యనుగ్రహమును సంపాదించుకొనఁజాలకపోయితివి. కేవలమును బాహ్యవేషమును జూచి మోసపోయితివి. కొల్లి నీవు బాహ్యవేషమును జూచి ఆచార్యు లని తలంపరా దని చెప్పి అంతరంగమే ప్రధాన మని యనున్యసించియు నిప్పుడు ఇట్లు అజ్ఞానాంధ్యమునఁ బడిపోవుట చాల విచారకరము. ఇంకను మించిపోయినది లేదు. ఈతడవ నైనను జాగ్రత్తగా నుండుము" అని జనార్దనయోగి మందలింపఁగా ఏకనాథుఁడు "మహానుభావా,నాకు దత్తాత్రేయస్వామియనుగ్రహము గలుగలేదని విచారము లేదు. తలక్రిందఁగొంకను బెట్టుకొని రాళ్లకొఱకు వెదకులాడినట్లు కేవలము హరిస్వరూపు లగు మీయనుగ్రహము సులభమైయుండఁగా నెవరినో ఆశ్రయింపవలసిన పని యేమున్నది? ఇంతకును భక్తపరాధీనుఁడైనచో దత్తాత్రేయుఁడు మీకు శిష్యుఁడనై నంతమాత్రముననే న న్ననుగ్రహింప వచ్చును" అని బదులు చెప్పెను.

"నీకు ఏమియుఁ దెలియదు. ఊరకుండుము" అనిచెప్పి జనార్దనయోగి మఱియొకనాఁడు ఏకనాథుని వెంటనిడుకొని అరణ్యమునకుఁ బోయెను. అచట మఱలధ్యానింపఁగా దత్తాత్రేయుఁడు కామధేనువును కుక్కఁగాఁ జేసికొని వెంట నిడుకొని తాను ఫకీరు వేషముతో వచ్చెను. జనార్దనయోగి మఱల నాతని పాదముల మీఁద వ్రాలి యథాపూర్వముగ మాటలాడసాగెను. కొంతసేపయినతరువాత ఫకీరు సంచిలోని రొట్టెను దీసి కుక్కపాలలో ముంచుకొని తినుచు "నీకు అనేఁడు అంత

రంగశిష్యుఁడైనచో రప్పింపుము"అని యానతిచ్చెను. జనార్దనుఁడును మహాప్రసాద మని కుక్కపాలలో రొట్టె ముంచి తినుచున్న ఫకీరుని, గాంచి ఏవగించుకొనుచున్న ఏకనాథునిఁ గొనివచ్చి దత్తాత్రేయ స్వామి ఉచ్ఛిష్టమగు రొట్టెముక్క నిచ్చి తినుము అని యాజ్ఞాపించి ఆతని పాదములమీఁదఁ బడవేసి "దేవా, ఈదాసానుదాసునిరక్షింపవలయును"అనిప్రార్థించెను. దత్తాత్రేయుఁడు సంతోషించి "ఈతఁడుగొప్ప భక్తుఁడై భాగవతమును మహారాష్ట్రభాషలో రచించిచాల హరికీర్తనలురచించి అనేకమానవుల పామరత్వమును దొలగించును" అని అనుగ్రహించెను. ఈలోపుగా ఏకనాథుఁడు రొట్టెముక్కనవ్వలఁ బాఱవేసెను. అప్పుడు జనార్దనుఁడు ఏకనాథుని లేవనెత్తి "వత్సా, శ్రీదత్తాత్రేయస్వామికి నీయెడలననుగ్రహము గలిగినది. వారిభుక్తిశేషమునుస్వీకరించితివా లేదా!"అన యడిగెను. అంతట ఏకనాథుఁడు తాను చేసినఅకృత్యమునకు పశ్చాత్తాపపడుచు సంగతి యంతయు గడగడ వడఁకుచుఁ జెప్పెను. అందులకుఁ జాల నొచ్చుకొని జనార్దనుఁడుదత్తాత్రేయస్వామియుచ్ఛిష్టమగు తమలపాకులతమ్మును స్వీకరించిఏకనాథునినోట వేసెను. తోడనే ఏకనాథునిహృదయము నిర్మలమై యాతనికి సర్వజ్ఞత్వముగలిగెను. అగుట నాతనికి ఆచార్యసేవాప్రభావము కరతలామలక మయ్యెను. అంతంతకు ఆతనికి గురుభక్తి పెరిగిపోయెను.

ఇది యంతయుఁ జూచి జనార్దనయోగి "దత్తాత్రేయస్వాముల యనుగ్రహమువలన నీతఁడు మహాత్ముఁడై నాఁడు. ఈతనివలనఁ బరిచర్య చేయించుకొనుట నరకహేతువు"అని తలంచి ఏకనాథునిఁబిలిచి" నీవు ఇఁక పైఠణపురమునకుఁ బోయి మాతాపితృశుశ్రూషతోడను,భగవద్భాగవతారాధనము తోడను పామరులకు భక్తిజ్ఞానవైరాగ్యమునుపదేశించుటతోడను కాలముఁ బుచ్చుము. గురుదేవుని మాట అవిలంఘ్యము. ఇఁక మాఱు వలుకకుము" అని నియమించెను. అంతట జేయునది లేక ఏకనాథుఁడు "నేను మిమ్ము. విడిచియుండఁజాలను.అయినను మీయాజ్ఞను జవదాటినచో నేను నరకకూపమునఁ గూలఁ బడిపోదును;గాన అట్లే చేసెదను"అనినవిన్నవించిపాదములమీఁదవ్రాలి బాష్పధారచే పాదప్రక్షాళనము గావించి వెళ్లలేక వెళ్లలేక యెట్లో మనస్సురాయిచేసి వెడలిపోయెను. అతనిరాకకు తలిదండ్రులెంతయు

నానందించిరి. పిదప నాతఁడు గుర్వాజ్ఞానుసారముగాఁ బ్రవర్తించుచు సతతము హరిభజనము సేయుచు భోజనానంతరము పురాణకాలక్షేపముచేసి పామరుల అజ్ఞానమును బోఁగొట్టుచుండెను.

ఆతని భక్తిప్రపత్తులకు మెచ్చి పాండురంగఁడు ఒకనాఁడు స్వప్నమున సాక్షాత్కరించి "వత్సా, నీసేవవలన నానందముగలుగుచున్నది. నీవు వాల్మీకిప్రోక్తమగు రామాయణమును మహారాష్ట్రభాషలో రచియింపుము. ఆగ్రంథము జదువుకొని అనేకమూఢజనులు తరింతురు" అని యాజ్ఞాపించి యదృశ్యుఁడయ్యెను. తోడనే మేల్కాంచి ఏకనాథుఁడు భగవంతునకుఁ దనమీఁద గలిగినయనుగ్రహమునకు ఆనందానందకందళితహృదయారవిందుఁడై అనేకవిధముల స్వామిని నుతించి మఱునాఁడే "భావార్థరామాయణము" అను పేరుతో భగవంతుని యాదేశమును నిర్వర్తింపసాగెను. ఈసంగతి విని ప్రక్కయింటి బ్రాహ్మణుఁడొకఁడు "ఈతఁడెక్కడ? మహారాష్ట్రభాషలో రామాయణమును వ్రాయుటెక్కడ? అట్లయిన రామాయణ మంతయు పిప్పియైపోదా?" యని యచ్చటచ్చట నిందచేయుచుండెను. ఇది కర్ణాకర్ణిగా వినవచ్చినను ఏకనాథుఁ డందులకేమియు సమాధానముచెప్పక తదేకదీక్షతో గ్రంథరచనము చేయసాగెను. ఒకనాఁడు సుందరకాండమములో సీతాన్వేషణమునిమిత్తము అంజనాదేవికుమారుఁడు మహేంద్రపర్వతముమీఁదినుండి సముద్రమును దాఁటి లంకలోఁ బ్రవేశించెనని వ్రాయుచుండఁగా ఆంజనేయుఁడు ఆతనియందుఁ బ్రవేశించి కోటగోడమీఁద కూర్చున్నయట్లుగా ఎత్తి ఆతనిని నిందించుచున్న బ్రాహ్మణునియింటిముందు పడునట్లు చేసెను. ఉన్నట్లుండఁగా నేదో గుభీలున చప్పుడు అగుటచే ఆబ్రాహ్మణుఁడు అదరిపడి వీథిలోనికివచ్చి అంతయుఁ జూచి ఏకనాథుని చేతులలో తాటాకుల సంచికయు గంటమును ఉండుటఁ జూచి అందలివిషయము చదివి ఆంజనేయుని యనుగ్రహమువలననే యిట్టిది సంభవించె నని యెఱింగి ఉపచారముచేసి ఇంటికిఁ బంపివేసెను.

పిదప నాబ్రాహ్మణుఁడు ఏకనాథునివలన నుపదేశమును బడయఁ గోరి ప్రార్థింపఁగా నాతఁడు "ఈతఁడు నిన్నటివఱకును నాయెడల నసూయగలవాఁడు. ఇంతలో నీతనికి ఈభక్తి యెట్లుగలిగెను? ఇది స్థిరమా?" యని సందేహించి "అయినను పరీక్షింపకుండ శిష్యునికి ఉపదేశము

చేయుటకు శాస్త్రము నిషేధించుచున్నది. బోధార్థియై వచ్చిన వాని గుణగతములను బరీక్షింపక వచ్చినవెంటనే ఉపదేశము చేయుట ధనమును, పేరును, గౌరవమును, పూజను యాచించువారు చేయవలసినది. నేను అట్లు చేయఁజాలను. తొందరపడి యుపదేశము చేసినచో పిదప శిష్యుఁడు మంచివాఁడుగాకున్న గురువునకు అధఃపతనము తటస్థించును" అని తలంచుకొని పరీక్షించుటకు నిశ్చయించి "రేపు నేను పంఢరినాథునిఁ బూజించుచుందును. ఆసమయమున రమ్ము" అని యాతనికిఁ జెప్పి పంపివేసెను. పిదప నాతఁడు ఇంటిలోని వారి నందఱను బిలిచి "నేను రేపు పాండురంగని పూజించునపుడు అది తెండు, ఇది తెండు, అని యాజ్ఞాపించెదను గాని మీరు ఏరును నాకుఁ బలుకవలదు. మీరప్పనిలో మీరు నిమగ్నులై యుండుఁడు" అని యాజ్ఞాపించెను.

ఏకనాథుని యాజ్ఞాప్రకారము బ్రాహ్మణుఁడు పూజాసమయమున వచ్చి చెంతఁ గూరుచుండెను. అప్పుడు ఏకనాథుఁడు "ఓహోయి, ఎవరచ్చట? స్వామి అభిషేకార్థము జలము కావలెను" అని చాలసారులు పిలిచెను; గాని సంకేతానుసారముగ నింటిలోనివా రెవరును బలుకరైరి. అంతట ఏకనాథుఁడు "నేఁడు అందఱును గూడ స్వామిని మఱచి ఎంత మూఢులైనారు ?" అని ఆశ్చర్యపడుచు తానే పోయి జలము తెచ్చుకొని సమస్తకార్యములను నిర్వర్తించుకొని అతిథిసమర్చనము చేసి తచ్ఛేషమును తాను భుజించి "ఈబ్రాహ్మణుఁడు ఇంటిలోనివారు పలుకకుండుట చూచియు తాను పోయి జలము తీసికొనిరాక నేను స్వయముగఁ దెచ్చుకొనుచున్నను ఏమియు నెఱుఁగనట్లుకూర్చుండెను. ఆచార్యభక్తి లేని యిట్టి వానికి ఉపదేశము చేయుట యెట్లు?" అని సందేహించి "ఉపదేశము చేయుటకు ఇది మంచిసమయము గాదు. స్వామికి అనుగ్రహము గలుగలేదు. ఇంకొకనాఁడు చూచుకొందము లే" యని బ్రాహ్మణునిఁ బంపివేసెను. పిదపఁ గొన్నిదినములకు పాండురంగాజ్ఞచేఁ బ్రారంభించిన రామాయణమును ముగించి పిదప దత్తాత్రేయస్వామియాజ్ఞను దలంచికొని భాగవతమును గూడ మహారాష్ట్ర భాషలో రచించి అనేకకీర్తనములుచేసి పామరులకు మోక్షమార్గమును జూపెను.

ఏకనాథునిభక్తిప్రపత్తులు దినదినమును వృద్ధికాసాగెను. శ్రీహరి

హృదయము పూర్తిగ నేకనాథునిపై లగ్నమయ్యెను. ప్రేమాతిరేకంబున నారాయణుఁడు బ్రాహ్మణయువకుని వేషమున ఏకనాథునియింటికి వచ్చి "మహాత్మా, నాకెవ్వరును బంధుమిత్రులు లేరు. కేవలము ఏకాకిని. నీసమాచారము విని నిన్ను సేవించి తరింపవలయునని తలంచి వచ్చితిని. నాకు జీత మక్కఱలేదు. అన్నవస్త్రము లిచ్చినఁ జాలును. నీయింటి పరిచర్య యంతయు నేనే చేసెదను. నాకెవ్వరును సాయ మక్కఱలేదు. నాకు నీయనుగ్రహ మొక్కటియే కావలయును. అభయ మిమ్ము" అని ప్రార్థించెను. అందులకు ఏకనాథుఁడు ఆనందించి "వత్సా, దీనికై నన్నింతగాఁ బ్రార్థింపనేల! లోకములో మానవుఁడు నాది యని చెప్పుకొనుటకు తగినవస్తువు ఏదియు లేదు. అంతయు ఈశ్వరుని యాస్తి. నేను వాడుకొనుచున్న ఈయింటిమీఁదను, ఇందలి వస్తువులమీఁదను ఈశ్వరసంతానమున కంతకు నధికారము గలదు. కావున నీవు ఇందు వసించుటకును, ఇందలి సామగ్రిని వాడుకొనుటకును నాయనుజ్ఞను బడయవలసిన పని యేమియు లేదు. నీవు అభయము వేఁడితివి. శ్రీహరిని నమ్ముము. హరిభక్తులకు భయము అనునది లేదు. ఆచార్యసేవను, భాగవతారాధనమును జేయుచుందువేని నీకు మోక్షము కరతలామలకమగును. నీవు ఇక్కడనుండి అతిథిపూజలో నాకొకింత సాయపడెదవేని చాల నానందించెదను" అని పలికెను. యువకుఁడు చాల నానందించి ఏకనాథుఁ డడుగఁగాఁ దనపేరు కృష్ణుఁడని యెఱింగించి ఆతని యింటఁ బ్రవేశించెను.

దేవత లందఱును ఈసంగతిని దివ్యదృష్టివలనఁ దెలిసికొని పరమాశ్చర్యచకితులైరి. కాలము గడచిపోవుచుండఁగా ఏకనాథునియింట నాతని తండ్రి యాబ్దికము వచ్చెను. అప్పుడు ఏకనాథుఁడు "కృష్ణా, నేఁడు మాతండ్రిగారి యాబ్దికము. బ్రాహ్మణనిమంత్రణముచేసి వచ్చితిని. సకల పదార్థములును నీవు త్వరగా సిద్ధముచేయవలయును" అని నియమించి తాను స్నానము చేసి వచ్చి దొడ్డిలో వస్త్రముల నారవేసికొనుచుండెను. ఇంతలో కృష్ణుఁడు దేవతలకుఁ గూడ నోరూరునట్లు సకల పదార్థములును అతిచాతుర్యముతో వంటఁ దొడఁగెను. ఆపరిమళము నాఘ్రాణించి ఏకనాథుని పూలదోఁటలో చాకిరీచేయు మాలవానిభార్య తన నాథునితో "నేఁడు మన యజమానుని యింట శ్రాద్ధ

మగునఁట. అందులకై యాపిన్నబాపనయ్య అన్నిపదార్థములును వండుచున్నాఁడు. వాని సువాసన ఇక్కడకుఁగూడ వ్యాపించుచున్నది. బ్రాహ్మణులు లేచిపోయినతరువాత పెంటమీఁదఁ బాఱవేయు విస్తరి ఆకులలో మిగిలియుండు పదార్థములను మనము జాగ్రత్తచేసికొని చక్కగా భుజింపవచ్చును" అని చెప్పెను. అందులకుమాలవాఁడునిరాశ ప్రకటించుచు "ఎలగొంతెమ్మ కోరికలు కోరెదవు. శ్రాద్ధదినమునాఁడు బ్రాహ్మణులు ఎంగిలియాకులను పెంటమీఁదఁ బడవేయక అగ్నిలోఁ గాని, గోతిలోఁ గాని, ఏటిలోఁగాని పడవేయుదురు. అగుటచే మనకు ఏమియు లభింపవు" అని పలికెను. ఇదివిని మాలెత చిన్నవోయెను. ఈమాటలు ఏకనాథునకు వినవచ్చెను. తోడనే యాతని హృదయము జల్లు మనియెను. "ఈశ్వరసంతానములో భేదములను జూపుట కేవలము అవివేకము. కృష్ణుఁడు వండుచున్న పదార్థముల సువాసనవలన ముగ్ధులై తోటపనివాండ్రు వానిని కోరుచున్నారు. వారికి ఆపదార్థములను ఇచ్చి తృప్తిపఱుపకున్న నేఁడు నాతండ్రిగారి యాబ్దికము ఫలింపదు" అని తలంచి కృష్ణుని బిలిచి సంగతియంతయు నెఱింగించి "నీవు వండిన పదార్థమంతయు మాలవాండ్రకుఁ బెట్టుదము" అని మాలపల్లెయందలి మాలవాండ్ర నందఱను రాపించి తన వీథిలో బారులు తీర్చి కూర్చుండఁజేసి సకలపదార్థములును వాండ్రకు వడ్డించి జగత్పితయగు శ్రీహరినిఁ దలంచికొని భుజింపుఁడు అని యాజ్ఞాపించెను. ఏకనాథుని భార్యగూడ ఆనందించి అందులకు చాల తోడ్పడెను. మాలవాండ్రు తామెన్నఁడును ఎఱుఁగని క్రొత్తపదార్థములను భుజించి అమితానందపరవశులై యేకనాథుని నుతించుచు తమతమయిండ్లకుఁ బోయిరి.

ఆగ్రామమునందలి బ్రాహ్మణు లందఱు నీసమాచారమును విని గుమిగూడి "తండ్రి యాబ్దికమునకు ఉపయోగము చేయఁదలఁచిన పదార్థములను చండాలురకు వినియోగించిన ఏకనాథుని మనము వెలివేయుదము" అని నిశ్చయించుకొని ఆతని యింటికి వచ్చి "నీకు పితృదేవతలకంటె చండాలురే పూజ్యులైరి; గావున నీయట్టివానికి బ్రాహ్మణులకంటె చండాలురే శ్రేష్ఠులు. ఇఁకమాతో నుండి ఏల కులము చెఱుపుకొందువు ? నేఁటినుండి నీవు చండాలురతోడనే భోజనప్రతిభోజనాదికములు చేసికొనుచుఁ దరింపుము. నేఁటితో నీకును మాకును సంబంధము

వదలి పోయినది" అని చెప్పిరి. అదివిని యేకనాథుఁడు జరిగిన సంగతి యంతయు నెంత వినయముతో చెప్పినను వారు వినక "ఇఁక నీకు నీవే మాకు మేమే" యని చెప్పి పయిమాట వినిపించుకొనకయే వెడలి పోయిరి. అందులకు ఏకనాథుఁడు భీతచిత్తుఁడై "సంగతి సందర్భము లాలోచింపకుండ నీబ్రాహ్మణులు నామీఁద నాగ్రహమును వెడలఁ గ్రక్కుచు వెడలిపోయిరి. ఇఁక వీరు నాయింటికి రారు. పితృకార్యమును ఎట్లు నిర్వర్తించుకొందును?" అని విచారింపసాగెను. మొదటినుండియు నంతయుఁ జూచుచున్న కృష్ణుఁడు అప్పుడు "మహాత్మా, ఏల వగచెదవు? మూఢులగు ఈబ్రాహ్మణులతో నీకు ఏమిపని? ఒక్కమాఱు శ్రీహరిని ప్రార్థించి పితృదేవతల నాహ్వానింపుము. శ్రియఃపతి యనుగ్రహము వలన నేఁడు నీపితృదేవతలే పూజను గైకొని వెడలిపోవుదురు" అని చెప్పెను. ఏకనాథుఁడు ఈయుపాయము బాగుగ నున్నదని సంతసించి మఱల పాకము సిద్ధముచేయించి.—

ఉ. "కోరిక లిచ్చినన్ గనకు గూర్చిన జీవనజీవితమ్ము లే
దారి నొనర్చినన్ దెలివిఁ దార్చినఁ దల్లియుఁ దండ్రియుం బలెన్
నేరము లోర్చినన్ దరుగ నేర్పుగఁ దీర్చినఁ గల్కిఁ జేర్చినన్
భారము నీవ కాని మఱి యంబుజనాథ యెఱుంగ నన్యులన్."

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 104.)

అని త్రికరణశుద్ధిగా శ్రీమన్నారాయణునిఁ బ్రార్థించి పితృదేవతల నాహ్వానించెను. తోడనే పితృదేవతలు సాక్షాత్కరించిరి. ఇఁక ఏకనాథుని యానందము నేమని చెప్పవచ్చును? ఈయానందాతిరేకమువలన నాతఁడు పరవశుఁడై "మహాత్మా! ఆలసించిన పితృదేవతల కపరాధము చేసిన ట్లగును" అని ప్రబోధింపఁగా మహానందముతోడను, అచంచలభక్తి తోడను, పితృదేవతల నారాధించి వారిని సంతోషపెట్టెను. ఈసంగతి యెట్లో క్షణములో గ్రామ మంతయుఁ దెలిసిపోయెను. తోడనే బ్రాహ్మణు లందఱును మఱల గుమిగూడి "అయ్యో, మనము ఏకనాథుని ఎంత చులకనగఁ జూచితిమి. ఆతఁడు శ్రీమన్నారాయణుని యాంతరంగికభక్తుఁడు అనుటలో ఏమియు సందేహము లేదు. అట్టి వానినిఁ దిరస్కరించి మనము సాపరాధుల మైతిమి. ఆతఁడు ఎట్లయినను అనుగ్రహింపవలయు నని మనలను ఇంతకుమున్ను ప్రార్థించెను

గదా? ఆప్రకారము మన మాతనిని ప్రాయశ్చిత్తము గావించి మనలోఁ గలుపుకొందము. లేకున్న కీడు మూడవచ్చును" అని తలంచి తిన్నగా ఏకనాథునియింటికిఁ బోయిరి. అప్పటి కప్పుడే అక్కడ ఆరాధనాది కము లన్నియు ముగియుటవలన ఏకనాథుని పితృదేవతలు మఱల స్వర్గమునకుఁ బోయిరి.

తనయింటికి వచ్చిన బ్రాహ్మణులను వారు తనకు చేసిన యపకారము నేమియు మనస్సున నుంచుకొనక ఏకనాథుఁడు చాల గౌరవించి ఆగమనకారణ మడిగెను. అప్పుడు బ్రాహ్మణులలో నొకఁడు "ఏకనాథా! ఈబ్రాహ్మణబృందమునకు నీమీఁద ననుగ్రహము గలిగినది. కావున నీవు ప్రాయశ్చిత్తము చేసికొనుము. అట్లయిన నీవు కులములోఁ జేర్చికొనఁ బడుదువు" అని చెప్పెను. ఏకనాథుఁ డిది యనవసరమని యెఱింగియుండియు అందఱకు వ్యతిరేకము సేయనేల? యని అందుల కంగీకరించెను. వెంటనే బ్రాహ్మణులు తమ పాచిక పాఱినందులకు ఆనందించుచు ప్రాయశ్చిత్తము నెఱవేర్చుటకు ఏకనాథుని నదీతీరమునకుఁ గొనిపోయిరి.

అట ప్రాయశ్చిత్తము ప్రారంభ మగునప్పటికి యొక బ్రాహ్మణుఁడు వచ్చి "ఇందఱిలో ఏకనాథస్వామి లెవరు?" అని యడిగెను. ఆతనితో నీకు ఏమిపని యని బ్రాహ్మణు లడుగ నాతఁడు "అయ్యా, నను జూచుట లేదా? నేను చాలకాలమునుండి ఈకుష్ఠరోగముచే బాధపడుచు ఈశ్వరానుగ్రహమునఁ గాని యిది నివృత్తియగునది కాదని నిశ్చయించుకొని పరమేశ్వరుని గుఱించి తపస్సు ప్రారంభించితిని. కొన్నిదినములకు నాకు త్రిలోచనుఁడు సాక్షాత్కరించి "వత్సా, పైఠణపురమున నుండు ఏకనాథస్వామి అను శ్రీహరి యంతరంగభక్తుఁడు నేఁడు పితృశ్రాద్ధమున కుద్దేశింపఁబడిన పదార్థములతో అనేకచండాలురను భగవత్స్వరూపులుగా భావించి సంతృప్తులంగావించెను. ఆతఁడు విశుద్ధభక్తితో నా కార్యమును నెఱవేర్చెను; గావున భగవంతుని కది ఆనందసంధాయకమయ్యెను. ఒక చండాలస్త్రీ శిశువునకు అన్నదానము సేయుటవలనఁ గలిగెడి సుకృతములో నొకభాగము నీవు ఆతనివలనఁ బడసితివేని సఫల మనోరథుఁడ వగుటయేగాక అవసానమున హరిసాయుజ్యముఁ బడసెదవు" అని యానతిచ్చెను. కావున నేను ఆభాగవతోత్తముని వెదకుకొనుచు వచ్చినాను"అని చెప్పెను. అదివిని బ్రాహ్మణు లందఱు నాశ్చర్యపడి యిది

యేమో చూడవలయు నని తలంచి అతనికి ఏకనాథునిఁ జూపిరి. ఆగంతుకుఁడు ఏకనాథునకు సాష్టాంగనందన మాచరించి తన స్థితిగతు లన్నియు శివాజ్ఞను దెలిపి రక్షింపుమని ప్రార్థించెను. ఏకనాథుఁ డిదివిని "అయ్యా, పార్వతీనాథుఁడు నీయభీష్టమును నెఱవేర్పఁగలిగియుండియు నీభారమును నామీఁద మోపుట నాయదృష్టమేగాని వేఱుగాదు. తెలిసినంతవఱకు నేను భగవంతుని, భాగవతులను నిష్కామకర్మతో నారాధించుచున్నాను. కావున చండాలస్త్రీశిశువునకు అన్నదానము చేయుటవలన గలిగిన పుణ్యములో నొక భాగము నీకు సమర్పించుటకు నాకేమియు నభ్యంతరము లేదు. నీవు అంగీకరించెదవేని ఆసుకృతమంతయు నానందముతో నొసంగఁగలను" అని పలికెను. అందులకుఁ జాలసంతసించి ఆగంతుకుఁడు "మహాత్మా, నీవంటి పరమభాగవతోత్తములు నిర్లిప్తతకుఁ బేరుగదా? అయినను నేను శివానుమతిని మీఱఁజాలను. ఆసుకృతములో నొకభాగముమాత్రమే నేను స్వీకరింతును. అంతకంటె నాకు వలదు" అనిచెప్పను. తోడనే ఏకనాథుఁడు ఆగంతుకుఁడు కోరినది నిశ్చలచిత్తముతో ధారాపూర్వకముగ దానముచేసెను. అది స్వీకరించిన వెంటనే పరమాసహ్యముగా నున్న ఆగంతుకుని దేహము వజ్రదేహ మైపోయెను. అదిచూచి ఏకనాథునకుఁ బ్రాయశ్చిత్తము విధించిన బ్రాహ్మణులందఱును దెల్లవోయి భయభ్రాంతులై పాదముల మీఁదవ్రాలి "మహాత్మా, నీమాహాత్మ్యము నెఱుంగక చేసిన మాయపరాధమును మన్నింపు"మని ప్రార్థించిరి. ఏకనాథుఁడు వారి నందఱను లేవనెత్తి తన యింటికిఁ గొనిపోయి షడ్రసోపేతమయిన భోజనము పెట్టి చందన తాంబూలము లిచ్చి సత్కరించి పంపివేసెను.

ద్వారకాపురమున మఱియొక బ్రాహ్మణుఁడు, శ్రీకృష్ణుని సందర్శనముగోరి తీవ్రనిష్ఠతోఁ దపస్సుసేయుచుండెను. పదునాలేండ్లు గడచిన తరువాత ఆతనికిఁ గృష్ణునిభార్యలు స్వప్నమున సాక్షాత్కరించి "బ్రాహ్మణుఁడా, వ్యర్థముగా నిక్కడ నేల కాలము గడపెదవు? తీవ్రతపోనిష్ఠచే నీశరీరము నేల కృశింపఁజేసికొందువు? నీవుకోరియున్న శ్రీకృష్ణుఁ డిప్పు డిచ్చట లేఁడు. ఆతఁడు పైఠణపురమున నున్న ఏకనాథుఁడు అను భాగవతాగ్రేసరునియింట పరిచారకుఁడై యున్నాఁడు. అక్కడకుఁ బొమ్ము. అచ్చట ఏపరిచారకునకు కృష్ణుఁ డను పేరుండునో యా

తఁడే శ్రీకృష్ణుఁడని యెఱుంగుము. మాహృదయేశుఁడు మమ్ము విడిచి పోయి పండ్రెండుసంవత్సరము లైనది. నీవు ఆతనిని దర్శించి మమ్మిట్లు విడిచియుండుట ధర్మము గాదని విన్నవించి తోడుకొనిరమ్ము" అని చెప్పి తిరోహితులై పోయిరి. తోడనే బ్రాహ్మణుఁడు మేలుకొని స్వప్నవృత్తాంతమును దలంచి శ్రీకృష్ణుఁడు భాగవతాగ్రేసరుఁడగు ఏకనాథునకు పరిచర్య చేయుచున్నందులకు ఆశ్చర్యచకితుఁడై వెంటనే బయలుదేఱి పైఠణపురమునకు వచ్చి సూర్యోదయ మగునప్పటికి ఏకనాథునియిల్లు జేరుకొనెను. అప్పు డేదోపనిమీఁద ఏకనాథుఁడు వీథిగుమ్మములో నిలిచియుండెను. ఆగంతుకుఁడు ఆతఁడే ఏకనాథుఁడు అని దివ్యతేజస్సువలన గుర్తెఱింగి వందనమాచరించి "నేను ద్వారకావాసిని బ్రాహ్మణుఁడను. నీయింటఁ బరిచర్య చేయుచున్న కృష్ణునినిమిత్తము వచ్చితిని. ఆతనిం జూపవలెను" అని కోరెను. ఏకనాథుఁడు ఆతని నెంతో ఆదరించి లోనికిఁ గొనిపోయి "అయ్యా, కృష్ణుఁడు జలము తెచ్చుటకు ఏటికిఁ బోయియున్నాఁడు. "క్షణములో రాఁగలఁడు" అని చెప్పెను.

అట్లే యొకక్షణము గడచునప్పటికి కృష్ణుఁడు ఏటినుండి నీళ్లకావడి మోసికొని వచ్చెను. తోడనే ఆగంతుకుఁడు ఆతని కాళ్లమీఁద వ్రాలి "శ్రీహరీ, సర్వేశ్వరా, నీకు ఇట్టి పక్షపాతము తగునా? లోకములో నెందఱో భక్తులు నీనిమిత్తము వెదకుచుండ నీవిట్లు ఏకనాథుని యింట దాఁగియుండుట తగునా? రాధారుక్మిణులను వియోగముపాలు చేసి యిచ్చట నేకాకివై యుండుట ధర్మమా? జగన్నాయకా! నీసంకల్పమాత్రమున నీజగమంతయుఁ బ్రవర్తిల్లుచున్నది. అయినప్పుడు నీవు ఏకనాథునకుఁ గావలసిన నీళ్లు కావడితో భుజముమీఁదఁ బెట్టుకొని తేవలయునా? దేవతలందఱును నీపరిచారకులై యుండ వారిని నియమింపక నీవే ఏకనాథునకుఁ బరిచర్య చేయ నేల? రమాపతీ, అంతయు నెఱుఁగుదును. ఏకనాథుని భక్తి యచంచలమైనది. ఆతని భక్తివలన నీవు విమోహితుఁడవైతివి. కావుననే యిట్టి పనులు చేయుచున్నావు. దామోదరా, గోవిందా, పదునాఱుసంవత్సరములనుండి నీనిమిత్తము తపించుచున్నాను. ఒక్కక్షణమైన ఏకనాథునివిడిచి వచ్చి నన్ను ఉద్ధరింపరాదా? ఒక్క యేకనాథునినిమిత్తము లోకములో అనేకభక్తుల ఆశాలతలను ద్రెంపివేయవచ్చునా?" అని వాపోవఁ దొడఁగెను. అది చూచి

ఏకనాథుఁడు తెల్లవోవుచుండఁగా కృష్ణుఁడు మందహాసముగావించుచు కావడి నక్కడదింపి అదృశ్యుఁడయ్యెను. తోడనే "నన్ను చూచినంతనే నీవు మాయమైపోయితివి. ఏకనాథునిఁ బండ్రెండు సంవత్సరములు కొలిచితివి. అచ్యుతా, అనంతా నారాయణా, నీకిట్టిది తగునా? నేను నీకు భారముగాఁదోఁచితినా?" యని ఆగంతుకుఁడును "మాధవా, మధుసూదనా, నేనేమి పాపము చేసితి నని యిట్టి విపరీతము చేసితివి? నాచే పరిచర్య చేయించుకొనుటకు మాఱుగ నీవు నాకే పరిచర్య చేసి నన్ను కుంభీపాకనరకమున నేల గూలఁద్రోసితివి? నేను నిన్నెప్పుడును మఱువలేదు పేరుప్రతిష్ఠలనిమిత్తము నిన్ను గొలువలేదు. ఇంకేల నాకీయపకారము చేసితివి? పండ్రెండు సంవత్సరములు నాయింట సకలహీనకార్యములును జేసి నాపాపము పండించితివా? ఇంతకాలము నాయింట నుండియు కలలోనైన దర్శనమిచ్చి యథార్థము నెఱింగించి జ్ఞానభిక్ష దయచేయవైతివి. ఎక్కడ నుండియోవచ్చిన యీబ్రాహ్మణశ్రేష్ఠునకు క్షణములో దర్శనమిచ్చితివి. అయ్యో, ఇఁక నేనెట్లుసహింతును?" అని ఏకనాథుఁడును, ఇదంతయువిని వచ్చి "పద్మనాభా, ఇది యేమివిపరీతము? నేను గాని నానాథుఁడు గాని నీయెడలఁ జేసిన యపరాధ మేమున్నది? మమ్ము ఇట్లేల వంచించితివి! నానాథుఁడుతినివిడిచినను ఆకులుపాఱవేసితివి. నానాథుఁడు కట్టివిడిచినబట్టలు ఉతికితివి. నాయింట స్థలశుద్ధి చేసితివి. కావడిభుజముమీఁదఁ బెట్టుకొని కావలసినన్ని నీళ్లు తెచ్చితివి. ఇదంతయు నేల చేయవలెను? ముకుందా, మురారీ, మాపై నీకింత యాగ్రహ మేల కలుగవలెను? మేము నిన్ను పొగడితిమి గాని తెగడలేదు. పూజించితిమి గాని నిందింపలేదు. ప్రార్థించితిమి గాని తిరస్కరింపలేదు. అట్టిచో మాకీపాటు నేలకూర్పవలెను?" అని ఏకనాథుని గృహిణియు నదేపనిగ విచారింపసాగిరి.

ఇట్లు కొంతతడవు జరిగిపోయినతరువాత ఆగంతుకుఁడు "మీభాగ్యము నేమని కొనియాడవచ్చును? ప్రపంచమునం దంతటను గలభక్తులలో శ్రీహరికి అంతరంగికభక్తులుమీరే. కావున శ్రీమన్నారాయణుఁడు మీయింటపరిచారకుఁడైనాఁడు. శ్రీపతి భక్తులయెడలఁ జూపించు ననుగ్రహము ఇంతకంటెఁ గలదా? ఆహా, మీదంపతు లెంత పుణ్యాత్ములు! మీహృదయములను విడిచి శ్రీహరి మఱియొకచోట నుండఁజాలఁ

డు. మీారిఁక నేలవగచెదరు? మీాయనుగ్రహమువలన నాకుఁగూడ శ్రీహరిసాక్షాత్కారము సంఘటిల్లినది" అని వారికి సాష్టాంగనమస్కారములాచరించి తన దారినిఁ బోయెను.

పిదప ఏకనాథుఁడును అతని భార్యయు పూర్వాధికభక్తితో భగవద్భాగవతారాధనము ప్రారంభించిరి. ఇట్లుండఁగా నొకనాఁడు జ్ఞానదేవుఁడు ఏకనాథుని స్వప్నమున సాక్షాత్కరించి "వత్సా, అలకాపురమున నాసమాధిప్రక్క నొకరావిచెట్టు పెరుగుచున్నది. దానివ్రేళ్లు నాసమాధికి భంగము కలిగింపఁబోవుచున్నవి. కావున నీవు వచ్చి ఆచెట్టు చచ్చిపోకుండ దూరముగ నాటుము" అని చెప్పి అంతర్హితుఁడయ్యెను. వెంటనే ఏకనాథుఁడు మేల్కాంచి స్వప్నవృత్తాంతమును భార్య కెఱింగించి మహానందపరవశుఁడై భగవంతునిఁగీర్తించి నృత్యముచేసి అలకాపురమునకుఁ బోయెను. అచటి జనులందఱును ఏకనాథునిఁ జాల గౌరవించిరి. పిదప ఏకనాథుఁడు సిద్ధేశ్వరుని దర్శించి తన యాగమనకారణమునువిన్నవించి యనుగ్రహము చూపవలయునని ప్రార్థించి జ్ఞానదేవుని సమాధిచెంతకుఁ బోయి ప్రదక్షిణనమస్కారములు చేసి తపోనిష్ఠుండయ్యెను. కొంతసేపటికి. జ్ఞానదేవుఁడు సాక్షాత్కరించి "వత్సా, ఏల జాలము సేసెదవు? వృక్షమును పెరికి మఱియొకచోట పాతుము" అని యానతిచ్చి యంతర్హితుఁడయ్యెను. తోడనే ఏకనాథుఁడు లేచి చిన్ని మొలకనుబోలె ఆపెద్ద రావిచెట్టును దానొక్కరుఁడు నవలీలగఁ బెరికి మఱియొకచో నాటి శిల్పుల ననేకులను రావించి జ్ఞానదేవునిసమాధిని మరస్మతు చేయుటకు నియమించెను.

గాని అనేకులు క్రొత్తగా వచ్చుటచే అప్పురమునందలి కోమటులు భోజనపదార్థములను సమకూర్పఁజాలకపోయిరి. అంతట శ్రీహరియే యొక కోమటిరూపముతోవచ్చి శిల్పులు పనిచేయుచోటికి సమీాపమున దుకాణము పెట్టి వారికిఁ గావలసిన వస్తువులన్నియు లేదనక అరువుగా నీయసాగెను.

కొన్ని దినములకు సమాధిపని పూర్తి యయ్యెను. అప్పుడు కోమటి ఏకనాథుని యెదుటకు వచ్చి "మహాత్మా, మీారు నాకు ఈయవలసినధనము మఱియొకప్పు డీయవచ్చును. ప్రకృతము నాకు మీాతో రావలెనని వాంఛ గలదు. సెలవు దయచేయవలె నని ప్రార్థించెను. అందులకు

ఏకనాథుఁడంగీకరింపఁగా నందఱును పైఠణపురమునకు బయలుదేఱిరి; గాని కొంతదూరము వచ్చినతరువాత కోమటి తనసామానులతోఁ గూడ నదృశ్యుఁ డయ్యెను. అది చూచి ఏకనాథుఁడు శ్రీమత్పండరినాథుఁడే కోమటియైవచ్చెనని యానందమును బట్టఁజాలక నృత్యము ప్రారంభించెను. ఆతని వెంట శిల్పులుగూడ నృత్యము చేయసాగిరి. పిదప ఏకనాథుఁడు పైఠణపురముఁ జేరుకొని బ్రతికియున్నంతకాలమును భగవద్భాగవతారాధనము గావించి యవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను.

చ. "అలరు పసిండి కింకిణులు నందెలు మువ్వలు రావిరేక సం
కులపు లగోరుఁ దాయెతులు గుప్పెడుపుస్తెలు నాలుమద్దికా
యలు గల నందనందను దిగంబరుఁ జారుకటీతటోజ్జ్వలత్
విలసితనీలదేహు నవనీతహరుండగు బాలుఁ గొల్చెదన్"

(కృష్ణకర్ణా. 2. ఆ. 57. ప.)

---

34. కబీరుదాసుఁడు

శ్లో. శత్రుచ్ఛేదైకమంత్రం సకలముపనిషద్వాక్యసంపూజ్యమంత్రం
సంసారోత్తారమంత్రం సముచితసమయే సంగనిర్యాణమంత్రం,
సర్వైశ్వర్యైకమంత్రం వ్యసనభుజగసందష్టసంత్రాణమంత్రం
జిహ్వే శ్రీరామమంత్రం జపజప సఫలం జన్మసాఫల్య మంత్రం"

(రామకర్ణా. 1 ఆ. 73 ప.)

గంగాతీరమునందలి యొకపల్లెలో నొకతురుష్కుఁడు కాపురము ఉండెను. ఆతఁడు వస్త్రములు నేసి తన్మూలమున ధనము సంపాదించి సంసారమును నిర్వహించుకొనుచుండెను. ఒక్క సంతానహీనత తక్క నాతనికి మఱియొక చింతాకారణము లేదు. సంతానమునిమిత్తము ఆతఁడును భార్యయు రాత్రింబవళ్లు సర్వేశ్వరునిఁ బ్రార్థించుచుండిరి; గాని వారి కోరిక ఫలించునట్లుతోఁచ లేదు.

ఇట్లుండఁగా నొకనాఁడు తురుష్కుఁడు గంగకుఁ బోయి నూలు కడుగుచుండెను ఇంతలో నొక పెద్దముత్యపుచిప్ప ఆతనిచెంతకుఁ గొట్టుకొనివచ్చెను. దానిలోఁ గా నందొక బాలుఁడు ఉండెను. ఉదయద్భా

తమును జూచి యాతఁడు తెల్లవోయి అంతలోఁ బ్రబోధితుఁడై తనకు సంతానము లేని కొఱంత తీర్చుటకు భగవంతుఁడు ఈబాలుని ఈతీరునఁ బంపె నని భావించి తటాలున వాని నెత్తికొని యింటికిఁ గొనిపోయి భార్యకు సంగతి యంతయు నెఱింగించి "నేఁటితో మనకు బిడ్డలు లేని కొఱంత తీఱినది. ఈముద్దుబాలునిఁ బెంచుకొందము" అని చెప్పెను. ఆతని భార్య బాలసూర్యునివలెఁ బ్రకాశించుచున్న యాబాలకునిఁ జూచి పరమానందభరితురాలై భర్తమాటల కంగీకరించెను. దైవ మాయ లెఱుంగ శక్యము గాదుగదా! ఆరమణి ఆబాలకుని ఎత్తుకొనిన వెంటనే స్తనములయందు పాలు చేఁపెను. అందులకు మఱింత వింత పడి యామె "యీబాలునిఁ బెంచుటకు ఈశ్వరుఁడు నాకే నియమించి నాఁడు. కావుననే యిట్లు అయినది" అని యుప్పొంగిపోయెను.

ఇట్టి యానందముతో ఆదంపతులు ఆబాలుని కడుపునఁ బుట్టిన వాని కంటె మిక్కిలి ప్రేమతోఁ జూచుచు కబీరు అని పేరు పెట్టి ప్రాణపదముగాఁ బెంచుకొనసాగిరి. కొన్నిదినములకు కబీరు మాట లాడ నేర్చెను. అందులకు తల్లిదండ్రు లబ్బురపడుచుండఁగా నా బిడ్డఁడు తఱుచు రామరామా యని ఈశ్వరస్మరణము చేయసాగెను. అదిచూచి ఆదంపతులు ఆశ్చర్యచకితులైరి. అయినను తండ్రి యందు లకుఁ గోపింపక "భారతీయుల తత్వము అసాధారణము. తొల్లి హిరణ్య కశిపుఁడు అను రాక్షసుఁడు తన చిన్నికుమారుఁడు తన శత్రువగు శ్రీహరిని ప్రార్థింపఁ బూనఁగాఁ జాల కోపించి ఆమాట మానుమని దండించెనఁటగాని బాలుఁడు మాననందున తండ్రి దయమాలి య నేకవిధముల దండించెనఁట. ఆబాలకునియిష్టదేవుఁడందులకుఁగోపించి సభామండపముసందలి స్తంభమున సాక్షాత్కరించి హిరణ్యకశిపునిఁ జిత్రవధ గావించి యాబాలభక్తునిఁ గాపాడెనఁట. భారతీయుల దేవుఁడు అనియు, తురకలదేవుఁ డనియు వ్యవహారమునందే భేదము గాని యథార్థమునకు జగత్తునకెల్ల ఈశ్వరుఁ డొక్కఁడే. మానవులు ఆతనికి భిన్నరూపములు, భిన్ననామములు గల్పించుచున్నారె గాని ఆతనియం దేమియు భేదము లేదు. కావున మన బిడ్డఁడు రామరామాయనినను అల్లాహో అక్బర్ అనినను మనము కోపింపవలసిన పని లేదు. ఇంత చిన్నతనము నుండియు భగవద్భక్తి గలిగిన బాలుఁడు మనబిడ్డఁడగుట

మన పుణ్యవిశేషము" అని తన భార్యకుఁ జెప్పెను. కబీరు తల్లి గూడ నట్లే చెప్పెను.

కబీరునకు యుక్తవయస్సు వచ్చినతరువాత తండ్రి యాతనికి వస్త్రములనేత బాగుగానేర్పి చక్కని పిల్లనుదెచ్చి పెండ్లిగావించెను; గాని కబీరుమాత్రము సంసారమనిన చాల కంటగించుకొనుచు సదా రామనామమును స్మరించుచు కాలము గడుపసాగెను. ఇట్లుండఁగా నాతనితండ్రి చనిపోయెను. సంసారభార మంతయు కబీరుమీఁదఁ బడెను. అయినను ఆతఁడు అందు మమతను వహింపక దూరముగా నుండసాగెను. ధనము సంపాదించువారు లేకపోవుటచే ఖాళీఅయిన బియ్యపుకుండ మఱల పూర్తి గాదయ్యెను. అదిచూచి ఆతనితల్లి చాల మందలించి వస్త్రములునేయుమని నిర్బంధించెను. అందులకు వ్యతిరేకము సేయ లేక కబీరు వస్త్రమునేయుటకుఁ బ్రారంభించెను; గాని యాతని హృదయమునేతమీఁద అంటనే లేదు. రెండుమూరలు నేయునప్పటికి ఆతనిహృదయము రామనామస్మరణము ప్రారంభించెను. అప్పుడు ఆతఁడు నేత మానివేయుటచే ఆతని యిష్టదైవ మగు శ్రీరాముఁడు వచ్చి నేఁత ప్రారంభించెను. కొంతసేపు కబీరును కొంతతడవు శ్రీరామచంద్రుఁడును జొప్పున నొకదినములో ఆవస్త్రమును నేసివేసిరి. అదిచూచి తల్లి "ఈవస్త్రము చాల బాగుగా నున్నది. కావున బజారునకుఁ బోయిన చాల వెలవచ్చును. వెంటనే పోయి విక్రయించి రమ్ము" అని కుమారునకు ఆజ్ఞాపించెను. కబీరు తల్లి యనుజ్ఞను నెఱవేర్చుటకు బయలుదేఱి పోయి బజారులోఁ గూర్చుండి "ఈవస్త్రము నమ్మెదను. కావలసినవారు వచ్చి కొనుక్కొనుఁడు" అని యొకటిరెండు తడవలు కేకలువేసి అంతలో రామస్మరణప్రారంభించెను. ఈస్మరణవలన నాతనికి తన్మయత్వము గలిగెను. ఇఁక నాతఁడు ప్రపంచము నెఱుఁగఁడు.

బజారునకు వచ్చిపోవువా రనేకులు కబీరుముందట నున్న ఆవస్త్రమును జూచి "ఇది చాల బాగుగా నున్నది; గాని యిది జమీందారులుకొనవలసినదిగాని మనము కొనఁజాలము" అని చేతితో నైనఁ దాఁకకయె వెడలిపోవుచుండిరి. ఇట్లు కొంత సేపుఅగునప్పటికి సాయంత్రము అయ్యెను. రాత్రి అయ్యెను. దుకాణదారు లందఱును వెడలిపోయిరి. కబీరుఒక్కఁడుమాత్రమె అక్కడఁ గూర్చుండియుండెను. కొంతసేపటికి

ఆతఁడు మఱలఁ బ్రపంచమునఁ బ్రవేశించి బజాఱు అంతయు జనశూన్యమైపోవుటఁ జూచి "నేఁడు వస్త్రము అమ్ముడుపోదయ్యెను. విక్రయింపక యేయింటికిఁ బోయిన మాతల్లి దండించును" అని తలంచి ఆప్రాంతమున నున్న యొకగుడిలోఁ దూఱి శ్రీరామనామస్మరణము ప్రారంభించెను.

భగవంతునకు కబీరు హృదయనైశ్చల్యమును భక్తిపారవశ్యమును బరీక్షింప నాసక్తి వొడమెను. అక్కట నాతఁడు వృద్ధబ్రాహ్మణరూపముధరించి అతిజీర్ణవస్త్రము కట్టుకొని వడవడవడఁకుచు వచ్చి "మహాత్మా, వృద్ధుఁడను. దరిద్రుఁడను. చలిచే బాధపడుచున్నాను. నాకేదయిన వస్త్రమును ఇచ్చి పుణ్యము గట్టుకొనుము" అని ప్రార్థించెను. అందులకు హృదయము కరఁగఁగా కబీరు తన చెంత నున్న వస్త్రములో సగము చించి యిచ్చి మఱల ధ్యానము ప్రారంభించెను. శ్రీహరి మఱికొంత సేపటికి ఫకీరురూపముతో వచ్చి "ఓయీ, పరమేశ్వరుఁడు నిర్గుణుఁడై యుండఁగా నీవు సగుణోపాసన జేసెద వేల?" యని ప్రశ్నించెను. దాని మీఁదఁ జాల వాదము జరిగెను. "భగవంతుఁడు ప్రపంచమునందంతటను వ్యాపించియున్నాఁడు. ఈవిధముగా నాతఁడు సగుణుఁడును నిర్గుణుఁడును గూడనై యున్నాఁడు. అదియుఁగాక, పరమేశ్వరుఁడు భక్తముక్తిప్రదాయకుఁడు గదా! మాయావృతమైన యీప్రపంచమున అధర్మము విజృంభించినప్పుడెల్ల ఈశ్వరుఁడు ధర్మసంస్థాపనార్థము సగుణుఁడై సాక్షాత్కరించును; గాని పరప్రత్యయనేయబుద్ధు లీరహస్యము నంగీకరింపరు. భక్తపరాధీనుఁ డగుటచే సర్వశక్తుఁడగు ఈశ్వరుఁడు భక్తులెట్లు ప్రార్థించిన నట్లు సాక్షాత్కరించును. అంతేగాక ప్రపంచములో భగవంతుని అంశలు అనేకకోట్లు స్వరూపములై యుండఁగా భగవంతుఁడు స్వరూపి గాఁడని చెప్పు టెట్లు? భక్తికి లక్ష్యము సగుణబ్రహ్మము. నీవు సగుణబ్రహ్మము లేదందువేని భక్తి యనునది వ్యర్థము. నిర్గుణబ్రహ్మము జ్ఞాన్యుపాస్యము. సగుణబ్రహ్మము భక్తోపాస్యము. ఈరహస్యము నెఱుంగక చాలమంది భక్తికిని నిర్గుణబ్రహ్మమునకు లంకెపెట్టఁజూచి సంకరులై భ్రష్టులయ్యెదరు. నీవుగూడ నీయవివేకవాదమును బ్రారంభించితివేల?" యని కబీరు ప్రశ్నించెను. ఫకీరు కబీరు చెప్పిన యుక్తులకు సంతుష్టుఁడై "వత్సా, చలిబాధ దుస్సహముగానున్నది. ఏదైన వస్త్రమునీయఁగలవా?" యని యడిగెను. అంతట కబీరు ఆనందముతో తనచెంతనున్న

సగమువస్త్రమును ఇచ్చి,ఫకీరు నంపివేసి వస్త్రము వెల పోలేదనుచింత మాని నిశ్చలచిత్తుఁడై రామస్మరణప్రారంభించెను.

పిదప భగవంతుఁడు బ్రాహ్మణరూపము ధరించి కబీరు నింటికిఁ బోయి ఆతని తల్లినిఁ బిలచి "నీ కుమారుఁడు అమ్ముటకుఁ గొనిపోయిన వస్త్రమును రెండు ముక్కలుగా చించి ఒక బ్రాహ్మణునకును,ఫకీరునకును ఇచ్చివేసి నిన్ను జూచుటకు భయపడి యొకపాడుగుడిసెలో శ్రీరామనామధ్యానము చేయుచుఁ గూర్చుండియున్నాఁడు. నీకిది తగదని నేనెంత చెప్పినను వినలేదు" అని చెప్పెను. అందులకు "ఏమి చేయుదును నాయనా? వానికెప్పుడు రామనామస్మరణయే మాకింతఅన్నము పెట్టి తరువాత వాఁడు తనయిచ్చవచ్చినట్లుఉండరాదా? ఇంటికి రానిమ్ము. శిక్షించెదను" అని పలికెను. బ్రాహ్మణుఁడు "కబీరు నేఁడు ఇంటికి రాఁడు. చాల వెలరావలసిన వస్త్రమును దానము చేసినందులకు నీవు ఏమందువో యను భయంబున నాతఁడు దాఁగి యున్నాఁడు. కావలయు నేని నాతోఁగూడ రమ్ము చూపెదను." అని పలికెను. వెంటనే యామె యాబ్రాహ్మణునితో బయలు దేఱెను.

అప్పటి కింకను కబీరు సమాధినిష్ఠుఁ డయియేయుండెను బ్రాహ్మణుఁడు గుడిసెబైట నిలిచి "అడుగో నీకుమారుఁడు." అనిచూపి యామెను లోనికిఁ బంపెను. క్షుధార్తయై యున్న యామె కుమారునిఁజూచి "నీవు విక్రయించుటకుఁ దెచ్చిన వస్త్రమేదిరా?" యని గద్దించి యడిగెను. సమాధినిష్ఠుఁడై యున్న కబీరునకుఁ దనతల్లివచ్చినసంగతియే తెలియదుగదా? అంత నామె తనకు జంకియే పలుకకున్నాఁడని తలంచి అచ్చటఁబడియున్న కఱ్ఱతీసికొని "ఇంకను పలుకవేమి?" యని కొట్టెను అప్పటికిని కబీరునకు ప్రాపంచికస్మృతి రాలేదు; గాని యాదెబ్బ కబీరునకు మాఱుగా బ్రాహ్మణరూపముతో గుడిసెబైట నున్న శ్రీహరికిఁ దగిలెను. అంత శ్రీరామచంద్రుఁడు కబీరుని అచంచలభక్తికి ఆనందించి కోదండపాణియై హనుమత్సీతాలక్ష్మణభరతశత్రుఘ్నసమేతుఁడై సాక్షాత్కరించెను. వెంటనే కబీరు స్వామిపాదములమీఁద వ్రాలి,—

చ. "దురితలతాలవిత్ర ఖరదూషణకాననవీతిహోత్ర భూ
భరణకళావిచిత్ర భవబంధవిమోచనసూత్ర చారువి
స్ఫురదరవిందనేత్ర ఘనపుణ్యచరిత్ర వినీలభూరికం
ధరసమగాత్ర భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ."

చ. "అగణితజన్మకర్మదురితాంబుధిలో బహుదుఃఖవీచికల్
దెగిపడ నీఁదలేక జగతీధవ నీపదభక్తినావచేఁ
దగిలి తరింపఁగోరితిఁ బదంపడి నాదు భయంబు మాన్పవే
తగదని చిత్తమందిడక దాశరథీ కరుణాపయోనిధీ."

(దాశరథీశతకము. 9. 46. ప.)

అని యనేకవిధములఁ బ్రార్థించెను. శ్రీరామభద్రుఁడందునకు మహానందకందళితహృదయుఁడై ఆదరముతో కబీరుని లేవనెత్తి "వత్సా! ఆనందమైనది. ఇట్టి యచంచలనిష్ఠ నేను మఱి యెచ్చటను జూడలేదు. నీవు నావాఁడవు. నీకు నేమియుఁ గొఱంత లేదు" అని చెప్పి, అతనిఁ దల్లిని జూచి "రమణీ! నీకుమారుఁడు నాకు అంతరంగభక్తుఁడు. ఆతనికిఁ దల్లి వగుటచే నీకుఁగూడ నాదర్శనము లభించినది. పసిపాఁగఁ గట్టిన మాణిక్యమువలె నుండుటచే నింతవఱకును నీకొడుకు ప్రభావమును దెలిసికొనఁజాలకపోయితివి. ఇఁకనైన నీవు ఆతనిని సామాన్యునిగా భావింపకుము. నీవుగూడ ఇది మొదలు నన్ను సేవించుచుండుము" అని పలికి చూచుచుండఁగా నదృశ్యుఁడయ్యెను. కబీరు తల్లి యిదియంతయుఁ జూచి పరమాశ్చర్యచకితయై కొంతసేపు నిశ్చేష్టయై యుండి పిదప కుమారుని ఆలింగనము చేసికొని ప్రియమార ముద్దాడి "నాచిట్టితండ్రీ, నీవిట్టివాఁడవని యెఱుంగక నిన్ను దండించితిని. అందులకు నగవకుము. నీ యనుగ్రహమువలన నేనుగూడ దరించితిని." అని ఎంతో మక్కువఁజూపి యింటికిఁ గొనిపోయెను.

శ్రీరామభద్రుఁడు సాక్షాత్కరించినది మొదలు కబీరు తల్లిగూడ నిశ్చలభక్తిపరురాలై రామనామస్మరణము చేయుచు నప్పుడప్పుడు తన్మయతఁ గాంచుచుండెను. కబీరుభార్యగూడ నిట్లే యెల్లప్పుడును రామ రామా యని రామస్మరణ చేయుచుండెను. ఇట్లు కాలము గడచిపోవుచుండఁగా కబీరుభార్య గర్భవతియై నవమాసములు మోసి శుభముహూర్తమునఁ జక్కనికుమారునిఁ గనియెను తల్లిదండ్రులు ఆపాపనికి కమాల్ అని పేరుపెట్టి గారాబముతోఁ బెంచుకొనసాగిరి. కమాలు మాట్లాడ నేర్చినది మొదలు ఇంట నెల్లపుడును శ్రీరామనామమును బ్రతిధ్వనించుచుండుటచేఁ దానుగూడ రామస్మరణము చేయసాగెను. అందులకు ఆతని తల్లిదండ్రులు పరమానందభరితులైరి. కమాలు తండ్రివలన జ్ఞానోపదేశమును బడసి సదా తారకమంత్రమునే జపించుచు యుక్తవయస్కుఁడైన

పిదప నొకనాఁడు తండ్రినిఁ జూచి "తండ్రీ, నాకు తీర్థయాత్ర సేయవలయునని తలంపు గలదు. నీయనుజ్ఞ యయ్యెనేని సంతసించెద" నని విన్నవించెను. అంత కబీరు కుమారుని సత్సంకల్పమున కమితానందమును గాంచి "వత్సా, పోయిరమ్ము" అని యాజ్ఞాపించెను.

కమాలుదాసుని భక్తిప్రపత్తులకు అద్భుతాశ్చర్యనిమగ్నులై మార్గమధ్యమున ననేకులు ఆతనిని దమ గృహములకుఁ బిలుచుకొని పోయి చాల నాదరింపసాగిరి. ఆతఁ డీతీరున అనేకభక్తులచే నాదరింపఁబడుచు ననేకతీర్థములను సేవించి తుదకు భీమరథీనదీతీరమునకు వచ్చి నదిలో స్నానమాడి తీరమునఁ గూర్చుండి తారకమంత్రమును జపించుచుండఁగా నొక భక్తుఁడు వచ్చి ఆతని తేజస్సును జూచి ఆశ్చర్యచకితుఁడై యనేకవిధములఁ బ్రార్థించి యాతనిం దనయింటికిఁ దోడ్కొనిపోయెను. కమాలు ఆతనియింట నున్న నాలుగుదినములలో నాకుటుంబమునందలివారి కందఱకును ప్రపంచముయొక్క అస్థిరతను బోధించిభక్తి జ్ఞానవైరాగ్యములను బోధించి తారకమంత్రము నుపదేశించి మోక్షమార్గమును జూపెను. అందులకు మహాసంతసమగ్నుఁడై యావర్తకుఁడు "నాకుటుంబమునంతను పాపపంకమునుండియుద్ధరించిన యీమహాత్ముని నేనేమి సత్కరింపఁగలను?"అని యోచించి తనయింట నున్న రత్నముల అన్నిటియందును నాయకమణి యగుదానిని గొనివచ్చి స్వీకరింపవలసినదని ప్రార్థించెను; గాని కమాల్‌దాసు "అయ్యా, నన్నేమనిభావించితివి? నేను ఉపదేశములు చేసి పాదపూజ అను పేరున ధనము సంపాదించుటకు రాలేదు. నాచేతనైనంతవఱకును మాయావృతమయి అంధకారకూపమునఁ గూలిపోవనున్న ఈశ్వరసంతానము నుద్ధరించి జ్ఞానప్రకాశము నొసంగుటయే నాపని" యని దానిని తిరస్కరించెను. వర్తకుఁ డెన్నివిధముల ప్రార్థించినను కమాల్‌దాసుఁ డంగీకరింపకపోవుటఁ జూచి "ఇది యీతని కీయవలయునని సంకల్పించుకొంటిని. అట్టిచో దీనిని నేనెట్లు వాఁడుకొందును? ఇంటికిఁ బోయిన తరువాతనైనఁ జూచుకొనుఁగాక" అని తలంచి దానిని దాసు వస్త్రమున ముడిచి పంపివేసెను.

మార్గమధ్యమున కమాల్దాసు తనవస్త్రమున రత్నము కట్టఁబడియుండుటఁ జూచి అది వర్తకుని పనిగాఁ దలంచుకొని "ఆతనికి నాయందంత భక్తిగలిగినది ఇదినాకొసఁగవలయునని సంకల్పించుకొనియున్నాఁ

డు. కావున తన సంకల్పము వ్యర్థముగాఁగూడదని నిశ్చయించుకొని నేను బుద్ధిపూర్వకముగా స్వీకరింపనని తలఁచి యిట్లు చేసియుండు" నని యూహించుకొని యింటికిఁ బోయి తీర్థయాత్రావిశేషములను తల్లిదండ్రులకు నుపితామహికి నెఱింగించెను. వారులతనియాగమనమునకుఁజాలసానందించిరి; గాని రత్నమును జూచిన వెంటనే దుఃఖింపఁ జొచ్చిరి. అదిచూచి కమాల్ తెల్లవోయి "అయ్యో, తొలుత తిరస్కరించియు పిదప నీరత్నమునుజూచినపుడు ఏల యంగీకరించితిని? "అని పశ్చాత్తాపపడుచు నతిశీఘ్రముగాఁ బోయి యారత్నమును తొల్లిటివర్తకునకు ఇచ్చివేసి వచ్చి తల్లిదండ్రులకును బితామహికిని ఆవృత్తాంతము నెఱింగించెను. అదివిని వారు ఆనందించి కమాల్‌దాసును ఆలింగనముచేసికొని బుజ్జగించిరి.

ఒకనాఁడు రాత్రి కబీరును కమాలును హరిభజనమునఁ దన్మయులై యుండఁగా కొందఱు భాగవతులు వచ్చిరి. కొంతతడవునకు తండ్రియు కుమారుఁడును భజన సాలించి భాగవతుల నాదరించిరి. కబీరు భార్య చెంతకుఁ బోయి "అయాచితముగ నేఁ డీభాగవతులు మనలను బునీతులంగావించుటకు దయచేసినారు. వారికి అన్నముపెట్టవలయును" అనిచెప్పెను. అదివిని యాతనిభార్య "నేనును ఆవిషయమునే యోచించుచున్నాను; గాని యేమి సేయవచ్చును? ఇంట గిద్దెఁడు బియ్యమైనను లేవు. నిజముగా నీభాగవతోత్తములను పస్తుపెట్టుటకన్న మనముప్రాణములను దొరంగుట మేలు" అని ప్రత్యుత్తరమిచ్చెను. అది విని కబీరు కుమారునిఁబిలిచి ఆలోచనయడిగెను. అందులకు కమాల్దాసు "తండ్రీ, ఇంటికి క్షుధార్తులై వచ్చిన భాగవతశ్రేష్ఠులకు అన్నము పెట్టకపోవుటకంటె పాపము లేదు. కావున మనము నేఁడు ఎక్కడనైన కన్నమువేసి తెచ్చియైనను వీరికి అన్నముపెట్టి సత్కరింపవలయు" నని చెప్పెను. కబీరు అందులకు సమ్మతించెను.

పిదప తండ్రియు కుమారుఁడును ఆయుధహస్తులై ఊరిలోనికిఁ బోయి ఒకవర్తకుని యింటికిఁ గన్నముత్రవ్విరి. కమాలు తండ్రిని కన్నముచెంత నిలిపి తాను లోపలఁ బ్రవేశించెను. లోపల వర్తకుఁడు గుఱ్ఱుపట్టినిద్రించుచుండెను. అందులకు ఆనందించి భాగవతారాధనమునకుజాలునంత ఉప్పు పప్పు బియ్యము మున్నగు వస్తువులను దీసికొని వచ్చి తండ్రిచేతి కిచ్చి "మనమిక్లే పోయినచో మఱికొందఱు దొంగలు వచ్చి

యాతని యిలుసొచ్చి సర్వనాశనము చేయవచ్చును; గావున నీవిచట నుండుము. నేను వర్తకుని లేపి పరుగెత్తి వచ్చెద" నని తండ్రికిఁ జెప్పి లోనికిఁ బోయి వర్తకుని లేపి తటాలున వచ్చి కన్నములోఁ దూఱెను; గాని వెంటనే వచ్చి వర్తకుఁడు కమాలు కాళ్లుపట్టుకొనెను. అదిచూచి కమాలు "తండ్రీ, నేను వర్తకునకు దొరికిపోయితిని. ఇఁక ననేకకష్టములు రానచ్చును; గాన నాశిరస్సు ఖండించుకొనిపొమ్ము" అనిచెప్పెను. కబీరు అట్లే చేసి యింటికిఁ బోయి భార్యకు సంగతి యంతయు నెఱింగించెను. అదివిని యాయిల్లాలు కొంతతడవు వగచి "పుత్రా! నీవు భాగ్యవంతుఁడవు. కావుననే భాగవతసేవలో నీవు ప్రాణములను విడిచితివి. నీకు మోక్షము కరతలామలకము" అని మనస్సమాధానము చేసికొని భర్త తెచ్చిన పదార్థములను చక్కఁగా వండి భాగవతులకుఁ బెట్టెను. వారి యాదరమునకు సంతోషించి భాగవతులు క్షుద్బాధ తీర్చుకొని ఆదంపతులతోఁ గలిసి కొంతతడవు హరిభజనము చేసి పిదప శయనించిరి. అట వర్తకుఁడు ఆమొండెమునుగొనిపోయి రాజునకుఁజూపి తనకుఁ దెలిసిన దంతయు నెఱింగించెను. రాజు "ఈమొండెమును గొనిపోయి బజాఱునడుమ శూలారోపణముసేయుఁడు. ఆమూలమునఁ జోరుఁడు తెలియఁబడును" అని భటులకు సెలవిచ్చెను. భటులు అట్లేచేసిరి.

మఱునాఁడు చీఁకటి యుండఁగనే లేచి భాగవతులుసూర్యోదయమగునప్పటికికాలకృత్యములన్నియు నెఱవేర్చుకొని మఱియొకయూరు పోవుటకు బయలుదేరిరి. కబీరు వారిని సాగనంపుటకు వారివెంటబయలుదేఱెను. వారు బజారునకు రాగానే శూలముమీఁదనున్న మొండెము వారినిఁ జూచి చేతులు జోడించి నమస్కరించెను. అదిచూచి భాగవతులాశ్చర్యపడుచుండఁగా కబీరు "మహాత్ములారా! ఏల వింతపడెదరు. ఆతఁడు వైష్ణవోత్తముఁడనియు, శ్రీహరిప్రసాదమువలన మీకు నమస్కరించునంతదనుక ప్రాణములునిలిపికొనియున్నాఁడనియుతోఁచుచున్నది. భగవద్భక్తులు ఇట్టివిచిత్రములు అనేకములు చూపుట వినలేదా" యని చెప్పెను. అంతట భాగవతులు ఇందలి రహస్యముకబీరునకుఁజక్కఁగా దెలియునని యూహించి "సంగతి యేమో చెప్పు" మని నిర్బంధించిరి. అప్పుడు కబీరుజరిగినదంతయు నెఱింగించెను. అందులకు పరమాశ్చర్యానందభరితులై కమాల్దాసుని శిరముతోఁగూడ కబీరుభార్య నచ్చుటకు

రప్పించి శూలమునుండి కమాలు మొండెమునుదింపించి శిరస్సును దానికితగిలించి ఈశ్వరుని స్మరించుచు తాము చేతులతోఁ దాఁకిరి. తోడనే కమాల్దాసు నిద్రవోయి లేచినవానివలె లేచి భాగవతులకును తల్లిదండ్రులకును ప్రదక్షిణనమస్కారము లాచరించెను భాగవతులు కబీరు కుటుంబము మాహాత్మ్యమునకు అబ్బురపడుచు వారివద్ద సెలవుగొని తమదారినిఁ బోయిరి. ఊరివా రందఱును ఈచిత్రమును జూచి అద్భుతాశ్చర్యములఁ గాంచి కబీరుకుటుంబము నెడల చాల భక్తులై వారి నెంతో గౌరవింపసాగిరి.

ఒకనాఁడు కబీరు బజాఱులోఁ బోవుచు అంగడిప్రక్క నొక స్త్రీ బియ్యము విసరుట చూచి బిగ్గరగా నేడ్వసాగెను. అదిచూచి అచ్చటి వారందఱును వచ్చి యేమి యేమని యడిగిరి; గాని కబీరు ఏమియుఁ బలుకక తనయేడుపును అట్లే సాగింపసాగెను. ఇంతలో నొకభక్తుఁడు ఆమార్గమున నెక్కడికోపోవుచు నిదిచూచి దగ్గఱకు వచ్చి "భాగవతోత్తమా, ఏల యట్లు దుఃఖించెదవు?" అని కబీరునిఁ బ్రశ్నించెను, కబీరు ఆభక్తునిఁ జూచి, "మహాత్మా, ఆమె తిరుగలి విసరుట చూడఁగా నాకీ ప్రపంచవృత్త మంతయు జ్ఞాపకము వచ్చినది. ఆతిరుగలియొక్క క్రింద ఱాయి భూమి యనియు మీఁది ఱాయి ఆకాశ మనియు, నడుమ నలుగుచున్న బియ్యము ప్రాణులు అనియు, త్రిప్పుచున్న స్త్రీ యముఁడనియుఁ దోఁచి ప్రాణులు చేయు దౌర్జన్యములను, వారికి సంభవింపనుండు ఆపదలను యమయాతనలను దలంచుకొని దుఃఖించుచున్నాను" అని చెప్పెను నీవు తలంచిన దంతయు యథార్థము ; గాని తిరుగలిలో నున్న బియ్యమన్నియు నలిగిపోవుట లేదు. మఱియు లోకమునందలి ప్రాణు లన్నియు యమయాతనల ననుభవించుటలేదు. మఱేమన ? తిరుగలిలో గురుసుచెంత నున్న వివరములో నుండు బియ్యము నుంతయైన నలుగుడుగాంచకుండ నెట్లు ఉన్నవో అట్లే లోకములో శ్రీహరిని నమ్ముకొని కైంకర్యము చేయు ప్రాణులు నిరపాయములై యుండు" నని చెప్పి యాభక్తుఁడు వెడలిపోయెను. అదివిని కబీరు ఆనందముతో తన మార్గమునఁ బోయెను.

పిదప నొకనాఁడు కబీరునకు జ్ఞానములేని భక్తి అడవిఁగాచిన వెన్నెలవలె నిష్ప్రయోజన మని తోఁచెను. జ్ఞానోపదేశముఁ బడయఁ

దలఁచి కాశీనగరమునఁ గల అనంతజ్ఞానులలో రామానందస్వామి యొక్కఁడే సదాచార్యుఁడుగ నుండఁదగినవాఁ డని తలఁచి తిన్నగ నాతని యాశ్రమమునకుఁ బోయి బైట నిలిచి పిలిచి దూరమునుండియే సాష్టాంగదండప్రణామము లాచరించి "మహాత్మా, నిరాధారుఁడను, ఆపన్నుఁడను, సంసారసాగరమును జూచినను ఈమాయావృతమైన ప్రపంచమును జూచినను నాగుండె పగిలిపోవుచున్నది. నాకు జ్ఞానభిక్షఁ అనుగ్రహించి నాగుండె దప పోగొట్టవలయును" అని వినయవినమితదేహుఁడై ప్రార్థించెను; గాని కబీరు తురుష్కుఁడగుటచే నాతనినిఁ దన శిష్యకోటిలోఁ జేర్చుకొనిన ఏమైన బాధలు కలుగవచ్చు నని తలంచి రామానందుఁడు ఏమియు మాఱుపలుకఁ డయ్యెను; గాని కబీరు అంతటితో నూరకుండ లేదు. మేఘజలమును గాంక్షించు చాతకమువోలె నేను మీ యభయదానమును నిరీక్షించియున్నాను. దిక్కులేనివాఁడను. శరణాగతునిఁ ద్రోసివేయుట ధర్మము గాదు. జ్ఞానార్తునిఁ దరి జేర్చి కాపాడుట కంటె మఱి పుణ్యము లే"దని యాతఁడు మఱలఁ బ్రార్థించెను. అప్పుడు రామానందుఁడు "నీవు మ్లేచ్ఛుఁడవు. మ్లేచ్ఛులు ధర్మబాహ్యులు. కావున నీకు ఉపదేశము చేయుటకు వీలు లేదు. పొమ్ము" అని యాన తిచ్చి లోనికిఁ బోయెను. అప్పుడు కబీరు అందులకు చింతింపక "స్వామీ నాహృదయము మీపాదపద్మములను బూజించుచున్నది. దానిని మీరు నిషేధింపఁజాలరు. ద్రోణభట్టారకుని ధ్యానించి ఏకలవ్యుఁడు సఫలమనోరథుఁ డైనట్లే నేను మిమ్ము ధ్యానించి సఫలప్రయత్నుఁడ నయ్యెదను" అని చెప్పి తన గృహమునకుఁ బోయెను.

కాని యంతటితోఁ గబీరునకు తృప్తి కలుగ లేదు. "మహాత్ముఁడగు రామానందస్వామి పాదధూళి నాశిరమున ధరింపవలయును. వారి వాచా శ్రీరామనామమును వినవలయును" అని యాతఁడు నిశ్చయించుకొని యొకనాఁడు రామానందుఁడు తెల్లవాఱకపూర్వము స్నానార్థము గంగకుఁబోవు మార్గమున నొకగోయి త్రవ్వుకొని దాని లోఁగూర్చుండి శిరస్సుమాత్రము పైకిఁ గాన్పించునట్లు గోతిమీఁద కఱ్ఱలుపఱచి మట్టి కప్పించుకొని యుండెను. కొంతసేపటికి రామానందుఁడు ఆమార్గమునఁబోవుచు చీఁకటివలన తెలియక కబీరు శిరముమీఁద పాదము మోపి 'రామరామా' తెలియక మార్గమధ్యమున నున్న యే

మహాత్మునిశిరమెూ త్రొక్కితినని పరితాపపడసాగెను. తోడనే కబీరు గోతిలోనుండి పైకి వచ్చి రామానందునకు సాష్టాంగవందన మాచరించి "దేవా, నేఁటి కీ శిష్యునిపై ననుగ్రహము గలిగినందులకు మహానంద భరితుఁడ నగుచున్నాను. మీపాదపద్మస్పర్శచే నేను పునీతుఁడ నయితిని. మీ తారకమంత్రోపదేశముచే నిఁక నాకు మోక్షము కరతలామలకము" అని యనేకవిధముల స్తోత్రము చేయసాగెను. అది విని రామానందుఁ డేమియు మాఱుపల్కక తిన్నగ గంగకుఁ బోయి స్నానము చేసి జపతపము లన్నియు నిర్వర్తించుకొని యాశ్రమమునకుఁ బోయి "కబీరు దీక్షచూడ చాల నాశ్చర్యకరముగా నున్నది. మహమ్మదీయుఁ డయ్యు నింతటి శ్రీరామభక్తుఁ డగుటఁజూడ నాతఁడు కారణ జన్ముఁడని తోఁచుచున్నది. అయినను ఇంకను ఆతని హృదయ నైర్మల్యమును బరీక్షించి చూచెదను" అని నిశ్చయించుకొనెను.

ఒకనాఁడు కబీరు బజాఱులో నెచ్చటకో పోవుచు నెవరో రామనామము నుచ్చరింపఁగా విని తన్మయుఁడై రామభజనము ప్రారంభించి "రామానందస్వామి నాకు ఆచార్యుఁడై యుండ నిఁక నాకు లోపమేమి?" యని పాడఁ దొడఁగెను. అది విని యచ్చట నున్న బ్రాహ్మణులుకొందఱు రామానందుని చెంతకుఁ బోయి మీరు కబీరునకు తారకోపదేశము చేసితిరఁట. ఇది మీకుఁ దగునా?" యని యడిగిరి. అది అదివిని రామానందుఁడు కబీరునెడల హృదయమున నత్యంతప్రేమ గలిగియుండియుఁ జాల నాగ్రహము ప్రకటించి ఆబ్రాహ్మణులను వెంటఁగొనివచ్చి "ప్రేలకీ, నీవు నాశిష్యుఁడ వనియు, నేను నీకు తారకమంత్రోపదేశము చేసితి ననియు నేల దబ్బరలు పల్కెదవు?" అని గద్దించి పలుకుచు తన పాదుకతో కబీరుని శిరముమీఁద నొక దెబ్బ కొట్టెను. అదెబ్బతో కబీరు శిరముమీఁద గాయము పడి రక్తము కాఱసాగెను. అయినను కబీరు అందులకు కోపమునుగాని విచారమును గాని పొందక "మహాత్మా, దేశికోత్తమా, ఏలినవారు నాకు తారకమంత్రోపదేశమును జేయుటను గుఱించి యిపుడు సాక్షు లేల? అయినను వ్యామోహమునఁ బడి కొట్టుకొను మానవులు చర్మచక్షుస్సులతోఁ జూడనంతమాత్రమున నేమి లోపము తటస్థించును? ఉభయసంధ్యలును సూర్యచంద్రులును వేదములును పంచభూతములును సాక్షిగా

దేవరవారు నాకు ఉపదేశము చేయుట కల్ల యని వాదింప నెవరికిశక్తి
కలదు? మహాజనులు ఇందఱు చూచుచుండ నిపుడు దేవరవారు తమ
పాదస్పర్శచే పరమపావనమైయున్న పాదుకతో నాశిరమునలంకరించితిరి
గదా? ఇంతకంటె ప్రత్యక్ష సాక్ష్య మేమి కావలయును? ఓజనులారా,
నాకు తారకోపదేశము చేసిన గురుదేవుఁడు ఇక్కడ సాక్షాత్కరించి
యున్న రామానందస్వామియె. మీరుగూడ వీరిపాదపద్మము నాశ్ర
యించి తరింపుఁడు" అని పలికెను. కబీరుని యాయచంచలభక్తినిఁ
జూచుటవలన రామానందుని హృదయము వెన్నవలెఁ గరఁగిపోయెను.
తోడనే యాతఁడు "ఈబ్రాహ్మణులు ఏమనుకొనినను అనుకొందురు
గాక; గాని యిట్టి భాగవతాగ్రేసరునిఁ దిరస్కరించుటకంటె పాతకము
లే"దని నిశ్చయించుకొని కబీరు శిరముపై చేతి నునిచి "భాగవతో
త్తమా, ఇదే నీకు అభయ మిచ్చుచున్నాను. నీకు ఏమియు లోపము
లేదు శ్రీరామచంద్రుఁడు నీపాలఁ గలఁడు. అనవరతమును నీవు ఆపరమే
శ్వరుని శ్రవణమననధ్యానార్చనములతో సంతోష పెట్టుచుండుము. భా
గవతులను బూజింపుము" అని యాజ్ఞాపించి మఱియెరితోడను మాట్లా
డక తన మఠమునకుఁ బోయెను.

లోకములో ననేకవిధములైన మనుష్యులు గలరు. వారిలో
గొందఱు ఒరులు తమ్మేమియుఁ జేయకపోయినను వారు ఏదో విధమున
బాగుపడుచున్నచో వారి నేదోవిధమున వంచింపవలయు నని నిష్కార
ణముగ దలంచి అనేకదుష్టప్రయత్నములను జేయుచుందురు. అట్లే
కబీరుదాసు ఒకరిజోలికిని సొంటికినిఁ బోనక సదా శ్రీరామభజనమును
జేసికొనుచుండుటఁ జూచి యోర్వజాలక కాశీనగరమునందలి కొందఱు
దుర్మార్గులు,—

"మహాత్ములారా,

శ్రీజానకీరమణుని యనుగ్రహమువలన నీదేశమున నుండు భాగవతోత్త
ముల నందఱను ఆరాధింపవలయునని నాకు సంకల్పముగలిగినది; గావున
తామందఱును విజయముచేసి యీదాసానుదాసుని తరింపఁ జేయవల
యును" అని యొక విజ్ఞాపనమును వ్రాసి కబీరుదాసు సంతకము చేసి
సకలదిక్కులకును రవానా చేసిరి. అంతట నీపత్రికలను జూచిన సాధువు
లందఱును ఇది నిజమే యని నమ్మి నిర్దిష్టదినమునకు లక్షలకొలఁదిగ వచ్చి

కాశీనగరమున గంగాతీరమునవిడిసిరి. ఇదిచూచి శ్రీరామచంద్రుఁడే నేఁడిన్నిరూపములతో సాక్షాత్కరించెనని యానందముతో పరవశుఁడై కబీరు నృత్యము సేయుచుండఁగా శ్రీరాముఁడు భక్తార్తిభంజనుఁడు గావున నెందఱు సాధువులు వచ్చిరో అన్ని కబీరురూపములను ధరించి వచ్చిన సాధువుల నందఱను అనేకవిధముల నాదరించి పంపివేసెను. ఈవింతచూచి పత్రికను గల్పించిన దుష్టులు బుద్ధితెచ్చుకొని కబీరు పాదములమీఁద వ్రాలి నిజ మంతయుఁ జెప్పి అపరాధమును క్షమింప వలయు నని ప్రార్థించిరి; గాని కబీరు అందుల కేమియు నాగ్రహపడక వారి కందఱకును జ్ఞానోపదేశముచేసి రామభజనతత్పరులను గావించి పంపివేసెను.

తీర్థయాత్రకై బయలుదేఱిన జ్ఞానదేవనామదేవులు కాశీనగర మునకు వచ్చి సకలతీర్థములను సేవించి నాలుగు మాసములు అచ్చట వసించి ఒకనాఁటి రాత్రి కబీరునిఁ జూచుటకు వచ్చిరి. అప్పటికి కబీరు హరిభజనము చేసికొనుచుండెను; గాని ఇంటికి వచ్చిన భాగవతోత్త ములను జూచి వారి ననేకవిధముల నాదరించి భార్యచెంతకుఁ బోయి "వీరికి అన్నము పెట్టవలయును" అని చెప్పెను. అందులకు ఆమె చాల గటకటంబడి యింట బియ్యము లేవనిచెప్పి బజారునకుఁబోయి తెచ్చు టకుభర్త యనుజ్ఞను బడసి బయలు దేఱెను; గాని దుకాణములన్నియు కట్టివేసిరి. ఒక్కదుకాణదారుఁడు కట్టివేయుటకు సిద్ధముగా నుండెను. వీథు లన్నియు నిర్జనములై యుండెను. అంత కబీరుభార్య ఆవర్తకుని చెంతకుఁబోయి తన్నెఱింగించుకొని" మాయింటి కిపుడు ఇరువురు భాగవతులు వచ్చినారు. చెంత నొక కాసైన లేదు. వారికి సరిపోవు సంభారముల నీవు ఇచ్చెదవేని నీకు చాల పుణ్యము వచ్చును. వెల నేను రేపు ఎట్లయినను ఇచ్చివేసెదను" అని చెప్పెను.

గాని యాసాధ్విని జూచిన వెంటనే వానికి కామోద్రేకముగలి గెను దానిని బట్టఁజాలక వాఁడు ఇంత నీవు నాకు వెల నీయనక్కఱ లేదు నిన్ను జూచుటతోడ నేనన్మ మన్మథుఁడు వేటాడఁదొడఁగినాఁడు. నాకోరికఁ దీర్చెదవేని నీవు కోరిన దంతయు నిచ్చెదను" అని నిర్భయ ముగాఁ బలికెను. అదివిని యామె చాల వగచి "ఇందుల కంగీకరింప కున్న వీఁడు వస్తువులనీయఁడు. ఈయకున్న భాగవతులను పస్తుపెట్టవలసి

వచ్చును. అంతకంటె పాతకమేమియున్నది? వీనిహృదయమును శ్రీరామ చంద్రుఁడు త్రిప్పకమానఁడు. అని నిశ్చయించుకొని "అట్లే చేసెదను. గాని ముందు వస్తువులు ఇచ్చి నన్ను బంపుము. భాగవతుల నారాధించి వచ్చెదను." అని చెప్పెను. "నీమాటలయందు నాకు నమ్మకము కలదు. పోయిరమ్ము. నేనిక్కడనే ప్రతీక్షించుచుందును" అని చెప్పి వర్తకుఁడామెకుఁ గావలసిన వన్నియు నిచ్చి పంపివేసెను.

ఆమె యింటికిఁబోయి సంగతియంతయు భర్తకెఱింగించెను. కబీరు అదివిని "భాగవతులకు వస్తుపరుండవలసిన యోగము లేకుండఁ జేసిన యాపుణ్యాత్ముని హృదయమునందలి యాకళంకమును శ్రీహరి తొలంగింపకుండ నుండఁడు. అంతకును మనకు శ్రీరాముఁడే రక్షకుఁడై యున్నాఁడు. నీవు భాగవతారాధన మైన తరువాతఁ బోయి రమ్ము" అని యాజ్ఞ యిచ్చెను. భర్త సెలవుగొని నిముసములో వంటఁజేసి భాగవతులను భుజింపఁజేసి వారు పరుండుటకు తగిన వసతు లన్నియుఁ గల్పించి యామె వర్తకునిచెంతకుఁ బోయెను; గాని వాఁడీమెను జూచిన వెంటనే మాతృభావముతోఁ బాదముల మీఁద వ్రాలి "తల్లీ, నన్ను రక్షింపవలయును కండక్రొవ్వువలన నేను నిన్ను దుర్భాష లాడితిని. జగద్రక్షకుఁడగు శ్రీరామచంద్రుని అనుగ్రహమువలన నాకు బుద్ధి వచ్చినది. నాయపరాధమును క్షమించి నన్ను శిష్యకోటిలోఁ జేర్చుకొని జ్ఞానోపదేశము చేయునట్లు నీభర్తతో చెప్పవలయు" నని యనేకవిధములఁ బ్రార్థించెను. అది చూచి యామె వానినువన్ను సత్పథమునకు వచ్చుటకు శ్రీరామచంద్రుఁడే కారణ మని నమ్మి అనేకనమస్కారము లాచరించి వర్తకుని పుత్రభావముతో దీవించి తనవెంటఁ గొనిపోయి భర్తపాదముల మీఁదఁ బడవేసి రక్షింపవలె నని వేఁడుకొనెను. కబీరు చాల సంతసించి అభయ మిచ్చి వానినిఁ దన శిష్యులలోఁ జేర్చుకొని యాదరించెను.

ఇది చూచి జ్ఞానదేవుఁడును నామదేవుఁడును ఆశ్చర్యచకితులై కబీరుదాసుని, ఆతని భార్యను అనేకవిధములఁ గొనియాడిరి. అప్పుడు జ్ఞానదేవుఁడు కబీరుతో "భాగవతోత్తమా, భక్తత్రాణమునిమిత్తము శ్రీహరి పాండురంగఁడై పండరిపురమున వసించియున్నాఁడు. ఆతనికి ఈనామదేవుఁ డనిన నమితకరుణ. నీవు వచ్చి ఆదేవుని సేవింపవలయు"

ననిచెప్పెను. "మీరు సెలవిచ్చినప్రకారము ఉత్థానైకాదశికి వచ్చెద" నని కబీరుచెప్పఁగా జ్ఞానదేవనామదేవులానందించి సెలవుగొని తీర్థయాత్రకుఁ బోయిరి.

ఇట్లు కాలము గడచిపోవుచుండఁగా అయాచితముగా కబీరుదాసు కీర్తి దేశమునందంతటను వ్యాపింపసాగెను. ఆతని ప్రభావమును విని అనేకులు వచ్చి జ్ఞానోపదేశమును బడసి శిష్యులై కొలువసాగిరి. కాశీనగరమునందే యొక బ్రాహ్మణునకు ఒక్కఁడే కుమారుఁడుండెను. బాల్యమున తండ్రి యాతనికి వేదశాస్త్రములను జెప్పెను. ఆవిద్యవలన నాతఁడు అవిద్యనుజయించి కబీరుదాసు నాశ్రయించి తారకమంత్రోపదేశమును బడసి భక్తుఁడై హరిభజనము ప్రారంభించెను. ఒకరుబోధించుటవలన వచ్చినది గాక స్వయంభువు అగుటచే నాతనిభక్తి అంతకంతకు అధికమై నిర్మలమై ప్రకాశింపసాగెను. శిష్యుని దీక్షను జూచి గురుఁడు బ్రహ్మానందభరితుఁడగుచుండెను. పద్మనాభుఁడుఅను పేరుగల యాభక్తుఁడు ఒకనాఁడు గంగానదికి స్నానార్థము పోయి యుండఁగా నచ్చట నొక యదృచ్ఛాకార్యము జరిగెను

కాశీనగరమునందలి గొప్పవర్తకులలో నొకనికి అయిదుగురు పుత్రులు కలరు. వారు తండ్రివలె శాంతులును వర్తకనిపుణులునై చాల లాభమును సంపాదించుచు తండ్రికిఁ వశవర్తులై యుండిరి. వర్తకుఁడు అనంతధనముగలదుగదా యని గర్వపడక శ్రీహరిని శ్రవణమననధ్యానాదులచేఁ బూజించుచు దేవబ్రాహ్మణభక్తి గలిగి దీనపోషకుఁడై యుండెను. ఆతనిభార్య అన్నివిధముల నాతనికి అనురూపురాలై యుండెను. ఇట్టి మహావిభవుఁడు అగు ఆవర్తకునకు పూర్వజన్మార్జితమగు పాపలేశమువలన చూచుచుండఁగా అనివార్యమగు కుష్ఠురోగము అంకురించెను. అది యెన్నియౌషధములను సేవించినను నివృత్తిగాక ఎన్ని దానధర్మములుచేసినను లొంగక, కొలఁదికాలమునందే అతితీవ్రముగ విజృంభించి శరీరము అంతయుఁ దినివేసెను. అట్టి స్థితిలో నావర్తకుఁడు ఇఁక నిదిపోవునది కాదని నిశ్చయించుకొని మరణమేశరణ్యమని తలంచి భార్యాపుత్రులను జూచి నేను బ్రతికియుండుటవలన ఏమి ప్రయోజనమున్నది? నేను ఇట్లు బాధపడుచుండఁగా మీకు మాత్రమేమి సుఖము? కేవలము యమయాతన తక్క మఱేమియు లేదు. పరలో

కములో ననుభవింపవలసిన యమయాతననీలోకమునందే యనుభవింపనేల? కావున నన్ను గంగలో విడువుఁడు" అని చెప్పెను. అదివిని వారు తొలుత చాల వగచి తుదకు జేయునది లేక వల్లె యని గంగాతీరమునకు గొనిపోయిరి.

కబీరు శిష్యుఁడగు పద్మనాభుఁడు అప్పు డచ్చట స్నానసంధ్యావశ్యకానుష్ఠానములన్నియుఁ దీర్చికొని యింటికిఁ బోవుటకుఁ దలంచుచుండెను. అగుట నాతఁడు వర్తకునిచెంతకు వచ్చి యిది యేమి అని ప్రశ్నించి సంగతి యంతయు దెలిసికొని "అయ్యా, ఆత్మహత్యఁ జేసికొనుటకంటె వెఱ్ఱిపని మఱియొకటి కలదా! ఎన్నిపుణ్యములు చేసికొనిన నీ కీమానుష జన్మము తటస్థించినదో యేమైన యోచించితివా? అనేకులు అజ్ఞానులై దుర్లభమైన యీమనుష్యజన్మమును బడసియు అజ్ఞానమువలన అకృత్యములు చేసి అధఃపతితులై పోవుచున్నారు. అక్కటా, వర్తకుఁడా, ఈయాత్మహత్యవలన నీవు ఎట్టి హీనజన్మము నెత్తెదవో గదా? నీప్రయత్నము చూచిన నాగుండె పగిలిపోవుచున్నది. ఆత్మహత్య చేసికొనుటకైన సాహసించితివి; గాని ఆర్తత్రాణపరాయణుఁడగు శ్రీహరిని నమ్మియుండఁజాలకపోయితివిగదా? ఏదో కొంతతడవు భజనచేసినంతమాత్రమున నీకు చేయూఁత నొసంగలేదని భగవంతుని నమ్మఁజాలకపోయితివిగదా? అయినను ఇప్పుడు మించిపోయినది లేదు నీవు ఇప్పుడు నాతోఁ గూడ శ్రీహరిని బ్రార్థింపుము. నీకుమారులును, నీభార్యనుగూడఁ బ్రార్థన సేయునట్లు నియమింపుము. జానకీరమణుఁడు భక్తుల విపత్తులను దొలఁగించుటకు సర్వసిద్ధుఁడై యున్నాఁడు. అదిగో శ్రీరామచంద్రుఁడు దయామృతవర్షము గురియుచున్నాఁడు. ప్రార్థింపుము" అని యాతనికి బోధించి

నాదనామక్రియ— ఆదితాళము

ఏమి రా రామా నావల్ల నేర మేమి రా రామా,
ఏమి రామ యీలాగు కష్టము ? నీమహిమో నాప్రారబ్ధమో. ఏమి
కుండలిశయన వేదంతరక్షకా ఖండతేజ నా యండ నుండవే. ఏమి
పంకజలోచన శంకరనుత నా సంకట మార్పవే పొంకము తోడను. ఏమి
మందరధర నీ సుందరపదములు ఇందిరేశ కనుఁ గొందుఁ జూపవే. ఏమి
దినమొక యేడుగ ఘనముగఁగడపెద తనయుని మీఁదను దయాళో దయరా.

సదయహృదయ నీమృదుపదములు నాహృదయకమలమున వదలక నిల్పెద. ఏమి
రామరామ భద్రాచలసీతారామదాసుని ప్రేమతో నేలవె. ఏమి

శా. "ధీరాగ్రేసర నందనందన, హరీ, దేవౌఘచూడామణీ,
ఘోరాఘౌఘహరా, ముకుంద, నృహరీ, గోవింద, శ్రీకృష్ణ, సం
సారాంభోనిధికర్ణధార, కమలాక్షా, శౌరి, దామోదరా
శ్రీరామాచ్యుత, జానకీరమణ ని న్సేవింతు నిష్టాప్తికిన్.

(రామదాసుచరిత్ర. పుట.71.)

ఉ. నీసతి పెక్కుకష్టము లిడ నేర్పరి, లోక మకల్మషంబుగా
నీసుత సేయు పావనము, నిర్మితకార్యధురీణదక్షుఁడై
నీసుతుఁ డిచ్చు నాయువులు, నిన్ను భజించినఁ గల్గకుండునే
దాసుల కీప్సితార్థములు దాశరథీ కరుణాపయోనిధీ!"

(దాశరథిశతకము. ప.89.)

అని రామభజనము ప్రారంభించెను. ఆతని వెంట వర్తకుఁడును ఆతని భార్యాపుత్రులుగూడ ప్రారంభించిరి. ఇది యైనతరువాత పద్మనాభుఁడు ముమ్మారు తారకమంత్రము నుచ్చరించి వర్తకునిఁ దాఁకెను. తోడనే వర్తకుఁడు రాహువిముక్తపూర్ణచంద్రునివలె కుష్ఠరోగముచే విముక్తుఁడై వజ్రకాయుఁడై ప్రకాశింపసాగెను. అదిచూచి అందఱు నాశ్చర్యపడిరి. వర్తకుఁడును, ఆతని భార్యాపుత్రులును కాళ్ళమీఁద వ్రాలి "మాయింటికివచ్చి మాపూజ గైకొనవలయు" నని యెన్నివిధములఁ బ్రార్థించుచున్నను వినక ఆశీర్వదించి పద్మనాభుఁడు గురుసన్నిధికిఁ బోయెను.

కబీరు అంతయు విని "ఈస్వల్పప్రయోజనమునకొఱకు తారకనామమును మూఁడుమాఱు లుచ్చరింపవలయునా?" యని శిష్యు నడిగెను. అందులకు పద్మనాభుఁడు "ఆవైశ్యుఁడు మహాత్ములగు మీపాదముల నాశ్రయించి జ్ఞానోపదేశమును బడయమిఁగలిగినపాపము తొలఁగిపోవుటకు ఒకమాఱును, కుష్ఠురోగమునుగూడ భవరోగమునుగూడ సమూలముగ నశించుటకు ఒకపర్యాయమును, ఆతని భార్యాపుత్రాదులకుఁ గూడ ముక్తికలుగుటకై మఱియొకసారియు నిట్లు మూఁడుతడవలు తారకనామము నుచ్చరించితి" నని సమాధానము చెప్పఁగా కబీరు అది విని మిగులనానందించి "వత్సా, నీవు శ్రీహరికిఁ దగిన భక్తుఁడవు. శ్రీహరి

నీహృదయమున నెప్పుడును సాక్షాత్కరించియున్నాఁడు" అని శిష్యునిఁ బ్రశంసించెను.

పిదప నొకప్పుడు పదివేలభాగవతులు ఒక్కమాఱుగా కాశీనగరమునకు వచ్చిరి. వారి కెవరును సదావర్తి యిచ్చువారు లేకపోయిరి. వారందులకై తొట్రుపడుచుండఁగా కబీరును వంచించుట కిదియే సమయమని యెంచి అకారణవిరోధులగుకొందఱుదుష్టులు వారిదగ్గఱకుఁబోయి "మీ రేల కంగారు పడెదరు? కబీరుదాసుని ఇంటికిఁబోయితి రేని మీకందఱకు నాతఁడు సదావర్తి యిచ్చు" నని చెప్పి వారి కాతని యిల్లుచూపి వెడలిపోయిరి. వెంటనే భాగవతు లందఱును శ్రీరామస్మరణ సేయుచు కబీరుదాసు ఇంటి ముంగిటకు వచ్చిరి. ఈరామఘోషమును విని కబీరు దాసుఁడు పరమానందముతో బైటకువచ్చి వారి నందఱ నాదరించి కూర్చుండఁజేసి వచ్చినసమాచారము నడిగి "దయచేసి ఒక్క క్షణము ఉండుఁడు దాసుఁడు మీకు సదావర్తియిచ్చుటకు సిద్ధుఁడై యున్నాఁడు" అని చెప్పి బజారునకుఁ బోయి యొక వర్తకునిచెంత కరిగి "అయ్యా, నేఁడు నాయింటికి పదివేల సాధువులు వచ్చియున్నారు. వారికి సదావర్తి యీయవలసినది. నీవుఈసాహాయ్యమును జేయవలెను" అని వేఁడుకొనెను. అందులకు పశుప్రాయుఁడగు ఆవర్తకుఁడు ఏమియు సంకోచింపక "పదివేలకుఁ గాదు. ఇరువదివేలకు ఇమ్మనినను నేను ఈయఁగలను; గాని నేఁటిరాత్రికి నీభార్యను నాయంతఃపురమునకుఁ బంపఁగలవా?" యని కబీరు నడిగెను. కబీరు అదివిని వానిదుర్బుద్ధికి చాలదుఃఖించి అన్నిటికిని శ్రీరామచంద్రుఁడే యున్నాఁడనినిశ్చయించుకొనివల్లెయనెను. తోడనే వర్తకుఁడు కబీరు కోరినదెల్ల ఇచ్చివేసెను. కబీరు సాధువుల నందఱను సత్కరించి పంపివేసి సంగతియంతయు నెఱింగించి రాత్రి భార్యను వర్తకుని యింటికిఁ బంపెను.

వర్తకుఁడు కబీరుభార్యను జూచి పరమానందభరితుఁడై ఆమెను అంతఃపురమునకుఁ గొనిపోయి మీఁద జేయి వేయఁబోయెను. తోడనే శ్రీరామభద్రుఁడు ఊరి కొత్వాలురూపముతో సాక్షాత్కరించి "దురాత్మా, ఆసాధ్విపైఁ జేయివేసెదవేని చచ్చెదవు" అని పలికెను. అది చూచి వర్తకుఁ డదరిపడి "మహాత్మా, రక్షింపుముబుద్ధి వచ్చినది" అని ప్రార్థించెను. కొత్వాలు కబీరుభార్య నింటికిఁ బంపివేసి తాను అంతర్హితుఁడయ్యెను.

ఇది భార్యవలనవిని కబీరు శ్రీరామచంద్రుఁడే యిట్టి పనిఁ జేసిన వాఁడు అని యెఱింగి వడివడిగ వర్తకునియింటికిఁ బోయి "ఓవర్తకుఁడా, నీవెంతటి యదృష్టవంతుఁడవు! నీకు కాన్పించిన కోత్వాలు సాక్షాత్తుగ శ్రీరామచంద్రమూర్తి. నీవింతవఱకును ఆతనిం గొలిచియుండకపోవుట చే నిజరూపముతో నీకు దర్శన మీయఁ డయ్యెను. అయినను నీవు తరిం చితివి. ఇఁక నైన శ్రీహరిని భజింపుము" అని చెప్పెను. వర్తకుఁడు అది విని పరమానందభరితుఁడై కబీరు నాశ్రయించి జ్ఞానోపదేశమును బడసి కేవలము నిర్మలహృదయుఁడై విరాగి యయ్యెను. కబీరు ఇంక ననేక పర్యాయములు ఇట్లు ప్రభావము చూపి అనేకులను ఉద్ధరించి అవసాన మున భార్యాపుత్రులతో శ్రీహరిసాయుజ్యమును బడసెను.

మ. "ఉరుసంసారసముత్తరంబు నిగమాంతోచ్చారితంబున్ సమ
స్తరిపుధ్వంసము జన్మపావనముగా సత్సంగవేళా సము
చ్చరితంబున్ వ్యసనాభిదష్టజనరక్షాదక్షమై శర్వదం
బరుదా శ్రీరఘురామమంత్రమును జిహ్వా, భక్తిఁ గీర్తింపుమా."

(రామకర్ణామృతము ఆ. 1. ప. 78.)

35. సదాశివేంద్ర సరస్వతి.

శ్లో. తృష్ణాతోయే మదనపవనోద్ధూతమోహోర్మిమాలే
దారావర్తే తనయసహజగ్రాహసంఘాకులే చ,
సంసారాఖ్యే మహతి జలధౌ మజ్జతాం నస్త్రిధామన్
పాదాంభోజే వరద భవతో భక్తినావం ప్రయచ్ఛ."

(ముకుందమాల. 14.)

దక్షిణాపథమున కొహూరు అని పిలువఁబడు గ్రామమునకు సమీప మున ఒక చిన్నిపల్లెలో ఒక బ్రాహ్మణునకు ఒక కుమారుఁడు గలిగెను. ఆతఁడు తల్లిదండ్రులచే మిగులఁ బ్రేమింపఁబడుచు బాల్యమునుండియు అఖండశేముషీమహిమను జూపసాగెను. అయిదేండ్లు దాఁటినవెంటనే అక్షరాభ్యాసము చేసి తల్లిదండ్రులు ఆతనిని విద్యాభ్యాసార్థము గురు నికటమునకుఁబంపిరి. సదాశివుఁడు కావేరితీరమునందలి తిరుగిసనెల్లూరు

అనుగ్రామమున విద్యాభ్యాసము ప్రారంభించెను. ఆగ్రామము నివాసయోగ్యము సరస్వతికి విలాసభవనము అందు సదాశివునితోఁ గూడ నింక ననేకవిద్యార్థులు విద్య నభ్యసించుచుండిరి. ఆతని సహాధ్యాయులలో ననేకులు పెద్దలైనతరువాత చాలకీర్తిని గడించిరి. జానకీపరిణయముఅనుసంస్కృతనాటకమునురచించిన రామభద్రదీక్షితుఁడు అచ్చటివాఁడే. పందొమ్మిదిసంవత్సరముల ప్రాయమునందే సకలశాస్త్రములసారమును గ్రహించి అనేకగ్రంథములను రచించి "అయ్యావాల్" అను ప్రసిద్ధినిఁ బడసి అనేకదాక్షిణాత్యులచే ఇప్పటికిఁ గూడ పూజింపఁబడుచున్న వేంకటేశ్వరపండితుఁడును అచ్చట యాతఁడే పుదుక్కోటసంస్థానాధీశ్వరులకు మతబోధకుఁడును వారివలన గొప్పభూదానమును బడసిన విద్వాంసుఁడును మహాభాష్యముగోపాలకృష్ణశాస్త్రియనుబిరుదము పొందిన గోపాలకృష్ణశాస్త్రి యాగ్రామమునందే విద్య నభ్యసించెను.

ఇట్టివారితోఁ గలసిమెలసియుండుటవలన సహజతీక్ష్ణమగు సదాశివుని ధిషణ మతియింత కుశాగ్రమయ్యెను. అప్పుడే యాతనికి తఱుచుగ శాస్త్రవాదమును జేయు అలవాటు అయ్యెను. శాస్త్రవాదములో నొకొక్కప్పుడు ఉపాధ్యాయుఁడుగూడ ఆతనితో నెగ్గలేక వెనుకంజ వేయుచుండెడివాఁడు. ఇట్లు కొన్ని దినములు గడచిపోయినతరువాత ఉపాధ్యాయుఁడు సదాశివునిఁ జేరఁబిలిచి "వత్సా, నీవిద్యాభ్యాసము పూర్తియైనది ఇఁక నీవు ఇంటికిఁబోవచ్చును" అని చెప్పెను. సదాశివుఁడు ప్రయాణముహూర్తము నిశ్చయించుకొనినదినమున ఆతని భార్య రజస్వలయైనట్లు అచ్చటకుఁ దెలిసెను. అదివిని గురువును, గురుపత్నియు, సహాధ్యాయులును ఆనందించి ఆశీర్వదించి ఆతనిని ఇంటికిఁ బంపివేసిరి. కుమారుని రాకకు ఆతని తల్లి మిగుల నానందించి అభ్యంగనము చేయించి వంట ప్రారంభించెను. అభ్యంగనమువలనను పిండివంటలు చేయుటవలనను నాఁడు భోజనమునకు కొంచెము ఆలస్యమయ్యెను. అదిచూచి సదాశివుఁడు "సంసారములో నుండిన ఇట్టి చిక్కులే కలుగుచుండును. ఒకటియు సరిగాఁ గాదు. అన్నిటికి నన్నియు నభ్యంతరములే" యని తలంచి తత్క్షణమే వైరాగ్యము వృద్ధిపొందుడు ఎవరికినిఁ దెలియకుండ ఇలువెడలిపోయెను.

అది మొదలుకొని యాతఁడు ప్రాపంచికవ్యవహారోచితములగు శత్రుమిత్రభేదాదికములు ఏమియు దరికిఁ జేరనీయక సర్వసముఁడై ప్రవర్తింపసాగెను ఆతనికి ఇఁక ఇహలోకమునఁ బొందగినచోటు ఏమియు లేదు. పొందవలసిన ఫలము ఏమియు లేదు. కోరవలసిన వస్తువు ఏమియు లేదు అగుటవలననాతఁడు ఆహారమును గుఱించికూడ ఎవరిని ప్రార్థించియెఱుఁగఁడు. స్వయముగ నందుకొనితినుట యిఁక ఎట్లుండును? వీధిలో బోవుచున్నపుడు ఎవరైనఁ బిలిచి చేతిలో నేమయిన నుంచినయెడల దాని నిగుఱించి ఏమియు విచారణ సేయకయే తోఁచినంతతినితిరుగుచుండు వాఁడు. ఇట్లు కాలముగడచిపోవుచుండఁగా పరశివేంద్రసరస్వతి అను యోగీశ్వరునితో ఆతనికిసమావేశమగుట తటస్థించెను. అప్పుడు ఆతఁడుఆక్షణమునందే ఆయోగశక్తిసామర్థ్యములను దెలిసికొని ప్రార్థించి ఆతనివలన యోగాభ్యాసము ప్రారంభించెను. యోగాభ్యాసముగూడ ఆతనికి చిరపరిచితమువలెనే సాధ్యమయ్యెను. ఇది ఇట్లుండఁగా ఇంకను ఆతనికి వాదించుటయందుఁగల ముచ్చట తీఱ లేదు అగుటచే నాతఁడు తన గురువును జూడవచ్చు పండితుల నందఱును నిలిపి వాదించి ఓడించి పంపి వేయసాగెను ఇట్లు కొన్నిదినములు జరుగునప్పటికిపండితులు ఎవ్వరును దాకఁజాలకపోయిరి. తుదకు వారు చేయునది లేక పరమశివేంద్రసరస్వతిచెంతకుఁబోయి "మహాత్మా, మీశిష్యునితో మేము వేగలేకుండనున్నాము. ఆతఁడు మాటిమాటికిని శృంగభంగముచేసి పంపుచున్నాఁడు" అని విన్నవించిరి. అందులకు గురుదేవుఁడు కొంచెము అసంతృప్తుఁడై సదాశివునిఁ జూచి నీకింకను శాంతము ఎపుడువచ్చునని కొంచెము కోపపడెను. తోడనే సదాశివుఁడు జ్ఞానము తెచ్చుకొని తన తప్పు మన్నింపవలసినదని గురుదేవుని పాదములమీఁద వ్రాలి మన్నింపవేడుకొని "ఇది మొదలు నేనిఁక మాటాడను" అని శపథముపూని యోగాభ్యాసము పూర్తియగుటచే గురుని సెలవుఁబడసి అక్కడనుండి వెడలిపోయెను.

అదిమొదలుకొని యాతఁడు గ్రామైకరాత్రముగా దేశసంచారము ప్రారంభించెను. ఎవరైన నేమయిన పిలిచియిచ్చినఁదినును. లేకున్న లేదు. తనయభిప్రాయమెక్కడనైన చెప్పవలసివచ్చినచో నేలమీఁదవ్రాసి చూపును. ఇట్లు ఆతఁడు దేశమెల్లఁదిరుగసాగెను. యౌవనముమఱల

దొడఁగునప్పుడు ఆతఁడు కావేరీతీరమున నివసించియుండెను. ఒకనాఁడు ఆతఁడు కావేరీనదిలో నిసుకతిన్నెమీఁద సమాధినిష్ఠుఁడై యుండఁగా అమాంతముగ నది పొంగెను. ప్రజ లందఱును ఆసంభవమును జూచి హాహాకారములు చేయుచుండఁగా నది యాతనిం గొనిపోయి యొకచో మేట వేసెను. అదిచూచి జనులు చాలదుఃఖించి చేయునదిలేక యూరకుండిరి; గాని మూఁడుమాసములు గడచినతరువాత అచ్చటి గ్రామమున నున్నవారు నదికి అడ్డకట్ట వేయుటకై కూలివాండ్రను బిలుచుకొనిపోయి దైవవశమున యోగియున్న యిసుకగుట్టనే త్రవ్వించిరి కొంతసేపు అగునప్పటికి ఒకనిపారనుండి రక్తపుచుక్కలు పడసాగెను. అదిచూచివాఁడు ఆసమాచారమును సమీపమునందలివానికిఁ జెప్పెను. తుదకు క్షణములో ఈవిషయము అందఱకును దెలిసెను. తోడనే అందఱు నచ్చటఁ జేరి మెల్లగా అచ్చటఁ ద్రవ్వఁగా సదాశివయోగి సమాధినిష్ఠుఁడై యుండెను. ఆతనిని జూచి వారందఱును దెల్లవోవుచుండఁగా ఆతఁడు సమాధి చాలించి లేచి ఎక్కడకో వెడలిపోయెను. ఎవ రెంతపిలిచినను పలుకలేదు. ఎంతబతిమాలినను అచ్చట నిలువలేదు.

ఒకప్పుడు ఒకగ్రామములో రైతు ఒకపొలములో కుప్పనూర్పించెను. పనియంతయు నగునప్పటికి సాయంత్రము అగుటచే నాతఁడు ధాన్యమురాశిని అచ్చట నేయుంచి ఎనమండుగురుకూలివాండ్రను కాపుపెట్టి ఇంటికిఁ బోయెను. కూలివాండ్రు ఆమాటయు నీమాటయుఁ జెప్పుకొనుచుండగా అర్ధరాత్రమయ్యెను. అప్పుడు సదాశివయోగి సదాసంచారపరాయణుఁడు గావున ఎక్కడకో ఆదారినిఁ బోవుచు చీఁకటికారణమున కళ్ళములోనికి వచ్చెను. అంతట అచ్చటనున్న కూలీలు ఆతఁడు ధాన్యము హరించుకొనిపోవుటకువచ్చిన చోరుఁడు అనిభావించి బడితెలుతీసికొని కొట్టవచ్చిరి; గాని యోగిని సమీపించినవెంటనే ఎత్తఁబడినవారిచేతులుపైని అట్లేస్తబ్ధములైపోయెను. అంతట వారు చేయునదిలేక ఒకరినొకరుచూచుకొనుచు ఎట్లో ఆరాత్రిగడపిరి. కొంతసేపటికి తెల్లవాఱెను. అంతలో యజమానుఁడు అక్కడకువచ్చి అంతయుఁ జూచి తెల్లవోయెను. ఈసందర్భములో యోగి అచ్చటనుండి వెడలిపోయెను. ఆతఁడు కదలినవెంటనే కూలీలచేతులు సరిగ వచ్చెను.

ఒకప్పుడు ఒకగ్రామమున ఏదోపనిమీఁదరాజకీయోద్యోగులు అనేకులు వచ్చియుండిరి. వారి వంటబ్రాహ్మణుల యాజ్ఞచొప్పున తలారి వాండ్రు వంటచెఱకు తెచ్చుటకు అడవికిఁ బోయి ఎండుకట్టెలు చాల కొట్టి పెద్దపెద్ద మోపులు కట్టిరి. ఆమోపులు సామాన్యముగ నందఱును మోయఁజాలనివిగా నుండెను. అయినను వాండ్రు బలశాలులు గావున ఒక్కొకమోపు నెత్తుకొనిరి; గాని ఒకమోపు మిగిలిపోయెను. అప్పుడు వారు ఆప్రాంతమున ఉన్మత్తునివలె సంచరించుసదాశివేంద్రునిఁ జూచి ఎవఁడోతమతోడివాఁడుఅని భావించినిర్బంధించిఆతనినెత్తిమీఁద ఆమోపుఎత్తి కూడఁ గొనిపోయిరి. గమ్యస్థానము చేరినతరువాతఅందఱును మోపులుక్రిందఁబడవేసిరి. తుట్టతుదను సదాశివేంద్రుఁడు గూడఁ బడవేసెను. అయితేసదాశివేంద్రుని మోపుతక్కినవానిమీఁదఁబడఁగానే అది అగ్నిజిమ్ముచు తక్కినవానినిఅన్నిటినిదహించివేసెను. సదాశివుఁడు తనదారినిఁ బోయెను తలారులు తెల్లపోయి మఱల అడవికిఁబోయిరి.

ఒకప్పుడు కొందఱు బాలురు వచ్చి "తాతా, నేఁడు మధురాపురములో సుందరేశ్వరునకు మహోత్సవము జరుగునుగదా? అదియిప్పటికేప్రారంభమైయుండునుమాకుఆమహోత్సవమునుజూడవలెననికోరిక గలదు. మామనోరథమును దీర్పవా?"యనిప్రార్థించిరి. తోడనేయాతఁడు వారి నందఱను "నాభుజములమీఁద ఎక్కి కన్నులు మూసికొండు" అనియెను మఱల ఆతనిసెలవుప్రకారము వారుకన్నులు తెఱచిచూచి తాము వృషభవాహనారూఢుఁడై మహావైభవముతో వెలుఁగుచున్న సుందరేశ్వరునియెదుట మధురాపురములో నుండుటఁ జూచి పరమాశ్చర్యచకితులై సదాశివుని అనేకవిధములఁ గొనియాడిరి. ఇక్కడ వారితలిదండ్రులు రాత్రి రెండుజాములు అయినను దమబిడ్డలు ఇండ్లకు రాక పోవుటకుఁ గారణములు ఎఱుఁగక వగచుచు అంతటను వెదకసాగిరి. సదాశివుఁడు అరుణోదయము అగునంతదనుకవారికిమహోత్సవముఁజూపి పిదప యథాపూర్వముగ భుజములమీఁదఎక్కించుకొనికన్నులుమూసికొన నియమించి క్షణములో స్వగ్రామమునకుఁ దెచ్చి విడిచెను. అది చూచియు జరిగినది అంతయు వినియు ఆబాలుర తలిదండ్రులు పరమాశ్చర్యరసనిమగ్నులై సదాశివేంద్రుని మాహాత్మ్యమును అనేకవిధములఁ గొనియాడిరి.

ఇంకనొకప్పుడు ఒక మహమ్మదీయుఁడు తనభార్యమున్నగువారితో ఒకతోఁటలో విడిసియుండెను. అప్పుడు చింపిరిగుడ్డలు కట్టుకొనియున్న సదాశివేంద్రుఁడు ఏదోపనిమీఁద ఆదెసకుఁ బోయెను. అదిచూచి ఆయవనుఁడు ఆతఁడు తనభార్యమున్నగువారిని అవమానించుటకు అట్లువచ్చుచున్నాఁడు అని భావించి అతిరోషముతో వచ్చి ఆతనిభుజముమీఁదఁ గత్తివిసరెను. ఆకత్తిపేటుతప్పుటచే భుజముమీఁదసగము అఱుగుగాయముచేసెను; గాని సదాశివేంద్రుఁడు భగవంతునియందు హృదయమును లీనముచేసియుండుటచే నిదియేమియు నెఱుఁగక తనదారినిబోవసాగెను. అదిచూచి తెల్లవోయి ఆమహమ్మదీయుఁడు ఈతఁడెవఁడో మహానుభావుఁడు అనిభావించి అపరాధమునువిన్నవించి మన్ననవేఁడుకొనవలయునని వెంటఁబడెను. కొంతసేపటికి యోగి వెనుదిరిగిచూచెను. తోడనే మహమ్మదీయుఁడు పాదములమీఁద వ్రాలి శరణము వేఁడెను. అప్పుడు యోగి యవనునివలన సంగతి యంతయు విని ఏమియులేదు అని సన్నచేసి తనకుడిచేతితో ఎడమభుజమును స్పృశించెను. తోడనే ఆభుజము యథాపూర్వముగ నైపోయెను. మహమ్మదీయుఁడు తెల్లవోయి సెలవుఁబడసి వెడలిపోయెను.

ఇంకొకప్పుడు ఒక మూఢబ్రహ్మచారి మంత్రోపాసనముచేసి విద్వాంసుఁడు కావలెనని భావించి ఎటకో పోవుచు మార్గమధ్యమున మనసదాశివేంద్రునిఁ జూచి ఆశ్రయించెను. ఆతని చరిత్రములను వినఁగనే యోగికి కరుణవచ్చెను. అప్పుడు ఆతఁడు తన ప్రభావమువలన రెండుమూఁడు దినములయందే ఆబ్రహ్మచారిని గొప్పపండితునిఁ జేసి పంపివేసెను ఆతఁడు యోగిని విడిచి పోయినపిదప అనేకపురాణములకు గొప్పగొప్ప వ్యాఖ్యానములు వ్రాసి పేరుప్రతిష్ఠలును గొప్పమాన్యములును సంపాదించెను.

ఈయోగీంద్రుఁడు ఇంకను అనేకపర్యాయములు తనప్రభావమును లోకమునకుఁ జూపెను. ఈతఁడు సూర్యోదయకాలమున కాశిగయమున్నగుసకలతీర్థములయందును ప్రతిదినమును గాన్పించి అందఱకు నాశ్చర్యమును గొలుపుచుండెడివాఁడు. ఒకప్పుడు ఈతఁడు తిరువేంద్రంసమీపమున ఒకయరణ్యములోఁ బోవుచుండఁగా తొండమానుఁడు విజయరఘునాథుఁడు అనురాజు లిద్దఱు కాన్పించి దివ్యతేజస్సును బట్టి ఈతఁ

డొక యోగియని భావించి తరణోపాయమును ఎఱింగింపఁ బ్రార్థించిరి. యోగి మాటలాడఁడు కావున ఇసుకమీఁద మంత్రమును వ్రాసి వారికి ఉపదేశించెను. పుదుక్కోటసంస్థానమున ఇప్పటికిని ఆ ఇసుక పూజింపఁబడుచున్నది. మఱియు ఆయోగీంద్రుని బోధచే ఆరాజులు ఆతని సహాధ్యాయి యగు గోపాలకృష్ణశాస్త్రిని తమ గురువుగా నేర్పఱుచుకొనిరి.

ఇట్లు అనంతప్రభావసంపన్నుఁడైన ఈసదాశివయోగీంద్రుఁడు అనేకగ్రంథములనువ్రాసి దేశమున విజ్ఞానమును వెదఁజల్లి అవసానమున ఈశ్వరసాయుజ్యమును అందెను.

---

36. రాకాకుంభారు.

శ్లో. "సకలభువనరత్నం సర్వశాస్త్రార్థరత్నం
సమరవిజయరత్నం సచ్చిదానందరత్నం,
దశముఖహరరత్నం దానవారాతిరత్నం
రఘుకులనృపరత్నం పాతుమాం రామరత్నమ్"

(శ్రీరామకర్ణామృతం. అ. 1. ప. 94)

పంఢరిపురమున రాకాకుంభారు అను నొకకుమ్మరివాఁడు వసించియుండెను. ఆతని సంసారమున భాకా యను భార్యయు, భంగఅను కొమార్తెయుమాత్రము ఉండిరి. ఆతఁడు తనభార్యాపుత్రికలతోఁగూడి కులవృత్తియగు కుంభులవ్యాపారమును చేయుచుండినను లోకులందఱ వలె లేనిపోని నన్నియు కల్పించుకొనక, మాయయు మర్మమును ఎఱుఁగక, పుణ్యపాపములను గుఱుతెఱిఁగి, వ్యామోహవర్జితుఁడై, సదా శ్రీపంఢరినాథుని శ్రవణమననధ్యానాదులచే నర్చించుచు భక్తుడై కాలముగడుపుచుండెను ఆతనిభార్యయు, పుత్రికయుఁగూడ నిట్లేపాండురంగ నామముతో వెలసియున్నశ్రీహరిని సేవించుచు నుండిరి. వారు ముగ్గురునుగలిసి తఱచుగ పండరినాథునికీర్తించుచు భజనముసేయుచు ఆనందాతిరేకముచే మైమఱచుచుండిరి వీరినిఁజూచి తక్కినకుమ్మరివాండ్రును తదితరులును ఆశ్చర్యపడుచుండిరి. కుంభారు ఎన్నికుండలు చేసి విక్రయించినఁ దనసంసారము భక్తులకుఁదగినట్లు నిర్వహింపవచ్చునో అన్ని

కుండలే చేసి విక్రయించుచుండెను; గాని తక్కిన కుమ్మరవాండ్రవలె కుండల చేతలో పడి మునిఁగియుండువాఁడు కాఁడు.

ఇట్లు కాలము గడచిపోవుచుండఁగా, ఆవము పెట్టి కుండలు కాల్పవలయునని తలఁచి ఒకప్పుడు కుంభారు చాల పచ్చికుండలు చేసి ఇంట నీడను ఆరఁబెట్టెను అందొక కుండలో ఒకపిల్లి మూఁడుపిల్లలను బెట్టెను. ఒకనాఁడు పిల్లి తన పిల్లలకు ఆహారము తెచ్చుటకు బైటకుఁబోయియుండఁగా ఈసంగతి యెఱుఁగక కుంభారు ఆకుండలనన్నిటిని ఆవములోఁ జేర్చి పైని గడ్డి మట్టి మున్నగునవి కప్పి నిప్పు ముట్టించెను. కుండలోనున్న పిల్లిపిల్లలు చాల చిన్నవి యగుటచే యెందును బోఁజాలక ఆకుండయందే యుండి సెగతగిలినతోడనే ఆస్వల్పపువేఁడి కే సైపఁజాలక అఱవసాగెను. అంతలో పెద్దపిల్లి వచ్చి యథాస్థానమున కుండలు లేకుండుటఁ జూచి, పిల్లలకు అపాయము సంభవించియుండు నని భావించి, అంతటను గలయఁదిరిగి కుంభారు ఆవమువద్ద నుండుటఁ జూచి, కుండలు ఆవములో పెట్టఁబడి కాల్పఁబడుచున్నట్లు గ్రహించి, తన ముద్దుకూనలు అప్రతియాగ్నిలోఁబడిమాడిపోవుచున్నట్లునిశ్చయించికొని, గొంతెత్తిఏడ్చుచు ఆవముచుట్టును, కుంభారుచుట్టును దిరుగసాగెను. ఆవమునుండి పిల్లికూఁతలు వినవచ్చుచుండుటయు, పెద్దపిల్లి ఏడ్చుచుఁ దనచుట్టును దిరుగుచుండుటయుఁ గాంచి, సంగతి యంతయు గ్రహించుకొని, భార్యను బిలిచి తనకు దోఁచిన దంతయు నెఱింగించి "శ్రీహరీ, ఆర్తత్రాణపరాయణా, భక్తచింతామణీ, మూఢుఁడనై ఏమియుఁ దెలియక పిల్లిపిల్లలను ఆవములో పెట్టి కాల్చివేయుచున్నాను. అయ్యో! నేనెంత పాపాత్ముఁడను! పిల్లిపిల్లలెట్లు బ్రదుకును? అంతయు నీచేతనున్నది. ఈక్షుద్ర సేవకుని ఉద్ధరించినను అధోలోకమునకుఁ ద్రోసివైచినను భారమంతయు నీదే. నాఁడు లాక్షాగృహముతగులఁబడిపోవునపుడు పాండవులను, నిర్దయుఁడై హిరణ్యకశిపుఁడు అగ్నిలోఁ ద్రోయించినపుడు ప్రహ్లాదుని కరుణమతివై రక్షించిన నీకు నోరెఱుఁగని ఈపిల్లికూనలను కాపాడుట ఒక లెక్కలోనిది కాదు అక్రూరవరదా' నారాయణా! ఆపద్బాంధవా! నేను నిన్నే నమ్మి యున్నాను. నీపాదములనే నమ్మి నీనామమునే స్మరించుచు నీరూపమునే ధ్యానించుచు నీయనంతగుణములనే కీర్తించుచు భజన సేయుచున్నాను. అట్టి నాకు అజ్ఞానకృతమగు ఇట్టిదారుణ

పాపము సంభవింపనిచ్చెదవా? నన్ను కుంభీపాకనరకమునఁ గూలఁ ద్రోసెదవా?" అని దీనాతిదీనుఁడై విలపింపసాగెను. కుంభారు భార్యయగు భాకాయి గుండెలు బాదుకొనుచు "శ్రియఃపతీ, దీనమందారా, గజేంద్రరక్షకా, అనాథనాథా, మావలన దారుణకృత్యము చేయఁబడినది. ఈదారుణమును మానవమాత్రుఁడు తప్పింపఁ జాలఁడు. ఈపిల్లుల విచారమును జూచిన నాకడుపు తఱుగుకొనిపోవుచున్నది. బిడ్డలను గన్న నేను ఈఘోరమును ఎట్లుచూడఁగలను? కట్టా హృషీకేశా, వాసుదేవా, చనిపోయిన బ్రాహ్మణబాలురను బ్రతికించి తెచ్చి తల్లిదండ్రులకు అప్పగించిననీకు ఈయాపత్తును తప్పించు టెంతటికార్యము? ఈయాపద తప్పదేని నాభర్తయు నేనును నాకొమార్తెయు నీచరణసన్నిధినిఁ బ్రాణములను విడిచెదము" అని విలపింపసాగెను. భంగయు ఇది యంతయుఁ జూచి తానుగూడ అట్లే ఆక్రందనము చేయసాగెను. వీరిట్లు భూమిపైఁబడి పొరలుచు దొరలుచుండఁగనే రెండు అహోరాత్రములు కడచిపోయెను. ఈరెండుదినములునుగూడ ఆవము కాలి, మూఁడవదినమున చల్లారెను వెంటనే కుంభారు ఆవమును విప్పి చూచెను. కుండలన్నియు ఎఱ్ఱఁగఁ గాలియుండెను; గాని పిల్లిపిల్ల లున్న కుండమాత్రము సెగయైన తగులకుండ భద్రముగా నుండెను. అందలి పిల్లిపిల్లలు దీనినేమియు నెఱుఁగకయే ఎదుటనున్న మంటను జూచి వినోదముగాఁ జెలగాటము ఆడుకొనుచుండెను ఇది యంతయుఁ జూచి కుంభారును భాకాయియు, భంగయు పరమాశ్చర్యచిత్తులై సర్వేశ్వరుని అనేకవిధముల వినుతించి కుండయందలి పిల్లికూనలను తల్లిచెంత విడిచి వానికిఁదగిన ఆహారము వేసిరి. విచారసాగరమున మునిఁగియున్నవారు; గావున వారికి ఈమూఁడు రాత్రియుంబవళ్లును నిద్రాహారములను అనుభవించుటకుఅవకాశము లేకపోయెను. అయినను పిల్లిపిల్లలను జూచినవెంటనే కడుపులు దహించి వేయుచున్న ఆఁకలియు కన్నులనుమండించివేయుచున్న నిద్రయు నటు మాయమైపోయెను. లోకబాంధవుఁడగు రుక్మిణీకాంతునిఁ గొలుచువారిని ఆపదలు సమీపింపఁజాలవుగదా! అప్పటినుండి ఇఁక కుండలు చేసి కాల్చి విక్రయింపఁగూడదని వారు ప్రతినఁదాల్చిరి.

పిదప వారు ఇఁక జనులమధ్యమున నుండఁగూడదని నిశ్చయించుకొని ఊరియందలి బీదల నందఱను రావించి తమకు ఉన్నదంతయు

వారికి ఇచ్చివేసి పండరినాథునిఁ గీర్తించుచు అరణ్యమునకుఁ బోయిరి. అచ్చట వారు అచ్చటచ్చటఁ బడియున్న ఎండుకట్టెలను ఏరి సమీపగ్రామమునకుఁ గొనిపోయి చాల తక్కువవెలకు విక్రయించి ఆస్వల్పధనముతో ఎట్లో దినపాతము సేయుచు సదా హరిభజనము సేయుచుండిరి. ఎండుకట్టెల నేరునపుడు రెండుకట్టెలు ఒక్కచో దైవవశమునఁబడియుండినను అవి ఎవరిచేతనో అట్లు ప్రోగుచేయఁబడినవని తలంచి వానినిఁ దాఁకక ఒక్కొక్కటిచొప్పున నున్న కట్టెలను మాత్రమే వారు ఏరుచుండెడివారు. మఱియు గ్రామమునుండి అరణ్యమునకు వచ్చునపుడు వారు తమ వృథవస్త్రములనన్నిటిని బీదలకు ఇచ్చివేసిరి. గావున కట్టెల నమ్ముటకు గ్రామములకుఁ బోయినపుడు వీథులలో నెచ్చటనైన గుడ్డపేలికలు దొరకినచో వానినిఁ గొనిపోయి కుట్టుకొనిధరించుచుండెడివారు.

చ "సుధలు గుల్కు గోపికలనారణ నొండొరుతోడ నాడుమా
టులఁ జెవికింపుగా వినఁదొడంగి తనర్చిన మందహాసము
బలుసుఱు నాఁగి మేను గరుపాఱఁగ నూఱక కన్నుమోడ్చు న
జ్జలరుహపత్త్రనేత్రుని మనస్స్ఫుట నిద్దురను మ్రొక్కెదన్.

(కృష్ణకర్ణామృతం. ఆ. 1. ప. 26)

చ. మరకతముఖ్యరత్నసుసమాన్వితవిగ్రహుఁ గౌసలేయు దు
ర్భరదనుజప్రహారు రఘురాజశిఖామణి జానకీమనో
హరుఁ ద్రిజగద్ధితున్ శమదమాద్యఖిలైకగుణాకరున్ సురే
శ్వరనుతరాజచంద్రు బుధవత్సలు ధార్మికు నాశ్రయించెదన్."

(రామకర్ణామృతము ఆ, 1. ప, 1.)

ఈతీరున వారు ముగ్గురును హృదయమును సతతము శ్రీమన్నారాయణునియందు లీనముచేసి ఆనందోన్మత్తులై యుండెడివారు.

ఒకప్పుడు కుంభారు కట్టెల నమ్ముటకు ఒక సమీపగ్రామమునకుఁ బోయి బజారులో నొక యంగడిముందు గుడ్డపేలికఁ జూచి దానిని గ్రహించుటకుఁ జేయిసాచెను. అదిచూచి ఒక కొంటెవాఁడు "అది స్వామి దివ్వెకుఁ జుట్టుటకుఁ బనికివచ్చును. విరక్తులు దాని నంటఁగూడదు" అని పలికెను. కుంభారు అదివిని యులికిపడి చాచిన చేతిని చాచినట్లే ఎత్తుకొని ఆసమీపమునఁ బడియున్న ఒకయెంగిలాకును మొలకుఁ జుట్టబెట్టుకొనుటకుఁ దీసికొనెను.

ఒకనాఁడు కుంభారు కొమార్తయగు భంగ ఏటికిఁ బోయి స్నానముచేసి, నీటిలో నిలిచి సర్వేశ్వరుని ధ్యానించుచుండెను. అప్పుడు నామదేవుని కూఁతురు ఆయేటికే ఆరేవునకే స్నానమునకు వచ్చి భంగ నిలిచియున్నచోటికి సమీపమునందే యున్న రాతిమీఁదఁ బట్టలు ఉతుకసాగెను. భంగ భట్టలనీళ్లు మీఁదఁబడుచుండుటఁ జూచి "నామీఁద నీళ్లుపడుచున్నవి. కొంచెము దూరమున నున్న రాతిమీఁదికిఁ బోరాదా?" అని పలికెను. అదివిని నామదేవుని పుత్రిక "ఏమిఒయ్యారమే అమ్మా, కులముచే అధమురాలవయ్యు నోటితో గొప్పమాటలనే పలుకుచుంటివి. అవును. నీతండ్రి తానేమో గొప్పవాఁడనని భావించి పాండురంగని వంచించుచున్నాఁడు. ఆతండ్రికి తగిన బిడ్డవు నీకీమాటలు తగినవే" అని మాఱుపలికెను. ఈమాటలమీఁద భంగకుఁ గోపము వచ్చెను. "అవునమ్మా, పిచ్చిపిచ్చి భక్తుఁడై అర్చామూర్తియైయున్నపండరినాథుని ఇబ్బందిపెట్టి తనతో మాటాడునట్లును, తనపంక్తిని భుజించునట్లును, జేసికొని నీతండ్రి విఱ్ఱవీగుచున్నాఁడు. మాతండ్రి అట్లు భగవంతునకు ఏమియు హృదయావేదనమును గలిగింపక పిల్లికూనలకు విపత్తు తటస్థించినప్పటినుండియు కేవలము విరాగియై ప్రపంచమును విడిచి అడవికిఁ బోయి ఒంటిగా నున్న కట్టెలను ఏరికొని స్వల్పమూల్యమునకు విక్రయించుకొని ఆకొలఁది ధనముతో జీవములను నిలుపుకొని నిష్కాముఁడై భగవంతుని అర్చించుచు కాలము గడుపుచున్నాఁడు. నాతల్లియు నేనును నాతండ్రి పదాంకములను అనుసరించి ఈశ్వరు నారాధించుచున్నాము. మీతండ్రివలె గాదు. నీవిధమును గాదు. మాకు ఆడంబరము లేమియు లేవు. నీవేమి యనినను నాకు అభ్యంతరము లేదు" అని మఱి పలుకక తనదారిం బోయెను.

అదివిని అవమానజనిత మగు రోషావేశమువలన ఒడలు తెలియక తిన్నఁగ నింటికిఁ బోయి సంగతి యంతయు నివేదింపఁగా నామదేవుండు ఆశ్చర్యచకితుఁడై తోడనే పాండురంగని ఆలయంబునకుఁ బోయి "స్వామీ, రాకాకుంభారు చరిత్ర మెట్టిది? ఆతఁడు నిష్కామకర్ముఁడా? సకామకర్ముఁడా? నాకెఱింగింపవలయును" అనిప్రార్థించెను. అందులకు శ్రీపతికుంభారుతోతులతూఁగఁగలనిష్కామకర్ముఁడుసకలభువనములయందును లేఁడు" అని చెప్పఁగా నామదేవుఁడు మఱింతవింతపడి "ఈశ్వరా,

ఆతని నిష్కామపరత్వమును నాకుఁ బ్రత్యక్షముగఁ జూపవలయును" అని వేడుకొనియెను. అంతట విఠలనాథుఁడు నామదేవుని రుక్మిణీదేవిని వెంట నిడుకొని కుంభారు నివసించియున్న అడవికిఁ బోయి ఆతని చరిత్రనంతయు నెఱింగించి నడచునపుడు ఏప్రాణియైన తన కాలిక్రిందఁ బడి నలిగిపోవునేమో యని భయపడుచు కుంభారు అతిజాగ్రత్తతో నడచుచుండుటఁ జూచి "నామదేవా, చూచితివిగదా కుంభారు నిష్కామపరత్వమును? ఇంకను చూడుము" అని రుక్మిణినిఁ జూచి కన్నుగీటెను. అంతట భగవంతుని ఇంగితము నెఱింగి రుక్మిణి తన చేతి రత్నకంకణమునుదీసి యొకకట్టెక్రిందనుంచెను. అంతట కట్టెలకొఱకై అట సంచరించుచున్న కుంభారు ఆకట్టెను ఈకట్టెను ఏరుకొనుచు తుదకు రుక్మిణి తన కంకణముమీఁద నుంచిన కట్టెను దీసికొనెనుగాని అంతలో క్రిందనున్న రత్నకంకణము తళతళ మెఱయుటఁ జూచి "అయ్యో! ఈకంకణమును ఎవరో దీనిక్రింద దాఁచికొనినారు. ఇఁకనిక్కడనివసించినచో హృదయము వ్యామోహగ్రస్తము అయిపోవును" అని భీతుఁడై భార్యాపుత్రికలతోడ మఱియొకకాననమునకుఁ బాఱిపోయెను.

అదిచూచి నామదేవుఁడు నిర్విణ్ణుఁడై, అద్భుతాశ్చర్యములకు లోనై "పాండురంగా, కుంభారుప్రభావమువిస్పష్టముగఁ దెలిసినది ఈతని నిష్కామపరత్వమునకు మేఱలేదు ఇట్టి నిష్ఠ నాకెప్పుడును గలుగలేదు. ఇతనికంటె సహస్రాంశము హీనుఁడనయ్యు నేను "నాకు భగవంతుఁడు సాక్షాత్కరించును" అని గర్వించియున్నానుగాని నాకంటె నెన్నోరెట్లు అధికుఁడగు భాగవతాగ్రేసరుఁడు గర్వము అనుమాటయే యెఱుఁగఁడు ఆహా! ఈతనిఁ జూచుటవలన నేను పాపముక్తుఁడనైతిని. శ్రీధరా! పద్మనాభా! ఇట్టి భక్తశిఖామణికి నీవు ఇంకను ఏల సాక్షాత్కరింపకున్నావు" అని తొందఱపెట్టెను. అంతట శ్రీహరి నామదేవుఁడు సందేహవిముక్తుఁడైనందులకును తన హైన్యమును ఎదుటివాని ఆధిక్యమును అంగీకరించినందులకును హర్షించి రుక్మిణీసహితుఁడై తటాలున కుంభారునకు సాక్షాత్కరించి కౌఁగిలించికొని "భక్తచక్రవర్తీ. నీనిష్ఠకు సంతసించితిని. నామదేవుని సంశయమును దీర్చుటకు నిన్ను పరీక్షించితిని. నీవు ఇదియేమియు మనసున నుంచుకొనకుము. నేను నిన్ను విడిచియుండను" అనిచెప్పి తిరోహితుఁ డయ్యెను. కుంభారు ఇది యంతయు భార్యాపు

త్రికలకు ఎఱింగించెను. అందఱును ఆనందోన్మత్తులై నాట్యముచేసిరి. కుంభారు అవసానమున ఈశ్వరసాయుజ్యముఁ బడసెను.

చ. "ఇనకులరాజరత్న మసురేశ్వరమర్దనరత్నము వ్రణా
వనిజయరత్నము న్నిగమవర్ణితరత్న మమేయరత్నముం
దనుజవినాశరత్నము విధాతృసమర్చితరత్నముం జగ
జ్జనసుతరామరత్న మనిశంబు కృపామతి నన్ను బ్రోవుతన్."

(రామకర్ణామృతము. ఆ. 1. ప.94)

---

37 సమర్థరామదాసస్వామి

శ్లో. "వేద్యంవేదగురుం విరించిజనకం వేదాంతమూర్తింస్ఫుర
ద్వేదం వేదకలాపమూలమహిమాధారాంతకందాంకురమ్,
వేదశృంగసమానశేషశయనం వేదాంతవేద్యాత్మకం
వేదాద్యర్థితపాదపంకజమహం రామం భజే తారకమ్.

(రామకర్ణామృతము. ఆ. 2. ప. 33.)

జగత్పావని యగు గంగానదియొడ్డున జంబూనగరము అను నొకగ్రామమున ఒక బ్రాహ్మణుఁడు శ్రీరాముని ఉపాసించుచు భాగవతోత్తముఁడై, విజ్ఞానశేఖరుఁడై ప్రపంచవాసన ఎఱుఁగక కాలము గడుపుచుండెను. ఆతనిభార్య ఆతనికి అనురూపయై ఆతనివలెనే విషయసుఖములఁబొందక శ్రీరాముని శ్రవణమననధ్యానభజనకీర్తనలతో ఆరాధించుచు కాలముఁ బుచ్చుచుండెను. ఆదంపతులు భూతదయాపరులై, వర్ణభేదము నెంచక వచ్చిన యతిథుల నెల్లరను మృష్టాన్నసంతృప్తులఁ గావించుచు అహోరాత్రములు శ్రీరామసేవానిమగ్నులై, విశేషించి ఏటేటను చైత్రశుద్ధనవమి మొదలు పండ్రెండుదినములు అత్యంత భక్తిభావముతో రామోత్సవము సేయుచు వీలు అయినంతవఱకు భక్తుల నెల్లరను రావించి వారిని సేవించుచు ఉండిరి. ఇట్లుండఁగా నొకయేటి రామోత్సవసమయమున వారిస్వప్నమున భక్తులపాలి చింతామణియగు శ్రీరామచంద్రమూర్తి ప్రత్యక్షమై "మీ యెడల నాకు మెప్పు గలిగినది. మీ సేవకు ఆనందించితిని. నా అంతరంగభక్తులలో నగ్రేసరుఁ

డగు ఆంజనేయుఁడు నీకడుపునఁ బుట్టి సతతము నాసేవయందే నిమగ్నుఁడై విజ్ఞానమూర్తియై లోకము నుద్ధరించును” అని చెప్పి తిరోహితుఁ డయ్యెను.

వెంటనే వారు మేల్కాంచి తమ తమ స్వప్నవృత్తాంతములు ఒండొరులు తెలిసికొని శ్రీరామభద్రునకు తమ యెడల నిట్టి యనుగ్రహము గలిగినందులకు ఆనందపరీతహృదయులై మైమఱచి నృత్యము ప్రారంభించిరి. పిదప కొన్నిదినములకు ఆబ్రాహ్మణపత్ని గర్భవతియై నవమాసములు మోసి ఒక్క శుభదినమున ఆంజనేయాంశమున సుపుత్రు నిఁగనియెను. అంతయు శ్రీరామచంద్రుఁ డానతిచ్చినట్లు జరిగినందులకు సంతసించిరి. ఊరి స్త్రీలందఱును “ఏమి యదృష్టమమ్మా” అని వింతపడిరి. ఆపుణ్యదంపతులు దాశరథికరుణావిశేషమువలనఁ గలిగిన తమ బిడ్డకు పండ్రెండవ దినమున “రామదాసు” అని నామకరణమహోత్సవమును నెరవేర్చిరి. లేకలేక కలిగిన యాకుమారుని వారు ఎంతో గారాబముగఁ బెంచుకొనుచు ఐదవయేట అక్షరాభ్యాసముగావించి ఒక పండితునియొద్ద విద్యాభ్యాసార్థము నిలిపిరి. రామదాసుఁడును ఆంజనేయాంశమున పుట్టినవాఁడగుటను దేశము నుద్ధంపవలసినవాఁ డగుటను కుశాగ్రబుద్ధియై గురువు చెప్పిన దెల్ల ఒక్కమాఱు చెప్పినంతనే గ్రహించుచు నాలుగేండ్లలో సకలవిద్యలయందును అపారపాండిత్యమును సంపాదించెను. అప్పటికి ఆతనివయస్సు తొమ్మిదేండ్లు. అంతకుఁ బూర్వమే ఆతనికి తలిదండ్రులు చౌలోపనయనాదిసంస్కారములు అన్నియుఁ గావించి, ఆతఁడు సకలకలాకోవిదుఁడై యుండుటఁ జూచి వివాహము చేయఁదలఁచి ఒక చక్కని కన్యను నిశ్చయించిరి. కొలఁదిదినములయందే వివాహప్రయత్నములు సమస్తము నెఱవేఱెను అంతట వచ్చిన బంధుమిత్రాదు లందఱతోడను ఆనందసాగరమున నోలలాడుచు ఆతని తలిదండ్రులు పెండ్లికుమార్తెను అలంకరించి తెచ్చి పెండ్లిపీటమీఁదఁ గూర్చుండఁజేసి మంగళస్నానములు చేయించుటకై రామదాసుని గూడఁ గొనివచ్చిరి. రామధ్యానపరాయణుఁడై యున్న రామదాసు అంతవఱకును తనకు వివాహము జరుగు సంగతి ఏమియు నెఱుఁగనివాఁ డగుటవలన తలిదండ్రులు అందఱనడుమకును గొనివచ్చినపుడు తెల్లఁబోయి అంతయుఁ దెలిసికొని “అయ్యో,

ఇదియేమి ఘోరము? పరితోడను సంబంధములేక నామట్టునకు నేను ఏమూలనో ఒదిగి యుండి శ్రీరామధ్యానము చేసికొనుచుండఁగా ఈగోల యంతయు నేమి? కష్టా! మీరు నాకెట్టి యపకారము చేయఁ దలఁచితిరి. సంసారమునకును సాగరమునకును పరిమాణమునఁ దక్క మఱియేమియును భేదము లేదు. సాగరము నైనను దాఁట వచ్చును గాని సంసారమును తరించుటకు బ్రహ్మకైనను తరము కాదు. సంసారమను సముద్రమున ఆశయే జలము. మన్మథుఁడే గాలి. మోహమే కెరటములు. భార్యయే సుడిగుండములు. పుత్రికలు పుత్రులు అన్నలు తమ్ములునే మొసళ్లు. వీనితోడను, ఇంక నిట్టి అనేక భయంకరవస్తువుల తోడను నిండి అగాధమును అనంతమును చొఱరానిదియు అగు ఈ సంసారసాగరమున నన్ను కూలఁద్రోయఁ దలఁచితిరి గదా? మీరు కూలుట చాలదా?. ఆఁకలిలేనివాని కన్నము పెట్టినట్లు కోరనిదే నాకు ఈ పెండ్లియేల? ఈప్రయత్నము సేయునపుడు ఈవిషయమును గుఱించి నాతో ముచ్చటించి యున్నయెడల మీకు ఈశ్రమ లేకపోయి యుండుఁగదా? నాయభిప్రాయము నెఱుఁగరైరి. నాయిచ్ఛను దెలిసికొనరైరి. మీయభిరుచినిఁ బట్టి నామనస్సును నడుపఁజూచితిరి. కష్టా! ఇంతకంటె దౌర్జన్యముండునా! ఇప్పుడైనను మించినది లేదు. మీప్రయత్నములు మీచిత్తమువచ్చినట్లు చేసికొనవచ్చును. పెద్దలు నాసుఖదుఃఖములఁ దెలిసినవారు నాయభీష్టమును నెఱవేర్చువారును అని యనుకొంటిని. బాగాయె మీకిఁక శ్రమవలదు." అని పలికి తటాలున అచ్చటనుండి పాఱిపోయెను. ఆతని తల్లిదండ్రులును బంధుమిత్రులును ఆతనినిఁ బట్టుకొనుటకు చాల ప్రయత్నించిరి; గాని ప్రయోజనము లేదయ్యెను. తుదకు అందఱును ఈతఁడు ఆంజనేయుని అంశమున జనించెనుగదా? మారుతి అస్ఖలితబ్రహ్మచారి అనవరతశ్రీరామస్మరణానందపరవశుఁడు. అట్లే ఈతఁడును అస్ఖలితబ్రహ్మచారియు శ్రీరామసేవాతత్పరుఁడును అగుటలో వింతయేమి? ఇఁకెంత ప్రయత్నించినను మనము ఈతని హృదయమును త్రిప్పఁజాలము" అని నిశ్చయించుకొనిరి. బంధుమిత్రాదులును మీరు అదృష్టవంతులు గావున ఇట్టి సత్పుత్రుఁడు ఉదయించెను. ఈతఁడు సంసారపరాఙ్ముఖుఁడైనందులకు వగవఁ బనిలేదు. ఆంజనేయుని అపరావతారమగు శ్రీరామభక్తుఁడు పుణ్యవశమున మీకడుపునఁ

బుట్టి నంతేచాలు" అనిరామదాసు తల్లిదండ్రుల నూఱడించి తమతమ గ్రామములకు వెడలిపోయిరి. ఆతని తల్లిదండ్రులు అప్పటినుండియు రామ ధ్యానపరాయణులు అయిరి.

అట్లు పాఱిపోయిన రామదాసు తిన్నఁగ గంభీరారణ్యమధ్యమునకుఁ బోయి ఒక చెట్టునీడఁ గూరుచుండి ముకుళితకరకమలుఁడై నిమీలితనేత్రుఁడై విశుద్ధహృదయుఁడై "శ్రీపతీ,రాక్షసాంతకా,మునిరంజనా, నీప్రభావము అచింత్యము. నిర్గుణుఁడ వగు నీవు ననుబోలు విపన్నులను రక్షించుటకు సగుణత్వము నంగీకరించుచున్నావు. అట్టిచో ఈమానవులు తత్త్వము నెఱుంగలేక మాయావరణమునఁ గూలి చెడిపోవుచుండుట విచారకరముకదా? శ్రీహరీ, నాకేమియువలదు. నాకువాక్కు నిచ్చితివి. వానిని నీగుణకీర్తనమునందేయుపయోగించునట్లు చేయుము. మఱియు నాకు ఇచ్చిన కన్నులను నిన్నుసందర్శించుటయందును, కరములు నిన్ను బూజించుటయందును, పాదములు నిన్నువలగొనుటయందును, హృదయము నీపాదపీఠముగను వినియోగించునట్లు సేయుము. నేను ఈ ప్రపంచమున మనఁజాలను. విద్యాహతులగు ఈజనులతోఁ గూడి యుండఁజాలను. నాకుఁ బోసిన యాయుర్దాయమును ఐహికసుఖాభిలాషియగు వేఱొకనికి ఇచ్చి నాకు మోక్షము దయచేయుము" అని యనేకవిధములఁ బ్రార్థింపఁదొడఁగెను.

అంతట శ్రీరామభక్తాగ్రేసరుఁడగు ఆంజనేయుఁడు తన నిజరూపముతో సాక్షాత్కరింపఁగా రామదాసు "భాగవతాగ్రణీ, నీయభిప్రాయములను గ్రహించితిని. నేను సంసారసాగరమునకు అరిషడ్వర్గమునకును భీతిల్లుదును; గాని ఈనీఘోరాకారమునకు భీతిల్లువాఁడనుగాను. శ్రీరామచంద్రుని అంతరంగభక్తులలో అగ్రేసరుఁడవగునిన్ను జూడఁగలిగినదానికి ఇంక భీతిమున్నగు ప్రాపంచికవాసనలు ఎట్లుండును ? నీయనుగ్రహమునకుఁ బాత్రుఁడనైన ఇఁక నాకుఏమి లోపములు ఉండును ? నాకు ఏమియు వలదు శ్రీరామచంద్రునికొఱకు నేను పరితపించుచున్నాను. సీతాపతిదివ్యమంగళవిగ్రహమునుజూచుటకు ఆత్రపడుచున్నాను. ఆ దేవదేవుని పాదకమలములనుఅర్చించుటకు నిరీక్షించుకొనియున్నాను. నీవుకరుణాసముద్రుఁడవు. నాయెడఁగరుణించినన్ను ఈప్రపంచవాసలనుండితొలఁగింపుము. శ్రీరామచంద్రునిఁజూపుము." అని యాతని ననేకవిధములఁ

ప్రార్థించెను. మారుతి రామదాసునెడలఁ జాలఁ గరుణార్ద్రహృదయుఁడై ప్రేమతో లేవనెత్తి "వత్సా, నీహృదయము విశుద్ధమైయున్నది. నీదీక్ష అనంతము నీవాంఛ మునిజనోచితమునై యున్నది. నీవాగ్ధోరణి నన్ను ముగ్ధునిఁ జేయుచున్నది. ఇట్టి నీయెడల మావంటి కించిజ్జ్ఞుల ప్రేరణలేకయే శ్రీహరి సానుగ్రహుఁడై యుండును. శ్రీరామచంద్ర మూర్తి, మెట్టవేదాంతులై ధనసంపాదనకొఱకు ఉపదేశములను జేయుచు ఆత్మవంచకులై అజ్ఞానులను అన్నివిధములను జెఱుచుమాయ దారిభక్తులకు దాదవ్వుల నుండును; గాని నినుబోలు శుద్ధాంతరంగులను ఎప్పుడును కనిపెట్టుకొనియే యుండును. విశుద్ధభక్తుల వినిర్మల చిత్తములే ఆతనికి వాసస్థానము. నీచర్మచక్షువులకు ప్రకృతము కానిపింపకపోయినను ఆతఁడు నీహృదయమునందే యుండి నీభావయంత్రమును ద్రిప్పుచున్నాఁడు. ఆశ్రీపతికి నేనెట్టివాఁడనో నీవు నట్టివాఁడవ. త్వరపడకుము. శ్రీహరి యగు రామభద్రుఁడు నీకుసాక్షాత్కరింపకుండ నుండఁజాలఁడు" అని చెప్పి చూచుచుండఁగనే మాయమైపోయెను.

ఆంజనేయుని యుపదేశముచొప్పున రామదాసు నిశ్చలచిత్తుఁడై పగటియందు దగ్గఱిగ్రామములకుఁ బోయి భిక్షాన్నమును దెచ్చుకొని ఏకభుక్తము చేయుచు, ఇన్నూఱు శ్లోకములను రచించి సదా వానినే చదువుచు భజనము సేయుచు కాలము గడుపుచుండెను. ఇట్లు కొన్నిదినములు గడచునప్పటికి మఱల మారుతి సాక్షాత్కరించి "భక్తాగ్రేసరా, ఆషాఢశుద్ధైకాదశినాఁడు పండరిపురమున మహోత్సవము జరుగును. అది సమీపించుచున్నది. నాఁడు నీవు అచ్చటకుఁ బొమ్ము. శ్రీరాముఁడు నీకు సాక్షాత్కరించి నీయభీష్టములను నెఱవేర్చును" అనిచెప్పి తిరోహితుఁడయ్యెను. అంతట రామదాసు మహానందభరితుఁడై వెంటనే బయలు వెడలి పండరిపురమునకుఁ బోయెను. అప్పటికి మహోత్సవము ప్రారంభమయ్యెను. వివిధ దేశములనుండి అనేకసాధువులు, సజ్జనులు, విపన్నులు, భక్తులు మున్నగువారు చనుదెంచి అమ్మహోత్సవానందమున మునిఁగి యుండిరి. రామదాసు వారి సందడిను జూచి ఆసజ్జనసమూహమున తెరచాటునఁబోలె నీషత్తిరోహితుఁడై సాక్షాత్కరించియున్న విశ్వరూప

నారాయణుని మంగళస్వరూపము సందర్శించి మిగుల హర్షించి చంద్రభాగానదియందు జలకమాడి మహాద్వారమున నవతరించియున్న ఆంజనేయుని సేవించి, పిదప ఆలయమునఁ బ్రవేశించి యిటుకరాతిపై వెలసియున్న పాండురంగని జూచెను; గాని ఆతనికి తృప్తి కలుగ లేదు. అంత నాతఁడు అతృప్తుఁడై సాగిలఁబడి మ్రొక్కి “శ్రీరమణా, రామచంద్రా, నీవిచ్చట నుంటివని మారుతి చెప్పఁగా వచ్చితిని. ఆతఁడు చెప్పినమాటలనుబట్టి నీవు నాయెడల సదయుఁడవై యుంటివని తలంచి ఉప్పొంగిపోయితిని. కాని ఎంత మోసపోయితిని నీకు ఈవంచనము ఎప్పటినుండి యలవడెను? నీస్థితి యంతయు విపరీతముగా నున్నది. లక్ష్మణుఁడెక్కడ? సీతయేది? భరతశత్రుఘ్ను లెందున్నారు? ఆంజనేయుఁడెచ్చటనో యున్నాఁడేల? పరివార మంతయు నేమైనది? చేత కోదండమేది? ఈవికృతరూపమేల? నాయెడ ననుగ్రహము లేదా? నన్ను పరీక్షింపఁ బూనితివా? అయ్యో! నేను తాళఁగలనా? నిన్ను చూడక నాకన్నులు కాయలు కాచిపోయినవి. నీవనేకులను రక్షించితివి. నేనొక్కఁడను భారమైతినా? నాకేమియు వలదు. నీదివ్యమంగళవిగ్రహమును జూపినఁ జాలును అంతమాత్రమునకైన తగనా?” అని పరిపరి విధముల ప్రార్థించెను. అపుడు శ్రీరామచంద్రుఁడు రామదాసు కోరిన విధమున సీతాలక్ష్మణభరతశత్రుఘ్నపరివారసమేతుఁడై మందహాసము గావించుచు రామదాసునకుఁ గానిపించెను.

వెంటనే రామదాసు స్వామిపాదములను ఆనందబాష్పములతో కడిగి “శ్రీహరీ, ఆర్తత్రాణపరాయణా, యెన్నోదినములనుండి నీకై వేచియున్నాను. ఇప్పటికైన దయగలిగె నంతియే చాలు. నాకిఁక నేమియు వలదు. నీదర్శనమువలన నాహృదయమునకు శాంతి యొనఁగూడినది” అని యనేకవిధముల నుతించుచుండఁగా శ్రీరాముఁడు ఆతని శిరమునఁ జేయియుంచి “వత్సా, నీయచంచలభక్తికి మెచ్చు కలిగినది. యథార్థమున నేను నామరూపరహితుఁడను. అయినను దుష్టశిక్షణార్థమును శిష్టరక్షణార్థమును అనేకరూపములను గైకొనుచున్నాను. ఎవరేరూపమును గోరి నన్ను ప్రార్థింతురో వారి కారూపముతోనే సాక్షాత్కరించి సేవ యొసంగుచున్నాను. కావుననే నీవు కోరినట్లు శ్రీరామ

రూపముతో నిప్పు డిట సాక్షాత్కరించితిని. నీవు నాయంతరంగభక్తు లలో నెల్ల నుత్తముఁడవు. నన్నిపుడు ఏరూపమున నుండఁగా చూచి తివో ఆరామరూపమునే ధ్యానించుచు సకల ప్రపంచమునందును నన్నా గుర్తెఱిఁగి లోకుల నుద్ధరించుచుండుము" అని నియమించి తటాలు న మఱల పాండురంగరూపమును వహించెను.

ఇది యంతయు కనుమూసి తెఱచునంతలో ముగిసిపోవుటవలన రామదాసు కలగన్నవానివలెఁ గొంతవడి భ్రాంతుఁడై అంతలో హృద యము తేటెకొని ఎదుట సాక్షాత్కరించియున్న విఠలనాథుని వినుతింపఁ దొడఁగెను. కొంతసేపటివఱకు నాతఁడు తన్మయుఁడై యుండి పిదప ప్రాపంచికస్మృతి గాంచి ఆనందాతిరేకమువలన నృత్యముచేసి ఉత్స వమంతయు ముగియునంత దనుక నచ్చటనే యుండి సాధుసజ్జను లెల్ల రను సేవించి మహాద్వారమున నున్న మారుతికి మఱల మ్రొక్కి మగు డ చంద్రభాగానదియందు స్నానమాడి ఆనందపరితహృదయుఁడై అరణ్యమునకు మఱలెను.

మార్గమధ్యమున జేసూరు అను నొకపట్టణ ముండెను. ఆనగ రమున ఉన్న పార్వతీపతి శ్రీరామచంద్రుని అంతరంగభక్తుఁ డగు రామ దాసు సమీపమునుండి పోవుచుండుటను జూచి ఒక మహారాజు వేష ముతోఁ బోయి ఎదుట నిలిచెను. అంతట రామదాసును తన యెదుట నున్నయాతఁడు తారకమంత్రోపదేశకుఁడును పార్వతీపతియు నగు శంభుఁడు అని యెఱింగి సాష్టాంగదండప్రణామంబు లాచరించి "పర మేశ్వరా! అయాచితముగ నాకు దర్శన మొసంగిన నిన్ను నేనేమని కొనియాడఁగలను? నాపై నీకిట్టికటాక్షముగలుగుటకు నాయెఱిఁగినంత వఱకు హేతువు లేదు. పరబ్రహ్మముయొక్క అనుగ్రహము గల్గుట ఎం తవానికి లభించును? నీతత్త్వము అవాఙ్మానసగోచరము నీవునామరూప రహితుఁడవే గాని మా కనేకరూపములతోఁ గాన్పించుచున్నావు. అనేకనామములతో వినఁబడుచున్నావు. చక్రధరుఁడవై వైకుంఠనా థుఁడ వయ్యెదవు. పినాకపాణివై కైలాసగిరిపై సంచరింతువు. పద్మో ద్భవుఁడవై ప్రపంచమును సృష్టింతువు.నీలీల లనంతములు. పాండురంగ విగ్రహమున కోదండపాణివై శ్రీరామచంద్రుఁడవై సాక్షాత్కరించి,

ఇపుడు పరమశివుఁడవై నన్ను పరీక్షించుటకు మహారాజరూపముతో దర్శన మిచ్చితివి. నీయాథార్థ్యమును తెలిసినవారు లేరుగదా? ఎఱుకలేకయే విజ్ఞానశేఖరుల మని విఱ్ఱవీఁగుచు కొందఱు నీకు శివవిష్ణ్వాదిభేదములను గల్పించి తలక్రిందు లయ్యెదరు. కట్టా! ఎంత మౌర్ఖ్యము. "శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే, శివస్యహృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః" అను తత్త్వము నెఱుంగక ఎందఱు చెడుచున్నారు!" అని ఈతీరున అనేకవిధములవినుతించి ప్రణతిచేసి నిలిచెను. అదిచూచి మహేశ్వరరూపి యగు భగవంతుఁడు రామదాసుని నిష్కల్మషహృదయమునకు ఆనందించి ఆతనిని కొందఱుభక్తులు తనకు నిర్మించిన ఆలయమునకుఁ గొనిపోయెను. రామదాసు కొంతతడవు మహేశ్వరుని సేవించి సెలవుఁబడసి బయలుదేఱెను. రామదాసు ఇట్లు ఆప్రాంతమునకు వచ్చుట విని భారతధర్మమునుమాపు మాపఁదలఁచియున్న మహమ్మదీయులను ఉక్కడంచుచున్న శివాజీయను మహారాష్ట్రప్రభువు అచ్చటకు వచ్చెను. ఇరువురును ఒక పర్వతపాదమున సమావేశమైరి శివాజీ తన్ను శిష్యునిగా నంగీకరింపవలసిన దని ప్రార్థింపఁగా రామదాసు అందుల కంగీకరించి ఆతనికి స్వధర్మబోధ గావించి యవనవినాశము గావించునట్లు ప్రోత్సాహపఱచి సెలవిచ్చి పంపివేసి తన యాశ్రమమునకుఁ బోయెను.

సమర్థుఁడు అను బిరుదము వహించిన ఈరామదాసస్వామి ఇట్లు అనేకులను స్వధర్మరక్షకులుగాఁ దయారుచేసి అనేకులనుభక్తిజ్ఞానవైరాగ్యవంతులను గావించెను. ఈతఁడు సుబోధము అనునొక గొప్పగ్రంథమును రచించెను. ఆగ్రంథమును బఠించువారు తప్పక భక్తిజ్ఞానవైరాగ్యశీలురై మోక్షమును సులభముగ గాంతురు. రామదాసు బ్రతికియున్నంతకాలమును ఈతీరునఁ గడపి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను.

శా. "వేదాధారు సమస్తవేదగురునిన్ వేదాంతవేద్యున్ లస
ద్వేదారాధితపాదపంకజయుగుం వేదాంతమూర్తిన్ మహా
వేదభ్రాజితవేద్యు బ్రహ్మజనకున్ వేదాంతభావోల్లస
ద్వేదాగ్రేసరతల్పు రాము మహిమాధారున్ బ్రశంసించెదన్"(?)

(రామకర్ణామృతము. ఆ. 2. ప. 33)

38. లతీబ్ సాహేబు.

"శ్లో. మదమయ మదమయ దురగం యమునా మవతీర్య వీర్యశాలీ యః,
మమ రతి మమరతిరస్కృతి శమనపర స్స క్రియాత్కృష్ణః."
(కృష్ణకర్ణామృతము. ఆ. 2. శ్లో. 92)

ఒకపట్టణమున లతీబ్‌సాహేబు అనునొకతురక నివసించియుండెను. ఆతఁడు తోడి తురకలవలె గాక భక్తిజ్ఞానవైరాగ్యపరుఁడై భగవంతుఁడు అగు శ్రీకృష్ణుని సేవించుచు తన్నామకీర్తనమున మైమఱచుచు కాలము గడపుచుండెను. ఆతఁడు చేయునది యెల్లఁ జూచితురకలనేకులు చాల కంటగించుకొనుచుండిరి. అయినను ఆతఁడు దాని నేమియు లెక్కసేయక సూర్యోదయము కాకపూర్వమే లేచి కార్యములన్నియు నెఱవేర్చుకొని నదిలో స్నానమాడి పరిశుద్ధహృదయుఁడై పరమాత్ముని ధ్యానించి భగవద్గీతను పారాయణచేసి భగవంతునిఁబూజించి భాగవతాగ్రేసరులను, బధిరపంగ్వంధాదిజనులను మృష్టాన్నతృప్తులను గావించిపంపివేయుచుండును. ఇంతియె గాక ఆతఁడింకననేకధర్మకార్యములను గావించుచుండును. ఇది యంతయుఁ జూచి ఒకముష్కరతురుష్కుఁడు "వీఁడు మా తురకజాతి చెడఁబుట్టినాఁడు. మహమ్మదునివిడిచి భారతీయులపాడు దేవునిసేవించుచున్నాఁడు." అనికోపించివెంటనేఆపురమునేలు తనజాతివాఁడగుపాదుషాహాకుఎఱింగించెను, పాదుషాహాయు ఇదివిని రిచ్చవడి మండిపడి ఎగిరిఎగిరిపడి పండ్లు పటపట గొఱుకుకొని "కొనిరండు జాతిభ్రష్టుని శిక్షించెదను. వాని యిల్లు మీచిత్తమువచ్చినట్లు దోఁచికొనుఁడు" అని భటులనుజూచి యఱచెను. వెంటనేభటులు చిందులు త్రొక్కుచు బయలు దేఱిరి. వారుపోవునప్పటికి లతీబుసాహేబుభక్తిపరవశుఁడై —

ఉ. "పాయని భక్తిమ్రొక్కెద నపార కృపారస ధేనుసౌఖ్యసం
ధాయికిఁ లోకరక్షణవిధాయికి భాసురరాధికాకుచ
స్థాయికి బన్నగాధిపవిశాలఫణామణిసౌధవీధికా
శాయికి గోపికానయనసారససారఘప్రబాయికిన్.

ఉ. చిక్కరనాఁడు గోపికల చేలము లెత్తిన దొంగ శైలముల్
చెక్కులు సేయువాని మదజృంభము నాఁచిన దొంగ భక్తిచే

నెక్కొనుమానికోటి మదినిల్చిన తాపము బాపు దొంగ నా
చొక్కపుఁ జిత్తసారసముఁ జూఱలుగాఁ గొనుదొంగ నేఁటికిన్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 75. 81.)

అని నృత్యము సేయుచుండెను. ఇట్లు ఆనందమయుఁడై యున్న ఆతనింజూచి రాజభటులు ఏమియుం జేయఁజాలక పయింబయిగా భక్తిపరవశులై తాముగూడ భజన ప్రారంభించిరి. వీరెంతకును రాకుండుటఁ జూచి పాదుషాహ మిగులఁ గోపించి మఱియొక జట్టునంపెను. వారు గూడ నట్లే చేసిరి. ఇట్లు జట్టుమీఁద జట్టుచొప్పున పదిపదునైదుజట్టుల నంపెనుగాని ఆజ్ఞ నెఱవేఱకయెయ్యెను. అందులకు పాదుషాహ ప్రళయ మార్తాండునిభంగి మండిపడుచు తానే బయలుదేఱెను.

అప్పటికి లతీబు నృత్యము చాలించి బృందావనమున రాజభటుల నందఱ నొకచోఁ గూర్చుండ నియమించి భాగవతపురాణము ప్రారంభించెను. రాజభటులు తమ జన్మమధ్యమున ఎప్పుడు నెఱుఁగని ఆకృష్ణలీలలను విని రాజును, తమ వచ్చిన పనిని, తుదకు తమ్మునుగూడ మఱచి యుండిరి. లతీబు కుటీరముగోడలమీఁద చిత్రింపఁబడిన శ్రీకృష్ణలీలలను నడుమనడుమ వారికిఁ జూపించుచుండెను. ఆచిత్రములనుజూచి తురుష్కభటులు ఆనందాతిరేకముచే మైమఱచియుండిరి.

అట్టి సమయమున కోపఘూర్ణితహృదయుఁడగుటవలన పాదుషాహ అక్కడకు నడచియే వచ్చెను. ఇఁకఁ జెప్పవలసిన దేమున్నది? తన భటులుగూడ లతీబువలెనే కృష్ణలీలలను ఆనందముతో వినుచు మైమఱచి యుండుటవలన దండతాడితభుజంగమువలె నున్న ఆతని కోపము అగ్నిలో నేయివోసినట్లు పెల్లగెసెను. అధరము గడగడలాడెను. నోట మాట రాదయ్యెను. మొగము కందగడ్డ యయ్యెను. తనరాకను జూచియు లేవకయేమూడనైనఁ జూడకయే తదేకధ్యానముతో భటులు పురాణము వినుచుండుటచే ఈస్థితి చూచుచుండఁగనే హెచ్చుపెరిగెను. ఇదియంతయు లతీబుమోసకృత్యమని నిశ్చయించుకొని ఆతనిని దండించినచో అంతయు చక్కఁబడు నని యూహించి పాదుషాహ తటాలున సమీపించెనుగాని అంతలో లతీబు కుటీరభిత్తిపై వెలయు శ్రీకృష్ణలీలలు కన్నుల నాకర్షించుటచే ముందునకుఁబోలేక కాట్లకుక్కవలె అఱచుచు లతీబును అచ్చటకు బిలిచి రాధాదేవి శ్రీకృష్ణునకు విడియము నందిచ్చు

చున్నట్లున్న ఒకచిత్రమునుజూపి ఇదియేమి అని గర్జించుచుఅడిగెను అం
దులకుభీతిల్లకమందహాసాంచితవదనుఁడై ఇట్లుచెప్పెను "అడుగవలసిన దే
యడిగితివి; కాని దానియాథార్థ్యమును పూర్తిగాకున్న సగమైనను
చెప్పుటకు ఏరికిని సాధ్యముగాదు. సృష్టికర్త విశ్వరక్షకుఁడు,సంహారకా
రకుఁడు అనిచెప్పిన గ్రహింపఁగలవా?నీవిగోడపై ఎవనిని జూచుచున్నా
వో ఆతఁడు అవాఙ్మానసగోచరుఁడు.యోగీశ్వరులకుఁగూడ దుర్లభుఁడు
కాని అంతసులభుఁడు లేఁడు.చదువులకు అందఁడు.ఆతనిని దెలిసికొను
టకు నాతనినిజూచుటకు ఆతనిపాదసేవ చేయుటకు ఆతనియనుజ్ఞాపాత్రుఁ
డగుటకు ఒక్కటే మార్గము కలదు. విద్యావంతుఁడైనంతమాత్రమున
అదికలుగదు.మూర్ఖుఁడైనంతమాత్రమునఁగలుగక పోదు.దానికి స్త్రీపు
రుషభేదము లేదు. వయోభేదము లేదు. ఏజాతియైనను ఏవర్ణమైనను
ఏకులమైనను దానికి అభ్యంతరము లేదు. చిత్తశుద్ధి యున్నఁజాలును.
త్యాగగుణమున్నఁ జాలును.విశ్వాసము దానికిమూలము.అదిభక్తి. భక్తి
లేనివానికి ఈచిత్రము కేవలము వినోదమాత్రము. భేదభావదగ్ధులకు ఇది
కేవలము రంగుగీఁతలప్రోగు. త్యాగగుణమున్నచో,విశ్వాసమున్నచో,
భక్తి యున్నచో,ఈచిత్రమున ఎంత మహిమ యున్నది? ఎంత గంభీ
రార్థమున్నది!నీవు బుద్ధిమంతుఁడవే విద్యావంతుఁడవే ధనవంతుఁడవే;
కాని ఈచిత్రము ఎఱుంగునంతటి జ్ఞానమునకు నీసంకుచితచిత్తమున
స్థలము లేదు కాకున్న నిదియేమని యడిగెదవా?వినినంతమాత్రమున
ఇది మనస్సునకెక్కదు అర్థముకాదు. అనుభవమునకురాదు. చెవులు
వినఁజాలవు హృదయము గ్రహింపఁజాలదు.అయినను చెప్పెదను.ఆతని
నామస్మరణమే భవతారకము.ఇఁక గుణకీర్తనమాహాత్మ్యమును జెప్ప
నేల!దానివలననే భక్తులుతరించుచున్నారు.ఆతఁడు శ్రీకృష్ణుఁడు.దుష్ట
శిక్షణార్థము శిష్టరక్షణార్థమును అవతరించినాఁడు. ఇది సామాన్య
ముగా నెల్లరుఁజెప్పుకొను సంగతి. యోగుల యభిప్రాయమున ఈతఁడు
ఇంద్రియాగోచరుఁడును,ఉపమానరహితుఁడును,అచింత్యరూపుఁడును,
మాయాతీతుఁడును అగుజ్యోతిర్మయమూర్తి. భక్తుల భావమున రాధా
కృష్ణుఁడు.ఆహా! ఇది యెంత మధురమైన పేరు! ఎంత దివ్యమంగళవిగ్ర
హము! ఎట్టి కీర్తనీయగుణము! ఎట్టి యద్భుతచరిత్రము! ఎంతటి మహా
మహిమము! ఓ బాబా! ఈతనిని వర్ణింపఁబూనినవారెల్లరును శృంగ

భంగము గాంచినారు. లోకాతీతుఁడేగాని భక్తిక్రీతుఁడు. ప్రపంచము నంతటను ఆడించువాఁడే గాని భక్తపరతంత్రుఁడు. ప్రపంచము నంతటను కుక్షిని ధరించినవాఁడే గాని భక్తచిత్తములఁగాపురమున్నవాఁడు. ఈతనిని ఎఱుంగఁ గల్గుటకుఁ గల సాధనము అతిసూక్ష్మమే గాని అనాధ్యము. నిర్గుణుఁడే గాని ఈతఁడు విపన్నుల నిమిత్తము ధర్మసంస్థాపనార్థము సగుణత్వము సంగీకరించిన లీలామానుషవిగ్రహుఁడు. నీలమేఘశ్యాముఁడు. శ్రీకృష్ణుని ప్రక్కనున్న స్త్రీవ్యక్తి రాధాదేవి. ఆమె భక్తికి పరమావధి. సాధనమహిమచేత ఈమహాత్మునికొంగు బంగారముగఁ జేసికొనిన మహాత్మురాలు. ఆత్మసమర్పణమునకు ఈమెకంటె ఉదాహరణము లేదు. శ్రీకృష్ణుని తత్త్వమును మాధవుని మహిమను సర్వేశ్వరుని అస్తిత్వమును సంపూర్ణముగ నెఱింగినది. ఈమె యొక్కటియే. ఈపావనభారతదేశమున ఈపుణ్యభూమియందు ఈభూలోకవైకుంఠమున ఎల్లవారి మానసక్షేత్రములయందును దాండవమాడునది ఈరాధామాధవవిలాసమే. ఈదేశమునకు దివ్యత్వము నాపాదించినది ఔన్నత్యమును సంఘటించినది మహామహిమను నొడగూర్చునది ఇదియే. ఓయీ, తెలిసినదా? రాధాదేవి శ్రీకృష్ణభగవానునకు తమలము మడిచి యిచ్చుచున్నది" ఇదివిని పాదుషాహ మొగముచిట్లించుకొని "అట్లయిన శ్రీకృష్ణుఁడు ఆతమలమును ఏల యంగీకరించుట లేదు" అని ప్రశ్నించెను. "ఇష్టమైనపుడు గ్రహించును. అనుగ్రహమొదవినపుడు స్వీకరించును. తొందరయేల?" అని లతీబ్ సమాధానము చెప్పెను.

కాని ఆముష్కరతురుష్క ప్రభువునకు సమాధానము కాలేదు. ఆతని యభిప్రాయమున తనకంటె ఘనుఁడు లేడు. ఆజ్ఞాపింపఁదగినవాఁడు లేఁడు. అందఱును నెఱవేర్పవలసినవారే ఎప్పుడో పనికిరాదు. ఇప్పుడే స్వీకరింపవలెను. అని పాదుషాహ గద్దించి పలికెను; గాని లతీబు భీతిల్లలేదు. కవల లేదు. మందహాసము చేసెను. అదిచూచి పాదుషాహ కోపించి సవ్వీస నఱికినై చెడ నసియెను అయినను లతీబు చలించలేదు. ఆతని ముఖమున మందహాసము తొలఁగిపో లేదు. అద్దిరా! మశకము మదగజముల కాజ్ఞాపించుటా! మిణుఁగురుఁ బురువు సహస్రమయూఖునకు వెలుగుజూపుటా!" ఇట్లు తలంచుకొని లతీబు పక్కన నవ్వెను. పాదు

పాహాకు కోపము మెండయ్యెను. అదిచూచి భటులుగూడ నవ్వఁదొడ
గిరి. ఇఁకపాదుషాహ దౌర్భాగ్యదశ నెవరు వర్ణింపఁగలరు? ఆతనికిఁతొ
లుత రాధామాధవవిలాసమును ధ్వంసముచేయఁ దలంపుగలిగెను. పిదప
లతీబును పొడిచివేయ నూహ వొడమెను. తోడనే చేయి మొలలోని
కైజారుమీఁదికిని చూడ్కి రాధామాధవవిలాసము మీఁదికినిఁబోయె
ను. ఆహా! అంతలో నేమి చిత్రము. ఆతని కన్నులు నైశ్చల్యము వహిం
చెను. చేష్టలుడిగెను. హృదయము భావనుయ్యెను. కైజారుమీఁది కరము
స్తబ్ధమయ్యెను. కొంతసేపటికి ఆతనికి రాధచేత ఏమియు లేకపోవు
టయు శ్రీకృష్ణుని చేత సగమును నోట సగమును తమలపుఁాకు మడు
పు ఉండుటయును మాధవుని ముఖము దరహాసభాసురమై యుండు
టయు లతీబుముఖము దివ్య తేజస్సుచే మెఱసిపోవుచుండుటయుఁ
గానవచ్చెను. తోడనే పాదుషాహ మేను అవశమైన లతీబు పాదముల
నికటమునఁబడియెను. ఇదియంతయుఁ జూచుచున్న తురుష్కభటులు
నిర్విణ్ణులైరి.

లతీబు ఆశ్చర్యవివశుఁడై యుండి కొంతతడవు చేష్ట లుడిగి
అంతలో ప్రబుద్ధుఁడై నిటలతటఘటితాంజలియై "శ్రీహరీ, దీన
బంధూ, భక్తచింతామణీ, ఈక్షుద్రునియెడల ఎంత కరుణ చూపితివి!"
అని ఇట్లు అనేకవిధములఁగొనియాడి పాదుషాహాను లేవనెత్తి "ఓబా,
నీవు మిగుల నదృష్టవంతుఁడవు మహాయోగులకుఁగూడ అగోచరుఁ
డగు శ్రీకృష్ణుఁడు నేఁడు నీయెదుటఁ దన విలాసమును జూపెను. నీ
పుణ్యముపుచ్చినది. అశ్రమముగ భగవంతుని అపారకరుణకు పాత్రుఁడ
వైన నీభాగ్యముచు వర్ణింప నేరితరము?" అని కొనియాడెను. భట
వర్గము పాదుషాహ అదృష్టమును జూచియు లతీబు మహామహిమము
నుజూచియు ఆశ్చర్యచకితు లైరి.

పాదుషాహ లేచి లతీబునెదుట మోఁకాళించి నిలిచి "మహాను
భావా, నీమాహాత్మ్యమును దెలిసికొనలేక అపరాధము చేసితిని. క్రూర
కర్ముఁడనైతిని. ఇంతకును నేను దైవోపహతుఁడను. పూర్వజన్మమున
నేను మహాపాపమును చేసితిని. కావుననే నాకీదుర్బుద్ధి వొడమినది. కట్టా!
ఏకకాలమునందే భగవద్భాగవతాపచారము చేసిన నాబ్రతుకు
కాల్పనా! ఆహా! నీయాత్మ యెంత మహోన్నతమైనది. ఎంత పావన

మైనది.ఎంత శాంతమైనది.అది యెంతదయార్ద్రము. పారుష్యముఅన నెట్టిదో యెఱుఁగనినీయెదుట క్షుద్రుఁడనగు నాకు నిలుచుటకైన నధికారము లేదు గదా? నేను దురదృష్టవంతుఁడను గావున తొల్లి నాకు గురువులు భగవంతుని గుఱించి తెలుపరైరి. భాగవతాగ్రేసరుల మహిమము నెఱింగింపరైరి. జగత్తంతయు ఈశ్వరాధీనమైనదనిచెప్పితివి; కాని గోడమీఁది బొమ్మకు చైతన్యము గలిగించిన నీయెదుట ఈశ్వరునకు స్వాతంత్ర్య మెక్కడిది? నీదర్శనమువలననే ఇప్పు డీయద్భుతముఁ జూచుటవలననేనాకు జ్ఞాన మొదవుచున్నది.తత్త్వము నాలోచించిన నీవన నెవరు? భగవంతుఁడన నెతఁడు? లోకకళ్యాణము నిమిత్తము పుడమిపై నవతరించిన ఈశ్వరుఁడవే కావా నీవు? నాకు బుద్ధి వచ్చినది. నా పూర్వజీవితమును స్మరించుకొనిన నాయొడలు కంప మెత్తుచున్నది. నా హృదయము చెదరిపోవుచున్నది. నాకన్నులు తేలిపోవుచున్నవి.కటకటా నాజీవితము ఎంత పాపబంధురమైపోయినది? నేను ఈశ్వరున కెంత ద్రోహముచేసితిని. నేనింతవఱకును దయ అనుమాట నెఱుఁగను.ఈశ్వర సంతాన మంతయు నాకు సేవలుసేయుటకే యేర్పడినదని అనేకములగు అకార్యములను చేసితిని. నాదౌర్జన్యము నోపలేక అనేకప్రాణులు మల మల మాడిపోయినవి. అనపరాధులగు అనేకులను వినోదముకొఱకు నఱికించిన నాకు ఇఁక పుట్టగతులు గలవా? మహాత్మా,అయిన దేమోయైనది. ఇఁక గతజలసేతుబంధన మేల? నాకు పరితాపము గలిగినది. భాగవతులు శత్రుమిత్రభావదూరులుగదా? కావున నాయపరాధములన్నియు విస్మరించి పాపపంకమునుండి నన్ను లేవనెత్తుము కుంభీపాక నరకమున కూలఁబడనున్న నన్నుద్ధరింపుము"అనిపాదములమీఁద వ్రాలి బాష్పోదకముచే పాద్యమును ఘటించి అనేకవిధముల లతీబును ప్రార్థించెను.

ఈప్రార్థనకు లతీబు సహజకోమలహృదయము మఱింత కరఁగెను. అందుదయాప్రవాహము వెల్లివిరిసెను. తోడనే యాతఁడు పాదుషా శిరమునఁ జేయిడి "ఓయీ, నన్నింత ప్రార్థింపనేల? నీవు సామాన్యుఁడవుకావు. భగవద్దర్శనమువలన నీవు సర్వజ్ఞుఁడవైతివి. నావంటి క్షుద్ర జనులకనేకులకుముక్తియొసఁగఁగలవు. క్షణములోభగవత్సాక్షాత్కార లాభముబడసిన నీవు ఎంత ఘనుఁడవో వేఱుగ వివరింపనేల?" అని

ప్రత్యుత్తరమిచ్చెను. అయిననుమఱల పాదుషాహా లతీబుపాదములనంటి "గురూ, నీవిట్లనవలదు. అనేకులకు జ్ఞానబోధ చేసిన నీకు నేను భారమైతినా? నాకిఁక ఈరాజ్యము వలదు. వైభవము వలదు. సంసారమునలదు. ఏమియు వలదు. నీవాత్సల్యము గావలెను. నీదాక్షిణ్యము కావలెను. నీపదసేవ నయ చేయుము. నీకుదాస్యము చేయనిమ్ము. నీహృదయమున నాకు కొంచెము చోటిమ్ము" అని మఱిమఱి ప్రార్థించెను. అది విని లతీబు ఆనందించి "ఓ రాజా, అంతయు బాగుగ నున్నది. వైభవమును విడిచి పెట్టుము. ఆశలను జయింపుము. కోరికలను చంపుము. సమర్పణము, త్యాగము, అర్చనము. దాస్యము వీని నలవఱచుకొనుము. రాజ్యమునుమాత్రము విడువకుము అదియే నిన్నుద్ధరించునది ఏమందువా దేశమందలి ప్రజలెల్లరును నీకుఆజ్ఞానువర్తులు. అందఱకును భగవద్భక్తి కల్గియుండునట్లాజ్ఞాపింపుము. భాగవతార్చనము సేయునట్లు నియమింపుము సర్వసమానత్వమును చూపునట్లు కట్టడి సేయుము. అధికారము లేనినాఁడు ఇదియంతయు స్వాధీనముకాదు. ఇట్లయిన నీవొక్కఁడవు బాగుపడుటకాక దేశమును బాగుచేసినవాఁడ వగుదువు ఇంతకంటె ఉత్కృష్టకార్యముమఱేమున్నది?" అనిబోధించి పాదుషాహాకు మంత్రోపదేశమును చేసెను. పాదుషాహా గుర్వాజ్ఞను నెఱవేర్చెను కొలఁదిదినములయందే దేశమునందంతటను భక్తిరసవాహిని కూలంకషముగఁ బ్రవహించెను. ఇఁక పాదుషాహా సంతోషము నేలసెప్ప? లతీబు బ్రహ్మానందము నేల వివరింప? బ్రతికియున్నంతకాలము లతీబు ఇట్లు బ్రహ్మానందనిమగ్నుఁడై యుండి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను.

శా. కాళిందీజల ముబ్బి గట్ల కెదురక్కుం జొచ్చి హాలాహల
జ్వాలాలీఢకరాళ కాళియఫణాజాలంబు నృత్తక్రియం
గాలం గేల నడంచి నిర్జరతిరస్కారంబు వారించు గో
పాలస్వామి కటాక్షవీక్షణము మాపాలం దిరం బయ్యెడిన్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 92.)

39. గోరాకుంభారు.

శ్లో. "ముక్తేర్మూలం మునివరహృదానందకందం ముకుందం
కూటస్థాఖ్యం సకలవరదం సర్వచైతన్యరూపమ్,
నాదాతీతం కమలనిలయం నాదనాదంతతత్త్వం
నాదాతీతం ప్రకృతిరహితం రామచంద్రం భజేఽహమ్,"

(శ్రీరామకర్ణామృతము. ఆ. 2. ప. 44.)

పండరిపురమునకు సమీపమునఁ గల ఒక చిన్న గ్రామమున గోరాకుంభారు అను ఒక కుమ్మరి యుండెను ఆతఁడు కుండలు చేసి విక్రయించి తన్మూలమున జీవించుచుండెను. ఆతని యింట భార్యయు ఒక చిన్నబిడ్డయు మాత్రమే కలరు.

ఆతని హృదయము మిగుల నున్నత మైనది ఆతఁడు స్వల్పకాలము మాత్రమే కులవృత్తినిఁ జేసి తక్కిన దినమంతయు శ్రవణమనన ధ్యానావాహనపూజనాదులచే శ్రీహరిని సేవించుటలోఁ గడుపుచుండును. అతని భార్యకూడ పతివలెనే సకలవిషయములయందును నడచుకొనుచుండెను. భార్యకుఁ దగిన భర్త యనియు భర్తకుఁ దగిన భార్య యనియు వారినిఁ జూచి జనులు అందఱు నానందపడుచుండిరి.

ఇట్లు కాలము గడచిపోవుచుండఁగా ఒకనాఁడు గోరాకుంభారు కుండలు చేయుటకై మట్టిని తెచ్చి చక్కఁబడుటకై త్రొక్కుచుండెను. ఆసమయమున ఆతని భార్య బిడ్డను దెచ్చి ఆసమీపమునఁ గూర్చుండబెట్టి ఏటికి నీళ్లకుఁ బోయెను. ఆతఁడు మట్టిత్రొక్కుచునే కొంతవడి బిడ్డను లాలించి ఆనందించెను. ఇట్లొకపదినిమిషములుగడచిపోయినతరువాత ఆతని హృదయము హఠాత్తుగ ఈశ్వరధ్యానతత్పర మయ్యెను. ధ్యానము మననముగాఁ బరిణమించెను. మననము కీర్తనముగామాఱెను. వెంటనే ఆతఁడు చేతులతోడనే తాళము వేయుచు,

శ్లో. "దారా వారాకరవరసుతా తే తనూజో విరిఞ్చిః
స్తోతా వేద స్తవ సురగణో భృత్యవర్గః ప్రసాదః,
ముక్తిర్మాయా జగదవికలం తావకీదేవకీతే
మాతా మిత్రం బలరిపుసుత స్త్వయ్యతోఽన్యన్నజానే."

(ముకుందమాల. ప. 32.)

శ్లో॥ రాజీవనేత్ర రఘుపుంగవ రామభద్ర రాకేందుబింబసదృశానన నీలగాత్ర,
రామాభిరామ రఘువంశసముద్భవ త్వం శ్రీరామచంద్ర మమ దేహి కరావలంబమ్.
(రామకర్ణామృతము. ఆ. 3. ప. 43.)

మ. అల డాకేశరన్మృగాంకనిభమా హైయంగవీనంబు న
వ్వలికేలన్ రసయుక్తపాయసము గ్రీవాంద్ధచామీకర
జ్జ్వలశార్దూలనఖంబు నంబరకటీచక్రంబుఁ బెంపారఁ ని
చ్చలుఁ గ్రీడించు యశోదపట్టి కరుణన్ సౌఖ్యంబు మాకీవుతన్."
(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 75.)

అని భజనప్రారంభించెను. దానితో నృత్య మారంభమయ్యెను. దీని నంతను జూచి కిలకిల నవ్వుచు చిన్నబిడ్డ సమీపించెను; కాని గోరాకుంభారు అది ఏమియు నెఱుఁగఁడు. బిడ్డ మట్టిని స్పృశించెను. క్రమక్రమముగా మట్టిలోనికి వచ్చెను. తునకు తండ్రి కాళ్ళసమునకు వచ్చెను. చూచుచుండఁగనే కాళ్ళక్రిందనే పడిపోయెను. తండ్రి నృత్య వేగంబున ఆబిడ్డ మట్టిలోఁ గలసిపోయెను. తలమాత్రము పైని దొరలు చుండెను. బిడ్డ రక్తమువలన మట్టియు తండ్రి పాదములును ఎఱ్ఱనయ్యెను. ఎముకలు లేతవగుటవలన పటపట విరిగిపోయెను. ఈవిధముగా ఆశిశువు చూచుచుండఁగనే మట్టిలోఁ గలిసిపోయెను. అయినను గోరాకుంభారు ఇది యేమియు నెఱుఁగఁడు. ఆతని భక్తి క్రమక్రమముగా మఱింత పెరిగిపోయెను.

శ్లో॥ "దివి వా భువి వా మమాస్తు వాసో నరకే వా నరకాన్తక ప్రకామం,
అవధీరితశారదారవిన్దౌ చరణౌ తే మరణేఽపి చిన్తయామి."
(ముకుందమాల. శ్లో. 6.)

అని అంతకంతకు మఱింత మధురములైన గీతములను బాడుచు నృత్యవేగమును హెచ్చించెను. కొంతతడ వగునప్పటికి ఆతనికి పాండురంగఁడు వలిపపు తెరచాటున నున్నట్లు తోఁచెను. ఇఁక నేమి కావలయును? నృత్యవేగము మఱింత యయ్యెను. తాళారావములు దిక్కూలములు ప్రతిధ్వనింపసాగెను. గీతధ్వనులు మిన్నుముట్టుచుండెను. నేత్రములు నిమీలితము లయ్యెను. హృదయము కడు అత్యుత్తం బయ్యెను. ప్రాపంచిక జ్ఞానము విలుప్తమైపోయెను. గోరాకుంభారు ఈతీరున హరిభజనము సాగించుచు మైమఱచి యుండెను.

ఈసమయమున ఆతని భార్య ఇంటికి వచ్చెను. నీళ్ళకడవ నింటఁ బెట్టి బైటకు వచ్చి ఆమె చూచెను; గాని బిడ్డ యెక్కడ? అటు తిరిగి ఇటు తిరిగి తుద కామె చూపులు భర్త త్రొక్కుచున్న మట్టిమీఁదికిఁ బ్రసరించెను. ఎంత కష్టము! నవమాసములు మోసి కడుపార కన్న బిడ్డ మట్టిలోఁ గలిసిపోయెను. భర్త కాళ్ళక్రింద పడి బాలవన్మరణము పాలయ్యెను. ఇంక నేమున్నది! పాపము ఆయిల్లాలి మీఁదిప్రాణములు మీఁదికి ఎగిరిపోయినవి.

కొంతతడవు ఆమె నిశ్చేష్టయై యుండి పిదప ప్రబుద్ధయై రొమ్ము బాదుకొనుచు "హా! నాబిడ్డ మంటఁ గలిసిపోయెను. అయ్యో నాథా! ఇదియేమి ఘోరము?" అని గోలపెట్టసాగెను. అది విని గోరాకుంభారు ఉలికిపడి ఎదుట ఘోరముగ విలపించుచున్న భార్యను జూచి "ఛీ సీ దుర్భాగ్యురాలా, ఒడలెఱుంగక ఉన్మత్తురాలవై పిశాచమువలె అఱచుచు నాయెదుట సాక్షాత్కరించిన పండరినాథుని పాఱఁద్రోలితివిగదే" యని ఉబికియుబికి వచ్చు కోపమును పట్టఁజాలక ఆగ్రహమహోగ్రుఁడై ఆమె పైఁబడి కొట్టఁబోయెను. తోడనే ఆమె నన్ను ముట్టిన పాండురంగని ఆనగలదు." అని తటాలున వెనుకకు తగ్గెను. ఇది వినినంతనే గోరాకుంభారు భయచకితుఁడై వెనుదగ్గి ఒకమూలకుపోయి కూర్చుండి మఱల నిశ్చలహృదయుఁడై భగవద్భజనము ప్రారంభించెను.

ఆయిల్లాలి రోదనధ్వని విని తొలుత మార్గమునఁ బోవువారు వచ్చిరి. పిదప ఇరుగుపొరుగువారు చనుదెంచిరి. ఇంతలో ఈదారుణ వ్యాపారము ఊరంతయుఁ దెలిసిపోయెను. ఉత్తరక్షణమునందే ఊరివా రందఱును విరిగిపడి అచ్చటకు వచ్చిరి. అంతయుఁ జూచి కొందఱు తెల్లవోయిరి. కొందఱు ఏడ్చిరి. కొందఱు ఆరమణి నూఱడించిరి కొందఱు గోరాకుంభారునకు మతి పోయిన దనిరి. కొందఱు ఆతని యెదుటికే పోయి ఆతనిని నిందింపసాగిరి. అందఱు అన్నివిధములఁ జెప్పుకొనసాగిరి. అయినను ఆమె విచారమును మానలేదు. ఆతఁడు వారిదెసకే చూడలేదు. ఇది చూచి వచ్చినవారెల్లరును చాల విసుగుకొని ఎవరియిండ్లకు వారు పోయిరి. మఱికొంతసేపటికి ఆమె రోదనము కట్టువడెను. కాని ఆతని భజనము మాత్రము ఇంకను సాగుచునేయుండెను. ఆతనికి ప్రాపంచికజ్ఞానము పూర్తిగ లోపించి పోయెను.

కొంతసేపయిన తరువాత గోరాకుంభారు భార్య, "నేనిట్లు వగచుచు కూర్చుండిన నేమి లాభము? బ్రతికియున్నంతకాలము నేడ్చినను బిడ్డను బ్రతికింపఁజాలను. సంసారము చెడిపోవుటతప్ప దీనివలననిఁకేమి లాభము?" అని నిశ్చయించుకొని ఒక చెంబుతో నీళ్లు గైకొని కాళ్లు కడుగుటకు భర్తచెంతకుఁ బోయెను. ఆతనికి ఆమె చాల భారముగఁ దోఁచెను. మఱియు నాతఁడు మొగమోటము విడిచి "నిన్నుతాఁకిన పాండురంగని యాన కలదంటిని. కావున నన్ను ముట్టకు" అని గద్దించి పలికెను. ఆమె యచ్చటినుండి వెడలిపోయెను. ఆతని భారముగూడ తొలఁగి పోయెను.

ఆమె తిన్నఁగ పుట్టినింటికి పోయెను. తల్లిదండ్రులు అకాలమునందలి యామెరాకకు అబ్బురపడి 'ఏమితల్లీ' యని అడిగిరి. తల్లిదండ్రులను చూచినతోడనే ఆమె హృదయమున విచారము ఉబ్బెత్తుగ పొంగిపోయెను. పిదప కొంతతడవున కామె తేరుకొని అచ్చట జరిగిన దంతయు నెఱింగించి "నావంశము నిర్మూల మగునట్లు తోఁచుచున్నది. కావున అట్టిది సంభవింపకుండ నాభర్తకు నాచెల్లెలినిచ్చి పెండ్లిచేయుఁడు" అని ప్రార్థించెను. ఆమె తల్లిదండ్రులు ఆమె వేఁడికోలును త్రోసివేయఁజాలక మహావైభవముతో తమ చిన్నకొమార్తెను గోరాకుంభారునకిచ్చి పెండ్లిచేసి అంపకపుసమయమున "మాబిడ్డలను ఇరువురను సమభావముతో చూడుము. లేకున్న పాండురంగనిపై ఆన కలదు" అని పలికిరి. మఱునాఁడు ఆయక్కచెల్లెండ్రు తమభర్తతోఁగూడ వెడలిపోయిరి.

ఇంటికి వచ్చినతరువాత కుంభారు ఏమిటను లోపము లేకుండునట్లు భార్యలకు సమస్తమును ఏర్పాటుచేసి వారి నంటక వారితోడి గోష్ఠినైననొల్లక హరిధ్యానతత్పరుఁడై యుండెను. అందులకుఁ జాల కటకటంబడి పెద్దయామె యొకనాఁడు ఆతనిచెంతకు వచ్చి మోఁకారించి నిలిచి చేతులుజోడించుకొని "స్వామీ. ఇదియేమిఘోరము? మాచెల్లెలును నేనునుగూడ మిమ్ము అచంచలభక్తితో సేవించుచున్నాము. నేను మీయెడల మహాపరాధము చేసితిని. కావున నేను దానిననుభవించెదను; కాని నాచెల్లెలివలన నేమి యపరాధముచేయఁబడినది. ఏమియు నెఱుఁగని యాముగ్ధరాలి మీరేల కరుణింపరు? ఇట్లయిన ఆయమాయకురాలిగతి యేమి కావలసినది?" అని ప్రార్థించెను. అందుల కాతఁడు సిశ

లుఁడై 'ఇంతీ, నీతలిదండ్రులునీచెల్లెలినినాకిచ్చిననాఁడుసకలబంధువుల సమక్షమున మాబిడ్డలను ఇరువురను సమభావముతో చూడవలెనని ప్రార్థించినారుగదా? నిన్ను ముట్టుటకు పాండురంగనిపై ఆనకలదు. కాన వీలులేదుకదా? కావున నేను చేయుఘోర మేమికలదు? నీచెల్లెలిని ముట్టిన నిన్నుగూడముట్టవలసివచ్చును. అగుటచే నిరువురనుగూడ తాఁకుట మానితిని' అని బదులు చెప్పెను. అదివిని ఆమె కొంతవడి మ్రాన్పడి చేయునది లేక దుఃఖించుచు లోనికి వెడలిపోయెను. నాఁడు రాత్రి భర్త గాఢముగ నిద్రించువఱకు నూరకుండి పిదప నిరువురును యోచించుకొని యాతనికి చెరియొకప్రక్కను బరుండి యాతనిచేతులను తమ యిరువురపై నునిచికొని శయనించిరి.

ఇట్లు పదినిమిషములు గడచునప్పటికి కుంభారునకు హఠాత్తుగ మెలకువ వచ్చెను. తోడనే యాతఁడు తన స్థితినంతను జూచుకొని ఉలికిపడి లేచిశయ్యదిగిపోయి "బళా. ఈస్త్రీలుఎంతసాహసకృత్యమును చేసిరి. ఎట్లు మోసగించుటకు తలపెట్టిరి?" అని వగచి పాండురంగని పదకమలములను స్మరించి తటాలున తన రెండుచేతులను ఛేదించుకొనెను. వెంటనే యాతని భుజమూలమునుండి చిన్నగొట్టములనుండి వోలె రక్తధార లెగసి ఆవనితలపైఁ బడెను. అంతట ఆరక్తపాతమువలన వారిరువురు మేల్కాంచి జరిగిన దంతయుఁ జూచి ఆశ్చర్యవిషాదములకు లోనై కొంతతడవు చేష్టలుడిగి పిదప "నాథా, నీకింత యాగ్రహమేల?" యని దుఃఖింపసాగిరి. అపు డాతఁడు బాధ ఏమియు నెఱుంగక మందహాసము సేయుచు "చంద్రముఖులారా, భక్తత్రాణపరాయణుఁడగు ముకుందుఁ డుండ మన కేమిలోపము?" అని వారికి ధైర్యము గొలిపి,

శ్లో. "క్షీరసాగరతరఙ్గశీకరాసారతారకితచారుమూర్తయే,
భోగిభోగశయనీయశాయినే మాధవాయ మధువిద్విషే నమః."

(ముకుందమాల ప. 39.)

అని శ్రీహరిని ప్రార్థింపఁ దొడఁగెను.

మఱికొన్నిదినములకు ఆషాఢశుద్ధైకాదశి సమీపించెను. నాఁడు పంఢరిపురమున పాండురంగనికి మహోత్సవము జరుగును; గావున తన

భార్యల నిరువురను బిలిచికొని చంద్రభాగానదిలో స్నానముచేసి ఆల యమునఁ బ్రవేశించి భక్తచింతామణియు దీనబంధుఁడునగు పాండు రంగని సేవించి ఇవ్వలకు వచ్చెను. ధ్వజస్తంభముచెంతనామదేవుఁడు మహానందముతో పాండురంగని గీర్తించుచు నాట్యముసేయుచుండెను. ఆతని భక్తికి మెచ్చి ఆతనికి మాత్రమే కాన్పించుచు పాండురంగఁడు అచ్చటనే యుండెను. పదినిమిషములలో ఆస్థల మంతయు జనసంకీర్ణ మైపోయెను. గోరాకుంభారును ఆతని యిరువురు భార్యలును వచ్చిరి. ఆశ్చర్యముతో నోరులు తెఱచికొని చూచుచున్న జనసమూహమును జూచి "అయ్యలారా, ఏలచూచెదరు! పాండురంగనిఁ బాడుచుభజన సే యుఁడు" అని చెప్పెను. వెంటనే వారు భజన ప్రారంభించిరి. వారినిఁ జూచి కుంభారుభార్యలు "అయ్యో, మనభర్తకు చేతులు లేకపోయెనే" యని దుఃఖింపసాగిరి. ఈదుఃఖమువలన వారుకొంతవఱకు బాష్పాంధులై మఱలఁ జూచునప్పటికి గోరాకుంభారు చేతులు తట్టుచు హరిగుణకీర్త నము సేయుచు అందఱతోపాటు భజనఁ జేయుచుండెను. అదిచూచి ఆవనితామణులు తొలుత తెల్లవోయి పిదప "ఇదియంతయు ఈశ్వ రేచ్ఛ" అని భావించి పాండురంగని మహామహిమను కీర్తింపసాగిరి. ఇం తలో శ్రీకృష్ణుఁడు అచ్చట సాక్షాత్కరించెను. ఆఁతనివెంట రుక్మిణి కుంభారుబిడ్డను చంక నిడుకొని వచ్చి అబిడ్డను కుంభారు పెద్దభార్యచేతి కిచ్చెను. అందులకు ఆమెయు ఆమె చెల్లెలును మహానందమును బడసి రుక్మిణీదేవిని అనేకవిధముల వినుతించిరి. అప్పుడు శ్రీకృష్ణుఁడుకుంభా రును సమీపించి "భాగవతాగ్రణీ, నీనియమనిష్ఠలకు ఆనందము. నీభక్తి ప్రపత్తులకు సంతోషము. నీభార్యయు నీవును నాపైఁ బెట్టిన యానలు నేఁటితోఁ గతార్థములై పోయినవి. కావున నేఁటినుండి నీయిరువురుభార్య లతోఁ గూడి సంసారమును నిర్వహించుకొనుచు మాధ్యపతిత మైపోవు చున్న లోకము నుద్ధరింపుము" అని విధించి రుక్మిణితోఁగూడ తిరో హితుఁ డయ్యెను. గోరాకుంభారు బ్రతికియున్నంతకాలమును హరి భజనమునుతప్పక ఇంకనుఅనేకాద్భుతకార్యములనుజేసి అనేకజనులను సాధుమార్గప్రవర్తకులను గావించి పెక్కుమందిని ముక్తిమార్గోన్ము ఖులం గావించి జన్మసాఫల్యమును బడసెను. ఆతనిభార్య లిరువురును ఛాయవలె నాతని ననుసరించిరి. అవసానమున గోరాకుంభారునుఆతని

భార్యలును అశ్రమముగను ఆనందముతోడను భౌతిక దేహమును విడిచి శ్రీహరిసాయుజ్యమును బడసిరి.

మ. మునిహృత్తోషకరు న్నిర్ధానరహితు న్మోక్షాధినాథు న్సనా
తనుఁ గూటస్థుని సర్వవిశ్వమయుఁ జైతన్యాకృతిన్ కృత్స్నవం
దను సర్వాత్ము ముకుందు లోకపరదున్ నాదాంతతత్త్వాత్ము న
త్యనఘున్ రాము ధరాసుతాధిపతి నాదాతీతు భావించెదన్.

(రామకర్ణామృతము. ఆ. 2. ప. 48.)

శ్లో. వదనే నవనీతగన్ధవాహం వచనే తస్కరచాతురీధురీణమ్,
నయనే కుహనాశ్రు మాశ్రయేథా శ్చరణే కోమలతాణ్డవం కుమారమ్.''

(కృష్ణకర్ణామృతము. ఆ 2. ప. 18)

40. చోకామేళుఁడు.

శ్లో. ''కస్తూరీతిలకం లలాటఫలకే వక్షఃస్థలే కౌస్తుభం
నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కఙ్కణమ్,
సర్వాఙ్గే హరిచందనం చ కలయన్ కణ్ఠే చ ముక్తావళిం
గోపస్త్రీపరివేష్టితో విజయతే గోపాలచూడామణిః.''

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 109.)

పండరిపురమున చోకామేళుఁడు అను ఒకచండాలుఁడు ఉండెను. ఆతఁడు కులక్రమాగతములగు వృత్తులలోనిర్బాధకములగు వానినికొన్నిటినిమాత్రము జీవితమునకు ఉపయోగించునంతవఱకు చేయుచుతక్కిన కాలము నంతయు భగవద్ధ్యానముచేఁ గడపుచుండెను. అది చూచి తోడి చండాలురు ''ఇది యేమిపనిరా! మన జాతిక అప్రతిష్ఠ తెచ్చుచున్నావుగదరా?. కల్లుద్రావినఁ గలుగు ఆనందమునకంటె నెవఁడో ఈశ్వరుని గొలిచినఁ గలుగు ఆనందము గొప్పదియా?'' అని విసుగుకొనుచుండిరి. ఆతని భార్య సహజముగ ఆతనికిఁ దగినదే యైనను అపుడపుడు కులము వారు చేయు హేళనమును విని ''ఇది యెందుకులే? మనకులవృత్తి సాగించుకొందము అన్యాయము సేయకుండ నుండిన కులవృత్తిలో మాత్రము మోక్షము లేదా యేమి?'' అని పలుకుచుండెడిది. అయినను ఆతఁడు వీనిని వేనిని లెక్క సేయకతనయులవాటుచొప్పునప్రతిదినమును

స్వామికోవిలకుఁ బోయి ప్రదక్షిణము చేసి స్వామిదర్శనముఁ గోరి గో పురద్వారమున కెదురుగఁ గూర్చుండెడివాఁడు.

ఇట్లు కొంతకాలము జరిగిపోయినతరువాత కొందఱు బ్రాహ్మణులు చోకామేళుఁడు అనుదినమును ఆలయమునకు ముందు కూర్చుండి యుండుట సహింపఁజాలక ఒకనాఁడు "ఓరీ, అనేకదినములనుండి నిన్ను ఇక్కడ చూచుచున్నారము. వాఁడే పోవు నని యూరకుండినకొలఁదిని నీవు బిఱ్ఱబిగియుచున్నావు. మేమీదుండగమును సహింపఁజాలము. నేఁటినుండి నీవిచ్చట కాన్పించితివేని ఇఁక నీమెడపై తల యుండదు." అని గర్జించుచు పలికిరి. అందులకు చోకామేళుఁడు వినయవినమితోత్తమాంగుఁడై "మహానుభావులారా, మీదికి తగునా? సర్వేశ్వరుని సృష్టిలో ఈజాతిభేదములుగలవా? విధాత మిమ్ము సృష్టించిన చేతితోడనే మమ్ముసృష్టింపలేదా? మీశరీరముగోసిన పాలును నాశరీరముగోసిన నీరును గాఉనా? మీకుఁగల మానవత్వము మాకు లేదా? మీకుఁ గల హృదయము మాకు లేదా? మీకుఁగల చైతన్యము మాకులేదా? మీ ధర్మమునకు మాధర్మమునకు భేదము గలదా? మీకు సేవ్యుఁడైన పండరినాథుఁడు మాకు సేవ్యుఁడు గాఁడా? మీకు ప్రకాశమునిచ్చుచున్న సూర్యుఁడు మాకిచ్చుట లేదా? ఇట్లాడ మీకు తగునా? అయినను భగవన్నియమనమును విరోధించి మీరు కల్పించుకొనిన ప్రాకారములు దాఁటి నేను లోనికి రాలేదే? నాజాతివారీమార్గమున అనేకులు పోవుచుండుటలేదా? పోవుచు పోవుచు నేనిచ్చట నిలిచితి ననుకొనుఁడు. ఇఁక నేను చేసినవిశేషాపరాధ మేమున్నది? భగవంతుని నాహృదయమందు ప్రార్థించితిని. అదిదోషమందురా? నాహృదయమును భగవంతుఁడేనిర్మించెను. ఆతనిచేతితో నిర్మింపఁబడిన దానియందే ఆతనిని నిల్పితిని. మీమెడమీఁదితలయు నామెడమీఁది తలయు, ఆతఁడే సృజించెను. ఇచ్ఛగలిగిన దానినాతఁడే తొలగింపవలెను; గానిమీ రెవరు? అయిననుమీరు కట కటఁబడుచున్నారు గావున నేను తొలఁగిపోవుచున్నాఁడను" అనితటాలున లేచి తన గుడిసెకుఁ బోయెను. ఆబ్రాహ్మణులు వాని యుపన్యాసము విని లజ్జించియు మొండికెత్తి తమమార్గమునఁబోయిరి.

చోకామేళుఁడు అట్లు గుడిసెకుఁ బోయి కూర్చుండి నిమీలితనేత్రుఁడై అంజలిబద్ధుఁడై ? "శ్రీహరీ, పుండరీకవరదా, నేను క్షుద్రుఁడను.

పాపాత్ముఁడను. ఈప్రపంచమునుఁ జూచిన నాయొడలు కంపమెత్తుచున్నది. నాచూపులు చెదరిపోవుచున్నవి. నాహృదయము దహించుకొనిపోవుచున్నది. శేషనారాయణా, అక్రూరవరదా, భక్తార్తిభంజనా, నేననాథుఁడను. అగతికుఁడను. నిరాశ్రయుఁడను. నిర్భాగ్యుడను. జనార్దనా! నన్నురక్షింపవా? నన్ని భవసాగరమునుండి యుద్ధరింపవా? ఈప్రపంచ వాసనలనుండి నాహృదయమును తొలఁగింపవా! నాకేమియు వలదు నీ దివ్యమంగళవిగ్రహదర్శన మొక్కటి చాలును. అన్యమువలదు. అంతియు చాలును" అని ఈశ్వరధ్యానము ప్రారంభించెను. సూర్యాస్తమయమయ్యెను. అర్ధరాత్రముగూడ నయ్యెను అపుడు పండరినాథుఁడు చోకామేళుని అచంచలభక్తికి ఆనందించి అర్చకులు తలుపులు బిగించిపోయిన వెంటనే లీలామానుషవిగ్రహుఁడై కవాటమును తెఱచుకొని చోకామేళుని గుడిసెకు వచ్చి దర్శన మొసంగెను. అంతట అట్లు నిర్హేతుకజాయమానకటాక్షముతో సాక్షాత్కరించిన భగవంతునకు చోకామేళుఁడు సాష్టాంగనమస్కారము లర్పించి అనేకవిధములఁ గొనియాడెను. అందులకుఁగూడ నానందించి శ్రీహరి "నీకేమికావలయు?" నని యడుగఁగా చోకామేళుఁడు "అనాథనాథా, కరుణాకరా, భక్తచింతామణీ, నీసాక్షాత్కారముకంటె నాకేమియు కోరిక లేదు. అయినను నీవు అనుగ్రహింతుననుచున్నావు గావున ఆలయమున దర్శన మీయవలెను" అని ప్రార్థించెను. అందులకు భగవంతుఁడు నీవు "నాయంతరంగభక్తుఁడవు. కావున నీకేమి యభ్యంతరము గలదు" అని పలికి ఆలయమున కాతనిం గొనిపోయి చెంగటఁ గూర్చుండఁబెట్టుకొని ముచ్చటలు ప్రారంభించెను.

ఆముచ్చటలు అనేకవిధములు జరిగెను. పాండురంగఁడు చోకామేళునిపై తనకుఁ గల ప్రేమ అంతయు విస్పష్టముగ చూపివేసెను. ఆసందర్భమున జీవాత్మపరమాత్మలదిశుద్ధాద్వైతభావమంతయుఁ బ్రకటితమయ్యెను. అంతలో తెల్లవాఱెను. అర్చకు లందఱును తమతమ పనులను బ్రవేశించుటకు వచ్చిరి. వారిలో పెద్ద తాళముచెవులు గైకొని గర్భాలయము దగ్గఱకు వచ్చి లోపల మాటలు వినఁబడుచుండుట నెఱింగి, అబ్బురపడి తననారి నందఱను బిలిచి తటాలున తలుపు తెఱచెను. ఇది యెల్ల గ్రహించి పండరినాథుఁడు శిలావిగ్రహమున తిరో

హీనుఁడయ్యెను. చోకామేళుఁడు నివ్వెఱపడెను. ఇంతలో అర్చకులు లోనికి వచ్చి చోకామేళుని గాంచి తొలుత విపన్నులై పిదప నాగ్రహ మహోగ్రులై "అరే దురాత్మా! చండాలుఁడ వయ్యు ఎంత పని చేసితి విరా" యని ప్రహరించుటకు సిద్ధపడెను. అందులకు భక్తుఁడు "అయ్యలారా! నాపై నేల కోపించెదరు? నేనేమియు నెఱుఁగను. పండరినాథుఁడు నాగుడిసెలో సాక్షాత్కరించి చేయి పట్టుకొని యిక్కడకుఁగొని వచ్చెను. నల దందు రేని పోయెదను. ఏల మండిపడెదరు?" అని సవినయముగఁ బలికెను. దానిపై నెల్లరును కూడఁ బలుకుకొనిఅర్చకులు "అయిన దానికి విచారణ వలదు. నిలిచియున్నట్లుగ లేచిపొమ్ము.ఈసంగతి యేరికిని తెలియనీయకుము. ఇఁక నీవు మాలపల్లిలో వసించుటకు వలనుపడదు. చంద్రభాగానది అవ్వలకుఁ బొమ్ము" అనిపలిరి. చోకామేళుఁడు తోడనే బయటకువచ్చి "అయ్యలారా, మీరు నియమించితిరిగావున వెడలిపోవుచున్నాను. మతేమన? ఈశ్వరుఁడు సర్వసముఁడు. ఆతనికి భేదభావము లేదు. భక్తిజ్ఞానవైరాగ్యములు లేనినాఁడు బ్రాహ్మణుఁడైనను ఈశ్వర కృపకు పాత్రుఁడు గాఁడు. మాటిమాటికిని మీరు నీవు చండాలుఁడవు ఇందు రాకూడదు అని నన్ను తఱుముచున్నారు. నేను మెట్టిన స్థలము మీకు అపవిత్రమగునేని, నేజలకమాడిన చంద్రభాగ మీకు స్నానయోగ్య మగునా! నేను వసించిన వసుంధర మీకు వాసమునకు తగునా? నేను పీల్చిన గాలి మీకు పీల్చుటకు తగునా? అయినను ఇట్లు మీతో వాగ్వాదము చేసిన నేమి ప్రయోజనము? నేనెట్లు ప్రవర్తించిన మీకు సమ్మతమగునో అట్లే ప్రవర్తించెదను. చంద్రభాగ అద్దరిని వసించెదను" అని చెప్పి స్వస్థలమునకుఁ బోయి సంగతి యంతయు భార్యకు ఎఱింగించి అప్పుడే చంద్రభాగనుదాఁటిపోయి గుడిసె వేసికొని అందు వసించెను. ఎచ్చటికిఁ బోయినను భక్తునిహృదయము భగవంతుని విడిచియుండదుకదా? చోకామేళునకు నివాసమువిషయము మార్పుగలిగినను హరిధ్యానమున మార్పు తటస్థింపలేదు ఆతఁడు తొల్లిటివలెనే శ్రీహరిని సేవించుచుండెను.

ఒకనాఁ డాతఁడు గుడిసెబయటఁ గూర్చుండి యుండెను. ఆతని భార్య కుండతో అన్నమును దెచ్చి వడ్డించుచుండెను. అట్టి సమయమున పాండురంగఁడు అచ్చట సాక్షాత్కరించి "భక్తాగ్రేసరా, నీతో కలిసి

భుజింపవలయును" అని చెప్పెను. అందులకు అబ్బురపడి భక్తుఁడు "శ్రీహరీ! ఇందులకు అభ్యంతరము ఏమి కలదు?" అని అన్నపుగిన్నెను గైకొని శ్రీహరిని వెంటనిడుకొని సమీపమున నున్న వేపచెట్టుక్రిందికిఁ బోయి కూర్చుండి రుక్మిణీకాంతునితోఁ గలిసి భోజనము ప్రారంభించెను. కొంతసేపటికి చోకామేళుని భార్య దధిభాండమును తీసికొనివచ్చెను. దైవవశమున ఆమెచేతులు జాఱి కుండ క్రింద పడిపోఁగా పెరుఁగంతయు పాండురంగని పీతాంబరముపైఁ బడెను. అందులకు చోకామేళుఁడుచాల నొచ్చుకొనియెను; గాని మఱలఁ జూడఁగా స్వామి పీతాంబరము యథాపూర్వముగ నుండెను.

ఇంతలో నచ్చటకు ఒకబ్రాహ్మణుఁడు వచ్చెను. ఆతఁడు చండాలుఁడగు చోకామేళుఁడు శ్రీహరితోఁ గలిసి భుజించుచుండుటఁ జూచి ఓర్వఁజాలక నిమిషములో సమీపించి బ్రద్దలగునట్లు చోకామేళుని చెంపమీఁద కొట్టెను. తోడనే విఠలనాథుని యొకబుగ్గ పొంగి దానిపై అయిదువ్రేళ్లగుర్తులును విస్పష్టముగఁ గాన్పింపఁదొడఁగెను. అదిచూచి బ్రాహ్మణుఁడు తెల్లవోయి "కట్టా! ఎంత విపరీతము జరిగినది? చోకామేళునిఁ గొట్ట శ్రీహరి చెంప వాచుట ఏమివింత! చోకామేళుఁడు సామాన్యుఁ డనుకొంటిని ఈతఁడు శ్రీహరి యంతరంగభక్తుఁడు అని కాకున్న సామాన్యభక్తుఁడు అనియైన తెలిసికొనఁజాలక పోతిని. చండాలుఁడను. శంకలేక భగవంతుఁడు సన్నిధిచేసియుండుటఁ జూచి యుగ్రహింపలేకపోతిని" అని సంతప్తచిత్తుఁడై చోకామేళుని పాదములమీఁద వ్రాలి "మహాత్మా! భాగవతాగ్రణీ! నీమహామహిమము తెలిసికొనఁజాలక అపరాధి నైతిని నీవు క్షమింపకున్న ఇఁక నాకు దిక్కు లేదు నేను ఒడలు తెలియక కేవలము శ్రీమన్నారాయణమూర్తినే కొట్టితిని. నన్ను రక్షింపుము. స్వామి కపోలముఁ జూచిన నాకడుపు తఱుగుకొనిపోవుచున్నది." అని అనేకవిధముల ప్రార్థింపఁగా చోకామేళుఁడుస్వామిసన్నిధిఁ జేరి "అచ్యుతా, అనంతా, నీమాయలనంతములు. నీలీలలుఅజ్ఞేయములు. ఈక్షుద్రసేవకునిపై నింతటి యనుగ్రహముసూపుట కేవలము విపరీతము. ఈమహానుభావునకు సంతాపము కలిగినది. జ్ఞానప్రకాశ మైనది. ఇఁక నీపాదపద్మములను విడువఁజాలఁడు. రక్షింపుము" అని స్వామిని వేఁడుకొని పొంగియున్న కపోలమును దాఁకెను.

తోడనే అది యథాపూర్వముగా నైపోయెను.

ఇదియంతయుఁజూచి ఆబ్రాహ్మణుఁడు నిలిచియున్నట్లుగ గ్రామము లోనికి పరుగెత్తుకొనిపోయి సంగతి యంతయు నెల్లరకు నెఱింగించెను. తోడనే అందఱును వచ్చి పాదములమీఁద వ్రాలి "మహాత్మా, నీమహిమ తెలియక అపరాధము చేసితిమి. రక్షింపు"మని ప్రార్థించి చోకామేళుని పంఢరినాథుని గర్భాలయమునకుఁ గొనిపోయిరి. నాఁడు మొదలు చోకామేళుఁడు బ్రతికియున్నంతవఱకు ప్రతిదినమును స్వామిసన్నిధికి వచ్చి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను.

మ. "మకుటం గస్తురిబొట్టు నాసికతుదన్ ముత్తెంబు శ్రీగంధసం
పద నెమ్మేనఁ గరంబులన్ గటకముల్ వంశంబు హస్తాగ్రమం
దెదపై నిస్తులకౌస్తుభంబు నలుతన్ శృంగారహాసంబు విం
పొదవన్ గృష్ణుఁడు గోపికాన్వితుఁడు సర్వోత్కృష్టుఁడై వర్తిలున్."

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 109.)

41. దామాజీ.

శ్లో. "కృష్ణో రక్షతు నో జగత్త్రయగురుః కృష్ణం నమస్యామ్యహమ్
కృష్ణేనామరశత్రవో వినిహతాః కృష్ణాయ తస్మై నమః,
కృష్ణాదేవ సముత్థితం జగదిదం కృష్ణస్య దాసోస్మ్యహం
కృష్ణే తిష్ఠతి సర్వమేతదఖిలం హే కృష్ణ రక్షస్వ మామ్."

(ముకుందమాల. శ్లో. 33.)

బిదరి అను నొక చిన్న గ్రామమున దామాజీ అనునొక బ్రాహ్మణుఁడు ఉండెను. ఆతఁడు బాల్యమునందే సకలవిద్యలను నేర్చి అన్నిటిలో గొప్పపండితుఁడై ఆవిజ్ఞానమువలన జగత్తు మిథ్య అనువిషయమును అనుభవమునకుఁ దెచ్చుకొని సంసారము నంటక అనవరతము ఈశ్వరధ్యానమునుచేయుచు కాలము గడపుచుండెను. ఆతని వివేకమహిమను జూచి ఆపరగణాను ఏలు రాజు దామాజీకి మంగళవటము అను పట్టణముపై అధికార మిచ్చి పంపివేసెను. దామాజీ రాజాజ్ఞను శిరసావహించి ఆపట్టణమునకుఁ బోయి ఉద్యోగభారమును స్వీకరించి తొల్లిటి యుద్యోగులవలెఁ గాక అక్రమము అను మాటను చేరనీయక రాజకార్యములను చక్కఁగ నిర్వర్తించుచుండెను. ఇదిచూచి అచ్చటి

ప్రజ లెల్లరు మహానందనిమగ్నులై ఆతనియెడల చాల భయభక్తులు గలిగి సంచరించుచుండిరి. దామాజీ రాజకార్యములలోఁబడి మునిఁగి పోక వివేకసహితుఁడు గావున దైనికకృత్యము లన్నిటిని అన్యాయ మొనవకుండ అతిశీఘ్రముగ నిర్వర్తించుకొని తక్కిన కాల మంతయు భగవద్ధ్యానమునందును సాధుసజ్జనసేవయందును గడుపసాగెను. మఱియు తనకు నెలనెలకునువచ్చు వేతనములో స్వల్పముమాత్రమే సంసారమునకుఁ దీసికొని తక్కిన దంతయు భాగవతార్చనమునందు వినియోగించుచుండెను.

ఇట్లుండఁగా ఒకసంవత్సరము వర్షాభావమువలన తీవ్రమగు కాటకము సంభవించెను. కొలఁదిదినములయందే జను లెల్లరును సమకూర్చుకొనిన భోజనసామగ్రి అయిపోయెను. క్రమక్రమముగ జనక్షయము ప్రారంభ మయ్యెను కొందఱు అన్నార్తులై తమదారపుత్రులసంగతినైన యోచింపక దేశాంతరములకు లేచిపోవసాగిరి. వారిలో పండరిపురమున వసించు బ్రాహ్మణుఁ డొకఁడు మార్గవశమున మంగళవటమునకు వచ్చి అన్నార్థియై ఇంటింటికిని తిరుగసాగెను. అదిచూచి దామాజీ అతి భక్తితో తనయింటికి ఆతనిం బిలుచుకొనిపోయి ఆతఁడు జన్మమధ్యమున ఎప్పుడును ఎఱుఁగని మృష్టాన్నముతోడి పాత్రమును ముందిడియెను. ఆబ్రాహ్మణుఁడు సువాసనలు వెదఁజల్లుఆపదార్థములనుజూచి కన్నులనీరు పెట్టికొనియెను. అందులకు దామాజీ వింతపడి "బ్రాహ్మణోత్తమా, అన్నము చెంతఁగూర్చుండి అట్లువగచెదవేల? నావలన నేమయిన అపరాధము జరిగెనా? ఆపదార్థములు నీకు హితవుగావా? పూర్వశోక మేదైన జ్ఞప్తికివచ్చెనా? ఏదియో తెల్పవేని కృతఘ్నుఁడ నయ్యెదను. నావలన నైనచో దైవసాక్షిగ దానిని దీర్చెదను" అనియెను. అందులకు బ్రాహ్మణుఁడు కన్నులనీరుతుడుచుకొని "మహాత్మా, నీవుజనార్దనునిఅవతారమ వనితోఁచుచున్నది, లేకున్న మానవమాత్రులకు ఇంత భక్తి ఇంత జంతుప్రేమ ఇంత వినయము ఇంతటిఔదార్యము కలుగనేర్చునే? ఇట్టి మధురపదార్థములనునాజన్మమధ్యమున ఎప్పుడును జూచియైన ఎఱుఁగను. అట్టిచో నాకివి హితవు కాకుండుట యెట్లు? మఱి నాదుఃఖకారణ మేమన? నానివాసము పండరిపురము. నేనుబయలు దేఱినాలుగుదినము లయినది నేను నాలుగు దినములుగా ఆహారమెఱుఁగను. అన్నములేక నాలుకలుమాడిపోవుచున్న

నాదారపుత్రులను ఏమయిన సంపాదించి కాపాడుదమను ఊహతో బయలుదేఱితిని; కాని ఈ మృష్టాన్నమును జూచినతోడనే నాభార్యాపుత్రులు 'అన్నమో రామచంద్రా' యని అచ్చట విలపించుచుండ ఇచ్చట నేను ఒక్కఁడనే యీ యాహారమును భుజింపవలసివచ్చినందులకు దుఃఖించుచున్నాను" అని బదులు చెప్పెను.

ఈమాటలు కఠోరశరములవలె దామాజీహృదయమును దూటాడెను. తోడనే యాతఁడు అతిథికి సంభవించినవిపత్తునకు మిగులవగచి "బ్రాహ్మణోత్తమా, నీకాచింతవలదు. నీకుటుంబమునకు ఒకసంవత్సరము సరిపోవు ధాన్యాదికమును నేను ఇచ్చెదను. నీవు నిశ్చింతుఁడవై భుజింపుము" అని చెప్పెను. ఈమాటలు వినినతోడనే బ్రాహ్మణుని హృదయమునఁ గల విచారమంతయు నొక్కమాఱుగ పొంగిపొరలిపోయెను. పిదప నాతఁడు దామాజీకి చాలఁ గృతజ్ఞతను జూపి కడుపార భుజించి లేచెను. దామాజీ "విప్రోత్తమా, అచ్చట నీదారపుత్రులు ఆఁకట నకనక మాడుచుందురు. క్షణమైన నీవిచట నిలువవలదు" అని చెప్పి నౌకరులను పిలిచి రాజుగారి గాదెనుండి నాలుగుపుట్ల ధాన్యము తీసి వలయు సంబారముల నెల్లఁ జేర్చి ఈబ్రాహ్మణుని వెంటఁ గొనిపోయి వారియింట నప్పగించి రండు" అని నియమించెను నౌకరులు అట్లే యని సామగ్రి నంతను బండ్ల కెక్కించుకొని బ్రాహ్మణునితో బయలువెడలిరి.

ఆబ్రాహ్మణుఁడు ఆనందభరితచిత్తుఁడై పోవుచుఁ బోవుచు బండ్లతోఁగూడ మార్గవశమున నొకయడవిలోఁ బ్రవేశించెను అప్పుడు ఈతని వలెనే కఱవువలన ఎన్నో దినములనుండి అన్నములేక మలమల మాడుచు వచ్చుచున్న ఒక గొప్పజనసమూహము ఎదురయ్యెను. అందలి కొందఱు ఆబ్రాహ్మణుని వలననే బండ్లయందున్నది భోజనసామగ్రియని తెలిసికొని అధర్మమని జంకక, ఆసామగ్రిని వెంటనే కొల్లగొట్టఁ దొడఁగిరి. ఆజనసమూహమంతయు క్షుధార్తమే గావున అందఱునుఆపనిఁ జేసిరి. క్షణములో బండ్లు అన్నియునట్టి వయ్యెను. ఎవరికి దొరకినసామగ్రిని వారు తీసికొనిరి. ఈతీరున ఆబ్రాహ్మణుని సంపత్తును ఆతని నెత్తిమీఁద శని తన్నుకొనిపోయెను. ఈదౌర్భాగ్యమును జూచి ఆతఁడు చేయునది ఏమియును లేక తన భాగధేయమును నిందించుకొని "ఇఁక నిది పనికాదు. ఇట్లెన్నిమాఱులు దామాజీవలన సాహాయ్యమును పొంది

పండరిపురమునకుఁ గొనిపోవుద మన్నను ఇక్ట్లే యగును. కావున నా కుటుంబమును వెంటనిడుకొని మంగళవటమునకుఁ బోయి ఆమహానుభావుని సన్నిధిని ఆశ్రయించుకొని యుండెదను" అని నిశ్చయించుకొని తిన్నఁగ పండరిపురమునకుఁ బోయి వెంటనే కుటుంబమును వెంటనిడుకొని మంగళవటమును జేరుకొనియెను. ఆతనివలన దామాజీ యౌదార్యమును విని యనేకులు ఆతనివెంట బయలుదేఱిపోయిరి.

పోయిన కొంతసేపటికి అందఱును గలిసి దామాజీని దర్శించి హృదయము కరగునట్లు ఆతని యెదుటఁ దమ దైన్యము నంతను వెళ్ళఁబుచ్చిరి. అదివిని దామాజీ వారి యాక్రందనములవలన హృదయము వివశము కాఁగా లోనికిఁ బోయి భార్యను బిలిచి "సంగతి యంతయు వింటివి కదా? భయంకరమగు ఈకఱవువలన అనేకులు మలమలమాడి పోవుచున్నారు. ఎందఱు చనిపోయిరో లెక్కలేదు. ఈశ్వరసంతానము ఈతీరున వగలఁ బొగులుచుండ ఈవిపత్తును తప్పింప సమర్థులగువారు తమ్ము కానట్లు ఊరకుండుట రాక్షసకృత్యము. సర్వేశ్వరుఁడు సర్వశక్తుఁడయినను మానవుల ప్రవర్తనములు కనిపెట్టుటకై అపుడపుడిట్టివి తటస్థింపఁజేయుచుండును. రాజుగారి గాదెలిప్పుడు అనేకములు నావశమునందున్నవి. వానియందు లెక్కలేనన్ని గరిసెలధాన్యము కలదు. రాజు ప్రజలసౌఖ్యములను పరిగణింపవలసినవాఁడు; కావున నేనిపుడుస్వతంత్రించి ఈధాన్యమంతయుఁ దీనజనులకు వినియోగించినచో ఏమియు బాధింపఁడు" అని చెప్పి ఆమెచే నౌననిపించుకొని ఇవ్వలకు వచ్చి అన్ని గాదెల తలుపులను తెఱచునట్లు భటులకు నియమించి "మహానుభావులారా, ఎవరికిఁ గావలసిన ధాన్యము వారు నిస్సందేహముగా తీసికొనుఁడు. ఎక్కువ తీసికొనినను బాధలేదు; గాని తక్కువమాత్రము తీసికొనవలదు" అని చెప్పెను అందులకు ఆక్షుధార్తులందఱును మిగులనానందించి ఎవరెవరికిఁ గావలసిన ధాన్యమును వారు తీసికొనిపోయిరి. ఈతీరున ఎడతెగకుండ మూఁడుమాసములు ధాన్యమును తీసికొనునప్పటికి గాదెలు ఖాళీలయ్యెను. అందఱును కఱవువలని బాధను తప్పించుకొనిరి. లోకమంతయు పరమానందభరితమయ్యెను. దామాజీ కీర్తి దశదిశల వ్యాపించెను.

లోకములో కొందఱు మహానుభావులు పరులుధనవంతులైనచో తమదేమో పోయినట్లు దుఃఖింతురు. ఒరులు సుఖమనుభవించుచున్నచో తమకు కష్టము సంభవించినట్లు వగతురు. ఒరులయింట శుభములు జరిగినచో తమయింట పీనుఁగు వెడలినట్లు ఆక్రోశింతురు. ఇతరులు కీర్తిశాలురైనచో తమకవమానమువచ్చినట్లు వాపోవుదురు. అన్నివిధములనుఎదుటివారు బాగుగ నున్నచో తమగుఱ్ఱు పెటికికొందురు. ఇట్టి మహాపురుషులకు ఏ దేశమునందును, ఏజాతియందును, ఏవర్ణమునందును, ఎప్పుడును లోపము ఉండదు; గావున అప్పుడు కొందఱట్టివారు "దామాజీ రాజస్వమంతయు భక్తులకు పంచిపెట్టినాఁడు. మీగాదెలన్నియు ఖాళీలైనవి. వానిలో ఒక దమ్మిడీ ధాన్యమైనను లేదు" అని అర్జీలు వ్రాసిరి. దానిపై రాజు ఆగ్రహమహోగ్రుఁడై నుండిపడి దామాజీని కట్టితెండని భటుల కాజ్ఞాపించెను. తోడనే రాజభటులు మంగళవేటమునకు బోయి యావంగతి యంతయు దామాజీ కెఱింగించి "మీరు మహానుభావులు కావున ఇచ్చటనే మిమ్ము బంధింపఁజాలము; కాని రాజాజ్ఞ నుల్లంఘింపఁజాలము. కావున మాతో దయచేయుఁడు. రాజధానివఱకు మిమ్ము నిరాయాసముగఁ గొనిపోయి అచ్చటమాత్రమే మిమ్ము బంధించెదము" అని చెప్పిరి. దామాజీ అందులకు భీతిల్లక భార్యకు ధైర్యముగొలిపి వారివెంట బయలుదేఱెను.

మార్గమధ్యమున పంఢరిపురముతగిలెను. అచ్చటదామాజీభటుల యనుజ్ఞను బడసి ఆలయమునకుఁ బోయి పాండురంగని సేవించి నిశ్చలచిత్తుఁడై ఈతీరున ప్రార్థించెను. "శ్రీహరీ, సర్వలోకశరణ్యా, నీకు తెలియని దేమియు లేదు. అయినను విన్నవించుట మానని. ప్రపంచమునందంతటను నీవు నిండియున్నావు ఆశరీరమున నుండి రాజు అని పిలిపించుకొనుచు ఈశరీరమున నుండి దామాజీ యని పేరుగొన్న నిన్నెశిక్షించుటకు పిలిపించుకొనుచున్నావు. నీలీలలు అనంతములుగదా ? నీ కెట్లు క్రీడింపఁ దలంపు గలిగిన నట్లు క్రీడింపుము; గాని ఈక్షుద్ర శరీరమున నున్న స్వల్పాంశమును తుదకు నీయందే చేర్చికొనుము."

ఇట్లయిన తరువాత అతఁడు రాజభటులతోఁ గూడిరాజధానికి బయలుదేఱెను అంతకు పూర్వమే పాండురంగఁడు ఒక తలారివాని వేషము ధరించి చింపిరిగుడ్డను కట్టుకొని ఒకచేత దుడ్డుకఱ్ఱయు,ఒకచేత

వరాలసంచియుఁ గైకొని రాజధానికిఁ బోయి రాజగృహద్వారమున నిలిచి తనరాకను లోని కెఱింగించెను. రాజు సెలవిచ్చెను. వెంటనే తలారి రాజసన్నిధికిఁ బోయి "మహారాజా, ఏలినవారి పాదపద్మముల సన్నిధికి నన్ను దామాజీ పంపెను. మంగళవేఢమున నున్న తను గాదెల లోని ధాన్యమును విక్రయించి సొమ్ము నాచేతఁ బంపినాఁడు; కావున దానిని స్వీకరించి నాకు రసీదు దయచేయునలయును" అని చెప్పి ఆవరాలమూటను ముందిడియెను. యతని జూచియు అతని మాటలను ఆలకించియు ఆతని రూపమును తిలకించియు "అయ్యా, నీవెవఁడవో నాకనుమానము వింద సేయుచున్నావు; క్షుద్రవస్త్రముల ధరించినను నీ తేజస్సు సార్వభౌమపుత్రులకుఁ గూడ దుర్లభమైయున్నది. నిన్ను తలారి యని తలంచుటకుఁగూడ నామనస్సంగీకరింపకున్నది. మాకు మంగళ వేఢమున రావలసిన ధనము నాల్గులక్షలవరహాలు. దామాజీ అంతయుఁ బంపెనని చెప్పుచున్నావు. ఆమొత్త మంతయు నీజానెఁడు సంచిలో కలదా ! నీవు మానవుఁడవు కావని చెప్పుటకు ఇంతకంటె దృష్టాంత మేమి కావలయును. నీయూరేది? నీపేరేమి? నీతలిదండ్రు లెవరు? నీకు నెలజీత మెంత?" అని ప్రశ్నించెను.

అదివిని తలారిరూపముతో నున్న పండరినాథుఁడు అందలివారి కెల్లరకును యథార్థము తెలియకుండునట్లు మాయ కల్పించి రాజును జూచి "రాజా, నాకు ఏలిక యగు దామాజీకి నీవు ఏలికవు; గావున నీ ప్రశ్నలకు ప్రత్యుత్తరము చెప్పుచున్నాను. నాకొక యూరు లేదు; గాని అన్ని యూళ్లును నావే. నాకొక పేరు లేదు; అయినను అన్నిపేళ్లును నావే. నాకు తలిదండ్రులు లేరు అయితే అందఱకును నేనే తండ్రిని; నేనే తల్లిని. ఈప్రపంచమున నేను కాని దేమియును లేదు. అదియట్లుం చుము. దామాజీ తన సర్వస్వమును నాకర్పించెను. నాసర్వస్వమును ఆతని కిచ్చితిని. ముందుగ నీసొక్కమును నీవు గ్రహింపుము" అని చెప్పి ఆచిన్ని వరాలమూటను విప్పి అందలి వరాలను ఆతని ముందట పోయఁ గనే ఆచిన్నివరాల రాసి కొండవలె పెరిగిపోయెను.

రాజు అందులకు మిగుల నాశ్చర్యపడి నాల్గులక్షల వరహాలును లెక్కించి పుచ్చుకొనునట్లు కోశాధికారికి నియమించి అంతయు నైన తరువాత రసీదు వ్రాసి యిచ్చి తలారికి వస్త్రాభరణములను బహుమతి

చేసి దామాజీపండితులకుఁగాను అనేక గజాశ్వాదులను బహుమానము చేయవలసిన దని కొందఱు ఉద్యోగులకు నియమించి తలారికి సెలవొసంగెను. మఱునాఁడే రాజభటులు దామాజీని తీసికొనివచ్చి బద్ధుఁడైయున్న యాతనిని రాజు నెదుట నిలిపిరి. తోడనే రాజు గద్దియడిగ్గి స్వయముగ ఆతని బంధములను విప్పి సాష్టాంగనమస్కారము లాచరించి నాయపరాధమును సైరింపవలయును. నీమహిమ నెఱుఁగఁజాలకపోయితిని. పాండురంగఁడు అను తలారి నీవు పంపితివని గతదినమున ఇచ్చటకు వచ్చి నీవు మాకీయవలసిన నాణెములు వరహాలును చెల్లించి రసీదు గొని పోయెను. అంతకుపూర్వమే నేను భటులకు నియమించియున్నవాఁడను గావున వారు నిన్ను కట్టితెచ్చిరి. అంతయును కరుణింపవలయును" అని ప్రార్థించెను. దామాజీ అదివిని కొంతసేపు నిర్విణ్ణుఁడై "శ్రీహరీ, ఈతుద్రునికొఱకు నీవెట్టి నీచవేషమును ధరించితివి? అని దుఃఖించి "రాజా, నీవెంతయు నదృష్టవంతుఁడవు. లేకున్న సనకసనందనాదులకుఁగూడ అవాఙ్మానసగోచరుఁడగు భగవంతుఁడు నీకింత సులభముగ దర్శనమిచ్చునే!" యని కొనియాడెను.

పిదప రాజు "యథాపూర్వముగా మంగళవటమునకు అధికారివై దానిమీఁది యాదాయమును నీచిత్తము వచ్చినట్లు వెచ్చింపుము" అని చెప్పెను; గాని దామాజీ ఇఁకే నేను సేవకవృత్తిని సేయఁజాలను" అని చెప్పి తిన్నఁగ పండరిపురమునకుఁ బోయి శ్రీహరికైంకర్యమున కాలమును గడపి అవసానమున సాయుజ్యమును బడసెను.

శ్లో. "బద్ధేనాంజలినా నతేన శిరసా గాత్రైస్సరోమోద్గమైః
కంఠేన స్వరగద్గదేన నయనేనోద్గీర్ణబాష్పాంబునా,
నిత్యంత్వచ్చరణారవిందయుగళధ్యానామృతాస్వాదినా
మస్మాకం సరసీరుహాక్ష సతతం సంపద్యతాం జీవితమ్."

(ముకుందమాల. శ్లో. 20.)

---

42. పిపాజిరాజు.

శ్లో. "ఏతస్మాద్విరమేంద్రియార్థగహనా దాయాసకా దాశ్రయ
శ్రేయోమార్గ మశేషదుఃఖశమనవ్యాపారదక్షం క్షణాత్,

శాన్తం భావ ముపైహి సన్త్యజ నిజాం కల్లోలలోలాం గతిం
మా భూయో భజ భఙ్గురాం భవరతిం చేతః ప్రసీదాధునా."

(భర్తృహరి. వైరాగ్యశత. శ్లో. 63.)

మంగళవటము అను గ్రామమున పిపాజిరాజు అను నొక మహారాజు ప్రజల నేలుచుండెను. అతఁడు వివేకశాలియు, పరాక్రమవంతుఁడును, క్షమారతుఁడును గావున న్యాయాన్యాయములఁ జక్కఁగ గుర్తెఱిఁగి యుద్ధములయందు ఓటమి యన నెట్టిదో యెఱుఁగక చాల శాంతముగ ప్రజాపాలనము సాగించుచుండెను. విశేషించి లోకమాతయగు కాళికాదేవి అన్నివిధములను అతనిని పూలఁ బెట్టినట్లు కాపాడుచుండెను. అతఁడు ప్రతిదినమునందును ప్రాతఃకాలమునందే లేచి స్నానాదినిత్యకృత్యము లన్నియుఁ దీర్చుకొని కాళికాదేవిని బూజించి ఆమె సాక్షాత్కరించి నైవేద్యమును స్వీకరించిన తరువాత సుగంధతాంబూలము నొసంగి సంతోషపెట్టి పిదప తాను భుజించి రాజకార్యములను జూచుకొనును. ఏ కారణమువలన నైన ఆమె సాక్షాత్కరించుట కొంచెము ఆలస్య మగునేని అది యగునంతదనుక అతఁడు భోజనముకూడ సేయఁడు. ఇట్టి యచంచలభక్తితోఁ దన్ను సేవించుచుండుటవలన కాళికాదేవి రాజునకు అన్నిటను విజయమె కలిగించుచుండెను.

ఇట్లుండఁగా కొందఱు భాగవతాగ్రేసరులు ఆపట్టణమునకుఁ జనుదెంచిరి. రాజు భూతదయాపరుఁడు గావున వారు అట నున్నన్నిదినములు మృష్టాన్నసంతర్పణము గావింపవలసిన దని పురోహితునకు నియమించి తగిన యేర్పాటు లన్నియుఁ గావించి తాను కాళీపూజ గావింపఁదొడఁగెను. పూజాదికములయందు ఏలోపమును సంభవింపకుండినను యుక్తసమయమున నాఁడు దేవి సాక్షాత్కరింపదయ్యెను. అందులకుఁ జింతించి రాజు అనేకవిధములఁ బ్రార్థింపఁగా ఆమె సాక్షాత్కరించి "రాజా, నీవలన నేలోపమును లేదు. నాయెడల నీకు భక్తి అంతకంతకుఁ బెరుగుచున్నది; కాని తఱుగుట లేదు. మఱి నేఁడు ఆలస్యమునకు కారణ మేమందువా? నీపట్టణమునకు కొందఱు భాగవతాగ్రేసరులు వచ్చియున్నారు. వారు మహాత్ములు. శ్రీహరి యంతరంగభక్తులు. వారికి భోజనాదికము లన్నియుఁ జక్కఁగా జరపునట్లు నీవే యేర్పఱిచి యున్నావుకదా? వారికింకను భోజనము కాలేదు. వారు భుజించునంతదనుక నేను నైవేద్యము

స్వీకరింపఁజాలను. ఇది యట్లుండ నిమ్ము. వత్సా! నీపూర్వపుణ్యమువలన వారు అయాచితముగ లభించిరి; గాని ప్రయత్నించినచో వారులభింపరు. ఇంతకంటె నీకు మంచితరుణము లభింపదు; గావున సున్నితమైన వారి మనసు కరఁగునట్లు సేవలు సేయుము. నాయనుగ్రహమువలన నీవింతవఱకును దేవేంద్రునకుఁగూడ అలభ్యములగు వైభవముల ననుభవించితివి. మానవజన్మము దుర్లభము. జన్మముల కన్నిఁటికి నిది పరమావధి. ఇందు తప్పుత్రోవఁబోయినచో అధఃపతనము సంభవించును. అనఁగా ఈఁగయో దోమయో యై పుట్టుట తటస్థించును. అంత కష్టము మఱి లేదు కదా? కావున మానవు లెల్లరును పునర్జన్మరహితముగా ఈశ్వర సాయుజ్యమును బడయుట యుక్తము. ఈశ్వరప్రేమకు భక్తిజ్ఞానము సాధనములు. వైరాగ్యము వీనికి పోషకము. జీవితకాలము బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము అను నాల్గు ఆశ్రమములుగా విభాగింపఁబడినది. ధర్మములను బట్టి ఈనాల్గునుగూడ మిక్కిలి నుత్తమములు. కొందఱు మహానుభావులు బ్రహ్మచర్యమునుండియే మోక్షసాధనకు ఉపక్రమింతురు; కాని యది మిగుల దుర్ఘటము. గార్హస్థ్యమునుగూడ గడపి మోక్షసాధన నుపక్రమించువారు కొందఱు. వీనితరువాత మోక్షేచ్ఛులు భక్తిమార్గమునో జ్ఞానమార్గమునో అవలంబింతురు. ఇది యెల్ల నీకు తెలిసినదియే కదా. నీవు ఇపుడు గార్హస్థ్యముననున్నావు. నీవనుభవించుటవలన ఐహికసౌఖ్యమంతయు పీల్చివేయఁబడిన పిప్పియైపోయినది. నీకు మోక్షసాధనఁ బ్రారంభింపఁదరుణ మాసన్నమైనది. మోక్షమనఁగా జన్మపరంపరావిముక్తి, ఈశ్వర సాయుజ్యము. ముక్తిని సాధించుటకు జ్ఞానముకంటె భక్తి సులభము. కావున ఇఁక నీవు ఈరాజ్యభారమునంతను నీకుమారునిపై నిడి ఈపట్టణమునకు వచ్చియున్న భాగవతులను ఆశ్రయింపుము. వారునిన్నుతరింపఁజేయుదురు.” అని చెప్పెను.

అదివిని రాజు ఆనందకందళితహృదయారవిందుఁడై దేవి పాదములమీఁద వ్రాలి “నాయెడల నీవు చూపిన యనుగ్రహమునకు కృతజ్ఞుఁడను. ఈక్షుద్రుని యెడల నీకింతటి ప్రేమ గల్గుటకు కారణము నీహృదయము ఆర్ద్రమగుటయే కాని నాసేవ గాదు. తల్లీ, జ్ఞానోపదేశమున నీకే ప్రథమగురుత్వము సిద్ధించినది. నీయాజ్ఞానుసారముగా నేనిదె భాగ

వతులను సేవింపఁబోవుచున్నాను." అనివిన్నవించి మఱల సాష్టాంగనమస్కారము లాచరించి అనుజ్ఞను బడసి భాగవతుల సన్నిధికిఁ బోయెను.

అప్పటి కప్పుడే భాగవతులు భుజించి తాంబూలమును సేవించుచుండిరి. రాజాగమనమును విని వారు వింతపడుచున్నంతలో రాజు వచ్చి వారి పాదములమీఁద వ్రాలెను. మఱింత యబ్బురపడి వారు దీవించి రాజును లేవనెత్తిరి. రాజు వారి యెదుట మోఁకరించి నిలిచి రచితాంజలిబంధుఁడై "మహానుభావులారా, మీమహానుభావము అనిర్వరవేద్యము. నాపూర్వపుణ్యవశమున నే మీరిటకు వేంచేసితిరి, గాని నేను గాదు. అదృష్టహీనులకు ఎంత ప్రయత్నించినను మీవంటివారి దర్శనము లభింపదు. చేఁజిక్కిన సన్నిధిని వ్యర్థపుచ్చుకొనుట వివేకిలక్షణము కాదు. నేనింతవఱకును కాళికా దేవిని బూజించి ఆమె యనుగ్రహమునఁ సకలవైభవములు ననుభవించితిని. నేఁడు ఆమె యాజ్ఞవలన నే నేను మోక్షాసక్తుఁడ నైతిని. ఆమె యుపదేశమువలన జగన్మిథ్యాత్వము నెఱింగి ఆమె సెలవువలనమీసన్నిధికి వచ్చితిని. కావున శ్రీహరి అంతరంగభక్తుల రగుమీరు నాకు చేయూఁత నొసంగి మోక్షసాధనమునకు మార్గము నుపదేశింపవలెను" అని ప్రార్థించెను.

భాగవతులు రాజు ప్రయత్నము నెఱింగి మిగుల నానందించి "రాజా, కాళికా దేవి యనుగ్రహముఁ బడసిన నీకు ఇఁక లేని దేమున్నది. నీప్రయత్నము ప్రశంసనీయము. కాళికా దేవిచే నియమింపఁబడితివి; గావున నీహృదయమున ఇఁక ఎంతమాత్రమును సంసారవాసన అంటఁజాలదు. నీకు ఇఁక మోక్షము కరతలామలక మగుటలో వింత యేల? ఇఁక నీకు లభింపవలసినది సదాచార్యుని పాదపద్మములు; కావున నీవు వెంటనే బయలుదేఱి అఘనాశక మగు వారాణసీపురమునకుఁ బోయి భాగవతుల అందఱియందును నాయకమణియై రిక్కలనడుమ చంద్రుఁడువలె విరాజిల్లుచున్న శ్రీరామానందస్వామి నాశ్రయింపుము" అని చెప్పిరి. రాజు వారికి మ్రొక్కి దీవనలు బడసి అనుజ్ఞ నంది కోటకుఁ బోయి రాజ్యమును కుమారునకు అప్పగించి ఆతనికిని మంత్రులకును జెప్పవలసిన దంతయుఁ జెప్పి భార్యాసహితుఁడై ఆకాశీనగరమునకు బయలుదేఱెను.

రాజును రాణియు యుక్తసమయమున రామానందస్వామిని

దర్శించి సాష్టాంగదండప్రణామమ్ములాచరించి నిలిచిరి. స్వామి దీవించిన పిదప రా జిట్లు చెప్పెను. "మహాత్మా, భాగవతాగ్రేసరులయందు నాయకమణియైనవాఁడా, నీపాదపద్మసందర్శనమువలన నేఁడు మాపాపములన్నియు భస్మపటలము లై పోయినవి" అని మ్రొక్కి తన చరిత్ర మంతయు నెఱింగించి "శ్రీహరి అంతరంగభక్తుఁడ వగునీకు అసాధ్య మెద్దియు లేదు. నీయనుగ్రహమువలన అనేకులు జన్మసాఫల్యమును బడసిరి. ఆశిష్యపరంపరలో భార్యాద్వితీయుఁడ నగు నన్నుఁగూడఁ జేర్చుకొనుము. నాకు మోక్షమార్గము నెఱింగించి రక్షింపుము" అనిప్రార్థించెను. స్వామి పరమానందభరితుఁడై తారకమంత్రోపదేశమును జేసి జ్ఞానబోధ గావించి ద్వారకకుపోయి అచ్చట వేంచేసియున్న శ్రీహరిని సేవింపుమని పంపివేసెను.

రాజు గుర్వాజ్ఞవలన ద్వారకకు పోయి స్వామిని దర్శించి ప్రార్థింపఁగా శ్రీహరి సాక్షాత్కరించి "వత్సా, కాళికాదేవి యనుగ్రహమువలనను రామానందస్వామి యుపదేశమువలనను నీవు ధన్యుఁడవైతివి. మఱియు నామదేవాదులవలె నాయంతరంగభక్తుఁడవుగూడ నైతివి. నేను నీహృదయమునందును నీభార్య హృదయమునందును ఎప్పుడును వసించియుండెదను. గుర్వాజ్ఞానుసారముగ ప్రవర్తించుకొను" మనెను. పిదప రాజు అచ్చట నాల్గుమాసములు వసించి మఱల కాశికి బయలుదేఱెను.

మార్గమధ్యమున ఒక యడవిలో ఒక బెబ్బులి యెదురుపడెను. దానిని చూచి రాణి "అయ్యో, బెబ్బులి వచ్చుచున్న" దని భయపడఁగా "దేవీ, ఏల యిట్లుభీతిల్లెదవు? సర్వసమభావమును మఱచితివా? నీయందును నాయందును బెబ్బులియందునుగూడ నున్నవాఁడు భగవంతుఁడే గదా?" అని చెప్పఁగా రాణి తేరుకొని బెబ్బులివంక జూచి "ఈశ్వరా, నీరూపములు అనంతములు. నీలీలలు అగణ్యములు. నీనామములు అసంఖ్యములు. నీచర్యలు అనితరవేద్యములు. వ్యాఘ్రరూపివై వచ్చిన నిన్నునేను నమస్కరించుచున్నా" నని మ్రొక్కెను. ఇదివిని బెబ్బులి మిగులశాంతించి తోఁక నాడించుకొనుచు దగ్గఱకు వచ్చి నిలిచెను. రాజుదానినిబుజ్జగించి చెవిలో తారక మంత్ర ముపదేశించెను. తోడనే అది సాష్టాంగచిహ్నముగా ఆదంపతుల యెదుట పరుండి యథేచ్ఛంబని

యెను. అదిమొదలు అది క్రిందరాలిన ఆకులను, అంబుమును పరి తినుచు సదా ధ్యాననిష్ఠమై కాలము గడపెను.

పిపాజిరాజును, అతని భార్యయు బ్రతికియున్నంతకాలము భగవద్భాగవతార్చనముచే గడపి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసిరి.

శా. ఆయాసప్రద మింద్రియార్థగహనం బౌ త్రోవ వర్జింపుమీ
శ్రేయోమార్గము సర్వదుఃఖశమనచ్ఛేదార్థమై చేరుమీ
స్వారాజ్యవ్రతముం బొందుము స్థిరతచే దీపింపుమీ చిత్తమా
మాయాకేళికి వెండియుం జొరకుమీ మాలిన్యమున్ వీడుమీ.

(భర్తృహరి. వైరాగ్యశత ప. 63)

---

43 నా న కు దా సు.

శ్లో. అరుణాధరామృతవిశేషితస్మితం, వరుణాలయానుగతవర్ణవైభవమ్
తరుణారవిన్దదళదీర్ఘలోచనం, కరుణామయం కమపి బాలమాశ్రయే.

(కృష్ణకర్ణామృతము. ఆ. 3. ప. 17.)

పాంచాల దేశమున నానకుఁడు అనునొక మహానుభావుఁడుండెను. ఆతఁడు మహమ్మదీయుఁడయ్యును మహాత్ములు అన్ని మతములయందును అవతరింతురు; గావున అజ్ఞానులవలె శివుఁడు, విష్ణువు, బ్రహ్మ, అల్లా, క్రీస్తు అను భేదభావము సేయక ఇవి యన్నియు నామరూపరహితుఁడగు ఆసచ్చిదానందమూర్తికే చెందునని నిశ్చయించి శ్రవణమననధ్యానానుసంధానాదులచే శ్రీహరిని సేవించుచు నుండెను. నానకుఁడైనభక్తికి తోడుమహాధనికుఁ డగుటవలన తనకును తక్కినభాగవతులకునుగూడ ఉపయోగించుటకై ఒక గొప్ప విష్ణ్వాలయమును గట్టించెను. అయితే ఆగ్రామమున నుండువారిలో మహమ్మదీయులుకూడ కొందఱు కలరు. కావున తమ మతమువాఁడు ఇట్లు భారతీయులు పూజించు శ్రీహరిని ఆరాధించుట నంగీకరింపఁజాలక దురభిమానదూషితులై ఆయాలయమును పడఁగొట్టి వేసిరి; గాని నానకుఁ డందుల కేమియు కోపింపక వెంటనే అచ్చటనొక గొప్ప మసీదును కట్టించెను. తురకలందఱకును మిగుల నానందమయ్యెను.

కాని భారతీయులకు కోపము వచ్చెను. "నానకు స్వబుద్ధివలననే శ్రీహరిని బూజింపఁదొడఁగెను; గాని పరులబోధవలనఁగాదు. విష్ణుదేవుని యాలయనిర్మాణము గూడ నతఁడు స్వయముగ యోచించియే చేసెను; గాని మాకు లేకపోవుటవలనఁ గాని మాబోధనవలనగాని చేయ లేదు. అట్టిచో తురకలు విష్ణ్వాలయమును పడఁగొట్టనేల?" అని తలంచి కోపోద్రిక్తులయి భారతీయులు ఆ మసీదును బడఁగొట్టి వేసిరి. "నా భావమును వీరెవరును గనుగొనఁజాలకపోయిరి. ఈయుభయపక్షుల వారికిఁగూడ స్వమతాభినివేశము ప్రబలమై యున్నది. మతవిషయమున వీరికి సంధి కుదురదు. అందులకై ప్రయత్నించుట వ్యర్థప్రయాసమగును" అని తలంచి నానకు ఆస్థల మంతయు బాగుచేయించి పొలముగా నుపయోగింపసాగెను. ఇట్లు చేయుటవలన ఆపొలములో చాల ధాన్యము పండుటయు దానివలన అనేకదీనులు బ్రతుకుటయు సంభవించెను. భారతీయులకును మహమ్మదీయులకునుగూడ కోపమునకును కార్పణ్యమునకును గారణము లేకపోయెను. అయినను కొందఱు ఆతని దగ్గఱకు పోయి "అయ్యా, మీరు తొలుత విష్ణుదేవుని యాలయమును గట్టించితిరి. తురకలు దానిని బడఁగొట్టఁగా పిదపమసీదును గట్టితిరి. భారతీయులు దానిని బడఁగొట్టఁగా తుదకు పొలముగా చేసితిరి. ఈతీరున మీరు మహమ్మదీయులై పుట్టియు విష్ణుభక్తులయితిరి; కాని మహమ్మదీయుల దౌర్జన్యమువలన మరల మహమ్మదీయులైతిరి. పిదప మావారి నిర్బంధమువలన వైష్ణవులగుటకు మాఱుగ నాస్తికులైతిరి. మీచర్యనంతయును అర్థమేమి! మీహృదయము పరిపక్వమైనదా లేదా! దానికి నైశ్చల్యము కలదా లేదా! మతవిషయమున మీభావమేమి! దైవమును గూర్చిన మీయభిప్రాయ మెట్టిది!" అని యడిగిరి. అందులకు ఆతఁడు ఇట్లు చెప్పెను. "లోకు లనేకవిధముల ననుకొందురు. వారి కందఱకును నచ్చఁజెప్పుట విధాతకైన తరము కాదు. నేను అల్లాను సేవించెదను. శ్రీహరిని పూజించెదను. శంకరుని అర్చించెదను. మీరందఱును తలఁచునట్లు గాక ఈనామము లన్నియు ఆసచ్చిదానందమూర్తికే చెల్లుచున్నవి. విష్ణ్వాలయమును గట్టిన మహమ్మదీయులు పడఁగొట్టిరి. మసీదును కట్టిన భారతీయులు పడఁగొట్టినారు. మసీదుగను విష్ణ్వాలయముగను కట్టించినచో ఉభయులును కలిసి పడఁగొట్టెదరు. ఇన్నిబాధ లేల? ఇంత

ధనవ్యయ మేల? అచ్చట వ్యవసాయము చేసినచో చాల ధాన్యము పండును. ఆధాన్యమువలన ఇప్పుడు అనేకులు జీవించుచున్నారు. గుడిగాని, మసీదుగాని, లేకపోయినంతమాత్రమున నాదైవభక్తికి లోపము లేదు. నిశ్చలమైన హృదయముతో భక్తుఁడు ఎట్టిభావనసేయునో అట్టి రూపముతో ఈశ్వరుఁడు పొడకట్టును. ఈశ్వరుఁడు ప్రపంచమం దంతటను నిండియున్నాఁడు. ఇచ్చట మసీదుగాని ఆలయముగాని లేనిచో ఆతఁడు మనకు దూరుఁడగునా? సామాన్యుల యభిప్రాయమున పాండురంగఁడు ఒక్క పండరిపురమునం దేకలఁడు; గాని తర్కించి చూచినచో అతఁడు లేనిచో టెచ్చట నున్నది! తెలిసికొన శక్తియున్నచో ఈశ్వరుఁడు కండ్లయెదుటనిలిచియే యున్నాఁడు. అజ్ఞానము కలవాఁడు భేదభావము సేయఁడు. వైష్ణవులు శైవులను ద్వేషించుటకును శైవులు వైష్ణవులను ద్వేషించుటకును మహమ్మదీయులు భారతీయులను దూరుటకును భారతీయులు మహమ్మదీయులను విరోధించుటకును ఇట్లు భిన్న ప్రకృతులు పరస్పరము నిందించికొనుటకును ఈయజ్ఞానమే కారణము. కావున ఈవిషయమును విశేషముగ తర్కించుట వివేక మనిపించుకొనదు.

ఈసమాధానమును విని వారిలో కొందఱు మిగుల కోపించి ఆదేశము నేలు నవాబుయొద్దకుఁ బోయి నానకు సంగతి యంతయు నెఱింగించి ఆతనిని విచారింపవలయు నని చెప్పిరి. నవాబు వల్లెయని వారిని పంపివేసి "నీవు మహమ్మదీయుఁడవు. మహమ్మదీయసంప్రదాయమును నీవు విడువఁగూడదు" అని యొకభటునిద్వారా నానకునకు వర్తమానము చేసెను. అదివిని యాతఁడు "సూర్యతేజము వివిధములగు గాజుపెంకుల మీఁదఁ బడునపుడు పెక్కురంగులు నీనుచున్నది. అట్లే పరమేశ్వరుఁడు అనేకమతములవారికి అనేకవిధములుగ కనుపించుచున్నాఁడు. మీరందఱును మీమీహృదయములయందు ప్రతిఫలించిన ఆపరమేశ్వరుని అలీకరూపములనే చూచుచున్నారు; గాని నే నామూలతత్త్వమునే యుపాసించుచున్నాను" అని యొక కాగితముమీఁద వ్రాసి ఆభటునకిచ్చి "ఇది మీప్రభువునకుఁ జూపుము" అని చెప్పెను. వాఁడట్లే చేసెను. రాజు ఆకాగితమును జూచి అందలి భావగాంభీర్యమునకు అచ్చెరువడి "ఇతని ప్రభావము మిగుల నద్భుతముగాఁ దోఁచుచున్నది. అయినను ఎవరును తెలిసికొనఁజాలక పోవుచున్నారు. నేను దానిని పరీక్షించి నిజమైనచో అందఱి

కుని జాటిచెప్పెదను" అని నిశ్చయించుకొని "నారాజ్యములో నుండి నా ప్రజలలో నొకఁడై యుండియు నాయాజ్ఞను తిరస్కరించెను; గావున మీరుపోయి ఆతనిని గట్టి తెండు" అని సిపాయిల కాజ్ఞ యిచ్చెను.

వెంటనే అయిదువందల సిపాయిలు బయలు దేఱిపోయిరి. అప్పటికి నానకు లోపలఁ గూర్చుండి శిష్యులకు జ్ఞానబోధ గావించుచుండెను. ఇట్టిస్థితిలో రాజభటులువచ్చి తనకుటీరమును ముట్టడించియున్నారనుసంగతి శిష్యులవలన వినియప్పటికియు నానకుఁడు కొంచెమైనను భయపడక "అంతకును పండరినాథుఁడే గలఁడు" అని పలికి హరిధ్యానమున ప్రవృత్తుఁడయ్యెను. అంతట చూచుచుండఁగనే భుజబలులగు పదివేలవీరభటులు నేలయీనినట్లు క్షణములో నావిర్భవించి రాజభటుల నెదిరించి నిలిచిరి. ఇరువాఁగులవారికిని సంకులసమరము జరిగెను. ఉత్తరక్షణమునందే రాజభటులు క్రొత్తవీరులధాటికి నిలువఁజాలక వెన్నిచ్చి పాఱిపోయి యాసంగతి యంతయు తమ ప్రభువునకు విన్నవించిరి. అంతట నవాబు నానకుమాహాత్మ్యమునకు పరమాశ్చర్యచకితుఁడై తాను చేసిన పనికి మిగుల పశ్చాత్తాపపడుచు వెంటనే నానకుసన్నిధికి పోయి పాదములమీఁద వ్రాలి "మహాత్మా, నేను మహాపరాధిని. ఏలినవారి ప్రభావమును దెలిసికొనఁజాలక నేనీ ధూర్తకార్యమును జేసితిని. మీరంపిన చీటి చూచినప్పుడే నాకు మీయెడల మహానుభావులను నమ్మకము గలిగెను; కాని ఇప్పుడు లోకములో దొంగహరిదాసుల సంఖ్య గణనాతీతమై యున్నది. కావున ఆనమ్మకమును స్థిరముగ నుంచుకొనఁజాలక మిమ్ము పరీక్షించుటకు ఈపని చేయించితిని సంకుచితచిత్తుఁడనగుటవలన మీమాహాత్మ్యమును దెలిసికొనుటకు నాకింతకంటె మంచిమార్గము తోఁచలేదు. అజ్ఞానకృతమైనను చేసినపనికి ఫలమనుభవింపక తప్పదు; కావున నాకు తగిన ప్రాయశ్చిత్తమైనది. మీయనుగ్రహమువలన నాకు బుద్ధివచ్చినది; కావున నాయపరాధమును మన్నించి నన్ను శిష్యకోటిలోఁ జేర్చుకొని జ్ఞానతేజమువలన నామౌఢ్యాంధకారమును తొలఁగించి నన్ను రక్షింపవలయు" నని ప్రార్థించెను. అంతట నానకుఁ డాతనికి తారకమంత్రము ఉపదేశించి,—

సీ. "హలకులిశాంకుశజలజధ్వజచ్ఛత్రలాలితలక్షణలక్షితములు
సులలితనఖచంద్రచంద్రికానిర్ధూతభక్తమానసతమఃపటలములును

సురుచిరాంగుష్ఠనిష్ఠ్యూతగంగాతీర్థమండితహరజటామండలములు
సంచితధ్యానసంతాపమానఘనపాతకలుపర్వతదీప్తపవిశములును
గీ. దాసలోకమనోరథదాయకములు, చారుయోగిమనఃపద్మషట్పదములు
ననఁగఁ దనరిన హరిచరణాబ్జములను, నిరుపమధ్యానమున మది నిలుపవలయు."

(భాగవతము. స్కం. 3. ప. 9:9.)

అని యుపదేశించి "నీయాజ్ఞకు ఎందును అడ్డులేదు. నీవు హరి ధ్యానము సేయు ఫలముకంటె నీప్రజలను అనేకులను హరిభక్తులను జేసిన కలుగు ఫలము అపరిమితము. కావున నీవట్లు చేయుము" అని బోధించెను.

ఈయద్భుతకృత్యమును జూచియు చూచినవారివలన వినియు పెనభక్తులు కొందఱు వెంటనే వచ్చి నానకు నాశ్రయించి శిష్యగణమునఁ జేరిరి. అనేకులు తమకు ఉన్నదాని ననుసరించి ఎవరికిఁ దోఁచినంత వారు తెచ్చి ధనము సమర్పింపసాగిరి. ఇట్లు వచ్చిన ధన మంతయు నానకు భాగవతసేవకు వినియోగింపసాగెను. దానివలన అనేకులకు దిన పాతమునకు ఉపయోగ మేర్పడెను.

ఇట్లు కాలము గడచిపోవుచుండఁగా నానకు తన నమ్మిన శిష్యులగు ఇద్దఱిలో సూత్ర అను సతినిని మఠమునందు ఉండ నియమించి మర్దనుఁడు అను నతనిని వెంటఁ బెట్టుకొని లోకము నుద్ధరించుటకై బయలుదేఱెను. కొంతదూరము పోవునప్పటికి మకాపట్టణమునఁగల శ్రీకృష్ణభగవానుని విగ్రహమును అచ్చటి తురకలు త్రవ్వి పాఱవేసి దానిపై పశువుల యెముకలను పడవేసిరి యను వార్త వినవచ్చెను. తోడనే నానకు ఆవిగ్రహముసుద్ధరించుటకును ఆవిగ్రహరూపమున వెలసియున్న శ్రీకృష్ణపరమాత్మను సేవించుటకును బయలుదేఱెను. గురుశిష్యులు ఇరువురును ఇట్లు అత్యాత్రముతోఁ బోవుచుండఁగా మార్గమధ్యమున నొకయేఱు అడ్డువచ్చెను. అది కూలంకషముగ ప్రవహించుచుండెను దాఁటుటకు యానపాత్ర మేమియుఁ గూడ లేకపోయెను. ఇదిచూచి నానకు "ఓనదీ, నీవు శిలాత్వమును వహింపుము" అని విధించి ఏటి కడ్డుపడియెను. మహామహిమాభిరాముఁడు; గావున నానకు ఘంటాపథము మీఁదవలెనే నడచిపోవసాగెను. అది చూచియు మర్దనుఁడు నీటిలో దిగుటకు వెఱచి గట్టుమీఁదనే యుండిపోయి నానకు ఏఁబది భుజ్ఞువద్ధి

గజములదూరము పోవునంతదనుక నూరకుండి పిదప "గురుదేవా, నేనిచ్చటనే యున్నాను. ఏటిలో దిగుటకు నాకు భయ మగుచున్నది" అని గొంతెత్తి పలికెను. అదివిని నానకు వెనుదిరిగి చూచి మందహాసము గావించి "భయమువలదు. గురుపాదపద్మములను నిశ్చలభక్తితో ధ్యానించుచు ఏటిలో దిగివెంటరమ్ము. అట్లయిన నీకేదియు నపాయము సంభవింపదు" అని పలికెను. మర్దనుఁడు అట్లే చేసెను. గురుదేవుని ప్రభావమువలన మర్దనుని దేహము మొలవఱకుమాత్రమే నీటిలో మునిఁగెను. కొన్నినిమిషములకు గురుదేవుని సమీపించి ఆతఁడు గురువు వెనుక మఱికొంతదూరముపోయినతరువాత "నాయాజ్ఞ మాత్రము ఏల చెల్లదు?" అని తలంచి "శిలాగర్వము వహింపుము" అని నదినిఁ జూచి పలికెను. వెంటనే ఆతని దేహము కంఠమువఱకు మునిఁగిపోయెను. క్రొత్తది రాకపోవుటయేగాక ఉన్నదిగూడ ఊడుటవలననునోటిలోనికి నీరు వచ్చుచుండుటవలనను మర్దనుఁడు భయప్రకంపితుఁడై "గురుదేవా, చెడితిని. రక్షింపవలయును". అని కేకవేసెను. నానకు వెనుదిరిగి చూచి "గురుపాదస్మరణ మఱచితివా? యేమి" అని పలుకఁగా మర్దనుఁడు తొల్లిటివలెనే చేసెను. తోడనే ఆతని దేహము మొలవఱకును తేలెను. కొంతసేపటికి వారు తీరమునకుఁ బోయి మక్కాపట్టణము సమీపించిరి.

అందలివారెల్లరును అన్నమును గోమాంసమును విక్రయించువారు. దయాదాక్షిణ్యములు లేనివారు. విశేషించి భారతీయులను ఆనగరమున అడుగుపెట్టనీయనివారు. మఱియు అతిరహస్యముగ భారతీయు లందు ప్రవేశించినను తెలిసినచో వారిని వెంటనే వారు సంహరించివేయుదురు. ఇదియంతయు తెలిసినవాఁడు గావున నానకు తన ప్రభావమువలన తన శిష్యునితోఁగూడ బరులకు కాన్పింపకుండునట్లు మాయ కల్పించుకొని తిన్నఁగా శ్రీకృష్ణాలయమునకుఁ బోయి చేరుకొనెను. అచ్చట నొక తురకవాఁడు కాపు కాయుచుండెను. వాఁడువారినిఁ జూచి "మీరెవరు? మీలో నొకఁడు భారతీయుఁడుగా నున్నాఁడు భారతీయులు ఇచ్చటకు వచ్చుటకు వలనుపడదు. కావున తీసికొనివచ్చినందుకు నిన్నును వచ్చినందులకు భారతీయుని సంహరింపవలసియున్నది. ముందుగా మీరు ఇచ్చటకు ఎట్లు వచ్చితిరో తెల్పుఁడు" అని గర్జించుచుపలికెను. అందులకు నానకు మందహాసముగావించి "నీవు పెద్దప్రశ్న

వేయుచున్నావు! గాని దానికి మేమిచ్చు సమాధానము నీకర్థము గాదు. పర్యవసానము వినుము. మావలన కానిది యేమియు లేదు. నీవలన నగునదిగూడ అంతకుమున్నే లేదు" అని బదులు చెప్పెను. ఈమాటల మీఁద ఆయవనునకు చిఱునవ్వును ప్రచండకోపమును వచ్చెను. "మీ మాటలు వెంటనే మీతల తీసివేయునంతటి దోషమును జేయుచున్నవి; గాన అందలి యర్థముమాత్రము వినోదమును గొల్పుచున్నది. కావున కొంతతడవు శాంతించెదను. మీవలన కానిది ఏమియు లేదని చెప్పితివిగదా! మేము ఇచ్చటి కృష్ణవిగ్రహమును మట్టిలో పూడ్చియున్నాము. మీరు ఇక్కడనే యుండి క్షణము ఆవిగ్రహము యథాస్థానమునకు వచ్చి యథాపూర్వముగ నుండునట్లు చేయఁగలిగితి రేని నీప్రభావమును నమ్మెదను" అని అడుగఁగా "నీవెంతటివాఁడవు? కూలికై విషముతినిన అధముఁడవు. నిన్నును నీతోడువారిని ఈపనికి నియోగించిన ఇచ్చటి ప్రముఖులను తీసికొనివచ్చితి వేని నా ప్రభావముఁ జూపెదను" అని నానకు అందులకు బదులు చెప్పెను.

వెంటనే వాఁడు మఱియొక భటునిచే కబురుచేయఁగా ఉత్తరక్షణమున ప్రముఖులువచ్చిరి. వెంటనే నానకుని మీలితనేత్రుఁడై చేతులు జోడించి:—

మ. "తరుణాబ్జారుణలోచనద్వయి గృపాసారవేయుమై యొప్ప సా
గరకన్యాకుచకుంభపాళిఁ బులకల్ గన్పట్ట పూసెంద్ర హృ
త్సరసీజంబులు సంచలింప మురళీసంజాతగీతోన్నతి
స్ఫురణన్ రాల్ గరఁగం జరించు హరికై శోరంబు భావించెదన్."
(కృష్ణకర్ణామృతము. ఆ. 1 ప. 18.)

అని ప్రార్థింపఁగా శ్రీకృష్ణుఁడు లీలామానుషవిగ్రహుఁడై సాక్షాత్కరించెను. తురకలందఱును ఈయద్భుతమును జూచి వింతపడుచుండఁగా నానకుస్వామి పాదారవిందములకు సాష్టాంగనమస్కారమాచరించి.

శ్లో. "శ్రీనాథ నారాయణ వాసుదేవ శ్రీకృష్ణ భక్తప్రియ చక్రపాణే,
శ్రీపద్మనాభాచ్యుత కైటభారే శ్రీరామ పద్మాక్ష హరే మురారే."
(ముకుందమాల. ప. 36.)

అని యనేకవిధముల ప్రార్థించెను. పిదపచూచుచుండఁగనే స్వామి అంతర్హితుఁడు కాఁగా తురకలందఱును విస్మితులై నానకు కాళ్లపైఁ

బడి "మహాత్మా, నీప్రభావము అనితరసాధ్యము. శ్రీకృష్ణవిగ్రహమును పాతిపెట్టి తీరనియపరాధమును గావించిన మమ్ము రక్షింపవలయును" అని ప్రార్థించి వారిలో ధర్మబుద్ధిగల కొందఱు వెంటనే నానకు శిష్యులైరి.

ఇది మొదలుకొని కొలఁదినిమిషములకే నానకు స్వదేశోన్ముఖుఁడయ్యెను. కొంతసేపటికి ఆతఁడు శిష్యసహితుఁడై ఎత్తయిన కొండలపొడుగున నంటి పాఱుచున్న ఒక యేటిని సమీపించెను. ఆనది కుఱుంకపమై ప్రవహించుచుండుటచే ఒక రాజు దానిని దాఁటవచ్చియు దాఁటలేక దారితెన్నులు తెలియక యంతలో నానకును జూచి మహాత్ముఁడుగా శంకించి "ఏరు దాఁటు నుపాయము సెప్పవలయును" అని ప్రార్థించెను. అంతట నానకు కరుణించి ఒక చిన్నకాగితముతో ఒక చిన్న పడవను జేసి ఇచ్చి "రాజా, దీనిపై నీపరివారమంతటితో నెక్కుదువని ప్రయత్నము లేకయే నిన్నిది యద్దరికిఁ జేర్చును" అని చెప్పి శిష్యుని వెంటనిడుకొని "శిలాత్వము వహింపుము" అని నదికాజ్ఞాపించి తొల్లిటివలె దాఁటిపోయెను. అంతట రాజు ఇదిచూచి మిగుల నచ్చెరువడి ఆచిన్నిదోనెను నీటిలో వేసి చాల ధైర్యముతో దానిపై నెక్కెను. అది రాజు ఎక్కిన వెంటనే మఱియొకనికి చోటిచ్చెను. మఱియొకఁ డెక్కఁగా మఱియొకనికి జోటిచ్చెను. ఇంకొకఁ డెక్కఁగా ఇంకొకనికి తావిచ్చెను. వేఱొకఁ డెక్కఁగా వేఱొకనికి స్థలమిచ్చెను. ఈతీరున పరివారమంతయు ఎక్కిన వెంటనే ఆదోనె విమానమువలె క్షణములో నవ్వలిగట్టుఁ జేరెను. అంతట రాజు పరివారముతోఁ గూడ తీరముఁ జేరి తనకంటె ముందుగనే నానకు నచ్చటకు వచ్చియుండుటఁ జూచి మఱింత వింతపడి సాష్టాంగ మాచరించి "మహాత్మా, నీవు లీలామానుషవిగ్రహునివలె తోఁచుచున్నావు. కరుణించి నాకు తరుణోపాయము సెప్పవలయును" అని ప్రార్థించెను. నానకు అందులకు ఆనందించి అష్టాక్షరీమంత్రము నుపదేశించి "అచంచల భక్తితో దీనినుపాసింపుము. నారాయణుఁడు నీకు సాక్షాత్కరించును" అని చెప్పి ఆతనిని పంపివేసి తాను స్వదేశమును చేరుకొనియెను.

పిదప కొన్నిదినములకు ఆతఁడు పునహానగరము చేరుకొనియెను. అచ్చట అంతకుపూర్వమే వచ్చియున్న గోరక్షకులు కొందఱు వచ్చి నానకుని సేవించి "మహాత్మా, నీప్రభావము అత్యద్భుతము. అశ్రుతపూర్వము. మీదర్శనమువలన మేముతరించితిమి. రేపు హరిద్వారమునకు ఒక్క

ముహూర్తమున నాలుగులక్షల హరిదాసులు చేరనున్నారు. ఇంతవఱ
కును వారికి అన్నప్రదానము సేయు మహాత్ము లెవరును కాన్పించుట లేదు.
ఎంతో ప్రయత్నము చేసినఁగాని అది నేఱవేఱదు. ఎంతధనవంతు
లైనను ఇంత స్వల్పవ్యవధిలో ఆపని సేయఁజాలరు; గావున మీరు
పూనుకొనవలసియున్నది. లేకున్న ఆహరిదాసు లందఱును క్షుధార్త
లగుటయు తన్మూలమున దేశమునందలి జను లెల్లరును పాపభాజను
లగుటయు సంభవించును. మహాప్రభావసంపన్ను లగుట మీరొకక్షణ
ములో నిర్వహింపఁగలరు; గావున మిమ్ము ప్రార్థించుచున్నారము" అని
పలికిరి. "ఏలినవారల చిత్తములకు వ్యతిరేకము సేయుటకు సాహసింప
జాలను. కావున తాముగూడ అచ్చటికి విజయముచేసి నేనొసఁగు హ
స్తోదకము స్వీకరించి నన్ను తరింపఁజేయవలయును. మఱి మావిశేష
ప్రార్థన మేమనఁగా, హరిదాసు లందఱును అచ్చటకు వచ్చి తమ్మాదరిం
చువారు ఎవ్వరును లేమి తల్లడంబందుదురు; గావున అట్టిది సంభవింప
కుండ 'నానకు దేవరవారలకు తీర్థోదకము నిచ్చి సేవించును' అని ముం
దుగ మీరుపోయి అచ్చట చాటించవలయును" అని నానకు బదులు
చెప్పెను. తోడనే గోరక్షకులు తమతపఃప్రభావమువలన ఆకాశమార్గ
మున బయలు దేఱిపోయిరి.

గోరక్షకులు మఱునాఁడు ఉదయము జామున్నర ప్రొద్దెక్కిన
ప్పటికి హరిద్వారము చేరుకొని అచ్చట హరిదాసులు నాల్గులక్షలమం
దియు ఒకచో గుమిగూడి యుండుటఁ జూచి క్రిందికి దిగి "భక్తాగ్రేస
రులారా! నేఁడు విచారింపకుఁడు, నానకుదాసులు అన్నప్రదానము సే
యుదురు. ఒక్క క్షణము తాళుఁడు. కంగారుపడి ఎచ్చటకును బోవల
దు" అని చెప్పిరి. ఇదివిని హరిదాసు లందఱును ఒక్కమాఱు పకపకన
వ్విరి. ఆనవ్వువలన బ్రహ్మాండభాండ మంతయు నిండిపోయెను. వారిలో
కొందఱు "అయ్యా, మీరింకను తప్పుత్రోవనే యున్నారు. నానకుదా
సులు వచ్చి మాకు మృష్టాన్న మొసఁగుటయు దివ్యతాంబూలములు
ఇచ్చుటయు ఇంతకు పూర్వమే జరిగిపోయెను. ఇఁక మీకు శ్రమయేల?"
అని పలికిరి. ఇదివిని గోరక్షకులు వింతపడుచుండఁగా నానకు అచ్చటకు
వచ్చెను. ఆతనిం జూచి గోరక్షకులు తటాలున సాష్టాంగము లాచరించి
"మహాత్మా! మీప్రభావము నెఱుంగఁజాలకపోయితిమి. మీవంటి భాగ

నతాగ్రేసరులు ఇఁక లేరు" అని కొనియాడి యథేచ్ఛగా ఆకాశమార్గమునఁబోయిరి. నానకు తన మఠమునకుఁ బోయి చేరుకొనియెను. ఆతఁడు బ్రతికియున్నంతకాలము ఇట్లనేకమహాద్భుతకార్యములను జేసి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను.

ఉ. "చల్లనివాని నవ్వు కెదఁజల్లెడువాని దయారసంబు జొ
బ్బిల్లెడువానిఁ గెంపుజిగి పెంపు సెలంగెడుమోవివాని సం
ఫుల్ల సరోజనేత్రములఁ బొల్చినవానిఁ బయోధిపీఠికా
వేల్లితసల్లలీలదనకీనతిమగ్నతివానిఁ గాంచెదన్"

(కృష్ణకర్ణామృతము ఆ. 3 ప. 17.)

44. నరసింహామేధ.

శ్లో. "ముగ్ధం స్నిగ్ధం మధురమురలీమాధురీధీరనాదైః
కారం కారం కరణవివశం గోకులవ్యాకులత్వమ్,
శ్యామంకామం యువజనమనోమోహనం మోహనాంగం
చిత్తే నిత్యం నివసతు మహో వల్లవీవల్లభం నః."

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 50.)

ద్వారకాపురమునుండి పిపాజిరాజు భార్యతోఁగూడి కాశీనగరమునకుఁ బోవుచుండెను. ఆదంపతులిరువురును భక్తశిఖామణులు. వారు గురుదేవుఁడగు శ్రీరామానందస్వామిని దర్శింప వారణాసీనగరమునకుఁబోవుచుండఁగా నొక భీకరమగు శార్దూలము అడ్డువచ్చెను. దానిని జూచి రాణి చాల భీతిల్లెను; గాని భర్త తత్త్వము నుపదేశించుట వలన భీతిమాని దానిని చెంగటకుఁ బిలిచెను. ఎంతో కోపముతో వారిపైఁ బడవచ్చిన ఆబెబ్బులి ఆమె పిలిచినవెంటనే మిగుల సాధువై వారి సమీపమునకుఁ బోయెను. అంతట రాజు బుజ్జగించి దాని చెవిలో తారకమంత్రమును ఉపదేశించెను. అదిమొదలుకొని శుద్ధసాధుస్వభావముతో వర్తించుచు ఆబెబ్బులి కొలఁదిదినములయందే ఆవ్యాఘ్రదేహమును జాలించి పురాతనవటము అనుగ్రామమున ఒక బ్రాహ్మణునకు కుమారుఁడై పుట్టెను. తలిదండ్రులు ఆబిడ్డకు నరసింహామేధ అని పేరుపెట్టిరి.

నరసింహామేధకు ఏడుసంవత్సరముల వయస్సు వచ్చునప్పటికి తలిదండ్రులు ఇద్దఱును ఒక్కమాఱుగ పరమపదించిరి. అదిమొదలు పినతండ్రియు, అన్నయు ఆతనిం బెంపఁజొచ్చిరి. తలిదండ్రులను గోలు పోయిన పసిపాప యగుటవలన వారీతనిని శిక్షింపక చాల గారాబముగఁ జూడసాగిరి. ఈగారాబమువలన ఆతఁడు పెంకెవాఁడును ఆకతాయి యునై కొలఁదిదినములయందే వారిని నిర్భయుఁడై ఎదిరించుచు భోజన సమయమునఁ దక్క తక్కినసమయములయందు తనవంటిబాలకులతో విశృంఖలముగఁ బ్రవర్తింపసాగెను. అయినను అన్నయుఁ బినతండ్రియు ఆతనిని శిక్షింపఁ దలంపుగొనలేదు; గాని వదినెయు పినతల్లియు మఱికొందఱు దగ్గఱి బంధుగురాండ్రును "మా నరసింహామేధ అదృష్టవంతుఁడు. ఆతని పాప లేశమువలన పెండ్లియగుట తటస్థించునేని ఈతనికి పెండ్లాముగొడవ లేమియు నక్కఱ లేదు. అది భుజించిన భుజించితివా యని యడుగఁడు. లేకున్న మానితివా? యని యడుగఁడు. ఇతఁడు ఏమయిన సంపాదించినపుడును ఇతని పాండిత్యమునకు మెచ్చి యెవ్వరైన ఒకదమ్మిడీ ఇచ్చినపుడునుగదా ఆగొడవ? కాదటయ్యా, ముద్దులయ్యా" అని తఱచుగ హేళనము సేయసాగిరి. దీనిని భరింపలేక కొన్నిదినములైనతరువాత ఆతఁడు ఏరికినిఁ జెప్పకుండ దిక్కుతెలియకుండ పాఱి పోయెను.

పోయిపోయి ఆతఁడొక మహారణ్యమును బ్రవేశించెను. భయంకరమగు నాగహానము సొచ్చునప్పటికి ఆతని కాయాసము తోఁచెను. అగుట నాతఁడొకచెట్టునీడను గూర్చుండి "దీనికై విచారింపవలసిన పని లేదు. వారు నన్ను హేళనము సేయుట కట్టి మాటలాడినను అవి నాకుతొల్లి ధ్రువునకు సవతితల్లి మాటలువలె జ్ఞానోదయమునకే హేతువులైనవి. నానెత్తిమీఁద తాండవమాడుచుండిన శని నేను బయలుదేరినపుడే తొలఁగిపోయెను. ఇఁక నేను అంతములేని సంసారసాగరమునఁ గూలక మోక్షమార్గమునఁ బ్రవేశించెదను" అని యనుకొని తటాలున లేచి ముందునకు బయలుదేఱెను. కొంతదూరము పోవునప్పటికి ఒక శివాలయము గాన్పింపఁగా నాతఁడు అట్టినిర్జనారణ్యమున దేవాలయ ముండుటకు వింతపడి "సంగతి యేమో చూచెదను" అని తలంచి ధైర్యమునవలంబించి లోనికి పోయెను; కాని అందెవ్వరును గాన్పింపలేదు.

అయినను జంకక ఆతఁడు అందలి మహాలింగము నెదుట మోఁకరించి నిలిచి చేతులు జోడించుకొని,—

సీ. "దేవా జగన్నాథ దేవేంద్రవందిత వితతచారిత్ర సంతతపవిత్ర
హాలాహలాహార యహిరాజకేయూర బాలేందుభూష సద్భక్తపోష
సర్వలోకాతీత సద్గుణసంఘాత పార్వతీహృదయేశ భవవినాశ
రజితాచలస్థానగజచర్మపరిధాన సురవైరివిధ్వస్త శూలహస్త
తే. లోకనాయక సద్భక్తలోకవరద, సురుచిరాకార మునిజనస్తుతివిహార
భక్తజనమందిరాంగణపారిజాత, నిన్ను నెవ్వఁడు మతిసేయ నేర్చు నభవ?"

(భాగవతము. స్కం. 10. ప. 302.)

అని అనేకవిధముల సన్నుతిసేయఁదొడఁగెను. ఈసందర్భమున నాతని హృదయము పార్వతీరమణునియందు సంపూర్ణముగ లీనమైపోయెను. ఇట్లుండఁగనే ఏడుదినములు గడచిపోయెను. అంతట మహేశ్వరుఁడు ఆతని స్తోత్రపద్ధతికిని మనోనైర్మల్యమునకును పరమానందభరితుఁడై సాక్షాత్కరించి "వత్సా, నీభక్తికి మెచ్చితిని. నీ కేమి కావలయునో కోరుకొనుము" అనిచెప్పెను. అందులకు నరసింహమేథ ఉప్పొంగిపోయి "చంద్రశేఖరా, మునికులతిలకులకుఁగూడ అగోచరుఁడవగు నీవు సాక్షాత్కరించుటవలనను, కావలసినది కోరుకొనుమనుటవలనను నేను ఆనందపరవశుఁడనై యున్నాను. గావున నా కేమి కావలయునో నాకుఁ దెలియుటలేదు. కావున నీకు అత్యంతప్రియతమ మగు వస్తు వేదియో దానిని అనుగ్రహింపుము" అనికోరెను. ఇదివినఁగనే శివునకు చిఱునవ్వు వచ్చెను. అంతట నాతఁడు నరసింహమేథ వీపుపైఁ దట్టుచు "వత్సా, తెలియదనుచునే సనకసనందనాదులకుఁగూడ అగోచరమగు పదార్థమును గోరితివి. నాకు ప్రియతమ మగు వస్తుజాలమునం దెల్ల గుణకృష్ణుఁడు ప్రియతముఁడు. కావున ఆతనిని నీకిచ్చుచున్నాను." అని ఆతనిని వెంటనిడుకొని యమునాతీరమునకుఁబోయెను. తోడనే ఆగోపాలుఁడు పశుపతిచెంతకు వచ్చెను. శ్రీహరియు శ్రీకంఠుఁడును ఒకరితో నొకరు ముఖ్యవిషయములను ముచ్చటించుకొనుట యైన తరువాత నరసింహమేథ ప్రస్తావము వచ్చెను. అపుడు మహేశ్వరుఁడు నరసింహమేథచే శ్రీకృష్ణునకు సాష్టాంగనమస్కారము లాచరింపఁజేసి సంగతిసందర్భములన్నియు నెఱింగించెను. ఇది విని శ్రీకృష్ణుఁడు నరసింహమేథను చేరదీసి "వత్సా, నీవు భాగ్య

వంతుఁడవు కావుననే ఈమహాత్ముని దర్శనము లభించినది. లోకకళ్యాణ సంధాత యగు పరమశివునియనుగ్రహమునకు పాత్రుఁడైనవానికి ఇఁక లేనిదేమున్నది? నీభక్తికి ఆనందించితిని. నిన్ను నాయంతరంగభక్తుల లో జేర్చుకొని నీహృదయమునందు నివసించి యుండెదను. నీవు ఇఁక అజ్ఞానపతితమైయున్న లోకము నుద్ధరింపుము" అని నియమించి శంకరునివద్ద సెలవుఁగైకొని వెడలిపోయెను. పిదప నీశ్వరుఁడు నరసింహమేధను వెంటనిడుకొని తన యాలయమునకు వచ్చి "వత్సా, ఇఁక నీకు లోపములేదు. శ్రీహరి యంతరంగభక్తుఁడవైతివి" అని చెప్పి తిరోహితుఁడయ్యెను.

ఆనిమిషము మొదలుకొని నరసింహమేధ నిద్రాహారములను లెక్కసేయక అహోరాత్రములు శ్రీకృష్ణగుణకీర్తనము గావించుచు ఆశివాలయమునందే యుండెను. కొన్ని దినములకు ఆతని కొఱకు దేశమంతయు వెదకుచున్న ఆతని యన్న అచ్చటకు వచ్చి అనేకవిధముల బోధించి యింటికిఁ గొనిపోయెను. ఆయూర నుండిన యొక బ్రాహ్మణుఁడు నరసింహమేధ ప్రభావమును జూచి ఆశ్చర్యపడి తన కుమార్తెను ఆతనికిచ్చి పెండ్లి చేసెను.

కొన్నిదినములకు నరసింహమేధకు చాలమంది కుమారులును కొమార్తలును గలిగిరి. ఈతీరున సంసారము పెరిగిపోయినను ఆతని హృదయము శ్రీపాండురంగని పాదకమలములనుండి ఒక క్షణమైనను వియోగమును బొంది యెఱుఁగదు. ఇట్లు అచంచలభక్తితో ఆతఁడు కాలము గడుపుచుండుటఁ జూచి ఎఱిఁగినవా రందఱును ఆశ్చర్యపడుచుండిరి. మఱికొన్ని దినములకు ఆతని పెద్దకుమారుఁడు వివాహయోగ్యుఁడయ్యెను.

పురాతనపటమునకు సమీపమున శ్యామలాపురము అను నొక గ్రామము గలదు. అందు త్రిపురాంతకుఁడు అను నొక బ్రాహ్మణుఁడు వర్తకమువలన అసంఖ్యధనమును సంపాదించుచు మహావైభవముల ననుభవించుచుండెను ఈసమయమునకే ఆతనికొమార్తగూడ వరయోగ్య యయ్యెను. అది చూచి త్రిపురాంతకుఁడు కృష్ణభట్టు అను తనపురోహితుని రావించి "మహాశయా, అమ్మాయి ఇపుడు వరయోగ్యయై యున్నది. నీకంటె మాకు మనసుకలసినవారును మామంగళమునుగోరు

వారును లేరు. కావున నీవు పోయి తగిన వరుని వెదకి నిశ్చయించుకొని రమ్ము" అని చెప్పెను. వల్లెయని కృష్ణభట్టు ఇంటికిబోయెను.

కృష్ణభట్టు హృదయము ఆలోచనాధీనమయ్యెను. "త్రిపురాంతకుఁడు సదాచారసంపన్నుఁడు. సత్కులప్రసూతుఁడు. చాల మర్యాదకలవాఁడు. వధువుగూడ అన్నిఁటను ఎన్నఁదగినది. ఈప్రాంతములయందు ధనవిషయమునఁ దక్క తక్కిన సకలవిషయములయందును, ఒక్క నరసింహ మేధ తక్క త్రిపురాంతకునకు సాటియగువారు మఱియెవరును లేరు. ధనమున త్రిపురాంతకుఁడు కుబేరుఁడైనచో భగవత్సేవయందు నరసింహమేధ ప్రహ్లాదునియంతటివాఁడు. విషయములు భిన్నములైనను ఇరువురును గూడ మహోన్నతులు. వీరి బాంధవము చాల బాగుగ నుండును" అని తలఁచి కృష్ణభట్టు వెంటనే బయలుదేఱి పురాతనవటమునకుఁ బోయి నరసింహమేధతో ఈప్రస్తావన చేసెను. వెంటనే నరసింహమేధ యంగీకరించెను. మఱునాఁడే కృష్ణభట్టు శ్యామలాపురమునకుఁబోయి సంగతి యంతయు త్రిపురాంతకునకు ఎఱింగించెను.

ఈసంబంధము త్రిపురాంతకుని కుటుంబమును గుసగుసలకు మూఁతి విఱుపులకును హేతువయ్యెను. దీనిని గుఱించి త్రిపురాంతకుఁడు చాల యోచించెను. "నరసింహమేధ మహాభాగవతశిఖామణియే కావచ్చును; గాని యాతనికి ధనము లేదు. వైభవము లేదు. ఒక్కపూటకైన గంజయైన పూర్తిగ లేదు. ఆతనితో నాకేటి వియ్యము? అయినను కృష్ణభట్టు నిశ్చయించుకొనివచ్చెను; గావున వలదనుటకు వీలు లేదు. ఏలోపమునను నరసింహమేధమీఁద పడవలెనుగాని నామీఁదికి రాకూడదు. ఇందులకు తగిన తంత్రము పన్నెదను." అని యోచించి మఱల కృష్ణభట్టునిఁ జూచి "రేపే వివాహమునకుతగిన దినమై యున్నది. రేపటి ముహూర్తము దాఁటినచో మఱల నేనింతలో వివాహప్రయత్నము జేయఁజాలను. నావైభవమునకు తగినట్లు రాఁగలఁడేనినరసింహమేధను రమ్మనుము. లేకున్న నీవు చేసిన నిశ్చయమునకు నేను బాధ్యుఁడను కాఁజాలను" అని చెప్పెను. కృష్ణభట్టు పోయి యాసంగతి తెలుపఁగా నరసింహమేధ మందహాసము గావించి "అన్నిటికిని పాండురంగఁడే కలఁడు. రేపటికే నేను తరలివచ్చెదను" అని బదులు చెప్పెను. ఈసంగతి కృష్ణభట్టు వెంటనే త్రిపురాంతకునకు ఎఱింగించెను; కాని త్రిపురాంతకుఁడు

వానిని నమ్మక "అయ్యా, ఏల నీకీ వెఱ్ఱి? కేవలము జడమతి యని పేరు గొన్న నరసింహమేధ ఇట్లు చేయఁగలఁడని నీవు నమ్మియే నీవు నాకీ మాట చెప్పవచ్చితివా! ధనవంతుఁడే ఇంత యవ్యవధిగా మహావైభవమును సమకూర్చుకొని వచ్చుట కష్టము. అట్టిచో పూటకు దిక్కులేని నరసింహమేధ ఎట్లు రాఁగలఁడు? నీకెంత వెఱ్ఱి! కుంటియైనవాఁడు ఓడముం దెక్కినట్లు ఆనిర్ధనుఁడు పెండ్లికొడుకును వెంటఁబెట్టుకొని రావచ్చును. అది నాకేకాదు. నా సేవకునకైన అర్హమైన వైభవమా? అట్టి వానితో నేనెట్లు సంబంధము సేయఁగలను?" అని పరిహసించుచు పలికెను. అందులకు కృష్ణభట్టు అసంతృప్తుఁడై "ఓ [illegible], నీవు యోచింపకుండ పలుకుచున్నావు. ధనమును బట్టియే నీవు గొప్పతనము గొల్చుచున్నావు; గాని మనస్సును బట్టి గాదు. ఆతని మహిమను నీ వెఱుంగవు. సర్వశక్తుఁడగు భగవంతుఁడు ఆతని పాలఁ గలఁడు. అగుట నాతనికి అసాధ్యము లేదు. పరమభాగవతోత్తములు నీవంటివారికి జడప్రాయులై తోఁచవచ్చును. కాని మీయూహయే యథార్థము కాదు నిజముగ నీవు గర్వము విడిచి తగు సన్నాహముతో నుండవేని రేపు శృంగభంగము గాక తీఱదు. నేను నీకళ్యాణమును కోరవలసినవాఁడను గాన సంగతి చెప్పుచున్నాను" అని చెప్పెను.

అట నరసింహమేధ వేకువను మేల్కాంచి స్నానసంధ్యాద్యనుష్ఠానము లన్నియు నెఱవేర్చుకొని బంధువులు, మిత్రులు, భాగవతులు, మున్నగువారిని వెంటఁబెట్టుకొని మద్దెల తాళము మొదలగు మంగళ వాద్యములు బోరుకలంగ శ్యామలాపురమునకు బయలుదేఱెను. శ్రీకృష్ణుఁడు, బంధువులు, మిత్రులు, స్నేహితులు, ఆశ్రితులు, భాగవతులు, తన అంతఃపురము మున్నగు సకలపరివారముతోడను వచ్చి నరసింహమేధను గలిసికొనెను. దేవతలు అందఱును వచ్చిరి. పిదప అందఱును ఒక్క క్షణమునకు శ్యామలాపురము సమీపించిరి.

ఊరి బయట అందఱును ఒకచో విశ్రమింపఁ జేసి శ్రీకృష్ణుఁడు దూతల నంపి తమ రాకను త్రిపురాంతకునకుఁ దెలియఁబఱచెను. వెంటనే వెడలిపోయి ఊరివా రందఱును వెంట నిడుకొని అచ్చటకు వచ్చి అచ్చటివా రెల్లరును మహాతేజస్సంపన్నులై ఉండుటఁ జూచి తొలుత ఒక్కొక్కరికే నమస్కరింపఁ దొడఁగి అది సాధ్యముకామి

తుదకుఁ జేతులెత్తి సాముదాయికముగ నందఱకును మ్రొక్కి లజ్జ వలన నరసింహమేధ చెంతకు పోలేక పోలేక ఎట్లో పోయి మాటాడలేక నిలిచెను. అప్పుడు కృష్ణభట్టు ఆచెంతనే యున్న శ్రీకృష్ణుని గాంచి "శ్రీహరీ, మేము చాల సదృష్టవంతులము. నరసింహమేధ కారణముగా మీదర్శనము మాకు కలిగెను; కావున తొలుత ఆభాగవతశిఖామణికిని పిదప ఆ త్రిత్రాణపరాయణుఁడవగు నీకును వందనములు సేయుచున్నాను. ఇందు నీకు కానివా రెవ్వరును లేరు. నీవు నరసింహమేధ పక్షముగ వచ్చితివి. అది నీకు తగునా? త్రిపురాంతకుఁడు కూడ కరుణార్ద్రుఁడు కాఁడా? ఈపక్షపాతము నీచేఁ జూపఁబడవచ్చునా? వారితోఁగూడి తరలివచ్చితివి. వీరితోఁగూడి ఈకార్యభారమంతయు వహింపుము. ఈయుభయుల కీర్త్యపకీర్తులును మంచిచెడ్డలును నీవే" అని విన్నవించెను.

అందుల కేమియు మాఱువల్కక శ్రీహరి త్రిపురాంతకునిదిక్కు మొగంబై "నిన్న నీవు కృష్ణభట్టుచే మావైభవమునకు తగినట్లు తరలి రావలయునని నరసింహమేధకు వర్తమానము చేసితివి. నరసింహమేధ తనకుఁ దగిన వైభవముతో వచ్చెను. నీవు చేసినసన్నాహ మేమో చూపుము" అనెను. దీని కేమియును తోఁచక త్రిపురాంతకుఁడు ఊర కుండఁగా శ్రీకృష్ణుఁడు "వివాహశ్చ వివాదశ్చ సమయో రేవశోభతే" అనునట్లు వియ్యము తుల్యులకే తగును. నీవు మాత్రము ఈన్యాయ మెఱుఁగవా? మావైభవమునకు నీసంబంధము తగని దని నీవే యెఱుఁగుదువుకదా? అయినను ఇంతదూరము వచ్చి వచ్చినపని చేసి కొనకుండ మఱలిపోవుట మాకు మర్యాద కాదు. తొలుత మీసన్నాహ మంతయుఁ జూపుము" అని మఱల నడిగెను. ఈతర్జనభర్జనములవలన త్రిపురాంతకుని హృదయము కలఁగిపోయెను. ఆతనికి కర్తవ్యజ్ఞానమును వక్తవ్యజ్ఞానమునుగూడ తొలఁగిపోయెను. తుదకాతఁ డేమియుఁ దోఁచక "మీ రెవరు?" అని శ్రీకృష్ణుని ప్రశ్నించెను. శ్రీకృష్ణునకు నవ్వువచ్చెను. అంతలోనే దాని నాపుకొని ఆతఁడు "ఓయి, నీవు ద్వారకానగరము ఎఱుఁగుదువుకదా? అందలి వర్తకులలో నరసింహమేధ అగ్రస్థానమును వహించియున్నాఁడు. ఆపురమున ఈతనికి అనేకవర్తకశాలలు గలవు. అచ్చటి పనియెల్లఁ జూచుటకు ఈతఁడు నన్ను నియమించి

యున్నాఁడు. ఇపుడు తన కుమారునకు పెండ్లియనియు ఈవివాహ సంబంధములగు కార్యము లన్నియు నీవే నెఱవేర్పవలసిన దనియు ఈ నరసింహమేధ వర్తమానము సేయుటచే నేను వచ్చితిని. నావృత్తాంత మిది. మీపురోహితుఁడగు కృష్ణభట్టు మాటలవలన నీసంగతిఅంతయుఁ దెలియనైనది. ఇఁక నాలోచింపవలదు. నీవు పోయి నీబంధుమిత్రాదులను రమ్మని వార్త సేయుము" అని పలికెను. ఈనియమనమువలనను కృష్ణభట్టు తొందఱ పెట్టుటవలనను నరసింహమేధ ఆపని సేయుటకై పోయెను. తోడనే శ్రీకృష్ణుఁడు విశ్వకర్మనుస్మరించి "వివాహమంటపము మున్నగు సకలమును ఏర్పాటు సేయుము" అని ఆజ్ఞ యిచ్చి "తక్కిన వన్నియు మీరు నెఱవేర్పుఁడు" అని కామధేనువునకును కల్పతరువునకును ఆజ్ఞ యిచ్చెను.

మఱి పదినిమిషములలో అన్నియు సిద్ధమయ్యెను. బంధుమిత్రాదు లందఱను జేర్చుకొని త్రిపురాంతకుఁడు వచ్చెను. శచీదేవి మున్నగు దేవతాస్త్రీలు పెండ్లికొమార్తెను అలంకరించి తెచ్చిరి. వివాహము భూనభోంతరాళములు బోరుకలంగ మహావైభవముతో నెఱవేఱెను. అందఱును స్వస్థానమునకుఁ బోయిరి. నరసింహమేధ పురాతనవటము సేరిన తరువాత శ్రీకృష్ణుఁడు ఆతనిని చేరఁబిలిచి "వత్సా, నీకేమియు చింతవలదు. నీకేమియు లోపము లేదు. నీవు నాయంతరంగభక్తుఁడవు. వలసినపు డెల్ల ఇట్లే నేను నీకన్నియు నెఱవేర్చుచుందును." అని చెప్పి సపరివారుఁడై అంతర్హితుఁ డయ్యెను.

భగవల్లీలకు విచిత్రపడుచు నరసింహమేధ ఆనందపరవశుఁడై కాలము గడపుచుండఁగా పురాతనవటమునకు కొందఱు సాధువులు వచ్చిరి. వారు ద్వారకాయాత్ర సేయుటకై బయలుదేఱినవారు. వారి చెంత ఆఱువందల వరాలు ఉండెను. మార్గమధ్యమున చోరులవలన అపాయము కలుగవచ్చునని శంకించి వారు ఆవరాలకు మాఱుగ హుండీని గొనిపోవ నిశ్చయించుకొనిరి. కావున వారు "ఈగ్రామమున ద్వారకయందలి వర్తకులకు హుండీని ఇచ్చువారలు గలరా" అని ప్రశ్నింపఁగా నరసింహమేధ భాగ్యమును జూచి ఓర్వలేని కొందఱు మహానుభావులు "నరసింహమేధచెంతకుఁ బోయితిరేని మీయభీష్టము

నెఱవేఱును" అని చెప్పిరి. అంత నాసాధువులు నరసింహమేధ చెంతకుఁ బోయి సంగతియంతయు నెఱింగించిరి.

తొలుత నరసింహమేధ తెల్లవోయెను. పిదప అబ్బురపడెను. పిమ్మట గడగడలాడెను; గానితుదకు ధైర్యము తెచ్చుకొని "ఇట్టిదిగలదా? ఇది యేమో భగవంతుని మాయగా నున్నది. నేను పూటకు దిక్కులేని వాఁడ నని ఈగ్రామమున ఆబాలగోపాలముగ నందఱకును దెలియును. అయినను వీరిని ఎవరో నాచెంతకుఁబంపిరఁట. దీని యాంతర్యంతము లేమియు బోధపడుట లేదు. అంతయుఁ జూడఁగా ఇది ఈశ్వరోద్దేశమనితోఁచుచున్నది; కావున ఈయాఱువందల వరాలను స్వీకరించెదను. ఈరొక్కమును దీనజనులకు నాచేతులతో పంచిపెట్టుట భగవంతుని సంకల్పము. ద్వారకయందు సర్వాధారుఁడగు శ్రీకృష్ణపరమాత్మ యే నాకుదిక్కై యున్నాఁడు ఆమహాత్ముఁడు నాఁడు శ్యామలాపురమున త్రిపురాంతకునితో తాను ద్వారకయందు నావర్తకము చక్కఁబెట్టు నాప్రతినిధి నని చెప్పినమాటలకు ఇదియే యర్థమని తోఁచుచున్నది." అనితలంచి ఆవరాలను గైకొని "వీరు నాకు ఆఱువందల వరాలు చెల్లించినారు. వీరినిఁ జూచిన వెంటనే ఈహుండీని గైకొని ఆసొమ్ము ఇచ్చివేయునది" అని ఒక వర్తకుని పేర హుండీ వ్రాసి సాధువులకు ఇచ్చివేసెను.

నిర్విచారముతో సాధువులు ద్వారకానగరమునకుఁబోయి ఒకటి రెండు దినము లైన తరువాత ధనము అవసరము కాఁగా హుండీమీఁద వ్రాయఁబడిన పేరుగలవర్తకుని వెదుకసాగిరి. నాలుగైదుదినములు వెదకిరి; గాని ప్రయోజనము లేదయ్యెను. ఎవరు చెప్పినను "పూటకు గతిలేనినరసింహమేధకు ఈయూర వర్తకశాల లననేమి? వానికి ప్రతినిధి యననేమి? వానిపేర హుండీ యననేమి? ఇందేమియు అర్థము లేదు. కేవలము మోసము. శుద్ధముగ వంచనము. మీయాఱువందల వరాలును బుగ్గియైపోయినవి" అనియే చెప్పసాగిరి. సాధువులు తుదకు ఇట్లే నిశ్చయము చేసికొనిరి. తోడనే వారి నవనాడులును గ్రుంగిపోయినవి. మీఁది ప్రాణములు మీఁది కెగిరిపోయినవి తుదకు చేయునది లేక వారు ఒక నిర్జనస్థలమునందలి ఒక చెట్టుక్రిందఁ గూర్చుండి సావకాశముగ దుఃఖింపసాగిరి.

ఇట్లుండ సర్వాంతర్యామి యగు శ్రీకృష్ణభగవానుఁడు ఒకవర్తకుని వేషమును ధరించి ఒక గుఱ్ఱపుబండిపై నచ్చటకు వచ్చి "మీ రేల దుఃఖించెదరు?" అని వారిని పలుకరించెను. అందులకు వారు "దుఃఖకారణ మేమున్నది? ఆఱువందల వరాలను మేము గంగలో కలుపుకొంటిమి. శ్రీహరికిఁ జేయింపఁదలఁచుకొన్న భోగము లన్నియు కలలోని ముచ్చటలై పోయినవి" అని పలికిరి. అందులకు మందహాసము చేయుచు వర్తకవేషధారియగు శ్రీహరి "బ్రాహ్మణోత్తములారా, ఏల దుఃఖించెదరు? మిమ్మెవరో మోసము చేసినారు. మీ వరాలు పోలేదు. మీ విరోధు లెవరో మీకు భీతి కల్పించియుందురు. మీరు తెచ్చిన హుండీని జూపెదరేని మీ వరాలు మీకు చెల్లించెదను. మీరు పురాతనపటమున నరసింహమేధకు ఆఱువందల వరాలు చెల్లించియున్నారు. ఇది నిజమే కదా! నేను ఆ మహాత్ముని ప్రతినిధిని. నన్ను ఇచ్చట అందఱును ఎఱుఁగుదురు. అయినను ఇచ్చటకు అనేక సాధుజనులు వచ్చుచున్నారు; కావున వారివలన వస్తువులకు హెచ్చువెలలు వేసి చాలధనము సంపాదింపవచ్చునని తలంచుచుండు ఇచ్చటి వర్తకులకు పోటిగా మేము సకలవస్తువులను చాలచౌకగా నిచ్చుచుండుటనుబట్టి మాయెడల ఇచ్చట ననేకులు విరోధము వహించియున్నారు. వారే మిమ్ము ఈదుఃఖముపాలు చేసిరి. నా చెంత ధనము సిద్ధముగా నున్నది. హుండీ జూపెదరేని ఇచ్చివేసెదను" అని పలికెను. సాధువులకు పోయినప్రాణములు తిరిగి వచ్చెను. హఠాత్తుగ వారికి అనంతసంతోషము గలుగుటవలన ఆ యానందము కూలంకషమై వారికి ఉక్కిరిబిక్కిరి ఒదవించెను. కొంతతడవు వారు నిశ్చేష్టులై యుండి ఆ హుండీని జూపిరి. వెంటనే ఆ వర్తకుఁడు ఆ సొమ్ము చెల్లించి అదృశ్యుఁడయ్యెను.

ఒకసాధువు "లెక్కలో పొరపాటు గలిగినట్లు తోఁచుచున్నది" అనియెను. ఇంకొకఁడు లేదనియెను. మూఁడవవాఁడు "సందేహ మెందులకు? మఱల లెక్కింపుఁడు" అనియెను. అందఱును సమ్మతించిరి. లెక్క ప్రారంభమయ్యెను. ఒక్కొకఁడు రెండేసి వందల వరాలు చొప్పున లెక్కించి మూటలుగట్టి వెనుకకుఁ బడవేసిరిగాని ముందున్నగుట్ట మాత్రము తఱుగలేదు. ఇంకొక ఆఱువందలవరాలు తీసిరి; వేఱొక ఆఱువందలవరాలు తీసిరి; గాని గుట్ట తఱుగలేదు. వారికి ఆశ్చర్యము కలిగెను. "ఈతఁడు మానవమాత్రుఁడుఁగాఁడు. మన యదృష్టమువలన శ్రీహరియే ఇటు

మాధవరూపము ధరించి వచ్చెను" అని తలంచుకొని మహానందభరితులై ఆనగరమున నెఱవేర్చుకొనవలసిన వన్నియు తీర్చుకొని వెంటనే బయలు దేఱి పురాతనవటమునకుఁ బోయి నరసింహమేథను సందర్శించి "మహాత్మా, నీప్రభావము ఇట్టి దని యెఱుంగఁజాలకపోతిమి. నీవు కేవలము శ్రీహరికి అంతరంగభక్తుఁడవు. నీయనుగ్రహమువలన అయాచితముగ శ్రీహరి సాక్షాత్కరించి మాకు సేవ యొసంగెను నీవు మాకు చేసిన మహోపకారమునకు కృతజ్ఞులమై యుందుము" అని చెప్పి సెలవుగైకొని వెడలిపోయిరి. నరసింహమేథ ఆవార్తవిని ఆనందపరవశుఁడై నృత్యము గావించెను.

కొన్నిదినములకు నరసింహమేథ కొమార్త రజస్వల యయ్యెను. అప్పుడాతనిభార్య "మన కొమార్తె నిఁక మనయింట నుంచుకొనుట మంచిది గాదు ఆమె యింటికి ఆమెను పంపివేయుటయుక్తము" అని పలికెను. అదివిని వల్లెయని యాతఁడు తన కొమార్తను గొనిపోయి అత్తింట విడిచి, "తల్లీ మన యింట నున్నధనము శ్రీహరిదివ్యనామము. వీనినిగైకొని ఆహరినామమును కీర్తించుచుండుము" అని చెప్పి ఆమెకు తంబురను తాళములను ఇచ్చెను. నాఁడు ఆయూరి స్త్రీలందఱును ఫలానివారికోడలు కాపురమునకు వచ్చిన దఁట. సారె తెచ్చినదఁట. చూచి వత్తమురండు" అని ఆతని యింటికి వచ్చిరి. ఇంటి యజమానుఁడు వారి నందఱను మర్యాదచేసి కూర్చుండఁబెట్టి కోడలిని గొనివచ్చి వారినడుమఁ గూర్చుండఁబెట్టెను. తొలుత అచ్చట స్త్రీలెల్లరును ఆయింటి కోడలిసౌందర్యమునకుఁ జాలమెచ్చుకొని "పిల్లచాల తెలివితేటలైనదే అని తోఁచుచున్నది" అని పలికిరి. ఇట్లు కొంతసేపు ప్రశంస లయిన తరువాత ఒక ముసలమ్మ కండ్లు చికిలించుకొనుచుచూచి "అయితే కోడలు ఏమేమి సారె తెచ్చిన దమ్మా" అని యడిగెను. తోడనే యజమానురాలి ముఖము తుమ్మలలోఁ బొద్దు క్రుంకిన ట్లయ్యెను. ఆడుబిడ్డ ముఖము గుసరుసలాడఁదొడఁగెను. ఆముసలమ్మ మాటవినియు అత్తగారియొక్కయు ఆడుపడుచుయొక్కయు ముఖములు చూచియు కోడలు ముఖము చిన్నబుచ్చుకొనియెను. ఇదిచూచి ఆమెను మఱింత దుఃఖపెట్టుటకు ఆడుపడుచు నరసింహమేథ యిచ్చిన తంబురను తాళములనుదెచ్చి వారి నడుమ నుంచి "ఇదిగో మావదినె తెచ్చిన సారె"

అని సోత్ప్రాసముగఁ బలికెను. అంతటవారిలోనొక స్త్రీ మూతిముడుచుకొనియెను. ఒకతె పెదవులు విఱిచెను. ఇంకొకతె కండ్లు తేలవేసెను. వేఱొకతె పరిహాసము చేసెను. మఱియొకతె "ఏమమ్మా మమ్ము వేళాకోళము చేసెదరు? మీకోడలు తెచ్చిన సారె మేము చూడఁగూడదా?" అని సాగఁదీసికొనుచుఁ బలికెను. చిన్నిపిల్లలు కొందఱు నవ్విరి. ఇదియంతయు నైన తరువాత యజమానురాలు "మాపిల్లవానికిని మాపిల్లకును నాకును లాంఛనములు తీఱుయోగము ఉన్నయెడల మా అబ్బాయికి మొదట వచ్చిన సంబంధమే యైయుండును" అని తల ఆడించుచు వచించెను. ఆడుపడుచు "అమ్మా, నీకేమి వెఱ్ఱి? అన్నకే లేని లాంఛనములు మన కెట్లు తీరును?" అని కన్నులు తేలవేసికొనుచుఁ బలికెను. ఈమాట లన్నియు వినియు ఇదియంతయుఁ జూచియు సహింపలేక ఆముద్దరాలు తండ్రివద్దకుఁ జని జరిగిన దంతయు నెఱింగించెను.

అంతట నరసింహామేధ వెంటనే ఆస్త్రీసమూహముచెంతకు వచ్చి వియ్యంకురాలినిఁ జూచి "చెల్లెలా, మాఅమ్మాయికి సారె ఏమియు మేము పెట్టలేదని మీకు కష్టముగా నున్నట్లు తోఁచుచున్నది; గాని మాయభిప్రాయము మీరు గ్రహింపలేదు. మాకు తోఁచినమట్టుకు మాకున్నమట్టుకు సారె పెట్టియే మాఅమ్మాయిని పంపఁదలఁచితిని; గాని యిచ్చట మీకేమేమి యిష్టమగునో మీరు ఏమి కోరెదరో తెలిసికొని మఱియు దేవచ్చునని ఊరకయే వచ్చితిని. గతించిన దేమియో గతించినది. ఇఁక ప్రస్తావనయేల? మీకేమేమి కావలెనో చీటివ్రాసి యియ్యుఁడు. అన్నియు సాయంత్రమునకే తెప్పించెదను" అని వాక్రుచ్చెను. మొదట సారెప్రస్తావము తెచ్చిన ముసలమ్మ అది విని "మంచిపని చేసితివి నాయనా! నేను అనేక సంపన్నులు పంపిన సారెలు చూచితిని; గాని ఎవరును వియ్యాలవారి ఇష్టము నెఱింగి వారు కోరిన వన్నియు తెచ్చినవారు కారు. నాయనా, మహాలక్ష్మివంటి కన్నబిడ్డ అత్తింటికిఁ బోవునపుడు సారె ఇచ్చుట లాంఛనము గాని ఇంతమాత్రమున లోకములో పుట్టినింటివారికి లోపముకలుగదు. అత్తింటివారికి లోపము తీరదు. ఈయాచారము సృష్టిమొదలుకొనియు వచ్చుచున్నది. ఎంత బీదవాఁడైనను తనకు సాగినంతమట్టుకు సారె పెట్టియే పంపును; గాని కొమార్తెను ఊరక పంపఁడు. నీవు

అన్నియు నెఱిఁగినవాఁడవు. నీకుఁ దెలుపవలసిన దేమియు లేదు." అని పలికెను.

చీటి వ్రాయుట కొకఁడు కూర్చుండెను. తొలుత అల్లుఁడు ఇట్లు చెప్పెను. "పెండ్లికాలమున నాకేమి లాంఛనములు తీరలేదు. అన్నియు ఇప్పుడే తీర్పవలసియున్నది. వ్రాయుము. వెండిచెంబులజోడా, పట్టుతాపితా. చేతులకు మురుగులు, మురడీగొలుసులును, దర్భముడి ఉంగరము, బంగారు గోపత్రాడు, బటువు ఉంగరము ఒకటి, పట్టంచుల కట్టుపంచలు, పండలిపట్టుపంచము, పట్టు అంగరకా, కాళ్ళకు ఢిల్లీపాపూసులు, పాగారుమాలు, వీనికిఁ దగిన తక్కిన పరికరములు" పిదప ఆఁడుపడుచు ఇట్లు చెప్పెను. "సరిగపట్టుచీర, పెండ్లిలో ఈయవలసినవి అయిదును, ఇప్పుడు ఈయవలసినవి మూఁడును మొత్తము ఎనిమిది సరిగచీరలు, ఎనిమిది పట్టురవికగుడ్డలు, మోహారీలు, ఎనిమిది పసుపు, కుంకుమ బొట్టుపెట్టె, రెండు కాళ్లు కడుగు పళ్ళెములు, కాళ్లు కడుగు చెంబులు రెండు, మఱియొక మొహరీ, ఒక వెండిచెంబు, ఒక వెండిపళ్లెము, వెండి తమలపాకులు, బంగరు పోకచెక్కలు, సున్నము నిమిత్తము ఆణిముత్తెములు, ఇంకను తక్కిన లాంఛనములు, వియ్యపురాలికికూడ కాళ్లు కడుగు పళ్లెమును, కాళ్లు కడుగు చెంబును తక్క తక్కిన వన్నియుఁ గోరెను. మఱియు నామె యిట్లు చెప్పెను. "వితంతువగు మాతల్లికి మొత్తని జామారు, మేము ఏర్పఱుచుకొనఁబోవు దాసికి చీర, వియ్యంకునికి మీఁచిత్తమువచ్చినవి". నరసింహమేధ వానినిగూడ వియ్యంకుని వలన తెలిసికొని వ్రాయించి పిదప వ్రాసిన వానినిఁ జూచి "నీకేమి కావలయును" అని యడిగెను. "నరసింహమేధ పరమదరిద్రుఁడు. అదియుఁగాక ఇప్పుడు ఉన్మత్తుఁడై నాఁడు. కావుననే ఇట్టిచీటి వ్రాయించినాఁడు. వీరికి కోరిన వన్నియు నిచ్చినపుడు చూతము" అని తనలో తాను నవ్వుకొని "నాకు ఒక పెద్ద గుండురాయి కావలెను" అని లేఖకుఁడు వ్రాసెను.

నరసింహమేధ ఇది యంతయు నైన తరువాత తనతోఁ గూడ వచ్చిన సేవకవేషధారి యగు పాండురంగనిచేతి కిచ్చి నీవు బజారున కుఁబోయి చీటిలోని వస్తువు లన్నియుఁ గొనిరమ్ము" అని నియమించెను.

చిత్తము అని సేవకుఁడు బజారునకుఁబోయి క్షణములో అన్నియుఁ గొనివచ్చెను. వెంటనే నరసింహమేధ చీటిప్రకారము ఎవరు కోరినవి వారి కిచ్చి తుదకు "ఇదిగో పుచ్చుకొని సంతోషింపుము" అని వ్రాసినవానికి గుండురాతి నిచ్చెను. ఈదృశ్యమును జూచి అచ్చటివారెల్లరును పరమాశ్చర్యచకితులై అసమానమహిమాభిరాముఁడగు నరసింహమేధను చాల కొనియాడి "నీనెత్తిమీఁద శని యున్నాఁడు. నీనాలుకమీఁద పెద్దమ్మ యున్నది; కావుననే ఇట్టి కోరిక కోరుటకు నీకు తలంపు పొడమినది" అని వ్రాసినవానిని పరిహసించిరి.

పిదప బంధువు లెల్లరును నరసింహమేధ సేవకునిఁ జూచి "నీవెవఁడవు! నీపేరేమి?" అని యడిగిరి. అందులకు పరిచారకవేషి యగు పాండురంగఁడు "నేను నరసింహమేధ సేవకుఁడను. ద్వారకాపురమునందలి ఈతని వర్తకము నంతను నేనే చక్కఁబెట్టుచుందును. ఈతఁడు తన కొమార్తెకు సారె పెట్టుచున్నానని నన్నిటకు రమ్మని వర్తమానము చేయఁగా వచ్చితిని. మీరు 'బాంధవముకంటెను స్నేహముకంటెను ధనమేయధికము' అని తలఁచువారే; గావున మీకు కావలసిన లాంఛనములనే కోరితిరి; గాని నరసింహమేధ కొమార్తెకు పెట్టఁదగినవస్తువులను కోరలేదు. అయినను లోపము లేదు. ఇదిగో మాయజమానుఁడు తన కొమార్తకు తెచ్చిన సారె" అని బజారునకుఁ బోయి సకలవస్తువులను గొని తెచ్చి ఆయింట నప్పగించి సంకల్పమాత్రమున భోజనపదార్థములన్నిటిని కల్పించి అందఱకును విందుజేసి చందనతాంబూలాదులొసంగి కట్టకడపట నరసింహమేధ కంఠమున ఒక తులసీతావళమును గీలించి చూచుచుండఁగనే అదృశ్యుఁడయ్యెను. ఇది చూచి అచ్చటివారెల్లరును ఆసేవకుఁడు పండరినాథుఁ డని నిశ్చయించుకొని అట్టివానిచే సేవలు సేయించుకొనుచున్న నరసింహమేధ ప్రభావమును అతిశయముగఁ గొనియాడి పూజించి గౌరవించిరి. పాండురంగఁడు నరసింహమేధ కంఠమున వేసిన తులసీతావళము ఆతఁడు హరినామస్మరణ చేయునపుడు రత్నమాలవలె తళతళ మెరయుచు తక్కిన సమయములయందు తిరోహితమై యుండెడిది.

ఈసకలవృత్తాంతమును ఆదేశమును ఏలు రాజునకు తెలియువచ్చెను. వెంటనే యాతఁడు అచ్చటికి వచ్చి నరసింహమేధ ప్రభావమును

పరీక్షింపఁదలఁచి ఆతని మెడలోని తులసీతావళమును తీసి చేతఁ గొని "ఓయీ, నీవు యథార్థముగ భక్తుఁడ వేని నాచేతియందలి తావళము నాచేతియందే యుండఁగా నీకంఠమున మఱియొక తావళము వచ్చి యుండవలెను. అట్లు కాదేని నీశిరం బుత్తరించెద" నని పలికెను. నరసింహమేథ ఇది విని మందహాసము గావించి నాభక్తత్వమునకు నీయానందము ఆధారము గాదు. నీవు కోపించిన నాభక్తత్వము పోదు. నేను భక్తుఁడ నని విఱ్ఱవీఁగుట లేదు. నేను నీరక్షకు ఆనందించువాఁడ నేని నీశిక్షకు భయపడి యుండుదును. నాకు రెండును సమానములు. నీవేమి చేసినను నాకభ్యంతరము లేదు." అని పలికెను. అందులకు రాజు ఇట్లు అనియెను. "నాహృదయమున నున్న భావము వేఱు. నీవు గ్రహించినది వేఱు. లోకములో అనేకులు మేము హరిదాసుల మని విఱ్ఱవీఁగుచున్నారు. అట్టివారు ఉండఁగూడ దని నాయభిప్రాయము. లోకములో అనేకమాయ లున్నవి. అట్లే భక్తిజ్ఞానవైరాగ్యాదులయందుఁ గూడ మాయ, మోసము, దంభము, ఇట్టివి యుండఁగూడదు. నీవు ఇట్టివాఁడవుగాక మహామహిమోభిశోభితుఁడ వగుహరిదాసుఁడ వేని నేను కృతకృత్యుఁడను. నీపాదమును బట్టెదను. కేవలము ఐహికవిషయములందే పడి కొట్టుకొనుచున్న నాదేశపు ప్రజలకు ఆముష్మికజ్ఞానము కలిగింపఁగల ఆచార్యుఁడు కావలసియున్నాఁడు. కుహనాభక్తులు హెచ్చు పెఱిఁగియుండుటవలన యథార్థభక్తులను తెలిసికొనుట కష్టము; అగుట ఇట్లు పరీక్ష చేయవలసి వచ్చినది; కావున దయయుంచి నాకోరికను దీర్పుము." ఇది విని నరసింహమేథ.—

శ్లో. "చతుర్వేదకూటోల్లసత్కారణాఖ్యం స్ఫురద్దివ్యవైమానికే భోగితల్పే,
పరంధామమూర్తిం నిషణ్ణం నిషేవే నిషేవే ఉన్యద్దైవం నసేవే న సేవే."

(రామకర్ణామృతము. అ. 2. ప. 92.)

అని ప్రార్థించెను. తోడనే పాండురంగఁడు సాక్షాత్కరించి నరసింహమేథ కంఠమున మఱియొక తులసీమాలను వేసి పోయెను. అది చూచి రాజు మున్నగువారు పరమాశ్చర్యచకితులై నరసింహమేథను చాలఁ గొనియాడిరి. పిదప రాజు ప్రార్థన ననుసరించి నరసింహమేథ ఆతని రాజధానికిఁ బోయెను. అచ్చట ననేకులు ఆతనికి శిష్యులైరి.

బ్రతికియున్నంతకాలము నిట్లు అనేకులను హరిదాసులను గావించి అవసానమున నరసింహమేథ శ్రీహరిసాయుజ్యమును బడసెను.

చ. "సతతము వేదకోటివిఁ సద్ఘనకారణ నామధేయుఁడై
యతులితదివ్యపుష్పకమునం దధిరూఢుఁడయ్యుఁ జగ
ద్ధితపరధామమూర్తియగు దీప్తివహించిన రాము నెంతుఁ గా
కితరములైన దైవముల, నేను భజింప భజింప నెమ్మదిన్"

(రామకర్ణామృతము. ఆ. 2. ప. 92)

---

45. నా మ దే వుఁ డు

శ్లో. "ఉపద్వైతశేషాచలేయోగపీఠే
సదానందచైతన్యమాలికేమాసహాసం,
మునీనాంహృదానందచైతన్యకాగగమ్యం
సదా భూమిజాయుక్తరామం భజేహృద్దంతే."

(రామకర్ణామృతం. ఆ. 2. ప. 93.)

పండరిపురమున దామాజీ యను ఒక భక్తాగ్రేసరుఁడు వసించియుండెను. ఆతని భార్య పేరు గుణాబాయి. అన్నివిధముల నాదంపతులు ఇరువురును ఒకరి కొకరు తగినవారు. భార్య మాట భర్త మీరఁడు. భర్తమాట భార్య జవదాఁటదు. ఈతీరున వారు అన్యోన్యానురక్తులై యుండుటయేగాక విశేషించి భగవద్భక్తులుగూడ నై యుండిరి. వారిరువురునుగూడ అనుదినమును దేవాలయమునకుఁ బోయి పండరినాథుని సేవించి ఇంటికివచ్చి మఱల స్వామికి మహానైవేద్యము గావించి తన్నివేదితాన్నమును వారుభక్తితోఁ భుజించుచుండురు. సాంసారికములు అగు స్వల్పపుఁబనులు అన్నియు వారు ఇరువురును గూడి అతిశీఘ్రముగ నెఱవేర్చుకొని తీరికయైన వెంటనే హరిభజనము ప్రారంభింతురు. ఇంతకంటె వారికి మఱియొకపని లేదు.

ఈమహానందముతోఁ గాలము గడచిపోవుచుండఁగా హఠాత్తుగా గుణాబాయికి ఒకదుర్భరవిచారము పొడసూపెను. వారికిఉత్తరవయస్సు

ప్రారంభ మయ్యెను; గాని యొక్క బిడ్డయైనను కలుగలేదు. సంతానము లేని విచారము గుణాబాయికి ఇన్నిదినములకు హృదయభేదకము య్యెను. చూచుచుండఁగనే అది విపరీతముగఁ బెరిగిపోయెను. ఇఁక సహించుట కష్టమయ్యెను. దానినిఁ బయటికి రాకుండ ఇన్నిదినముల నుండియుఁ జేసిన ప్రయత్న మంతయు వ్యర్థ మయ్యెను. తుదకు అది బహిర్గతము కాక మానలేదు. అగుటచే నొకనాఁడు ఆసాధ్వి భర్త దిక్కు మొగంబై "నాథా, మన కేమియు లోపము లేదు. పాండురంగని యనుగ్రహము మనపై నున్నది; గాని దానికి గుఱుతేది? మనము నిష్కామకర్మతోడనే భగవంతు నారాధించుచున్నాము. అయినను ఆపాండురంగఁడు మన కొక బిడ్డను దయసేయఁ గూడదా? దాన నాతని కేమి కష్ట మున్నది? నాకు ఐహికవాంఛ లేమియు లేవు. మఱేమన: మన వంశము నిష్ఫలము కాఁగూడదు. ఈహరిభజనము మనతోడనే ముగియఁగూడదు. ఈస్థలమున ఎల్లకాలమును మన కుటుంబములోనివారిచే హరిసంకీర్తనము చేయఁబడుచుండవలెను. ఇంతియే. ఇది ఐహికవాంఛయైనను పరలోకమునకు భంగకరము కాకపోయినను మఱేమియైనను ఇది నాహృదయమున చాల తీవ్రముగ జాగరిత మగుచున్నది. ఏమిచేసిన పాండురంగఁడు ఈకోర్కెను ఘటించును" అని యడిగెను. ఇది విని ఆవృద్ధుఁడు ఆశ్చర్యచకితుఁడై "దేవి, నీవింత పిచ్చిదాన వగుచుంటివేమి? ఈముసలితనమున మనకు సంతానమా? భూతవర్తమానములయందు వృద్ధులకు ఎందైన సంతానప్రాప్తి వినవైన వింటివా? ఊరకుండుము. ఇది పరులు వినిన గేలి సేయుదురు" అని మాఱుపలికెను.

కాని గుణాబాయికి నిస్పృహ గలుగలేదు. ఏల కాఁగూడదు? పండరినాథుని విలాసములను తెలియ నెవరి తరము? మృతులైన బాలకులను గొనివచ్చి గురువునకు సమర్పించిన శ్రీకృష్ణుని దాక్షిణ్యభావమునకు పారమెక్కడిది? అచంచలభక్తితో సేవించువారి మనోరథములను దీర్చుట శ్రీహరికి ఎంతపని? మనకొఱకు మనము పుత్రుని కోరుట లేదు. ఈయింట హరిభజనమునకు అంతరాయము కలుగఁగూడదు. తన సేవకులలో నొకనిని శ్రీహరి మనకు పుత్రునిగాఁ జేయఁగూడదా? వంశపారంపర్యముగ తన్ను సేవింపఁదలఁచిన మనలను అక్రూరవరదుఁడు విఫలమనోరథులం గావించునా?" అని యామె బదులు చెప్పెను.

ఈపలుకులవలన దామాజీకి ఆశ గలిగెను. తోడనే యాతఁడు ఆలయమునకుఁ బోయి పాండురంగని అనేకవిధముల సేవించి "శ్రీహరీ, మాకు పుత్త్రాశగలిగినది. మాకొక బిడ్డను దయసేయవా?" అని ప్రార్థించి సంతానార్థులు పరుండు మంటపమునఁ బరుండెను. క్షణములో నాతనికి నిద్ర పట్టెను. ఆనిద్రలో నొక స్వప్నము వచ్చెను. ఆస్వప్నమున,-

సీ. "సోడుపుఁగెంపునహించు బెడిదంష్ట్ర వినిగెంపురహి నింపు కంఠహారంబువాఁడు
కోమలాంగుళులయొరగొనబురింగులు బాహ గట్టినబంగారుబట్టవాఁడు
శృంగారగతిమించు చెలువొందు కస్తూరి తిలకంబు చేముద్దుగులుకువాఁడు
మకరకుండలలోలమణిజాలరుచిమీర దళుకొత్తు చెక్కుటద్దములవాఁడు
తే. తలను నెమ్మిగొన్న పింఛపుదండవాఁడు, విమలశతపత్త్రజైత్ర నేత్రములవాఁడు
మురళి డాచేతఁగొను జగన్మోహనుండొకండు, నాస్వప్నమునను సాక్షాత్కరించె."

(ఉత్తరరామాయణము. పీఠిక. ప. 19.)

అట్లు సాక్షాత్కరించిన శ్రీహరి దామాజీని ప్రబోధించి "ఓయీ, మీభక్తికి మెచ్చితిని. మీ సేవకు ఆనందించితిని. మీకోరికను ఘటించుచున్నాను. రేపు ప్రాతఃకాలమున నీవు భీమానదికి స్నానము సేయఁబొమ్ము. స్నానాదికములగు నిత్యకృత్యములన్నియు నెఱవేఱిన తరువాత ప్రవాహవేగమున నొక ముత్యపుచిప్ప కొట్టుకొనివచ్చును. అందొక బాలకుఁడు ఉండును. ఆబాలకుఁడు నాయాజ్ఞవలన అక్రూరాంశమున జనుల నుద్ధరించుటకు భూతలమున జన్మించెను. ఆపాపనిం గొనిపోయి మీరు పెంచుకొనుఁడు" అని చెప్పి అంతర్హితుఁ డయ్యెను. తోడనే దామాజీ ప్రబోధితుఁడై లేచి సుజల గర్భాలయమునకుఁబోయి "శ్రీహరీ, నీమాయ లనంతములు. నీలీలలు అగమ్యములు. నీకరుణ అపారము. నేను నీకు ఏమిసేయఁగలను" అని యనేకవిధముల నుతించి యింటికి వెడలిపోయి సంగతి యంతయు భార్యకెఱింగించెను. అది విని గుణాబాయిమహానందభరితురాలై పారవశ్యమువలన కొంతతడవు మాటాడఁజాలక తుదకు నృత్యము ప్రారంభించెను. అందులకు తోడుగ దామాజీ హరినామకీర్తనము ప్రారంభించెను. తుదకు ఆతఁడుకూడ నృత్యముప్రారంభించెను. ఈనృత్యమునందే తెల్లవాఱిపోయెను.

వెంటనే పాండురంగనియనుజ్ఞ నుదలంచి దామాజీ భీమానదికిఁ బోయి స్నానసంధ్యాద్యనుష్ఠానము లన్నియు ముగించుకొని ముత్యపు

చిప్పకై ఎదురుచూడసాగెను. ఈశ్వరాజ్ఞ గావున కొంతసేపటికి అదికొట్టుకొనివచ్చెను.చూచిచూడకయే మునుపే దామాజీఅందున్న బాలకుని దఁగాలున నెత్తికొని ఇంటికిఁగొనిపోయి భార్యచేతి కిచ్చెను.కొంతతడవు వారు ఆబాలుని అనిందితదివ్యతేజస్సును చూచి ఆశ్చర్యపడినతరువాత దామాజీ భార్యను జూచి "దేవీ, ఆవుపాలైనను లేవు, ఈబాలుని ఇఁక నెట్లు పోషింతుము"అని దీనముగఁ బలికెను;గాని ఈవాక్యము పూర్తి గాకపూర్వమే గుణాబాయిపాలిండ్లయందుక్షీరప్రవాహముపొంగిపారలెను. అది చూచి వారు మఱింత వింతపడిరి "వింత పనిలేదు. ఈశ్వర లీలలు ఎవరికిఁ దెలియఁగలవు?" అని యనుకొనుచు ఆబాలకుని చాల గారాబముగ పెంచుకొనసాగిరి. కొన్నిదినములైనతరువాత ఆబాలునకు వారు నామదేవుఁడు అని పేరుపెట్టిరి.

నామదేవుఁడు శుక్లపక్షక్షపాకరునివలెదినదినప్రవర్ధమానుఁడగుచుండెను.చిన్నతనమునందే ఆతనికి హరిభక్తియలవడెను. వయసుతోఁగూడ బుద్ధియు బుద్ధితోఁగూడ జ్ఞానమునుదానితోఁగూడనాతనికి హరిభక్తియు పెంపొందసాగెను.దామాజీయు గుణాబాయియుఅబ్బాలుని బాల్యచేష్టితములను జూచిఆనందపారవశ్యమువలన తమ కాతఁడులభించినమార్గమును శ్రీహరి చెప్పినవిషయమును మఱచిపోయి గారాబుకుమారునియెడల అందఱుతల్లిదండ్రులును బ్రవర్తించునట్లు ప్రవర్తింపసాగిరి.

ఒకనాఁడు దామాజీకి ఒకానొక సమీపగ్రామమునకు పోవలసిన యవసర మేమో తటస్థించెను. అంత నాతఁడు "నేఁడు పాండురంగని పూజించుటకు మన నామదేవునిఁ బంపుము" అని గుణాబాయికి నియమించి వెడలిపోయెను. పూజాసమయము సమీపించిన వెంటనే గుణాబాయి కావలసిన వన్నియు నిచ్చి కుమారునిఁ గుడికి పంపెను.

నామదేవుఁడు తనకు తెలిసినంతవఱకు యథాక్రమముగఁ బూజించి మహానైవేద్యము చేసి "స్వామీ, భుజింపుము"అని ప్రార్థించెను. గాని స్వామి సాక్షాత్కరింపలేదు. నైవేద్యము స్వీకరింపలేదు. నామదేవునకు తృప్తి కలుగలేదు. భోజనపాత్రమును బట్టుకొనిపోవుటకు నామదేవుఁడు వేషధారి గాఁడు."స్వామీ భుజింపుము. నేను బాలుఁడను. నావలన అపరాధము గలిగిన సైరింపుము. ఇంటివద్ద మాతల్లిచే నాకు

చెంపపెట్లు సంభవింపనీయకుము. నైవేద్యమును స్వీకరింపుము" అని మఱల ప్రార్థించెను; గాని అప్పటికి ప్రయోజనము లేకపోయెను. "ఈశ్వరా, నాకు ఆకలి యగుచున్నది. దాహము మితిమీఱుచున్నది. నీవు భుజించినఁగాని నేను భుజింపను. నేఁడు లంఘనము చేయించెదవా? అది నీకు ముచ్చటా? జగద్రక్షకా! నన్ను గాపాడుము" అని నామదేవుఁడు బతిమాలుకొనియెను. అప్పటికిని పండరినాథుఁడు సాక్షాత్కరింపలేదు. నామదేవునకు భయ మయ్యెను. ఏడ్పు వచ్చెను. చూచుచుండఁగా కన్నులనుండి అశ్రులహరియే ప్రవహించెను. "పండరినాథా, నేనేమి తప్పు చేసితిని? నేనేమియు తెలియనివాఁడను. భార మంతయు నీమీఁదనున్నది. నావలన అపరాధమైన అది నీదేయగును. ఏలజాలము చేసెదవు? మేము పేదవారము? నీకు తగిన భోజనము పెట్టఁజాలము. ఇది మాశక్తికి తగినది. దీనిని స్వీకరించునంతదనుక నేనిక్కడనుండి కదలను" అని అతఁడు కన్నులు తుడుచుకొని అచ్చటఁ గూర్చుండెను.

ఈబాలభాషణములవలన పండరినాథుని మనస్సు కఱఁగెను. వెంటనే యాతఁడు దివ్యమంగళవిగ్రహుఁడై నామదేవుని తట్టి బుజ్జగించి ఆయన్నము భుజించెను. నామదేవుఁడు మహానందభరితుఁడై ఇంటికి పోయెను. భగవన్నివేదితాన్నముకొఱకు నిరీక్షించుచున్న గుణాబాయి రిక్తపాత్రుఁడై వచ్చిన కుమారునిఁజూచి "ఏమిసంగతి? అన్న మేమిచేసితివి?" అని ప్రశ్నించెను. నామదేవుఁడు సత్యము చెప్పెను; గాని ఆమె నమ్మలేక నమ్మలేక నమ్మి మఱునాఁడు భర్తకు ఈసంగతియంతయు నెఱింగించెను. దామాజీగూడ తొలుత దీనిని నమ్మలేకపోయెను. "వత్సా, స్వామిని నేఁడుగూడ నీవే పూజింపుము. నేను దగ్గఱనుండి అంతయుఁ జూచెదను" అని చెప్పి దామాజీ పూజాసామగ్రి యంతయుఁ గైకొని కుమారుని వెంటఁ గొనిపోయెను.

నామదేవుఁడు యథాపూర్వముగ పూజ ప్రారంభించెను. కుమారుని చాకచక్యమును జూచి దామాజీ చాల నానందించెను. ఇంతలో నైవేద్యసమయ మయ్యెను. నామదేవుఁడు పదార్థములతో నిండిన భోజనపాత్రమును ఎదుట నుంచి నివేదించి "స్వామీ, స్వీకరింపు" మని ప్రార్థించెను; కాని ఏమియు ప్రయోజనము గలుగలేదు. ఏమి జరుగునో యని దామాజీ ఆత్రముతో చూచుచుండెను. అంతట నామదే

వుఁడు మోఁకాలించి నిలిచి "శ్రీహరీ, ఏల జాలముచేసెదవు? దినదినము ఇట్లు సేయుటకును నాచే పలుమాఱు ప్రార్థింపించుకొనుటకును నీకు ముచ్చటయా? అట్లని యెఱింగించి ముందు దీనిని స్వీకరింపుము. పిదప నిన్ను నేను స్తుతిచేసెదను" అని ప్రార్థించెను. అప్పుడు "వత్సా, నీయందు నాకు ఆగ్రహము లేదు. నీచే స్తోత్రము చేయించుకోవలెనను ఊహ లేదు. నీవు నివేదించిన యన్నమును స్వీకరించుటకు నాకు అభ్యంతరము లేదు; గాని నీతండ్రికి నేను కానిపింపను. ఆతని నవ్వులకుఁ బొమ్మనుము" అని యొక మాట వినవచ్చెను. ఇది పాండురంగని మాటగా నిశ్చయించుకొని దామాజీ తన దౌర్భాగ్యమును నిందించుకొనుచుండగా నామదేవుఁడు "పుండరీకవరదా, నీవు సర్వజ్ఞుండవే; గాని పొరఁబడుచున్నావు. నీవు సర్వసముఁడవే; గాని పక్షపాతము జూపుచున్నావు. నీయెడల మాతండ్రి చేసిన యపరాధ మేమున్నది? నాతండ్రికంటె నీకు నేను చేసిన సేవ యేమున్నది? నీకుమారుని గౌరవించి నిన్ను బహిష్కరించినచో ఆగౌరవమును నీకుమారుఁడు స్వీకరింపవచ్చునా? అప్పుడు నీకెట్లుండును? మాయిరువురలో భేదము సూపుట నీకు తగదు. కావున పది మాఱులు చెప్పించుకొనక వేగముగ స్వీకరింపుము" అని వేఁడుకొనియెను. దీనితో పాండురంగని హృదయము కఱఁగెను. తోడనే ఆతఁడు సాక్షాత్కరించి దామాజీని నామదేవుని అనుగ్రహించి ఆయన్నమును భుజించి తిరోహితుఁడయ్యెను. కుమారునియనుగ్రహమువలన తనకు ఈశ్వరసాక్షాత్కార మైనందులకు పరమానందభరితుఁడై దామాజీ ఎంతో కుమారుని ఆదరించి గ్రుచ్చికౌఁగిలించుకొని శిరముమూర్కొని ముద్దాడి బుజ్జగించి ఎత్తుకొని ఇంటికిఁ గొనిపోయి సంగతి యంతయు భార్య కెఱింగించెను. గుణాబాయి కుమారుని మహాప్రభావమునకు అత్యాశ్చర్యపడెను. పిదప నందఱును పరమేశ్వరుని దివ్యలీలలను గీర్తించుచు నృత్యము ప్రారంభించిరి.

నామదేవునకు పండ్లి [illegible]డు వచ్చెను. అపుడు దామాజీయు గుణాబాయియు చాల విచారణ చేసి రాధాబాయి అను నొక చక్కని కన్యను దెచ్చి నామదేవునకు వివాహము చేసిరి రాధాబాయి అన్నిటను నామదేవునకు తగిన పత్ని. నామదేవుఁడును ఆమెకు తగిన భర్త. ఇట్లయ్యిరువురును పరస్పరానురక్తులై పాండురంగనిఁ బూజించుచు

దామాజీకిని గుణాబాయికిని సపర్యలు సేయుచు కాలము గడుపసాగిరి. కొన్నిదినములకునామదేవునకు ఒక పుత్రుఁడు కలిగెను. దామాజీ పోయి పాండురంగని తనమనుమని నామకరణమహోత్సవమునకు పిలిచి వచ్చెను. అట్లే పదునొకండవ దినమున లాంఛనముల నన్నిటిఁ బట్టించుకొని నామదేవునియింటికి శ్రీహరి వచ్చెను. ఆయింటివా రందఱును పంఢరినాథుని రుక్మిణీదేవిని అనేకవిధముల గౌరవించి పూజించిరి. పాండురంగని యాదేశమువలన గుణాబాయి తన మనుమనికి నారాయణుఁడు అని నామకరణము చేసెను. అందఱును దీవించిరి. పాండురంగఁడు రుక్మిణితోఁగూడ వెడలిపోయెను.

కొన్ని దినములకు దామాజీయు గుణాబాయియు సంపూర్ణముగ వృద్ధులైరి. సంసారభారము అంతయు నామదేవునిమీఁదఁ బడెను. అయినను ఆతఁడు ఆవిషయమున యోచనము గాని విమర్శగాని లేక సదా శ్రీహరిసేవయందే కాలము గడుపసాగెను. అగుట సంసారము జరుగుట కష్టమయ్యెను. మధ్యాహ్నము భుజించిన రాత్రికి లేనిస్థితి సంభవించెను. సంసారస్థితి ఇంత శోచనీయముగ నున్నను జోక్యము కలుగఁజేసికొనకుండుటఁ జూచి నామదేవునిఁ జేరఁబిలిచి యొకనాఁడు గుణాబాయి "అబ్బాయీ, నీవు బాలుఁడవు గావు. ప్రాపంచికధర్మము నెఱుంగనివాఁడవు గావు. ఎంత భక్తియున్నను సంసారము జరుగుచున్నదా లేదాయని యోచించుకొనకతీఱదు. నీబిడ్డకుఁగూడ రాత్రి భుజంచుటకుఁ బట్టెఁడు అన్నములేదు. రాత్రి మన మందఱమును పస్తు ఉండవలెను; గాని మఱి దిక్కులేదు. ఐహికవాంఛలు పరలోకమునకు భంగకరములు గాని దినపాతముగాదు 'శరీరమాద్యంఖలుధర్మసాధన'మ్మను న్యాయము నెఱుంగనివాఁడవు కావుగదా! నీపుట్టుకు నీవు ఎఱుఁగనట్లు ఉండిన ఇఁక మనయింట సంసారభారమును వహింపఁగలవారెవరు? నీతండ్రి వృద్ధుఁడు; ఒకరి సాయము లేకున్న లేచుటకైన సమర్థుఁడు కాఁడు. నేను ఎట్టి స్థితిలో నున్నదియు నీకు తెలియనిది గాదు. నీభార్య పోయి ఏమియు సంపాదింపఁ జాలదు గదా! నీబిడ్డఁడు బిడ్డఁడే. ఇఁక నీవు మాత్రమే ఇందఱకును ఆధారము కాన్పించుచున్నావు. అట్టి నీవు ఇట్లు ఊరకుండిన ఇఁక మనము అందఱమునుక్షుధార్తులమై మాడిపోవలసినదే గాని దిక్కేమి యున్నది; తండ్రీ,నీభక్తికి మేము అడ్డురాము.

నీభజనమునకు మేము ఆటంకము సేయము. నీమార్గమును మేము కంటకితము గావింపఁజాలము. మఱేమన? మాకు కడుపునిండ అన్నము గాక పోయిన గంజియైన బోయుము. ఇంక ప్రాణములు నిలుపఁబెట్టుటఁ గూడ పుణ్యమే. ఇదిగూడ మోక్షమునకు మార్గమే. కావున దీనిని నెఱవేర్పక తప్పదు" అని పలికెను.

ఇది విని నామదేవుఁడు మాఱువలుకక తిన్నఁగ పాండురంగని సన్నిధికిఁబోయి మోకారించి నిలిచి నిటలతటఘటితాంజలియై "జనార్దనా, ఆర్తత్రాణపరాయణా, నీకిట్టిది తగునా? నాకు ఈగతి నేల కల్పించితివి? ఈదుఃఖసాగరమున నన్నేల కూలఁద్రోసితివి? ఇట్లు సేయుట నీకుఁ దలంపు గలిగియున్న నాకు ఈజగన్మిథ్యాత్వమును సంసారహైన్యమును ఏల తెలిపితివి? అయ్యో, నాకు ఇట్టి యగచాట్లను గల్పించుటకు నేను నీకేమి యపరాధమును జేసియున్నాను? నేను నీపాదస్మరణము తక్క ఎన్నఁడును మఱియొకటి యెఱుఁగనుగదా ? సర్వవ్యాపకుఁడవు అగు నీకు తెలియనిది ఏమున్నది ? శ్రీహరీ, భక్తచింతామణీ, నన్ను ఉద్ధరింపుము" అని అనేకవిధముల బ్రార్థించెను. అంతట పాండురంగఁడు సాక్షాత్కరించి ఆతనిం జేరఁదీసికొని "వత్సా, విచారింపకుము. నీకు ఏమియు భయము వలదు. నీవు ఇచ్చటనే యుండుము" అని బోధించెను. నామదేవుఁడు నల్లెయని అట్లే యుండెను.

ఇప్పుడే వచ్చునో గడియకే వచ్చునో యని నిరీక్షించుచున్న రాధాంభాయిభర్త ఎంతకును రాకుండుటఁజూచి "అత్తా, నీకుమారుని చర్య ఏమియు తెలియుట లేదు. వారిని ఏమి యనినను బ్రయోజనము లేదు. దీనికి అంతకును గారణము పాండురంగఁడే" యని తోఁచుచున్నది. ఇఁక నేమనుకొనినను ఏమి ప్రయోజనము? అందఱమును నిరాహారులమై యుందము; కాని ఈబిడ్డనిఁ జూచిన నాగుండెలు పగిలిపోవుచున్నవి. ఇంతకంటె నాకు విచారములేదు. అయినను రుక్మిణీకాంతుఁడు ఇట్లు చేయఁ దలపెట్టినపుడు ఇఁక నేమి యనుకొనినను ఏమిప్రయోజనము?" అని నిరాశతో పలికెను. ఈమాటలు రుక్మిణితో సరసాలాపము లాడుచున్న పాండురంగనికి వినవచ్చెను. తోడనే యాతఁడు నామదేవునకుఁ దెలియకుండునట్లు ఒక వర్తకునిరూపము

ధరించి బలమగు ఒక వృషభమును గల్పించుకొని దానిమీఁద అనంతధనమును వేసికొని నామదేవుని ఇంటికి బయలుదేఱెను.

"అయ్యా, ఆకట నకనక మాడుచున్నాను. నామదేవుని ఇంటికిఁబోయిన ఇంత ప్రసాదము లభించు" నని తెలియవచ్చినది. కావున "ఆమహానుభావుని ఇంటిదారి చూఁపుడు" అని యూరివారి నడుగుచు ఆవర్తకుఁడు ఊరిలోఁ బ్రవేశించెను. ఇది వినినవారు ఎల్లరును "నేఁడు ఈవర్తకుని కడుపునిండినట్లే మధ్యాహ్నము భుజించుటకే నామదేవునికుటుంబము ఏమియు లేక పస్తు ఉండెను" అని యనుకొనసాగిరి; ఇది యేమియు వినిపించుకొనకయే వర్తకుఁడు నామదేవుని ఇంటికిఁ బోయెను.

అప్పటికి రాధాబాయి వాకిట నిలిచియుండెను. వర్తకుఁడు గుస్మములోనికి వచ్చి "అమ్మా, నామదేవులు నాకు మిత్రులు. నేను విందనై వచ్చితిని" అనియెను. అదివిని రాధాబాయి ఏదో పనిమీఁద వచ్చియున్న పొరుగింటియామెను జూచి "మాయింటిస్థితి ఇట్లున్నది. వచ్చెడి భాగవతులకు అంతములేదు. మాయజమానుల యాజ్ఞకుఁగూడ పారములేదు. మాదారిద్ర్యమునకుఁ గూడ దరి లేదు" అని చెప్పెను. ఈమాటలను విని వర్తకుఁడు "అమ్మా, నాకు నేటిరాత్రికి భోజనము అక్కఱలేదు. ఉండుటకు ఇంత స్థలము ఇచ్చినఁ జాలును" అనియెను. రాధాబాయి హృదయావేదనము ఒకింతతీఱెను; గాని పూర్తిగఁ దీఱలేదు "ఇంటికివచ్చిన అతిథికి భోజనముపెట్టుటకు శక్తిలేకపోయినది" అని యామె కొంచెము వగచి "అయ్యా, మీఁది ఏయూరు? మీరు ఎవరు? ఇక్కడకు ఏలవచ్చితిరి?" అని ప్రశ్నించెను. "నాపేరు? చెప్పవలసిన పనిలేదు. నేను వర్తకుఁడను గావున నాకొకచో స్థిరనివాసము లేదు. నా మిత్రులగు నామదేవులు మిగుల దారిద్ర్యపీడితులై యున్నారు" అని విని వారికి కొంతగాకున్న కొంతయైన నుపకరింపవచ్చునని తలఁచి "వారికి సమర్పించుటకు కొంచెము ధనము తెచ్చితిని" అని బదులుచెప్పి యాతఁడు వరాలమూటను ఆమెచేతికి అందించెను. రాధాబాయి ఆమూటనుగైకొని వర్తకుని లోనికిఁ గొనిపోయి చాల నాదరించెను. కొంతసేపు అయినతరువాత వర్తకుఁడు "అమ్మా, నేను వచ్చినపని యైపోయినది. ఇఁక నిక్కడ కూర్చుండియుండుటకు నాకు తీఱిక

లేదు. నేను పోయెదను. నామదేవులు ఇంటికి వచ్చిన తరువాత నేను వచ్చినసంగతి వారికిఁదెలుపుము" అనిచెప్పి తనమార్గమునఁబోయెను.

రాధాబాయి పరమానందముతో వర్తకుని సాగనంపి మూటలోని కొన్నివరాలు తీసికొని బజారునకుఁబోయి ప్రసిద్ధమైన ఒక వర్తకుని దుకాణముమీఁద తనకు కావలసిన వస్తువులన్నియు గొని ఇంటికివచ్చెను. ఇదియంతయు నగునప్పుడు ఇంట మఱెవ్వరును లేరు. ఒక్క రాధాబాయి మాత్రమే యుండెను. నారాయణుఁడు ఎందో ఆటలాడుకొనుచుండెను.

ఇది యిట్లుండ గుణాబాయి నాఁటిరాత్రి, వంటచేసికొని భుజించుటకు ఏమియు లేకపోవుటఁజేసి గ్రామములోనికిఁబోయి అటనట కొందఱు గృహయజమానురాండ్రు ఇచ్చిన బియ్యములు మూటఁగట్టుకొనివచ్చుచు మార్గమధ్యమున పండరినాథుని ఆలయము కాన్పించుటచే చాల కోపముతో లోనికిఁబోయి "శ్రీహరీ, ఇదియేమి అన్యాయము? చెట్టు సత్యభామదొడ్డిలోను పూవులు రుక్మిణిదొడ్డిలోను అనునట్లు నామదేవుఁడు మా కుమారుఁడేగాని ఆతనినివాస మెప్పుడును నీ సన్నిధిని. పుత్రుఁడోయని పడిగాపులు దండములుపెట్టి నిన్ను ప్రార్థింపఁగా తనకు పుత్రు నిచ్చితివి; గాని ఆతనిని నీవు విడువవు. ఇంట మేమన్నము లేక మలమల మాడిపోవుచున్నాము. ఇఁక నామదేవునివలన నేమి ప్రయోజనము? నీవు తొలుత మాకు ఈయకయే యుండినయెడల మాకీబాధలే లేకపోయియుండును. వృద్ధుల మగు మాయిరువురిప్రాణములు నెట్లో పోయి యుండును ఇప్పుడు మాకు ఏమియు నెఱుఁగని రాధాబాయియు ముక్కుపచ్చ లారని నారాయణుఁడును తోడైనారు. వారి దీనాననములు చూచిన మాకడుపులు తఱుగుకొనిపోవుచున్నవి. "అమ్మా, రుక్మిణీ, నీనాథునిచేష్టలు చూచితివిగదా ? నామదేవునివలని కష్ట మంతయు మాది సుఖమంతయు మీది. నీవును బిడ్డలను గన్నతల్లివి. ఆడువాండ్ర కిది యెంత కష్టమో యోచింపుము. తండ్రీ, పాండురంగా, ఇప్పుడైనను నీకు మనసు కఱుఁగదా?" అని అనేకవిధములు దీనాలాపము లాడెను ఇది విని సహింపఁజాలక పండరినాథుఁడు "అమ్మా ఏమి సేయుదును; నామదేవుఁడు నన్ను సేవించుటకుఁబుట్టెను. లోకము నుద్ధరించుటకుఁ బుట్టెను. ఇఁక మీకెట్లు ఉపకరించును? అయినను ఆతఁడు

వచ్చునేని నీవు తీసికొనిపోవచ్చును" అని పలికి నామదేవునిచేతిని గుణాబాయి చేత నిడియెను వెంటనే గుణాబాయి బయలుదేఱెను. తూఁబు వల్కకుండ నామదేవుఁడు తల్లితోఁగూడ నింటికిఁ బోయెను.

వారు ఇంటికిఁ బోయి చూచునప్పటికి ఇల్లంతయు సకలపదార్థములతోడను నిండి యుండెను. అది చూచి నామదేవుఁడు "అమ్మా, ఇదంతయు నేమి"అనియడిగెను; గాని "నాయనా, నాకేమియుఁ దెలియదు"అని చెప్పుచునే గుణాబాయి కుమారుని లోనికిఁ గొనిపోయెను. అప్పటికప్పుడే రాధాబాయి పంచభక్ష్యపరమాన్నములను జేసి ఎదురు చూచుచుండెను. నామదేవుఁడు ఆమె నడిగెను; గాని నిజము చెప్పినచో భర్త అంతయు నెచ్చింపివేయును. అని భయపడి ఆమె మౌనవ్రతము దాల్చెను. అంతట నామదేవుఁడు దాసివలన సంగతిసందర్భములన్నియు దెలిసికొని "శ్రీహరీ, ముకుందా, నీకిది తగునా? ఎట్లో దేహమునిలుపుకొని నీసేవయందే నాజీవితమును గడుపఁదలఁచియున్ననాకు ఈభాగ్యమంతయు నేల యిచ్చితివి? దీనివలన సంభవించు పాపము లన్నియు నేను సహింపఁజాలను. నాకు నీపాదారవిందధ్యానము తప్ప అన్యము వలదు." అని ఆధన మంతయు బీదలకు ఇచ్చివేసి సంసారమును మఱల పూర్వస్థితికిఁ గొనివచ్చెను.

మఱల కొన్ని దినములు అట్లు గడచిపోయిన తరువాత దేశమునందు అంతటను ప్రఖ్యాతి పొందిన జ్ఞానదేవుఁడు అనుభక్తాగ్రేసరుఁడు నామదేవుని యింటికివచ్చెను. నామదేవుఁడు వచ్చిన భాగవతశ్రేష్ఠునకు అర్ఘ్యపాద్యాదిసకలోపచారములను జేసి ఆదరించెను. జ్ఞానదేవుఁడు సాష్టాంగ మెఱఁగియున్ననామదేవుని ప్రీతితో లేవనెత్తి"భక్తాగ్రేసరా, నీభాగ్యము అనంతము. అది అనితరసాధ్యము. రుక్మిణీపతిని పూర్తిగ స్వాధీనము చేసికొనినది నీవు ఒక్కఁడవే నివిశేషమును శ్రీహరి సహింపఁజాలక మముబోంట్ల నందఱను ఉపేక్షించి మాకు విచారమును గలిగించుచున్నాఁడు. అట్టి భక్తాగ్రేసరుఁడవు అగు నిన్ను జూచిన నేఁటి దినము ఎంతో సుదినము. నేఁడు నాకు నేత్రోత్సవముఅయినది. ఆహా, ఇంతవాఁడవు అయ్యు నీవు ఎంత వినయముచూపుచున్నావు. నిజముగ ఔన్నత్యమును గుర్తెఱిఁగినవాఁడవు నీవు ఒక్కఁడవే. సర్వసమత్వమును భాగవతులు అందఱును నిన్నుఁజూచియే నేర్చుకొనవలయును" అని

యనేకవిధముల వినుతి సేసెను. అది విని నామదేవుఁడు అంజలిబంధము గావించి "దేవరవారు ఇట్లు ఎందులకు సెలవిచ్చుచున్నారో తెలియదు. దాసానుదాసుఁడ నగు నేను మీరు చేసిన వినుతికి అర్హుఁడను గాను. నిజముగా మీదర్శనమువలన నేఁడు నేను ధన్యుఁడ నైతిని. వాగ్ములలో నగ్రేసరులు గావున మీరు నాకు అవకాశము లేకుండ ఆగొప్పతనమును నాకె అంటఁగట్టినారు. ఈదాసజనుఁడు ఏలినవారి నమ్మినబంటు వీనిని అన్యథా తలంపవలదు" అని బదులు చెప్పెను.

జ్ఞానదేవుఁడు ఈప్రత్యుత్తరమునకు ఎంతయు ఆనందించి మఱియొకమాఱు గ్రుచ్చి కౌఁగిలించుకొని "వత్సా, నీతో మాటాడవలయును అని నేను చాల దినములనుండి తలంచుచున్నాను. అది నేఁటికి నెఱవేఱినది. నీయెడల నాకు ఒక ప్రార్థనము గలదు. నాకు చిరకాలమునుండి తీర్థయాత్రయు దేవతాదర్శనమును జేయఁ దలంపు గలదు; గాని నీవు వెంట రాకున్నఁ దృప్తి గలుగదు. నీవు నాకోరికను విఫలము సేయవు అను నమ్మకముతో వచ్చినాను. కావున సాధ్యమైనంత త్వరగ బయలుదేఱుము." అని చెప్పెను. తోడనే నామదేవుని శిరమున పిడుగు పడినట్లు అయ్యెను. ఆతని నల్లగుండెకు ఏదో తీవ్రతరాఘాతము తగిలినట్లు అయ్యెను. పాండురంగని దివ్యదర్శనము విడిచియుండుట యెట్లు ?

నామదేవుని ముఖమున విచారము చిహ్నితము అగుటఁ జూచి జ్ఞానదేవుఁడు 'ఈతఁడు నాకోర్కెను మన్నించునా మన్నింపఁడా?' యని సందేహించెను. ఇది తీఱకపూర్వమే నామదేవుఁడు జ్ఞానదేవునిపాదములనుస్పృశించి "మహాత్మా, ఈదీనుఁడు దాసానుదాసుఁడు. వైష్ణవోత్తముల పాదధూళి ఈక్షుద్రునకుఆధారము. భాగవతాగ్రేసరులకు అడ్డు చెప్పుట యనిన నాకు ఎంతో సంకటముగా నుండును. నేను ఇంతవఱకును అట్టిది యెఱుఁగను. నాకు స్వాతంత్ర్యము లేదు. ఈవిషయమును దేవరవారు ముందుగ గమనింపవలయును. బాల్యముప్రారంభించి ఇంతవఱకును నేను ఒక్కక్షణమైన పండరిపురమునువిడిచి యెఱుఁగను. ఒక్కదినమైన శ్రీపాండురంగని సన్నిధిఁ బాసి యెఱుఁగను. త్రికరణశుద్ధిగా నేను పండరినాథునకు అర్పణమై యున్నాను. నీప్రశ్నకు నేను ఏమి చెప్పఁగలను. నీమాట వినినదిమొదలుకొని నాకన్నులు అశ్రుపూరిత

ములై యున్నవి. నాహృదయము తహతహలాడుచున్నది. మహాత్మా, శ్రీహరి నెట్లు విడిచి యుండఁగలను?" అని బదులు చెప్పెను.

జ్ఞానదేవుఁడు ఇది యంతయు విని నామదేవుని భావము అంతయు గ్రహించి "భక్తశిఖామణీ, నీకు హృదయావేదన వలదు రమ్ము. మనము పాండురంగని సన్నిధికిఁ బోదము" అని చెప్పి ఆతనిచేయి పట్టుకొని బయలుదేఱెను.

ప్రాకారములు అన్నియుదాఁటి వారుగర్భాలయము సొచ్చి పాండురంగని యథావిధిగ సేవించిరి. పిదప జ్ఞానదేవుఁడు చేతులు జోడించి "పండరినాథా, నీకుఁ దెలియనిది ఏమియు లేదు. నామనోరథమును ఈడేర్పవలయును" అని ప్రార్థించెను. అందులకుఁ బ్రీతుఁడై పాండురంగఁడు "జ్ఞానదేవా, నీమాటలు వింతఁ గొలుపుచున్నవి. సూర్యునకు కాగడా యవసరము అగునేని నీకు తీర్థాటనము అవసరము కావచ్చును. ఇప్పుడేమిది అట్లు కోరెదవు?" అని ఆశ్చర్యమును జూపెను. మఱల కరకమలములు ముకుళించి జ్ఞానదేవుఁడు "శ్రీహరీ, నీవు చెప్పినది యథార్థమే కావచ్చును. ఎంత విజ్ఞానులు అయినను ఎంతటి భక్తులు అయినను మఱెంతటి విరాగులు అయినను మానవులను అపుడపుడు అజ్ఞానము ఆవరించుచుండుట గలదు. నీవు లేని స్థలము లేదు. అయినను లోకోజ్జీవనార్థము అటనట పుణ్యక్షేత్రములు వెలసియున్నవి. అచ్చటచ్చటకు దాసజనులు లక్షలకొలఁది వచ్చుచుందురు. ఆభక్తసంఘమున ప్రాకృతులకుఁ గాన్పింపని మహాతేజముతో సాక్షాత్కరించు నిన్ను సేవించుట ఒక్కచోటనే యుండిన లభించునా? అందఱభక్తులయందును మహానుభావులు అనేకులు ఉందురు. వారిని సందర్శించి వారి పాదములను బూజించి వారిని సేవించి వారి ఉపదేశములను వినుట ఒక్కచోటనే యుండువారికి లభించునా? సాధన చేయువారి భాగవతులనుబట్టి అనేక రూపములతోడను అనేకనామములతోడను వేంచేసియుండునిన్ను అనేక విధముల సేవించుట ఒక్కచో నుండువారికి లభ్యమగునా? మఱియు నామదేవునివంటి భాగవతాగ్రేసరునితో సంచారముచేసి తరించుటకు తీర్థయాత్రలకన్న ఆధారములేదుగదా? కావున నాయందు అనుగ్రహముఁ బూని నామదేవుని నాతోఁగూడఁ బంపవలయును" అని మఱియు మఱియుఁ బ్రార్థించెను.

పాండురంగఁడు సర్వశక్తుఁడయ్యు జ్ఞానదేవునిమాటలకు అభ్యంతరము సెప్పఁజాలక తనతో వియోగము గలుగు నేమోయనిఅడలుచున్న నామదేవుని జూచి చేరఁ బిలిచి శిరంబు మూర్కొని "వత్సా, జ్ఞానదేవునకు నేను ప్రతి చెప్పఁజాలను అతనికి అతఁడేగాని మఱియొకఁడుసాటి రాఁడు. అతని ప్రభావమును నేనుగూడఁ జెప్పఁజాలను. అతఁడు చెప్పు మాటలకుఁ గల బాహిరార్థము నీతో మైత్రి నెఱపుటగాని వాని పరమార్థము నిన్ను ఉద్ధరించుటయని తెలిసికొనుము. అతఁడు తీర్థాటనము సేయుటలో చాల భావ మున్నది. నిన్ను విడిచి నేనును నన్ను విడిచి నీవును ఉంఁడఁజాలకపోవుటలో అసత్యము లేదు; గాని అతని యాజ్ఞ అవిలంఘ్యము. నీవు అతనితోఁ బోయి అతని మనసున కెక్కునట్లు నడుచుకొనుము." అని యాతనికిఁ జెప్పి జ్ఞానదేవునిఁ జూచి "ఓయా, నీప్రభావమును ఎఱిఁగినవాఁడు నేనొక్కఁడనే. నీవుచేయునది మనోరథము గాదు ఆజ్ఞ. నీయాజ్ఞను నిరాకరించుటకు ఎవరికిని సాధ్యము గాదు. కావుననే చిరకాలసాన్నిధ్యమువలన నాకు విడవరాని ప్రేమభాజనమగు నామదేవుని నీయధీనము చేయుచున్నాను. సర్వజ్ఞుఁడ వగు నీకు దెలుపవలసిన దేమియు లేదు.నామదేవుఁడు నాసాన్నిధ్యముఁ బాసినది మొదలు నాకు క్షణము ఒకమహాయుగమువలె నుండును. కావున నీవు అతనిని కడు జాగరూకతతో రక్షించుచు సాధ్యమైనంతత్వరగా రమ్ము" అని పలికి నామదేవుని చేతిని అతనిచేతియం దుంచెను.

"చిత్తము" అనిపలికి సాష్టాంగవందన మాచరించి సెలవుఁబడసి జ్ఞానదేవుఁడు అచ్చటనుండి కదలెను. పాండురంగఁడు నామదేవుని విడువలేక విడువలేక విడిచెను. నామదేవుఁడు పండరినాథుని సాన్నిధ్యమును వీడఁజాలక వీడఁజాలక విడిచెను. జ్ఞానదేవుఁడు అచ్చటినుండి తిన్నగ చంద్రభాగానదికిఁ బోయి జలకమాడి ఈశ్వరార్పణముగా నామదేవునితో తీర్థయాత్రలు సేయుటకు సంకల్పము చేసెను. నామదేవుఁడు గూడ నట్లే చేసెను.

పిదప నిరువురును బయలుదేఱిరి. కొంతదూరము పోయిన తరువాత,నామదేవుఁడు మాటిమాటికిని వెనుదిరిగిచూచుచు "పాండురంగా, దూరమగుచుంటివా? నిన్ను విడిచి వచ్చుటవలన నాహృదయము కలఁగిపోవుచున్నది. నా భావయంత్రము చిక్కువడిపోవుచున్నది.నాచైతన్యము

లోపించిపోవుచున్నది" అని తేపతేపకును మూర్ఛిల్లసాగెను. అదిచూచి జ్ఞానదేవుఁడు ఆశ్చర్యపడుచు నామదేవునకు ఉపచారములు సేయుచు "భాగవతాగ్రణీ, ఏల నీ కీవిచారము? పండరినాథుఁడు సర్వవ్యాపి. విశేషించి భక్తిప్రీతుఁడు. ఆతనినివిడువఁజాలక నీవెట్లుకుందుచున్నావో, నిన్ను విడువఁజాలక ఆతఁడును అట్లే తహతహపడుచుండును. మీ యన్యోన్యవియోగము నీకంటె ఆతనికి మిగుల దుర్భరము. నీహృదయమునందే తాండవము సేయుచున్న విఠలనాథుని నీవు చూచుట లేదా? ఇఁక నీ కీవిచార మేల?" అని బుజ్జగించుచుండెను. అందులకు నామదేవుఁడు జ్ఞానదేవునిజూచి "మహానుభావా, నీవు అచంచలభక్తుఁడవు కావునను, సుస్థిరహృదయము కావునను నీకు బెంగ లేదు; కాని నే నెట్లు తాళగలను? ఆపాండురంగని దివ్యమంగళవిగ్రహమును జూడకున్న నాకన్నులు నిలువఁజాలవు. నాహృదయము తెరిగొనఁజాలదు. విచారమన నెట్టిదో యెఱుఁగనినీకు నావిచార మెట్టిదో ఎట్లు దెలియగలదు. నీ వనుగ్రహించి విఠలనాథుని దర్శనము దినదినము నాకు కలుగునట్లు చేయ వేని నేను బ్రతుకఁజాలను" అని అనేకవిధముల దీనాలాపము లాడుచునే జ్ఞానదేవునివెంటఁ బోవుచుండెను.

మఱికొంతదూరము పోయినతరువాత నామదేవునిఁ జూచి జ్ఞానదేవుఁడు "భక్తశిఖామణీ, నీచరిత్రము మిగుల ఆశ్చర్యకరమై యున్నది. నీవు శ్రీహరి నెట్లు ఉపాసించితివి? ఆజగదీశునియనుగ్రహము నీకు ఎట్లు లభ్యమైనది?" అనియడిగెను. ఇదివినినామదేవుఁడు జ్ఞానదేవునిపాదముల నంటి "మహాత్మా, మీరు ఇట్లు అడుగరాదు. ఈదీనునియందు మీరు తెలిసికొనవలసినది ఏమియు లేదు"అని బదులుచెప్పెను; గాని అంతటితో జ్ఞానదేవునకు తృప్తికలుగ లేదు.ఆతఁడునామదేవునిబుజ్జగించి "నీహృదయము ఇంత గంభీరమైనది" అని నాకు మొదటినుండియు నెఱుకయే. తెలిసినవానివద్ద ఇంక ఎంతదడవు దాఁచెదవు? "నామదేవా! పయిపయి రంగులు చూచి తత్త్వము నూహించువారు నీయెదుటశృంగభంగము గాంచుటలో సందియము లేదు. తెలిసినవారికి ఇప్పుడు నీవుఆడిన పలుకులయందు ఎంతో యర్థము గలదు. నీసంభాషణము వినుటవలన నాకు పరమానందము గలుగుచున్నది. పాండురంగని అనుగ్రహము లేకున్న ఇట్టి మహామహిమోపశోభితుఁడవు అగు నీతోడిసాహచర్యము

నాకు లభించియుండదు గదా? ఇఁక వెనుకటి వృత్తాంతమంతయు నేటికి? సాధుసంగమువలనఁ గలుగు ప్రయోజనమువలన బడయుటకు నేను నీతో తీర్థయాత్రకు బయల్వెడలితిని. నీవు నాకు మనోరథమును ద్రోసివేసెదవేని పాండురంగఁడు చెప్పినట్లు నిజముగ ఈనా ప్రయాణము అంతయు వ్యర్థమేగాక విశేషించి నిన్ను ఇట్లు శ్రమపెట్టినందులకు నాకు మహాపాతకము గూడ సంభవింపఁగలదు. కావున నా ప్రార్థనమును మన్నించి నాయెడల ననుగ్రహము ఉంచి నాకోరికను దీర్పుము" అని మఱల నామదేవుని ప్రార్థనాపూర్వకముగ బలవంతము చేసెను. నామదేవుఁడు కొంతతడవు నిరుత్తరుఁడు అయ్యెను.

తుదకు తప్పనిసరియగుటచే నామదేవుఁడు జ్ఞానదేవుని పాదములపై వ్రాలి "ఇట్లు నిర్బంధపెట్టిన నేనెట్లు తాళఁగలను? ఈమూఢునకు తెలిసినదేమున్నది? మీనిర్బంధమే నన్ను పలికించుచున్నది. సర్వజ్ఞులగు మీయెదుట మాటాడుటకే సిగ్గగుచున్నది. నేను శాస్త్రమును చదువుకొనలేదు. యోగములను అభ్యసింపలేదు. కేవలము శ్రీహరియెడల మూఢభక్తి చేసితిని. ఈశ్వరదత్తమగు దేహమును ఈశ్వరసేవయందే వినియోగింపవలయు ననియు ఈశ్వరునిచే ననుగ్రహింపఁబడిన హృదయమును తత్స్మరణమునందే వినియోగింపవలయు ననియు ఈవిధమున దేవదేవునిచే నొసంగఁబడిన సర్వమును ఈశ్వరునికే సమర్పింపవలయు ననియు నాకు తోఁచినది. నేనట్లే చేసితిని. ఏదోయొక యశరీరవాణి నేను చేసినది సరియని నాకు వినిపించినది. అప్పటినుండియు నేను ఆ మార్గమునుండి విచ్యుతుఁడను గాలేదు. శ్రీహరి ఆనందముతో నన్ను స్వీకరించినాఁడు. నేనిప్పుడు ఆసచ్చిదానందస్వరూపమునే నాహృదయమున నిడుకొని శ్రవణమననాదులచే అర్చించుచు ఆనందరసమగ్నుఁడనై యున్నాను." అని చెప్పెను.

జ్ఞానదేవునకు మహానందము కలిగెను. తోడనే యాతఁడు నామదేవుని దృఢముగ కౌఁగిలించుకొని "మహాత్మా, ధన్యుఁడనైతిని. నీదివ్యసాధనాప్రణాలి అనితరసాధ్యమై యున్నది. మముబోంట్లకు ఇంత సులభముగా హృదయము స్వాధీనముకాలేదు. నినుబోలువారు ఇఁక లేరని చెప్పుట అసంభావ్యము గాదు" అని కొనియాడెను. తుదకు వారు ఢిల్లీ నగరము చేరుకొనిరి. అచ్చటివారెల్లరును కొలఁదిదినములయందే నామ

దేవుని ప్రభావమును విని గుంపులుగుంపులుగా వచ్చి సేవించి పోసాగిరి. మఱికొన్నిదినములలో నగరమునందంతటను ఈవృత్తాంతము వెల్లడి యయ్యెను. జనసంవాదము అచ్చటి తురుష్క ప్రభువునకు చాల వింతగను విపరీతముగను దోఁచెను. నామదేవుని ప్రభావమునందు ఆతనికి నమ్మకము కలుగలేదు. విశేషించి పరీక్షింపవలెనని సంకల్పము కలిగెను.

ఇట్టి సంకల్పముతో పాదుషాహా ఒకగోవత్సమును పట్టించుకొని అక్కడకు వచ్చి "నీవు నిజముగ హరిదాసుఁడవేని దీనిని బ్రదికింపుము. లేకున్న నిన్ను శిక్షింతును" అని నామదేవునితోఁ బలికెను; కాని నామదేవుఁడు ఏమియు భయపడలేదు చలింపను లేదు మాఱుకూడఁ బలుకలేదు ఈస్థితివలన పాదుషాహాకు కోపము పెరిగిపోయెను. మఱల నాతఁడు జడిపించుచు దీని నెన్నిదినములలో బ్రతికించెదవు? మాఱు పల్కుము" అని మేఘగంభీరభాషణములతో పలికెను. అది చూచి నామదేవుఁడు మందహాసము గావించి "నాలుగుదినములలో రమ్ము. పో. ఇఁక పలుకవలదు" అని బదులు చెప్పెను. పాదుషాహా తెలివితేటలుగల భటులను అచ్చట కాపలా వేసి కోటకుఁ బోయెను.

పిదప నామదేవుఁడు శ్రీహరిని ప్రార్థింపఁదొడఁగెను.

శ్లో. జానాతి రామ తవ తత్త్వగతిం హనూమాన్
జానాతి రామ తవ సఖ్యగతిం కపీశః,
జానాతి రామ తవ యుద్ధగతిం దశాస్యో
జానాతి రామ ధనదానుజ ఏవ సత్యమ్.

శ్లో. హే రామ హే రమణ హే జగదేకవీర
హే నాథ హే రఘుపతే కరుణాలవాల,
హే జానకీరమణ హే జగదేకబంధో
మాం పాహి దీన మనిశం కృపణం కృతఘ్నమ్.

(రామకర్ణామృతము. 17-18. శ. 4. అ)

అని ఈతీరున నామదేవుఁడు నాలుగుదినములు ప్రార్థించెను. అప్పటికి పాండురంగఁడు నిజరూపముతో అచ్చట సాక్షాత్కరించెను. తోడనే నామదేవుఁడు శ్రీహరిని వంగొని సాష్టాంగ మాచరించి "జగన్నాథా, నాపై నాగ్రహ మేల కలుగవలెను? నేనేమి యపరాధము చేసితిని? నాలుగుదినములు నన్నేల యుపేక్ష చేసితివి? నాఁడు నీవియోగ భారమును

సహింపఁజాల నంటివి; గాని ఇప్పుడు ఇన్ని దినములు ఇంత దీనుఁడనై ప్రార్థించినను ఏల దయ సూపకపోతివి? ఇట్లయిన నేను బ్రతుకఁగలనా?" అని దీనముగఁ బలికెను. అందులకు పాండురంగఁడు మందహాసము గావించి "నామదేవా, తప్పంతయు నాపై మోపుట ధర్మమా! నీవు పాదుషాహాతో 'ఈయావు నాలుగు దినములలో బ్రతికింతు' నని చెప్పితివి. అగుటచే నేనింతవఱకును రాఁజాలక పోతిని. నీవు అప్పుడే బ్రతికింతు నని ఏల చెప్పకపోతివి? నాహృదయమును నీవు తెలిసికొనఁజాలక పోతివి" అని పలుకుచు చచ్చిపడియున్న ఆవుకళేబరమును ముట్టుకొని తోడనే తిరోహితుఁడయ్యెను. ఆవు లేచి నిలుచెను. మహానంద పరవశుఁడై నామదేవుఁడు నృత్యము ప్రారంభించెను.

ఇది యంతయుఁ జూచి రాజభటులు తెల్లవోయి కొంత తడవు ప్రాణ్వసియుండి పిదప తిన్నగ పాదుషాహచెంతకుఁ బోయి సంగతి యంతయుఁ దెలిపిరి. ఆశ్చర్యాతిరేకముచే పాదుషాహ తోలుత నిర్విణ్ణుఁడై పిదప తేరికొని వెంటనే అటకుఁ బరువెత్తుకొనివచ్చి "నాయపరాధమును క్షమింపవలయు" నని నామదేవుని పాదముపై వ్రాలెను. అందఱును ఆనందించిరి. నామదేవుఁడు పాదుషాహాను తన శిష్యవర్గమున చేర్చికొనియెను. నామదేవుఁడు మహామహిమము స్వల్పకాలమునందే దేశము పలుమూలలకు నల్లుకొనియెను.

పిదప నచ్చట నొకటి రెండు దినములు ఉండి నామదేవుఁడును జ్ఞానదేవుఁడును మఱల బయలుదేఱి ప్రయాగ, అయోధ్య, మథుర, గోకులబృందావనము, ద్వారక మున్నగు పుణ్యస్థలములను సందర్శించి మార్వాడీదేశమునకు ప్రయాణమైరి; ఒకనాటి ప్రయాణమున వారు ఒక యామ విడిచి రెండవయామ వచ్చుచుండఁగా మార్గమధ్యమున ఇరువురకునుగూడ నొక్కమాఱుగ దాహము అయ్యెను. వారంతటను గలయఁ జూచిరి; గాని సమీపమున నేదియు తటాకము కాన్పింపదయ్యెను. ఆప్రయాసముతోడనే వారు మఱికొంతదూరము అరుగునప్పటికి అచ్చట నొక బావి కాన్పించెను; గాని అచ్చట చేద త్రాడు మున్నగు సాధనములు ఏమియు లేకపోయెను.

అయినను జ్ఞానదేవ నామదేవులవంటి భాగవతాగ్రేసరులకు ఏమిలోపము? జ్ఞానదేవుఁడు చూచుచుండఁగనే దేవతలు స్వర్గమునుండి

భూమికి ఆధారములు ఏమియు లేకయే దిగునట్లు నూతిలో దిగి దప్పి దీఱ అందలి మధురజలమును ద్రావి బైటకు వచ్చెను. అంతట నామ దేవుఁడు చేతులు జోడించి "జగన్నాథా! భక్తచింతామణీ, రక్షింపుము. సందర్భమును బట్టిచూచిన నీకు నేను పండరిపురమున నిన్ను సందర్శించుట పొసఁగనట్లు తోఁచుచున్నది. అయినను సకలమునకు నీవే కర్తవు" అని ప్రార్థించెను. తోడనే ఈప్రార్థనము ముగియక పూర్వమే బావియందలి నీరు పొంగి పైకి వచ్చెను. అది చూచి నామదేవుఁడు పాండురంగని పాదపద్మములను స్మరించి పిపాస శమించునట్లు జలమును ద్రావెను. ఈవింతను జూచి జ్ఞానదేవుఁడు నామదేవుని కౌఁగిలించుకొని "మహాత్మా, సర్వకాలసర్వావస్థలయందును పాండురంగఁడు నీకుఁ దోడునీడయై యున్నాఁడు. అనుక్షణమును నేను నీసాహచర్యమువలన పునీతుఁడ నగుచున్నాను" అని వినుతిచేసెను. నామదేవుఁడు గూడ జ్ఞానదేవునిఁ బ్రతివినుతిచేసెను. ఈతీఱున ఒకరి ప్రభావమును ఒకరు కొనియాడుకొనినతరువాత వారు ఇరువురును మఱల ప్రయాణము సాగించిరి. వారిరువురును పిపాస తీర్చుకొను సందర్భమున మహాద్భుతములు చూపిన ఆ బావిచెంతకు వచ్చి నేఁటికిని వేలకొలఁది సాధుజనులు మార్గశిరమాసమున అవగాహనము చేసి విముక్తపాపు లగుచుందురు.

హరిద్వారము, హిమాచలము, నైమిశారణ్యము, గయ, జగన్నాథము, శ్రీకూర్మము, సింహాచలము, కోటిలింగాలు, ద్రాక్షారామము, భీమేశ్వరము, కోటిఫలి, కాళహస్తి, వేంకటాచలము, శ్రీరంగము, మున్నగు సమస్తతీర్థక్షేత్రములను వారు సేవించి తుదకు మహాశివరాత్రికి నాగనాథపురము వచ్చి చేరికొనిరి. అచ్చట నాఁడు నాగనాథునియాలయము అంతయు జనసంఘముచే క్రిక్కిరిసియుండెను. అయినను వారు ఎట్లో తెలపిచేసికొని గర్భాలయము సొచ్చి నాగనాథునకు సాష్టాంగవందనములు అర్పించి ధ్యానముచేసి తుదకు భగవద్గుణకీర్తనముప్రారంభించిరి. వారి మనోహరగానపద్ధతికి అబ్బురపడి అచ్చటి జనసంఘము అంతయు నిశ్చేష్టమైయుండెను.

ఇట్లు ఉండఁ గొంతసేపటికి అర్చకులు స్నానసంధ్యాద్యనుష్ఠానములు అన్నియు ముగించికొని స్వామినిఁ బూజించుటకు వచ్చిరి; గాని

వారు లోనికిఁ బోవుటకు మార్గము కానిపింపదయ్యెను. అందులకు కుపి
తులై వారు జ్ఞానదేవుని నామదేవునిఁ జూచి "ఇదియేమి గందరగోళ
ము? త్రోలఁగిపొండు. ఈశ్వరుని సేవించుటకు అనేకులు వచ్చుచున్నా
రు. వారికేవరికిని మాకుఁగూడ మార్గము లేకుండ నిట్లు అడ్డముగాఁ
గూర్చుండినదెట్లు? పొండు. ఈవేషములు అన్నియు మాకు తెలియని
వి గావు" అనిగర్జించి పలికిరి; గాని భగవద్గుణానుభవమున నున్న నా
మదేవునకును జ్ఞానదేవునకును ఈమాటలు విన్పింపవయ్యెను. అందు
లకు మఱింత ఆగ్రహపడి అర్చకులు "సంగతి యంతయు పూర్వవిధ
ముగనే చెప్పి పొండు. ఆలయము వెనుకకుఁ బోయి మీగోల మీచి
త్తము వచ్చినట్లు చేసికొనుఁడు" అని యాజ్ఞాపించిరి. నామదేవుఁడును
జ్ఞానదేవుఁడును మాఱుపలుకకుండ అట్లె చేసిరి. అర్చకులు "మూఢులు"
అని నవ్వుకొనుచుఁ దమపనిమీఁదఁ బోయిరి.

యథాపూర్వముగ నామదేవుఁడును జ్ఞానదేవుఁడును ఆలయ
ము వెనుకనే భగవద్గుణకీర్తనము ప్రారంభించిరి. ఇట్లు కొన్ని నిముస
ములు గడచునప్పటికి ఆకసమునుండి విద్యుల్లతలవలె వెలుంగుచు
తొమ్మిదిలక్షలమంది పతాకములను గైకొని వచ్చి ఆకసమునందే సమీ
పమున నిలిచి యుండిరి. ఈసమయమున దేవతలు పుష్పవర్షము గురి
సిరి. అదిచూచి అచ్చటివారందఱును నామదేవుని ప్రభావమును అనే
కవిధములఁ గొనియాడసాగిరి.

ఇట్లుండఁగా ఆపగలును, రాత్రియుఁగూడ గడచిపోయెను. అర్థ
రాత్రి యగునప్పటికి బాలచంద్రుని సిగపూవుగా ధరించిన నాగనా
థుఁడు ఆలయముతోఁగూడ నామదేవునకు అభిముఖముగ అనఁగా
పశ్చిమాభిముఖముగఁ దిరిగి ఆతని అద్వితీయమగు ఈశ్వరగుణకీర్తనా
చాతుర్యమునకు ఆనందింపసాగెను.

మఱికొంత సేపటికి ఉదయము అయ్యెను. యథాపూర్వముగ
అర్చకులు మఱల ఈశ్వరునిఁ బూజించుటకు స్నానసంధ్యాదికములు
అన్నియు ముగించుకొని వచ్చిరి; గాని వారికి అంతయు విపరీతముగఁ
దోఁపసాగెను. పుష్కరిణులు, తక్కిన భవనములు, మంటపములు
మున్నగునవియెల్ల యథాప్రకారముగనే యున్నను ఆలయము మాత్ర
ము అట్లు తిరిగిపోయి యుండుటచే వారికిఁ గొంతవఱకును దిగ్భ్రమ

గలిగెను. ఈస్థితి కొంతసేపటికిఁ బోఁగా వారు ఇందులకు నామదేవుని ప్రభావమే కారణము అని తెలిసికొని వెంటనే అచ్చటకుఁ బోయి అనేక విధములఁ గొనియాడఁ జొచ్చిరి. అంతవఱకును అచ్చటనే యుండియు మైమఱచి యుండిరి; గావున అచ్చటివారు ఎల్లరును ఈవిషయమును విని పరమాశ్చర్యచకితులై నామదేవునకు సాష్టాంగవందనములు అర్పించి ఓపినంతవఱకును సన్నుతింపఁగడఁగిరి. నింగిని ఉన్న దేవతాపురుషులు అదృశ్యులైరి. ఆలయము ప్రతిధ్వనించునట్లు ఆనందధ్వానములు చెలరేఁగెను. జ్ఞానదేవుఁడు నామదేవుని కౌఁగిలించుకొని మిగులఁ గొనియాడెను. ఇప్పటికిఁ గూడ నాగనాథుని ఆలయము పశ్చిమాభిముఖమయియే యున్నది.

అచ్చట మఱికొన్నిదినములు ఉండి నామదేవుఁడును జ్ఞానదేవుఁడును నాగనాథుని సెలవుఁ బడసి పండరిపురమునకుఁ బ్రయాణము సాగించిరి. ఇంతవఱకును నామదేవుఁడు ప్రయాణము సేయునపుడు మార్గమధ్యమున జ్ఞానదేవునితో సకలవిషయములను గుఱించియు యథేచ్ఛగ ముచ్చటించెడువాఁడు; గాని ఈప్రయాణమునమాత్రము తల్లినిఁ జేరఁబోవు దూడవలె పండరినాథునియందే హృదయమును లీనముచేసి మౌనవృత్తి వహించి నడువసాగెను. అదిచూచి జ్ఞానదేవుఁడు "ఈమహాత్ముఁడు పండరినాథుని సమీపించుచున్నానను ఆనందమువలన మైమఱచియున్నాఁడు. ఇప్పుడు ఈతనినిఁ బలుకరించి ఆయానందానుభవమునకు విఘ్నము నాపాదించుట ధర్మముగాదు" అని తలంచి ఏమియు పలుకకయే వెంట వచ్చుచుండెను.

ఇట్లు ఒకటిరెండు దినముల ప్రయాణము సాగునప్పటికి ఒకనాఁటియుదయము పండరిపురము కొంచెము దూరముననున్నదనఁగా స్వామి ఆలయగోపురాగ్రము దృగ్గోచర మయ్యెను. తోడనే నామదేవుఁడు సాష్టాంగనమస్కారము లాచరించి,—

చ. "కనుకటిచీఁకటింబడి తనూఘటించిన జన్మశతంబు లట్లు సేఁ
దుదు భ్రమ మానిపోవక గదుం గలివొందుచు డెందమా! చిరం
తనతపముల్ ఫలించి పురతఃస్థితి నున్నది కృష్ణరూపమై
యనవరతానుచింతనసుధారసవీచుల నోలలాడుమీ."

(కృష్ణకర్ణామృతము. ఆ. 3 ప. 64.)

అని పలికి భక్తివివశుఁడై కొంతసేపటికి లేచి పూర్వాధిక వేగంబునఁ బోయి చంద్రభాగానదిలో స్నానమాడి మఱింత వేగముగఁ బోయి పండరినాథుని యాలయముఁ జొచ్చెను. ఈతనిని చూచిన వెంటనే పండరినాథుఁడు ఎదురువచ్చి చేతులు సాచి నామదేవుఁడు సాష్టాంగపడఁబోవుచుండఁగనే తటాలునఁ బట్టుకొని కౌఁగిటఁ బొదివి పట్టి శిరంబు మూర్కొని "నాయనా, నిన్నెన్నిదినములకుఁ గంటినోయి! నీవు ఇచ్చట లేకపోవుటచే ఇన్నిదినములును నాకన్నులు కాయలు కాచినవి. నా మనసు మనసున లేదు. ఏమియు తోఁచినది కాదు. అంతయు అంధకారబంధురముగఁ గాన్పించెను. నేఁడు నిన్ను గాంచుటవలన నాప్రాణములు లేచివచ్చుచున్నవి. కన్నులు తెరికొనుచున్నవి. ఆహా! నేఁ డెంతయానందముగా నున్నది" అని పలికి "జ్ఞానదేవా, మీయిరువురకొఱకును నేను క్షణమొక మహాయుగమువలెఁ గడుపుచు ఎదురుచూచుచున్నాను మీతీర్థయాత్ర సాంగమైనదిగదా? దురాత్ములవలన ఏమియు చిక్కులపాలుగాకుండ నిరాటంకముగ వచ్చితిరిగదా? నీకోరిక నెఱవేఱినది గదా? అద్దిరా! నీపట్టుదల! నీ సాధనాప్రణాళి! నీ యచంచలభక్తి! నీవినిర్మలజ్ఞానము! నీయనుపమేయవైరాగ్యము! నాకు అపరిమితానందమగుచున్నది. ఇంతటివాఁడ వయ్యు నీవు డంభమును ఎఱుఁగవు. ప్రపంచమును ఎఱుఁగవు. మదీయతత్త్వము తక్క నీయోచనకు మఱియొకటి అందదు. చాల నానందమైనది" అని యాతనిని గూడ ఆదరించి చేరఁదీసి కౌఁగిలించుకొనియెను.

నామదేవజ్ఞానదేవుల హృదయసీమలయందు నిర్మలానందవాహిని పొంగిపొరలిపోయెను. అంతట నామదేవుఁడు మోఁకరించి నిలిచి చేతులు దోయిలించి "శ్రీహరీ, భక్తబాంధవా, నన్ను పెద్దఁజేయవలెనని నాయందలి యనుగ్రహముచే నిట్లు పలికెదవు; గాని సర్వాంతర్యామి వగు నీకు తెలియని దేమున్నది? నేను చెప్పవలసిన దంతయు నీవే చెప్పివేసి నాకు వాక్బంధనము చేసితివి. జనార్దనా, నీ నిర్హేతుకజాయమానకటాక్షమునకు మేఱ కలదా? ఈక్షుద్రుని యెడల ఇంత యనురాగమును జూపుచున్న నీతత్త్వము నెఱుంగ నెవ్వరి తరము! నీవు చెప్పినట్లు జ్ఞానదేవుఁడు సాక్షాత్తుగ సచ్చిదానందస్వరూపుఁడు. ఆతని సాహచర్యమువలన నాహృదయము నిర్మలమైనది. నాశరీరము పావనమైనది.

నా జన్మ సఫల మైనది. నేను ధన్యుఁడనైతిని. మహాత్ముఁడగు జ్ఞానదేవుని సన్నిధి లేకపోయిన భవద్వియోగభారమును సహింపఁజాలక నాహృదయగోళము ఇంతపఱకే పగిలిపోయియుండును.” అని పలుకుచు స్వామి పాదములను కన్నీటిచే కడిగెను.

జ్ఞానదేవుఁడు కూడ నట్లే మోఁకరించి నిలిచి కరకమలములను ముకుళించి “అచ్యుతా, సర్వలోకశరణ్యా, నీలీలల నెఱుంగ నెవరితరము? ఏమియు నెఱుగనట్లుండెదవు. నామరూపములు లేనివానివలెనుందువు. గాని ఈజగమంతను నీవే యాడించుచున్నావు. తత్త్వవిచారణ సేయఁగలుగువారికి అనంతరూపుఁడవును అనంతనాముఁడవునై సాక్షాత్కరించుచున్నావు. నీయాద్యంతముల నెఱిఁగినవా రెవ్వరును లేరు. నీకు ఆదియు అంతమును లేనే లేదు. కొందఱు భక్తులు నీవు తమ్మే పూర్తిగ అనుగ్రహించుచున్నావని చెప్పెదరు; గాని ఎవరికివారికే అట్లు చేయుచున్నావు. నీవు ప్రతిభక్తునిగూడ నీకంటె నాకు ప్రేమభాజనము లేదని చెప్పెదవు; గాని ఇందఱుభక్తులలో పూర్ణముగ నీవిలాసములు తెలిసినవా రెవరున్నారు? అయినను నాయెడల చూపుచున్న ప్రేమము అపారము. ఇది నీయకారణవాత్సల్యమునకు చిహ్నము; గాని నా భక్తికి సూచకము గాదు. మాధవా! నీయనుగ్రహమునకు నీవాత్సల్యము కాక కేవలము నాభక్తియే కారణము అగునెడల ఎవనికి నిన్ను సమీపింప శక్తి గలదు? మాహృదయములు నిర్మలములైన వెంటనే నీ కభిముఖములైనతోడనే వారికి నీయనురాగదీప్తిచే ప్రకాశము గలిగించెదవు; గాని కాకున్న నవఁడు స్వశక్తిచే నిన్ను చేరఁగలఁడు? మధుసూదనా, విశ్వమంతయు వ్యాపించియున్నసర్వజ్ఞుఁడ వయ్యు నన్ను నీతీర్థయాత్ర నిరాటంకముగ సాగినదా? యని యడుగుచున్నావా? అవును. అడుగవలసినదే. నేను చెప్పవలసినదే. చెప్పెద. వినుము. నాయెడల అపారకృప వహించి నామదేవుని నాకు తోడిచ్చిన వెనుక ఇఁక నాకు లోపములు ఏమి యుండును? అంతయు నిరాటంకముగ నెఱవేఱినది. సర్వమును బ్రహ్మానందప్రదముగ పూర్తియైనది. శ్రీధరా, నీయనుగ్రహపాత్రునకు అసాధ్యము లేమి యుండును? అంతయు అనుకొనినట్లే పూర్తియైనది. గావుననే తిరుగ నీదర్శనమునకు వచ్చితిని.” అని తానుగూడ బాష్పోదకముచే శ్రీహరికి పాద్యమును ఘటించెను.

పండరినాథుఁడు నామదేవుని కంఠమున తులసీహారమును వేసి మఱల నాదరించి "వత్సా, నీవు చాల శ్రమపడి తీర్థయాత్ర చేసికొని వచ్చితివి. కావున వ్రతము ఫలించుటకు ఉద్యాపనము సేయవలయును" అనిచెప్పి తానొక బ్రాహ్మణవేషమును ధరించి సోపానదేవుఁడు జ్ఞానదేవుఁడు మున్నగు భక్తాగ్రేసరులు వెనువెంట వచ్చుచుండ నామదేవుని వెంటనిడుకొని గ్రామములోనికి బయలుదేఱెను. నిండుచంద్రునివలె వెలుంగుచు ప్రచ్ఛన్నవేషుఁడై యున్న పండరినాథునిచుట్టును చంద్రుని చుట్టునున్న నక్షత్రములవలె అలరారుచున్న భాగవతులను జూచి గ్రామవాసులందఱును అద్భుతాశ్చర్యచకితులగుచుండిరి. శ్రీహరి బ్రాహ్మణుల నందఱను సంబోధించి "నామదేవుఁడు తాను చేసిన తీర్థయాత్రకు ఉద్యాపనము చేయుచున్నాఁడు; గావున మీరందఱునువిందునకు దయ చేయవలయును" అని పిలువఁదొడఁగెను. నాలుగ్గడియలలో ఆగ్రామమునందలి బ్రాహ్మణుల నందఱను పిలుచుట యైపోయెను. స్వస్థానమునకు వచ్చినతర్వాత శ్రీహరి కామధేను కల్పవృక్షములను స్మరించెను. తోడనే అవి సాక్షాత్కరించి విందునకు వలయు నేర్పాటు లన్నియు చూచుచుండఁగనే ముగించి వేసెను. కొంతసేపటికి బ్రాహ్మణులు తండోపతండములుగ వచ్చిరి. పిదప పాండురంగఁడు చేయవలసినకృత్యమంతయు నామదేవునిచేఁ జేయించి బ్రాహ్మణులను మృష్టాన్నసంతృప్తులం గావించి "మహానుభావులారా, తాంబూలములనుపుచ్చుకొనిపోవచ్చును. కొంచెము తడవు విశ్రమింపుఁడు" అని చెప్పి నామదేవాది భక్తులతోఁ గూడ తాను భోజనమునకుఁ గూర్చుండెను. రుక్మిణీసత్యభామలు వడ్డించిరి. భోజనము ప్రారంభ మయ్యెను. వారి యుచ్ఛిష్టమును వీరును వీరి యుచ్ఛిష్టమును వారును అందఱ యుచ్ఛిష్టమును పండరినాథుఁడును పండరినాథుని యుచ్ఛిష్టమును అందఱును భుజింపసాగిరి.

ఇది చూచి బ్రాహ్మణులు చాల కటకటం బడిరి. "ఈబ్రాహ్మణుఁ డెవ్వఁడో తెలియదు. సంగతి సందర్భములను బట్టిచూచిన బ్రాహ్మణుఁ డగునా కాదా! యని గూడ సందేహింపవలసివచ్చుచున్నది. మనము ఇట్టు లేమియు విచారింపకయే త్వరపడి విందు కుడిచితిమి. మన బ్రాహ్మణ్యము చంద్రభాగలో కలసిపోయినది" అనితహతహపడి వారు బ్రాహ్మణవేషధారి యగు పండరినాథుఁడు తాంబూలము లీయ వచ్చినపుడు

"దూరముగ నిలువుము. తొలుత నేమో నీవు బ్రాహ్మణరూప చండాలుఁడవని తెలిసికొనఁజాలక పోయితిమి. నమ్మి వచ్చినందులకు బాగుననే చేసితివి. నీతాంబూలములు మాకు వలదు. నీవు బ్రాహ్మణుఁడవేని వర్ణాశ్రమాచారభ్రష్టులగు వీరితో భుజించినందులకు ప్రాయశ్చిత్తముఁ జేసికొనుము. లేకున్న వ్యవహారము బాగుగ జరుగదు" అని పలికిరి.

పండరినాథుఁడు ఇది యంతయు విని "వీరు మూఢాగ్రేసరులై యున్నారు. శాస్త్రవాదమునకు పనికిరారు. యుక్తివాదమునకు రారు. తమకుఁ దోఁచదు. చెప్పిన వినరు. అజ్ఞానలవదుర్విదగ్ధులతో వాదింపఁబూనుట నవ్వులాటకు కారణము" అని తలఁచి ఏమియు నెఱుఁగనివానివలె "బ్రాహ్మణప్రవరులారా! మీయాజ్ఞాప్రకారమే చేసెదను. అంతయు మీరే నెఱవేర్పవలయును" అని చెప్పెను. బ్రాహ్మణులు అంగీకరించిరి. మఱునాఁడు చంద్రభాగానదీతీరమున వారు యథాశాస్త్రముగ బ్రాహ్మణరూపి యగుపండరినాథునకు యథాశాస్త్రముగ ప్రాయశ్చిత్తముచేసిరి. "మన పంతము నెగ్గినది" అని అంతయునైన తరువాత బ్రాహ్మణులు చాల గర్వించిరి.

అపుడు పండరినాథుఁడు బ్రాహ్మణుల నందఱను జూచి "మహానుభావులారా, మీయాజ్ఞ నెఱవేఱినది మీయనుగ్రహమువలన నేను పునీతుఁడనైతిని; కావున నేను తరించుటకు నేఁడు నేను ప్రత్యేకముగ జేయఁబోవువిందునకు మీరందఱును దయచేసి ఆరగింపవలయును" అని ప్రార్థించెను. బ్రాహ్మణులు అంగీకరించిరి

అనుష్ఠానము లన్నియు తీర్చుకొని యుక్తసమయమునకు బ్రాహ్మణులందఱును వచ్చిరి. వారిలో నాలుగైదుగురు ఒక గదిలో సిద్ధముగానున్న దివ్యములగు భోజనపదార్థములను వడ్డించుకొని భోజనము ప్రారంభించిరి. ఈసమయమున పండరినాథుఁడు తన నిజరూపమును దాల్చి బ్రాహ్మణుల నడుమ సంచరింపసాగెను.

ఇది చూచి బ్రాహ్మణులు తెల్లబోయిరి. "అయ్యో మనము గ్రహింపలేక పోయితిమి. పాండురంగఁడే ఇట్లు ప్రచ్ఛన్నరూపముదాల్చి ఇన్ని లీలలను జేసెను. కట్టా! మన మెంత దుర్భాగ్యుల మైపోయితిమి. దేవాదిదేవునకు ప్రాయశ్చిత్తము చేయించిన మనకు ఇఁక పుట్టగతులు గలవా?" అని యనేకవిధముల పరితపించుచుండ పండరినాథుఁడు చూచు

చుండఁగనే మఱల తొల్లిటి ప్రచ్ఛన్నరూపమును ధరించి నామదేవుని చే వారికి నమస్కారములు చేయించి "బ్రాహ్మణోత్తములారా, ఈతనిని అనుగ్రహింపుఁడు. ఈతఁడు నాయారవప్రాణము. భక్తిమార్గమున నన్ను జేరఁదలఁచువారిలో నీతఁ డగ్రేసరుఁడు. ఇంతటి భక్తశిఖామణి మఱియొందును కలుగఁబోఁడు, నన్ను జేరుటకు అనేకమార్గములు కలవు. అందు మీరు అవలంబించిన మార్గము ఒకటి ఈతఁడు అవలంబించిన మార్గము ఒకటి. ఇంకను అనేకమార్గము లున్నవి. మీరు ఒకరి నొకరు ద్వేషించుకొనుట ఏమి ధర్మము ? ఏమి లాభము ? మీమార్గమున మీరు ఘనులు. అట్లె ఎవరిమార్గమున వారు ఘనులు. మార్గము మాత్రము మంచిది గావలెను. అది నన్ను జేర్చునది కావలెను. కావున తత్త్వము నెఱింగి ప్రవర్తించుట మంచిది" అని చెప్పి విరమించెను.

బ్రాహ్మణులు వివేకమును గాంచిరి. వారందఱును తమ యపరాధమును గుఱించి తమ్ము కాపాడవలయు నని అనేకవిధముల ప్రార్థించి పెక్కువిధముల స్తోత్రము గావించిరి. అగణ్యసాష్టాంగనమస్కారములాచరించిరి. భగవంతుఁడు వారి ప్రార్థనలు మన్నించెను. వారికి అభయమిచ్చెను. అందఱును సెలవుఁ బడసి ఎవరియిండ్లకు వారు పోయిరి.

పిదప మఱికొన్ని దినములు గడచిపోయెను; ఒకనాఁడు నామదేవుఁడు జ్ఞానదేవుఁడు భక్తాగ్రేసరులు అందఱును గోరాకుంభారు ప్రార్థింపఁగా అతని యింటికిఁ బోయిరి. ఆసమయమున అతఁడు వారి నందఱను జాల మర్యాద చేసి మహాదరముతోఁ బూజించి సేవించెను. అంతట జ్ఞానదేవుఁడు గోరాకుంభారునిఁ జేరఁబిలిచి "మహాత్మా, నేఁడు నీయింటికి వచ్చి నీచే నాదరింపఁబడుటవలన మేము ధన్యులము అయితిమి. నీవు తొల్లి కుంభకారుఁడవు గావున ఘటములమంచిచెడ్డలు నీకు దెలియనివిగావు. ఇచ్చట నీవు ఇన్ని ఘటములను వరుసగాఁ గూర్చుండఁ బెట్టితివిగదా ? ఇన్నిటిలో ఉత్తమాధమభేదములను వివరించిచెప్పుము. అని కోరెను; అదివిని గోరాకుంభారు అనేకవిధముల తప్పించుకొనవలయును అని చూచెను; గాని ప్రయోజనము లేకపోయెను. తుదకు ఆతఁడు జ్ఞానదేవుని ఆజ్ఞాప్రకారము ఘటపరీక్ష సేయుటకు సన్నద్ధుఁడై ముందునకువచ్చెను.

మృష్టటములను జేతితోఁ గొట్టి పరీక్షింతురుగదా! అట్లే గోరా కుంభారు అచ్చట బంతిదీఱి కూర్చుండియున్న ఆభక్తులశిరముల పై చేతితోఁ గొట్టుచుఁ బరీక్షింపసాగెను. జ్ఞానదేవుఁడు, సోపానదేవుఁడు మున్నగువారు వినిర్మలభక్తులు గావున గోరాకుంభారు చేతితోఁ దమ శిరములపైఁ గొట్టుట యెఱుఁగనే యెఱుఁగరు; గాని నామదేవుఁడు మాత్రము కుంభారు తన్ను సమీపించిన వెంటనే వెనుకకు ఒదిగి "నేను నిన్ను ఏమి చేసితిని? నాశిరమున నేల కొట్టెదవు" అని వడఁకుచు అడిగెను. అందులకు బదులు ప్రత్యేకముగఁ బలుక ఆతఁడు అందఱను జూచి "ఇన్ని ఘటములలో ఇదియే ఓటిది. ఇది నిష్పక్వము గాదు" అని యెలుగెత్తి పలికెను. తోడనే అజ్ఞానదేవాదులు అందఱును పకపక నవ్విరి. నామదేవుఁడు లజ్జాభరంబున ఏమియుఁ జేయఁజాలక వెంటనే అటనుండి కదలి ఆలయము సొచ్చెను.

అల్లంత దూరమునందే నామదేవునిఁ బంఢరినాథుఁడు జూచి ఎదురేఁగి కౌఁగిలించుకొని ముఖము గ్రీష్మాతపతప్తమగు కలువవలెనుండుటఁ గాంచి బుజ్జగించి సంగతి అంతయు నడిగెను. నామదేవుఁడు కొంతవఱకును లజ్జచే మాటాడఁజాలక మఱికొంతసేపు దుఃఖించి పిదప "శ్రీహరీ, సర్వాంతర్యామివి అయ్యు నన్ను సంగతి ఏమియని అడుగుచున్నావా? ఇది నీవంటివానికిఁ దగినదే కదా? నేను నీవు నావాఁడవు అని తలంచి మోసపోయితిని. ఇట్లు చేసెదవు అని తలంపఁజాలనైతిని" అని పలికెను.

అంతట శ్రీపాండురంగఁడు "వత్సా, ఏల శోకించెదవు? ఇందు అన్యాయము ఏమి ఉన్నది? నీహృదయము అచంచలమే; మఱియు భక్తిబంధురమే; గాని దానికి ఇంకను పరిపక్వస్థితి సంభవింపలేదు. నీవు జ్ఞానదేవాదులు చెప్పినట్లు ఇంతవఱకును సదాచార్యుని ఆశ్రయింపక పోవుటయే అందులకుఁ గారణము జ్ఞానదేవాదులు నిన్ను పరిభవింపవలయు నను తలంపుతో అట్లు నవ్వలేదు. అట్లుచేసినఁగాని నీకు యథార్థము తెలియ దనియు నీకు ధన్యత సిద్ధింపదనియుఁ దలంచియే గాని వారికి నీయెడల మఱియొక భావము లేదు. కావున వారిమాటలును హాసమును నీకు లజ్జాకారణములు కావు. నేను తలఁచినపుడెల్ల నీకు సాక్షాత్కరించుచు నీకుఁదోడునీడగా నున్నను ఆచార్యాశ్రయరాహిత్యము నీయందు లేకపోలేదు. అయినను, తక్కిననీగుణగణములవలన నిన్ను విడువఁజాలక

పోవుచున్నాను. జ్ఞానదేవాదులు గూడ నీయెడల నిట్టి యభిప్రాయము తోడనే యున్నారు. వారు నీకు ఈకళంకము తొలఁగిపోవలయును అని యే నేఁడు ప్రస్తావన చేసిరి. కావుననీవు వారియెడల అన్యథా చింతింపక వెంటనే ఆచార్యుని ఆశ్రయింపుము" అని హితోపదేశము చేసెను.

అపుడు నామదేవుఁడు "పండరినాథా, నీవును ఇట్లే సెలవిచ్చిన ఇఁకేమి చెప్పఁగలను? అయినను నీకుఁగాని జ్ఞానదేవుఁడు మున్నగు భాగవతాగ్రేసరులకుఁగాని నాయెడల సాధింపవలసిన ద్వేషమేమియు లేదు. గావునను నాకు నీయనుగ్రహముతోడనే గాని తదన్యముతో ప్రసక్తి ఏమియు లేదు; గావునను విశేషించి నీయాజ్ఞ యైనది; గావునను నేను సదాచార్యుని ఆశ్రయించెదను. గాని తన్నిర్ణయమును నీవే చేయవలయును" అని మనవి చేసెను. పండరినాథుఁడు "నీకు తగిన సదాచార్యుఁడు వీశోబాకేశుఁడు తక్క నన్యుఁడు లేఁడు." అని చెప్పఁగా వల్లెయని నామదేవుఁడు ప్రయాణ మయ్యెను

మార్గమధ్యమున వీశోబాకేశుఁడు నాగనాథుని సన్నిధి నున్నాఁడని నామదేవునకు తెలియవచ్చెను. అగుట నాతఁ డచ్చటికే పోయెను. పోయి చూచునప్పటికి వీశోబాకేశుఁడు లింగాకారముతో నున్న నాగనాథునిపై తన కాళ్ళు ఉంచి నిద్రించుచుండెను. ఈస్థితినిఁ జూచి నామదేవుఁడు చాల సందేహించి "ఈతనిస్థితి చూచిన ఇట్లున్నది. పండరినాథుని యుపన్యాసము చూచిన మహాద్భుతముగ నున్నది. కిరాతునివంటి ప్రాకృతుఁడుగూడ దేవుని విగ్రహముపై కాళ్లు ఉంచుకొని నిద్రించుట కట్టుకథలయందైనను వినలేదు. ఇట్టిఅవ్యక్తునిపై పండరినాథునకు అట్టి సదభిప్రాయము ఎట్లు కలిగెనో ఊహింప నలవికాకున్నది. అంతయుఁ జూడఁగా జ్ఞానదేవాదులును పాండురంగఁడును నాపై నారోపించిన కళంక మొక్కటియె గాక నాయందు అంతకు మించినది మఱి యేదో గూడఁ గలదనియు దానినిగూడ తొలఁగించుటకే శ్రీహరి ఈవీశోబాకేశునివంటి అవ్యక్తులచెంతకు నన్నుఁ బంపె ననియుఁ దోఁచుచున్నది. ఏది యెట్లయినను ఈతనిని పలుకరించి చూచినఁ గాని పాండురంగని భావము తేటపడదు" అని నిశ్చయించుకొని వీశోబా ముఖముమీఁదనే తన చూపును నిలిపి ఎదుట నిలిచి యుండెను.

కొంతసేపటికి వీశోబాకేశునకు మెలకువ వచ్చెను. తోడనే యాతఁడు కన్నులువిచ్చి చూచెను. అంతట నామదేవుఁడు ఆతనిం జూచి "అయ్యా, నీవంటివాఁడు ఇట్లు శివలింగముపై పాదములు ఉంచుకొని నిద్రించుట తగునా?" అని యడిగెను. అందులకు వీశోబాకేశుఁడు నంద హాసము చేసి "ఇందు అసంభావ్య మేమున్నది? మీరు పరోపకార పారీణు లని తోఁచుచున్నది. దివ్యతేజస్సువలన భాగవతాగ్రేసరులని గూడ పొడగట్టుచున్నది; కావున దయయుంచి ఎచ్చట నుంచినదోషము ఉండదో అచ్చట నాపాదముల నుంపఁగోరుచున్నాను." అని బదులు పలికెను. నామదేవుఁడు మాఱుపలుకకయే క్రిందఁబెట్టవలెనని వీశోబాకేశుని పదముల నంటెను. గాని వెంటనే జగత్తంతయు శివమయముగా గాన్పించెను. శివలింగము లేని స్థలము ఆవగింజంతయైనను కాన్పింపదయ్యెను. నామదేవుఁడు ఈయద్భుతమును చూచి నిర్విణ్ణుఁడై యుండఁగా వీశోబాకేశుఁడు "వత్సా, ఏలయాశ్చర్యపడెదవు. శివలింగము లేని స్థల మెచ్చటనున్నది. హరి యెచ్చట నుండునో హరుఁడు నచ్చటనే యుండును. బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు పృథక్స్థితియున్నదా!" అని యడిగెను. వీశోబాకేశుని పాదముల నంటిన వెంటనే విద్యుత్తువలె విజ్ఞానము తన హృదయమున వ్యాపించుటచే గతకల్మషుఁడై యున్న నామదేవుఁడు అంతయు నెఱింగి వీశోబా ప్రభావమును తెలిసికొని అతనికి సాష్టాంగవందనములాచరించి "మహాత్మా, నన్ను ఉద్ధరింప వలయును. పండరినాథుని యనుజ్ఞవలన నీసన్నిధికి వచ్చితిని. నాకిఁక అన్యము దిక్కులేదు" అని ప్రార్థింపఁగా వీశోబాకేశుఁడు ఆతనిం జేరఁదీసి అభయ మిచ్చి జ్ఞానోపదేశము గావించెను.

తోడనే నామదేవుని హృదయముపై నావరించియున్న మాయావరణము తొలఁగిపోయెను. ఆతనికి జగత్తంతయు శ్రీహరిమయముగాఁదోఁచెను. ఈదివ్యసందర్శనమువలన ఆతఁడు పండరిపురమునందలి సకలమును విస్మరించెను. ఆతఁడు నడచును; గాని తానెందుఁ బోవుచున్నదియు నెఱుఁగఁడు. కూర్చుండును; గాని ఎందు కూర్చున్నదియు నెఱుఁగఁడు. కండ్లకు శ్రీహరిరూపమే కాని మఱి యేమియు కాన్పింపదయ్యెను. శ్రవణములకు శ్రీహరినామముతప్ప ఇతరము విన్పింప

దయ్యెను. వాక్కునకు హరిగుణకీర్తనము తక్క అన్యము అంద దయ్యెను. ఇట్లాతఁడు సచ్చిదానందానుభవమున వివశుఁడై యుండెను.

ఒకప్పుడు పండరినాథుఁడు ఆతఁ డున్నచోటికి వచ్చి తట్టి ప్రబోధించి "నామదేవా! నాపై కోపించితివా యేమి? మఱి యీ విపరీత మేమి? తొల్లి నన్నొక్క నిమిషమైనను బాసియుండఁజాలకపోయెడివాఁడవు. ఇప్పుడు నీకు పండరిపురపుస్మృతియే లేక పోయెను. నీకిది తగునా?" అని యడుగఁగా నామదేవుఁడు "శ్రీహరీ, నీయనుగ్రహమువలన నాయజ్ఞాన మంతయుఁ దొలఁగి పోయినది. ఇప్పుడు నీవు లేనిస్థలమేదియు నాకు కాన్పించుటలేదు. నీకంటె నితరరూపము కాన్పించుట లేదు. ప్రపంచమం దంతటను నీవే నిండియున్నావు. అట్టిచో నేను పండరిపురమునకు ఏల రావలయును?" అని బదులు చెప్పెను. ఈప్రత్యుత్తరమునకు శ్రీహరి పరమానందభరితుఁడై ఆతనిచేతిం గైకొని తన యెదుట నిలిచియున్న జ్ఞానదేవాది సాధుపుంగవులం జూచి "ఇప్పుడు నామదేవుఁడు అపక్వఘటమని ఎవరైన చెప్పఁగలరా?" యని యడిగెను; గాని ప్రత్యుత్తరము రాలేదు.

ఒకప్పుడు పండరినాథుఁడు నామదేవునిఁజూచి "వత్సా, నీహృదయస్థితి యెట్లున్నది? విశోబాకేశుని యుపదేశమును మరచితివా?" అని యడిగెను. అందులకు నామదేవుఁడు "అదెట్లు సంభవించును! పదార్థ బాహుళ్యము గలిగినపుడు భ్రాంతికి అవకాశము ఉన్నది; కాని నీకంటె నన్యము లేనపుడు భ్రాంతి గాని, పతనముకాని, విచ్యుతి గాని, ఎట్లు సంభవించును!" అని ప్రత్యుత్తర మిచ్చెను.

ఇది యెంత నిశ్చయమో యెఱుంగుటకు నామదేవుని పరీక్షింపవలయు నని పండరినాథునకు సంకల్పము గలిగెను. ఈయూహతో నాతఁడు ఒకనాఁడు ఒకచో భాగవతాగ్రేసరులు అనేకులు గుమిగూడి భుజించుచుండఁగా శ్వానరూపముధరించి అచ్చటకు వచ్చెను. కొందఱు భాగవతులు ఛీఛీయనిదానినితఱిమివేసిరి. మఱికొందఱు తమముందున్న పదార్థము అపవిత్రమైపోయిన దని దానిని విడిచివేసిరి. మఱికొందఱు అసహ్యపడియుఁ జూచియుఁ జూడనట్లు నటించిరి; గాని పదార్థములను మాత్రము విడువలేదు. ఇంతలో నది పదార్థములు నిలువయున్నచోటికేఁ బోయి ఒక పాత్రమున మూతిపెట్టెను. తోడనే కొందఱు దుడ్డుకఱ

లతో కొట్టరాఁగా వారి కందక అచ్చటినుండి తొలఁగిపోయి మఱల భాగవతులలోఁ బ్రవేశించెను. మగుడ భాగవతులు కొందఱు దానిని తఱుమఁజొచ్చిరి. అంతట నది నామదేవుని చేతనున్న రొట్టెను తటాలున నోటఁ గఱచుకొని పాఱిపోఁదొడఁగెను; గాని నామదేవుఁడు అందుల కేమియు కోపపడక ఏవగించుకొనక విశేషించి ప్రపంచములో శ్రీహరి కంటె నన్యము ఏమి కలదు? అని తలంచి "మహాత్మా, ఏల పరుగెత్తెదవు? ఏల భయపడెదవు?" అని దానిని పట్టుకొని ఒడిలోఁ గూర్చుండఁబెట్టుకొని "వట్టిరొట్టె తినవలసిన గతి యేమి?" అని పలికి రొట్టెను తన చేతఁగొని చిదిపి ఆముక్కలను నేతిలో ముంచి చక్కెరలో నద్ది దానినోటి కందింపసాగెను. శ్వానమును నిర్భయముగా ఆరొట్టెముక్కలను భుజింపసాగెను.

ఇది చూచి అచ్చటనున్న భాగవతులలో కొందఱు "నామదేవునకు పిచ్చిపట్టినది. లేకున్న కుక్కకు రొట్టె పెట్టుట ఏమి? ఆహా! అంతటి భాగవతశిఖామణికి ఇట్టి పాటు రాఁజెల్లునా? అంతయు ఈశ్వరునిసంకల్పము" అనినవ్వుకొనసాగిరి. మఱికొందఱు భాగవతులు "అట్లనఁగూడదు. నామదేవుఁడు పండరినాథునిఅంతరంగభక్తులలోనగ్రేసరుఁడు. ఈశ్వరతత్త్వము ఆతనికిఁ దెలిసినట్టు అన్యులకుఁ దెలియదు. ప్రపంచమంతయు ఈశ్వరమయ మని మనకుఁ దెలియనిది గాదు; గాని మనకు అనుభవజ్ఞానము లేదు. నామదేవుఁడు శ్వానమునందుఁగూడ భగవంతుని గనుఁగొనెను. కావుననే ఆతఁ డిట్లు ప్రవర్తించుచున్నాఁడు; పండరినాథుఁడు నామదేవునకుఁ గొంగుబంగారమై యున్నాఁడు. ఆతఁడు భక్తశిఖామణిని విడిచి ఎప్పుడును ఉండఁజాలఁడు" అని చెప్పుకొనసాగిరి.

ఈవాదప్రతివాదము లిట్లు జరిగిపోవుచుండఁగనే అట కుక్క చూచుచుండఁగ దివ్యమంగళవిగ్రహమై నామదేవుని అనుగ్రహించి అంతర్ధానమయ్యెను. దీనిని చూచి తొలుత ఆక్షేపించినవారు తెల్లవోయిరి. కొనియాడినవారు ఆశ్చర్యచకితులైరి. తుదకు అందఱును "భగవంతుఁడు అగు పండరినాథుఁడు నేఁడు ఇచ్చటఁ జేరిన భాగవతుల నందఱను బరీక్షించుటకువచ్చెను. ఆసర్వేశ్వరుని అనంతలీలలలో నిదియొకటి. మనము మందబుద్ధులము గావున మొట్టమొదట తెలిసికొనఁజాలక పోయితిమి. నామదేవుఁ డన్న అఖండజ్ఞానపరిపూర్ణుఁడు గావున శ్వాన

రూపియై వచ్చిన ఈశ్వరుని తెలిసికొనఁ గలిగెను. కావుననే ఆతఁడు అనుగ్రహింపఁ బడియెను." అని యనేకవిధముల నామదేవునిఁ గొనియాడుచు తమదౌర్భాగ్యమును నిందించుకొనసాగిరి.

పిదప కొంత కాలము గడచిపోయెను కార్తికశుద్ధఏకాదశివచ్చెను. నాఁడు నామదేవుఁడు మహానందముతో పండరినాథునిఁబూజించుటకు ఆలయమునకుఁ బోయెను. పూజ ముగిసిన పిదప పండరినాథుఁడు సాక్షాత్కరించి నామదేవుని ఆలింగనము చేసికొని "వత్సా, నీవు నేఁడిచ్చట భుజింపవలయును" అని చెప్పెను; కాని నామదేవుఁ డందులకు అంగీకరింపలేదు "ఈశ్వరా, తప్పుత్రోవలనుండి ఉద్ధరింపవలసిన నీవే ఇట్లు చెప్పిన మేమేమి చేయఁగలము? నేఁడు ఏకాదశి నేఁడు భుజించినవారికి పుట్టగతు లుండునా?" అని బోధించిచెప్పెను. అందులకు శ్రీహరి ఏమియు అడ్డుచెప్పక అంగీకరించెను. మఱికొన్నిదినములుగడచి పోయెను మఱల ఏకాదశివచ్చెను. నాఁడు పండరినాథుఁడు నామదేవుని పరీక్షింపఁదలఁచి వృద్ధబ్రాహ్మణరూపము దాల్చి వచ్చి "మహానుభావా! చాల దూరమునుండి వచ్చుచు కడు డస్సియున్నాను. ఆఁకలిచే నా కడుపు మాడిపోవుచున్నది. గడియ యూరకున్న నేను శోషవచ్చి పడి పోదును. పట్టెఁ డన్నమైన నాకు చాలును. రక్షింపవలెను" అని దీనముగ ప్రార్థించెను; గాని నామదేవుఁడు "అయ్యా, వృద్ధుఁడ వగు నీకు నేను చెప్పవలసినదేమున్నది? నేఁడు ఏకాదశిగదా! నేఁడు ఒక్కమెతుకైనను భుజించినవాఁడును పెట్టినవాఁడును నరకలోకమునకు పోవుదురు. కావున నీవు అంత బాధపడుచుంటివేని ఫలముల నిచ్చెద భుజింపుము" అని పలికెను.

బ్రాహ్మణుఁడు అందులకు అంగీకరింపలేదు. "నాకుపండ్లక్కఱ లేదు. అన్నమే కావలెను. ఇఁక మాటలాడఁజాలను. ప్రాణములు తేలిపోవుచున్నవి అన్నము అన్నము అన్నము. లేకున్న చచ్చిపోయెదను. ఈ పాపము నీకు తగులును" అనెను; కాని నామదేవుఁడు మెత్తపడలేదు. "పుణ్యపాపములతో నాకేమియు సంబంధము లేదు. నేను హరిదాసుఁడను. హరిధ్యానముకంటె నాకు మఱియొకటివలదు. హరివిస్మృతికంటె నాకు పాపకారణము లేదు." అని యాతఁడు బదులు చెప్పెను. వృద్ధుఁడు

ఇది విని చాల కోపమును బ్రకటించి "నీయంతక్రూరుఁడు లేఁడు. విష్ణుభక్తుఁడ నని గర్వించియున్న నీకంటె చండాలుఁడు మేలు" అనికన్నులు తేలవేయుచు కూలఁబడిపోయెను.

అంతట నామదేవుఁడు పరీక్షించిచూచి బ్రాహ్మణుఁడు చనిపోయెనని తెలిసికొనెను. ఇది చూచి ఇరుగు పొరుగువా రందఱును "నామదేవుఁడు శిలాహృదయుఁడు. దుర్మార్గుఁడు. వృద్ధబ్రాహ్మణుని చేతులార చంపిన పాపాత్ముఁడు" అని నిందింపసాగిరి. అయినను ఆతఁడు వారి కేమియు ప్రత్యుత్తరము చెప్పక ఆబ్రాహ్మణుని కళేబరమును భుజములపై నిడుకొని భీమానది యొడ్డునకు తీసికొనిపోయి చితి పేర్చి దానిపై నెక్కించి అగ్ని ముట్టించి ప్రక్క మఱియొక చితి పేర్చుకొని దానికి నిప్పు ముట్టించి దానిపై తా నెక్కెను. ఈసంగతి వెంటనే గ్రామములో తెలిసిపోయెను. నామదేవుని భార్యయు విని ఒక్క క్షణమైన నింట నుండక అచ్చటకుఁ బోయి భర్తయున్న చితిపై తానును నెక్కెను. ఈవింతను ఆయూరి స్త్రీపురుషు లందఱును చూచి నామదేవునిమాహాత్మ్యమునకు అబ్బురపడ సాగిరి. చితి మంటలు నల్వంకల నలుముకొనుచుండఁగాఁ బ్రాహ్మణరూపి యగు పాండురంగఁడు నిజరూపముతో సాక్షాత్కరించి నామదేవుని ఆతని భార్యను సురక్షితముగ పైకి తీసి "వత్సా,నీధైర్యస్థైర్యములకు మెచ్చితిని నీనిష్ఠకు ఆనందించితిని. ముల్లోకములయందును నాకు నినుబోలు అంతరంగభక్తుఁడు లేఁడు. నీభార్యను బోలు పతివ్రతలు లేరు" అని పలుకుచు చూచుచుండఁగనే తిరోహితుఁడయ్యెను. అచ్చట నున్నవా రందఱును ఈయద్భుతమును జూచి నామదేవుని మాహాత్మ్యమును గొనియాడి మహోత్సవముతో ఆదంపతులను గ్రామమునకుఁ గొనిపోయిరి. నామదేవుఁడు బ్రతికియున్నంతకాలము నిట్లే హరిభక్తి సల్పి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను. దేశమునందలి భక్తలోక మంతయు ఆతని నిర్యాణమునకు వగవని దినము లేదు.

మ. "వరశేషాద్రిలసద్విమానమున భాస్వద్యోగపీఠంబునం
దు రమాయుక్తముగా వసించి మునిసంతోషాకృతిఁ గల్గ వి

స్ఫురదోంకారమునన్ భజింపఁదగు రామున్ మేఘసుశ్యాము సుం
దరకామున్ రవిధాము నిచ్చలు పరంధామున్ భజింతు న్మదిన్."

(రామకర్ణామృతము. ఆ. 2. ప. 93.)

---

46. కూ పా కుం భా రు.

శ్లో. "బృన్దావనద్రుమతలేషు గవాంగణేషు
వేదావసానసమయేషు చ దృశ్యతే యత్,
తద్వేణువాదనపరం శిఖిపిఞ్ఛచూడం
బ్రహ్మ స్మరామి కమలేక్షణ మభ్రనీలమ్."

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 21.)

మార్వాడీదేశంబున ఒకపల్లెయందు కూపాకుంభారు అనునొక కుమ్మరి యుండెను. ఆతఁడు ఇరుగుపొరుగువా అందఱవలె సంసారనిమగ్నుఁడు కాక తామరాకుమీఁది నీటిబిందువువలె సంసారము నంటక సదాభగవద్ధ్యానతత్పరుఁడై యుండెడివాఁడు. ఆతని భార్యయు సద్గుణరాశియై రమణీమణియై భర్తయాజ్ఞాప్రకారమువర్తించుచుండెను ఆమెగూడ భర్తవలెనే భక్తురాలు. కూపాకుంభారు దినమునకు ఒక్కకుండ చేసి నెలకొకమాఱు ముప్పదికుండలను ఆవముపెట్టి కాల్చి వానిని దినమునకు ఒకటిచొప్పున విక్రయించి ఆస్వల్పధనముతోడనే దినపాతము సేయుచుండెను. ఆదంపతులు ఇరువురునుగూడ నిస్పృహులే యగుటవలన అంతకంటె ఎక్కుడు కుండలు చేసి ధన మార్జింత మని ఎన్నఁడును యూహింపలేదు. కుంభారు దినమున కొక్కటిచొప్పున చేయుటయైనను కేవలము దినపాతనిమిత్తమే గాని మఱియొకందులకు గాదు. "ఒక్క కుండ క్రయముతో మనసంసారము గడచిపోవుచున్నది. మనకు ఏమియు లోపము లేకుండ రోజులు గడచిపోవుచున్నపుడు దిన మెల్ల శ్రీహరిని ధ్యానించుట మాని ఆశావిజితులమై భవపరంపరం ద్రెంపుకొనఁజాలని అవస్థకు మనము రానేల ? పూర్వజన్మసుకృతవిశేషంబున పండరినాథుని దివ్యనామామృతము మనకు లభించినది. దీనిని

మఱచిపోవుటకంటె దౌర్భాగ్య మేమున్నది?" అని ఆతఁడును భార్యయుఁ జెప్పుకొనుచు ఇంద్రియములను జయించి ఈశ్వరధ్యానమున నిమగ్నులగుచుండిరి.

ఇట్లు కాలము గడచిపోవుచుండఁగా ఆదేశము నేలు ప్రభువు అశక్తిదుర్జనుఁడై కుండలుసేయు కుమ్మరు లెల్లరును ఆవము ఒకటింటికి నెలకు పదికుండలు చొప్పున కోటలో నప్పగింపవలయు నని శాసనము చేసెను. చేయునది లేక కుమ్మరు లెల్లరును ఆశాసనమునకు లోఁబడిరి. కూపాకుంభారుకూడ అట్లే ఈయసాగెను; గాని ఆవము పెట్టునపుడు ముప్పదికుండలనే పెట్టినను ఆవము తీయునప్పటికి అందు నలువదికుండ లుండెడివి. అదిచూచి ఆదంపతు లిద్దఱును పరమాశ్చర్యచకితులై "ఇది పండరినాథుని లీల ఇంతేకంటె అన్యముగా కాదు. సర్వశక్తుఁడు అగు ఆభక్తలోకాంతుని లీల నెఱుఁగ నెవ్వరివశము?" అని నిశ్చయించుకొని అదిమొదలు మఱింత భక్తిశ్రద్ధలతో నాతనిఁ బూజింపఁజొచ్చిరి.

ఇట్లు ఉండఁగా పండరినాథునకు కూపాకుంభారును బరీక్షింపఁ దలంపుగలిగెను. అంతట నొకనాఁడు ఆతఁడు ఇద్దఱు భక్తులతోఁ గూడి ఒక బ్రాహ్మణుని వేషము దాల్చి కుంభారు ఇంటికి వచ్చెను. అప్పుడు గృహయజమానుఁడు అగుకుంభారు లోపల భార్యతోఁ గూర్చుండి భగవంతుని స్మరించుచుండెను. ఈసమయమునందు వీథిలోని భక్తులు అందఱును ఒక్కమారుగ శ్రీహరినామోచ్చారణముగావించిరి. ఆధ్వని కుంభారు కర్ణములలో సొచ్చెను. తోడనే యాతఁడు బైటికి వచ్చి సాక్షాత్కరించిన విష్ణుదూతలో యన వెలుంగుచు వీథియందునిలిచియున్న భాగవతాగ్రసరులం గాంచి అనేకసాష్టాంగనమస్కారములు ఆచరించి ఆదరవచనములు పలికి అర్ఘ్య పాద్యాదివిధులతోఁ బూజించి సుఖోపవిష్టులం గావించి చేతులు జోడించుకొని ఎదుటనిలిచి "మహానుభావులారా, మీరాగమనమువలన నాజన్మము నావంశము నాజీవితమును ధన్యములైనవి. నేను పునీతుఁడనైతిని. ఇంతఱు భాగవతోత్తములను ఒక్కచోట ఒక్కమాఱు చూచుటకు నాకు ఇదియే ప్రారంభము. మీ దర్శనమువల్ల నాకుఁ గలిగిన యానందము కూలంకషమై యుక్కిరిబిక్కిరి యొనరించుచుండుటచే బహుభాషలుఆడుటకు నేను ఓపఁజాల

కున్నాను. మహాత్ములు ఊరకరారు. కావున దేవరవారలు విచ్చేసిన కారణమును ఎఱింగింపఁ బ్రార్థింతును" అని వేఁడుకొనెను.

అంతట ఆభాగవతులు ఇట్లు అనిరి. "నీవు చేయు ఆదరము మాకు ఆనందము గొలుపుచున్నది. మాకు విశేషము అగు కోర్కె ఏదియు లేదు. మేము ఆఁకట నకనకలాడుచున్నారము. ఈపూట మాకు ఈక్షుద్బాధ తీర్చెదవేని కృతజ్ఞులమై యుందుము" ఇట్లు చెప్పునపుడు ఆభాగవతులు చాల ఆయాసమును బ్రకటించిరి. అది విని సహజదయార్ద్రహృదయుఁడు అగు కుంభారు హృదయము బ్రద్దలుకాఁగా ఓపఁజాలక అంతకును పండరినాథుఁడే కలఁడు అను విశ్వాసముతో స్వశక్తివిచారణ సేయక "భాగవతోత్తములారా, ఇందులకు ఇంత దైన్యము పాలు కానేల? ఈదాసునియెడల ఇది యాజ్ఞయగును. గాని ప్రార్థన మెట్లగును? ఒక్కక్షణముమాత్రము తాళుఁడు. ఇంతలోనే సకలమును సన్నద్ధము గావించెదను" అని చెప్పి వారిని అచ్చట నుంచఁగోరి బైటకు వచ్చి నలుదిక్కులు గలయం జూచి "ఇప్పుడు ఏమిదారి? ఇందఱుభాగవతులు కోరిన కోర్కెను కొనసాగింపఁజాలనేని ఇఁక నా జన్మము ఏల? ఇందు అనేకమహాత్ములు గలరు. అందఱును శ్రీహరికి అంతరంగభక్తులు. ఒక్కపూటయైన వారికి దురంతము అగు క్షుత్తు తీర్చుట రూపముగ సేవఁ జేయఁగలుగుదునేని ఇఁక నాకుఁ గావలసినది ఏమికలదు?" అని కొంతతడవు యోచించి తిన్నఁగ బజారునకు దారి తీసెను. పోవుచుండఁగా హఠాత్తుగా నాతనికి ఒకఆలోచనము తోఁచెను. తోడనే యాతఁడొక అంగడిచెంతకుఁబోయి నిలిచెను.

భక్తిరసము ఇట్లు అవతరించి వచ్చినదో యని తేజరిల్లుచున్న కూపాకుంభారు నారసి యావర్తకుఁడు "అయ్యా, మీరు వచ్చిన పని ఏమి?" అని ప్రశ్నించెను. అంతట కుంభారు సంగతి అంతయు నెఱింగించి "శ్రీమంతుఁడా, ఇపుడు వచ్చియున్న భక్తులు కేవలము శ్రీహరికి అంతరంగికులు. వారిని సేవించుభాగ్యము అయాచితముగ నాకు లభించినది. వారిని సఫలమనోరథులం గావింపకుండ నేను పంపివేయఁజాలను. నేఁడు నీవు వారికిఁ గావలసిన సామగ్రి యంతయు ఒసంగెదవేని కృతజ్ఞుఁడను. మఱియు అచిరకాలమునందే వడ్డితోఁగూడ ఆమూల్యమును ఇచ్చివేసెదను" అని కోరెను. వర్తకుఁడు అందులకు అంగీ

కరించి "అయ్యా, మీరు బీదవారు. అగుట నేను కోరినప్పుడు గాని మీకు తోఁచినపుడు గాని మీచెంత ధనము ఉండకపోవచ్చును; అట్టిది సంభవించినచో పిదప చాల చిక్కులు తటస్థింపఁ గలవు. ఇన్నియేల? ఉభయతారకము అగు ఒక యుపాయము చెప్పెదను. ఆలింపుఁడు. మీరు కోరిన పదార్థములను నేను ఒసంగుట ఏమో యథార్థము. మఱి విశేషము ఏమన: నేను ధర్మార్థము ఒకబావి త్రవ్వింపఁదలఁచియున్నాను. నేఁడు నేను మీకు ఇవ్వఁబోవుచున్న సామగ్రిమూల్యమునకు బదులుగా ఆబావిని మీరు త్రవ్వుటకు అంగీకరించెదరేని ఉభయుల కోరికలునుగూడ నిర్బాధముగ నెఱవేఱఁగలవు" అని చెప్పెను. కుంభారు భాగవతార్చనమునకు అడ్డంకులు కలుగకున్న ఏమైనను సరియే యని అందులకు అంగీకరించెను. వర్తకుఁడు స్వల్పధనముతో పెద్ద మంచినీళ్ళబావి తయారగుచున్నందులకు ఆనందించి ఆతఁడు కోరినది అంతయు ఇచ్చి పంపివేసెను. కుంభారు ఆసామగ్రి అంతయు ఇంటికిఁ గొనివచ్చి భాగవతులను ఆగ్రామముసమీపమున నున్న నందనవనమునకుఁ గొనిపోయి పాకముచేసికొని తృప్తితీర భుజింపుఁడు" అని ప్రార్థించెను.

కుంభారు కోరిక ప్రకారము భాగవతులు మహానందముతో వంటచేసికొని తనివితీర భుజించి తాంబూలములు స్వీకరించి "భక్తాగ్రేసరా, నీ సపర్యకు ఆనందము కలిగినది నీహృదయము విశుద్ధము గావున మాకిచ్చిన యాతిథ్యమును శ్రీహరినిఁ జేరినది. ఈరూపమున నీవును మేమును గూడ ధన్యులమైతిమి. తొలుత నీసంగతి మాకు తెలియదయ్యెను. నీవు సాత్త్వికుఁడవు శ్రీహరికి అంతరంగభక్తుఁడవు. నీకు ఎందును లోపము లేదు; అయినను నీయాతిథ్యమును బడసితిమి; గావున నిన్ను ఆశీర్వదింపకుండఁ బోవరాదు; గాని, నీవు నిస్సంగుఁడవు. ఈప్రపంచమున నీకు అభ్యర్థనీయము అగు కోరిక ఏమియు లేదు. అయినను నీహృదయమున ఏతలంపు పొడసూపునో వెంటనే అది నెఱవేఱుఁగాత" మని యాశీర్వదించి వారు తమ దారినిఁ బోయిరి.

మఱునాఁడు కూంపాకుంభారును ఆతని భార్యయు యథాపూర్వముగ ప్రాతఃకాలమున లేచి కార్యములు అన్నియు ముగించుకొని స్నానమాడి హరినిఁ బూజించి కలమట్టుకు చక్కఁగా వండిన భోజనపదార్థము

లను విశుద్ధహృదయములతో స్వామికి నివేదించి పిదపఁ దాము భుజించి గునపము పాఱ మున్నగు ఖననసాధనములనుగై కొని వర్తకుని యింటికిఁ బోయిరి. ఆవర్తకుఁడును వీరినిఁ జూచి వ్యాపారబాహుళ్యమువలన తామేర్పఱచికొనినది మఱచి "ఏలవచ్చితిరి?" అని వారినిఁ బ్రశ్నించెను. అంతట కుంభారు సంగతి అంతయు జ్ఞాపకము చేసి "మేము బావి త్రవ్వెదము. స్థలము చూపుము" అని చెప్పెను వర్తకుఁడు ఆనందించి వారి సత్యనిష్ఠకు ప్రశంసించి తన పొలమునకుఁ గొనిపోయి "ఇచ్చటఁ ద్రవ్వుఁడు" అని చెప్పి యొకచోటు చూపి "ఇట్లు సూక్ష్మములో మోక్షము ఉండవలయును" అని యానందించుకొనుచు ఇంటికిఁ బోయెను.

కుంభారు తొలుత "శ్రీహరీ" యని గునపము వేసి తట్టలో నిక మట్టి యెత్తెను. ఆతని భార్య "పుండరీకాక్షా" యని గంప నెత్తిమీఁదఁ బెట్టుకొని పోయి అవ్వలఁ బాఱఁబోసెను. ఈతీరున వారు శ్రీహరిని ధ్యానించుచు పని చేసిరి.

సాయంకాలము అగుచుండఁగా వర్తకుఁడు చేసిన పనినిఁ బరీక్షించుటకు వచ్చెను. కుంభారు వినయముతో అంతయుఁ జూపఁగా, ఇరువదిమంది చేయవలసిన పనిని ఇరువురు చేసినందులకు ఎంతయు ఆశ్చర్యపడుచు ఆనందముతో వర్తకుఁడు ఇంటికిఁ బోయెను. మఱునాఁడు మధ్యాహ్నమువఱకును కుంభారు భార్యతోఁ గూడ అదే విధముగఁ బని చేయఁగా అప్పటికి గంగాజలమువంటి నీరుపడెను. అదియు ఝరీవేగముతో రాసాగెను. అందులకు కుంభారు ఆనందించి "మాట యిచ్చినందులకు వర్తకునకు మనము ఋణము తీర్చుకొనఁగలిగితిమి" అని సంతృప్తుఁడై చెంత నున్న ఒక తియ్యమామిడిచెట్టుక్రిందఁ గూర్చుండెను. ఆతని భార్య ప్రక్కనే యుండెను. ఇరువురును హరిభజనము ప్రారంభించిరి.

వీరు ఇట్లు ఉండఁగా వర్తకుఁడు మఱల వచ్చెను. కుంభారు అప్పుడే భజనము మాని వర్తకునకు సకలమును నివేదించెను. ఆనీటి మాధుర్యమునకు వర్తకుఁడు పరమాశ్చర్యచకితుఁడై మహానందపరిపూర్ణచిత్తుఁడై యూరివారినందఱను రావించి సంగతి యానుపూర్వికముగ నెఱిఁగించెను. అంతఱును ఆనీటి మాధుర్యమును జూచి రిచ్చవడి "ఇది

అమృతోపమానము. నీపుణ్యమువలన నిట్టిజలము పడినది. ఇది ఎన్ని దినములు వర్షము లేకున్నను ఎండిపోదు. ఈయూరి పొలములకు అంతయు ఈనీరు చాలును" అని ప్రశంసించిరి. తాము కష్టపడినందులకు వ్యర్థము గాలేదని కుంభారు మిగుల నానందించెను.

ఇది యంతయు ఇట్లు అగుచుండఁగా ఆతీరున ఆనందించుచు కుంభారు నూతిచెంత నిలిచియుండెను; గాని ఉన్నట్లు ఉండఁగా హఠాత్తుగ అచ్చటి భూమి క్రుంగిపోయెను. కుంభారుభూమిలోనికిఁబోయెను. అంతట ఆతని భార్య విలపించుచు అచ్చటకు రాఁగా అచ్చటివారెల్లరును కుంభారును బైటకుఁ దీయుటకుఁ బ్రయత్నించిరి; గాని ఆతఁడు ఎందును గాన్పింపఁడయ్యెను. ఇఁకఁ జేయునది లేక వారు కుంభారు భార్యను ఓదార్చి ఇంటికిఁ దీసికొనిపోయిరి.

పిదప ఆమె భర్తకొఱకు కొంతతడవు విచారించి తుదకు ఈభౌతిక ప్రపంచము గతియే యిట్టిదని మనస్సునకు సమాధానము చెప్పుకొని అత్యంతభక్తిశ్రద్ధలతో పాండురంగని మూఁడు అహోరాత్రములు ధ్యానించెను. అంత శ్రీహరి సాక్షాత్కరించి విచారము ఉడుపఁగా ఆమె అనేకవిధముల వినుతిసేసెను. అందులకు సంతోషించి స్వామి ఆమెకు అభయము ఇచ్చి "సాధ్వీ, నీకు విచారము వలదు. ఇఁక నొక్క సంవత్సరము అయినపిదప నీభర్త మఱల భూవివరమునుండి వచ్చును. అంతవఱకును నీవు యథాపూర్వముగ నన్ను బూజించుచుండుము. పిదప నీభర్తయు నీవును గలిసి సేవించి ధన్యులయ్యెదరు. ఒక్క సంవత్సరము వఱకును భర్తృవియోగమును సహింపుము" అని పలికి తిరోహితుఁడయ్యెను.

అట వర్తకుఁడు అకారణము కుంభారు భూమిలో దిగఁబడిపోయినందులకు విచారించి ఆతఁడు దిగఁబడిపోయినచోట నొకమఠమును దాని చుట్టును చక్కని పూఁదోఁటయు నిర్మింపించెను. ఆబావి మధురజలమును ద్రావుటవలన నాతనికి భక్తిజ్ఞానవైరాగ్యములు అలవడెను. మఱియు ఈవృత్తాంతము అంతయు వినియు ఆనూతియందలి మధురజలములను విడువఁజాలకయు అనేకభాగవతులు ఆమఠమున స్థిరనివాసములు ఏర్పఱుచుకొనిరి.

ఈతీరున పాండురంగఁడు ఏర్పఱిచిన గడువు ముగిసిన తరువాత

ఒకనాఁటిరాత్రి ఆమఠముముందు కుంభారుఁడు నిద్రింగిపోయినచోట భూమిలోనుండి తాళములు మృదంగము మున్నగు వాద్యములు బోరుకలంగ హరిభజనము వినవచ్చెను. అది విని అచ్చటివారు ఎల్లరును ఆశ్చర్యచకితులై ఈవార్త గ్రామమున వెల్లడించిరి. తుదకు అది ఆ దేశమును ఏలురాజునకుఁగూడఁ దెలిసెను. తోడనే రాజు వింతపడి అనంతపరివారముతోఁగూడి వచ్చి అచ్చట త్రవ్వింపఁగా అడుగున శంఖచక్రాదిసకలాలంకారములతోడను ఒప్పుచున్న బంగరుకృష్ణవిగ్రహమును దానిముందు తాళములు వాయించుచు పాటలుపాడుచు హరిభజనసేయుచు కూర్మాకుంభారును ఉండిరి. రాజు ఆసంభవమును జూచి కుంభారు మహిమకు చాల నబ్బురపడి తోడనే యతని పాదములమీఁద వ్రాలి "మహాత్మా, రక్షింపుము" అని ప్రార్థించెను. అచ్చటివారు ఎల్లరునుగూడ కుంభారుపాదములమీఁద వ్రాలి రక్షణమును వేఁడుకొనిరి. భక్తుఁడు వారి నందఱను ఆశీర్వదించుట అగునప్పటికి వర్తకుఁడు వచ్చి భక్తుని కాళ్లమీఁద వ్రాలి సాష్టాంగనమస్కారములు ఆచరించి "మహాత్మా, ఏలినవారి మాహాత్మ్యమును దెలిసికొనఁజాలక నీచమైన పని చెప్పి మిమ్ము నను నొప్పించితిని. ఈనూతిజలము త్రావిన పిమ్మట నాకు జ్ఞానము కలిగినది. ఎంతచేసినను నేను చేసిన పాపము పోదు. అది తమయనుగ్రహమువలననే పోవలయును. కావున అనుగ్రహించి రక్షింపవలెను." అని ప్రార్థించెను. భక్తుఁడు ఆతని నాదరముతో లేవనెత్తి "మహానుభావా, విచారమువలదు. నీవు చేసిన అకృత్యము ఎద్దియును లేదు. నీయనుగ్రహమువలననే నాకు ఈయదృష్టము గలిగినది. నీయనంతకరుణవలన నేను ఒకసంవత్సరము శ్రీహరితో ఏకాంతవాసము చేసి బ్రహ్మానందమును అనుభవించితిని. నీమీఁద ఈశ్వరునకు అనుగ్రహము గలుగు" నని పలికెను.

పిమ్మట రాజు "ఈతఁడు మానవమాత్రుఁడు గాఁడు" అని చెప్పి ఆందోళికమీఁద నాతనిని మనోహరమగు విమానముమీఁద శ్రీకృష్ణవిగ్రహమును ఎక్కించి యుక్తస్థలమునకుఁ గొనిపోయి విడియించెను. ఇంతలో కుంభారుభార్య వచ్చి భర్తకు సాష్టాంగనమస్కారములాచరించి నిలువఁగా ఆతఁడు ఆమెను దీవించి "నీవు భగవానుగ్రహమునకుఁ బాత్రురాలవు అయ్యెదవు" అని చెప్పెను. అప్పుడు ఆమె తన

స్వప్నవృత్తాంతము అంతయు నివేదింపఁగా కుంభారు ఎంతయు ఆనందించెను.

తరువాత ఆరాజు తన పట్టణమున ఒక గొప్పఆలయమును గట్టించి అందు శ్రీకృష్ణవిగ్రహమును బ్రతిష్ఠసేసి ఆసమీపమునందే ఒకమఠము కట్టించి అందు కుంభారును భార్యాసహితముగా నిలిపెను. మఱియు నాతఁడు శ్రీకృష్ణపరమాత్మను సేవించుటకును కుంభారువలన జ్ఞానోపదేశమును బడయుటకును ఏఁగుదెంచు భాగవతులుమున్నగువారికిని శ్రీకృష్ణునకును ఏమియు లోపములు ఒదవకుండునట్లు వలసిన ద్రవ్యమును దానిని యుక్తమార్గములయందు వెచ్చించుటకు కొందఱు ఉద్యోగులను నియమించెను. కొన్నిదినములు గడచినతరువాత రాజు సంపూర్ణముగ జ్ఞానవైరాగ్యములనుబొంది కుంభారు పాదములను బట్టి "అనుగ్రహింపవలయును" అని ప్రార్థించెను. కుంభారు కరుణాళుండై రాజునకు శ్రీకృష్ణమంత్రమును ఉపదేశించి దాని క్రమమంతయు నెఱింగించి ఆశీర్వదించెను.

మఱి కొన్నిదినములకు వర్తకుఁడు భార్యాద్వితీయుఁడై అచ్చటకువచ్చి కుంభారునకు సాష్టాంగనమస్కారములు ఆచరించి "మహానుభావా, మేము ఇంతవఱకును సంసారసాగరమునఁ గూలి దరిఁగానక పరితపించితిమి. ఇప్పుడు మాకుపశ్చాత్తాపముగలిగినది. మాయెడలనను గ్రహించి పూర్ణకరుణను మోక్షప్రాప్త్యుపాయము నెఱింగింపుము" అని ప్రార్థించిరి. కుంభారును వారికి పరమభక్తిజ్ఞానవైరాగ్యములు అలవడినందులకు ఆనందించి వారికి మంత్రోపదేశము చేసి "భగవంతునకు మీయెడల అపారకరుణ కలుగును" అని యాశీర్వదించెను. పిదప అనేకులు వచ్చి ప్రతిదినము కుంభారువలన ఉపదేశములు పొందసాగిరి.

కుంభారు చేయు భజనను మెచ్చి కొన్నిదినములకు శ్రీహరిసాక్షాత్కరించి "వత్సా, నీభక్తికిమెచ్చితిని. నీవు నాకుఅంతరంగభక్తుఁడవు. ఏమికావలయునో కోరుకొనుము" అని చెప్పెను. కుంభారు పరమానందభరితుఁడై అనేకవిధములఁ గొనియాడి "భక్తవత్సలా, సనకసనందనాదులకుఁ గూడ దుర్లభుఁడవు అగు నీవు సాక్షాత్కరింప నింక నాకుఁ గావలసినది ఏమి ఉన్నది! లోకము మాయావరణమునఁగూలియున్నది. దానికితరణోపాయమును అనుగ్రహింపుము" అని ప్రార్థించెను. "అందు

లకునీవే తగినవాఁడవు. నీకోరిక యెప్పుడును వృథగాదు" అనిచెప్పి భగవంతుఁడు అంతర్హితుఁడు అయ్యెను. కుంభారుఁడు బ్రతికియున్నంతకాలము అనేకులను భక్తిజ్ఞానవైరాగ్యసంపన్నులను గావించి అవసానమున భార్యతోఁగూడ శ్రీహరి సాయుజ్యమును బడసెను అవసానమునకుఁ బూర్వము కుంభారునకు మఱియొకప్పుడు స్వామి సాక్షాత్కరించి "వత్సా, నీనివాసమువలన ఈనగరము పుణ్యక్షేత్రములలో నొకటియైనది; ప్రతిసంవత్సరమును ఆషాఢకార్తికమాసములయందు నన్ను సేవించుటకు పండరిపురమునకు వచ్చు భక్తులందఱును ఇక్కడకుఁ గూడ వచ్చి పోవుచుందురు" అని చెప్పెను. ఇప్పటికిఁగూడ అట్లే జరుగుచున్నది.

శా. "బృందారణ్యతటప్రదేశమున గోబృందంబులం గాచుచుం
గందర్పాకృతిఁ గానుపించు ఘనసుస్వచ్ఛందమౌ తేజమా
నందప్రస్ఫుటసంపదయ్యె శ్రీనాథానుమోదంబు నా
యందుంగాని పొదఁ దింపఁజూచుఁ బయోజాక్షుంబు మేఘాంగమున్."

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 21.)

---

47. శ్రీరామకృష్ణపరమహంస.

శ్లో. "పర మిమ ముపదేశమాద్రియధ్వం నిగమవనేషు నితాంతచారఖిన్నాః,
విచినుత భవనేషు వల్లవీనా ముపనిషదర్థ ముదూఖలే నిబద్ధమ్"

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 28.)

వంగదేశమునందలి హూగ్లికరమను గ్రామమున కుదీరాంచటర్జీ అను నొకవైదిక బ్రాహ్మణుఁడు ఉండెను. ఆతనికి ముగ్గురుకుమారులు గలిగిరి. మూవురిలోఁ గడగొట్టువాని పేరు గదాధరుఁడు. అయిదేండ్లప్రాయము వచ్చిన తరువాత తల్లిదండ్రులు ఈతనిని యథాశాస్త్రముగ అక్షరాభ్యాసముగావించి బడికిఁ బంపిరి; గాని అక్షరజ్ఞానము గలిగినతరువాత గదాధరుఁడు గ్రంథములను జదువుటకుఁ జాల ససహ్యముచూపఁ

రామకృష్ణపరమహంస.

దొడఁగెను. అందులకుగారణ మేమన? ఆతనికి లౌక్యవిద్యలయందు అభిలాష లేకుండెను. అంతటి చిన్నతనమునఁ గూడ నాతనికి భగవద్భక్తి గలిగియుండవలయు నను పేరాస యుండెడిది. అందుల కుదాహరణముగ నాతఁడు ఎల్లవేళలయందు ఏకాంతముగఁ గూరుచుండి భగవంతుని ధ్యానించుచుండెడివాఁడు. ఇదిచూచి అన్నలును, తల్లిదండ్రులును జాలిఁగోపించి పాఠశాలకు వెళ్లవలసివచ్చు నని యిట్లు మాయలు చేయుచున్నాఁ డని తలంచి బలవంతముగాఁ దీసికొనిపోయి పాఠశాలలో గూలవేసి వచ్చుచుండిరి. ఎన్నివిధములఁ బ్రయత్నించినను ఆతఁడు పుస్తకము ముట్టడయ్యెను. అందులకు విసిగి ఆతనిని అన్నలలో నొకఁడు రక్తము కక్కు నట్లు చేసెదనని భయపెట్టెను. పదినాలుగైదుదినములు గడచునప్పటికి గదాధరుఁడు ఏకారణముననో రక్తముకక్కెను. తుదకీతని తల్లిదండ్రులు ఈతనిచేష్టలకు విసిగి కలకత్తానగరసమీపమున నున్న దక్షిణేశ్వరమను గ్రామమునకుఁ బంపి యచ్చట కాళికాదేవిగుడిలో అర్చకునిగా నేర్పఱచిరి.

కాళికాలయమునఁ గూడ నాతనికి ఆత్మజ్ఞానసాధనమును గుఱించిన పరితాపమే పీడింపసాగెను. కొన్నిసమయములయం దాతఁడు దేవీపూజను మఱచి గర్భాలయము సొచ్చి క్రిందఁబడి దొరలుచు "తల్లీ, మానవుని ఆయుర్దాయము అల్పము. జ్ఞానము చిరకాలసాధ్యము. ఇట్లు చేసియు భగవంతుఁడు జ్ఞానరహితునకు నరకము విధించినాఁడు. కట్టా! నాజీవితము తరిగిపోవుచున్నది నీవేల కరుణింపవు? నాకేమియువలదు. ఆత్మజ్ఞానతృష్ణ నన్ను దహించివేయుచున్నది. లోకజననీ! నాదాహము తీర్పవా?" అని పరితపించుచుండెను. ఇట్లు అనేకదినములు గడచిపోయెను. ఒక్కొక్కపు డాతని కీవిచారమున రాత్రింబవళ్లు తెలియకయే గడచిపోవుచుండెడివి.

ఈషణాత్రయము మోక్షసిద్ధికి ప్రతికూలములు. దానిచే నెవరి హృదయములు పూరితములై యుండునో వారికి జ్ఞానసంపాదనము శశవిషాణమువంటి దగును. తల్లిదండ్రులు బాల్యమునందే పెండ్లిసేయుట వలనగదాధరునకు శారదాదేవి యను భార్య యుండెను ఆత్మజ్ఞానమును బడయవలయునని యాతని కెప్పుడు తోఁచెనో అప్పుడే స్త్రీలను జూడ రాదు అనుసంకల్పము గూడ గలిగెను. అట్లే "నేఁటినుండియొక కాసై

నను ముట్టుకొనఁగూడదు" అని యాతఁ డొకనాఁడు శపథము చేసికొనెను. పిదప నాతని బీదతనముఁ జూచి యనేకు లాతనికి అయాచితముగ ధనము నొసంగఁ జూచుచుండిరి; గాని యాతఁడు ఒక్క కాసైనను స్వీకరించి యెఱుఁగఁడు. కొందఱు ధనికులు ఆతనికి ఎట్లయినఁ దమధనము నొకింత యిచ్చి తీరవలయు నని దీక్షఁదాల్చియుండిరి. వారు ఆతఁడు తెలిసియున్నఁ బుచ్చుకోఁడని తలంచి సమాధిలోనున్నపుడు ఆతనిచేతిలోనో కాలిమీఁదనో పెట్టెడివారు; గాని యానాణెములుతీసివేయునంతదనుక నవి యెచ్చటనుండెడివో యాచోటుగజగజవడఁకిపోవుచుండెడిది. పిదప నాతఁడు వివాహబంధమును ద్రెంపుకొనఁదలఁచెను. గాని భారతీయుల వివాహబంధమునకు విచ్ఛేదము లేదుగదా? ఇది యెఱింగి యాతఁడు శారదాదేవిచెంతకుఁబోయి దోసిలి యొగ్గి "మనదాంపత్యబంధనమును ద్రెంపివేయుము. నాకు ఐహికవాంఛ లేమియులేవు. నీవు నాకు ఈవర మిచ్చితివేని సుఖించెదను" అనిప్రార్థించెను. అంత నామె మాఱు పలుకక భర్తకోరికను నెఱవేర్చి తాను సన్న్యాసిని యయ్యెను.

పిదప నాతఁడు పరతత్వజ్ఞానమునకై చేసిన పరిశ్రమ మనంతము. ఆతఁడు అన్నిమతములవారి యుపాసనాపద్ధతులను దెలిసికొనియెను. అన్నిమతములరహస్యములను దెలిసికొనెను. సకలము నాతఁ డాదరించెను. "భారతీయులు, మహమ్మదీయులు, క్రిష్టియనులు, బౌద్ధులు మున్నగువారులందఱునుగూడ ఆపరబ్రహ్మముకొఱకే వెదకుచున్నారు; గాని విశ్వాసములు వేఱు. మార్గములు వేఱు. అయిన నేమి? ఫలమొక్కటియే. ఉపాధిభేదమువలన రుచిభేదముగలిగినట్లే జాతిభేదముల ననుసరించి మతభేదములు గలిగినవి. ఇది ప్రకృతి విరుద్ధము గాదు. ప్రపంచమంతయు నద్వైతమును ధ్రువపఱుచుచున్నది. ప్రపంచము నెఱుఁగనివారు భేదమును, ద్వేషమును బెంచెదరు" అని యాతఁడు నిశ్చయించుకొనియెను.

ఇట్లుండఁగా గదాధరుఁడు సన్న్యసించి పరమహంసరామకృష్ణుఁ డయ్యెను. అప్పుడు కలకత్తానగరమున కేశవచంద్రసేనుఁడు అనునొక జ్ఞానార్థుఁడు పరమహంస నాశ్రయించి జ్ఞానభిక్షమును వేఁడెను. ఆతనికిఁ దొలుత రాజారామమోహనరాయి యేర్పఱిచిన బ్రహ్మసమాజమునఁ జాల నాసక్తి యుండెను. అగుటచేఁ గొంతకాల మాతఁడు పరమహంస

వలన జ్ఞానోపదేశమును బడసి పిదప నిది మంచిమార్గము గాదు" అని నిశ్చయించుకొని సాధారణబ్రహ్మసమాజమునకుఁ బునాదివేసెను; గాని యీతనివలననే పరమహంసశక్తిసామర్థ్యములు ప్రఖ్యాతములయ్యెను. పిదప వివేకానందుఁడు పరమహంస నాశ్రయించి యఖండజ్ఞానమును బడసి గురూపదేశమును దిరస్కరింపక దానిని బాశ్చాత్యులకు విప్పిచెప్పి అద్వైతమతప్రాముఖ్యమును ద్రువపఱుచుట అందఱకును దెలిసినదియే.

పరమహంస యుపదేశమువలన ననేకులు తరించిరి. అద్వైతమతము మఱల నున్నతస్థితికి వచ్చెను. ఆతఁ డెంతసేపును "తర్కశాస్త్రముతోఁ బనిలేదు. వేదాంతశాస్త్రచర్చలతోఁ బనిలేదు. జ్ఞానముమీఁద తఱుగని ఆశ, పరతత్త్వమును దెలిసికొనుటలో నత్యాసక్తి, సాధన, దీక్షమున్నగునవి యున్నఁ జాలునని యుపదేశించుచుండెను. ఈ కాలమున భారతజాతికి రామకృష్ణుఁడుచేసినమహోపకారము శతసహస్రయుగములయందైనను మఱుపరానిది. తమమతమునందు అధికాభినివేశముగల పాశ్చాత్యులలో ననేకులు రామకృష్ణునిమతమును, ఉపదేశములును విని మహానందముతో నాదరించిరి. ఆతని ప్రజ్ఞ యెల్లరిచేతను గొనియాడఁబడెను. రామకృష్ణుఁ డిట్లు చిరకాలము లోకము నుద్ధరించి ప్రపంచధర్మము ననుసరించి నశ్వరమగు దేహమును విడిచి పరబ్రహ్మసాయుజ్యమును బడసెను.

సీ. "పరధర్మకామార్థనిర్జితకాములై విబుధు లెవ్వాని సేవించి యిష్ట
గతిఁ బొందుదురు చేరి కాంక్షించువారికి నెయ్యది యిచ్చు నెవ్వాఁడు కరుణఁ
ముక్తాత్ము లెవ్వాని మునుకొని చింతింతు రానందవార్ధి మగ్నాంతరంగు
లేకాంతు లెవ్వని [illegible] నేమముఁ గోరక [illegible] చరిత్రంబుఁ [illegible] పాడుచుండ్రు
గీ. [illegible] నవ్యక్తు నధ్యాత్మ, [illegible]
బ్రహ్మమయుని [illegible] నే భజింతు."

(భాగ. స్కంధ. 5. ప. 63)

48. నివేదిత.

శ్లో. "తమసి రవి రివోద్యన్ మజ్జతా మంబురాశౌ
ప్లవ ఇవ తృషితానాం స్వాదువర్షీవ మేఘః,
నిధి రివ విధనానాం దీర్ఘతీవ్రామయాణాం
భిషగివ కుశలం నో దాతు మాయాతు శౌరిః."

(కృష్ణకర్ణామృతము. ఆ. 3. ప. 79.)

ఐరోపాఖండమున వాయవ్యభాగమున నున్న బ్రిటిషుద్వీపములలో నొకటియగు ఐర్లండు అను ద్వీపమున "రెవరెండు ,యస్, ఆర్. నోబుల్" అను నొక మహాజనుడు ఉండెను. ఆతఁడు పెద్దవాఁడు అయిన తరువాత మాంచెష్టరు పట్టణమున ఒక ధర్మబోధకుఁడుగా నేర్పఱుపఁబడెను. ఆతఁడు చాల మంచివాఁడు "మార్గరెటునోబుల్" అనునామె ఆతనికి ముద్దులకూఁతురు.

ఈకొమార్తె యనిన నాతనికి ఎంతో ప్రేమ. ఎట్టి చిక్కునమయమునందైనను ఎట్టి విచారసమయమునందు అయినను ఆమెనుజూచినచో ఆనందము వచ్చెడిది. తండ్రియెడల ఆమెకు విశేషమైన భక్తి గలదు. ఆమె తండ్రి గౌరవమును బాగుగ గ్రహించెను. ఆతఁడును ఆమె ముఖమున తాండవము సేయు తేజస్సును గాంచి "ఈమె మహాత్మురాలు అగును" అని తలంచుచుండెడివాఁడు. మఱియు నాతఁడు కూఁతునకు చాల శ్రద్ధతోఁ జదువుచెప్పెను. ఆమె చిన్నతనమున ఆతఁడుమాంచెష్టరునగరమున బీదజనులకు అనేకులకు అనంతసాహాయ్యము చేయుచుండెను. అగుట నాతని కొమార్తకు అట్టి పరోపకారగుణమే పట్టువడెను. కొన్నిదినములకు ఆతనికి మరణము సమీపించెను. మరణకాలమున ఆతఁడు తనభార్యను జూచి "మార్గరేట ముందుముందు చాల గొప్ప పనులం జేయును. నీవు అప్పుడు ఆమెకు అడ్డుసెప్పక అడ్డంకులు గలిగింపక చేయఁబూనిన పనియందు విశేషమైన ప్రోత్సాహమును గలిగింపుము" అని చెప్పిపోయెను.

కొన్నిదినములకు ఈమె లండనుపురమునఁ బ్రవేశించెను. అచ్చటఁ గొందఱు పండితులు క్రొత్తవిద్యావిషయమునఁ గ్రొత్తమార్గములను గనిపెట్టి వానిని బ్రకటించిరి. ఈమె ఆపద్ధతులను బాగుగ గ్రహించి అందు చాల ప్రయోజనములు గలిగించు చిహ్నములు ఉండుటచే

వానిని అంగీకరించి, ఆపద్ధతులతో ఒక పాఠశాలను స్థాపించి దానికి తానే అధీశ్వరియై నడుపసాగెను. ఈకాలమున నీమె అనేకులకు అనేక విధముల సాహాయ్యము చేసెను.

ఇంతలో అనేకుల కోరికమీఁద శ్రీరామకృష్ణపరమహంసశిష్యుఁడగు వివేకానందస్వామి ఇంగ్లాండునకు వచ్చెను. అతఁడు భారతధర్మమును గుఱించియు, అద్వైతమతమును గుఱించియు అనేకోపన్యాసములు ఇచ్చెను. మార్గరేటు అన్ని యుపన్యాసములను వినెను. వివేకానందునియెడల చాల గౌరవభావమును జూపసాగెను. గాని యాతఁడు బోధించు మతమును మాత్రము ఆమె అంగీకరింపలేదు ఆమె స్వామి మతమును తొలుత గౌరవింపలేదు ఇంతలో స్వామి భారతదేశమునకు వచ్చి యొకసంవత్సరము మాత్రము ఉండి మఱల ఇంగ్లాండునకుఁ బోయెను. ఈలోపుగా నామె వివేకానందుని మతమును గుఱించి అనేక విధములఁజర్చించుకొని "ఇందుఁ గొంతగాకున్న గొంతయైనయాథార్థము ఉండకపోదు" అని సంశయగ్రస్త యయ్యెను. ఇంతలో మఱల స్వామి యుపన్యాసములను వినుట తటస్థించెను. ఈసంభవమువలన ఆమెకు స్వామియందేగాక స్వామిమతమునందుఁగూడ గౌరవభావముగలిగెను. గాని అప్పటికిఁ గూడ ఆమె తన మతమును విడువలేదు.

ఇట్లుండఁగా వివేకానందుఁడు ఒక దినమున "మా దేశపుస్త్రీల వృద్ధిని గుఱించి కొన్ని యాలోచనములు చేసితిని. ఈప్రయత్నమున నీవు చేయూత నిచ్చి వారి నుద్ధరించెదవా!" యని ఆమె నడిగెను. తోడనే సందేహింపక ఆమె యందులకు అంగీకరించి స్వామివెంట భారతదేశమునకుఁ బ్రయాణము అయ్యెను.

భారతదేశమునకు వచ్చినపిదపఁ గూడ నామె ఇంకను వివేకానందుని మతమును గుఱించి యోచించుచునే యుండెను. ఒకప్పుడు ఆమె తన స్నేహితురాలియింటనుండి ఆమెతో ఈవిషయమును గుఱించియే ప్రస్తావన చేయుచుండఁగా అచ్చటకు స్వామి వచ్చెను. అప్పుడు స్వామి ముఖమున ఆమెకు ఏదో యనిర్వచనీయమగు దివ్యతేజము పొడగట్టెను. తోడనే యామె మోఁకరించి నమస్కరింపఁగా స్వామి ఆదరముతో శిరముపైఁ జేయిడి ఆమెను ఆశీర్వదించెను. స్వామి హస్తస్పర్శవలన ఆమెశరీరము పులకాంకితము అయ్యెను. భావయంత్రము కదలి

పోయెను. సందేహములు సమూలముగ నాశనమై పోయెను. అప్పుడామెకు నూతనజీవనము ప్రారంభము అయ్యెను. అనఁగా ఆమెకు భారతీయత్వము ప్రాప్తించెను.

ఆమె అప్పుడు వివేకానందుని మాహాత్మ్యములను బాగుగ గుఱుతెఱిఁగెను. ఏమన? ఒకప్పుడు ఆమె రామకృష్ణపరమహంస వివేకానందునిఁ గుఱించి "ఈతని హస్తస్పర్శవలననే దివ్యజ్ఞానము గలుగును" అని చెప్పియున్నట్లు వినియుండెను. అందులకు దార్ష్టాంతముగా నీమె "నేను ఆమహాత్ముని పాదములు ఎప్పుడు స్పృశించితినో అప్పుడే నాకు బ్రహ్మజ్ఞానము కలిగినది" అని చెప్పి గురుదేవునియెడల చాలభక్తిశ్రద్ధలతో సంచరింపసాగెను.

పిదప ఆమె రామకృష్ణపరమహంసశిష్యబృందమునఁ జేరెను. హృదయమును మార్చుకొనినట్లే ఆమె "మార్గరెటునోబుల్" అను నామమును "నివేదిత" అని మార్చుకొనెను. తన్ను దానే భారతధర్మమునకు నివేదించుకొనినది; గావున నీమె ఈపేరు గ్రహించెను. పిదప నీమె వివేకానందస్వాముల శిష్యురాలు అయ్యెను. అందఱును ఈమెను "నివేదితాసోదరి" యని పిలువసాగిరి.

మతవిషయికములు అగు చింతలు అన్నియు మానినతరువాత ఈమె వివేకానందుఁడు తొలుత తన్ను ఈదేశమునకు ఎందులకు ఆహ్వానించెనో ఆపని సేయుటకుఁ బూనఁదలఁచెను; గాని అందులకుఁగాను నివేదిత కులీనస్త్రీలనడుమ నుండవలయు నని నిశ్చయించుకొనెను. అందును బ్రాహ్మణుల మధ్య నుండఁదలఁచెను. అగుట నీమె ఈప్రయత్నసాఫల్యముకొఱకు కొన్నిదినములు కష్టపడవలసివచ్చెను. తుదకు ఎట్లు అయినను ఆకోరిక నెఱవేర్చుకొనెను. కాని మఱియొక కష్టము ప్రాప్తించెను. ఈమెకు వంటవాండ్రవలన కష్టములు సంభవించెను. తెలిసి తేటలు గల వంటవాండ్రు తొలుత లభింపరైరి. లభించినను స్థిరముగ నుండరైరి. మాటిమాటికిని మానుకొనఁజొచ్చిరి. కొన్నిదినములయందు ఈమెకు ఎట్టివాండ్రైనను వంటవాండ్రు లేకపోవుచుండిరి. అప్పుడెల్ల నీమె ఏపండ్లో ఏపాలో పుచ్చుకొని దినములు గడుపసాగెను. ఒక్కొక్కనాఁడు ఇరుగుపొరుగు స్త్రీలు ఈవార్త విని సకరుణలై అన్నాదికములు పంపఁగా నీమె కృతజ్ఞతతో వానిని స్వీకరించి భక్షింపసాగెను.

కొన్ని దినములు గతించిన తరువాత నీమె స్వయముగ తన యింటిముంగిట వీధిని తుడుచుకొనఁ జొచ్చెను. అదిచూచి ఆయిరుగు పొరుగు స్త్రీలెల్లరును తాము స్వయముగ ఆపనికిఁ బూనుకొనకున్నను సేవకులచేనైనను శ్రద్ధగా చేయింపసాగిరి. ఈకారణమువలన అంతకుమున్ను చాల మురికితో నిండియుండెడి బోసప్రా అనుపేరుగల ఆవీధి చాల శుభ్రముగా నుండుచుండెను.

తరువాత నీమె స్త్రీలకు జ్ఞానము నొసంగుటకుఁ దలపెట్టెను. భారతదేశములో ప్రకృతము ఆచరణలో నున్న విద్యావిధానము కేవలము నిరుపయోగము. అగుట నామె అది కనిపెట్టి క్రొత్తపద్ధతితో తొలుత బాలికలకు చదువుచెప్పుటకుఁ బ్రారంభించెను. ఇది ప్రయోజనకరము అగుచుండుటఁ జూచి కొన్నిదినములు కడచినతరువాత ఆవీధిని సమీపవీథులయందును గల ఇరుగుపొరుగు గృహయజమానురాండ్రు గూడ తీరికయైనపుడు వచ్చి ఆమెవలన విద్యాదానమును బడయుచుండిరి. ఈతీరున తొలుత ఇంటిని గుదురనీయకయు వంటలక్కను గుదురనీయకయు ఆమె ననేకవిధముల బాధపెట్టిన స్త్రీలు అందఱును ఆమెకు శిష్యురాండ్రు అయిరి. వారికి ఆమెను ఋణము విడిచియుండుట గూడఁ గష్టముగాఁ దోఁచుచుండెను. ఆమె మంచితనమే ఆమెకు ఇట్టి విజయమును గలిగించెను.

భారతస్త్రీలను ఉద్ధరింప వ్రతముపూని ఈవిషయమున అనఁగా తల పాఠశాలలకు స్త్రీలనుదీసికొనిరావలసినదని ఈమె తొలుత డాక్టరు బోసుగారి భార్యను సాయము గోరెను. ఆమె నివేదిత ప్రార్థనమును త్రోసివేయక కొంత ప్రయత్నించెను; గాని ఆవంతయు ఫలము గలుగదయ్యెను అంతట నామె విసిగిపోయి "ఈవిషయమున నావలన నేమియుఁ గాలేదు" అని చెప్పియుండెను. అగుటచే నివేదిత ఇప్పుడు ఆమె నొకనాఁడు తన యింటికిఁ గొనివచ్చి ఇరుగుపొరుగు స్త్రీలు అనేకులు చదువుకొనుచుండుటఁ జూపెను. అది చూచి బోసుగారి భార్య మిగుల వింతపడి సిగ్గుపడెను. నివేదిత స్త్రీలకు విద్య చెప్పుటతో మాత్రమే తృప్తి వహింపలేదు. ఆమె అనాథశిశువులకు ఆశ్రయము ఇచ్చెను; బాలవితంతువులను ఆదరించెను; అనేకవితంతువులను ఉపాధ్యాయురాం

ద్రనుగాఁ దయచేసెను ఇన్ని సత్కార్యములు చేయుచుండుటవలన నివేదిత ఏర్పఱిచిన పాఠశాలకు సోదరీబృందము అని పేరు వచ్చెను.

ఈసోదరీబృందవిషయమును నివేదితవృత్తాంతమును దేశదేశము లయందు వెల్లడి యయ్యెను. అగుటచే కలకత్తాకు వచ్చిన భారతీయు లలో ననేకులును భారతదేశమును జూడవచ్చిన పాశ్చాత్యు లనేకులును ఆమెను జూచిపోవుచుండిరి; గాని ఆమె ఈయాశ్రమనిర్వహణార్థము ధనము ఈయవలసినదిఅని ఎవరినిఁ బీడించి ఎఱుఁగదు ఆమెతఱుచుగ గొప్ప గొప్పపత్రికలకు మంచిమంచి వ్యాసములను వ్రాసి పంపుచుండె డిది. ఈవ్యాసములకు ఆయా పత్రికాధిపతులు వెల ఇచ్చుచుండిరి. ఇదియుఁ గాక ఆమె అనేకమహావిషయములను గుఱించి అనేకగ్రంథ ములను వ్రాసి ప్రకటించెను ఈగ్రంథప్రకటనము వలనఁగూడఆమెకుఁ జాల ధనము వచ్చుచుండెడిది ఈతీరున సంపాదించిన ధనము అంతయు ఆమె ఈయాశ్రమమును బోషించుటకే వినియోగించుచుండెడిది.

ఆమె కలకత్తాలోఁ బ్రవేశించిన కొలఁది దినములకే ఆనగర మున ప్లేగుజాడ్యము చెలరేఁగెను నగరమునందలివారు ఎల్లరును అదలిపోయిదిక్కు తెలియకుండఁబోనసాగిరి. కలకత్తాకుఁ జేరెడి యోడ లును రైలుబండ్లును శూన్యములగుచుండెను; గాని కలకత్తానుండివివిధ ప్రాంతములకుఁ బోవునవి మాత్రము క్రిక్కిరిసిపోవుచుండెడివి. అనే కులు ఇట్లు పాఱిపోవుచుండఁగా అనేకులు ఇష్టము లేకయు నీళ్లులేకయు మఱి యితరకారణములవలనను నగరమునందే నిలిచిపోయిరి. వారిలో ననేకులు మృత్యువువాతఁ బడసాగిరి. నివేదిత యప్పుడు విసుగును విరామమును భయమును లేక నగరము అంతయు దిరుగుచు చేత నైనంతవఱకును ప్లేగు సోకినవారికి ఉపచారములు సలహాలుచెప్పుట మందులు ఇచ్చుట మున్నగునవి చేయుచుండెడిది. ఒకప్పుడు ఒకబీదస్త్రీ తనతల్లి ప్లేగువలననే చచ్చిపోయియుండఁగా ఏడ్చుచుండెను అప్పుడే ఆమెకుఁ గూడ జాడ్యము అంకురించెను. తోడనే నివేదిత ఆమెకుఁ జికిత్స ప్రారంభించెను; గాని కొలఁదిసేపటికి నివేదిత యొడియందే ఆమె ప్రాణములు విడిచెను. ఈతీరున నివేదిత శక్తివంచన లేకుండ ననేకులకు సేవ సేసి కొందఱను మాత్రము బ్రతికింపఁ గలిగెను.

మఱికొన్ని దినములకు తూర్పు బంగాళా దేశమున తీరని కఱవు ప్రాప్తించెను. దీని వలన అనేక ప్రజలు మలమల మాడిపోయిరి. ఆ విపన్నుల నప్పుడు ఈమె మఱల రక్షించుటకుఁ బ్రారంభించెను. ఈకార్యమున ఆమె నిద్రాహారములను మఱచి శక్తికిమించిన పని జేసి యనేకులను రక్షించెను; గాని యీపరోపకారపారీణతకు ఫలమో యనునట్లు ఆమెకు శీతజ్వరము సంభవించెను. ఈశీతజ్వరమువలన ఆమె చాలనలిగి పోయెను. రోగస్థితిని జూచి అనేక దేశీయవిదేశీయవైద్యులును అనేక మిత్రులును ఈమెను ఆబోస్పారావీధినుండి మఱియొక వీధికి బోవలసిన దని చెప్పిరి; గాని ఆమె వినక అచ్చటనే యుండెను.

నివేదిత అనేకపత్రికలలో అనేకవ్యాసములు ప్రకటించియున్నది గదా? అట్లే యీమె కొన్నిగ్రంథములను గూడఁ బ్రకటించియున్నది. ఆమె వ్రాసిన గ్రంథములం దెల్ల ఆదిమము "కాళీమాత". ఇది కాళిక యొక్క తత్వము నంతను వివరించును. ఇందు మనలోఁ జాల మంది తలఁచునట్లు కాళిక యని నరబలులను జంతుబలులను గోరు మారణదేవత గాదని యీమె సహేతుకముగా నిరూపించి యున్నది. దీనిని ఇంగ్లాండు దేశమున ఒకపుస్తకవిక్రేత ప్రకటించెను. మఱియు నివేదిత వ్రాసిన మఱియొక గ్రంథము "భారతీయాచారముల యల్లిక" యనునది ఇందు మనయాచారముల ఘనత చక్కఁగ వివరింపఁబడి యున్నది. నివేదిత "స్వామిని నేఁగన్నవిధము" అని మఱియొక గ్రంథము వ్రాసెను. అందు వివేకానందునకును దనకును పరిచయము అగుట యాదిగ జరిగిన సంగతులు వ్రాసియున్నది. అజంతావిహారమునందలి ప్రతిమలను గుఱించి ఈమె వేఱొక గ్రంథము వ్రాసి యున్నది. అది భారతీయు లెల్లరును తప్పక పఠింపవలసిన గ్రంథము. నివేదిత శైలి యతిమధురము ఈమెకుఁగల విషయనిరూపణశక్తి అత్యద్భుతము. ఈమెకు వ్రాయుటయందు చెప్పుటయందునుగూడ సమానమైన అసమానశక్తియున్నది. ఈమె వ్రాసిన విషయములును చెప్పిన సంగతులను గూడ క్షణములో పాఠక చిత్తముల యందును శ్రోతల హృదయముల యందును అంకితములు అగును. ఇట్లు ఈమె అసమాన సామర్థ్యముతో పదునాలుగు సంవత్సరములు భారతదేశమునకు అనంత సేవను జేసి అవసానమున పరబ్రహ్మైక్యముఁ బడసెను.

మ॥ "అడవిం జీఁకటిఁ బోవువాని నుదయం బైనట్టి సూర్యాకృతిన్
జడధిం గ్రుంగఁగ నావ నెగ్గితిన యోజం బేదకున్ లిబ్బి చొ
ప్పడురీతిన్ ధృష్టిఁ దీర్పఁగా జడిమొగుల్ పైకొన్న చందాన నొ
వ్వడరన్ మాన్పెడు దైత్యునట్లు హరి డాయన్ వచ్చినన్ బ్రోచుతన్."

(కృష్ణకర్ణామృతము. ఆ.3. ప. 97)

భద్రాచలరామదాసు.

బెజవాడకు సమీపమున నున్న నేలకొండపల్లెయందు లింగన్న అను నొక బ్రాహ్మణుఁడు వసించియుండెను. అతని భార్య పేరు కామమ్మ. ఆదంపతులు అన్యోన్యప్రేమ సకలసుఖములు అనుభవించుచుండిరి; గాని వారికి సంతానసుఖముమాత్రము లేదయ్యెను. సంతానము నిమిత్తము లింగన్న చాలదినములు ఇందిరేశుని భజించెను. మఱి కొన్నిదినములకు హరిపూజాఫలముగ కామమ్మ గర్భవతియై నవమాసములు మోసి ఒకమంచిలగ్నమున కుమారునిఁ గనియెను. లింగన్న కుమారునకు జాతకర్మాదులు నిర్వర్తించి గోపన్నఅని నామకరణముగావించెను.

శ్రీహరిప్రసాదమువలన జన్మించినవాఁడు; గావున గోపన్న మాటలాడ నేర్చినదిమొదలు 'శ్రీహరీ' యనియు, 'శ్రీరామా'యనియు నెల్లప్పుడును పలుకుచుండెను. లింగన్న తన కొడుకు ఇట్లు దైవభక్తి కలవాఁడు అగుటకు ఆనందించి యుక్తసమయమున అక్షరాభ్యాసము గావించి విద్యాభ్యాసార్థము ఒక పండితునకు అప్పగించెను. అచ్చట గోపన్న తొలుఁదొలుత బాలరామాయణము చదివెను. అదిమొదలు అతఁడు రామనామస్మరణ తప్పకుఁ డయ్యెను. కొలఁది దినములకే అతఁడు విద్దెలను నేర్చి ఇంటికిఁ జేరుకొనెను. విద్వాంసుఁడై వచ్చిన గోపన్నను జూచి తలిదండ్రులు మిగుల నానందించిరి; గాని మఱికొలఁది దినములయందే వారు దివమునకుఁ బోయిరి.

సంసారభారము గోపన్నమీఁదఁ బడెను. ఇరుగుపొరుగువారి బోధవలన అతఁడు ఒకమంచి కన్యను జూచి పెండ్లియాడెను. పెండ్లి



రామదాసు.

భ_క్త :—418

మైన కొన్నిదినములకు ఆమె కాంపురమునకు వచ్చెను. దంపతులు ఇరువురును చాల అనురాగముతో మెలఁగసాగిరి. ఇట్లు కొలఁది కాలము గడచునప్పటికి గోపన్నకు ఒకకుమారుఁడు గలిగెను. ఆతఁడు కుమారునకు రాముఁడు అని పేరుపెట్టి మిగుల గారాబముతో పెంపఁ దొడఁగెను. అప్పటికి గోపన్న వయస్సు రమారమి ఇరువదిసంవత్సరములు?

ఒకనాఁడు తంబుర శ్రుతిచేసికొని హరికీర్తనలు పాడుచు నొక హరిదాసుఁడు గోపన్న ఇంటిముంగిటకు వచ్చి నిలిచెను. తోడనే గోపన్న "ఎవరో మహానుభావులు వచ్చినారు" అని చింతించి వీథిలోనికి వచ్చెను. వెంటనే హరిదాసుఁడు గోపన్న లక్షణములను బరిశీలించి అద్భుతాశ్చర్యచకితుఁడై గద్గదకు ఠమ్మని చేరఁబిలిచి "వత్సా, నీకు అఖండయోగము ఉన్నది. నీమీఁద శ్రీరామచంద్రునకు అఖండానుగ్రహము గలుగును. ఇఁక నీకు లేనిది యేమి గలదు? ప్రపంచమునఁ బుట్టినవారు ఎల్లరును జచ్చి మఱల మఱలఁ బుట్టి మఱలమఱలఁ జచ్చుట ప్రకృతిధర్మము. ఇది సామాన్యధర్మము. విశేషధర్మము గూడ నొకటి గలదు. అనఁగా పునరావృత్తి రహితశాశ్వత బ్రహ్మలోకనిత్యనివాసము. దీని ముఖ్యభావము ఈశ్వరసాయుజ్యము. మానవజన్మము ఎత్తినందులకు ఫలము ఈశ్వరసాయుజ్యమును సాధించుట. ఇదిసాధింపనిప్రాణి జన్మపరంపరచే యమయాతన ననుభవించును. ఇట్టి యవస్థ రాకుండఁ జూచుకొనుట వివేకి లక్షణము. ప్రపంచవాసనలను పరిహరింపఁజాలని వాఁడు ముక్తి పడయఁజాలఁడు. ఈజగత్తు అంతయు మిథ్య. శాశ్వతము గాదు. ఆత్మ యొక్కటే శాశ్వతము. అయినను మాయావరణము వలన ఆత్మజ్ఞానము తిరోహితమై, జగత్తు యథార్థము అను మోహము ఎల్లప్రాణులకును గలుగుచున్నది. ఎవరు ఈవ్యామోహమునఁ జిక్కుదురో వారికి మోక్షము లేదు. ఈవ్యామోహమును దొలఁగించుకొనుటకు ఆధారము ఈశ్వరసేవ. శ్రీహరిని గొలిచినవారికి అక్షయానందము సిద్ధించును; గావున నీవు ఈసంసారము అసారము అని ఎంచుము. దానిని అంటకుము. తారకమంత్రమును జపింపుము" అని మంత్రోపదేశముచేసెను. ఆహరిదాసుఁడు కబీరుదాసు.

కబీరుదాసు వెడలిపోయినతరువాత గోపన్న తారకమంత్రమును తదేకనిష్ఠతో జపింపసాగెను. ఉన్నది ఎంతయో రావలసినది ఎంతయో ఎఱుగకుండ తన ఇంటఁగల ధనము అంతయు బీదలకుఁ బంచి ఈయసాగెను. సంతర్పణలమీఁద సమారాధనలు. దానముల మీఁద ధర్మములు. ఇఁక వెనుకముందులు ఆలోచించుట లేదు. ఈతీరున కొలఁది కాలము మాత్రమే జరుగునప్పటికి ఇంటఁగల సర్వస్వమును అయిపోయెను. దినపాతములకు కష్టము సంభవించెను. మధ్యాహ్నము అరగడుపుతో లేచిన రాత్రికి మునలే లేకుండెను. ఇట్టిస్థితి సంభవించినను ఆతఁడు సంపాదనకుఁ బూనుకొనలేదు. అన్నము లేదే యని విచారింపలేదు. అన్నిటికిని రామనామస్మృతియే చాలును అని యాతఁడు తదేకదీక్షతో నుండెను.

తొలుత నాతఁడు రామకోటి వ్రాసి ముగించి అందులకు సంతర్పణము ప్రారంభించెను. ఇట్లుండఁగా నొక యూరి నుండి యొక బ్రాహ్మణుఁడు వచ్చెను. ఆతని నెంతో ఆదరించి గోపన్న సకలమును ప్రారంభించెను. వంటలన్నియుఁ బూర్తి యయ్యెను. అనేకబ్రాహ్మణులు వచ్చి వాకిటఁ బంతులుదీఱి కూర్చుండిరి. కొందఱు బ్రాహ్మణులు వడ్డనలు సేయుచుండిరి. ఈసమయమున గోపన్న కుమారుఁడు అగు రాముఁడు గంజితొట్టిలోఁ బడిపోయెను. వెంటనే తల్లి ఆబాలుని ఒడ్డుమీఁదికి లాగివేసెను; గాని అంతకుముందే బాలుఁడు విగతప్రాణుఁడు అయ్యెను. అయినను ఇప్పుడు తెలిసినచో బ్రాహ్మణ సమారాధనమునఁ దప్పు రుఁడ్డే యున్నపతి తర్ధండి చేయుచున్నఁని మానివేయునని శంకించి యూరకుండెను. కొంతసేపటికి బ్రాహ్మణులు తృప్తిగా భుజించిరి. అప్పుడు గోపన్నకు ఈవార్త తెలిసెను. తోడనే యాతఁడు తనకుమారుని మృతకళేబరము నెత్తికొని శ్రీరామచంద్రునిఁ దలంచి అతిఘోరముగ విలపింపసాగెను. ఒకటి రెండు నిమిషములయందే ఆతనికి ఈదుఃఖము పోయెను. "జగదీశ్వరుఁడగు శ్రీరామచంద్రుఁడు నాపాల నుండ నాకీదుఃఖమేల" అని తలంచి ఆతఁడు కాళ్లకు గజ్జెలు కట్టుకొని ఒకచేత తంబురాధరించి ఒకచేత బాలుని మృతకళేబరమును ఎత్తుకొని శ్రీరాముని గుణగణములనుగీర్తించుచుమహానందముతోనృత్యముప్రారంభించెను. కొంతసేపటికి బాలకుఁడు దీర్ఘనిద్రపోయి మేల్కొన్నవానివలె లేచి

కూర్చుండెను. అది చూచి అందఱును అత్యాశ్చర్యపడిరి. గోపన్న మహానందపరవశుఁడై శ్రీరామచంద్రుని మఱియనేకవిధములఁ బ్రార్థించెను. భోజనమునకు వచ్చిన బ్రాహ్మణులు అందఱును భూరిసంభావనలు బడసి గోపన్నమాహాత్మ్యమునకు అబ్బురపడుచు వెడలిపోయిరి. ఈవిధమున అనేకపర్యాయములు సమారాధనలు చేయుటవలననే ఆతఁడు కడు బీదస్థితికి వచ్చెను. ఈస్థితిఁ జూచి భార్య వగచుచుండఁగా గోపన్న "చెలం, ఏలవగ చెదవు? శ్రీరామచంద్రుఁడు ఉండఁగా మనకు ఏమిలోపము?" అని యామె నోదార్చెను.

అదిమొదలు ఆమె మఱల తనబీదస్థితినిఁ దలంచుకొని వగచి ఎఱుఁగదు. ఎల్లప్పుడును భర్తతోఁగూడ సత్యానందముతో శ్రీరామనామమును స్మరించుచు భర్తకు సకలోపచారములను జేసి సరివారిలో నామె మేలుబంతి అని పేరుబొందెను.

ఇంతలో నొక సంవత్సరము గడచి పోయెను. శ్రీరామజన్మోత్సవము సమీపించెను. అది తెలిసి గోపన్న "ఇంటఁ జూచిన నేమియు లేదు. శ్రీరామజన్మోత్సవమును బ్రతికియుండియు శక్తికొలఁది చేయక పోవుటకంటె అన్యాయము లేదు. ఇందులకు ధనము కావలయును గదా! గోల్కొండకుఁ బోయెదను. నేను పూర్వజన్మమున పుణ్యము చేసికొని యుంటినేని ఈమేటి మహోత్సవము జరుగుటకు తగిన అవకాశములు అక్కడ సంభవింపవచ్చును" అని నిశ్చయించుకొని గోల్కొండకు బయలు దేఱెను.

గోపన్న కొన్నిదినములకు గోల్కొండకు జేరుకొని అక్కన్న మాదన్నగార్ల ఇంటికిఁ బోయెను; గాని లోపలకుఁ బోవుటకు పహారా జవానులు అడ్డుపడిరి. అప్పుడు ఆతఁడు "నేలకొండపల్లె కాపురము తండ్రి లింగయ్య తల్లి కామమ్మ పేరు గోపన్న దర్శనమునకు సెలవుఁగోరుచున్నాఁడు" అని చెప్పుఁడు అని జవానులతోఁ జెప్పెను. జవానులు లోపలకుఁ బోయి రాజ్యాంగమును గుఱించి ఆలోచించుచున్నఅక్కన్నమాదన్నగార్లకు ఈసంగతులు తెలిపిరి. ఇది వినినతోడనే వారు దిగ్గన లేచి వీథిలోనికి వచ్చి మేనల్లుడు అగు గోపన్నను కౌఁగిలించుకొని ఆదరించి లోనికిఁ గొనిపోయి "వత్సా, నీతల్లియు, మా అక్కయునగు కామమ్మ స్త్రీలయందు మేలుబంతి. అట్టియామెను బ్రపంచమున మఱలఁ

జూడము" అని ఆమెను దలంచుకొని వగచిరి. అంతట గోపన్న "గత జలసేతుబంధనము వలనఁ బ్రయోజనము లే"దని వారికి తెలిపెను. పిదప వారు గోపన్న స్థితిగతుల నడిగి తెలిసికొని జరిగినదానికి ఎంత యువగచి నీకేమియు ఇబ్బందిలేదు. అంతకును శ్రీరామచంద్రుఁడును పిదపమేమును గలము" అని చెప్పి ఆతనికి ధైర్యముఁ గొలిపి భోజనానంతరము కచ్చేరికిఁ బోయిరి.

వారు ఇరువురును కచ్చేరికిఁ జేరుకొని తొందరపనులు అన్నియు ముగించుకొను సప్పటికి తానీషావచ్చి సలాములు చేసి "అమాత్యవరులు నేఁడు జాలము చేసినట్లు ఉన్నది. ఒకానొక పనివిషయము మీకొఱకు ఎదురుచూచుచున్నాము" అని పలికెను. అక్కన్న తన మేనల్లుఁడు వచ్చిన సంగతిఁ దెలుపఁగా తానీషా "వారిని మేము చూడవలయును" అని పలికెను; అంతట తానీషా యాజ్ఞప్రకారము ఒక సరదారుఁడు పాలకినిఁ బట్టించుకొనిపోయి నవాబు సెలవు నెఱింగించి గోపన్నను ఆపాలకిలోఁ గోటకుఁ గొనివచ్చెను. అక్కన్నపోయి గోపన్నను గొనివచ్చి నవాబుదర్శనము చేయించెను. గోపన్న నవాబునకు వంగి సలాములు చేసి ఆశీర్వదించెను. పిదప నవాబు మంత్రుల వలన గోపన్న శక్తిసామర్థ్యములను విని ఆతనికి భద్రాచలము తాలుకాకు తహాసీలుదారీ ఉద్యోగము ఇచ్చి సబహుమానముగాఁ బంపెను. సాయంత్రము ఇంటికి వచ్చిన తరువాత అక్కన్న మాదన్నగారు మేనల్లునకు నీతులు ఉపదేశించి పాలకీమీఁద భద్రాచలమునకు మఱునాఁడుపంపివేసిరి.

గోపన్న భద్రాచలము చేరిన మఱునాఁడే అచ్చట అంతకుఁ బూర్వము తహాసీలు చేయుచున్న యాతఁడు అధికారము అంతయు గోపన్నకు ఇచ్చివేసెను. పురజనులు క్రొత్తతహాసీలుదారుగారినిఁ జూచుటకువచ్చిరి. వారినిఁజూచి గోపన్న "అయ్యలారా, మీరిదివఱకు బాకీయున్న సొమ్ము అంతయుఁ జెల్లించివేయుఁడు. నేను మిమ్ములను సుఖపెట్టుటకై వచ్చియున్నాను. నేను ఏమి చేయఁదలఁచు కొన్నను మీరేఆధారము; గావున మీరు నాకు అన్నిటను జేదోడువాదోడుగా నుండి నాకు సర్కారులో గౌరవమును గలిగింపుఁడు. మీరుసాయపడ రేని మీకు నేను చేయఁదలఁచిన సౌకర్యములు చేయఁజాలను. మీరును శ్రీ

రామచంద్రమూర్తి అవతరించియున్న భద్రగిరి ప్రాంతములయందున్న వారు.మీకు ధర్మము లేమియు ఉపదేశింపవలసిన పని లేదు. మనము అందఱమును శ్రీరామచంద్రుని భటులము, గావున మన భేదభావములు అన్నియు మఱచి శ్రీరాముని సేవింతము"అనిచెప్పెను. రైతులు అందులకుఁ బరమానందముతో సంగీకరించిరి.

ఆసంవత్సరము గోపన్న పన్నులు అన్నియు ఒక్కదమ్మిడీయైన బాకీ లేకుండునట్లు వసూలు చేసి యుక్తకాలమున గోలకొండకుఁబంపి వేసెను. అది చూచి నవాబు ఆతని చాకచక్యమునకు ఎంతయు మెచ్చుకొనెను. ఇట్లుకొన్నిదినములు గడచిపోయెను. కాలము గడచిన కొలఁదిని భద్రాచలము తాలూకాయందలి ప్రజలకు గోపన్న తహస్సీలుదారు అనుటకంటె రామదాసు అని ఎక్కుడు గౌరవభావము గలిగెను.ఆతని అందఱును గోపన్న యనుట మానివేసి రామదాసు అని పిలువసాగిరి. మఱికొన్నిదినములు గడచునప్పటికి గోపన్నతనపేరు మఱచిపోయి ఎవరైన నడిగినచో రామదాసు అనియే చెప్పసాగెను. తెల్లవాఱినది మొదలు సాయంత్రము అగునంతవఱకు రాజకార్యములయందును సాయంత్రము అయినది మొదలు తెల్లవాఱునంతవఱకు రామకార్యములయందును రామదాసు లీనుఁడై పోవుచుండెను. ఆతని ఏల్బడిలో నున్న ప్రజలుగూడ కొల్లిటికంటె రామభక్తులు కాఁజొచ్చిరి. ఎక్కడఁ జూచినను రామోత్సవములే. ఎక్కడ వినినను రామనామమే.

ఇట్టి స్థితి సంభవించునప్పటికి రామదాసునకు ఒక తలంపు ఒడమెను. శ్రీరామచంద్రుఁడు ఆచ్ఛాదనములేకుండ కొండమీఁదఁ బడియుండుట ఆతనికి మంచిదిగా తోఁచలేదు. తనయేల్బడిలో శ్రీరామునకు ఆలయనిర్మాణము కాకపోయినచో తనకు అధోగతి తప్పవేఱు లేదని ఆతఁడు భావించి ఆలయము ఎట్లు పూర్తియగునని భావింపసాగెను. ఇంతలో ఆతాలూకాయందలి పెద్దరహితులు కొందఱు ఏదోపని మీఁద రామదాసు చెంగటకు వచ్చిరి. అప్పుడు ఆతఁడు వారినందఱను ఆదరించి "అయ్యలారా! జననమరణములు సహజములు. భూమిమీఁద నుదయించిన ఏప్రాణియుఁ జావకుండ నుండదు. ఇహలోకమున మనము చేయు సుకృత దుష్కృతములను అనుసరించి మన భవిష్యజ్జన్మము

కల్పింపఁబడును. మన భవిష్యత్తు అంతయు మన అఱచేత నున్నది. ఈ సంగతి అనేకులకుఁ దెలియదు. కావుననే వారు మంచిచెడ్డలు యోజింపక తోఁచినట్లెల్లఁ బ్రవర్తింతురు. నరజన్మమునకంటె స్వర్గమున దేవతలయి పుట్టుట మంచిది. అందులకు మనము ఇచ్చట బుణ్యము చేసికొనవలెను; గాని పుణ్యము శాశ్వతము గాదు. అది కొన్నిదినములకు తరిగి పోవును. అప్పుడు స్వర్గమున నున్నఆత్మ మరల నరజన్మముఎత్తి భూమిమీఁద సంచరింప వలసియుండును. ఇది యెంత కష్టమో యోజింపుఁడు. మరల యేజన్మము ఎత్తకుండ శాశ్వతబ్రహ్మలోక నివాసము ఒసంగు ఉపాయము ఒకటి గలదు. అది నిష్కామబుద్ధితో శ్రీహరిని సేవించుటయే. శ్రీహరిని సేవించినవారు శ్రీహరిసాయుజ్యమును బడయుదురు. దానికి ఇఁక అంతము అనునది లేదు. అందులకు మార్గము అర్పణము; గావున మనకు గలది అంతయు శ్రీరామచంద్రునకు సమర్పించి ధన్యతం గాంతము. శ్రీరామచంద్రుఁడు పర్వతోపరిభాగమున ఎండకు ఎండుచు వానకుఁ దడియుచు దిక్కులేని వానివలె నవయుచున్నాఁడు. అది మనకే అపాయకరము గావున మనము మనచెంత నున్నధనముతో ఒక యాలయము కట్టించి స్వామి నందుఁ బ్రవేశ పెట్టుదము. ధనము గలవారము ధనము ఇత్తము. ధనము కలవారును లేనివారునుగూడ కూలిఅడుగకుండ పనిచేయుదము" అని చెప్పె. అందులకు రహితులు అందఱును అంగీకరించిరి.

అంతట శుభముహూర్తమున ఆలయనిర్మాణము ప్రారంభించిరి. చుట్టుప్రక్కల గ్రామములయందలి రహితు లందఱును వచ్చి పనులు చేయసాగిరి. దూరస్థానములనుండి గొప్పగొప్పశిల్పులు వచ్చిరి. ఒక గడియయైన విఘ్నము రాలేదు. కొలఁది దినములయందే ఆలయనిర్మాణము పూర్తియయ్యెను. ఆయాలయమును జూచియు రామదాసు భక్తిశ్రద్ధలను జూచి అందఱును ఈవిధముగఁ జెప్పుకొనసాగిరి.

కల్యాణిరాగము - ఆదితాళము.

కైంకర్యము చేసెను రామదాసు కైంకర్యము చేసెను॥
కైంకర్యముచేసె కామిత్రప్రసులనకు సంకటహరణాస్వామి యనిమ్రొక్కి ॥కైంకర్యము॥
శ్రీకర మగు రాజతమణిశాలల, ప్రాకారంబుల బహుసుకపంక్తుల
మంజులతర మగు మణిమంటపముల, కంజరాగమణికలితాంగణముల

చారుచక్యకాంచనకూటంబుల, నాకాశంబున కంటెడు తేరుల
గోపుర మెరసెడి గోపురవితతుల, దీపించు వితర్దికల బెడంగుల
తళుకు గులుకు సగవష్ప కంబంబుల, కలశంబులను గల కలశములు
రంగగు ముత్యపు రంగవల్లికల, శృంగారములగు చిత్రశాలికల
సుకరతోరణసమాజంబుల మణి, ముకురతోరణసమూహంబులఁ గడు
భుగభుగ వలచెడు ధూపదీపముల, అగరుధూపముల నాళువత్తుల
మెరసెడి రీతిని మేలిమి గాఁగను ॥ కైంకర్యము॥

ధారాళములగు ద్వారబంధముల, నారయ నవ్యకాంచనశిఖరంబుల
సమ్మతమగు మణిమయ సింహాసనముల, ఘుమఘుమ యనుచు మలుకుంకుమరసముల
ఘణఘణయను మణిఘంటల తాళముల, ధణధణ యను వెడు మృదంగవాద్యముల
మిసమిస మెరసెడి మేటిమినాకుల, కనకమయంపు గరుడధ్వజముల
రామరామ యను రామనామంబుల, ప్రేముతో వెలసెడు విబుధగణంబుల
సంగ సంగీత గానంబుల, కోమలి నృత్యంబుల
నైవేద్యములు మహాన్నదానముల, శ్రీనిశంఖఘంటానాదంబుల
మెరసెడి రీతిని మేలిమి గాఁగను ॥ కైంకర్యము॥

పల్లగొడుగులను వింజామరముల, పల్లెల మొల్లల మంచివాసనల
పిల్లనగ్రోవి కఫ్లుస్వరముల, ఝల్లరిఢక్కా జయనాదంబుల
పల్లవపాణుల పాటల నాటల, సల్లలితోత్సవచామరవీజనముల
వనమాలాసంయుతకౌస్తుభముల, ఘనతులసీవనచందనగంధంబుల
రామభజనసంకీర్తనములు, రామతీర్థసాగరముల
రామస్మరణల రామనామంబుల, రామభద్ర విప్రసమారాధనముల
హనుమద్గజవాహనముల ఘనముల, అనుపమ శృంగారానందంబుల
రమణ భద్రగిరిరాముని నిత్యము, నిత్యానందంబై కలుగుల
మెరసెడి రీతిని మేలిమి గాఁగను ॥ కైంకర్యము॥

గుళ్లు గోపురములు మున్నగునవి అన్నియు పూర్తియగు నప్పటికి రామదాసు చెంతను రక్షితులవద్దను గల ధనము అంతయు నైపోయెను. ఇంకను సంప్రోక్షణాదికములు అన్నియు మిగిలియే యుండును. ఇదంతయు నెట్లు అగునని రామదాసునకు దిగులుపుట్టెను. ఎన్ని విధముల నాలోచించినను ఆతనికి ఏమియుఁ దోఁచినదిగాదుగాని నాఁటిరాత్రి శ్రీరాముఁడు స్వప్నమున సాక్షాత్కరించి “విచారింపకుము. సర్కారు పైక

ము వెచ్చింపుము" అని చెప్పెను. మఱునాఁడు ఉదయము రాముఁడే ఉపాయము సెప్పినందులకు పరమానందకందళితహృదయారవిందుఁడగుచు రామదాసు కోశాధికారినిఁ బిలిచి కోశమున ధనము ఎంతయున్నది. యని యడిగెను. కోశాధికారి పోయి చూచి వచ్చి ఆఱులక్షలు కలదనియెను. రామదాసు ఆఱులక్షలతోఁడను తక్కిన సమస్తమును నెఱవేర్చెను.

ఆసంవత్సరము అన్ని తాలూకాలనుండియు పన్నులు వసూలయ్యెను; గాని భద్రాచలము తాలూకానుండి మాత్రము వసూలు అయి రాకపోవుటకుఁ గల కారణము నెఱుంగక గోల్కొండయందును కోశాధ్యక్షుఁడు కలవరపడసాగెను. ఇంతలో మాదన్న కోశమును లెక్కలను పరీక్షించెను. అప్పుడు మాదన్న "గోపన్న పన్నువసూలు చేసి ఏల పంపలేదో కనుగొని రండు" అని కొందఱు సరదారులను నియమించెను. వారును ప్రభువు నానతి చొప్పున వెంటనే బయలుదేఱి స్వల్పకాలమునందే భద్రాచలము చేరుకొనిరి. వారువచ్చిన కార్యము విని గోపన్న మాఱు పలుకక—

దర్బారురాగము - చాపుతాళము.

పల్లవి. వచ్చేవో రామ మాయింటికి॥ వచ్చేవో॥

అనుపల్లవి.

వచ్చేవో రామ వాసుదేవ నేఁడు భక్తులను నన్నాదరింపఁగ నేఁ॥ వచ్చేవో॥

పంపిస్తినేతి రాము నీ సందేశము నమ్మి, మహాత్ముఁడని మునిపుంగవుఁ జెప్పఁగ విని గోపురం
పనుచేయింతి కాపాడు మని నేఁ॥ వచ్చేవో॥

కరుణించరాదా రామ నిన్ను నే నమ్మితిఁ, గమనమున గౌతమసతి నహల్యను నరయూ
ప చేసిన చరణములఁ మ్రొక్కెద॥ వచ్చేవో॥

మ్రొక్కెను రారా ఏలఁగ నన్ను దిక్కు గానరా, చక్కని భద్రాచలరామదాసుఁడ
నక్కఱతోఁ నన్నాదరించు నేఁ॥ వచ్చేవో రామ॥

అని అదేపనిగ రామస్మరణ ప్రారంభించెను. ఈనిరుత్తరము వలనను ఆతనిపాటలవలనను బట్టియు సొమ్ము ఆతఁడు దుర్విని యోగము చేసె నని తలంచి మఱికొంతసేపటికి అచ్చటి కోశాధ్యక్షునివలన నిజమెఱింగి గడగడలాడుచు సరదారులు గోల్కొండకుఁ బోయి

సంగతులు అన్నియు మాదన్నకు ఎఱింగించిరి. ఇది విని మాదన్న చాల వగచి అక్కన్నతోఁ జెప్పి కార్యగతుల నూహించుచుండఁగా తానీషా లెక్కలు పరీక్ష సేయుటకు కోశాగారమునకు వచ్చెను. అచ్చట నాతఁడు అన్ని తాలూకాలనుండియు సొమ్ము పూర్తిగా వచ్చియుండు టయు ఒక్క భద్రాచలముతాలూకానుండి మాత్రమే రాకపోవుటయుఁ జూచి "ఏమి కారణము?" అని యడిగెను. అంతట కోశాధికారి రామదాసు భద్రాచలరామునకు ఆలయాదులు కట్టించుట మున్నగు తాను వినిన సంగతులు ఎల్ల నెఱింగించిరి. అది వినినతోడనే తానీషా "మా తాలూకు ఆఱులక్షలరూపాయలు నిర్భయుండై వీఁడు రాముని నిమిత్తము వెచ్చించినాఁడా?" యని మహోగ్రుఁడై మంత్రులఁజూచి "ఉన్నట్లుండఁగా వానిని కట్టి తెండు" అని సందారులకు ఆజ్ఞయిచ్చెను.

పోఁడనే వారు బయలుదేఱి భద్రాచలముఁ జేరి గోపన్నను తిట్టుచు నిందించుచు త్రోయుచు గోల్కొండకుఁ బ్రయాణమైరి. భద్రాచలమునందలి వారెల్లరును రామదాసునకు ఇట్టి గతి పట్టినందులకు ఎంతయుఁ వగచి "రామా, నీదాసునిఁ బ్రోవ నిదే సమయము" అని అనేకవిధములఁ బ్రార్థింపసాగిరి అంతకంటె వారు ఏమి చేయఁగలరు?

యమునాకల్యాణిరాగము - ఆదితాళము.

గరుడగమన రారా నను నీ కరుణ నేలుకోరా
పరమపురుష యీవసుధలోన నీ మరుఁగుఁజొచ్చితిని అరమరచేయకు|| గరుడ||
పిలువఁగానె రమ్మీ అభయము తెలుపఁగానె ఇమ్మీ
కలిమి బలిమి నాకిలలో నీవని కలవరించితిని నలుసును గన్నయ్య|| గరుడ||
పాకశాసనుతయన దశరథబాల జలజనయన
పాలయించు నను నెల్లయెడల నీ పాలఁబడితి నిఁక జాలము సేయకు|| గరుడ||
ఏలరావు స్వామి నను నిపుడేలుకోనిదేమి
ఏలువాఁడ వని చాల నమ్మితిని ఏలరావు కరుణాలవాల హరి|| గరుడ||
ఇంత పంతమేల భద్రగిరీశ వెంకృపాళు
చింతలుడుఁచి కంచర్లరామదాసాంతరంగపతివై రక్షింపుము|| గరుడ||

అని రామదాసు గూడ అనేకవిధములఁ బ్రార్థింపసాగెను. కొలఁది దినములలో వారు గోల్కొండఁ జేరుకొనిరి. యుక్తసమయమున సరదా

రులు గోపన్నను తానీషా ఎదుటకుఁ గొనిపోయి నిలిపిరి. రామదాసు నిఁజూచిన వెంటనే తానీషాముఖము మహాకోపముచే ఎఱ్ఱఁబడెను. అంత నాతఁడు మండిపడుచు "గోపన్నా, మిన్నుమన్నులు గానకుండ సంచరించుచున్నావఁట! మాపైకము వెంటనే చెల్లింపుము" అని పలికెను. అందులకు రామదాసు "ఏల ఇట్లు కోపించెదవు! నీధనము, శ్రీరామచంద్రునకు సమర్పింపఁబడినది. నీవు ధన్యుఁడవైతివి" యని జవాబు ఇచ్చెను. తానీషాకోపము ఈమాటలతో ఆకసమంటఁ బెరిగిపోయెను. తోడనే యాతఁడు హర్కారులకు "ఈతనిని బందిఖానాలో వేయుఁడు. నాసొబ్బు ఎట్లురాదో చూచెదను. పండ్రెండుదినములలో మీరు ఈతని వలన ఆఱులక్షలపైకమును కక్కింపవలెను" అని యాజ్ఞాపించెను.

తోడనే హర్కారులు రామదాసుని కైదులోనికిఁ గొనిపోయిరి. ఈదారుణచర్యను జూచిన పౌరులెల్లరును చాల వగచిరి. రామదాసును రక్షింపుమని శ్రీరామచంద్రుని ప్రార్థించుచు కైదులోనికిఁ బోయెను. హర్కారులు ఉప్పుబియ్యము మున్నగు సామగ్రి తెచ్చి ఇచ్చి వెడలిపోయిరి. రామదాసు వారు వెడలిపోయిన తరువాత వానిని పచనము చేయ పాత్రయందు అన్నమునకు మాఱుగా అమృతతుల్యము అగు పాయసము ఉండెను. ఇది యంతయు రాముని కరుణయే యని యాతని యెడల రామునకు దయ తప్ప లేదనియు ఆనందించుచు రామదాసు ఆపాయసమును రామునకు నివేదించి పిదప తాను భక్షించెను.

మఱునాఁడు కారాగారరక్షకులు తానీషా చెంతకుఁ బోయి "ప్రభూ, ఆతఁడు ఈకారాగృహవాసమును ఏమియు లెక్కసేయుట లేదు. ఆనందముగా నున్నాఁడు. ధనము ఇచ్చునట్లు కానిపించదు" అని చెప్పిరి. అదివిని తానీషా మండిపడి "మంచిమాటలతో ఇచ్చువాఁడు కాఁడు. కొట్టుఁడు. మూపుపై ఇనుపగుండ్లుగట్టి పురమున అన్నివీథులను త్రిప్పుఁడు. మీచేతనైనన్ని బాధలు పెట్టుఁడు" అని యాజ్ఞాపించెను. యమభటులకుఁగూడ క్రౌర్యము నేర్పఁగల ఆభటులు ప్రభువునాజ్ఞ ముగిసిన వెంటనే ఆహాహా! యని యఱచుచుఁ బోయి ఆప్రకారముగ రామదాసునిఁ బీడింపసాగిరి. అయినను రామదాసు వానిని లెక్కసేయక ఏమియు నెఱుంగనట్లు రామస్మరణము చేయుచు ఆనందించుచుండెను

ఒకనాఁడు భటులలో నొకఁడు మేమెంతకొట్టినను నీవు "అమ్మా యనవు. ఏడువవు. నీకు దిక్కెవరు? మాదెబ్బలు నీకు ఏల తగులుట లేదు?" అని యడిగెను. అప్పుడు రామదాసు "తనమీఁద శ్రీరామచంద్రునకు అనుగ్రహము గ"దని చెప్పి రాముని మాహాత్మ్యమును వారియెదుట నుపన్యసించెను. అదివిని కొందఱు భటులు రామభక్తులైరి. తక్కిన వారు నుండిపడుచు తానీషా చెంతకుఁ బోయి "ఏలినవాఁడా, ఎన్నికొట్టినను వాఁడు లెక్కసేయుట లేదు. కొట్టినకొలఁది నవ్వుచున్నాఁడు. ధనమువచ్చేమార్గము కానరాదు" అని మరలఁ జెప్పిరి. అప్పుడు తానీషా రామదాసుని సింహాసనమునకు రావించి "మాధనము ఇచ్చెదవా లేదా!" యని గద్దించి పలికెను. రామదాసు అందులకు భీతిల్లక "నీసొమ్ము శ్రీరామచంద్రునకు వినియోగింపఁ బడినది. నీవు తరించితివి. మఱల ఆధనము గోరెదవేని నరకమునఁ గూలఁబడిపోయెదవు" అని ప్రత్యుత్తరము ఇచ్చెను. ఈజవాబు తానీషాకు నిప్పుమీఁద నేయిపోసినట్లు అయ్యెను. తోడనే ఆతఁడు మఱింత మండిపడి "వీనిని దయచూడక సంహరించి వేయుఁడు" అని యాజ్ఞాపించెను.

భటులు రామదాసునిమీఁద అనేకపర్యాయములు ప్రచండప్రహారములు విసరిరి; గాని ఆతనికి ఏమియు అపాయము గలుగ లేదు. యథాప్రకారముగనే యుండెను. అంతట విసిగిపోయి భటులు ఆతనిని మఱలం గైదులోఁ బడవేసి నల్లులు, దోమలు, తేళ్లు మున్నగువానిం గఱపించిరి. గాని అప్పుడును వారి ప్రయత్నములు విఫలములే యయ్యెను.

రామదాసు విసుగు విరామములు లేకుండ శ్రీరామునిఁ బ్రార్థించి కారామోచనము గానక "రాముఁడు దయఁ దలఁపలేదు." అని భావించి అనేకవిధముల సీతాదేవినిఁ బ్రార్థించెను. సీతాదేవి హృదయము వెంటనే కరిగెను. తోడనే ఆమె రామునకు జాలిగలుగునట్లు రామదాసు స్థితిగతుల నెఱింగించి "ఆతనిని వెంటనే చెఱ విడిపింపవలయును" అని యాజ్ఞాపించెను. అంతట రాముఁడు లక్ష్మణునితోఁ గూడ సేవకవేషములు ధరించి అర్ధరాత్రమున బయలుదేఱి గోల్కొండనగరముఁ జేరి తానీషా యంతఃపురము ప్రవేశించి తానీషాకు స్వప్నమున సాక్షా

త్కరించెను. తోడనే తానీషా లేచి కూర్చుండి ఏకశయ్యపై నిదురించుచున్న భార్యను లేపి స్వప్నమున ఇరువురు మహాత్ములం గాంచితినని చెప్పుచు అబ్బురపడుచుండ రామలక్ష్మణులు తలుపు తట్టిరి. తోడనే తానీషా తలుపులు తెఱచెను.

రామలక్ష్మణులు లోపలఁ బ్రవేశించిరి. వారినిఁ జూచి తానీషాయును ఆతనిభార్యయు ఏమియుఁ దోఁచక అబ్బురపడసాగిరి. కొంతసేపటికి రాముఁడు "తానీషా, రామదాసు నెచ్చట నేమి చేయుచున్నావు?" అని యడిగెను. అందులకు జవాబు చెప్పకయే తానీషా "మీరెవరు? అనేకవీరభటపరిరక్షితము అగు ఈ అంతఃపురమునకు ఎట్లు వచ్చినారు? ఏల వచ్చితిరి." అని యడిగెను. ఈసందర్భమున వారికి ఈ క్రిందిరీతిని సంభాషణము జరిగెను.

నాదనామక్రియరాగము - ఆదితాళము.

ఎవరి సర్దారులు మీరు వహ్వా ఎవరి హుకుమున వచ్చినారు?
గోపన్నగారి సర్దార్లు మా ప్రాణ కోటినాకిస్లు.
ఎందుకు నిటకు వచ్చినారు మిమ్మెంగల కైంపినారు?
తెల్లవారకె ఘుందు మీకు బాకీ చెల్లఁగట్టి యందుకొనుము.
వహ్వా మీ నామము లేమి? మీ వంగసమునకు పేరేమి?
రామోజీ లక్ష్మోజి నామం మాది రఘుకుల మను పేలనాము.
కొల్వ్వ కొచ్చినవారు మీకు వచ్చి కూటికెమ్ముటఁ బల్కుమాకు.
మూఁడుతరములుగ నున్నాము మమ్ము గావుండి పెదుదురన్నాము.
కొలువు కొలవఁగ వచ్చేము? ఈకొల్వువవచ్చినదేమి?
కొల్వ కొలుచుట నేఁ నయ్యా పొట్టకూటికై కాదఁటయ్యా.
మా పైకము దెచ్చినారా? ఎల్లమాట లాడఁగ వచ్చినారా?
మీ పైకముఁ దెచ్చినాము యెల్లమాట జూడ తెలుఁగము.
ఎంత పైకముఁ దెచ్చినారు మీరెప్పుడేమి చెప్పుచున్నారు?
మీకెంత బాకి చెప్పండి అది మీరప్పుడె చెల్లించుకోండి.
ఆరులక్షలు ఇవ్వండి మీ రాసిన గోపనను జూడండి
ఆరులక్షలు తేలేదండి మీకు అవలిచ్చేవారు లేరండి.
మీ రెంత తెచ్చినారండి మంచి పోరాటమాయెనుండి
మూఁడులక్షలున్నదండి మీ యొడ మారుపల్కలేవండి

వేగఁ దెచ్చినవి ఇవ్వండి మీరోగముడిపెదను చూపండి.
పదివేలు తెచ్చినామండి మీ పంపేము మాన మేలండి.
సుగుణములు మీకు మెండు మాపుణ్యసిరంగిలోగుండు.
మన్నెరయీతీఁగి నమ్మఁగలమా? పనువిసర్జన చేసిన ఫలమా?
విడుదలఁ గను తలంపు లేదు మీయెడ మాకసంతృప్తి లేదు.
జడిగొన్న క్రోధ మేలయ్యా మాకిపరాని గొకటి లేదయ్యా.
పైకో ఇచ్చట సుంత మా బాటల నుండఁ గెదనంత.
భేటికోలకు వచ్చినాము మీ బాటలు చెలిఁగిన వారఁగనము.
మీ బాట చెలుఁగ మాకేల? సన్న్యాసబాసు ఈమాటలేల?
మాటలేల మీతో నింక తేము పూర్తి చేక పోదు మింక.
గోనన్న సరదార్లు గనుక మీ పెట్లు పైదే గతి కాక.
బాకీదార్లగు కద్దు ఖైదు నేము బాకీ యేమాత్రము లేదు.
తెచ్చిన పైకమీయండి మీ తెగులు మాన్పెదము చూడండి.
తెగులు మాన్పెదు గోరయుంటే నేనే మీ మేలు నమ్మునకంటే.
మా ఉద్యోగ సొమ్ముకు సహమా పడ్డ మాను మనుము జెప్పనేనా?
అబ్బబ్బలకు అబ్బము మానే బ్బందులంటలు వినము.
ప్రభ్బబ్బగాఁ పలికేరు మా పద్బ్యమ గతి గానలేరు.
గతిలేనివారకెల్ల మేమే గతి యిమ్ముల మనఁ దేవరల్ల.
[illegible] గతిలేదు మీ బోర్ల బాటలు గన్న చేదు.
[illegible] ఇట్టి [illegible] చ్చెదము?
[illegible] తెగనా? మా [illegible] వినరా?
[illegible]

ఈవిధముగా వారు వినోదార్థము కొంత తడవు వాదించి తమ చెంతనున్న చిన్ని సరాలసంచిని క్రుమ్మరించి "లెక్కించుకొనుము." అని పలికిరి. తానీషా తొలుత "ఈరాశి ఏమాత్రము ఉండును?" అని పలికి పిదప లెక్కింపఁదొడఁగెను; గాని రాశి ఎంతకు తఱుఁగదయ్యెను. అందులకు ఆశ్చర్యపడుచు ఆతఁడు విసుగుకొనక లెక్కింపఁగా ఆఱు లక్షలవరాలు అగునప్పటికి రాశి మాయము అయ్యెను. అందులకు ఆశ్చర్యపడి తానీషా మాఱుపలుకఁజాలకుండఁగా రామచంద్రుఁడు "నీ సొమ్ము ముట్టినట్లు రశీదు ఇమ్ము" అని యడిగెను. అచ్చట రశీదు ఇచ్చు

టకు కాగితమా? కలమా?. అగుట నాతఁడు తప్పుపడిగముమీఁద తన మొహరువేసి ఇచ్చి వారిని పంపివేసెను.

దానినిఁ గైకొని రామలక్ష్మణులు బయలుదేఱి చెఱసాలకుఁ బోయిరి. అప్పటికి ఇంకను జాము రాత్రి ఉండెను. రామదాసు తనకు ఇఁక విముక్తి లేదని పరిపరివిధములఁ దుఃఖించుచు —

మ “అతికాతరమ్మునఁ జేసి నిన్ను మిగుల నత్యంతమ్ముగఁ దిట్టితిని
మతిలో నిందక కావుమప్ప దిక్కు నేనే నీవుఁ గాంతింపు నే
నతి దుష్కర్ముఁడ నేరము నన్ను నేలుకొనగా గాంభీర్యము నీ ప్రాపుఁ జా
ప్రుతి నీ చిత్తము వచ్చిన నిక శ్రీభద్రనారాయణా.”

మ “కరి రాజుం గాపాడితి ద్రౌపదికి కోకల్ మెచ్చి యిచ్చితివి స
ద్గురు కారుణ్యమునం బ్రహ్లాదునకుఁ బట్టం బట్టము మహా
పరమాన్నం బనాధుని తమ్మునికి రాజ్యం బిచ్చుటల్ గల్లయు
త్తరమ్ నన్నేలవు నిక్క మింక పలంతో భద్రనారాయణా.”

అని ఈతీరునఁ బ్రార్థించుచుండెను. ఈస్థితినిఁ జూచిన వెంటనే రాముని హృదయమునఁ జాల తత్తరము పడవెను. అపుడు ఆతఁడు “లక్ష్మణా, జాగు చేయక చెఱలోఁ బ్రవేశింపుము. రామదాసు దీనానవము నేను చూడఁ జాలకున్నాఁడను” అని తమ్ముని లోనికిఁ బంపి తానీపా మూపముతో తానుగూడ లోపల ప్రవేశించెను. అంతకుఁ బూర్వము రామదాసు ఇఁక నెట్లును రాముని కృప గలుగదని జీవితము నెడల నిరాశ చేసికొని విషపానము చేయుటకు సిద్ధముగా నుండెను. ఆతఁడు పాత్రములో విషము నెదుట నుంచుకొని శ్రీహరికి అంత్యప్రార్థనము సమర్పించి విషము పానము చేయఁదలఁచెను. రామదాసు ప్రార్థనము చేయుచుండఁగా చెఱలోఁ బ్రవేశించిన రామలక్ష్మణులు ముస్సుందు ఆ పాత్రమునందలి విషమును మాయము చేసిరి. ప్రార్థనానంతరము కన్ను లు తెఱచి పాత్రమున విషము లేకుండుటఁ జూచి రామదాసు ఇదియం తయు రాముని లీల యని ఆశ్చర్యపడసాగెను. ఆతఁడు కన్నులు విప్పు నప్పటికి రామలక్ష్మణులు మాయమై పోయిరి.

ఇది ఇట్లు జరుగుచుండఁగా నచ్చట నవాబు భార్యతో సంగ తు లన్నియు నెఱింగించి వెంటనే కొలువుకూటమునకు వచ్చి అక్కన్న

మాదన్న గార్లకు తక్షణము రావలసినదని వర్తమానము చేసెను. అది విని వారు ఆశ్చర్యపడి సముచితవేషములతో బయలుదేఱి వచ్చిరి. తానీషా, వారితో జరిగినది అంతయుఁ దెలిపి "వెంటనే రామదాసుని జెఱ విడిపించి మేము స్వారిచేయు బండిలోఁ గూర్చుండఁజేసి మహావైభవముతో నూరేగించి కొనిరావలసినది" అని యాజ్ఞాపించెను. అక్కన్న మాదన్నగార్లు తమ మేనల్లునకు సంభవించిన యోగ్యస్థితికి ఆనందించి అంతయు నవాబు చెప్పినట్లు చేసి ఆతనిని కొలువుకూటమునకుఁ గొని వచ్చిరి. తానీషా రామదాసుని అల్లంతదూరమునందే చూచి గద్దియడిగి ఎదురువోయి సాష్టాంగనమస్కారములు ఆచరించి కౌఁగిలించుకొని కొనివచ్చి సింహాసనమునఁ గూర్చుండఁజేసి తాను ఆతని పాదముల చెంతఁ గూర్చుండి "తన అపరాధములు అన్నియు క్షమింపవలసినది" అని యనేకవిధములఁ బ్రార్థించెను. పురమంతయు ఆనందించెను. రామదాసు "గతమునకు వగవవలదు" అని నవాబునకు అభయమిచ్చి "నీవు మహాయదృష్టవంతుఁడవు; గావుననే శ్రీరామచంద్రుఁడు నీకు అయాచితముగ దర్శనము నిచ్చెను. నీవు పూర్వమున తపశ్శాలివి. కాకున్న నిట్టిది తటస్థింపదు" అని యాతని ననేకవిధములఁ గొనియాడెను.

అట భద్రాచలమున మఱునాఁటి ప్రాతఃకాలమున అర్చకులు యథాప్రకారముగ తలుపులు తెఱచునప్పటికి రామలక్ష్మణులు రాత్రి గోల్కొండలో తానీషాకు దర్శనమిచ్చిన వేషములతో నుండిరి. రాముని చేతిలో నవాబు ఇచ్చిన విచిత్రపు రశీదు ఉండెను. ఇది యంతయుఁ జూచి వారు చాల అబ్బురపడి ఆవృత్తాంతమునంతయు అమీనునకుఁ దెలిపిరి. అమీను ఆవింతరసీదును బేగీరావుటపామీఁద గోలకొండకుఁ బంపివేసి ఆహర్కారులతో ఇక్కడి సంగతులు అన్నియు నెఱింగింపుఁడు అని నియమించెను. ఆబేగీరావుటపా గోలకొండ చేరునప్పటికి నవాబు మంత్రిసామంతాదులతోఁగూడ నిండుకొలువున రామదాసునకు మహాసత్కారము చేయుచుండెను. అప్పుడు ఆతఁడు ఆరశీదును జూచి ఆశ్చర్యపడి "రాముఁడు రామదాసు ఆజ్ఞానువర్తియై ఉన్నాఁడు" అని తలఁచి వృత్తాంతము అంతయు సభ్యులకు ఎఱింగించెను. అందఱును పరమానందభరితులైరి. పిదప తానీషా ఆవింత రశీదును రామదాసునకు ఇచ్చుచు ఇట్లు చెప్పెను.

నాదనామక్రియరాగము - ఆదితాళము.

పల్లవి॥ రామదాసుగారూ రండీ కాదనుకొండీ

అనుపల్లవి॥ గండికి మనవి వినండీ కృపనుంచండీ రాముని సహాయమగునండీ. రామ.

చరణములు॥ ఇచ్చి సేకరించు రాతిరి నాక్వ ఏమండి

సచ్చియుచట ప్రాప్తికంబంతయు నిచ్చినాఁడను పుచ్చుకవెళ్లరే. రామ.

కట్టెలాగులతో వాకలు కొట్టాకత్తులతో

పెట్టినమిత్తా కట్టిన మనసుగ ఇట్టివేషము సట్టికిరి ఇట రామ.

ఎంతకాంతమున్నలో సూదగు స్వాంతెంబెటి ఎవులో

ఇంతకష్టములు పెట్టిరిప్రతికూల సంతసించితిని అంతేన మొఱలిడక. రామ.

కృపణాఁడనేఁగనుక మీపై కృపలేదను లేకం

యవాదంబున కాంగానుపైని కన్నాతో చూపులు పిలుచునను రామ.

తనక నాఁడనసుట నాస నామ్యగుణను బాట

సామమహానమని సత్రనీని సీమమునఁ పడఁదిన బింగసుందనను. రామ.

గనేదు ఇచ్చుట మైనతగువాత్తే తానీషా భద్రాచలము తాలూకాను రామదాసునకు జాగీరుగా నిచ్చి అప్పుడే సరమానా వ్రాసి ఇచ్చివేసి రాముఁడు ఇచ్చినఆభరణములు పైకంబును నుతి యనేకరత్నాభరణములును రామదాసునకు ఇచ్చి అనేకవిధముల సన్మానము బ్రార్థించి మహావైభవముతో నాతనిని భద్రాచలమునకుఁబంపివేసెను. రామదాసును మఱల రాముని జూడబోవుచున్నాను అని పరమానందముతో నృత్యము చేయుచుఁ బోవుచుండెను. భద్రాచలమునుసమీపించునప్పటికి ఒకనాఁటి సాయంకాలము అఖండవర్షము కురియసాగెను. ఆసమయమున దారిదోపుడుగాండ్రు వందలకొలఁది వచ్చి రామదాసుని అరికట్టి సొమ్ము అంతయు అక్కడఁ బెట్టుమని నిర్బంధింపసాగిరి. అది చూచి రామదాసు భీతిల్లక రామస్మరణము ప్రారంభించెను. తోడనే ఆదొంగలు అందఱును మాయమైపోయిరి. ఇది చూచి రామదాసు ఇది యంతయు రాముని మాయయనియు రాముఁడు తన్ను పరీక్షించుటకు ఇట్లు చేసెననియు భావించి మఱింత యానందముతో మఱల నృత్యము చేయుచుఁ బ్రయాణము సాగెను.

మఱునాఁటిప్రాతఃకాలమునకురామదాసుపరివారముతోఁగూడి భద్రగిరిని సమీపించెను.తోడనేఆతఁడు అఖండగౌతమీనదిలోజలక మాడిపరివారముతో నూఁటిలోనికిఁ బయలు దేఱెను. అంతకుఁబూర్వమే ఈసంగతి యంతయు వినినభద్రగిరివాసులు మృదంగములు తంబురలు మున్నగు సకలమంగళవాద్యములతోడను ఎదురువచ్చి మహోత్సవ ముతో రామదాసుని పురములోనికిఁ గొనిపోయిరి.

రామదాసు తొలుత శైలము ఎక్కి విధివిధానముగ రాముని సేవించి పిదప స్వగృహము చేరుకొనెను. అది మొదలుకొని యాతఁడు శ్రీరామచంద్రునకు ఏమియు లోపము కలుగకుండునట్లు మహోత్సవ ములు చేయుచు అనుదినమును అనేకబ్రాహ్మణులకు సంతర్పణము సేయుచు సంసారమునంటక తామరాకుమీఁదనీటిబిందువువలె సంచ రించు చుండెను.

ఇట్లు కాలము గడచిపోవుచుండఁగాఒకనాఁడుసీతాదేవి శ్రీరా మునితో "నాథా, నీకు ఇది ఏమి ధర్మము! అనవరతము నిన్నే నమ్మి యున్న రామదాసునకు దర్శనము ఈయకపోయితివి. నిన్ను కలనైన తలంపని మ్లేచ్ఛునకు దర్శనము ఇచ్చితివి. ఇది బాగుగ నున్నదా?" అని యడిగెను. అందులకు రాముఁడు ఇట్లు ప్రత్యుత్తరము ఇచ్చెను.

"దేవీ, నీవు మంచిప్రశ్న వేసితివి. వినుము, తొల్లి ఒక బ్రాహ్మ ణుఁడు ఉండెను. కాశీనగరమునకు అవ్వలనొకచోటనొకశివాలయము ఉన్నది. విధివిధానముగ ఒక్క సంవత్సర కాలము ఆ దేవునకు రుద్రాభిషే కము సేసినవారికి మహేంద్రపదవి లభించును. ఆబ్రాహ్మణుఁడు మహేం ద్రపదవిని గోరి ఆ దేవునకు రుద్రాభిషేకము ప్రారంభించెను. ఆతఁడు సంవత్సరమును చేసెను. గాని రేపటికి సంవత్సరము ముగియు ననఁగా "ఆతఁడు ఇంకను ఏల ఈ మహానుభావుఁడు సాక్షాత్కరింపఁడు" అని ఉత్కంఠను బట్టఁజాలక కోపించి అభిషేకార్థము తెచ్చిన జలపూర్ణ మగు ఘటమును లింగముమీఁద విసరివేసెను. తోడనే ఈశ్వరుఁడు సాక్షాత్కరించి "నీవు ఇంతవఱకును ఎంతభక్తియుక్తుఁడవైనను నేఁడు తొందరపడి మనస్సును చెఱచికొంటివి. గావున నీకిఁక మహేంద్రపదవి రాదు. మఱియును: భూలోకమున మహారాజవు అయ్యెదవు. అయితే ధూర్తుఁడవై జలపూర్ణమగు ఘటమును నామీఁద విసరివేసితివి, గావున

మ్లేచ్ఛుఁడ వయ్యెదవు. నాదర్శనభాగ్యమును బరిహసించినందులకు మ్లేచ్ఛుల యందెల్లధర్మాత్ముఁడవు అయ్యెదవు. నిన్ను శ్రీరామచంద్రుఁడు రక్షించు" నని పలికెను ఆబ్రాహ్మణుఁడే ఈతానీషా. ఈశ్వరాజ్ఞవలన నేను ఆతనికి దర్శన మిచ్చి కరుణించితిని.

"ఇంక రామదాసుసంగతి వినుము. తొల్లి ఒక భూసురుఁడు ఒక చిలుకను బట్టి పంజరమున నునిచి అతిప్రీతితో దానినిఁ బెంచుచు రామరామాయని పాటలు నేర్పుచుండెడివాఁడు. కొన్ని దినములకు ఆతఁడు చనిపోయి రామదాసై పుట్టినాఁడు. ఆతఁడు చిలుకను పంజరమున బంధించెను; గావున ఈజన్మమున కైదులో నుండవలసివచ్చినది. అయినను దానికి రామనామమును నేర్పెను; గావున నాకు భక్తుఁడు అయ్యెను. ఆతనిని కొలఁది దినములయందే రక్షించెద. తొందర పడకుము."

రాముఁడు ఇట్లు చెప్పుట విని సీత సంగతులు అన్నియుఁ దెలిసి కొని మిగుల నానందించెను. కొన్నిదినములకు రామదాసునకు వృద్ధత్వము వచ్చెను. ఆతఁడు రామదర్శనమునకు రాఁజాలని స్థితికి వచ్చెను. అంత నాతఁడు "రామా, ఇఁక భూమిపై నిలువఁజాలను. రక్షింపుము" అని ప్రార్థింపసాగెను. ఆప్రార్థనకు ఆనందించి రాముఁడు తానొక గుఱ్ఱమువాని వేషము ధరించి లక్ష్మణుని గొడుగుపట్టువానినిగా నియమించి గరుత్మంతుని అశ్వముగన్నుని తిన్నగ రామదాసు ఇంటికిఁ బోయి "రామదాసుగారూ! రండి వైకుంఠమునకుఁ బోదము" అని పిలిచెను. తోడనే రామదాసు బైటకు వచ్చి రామునియాజ్ఞచే గుఱ్ఱము నెక్కి "వైకుంఠమునకుఁ బోదము రమ్ము" అనిభార్యను బిలిచెను; గాని ఆమె లోపలనుండి "స్నానము చేయుచున్నాను. కొంచెముతడవు ఉండవలెను." అని జవాబు చెప్పెను అంతట రామాజ్ఞచే గుఱ్ఱము బయలుదేఱెను. రామదాసు భార్యను దలంచుకొని "ఎవరి పుణ్యమునకు ఎవరు కర్తలు" అని యనుకొనుచు వెడలిపోయెను.

కొంతసేపటికి గుఱ్ఱము భద్రగిరిశిఖరము నెక్కెను. ఆలయద్వారము మూసి యుండుటఁ గాంచి రామదాసు రామస్మరణ ప్రారంభిం

చెను. తోడనే తలుపులు తెఱవఁబడియెను. గుఱ్ఱము లోపలకుఁ బోయెను. ఖాసీదారీ వేషముతో నున్న రాముఁడును, ఛత్రము పట్టి యున్న లక్ష్మణుఁడును గూడ లోపలకుఁ బోయిరి. వెంటనే తలుపులు మూసికొనిపోయెను; రాముఁడు నిద్రించుచున్నాఁడు అని భావించి రామదాసు మేలుకొలుపు ప్రారంభించెను. కొంతసేపటికి ఖాసీదారీ మాయమయ్యెను. పిదప ఛత్రగ్రాహి మాయమయ్యెను. గుఱ్ఱముగూడ తిరోహిత మయ్యెను. అదిచూచి రామదాసు అబ్బురపడుచుండఁగా రామచంద్రుఁడు విశ్వరూపముఁ దాల్చి రామదాసుని తన సన్నిధిని చేర్చుకొనెను. అప్పుడు రామదాసునకు బ్రహ్మానందము కలిగెను. అంత నాతఁడు తొలుత కబీరు చేసిన యుపదేశమును స్మరించి—

నాదనామక్రియరాగము - ఆదితాళము.

ఇది గురువాక్యం ఇది వేదాంతం ఇది తారక మిది బ్రహ్మము
ఇది మొదలిది నడు మిది తుది నాద మూదలక తెలిసినవాఁడే వాఁడో ఇది॥

నేఁడు చూచినను నీటి చందమున తోడైయుండుట నీవేగా
నేఁడై నాఁడై నెడను నీడై నిండినవాఁడవు నీవేగా
ఆడుచుఁ బాడుచుఁ దేటల మాటల నన్నిటికూటము నీవేగా
ఓహకు మని గురుఁడాడిన లక్ష్యము జాడనిలుచుటయు నీవేగా॥ ఇది॥

అకారంబున అష్టాక్షరియై యాత్మకు ప్రణవము నీవేగా
ఉకారంబున నున్నతోన్నమిత పురుషోత్తముఁడవు నీవేగా
మకారంబునను మతి శేషశాయముల మడియఁ జేయుటలు నీవేగా
అకారాంకితను అఖండరూపమై యలరదు ప్రణవము నీవేగా॥ ఇది॥

నాయక గన నానాయక కాపల నాయికత్వం బీవేగా
పాయక చీఁకటి బయలఁగలపి శేషశాయములఁ ద్రుంచుట నీవేగా
కాయంబు నిరాకారంబును స్మృతి గలుగఁ జేయుటలు నీవేగా
మాయాప్రపంచపు మాయలలో బడవేయు మాయకుఁడ వీవేగా॥ ఇది॥

కామమోహములఁ గట్టుపడక మముఁ గడతేర్చుటయును నీవేగా
తామసగోష్ఠినిఁ దగులనిక నీతత్వముఁ దెలుపుట నీవేగా

పామరత్వమునఁ బొరయక చేపట్టి ప్రోచుటయు నీవేగా
రామదాసగురురాయ భద్రగిరి ధామ సర్వమును నీవేగా॥ ఇది॥

ఇట్లు రామదాసు తత్త్వమును మననము చేయుచు ఈశ్వరసాయుజ్యమును బడసెను. పిదపఁ గొన్నిదినములకు రామదాసు భార్యయు "ఈశ్వరసాయుజ్యము నాకేలసిద్ధింపదయ్యె" నని చింతించి ప్రార్థింపఁగా రాముఁడు "నీవు ఇంకను భూతలమున కొన్నిదినములు ఉండవలెను. ఇచ్చట నీవు తులసీవనకైంకర్యము చేయుచుండుము" అని నియమించెను. ఆమె అట్లు చేసి తుదకు వైకుంఠమునకుఁ బోయెను.

---

50. తుకారామస్వామి.

నామదేవుఁడు ఒకప్పుడు పాండురంగని నూఱుకోట్ల వృత్తములతోఁ గొనియాడుటకు సంకల్పించుకొనెను. అందులకు పాండురంగఁడు "వత్సా, నీవు చేయఁదలఁచినపనికి మానవజీవితము చాలదు" అని పలికెను. అందులకు నామదేవుఁడు నిరుత్సాహపడక "దేవాదిదేవా! నీవు నాకు ప్రాపైయుండ నది అసాధ్య మెట్లు అగును? ఈసంకల్పమును నెఱవేఱునట్లు చేయవలయును" అని ప్రార్థించెను. భక్తునిసంకల్పమును ద్రోసివేయఁ జాలక పాండురంగఁడు సరస్వతిని బిలిచి "నీవు నామదేవుని జిహ్వాపై వసింపుము" అని తానే వ్రాయుటకుఁ గూర్చుండెను.

అంతలో నామదేవుని హృదయమునఁ గవితావాహిని పొంగి పొరలెను. పాండురంగఁడు వ్రాత ప్రారంభించెను. కొన్ని దినములు అగునప్పటికి నామదేవునకు మానుష దేహముమీఁద ససహ్యము గలిగెను. అప్పటికి తొంబదినాలుగుకోట్ల నలువదివృత్తములు అయ్యెను. అది చూచి పాండురంగఁడు "వత్సా, నీకు ఇప్పుడు ఈదేహముమీఁద రోత కలిగినది; గావున నీ ఇచ్చవచ్చినట్లు దీనిని విడువుము; గాని నీవు నన్ను శత

కోటివృత్తములతో వినుతించెద నని సంకల్పము చేసియున్నావు ఆసంకల్పము పూర్తికాకతీరదు. ఇప్పుడు ఈపాంచభౌతిక దేహమును విడువుము గాని మఱియొకప్పుడు వృత్తసంఖ్యను పూర్తిచేయుటకు మఱల మనుష్యుఁడవై పుట్టవలసివచ్చును. అంతయు నాలోచించుకొని నీయిష్టము వచ్చినట్లు చేయుము" అని చెప్పెను. నామదేవుఁడు "మఱియొకప్పుడు మఱల మానవజన్మము ఎత్తిన నెత్తెదను; గాని ఇప్పుడు ఈదేహమును భరింపఁజాలను" అని పలికి శ్రీహరి సెలవుఁ బడసి భౌతికదేహమును విడిచెను.

మఱల ఈశ్వరనియమమువలన ఆనామదేవుఁడే దేవనగరము అను గ్రామమున తుకారాముఁడు అనుపేరుతో నుద్భవించెను. ఆతని తల్లిదండ్రులు వర్తకులు అగుటచే బాల్యమున ఆతనికిఁగూడ వర్తకము అభ్యాసము అయ్యెను. ఆతఁడు వయస్సువచ్చిన తరువాత ఇరువురుభార్యలను పెండ్లి యాడెను. అందు పెద్దభార్యయందు ఇరువురు కుమారులు బొడమిరి. కుమారులకు యుక్తవయస్సు వచ్చిన తరువాత ఆమె చనిపోయెను. పిదప ఆమెయందు పుట్టినకుమారులు ఇద్దఱును తండ్రియుల్లప్పుడును భగవద్భజనమున ప్రవృత్తులైరి. వర్తకము సంగతి శ్రద్ధగాఁ జూడకుండుటచే కోపించి ఇలువిడిచి పోయిరి. తుకారాముఁడు అందులకు వగవక "క్రమముగా విఘ్నములును సంసారబంధములును తొలఁగిపోవుచున్నవి" అని యానందింపసాగెను.

ఇట్టిస్థితిలో నొకనాఁడు తుకారామస్వామి రాత్రినిద్రించుచుండఁగా పండరినాథుఁడు స్వప్నమున సాక్షాత్కరించి "వత్సా, నీవు పూర్వజన్మమున నామదేవుఁడవు. నీవు సంకల్పించిన వృత్తములను పూర్తిచేయుటకై మఱల మనుష్యజన్మ పొందితివి. ఇఁక నెన్నిదినములు గడపెదవు? నీపని పూర్తిసేసికొనుము" అని చెప్పి పోయెను. తుకారామస్వామికి వెంటనే మెలకువ వచ్చెను. అదిమొదలుకొని ఆతఁడు శ్రీహరిగుణకీర్తనము ప్రారంభించితొల్లిటిలోపమును కొలఁదిదినములయందే తీర్చివేసెను.

తుకారామస్వామి ఏఁటేఁటను ఆషాఢమాసమున పండరపురమునకుఁబోయి స్వామినిసేవించుకొని వచ్చుట అభ్యాసమైయుండెను. ఒక సంవత్సరము పాండురంగక్షేత్రమునుండి వచ్చినతరువాత తుకారామస్వామి తనయింటఁ గూర్చుండి శ్రీహరిని ధ్యానించుకొనుచుండఁగా

శివాజీమహారాజు ఆతనిం జూచి సేవింపవలయునను చిరసంకల్పముతో పళ్లెమునిండ రత్నాద్యనర్ఘములగు కానుకలను నింపుకొని వచ్చి స్వామికి సాష్టాంగ మాచరించి పళ్లెమును ఎదుటనుంచెను. అదిచూచి తుకారామస్వామి "వత్సా, నీభక్తికి ఆనందము; గాని ఈద్రవ్యముతో నాకేమియుఁ బనిలేదు. దీనిని మఱలఁ దీసికొనిపొమ్ము. నీవు సొంతమునకు వాడుకొనుటకు ఇష్టములేదేని దీనజనులనిమిత్తము వెచ్చింపుము" అని చెప్పి హరిభజనము ప్రారంభించెను. శివాజీమహారాజు అందులకు మాఱు పలుకఁజాలక ఆధనమును దీనులకు వెచ్చింపఁ దలఁచి హరిగుణకీర్తనము వినుచుఁగూర్చుండెను. ఇంతలో శివాజీ ఏకాకియై యున్నాఁడని తెలిసి ఢిల్లీచక్రవర్తి సైన్యము అతిరభసంబున అచ్చటకు వచ్చెను. బైటనున్న స్వామిశిష్యుఁడు ఒకఁడు ఈవార్త లోనికి ఎఱింగించెను. ఇంతలో తురుష్కభటులు "ఇచ్చటకు శివాజీ వచ్చియున్నాఁడు. చూపకున్న మీ ప్రాణములు దక్కవు" అని కుప్పిగంతులు వేయసాగిరి.

ఈవార్త నెఱింగించిన శిష్యుఁడు ఇచ్చట లేరని చెప్పవలసియెను. గాని అబద్ధము ఏల పలుకవలెను! అని స్వామికి నమస్కారము ఆచరించి శివాజీ తటాలున బైటకు వచ్చి ఆయుధములను సవరించుకొని గుఱ్ఱము నెక్కి ఇట్లు తిరిగి వచ్చి తురుష్కభటులముందు నిలిచెను. తుకారామస్వామి "స్వధర్మరక్షకుఁడు అగు ఈమహారాజును ఈశ్వరుఁడు రక్షించుగాక" అని ధ్యానము సేయఁదొడఁగెను. అట తురుష్కభటులు శివాజీనిఁ జూచి "గుఱ్ఱము దిగుము. నీవు మా కైదీవి" అని గర్వముతోఁ బలికిరి; గాన శివాజీ "ఎవరురా మీరు! ఆఁడువాండ్రవలె మాట్లాడెదరు!" అని కత్తిదూసెను. తురుష్కులు గూడ కత్తులు దూసిరి. సమరము ప్రారంభమయ్యెను. అయినను శివాజీ యొడలిమీఁద నీఁగయైన వ్రాలలేదు. శత్రువులు అనేకులు కూలిరి. హతశేషులు పలాయనము చిత్తగించిరి. శివాజీ తనమార్గమునఁ దాను బోయెను.

మఱియొకప్పుడు శివాజీ "ఎట్లయిన తుకారామస్వామికి ఒక తృణముసొమ్ము ముట్టఁజెప్పవలయును. అట్లయినఁగాని ఈజన్మకుఁ దరణోపాయములేదు" అని తలంచి ఒక వర్తకుని వేషము వేసికొని ఒకబండిమీఁద ధాన్యపుబస్తాలు వేసికొని వచ్చి "స్వామీ, నేను ఒక వర్తకుఁడను. ఈసంవత్సరమున నాకు వర్తకమున ఈబండెఁడుధాన్యము

లాభము వచ్చినది; గావున తమరు స్వీకరింపవలయును" అని ప్రార్థించెను. తుకారాముఁడు ఆతఁడు వర్తకుఁడు కాఁడనియు శివాజీయే తనయెడలఁగల భక్తిపెంపున ఇట్టి వేషము వేసికొని వచ్చె ననియు గ్రహించి మాఱుపలుకఁజాలక కనులు మూసికొని ధ్యానము చేసికొనసాగెను.

శివాజీ, మౌనము అంగీకారముగా గుర్తెఱింగి ఆబస్తాలనుస్వామిఇంటఁ బడ వేయించి ఆతని భార్యకు అప్పగించి వెడలిపోయెను. తుకారామస్వామి సమాధినుండి లేచినతరువాత సంగతి యంతయువిని "మనకుఒకపూటకు వలయు ధాన్యముమాత్రము ఉంచి తక్కినది అంతయుదీనులకుఁ బంచిపెట్టుము" అని భార్యకు ఆజ్ఞాపించెను; గాని యామె "ఈధాన్యము ఉన్నచో సంవత్సరము పొడుగునను లోపము లేకుండ కడుపునిండ భుజింపవచ్చును" అనితలంచి జాగ్రత్తచేసెను. అంతట స్వామి తనయాజ్ఞ వ్యర్థమగుటఁ జూచి "ఒరులకు ఆజ్ఞాపింపనేల?" అని ఆపని తానే చేసి వేసెను.

ఆయూరియందు గాజులవర్తకుఁడు ఒకఁడు ఉండెను. ఆతఁడు అనుదినమును తుకారామస్వామి ఇంటికిఁ బోయి చాలతడవు హరిభజనమువిని పోవుచుండును. ఒకనాఁడు ఆతనిబిడ్డకుఁ బ్రాణముమీఁదికి వచ్చెను. అయిననుదానిని లెక్కగొనక ఆతఁడు తుకారామస్వామి ఇంటికిఁ బ్రయాణము అయ్యెను. అందులకు ఆతని భార్య సహింపఁజాలక మార్గమునకు అడ్డమువచ్చి నిలుపఁదలఁచెను. అయినను ఆతఁడు నిలువలేదు. ఆతఁడుపోవునప్పటికి తుకారామస్వామి పరవశుఁడై హరిగుణములను కీర్తించుచు నృత్యము సేయుచుండెను. కొంతతడవు అది చూచి వర్తకుఁడుగూడ తన్మయుఁడయ్యెను.

ఇట్లు ఒక గడియ యగునప్పటికి తుకారామస్వామిభజనమాని నిలిచెను. వర్తకునకుఁగూడ చైతన్యము వచ్చెను. ఈలోపున వర్తకుని బిడ్డ చనిపోయెను. అంతట ఆతనిభార్య ఆబిడ్డ కళేబరమును భుజము మీఁద నిడుకొనివచ్చి తుకారామస్వామిముందుఁ బడవేసి గోలుగోలున ఏడ్చుచు "అయ్యా, నీవు కారణముగా నాభర్త నన్నుఒల్లకున్నవాఁడు. నాభర్త అశ్రద్ధవలన వైద్యలోపము సంభవింపఁగా నాబిడ్డ చనిపోయెను. ఈపాపము అంతయు నీదే. ఇప్పుడైన నాభర్తను మందలింపుము" అని నిష్ఠురోక్తు లాడఁజొచ్చెను. అదివిని చెంతనున్నవారుఅంద

ఱును "అమ్మా, త్వరపడకుము. స్వామి నీభర్తను వంచింపలేదు. నీభర్తసంగతి ఏమియు స్వామికిఁ దెలియదు." అని పలికిరి. తుకారామస్వామి ఈమాటలుచాలింపుఁడు అని పలికి, తాళము వేయుచు నృత్యము సేయుచు గొంతెత్తి,—

శ్లో. బద్ధేనాంజలినా నతేన శిరసా గాత్రై స్సరోమోద్గమైః
కంఠేన స్వరగద్గదేన నయనే నోద్గీర్ణబాష్పాంబునా,
నిత్యం త్వచ్చరణారవిందయుగళధ్యానామృతాస్వాదినా
మస్మాకం సరసీరుహాక్ష సతతం సంపద్యతాం జీవితమ్.

(ముకుందమాల. ప. 20)

అని శ్రీహరినిఁ బ్రార్థింపసాగెను. ఆతనివెంట సందఱును బ్రారంభించిరి. ఇట్లు పదిదినములు జరుగునప్పటికి వర్తకునిబిడ్డ జీవించి పరమారోగ్యముతో లేచినిలిచెను. అది చూచి, అందఱును తెల్లవోయిరి. వర్తకుని భార్య "అపరాధమును క్షమింపవలసినది" అని తుకారామస్వామి పాదములమీఁద వ్రాలెను.

ఒకప్పుడు తుకారామస్వామి ఇంటిని, సంసారమును విడిచి అడవులకుఁ బోయెను. నేఁడు వచ్చునో రేపే వచ్చునో యని ఆతనిభార్య కనిపెట్టుకొనియుండెను. ఇంటనున్న భోజనపదార్థములు అన్నియునైపోయెను. ఇంట పిల్లలు ఆఁకట నకనకమాడుచుండిరి. ఇది చూడ లేకయు ఏమియుం జేయంజాలకయు ఆమె దుఃఖసాగరమునం బడి దరిగానక కొట్టుకొనుచుండెను. ఇట్లు రెండుమాసములు కడచిపోయెను. ఇఁక నిట్లు నిరీక్షించుచుండినఁ బ్రయోజనములేదనియు ఆతఁడు ఎక్కడ నుండిన నచ్చటకు వెదకుకొనుచుఁ బోవలయు నని నిశ్చయించికొని ఆమె అరణ్యమునకు బయలుదేఱెను. కొంతదూరము పోవునప్పటికి పాండురంగని సేవించుటకు వచ్చుచున్న భర్త ఎదురయ్యెను.

తోడనే ఆమె అతని నచ్చట నిలిపి "నాథా, ఇది తగునా? రెండు మాసముల క్రిందట నీవు ఇట్లు విడిచిపోయితివి. నాసంగతి యోచింపవైతివి. బిడ్డలవిషయము ఆలోచింపవైతివి. మేముఁ ఏమి చేయఁగలము? ఆఁకలివలన మేము మాడిపోవుచున్నాము. మాకు భోగభాగ్యములు కావలయు నని కోరము. కేవలము గంజి చాలును. రెండుపూటల

యందును గంజిమాత్రమే చాలును. అది మాకు సమకూర్చి పొమ్ము. అట్లయిన నీకు మావలన ఏమియు తొందరలుకలుగవు.నీభక్తికి ఏమియు అంతరాయము ఒదవదు. అట్లుగాక ఆఁకలికి తాళఁజాలక మేము ఇంట నీప్రాణములకు ఉసురుపడి ఏడ్చుచుండఁగా నీవు వనములయందును పాండురంగని ఎదుటను ఎంత భజనము చేసినను ఏమి ప్రయోజనము? ఆభజనము భగవంతునకు ఏమి తృప్తికరము అగును. భక్తిజ్ఞానములు సంపూర్ణముగఁ గల నీకిది ఏల తోఁచకపోయెను?" అని తీవ్రముగఁ బ్రశ్నించెను.

తుకారామస్వామి అందులకు సమాధానము చెప్పలేక కొంత తడవు ఊరకుండి "వనితా, ఏల నిష్ఠురోక్తులు పలికెదవు? సంసారమున నున్నవానికి నీవు చెప్పినది అంతయు నిజము; కాని నాకు అదియేమియుఁ దెలియదు. నీకు పాండురంగని పాదపద్మములపై స్థిరభక్తిలేదు. గావున నీతోడి సాహచర్యమును నేను అంగీకరింపకుండ నున్నాను. ఇప్పుడైనను, పాండురంగనినే నమ్మియుండెద నన్నమాట ఇచ్చెదవేని తప్పక నేను ఇంటికివచ్చెదను" అని పలికెను. ఆమె నట్లె యనెను. తుకారామస్వామి ఆమెతోఁగూడ ఇంటికి బోయెను.

వారముదినములుగడచునప్పటికి ఏకాదశి వచ్చెను.నాఁడుతుకారామస్వామి తనభార్యకు మంత్రోపదేశము చేసెను. ఆ యుపదేశము వలన ఆమె జగన్మిథ్యాత్వమును సంసారాసారతను ఎఱింగి ఇంటనున్న సకలమును దీనులకుఁ బంచి ఇచ్చివేసెను. దొడ్డిలో నొక చీరమాత్రము మిగిలిపోయెను. అది దొడ్డిలో నున్నదన్నసంగతి ఆమె మఱచిపోయెను. లేకున్న నదిగూడ ఇచ్చివేసియే యుండును. దానిని తుకారామస్వామి చూచెను. పరిక్షైన ఇచ్చివేయవలయునని ఆతఁడు ఆచీరను వీధిగుమ్మము లోనికి తెమ్మనప్పటికి రుక్మిణీదేవి బిచ్చగాలివేషము వేసికొని వచ్చి దానినిఁ బట్టుకొనిపోయెను. రెండుదినములు గడచునప్పటికి తుకారామస్వామి భార్యకుఁ గలిగిన వైరాగ్యము నిలిచినదికాదు. బిడ్డలు అన్నము లేక మలమలమాడుచుండుటఁ జూడఁగా ఆమాత కడుపు తరుగుకొని పోయెను. అంతట నామె "ఎవనిని స్మరించుటవలన కన్నబిడ్డలను విపత్సముద్రమున ముంచివేయునంతటివైరాగ్యము కలిగినదో ఆపాండురంగని పాదములను నలుగఁగొట్టి వచ్చెదను" అని ఒక నల్లతాయి పట్టు

కొని బయలుదేఱెను. దానినిఁ జూచి తుకారామస్వామి భార్య చేయఁ దలఁచిన పనికి చాల చింతాక్రాంతహృదయుఁడై ఆమెను వారించుటకు వెనుక బయలుదేఱెను.

ఇది యంతయుఁజూచి పాండురంగఁడు గడగడలాడసాగెను. అంతట రుక్మిణీదేవి భయమువలదు. అని భర్తను ఆశ్వాసించి భక్తురాలు గర్భాలయము సొచ్చినంతనే తలుపులు బిగించి ఆమెను తనచెంతకుఁ బిలిచికొనెను. అది చూచి తుకారాముఁడు "అద్దిరా, నాఁడు రాముఁడు తనమీఁద చాల విరోధము వహించిన రావణుని వెంటనే వైకుంఠము నకుఁ గొనిపోయినట్లు తనభర్త పాదములను నలుగఁగొట్టఁ దలఁచిన నాభార్యను రుక్మిణి చెంతఁజేర్చి ఆదరించెను. తీవ్రముగనున్నచో విరోధముగూడ ఈశ్వరునియెడల నుపయోగించు" నని అబ్బురపడసాగెను. ఇంతలో రుక్మిణి భక్తురాలికి వెలగలచీరను గట్టనిచ్చి అమూల్యాభరణముల నలంకరించి ఒడినిండ వరాలను బోసి తలుపులు తెఱచి ఇంటికిఁ బంపివేసెను.

తుకారామస్వామి మహాలక్ష్మివలె నవరత్నాభరణముల ప్రభలతో తేజరిల్లుచు వచ్చిన తనభార్యనుజూచి చాల కటకటఁబడి "రమణీ, ఎంతపని చేసితివి. మఱల వ్యామోహమునఁ జిక్కితివిగదా! నాకిచ్చినమాటను పొల్లుచేసితివిగదా? కట్టా! అఖండ సచ్చిదానందమును గోరవలసిన నీవు ఐహికసుఖము నపేక్షించితివిగదా? ఇప్పుడైనను మించిపోయినది లేదు. లోకజనని యగు రుక్మిణీదేవి నిన్ను పరీక్షించుటకు ఇట్లుచేసినది; గావున వెంటనే ఈధనము నంతను దీనులకుఁ బంచియిచ్చి రుక్మిణికి ఆనందము గలిగింపుము" అని పలికెను.

ఈమాటలు వినుటతోడనే ఆమెకు మఱల అఖండమైన భాగ్యము గలిగెను. ఇదియంతయు అజ్ఞానుల పనియనియు, తాను పొరపడితిననియుఁ జింతించి భర్తయాజ్ఞప్రకారము ఉత్తరక్షణముననే రుక్మిణి ఇచ్చినది యంతయు దీనులకుఁ బంచిపెట్టెను. అదిచూచి తుకారాముఁడు చాల నానందించెను.

దేవనగరమునకు సమీపమునఁ గల యొక జనపదమున ఒక బ్రాహ్మణుఁడు గలఁడు. అతఁడు ఒకగణపత్యుపాసకుఁడు. ఆయూరి బ్రాహ్మణులు అందఱును ఆతనిని చాల గౌరవింతురు. ఆ గ్రామమునందలి బ్రాహ్మ

ణులకు అందఱకును "తుకారాముఁడు శూద్రుఁడు; వేదములకు అనధికారి; ఆతనితోఁ పాండురంగఁడు సహపంక్తిని భుజించునట. ఇదియెంత వఱకు నిజమో పరీక్షింపవలెను" అనుసంకల్పము గలిగెను.

వారు అందఱును ఇట్లు యోచించుచుండు దినమున తుకారాముఁడు దైవప్రేరితుఁడై ఆగ్రామమునకుఁ బోయెను. అచటఁబోయినతీర్థము ఎదురైనది. అని యానందించుచు ఆగణపత్యుపాసకుఁడు తుకారాముని ఆదరముతోఁ దనయింటికిఁగొనిపోయి నాఁడు భోజనమునకుఁదన ఇంట నుండఁ గోరెను. తుకారాముఁడు అందులకు అంగీకరించెను.

పూజాదికములు అన్నియు ముగిసినతరువాత బ్రాహ్మణుఁడుతుకారాముని స్నానమునకు లెమ్మని చెప్పెను. ఆతఁడును స్నానము చేసివచ్చి అచ్చటకు వచ్చినతరువాత చేష్టలను బట్టి ఆబ్రాహ్మణుని భావము నెఱింగిన వాఁడై; గావున "ద్విజశ్రేష్ఠా, నాకు వడ్డించినచోట రెండవయాకు వేసి అందుఁగూడ వడ్డింపవలెను. ఏమన? నాతోఁగూడిభుజించుటకు పాండురంగఁడు గూడ వచ్చును. అట్లే నీవుగూడ నాయెదుట వడ్డింపించుకొనుము. నీవు అర్చించు గణపతినిఁ గూడ ఆహ్వానించి ఆతనికి రెండవయాకులో వడ్డింపింపుము"అనిచెప్పెను. నాఁడువిందునకు వచ్చిన బ్రాహ్మణులు అందఱును ఈసంగతిని విని ఆశ్చర్యపడి "మనముఅందఱము గూడ తుకారామునకుఎదుటనేవడ్డించుకొందము. పాండురంగఁడును గణపతియు వచ్చి ఆతనికి పంక్తిని భుజించుట యథార్థమేని ఇంక మనకు మాత్రము దోషము ఎట్లు వచ్చును?" అని నిశ్చయించుకొని అట్లు చేసిరి. ధ్యానాదికములు అన్నియు నైనతరువాత తుకారాముఁడు గణపత్యుపాసకునిఁ జూచి, "అయ్యా, ఇఁక జాలము చేయనేల? త్వరగ గణపతినిఁ బిలువుము." అని పలికెను. అందులకు ఆబ్రాహ్మణుఁడు "అయ్యా, నాతోఁగూడి గణపతి ఎప్పుడును భుజించియుండ లేదు. నేను ఆతనిని రప్పింపఁగల నని చెప్పఁజాలను. గణపతిని పాండురంగనిఁ గూడ నీవే రప్పింపుము"అని బదులుచెప్పెను. తోడనే తుకారాముఁడు గణపతినిఁ బ్రార్థించెను. వెంటనే గణపతి ప్రత్యక్షమయ్యెను. అంతట తుకారాముఁడు అనంతభక్తితో గణపతిపాదములమీఁద వ్రాలి సాష్టాంగనమస్కారముల ఆచరించెను. గణపతియు ఆదరముతోఁ తుకారాముని లేవనెత్తి కుర్చుండఁ జేసెను.

పిదపతుకారాముఁడు పాండురంగనిస్మరించెను. వెంటనే దేవుఁడు ప్రత్యక్షమయ్యెను. తోడనే భక్తుఁడు స్వామిపాదములమీఁద వ్రాలి నమస్కారములు ఆచరించి అనేకవిధములఁ గొనియాడెను పాండురంగఁడు ఆదరముతో తుకారాముని లేవనెత్తి కూర్చుండఁజేసెను.

ఇది యంతయుఁ జూచి పరమాశ్చర్యచకితులై యున్న బ్రాహ్మణులు అప్పుడు తెలివి దెచ్చుకొని గణపతికిని పాండురంగనికిని సాష్టాంగవందనములు ఆచరించి "అపరాధమును క్షమింపవలసినది" అని అనేక విధములఁ బ్రార్థించి అభయముఁ బడసిరి పిదప నందఱును గలిసిభుజించిరి. భోజనానంతరము గణపత్యుపాసకుఁడు గణపతికి పాండురంగనికి తుకారామునకు తక్కుంగలబ్రాహ్మణులకు చందనతాంబూలాదిసత్కారములు చేసి పూజించెను. ఇది యైన వెంటనే గణపతియు పాండురంగడును తిరోహితులైరి. బ్రాహ్మణులు తుకారాముని చుట్టునుఁ జేరి జ్ఞానబోధను వినసాగిరి. కొంతతడవు అయిన తరువాత తుకారాముఁడు స్వగ్రామమునకు బయలుదేఱెను. బ్రాహ్మణులు ఆతనిని చాల గౌరవము చేసి సాగనంపిరి.

మార్గమధ్యమున నొక కర్షకుఁడు తుకారామస్వామిని తన చెఱకుగానుగవద్దకుఁ గొనిపోయి తనవిదీఱ చెఱకురసము త్రావించి ఇంటికిఁ గొనిపోవలసిన దని ఒక చెఱకుల కట్ట ఇచ్చెను. కొంత సేపటికి తుకారామస్వామి గ్రామమునఁ బ్రవేశించెను. వీదులలో ఆడుకొనుచుండు పిల్లలు తుకారామస్వామికి అడ్డు తగిలి "నాకొక చెఱకునిమ్ము, నాకొక చెఱకు నిమ్ము" అనిఅడుగసాగిరి. ప్రపంచమంతయు ఈశ్వరుఁడు నిండియున్నాఁడు అని ఎఱిఁగిన తుకారామస్వామి ఆ బాలురను జూచి శ్రీకృష్ణలీలను స్మరించి వారే కృష్ణరూపులుగా భావించి ఒక్కొక్కనికి ఒక్కొకగెడ ఇచ్చివేసెను. తుదకు యింటికిఁ బోవునప్పటికి ఆతని చేత నొక్కగెడమాత్రమే మిగిలియుండెను. దానిని ఆతఁడు భార్య చేతికి ఇచ్చెను.

ఏదో పనిమీఁద వీథిగుమ్మములో నిలిచియున్న తుకారామస్వామి భార్య ఆతఁడు చెఱకుగడలవంటిఅలభ్యపదార్థములను తనకుమారులను మఱచి విచ్చలవిడిగా ఊరివారి పిల్లలకుఁబంచిపెట్టుటఁ జూచి సహింపఁజాలకయు కోపము నడంచుకొనఁజాలకయు ఆచెఱకుగడతో ఆతని

నె త్తిమీఁదఁ గొట్టెను. ఆవ్రేటున స్వామికి ఏమియు దెబ్బ తగులలేదు; గాని గడమాత్రము రెండు ముక్కలై పోయెను. ఒకటి క్రిందఁ బడిపోయెను. రెండవది ఆమె చేతనే యుండెను. అదిచూచి స్వామి ఏమియుఁ గోపింపక మందహాసముతో "ఆహా, నీవు ఎంత నిష్పక్షపాతముగా పంచితివి. రెండు ముక్కలును సరిగ నున్నవి. నీచేత నున్నది నీవు భుజింపుము. ఇది బిడ్డలకు చాలును" అని క్రిందఁ బడినదానిని తీసి బిడ్డలకు ఇచ్చెను. ఆమె తనభర్త శాంతమును జూచి ఆశ్చర్యపడి కడకు లజ్జించి "నాయపరాధమును క్షమింపు" మని భర్తకాళ్ళమీఁద వ్రాలెను.

ఒక సంవత్సరము తుకారామస్వామి పాండురంగక్షేత్రమునకు అరుగుటకు సకలసన్నాహములును జేసికొనుచుండునపుడు హఠాత్తుగా ఉద్ధృతమైన జ్వరము వచ్చెను. ఆజ్వరమువలన ఒకటిరెండు దినములు అతఁడు ఒడలు తెలియక పడిపోయెను. ఈయౌద్ధత్యము తగ్గునప్పటికి ఏకాదశి సమీపించెను. అంతట నాతఁడు సంభవించిన దానికి చాలవగచి "పాండురంగా, నీయాజ్ఞ ఇట్లున్నది. అయినను నేనేమి చేయఁగలను? ఈసచరాచరప్రపంచము అంతయు నీఇచ్ఛామాత్రమున ప్రవర్తిల్లుచున్నది. దేనిని ఎట్లు నడిపింపవలయునో నీకంటె నన్యున కేరికిఁ దెలియును? నే నెఱింగినంతవఱకు ఏవిధమైన దోషమును చేయలేదు. నేను నిర్దోషి నని అనుకొనుచున్నాను. అయినను దానిని నిశ్చయించువాఁడవు నీవు. మానవలోకము ప్రమాదభరితము. తెలియకుండఁగనే కొన్నిప్రమాదములు జరిగిపోవచ్చును. ఎప్పుడేమి చేసితినో ఇప్పు డిట్లు అనుభవించుచున్నాను. నేను ఎందులకు ఇట్లు దుఃఖించుచున్నానో నీకుఁ దెలియనిది గాదు. జ్వరబాధను నేను లెక్కసేయను. దానికిని నాకును సంబంధము లేదు ఇనుముతోఁ గూడుటచే అగ్నిహోత్రునకు సమ్మెటపెట్లు సంభవించునట్లు పాంచభౌతికదేహము నాశ్రయించి యుండుటచే నిన్ను ఏకాదశీ పర్వదినముల సేవింప వీలుపడినది గాదు. అయినను నేను ఏమి చేయఁగలను? శ్రీరమణా, ఇదిగో ఇప్పుడే నేను ఇక్కడ నీకు సాష్టాంగ మొఱఁగుచున్నాను. నీచెంతనుండి ప్రత్యుత్తరము వచ్చునంత దనుక నేను లేవలెను" అని యొక జాబువ్రాసి పండరిపురమునకుఁ బోవు యాత్రికులకు ఇచ్చి ఇది విఠలనాథునకు సమర్పింపుఁడు" అని వారిని వేడుకొనెను.

యుక్తసమయమున వారుపండరిపురము చేరుకొని పాండురంగని దర్శించిప్రార్థనాదికము ముగిసినతరువాత తుకారామస్వామి వ్రాసిఇచ్చి నజాబును జదివి సంగతియు విన్నవించిరి. అంతట పాండురంగఁడు రుక్మిణీదేవినిఁ జూచి "దేవీ, తుకారాముని జాబు వినినప్పటినుండియు నాకు చాల సంతాపముగానున్నది. మనసుమనసులో లేదు. నూఱువేల తేళ్లు ఒక్కమాఱు కుట్టిన నెంత బాధ కలుగునో ఇపుడు అంతబాధగానున్నది. ఇక్కడి సంగతిఁ జూచిన అనేక వేల భక్తులు వచ్చి సేవలు చేయుచున్నారు. వీరిని విడిచి దేవనగరమునకుఁబోవుటధర్మముగాదు. అచ్చటితుకారామునిఁ జూడకుండ నుండఁజాలను. ఇందులకు ఉపాయము చెప్పుము"అని పలికెను. అందులకు రుక్మిణీదేవి"నాథా, నీకు భక్తులయెడలగలిగిన ప్రేమాదరములు అనంతములుగదా?నీవు ఇప్పుడు ఇచ్చటినుండి కదలుట ధర్మముకాదు:గావున గరుడునిఁ బంపి తుకారాముని ఇక్కడకేరప్పింపుము" అని ఉపాయము చెప్పెను.

పాండురంగఁడు అందులకుఁజాలనానందించి"వత్సా నీవియోగము నాకు హృదయశల్యముగా నున్నది. నీనిమిత్తము గరుడునిఁ బంపితిని.ఆతని మూఁపున నెక్కి వెంటనే రమ్ము. ఇచ్చట క్షణము ఒక మహాయుగమువలె నున్నది"అని జాబున వ్రాసి గరుడునిఁ బంపెను. ఈయుత్తరమునుజూచుకొనియు గరుడునిఁ జూచియు తుకారాముఁడు అనంతానందభరితుఁడై "మహాత్మా,నీదర్శనము అనన్యదుర్లభము నీయనుగ్రహమునకుకృతజ్ఞుఁడను. నీవు శ్రీహరి వాహనమవు. శ్రీహరి యధిష్ఠించిన నిన్ను నేను ఎట్లు అధిష్ఠింపఁ గలను"అని తిరస్కరించెను. గరుడుఁడు పోయి ఈసంగతి పాండురంగనికిఁ దెలిపెను. దానిమీఁదఁ జేయవలసినది లేక పాండురంగఁడు చాల విచారించి ఎట్లో ఆయేకాదశి గడిపి మఱునాఁడు రుక్మిణీసహితుఁడై దేవనగరమునకుఁ బోయి తుకారామునకు సేవయొసంగెను.

తుకారాముఁడుమహాసంతసముతో శ్రీహరికిసాష్టాంగవందనములు ఆచరించి ఆనందబాష్పములతోడనే పాద్యాదికమును సంఘటించి అనేకవిధములఁ గొనియాడెను. ఆసేవకు ఆనందించి పాండురంగఁడు "వత్సా, నీభక్తి యచంచలము, నీయర్చనమునకు ఆనందమైనది. ఏదేనివరముఅడుగుము"అని పలికెను. అదివినిభక్తుఁడుచేతులు జోడించుకొని

స్వామి యెదుట నిలిచి "శ్రీహరీ, ఆర్తత్రాణపరాయణా, విశ్వరూపుఁడవును, విశ్వేశ్వరుఁడవును అయిన నీవు ప్రేమతో సేవయొసంగితివి. ప్రపంచమున మానవునకు ఇంతకంటె కోరఁదగిన వరము మఱియేమియున్నది? అయినను నీవు అనుగ్రహించెద ననినపుడు వలదనుట మంచిది గాదు? గావున నాకు ఈవరము ప్రసాదింపుము సర్వకాలసర్వావస్థలయందును, నాహృదయమున నీకంటె నన్యము తోఁచకుండునట్లును నీయెడల నా అచంచలభక్తి తఱుగకుండునట్లును కోరినపుడెల్ల నీసేవ లభించునట్లును అనుగ్రహింపుము" అని కోరెను.

ఇది విని పాండురంగఁడు తుకారామస్వామి పరమవైరాగ్యమునకు ఆనందించి "వత్సా, నాకు ఆఁకలియగుచున్నది. ఏమయినఁ బెట్టుము" అని అడిగెను. అంతట తుకారామస్వామి పరమానందభరితుఁడై ఇంటనున్న ఒక రొట్టెను తెచ్చి ముందుంచి "పరమేశ్వరా, ఈరొట్టె కాల్చి రెండు దినములు అయినది ఇది నీకు పెట్టుటకు నామనసు అంగీకరింప లేదు; గాని ఇంతకంటె నాయింట మఱియొకటి లేదు. ఏమి చేయఁగలను? క్షమింపుము" అని అంజలిబద్ధుఁడై పలికెను. అందుఁకు మాఱు పలుకకయే పాండురంగఁడు ఆనందముతో ఆరొట్టెను భుజించి "వత్సా, నీవు సందేహింపవలదు. ఇంతకంటె నాకేమి కావలెను! నీభక్తిరసామృతము సోకుటవలన ఇది అమృతముకంటెను మధురముగా నున్నది. నాకు ఆనందమైనది. నీకు ఏమియు లోపము ఒదవఁబోదు. నీవు కోరినపుడెల్ల సేవ యొసంగుదును. ఇప్పటికిఁబోయెద" నని చెప్పి తిరోహితుఁడు అయ్యెను.

ఒకప్పుడు ఒక బ్రాహ్మణయువకుఁడు తాను అగ్రనుమున మహావిద్వాంసుఁడు కాఁగోరి ఆలోచించుచుండఁగా ఒక మహానుభావుఁడు స్వప్నమున సాక్షాత్కరించి "వత్సా, దేవనగరమున ఉన్న తుకారామస్వామి చెంతకుఁ బొమ్ము. ఆతఁడు నీయభిలాషను దీర్చును" అని చెప్పి పోయెను. మఱునాఁడు ప్రాతఃకాలమునందే ఆబ్రాహ్మణయువకుఁడు స్వప్నవృత్తాంతమును స్మరించి బయలుదేఱి దేవనగరమునకు వచ్చి తుకారామస్వామికి సాష్టాంగ వందనములు ఆచరించి సంగతులు అన్నియు నెఱింగించి అభయమును వేఁడెను. అంతట తుకారామస్వామి ఆయువకునిపై చాల ననుగ్రహము పూని మహారాష్ట్రభాషలో రచించిన పండ్రెండు అభంగవృత్తములను మంత్రించి ఒక నారికేళమును ఇచ్చి "వత్సా,

ఈనారికేళ ఫలమును నీవుఒక్కఁడవే భుజించి ఈవృత్తముల నొక్కమాఱు పఠింపుము. అట్లయిన నీయభీష్టము సిద్ధించును" అనిచెప్పెను; గాని ఆయునకుఁడు "ఇది పొసఁగనిమాట తనచెంతకు వచ్చినందులకు వ్యర్థముగా తిరిగి పొమ్మనుటకును చేతఁ గాదనుటకును సందేహించి ఈతఁడు ఇట్లు వేషము వేసెనుగాని ఈకొబ్బరికాయను తినినంత మాత్రముునను ఈపండ్రెండు వృత్తములను చదివినంత మాత్రముునను విద్యవచ్చునా?" యని సందేహించి వానిని అచ్చట నుంచి మాఱు పలుకకయే వెడలి పోయెను. తుకారామస్వామి తొలుత అందులకు ఆశ్చర్యపడి పిదప దివ్యదృష్టివలన సకలమును గ్రహించి "ఇట్టివానికి నేను పరీక్షింపకుండ నేల అభయము ఇచ్చితిని?" అని చింతింపసాగెను.

ఇంతలో మఱియొకబ్రాహ్మణుఁడువిద్యార్థియై వచ్చి అభయమును గోరెను. తుకారామస్వామి తొల్లిటివలెఁ గాక ఆయువకుని హృదయస్థితిని బాగుగఁ బరీక్షించి నమ్మి తొంటి బ్రాహ్మణుఁడు విడిచిపెట్టిపోయిన దానిని ఇచ్చి సంగతి యంతయు నెఱింగించెను. అంత నాయువకుఁడు స్వామి చెప్పినది అంతయుఁ జేసెను. తోడనే ఆతని జిహ్వపై సరస్వతి వచ్చి వాసముచేసెను. ఆతఁడు శివాజీమహారాజు ఆస్థానమునందలి ఒక పండితుని కుమారుఁడు. విద్యావిహీనుఁడు అగుటవలన ఆతని నందఱును నీచముగఁ జూచెడివారు. ఇందులకు లజ్జించి ఆతఁడు ఇట్లుబయలుదేఱి వచ్చెను. అదృష్టవశమున వచ్చిన వెంటనే పని అయిపోయినందులకు పరమానందభరితుఁడై ఆతఁడు గురుమహాశయునకు మఱలసాష్టాంగనందనంబులు ఆచరించి సెలవుఁ బడసి బయలుదేఱి స్వగ్రామమునకుం బోయెను.

ఆతఁడు ఇల్లుసేరునప్పటికి రాజసభలో ఒక గొప్ప పండితుఁడు పురాణము చెప్పుచుండెను. అది విని యాతఁడు సభకుఁబోయెను. పండితుఁడు పురాణమును బాగుగనే చెప్పుచుండెను; గాని రహస్యార్థములను జెప్పలేకుండెను. అంతట ఈయునకుఁడు అందుకొని రహస్యార్థములను జెప్పెను. అదిచూచిఅందఱును ఆశ్చర్యపడ సంగతిసందర్భములు అడుగఁగా ఆతఁడు జరిగినది అంతయుఁ జెప్పెను. అచటివారు ఎల్లరును తుకారామస్వామి మాహాత్మ్యమునకు ఆయునకుని అదృష్టమునకును

చాల ఆశ్చర్యపడిరి. శివాజీమహారాజు మహాపండితుఁడైన ఆ బాలునకు చాల సన్మానము గావించి ఆదరించి తండ్రికి ఆనందము గలిగించెను.

చించవటి యను గ్రామమునుండి వచ్చిన బ్రాహ్మణులు కొందఱు అప్పుడు అచ్చట నుండిరి. వారు తుకారామస్వామి ప్రభావమును బరీక్షించి తెలియఁగోరి "రాజసభకు రావలసినది" అని యొక మనుష్యునిఁ బంపిరి. గాని యానౌకరు పోవునప్పటికి తుకారామస్వామి హరిభజనము సేయుచుండెను. అదివిని అచ్చటఁ జేరియున్నవారు అందఱును ఆనందాతిరేకముచే మైమఱచి యుండిరి. ఈనౌకరుగూడ వారివలెనే అయ్యెను. చించవటి బ్రాహ్మణులు మఱియొకనౌకరు నంపిరి. వాఁడును అట్లే యయ్యెను. ఇంకొకనినిఁ బంపినను యథాపూర్వముగనే అయ్యెను. అందులకు కారణము నెఱుంగక ఆబ్రాహ్మణులు విసిగి తామే బయలు దేఱిరి.

ఈసంగతి దివ్యదృష్టివలన నెఱింగి తుకారామస్వామి హరిభజనము చాలించి ఎదురుపోయి సగౌరవముగ బ్రాహ్మణులను దోడి తెచ్చి తన ఇంట నాసీనులం గావించి చాల గౌరవించెను. అప్పుడు బ్రాహ్మణులలో అగ్రేసరుఁడు తుకారామస్వామినిఁ జూచి "స్వామీ మీప్రభావమును గుఱించిన వింతలు అనేకవిధముల వినఁబడుచున్నవి. ఒకవింత చేసి మాకు ఆనందము గలిగింపవలయు" ననికోరిరి. అందులకు మాఱుపలుకక యే తుకారామస్వామి కత్తితో తన తొడను గోసి బ్రాహ్మణులకుఁ జూపెను. తొడయందు ప్రాణిలోకమునకు అంతకును ఉండునట్లు రక్తమాంసములుగాక ఒక తెల్లని పదార్థము ఉండెను. అది చూచి బ్రాహ్మణులు ఆశ్చర్యపడి స్వామికి సాష్టాంగవందనములు ఆచరించి మహానుభావా, "నీప్రభావము అభూతపూర్వముగ నున్నది. దేహము అంతయు సత్వభూయిష్ఠమైయున్న దేవరవారికి అసాధ్యము ఏమి యున్నది ? మీదర్శనమువలన నేఁడు మాజన్మలు పావనములైనవి. మాయెడ ననుగ్రహము ఉంచి మాగ్రామమునకువచ్చి కొన్నిదినములు అచ్చట వసించి మాకు ముక్తిమార్గమును ఉపదేశింపవలయును" అని కోరిరి. తుకారామస్వామి వల్లెయని వారితో బయలుదేఱెను.

మార్గవశమున ఒకయూరి చెంతనుండి పోవుచుండఁగా ఆయూరి వారు వచ్చి ప్రార్థించి తమ గ్రామమున ఒక నెలదినములు ఉండునట్లు

ఒడఁబఱుచుకొని తుకారామస్వామినిఁ గొనిపోయిరి. అచ్చట స్వామి వారికి అందఱకును జ్ఞానబోధగావింపఁదొడఁగెను. ఇట్లుండఁగా పండరి పురమునుండి ఒక బ్రాహ్మణుఁడు యాచ్ఞార్థమై ఆగ్రామమునకు వచ్చెను. నాఁడు గ్రామమునందలివారు ఎల్లరును రెండుగడియల ప్రొద్దెక్కినను ఇంకను నిదురమంచములనుండి దిగలేదు. కారణము అడుగఁగా నిద్రాహారములు మాని తుకారామస్వామి బోధనము వినుట యని వారు చెప్పిరి. అంతనాబ్రాహ్మణుఁడు "తుకారామునిబోధవలన మైమఱచియున్న ఈయూరివారి నానంద పెట్టుటకు నాపాండిత్యము చాలదు" అని తలంచివచ్చిన దారినే మఱలఁ బయలు దేఱెను గాని తుకారామస్వామి దివ్య దృష్టివలన ఈసంగతి నెఱింగి వెంటనే పోయి ఆబ్రాహ్మణునిఁ గొనివచ్చి "మీకిది తగునా? వచ్చిన పనికి ప్రయత్నము చేయకయే వెడలిపోవుట ధర్మమా! ఇచ్చట మీకు నిస్పృహాపడవలసిన కారణము లేదు." అని బుజ్జగించి తిరిగి గ్రామములోనికిఁ గొనిపోయెను. అప్పటికి అప్పుడే గ్రామమునందలి పెద్దలు అందఱును తుకారామస్వామిబసనక్క మూగియుండిరి. స్వామి వారి నందఱను జూచి బ్రాహ్మణుని ఆగమనమునకు కారణము నెఱింగించి "మీరందఱును మీశక్తుల ననుసరించి ఈబ్రాహ్మణుని సత్కరించి పంపుఁడు" అని నియమించెను. అంతట వారిలోఁ గొందఱు పెద్దలు వారవారి శక్తుల ననుసరించి అందఱిచెంతను వసూలు చేసిరి; గాని ఒక బట్టలవర్తకునివలన తిరస్కరింపఁబడిరి. "నేనుకష్టించి సంపాదించికొన్నాను. నేను ఎవరికిని ఏమియు ఉచితముగ నీయఁజాలను" అని వాఁడు ఖండితముగాఁ జెప్పుటయే గాక వారిని దూషించెను. అదివిని వానిభార్య కటకటంబడి అనేకహితవచనములుచెప్పఁగావాఁడుతుదకు "నీకంటె నాకుప్రియమైన వస్తువు ప్రపంచమున మఱిలేదు; గావున నీకు నేను వ్యతిరేకము చెప్పఁజాలను. నీకు అంతగా దానము చేయవలయు నను నుత్సాహము ఉన్నయెడల మన ఇంట నున్న ఓటిచెంబు నిమ్ము" అని పలికెను. ఏదో యొకటి ఇచ్చుటకు అంగీకరించినందులకు ఆనందించి, ఆమె ఆయోటిచెంబును వారికి ఇచ్చి "అయ్యలారా, ప్రకృతము ఇంతేవీలయినది. అయినను ఈసడింపక స్వాములవారు దీనినే బంగారు కలశముగా భావింపవలయును" అని విన్నవించెను.

అంతట వారు సొమ్ము అంతయుఁ గొనిపోయి స్వామి కిచ్చి ఓటి చెంబుగూడ ఇచ్చి సంగతి అంతయు నెఱింగించిరి. అంతట స్వామి ఆనందముతో ఆయోటిచెంబును తాఁకఁగా నది బంగరుకలశమే యయ్యెను. అందులకు అందఱు నాశ్చర్యపడుచుండఁగా "ఆమె మహా పతివ్రత; గావుననే ఇట్లుజరిగినది." అని చెప్పి స్వామి ఆరొక్కమును కలశమును బ్రాహ్మణునకు ఇచ్చి పంపి వేసెను.

ఇట్లు మఱికొన్ని దినములు ఆగ్రామమున నుండి స్వామి చించవటికి పోయి అచ్చట నొక నెలయుండి పిదప స్వస్థలముఁ జేరుకొనెను. ఒకనాఁడు ఆయూరియందలి బ్రాహ్మణులు కొందఱువచ్చి "తుకారామా నీవు లోకులకు భక్తియే మంచిదని బోధించుచు కర్మమార్గమును భ్రంశము చేయుచున్నావు. కావున నీవు వ్రాసిన పుస్తకములను మేము ఏటిలోఁ బాఱవేసెదము ఎన్నిదినములున్నను అవినీటిలో చెడిపోకుండు నేని నీమార్గమే మంచిదని అంగీకరించెద" మని చెప్పి బలాత్కారముగ ఆతని గ్రంథములను గొనిపోయి ఏటిలో పాఱవేసిరి. పిదప వారు పదునైదుదినములు ఆ గ్రంథములను గనిపెట్టుకొని యుండిరి; గాని ఒక్క ఆవగింజతయైన గ్రంథములు చెడిపోలేదు. అదిచూచి బ్రాహ్మణులు లజ్జించి ఉన్నట్లుండఁగా వచ్చి తుకారామస్వామికాళ్ల మీఁదఁ బడి అభయమును బడసిపోయిరి. స్వామి బ్రతికియున్నంతకాలము నిట్లు అనేకాద్భుతకృత్యములనుజేసి అవసానమున ఈశ్వరసాయుజ్యమును బడసెను.

అభంగలు.

ముంగీ ఆణిరావ, ఆహ్మాం సారఖే చి జీవ. ౧
గేలా మోహ ఆణి ఆశా, కళికాళాచా హా ఫాంసా. ౨
సోనే ఆణి మాతీ, ఆహ్మాం సమాన హే చిత్తీం. ౩
తుకాహ్మణే ఆలే, ఘరా వైకుంఠ సగళేం. ౪

తుహ్మాం పాశీం ఆహ్మీ యే ఊనియాం కాయ,
వ్యర్థా కేలా హే చాలణ్యాచా. ౧
మాగాంవేం హేం అన్న తరీ భిక్షాహార,
వస్త్రాసీ హే భారచింధ్యా విదీ. ౨
నిద్రే సీ ఆసన ఉత్తమపాషాణ,
వరీ ఆవరణ ఆకాశాచేం. ౩

తేథేంకాయకరణేం కరణాచీ ఆస,
వాయాం హోయనాశఆయుష్యాచా. ౮
రాజగృహాయావేం మానాచియే ఆసే,
తేథేంకాయపసే అనుభవ. ౯

51. జ్ఞాన దేవుఁడు.

గంగాతీరమునందలి అప్పగ్రామమున వసించు గోవిందపండితుని కుమారుఁడు అగు విఠోబా తనపంద్రెండవయేట తల్లిదండ్రుల యనుజ్ఞనుబడసి తీర్థయాత్రకు బయలువెడలెను. ఆతఁడు అనేక క్షేత్రములను సేవించి ఒకనాఁడు అలకాపురము చేరికొనెను. అచ్చట నాతఁడు చక్రతీర్థమున స్నానమాడి నిర్మలహృదయముతో ఈశ్వరధ్యానము చేయుచుండెను. ఇట్లుండఁగా ఆపురమున వసించుచున్న సిద్ధపండితుఁడు అను ఒక మంచి బ్రాహ్మణుఁడు స్నానార్థము అచ్చటకు వచ్చి విఠోబానుజూచి ఆనందించి ధ్యానాదికము ముగిసిన పిదప వృత్తాంతము అంతయుఅడిగి తెలిసికొని ప్రార్థించి తనఇంటికిఁ గొనిపోయి చాల మర్యాద గావించెను. అందులకు విఠోబా చాల నానందించెను.

నాఁటిరాత్రి పాండురంగఁడు సిద్ధపండితుని స్వప్నమున సాక్షాత్కరించి "విఠోబామహానుభావుఁడు. ఆతనికి మహాప్రభావసంపన్నులుఅగు నలుగురు బిడ్డలు పుట్టవలసియున్నారు; గావున నీకుమార్తెను ఆతనికిచ్చి వివాహముచేయుము" అని నియమించెను. మఱునాఁడు సిద్ధపండితుఁడు విఠోభాను చేరఁబిలిచి వృత్తాంతము అంతయుఁ జెప్పి నాప్రార్థనము నంగీకరింపవలయును అని కోరఁగా విఠోబా "అయ్యా, నాకుఁగూడ పాండురంగఁడు అట్లు నియమించినచో నాయభ్యంతరము లే" దని చెప్పెను. నాఁటిరాత్రియే పాండురంగఁడు విఠోబాస్వప్నమునఁ గూడ సాక్షాత్కరించి "వత్సా, సిద్ధపండితుని యాజ్ఞను జవదాఁటకుము. ఆతనికొమార్తెను బెండ్లియాడుము" అని నియమించెను. మఱునాఁడు ఆనందముతో విఠోబా ఈవృత్తాంతము నెఱింగింపఁగా సిద్ధపండితుఁడుమహా

నందభరితుఁడై రుక్మాబాయి అను తన కొమార్తను మంచిముహూర్తమున విఠోబాకు ఇచ్చి పెండ్లి చేసెను.

నాలుగైదు దినములు గడచినతరువాత సిద్ధపండితుఁడు భార్యను పుత్త్రికను అల్లుని వెంటనిడుకొని పండరిపురమునకుఁ బోయి పాండురంగని సేవించెను. అర్చనము అంతయు నైన తరువాత విఠోబా మామగారినిఁ జూచి "నాకు సెల వీయవలయును. నేను తక్కిన తీర్థములను గూడ సేవించుకొని వచ్చెదను" అని ప్రార్థించెను. సిద్ధపండితుఁడు అందులకు అంగీకరించెను.

ఇట్లు అత్తమామల సెలవుఁ బడసి విఠోబా మఱల బయలుదేఱి అనేకపుణ్యక్షేత్త్రములను సేవించి తుదకు సేతువునకుఁ బోయి అచ్చటఁ జేయవలసినవి ఎల్ల ముగించుకొని మఱల అత్తవారి ఇంటికి వచ్చి చేరుకొనెను. అత్తమామలును భార్యయు చాలసంతసించిరి మఱినాల్గు దినములు అచ్చటనుండి విఠోబా అత్తమామలం గాంచి "నాతలిదండ్రులను విడిచివచ్చి చాల ఏండ్లయినది. కావున పోయివచ్చెదను. సెలవు ఈయవలయును" అని ప్రార్థించెను. వారు అందులకు అంగీకరించి రుక్మాబాయిని ఈతనికి ఇచ్చి పెండ్లి చేయుట ఈతని తలిదండ్రులు ఎఱుఁగరు. కావున ఆతనితోఁ గూడ మనము మన బిడ్డను వెంటఁ బెట్టుకొనిపోయి అచ్చట అప్పగించి వత్తము అని కూడఁ బలికికొని అల్లునితోఁ గూడ బయలుదేఱిరి. కొలఁది దినములకే వారు నలుగురును అప్పాగ్రామము చేరుకొనిరి. విఠోబా తొలుత భార్యాద్వితీయుఁడై తలిదండ్రులకు నమస్కరించెను. సిద్ధపండితుఁడు సంగతి అంతయు నెఱింగించెను అంతయుఁ జూచి అంతయు విని విఠోబా తలిదండ్రులు పరమానందభరితులై కుమారుని కోడలిని ఆశీర్వదించి వియ్యాలవారిని చాల గౌరవించిరి. అచ్చట సిద్ధపండితుఁడు ఒకవారము దినములు ఉండి కొమార్తకు బుద్ధులు చెప్పి అల్లుని దీవించి వియ్యాలవారివలన సెలవుఁ బడసి స్వగ్రామమునకుఁ బోయిరి. మఱికొన్ని దినములకు గోవిందపండితుఁడు ఆతని భార్యయుఁ బరలోకమునకుఁ బోయిరి. సంసారభారము విఠోబామీఁదఁ బడెను.

కాని విఠోబా సంసారవృత్తమును గమనించుట మానివేసెను. అప్పటికి ఆతనికి వైరాగ్యము పెరిగిపోయెను. సర్వకాలసర్వావస్థలయందును ఈశ్వరధ్యానముదక్క నాతఁడు అన్యము నెఱుంగఁడు. ఈసంగతి

అలకాపురమున నున్న సిద్ధపండితునకుఁ దెలిసెను. తోడనే ఆతఁడు అప్పగ్రామమునకు వచ్చి మంచిమాటలుచెప్పి అల్లునికొమార్తెను తన ఇంటికిఁ బిలుచుకొని పోయెను.అక్కడ కూడ విఠోబాకు వైరాగ్యము ఆకసము అంటఁబెరిగి పోయెను. ఒకనాటిరాత్రి ఆతఁడు భార్యనుజేర బిలిచి "మనకు ఇంతవఱకును సంతానము కలుగలేదు. సన్యాసాశ్రమము మీఁద యభిలాష నాకు పెరిగిపోవుచున్నది. కావున సెలవుఇమ్ము. కాశికిఁ బోయి నేను సుఖించెదను" అని అడిగెను. అందులకు రుక్మాబాయి ఏమియుఁ జెప్పక మౌనముగా నుండి మఱునాఁడు ఈసంగతి తలిదండ్రులకు ఎఱింగించెను; వారును అల్లుని వైరాగ్యమునకు భీతిల్లి, "తల్లీ, విఠోబా ఈప్రస్తావన తెచ్చినప్పుడెల్ల నీవు మౌనవ్రతమును అవలంబింపుము" అని చెప్పిరి.రుక్మాబాయి అట్లేచేసెను. కాని యొకనాఁడు నిద్రపోవుచుండఁగా రుక్మాబాయిని లేపి "నేను కాశికిఁ బోయెద" నని యెను. నిద్రమత్తులో నున్న రుక్మాబాయి వల్లె యనెను.పులినోటనుండి తప్పితి నని పరమానందముతో విఠోబా అప్పుడే కాశికి బయలుదేఱి పోయెను.

కాశిఁ జేరుకొన్న పిదప ఆతనికి సన్యాసముమీఁది అభిలాష హెచ్చు అయ్యెను. అచ్చట గంగాతీరమునఁ గూరుచుండి యుండు సన్యాసులను జూచి ఆతఁడు పొంగిపోఁదొడఁగెను. తుదకు ఒకనాఁడు ఆతఁడు ఆనగరమున నున్న సన్యాసులలో నెల్ల మేలుబంతి యగు రామానందస్వామిచెంతకుఁ బోయి సాష్టాంగనమస్కారములు ఆచరించి అభయము వేఁడెను. అందులకు రామానందస్వామి ఆనందించి "ముందు ఈసంగతిఁ జెప్పుము. నీవు పితృఋణవిముక్తుఁడవైతివా? నీతలిదండ్రులవలన సెలవుఁ బొందితివా? నీ భార్యపుత్రులకు లోపములు కలుగకుండునట్లు చేసితివా? నీ హృదయమున ఉన్నవైరాగ్యము సుస్థిరమేనా?" అని ప్రశ్నించెను. "నాతలిదండ్రులు పరమపదించినారు తక్కినవానిలో లోపములు ఏమియు లేవు" అని విఠోబా అందులకుఁ బ్రత్యుత్తరమిచ్చెను.స్వామి విఠోబాకు సన్యాసముఇచ్చెను. విఠోబా పరమానందభరితుఁడు అయ్యెను.

కొలఁది దినములలో విఠోబా సన్యసించినట్లు అలకాపురిలో సిద్ధపండితుని యింటఁ దెలిసెను. తోడనే పెద్దకోలాహలము పుట్టెను. సిద్ధ

పండితుఁడు మనస్సు రాయి చేసికొని అనేకవిధముల నూరడించెను; గాని రుక్మాబాయికి విచారముహరి అఁగ లేదు. ఆమె దుఃఖమును జూడలేక సిద్ధపండితుఁడు గూడ మఱల విచారింపసాగెను. ఇట్లు కొన్ని దినములు జరిగిన తరువాత రుక్మాబాయి ఇఁక ఎంత వగచినను ప్రయోజనము లేదని గుర్తెఱిఁగి అశ్వత్థనారాయణునిఁ బూజింపసాగెను.

అచ్చట రామానందస్వామి సేతుస్నానము చేయ నభిలషించి ఆశ్రమమున ఉన్నశిష్యులకు కట్టుదిట్టములుచేసి బయలుదేఱి మార్గవశమున అలకాపురికి వచ్చి ఊరిబయట చెఱువుగట్టుమీఁద నున్నఅశ్వత్థవృక్షముక్రిందఁ గూరుచుండెను. కొంతసేపటికి ఆయశ్వత్థమును బూజించుటకు అచ్చటకు వచ్చి రుక్మాబాయికి సాక్షాత్కరించిన పరమశివుఁడో యన ఎదుటఁ దేజరిల్లుచున్న రామానందస్వామినిఁ జూచి వినయము తోఁడను భక్తితోఁడను నమస్కరించెను. అందులకు ఆనందించి స్వామి "దీర్ఘసుమంగలివై రత్నములవంటి బిడ్డలను బడసి సుఖింపుము" అని ఆశీర్వదించెను. అది విని రుక్మాబాయి మందహాసము గావించెను.

స్వామికి సందేహము గలిగెను. "ఎందులకు ఈమె ఇట్లు మందహాసము చేయుచున్నది?" ఈసందేహము ఆతనికిఁ దీరలేదు. వెంటనే ప్రశ్నింపఁగా రుక్మాబాయి "నాభర్త కాశీనగరమున సన్యాసాశ్రమము స్వీకరించెను. ఇఁక మీయాశీర్వచన మెట్లు ఫలించును? తమవంటి మహాత్ముల యాశీర్వచనములను గూడ వ్యర్థము చేయుచున్న నాదౌర్భాగ్యమును స్మరించుకొని మందహాసము చేసితిని" అని ప్రత్యుత్తరము నిచ్చెను. సంభాషణావశమున ఆమె తన భర్తపేరుగూడఁ దెలిపెను. అదివిని స్వామి "సాధ్వీ, నీభర్తకు సన్యాసము నేనే ఇచ్చితిని. ఆతఁడు తాను పుత్రసంతానమునుబడసి పితృఋణమునుండి విముక్తుఁడనైతి ననిచెప్పెను. అందఱకును లోపములు ఏమియు కలుగకుండునట్లు ఏర్పాటులు అన్నియు చేసి వచ్చితి నని చెప్పెను. అబద్ధము చెప్పి సన్యాసము తీసికొనినందులకు నీభర్తయు యథార్థముఁ దెలిసికొనుటకు ఏవిధముగను బరీక్షింపనయే సన్యాసము ఇచ్చినందులకు నేనును ప్రాయశ్చిత్తార్హులమై యున్నాము. నేను ఈకళంకమును బాపుకొనుటకై సేతుయాత్ర మాని మఱలఁ గాశికిఁ బోయెదను; గావున నీతలిదండ్రులను వెంటఁబెట్టుకొని నీవు నాతోఁగూడ రమ్ము" అని పలికెను. రుక్మా

బాయి స్వామి సెలవు ప్రకారము ఆతనివెంట తల్లిదండ్రులతో గూడ కాశికి బయలుదేఱెను.

యుక్తసమయమున వారు కాశీనగరమును జేరుకొనిరి. గురుదేవుని వెనుక నున్న రుక్మాబాయిని అత్తమామలను జూచి విఠోబా తెల్లవోయి "అపరాధమును మన్నింపవలెను" అని రామానందుని పాదముల మీఁద వ్రాలెను. ఆదరముతో లేవ నెత్తి స్వామి "క్షమించితిని. నాతో అబద్ధములాడినందులకు ప్రాయశ్చిత్తముగా మఱల నీవు సంసారమునఁ బ్రవేశింపుము" అని నియమించెను. విఠోబా ధర్మభయముఁజూపెను. గాని స్వామి "అట్లు వలనుపడదు. అంగీకరింపవేని గురునిరాకరణపాపము చుట్టుకొనును. అంగీకరించెదవేని వెనుకటి సకల పాపములును గూడ తొలఁగిపోవును" అని చెప్పెను. చేయునది లేక విఠోబా మఱల సంసారమునఁ బ్రవేశించెను.

విఠోబా సంసారమునఁ బ్రవేశించెను; గాని ఆతని హృదయమున ఆధ్యాత్మికచింతనము శూన్యము గాలేదు. అయినను సన్యాసమునుండి గృహస్థుఁడు అగుట లోకులకు విపరీతము కాకపోదు. విఠోబాను అనేకులు అనేకవిధముల నిందింపసాగిరి. స్త్రీలు కొందఱు "విఠోబాకు సిగ్గు లేకున్నమానె రుక్మాబాయికైన నుండవలదా?" అని కాన్పించినచోటులందెల్ల ఆమెను దెప్పసాగిరి. ఈతీరున వారు మాటిమాటికి నిందింపఁబడుచు అలకాపురమున ఉండఁజాలక అరణ్యమునకుఁ బోయి ఒక గుడిసె వేసికొని అందు వసించిరి.

పండ్రెండుసంవత్సరములు గడచిన తరువాత రుక్మాబాయి గర్భవతి యయ్యెను. విఠోబా ఈసంగతిఁ దెలిసికొని తన సంసారబంధము నశించిపోవు సమయ మాసన్నమైనది అని భావించి ఉప్పొంగసాగెను. నవమాసములను మోసి ఒక కుమారునిఁ గనెను. ఇట్లు ఆమె వరుసగా మఱి ఇరువురు కుమారులను ఒక కొమార్తను గనెను. ప్రథమపుత్రునకు నివృత్తిదేవుఁడు అనియు, రెండవపుత్రునకు జ్ఞానదేవుఁడు అనియు, మూఁడవపుత్రునకు సోపానదేవుఁడు అనియు, కొమార్తకు ముక్తాబాయి అనియు వారు పేరులు పెట్టిరి.

బిడ్డలు యుక్తవయస్కులైన తరువాత రుక్మాబాయి భర్తను జూచి "మన బిడ్డలు ఇట్లు బ్రాహ్మణ్యహీనులై యుండుటఁజూడ నాకుఁ

చాల కష్టముగానున్నది; మీరు బ్రాహ్మణులలోఁ జేర్చుకొనఁబడుటకు ఏద
యిన ఉపాయము చేసినఁ గాని నేను సహింపఁజాలను" అని పలికెను.
విఠోబాకు గూడ ఇటువంటి చింతయే యుండెను. గావున ఆతఁడు
అలకాపురమునకు బిడ్డలతోఁ గూడఁ బోయి వారిని బ్రాహ్మణులకుఁ
జూపి "మహాత్ములారా, నాబిడ్డలను రక్షింపుఁడు. మాకు ప్రాయశ్చిత్తము
గావించి మమ్ము మీలోఁ గలుపుకొనుఁడు" అని కోరెను. అందులకు
ఆబ్రాహ్మణులు నవ్వి "మరణముకంటె మీకు మఱియొక ప్రాయశ్చిత్తము
లేదు. పోయి ఏసాగరమునందైన ఉఱుకుఁడు" అని పలికిరి. ఆమాట
లను విని విఠోబా భార్యాపుత్రులను విడిచి ఎందో పోయెను.

మఱునాఁడు జ్ఞానదేవుఁడు అన్నదమ్ములను చెల్లెలిని వెంటనిడు
కొని మఱల అలకాపురమునకుఁ బోయి బ్రాహ్మణులకు సాష్టాంగవందన
ములు ఆచరించి "మహానుభావులారా, మీరు అనిన మాటలకు లక్ష్యిం
చి మాతండ్రి ఎందో పోయెను. ఇఁక మాకుప్రాయశ్చిత్తము విధించుట
కు ఏమి అభ్యంతరము ఉన్నది?" అని అడిగెను. అందులకు వారు మీ
హృదయమునఁ బశ్చాత్తాపము గలుగుట చాలమంచిది. అయినను సా
హసించి మేము ఏమియుఁ జేయఁజాలము. పైఠణపురమున ఉన్న బ్రా
హ్మణులు సరస్వతీపురుషావతారములు. కావున వారి చెంతకుఁ బోయి
ప్రార్థింపుఁడు. వారివలన మీయభీష్టము నెఱవేఱవచ్చును" అని చెప్పి
ఒకజాబు నిచ్చిరి. ఆజాబుగైకొని జ్ఞానదేవుఁడు వారితోఁ గూడి
పైఠణపురమునకుఁ బోయెను.

పైఠణపురమునందలి బ్రాహ్మణులు అలకాపురపు బ్రాహ్మణులు
వ్రాసిన జాబువలన సకలమును ఎఱింగి "వత్సలారా,మీకు సంభవించి
నదుర్గతికి మాకు దుఃఖము అగుచున్నది. అయినను మేము ఏమియుఁ
జేయఁజాలము. మీరు సన్యాసికిఁ బుట్టినారు. దీనికి ఎందును ప్రాయ
శ్చిత్తము లేదు. ఫలములేని శ్రమకు ఏల పాల్పడెదరు ! మీరు భగవం
తుని ఆరాధింపుఁడు. అదియే మీకు భవతారకము" అని చెప్పిరి. జ్ఞాన
దేవుఁడు అది విని "ఇది మీరు చెప్పుచున్నను మాహృదయములయందు
జాగరితము అగుచున్నది. మీకు శక్తిలేని దానిని మేము కోరుట
వలనఁ బ్రయోజనము లేదు; గావున బ్రాహ్మణ్యసంపాదనము నెడల
మేమిఁక నిరాశ చేసికొనియెదము" అని పలికెను. అటుమీఁద ఆ

బ్రాహ్మణుల యందలి మూర్ఖులు కొందఱు "వేదవేదాంగములను అభ్యసించిన జ్ఞానదేవుఁడు అను పేరు నీవు ఏల వహించితివి? భీరునకు శూరుఁడు అను పేరు తగనట్లు నీకు ఇట్టి పేరు తగదు." అని పలికిరి. ఈ సమయమున ఒక తురుష్కుఁడు ఒక దున్నపోతుమీఁద ధాన్యపు బస్తా వేసికొని వచ్చుచుండెను. అది చూచి ఆబ్రాహ్మణ మూర్ఖులలో నొకఁడు "జ్ఞానదేవుఁడు అను పేరు నేను ఈమహిషమునకుఁ బెట్టెదను. నీకంటె దీని తక్కువ ఏమి?" అనియెను.

అంతట జ్ఞానదేవుఁడు ముకుళితకరకమలుఁడై "అయ్యా, అందు అసందర్భ మేమియున్నది? మీరు తోఁచినట్లు చేయుటకు అభ్యంతరము ఏమియు లేదు. మీరు తలంచినట్లు ఈమహిషమునకును నాకును ఏమియు భేదము లేదు. నాయందును ఆమహిషమునందును గూడ ఒక్క పరమాత్మయే యున్నాఁడు. కుండయందును బిందెయందునుగూడ నున్నజలము గంగాజలమే. మీరు బాహ్యచిహ్నములను బట్టి భేదభావము వహించుచున్నారు. గాని వేఱుగాదు" అని పలికెను. "అట్లయిన ఈమహిషమును కొట్టినచో ఆదెబ్బ నీకుఁ దగులవలయును" అని ఆ బ్రాహ్మణుఁడు మాఱు పలికెను. జ్ఞానదేవుఁడు చూడవచ్చు ననియెను. తోడనే ఆబ్రాహ్మణుఁడు మహిషము వీఁపుమీఁద ఒక దెబ్బ కొట్టెను. మహిషమునకు ఏమియుఁ దెలియదు; గాని జ్ఞానదేవుని వీఁపుమీఁద ఒక బొబ్బ లేచెను. అది చూచి కొందఱు బ్రాహ్మణులు ఆశ్చర్యపడి "వీరు మహానుభావులు" అని తలఁచిరి; గాని తక్కినవారికి తృప్తికలుగలేదు. "ఈమహిషముచే వేదములను బలికించినఁ గాని నిన్ను నమ్మ" మని బ్రాహ్మణులు మఱలఁ బలికిరి. "అయ్యలారా, మీకు అట్టిసంకల్పముఉన్నచోఁ జూడవచ్చును" అని జ్ఞానదేవుఁడు మహిషము చెంతకుఁబోయి దానిశిరమునఁ జేయిడి "భద్రా, వేదమును ఉచ్చరించి ఈ బ్రాహ్మణుల అనుగ్రహమును బడయుము" అనిపలికెను. తోడనే మహిషమున స్వరమున వేదపఠనము ప్రారంభించెను. బ్రాహ్మణు లందఱును తెల్లవోయిరి. మూర్ఖపుపట్టుపట్టి విపరీతపుప్రశ్నలు వేసి బ్రాహ్మణులు 'కట్టా, మన మెంత అక్రమప్రవర్తనము చేసితిమి?' అని వగవసాగిరి. 'మీకుబ్రాహ్మణ్యము సిద్ధింపదు.' అనిన బ్రాహ్మణులు "వీరు మనకంటె గొప్ప బ్రాహ్మణులు" అని లజ్జించి యూరకుండిరి.

పిదప అచ్చటివారు అందఱును వారిని చాల గౌరవించిరి. సుశీలుఁడు అను బ్రాహ్మణుఁడు వారినిఁ దన ఇంటికిఁ దీసికొనిపోయి ఒకభాగమువారి కిచ్చి "మీరు ఇష్టమున్నంతకాలమును ఇచ్చట వసింపవచ్చును." అని చెప్పెను. వారందులకుఁ జాల నానందించిరి. జ్ఞానదేవుఁడు చూపిన అద్భుతమును ఆయూరియందున్న కొలఁదిమంది మాత్రమే చూచిరి. తక్కినవారు "మీరు చెప్పెడిమాటలు ఏమియు మేము నమ్మఁజాలము. ఒకవేళ ఆతఁడు అట్టి విచిత్రములను జేసినను వారు బ్రాహ్మణులు మాత్రము ఎన్నటికిన్ని గారు. ఒకప్పుడు చండాలుఁడు బ్రహ్మజ్ఞానసంపన్నుఁడు కావచ్చును; అంతమాత్రమున వాఁడు బ్రాహ్మణుఁడు అగునా? మనవర్ణమునకు ఒక విశిష్టధర్మము ఉన్నది. ఆధర్మము లేనివాఁడు మనకంటె గొప్పవాఁడే కావచ్చును; గాని బ్రాహ్మణుఁడు మాత్రము కాఁడు. వర్ణము వర్ణమే. ఘనత ఘనతయే. రెండింటికిని సంబంధము లేదు" అని చెప్పిరి. ఇంతటి యుక్తినిఁ జూచి అందఱును గూడ ఆవాదమునే అంగీకరించిరి. సుశీలుని వారు చేరనీయలేదు. "తక్కినవారు చెప్పినదే లేదు. నీవు కులభ్రష్టుఁడవైతివి" అని వారు ఆతనిని వెలివేసిరి. అట్లుండఁగా, సుశీలుని తండ్రి యబ్దికము వచ్చెను. "నాయపరాధమును క్షమించి నాకు ప్రాయశ్చిత్తముచేసి బ్రాహ్మణ్యము ఇచ్చి మీలో ఒక ఇంటివానినిఁగా అంగీకరింపుఁడు" అని ఆతఁడు ఎన్నోవిధములఁ బ్రార్థించెను; గాని ఆ బ్రాహ్మణులు "నీబ్రాహ్మణ్యము ఎప్పుడో పోయినది. ఆసన్యాసిపుత్రులకు ప్రాయశ్చిత్తాధికారము ఎట్లు లేదో నీకును అట్లే లేదు" అని వారు తిరస్కరించిరి. సుశీలునకు శిరముమీఁద పిడుగు పడినట్లు అయ్యెను.

ఆతని దైన్యమును గ్రహించి జ్ఞానదేవుఁడు "అయ్యా, నీకు సంభవించిన విపత్తు ఏమియు లేదు. ఈబ్రాహ్మణులవలన నీకు సంభవించు ఇక్కట్లు ఏమియు లేవు. ఈబ్రాహ్మణులు భోక్తలుగా రాకున్న నీకేమి! నీపితృదేవతలే స్వయముగ వచ్చి భుజించిపోయెదరు. కావున నీవు చింత మాని సకలప్రయత్నములును కొనసాగింపుము" అని చెప్పెను. జ్ఞానదేవుని మాహాత్మ్యమును ఎఱిఁగియున్నవాఁడు కావున సుశీలుఁడు ధైర్యము వహించెను.

ఆదినము వచ్చెను. జామున్నర ప్రొద్దు యెక్కునప్పటికి సుశీలుని భార్య పచనకార్యము సాంగోపాంగముగ నిర్వర్తించి ఆసంగతి భర్తకు

ఎఱింగించెను సుశీలుఁడు జ్ఞానదేవునకుఁ దెలిపెను. వెంటనే జ్ఞానదేవుఁడు శ్రీహరినిఁ బ్రార్థించెను. చూచుచుండఁగనే సుశీలుని పితృదేవతలు నిజరూపములతో స్వర్గమునుండి దిగివచ్చిరి.

సుశీలుఁడు భక్తిశ్రద్ధలతో పితృదేవతలకుస్వాగతమిచ్చి అర్ఘ్యపాద్యాదికములు ఒసంగి పూజించి మృష్టాన్నతృప్తులంగావించి చందనతాంబూలాదులు ఒసంగి సత్కరించెను. పితృదేవతలునుచాలతృప్తులై జ్ఞానదేవునిఁ గొనియాడి సుశీలుని ఆశీర్వదించి వెడలిపోయిరి. ఈసంగతి ఊరివారు అందఱును తెలిసికొని వచ్చి తమ యపరాధమును క్షమింపవలయు నని జ్ఞానదేవాదులను అనేకవిధములు బ్రార్థించి అచ్చట వారు చేసిన అద్భుతకార్యములు అన్నియుఁ దెలుపుచు "వీరు బ్రాహ్మణులందెల్ల నుత్తములు" అని జాబు వ్రాసిఇచ్చిరి. జ్ఞానదేవుఁడు దానిని గైకొని తోఁబుట్టువులతో బయలుదేఱి మార్గమధ్యమున తురకవాని యింటికిఁ బోయి సమాధానపెట్టి తాను వేదమును జెప్పించిన మహిషమును వెంట దోలుకొని బయలుదేఱెను. మార్గమధ్యమున వారు అనేక పుణ్యక్షేత్రములను దర్శించిరి; గాని కొంతదూరము పోవునప్పటికి ఆ మహిషము చనిపోయెను. అంతట జ్ఞానదేవుఁడు దానిని సమాధిచేసి అలకాపురము సమీపించెను. అచ్చటివారెల్లరును వీరి అద్భుతకార్యములను అంతకుఁబూర్వమే వినియున్నారు; గావున ఎదురువచ్చి పురములోనికిఁ గొనిపోయి చాల గౌరవించిరి.

కొలఁదిదినములకు దీపావళ్యమావాస్య వచ్చెను. జ్ఞానదేవుఁడు చెల్లెలు అగు ముక్తాబాయికి "నేఁడు పండుగ గావున పిండివంటలు సేయుము" అని నియమించెను. అట్లే యని ఆమెసకలపదార్థములనుసమకూర్చుకొని క్రొత్తకుండలకొఱకు కుమ్మరవాని ఇంటికి బయలుదేఱెను. ఆయూర విసోబాకేశుఁడు అను ఒకధూర్తుఁడు ఉండెను. ఊరియందలి వారు యెల్లరును చాల గౌరవించుచున్నను జ్ఞానదేవాదులను వాఁడు మాత్రము చాల అసూయతోఁ జూచుచుండెడివాఁడు. వాఁడు ముక్తాబాయి కుమ్మరయింటికి బోవుచుండుటఁ గాంచి చెంతకుఁ బోయి సిగ్గులేనిదానా యని ఒక చెంపకాయ ఇచ్చి ఆమెకన్న ముందు కుమ్మరయింటికిబోయి, "ఈమెకు కుండలు ఈయవలదు. ఇచ్చితివేని నీవు నాకు ఈయవలసిన పైకము నిమిత్తము బాధపెట్టెదను" అని కుమ్మరవానిని

భయపెట్టెను. చేయునది లేక కుమ్మరవాఁడు ఆమెను కుండలు లేవు పొమ్మనెను. అంతట ఆమె ఏడ్చుచు ఇంటికిఁబోయి సంగతియంతయు జ్ఞానదేవునకుఁ దెలిపెను. ఆతఁడు "విసోబా కొట్టెనని గాని కుమ్మరి కుండలు లేవనియెనని గాని దుఃఖింపకుము. నీవు వండఁదలఁచికొనిన పిండివంటలు నావీఁపుమీఁద వండుము" అని పండుకొని జఠరాగ్నినిఁ బ్రజ్వలింపఁజేసి వీపు ఎఱ్ఱఁగాఁ గాలునట్లు చేసెను. ముక్తాబాయి అన్నయాజ్ఞప్రకారము ఆతని వీపుమీఁదనే పిండివంటలు తయారుచేసెను.

అంతయు నైన తరువాత అన్నదమ్ములు ముక్తాబాయియును సమస్తపదార్థములను శ్రీహరికి నివేదించి పిదపఁ దాము భుజించిరి. ఇది అంతయు చాటున నిలిచి చూచుచున్న విసోబాకేశుఁడు వారి వృత్తమును మాహాత్మ్యమును బాగుగఁ గుఱుతెఱిఁగి పశ్చాత్తాపపడి తిరిగి వారి సమక్షమునకు వచ్చి పాదములమీఁద వ్రాలి తన యపరాధమును అనేకవిధములు మన్నింపవలయు నని ప్రార్థించెను. జ్ఞానదేవుఁడును వాని పశ్చాత్తాపము హృదయపూర్వకమే యని గ్రహించి ఆనందముతో వానిని అభయము ఇచ్చి చేరదీసెను. విసోబాకేశుఁడు పిదప జ్ఞానదేవునివలన ఉపదేశమును పొంది మహాభక్తుఁడై ప్రకాశించెను.

భీమనదీతీరమున చాంగదేవుఁడు అను నొక భక్తుఁడు ఉండెను. ఆతఁడు బాల్యమునుండియు భగవద్భక్తి గలిగియున్న సజ్జనుఁడు. ఆతని నిష్ఠవలన ఏమి కావలయునన్న అది వెంటనే అయిపోవుచుండెడిది. అయినను ఆతనికి ఒక చింతకలిగెను. "నేను అనేకశిష్యులకు ఆచార్యుండనై యున్నాను; గాని నాకు ఆచార్యుఁడు లేఁడు; గావున నాజన్మసాఫల్యమును బడయలేదు. ఇప్పుడు అయినను ఆచార్యోపదేశమును బడసినఁగాని నేను తరింపను" అని చింతించి ఆతఁడు తనకుఁదగిన ఆచార్యుఁడు ఎవ్వఁడా యని యోచింపఁగా జ్ఞానదేవునికంటె అధికుఁడు ఎవఁడును గాన్పింపలేదు. ఆచార్యుఁడగుటకు జ్ఞానదేవుఁడే అర్హుఁడు అని తనకు నిశ్చయించుకొని ఆతఁడు ఆతనికి వర్తమానము పంపఁదలఁచి జాబువ్రాయుటకు కాగితమును కలమును చేతఁబట్టెను. చిరంజీవి అని వ్రాయుటకు జ్ఞానదేవుని అనంతజ్ఞానము అభ్యంతరముగా నుండెను. బ్రహ్మశ్రీ అనుటకు ఆతఁడు తనకంటె చిన్నవాఁడు. తాను ఒకమహాను

భావుఁడు అని పేరుపొందియు వేఱొకనిని బ్రహ్మశ్రీకి పాత్రునిగాఁ జేయుటకు ఆతని మనస్సు అంగీకరింపలేదు. తుదకు ఆతఁడు ఏమియు వ్రాయకయే వట్టికాగితమే చుట్టి శిష్యునకు ఇచ్చి జ్ఞానదేవునకుఁ బంపివేసెను. జ్ఞానదేవుఁడు అది జూచి సంగతులన్నియు గ్రహించుకొని ఆతనికి బుద్ధివచ్చునట్లు జాబువ్రాసి పంపెను. దానినిం జూచినవెంటనే చాంగదేవుఁడు పశ్చాత్తాపపడి బయలుదేఱి మార్గమధ్యమున అరణ్యములో నొకఫులి గాన్పింపఁగా దానిమీఁద నెక్కి పయనము సాగించెను. ఊరిబైట నున్నవారు కొందఱు ఈవృత్తాంతమును జ్ఞానదేవునకు విన్నవించిరి. అంతట నాతఁడు అన్నదమ్ములతోడను చెల్లెలితోడను ఒక గోడమీఁద నెక్కి "చాంగదేవునకు ఎదురుగాఁ బొమ్ము" అని దానికి ఆజ్ఞాపించెను. తోడనే గోడబయలుదేఱెను. చాంగదేవుఁడు ఇదిచూచి "క్రూరజంతువును స్వాధీనము చేసికొంటిని. అని నేనుగర్వించుచున్నానుగాని అచేతనపదార్థమును ఇట్లు నడుపఁగలనా?" అని కించపడి ఫులిని దిగి వానికి భూమిమీఁద వ్రాలి సాష్టాంగనమస్కారములు ఆచరించెను. జ్ఞానదేవుఁడు ఆతనిని లేవనెత్తి అభయము ఇచ్చెను.

ఒకనాఁడు చాంగదేవుఁడు ఇంటిలోనికిఁ బోవలయు నని తలుపు గెంటెను. తోడనే ఆతనికి ఎట్టయెదుట దిగంబరియైయున్న ముక్తాబాయి కాన్పించెను. అందులకు లజ్జించి ఆతఁడు వెనుదిరిగి పోవుచుండఁగా ముక్తాబాయి మఱలఁబిలిచి "నీవు మహాత్ముఁడ నని గర్వించుచున్నావు; గాని ప్రాపంచికభావములు నీకు ఇంకను పోలేదు. నీసంగతి కనిపెట్టవలయు నని నేను నీకు వివస్త్రనుగాఁ గాన్పించితిని. కాని నేను నిజముగా వివస్త్రను కాను" అని చెప్పి ఈవృత్తాంతము జ్ఞానదేవునకు ఎఱిఁగించెను. జ్ఞానదేవుఁడు అందులకుచింతించి ఆతనికి జ్ఞానోపదేశము చేసెను. అదిమొదలు చాంగదేవుఁడు జ్ఞానదేవునితో సమానుఁడుఅయి పోయెను. జ్ఞానదేవుఁడును ఆతని తోఁబుట్టువును బ్రతికి యున్నన్ని నాళ్లును అనేకులకు మోక్షమార్గమును జూపి అనేకాద్భుతకార్యములు చూపి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బొందిరి.

52. రామతీర్థ స్వామి.

పంజాబు దేశమునందలి గుజరాన్వాలా మండలమునఁగల మురళీవాలా యను గ్రామమున గోస్వామివంశజుఁడు అగు హీరానందుఁడు అను ఒక సద్బ్రాహ్మణుఁడు వంశపారంపర్యముగ వాసము చేయుచు ఉండెను. ఆ దేశాచారము ననుసరించి ఆతఁడు "హీరానందగోస్వామి" యని వ్యవహరింపఁబడుచుండెను. హిందీ భాషలో తులసీరామాయణము అను పేరున రామాయణమును వ్రాసిన తులసీదాసు హీరానందగోస్వామి వంశమువాఁడు. అట్టి సద్వంశమున అవతరించుటచే హీరానందుఁడుగూడ పెగనున్నదియుద్దె పూర్వుల ప్రతిష్ఠకు భంగము కలుగకుండ కాలము గడుపసాగెను. గొప్పవంశమువాఁడు అయినను హీరానందునకు దారిద్ర్యబాధ తప్పలేదు. ఆతనికి పంజాబుదేశమున అనేక స్థలములయందు అనేకశిష్యులు గలుగు ఆతఁడు అప్పుడప్పుడు సంచారము చేసి శిష్యులు సమర్పించిన స్వల్పధనముతో కుటుంబము నెట్లో నిర్వహించుకొనుచుండెను.

ఆతనికి ఇరువురు కుమారులు. జ్యేష్ఠునిపేరు గురుదాసగోస్వామి. కనిష్ఠునిపేరు తీర్థరామగోస్వామి. తీర్థరాముఁడు పుట్టిన కొలఁదిదినములయందే తల్లిని గోల్పోయెను. అగుటచే నాతనిని మేనత్త పెంపసాగెను. బాల్యమునందే తల్లినిఁ గోల్పోవుటచే నామె యాహారమునకు ఆవుపాలను అలవాటు చేసెను. ఈయలవాటుచొప్పున కాలక్రమమున నాతనికి ఆవుపాలనిన అధికప్రీతి గలిగెను. ఆ ప్రీతివలనను నాముర్థ్యమువలనను ఆతఁడు ఒక్కొక్కప్పుడు అయిదేసి సేర్లపాలనుగూడఁ ద్రాగుటకలదు. తండ్రి సంచారమునకు వెళ్లినపుడెల్ల గురుదాసగోస్వామి తమ్ముని రక్షణము చూచుచుండెను.

రామాయణము భారతము భాగవతము మున్నగుగ్రంథములు అనిన తీర్థరామునకు పరమప్రీతి. ఎక్కడనైన పురాణము చెప్పుచున్నారని వినినచో తీర్థరాముఁడు అచ్చటకుఁ బోయి అధికానందముతో వినుచుండెడివాఁడు. రాముఁడు కృష్ణుఁడు భీముఁడు మున్నగువారి చర్యల జదువునపుడు తీర్థరాముఁడు అనేకప్రశ్నలు వేసి వారిజీవితములందలి

ఘనతను దెలిసికొనుచుండెడివాఁడు. భాగవతము, భగవద్గీత మున్నగు వేదాంత గ్రంథములు చదువునపుడు ఆతఁడు "జీవుఁడు అనిన నేమి? పరమాత్మ యనిన నేమి? ఉభయులకును సంబంధ మెట్టిది? కర్మ అన నేమి? అది యెట్లువచ్చినది?" అని ఇట్లు విద్యాధికుఁడువోలె గొప్ప గొప్పప్రశ్నలు వేయుచుండెడివాఁడు.

ఈతీరునఁ గాలము గడచిపోవుచుండఁగా హీరానందగోస్వామి తీర్థరామునకు యుక్తసమయమున అక్షరాభ్యాసము గావించి పాఠశాలకుఁ బంపెను. శైశవమునఁ గూడ ఆతఁడు తోడిబాలురతో ఆటపాటలయందుఁ గాలముఁ బుచ్చక సర్వకాలసర్వావస్థలయందును ఏదో చదువుచునో, చింతనసేయుచునో, యోచించుచునో యుండుచుండును. ఇట్టి అచంచల శ్రద్ధతో విద్యాభ్యాసముచేయఁ దొడఁగుటవలన ఆతఁడు ఎల్లతరగతులయందును ఓటమి యనునది ఎఱుఁగక జయమందసాగెను. కొలఁదికాలమునందే ఆతనికి పాఠశాలావిద్య పూర్తి యయ్యెను. వ్యయాధిక్యమునకు ఓపఁజాలక హీరానందుఁడు తీర్థరాముని గలాశాలకుఁ బంపఁ దలంపకుండినను అన్నితరగతులయందును ప్రథముఁడుగా జయము పొందుచుండుటవలన విద్యార్థి వేతనము దొరకుటయుఁ దత్సాహాయ్యమున నాతఁడు కలాశాలయందుఁ జేరి ఉన్నతవిద్య నభ్యసింపసాగెను.

తీర్థరామునకు విద్యాసక్తియు ప్రతిభయు హెచ్చిపోసాగెను. గాని దారిద్ర్యము మాత్రము తొలఁగు నుపాయములు గానరావయ్యెను. రెండు లాగులును, ఒక చొక్కాయు ఒకతలగుడ్డయు మాత్రమే ఆతని ఉడుపులు. రెండు పూటలైనను గడుపునింపఁ గాకున్న అరగడుపుగానైనను భుజించుటకు ఆహారము లేకుండెను. రాత్రులయందు చదువుకొందమన్న తైలాభావముచే దీపము లేకుండ నుండెను. అయినను ఆతఁడు ఒకపూట అన్నమైన మాని ఆతఁడు అందులకు అగు ఖర్చుతో నూనె సంపాదించి దీపమును నిలిపి రాత్రులయందు చదువుకొనుచుండెను. అందఱును నిద్రించిన తరువాతఁ గాని ఆతఁడు ఎప్పుడును నిద్రించి యెఱుఁగడు. మఱియు అందఱును లేచునంతదనుక ఆతఁడు లేవకుండ నుండి యెఱుఁగఁడు. పగలుకూర్చున్నపుడేగాక నడుచునపుడు గూడ నాతనికి అదేపని గాని మఱియొకధ్యానము లేకుం

డెను. ఒకనాఁడు ఆతఁడు ఎచ్చటకో పోవుచుండియు నడుచుచున్నను పుస్తకము చదువుకొనుచుండెను. అది చూచి యొకఁడు "రామా, నడుచునపుడుగూడ చదువవలెనా? ఇది పాఠశాల గాదు; మార్గము" అని యడిగెను. అందులకు తీర్థరాముఁడు "నాకు విశ్వమంతయు పాఠశాలయే" అని బదులు చెప్పెను. ఆసమాధానమును విని లజ్జించి ఆతఁడు వెడలిపోయెను.

ఇట్లు ఆతఁడు విశేషపరిశ్రమ చేసి గణితశాస్త్రమును అభిమానముగాఁ గైకొని ఆతఁడు బి. ఏ., పరీక్షయందు పంజాబునందంతటను మొదటివాఁడుగా నెగ్గెను. మఱియు ఆశాస్త్రమునే అభిమానముగాఁ గైకొని ఎం, ఏపరీక్షలోఁ గూడ ఉత్తీర్ణుఁడయ్యెను. ఈతీరున ఆతఁడు ఇరువది సంవత్సరముల ప్రాయమున ఎం, ఏ పరీక్షలో విజయము గాంచి లోకమును ఆశ్చర్యసాగరమున ముంచివేసెను. అప్పటికి ఆతని దేహము అస్థిపంజర మయ్యెను. కన్నులు గుంటలు పడెను. ఇది అపాయకర మని తెలిసికొని పిదప ఆతఁడు ఆవుపాలను త్రావుట ప్రారంభించి దానితో గూడ వ్యాయామమును ప్రారంభించెను. అగుట నాతఁడు మఱలఁ గొలఁది దినములయందే పూర్ణముగ ఆరోగ్యమును బడసెను. ఇట్టి యనంత మగు ఉపకారము సేయుటవలన ఆతఁడు బ్రతికి ఉన్నంతకాలమును వ్యాయామమును విడిచి యెఱుఁగఁడు.

తీర్థరాముఁడు కలాశాలను విడిచిన వెంటనే ఆరోగ్యము నిమిత్తము వ్యాయామమును ప్రారంభించెను గదా? ఆతఁడు ఆరోగ్యమును బొందినవెంటనే ఆతఁడు చదివిన లాహోరు, ఫార్మన్, క్రిష్టియన్ కలాశాలలలో ప్రధానగణితశాస్త్రపండితుఁడుగా నియమింపఁబడెను. గణితశాస్త్రమున అనంతప్రావీణ్యమును, అంతములేని అభిమానమును గలవాఁడు గావున ఆతఁడు అనేకులను ఆశాస్త్రమున ఉత్తీర్ణులగునట్లు చేయఁబూని ఆప్రయత్నమునఁ గృతార్థుఁడు అయ్యెను. పట్టపరీక్షయందు మొదటివాఁడుగా జయమందినయాతఁడు ఇంగ్లాండు దేశమునకుఁ బోయి అచ్చటిగొప్పపరీక్షలకుఁ జదువఁగలుగుటకై పంజాబుదొరతనమువారు ఒక విద్యార్థివేతనమును ఏర్పఱిచిరి; అది తొలుత తీర్థరామునకు ఒసగఁ దలఁచిరి; గాని అంతలో నేకారణమువలననో అది యొక మహమ్మ

దీయవిద్యార్థికి ముట్టెను. తీర్థరాముఁడు చేసిన ప్రయత్నములలో ఇది యొకటిమాత్రమే విఫలమైనది.

తీర్థరాముఁడు బోధించుటలో అద్వితీయుఁడు. అందులకుఁదోడుగ నాతఁడు గణితశాస్త్రమున నిరుపముఁడు; గావున నాతఁడు ఉపాధ్యాయుఁడుగా నుండిన కలాశాలయందలి విద్యార్థులు చాల సంతృప్తులై యుండి ఆతని యెడల చాల భయభక్తులు చూపుచుండిరి. ఆతఁడు సంస్కృతము, హిందీ, ఉరుదు, పరిషియన్, ఇంగ్లీషు భాషలయందు అపార పాండిత్యమును సంపాదించెను. పంజాబీ ఆతని మాతృభాషయే గావున దానియందు ఆతఁడు అఖండవిద్వాంసుఁడు అని వేఱుగ వివరింపఁ బని లేదుగదా? ఆతఁడు ఈభాషలయందలి తత్త్వగ్రంథములను అన్నిటిని మిగుల శ్రద్ధగాఁ జదివి అందలి సారమును గ్రహించెను. అగుటచే ఆతని హృదయము మిగుల మిగుల విశాలమును భావములు మహోన్నతములును అగుట సంభవించెను.

తీర్థరాముఁడు కళాశాలలో ఉపాధ్యాయుఁడుగాఁ బ్రవేశించిన పిదప ఆతని భార్య కాపురమునకు వచ్చెను. ఆమెకుఁ దగిన భర్త తీర్థరాముఁడు. తీర్థరామునకుఁ దగిన భార్య ఆమె. ఇట్లు వారు అన్యోన్య ప్రణయముగలవారై అందఱును ఆశ్చర్యపడునట్లు గార్హస్థ్యమును నిర్వహింపసాగిరి. తీర్థరాముఁడు ఎంత వైభవపరాఙ్ముఖుఁడో ఆవిషయమున ఆమెయు అంత పరాఙ్ముఖియే. ఆతఁడు ఎంత నిష్కాముఁడో ఆమెయు నంత నిష్కామురాలు. వారికి ఇరువురికిని గూడ మోక్షమే కోరిక అయ్యెను. వారు దానిని బడఁగొట్టు పనులను గాని తలంపులను గాని దగ్గఱకురానిచ్చి ఎఱుఁగరు.

గృహస్థాశ్రమమున ఉన్నంతకాలమును తీర్థరాముఁడు అతిథిసత్కారమును అతిశ్రద్ధాభక్తులతో నెఱవేర్చెను. మఱియు నాతఁడు ఎప్పుడును తాను ఆత్మవిచారమునఁ బ్రవృత్తుఁడయి యుండుటయేగాక భార్యకుఁ గూడ ఆత్మానాత్మవివేకమును బోధించుచుండెను. ఆతఁడు కొన్నిదినములు ఆత్మసాక్షాత్కారము నిమిత్తము హిమాలయమునకు బోయి తదేకనిష్ఠతోఁ జర్చ గావించుచుండెడివాఁడు. ఇట్లు ఆతఁడు కొలఁది దినములు మాత్రమే పరిశ్రమ జేసి అచిరకాలమునందే సఫలమనోరథుఁడు అయ్యెను. మఱియు నాతఁడు పిదప రెండు సంవత్సర

ములు గృహస్థాశ్రమమునందే యుండి భార్యకు వైరాగ్యమును జ్ఞాన
మును బూర్తిగఁ గలిగించి పిదప సన్న్యాసాశ్రమమును స్వీకరించెను.
అప్పుడు ఆతఁడు రామతీర్థస్వామి అయ్యెను.

పిదప ఆతఁడు హిమాలయములకుఁ బయలుదేఱెను. మార్గమధ్య
మున నాతనికి ఒక్కమాఱుగ అయిదు ఎలుగుగొడ్లు ఎదురుపడెను.
గాని వానినిఁ జూచి ఆతఁడు ఏమియు జంకలేదు. నిర్భయముగా నాతఁడు
ముందునకు నడచిపోయెను ఎలుగుగొడ్లు తొలుత నాకింత కోపదృష్టు
లను బఱపెను. గాని పిదప స్వామిచెంతకు వచ్చి శిరములువంచి వెడలి
పోయెను. ఆతఁడు తిన్నగ పర్వతాగ్రమునకుఁ బోయెను. అచ్చట నొక
గుహ యుండెను. అందు భూతములు గలవు అనియు అచ్చటకుఁ బోవల
దనియు అచ్చటి కొండవాండ్రు చెప్పిరి గాని ఆతఁడు అందులకు లక్ష్య
పెట్టలేదు. నిశ్చింతతో నాతఁడు అందు వసించెను. ఒక్క భూతమైనను
ఆతనికిఁ గాన్పింపలేదు. అందు వృశ్చికములును ఆతనితోడఁ గూడి
వసించి యుండెను; గాని వానిని రామతీర్థుఁడు గాని అవి రామతీర్థునిఁ
గాని పరస్పరము పీడింప దలంచి యుండలేదు. ఒకప్పుడు ఆతఁడు పర్వ
తము దిగి క్రిందికి వచ్చి అచ్చట కొందఱు యోగులు కూర్చుండియుం
డఁగా వారిచెంతఁ గూర్చుండెను. ఇట్లు కొలఁదిగడియలు గడచిపోవున
ప్పటికి ఆతని జన్మగ్రామమునుండి ఒకఁడు అచ్చటకువచ్చి "నీకుమారుఁడు
చచ్చి పోయెను" అని చెప్పెను. అయిన నాకేమి? అని బదులు పలికి
రామతీర్థస్వామి అచ్చట నుండి వెడలిపోయెను.

ఆపోవుట పోవుట తిన్నగ నాతఁడు గంగోత్తరికిఁ బోయెను; గాని
అచ్చట స్వల్పకాలము మాత్రమే నిలిచి యమునోత్తరికిఁ బోయెను.
అయిన నచ్చట నాతనికి గంగోత్తరివియోగము దుర్భరమయ్యెను.
అగుట నాతఁడు వెంటనే గంగోత్తరికి మఱలెను. అచ్చటఁ గొన్నిదిన
ములు ఉండి సుమేరుపర్వతమునకుఁ దారి తీసెను. ఈప్రయాణమున
ఆతఁ డెంతో కష్టపడెను గాని పట్టినపట్టు విడువక గమ్యస్థానము
చేరుకొనెను. అక్కడ నుండి వసిష్ఠాశ్రమమునకు వెడలెను.

స్వామి మఱికొన్ని దినములకు ప్రపంచోద్ధరణమునకై అడవుల
నుండి మఱలెను. ఆతఁడు కొడియాకొండమీఁదనుండి డేరాడూను
నకు వచ్చి అక్కడ నుండి లక్నో కలకత్తాలు చేరి, కలకత్తాలో ఓడనెక్కి

జపాను దేశమునకుఁ బయలుదేఱెను. ఆ దేశములో స్వామి పదునైదుదిన ములు మాత్రమే యుండెను. ఈస్వల్పకాలమునందే స్వామి ప్రాచ్యవిజ్ఞాన గౌరవము వెల్లడియగునట్లు రెండు మహోపన్యాసముల నిచ్చుటయు జపానుపండితులు అనేకులు, అనంతమైన ఆతని సామర్థ్యమును దెలిసి కొని చాల గౌరవించి పత్రికలలోఁ బొగడుటయు ఆ దేశీయులు అంద ఱును స్వామి వైరాగ్యనిష్ఠకు పరమాశ్చర్యచకితులు అగుటయు జరి గెను. స్వామి అచ్చట నున్నంతకాలమును పిదప మఱికొన్ని నెలలును ఆ దేశీయులు స్వామిని గుఱించిన ప్రస్తావములతోడనే గడపివేసిరి.

అమెరికాలోఁ బ్రవేశించి స్వామి చేసినపని చాల గొప్పది. ఆతఁడు ఆ దేశీయులకు ఆర్యమతరహస్యముఁ దెలిపి దాని గౌరవము నెఱుంగఁ గలుగునట్లుచేసెను. వచ్చినవారికి అందఱకు తత్త్వము నుప దేశించి సంతృప్తహృదయులంగావించి ఆనందముఁ గొలుపుచుండెను. జీవాత్మనుగుఱించియు పరమాత్మనుగుఱించియు తమ తత్త్వశాస్త్రము ననుసరించి నిశ్చయజ్ఞానమును బడయని అమెరికా దేశీయులు అనేకులు స్వామివలన సందేహములను బాసి భారతీయుల తత్త్వవిచారము ఇంతటి యుత్కృష్టమైనదే! యని యాశ్చర్యపడసాగిరి.

స్వామిఅచ్చట ఈతీరున అనేకులనుభక్తిమార్గమునకుఁ దెచ్చెను. అమెరికావారి గ్రంథములు అనేకములు చదివెను. అచ్చట నాతఁడు ఇంగ్లీషుభాషలో కవనము ప్రారంభించెను. అది అత్యద్భుతముగా నున్నది; గాని ఆతఁడు చెప్పిన కవిత్వము అంతయు ఇంగ్లీషుభాషలోనే యున్నది. ఇట్టి యలౌకికశక్తుల నారసి ఆ దేశపు పత్రికాధిపతులు అనేకులు ఆతని మాహాత్మ్యములు వర్ణించి తమ పత్రికల నాతనికి పంపసాగిరి; గాని స్వామి "నాకు ఈకాగడ్తలతో నేమి పని?" అని ఆపత్రికలను విప్పకయే నదిలోఁబారవేయసాగెను. ఇట్టి అచంచల వైరాగ్యమును జూచి ఆ దేశీయులు మఱింత అబ్బురపడసాగిరి.

ఒకప్పుడు అమెరికా దేశపాలకుఁడు స్వామిని దర్శింప వచ్చెను. అప్పుడు గొప్ప ఉత్సవము అయ్యెను. రామతీర్థస్వామి వసించియున్న ప్రదేశము ఒక స్త్రీ యధికారముక్రిందనుండెను. ఆమె యాపాలకునకు మిగుల మర్యాద గావించి స్వామి దర్శనము చేయించెను. ఆపాలకుఁడు చాలభక్తిశ్రద్ధలతో సాష్టాంగనమస్కారములు ఆచరించినపుడు స్వామి

ఆదరముతో లేవనెత్తి దీవించి తాను రచియించియున్న "భారతీయుల కొఱకు ఒకవిన్నపము" అనుపుస్తకమును ఇచ్చెను. దానిని ఆపాలకుఁడు ఎంతో ఆదరముతోఁ గైకొని చాల ఆనందముతోఁ బఠించెను.

పిదప స్వామి అమెరికాదేశమందలి పెద్దపెద్ద నగరములు అన్నియుఁ జూచెను. అంతటను ఆర్యమతమును బోధించెను. అనేకస్థలములయందు వేదాంతసమాజములను స్థాపించెను. ఈకాలమున "సెంటులూయి" అను నగరమున "విశ్వైక్యమత్యసభ" అను ఒక గొప్పసభ మూఁడుదినములు జరిగెను. అందలివిశేషము ఏమనఁగా: ఆసభకుస్వామి మొదటిదినమున అగ్రాసనాధిపత్యము వహించెను. తక్కినదినములలో ఆర్యమతమును గుఱించి చక్కని ఉపన్యాసము లిచ్చి సభకు వచ్చినవారికి అందఱకును నిశ్చేష్టతను గొలిపెను. పిదప ఆదేశమున కొలఁది దినములు ఉండి జిబ్రాల్టరునకు బయలుదేఱెను.

జిబ్రాల్టరునుండి స్వామి ఈజిప్టునకు బయలుదేఱెను. ఆదేశీయులు అగు మహమ్మదీయులు ఆతని మాహాత్మ్యమును దెలిసికొని ఆతఁడు మహమ్మదు యొక్క అపరావతారము అని భావించి విశేషముగ సన్మానించిరి. స్వామి అచ్చటి మసీదులలో అనేకస్థలములయందు పరిషియని భాషలో అనేకోపన్యాసములు ఇచ్చి వారికి ముక్తిమార్గమునుజూపెను. అచ్చటి పత్రికలు అన్నియు ఆతనిని విశేషముగఁ గొనియాడెను. పిదప స్వామి భారతదేశమునకు బయలుదేఱెను.

భారతదేశములో ఆతఁడు అనేకస్థలములయందు ఉపన్యాసము లిచ్చెను. దేశము అంతయు దిరిగె ననిచెప్పవచ్చును. ఈసంచారము అయినతరువాత ఆతఁడు మఱల గంగోత్తరి మున్నగుపుణ్యస్థలములను దర్శించి కాశికి వచ్చి గంగలో స్నానము చేయుచు మునిఁగిపోయెను. మఱల నాతని శరీరమును జూచినవా రెవ్వరును లేరు. ఈతీరున స్వామి పరమాత్మలో నైక్యమైపోయెను.

53. వివేకానందస్వామి.

కలకత్తానగరమునకు సమీపమున నున్న శిమూలియా యను పల్లెయందు విశ్వనాథదత్తుఁడు అను నొక కాయస్థుడు ఉండెను. ఆతఁడు పెద్దపెరిగిన తరువాత కలకత్తాలో న్యాయవాదిగాఁ బ్రవేశించెను. ఆతనికి ధనలోపమును సౌఖ్యలోపమును గలుగలేదు; గాని సంతానము లేకపోవుటచే ఆనందలోపముమాత్రము సంభవించెను. దానికై యాతఁడు అనేకప్రయత్నములను గావించి తుదకు కాశీయాత్రకుఁ బోయి వచ్చెను. తద్యాత్రాఫలముగ వచ్చిన కొలఁదిదినములకే ఆతని భార్య గర్భవతియై నవమాసములు మోసి ఒకకుమారునిఁ గనియెను.

తల్లిదండ్రులు ఆబిడ్డను నరేంద్రుఁడు అనిపేరుపెట్టి చాలగారాబముగాఁ బెంచుకొనుచుండిరి. ఆతఁడు చాల చురుకైన బాలుఁడు. మాటలు వచ్చినదిమొదలు ఆబాలుఁడు చూపిన తెలివితేటలనుజూచి ఇరుగుపొరుగువారు అందఱును ఆశ్చర్యపడుచుండిరి. ఇట్లుండగా విశ్వనాథదత్తుఁడు యుక్తకాలమున అక్షరాభ్యాసముచేసి కుమారుని పాఠశాలకుఁ బంపెను.

పాఠశాలలో నరేంద్రుఁడు ఎప్పుడును తన తరగతిలో అగ్రపీఠమునే అధిష్ఠించుచుండువాఁడు. యుక్తసమయమున ఆతఁడు ఇంగ్లీషు గూడ ప్రారంభించి ఏతరగతియందును దేలిపోక క్రమముగా బి.యే. పరీక్షలో నుత్తీర్ణుఁడు అయ్యెను. ఆతనికి తత్త్వశాస్త్రము అభిమానము అగుటచే ఆతఁడు హెర్బర్టుస్పెన్సరు మున్నగు ఆంగ్లేయులు వ్రాసిన తత్త్వశాస్త్రగ్రంథములు అనేకములు పఠించెను; గాని ఆతనికిఁ దృప్తి గలుగలేదు. ఆగ్రంథములయందు ఆతనికి ఏమియు పస గాన్పింపలేదు. ఆగ్రంథములమీఁద ఆతఁడు అనేకపూర్వపక్షములు చేసెను. హెర్బర్టుస్పెన్సరు నరేంద్రుఁడు తనగ్రంథములయెడలఁ జేసిన పూర్వపక్షములను విమర్శింపఁజాలక వానిని అంగీకరించి నరేంద్రునకు భారతీయుల వేదాంతం శాస్త్రము జదువునట్లుప్రోత్సాహమునిచ్చెను; గాని నరేంద్రుఁడు అప్పుడు నవనవలాడుచు కొనలుసాగుచున్న బ్రహ్మసమాజమువలన ఆకర్షింపఁబడి అందుఁ బ్రవేశించెను. అయినను ఆతని సందియములు తీరలేదు. తత్త్వము తెలియునప్పటికి నరేంద్రునకు బ్రహ్మసమాజమతముమీఁద ఏవగలిగెను.

వివేకానందస్వామి.

భ_క్త :—472

అది మొదలుకొని ఆతఁడు పరమాత్మను దెలిసికొను ఉపాయములు అన్వేషింపసాగెను.

ఆతని పినతండ్రి ఆతని భావములను ఎప్పటికి అప్పుడే గ్రహించుచుండెను. ఆతని గురువు శ్రీరామకృష్ణపరమహంసుఁడు, తన గురువు కంటె మహాత్ముఁడు మఱిలేఁడు అని ఆతని భావము. అగుటచే నాతఁడు "పిల్లవాఁడు దారిలోనికి వచ్చుచున్నాఁడు" అనితలంచి నరేంద్రునిఁ జేరఁబిలిచి "వత్సా, నీభావమును నేను గ్రహించితిని. నీయాందోళనము నాకుఁ దెలియును. కాశీఘట్టమున నాగురుదేవుఁడు కలఁడు. ఆతఁడు నీసందియములను బాపి నీహృదయమునకు శాంతిని సంఘటింపఁ జేయఁ గలఁడు. నాతో వచ్చెదవేని మేలు అగును" అని చెప్పెను. అందులకు అంగీకరించి నరేంద్రుఁడు పినతండ్రితో రామకృష్ణునిచెంతకుఁబోయెను.

వందనాదులు ముగిసిన పిదప రామకృష్ణుఁడు నరేంద్రుని ముఖవర్చస్సుఁ జూచి "ఈతఁడు మహాపురుషుఁడు అగును" అనిభావించెను. అప్పుడు నరేంద్రుని స్థితిగతులను ఆతని పినతండ్రి స్వామికి ఎఱింగించి "ఈబాలుని ఉద్ధరింపవలయును" అని ప్రార్థించెను. స్వామి అంగీకరించిన తరువాత నరేంద్రుఁడు "స్వామీ, రేపు మఱల నేనొక్కఁడను వచ్చెదను. ఏకాంతదర్శనము గోరుచున్నాను" అని సెలవు అడిగెను. స్వామి సల్లెయనెను. నరేంద్రుఁడు వెడలిపోయెను.

అనిన సమయమునకు నరేంద్రుఁడు మఱునాఁడు స్వామిచెంతకుఁ బోయెను. వందనాశీర్వచనములు ముగిసిన పిదప స్వామి నరేంద్రునిఁ గూర్చుండ నియమించి ఆతని ప్రశ్నలకు చక్కని సమాధానములు ఇచ్చెను. నాఁటితో నరేంద్రుఁడు "పట్టుకొమ్మ దొరకినది" అని ధైర్యము వహించి కొలఁది దినములయందే తన సందియములను బాసెను. స్వామి ఆతనికి భారతవేదాంతరహస్యములను అన్నిఁటిని కరతలామలకముగ బోధించెను. నరేంద్రునకుఁ బూర్తిగఁ దృప్తి యయ్యెను.

కొన్నిదినములకు రామకృష్ణుఁడు ఈశ్వరసాయుజ్యమును బడసెను. ఆతనిశిష్యులు అందఱును తమ గురుదేవుని యుపదేశములను లోకమునందు అంతటను వెల్లడింపవలయునని తలంచిరి. ఎవరెన్ని అభ్యంతరములు చూపినను వారు ఆప్రయత్నములనుమాన లేదు. వారియందెల్ల మన నరేంద్రుఁడు ప్రథముఁడు; ముఖ్యుఁడు. రామకృష్ణుని

మార్గము సంసారులు త్రొక్కుట కనువుగాదు; గావున వెంటనే సన్న్యసించి నరేంద్రుఁడు వివేకానందస్వామి యను పేరు ధరించి తలిదండ్రులకు నమస్కరించి హిమవత్పర్వతమునకుఁ బోయెను.

ఇదిమొదలు మనము నరేంద్రుని వివేకానందుఁడని పిలిచెదము. అచ్చట నాతఁడు ఆఱుసంవత్సరములు తదేకదీక్షతో తపస్సు చేసి పరమాత్మను దెలిసికొని "జన్మము తరించినది" అని పరమానందమును గాంచి అక్కడనుండి టిబెట్టుదేశమునకుఁ బోయెను. ఆదేశము మతము బౌద్ధము. వివేకానందుఁడుబౌద్ధమతరహస్యములనుబూర్తిగాగ్రహించి స్వదేశమునకు మఱలెను. అతఁడు మొదట ఖత్రి అను సంస్థానమునకు బోయి అచ్చటిరాజును దన శిష్యునిఁగా జేసికొని బయలుదేఱి కొన్ని దినములకు తిరువాన్కూరు వచ్చి అచ్చటినుండి చెన్నపట్టణము చేరికొనెను. వెళ్ళిన చోటులందెల్ల నాతనికి విశేషసమ్మానము జరుగుచుండెను. చెన్నపట్టణములోఁ గూడ నాతనికి జాల సమ్మానము జరిగెను.

అమెరికాఖండమునందలి చికాగో అను నగరమున ప్రపంచమునఁగల సకలమతములకును సంబంధించిన ఒక సభజరుగును అని ప్రకటింపఁబడెను. అప్పుడు చెన్నపట్టణమునందలి ముఖ్యపౌరులును మఱికొందఱు సంస్థానాధిపతులును ఆర్యమతప్రతినిధిగా వివేకానందుని ఆసభకుఁ బంపఁదలఁచి ఆతని యభిప్రాయము నడిగిరి. అందుల కాతఁడంగీకరించెను. తోడనే తగినంతధనము సమకూర్చి వారు ఆతనికి సెలవు ఇచ్చిరి.

వివేకానందుఁడు సభకుఁ జాలదినములకుఁబూర్వము అమెరికా చేరుకొనియెను. ఆతఁడు అచ్చటి సంగతులు తెలిసికొనఁగోరి దేశము అంతయుఁ దిరుగఁజొచ్చెను. ఈ సంచారమువలన ఆతని చేతనున్న ధనము అయిపోయెను. అప్పుడు ఆతఁడు రెండుమూఁడుదినములు పస్తుపడి యుండవలసి వచ్చెను. ఇట్టిస్థితిలో నాతఁడు బోస్టను పట్టణపరిసరముననున్న ఒక పల్లెటూరి వీథిలో నడచిపోవుచుండఁగా అన్నాభావము వలన కృశించి ముఖము కళావిహీనమైయున్నను ఆతఁడుధరించిన కావి వస్త్రములను ఆతని మేని చాయనుజూచి యొకవృద్ధాంగన తన ఇంటికిఁ గొనిపోయి అన్నంబిడి ఆదరించెను. ఆసమయమున వివేకానందుఁడు తన సంగతి అంతయు ఆమెకు ఎఱింగించెను. అత్యద్భుతమైన ఈసమా

చారమును విని అబ్బురపడి ఆవృద్ధవనిత ఆగ్రామమున ఉన్న ఒక తత్వశాస్త్రపండితునివద్దకుఁ గొనిపోయి ఆతనిని విడిచెను. అంతట తత్వజ్ఞునకును వివేకానందునకును వాదము పొసఁగెను. తుదకు సమాధానము చెప్పలేక తత్వజ్ఞుఁడు వివేకానందుని సామర్థ్యమును గొనియాడి ఆతనిని వెంట నిడుకొని ఆమహాసభకుఁ బోయి అధ్యక్షునకుఁ బరిచయముచేసెను. అధ్యక్షుఁడు అగు డాక్టరుబారోసు వివేకానందుని ఆర్యమత ప్రతినిధిగా నంగీకరించెను.

సభ ప్రారంభము అయ్యెను. తమతమ మతమును గుఱించి కొందఱు ఉపన్యసించినతరువాత అధ్యక్షుఁడు ఆర్యమతమును గుఱించి యుపన్యసించుటకు వివేకానందస్వామికి అనుజ్ఞ ఇచ్చెను.

తోడనే వివేకానందుఁడు లేచి నిలిచెను. ఆతని విగ్రహమును జూచి అందఱును ఆశ్చర్యపడిరి. ఇంతలో ఆతఁడు ఉపన్యాసము ప్రారంభించెను.సభలోనివారికి అంతయు నూతనముగను ఆప్యాయకరముగను దోఁచెను. వారు బొమ్మలవలె చేష్టలుడిగి వినసాగిరి. "నీకిచ్చిన వ్యవధి ముగిసినది" అని చెప్పుటకు అధ్యక్షునకు నోరాడలేదు. అతఁడు గూడ ప్రతిమాకారము వహించెను. ఆతని వాగ్ధాటి గంగాప్రవాహమువలె నిరర్గళముగ నుండెను. విషయనిరూపణము అరఁటిపం డొలిచి చేతఁ బెట్టినట్లు ఉండెను. విమర్శనాపద్ధతి అద్దములో వస్తువులను జూపినట్లు ఉండెను. కంఠస్వరము అన్నిఁటిని మించినమాధుర్యము నీనుచుండెను. "మన దేశీయుఁడుగూడ మన భాషలో నిట్లు మాటలాడఁజాలఁడు" అని అచ్చటి అమెరికావారు తలంపసాగిరి. ఈకారణమువలన నాతఁడు అపుడు చాలతడవు ఉపన్యసించెను. సభలోనివారు అందఱు అత్యాశ్చర్యపడిరి.

అదిమొదలు ఆతని వెంట అనేకులు బయలుదేఱిరి. అనేకసంగములలో నుపన్యసించుటకు ఆతఁడు ఆహ్వానింపఁబడెను. ఆతఁడు అనేకోపన్యాసములు ఇచ్చెను. అనేకులు ఆతనికి శిష్యులైరి. వారందఱును భారతీయుల నామములను ధరింపసాగిరి. శివవిష్ణ్వాలయములు ఆ దేశములో వెలసెను. శిష్యులు ముఖమున తిలకము ధరింపఁ బ్రారంభించిరి. గాయత్రీజపము ప్రారంభించిరి.

ఇట్లు అమెరికాదేశీయులను భారతీయులనుగాఁ జేయుచువివేకానందుఁడు ఆదేశమున ఒక సంవత్సరము ఉండి అక్కడనుండి ఇంగ్లాండునకు బయలుదేఱెను. అమెరికావారు ఆతనిని విడుచుటకు మిగుల దుఃఖించిరి. ఇంగ్లాండువారు అట్టి మహాత్ముఁడు తమ దేశమునకు వచ్చినందులకు పరమానందభరితులై ఆతనినిఁ జాల నాదరించిరి. అచ్చట స్వామి మూఁడుమాసములు మాత్రమే యుండెను. ఈస్వల్పకాలమునందే ఆతఁడు అనేకస్థలములయందు అనేకోపన్యాసములను గావించెను. ఆంగ్లేయులు గూడ కొంతమంది ఆతనికి శిష్యులైరి. మాక్సుముల్లరు అనుగొప్ప పండితునితో మాటాడి ఆతనికి రామకృష్ణపరమహంస జీవిత చరిత్రమును వ్రాయుటకు నియమించి "మార్గరెట్టునోబులు" అను నారీమణితో వివేకానందుఁడు స్వదేశమునకు మఱలెను.

ఆతఁడు సింహళద్వీపమునందలికొలంబోనగరమున ఓడ దిగెను. ఆనాఁడు ఆపట్టణము స్వర్గమువలె ప్రకాశించె . ఆనగరమునందలిభారతీయప్రముఖులు అనేకులు నౌకాశ్రయమునకుఁ బోయి స్వాగతమిచ్చి పుష్పహారములతో నలంకరించి మహావైభవముతో నగరములోనికిఁ గొనివచ్చిరి. అచ్చట స్వామి కొన్ని యుపన్యాసములు గావించి వారి అజ్ఞానాంధకారమును బాపెను.

అక్కడనుండి ఆతఁడు చెన్నపట్టణము వచ్చెను. ఆతఁడు ఎగ్మూరు మజిలీలో పొగబండి దిగినవెంటనే అంతకుఁ బూర్వము అచ్చట వేచియున్న ప్రధానన్యాయస్థానమందలి న్యాయాధికారులుమున్నగు గొప్ప యుద్యోగులును తక్కుంగల పౌరప్రముఖులును పూలదండలతో నలంకరించి అపూర్వోత్సవముతో నగరములోనికిఁ గొనివచ్చి విడియించిరి. నాఁటిసాయంకాలమున వివేకానందుఁడు పురమందిరము బైట మహోపన్యాసము చేసి చెన్నపట్టణవాసుల నానందపఱిచెను. మఱికొన్నిదినములు చెన్నపట్టణమున ఉండి ఇంకొకకొన్ని ఉపన్యాసములుఇచ్చి పిదప జన్మదేశము అగుకలకత్తానగరమునకు బయలుదేఱెను.

కలకత్తానగరమునఁగూడ వివేకానందునకు జరిగిన గౌరవము అభూతపూర్వము. ఇది యంతయు నైనతరువాత ఆతఁడు భారతజాతి నుద్ధరించు ప్రయత్నములను ప్రారంభించెను. ఈప్రయత్నమున ఆతఁడు

నిద్రాహారములు ఎఱుఁగఁడు. ఆతఁడు అనేకస్థలములయందు మఠములను స్థాపించి అనేకపాఠశాలలను నెలకొల్పెను. ఇంతలో సాతత్యంబగు నిట్టి పరిశ్రమవలన వివేకానందుని దేహారోగ్యము చెడెను.

వైద్యులు పరీక్షించి ఇఁక నొక తడవ అమెరికాకును ఇంగ్లాండునకును బోయివచ్చుట లెస్స అని చెప్పిరి. వారి ఆలోచన ననుసరించి మఱల వివేకానందుఁడు ఆఖండములకుఁ బోయెను. అమెరికాయు ఇంగ్లాండును ఆనందసాగరమున మునిఁగిపోయెను. వివేకానందుని జాడ్యముగూడఁ గుదిరిపోయెను. ఈపర్యాయముగూడ ఆతఁడు అనేకస్థలములయందు ఆశ్రమములను స్థాపించెను.

ఆతఁడు అక్కడనుండి బయలుదేఱి ఫ్రెంచిదేశమునకుఁ బోయి అచ్చట జరిగిన మతసభలో ఫ్రెంచిభాషలో నుపన్యాస మిచ్చి భారతమతగౌరవమును బోధించెను. పారిసులో నుండఁగా మఱల నాతని యారోగ్యమునకు భంగము గలిగెను. ఈస్థితియందే ఆతఁడు స్వదేశోన్ముఖుఁడు అయ్యెను.

స్వదేశము చేరినపిదప వైద్యులు విశ్రాంతిని బుచ్చుకొనవలయునని చాల గట్టిగాఁ జెప్పిరి; గాని ఆతఁడు దేశము నుద్ధరించుదీక్షను విడువఁజాలక వైద్యుల సలహాలను బెడచెవినిఁ బెట్టెను. మఱల నాతఁడు స్వదేశమునఁ బని ప్రారంభించెను.

ఇట్లుండఁగా "తమ శమునకు ఒక మాఱు వచ్చిపోవలసినది" అని జపానుదేశమునందలి ప్రముఖులు వివేకానందస్వామిని ఆహ్వానించిరి. గాని అనారోగ్యకారణమున ఆతఁడు వారి కోరికను నిరాకరించెను. ఆతఁడు తనశక్తులను అన్నిటిని భారతదేశమునిమిత్తము ధారపోసెను ఒకనాఁడుఉదయమున శిష్యులకు పాణినిసూత్రములనుబోధించి సాయంకాలమున ఉపనిషద్భాష్యమును బోధించి ఎవరికినిఁ దెలియకుండ రాత్రి సమాధిలో భౌతికదేహము విడిచి ఈశ్వరసాయుజ్యముఁ బడసె.



54. వేమన్న.

కొండవీడు రాజధానిలో ప్రభుత్వము సేయుచున్న కోమటి వేమారెడ్డి చాల యోగ్యుఁడు అనియు దక్షుఁడు అనియుఁ బేరుపొందియుండెను. ఆతనికి వేమన్న అను ఒక సోదరుఁడు ఉండెను. వేమన్న చిన్నతనమునుండియు అన్నమాటను లక్ష్యపెట్టక అల్లరిచిల్లరిగా తిరుగుచుండెడివాఁడు. మహారాజు తమ్ముఁడు అగుటవలన ఆతని కేవిషయమునను లోపమును ఎందును అభ్యంతరమును లేకుండెను. వేమన్నకు అన్నగారియెడల భయమంతగా లేకున్నను వదినెయగు సరసమ్మయెడల చాల భయభక్తులు గలవు.

కాలక్రమమున వేమన్న ఒక భోగముదానిని ఉంచుకొనెను. కొంతకాలము మాత్రము బెట్టుసరిగా నుండెను; గాని వేమన్న తుదకు దాని దాసుఁడు అయిపోయెను. అది యేపని చేయుమన్నను చేయుటకు సంకోచించుటలేదు. ఇది యంతయుఁ గనిపెట్టి వారకాంత ఆతనిని బొంగరమువలె త్రిప్పుచుండెను.

ఒకనాఁడు ఆవారకాంత వేమన్న ఆనందసాగరమున మునిఁగి యున్నప్పుడు "ప్రియుఁడా, నాకొక కోరికపొడమినది. నీవుతక్క నాకు అన్యథాశరణము లేదుకదా? సతికి పతివలని తీరనిది ఉండదు. కావుననే కోరుచున్నాను. మాఱుపల్కక తీర్చెద నందువేని చెప్పెదను" అని యెను. వేమన్న తీర్చెద చెప్పు మనఁగా వారకాంత "నీవదినెగారు ధరించుచున్న నగలను ధరింపఁ గోరిక పుట్టినది. దయయుంచి తెచ్చి పెట్టెదవా?" అని పలికెను. వేమన్న మాఱుపలుకక వల్లె యని అంగీకరించి అప్పుడేబయలుదేఱిపోయి మార్గమధ్యమున "ఈకోరికను ఆసాధ్వి మఱిశా నేనుని చెప్పుదును" అని సందేహించుచునే పోయి మనసు రాయి చేసికొని నరసమ్మ "పాదముల మీఁద వ్రాలెను. అంతట రాణి యగు నరసమ్మ "వేమన్నజీవితమున నేదో మార్పు కలిగినది" అని యానందించుచు లేవనెత్తి "వత్సా, విశేషములు ఏ"మని యడిగెను; గాని వేమన్న మఱల నామె పాదముల మీఁద వ్రాలి "తల్లీ, నీకంటె నాకు శరణము లేదు. తల్లి తన బిడ్డని కోరికలు తీర్పకుండ నుండదు. నాకొక కోరిక గలదు. అది తీర్చెద నను నంత దనుక నీపాదములను విడువను" అనిపలికెను. "సంకోచింపకచెప్పుము" అని నరసమ్మ పలికిన వెంటనే వేమన్న తెలుపలేక తెలుపలేక తన వారకాంత యభిలాష నెఱింగించెను. అది విని నరసమ్మ "బుద్ధి ఇంకను తిరుగ లేదు"అని నిశ్చయించుకొనియు లేవనెత్తి "వత్సా, ఇంతమాత్రమునకు ఇంత బెంగయేల! ఇదే ఇచ్చెద పుచ్చుకొనుము"అని ఒక అడ్డబాస తక్క తన యొడలిమీఁది తక్కి నగలనన్నిఁటిని ఒలిచి ఇచ్చి పంపివేసెను. అంతట వేమన్న నరసమ్మకు మఱియొకమాఱు మ్రొక్కి వారకాంత ఇంటికిఁ బోయెను.

వారకాంత వేమన నెంతో యాదరించెను. ఆయాదరమునకుఁ బొంగిపోయి ఆతఁడు తాను తెచ్చిన నగలను ఇచ్చెను. వారకాంత అన్నియు నుండుటయు అడ్డబాస లేకపోవుటయుఁజూచి "ప్రియుఁడా, ఆఁడువారికోరికలు అద్భుతములుగా నుండును.నీవు నాయభిలాషను వెంటనే తీర్చితివి.నీవదినెనగలు అన్నియు తెచ్చితివి;గాని ఒక వస్తువు మఱచితివి. రూపమునను వెలయందును అది అన్నిటికంటె చిన్నదియేగాని అదియొక్కటియు అనేకలక్షల వెలచేయు ఈనగలకు అన్నిటికిని సమానము.

అది లేకున్న స్త్రీలకు ఆనందము ఉండదు. అది యేమందువా? నీవు తేకుండుటచే దానిని గుఱించి ఇంత చెప్పవలసివచ్చినది; గాని లేకున్న అవసరము లేదు. దాని పేరు అడ్డబాస. అదికూడ తెచ్చిపెట్టవా?" అని బుజ్జగించుచు అడిగెను.

వేమన్న ఈలాలనకుఁ బొంగిపోయెను. వుఱల వెంటనే ఆతఁడు ఇంటికిఁ బోయెను; గాని వదినెగారి ముఖముఁ జూచుటకు సంకోచము కలిగెను. అక్కడ తన ఆతఁడు చేయునదిలేక తన కొఱకు ఏర్పఱుపఁబడిన పడకయింటిలోనికిఁ బోయి దుప్పటి ముసుఁగువేసికొని పండుకొనెను. నరసమ్మ భోజనసమయమున వేమన్న రాకుండుటను జూచి వెదకికొని రావలసినదని దాసీలకు ఆజ్ఞాపించెను. దాసీలు వచ్చిపిలిచిరి; గాని వేమన్న వారికిజవాబుచెప్పలేదు. వారుపోయి నరసమ్మకు ఆవృత్తాంతము నెఱింగించిరి. అంతటనరసమ్మస్వయముగబయలుదేఱివచ్చి "నాయనా! ఇట్లేల పండుకొంటివోయీ" అని బుజ్జగించుచు నడిగెను. వేమన్న ఆమె స్వయముగా వచ్చుటకాంచి కొంతతడవు లజ్జించి తుదకు సంగతియంతయు నెఱింగించెను.

అంతట నరసమ్మ "వెఱ్ఱివాఁడా, ఇంతమాత్రమునకే తలకట్టుకొని పండుకొనవలయునా? అన్నివస్తువులనడిగినట్లు ఇది యేల అడుగవైతివి? అన్నియు నిచ్చినట్లు ఇదిమాత్రము నేను ఈయనా? నాయనా! విచారము మానుము; గాని నాకొక్క మాట ఇమ్ము. ఈఅడ్డబాసనునీప్రియురాలు ముక్కునకు అలంకరించుకొని తరువాత ఆమెను నగ్నను గావించి దేహమంతయుఁజూడవలయును. అట్లుగాకున్న నీయన్నగారి ఆనగలదు" అని పలికెను. వేమన్న అందులకు అంగీకరించెను. నరసమ్మ వెంటనే అడ్డబాస తీసి మఱఁది కిచ్చివేసెను.

అంతట వేమన్న ఒక దూకున వారకాంత ఇల్లుసేరుకొనెను. ఆతని యుత్సాహమును జూచి వారకాంత తన కోరిక నెఱవేఱినదని గ్రహించి ముసిముసినవ్వులతో నెదురేఁగి గాఁగిటఁ గదియించి తెచ్చి ఆసనమునఁ గూర్చుండఁ జేసి మర్యాదలు చేయసాగెను. వేమన్న అపుడు అడ్డబాస దానికి ఇచ్చివేసి వదినెగారు చెప్పిన విషయమును మనసునందు ఉంచుకొని ఆప్రకారమేచేసెను. తోడనే ఆతనికి విషయ సౌఖ్యములమీఁద రోఁత పుట్టెను. ఇఁకఒక్కక్షణమైన అచ్చటనుండక

ఆతఁడు తిన్నగ ఇంటికిఁబోయి వదినెగారి పాదములమీఁద వ్రాలి "తల్లీ, కోటిజన్మము లెత్తియు నీఋణము తీర్చుకొనఁజాలను. కుంభీపాకనరకమునఁ గూలిపోవుచున్న నన్ను ఉద్ధరించుటకు నాతల్లివి అగు నీవే తగుదువు" అని యనేకవిధములఁ గొనియాడెను.

పిదప క్రమక్రమముగ నాతనికి సంసారముమీఁది విరక్తి పెరిగిపోయెను. ఇంతలో నొకయోగీశ్వరుఁడు ఆతనికిఁ గాన్పించెను. యోగి తనయెడల వేమన్న చూపుచున్న భక్తిశ్రద్ధలకు మెచ్చి ఆతనికి జ్ఞానోపదేశమును మంత్రోపదేశమును గావించెను. తోడనే వేమన్నకు ప్రపంచమును తత్త్వము కరతలామలకముగఁ దెలిసిపోయెను అప్పుడే ఆతఁడు ఇల్లువిడిచి నిర్జనస్థలమునకుఁ బోయెను. యోగి కరుణావలన అఖండకవితాధారగ నొదవెను. అంతట వేమన్న తన యఖండజ్ఞానలహరిని అద్వితీయకవితావాహినితో నేకముచేసి ఆంధ్రజాతిపైఁ బ్రవహింపఁజేసెను. పిదపఁ గొన్నిదినములకాతఁడు ఈశ్వరసాయుజ్యమును బడసెను. గాని తక్కినవారివలెఁ గాక ఆతఁడు ఇప్పటికిని ఆంధ్రజాతిలో జీవించియే యున్నాఁడు.

---

55. తరికుండ వెంకమ్మ.

శ్లో. "హే గోపాలక హే కృపాజలనిధే హే సింధుకన్యాపతే
హే కంసాంతక హే గజేంద్ర కరుణాపారీణ హే మాధవ,
హే రామానుజ హే జగత్త్రయగురో హే పుండరీకాక్ష మాం
హే గోపీజననాథ పాలయ పరం జానామి న త్వాం వినా." (ముకుందమాల.)

పూర్వకాలమందు ఒకప్పుడు ఆంధ్రదేశమున జనులను మాడ్చి వేయు క్షామము సంభవించెను. అగుట దేశమునం గలిజను లందఱు 'అన్నమో రామచంద్రా' అనుచు నానాదేశములకు బయలు దేఱుచుండిరి. రాచదుర్గము అను ఒక గ్రామమునందున్న జనులును కూటికి లేక మలమల మాడుచు గొడ్డుగోదల వెంటఁ బెట్టుకొని దారపుత్త్రాదులతో బయలు దేఱి యొక్క చోట మార్గాయాసము దీరుటకై విశ్రమించిరి. ఆ ప్రదేశమును పూర్వము ప్రత్తిమిట్ట యని యందురఁట. అచ్చట వారికి కొంత సౌఖ్యముగా నున్నట్లు తోఁచినందున కొన్ని దినములు చిన్న చిన్న పాకలు వేసికొని దొరకినమట్టుకు కలియో అంబలియో త్రాగుచుఁ గాలము గడపుచుండిరి.

ఒకనాఁడు లక్ష్మీనరసమ్మ అను ఒక బ్రాహ్మణయువతి తన గ్రామములో వేంచేసియుండు శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దలంచుకొని "స్వామీ, లక్ష్మీనరసింహా, నీకు దయరాదా? ఈ ఘోరక్షామములో దినఁ గూడు లేక మా కడుపులు మాడిపోవుచున్నవి. ప్రహ్లాదరక్షకా, దీనబంధూ, రక్షింపుము" అని అనేకవిధములఁ బ్రార్థించుచు ఒక కుండలోఁ బెరుగును బోసి తరిగంబము కడఁ బెట్టి కవ్వముతోఁ జిలుకుచుండెను. అట్లు చిలుకునపుడు మజ్జిగకుండలో ఒక రాయి కవ్వమునకు తటుకు తటుక్కున తగులుచుండఁగా ఇది యేమని యాశ్చర్యమొంది తన చేతితో కుండలోపల తడవిచూచెను; గాని అం దేమియుఁ గనఁబడ లేదు. మఱల నామె తరువ నారంభించెను గాని పూర్వపురీతి తటుకు తటుక్కున రాయి కవ్వమునకుఁ దగులసాగెను. తిరిగి చేతితో బాగుగ కుండను బరిశోధించెను. అం దేమియు గనఁబడ లేదు. అగుట ఆశ్చర్యచకితయై ఇది యేమో మాయయని తటాలున తన పెనిమిటికడ కేఁగి జరిగినవృత్తాం

తము సంతయు నెఱింగించెను. అతఁడును మిగుల అచ్చెరువొంది వచ్చి చూచునప్పటికి పుజ్జిగకుండలో లక్ష్మీనరసింహాకారమునొందిన యొక శిల ప్రత్యక్షమయ్యెను.

ఆగృహస్థుఁడు విగ్రహమును జూచి ఆశ్చర్యచకితుఁడై ఇదియొక భగవంతునిలీలయని తమవారికందఱికి ఈసంగతిని అంతయుఁ దెలిపి వారితోఁగూడ అనేకవిధముల ప్రార్థించిరి. అంత నరసింహుఁడు అశరీర వాక్కుతో "ఓభక్తులారా! మీరు పడుకష్టములను జూడలేక మిమ్ము రక్షించుటకై నే నీతరికుండలో నావిర్భవించితి. నన్ను మీరు భక్తి శ్రద్ధలతో బూజింపుఁడు. మీరెక్కడికిని వెళ్లక ఎల్లకాలము ఇచ్చటనే యుండుఁడు. మీకు కఱవుతీరుకాలము దగ్గరివచ్చినది. దుఃఖింపకుఁడు. ఇచ్చట నాకు ఒక ఆలయమును కట్టింపుఁడు" అని యాజ్ఞాపించెను.

వారు ధన్యులమయితి మని భగవంతుని ప్రార్థించి యానరసింహ విగ్రహమును బూజించుచుండిరి. ఇంతలో కఱవు దీరెను. దేశము సుభిక్షమయ్యెను. అచ్చట వారు తరికుండనృసింహుఁడు అని పేరు పెట్టి భగవంతునకు ఒక ఆలయమును కట్టించిరి. ఆగ్రామమునుగూడ*తరిగుం యని పిలుచుచుండిరి.

ఈ గ్రామమునందు పై వారిసంతతివాఁడును వసిష్ఠగోత్రసంజాతుఁడును అగు కృష్ణయ్య అను నొకబ్రాహ్మణుఁ డుండెను. ఆతనికి లేక లేక యొకకొమార్తె పుట్టినందున వెంకమ్మ అని పేరుపెట్టుకొని గారాబముతో పెంచుచుండిరి. కన్నియ దినదినాభివృద్ధినొందుచు ఎనిమిదేండ్ల వయస్సు గలదయ్యెను. తండ్రి ఆమెరూపమునకును సుగుణములకును సంతసించి ఒకగొప్పకుటుంబములోఁ బుట్టినవరునికిచ్చి వివాహము చేసెను; కాని కర్మఫలమనునది యెటువంటివారికి అనుభవింపక తీరదు. ప్రొద్దుట లేచినదిమొదలు మనుజులకోరికలు దొంతరలు దొంతరలుగ బయలువెడలుచుండును; గాని ఆకర్మబలము లేనిది ఆకోరికలన్నియు పుట్టినవి పుట్టినట్లే నశించును. పాపము వెంకమ్మకు పెండ్లియయిన ఒక సంవత్సరముననే భర్త పరలోకగతుఁ డయ్యెను. ఆయవస్థను జూచి తల్లిదండ్రులు మితిలేని శోకసముద్రములో మునిఁగిపోయిరి.

---

* ఈగ్రామము కడపజిల్లాలోచేరిన వాయిల్పాడునకు నాలుగుమైళ్లదూరమున కలదు.

వెంకమ్మ మొదటి నుండియు వైరాగ్యవంతురాలు; అగుట తన భర్త గతించినందులకు వగవక ప్రారబ్ధకర్మ మనుభవింపకతీరదని దృఢబుద్ధి నవలంబించి తలిదండ్రుల శోకమును దీర్చి వైరాగ్యమును బూని భగవత్కథలను జదువుచు వినుచు బ్రహ్మచారిణియై భక్తిమార్గమునఁ గాలము గడుపుచుండెను

ఇట్లు కొంతకాలముండి మదనపల్లెలో వేదాంతతత్త్వజ్ఞు లగు రూపావతారం సుబ్రహ్మణ్యశాస్త్రిగారిని ఆశ్రయించి వారివద్ద వేదాంతజ్ఞానము నలవఱుచుకొని పరమవిరక్తయై యచ్చట నుండి బయలుదేరి తరికుండ నరసింహస్వామికోవెలలో నుండు ఆంజనేయస్వామి విగ్రహమునకు వెనుకప్రక్క నున్న రహస్యస్థలమున నాహారవిహారము నర్జించి యోగనిష్ఠురాలై యుండెను.

లోకములో సామాన్యముగ సంగతి తెలిసికొనకయే ఒకరిపై తటాలున అపనిందలను వేయుట పామరజనుల స్వభావము. వారు కూపస్థకూర్మములవలె లోకజ్ఞానముగాని శాస్త్రజ్ఞానముగాని లేక యెవఁడో అనామధేయుఁడు చెప్పిన మాటను నిజముగ నమ్మి తత్త్వజ్ఞులనుసైతము దూషించుచుందురు. వెంకమ్మ వేదాంతమును జదువుకొనుటకుఁబోయినదని తత్త్వమును దెలిసికొనక పామరులు పరారు చిత్తగించినదని అపనిందనుమోపి పలువిధముల దూషించుచుండిరి. పాపము భక్తాగ్రేసరురా లగు వెంకమ్మకు ఈసంగతి ఏమి తెలియును?

ఒకనాఁడు అర్చకుఁడు కోవెలలో ఎందులకో మూలమూలలఁ బరీక్షించుచు ఆంజనేయవిగ్రహము వెనుకఁ గూర్చుండియున్న వెంకమ్మను జూచి మొదట నేమోయని భయపడి ధైర్యముదెచ్చుకొని పరీక్షించి చూచి వెంకమ్మ యని స్పష్టముగఁ దెలిసికొనెను. అగుట వెంకమ్మపై అపనింద గలిగియుండుటయు దానికిఁదగినట్లు నాలుగైదేండ్లు గ్రామములోఁ గనఁబడ కుండుటయు ఆలోచించి లోకాపవాదము సత్యమని తలఁచి కోపముతో "ఓసి లంజముండా, చెడ్డపనులు చేయుటయేకాక సిగ్గులేక యీదేవాలయములోఁ జేరి దొంగ వేషము వేసికొని స్వామివారి వస్త్రాభరణములు దొంగిలించుటకుఁ గూడఁ బూనితివా? ఛీ! లెమ్ము" అని తటాలున ఆమె జుట్టుఁబట్టికొని లాగి ఆమెయోగముకు భంగపఱిచెను. అంతవఱకును వెంకమ్మ శ్రీమన్నారాయణునే

మనమున ధ్యానించుచు ప్రపంచవిషయములను మఱచి భగవదేకాయత్తచిత్తయై యున్నందున ఈసంగతియేమియుఁ దెలిసికొనినది కాదు.

అంత అర్చకుఁడు బలాత్కారముగ నవలకు ఈడ్చికొనివచ్చినప్పుడు వెంకమ్మ తెలివొంది కన్నులు దెఱచిచూచెను. ఆమె ప్రభావమువలన నాతఁడు నిలిచినవాఁడు నిలిచినట్లు స్తబ్ధుఁడై యేమియుఁ జేయఁజాలకపోయెను. వెంకమ్మ "శ్రేయాంసిబహువిఘ్నాని" అనునట్లు మంచి కార్యమునకు దిగిన నందఱు భంగముసేయ నెంతురు. గాన నిచ్చట నుండఁగూడదు. "కలౌ వేంకటనాయకః" అనునట్లు సర్వేశ్వరుఁడు వేంకటాచలమున నెలకొనియున్నాఁడు. ఆదేవదేవుని సేవించి ఆతని పాదారవిందములసన్నిధినే నాప్రాణములు సమర్పించుకొందునుగాక" యని తలఁచి,—

శ్లో. "శ్రీకాంతాత్మసుగర్భసంపదకరం శీతాంశుబింబాననం
శ్రీకంఠాబ్జజసన్నుతాంఘ్రికమలం విన్యస్త్రముపాకృతం
లోకాతీతమనేకగోపమునతిలోకం పరం సర్వగం
స్వాకారం తరకుంటవేంకటగిరావ్యక్తం భజేహం సదా."

(వేంకటాచలమహాత్మ్యము. అ. 1, శ్లో. 1.)

అని తరకుంటదేవుని ప్రార్థించి సెలవు గైకొని శ్రీవేంకటాచలమునకు బయలుదేరిపోయెను.

ఇట అర్చకుఁడు కొంతసేపటికి తెలివి తెచ్చుకొని వెంకమ్మ భాగవతాగ్రేసరియనియు, ఆమె ప్రభావముననే తనకట్టిస్థితి సంభవించినదనియు తెలిసికొని యపరాధక్షమాపణకై యామె కాళ్లమీఁదఁ బడి వేఁడుకొనఁ జూచెను; గాని ఆమె యతని కగపడలేదు. అంత నతఁడు స్వామిసన్నిధి కేతెంచి "స్వామీ, ఒడలు దెలియక నీభక్తురాలి కపచారముచేసితిని. నన్ను క్షమింపుము. నాదోషములను బోకడచి రక్షింపుము" అని ప్రార్థించి ఆసంగతి యంతయు ఊరివారి కందఱకు దెలిపెను. పౌరులందఱు తాము నిష్కారణముగ వెంకమ్మయందు అపవాదము మోపినందులకు వగచి బుద్ధి తెచ్చుకొని ఆమెను మిక్కిలి కొనియాడిరి.

అట్లు వెంకమ్మ తరిగుంటనుండి బయలుదేరి వేంకటాచలమును జేరి

సీ. "ఘనగోపురములు ప్రాకారమంటపములు, తేరులు సత్పుణ్యతీర్థములును
కమలాప్తకిరణసంకలితంబులై ప్రకా, శించుచుండెడు హేమశిఖరములును

పావనపరివారదేవాలయంబులు, మహిమ నొప్పువిరక్తమఠవరములు
రంగత్తురంగమాతంగతురంగము, ల్గొమరారుబహుసాధుగోగణములు
తే. ముద్దుగాఁ బల్కు శుకపికములును నీల,కంఠములును మరాళసంఘములు మఱియు
ఫలవనంబులు తులసికాదళసుమములు, క్రిక్కిఱిసి యుండు వేంకటగిరిని గాంచి."

(వేంకటాచలమాహాత్మ్యము ఆ. 1. ప. 24.)

భక్తిపూర్వముగ స్వామిపుష్కరిణిలో తీర్థమాడి వేంకటేశ్వరుని వలగొని సాష్టాంగదండప్రణామము లాచరించి "వేంకటేశ్వరా, దీనబంధూ, ఏడుకొండలవాఁడా, వేంకటరమణా, అనాథ నగు దాసురాలిని దేవర పాదారవిందములఁ జేర్చుకొనుము. అశరణ్యశరణ్యా, సర్వవిధబంధువు నీవు దక్క మఱియొకఁడు లేఁడు" అని పలువిధముల ప్రార్థించి యాదివ్యపర్వతమున పుణ్యతీర్థమగు తుంబురుకోనదగ్గఱ నొక వివిక్తప్రదేశమున భగవద్ధ్యానమునఁ గాలక్షేపము సేయుచు:—

సీ. "నాచిన్ననాఁట నోనామాలునైనను, నాచార్యులచెంత నేఁ జదువలేదు
పరగుఛందస్సులోఁ బదిపద్యములనైన, నిక్కంబుగా నేను నేరలేదు
లలితకావ్యనాటకాలంకారశాస్త్రము, లీనులనైనను వినఁగలేదు
పూర్వేతిహాసవిస్ఫురితాంధ్రసత్కృతు, లొకదినంబైనఁ జూడలేదు
తే. చేరి తఱిగొండపురినారసింహదేవుఁ, డానతిచ్చినరీతిగ నేనిమిత్త
మాత్రమునఁ బల్కుదును స్వసామర్థ్యమిప్పు, డరయనించుకయేని నాయందులేదు.

(వేంకటాచలమాహాత్మ్యము. ఆ. 1. ప. 21.)

అని నైచ్యానుసంధానపూర్వకముగ వేంకటాచలమాహాత్మ్యము, ముక్తికాంతావిలాసము, రాజయోగసారము, భాగవతము (ద్విపద) అను గ్రంథముల రచించి శ్రీవేంకటేశ్వరునకు సమర్పించి కొన్నిదినములు యోగనిష్ఠలోనుండి తరువాత శ్రీవేంకటేశ్వర సాయుజ్యమును బొందెను.

మాలిని "కలశజలధిబాలా కాంతశృంగారలీలా
సలలితగుణజాలా సామగానాభిలోలా
కలుషనిచయశైలోగ్రాశనీవేదమూలా
విలసితగుణశీలా వేంకటాఖ్యాద్రిపాలా."

(శ్రీవేంకటాచలమాహాత్మ్యము. ఆ. 1. ప. 249.)

59. ప్రేమాబాయి.

శ్లో. “మమ చేతసి స్ఫురతు వల్లవీవిభో, ర్మణినూపురప్రణయి మంజుశింజితం,
కమలావనేచరకళిందకన్యకా, కలహంసకంఠకలకూజితాద్భుతమ్.”

(కృష్ణకర్ణామృతము. ఆ 1 ప. 17.)

కాశీక్షేత్రమున ప్రేమాబాయి అను నొకరమణీమణి యుండెను. ఆమె భర్త సుగుణశాలి; అనవరతము భగవద్ధ్యానమున మునిఁగి యుండుట తక్క నాతఁడు అన్యమెఱుఁగఁడు. ప్రేమాబాయి భర్తృపూజాధురంధరయై, ఐహికసుఖాపేక్ష లేక శ్రీహరిని గొలుచుచుఁ గాలము గడపుచుండెను. నగరమునందలి వారు ఎల్లరును ఆమెను చాల గౌరవించుచుండిరి. ఆదంపతులకు ఒక కుమారుఁడు కలిగెను. కుమారుఁడు పదిసంవత్సరముల ప్రాయమువాఁడు అయినపుడు దైవవశమున తండ్రి పరమపదించెను. ప్రేమాబాయి ఎప్పటికైన నిది తప్పనిదే యని ఎఱింగి విచారింపక శ్రీకృష్ణునిఁ బూజించుచు నానందపరవశయై యుండెను.

ఒకనాఁడు ప్రేమాబాయి యింటికి కొందఱు భాగవతులు వచ్చిరి. ప్రతిదినము ప్రేమాబాయి మధ్యాహ్నభోజనానంతరము ఆ వీథియందే ఒకపండితుఁడు భాగవతము పురాణము చెప్పుచుండఁగాఁ బోయి పరమభక్తితో వినుచుండెడిది. నేఁడు భాగవతులు వచ్చుటచే వారికి సపర్యలు చేయవలసివచ్చెను. ఈపనిలోఁ గూర్చున్న పురాణము వినుట తటస్థింపదు. పురాణము వినిన భాగవతసేవ తటస్థింపదు. అత్యావసరములయిన ఈరెండింట నేది విడువఁగలదు?

కొంతసేపు ఆమె ఇట్లు ఆలోచించి కుమారునిఁ జేరఁబిలిచి “కుమారా, నేఁడు భాగవతులు వచ్చియున్నారు. వారిని సేవింపకుండ పురాణము వినుటకుఁ బోవుట ధర్మము గాదు. పురాణము వినకుండ నుండఁజాలను; గావున నీవు పోయి పురాణము శ్రద్ధతో ఒక్క అక్షరమైన విడువకుండ విని వచ్చి నాకుఁ జెప్పుము. నేను భాగవతారాధనము గావించెదను” అని చెప్పెను. కుమారుఁడు వల్లెయని వెడలిపోయెను.

పిదప ప్రేమాబాయి హరిధ్యానముతో గంగానదికిఁ బోయి స్నానము చేసి స్వామిదర్శనము చేసి వచ్చి సకలపదార్థములును వండి

భాగవతులకు తృప్తిగా భోజనము పెట్టి సంతోషపఱిచెను. ఇంతలో కుమారుఁడు వచ్చెను. అంతట ప్రేమాబాయి కుమారునకు భోజనము పెట్టి తానుభుజించి కుంర్చున్నతరువాతకుమారుఁడుపురాణవిషయము అంతయుఁ జెప్పెను. పౌరాణికుఁడు యశోద కృష్ణునిరోటికి కట్టిపెట్టుట, ఆతఁడు లోంగిపోయి విడిపించుకొనఁ జాలనట్లు దుఃఖించుట మున్నగు విషయములను హృదయము కరగునట్లు చెప్పెను. కుమారుఁడు ప్రేమాబాయికి వినినది వినినట్లుగా విపరముగాఁ జెప్పెను. అంతట నే ప్రేమాబాయి "హా కృష్ణా! నీకెట్టిపాటువాటిల్లె" నని ఏడ్చుచు "ఇదిగో వచ్చి విప్పెదను" అని పరుగెత్తికొనిపోవుచు కొంతదూరము పోయినతరువాత క్రిందఁబడి ప్రాణములు విడిచెను. భాగవతులు ఆమె తన్మయత్వమునకు ఆశ్చర్యపడి ఆమె ననేకవిధములఁ గొనియాడి వెడలిపోయిరి. కుమారుఁడు తల్లికి యథాశాస్త్రముగ ఉత్తరక్రియలను నిర్వర్తించి తాను గూడ భక్తిమార్గమునఁ బ్రవేశించెను. ప్రేమాబాయి ఈశ్వరసాయుజ్యమును బడసెను.

మ. "దినముల్ నాదు హృదంతరాళమున వర్తిల్లన్ గళిందాత్మజా
వనజాళిన్ విహరించు నంచకలరావంబున్ విడంబించున
ధ్వనజాతేక్షణుపాదనూపురమణిధ్వానంబు గోపాంగనా
జనరాసోత్సవనృత్తగీతకళ నాసాదించు నారేయుమై."

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 17.)

---

57. గోమాబాయి

శ్లో. "మాధుర్యేణద్విగుణశిశిరం వక్త్రచంద్రం వహంతీ
వంశీవీథీవిగళదమృతస్రోతసా సేచయంతీ,
మద్వాణీనాంవిహరణపదం మత్తసౌభాగ్యభాజాం
మత్పుణ్యానాంపరిణతిరహో నేత్రయోస్సన్నిధత్తే."

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 74.)

గోమాబాయి అను ఒకవితంతుస్త్రీ విరాగిణియై భిక్షాటనమున జీవము నిలుపుకొనుచు అనవరతము భగవద్ధ్యానతత్పరయై యుండుచుం

డెను. ఒక సంవత్సరము ఆమె పండరిపురమున జరుగుమహోత్సవమును జూచి స్వామిని సేవించుటకు నిశ్చయించుకొనిబయలుదేఱెను. మార్గస్థులతోఁ గలిసి యామె చంద్రభాగానదియొడ్డునకు వచ్చెను. కూడవచ్చిన వారందఱితోఁ బాటుగ నామెయు ఓడయెక్కెను. కళాసులు అందఱి నలనను కేవు వసూలు చేసి గోమాబాయి చెంతకు వచ్చిరి. ఆమెచెంత నొక కాసైనను లేదు. "నేను బీదరాలను" నని ఆమె ఎంతబ్రతిమాలినను వారంగీకరింపలేదు "నాచెంత కొంచెము పిండి యున్నది. అందలి సగము ఇచ్చెద" ననినను వారు "మాకు పిండి వలదు. డబ్బు కావలయును. ఇచ్చుటకు శక్తిలేదేని దిగిపొమ్ము" అని బలవంతముగ క్రిందికి దింపివేసిరి

గోమాబాయి ఏమియుఁ జేయఁజాలక విచారముతో ఒడ్డుమీఁదికిఁ బోయి పండరినాథుని ఇట్లు ప్రార్థింపఁదొడఁగెను.

మ. "యమునాతీరవనాంతసంజనితదావాగ్నిస్ఫుటార్చిర్చికా
యమునానాజనభీకరం బగుచు జ్వాలల్ వెల్గ్రక్కంగాచునె
య్యము నాయంబని దానినానెనఁటు నిత్యంబుగాన్ హరిగుప్తసం
యమునారాధనసేయునాతఁ డభీష్టార్థప్రాప్తిగాఁ గంతునే?

ఉ. కోమలసుందరాకృతి ను గోపకనుంగవ కెంపుమోవి ను
న్నోమునఁ బ్రేలుముంగురులు నూత్నవిభూషణభూషితాంగము
న్దామదిగంబరాకృతి యుఁదాల్చిన వెన్నునిఁ జిన్నిబాలునిన్
శ్రీమయుఁడన్ భజింతు నవనీతసుధాశుని నందసూనునిన్."

(కృష్ణకర్ణామృతము. ఆ 2 ప. 16 19)

ఇట్లు ఒకటి రెండు గడియలు గడచునప్పటికిపండరినాథుఁడు ఒక పహిల్వాని వేషము ధరించి చిన్నినావను నడపుకొనుచు నచ్చటికి వచ్చి "తల్లీ, ఇచ్చట నీవు ఏల ఏకాకివై యుంటివి' పండరినాథుని ప్రార్థించు చున్నావు. గావున నీవు యాత్రార్థినివై వచ్చితి వని తలంచుచున్నాను. అయిన నిచ్చట నేల కూర్చుందువు? నానవనెక్కుము. అవ్వలిగట్టునకుఁ గొనిపోయెదను" అనిపిలిచెను. అంతట నామె "నాయనా, నేనునిరుపేదరాలను. ఒక్కకాసైనను లేదు. కొంచెము పిండిమాత్రము ఉన్నది. కొంత నీకిచ్చెదను. నన్నవ్వలకుఁ జేర్చి పుణ్యముగట్టుకొమ్ము" అనిప్రార్థించెను. అందులకు ఓడవాఁడు మందహాసము చేసి "తల్లీ, నేను ధనము

సంపాదించుటకు ఈవృత్తిలోఁ బ్రవేశింపలేదు. భక్తులకు సాయముఁ జేయుటయే నావృత్తి. నాకేమియు వలదు. నీవు ఆనందముతో నాయోడ నెక్కుము. భద్రముగా నిన్ను అవ్వలకుఁ గొనిపోయెదను" అని బదులు చెప్పెను. "నేను ఏకవస్త్రను. అందును నేనుధరించినదిచినుఁగులగుడ్డ, అది తడిసిపోయెనేని వృద్ధురాలనగు నేను ఈరాత్రి చలిబాధను ఎట్లు తొలఁగించుకొనఁగలను!" అని యామె యడుగఁగా "నీకు భయమువలదు. నేను నీకు పుత్రప్రాయుఁడను; నీవు సందియములేక నా భుజముపై నెక్కు"మని చెప్పి యాతఁడామె అంగీకరింపఁగా నామెను భుజముమీఁద నెక్కించుకొని పోయి పడవలో నెక్కించి భద్రముగా అవ్వలిగట్టునకుఁగొనిపోయి దింపి గ్రామములోనికి దారిఁజూపెను. అందులకు ఆమె చాలకృతజ్ఞయై "తండ్రీ, నాచెంతనున్న పిండిలో కొంచెము చేకొను" మనఁగా నాతఁడు "నాకు వలదు. రేపు ద్వాదశి కావున ఆపిండిని ఒక యతిథికి ఇమ్ము. అదియె నాకు ఆనందప్రదము" అని చెప్పి అదృశ్యుఁడై పోయెను.

పిదప గోమాబాయి ఊరిలోనికిఁ బోయి ఆలయము సొచ్చి విధివిధానమున స్వామిని దర్శించి ప్రార్థించి కొనియాడి మ్రొక్కి ఆరాత్రి జాగారము చేసి కడపెను. తెల్లవారినపిదప భక్తులందఱతోఁ గలిసి చంద్రభాగకుఁ బోయి స్నానముచేసి పండరినాథుని నామస్మరణము గావించుచు అతిథినిమిత్తము నిరీక్షింపసాగెను; గాని ఎంతకు ఎవరును రారైరి. అంతట నామె విచారముతో "రుక్మిణీనాథా, నీభక్తులు అందఱును ధనముకలవారు; గావున తమతమ వైభవముల ననుసరించి అతిథిసంతర్పణము చేయుచున్నారు. నేను అట్టిదానను కాను. ఇట్లు నీవుగూడ పక్షపాతము చూపిన నిఁక లోకము నిలుచునా?" యని ప్రార్థించుచుండఁగా పండరినాథుఁడు ఒక వృద్ధబ్రాహ్మణరూపముతో వచ్చి "తల్లీ, ఆఁకలికి నేను తాళఁజాలకయున్నాను. నావికృతవేషమును జూచి ఎవరును నన్ను చేరనీకున్నారు. నీవైన నాప్రాణములు నిలుపవా? నాకు ఒకరొట్టెచాలును" అని కూలఁబడెను. అందులకు గోమాబాయి చాల సంతసించి ఉపచారములు పలికి తనచెంతనున్నపిండితో రెండు రొట్టెలు కాల్చి ఒకరొట్టె బ్రాహ్మణుని ముందు ఉంచెను; దానిని ఆతఁడు తినఁబోవుచుండఁగా రుక్మిణీదేవి వృద్ధబ్రాహ్మణీరూపముతోవచ్చి నేను ఆఁకట

నకనక మాడుచుండఁగా నీవు ఇక్కడకువచ్చి ఒక్కఁడవును రొట్టె తినుచుంటివా?" యని పలికెను. అప్పుడు వృద్ధుఁడు గోమాబాయినిఁ జూచి "తల్లీ, మిగిలినరొట్టెను ఈమె కిమ్ము" అనిపలికెను. గోమాబాయి అట్లే చేసెను. వారిద్దఱును ఆరొట్టెలను తిని నిజరూపములతో ఆమెకు సాక్షాత్కరించి అనుగ్రహించి అదృశ్యులైరి. గోమాబాయి బ్రతికియున్నంత కాలమును పండరినాథుని సేవించి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను.

శా. "లావణ్యాంబుధి చంద్రబింబముఖలీలన్ దోఁచునంశినినా
దావిర్భూతసుధాప్రవాహమున నోలాడం బ్రవర్తిల్లునా
దైవాకారము నానదీవిహరణస్థానంబు నా పుణ్యస
ద్భావంబారఁ బ్రసన్నమయ్యెను యశోదాపుత్త్రరూపంబునన్."

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 74.)

---

58. రా మా బా యి.

శ్లో. "సోఽయంవిలాసమురళీనినదామృతేన
సించన్నుదంచితమిదంమమకర్ణయుగ్మం,
ఆయాతి మేనయనబంధురనన్యబంధు
రానందకందళితకేళికటాక్షలక్షః."

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 75.)

కాశీనగరమునకు అధిపతియగు సంతరాజు చాలమంచివాఁడై నీతిమంతుఁడై ప్రజలను కన్నబిడ్డలను వోలెఁ గాపాడుచు సదా హరిధ్యానతత్పరుఁడై యుండుచుండెను. ఆతనికి లేకలేక ఒకకొమార్త కలిగెను. ఆబిడ్డను తలిదండ్రులు అతిప్రేమతోఁ బెంచుకొనుచుండిరి. ఆమెకు రామాబాయి అని పేరు ఉంచఁబడెను. బిడ్డను జూచి ఇరుగుపొరుగువారుగూడఁ జాల సంబరపడుచుండిరి.

సంతరాజు ఆమెకు యుక్తసమయమున అక్షరాభ్యాసము చేయించి యోగ్యుఁడగు నొకగురువువద్ద విద్యాభ్యాసమునకు అప్పగిం

చెను. సుగుణఖని యగుఆబ్రాహ్మణుఁడు ఇట్టి కన్యారత్నమునకు విద్యచె ప్పునదృష్టము పట్టినందుకు చాల నానందించెను. ఆతఁడామెను కన్న బిడ్డవలెఁ దలంచి చదువు చెప్పఁబూనెను. ఆమెయు వయస్సునఁ జిన్నది యయ్యుగుణముల వృద్ధురాలు గావునగురువును దేవునిగను తండ్రిగను దలంచిపూజింపసాగెను.కొలఁదిదినములయందేఆమెకువిద్యాభ్యాసము పూర్తియయ్యెను. ఒకనాఁడు ఉపాధ్యాయుఁడు "తల్లీ, ఇఁక నీకుఁజెప్ప వలసినది ఏమియు లేదు"అని పలికెను.అంతట రామాబాయి"మీయ నుగ్రహమువలన నాకు సకలమును దెల్లమైనది. అయినను పతివ్రతా ధర్మములను మీవలన వినవలయునని కుతూహలము గలదు"అని విన్న వించెను.

అందులకు ఉపాధ్యాయుఁడు "అమ్మా, వివాహమైనదిమొదలు కొని జన్మము ఉన్నంతకాలమును పతి ననువర్తింపవలసిన రమణీమణుల ధర్మములను ఆమూలముగ వివరించిచెప్పుట కెవ్వరికి శక్యమగును? నీవు తెలియనిదానవుకావు. తెలియనివారికిఁ జెప్పినను బ్రయోజనములేదు. పతి సురూపియైనను కురూపియైనను సుగుణశాలియైనను దుర్గుణవం తుఁడు అయినను జారుఁడైనను చోరుఁడైనను అనాచారుఁడైనను అపా త్రుఁడైనను మఱియెట్టివాఁడయినను ఎదురాడక పదదాసియై రమణి మెలంగవలయును. అంతయు దీనియందే యున్నది." అని యిట్లే కొంత తడవు చెప్పెను. పిదప రామాబాయి గురువునకు అనంతధనము గురు దక్షిణగానిచ్చి ఆనందపెట్టెను. సంతరాజు గూడ ఉపాధ్యాయుని చాల గౌరవించెను.

పిదప సంతరాజు తనకుఁ దగినసంబంధమునుజూచిరామాబాయి నొక రాజపుత్రునకుఇచ్చి మహావైభవముతోఁబెండ్లిచేసెను. వివాహా నంతరమురామాబాయి అత్తవారింటికిఁబోయెనుగాని విధివశమునఆమె భర్త ఆమెమార్గమునకు కేవలము వ్యతిరిక్తుఁడయ్యెను.ఆతఁడు సకలమును చదువుకొనినవాఁడేయైనను ఐహికసుఖములమీఁద భ్రాంతిని కొంచెవఱ కైనను విడువఁజాలకయుండెను. ఎల్లప్పుడును అంతఃపురమును విడిచియుం డుటకు అంగీకరింపఁడయ్యెను.ఎట్లయిన భర్తను సన్మార్గమునకుఁ ద్రిప్పవ లయు నని రామాబాయి యోచించి తగినయుపాయములను వెదకినకొ లఁదిని ఆతఁడు బిఱ్ఱబిగియ సాగెను. పయింబయిగ నాతఁడు తనభార్య

ఛాందసమును పోఁగొట్టవలయుననికూడ సంకల్పించి యనేకవిధములఁ ప్రయత్నింపసాగెను.

ఇట్లు కాలము కడచిపోవుచుండఁగా రామాబాయి గర్భవతి యయ్యెను. తొమ్మిదిమాసములుగడచిన పిదప నామె ఒక చక్కని తనయునిఁ గనియెను. ఆకుమారుని తనవంటివానినిజేయవలయునని తండ్రియు తనవంటివానినిఁ జేయవలయునని తల్లియుఁ బ్రయత్నింపఁజొచ్చిరి. ఒకయేకాదశినాఁడు రామాబాయి తానుపవసించి భర్తనుగూడనుపవసింపవలసినదని చెప్పెను. ఆతఁడు అంతటఅంతఃపురమునకు ఒకమేఁకను దెప్పించి స్వయముగ రామాబాయియెదుట దానిని సంహరించి వంటవాండ్రకు "నేఁడు దీనిని వండుఁడు" అని నియమించెను. అది చూచి రామాబాయి చాలఁగటకటఁబడి ఇట్టివానిని ఎట్లుసుంచిమార్గమునకుఁ దేవచ్చునని చాల యోచించి, ఒకనాఁడు పాలలో విషముగలిపి బిడ్డకు ఇచ్చెను. కొంతసేపటికి ఆబిడ్డఁడు చనిపోయెను అంతటఁ దండ్రివచ్చిఅదే పనిగ విచారింపసాగెను. అప్పుడు రామాబాయి ఇదేసమయమని యోచించి "నాథా, ఏలవిచారించెదవు? కానున్నది కాకమానదు. ఇట్లు విచారించుచుండఁగాఁ జచ్చుండినమనపుత్రుఁడు బ్రతుకఁడు. ఈశ్వరాజ్ఞ లేనిదే చీమయుఁ గుట్టదు. ఇట్లగుటకుఈశ్వరుని సెలవుఅయినది. మనపుత్రుఁడు బ్రతుకవలయుననినచో మఱల ఈశ్వరునియా దేశముకావలయును; గాని విచారమువలనఁ బ్రయోజనములేదు. దేవాలయమునఁగొందఱుభాగవతులు వచ్చియున్నారు. వారు శ్రీహరిశ్రీపాదతీర్థమును మనబిడ్డ కళేబరమునిూఁదఁ జలికినచో ప్రయోజనము ఉండవచ్చును; గావున నీవు పోయిప్రార్థించి వారినిఁ గొనిరమ్ము"అని చెప్పెను. ఆతఁడు ఇదివినితొలుత నొకింత కోపించెను; గాని తుదకు "ఏపుట్టలో నేపామున్నదో ఎవరు చెప్పఁగలరు?"అని తలంచి భార్య చెప్పినట్లు దేవాలయమునకుఁబోయి భాగవతులను అనేకవిధములఁబ్రార్థించి ఇంటికిఁగొనివచ్చెను. రామాబాయిభాగవతులననేకవిధములఁబూజించెను. అంతభాగవతులు దయార్ద్రహృదయులై శ్రీహరిదివ్యపాదోదకమును బాలునిమీఁదఁ జల్లిరి. తోడనే బాలుఁడు నిద్రించినవానివలె లేచి కూర్చుండెను. అది చూచి ఎల్లరును ఆశ్చర్యచకితులైరి. రాజు చాల సంతసించి భాగవతుల ననేకవిధములఁ గొనియాడి పూజించి వారిచేజ్ఞానోపదేశమును బడసి"ఇంత

వఱకును నేను క్రూరుఁడనై నిన్ను అలయించితిని అయినను నీవు నా మీఁద పగఁబూనక సంతతపరిశ్రమచే నన్ను ఉద్ధరించితివి. కోటిజన్మములయందు నీకు దాస్యముఁ జేసియు నేను నీఋణమును దీర్చుకొనఁజాలను" అని రామాబాయిని అనేకవిధములఁ గొనియాడెను.

పిదప ఈదంపతులు బ్రతికియున్నంతకాలమును సకలవిధములను శ్రీహరిని సేవించి అవసానమున ఈశ్వరసాయుజ్యమును బడసిరి.

శ్లో॥ శత్రుచ్ఛేదైక మంత్రం సకలముపనిషద్వాక్య సంపూజ్యమంత్రం
సంసారోత్తారమంత్రం సముపచితతమస్సంగనిర్యాణమంత్రం
సర్వైశ్వర్యైకమంత్రం వ్యసనభుజగసందష్టసంత్రాణమంత్రం
జిహ్వే శ్రీకృష్ణమంత్రం జపజపసతతంజన్మసాఫల్యమంత్రం.

(ముకుందమాల. 23.)

---

59. కర్మాబాయి.

శ్లో॥. మాతఃకింయదునాథ దేహిచషకం కింతేన పాతుంపయ
స్తన్నాస్త్యద్య కదాస్తివాని శినికా కా వాంధకారోదయః
ఆమీల్యాక్షియుగం నిశాప్యుపగతా దేహీతిమాతుర్ముహు
ర్వక్షోజాంశుకకర్ష ణోద్యతకరఃకృష్ణ స్సపుష్టాతునః.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 60.)

జగన్నాథక్షేత్రమున కర్మాబాయి అనునొకస్త్రీయుండెను.ఆమె గర్భవతియై యుండఁగా భర్త పరమపదించెను. ఆదుఃఖమువలన నామె ప్రపంచ మెఱుంగక యుండి కొన్నిదినములకు ఒకకుమారునిగనియెను కర్మాబాయి ఏకపుత్రుని మిపులగారాబముతోఁ బెంచుచు ఆయాయుక్త సమయములయందు విద్యాభ్యాసము ఉపనయనము మున్నగువానిని నిర్వర్తింపించి తుదకొక మంచికన్యను దెచ్చి వివాహము గావించెను. వివాహమైన కొలఁదిదినములకే కర్మాబాయికోడలు గర్భవతియయ్యెను. సకలకష్టములను అనుభవించి పెంచిన తన బుడుతఁడు ఇఁకఁ గుమాళ్ళ

తండ్రి యగును గదా" యని యామె యానందించుచుండఁగా ఆకస్మికముగా నుద్ధృతరోగమువచ్చి ఆతఁడు చనిపోయెను. గోరుచుట్టుమీఁది రోఁకటిపోటువలె దుస్సహమైన పుత్రవియోగ మనుదుఃఖమును అనుభవించుచుండఁగా కోడలు ప్రసవమయ్యెను. మగబిడ్డ కలిగినందులకు కర్మాబాయి మఱల నానందించుచుండఁగా మాటలువచ్చుప్రాయమున మనుమఁడుగూడ ఈలోకమును విడిచిపోయెను. అంతట కర్మాబాయి మిన్నువిరిగి మీఁదఁబడినట్లు ప్రపంచము నెఱుంగక మింటికి మంటికి నేకధారగా విచారింపసాగెను.

కాలక్రమమున ఈవిచారము పెరిగిపోయెను; గాని తరుగలేదు. ఇట్లుండఁగా జగన్నాథయాత్ర సేసికొనుటకు వచ్చిన భాగవతశిఖామణి యొకఁడు కర్మాబాయియింట బసచేసెను. ఆతఁడు కర్మాబాయి తదేకదీక్షతో విచారించుటఁ జూచి కారణము నెఱింగి ఆమెను చేరఁబిలిచి ఇట్లు చెప్పెను.

"తల్లీ, నీవు కాలము గడచిన దానవు. ప్రాపంచికవృత్తములలో నీకుఁ దెలియనివి లేవు. సంసారమున సంభవించు నవస్థలు నీవు రెఱుఁగనివి లేవు ఇట్టి పూర్ణానుభవమును గలిగియు సంగతి సందర్భములను గ్రహింపలేవైతివి. భర్త, పుత్రుఁడు, పౌత్రుఁడు, అచిరకాలమున వరుసగా గతించుట విడ్డూరమే, విచారకారణమే; గాని బాగుగ యోచింపుము. పుట్టిన తరువాత చావకుండ నుండినవా రెవరో తెలుపుము. పురిటిగదియందే కొందఱుచచ్చిరి. పదియేండ్లు బ్రతికికొందఱు ఈల్గిరి. నూఱేండ్లు బ్రతికి అనేకులు సమసిరి. ఇట్లే అనేకప్రాయముల యందు అనేకులు నాపుమాసిరి. చావుమాత్రము ఎవరికిని తప్పియుండ లేదు. తప్పదు. "జాతస్యమరణంధ్రువ" మ్మన నెఱుంగవా? కాని చనిపోయినవాఁడు మఱల బ్రతికినట్లు ఎప్పుడును వినఁబడలేదు. దానికి ఏమియు ఉపాయములు లేవు. ఇఁక ఇట్లువిచారించుటవలన ఏమిప్రయోజనము? ఇంతకంటె అజ్ఞానము ఏమియున్నది? విచారించుచున్న నీవును చనిపోదువు. విచారింపవలదని చెప్పుచున్న నేనును చనిపోదును; గాని ఒక్క భేదము గలదు. కొందఱు మఱల జన్మింతురు. కొందఱు పునరావృత్తిరహితమైన శాశ్వతబ్రహ్మభావమును గాంతురు. ఇంతభేదము సంసార సంబంధములగు సకలవిషయములను అనుభవపూర్వముగ నెఱుంగు

చున్న నీకు పునర్జన్మమునసుఖమున్నదో బ్రహ్మైక్యమున సుఖమున్నదో వేఱుగఁ జెప్ప నక్కఱ లేదుగదా? యుక్తాయుక్తవిచారము సేయఁగల వ్యక్తి పునర్జన్మమును గోరదు పునర్జన్మమును బ్రహ్మైక్యమును మన ఇష్టానిష్టములయం దున్నవి, కావున జగన్నాథస్వామి సాక్షిగా నిన్ను ఉద్ధరించుటకుఁ జెప్పుచున్నాను. నేఁటినుండి,— ఈగడియనుండి,— ఈక్షణమునుండి నీవు దుఃఖమును మానుము. నీకు గోపాలమూర్తి విగ్రహమును ఇచ్చెదను దానిని నీవు నీకుమారుని, నీపౌత్రుని పెంచి లాలించినట్లు లాలించుచుండుము. అవసానమున నీకుముక్తిచేకూఱును."

ఈమాటలు విని కర్మాబాయి దుఃఖమును మాని భక్తుని యుపదేశానుసారముగఁ బ్రవర్తింపసాగెను ప్రతిదినమునుఉదయమున ఆమె లేవఁగానే సకలకృత్యములను విడిచి తొలుత అన్నము వండి గోపాల విగ్రహమునకు నివేదించి పిదప తొట్టిలోఁ బెట్టి జోలలుపాడి పిదపఁ దాను సకలమును నిర్వర్తించుకొని స్నానము చేసి భగవన్నివేదితాన్నమును భుజింపసాగెను. ఇట్లు కొంతకాలము గడచునప్పటికి ఆమెకు గోపాలవిగ్రహముతోడిదే లోక మయ్యెను. ఒకప్పుడు కర్మాబాయి ఇంటికిఁ గొందఱు బ్రాహ్మణులు వచ్చిరి వా రామె ప్రవర్తనముఁజూచి సందేహించి "తల్లీ, నీవు ప్రాతఃకాలమున లేవఁగానే అన్నము వండి పిదప స్నానము చేయుచున్నావు ఇదియేల?" అని యడిగిరి. అందులకు ఆమె "నాయనలారా! నేను స్నానముచేసి వచ్చునంతదనుక నాబిడ్డఁడు ఆఁకలికిఁ దాళఁజాలఁడు. కావున నట్లు చేయుచున్నాను" అనిచెప్పెను. "నీయింట బాలుఁడు కాన్పింపఁడేమి?" అని వారు అడుగఁగా నామె గోపాలవిగ్రహమును దెచ్చి చూపి సకలమును వారికిఁ జెప్పెను మధ్యాహ్నము వారు చూచుచుండఁగానామె గోపాలవిగ్రహమునెదుటఅన్నమును వడ్డించి నివేదనము చేసెను చూచుచుండఁగానే పాత్రమున ఉన్న సకలపదార్థములును మాయ మయ్యెను. బ్రాహ్మణులు అది చూచి పరమాశ్చర్యచకితులై "ఈమెచరిత్రము అద్భుతముగా నున్నది. ఇట్టిది ఎందును కని విని యుండలేదు" అని యనుకొని "తల్లీ, భగవంతుఁడు నీప్రాపున ఉన్నాఁడు నీయదృష్టము అనితరలభ్యము. అయినను ఇట్లుగాక స్నానముచేసి మఱియు పాకము చేయుట మంచిది" అని చెప్పి వెడలిపోయిరి. మఱునాఁడు ఆమె అట్లేచేసెను; కాని పాత్రమునవడ్డింపఁ

బడిన అన్నము అట్లే యుండెను. అందులకుఁ గారణము తెలియక ఆమె తహతహపడసాగెను. నాఁటిరాత్రి గోపాలుఁడు అర్చకునకు స్వప్నమున సాక్షాత్కరించి "కర్మాబాయి భక్తివిశ్వాసములు లేని శాస్త్రజ్ఞులమాటలనువినినాకు అన్నము పెట్టుటలో మామూలుమార్గమును విడిచిపెట్టినది. అగుటచే నేఁడు నాకు అన్నము సహింపలేదు. నాకడుపు ఆకఁటనకనకలాడుచున్నది" అనిచెప్పెను. మఱునాఁడు ఈసంగతిని అర్చకుఁడు కర్మాబాయితోఁజెప్పి "తల్లీ, నీయనుగ్రహమువలన నాకు భగవంతుఁడు సాక్షాత్కరించి అనుగ్రహించెను" అని కొనియాడి వెడలిపోయెను. కర్మాబాయి మఱల యథాప్రకారముగఁ జేయసాగెను. అప్పటినుండియు గోపాలవిగ్రహము నెదుటఁ బెట్టినపదార్థములు వెంటనే అదృశ్యములు కాసాగెను. అదిచూచి కర్మాబాయి గోపాలునకు మఱలఁ దనమీఁద ననుగ్రహము కలిగెనని పరమానందభరితురాలు అయ్యెను. ఈసంగతి విని వచ్చి ఊరివారందఱును ఆమెను జాలఁగొనియాడిరి. కర్మాబాయి బ్రతికియున్నంతకాలమును ఇట్లే గడపి అవసానమున ఈశ్వరసాయుజ్యమును బడసెను.

ఉ. అమ్మ ఇదేమిరా యదుకులాగ్రణి గిన్నెయొసంగు మేలపా
యమ్ముగఁ ద్రావలే దిపుడ నప్పుడు రేయది యొట్టిదంచుకా
రమ్ముగు నన్నుఁ గన్గొనిచి రాతిరి వచ్చిన వేగపాలు తే
నెమ్మని తల్లి సెలటఁ బడిఁ దీయుముకుందుఁడు నన్నుఁ బ్రోచుతన్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 60.)

60. మిరాబాయి

శ్లో. లీలాటోపకటాక్షనిర్భరపరిష్వంగప్రసంగాధిక
ప్రీతేగీతివిభంగసంగరలసద్వేణుప్రణాదామృతే,
రాధాలోచనలాలితస్యలలితస్మేరేమురారేర్ముదా
మాధుర్యైకరసేముఖేందుకమలే మగ్నంమదీయంమనః.

(కృష్ణకర్ణామృతము. ఆ 3. శ్లో. 22.)

ఉదయపురమును ఏలు ఒకానొక మహారాజునకు మిరాబాయి అనుకొమార్తె కలిగెను. తలిదండ్రులు ఆమె నెంతో గారాబముతోఁ బెంచుకొనసాగిరి. మాటలాడ నేర్చినదిమొదలు మిరాబాయి శ్రీకృష్ణా

యనితలఁచుచు పలుకుచుండెడిది; ఆటలాడఁదొడఁగినదిమొదలు ఆమెబంగరుశ్రీకృష్ణవిగ్రహమును అలంకరించుచు దానితోనాడుకొనుచుండెడిది. ప్రతిదినమును ఆవిగ్రహమునకు జలకమాడించి క్రొత్తబట్టలుగట్టి గంధము అలఁది పూదండలు వేసి—ఈతీరున ఆమె కాలము గడపుచుండెను. యుక్తసమయమునఁ దలిదండ్రులు ఆమెకు అక్షరాభ్యాసము గావించిరి; గాని విద్యావిషయమున ఆమె శ్రద్ధచేయులేదు తలిదండ్రులలో నెవరైన "చదువుకొనుమమ్మా" యని చెప్పినచో "ఇదిగో వెళ్లుచున్నాను"అని చెప్పి వారు అవ్వలకుఁ బోయినవెంటనే తనపనిఁ దాను చేసికొనుచుండెడిది కొంతకాలమునకు ఆమె వివాహయోగ్య యయ్యెను. అదిచూచి తలిదండ్రులు ఆమెకుఁ దగిన వరుని అన్వేషించుటకుఁ బ్రారంభించిరి. ఒకనాఁడు తండ్రి కొమార్తెను చేరఁబిలిచి "తల్లీ, నీకు పెండ్లియీడు వచ్చినది. నీవు ఎవ్వరినేనివరించియున్నచోఁ జెప్పుము" అనియెను. అంతట మిరాబాయి లజ్జను బోఁద్రోసి "నేను శ్రీకృష్ణమూర్తిని వరించితి"నని పలికెను తలిదండ్రులు ఆశ్చర్యపడి "తల్లీ, నిన్ను వేళాకోళమునకు అడుగుటలేదు యథార్థముచెప్పుము"అని యడిగిరి. మిరాబాయి "నేను వేళాకోళపుఁ బ్రత్యుత్తరము ఇచ్చుటలేదు. నిజమేచెప్పితిని" అని పలికెను. తల్లిదండ్రులకు ఈమాట వజ్రాయుధ మయ్యెను. కొంతతడవు వారు మాటాడఁజాలకపోయిరి.

పిదప తండ్రి ఇట్లు చెప్పెను. "చిట్టితల్లీ, లోకములో నిట్టివింతలు గలవా ? ఇది విన్న నలుగురును నవ్వరా? మాకుఁ దలవంపులుగదా ! నీకు సిగ్గుచేటు గాదా? నీవు ఇదివఱలో యోచించుకొనియుండనిచో ఇప్పుడు యోచించుకొనుము. లేకున్న తగినవరుని మేము తెచ్చెదము. చెప్పుము"ఆమె ఇది విని "తండ్రీ, నీవు పొరఁబడుచున్నావు. ఇదివఱకే నేను సకలమును ఆలోచించుకొంటిని ఇఁక యోచింపవలసినది ఏమియులేదు. మీకుఁగూడ ఆకష్టముపనిలేదు. తండ్రీ, నీకు ఈవెఱ్ఱి? ఏల నాకురుక్మిణీకాంతునికంటె మంచివరుఁడు లభించునా? నీకు శ్రీకృష్ణునికంటె మంచి అల్లుఁడు దొరకునా! ఇఁక నాయెదుటవివాహప్రస్తావము తేవలదు. నేను మానవమాత్రునిఁ బెండ్లియాడఁజాలను. మీకుఁ దెలియకపోవచ్చును. గాని నేను శ్రీకృష్ణునకుఁ బరిచర్య చేయుటకుఁ బుట్టితిని. మానవునకు మీరు నన్నుబలవంతముగాఁ గట్టిపెట్టెదరేని నేను మీకును మీరు ఆనం

దముతోఁ దెచ్చుకొనిన అల్లునకుఁ గూడఁ దక్కదు" అని చెప్పెను. తలిదండ్రులు ఇఁకఁ జేయునది లేక అందులకు అంగీకరించి "వంశమునకు అమర్యాదరానీయకుము" అని చెప్పిరి.

పిదప మీరాబాయి సువర్ణగోపాలవిగ్రహమే లోకముగా నుండెను. అంతట లోకులు ఆమెను గుఱించి అనేకవిధములఁ జెప్పుకొనసాగిరి. అవి ఆమె తండ్రి చెవులఁ బడెను. ఆతఁడు సహింపలేక భార్యను బిలిచి "మనబిడ్డవలన మనకు అపకీర్తి వచ్చుచున్నది. సాధువులను సజ్జనులను చేర్చి ఆమె హరిభజన చేయుట లోకులకు అనుమానకారణమైనది. నేను ఈయవమానమును సహింపఁజాలను" అనియెను. ఆమెగూడ అట్లే చెప్పెను. పిదప ఇరువురును మాటాడుకొని గిన్నెలో విషమును బోసి దానిని ఆమె చెంతకుఁ గొనిపోయి "నీవు మాయిష్టముప్రకారము పెండ్లియాడుము. లేకున్న ఈవిషమును పానము సేయుము" అని చెప్పిరి. మీరాబాయి ఆనందముతో ఆగిన్నెను అందుకొని "నాథా, నీకుఁ దెలియనిది లేదు. నీకొఱకు నేను ఈవిషముఁ బానము సేయుచున్నాను" అని గడగడఁ ద్రాగివేసెను. ఆవిషము మీరాబాయి కంఠము దిగుచుండఁగానే ఎదుట నున్న సువర్ణగోపాలవిగ్రహము నల్లఁబడెను. అదిచూచి ఆమె తలిదండ్రులును చూచినవారును ఆశ్చర్యపడి శ్రీకృష్ణుఁడు మీరాబాయికి స్వాధీనుఁడై యున్నాఁడని యెఱింగి మీరాబాయికిని శ్రీకృష్ణునకును తీరని యపచారము చేసితిమని విచారించి ఆమెను క్షమింపఁ బ్రార్థించిరి. అంతట నామె "హృదయేశ్వరా, ఈయపరాధమును క్షమించి నా తలిదండ్రులను గాపాడుము" అని ప్రార్థించెను. తోడనే సువర్ణవిగ్రహము తొల్లిటివలె ప్రకాశించెను. అంతట రక్షింపవలసినదని మీరాబాయిని ఎల్లరును బ్రార్థించిరి. అది మొదలు మీరాబాయిని ఎల్లరును బూజింపసాగిరి. మీరాబాయి బ్రతికియున్నంతకాలమును ఇట్లు కాలము గడపి అవసానమున ఈశ్వరసాయుజ్యమును బడసెను. మీరాబాయిని అనుగ్రహించిన సువర్ణగోపాలవిగ్రహమును ఇప్పటికిని ఉదయపురమున జనులు కొలుచుచున్నారు.

మ. లలితాలోకతరంగసంగతము లీలాక్షుద్రహాసప్రభా
పులినంబున్ మురళీనవామృతరసంబుల్ రాధికాలోచనో

త్పలసంభావితమాధురీగుణమునై భాసిల్లు శ్రీకృష్ణుని
ర్మలవక్త్రాంబురుహాకరంబునరమింపం గోరెదన్ నామదిన్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 3. ప. 22.)

---

61. జనాబాయి.

శ్లో. అవతారాస్సంత్వన్యే, సరసిజనయనస్యసర్వతోభద్రా,
కృష్ణాదన్యఃకోవా, ప్రభవతిగోగోపగోపికాముక్త్యై.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 85.)

ఒక బ్రాహ్మణుడు సకుటుంబముగా కార్తికోత్సవమున పండరినాథుని సేవించుటకు పాండురంగక్షేత్రమునకుఁబోయెను. అచ్చట నాతని కొమార్త పాండురంగని వైభవమునకుఁజొక్కి అటనుండి కదలఁజాలకఁ పోయెను. తల్లియుఁదండ్రియు నెంత నిర్బంధించినను ఆమె "నేను పాండురంగని పాదకమలములను విడిచి రాఁజాలను. నన్ను మఱచిపొండు. మీరు యథేచ్ఛగఁ బొండు" అనిచెప్పెను. వారందఱును ఆమె నచ్చట విడిచి వెడలి పోయిరి. పిదప నామె నిశ్చింతయై భగవంతుని యెదుటఁ గూరుచుండి ధ్యానము ప్రారంభించెను. కొంతసేపు అయిన తరువాత నామదేవుఁడు ఆమెను జూచి "నీపేరేమి? నీవు ఇచ్చట ఒంటిగా నేల యుంటివి?" అని యడిగెను. "నాపేరు జనాబాయి. పాండురంగఁడే నాతండ్రి. రుక్మిణీదేవియేనాతల్లి. నేనునాతలిదండ్రుల ఇంట నున్నాను" అని యామె ప్రత్యుత్తర మిచ్చి యూరకుండెను. అంతట నామదేవుఁడు "తల్లీ, నీవు మాయింటికి వచ్చి యుండుము. నీకేమియు లోపములు ఉండవు. అక్కడ నుండి నీవు నిశ్చింతతో హరిభజనము చేసికోవచ్చును" అని చెప్పి చేయిపట్టుకొని కొనిపోయి తల్లినిఁ జూచి "అమ్మా, ఈచిన్నది పాండురంగని అంతరంగభక్తురాలు. మనతో నుండి భగవంతుని పూజించుకొనుచుండును" అని యప్పగించెను.

అదిమొదలు జనాబాయి నామదేవుని యింట సకలమును నిర్వర్తింపుచు వారియెడల చాల భయభక్తులతో మెలంగుచు నుండెను. ఇట్లుండఁగా నొకనాఁటిరాత్రి గాలివానపట్టి నామదేవుని ఇంటికప్పు ఎగిరి పోయెను. అప్పుడు పాండురంగఁడు తన సుదర్శనముచే ఆయింటికి

ఆచ్ఛాదనము చేసి ఇంటియందు ఒకవానచినుకు అయినను పడకుండఁ జేసి పడిపోయిన గోడలను మన్ను కలిపిపెట్టుటకుఁ బ్రారంభించెను. గోడలు పూర్తిసేసి అచ్చటచ్చటఁ బడియున్న చెత్తను అవ్వలఁ బాఱవేయుచుండఁగా తెల్లవాఱెను. అపుడు నామదేవుఁడునిద్ర మేల్కాంచి వచ్చి చూచి నిర్విణ్ణుఁడై "శ్రీహరీ, ఇది యేమి?" అని ప్రశ్నింపఁగా పాండురంగఁడు అంతయు నెఱింగించి ఇంటిలోనికిఁ బోయి నామదేవునితో సరససల్లాపములు ప్రారంభించెను. అది చూచి వచ్చి నామదేవుని తల్లియగు గుణాబాయి పండరినాథునకు సాష్టాంగనమస్కారములు ఆచరించెను. అంతలో జనాబాయి వచ్చి "కరుణాసాంద్రా, మానిమిత్తము నీవు ఎంత ఆయాస మనుభవించితివి?" అని చెంతఁ గూర్చుండి ఒడలు ఒత్తసాగెను. ఇంతలో గుణాబాయి వంట తయారుచేసెను. నామదేవుఁడు ఒడలినొప్పులు పోవుటకై పాండురంగని వేఁడినీట జలకమాడించి భోజనమునకుఁ గొనిపోయెను.

నామదేవుని నలువురు కుమారులతో పాండురంగఁడు ఒకపంక్తినిఁగూర్చుండెను. గుణాబాయియు, నామదేవుఁడును ఒకబంతినిఁ గూర్చుండిరి. పండరినాథుని ఆజ్ఞయగుటచే నామదేవుని భార్యయగు రాధాబాయి గూడ వచ్చి కూర్చుండెను.అందఱకును జనాబాయి వడ్డించెను. అందఱును భోజనములు ప్రారంభించిరి. కొంతయైన తరువాత జనాబాయి"నన్నువిడిచి వీరందఱును భుజించుట చాలరసభంగముగానున్నది" అని యనుకొనెను. అదిగ్రహించి పాండురంగఁడు తినుటకు ఎత్తినకబళమును పాత్రమునఁ బడవేసి"నాకిఁక భోజనము రుచించుటలేదు" అని పలికి యూరకుండెను. నామదేవుఁడు "అవును. శ్రీహరీ, జనాబాయి బంతిని లేకుండ నీకు భోజనము ఎట్లు రుచించును?" అనియెను. ఇంతలో అందఱ భోజనములును పూర్తియయ్యెను.అందఱును లేచి చేతులుకడుగుకొని యొకచో సుఖోపవిష్టులైరి. గుణాబాయి భగవంతుని భుక్తశేషమును జనాబాయికి ఇచ్చి "ఇది బ్రహ్మాదులకుఁ గూడ అలభ్యము. పండరినాథుని అనుగ్రహమువలనను నామదేవుని కరుణవలనను నీకు ఇది లభించినది" అని చెప్పుచు ఇచ్చివేసెను. తరువాత భుజింపవచ్చునని జనాబాయి ఆప్రసాదమును ఒకచో భద్రముగ దాచెను.

నాఁటిరాత్రి అందఱును నిద్రించిన వెనుక పండరినాథుఁడు ధ్వని చేయకుండ జనాబాయిచెంతకువచ్చి "ఇందాఁక నాకు అన్నమురుచింప లేదు. ఇపుడు ఆఁకలి నన్ను దహించివేయుచున్నది ఏమయినఁ బెట్టుము" అని యడిగెను. జనాబాయి "శ్రీహరీ, నీకు నాయెడలఁ గలిగిన కటాక్షము నిర్హేతుకము. నీకు ఒసఁగఁదగినవస్తువు నాచెంత ఆత్మకంటె మఱియొకటిలేదు. దానిని స్వీకరింపుము" అనిపలికెను. శ్రీహరి జాలము సేయక పగటి నాభుక్తశేషమును దెమ్ము" అనియెను. జనాబాయి అట్లు చేయఁగా మఱల పండరినాథుఁడు "నాతోఁగూర్చుండి భుజింపుము" అని నియమించెను. అంత జనాబాయి పండరినాథునితోఁ గలిసి ఏకపాత్రమున భుజింపసాగెను. ఇదిగాంచి గుణాబాయి మెల్లఁగ నామదేవుని చెంతకుఁ బోయి జరుగుచున్నది అంతయుఁ జెప్పెను. నామదేవుఁడు "అమ్మా, నీవు ఇందులకు వింతపడనక్కఱలేదు. శ్రీహరి రామావతారకాలమున శబరియెంగిలి భుజింపలేదా!" అని యడుగ నామ మాఱుపలుకక తన స్థానమునకుఁబోయి పరుండెను. భోజనానంతరము జనాబాయియు పాండురంగఁడును ఎవరిస్థానమున వారు శయనించిరి.

తెల్లవాఱుజామున్న మఱల పాండురంగఁడు అందఱికంటె ముందుగ లేచి జనాబాయిచెంతకుఁ బోయి లేపి "నీవు పిండి విసరునపుడు నీకు సాయముఁ జేయవచ్చితిని రమ్ము" అనియెను. జనాబాయి తిరుగలి వేసి గోదుమలు తెచ్చి అచ్చట నుంపఁగా పండరినాథుఁడు నీవు పాట పాడుచుండుము నేను విసరెదను" అనియెను. జనాబాయి ఒకచక్కని పాటఁ బ్రారంభించెను. పండరినాథుఁడు పిండివిసరఁదొడఁగెను.

ఈధ్వని విని గుణాబాయి లేచి "నీతో పిండి విసరుచున్న రెండవ వారెవరే? ఇందులకు నీవొక కూలిదానినిఁ బెట్టుకొంటివా యేమి? ఇట్టి రాత్రివేళ కూలికి వచ్చినది ఎవతె?" అని జనాబాయిని గద్దించి పలికెను. జనాబాయి నిరుత్తరయయ్యెను. అంతట పండరినాథుఁడు నేను కూలిదానను గాను. జనాబాయి కోమలగానమును వినుటకువచ్చి పిండి విసరుచున్నాను. నాపేరుకృష్ణాబాయి" అనిచెప్పెను. అప్పుడు నామదేవుఁడు తల్లినిఁ బిలిచి "అమ్మా, ఇఁక మాటాడకుము. నీకు పండరినాథుఁడు ప్రత్యుత్తరము ఇచ్చుచున్నాఁడు. జనాబాయి తన సుగుణము లనుపాశముచే శ్రీహరిని బంధించి వేసి వెంటఁబెట్టుకొని యున్నది" అనియెను.

అది విని గుణాబాయి తాను చేసిన ధార్ష్ట్యమునకుఁ జాల సిగ్గుపడి క్షమింపవలసిన దని శ్రీహరినిఁ బ్రార్థించెను.

పిండి విసరుట యగునప్పటికి యింకను రాత్రి యుండెను. పండరి నాథుఁడు జనాబాయితో మాటాడుచునే నిద్రించెను. అంతలోఁ దెల్లవారెను. అప్పుడు జనాబాయి స్వామినిప్రబోధించి "శ్రీహరీ, తెల్లవారినది నీకొఱకు ఆలయమున అర్చకులును,యాత్రికులును వేచియుందురు" అని విన్నవించెను. పండరినాథుఁడు జనాబాయియెడలఁ దనకుఁగలఆదరమును అంతఱకును బ్రకటనఁ జేయఁగోరి తన యాభరణములను అన్నిటిని పీతాంబరమున మూటఁగట్టి జనాబాయి బట్టలమూఁటలోఁ బెట్టి ఆమె జీర్ణ వస్త్రములలో నొకటి తీసికొని కప్పుకొని వెడలిపోయెను.

అర్చకులు తలుపులు తెఱచి చూడఁగా అంతయు విపరీతముగా నుండెను. అందులకుఁ గత మెఱుఁగఁజాలక వారందఱును తహతహపడుచుండఁగా నందొకఁడు "ఈజీర్ణవస్త్రము మొన్న నీనడుమ నామదేవుఁడు తనయింటికిఁ దీసికొనిపోయిన జనాబాయిధరించినది. స్వామి ఆభరణములను పీతాంబరమును ఆమెయే హరించియుండవలెను" అనిపలికెను. ఈమాటమీఁద నందఱును "అయియుండవచ్చు"నని కోలాహలము సేయుచు నామదేవుని యింటికి వచ్చిరి. అందఱును ఒకమాఱుగ జనాబాయిని "భగవంతునిపదార్థములను శీఘ్రముగ నిమ్ము. లేకున్న దండింపఁబడెదవు" అని గద్దింపఁగిరి. అది చూచి జనాబాయి తెల్లపోయెను. నామదేవుఁడు ఆశ్చర్యచకితుఁడై సంగతి యేమనియడుగఁగా అర్చకులు తాము యోచించి నిశ్చయించినవిషయమును దెలిపిరి. నామదేవుఁడు ఆమీఁద మాటాడఁజాలక పోయెను. జనాబాయి "ఆపదార్థములు నాచెంత నున్నచో నాకండ్లు పోవునుగాక" అనిపలికెను. అంతట అర్చకులు లోపలఁ బ్రవేశించి ఆమె బట్టలమూఁటను వెదకిరి. అందున్న వస్తువులు తోడనే వారికిఁ గాన్పించెను. పిదప నందఱును ఆమె దోషియని నిర్ధారించి శూలారోపణశిక్షవిధింపుటకు చంద్రభాగానదీతీరమునకుఁ గొనిపోయిరి. జనాబాయి తనమీఁద నిట్టి జనాపవాదము వచ్చినదని ఏమియు వగవక నిశ్చింతయై.—

శ్లో. భక్తాపాయభుజంగగారుడమణి స్త్రైలోక్యరక్షామణిః
గోపీలోచనచాతకాంబుదమణిస్సౌందర్యముద్రామణిః,

యః కాంతామణిరుక్మిణీఘనకుచద్వంద్వైకభూషామణి
శ్శ్రేయోదేవశిఖామణిర్దిశతునోగోపాలచూడామణిః.

(ముకుందమాల. 22.)

అని తదేకదీక్షతో శ్రీహరిని ధ్యానింపఁదొడఁగెను. కొంతసేపటికి అర్చకులు ఆమెను ఎత్తి శూలముమీఁద ఎక్కించిరి. తోడనే శూలము భస్మమయిపోయెను. అది చూచి అందఱును జనాబాయి నిర్దోషురాలే గాక మహాత్మురాలనియు, ఆమెయెడఁ దామపచారము చేసి అపరాధముచేసితిమనియు నొచ్చుకొనుచు ఆమె పాదములమీఁద వ్రాలి అనేకవిధముల రక్షింపఁగోరి మహావైభవముతో మఱల గ్రామములోనికిఁ గొనిపోయిరి.

ఒకనాఁడు జనాబాయి పనులు అన్నియు ముగిసిన తరువాత వాకిటఁ గూర్చుండి పాండురంగనిమీఁద కవిత్వము సేయుచుండెను. పాండురంగఁడు ఆకవితామాధుర్యమునకు సొక్కి తాటాకుమీఁద ఆపద్యములను వ్రాసికొనుచుండెను. ఈసమయమున జ్ఞానదేవుఁడు తలుపులు తెఱచికొని స్వామిని సేవించుటకు వచ్చెను. ఆతనిం జూచి స్వామి తాటాకులను దాచెను. అందులకు అసంతృప్తుఁడై జ్ఞానదేవుఁడు అనేకవిధముల గ్రుచ్చిగ్రుచ్చి యడుగఁగా స్వామి తుదకు యథార్థము చెప్పెను. జనాబాయి కవిత్వమును జూచి జ్ఞానదేవుఁడు ఆశ్చర్యపడెను. మఱునాఁడు జ్ఞానదేవాదిభక్తశిఖామణులు ఎల్లరును నామదేవుని యింటికిఁ బోయి జనాబాయిని అనేకవిధముల గౌరవించిరి.

బ్రతికియున్నంతకాలమును జనాబాయి ఇట్లే కాలము గడపి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను.

మ. అవతారంబులు లేవె శౌరి కతికల్యాణంబు లిద్ధాత్రిలో
నవి పెక్కుల్ గలవెంచ గోనికర గోపానీక గోపాంగనా
నివహ శ్రేయము సంగఁ జాలెనె కృపానిర్నిద్రుఁడైనట్టి శౌ
రివలెన్ వేరొకమూర్తి గావునఁ దదంఘ్రిం గొల్తు నెల్లప్పుడున్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. ౭5.)

62. పి ళా బా యి.

శ్లో. తృష్ణాతురే చేతసి జృంభమాణం
ముష్ణన్ముహుర్మోహమహాంధకారం
పుష్ణాతు నః పుణ్యదయైకసింధోః
కృష్ణస్య కారుణ్యకటాక్షకేళిః.

(కృష్ణకర్ణామృతము. ఆ. 3 ప. 9.)

ఒక మంత్రికి చాలపుత్రుల వెనుక లేకలేక ఒక కొమార్తె కలిగెను. ఆమెను తల్లిదండ్రులు మిగుల గారాబముతోఁ బెంచుకొనుచు పిళాబాయి అని పిలువసాగిరి. పిళాబాయియు జ్ఞానము వచ్చినది మొదలు శ్రీహరినామస్మరణము సేయుచు శ్రీహరివిగ్రహములను పూజించుచు ఆనందమూర్తియై యుండెను. అన్నదమ్ములు గూడ ఆమెను చాల ప్రేమించెడివారు. ఆమెకు యుక్తవయస్సు వచ్చిన తరువాత తలిదండ్రులు ఒక చక్కని వరునిఁ దెచ్చి శుభముహూర్తమున మహావైభవముతో వివాహము గావించిరి.

కాని ఆమె దౌర్భాగ్యమువలన కొలఁదికాలమునందే ఆమెభర్త చనిపోయెను. అందులకుఁ జేయునదియేమియు లేక ఆమె తన కాలమునంతను తల్లిదండ్రులను సేవించుటయందును శ్రీహరినిఁ బూజించుటయందును గడపసాగెను. ఇట్లుండఁగా మఱికొన్నిదినములకు తలిదండ్రులుగూడ ఒక్కమాఱుగ కాలము చేసిరి. పిళాబాయి ఈతీరున ఆపత్సముద్రమున మునిఁగిపోయియు ధైర్యమును వీడక సదా హరినామమును స్మరించసాగెను. ఇట్లు మఱికొంతకాలము జరుగునప్పటికి ఆమె సోదరులు ఒకరితోనొకరు తగవులాడుకొని విడిపోయిరి. వారు ఆస్తియంతయు పంచుకొనుటలో పిళాబాయి దేవతార్చనసేయు పెట్టె చిన్నవాని భాగమునకుఁ బోయెను. దీనిని వాటాలు వేసికొనుట మంచిది గాదని పెద్దవాఁడు ఎంత పట్టుపట్టినను తక్కినవారు అంగీకరింపరైరి. పిళాబాయి పెద్దన్నవద్ద నుండెను. ఆమె తన పెట్టెను పంపవలసినదని ఒక నౌకరుని చిన్నఅన్నవద్దకుఁ బంపెను గాని ఇచ్చుటకు ఇష్టము లేక "చాల వెదకితిని. ఎచ్చటను గాన్పింపలేదు" అని వర్తమానము పంపెను. పిళాబాయి ఆపెట్టెలో నున్న శ్రీకృష్ణవిగ్రహమును బూజింపకుండ భోజ

నము సేయదు. అగుట నామె ఉపవాసములు చేయఁజొచ్చెను. ఇట్లు అయిదాఱు దినములు గడచిన తరువాత ఒకరాత్రి శ్రీకృష్ణుఁడు స్వప్నమున వృద్ధబ్రాహ్మణరూపముతో పిళాబాయికి సాక్షాత్కరించి "నీవు వగవవలదు. నేఁటినుండి నీవు అనవరతమును భగవద్గీతను పారాయణము సేయుచుండుము. శ్రీకృష్ణుఁడు భగవద్గీతారూపమును స్వీకరించి యున్నాఁడు. భక్తులకు అంతకంటె పూజ్యము మఱియొకటి లేదు" అని చెప్పి ఆమె పెట్టెను ఆమెచేత నుంచి తిరోహితుఁడయ్యెను.

పిళాబాయి ఆశ్చర్యముతో మేల్కాంచి చూడఁగా చేతిలో తన పెట్టెయుండెను. "భగవంతుఁడే వృద్ధబ్రాహ్మణరూపముతో సాక్షాత్కరించె" నని తెలిసికొని యామె పరమానందముతో అదిమొదలు భగవద్గీతాపారాయణము చేయసాగెను. కొన్నిదినము లయిన తరువాత ఆమె చిన్నియన్న చెల్లెలి మాహాత్మ్యమును గుర్తెఱిఁగి పెద్దన్నను ఆమెను పాదములుపట్టి క్షమింపవలసినదని ప్రార్థించిపోయెను. అదిమొదలు కొని ఆమె యన్నలుగూడ శ్రీహరినిఁ బూజించుచు అతిథులను, అభ్యాగతులను ఆదరించుచు శాంతముగఁ గాలము గడుపసాగిరి. పిళాబాయి బ్రతికియున్నంతకాలమును శ్రీహరినిఁ బూజించి అవసానమున ఈశ్వర సాయుజ్యమును బొందెను.

మ. అమితాశాంతమైన నాపది నపత్యంబైన మోహాంధకా
రము గాఢంబ్యకటాక్షవీక్షణవిభారాశిన్ విశోధించి సె
య్యము నంబ్రోచుదయాపయోధిననబ్బం బారణ్యకర్మంబిబ్బం
దనునోలోచనసాధుసేవధిప్రమోదంబొప్ప నెల్లప్పుడున్.

(కృష్ణకర్ణామృతం ఆ. 3. ప. 9)

---

63. గుణవతీబాయి.

శ్లో. ఉదారమృదుస్మితవ్యతికరాభిరామాననం
ముదా ముహుః దీర్ఘయా మునిమనోంబుజాప్రీడితం
మదావిలవిలోచనవ్రజవధూముఖాస్వాదితం
కదానుకమలేక్షణంకమపిబాలమాలోకయే.

(కృష్ణకర్ణామృతం. ఆ. 3. ప. 11.)

మాధవసింగు అనురాజునకు గుణవతీబాయి యనుభార్యయుండెను. ఆమె పతివ్రత యని చాల ప్రఖ్యాతి గడించెను. ఆమెకు ఇరువురు కుమారులు కలిగిరి. వారినిఁ బెంచుటకు నియమింపఁబడిన దాదియు చాల మంచిది. ఆమె పెదవులు ఎల్లప్పుడును కదలుచుండెడివి. అందులకు రాణి ఆశ్చర్యపడి ఒకనాఁడు అడుగఁగా దాది "నేను ఎప్పుడును శ్రీహరినామపారాయణము సేయుచుందును" అని చెప్పెను. రాణి అందలి విశేషము అడుగఁగా దాది అంతయుఁ జెప్పెను. గుణవతికి అది వినఁగనే తానుగూడ నట్లే శ్రీహరినిఁ బూజింపవలయునని తోఁచెను. అంతట నామె కోరఁగా దాది శ్రీకృష్ణమంత్రము నుపదేశించి, శ్రీకృష్ణవిగ్రహమును ఇచ్చి "భక్తిశ్రద్ధలతోఁ బూజింపుము" అని చెప్పెను.

అది మొదలు రాణి దాది చెప్పిన చొప్పునఁ జేయసాగెను. ఆమె ప్రతిదినమును లెక్కలేనంతమంది బీదలను వికలాంగులను భాగవతాగ్రేసరులను మృష్టాన్నతృప్తులం గావించుచు అచిరకాలమునందే అంతటను ప్రఖ్యాతి వహించెను. అంతేగాక ఆమె స్వల్పకాలమునందే ప్రపంచధర్మములు అన్నియు విడిచి కేవలము శ్రీహరిపూజయందే నిమగ్న యయ్యెను. అది చూచి రాజు ఆమెకు మతిపోయె నని నిశ్చయించి అనేకవైద్యులను రావించి సలహాలను అడుగఁగా వారు పరీక్షించి యథార్థమును గనుగొని రాజునకుఁ దెలిపిరి. రాజు అది నమ్మఁజాలక "నీవు అన్నిటిని వదలి ఇట్లు ఉన్మత్తవలె నుంటివేల?" యని ప్రశ్నింపఁగా "నేను శ్రీహరిపూజను దక్క నన్యమును మఱచియున్నా" నని ప్రత్యుత్తర మిచ్చెను. అంతట రాజు చాల కోపముతోఁ గన్ను లెఱ్ఱఁజేసి చూడఁగా రాణి భయభ్రాంతయై కన్నులు మూసికొనియెను; గాని శ్రీహరి దివ్య మంగళవిగ్రహముతో ఆమూసిన కనులయందే సాక్షాత్కరించి "నేనున్నాను. నీకు భయము వలదు" యని ధైర్యము చెప్పెను. అంతట గుణవతీబాయి చేతులు జోడించుకొని "శ్రీహరీ, ప్రపంచము తలక్రిందులైనను నేను నీసేవను విడువను" యనిపలికి బాష్పాకులనయన యయ్యెను. రాజు ఇది యంతయు నటన యని భావించి "నేఁడు మొదలు నీవు యుక్తమార్గమునకు రానిచో దండింతు' నని రాణికిని "ఈమె భాగవతులు యను దేశపుద్రిమ్మరుల

వలలోఁ జిక్కి యున్నది; గాన వాండ్రను కోటలోఁ బ్రవేశింపనీయ వలదు" అని భటులకును తీవ్రముగ నాజ్ఞాపించి వేటకుఁ బోయెను.

భర్త ఇట్లు ఆజ్ఞాపించినను గుణవతి శ్రీహరిపూజ యథాపూర్వముగఁ జేయుచునే యుండెను. భాగవతార్చనము మాత్రము జరుగకుండెను. "నగరునందలిసమాచారములను ఎప్పటికప్పుడు వివరముగాఁ దెలుపుచుండవలయు" నని రాజు మంత్రికి దిట్టపఱిచియుండెను. ఆ ప్రకారము మంత్రి రాణి ప్రవర్తన మంతయు అడవియందున్న రాజునకు వ్రాసి పంపెను. అది చూచి రాజు మండిపడి "రాణిని చంపి రండు" అని నలుగురు హంతకులకు ఆజ్ఞ ఇచ్చి పంపెను రాజాజ్ఞను బడసి వాండ్రు నగరునకు వచ్చునప్పటికి రాణి హరిపూజానిమగ్నయై యుండెను. అగుటచే వాండ్రు కొంతతడవు నిరీక్షించిరి. ఇంతలో ఆమె పూజించుచున్న శ్రీకృష్ణవిగ్రహము నుండి ఒక క్రూరవ్యాఘ్రము వెలువడివచ్చి హంతకులను చూచుచుండఁగనే చంపివేసి మాయమైపోయెను.

ఆధ్వని వినిన వారును రాణియు వచ్చి చూచి జరిగిన దంతయు తెలిసికొని తెల్లవోయిరి. రాణి మఱల యథాస్థానమునకు వచ్చి "శ్రీహరీ, నీసంకల్పమును.తొలుతనీక్షుద్రురాలికి ఎఱింగింపఁగూడదా? ఈపనివలన అనేకాసందర్భములు తటస్థింపనచ్చును. ఎట్లయినను ఈయభాగ్యులను నామీఁద దయయుంచి బ్రతికింపవలెను" అని ప్రార్థింపఁగా "వీరిమీఁద నీవు తులసితీర్థమును ప్రోక్షింపుము" అని అశరీరవాణి వినఁబడెను. వెంటనే రాణి యాప్రకారము సేసెను. అంతట హంతకులు నిద్రఁబోయిన వారివలె లేచి నిలిచి నిటలతలఘటితాంజలులై "మేము రాజాజ్ఞచే న్నిన్ను సంహరించుటకు వచ్చితిమి. అయినను మాయెడఁ గరుణించి మమ్ము బ్రతికించితివి. మాయపరాధములను మన్నించి మమ్ము దాసులుగా నంగీకరించి మాకు మోక్షమార్గమును జూపుము" అని పాదములమీఁద వ్రాలి ప్రార్థించిరి. గుణవతి సన్మార్గమునఁ బ్రవర్తింపుఁడు అని వారికి హితోపదేశమును జేసి శ్రీహరి పూజ ముగించి భగవన్నివేదితాన్నమును భుజించెను.

మంత్రి మహాశ్చర్యమగ్నుఁడై ఇదియంతయు రాజునకు వ్రాసి పంపెను. అదిచూచి అచ్చట రాజును ఆశ్చర్యచకితుఁడై" ఇన్నాళ్లును నేను గుణవతిమాహాత్మ్యము నెఱుంగక క్రూరుఁడనై ప్రవర్తించితి"

వని చింతించి "రాణిమీఁద నేను విధించిన నిషేధము లన్నియు తొలంగించివేసితిని. ఆమె భాగవతార్చనము మున్నగువానికి ఎట్టి యభ్యంతరము లేదని తెలిపి అడిగినదెల్ల వెంటనే యొసంగుచుండ వలసినది" అని మంత్రికి ఆజ్ఞాపించెను.

రాజు మఱినాలుగుదినములు కడచిన తరువాత నగరమునకుఁ బయలు దేఱెను. మార్గమధ్యమున నొక నది పొంగిపొరలుచు కూలంకషముగఁ బ్రవహించుచుండెను. రాజు రాణి నెప్పుడుచూతు నను సంభ్రమముతో కష్టసుఖము లాలోచింపక పడవలు విడిపించెను పడవలు ఏటినడుమకు వచ్చునప్పటికి ప్రవాహవేగమువలన మునిఁగిపోవుటకుఁ సిద్ధ మయ్యెను. అంతట రాజు "రాణీ, నీవు చేయు హరిపూజయందు మాహాత్మ్యమున్నచో మేము ఇపుడు నిరపాయులము కావలయును" అని పలికెను. అంతట కనుమూసి తెఱచినంతలో పడవ సురక్షితముగ ఒడ్డునకుఁ జేరెను.

పిదప రాజు నగరముచేరి వెంటనే అంతఃపురమున నున్న రాణి చెంతకుఁ బోయి మోకారించి నిలిచి "నీవు మహనీయురాలవు. నీ మాహాత్మ్యము నెఱుఁగక నీకు ఎగ్గుసేసితిని. అపరాధిని క్షమింపవలయును" అని ప్రార్థించెను. అపుడు రాణి రాజును లేవనెత్తి "మీరిట్లు పలుకుటధర్మముగాదు. అంతయు శ్రీహరిచేతిలో నున్నది. శ్రీహరియే లోకరక్షకుఁడు. ఈసంసారము ఈప్రపంచము నంతయు అశాశ్వతము. మఱియు అసారము. దీనియెడల మోహితులై యుండుట బుద్ధిమంతుల లక్షణముగాదు. శ్రీహరిని నమ్మనివారు బాగుపడలేదు" జనార్దనుని నమ్మినవారు చెడిపోలేదు. ఉత్తమమైన నరజన్మము ఎత్తినందులకు శ్రీహరిని సేవించుటకంటె సర్వోత్తమము లేదు" అని చెప్పెను.

రాజు రాణివాక్యములు వేదమంత్రములుగాభావించి అదిమొదలు శ్రీహరియెడల భక్తిప్రపత్తులు గలిగి ప్రవర్తించుచుండెను. రాణి రాజునకు చిత్తశుద్ధి గలిగినదని నిశ్చయించుకొని "మీరు అన్నివిధములను ధన్యులరైతిరి. జ్ఞానశేఖరులుగూడ అయితిరి. అయినను ఆచార్యోపదేశముపొందనివారు భగవంతుని అంతరంగభక్తులలోఁ జేరఁజాలరు. ఆచార్యోపదిష్టముగాని జ్ఞానము మోక్షము నొసంగఁజాలదు. కావున మీరు ఒక సదాచార్యు నాశ్రయింపవలసిన" దని చెప్పెను. రాజు

అందులకు అంగీకరించి "నాజ్ఞానము గురూపదిష్టమైనదే. నీకంటె నాకు సదాచార్యు లెవరు లభింతురు? నీవు నాయెడల దయయుంచి ఉపదేశించితివి; గావుననే నాకు మోక్షమార్గము తెలిసినది. అయినను నీ యిష్టమువచ్చినట్లు మెలంగెదను. నీయుపదేశముగాక మఱియొకరియుపదేశముగూడ నాకు అవసరమని నీకుఁ దోచినచో నట్లే చేయవచ్చు" నని చెప్పెను.

అంతట రాణి తనకు ఉపదేశముఁ జేసిన దాదినిఁ బిలిచి "నాకు జ్ఞానోపదేశముసేసితివి. రాజుగారిని గూడ అనుగ్రహింపుము" అని చెప్పెను. దాది తొలుత నొకంత సందేహించెను. గాని తుదకు అంగీకరింపక తీఱదయ్యెను. యుక్తసమయమున దాది రాణిచే నాజ్ఞప్తయై యథావిధిగ రాజునకు జ్ఞానోపదేశము గావించి పూజింపు మని శ్రీకృష్ణవిగ్రహమును ఇచ్చెను.

రాజు శ్రీహరిపూజ ప్రారంభించెను. ఒకనాఁడు శ్రీహరి దివ్యమంగళవిగ్రహముతో రాజునకు సాక్షాత్కరించి "నీవు నాయంతరంగభక్తుఁడవు. నీకు ఏమియు లోపములు కలుగఁబోవు" అని చెప్పి తిరోహితుఁడయ్యెను. తరువాత రాజును రాణియు దాదియు సకుటుంబముగ తీర్థయాత్రకుఁ బయలు దేఱిపోయిరి. అనేక దివ్యస్థలములయందు శ్రీహరి వారికి దర్శనమిచ్చి సేవయొసంగెను. రాజు తన కుపదేశము చేసిన దినముమొదలుకొని దాదికి సేవకతను బాపి ప్రత్యేకముగ మఠమును నిర్మించి ఇచ్చెను. రాజును రాణియు దాదియు బ్రతికియున్నంత కాలము ఇట్లు శ్రీహరినిఁ బూజించి అవసానమున సాయుజ్యముక్తినిఁ బడసిరి.

ఉ. కన్నులకొద్దిఁ జూచి వ్రజకాంతలు వేణుకృష్ణునిందగాఁ గా
సన్నపువన్నెచన్నులు సళ్లఁగఁ జల్లగ నల్లమానులన్
సన్నుతమానసాబ్జములసాంద్రసహాయహింసమించున
కన్నులపండువైనముఖకంజముగంజిలుపాలఁ గాంచెదన్.

(కృష్ణకర్ణామృతం ఆ. 3 ప. 11.)

64. సక్కుబాయి.

మ॥ అలరున్ ధన్యుల కేకథామృతము జిహ్వన్ లేహ్యమై బాల్యచా
పలముల్ రాధకు నెయ్యపుంగినుక నాపాదించు నేయందముల్
వెలయున్ మోమున వేణుగానకలనన్ వేమాఱు నాదివ్యచ
గ్యాలి నామానసవీథి వేఁగెదను ధారాళంబుగా నిల్వఁగన్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 106)

కృష్ణాతీరమున కరవీరపురము అను నొక గ్రామముకలదు అందు ఒక బ్రాహ్మణుఁడు ఉండెను ఆతఁడు గొప్పవిద్వాంసుఁడే; గాని సత్యధర్మదయాశౌచములు లేని కఠినుఁడు. అన్నివిధముల నాతని ప్రవర్తనము హేయమైనది. ఆతనిభార్య సకలవిధముల నాతనికిఁ దీసిపోనిది వారికి ఒక కుమారుఁడు ఉండెను. ఆతఁడు బాల్యమునందే సకలవిద్యలను నేర్చుకొనెను.

వృద్ధబ్రాహ్మణుఁడు తన కుమారుఁడు వివాహయోగ్యుఁడై యున్నాఁడని యెఱింగి భార్యతో యోచించి పెండ్లికొమార్తను వెదకికొనుటకు బయలుదేఱెను. ఆతఁడు ఒకనాటి సాయంకాలమునకు పండరిపురమునకు మిగుల చేరువ అన్న ఒక జనపదము చేరుకొనెను. చీఁకటిభయంబున నాతఁడు ఆరాత్రి ఆయూరనే గడుపఁగోరి ఒక బ్రాహ్మణునియింటికిఁబోయెను. ఆయింటి యజమానుఁడు వచ్చినబ్రాహ్మణుని చాలనాదరించి భోజనమునకు ఉండవలసినదని కోరెను. ఆతని కొక కూతురు ఉండెను. ఆమె చక్కనిచుక్క. విద్వాంసురాలు. వినయవతి. సుగుణఖని. ఆమెనుజూచిన వెంటనే మన వృద్ధబ్రాహ్మణుఁడు ఆమెను తనకుమారునకుఁ జేసికొనిన బాగుండు ననితలంచి భోజనానంతరము ఆమె తండ్రితో దనయభిప్రాయము సెప్పెను. ఆతఁడును తన ఇల్లాలితో నాలోచించి వల్లెయనెను. పిదప వారిరువురును నిశ్చయపఱచుకొనవలసినవిఎల్ల నిశ్చయపరచుకొని ముహూర్తమునుగూడ ఏర్పఱచుకొనిరి. మన వృద్ధుఁడు ఆనందముతో ఇంటికి బయలుదేఱెను.

కరవీరపురము సేరిన వెంటనే వృద్ధుఁడు సంగతులు అన్నియు భార్యకు ఎఱింగించెను. ఆమె చాల నానందించెను. పిదప వారు సుము

హుూర్తసమయమునకు బంధువులు అంతఅతోడనుఁ దరలివెళ్లి కొడుకునకు వివాహమహోత్సవము గావించివచ్చిరి. పెండ్లికొడుకు అత్తవారి యింటఁ గొన్నిదినములు ఉండి పిదప సక్కుబాయి అను తనభార్యతో తన స్వగ్రామమునకు వచ్చెను. తలిదండ్రులు ఓపినకొలఁదిని సక్కుబాయికి సారెచీరలు ఇచ్చి పంపిరి.

సక్కుబాయి బాల్యమునుండియు శ్రీహరినామస్మరణము సేయుచుండెడిది. ఒకనాఁడు అతిథి యొక్కఁడు ఆమె భక్తిశ్రద్ధలను జూచి ఆమెకు శ్రీకృష్ణమంత్రమును ఉపదేశించిపోయెను. సక్కుబాయి అప్పటినుండియు శ్రీహరిధ్యానమును అనవరతమును జేయుచుండెను అత్తింటికి వచ్చినతరువాతఁగూడ నామె శ్రీహరిస్మరణము మానలేదు. అది చూచి అత్త మామలు చాల కంటగించుకొని "ఈహరిపూజవలన ఇప్పుడు గృహకృత్యములు సాగవు. ముందు ముందు విరక్తి గలిగి చెడిపోవుదు" వనియుఁ జెప్పుచు ఆమెను హరిస్మరణ మానునట్లు నిర్బంధింపసాగిరి. అంతట సక్కుబాయి వారి దౌర్జన్యమునకు ఓడి అంతరంగమునందే హరిని ధ్యానించుచు వారుచూడనప్పుడు ఎట్లో వీలుచేసి హరినామమును గీర్తించుకొనుచుండెను. హఠాత్తుగా నిదియొకనాఁడు అత్తగారు చూచెను. నాఁడు మొదలుకొని అత్తమామలు మన యాజ్ఞలను దిరస్కరించిన" దని నిశ్చయించి అనేకవిధముల బాధపెట్టసాగిరి. చాకిరీ అంతయు ఒక్కతెయే చేసినను సక్కుబాయికి కొన్నిదినములు అన్నపానీయములు ఇచ్చుట మానివేసిరి. అయినను ఆమె దుఃఖింపక వారి యాజ్ఞలను అనువర్తించుచుండెను. "ఇదిమొండికెత్తినది" యని తలంచి అత్తమామలు ఆమెను మగనిచేఁ గూడఁ గొట్టింపసాగిరి. ఇది చూచి ఇరుగు పొరుగువారు కొందఱు "మీకోడలు కేవలము లోకజనని యగు మహాలక్ష్మివలెఁ గాన్పించుచున్నది. ఆమెను మీరిట్లు బాధించుట మీకుఁ దగ" దని చెప్పిరి. అంతట ఆదంపతులు ఇరువురును "మాఇంటి గొడవలు మీకుపేల" యని వారిని దూషించి పంపివేయుటయేగాక అదిమొదలు "ఇది యింటిగుట్టంతయు పొరుగువారికిఁ దెలుపుచున్నది" అని అనేకవిధముల సక్కుబాయిని మఱింత బాధింపసాగిరి.

ఒకనాఁడు సక్కుబాయియు ఆమెవలెనే సుగుణవతియు ఇరుగుపొరుగులవారిబిడ్డయు నగుశాంతయను యువతియుఁగలిసి చెరువునకు

నీళ్లకు వెళ్లిరి. అచ్చట అయిదారుగురు భాగవతులు కూర్చుండి శ్రీహరి కీర్తనలు గొంతెత్తి శ్రావ్యముగఁ బాడుచుండిరి. సక్కుబాయి ఆకీర్తనలకు మదికరుగ "శాంతా, నీవు ఇంటికిఁ బొమ్ము. నేను వీరితోఁ బండరిపురమునకుఁ బోయి పాండురంగని సేవించి వచ్చెదను. అనిచెప్పెను. శాంత ఈసంగతి సక్కుబాయి అత్తమామలకు ఎఱిఁగించెను. అంతట వారిరువురును మండిపడి కొడుకును వెంటనిడుకొని చెరువునకుఁ బోయిరి. భర్త సక్కుబాయిని చావమోది జుట్టుపట్టి ఈడ్చుకొనిపోయెను. ఆతనితలిదండ్రులు భాగవతుల ననేకవిధములఁ దూలనాడిరి. ఇంటికి వచ్చిన తరువాత వారు సక్కుబాయిని పెడరెక్కలు విఱిచి స్తంభమునకుఁ గట్టిపెట్టి అన్నపానములు ఈయక హింసింపసాగిరి. సక్కుబాయి చేయునది ఏమియు లేక,

మ. అమరీమానితగానమున బృందారణ్య మందాన్వం
దము క్రీడల్ యమునాతరంగకణికాంచద్వాటికాసన్మదే
శమునన్ సాంద్రఘనాఘనప్రతిభటశ్యామచ్ఛవిం బొల్చుధా
మము నామానసపీఠకంగగుణాగ్రస్ఫూర్తి నిల్పంగఁ దేర్పడున్.

ఉ. చీఁకటి మ్రానిఁ జొంపములఁ జెన్నగు సైకతవేదిసీలపు
న్నాకజలంబులో మురళి వాయుచు నంచనఁ బట్టి దట్టిపై
దాకొనఁ గొమ్ముఁ జెక్కుకొని తామరపాపునఁ జల్లి మెక్కుచున్
గోకులముం బ్రతిక్షణముఁ గూరిమిఁ గన్గొను బాలుఁ గాంచెదన్

శా. శ్రీవత్సాంకితు గోపికానయనరాజీవార్చితుం గోపగో
సేవాంభావితుఁ గౌస్తుభోల్లసితు వంశీనాదమోహాన్వితున్
గోవిందున్ వనసింహము స్త్రీశశినస్త్రజాస్యుల్లసత్పల్లవున్
శ్రీవిభ్రాజితు హాటకాంబరయుతున్ సేవింతు భూపాంచితున్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 3 ప. 84. 82. 80).

అని నిశ్చలచిత్తముతో శ్రీహరిని ధ్యానించుచు "పాండురంగా, నాకు ఎట్టికష్టములు సంభవించినను బాధ లేదుగాని నీయుత్సవమునుజూచుటకు శక్యము గానందులకుమాత్రమే వగచుచున్నాను" అని వగవసాగెను. ఆప్రార్థనమునకు హృదయము కరుగ విఠలనాథుఁడు సక్కుబాయి రూపమును ధరించి అర్ధరాత్రివచ్చి సక్కుబాయిని ప్రబోధించి "నీవు వచ్చునంత దనుక నేను ఈకట్లయందుఁ బడియుండెదను. నీవు పోయి

పాండురంగని సేవించుకొని రమ్ము" అని చెప్పెను. సక్కుబాయి అందులకు సందేహింపఁగా విఠలనాథుఁడు అనేకవిధముల నప్పఁజెప్పి ఆమెను కట్లువిప్పి పంపివేసి తాను కట్టుకొనెను. సక్కుబాయి పండరిపురమునకుఁబోవు భాగవతులతోఁ గలసి మార్గమున అనేకపుణ్యనదులు దాఁటి పండరిపురముఁ జేరుకొనెను.

అచ్చట నామె సకలోత్సవములఁ గనుజూచి మహానందభరితురాలై పాండురంగని పాదములమీఁద వ్రాలి "శ్రీహరీ, ఇఁక నే నీప్రపంచమున ఈయమయాతనల ననుభవింపఁజాలను. నన్ను నీలోఁ గలుపుకొనుము" అని ప్రార్థించెను. అంతట జ్యోతిర్మయమైన సక్కుబాయి ఆత్మ పాంచభౌతిక దేహమును విడిచి శ్రీపండరినాథునియందు ఐక్యమైపోయెను. అది చూచుచున్న భాగవతాగ్రేసరులు అందఱును ఆశ్చర్యచకితులై బ్రహ్మానందముతో సక్కుబాయి కళేబరమును చంద్రభాగానదీతీరమునకుఁ గొనిపోయి దహనసంస్కారముఁ గావించి వచ్చిరి.

అట సక్కుబాయిరూపముతో నున్న పాండురంగఁడు నిద్రాహారములులేక పదునైదుదినములు కట్లయందు ఉండెను. అంతట సక్కుబాయిమగఁడు ఒకనాఁడు "ఇది పదునైదుదినములనుండి ఇట్లు నిద్రాహారములు లేకయున్నది. ఇంకను ఇట్లె యుండిన మరణించును. ఇంత సుందరి ఇంతగుణవతి ఇంతవిద్యావతి ఇంతటి వినయవతి ఇఁక లభించుట కష్టము" అని తలంచి కట్లువిప్పి "పోయి స్నానముచేసి వచ్చి వంట చేయుము" అని నియమించెను. సక్కుబాయిరూపముతో నున్న భగవంతుఁడు సకలమును నిర్వర్తింపసాగెను. ఆమె వండిన పదార్థముల మాధుర్యమును జూచి వారు అత్యాశ్చర్యచకితులై అదిమొదలు చాలఁగా ఆమెను ఆదరింపసాగిరి.

ఇది యిట్లుండఁగా అట రుక్మిణి సర్వమును ఎఱింగి యున్నది; గావున "సక్కుబాయిరూపముతో నానాథుఁడు అక్కడఁ జిక్కుకొని యున్నాఁడు. ఇట సక్కుబాయి మరణించినది. ఏమిసేయుదు" నని యోచించి సన్నిధి నాశ్రయించియున్న భాగవతాగ్రేసరులను బిలిచి "మీరు సక్కుబాయి కళేబరమునకు దహనసంస్కారముచేసి వచ్చితిరి గదా! ఆమె అస్థులను గొనివచ్చి నాయెదుట నుంపుఁడు" అని నియమించెను. ఆమె యాజ్ఞాప్రకారము వారు రుద్రభూమికిఁబోవునప్ప

టికి సక్కుబాయి అస్థికలు నారాయణస్మరణము సేయుచుండెను. అందులకు పరమాశ్చర్యభరితులై భాగవతులు వానిని బంగరుపళ్లెరమున నిడి తెచ్చి రుక్మిణి పాదములచెంత నుంచిరి. రుక్మిణి వానిని దాఁటిన వెంటనే సక్కుబాయి సజీవయై సదేహయై లేచి నిలిచెను. భాగవతులందఱును సక్కుబాయి భాగ్యమును రుక్మిణి కరుణాహృదయమును అనేక విధములఁగొనియాడిరి.

రుక్మిణి సక్కుబాయిని కౌఁగిటఁబొదివిపట్టి "తల్లీ, శ్రీహరి నీరూపముతో కరవీరపురమున నున్నాఁడు. నేను ఆతని విశ్లేషమును సహింపఁజాలకున్నాను. నీవు పోయి నానాథునిఁ బంపివేయుము" అని చెప్పెను. ఆప్రకారము సక్కుబాయి బయలుదేఱెను. ఆమె కరవీరపురము చెఱువు గట్టుమీఁదికి వచ్చునప్పటికి సక్కుబాయిరూపముతో నున్న శ్రీహరి జలాహరణార్థము పోయి "తల్లీ, నీమనోరథము నెఱవేఱినది గదా" యని యడిగి బిందెను ఆమెకు ఇచ్చివేసి అదృశ్యుఁడయ్యెను. సక్కుబాయి ఆబిందెను గైకొని జలకమాడి నీళ్లు ముంచుకొని ఇంటికిఁ బోయెను.

రుక్మిణి పాదములసన్నిధిని సక్కుబాయి అస్థికల నుంచిన భాగవతులలో నొకఁడు సక్కుబాయి మాహాత్మ్యమును ఆమె అత్తమామలకును, మగనికిని జెప్పవలయు నని వెంటనే బయలుదేఱి కరవీరపురము వచ్చెను. అతఁడు సక్కుబాయి యింటికి వచ్చునప్పటికి ఆమె లోపలనుండి యెదురువచ్చి "మహానుభావా, దయచేయుము" అని స్వాగతమిచ్చెను. అందులకు ఆశ్చర్యచకితుఁడై ఆతఁడు పండరిపురమున జరిగినది అంతయు అంకఱకును ఎఱింగించెను. అది విని అత్తమామలు యథార్థము చెప్పుమని యడుగఁగా సక్కుబాయి తనకుఁ దెలిసినది అంతయుఁ జెప్పెను. అది విని వారు అందఱును మహానందభరితులై ఆమె ననేకవిధములఁ గొనియాడి "నీమాహాత్మ్యము నెఱుఁగక నిన్ను అనేకవిధముల బాధించితిమి. క్షమింపుము" అని ఆమెను ప్రార్థించిరి. మఱియు "నీవు బాల్యమునందే మోక్షమార్గమును సాధించితివి. మాకుఁగూడ దరిణోపాయమును ఎఱింగింపు" మని గూడ వేఁడుకొనిరి.

అంత సక్కుబాయి సకలమును వారికి బోధించి "ఆచార్యోపదేశముఁ బడసినఁగాని ప్రయోజనము లేదు" అని వారిని వెంట నిడుకొని

పండరిపురమునకుఁ బోయి "ఆచార్యుని పాదములమీఁద వ్రాలి "వీరు మిమ్మాశ్రయింప వచ్చినారు. వీరిని అనుగ్రహింపవలయు" నని ప్రార్థించెను. ఆచార్యుఁడు వారికందఱకును శ్రీకృష్ణమంత్రము నుపదేశించి జ్ఞానబోధగావించెను. అందఱును స్వస్థలముఁ జేరుకొని బ్రతికియున్నంత కాలమును శ్రీహరిని సేవించి అవసానమున సాయుజ్యముక్తిఁ బడసిరి.

మ. పరమాత్మ్యాయతురంగసేవితలసత్పాదాంబుజద్వంద్వుఁ బం
కరుహాక్షానుఁ గృపాబ్ధి నిర్గుణు నఘౌఘఘ్నుం సురమ్యుం బరా
త్పరమంబుఙ్ బురుషోత్తముఙ్ బరుఁ బరబ్రహ్మఙ్ నిజానందు శ్రీ
హరి శ్రీరాముఁ బ్రధానపూరుషు ఘనశ్యామాంగు భావించెదన్.

(రామకర్ణామృతం. ఆ. 2. ప. 45.)

---

65. సుపరాబాయి.

శ్లో. దేవక్యాజఠరాకరేసముదితః క్రీతోగవాంపాలినా
నందేనానకదుందుభేర్నిజసుతాపత్యేనపుణ్యాత్మనా,
గోపాలావళిముగ్ధహారతరలోగోపేననామ్నాకృతః
స్తేయానోఽపహ్నుదిసంతతంసుమనసఃకోఽపీంద్రనీలోమణిః.

(కృష్ణకర్ణామృతం. ఆ. 2. ప. 97.)

శరవాహనుఁడు అను రాజు సభలో ఒక పురోహితుఁడు ఉండెను. ఆతఁడు సకలశాస్త్రములును జదివినపండితుఁడు. శమదమాది సుగుణ భూషితుఁడు. ఆతని కేవిధమునను లోపము లేదు; గాని సంతానము లేదు. ఆతనిభార్య అన్నివిధముల నాతనికిఁ దగినది. ఆదంపతులు ఇరువురును సంతానము నిమిత్తము అనేకవ్రతములు, అసంఖ్యదానములు, ఇంకను అగణ్యప్రయత్నములును జేసిరి; గాని సంతానముగలుగ లేదు. "ఇఁకఁ బ్రయోజనము లేదు" అని నిశ్చయించుకొని వారు సంతానము నెడల నిరాశచేసికొని శ్రీహరిధ్యానమునఁ గాలము గడుపుచుండిరి.

ఒకనాఁటి రాత్రి పండరినాథుఁడు ఆమెకు స్వప్నమున సాక్షాత్కరించి "నీభర్తతోఁగలిసి ద్వారకానగరమునకు వచ్చి నన్ను సేవింపుము" అని నియమించి తిరోహితుఁడు అయ్యెను. వెంటనే యామె మేల్కాంచి భర్తను లేపి జరిగినది అంతయు నెఱింగించెను. ఆబ్రాహ్మణుఁడును అది విని పరమానందభరితుఁడై భార్యసౌభాగ్యమును గొనియాడి మఱునాఁడె ద్వారకకుఁ బ్రయాణము అయ్యెను.

ఆదంపతులు యుక్తసమయమున ద్వారకానగరము సొచ్చి యథోక్తముగ స్వామిని సేవింపఁబోయిరి. వీరు గర్భాలయముసమీపించు నప్పటికి స్వామి దివ్యమంగళవిగ్రహముతో సాక్షాత్కరించి ఎదురుగ వచ్చి కౌఁగిలించుకొని ఆదరముతోఁ గొనిపోయి "మీకుఁ జింతవలదు. మీకు నాయందు మిగుల భక్తిప్రపత్తులు గల కొమార్త కలుగును. ఆమెవలన లోకమంతయు నానందించును" అని చెప్పి తిరోహితుఁడు అయ్యెను. అందులకు వారు పరమానందభరితులై యుండఁగా వారితో స్వామిదర్శనమునకు వచ్చినవారు అందఱును వారి అదృష్టమునకు మిగుల నచ్చెరువడసాగిరి.

పిదప వారు బసకుఁ బోయి వంటఁ జేసి భగవంతునకు నివేదించి భాగవతార్చనముగావించి తచ్ఛేషమును భుజించిరి. పిదప వారు ఆనగరమునందే యుండి శ్రీహరి నర్చించుచుండిరి. కొంతకాలమునకు ఆమె గర్భవతియై నవమాసములు నిండిన తరువాత ఒకనాఁడు చాల బాధ పడసాగెను. ఆబాధ దుస్సహము కాఁగా ఆమె భరింపలేక అనేకవిధముల గొంతెత్తి యేడువసాగెను. అప్పుడొక మంత్రసాని వచ్చి లోపలఁ బ్రవేశించి అచ్చట నదివఱకే వచ్చియున్న మంత్రసానిని తొలఁగి నిలువుమని నియమించి "తల్లీ, నీవు చాల బాధపడుచున్నావని విని నీకు చికిత్సచేయుటకు వచ్చితిని. నీవు పడుబాధయు నాకరుణహృదయమును ద్వరపెట్ట అయాచితముగనే నేను వచ్చితిని. కన్నులు మూసికొనుము. నీకు ఏమియు భయము వలదు" అని చెప్పెను. తోడనే ఆమె కన్నులు మూసికొనఁగా క్రొత్తమంత్రసాని చెప్పిన విధమున వెంటనే ఆఁడుబిడ్డ పుట్టెను. తోడనే క్రొత్తమంత్రసాని ఆశిశువును స్నానము చేయించి చెవిలో శ్రీకృష్ణమంత్రము నుపదేశించి మంచముమీఁద పరుండఁ జేసెను.

పిదప పదియవదినమున జాతకర్మ చేసి బిడ్డకు కుపరాబాయి అని పేరుపెట్టి మిగుల గారాబముతోఁ బెంచుకొనసాగిరి. శ్రోత్రియమంత్రసాని మూఁడుమాసములవఱకును వారియింట నుండి శిశువునకు పరిచర్య చేసి తల్లిదండ్రులకు ఆనందము గొలిపి దివ్యమంగళవిగ్రహముఁ దాల్చి వారియెదుట నిలిచెను. అపుడు వారు ఇంతవఱకును తమ యింట దాస్యము చేయుచున్న మంత్రసాని నిజముగ మంత్రసానికాదనియు శ్రీకృష్ణుఁడే తమయెడలఁ గలయనుగ్రహముచే నట్లు వేషమువేసికొని వచ్చెననియు తెలిసికొని పరమాశ్చర్యభరితులై వెంటనే పాదములమీఁదవ్రాలి "శ్రీహరీ, నన్ను ఇట్లు వంచించుటకు మేము ఏమి యపరాధము సేసితిమి? ఇట్లు నన్ను సేయుటకు నీకు ఎట్లు తోఁచినది?" అని యనేకవిధముల నపచారములు పలికి బాష్పోదకముతో పాదములు కడిగి పూజించిరి. అందులకు శ్రీకృష్ణుఁడు ఏమియుఁ జెప్పక "మీరు నాయంతరంగభక్తులు. మీకు ఏమియు లోపముకలుగఁబోదు. అవసానమున మీరు నాసాయుజ్యము క్తినిఁ గాంతురు. కుపరాబాయియు మీవలెనే సాయుజ్యమోక్షముఁ గాంచును" అని తిరోహితుఁడు అయ్యెను.

కుపరాబాయి మాటలాడ నేర్చినది మొదలు హరినామసంకీర్తనము ప్రారంభించెను. భుజించునపుడు ఆటలాడునపుడు నిద్రించునపుడు ఇఁక నిప్పు డప్పు డననేల? సర్వప్రారంభములయందును సర్వకాలసర్వావస్థలయందును ఆమె శ్రీహరినామము నుచ్చరించుట నుఱచి యెఱుఁగదు. తలిదండ్రులు కొమార్త హరిభక్తినిఁ జూచి ఆశ్చర్యచకితులగుచు ఆమెను చాల గారాబముగఁ బెంచుకొనుచుండిరి.

మఱికొన్ని దినములు గడచిపోయిన తరువాత శ్రీకృష్ణుఁడు వారికి "ఇఁక మీగ్రామమునకుఁ బోయి సుఖముగా నుండుఁడు" అని సెలవిచ్చెను. వారు స్వామి యాజ్ఞాప్రకారము వెడలిపోయిరి. కుపరాబాయికి ఏడేండ్ల వయస్సు వచ్చెను. అప్పుడు తల్లిదండ్రులు ఒక చక్కనియువకునిఁ దెచ్చి ఆమెకుఁ బెండ్లి సేసిరి. మఱికొన్ని దినములకు కుపరాబాయి రజస్వల యయ్యెను. ఆమె తల్లిదండ్రులు ఆమెను పునస్సంధానముసేసి అత్తింటికిఁ బంపివేయవలయునని ముహూర్తము ఏర్పఱిచికొనిరి. కుపరాబాయి తలిదండ్రుల ప్రయత్నము నెఱింగి "పెద్దలు తమ

ముద్దుముచ్చటలు తీర్చికొనుటకే యూహించుచున్నారు; గాని, నానం
గతిసంకర్భములు ఆలోచించుట లేదు. లోకనిందలకు జంకి నన్ను
మాయామయంబగు ఈలోకమునఁ బడవేయఁజూచుచున్నారు; గాని
పిదప నాకు సంభవించుపాట్లను ఆలోచించుట లేదు. ఇప్పుడు నేను
సిగ్గుపడి నా బాగోగులు నేను చూచుకొనకున్న అవ్యాహతిముగు జన్మ
పరంపరపాలై చెడవలసివచ్చును" అని నిశ్చయించుకొని ఎవరికిఁజెప్ప
కుండ అర్ధరాత్రిసమయమున తీర్థయాత్రలు సేవించుటకు ఏకాకినియై
బయలుదేఱెను.

అప్పుడు పురద్వారములు మూయఁబడి యుండెను. అదిచూచి
కుపరాబాయి శ్రీహరిని స్మరించెను. తోడనే భగవంతుఁడు దివ్యమంగ
ళవిగ్రహుఁడై సాక్షాత్కరించి తలుపులు తెఱచి "తల్లీ, నీయచంచల
భక్తికి ఆనందము. నీకు ఏమియు భయము లేదు. ద్వారకకుఁ
బోయి సుఖముండుము" అని చెప్పి అంతర్హితుఁడు అయ్యెను. పిదప
కుపరాబాయి మహానందముతో బయలుదేఱి పోయి బృందావనము
మున్నగు దివ్యస్థలములను సేవించి ద్వారకావాసము సేసుకొని శ్రీహరిని
బూజించుచు బ్రహ్మానందమనుభవించుచుండెను. అచ్చట శ్రీకృష్ణుఁడే
ఆమెకుఁ బ్రసాదము తెచ్చి యిచ్చుచుండెను.

కొంతకాలమునకు ఆమె తండ్రి వెదకుకొనుచు వచ్చి "తల్లీ ఇన్ని
దినములును నీవెచ్చటనున్నదియుఁ దెలియక మేము పడు తాపమునకు
మేఱలేదు. నీవు ఇక్కడకు ఎట్లు వచ్చితివి? నీకు యౌవనము ప్రాపించి
నది. ఇఁక నీవు ఇట్లు ఉండుట మంచిదిగాదు. ఇప్పటికే మాకు అవ
మానము వచ్చుచున్నది గావున ఇంటికి రమ్ము" అని పిలిచెను. అందు
లకు కుపరాబాయి "తండ్రీ, అన్నిటను నీవు వృద్ధుఁడవు. నీకు సకలము
ను దెలియును; గాని మాయావృతుఁడవై యున్నాఁడవు. ప్రపంచవాస
నలనుండి నన్ను తొలఁగించుటకు మాఱుగ అందు కూలఁద్రోయఁజూను
ట యేటిధర్మము! నీవుగూడ యోచింపుము" కాయము అపాయసంయు
తము. ఇహసౌఖ్యములు ఆభాసములు. మనము చూచుచున్నది అంత
యు మిథ్య; భ్రాంతియే జనులను పాడుచేయుచున్నది. శ్రీకృష్ణపాదార
విందముల నాశ్రయించినవారికి భ్రాంతి యుండదు. నేను మీకు చెప్పు
నంతటిదానను గాను; అయినను ఇంతవృద్ధులై యుండియు మీరింకను

ఇట్లు సంసారచింతలతో వేగుచుండుట బాగుగలేదు" అని చెప్పెను. అది విని తండ్రి "తల్లీ, నీమాటలు నాహృదయమును కరగించినవి. ఇది జ్ఞానోపదేశముగాని వేఱుగాదు. నీవుచెప్పినట్లు మసలుకొందుము; గావున ఇంటికి రమ్ము. మనము అందఱమును గూడి శ్రీహరిని బూజించుకొందము" అని చెప్పెను. అంతట అశరీరవాణితో శ్రీకృష్ణుఁడు "కుపరా, ఇది యథార్థము. నీతలితండ్రులు నీవలెనే భక్తిపరితులయ్యెదరు నిశ్చింతతో నీవు నీతండ్రితో వెడలిపొమ్ము. నేను అచ్చటకు వచ్చెదను. నిన్ను నేను విడిచి యుండఁజాల" నని చెప్పెను. కుపరాబాయి ఆనందముతోఁగూడ అరిగెను.

కుపరాబాయి ఇలుసేరిన తరువాత తల్లికి నమస్కరించి అపరాధము క్షమింపఁ బ్రార్థించెను. తలితండ్రులేకాక కుపరాబాయి భర్తయు అత్తమామలునుగూడ ఆమె భక్తిజ్ఞానవైరాగ్యములకు అచ్చెరువడి చూచుటకు వచ్చి ఆమెవలన నుపదేశముఁ బొంది తాముగూడ శ్రీహరి భజనము ప్రారంభించిరి. కుపరాబాయి వృత్తాంతము తోడనే నగరము నంతంతటను వెలిసిపోయెను. రాజు విని యబ్బురపడి ఆమె తండ్రి యగు తనపురోహితుని రప్పించి "నీకొమార్త హరిగుణకీర్తనము సేయుచుండ విననలయు నని కోరిక యున్నది" అని చెప్పఁగా పురోహితుఁడు రమ్మని చెప్పెను. రాజు నాఁటి రాత్రి చెప్పినప్రకారము పోయి వినియెను. అతనికిఁ గూడ హరిభక్తి యొదవెను; గాని వెంటనే ఆమెపై హృదయము లగ్నమయ్యెను. భక్తిమోహములతో పరవశుఁడై యుండఁగా నాతనికి ఒక స్వప్నము వచ్చెను. అందు కుపరాబాయి ఒక నదియొడ్డున నున్నట్లును, తాను ఇవ్వలిగట్టున నున్నట్లును, మూర్ఖుఁడా, ఇటకు రమ్మని యామె తన్ను పిలిచినట్లును దోఁచెను. రాజు స్వప్న వృత్తాంతమును ఇంటికిఁ బోయి తనవిద్వాంసులకు ఎఱింగించెను; గాని వారు "మాకిందలి యంతరార్థము బోధపడుట లేదు. పోయి కుపరాబాయినే యడుగుట మంచిది" అని చెప్పిరి. రాజు మొదట క్షమింపఁ గోరి పిదప ఆమెకు తన స్వప్నవృత్తాంతము నెఱింగించెను. ఆమె ఇట్లు చెప్పెను. "నీకు స్వప్నమునఁ గాన్పించిన నేను ముక్తికాంతను. నీకును నాకును మధ్య జన్మాంతరము ఉన్నది. దానిని దాఁటి నాచెంతకు రమ్మని పిలిచితిని. రాజా, ఇఁక నీకు ఏమిలోపము? హృదయమును స్థిరపఱుచు

కొనుము. ఏమియు శాశ్వతముగాదు. నీవు తెలివిగలవాఁడవు నీవు చెడి
పోయిన నీకు దేశమును ఎవరు శాసింతురు! చెడిపోక శ్రీహరిని
భజించి సుఖింపు" మని చెప్పెను రాజునకు బుద్ధివచ్చెను. ఆతఁడు
జ్ఞానము నుపదేశించి రక్షింపుమని ప్రార్థింప కువరాబాయి అట్లే చేసెను.
రాజు అదిమొదలు భగవద్భాగవతార్చనము గావించుచు ధర్మమార్గ
మున రాజ్యము నేలుచుండెను.

కొన్ని దినములయిన తరువాత రాజు కువరాబాయి యొద్ద సెలవు
గొని తీర్థయాత్రకు బయలుదేఱెను. ఆతఁడు మార్గవశమున నొక
అరణ్యమధ్యమున విశ్రమించియుండఁగా అనంతగజములు వచ్చి బాధిం
పఁదొడఁగెను. అపుడు రాజు కువరాబాయి పాదపద్మములను స్మరించెను.
తోడనే భగవంతుఁడు సింహరూపియై వచ్చి ఆయేనుఁగుల నన్నిఁటిని
సంహరించి తిరోహితుఁడయ్యెను. అది చూచి రాజు కువరాబాయి
యనుగ్రహమువలన భగవంతుఁడే ఇట్లు వచ్చెనని తెలిసికొని మహా
సంతసముతో ముందునకు బయలుదేఱిపోయెను.

ఆరాజు ఒక నగరము చేరి రాత్రి భోజనము అయిన పిదప భగ
వంతుని స్మరించి శయనించెను. ఆపట్టణము నేలు రాజునకు ఒకకొమార్త
కలదు. ఆమెను బేతాళుఁడు పట్టి పీడించుచుండెను. నాఁటిరాత్రి
బేతాళుఁడు ఆమె తండ్రికి స్వప్నమున సాక్షాత్కరించి "రాజా, ఈనగర
మున సత్రములో నొక రాజు శయనించియున్నాఁడు. ఆతనిం దెచ్చి
నాకు బలియిచ్చెదవేని నీకొమార్తను నేను విడిచిపోయెదను" అని చెప్పెను.
రాజు వెంటనే మేల్కాంచి భటులకు ఆజ్ఞాపింపఁగా వారు నిద్రం
దవిలియున్న రాజభాగవతునిఁ గొనివచ్చి కైదులో వేసిరి. రెండుజాముల
రాత్రి యగునప్పటికి మెలకువ రాఁగా రాజు తాను బంధికానాలో
నుండుట యెఱింగి భగవంతుని స్తోత్రముఁ జేసెను. అప్పుడే శ్రీకృష్ణుఁడు
రాజునకు స్వప్నమున ప్రత్యక్షమై "నీవు నాభక్తుని కైదుచేసితివి.
వెంటనే యాతని విడిచిపెట్టి కాళ్లమీఁదఁబడి క్షమింపఁ బ్రార్థించి
అతఁడు చెప్పినట్లు నడచుకొనుము. అట్లుగాదేని నిన్ను సర్వనాశ
ము చేసెద" నని చెప్పెను. రాజు ఉలికిపడి లేచి వెంటనే స్వయముగా
కారాగారమునకు వచ్చి తనచేతులతో రాజభాగవతుని సంకెలలు విప్పి
పాదములమీఁద వ్రాలి ప్రార్థించి తనకష్టములు అన్నియు విన్నవించుకొ

నెను. అదివిని రాజభాగవతుఁడు "తేపటి మధ్యాహ్నము పూజానమ యమున నీకొమార్తను గొనిరమ్ము" అని చెప్పి తన బసకుఁబోయెను.

రాజు ఆభాగవతుఁడు చెప్పినప్రకారము చేసెను. అంతట రాజ భాగవతుఁడు శ్రీహరిపాదతీర్థమును రాజకుమారికకు ఇచ్చెను. ఆతీర్థ మును పుచ్చుకొనిన వెంటనే ఆమెను ఆవేశించియున్న బేతాళుఁడు భయావిష్టుఁడై ఆమెను విడిచిపోయెను. అంతట ఆమెయు రాజును మంత్రిముఖ్యాగువారును రాజభాగవతుని చాలఁ గొనియాడి చాలఁ బూజించి స్వదేశమునకుఁ బంపివేసిరి. స్వస్థలము చేరిన పిమ్మట ఆతఁడు కుపరాబాయికి మ్రొక్కి సకలమును నివేదించెను.

ఆరాజు సకుటుంబముగ వచ్చి తమకు మోక్షమార్గమును జూపవలయు నని రాజభాగవతునిఁ బ్రార్థించెను. ఆతఁడు కుపరాబాయి సెలవుఁబడసి వారికి జ్ఞానోపదేశము గావించెను అందఱును కుపరాబాయియాజ్ఞ చొప్పున శ్రీహరిని యథాశాస్త్రముగఁ బూజించుచు బ్రహ్మానందభరితులై యుండిరి.

కుపరాబాయి బ్రతికియున్నంతకాలమును శ్రీహరినిఁ బూజించి అవసానమున సాయుజ్యముక్తినిఁ బడసెను.

మ. వసుదేవప్రియదారగర్భఖనిజత్వంబొప్ప జన్మించి యా
వసుదేవుం డిడ నందగోపుఁడు సుతాపత్యంబునం గాంచు రా
నసమానవ్రజబాలహారతరళంబై గోపికాకల్పమై
రసలీలాకృతియైన కృష్ణమణిరశ్మింశం బెదన్నిత్యదా.

(కృష్ణకర్ణామృతం. ఆ. 2. ప. 97.)

---

66. శీలాబాయి.

శ్లో. కర్ణలంబితకదంబమంజరీ
కేసరారుణకపోలమండలం
నిర్మలంనిగమవాగగోచరం
నీలిమానమవలోకయామహే.

(కృష్ణకర్ణామృతం. ఆ. 2. ప. 31.)

ఒకరాజునకు శీలాబాయి అనునొక కొమార్తె పుట్టెను. తలిదండ్రులు ఆమెకు మివుల గారాబముతోఁ బెంచుకొనుచు యుక్తసమయమున విద్యాభ్యాసార్థము ఒక బ్రాహ్మణుని రావించి సుముహూర్తమున ప్రారంభముచేయించెను. ఆమె సూక్ష్మబుద్ధిగలదగుటచే గురువుచెప్పునది యెల్ల నిముసములో గ్రహించుచు అందఱు నాశ్చర్యపడునట్లుగా విద్యలన్నియు స్వల్పకాలమునందే నేర్చుకొనెను. ఆమె తనతండ్రి దినదినమును సాలగ్రామపూజ సేయుచుండుటఁ గాంచి తానుగూడఁ జేయఁగోరి యొకనాఁడు "నాకుఁగూడ సాలగ్రామపూజ సేయఁగోరిక కలదు. ఒక సాలగ్రామమును దెచ్చి యిచ్చి యుపదేశము సేయవలయును" అని ప్రార్థించెను. ఉపాధ్యాయుఁడు ఆమె భక్తిప్రపత్తులకు ఆనందించి అప్పటికి సాలగ్రామము ఏదియు లభింపకపోవుటచే నొక నల్లరాతినిఁ దెచ్చి యిచ్చి పూజావిధానము నుపదేశించెను.

శీలాబాయి అది మొదలు అత్యంతభక్తితో ఆనల్లరాతినిఁ బూజించుచుండెను. తల్లిదండ్రులు అదిచూచి "ఆట" యని భావించి యూరకుండిరి. ఇంతలో ఆమెకు సంపూర్ణయౌవనము వచ్చెను. అంతట తండ్రి ఒకచక్కని రాకొమారుని వెదకి తెచ్చి శుభముహూర్తమున దేవేంద్రవైభవముతో కొమార్తకుఁ బెండ్లిగావించెను. ప్రజలు అందఱును ఆనందించిరి. కొన్నిదినములు అల్లుని తనఇంటనుంచుకొని పిదప రాజు అల్లుని కొమార్తను బంపివేసెను.

అత్తింటికిఁ బోయినపిదపఁ గూడ శీలాబాయి ఆరాతికిఁ బూజ సేయుట మానలేదు. ఒకనాఁడు ఆమెభర్త వచ్చి "ఇది ఏమి?" అని యడుగఁగా ఆమె "ఇది మాకులాచారము" అని ప్రత్యుత్తర మిచ్చెను. "ఈవయస్సున ఇది తగినది గాదు" అని చెప్పి యాతఁడు ఒకనాఁటిరాత్రి ఆరాతిని నదిలోఁ బాఱవేసెను.

మఱునాఁడు శీలాబాయి రాతికొఱకు ఎంతవెదకినను గాన్పింపదయ్యెను; అగుటచే "నాదేవుఁడు లభించునంతదనుక నేను భుజింప" నని యామె శపథము పట్టెను. భర్తయే గాక అత్తమామలు గూడ ఎంతచెప్పినను ఆమె వినదయ్యెను. ఇట్లు అయిదాఱు దినములు గడచిపోయెను. శ్రీహరి శీలాబాయికి తనయెడలఁగల భక్తిశ్రద్ధలకు మెచ్చి నాఁటిరాత్రి వృద్ధబ్రాహ్మణవేషముతో వచ్చి ఆరాతిని ఆమెకు ఇచ్చి

వెడలిపోయెను. మఱునాఁడు ప్రొద్దున మేల్కాంచి ఆమె తన దేవుఁడు తనప్రక్కలో నుండుటఁ గాంచి పరమానందభరితయై భక్తితోఁ బూజించి నివేదనచేసి తానుభుజించెను. అత్తమామలు ఆమెప్రభావమును జూచి ఆశ్చర్యపడిరి. భర్త తెల్లవోయెను. అందఱును ఆమెకు అనేక వందనములు ఆచరించిరి. శీలాబాయి బ్రతికి యున్నంతకాలమును ఇట్లే శ్రీహరినిఁ బూజించి అవసానమున సాయుజ్యముక్తినిఁ బడసెను.

మ. చెవులన్ వ్రేలు కదంబమంజరులచేఁ జన్నారి చెక్కుల్ జ్వల
న్నవసంధ్యారుణితాశ్రీకాంతి చెలువందన్ మందహాసప్రభా
లవముల్ వెన్నెలతళ్కుఁ జూపఁ బుష్పదులంకారుఁడై వేదసం
స్తవనాగోచరుఁడైన శౌరి యసితచ్ఛాయల్ విలోకించెదన్.

(కృష్ణకర్ణామృతం అ. 2. ప. 31)

67. రామచంద్రభట్టు.

శ్లో. అగ్రే దీర్ఘతరోఽయ మర్జునతరు స్తస్యాగ్రతో వర్త్మని
సా ఘోషం సముపైతి తత్పరిసరే దేశే కళిందాత్మజా,
తస్యా స్తీరతమాలకాననతలే చక్రం గవాం చారయన్
గోపః క్రీడతి దర్శయిష్యతి సఖే పంథాన మవ్యాహతం.

(కృష్ణకర్ణామృతము. అ. 2. శ్లో. 43.)

నాశరిభి అనునదియొడ్డునఁ గల అమలనేరి అనునగరమున రామచంద్రభట్టు అను నొక బ్రాహ్మణుఁడు ఉండెను. ఆతఁడు పరమభాగవతోత్తముఁడు. ప్రాపంచికసుఖములు అనిన ఆతనికి తలనొప్పి. ఆతఁడు ఆ దేశమును ఏలు రాజునకు గురువు. అయినను ఆతఁడు వైభవములపొంతఁబోక కేవలము ఉంఛవృత్తివలననే కుటుంబమును గడుపుచుండెను. ఆతని హృదయమున సర్వకాలసర్వావస్థలయందును శ్రీహరినామము జాగరితము అగుచునే యుండును.

ఆతని భార్య సర్వవిధముల నాతనికిఁ దగిన రమణి. ఐహికసుఖముల యెడల నామెకు భర్తకుఁగంటెను ఎక్కుడు అనిష్టము. అత్తమామలను బూజించుటయందును పతికి సకలోపచారములును జేయుటయందును ఆమెతో సాటిబోటులు ఆ కాలమున ఎందును లేరని యామె ప్రఖ్యాతి వడసెను.

ఇట్టి దంపతులకు శిష్యుఁడు ఎట్టి గుణవంతుఁడై యుండును! తుల్యప్రకృతులు కాని వారికి లోకములో స్నేహాదిసంబంధములు ఎందును ఎఱుఁగము. ఆతఁడు భక్తిజ్ఞానవైరాగ్యసంపన్నుఁడు. శ్రీహరిభక్తుఁడు. మనుమార్గమును దప్పని ధర్మప్రభువు. ప్రజలయైశ్వర్యమును వృద్ధిసేయుటకును వారికి అనంతసౌఖ్యములు కలిగించుటకును ఆతఁడు ప్రాణములు విడువవలసివచ్చినను సంతోషముతో విడుచును. మనకుఁ గాన్పించుచున్న జగత్తు అంతయు మిథ్యయనియు దీనిని నమ్ముకొనుటకంటె అవివేకము లేదనియు నమ్మి శ్రీహరిసేవయందే కాలము గడుపు భక్తాగ్రేసరుఁడు.

ఆతని రాణి ఒకనాఁడు మహాపతివ్రత యగు గురుపత్ని దారిద్ర్యమును బాపుటకు నిశ్చయించుకొని ఆమెకు వర్తమానముచేసెను. రాణి యాజ్ఞప్రకారము రామచంద్రభట్టుభార్య కోటలోనికిఁ బోయెను. రాణి ఆమె ననేకవిధముల ఆదరించి చాలమర్యాదచేసి అనేకసద్విషయములను దెలిసికొని ఆనందభరితయై వెలగల పెక్కురత్నాభరణములను స్వయముగ నామెకు అలంకరించి సగౌరవముగ సాగనంపి ఇంటికిఁ బంపివేసెను.

రామచంద్రభట్టు పూచిన తంగేడువలె నున్న భార్యను జూచి ఆశ్చర్యచకితుఁడై "ఇదంతయు నేమి?" అని ప్రశ్నించెను. అందులకు ఆమె జరిగినది అంతయు నెఱింగింపఁగా రామచంద్రభట్టు చాలఁగటకటంబడి "రమణీ! నీవు సకలమును ఎఱింగినదానవే; గాని నేఁడు భ్రాంతవైతివి. ఎట్లో ఈతనువుఁ బాసిన చాలునని యున్న మనకు ఈరత్నాభరణములు అన్నియు ఎందులకు? సంగతి తెలిసియుండియు రాణి నీకు ఇవి యెల్ల నెట్లు ఇచ్చినది? నీవు ఎట్లు అంగీకరించితివి? అయ్యో, ఎంత అనాలోచితకృత్యమును చేసితివి? ఈమాత్రపు యోచన నీకుఁ దోఁచినది కాదుగదా?" యని పలికెను. అందులకు ఆమె "నేనుఏమిచేయఁగలను? రాణి అతిభక్తితో వీనిని నాకు యలంకరించినది. భక్తులు సమర్పించు వస్తువులను దిరస్కరించుట యెట్లు? శ్రీరామచంద్రుఁడు శబరియిచ్చిన ఎంగిలిఫలములను స్వీకరింపలేదా? ఆసమయమున మీరైనను మాఱుపలుకఁజాలరు. అయినను ఇపుడు మించినది ఏమియున్నది. మీయాజ్ఞ జవదాఁటుటకు నేను ఎంతటిదానను!" అని పలికి తనయొడలిమీఁది రత్నాభరణముల నన్నిటినిఁ దీసి ఎదుట నున్న హోమకుండములోఁ బడవేసెను. అదిచూచి రామచంద్రభట్టు చాల సంతోషించెను.

ఈవార్త రాజునకుఁ దెలిసెను. తోడనే ఆతఁడు వచ్చి "రాణి ఇచ్చిన వస్తువులు మీకు వలదేని నాకు దయచేయుఁడు" అని పలికెను. రామచంద్రభట్టు అందులకువగవక నిర్మలచిత్తుఁడై శ్రీహరినిస్మరింపఁగా నాతని రమణి హోమకుండములోఁ బడవేసిన వస్తువు లన్నియు పూర్వాధికశోభతో రాజు నెదుటఁ బడియుండెను. రామచంద్రభట్టు "తీసికొనవచ్చును" అని పలికెను; గాని రాజు "ఇచ్చినది మఱలఁ బుచ్చు

కొనుట మాకుఁ దెలియదు" అని తిరస్కరించి ఆరత్నాభరణాదులను అచ్చట నున్న బీదలకందఱకును బంచి ఇచ్చెను.

ఒకనాఁడు రామచంద్రభట్టు ప్రార్థనానిమగ్నుఁడై యుండఁగా శ్రీహరి దివ్యమంగళవిగ్రహుఁడై సాక్షాత్కరించెను. అంతట ఆనందమును బట్టఁజాలక రామచంద్రుఁడు నృత్యము ప్రారంభించెను. ఆతనిం గాంచి ఆతని రమణి గూడ అట్లే చేసెను. వారిభక్తికి మెచ్చుకొని శ్రీహరి వారికి అభయ మిచ్చి తిరోహితుఁడు అయ్యెను. రామచంద్ర భట్టును ఆతని భార్యయు బ్రతికి యున్నంతకాలమును శ్రీహరిని సేవించి అవసానమున సాయుజ్యమోక్షమును బడసిరి.

మ. అదిగో ముంగల పెద్దమద్దియట పో నాచెంత ప్రేపల్లెయు
న్నది యాదండ గళిందజాతటమునం దాపించభూజాళితో
గన పుల్ మేపుచు గోపబాలురను నిక్కంబొప్పఁగాఁ గొల్వన
త్పదవిం బొమ్ము సఖా శుభాస్పదముగా భావించి రంజిల్లదుక్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 43.)

---

68. జయమల్లరాజు.

శ్లో. అంసాలంబితవామకుండలభరం మందోన్నతభ్రూలతం
కించిత్కుంచితకోమలాధరపుటం సాచిప్రసారేక్షణం,
ఆలోలాంగుళిపల్లవైర్మురళికా మాపూరయంతం ముదా
మూలే కల్పతరో స్త్రిభంగిలలితం జానే జగన్మోహనమ్.

(కృష్ణకర్ణామృతము. ఆ 2. శ్లో. 102)

సోడము అను పట్టణమున జయమల్లుఁడు అను రాజు ప్రజలను పాలించుచుండెను. ఆతఁడు అనవరతమును భక్తిజ్ఞానవైరాగ్యబంధురుఁడై శ్రీహరిని ధ్యానించుచుండెను; ప్రతిదినమును ఉదయమున పూజయైనతరువాత ఏకాంతమునఁ గూరుచుండి ఒక జాము సేపు శ్రీహరిని ధ్యానించుట ఆతనికి అలవాటు. అప్పుడు ఆతనిచెంతకు ఏమను బోఁగూడదు. ఎవరును మాటాడఁ గూడదు. ఆతఁడు మధ్యాహ్నభోజనము

ననుక నిట్లు శ్రీహరిపూజాతత్పరుఁడై భోజనానంతరము మనుమార్గమున ధరాపాలనము గావించుచుండును.

ఆతనికి ఒక తమ్ముఁడు ఉండెను. తమ్మునకు అన్నరాజ్యము హరింపఁదలంపు గలిగెను. ఈతలంపుతో నాతఁడు దగ్గఱనున్న మఱియొక పట్టణమున వసించి సేనలను సేకరించుకొనసాగెను. తదేకదీక్షతో పనిసేయుచుండుటవలన అనంతసైన్యము త్వరలోనే సమకూడెను. తోడనే ఆతఁడు అన్నగారు హరిధ్యానతత్పరుఁడై యుండు సమయమున మేడముకోటను ముట్టడించెను. మంత్రి వెంటనే తనసైన్యముతో వాని నెదిరించెను; గాని ప్రయోజనము లేకపోయెను. శత్రుసేన అసంఖ్యాముగ నుండుటచే రాజసేన వెనుదీయఁజొచ్చెను. అది చూచి మంత్రి రాజతల్లి చెంతకుఁ బోయి సంభవించిన యాపద నెఱింగించెను. ఆమె పోయి రాజుతోఁ జెప్పుమనియెనుగాని రాజుతో నిప్పుడు మాటాడుటకు బ్రహ్మాండనాయకునకైన సెలవు లేదుగాదా!" అని యాతఁడు మాఱుపలికెను. "ఇఁక ఉత్తరప్రత్యుత్తరములతోఁ బ్రయోజనము లే" దని తలంచి రాజమాత వెంటనే పోయి "శత్రువులు వచ్చి కోటముట్టడించినారు. ఇప్పుడు లేవకున్నఅపాయముతప్పదు" అనియెను; గాని రాజు మాట్లాడ లేదు. "భయమువలదు. శ్యామలుఁడు అను నేను ఉండఁగా శత్రువులు జయింపఁజాలరు" అను ఆకాశవాణిమాత్రము వినఁబడియెను. అది విని రాజమాత ధైర్యముతో నీవలకు వచ్చెను.

అంతట శ్రీహరి శ్యామలుఁడు అను యోధుని రూపమును కైకొని గుఱ్ఱము నెక్కి యుద్ధరంగమున నురికెను. అంతట అనంతమైన వైరివాహినికిని ఏకాకియగు శ్యామలునకును ఘోరయుద్ధము పొసఁగెను. ఒకటిరెండు నిముసములు గడచునప్పటికి రక్తనదులు ప్రవహింపఁజొచ్చెను. హతులు ఆనదులలోఁ గొట్టుకొనిపోసాగిరి. హతశేషులు పలాయనము చిత్తగించిరి. అపుడు శ్యామలుఁడు రాజుతమ్మునిఁ బట్టుకొని పెడరెక్కలు విఱిచి కట్టి మంత్రికి అప్పగించి తాను తిరోహితుఁడు అయ్యెను. మంత్రి శత్రుని కారాగృహమున బంధించి నిశ్చలుఁడు అయ్యెను. ఇంతలో రాజు పూజాదికము ముగించుకొని ఇవ్వలకు వచ్చెను. మంత్రి రాజుతో సకలమును ఎఱింగించెను.

రాజు ఆశ్చర్యచకితుఁడై "మంత్రీ, శ్యామలుఁడు ఎంతఁటో ఎఱుఁగుదువా? నీవు ఎంత అదృష్టవంతుఁడవు. అనాయాసముగ భగవంతుని దర్శనము చేయఁగలిగిన నిన్ను ఏమని కొనియాడఁగలను?" అని మంత్రితోఁ బలికి "శ్రీహరీ, గోవిందా, నీవు భక్తపరాధీనుఁడవని విందును; గాని భక్తుఁడగు నాయెడలఁ జూపని యనుగ్రహము దుర్మార్గగామియగు వైరియెడల నేల చూపితివి? ఇది నీకుఁ దగునా?—అయ్యో, నీవు సర్వాంతర్యామివి గదా? సర్వసముఁడవు గదా! అదియుఁగాక నాకంటె వైరి నీకు అంతరంగభక్తుఁడై యుండవచ్చును. నేనే పొరపడితిని; గాని నాయెడల నేల యనుగ్రహము చూపవు? నీదర్శనము నపేక్షించియున్న నాకు నీదివ్యమంగళవిగ్రహసందర్శనలాభము నేల కలిగింపకున్నావు? జనార్దనా, నారాయణా, నీకంటె నేను అన్య మెఱుఁగను. నన్ను రక్షింపవా?" యని ప్రార్థింపసాగెను.

అపుడు శ్రీహరి నిజరూపముతో నచ్చట సాక్షాత్కరించెను. రాజు పరమానందభరితుఁడై భగవంతునకు సాష్టాంగనమస్కారములు ఆచరించి అనేకవిధములఁ గొనియాడెను. శ్రీహరి ప్రేమతో రాజును లేవనెత్తి కౌఁగిలించుకొని "వత్సా, నీభక్తికి మెచ్చితిని. నీచిత్తశుద్ధి అనన్యదుర్లభము. నీవు నాయంతరంగభక్తుఁడవు నీకేమియు లోపములు కలుగవు. నీవు కోరినప్పుడెల్ల నీకు సాక్షాత్కరించుచుందును. సదాచార్యు నాశ్రయింపుము. ఆచార్యోపదేశమును బడసినఁగాని నిశ్చలభావము కలుగదు" అని యాశీర్వదించి తిరోహితుఁడు అయ్యెను.

పిదప రాజు కారాగారమునందున్న తమ్ముని గొనివచ్చుటకు మంత్రికి ఆజ్ఞాపించెను. మంత్రియు కైదులోనికిఁ బోయి బద్ధుఁడై పడియున్న రాజు తమ్మునిఁ జూచి "నిన్ను కట్టి నాకు అప్పగించిన యోధుఁడు శ్రీహరి. శ్రీహరి, నీయన్నగారిని కంటికి రెప్పవలెఁ గాపాడుచుండును. భగవంతుని అంతరంగభక్తుఁడగు నీయన్నగారు నిన్ను గొనిరమ్మని నాకు సెలవు ఇచ్చినారు" అని పలికి ఆతనిం దీసికొనిపోయి రాజు నెదుట నిలిపెను. అంతట రాజు తమ్ముని బంధములను విప్పి కౌఁగిలించుకొని "తమ్ముఁడా, అశ్రమముగ శ్రీహరిదర్శన సాక్షాత్కారలాభమును బడసిన నీయదృష్టము నేమని కొనియాడవచ్చును? భగవంతునిఁ జూడఁగలిగితివి; గావున ఇఁక నీకు ఏమియు లోపము కలుగదు. నిన్ను జూచిన

నాకు మిగుల నానందము కలుగుచున్నది" అని యాదరముతోఁ బలికెను. అప్పుడు తమ్ముఁడు అన్నపాదములమీఁద వ్రాలి "మహాత్మా, నీప్రభావము నెఱుంగక నీయెడల ఎగ్గుచేసితిని. అయినను దీనుఁడనగు నన్ను మన్నించితివి. నీహృదయౌన్నత్యమునకు ఇంతకంటె నేమి యుదాహరణము కావలెను? నాకు బుద్ధి వచ్చినది. ఇంతవఱకును నేను జేసిన దుష్కృత్యములకు పరితపించుచున్నాను నన్ను నీశిష్యకోటిలోఁ జేర్చుకొని కాపాడుము" అని ప్రార్థించెను. రాజు తమ్ముని ఆదరముతో లేవనెత్తి అభయ మిచ్చెను.

పిదప రాజు గొప్పగొప్ప శిల్పులను రావించి అదృష్టపూర్వమగు నొక గొప్ప ఆలయమును గట్టించి శుభముహూర్తమున అందు శ్రీహరిని బ్రతిష్ఠసేసి ప్రతిదినమును బూజింపసాగెను. ఆయాలయమున తానొకఁడేగాని ఇతరులు ఎవరును బ్రవేశింపఁగూడదు. ఆతఁడు నూలు నిచ్చెనవేసికొని పైకి ఎక్కి నిచ్చెన వెంటఁ గొనిపోయి ఒకజాము శ్రీహరినిఁ బూజించి ప్రార్థించి సేవించి మఱలి వచ్చును. ఒకనాఁడు అతఁడు నిచ్చెన వెంటఁ గొనిపోవుట మఱచి లోనికిఁ బోయెను. అట్టి సమయము కొఱకు కనిపెట్టుకొనియున్న రాణి వెంటనే నిచ్చెన యెక్కి లోనికిఁ బోయెను అప్పటికప్పుడే రాజు మామూలు ప్రకారము సాక్షాత్కరించి యున్న శ్రీహరిపాదములను ఒత్తుచుండెను. అపుడు రాణియు శ్రీహరికి ప్రదక్షిణ నమస్కారములు ఆచరించి "పుండరీకవరదా, రాక్షసాంతకా, నేఁటికి నాజన్మసార్థకమైనది" అని యానందాతిరేకముచే మఱల మాటాడఁజాలక పోయెను. శ్రీహరి రాణి భక్త్యావేశమునకు మెచ్చి చేరఁ బిలిచి "నీవును నీభర్తయు నాకు అంతరంగభక్తులైతిరి. మీరు తలంచినపుడెల్ల నేను సాక్షాత్కరించుచుందును" అని చెప్పి అంతర్హితుఁడు అయ్యెను.

ఇది యంతయుఁ జూచి రాజు ఆశ్చర్యచకితుఁడై "నాకుఁ దక్క ఇతరులకుఁ జొరరాని ఇచ్చటకు నీ వెట్లువచ్చితివి?" అనియడుగఁగా రాణి మీరు వచ్చునపుడు నిచ్చెన తీసివేయుట నేఁడు మఱచిపోయితిరి. ఇట్టి సమయమునకై చాల దినములనుండి వేచియున్న నేను వెంటనే లోపలకు వచ్చితిని; గాని నాథా, నేను మీకు పదదాసినిగదా? అర్ధాంగినిగదా? అట్టి నన్ను ఇట్లు వేఱు సేయుట మీకు న్యాయమా? మీకు నేను ఏమి

యపరాధము చేసితిని. మీకు ఎప్పుడును ఎదురాడినదియే లేదుగదా. ఏవిషయమునందును మీకు అడ్డువచ్చినదియే లేదుగదా. నియమమును ఎన్నఁడు ఉపేక్షించినదియే లేదుగదా. అట్టి నన్ను ఇట్లు వేఱుచేయుటకు మీకు ఎట్లు మనసు ఒప్పెను?" అని యడిగెను. రాజు గతజలసేతుబంధనము వలదనియెను. అది మొదలు రాజును రాణియు అనుదినమును శ్రీహరినిఁ బూజించుచు సాక్షాత్కరించినదామోదరుని సేవించుచు బ్రహ్మానందమునఁ గాలము గడపి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసిరి.

ఉ. "యూఁపుర నామకుంజముల మావి నొకించుక మోడ్పునందమున్
జూపెడు నోరచూపు సొగసుం బొమ నొక్కట నిక్కఁగన్నసం
ద్రేఁపులు సొక్కఁ గప్పకము క్రిందఁ ద్రిభంగిగ నిల్చి యంగుళీ
వ్యాపితవంశపూర్తియయి పర్తెలు మోహనమూర్తిఁ గొల్చెదన్"
(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 102.)

---

69. గిరిధరలాలు.

శ్లో. "అంగనా మంగనా మంతరే మాధవో
మాధవం మాధవం చాంతరే చాంగనా,
ఇత్థ మాకల్పితే మండలే మధ్యగః
సంజగౌ వేణునా దేవకీనందనః".
(కృష్ణకర్ణామృతము. ఆ. 2. శ్లో. 35.)

బృందావనక్షేత్రమున గిరిధరలాలు అనునొక బ్రాహ్మణుఁడు ఉండెను. ఆతఁడు సంసారముయొక్క అసారతనుగుర్తించి ఐహికసౌఖ్యములు ఆభాసములు అని యెఱింగి ప్రపంచము అంతయు మిథ్యయని తెలిసి తామరాకుమీఁది నీటిచుక్కవలె ఎందును అంటక శ్రీహరిపూజాతత్పరుఁడై కాలము గడుపుచుండెను. కాళ్లకు గజ్జెలు కట్టుకొని తంబురమీటుచు శ్రీహరిగుణములను వర్ణించుచు నాతఁడు భజనము చేయునపుడు అనేకులు వచ్చి విని చూచి బ్రహ్మానందపరవశులై పోవుచుందురు.

ఒకప్పుడు ఆతఁడు గోపాలకృష్ణుని సేవించుటకు ఆలయమునకుఁ బోయెను. అంతకుఁ బూర్వమే అచ్చటకు అనేకభాగవతులు వచ్చియుం

డిరి. వారందఱును గిరిధరలాలుని గాన ప్రావీణ్యమును వినియున్నవారు గావున అందఱును జేరి "మహాత్మా, శ్రీకృష్ణభగవానుని రాసక్రీడా వైభవమును గీర్తించి మాకు ఆనందము గలిగింపుము" అని ప్రార్థించిరి. ఆతఁడు వారిమాట త్రోసి వేయఁజాలక పోయెను గాని, తంబురయు గజ్జెలు మఠమునుండిపోవుటచే వీరి నెట్లు సంతోషపెట్టఁగల నని చింతింపసాగెను. ఇట్లుండఁగా ఆకాశమునుండి తళతళ మెఱయు గజ్జెలును కలకల పలుకుతంబురయు వచ్చి గిరిధరలాలు ముందుఁ బడెను. అది చూచి భాగవతులు ఎల్లరును ఆశ్చర్యచకితులై గిరిధరలాలు మాహాత్మ్యమును వేనోళ్ల కొనియాడిరి.

తరువాత గిరిధరలాలు ఇదియంతయు గోపబాలుని అనుగ్రహము అని యెఱింగి వానికి మ్రొక్కి పీతాంబరమును గజ్జెలను ధరించి తంబుర గైకొని భాగవతుల యనుజ్ఞను బడసి నృత్యము ప్రారంభించెను. ఇట్లు రెండుమూఁడు నిమిషములు గడచునప్పటికి భాగవతులకు తన్మయత్వము గలిగెను. మఱి రెండు నిముసములకు గిరిధరలాలు గూడఁ దన్మయుఁడై చేష్టలు దక్కి నిలిచెను అపుడు శ్రీకృష్ణుఁడు తొల్లి బృందావనమున గోపికలతో నెట్లు రాసక్రీడ సలిపెనో అట్లే అచ్చట సాక్షాత్కరించి రాసక్రీడ సలుపసాగెను. భాగవతులు ఇది చూచి నిర్విణ్ణులై పదపడి తెలివి గాంచి శ్రీకృష్ణుని అనేకవిధంబులఁ గొనియాడసాగిరి. ఇంతలో కృష్ణుఁడు తిరోహితుఁడు అయ్యెను. గిరిధరలాలు ఇంకను తన్మయుఁడై యే యుండెను. భాగవతులు ఆతని భక్త్యావేశమునకు అచ్చెరువడి అందఱును ఆతనిచుట్టును జేరి చేతులతోఁ దాళము వేయుచు శ్రీహరికీర్తనలు పాడసాగిరి.

కొంతసేపటికి గిరిధరలాలునకు ప్రాపంచికస్మృతివచ్చెను. తోడనే భాగవతులందఱును ఆనందబాష్పములతో నాతనిపాదముల నభిషేకించి "మహాత్మా, నిర్హేతుకజాయమానకటాక్షమున మాకు శ్రీకృష్ణుని రాసక్రీడావైభవమును ప్రత్యక్షము సేసితివి. నిన్ను మేము ఏమని కొనియాడఁగలము? నీ ప్రజ్ఞ అసామాన్యము" అని సన్నుతించిరి. గిరిధరలాలు వారిని తనమఠమునకుఁ గొనిపోయి మృష్టాన్నసంతృప్తులంగావించి సుగంధకుసుమతాంబూలములు అర్పించి చాలనాదరించి పంపివేసెను.

ఒక దినమున ఒక విరాగి వచ్చెను. గిరిధరలాలు ఆతనిని దనమఠమునకుఁ గొనిపోయి చాల గౌరవించి మృష్టాన్నసంతృప్తునింగావించెను. ఇది తెలిసి ఊరివారందఱును వచ్చి "శ్మశానమునుండి వచ్చినవానికి నీవు ఆతిథ్యము ఇచ్చితివి; గావున నిన్ను వెలివేసితిమి," అని పలికిరి. అందులకు ఆతఁడు "మహానుభావులారా! మీరు ఆతనిని ఇట్లు పలుకఁ దగదు. ఆతఁడు కేవలము భాగవతాగ్రేసరుఁడు" అని చెప్పఁగా వారు "ఆతఁడు మహాత్ముఁడని నీవు చెప్పుచున్నావు. నీవు శవమును బ్రతికింపఁ గలవా? అట్లయిన నీమాటలను ఆతని మాహాత్మ్యమును నమ్మెదము." అనిరి. గిరిధరలాలు వల్లె యనెను గ్రామవాసులు ఆతని నొక శవము చెంతకుఁ గొనిపోయి 'దీనిని బ్రతికింపుము' అని రిగిరిధరలాలు నిర్మలచిత్తముతో శ్రీహరినిఁ బ్రార్థించి ఆశవమును దాఁకెను. తోడనే మృతుడైన పురుషుఁడు నిద్దురపోయి నవానివలె లేచి భక్తునకు వలగొని సాష్టాంగ వందనములు అర్పించి అనేకవిధములఁ గొనియాడెను. అది చూచి ఊరివారందఱును లాలు పాదములమీఁద వ్రాలి "మహాత్మా, నీశక్తి నెఱుంగక నిన్నుఁ దూఁ నాడిన మమ్ము క్షమింపవలయు" నని అనేకవిధముల బతిమాలికొనిరి. గిరిధరలాలు వారికి అభయ మిచ్చి తన మఠమునకుఁ గొనిపోయి మృష్టాన్నతృప్తులం గావించి పంపివేసెను.

గిరిధరలాలు బ్రతికియున్నంతకాలము నిట్లు శ్రీహరిని బూజించి అవసానమున సాయుజ్యముక్తిని బడసెను.

చ. ఇరుపసఁ దాను నిల్చి తన కెంతులు పార్శ్వములన్ వసింపఁగాఁ
గిరములుగింపఁ పాఁపఁ జెలఁగన్ ఖచిన్మణివిగ్రహంబులన్
సర మొనరించినట్లుఁ సుసుస్థితి మంపెఁ మహ్యపద్ధతియై
మురళీరవంబునం జెలఁగు మోహనమూర్తి మురారిఁ గొల్చెదన్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 35)

70. సుహాక్ షా.

శ్లో. ఆపాటలాధర మధీరవిలోల నేత్ర
మామోదనిర్భరిత మద్భుత కాంతిపూరం
ఆవిస్మితామృత మనుస్మృతిలోభనీయ
మాముద్రితానన మహో మధురం మురారేః.

(కృష్ణకర్ణామృతము ఆ. 3. ప. 63)

అహమ్మదాబాదు అనునగరమున సుహాక్ షా అను నొక మహమ్మదీయుఁడు వసించియుండెను. ఆతఁడు నపుంసకుఁడు; గావున స్త్రీలవలెనే వస్త్రాభరణాదులను ధరించి సిగ్గుపెంపున వీథిలోనికి రాఁజాలక సదా ఇంటియందే యుండెడివాఁడు. పూర్వపుణ్యవశమున ఆతనికి శ్రీహరిభక్తియొదవెను. ఆతఁడు సర్వకాలములయందును శ్రీహరిస్మరణము తక్క నన్య మెఱుఁగక యుండెను.

ఇట్లుండఁగా ఆ దేశమున అనావృష్టిచే క్షామముసంభవించెను. త్రాగుటకు జలమును తినుటకు పదార్థములును లేకుండుటచే అనేక జనులు చనిపోవసాగిరి. ఇదిచూచి అహమ్మదాబాదునగరమున ధరాపాలనము సేయుచున్న రాజు జననష్టమునుజూడలేక, నిరాహారుఁడై ఏడు దినములు మహోగ్రతపస్సుఁజేసెను. శ్రీహరిఅందులకుఆనందించిసాక్షాత్కరించి "వత్సా, నీభక్తికిని, నీతపోనిష్ఠకును నీదీక్షకును నీప్రజాపరత్వమునకును మెచ్చితిని. నీవు సర్వజీవదయాళుఁడవై ప్రజలనుకన్నబిడ్డలంబోలె భావించుచు భూమి నేలుచుండుట మొదటినుండియు నేను గమనించుచున్నాను. నీకెందును లోపముకలుగదు. నేను నిన్నెపుడును వేయికండ్లతోఁ జూచుచుందును. నీవు ఇపుడు వర్షమును గోరి నానిమిత్తము ఈఘోరతపస్సు చేసితివి. నీనగరమున నొక పర్ణకుటీరమున నొక సుహాక్ షాఅను నొకమహమ్మదీయుఁడు నాభక్తుఁడువసించియున్నాఁడు. నీవు పోయి ఆతనిని మ్రొక్కి ప్రార్థించెదవేని నీకోరిక నెఱవేఱును" అనిచెప్పి తిరోహితుఁడు అయ్యెను.

అంతట రాజు తపస్సు చాలించి నిండుకొలువునఁ గొలువుదీఱి మంత్రిసామంతాదులకును, విద్వాంసులకును జరిగినది అంతయు నెఱిం

గించెను. అందఱును ఆశ్చర్యచకితులైరి. ఒక బ్రాహ్మణుఁడు "మహారాజా, భగవంతుని మాట తప్పదు. ఆమహాత్ముఁడు భగవంతుని అంతరంగభక్తులలో అగ్రేసరుఁడు. కాకున్న ఇట్టిది యుండదని వేఱుగఁ జెప్పవలసినది ఏమున్నది? ఆమహాత్ముఁడు మహమ్మదీయుఁడు అను శంక వలదు. మహాత్ములు అన్నిజాతులయందును ఉందురు. మాహాత్మ్యము ఉన్నచోట జాతిభేదములను గణించుట వివేకిలక్షణముగాదు. అదియుఁ గాక శ్రీహరి సెలవైనపుడు సందేహమునకు అవకాశమే లేకుండఁబోయినది" అని చెప్పెను. అందఱును ఔను అనిరి. వెంటనే రాజు సుహాక్ షా కుటీరమునకు బయలుదేఱెను.

రాజుచే వర్ణితుఁడై సుహాక్ షా సంగతిసందర్భములు అన్నియు విని శ్రీహరినిఁ బ్రార్థింపఁదొడఁగెను. అయిదాఱునిముసములు గడచినను వర్షము కురియనందున సుహాక్ షా కోపించి "శ్రీహరీ, నన్ను మోసముఁ జేసెదవా?" యని ముక్కుననున్న నత్తు నూడఁబెఱికి చేతి గాజులు పగులఁగొట్టుకొనఁబోయెను. అంతట శ్రీహరి సాక్షాత్కరించి "వత్సా, వలదు" అని సాహసమును వారించి అంతర్హితుఁడయ్యెను. తోడనే పదునాలుగుదినములు అహోరాత్రములు సంతతధారగా వర్షము కురిసెను. క్షామము చల్లారెను. రాజు పరమానందభరితుఁడై సుహాక్ షా ననేకవిధములఁ బూజించి "మహాత్మా, ఈ సేవకుఁడు సమర్పించు వస్తువులను స్వీకరింపవలయును" అని ప్రార్థించెను. అందులకు భక్తుఁడు "నాకేమియు వలదు. శరీరమును విసర్జింపఁదలంచుచున్నాను. సమాధిని నిర్మించియిమ్ము" అని కోరఁగా రాజు అంగీకరించెను.

అప్పుడొక దీనుఁడు వచ్చి "మహాత్మా, నాయెడలఁ గరుణించి నాకు ముక్తిమార్గమును ఉపదేశింపవలయును" అని ప్రార్థించెను సుహాక్ షా పరమానందముతో నాతనికి శ్రీకృష్ణమంత్రమును ఉపదేశించి తత్త్వమును ఎఱింగించి పూజావిధానమును దెలిపెను. అదిచూచి ఇంక ననేకులు ఆతనివలన ఉపదేశములను బడసిరి. ఇంతలో గోరీ, సిద్ధమయ్యెను. ఈసంగతిఁ దెలియఁగనే సుహాక్ షా గోరిచెంతకుఁబోయి నిలిచి నిమీలితనేత్రుఁడై శ్రీహరినిఁ బ్రార్థించెను. తోడనే ఆతని యాత్మ సూర్యమండలమును భేదించుకొనిపోయి శ్రీహరిసాయుజ్యమును బడ

సెను. రాజు ఆతనిశరీరమును మహావైభవముతో ఆగోరీలో సమాధి చేయించెను.

మ. అతులానందరసామృతార్ణవ మహాంగాఢంగరంగత్తరం
గతతిం బొంగుచుఁ గెంపుమోవి సరిదాఁకం దత్సుధాబిందువుల్
స్మితలీలన్ విలసిల్లె నంచు జనముల్ చిత్తంబులన్ మెచ్చ న
ద్భుతశృంగారరసైకముద్రితముఖాంభోజున్ హరిం గొల్చెదన్.

---

71. బహిరంభట్టు.

శ్లో. అనన్యసాధారణకాంతికాంత
మాక్రాంతగోపీనయనారవిందం,
పుంసఃపురాణస్యనవంవిలాసం
పుణ్యేనపూర్ణేనవిలోకయిష్యే.

(కృష్ణకర్ణామృతము. ఆ 2. ప. 32.)

ప్రతిష్ఠానపురమున బహిరంభట్టు అను నొకబ్రాహ్మణుఁడు సకల శాస్త్రములయందును అనంతప్రజ్ఞను గడించియుండెను ఆతఁడు అఱువది సంవత్సరముల వయస్సు దాఁటిన తరువాత నొకనాఁడు భోజనసమయమున "కూరలో ఉప్పు తక్కువయ్యెన" దని భార్యతోఁ బలికెను. అది విని యారమణి "మీకు అఱువదియేండ్లు నిండినవి. ఇంకను రుచులు చాల లేదు. కామక్రోధాదులు మఱల లేదు. రుచివిషయమునఁ గల యాదీక్ష మీకు భగవంతుని విషయమునన్నచో ఇహపరమును గూడఁ దరించి పోదుము" అని పలికెను.

ఈమాట ఆబ్రాహ్మణుని వల్లగుండెకు వాఁడిబాణమువలె చురుక్కున నాఁటెను. తోడనే యాతఁడు తినుచున్న పదార్థమును విడిచివేసి హస్తప్రక్షాళనాదికము గావించుకొనివచ్చి భార్యకుఁ బ్రదక్షిణనమస్కారములు ఆచరించి "స్త్రీవైనను జ్ఞానమున నాకంటె ఎక్కువదానవై యున్నావు. నీవు ఇప్పుడు నాకుఁ గావించిన యుపదేశము ఈజన్మము ఉన్నంత కాలమును నాకర్ణపథమున మాఱుమ్రోగుచునే యుండును. శ్రీహ

గియే నీరూపమునవచ్చి నాయజ్ఞానమును దొలంగించెను" అనియు మఱియు అనేకవిధములఁ గొనియాడి "ఆకస్మికముగా ఒక్కక్షణములోఁ గలిగిన ఈవైరాగ్యము లడవులలోఁ బ్రవృద్ధము అగును" అని నిశ్చయించుకొని వెంటనే ఎంతయు వలదనుచున్నను వినక అడవులం బట్టి పోయెను.

తరువాత ఆతని భార్య ప్రార్థనమువలన బంధుమిత్రులు అనేకులు అరణ్యమునకుఁ బోయి వెదకి పట్టుకొని నిర్బంధించి ఇంటికిఁ దీసికొనిరాఁ దొడఁగిరి. అపుడు ఆతఁడు నడచుచునే "వీరు చాల పట్టుపట్టియున్నారు. అస్పృశ్యుఁడ నగుదునా వీరు నన్ను విడువరు" అని తలంచి ఎట్లో వారినిఁ గికురించి సమీపమునందలి ఒక పట్టణమునకుఁ బోయి తురకలమతాచార్యుఁడగు కాజీచెంతకుఁ బోయి "నేను తురకమతములోఁ గలిసెదను" అని పలికెను. తోడనే కాజీ మహాసంతోషభరితుఁడై ఆతనికి సున్తీమొదలగు సంస్కారములు చేసి మహమ్మదీయమతదీక్ష యొసంగెను. బహిరంభట్టు "కాజీ నన్ను కష్టముల నుండి గట్టెక్కించెను; గాని హృదయమును ద్రిప్పుటకు ఈతఁ డెవ్వఁడు! నేను మహమ్మదీయుఁడనైనను శ్రీహరికింకరుఁడను. శ్రీహరి దేవభావములను లెక్కించునా! హృదయము పరిశుద్ధమై యున్నపుడు నాకేమి భయము" అని ధైర్యము వహించి యుండెను.

ఆతని బంధుమిత్రులు వెదకివచ్చి ఆతనినిఁ బట్టుకొనిరి; గాని యాతఁడు "నన్నుఁ బట్టుకొనుటవలనఁ బ్రయోజనము మీకేమియు లేదు. నేను మహమ్మదీయుఁడనైతిని" అని పలికెను. తోడనే వారు "ఛీ ఛీ ఈయపాత్రుని మొగము చూడఁగూడ" దని తొలఁగి పోయిరి. అంతట నాతఁడు "బంధుమిత్రాదుల నిర్బంధము తప్పినది. ఇఁక నాకీతురకమతమెందులకు?" అని తలంచి కాశీనగరమునకుఁ బోయి విద్వద్బ్రాహ్మణులకుఁ దనచరిత్రను అంతయు వివరించిచెప్పి "నన్ను మఱల మీమతములోఁ గలుపుకొనవలెను" అని ప్రార్థించెను. బ్రాహ్మణులు ఆతనిదీనాలాపములకు జాలిపడి ధర్మశాస్త్రప్రకారము ప్రాయశ్చిత్తమును జరిపి బ్రాహ్మణులలోఁ గలుపుకొనిరి. అదియైన తరువాత భట్టు, వారలం జూచి "విద్వాంసులారా, నాకొకసందేహముగలదు. దానిని మీరే తీర్పవలయును" అని ప్రార్థించి "మున్ను సున్తీమొదలగుసంస్కారములను బడసి తురకనైతిని. ఇప్పుడు మీరుబ్రాహ్మణులలోఁ గలుపుకొన్నారు అని చెప్పుచు

న్నారు. అయిననుతొల్లిటిసుస్థితిపోలేదు. ఇప్పుడు నేను తురకనా? బ్రాహ్మణుఁడనా." అని ప్రశ్నించెను. బ్రాహ్మణులు ఆలోచించి "నీకు ఈశ్వరుఁడే చెప్పవలయును; గాని మేము చెప్పఁజాలము" అని తమదారిని బోయిరి.

బహిరంభట్టును జూచినవారు అందఱును "బాపనతురక" అనియు 'తురకబాపఁడు' అనియు నింక నిట్లనేకవిధములను జెప్పసాగిరి; గాని భట్టు ఈనిందలకుజంకక దేశయాత్రకు బయలుదేఱెను బహబానలము అనునొక గ్రామమున నాగనాథుఁడు అను నొక వృద్ధబ్రాహ్మణుఁడు గొప్ప దేవాలయమును గట్టింపఁ దలఁచి బెండ్లతోఁ బండ్లు చేయించి వాని మీఁద కొండవంటిరాళ్లను ఎక్కించి కోఁతులచే లాగించుకొనిపోవుచుండెను. భట్టు ఆతనిఁజూచి 'ఈతఁడు సిద్ధుఁడు. ఈతనివలన నాసందేహము తీఱును' అని నిశ్చయించుకొని తిన్నగ నాతని యెదుటకుఁబోయి నిలిచి 'నేనెవ్వఁడనో చెప్పుము. నీ తెలివితేటలు ఇపుడు తెలియును' అని పలికెను. నాగనాథుఁడు ఆతని మాటలకుఁ గోపించి "చావుము" అని తన బెత్తముతోఁ గొట్టెను. తోడనే భట్టు భూమిపైఁ బడి మరణించెను. నాగనాథుఁడు "ఈశవమును గొనిపోయి రోటిలోవేసి దంచి ముద్దచేసి తెండు" అని నియమించెను. వారు అట్లే చేసిరి. నాగనాథుఁడు ఆముద్దనుచితిమీఁద నుంచి దహనముచేసి భస్మము నంతను ప్రోగుచేసి తనకమండలూదకమును జల్లెను. తోడనే భట్టు పూర్వాధిక తేజస్సుతో లేచి నిలిచి నాగనాథునిపాదములమీఁదఁ బ్రాలెను. అపుడు నాగనాథుఁడు "మూఢా! ఇప్పుడు నీవు ఎవఁడవో చెప్పుము" అనియెను. భట్టు అప్పుడు తన శరీరమున తురకలు చేసిన సంస్కారములుగాని పిదప బ్రాహ్మణులు చేసిన సంస్కారములనుగాని కానక ఏమిచెప్పుటకును దోఁచక మౌనియైయుండెను అప్పుడు వాని నాగనాథుఁడు చేరఁబిలిచి భట్టుచెవిలో తారకమంత్రమును ఉపదేశించి తత్వమును దెలిపి "నాహితోపదేశమును మఱువక సాధువులను సేవించుచుఁ గాలము గడుపుము" అని చెప్పి పంపివేసెను.

భట్టు గురువు ననుజ్ఞను బడసి అనేక పుణ్యక్షేత్రములను దర్శించి తుదకు పండరిపురమునందు పాండురంగనిసన్నిధిఁ జేరి భాగవతమును అభంగవృత్తములతో మహారాష్ట్రభాషలోనికి మార్చి బ్రతికియున్నంత కాలమును భగవద్భాగవతుల నర్చించుచు అనేకులకు ముక్తిమార్గమును ఉపదేశించి అవసానమున ఈశ్వరసాయుజ్యమునుఁ బడసెను.

చ. ఇతరుల కందరాని జగదేకమనోహర కాంతియుక్ సమా
గతనవయౌవనాకరవికాసము లన్నియు గోపబాలికా
యతనయనారవిందముల కగ్గము సేయు పురాణపూరుషున్
మతిఁ దలపోసి చూచెద సమగ్రసనాతనపుణ్యసంగతిన్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 3. ప. 32)

72. కేశవస్వామి.

శ్లో. వ్యామోహప్రశమౌషధం మునిమనోవృత్తిప్రవృత్త్యౌషధం
దైత్యేంద్రార్తికరౌషధం త్రిభువని సంజీవనైకౌషధం,
భక్తాత్యంతహితౌషధం భవభయప్రధ్వంసనైకౌషధం
శ్రేయఃప్రాప్తికరౌషధం పిబ మన శ్రీకృష్ణదివ్యౌషధమ్.

(ముకుందమాల. శ్లో. 24.)

ఒక గ్రామమున కేశవస్వామి అను పరమభాగవతోత్తముఁడు నివసించియుండెను. ఆతఁడు అనవరతమును శ్రవణమననధ్యానాదికమగు శ్రీహరిపూజ తక్క నన్యమెఱుంగఁడు. ఆతనివలన యనేకులు ముక్తిమార్గోపదేశమును బడసిరి. ఒకనాఁడు ఆతఁడు కాళ్లకు గజ్జెలుకట్టుకొని ఒకచేతఁ జిఱుతలును, ఒకచేత తంబురయును గైకొని హరిభజనము ప్రారంభించెను. మనోమోహనముగు కేశవస్వామి గానామృతమునుగ్రోలఁగోరి అనేకభాగవతులు, పెక్కుపామరులునువచ్చి చుట్టును జేరి వినసాగిరి. కొంతసే పయినతరువాత కేశవస్వామి శిష్యులలో నొకనిఁ జేరఁబిలిచి "వత్సా, నేడు హరివాసరము. భాగవతు లందఱును ఉపవాసదీక్షలోనున్నారు. నీవు బజారునకుఁ బోయి సొంటి బెల్లమును గొని రోటిలోదంచి ముద్దచేసి తెమ్ము" అని నియమించెను.

అప్పటికి రెండుజాముల రాత్రి యయ్యెను. దుకాణములు అన్నియు మూయఁబడియుండెను. ఒకవర్తకుఁడు మాత్రము హరిభజనము వినుటకు రాఁగోరి అంతలో నిద్రక్రమ్ముటచే దుకాణము మూయకయే అచ్చటఁగూర్చుండి కునికిపాట్లుపడుచుండెను. కేశవస్వామి శిష్యుఁడు వర్తకునిఁ దట్టి లేపి తాను వచ్చినపనినిఁ దెలిపెను. తోడనే వర్తకుఁడు మహానందముతో లేచి బెల్లము దీపము లేకపోవుటచే సొంటి

యనుకొని వసనాభిని నలిసినంత ఇచ్చి ఆబ్రాహ్మణుని బంపివేసెను. ఆతఁడును ఆరెండువస్తువులను గొనివచ్చి రోటిలోఁగంచి ముద్దచేసి తెచ్చిగురువునకుఇచ్చెను. కేశవస్వామి దానిని భగవంతునకు నివేదించి గచ్చకాయంతముద్దలుచేసి దానిని అచ్చట నున్న భాగవతులు వగయిరాలకు అందఱకుఁ బంచియిచ్చెను. అందఱును మిగుల భక్తితో దానిని భుజించి తెల్లవాఱునంతవఱకునుండి పిదప ఎవరిఇండ్లకు వారు పోయిరి.

మఱునాఁడు వర్తకుఁడు మరల దుకాణమును దెఱచునప్పుడు సొంటిబస్తా కట్టఁబడియేయుండుటయు వసనాభిసంచి విప్పఁబడి సగమే యుండుటయుఁ జూచి "రాత్రి ఘోరము జరిగినది. అనేకభాగవతుల మృతికి నేను కారణభూతుఁడ నైతిని" అని చాల భయంపడుచు ఊరిలోని భాగవతుల ఇండ్లకు బయలుదేఱెను. ఆగ్రామమున నున్నభాగవతులు అందఱును రాత్రిభగవత్పూజనకు కేశవస్వామి ఇంటికిఁబోయియే యున్నారు; గావున వారు దానినిఁ దినకమాన రనియు వారినిఁ జూచినచో సకలమును దెలియఁగలననియుఁ నిశ్చయించుకొని యాతఁడు అట్లు బయలుదేఱెను; గాని యొకరిద్దఱు భాగవతులను జూచునప్పుటికి ఆతనికి భయము తీఱెను. "రాత్రి కేశవస్వాములవారికి శొంఠియు బెల్లమును నీవే ఇచ్చితివఁట. కేశవస్వామి మాకందఱకును బ్రసాదము నిచ్చెను. ఆహా, ఏమి యామాధుర్యము; కాని సెట్టీ, ఆప్రసాదమున మాకు శొంఠిరుచి కానిపింపలేదుసుమా. భగవంతునకు నివేదింపఁబడుటవలనను, నీవు ఇచ్చుటవలనను, విశేషించి కేశవస్వాములు అనుగ్రహించుటవలనను అది అమృతోపమానమైయున్నది" అని ఆ యొకరిద్దఱు భక్తులును జెప్పిరి. వారిప్రసంగమున తానిచ్చినది శొంఠి కాకపోవుట వ్యక్తమైనను దానివలన వారికి ఏమియు విపత్తు రాకుండుటఁ జూచి "నేను ఇచ్చినది వసనాభియగుటలో నెంతమాత్రమును సందేహములేదు; గాని కేశవస్వామియెడలఁ గలప్రేమాతిరేకమువలన శ్రీహరి అందలి విషమును దొలఁగించి అమృతమును జిలికెను. ఇదియే ఇందలి రహస్యము" అని నిశ్చయించుకొని కేశవస్వామిఇంటికి బయలు దేఱెను.

అప్పటి కప్పుడే కేశవస్వామి స్నానసంధ్యాద్యనుష్ఠానములు అన్నియు నిర్వర్తించుకొని శ్రీహరినిఁ బూజించుటకు తన ఇంట నతి

ధులై యున్న భాగవతులతోఁ గూడఁ బూజామందిరమును బ్రవేశించెను. అచ్చటఁ జూడఁగా శ్రీహరి స్వర్ణవిగ్రహము తళతళలాడుటమాని నల్లఁబడియుండెను. అందులకు ఆశ్చర్యచకితుఁడై కేశవస్వామి చెంతనున్న భాగవతులకు అదియంతయు నెఱిఁగించి "ఇందులకుఁ గారణము ఏమై యుండును?" అని యోచించుచుండెను. అట్టి సమయమున వర్తకుఁడు అచ్చటకు వచ్చి కేశవస్వామికి తక్కిన భాగవతులకును సాష్టాంగనమస్కారములు ఆచరించి కేశవస్వామి యెదుట నమస్కరించి నిలిచి "మహాత్మా, నిన్నరాత్రి నేను భాగవతులకు తెలిసి యపరాధము గావించితిని" అని సకలమును ఎఱింగించి మన్నింప బ్రార్థించెను. అది విని కేశవస్వామి ఆశ్చర్యచకితుఁడై శ్రీహరి విగ్రహము నల్లఁబడియుండుటకుఁ గలకారణమును ఇప్పటికిఁ దెలిసికొని "శ్రీహరీ, నీకు ఎంత యపచారము చేసితిని! నీకు విషము పెట్టితిని గదా? అయ్యో, భాగవతులకు ఎంత కష్టము తప్పినది! నేను ఎంత పాపాత్ముఁడనైతిని!" అని యనేకవిధముల విచారించి "అనాథనాథా, నీకు అసాధ్యము లేదు. నీలీలలు తెలిసికొనుట కెవరికిని శక్తి లేదు. ఇఁక నావంటి కుక్షింభరుల సంగతి వేఱుగ వివరింపనేల? అయినను నీకు నాయెడల అనుగ్రహము ఉండుట ఇప్పటికిఁ దేటతెల్లమైనది; గాని ఈయనుగ్రహము అనుగ్రహము గాదు. నీవు మఱల యథారూపము వహించినఁగాని నాకు విచారము పోదు" అని ప్రార్థించెను. అంతట శ్రీహరి దివ్యమంగళవిగ్రహుఁడై సాక్షాత్కరించి భాగవతుల నందఱను దీవించి కేశవస్వామినిఁ జూచి "వత్సా, నీకేమియు లోపము లేదు. నీవు నాయంతరంగభక్తుఁడవు; గావున నీహృదయమున సదా నేను వసించియుందును. నీవాక్కులు పీయూషతరంగితములై నాకు మహానందమును గలిగించినవి నీవు తలఁచినపుడెల్ల నీకు సాక్షాత్కరించి సేవ యొసంగుచుందును" అని అభయ మిచ్చి అంతర్హితుఁ డయ్యెను.

తోడనే సువర్ణవిగ్రహము యథారూపము వహించెను. అది చూచి కేశవస్వామి చాల నానందించి భాగవతుల నెల్లరను గొనియాడి వర్తకునిఁ జాల వినుతించి అందఱకు ఆతిథ్యము నొసఁగెను. కేశవస్వామి ఇట్లే అనేకాద్భుతములను జేయుచుఁ బ్రతికియున్నంతకాల

మును శ్రీహరినిఁ బూజించి అనేకపామరులకు ముక్తిమార్గమును ఉపదేశించి అవసానమున ఈశ్వరసాయుజ్యమును బడసెను.

మ. విలసత్పింఛవతంసుఁడై చిగురుమోవిన్ వేణువుం జేర్చి కం
దళితాలాపసుధాపరంపరఁ జేతం జేతనాచేతన
మ్ములకున్ నిశ్చలతాచలత్వముల పెంపుల్ గూర్చు నద్గోపికా
లలితాంగీసుజనత్వవంచకుని గొల్వం గాంతు గోపాలకున్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. శ్లో. 78.)

73. పన్ హాజీ సింగు.

శ్లో. ఉపాసతాం మాత్మవిదః పురాణాః, పరం పుమాంసం నిహితం గుహాయాం,
వయం యశోదాశిశుబాలలీలాం, కథాసుధా సింధుషు లీలయామః.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. శ్లో. 55)

గుజరాతీ దేశమున కోల్హాపూరు అను పట్టణమున గుమాన్ సింగు అను రాజు ప్రజాపాలనము గావించుచుండెను. ఆతఁడు సుక్షత్రియవంశాలంకారుఁడు. మనుమార్గమును దప్పక పరిపాలనము సేయు ధర్మాత్ముఁడు. ఆతనికి పన్ హాజీసింగు అను ఒక క్షత్రియకులశేఖరుఁడు స్నేహితుఁడై యుండెను. లౌకిక్యవ్యవహారము లన్నియు శీఘ్రముగ నెఱవేర్చుకొని వారు ఇరువురును ఏకాంతస్థలమునఁ గూరుచుండి హరినామసంకీర్తనము సేసికొనుచుందురు.

ఒకనాఁడు దీపావళిపండుగు వచ్చెను. రాత్రి వారు ఇద్దఱును ఏకాంతస్థలమునఁ గూరుచుండి హరినామసంకీర్తనము చేయుచుండిరి. ఉన్నట్లుండఁగా పన్ హాజీ హరిహరీ యని తన బుజముమీఁది యుత్తరీయమును జేతులతో లుంగఁ బెట్టి నలిపివేసెను. అది చూచి గుమాన్ సింగు అందులకుఁ గారణము ఏమనఁగా:పన్ హాజీ "ద్వారకానగరమున శ్రీకృష్ణభగవానునకు దీపోత్సవము జరుగుచున్నది. అర్చకుని అజాగ్రతవలన శ్రీకృష్ణుని పీతాంబరము అంటుకొనినది. నేను ఆర్పివేసితి" నని చెప్పెను. అందులకు గుమాన్ సింగు మఱింత యాశ్చర్యపడి మఱునాఁడు "నిన్నరాత్రి ద్వారకానగరమున శ్రీకృష్ణాలయమున జరిగినవిశే

షమేమో తెలుపవలె” నని రావణాపట్టణమునకు ప్రభువైన తన తోడి యల్లునకు వ్రాసెను. అతఁడు వెంటనే “దీపోత్సవసమయమున అర్చకుని అజాగ్రతవలన స్వామి పీతాంబరము అంటుకొనినది; గాని వెంటనే పన్ హాజీసింగు వచ్చి నలిపి యార్పివేసెను” అని ప్రత్యుత్తర మిచ్చెను.

గుమాన్‌సింగు వెంటనే వచ్చి పన్‌హాజీసింగు పాదములమీఁద వ్రాలి “మహాత్మా, మీ మాహాత్మ్యమును ఎఱుంగఁజాలకపోయితిని. మిమ్ము సామాన్యస్నేహితులవలెఁ జూచుచు మీచేఁ గొన్నిసమయములయందు సేవఁ జేయించుకొంటిని. ఇఁక మిమ్ము నేను ఏమని క్షమింపవేఁడుదును? రాజగర్వము నాకన్నులఁ గప్పి మిమ్ముఁ జులకనగాఁ జూచునట్లు చేసినది. అక్కటా, నేను ఎంతపాపి నైతిని” అని వగపసాగెను. అపుడు పన్‌హాజీ రాజును గౌఁగిలించుకొని “రాజా, ఏల ఇంతగా వగవ? నీవు చేసిన యపరాధము ఏమియున్నది? విష్ణ్వంశ లేనివాఁడు పృథివీపతి కాఁజాలఁడు అని మనశాస్త్రములు శాసించుచున్నవి. ఇఁక నిన్ను సేవించుటకు నాకు అభ్యంతర మేమి గలదు? నేఁడు నాయెడల నీవు ఇట్లు భేదభావమును జూపెద వేల? నీవు సుగుణమండితుఁడవు. శ్రీహరిభక్తుఁడవు. శ్రీహరి నీకు ఉపదేశము చేయునట్లు నాకు ఆజ్ఞాపించెను. నీకు ఏమియు లోపములు కలుగఁబోవు” అని శ్రీకృష్ణమంత్రము ఉపదేశించి “ఈమంత్రము భక్తిశ్రద్ధలతో జపింపుము. ఇది మానవుల పాపముల నన్నిటినిఁ ద్రోసివేసి ముక్తి నొసంగును. నీవు అదృష్టవంతుఁడవు; గావుననే నీవు శ్రీకృష్ణుని హృదయమున ఉత్కృష్ట స్థానమును ఆక్రమింపఁగలిగితివి. నీకు ఇఁకఁ జెప్పవలసినది ఏమి గలదు? ప్రజలను గన్నబిడ్డలను వోలెఁ గాపాడుము. సాధుసజ్జలను ఆరాధింపుము. శ్రీకృష్ణభగవానుని సేవింపుము” అని తత్త్వము నెఱింగించెను. రాజు అందులకు పరమానందభరితుఁడై మఱలఁ బాదములమీఁద వ్రాలి “మహాత్మా, గురుదక్షిణ యొసంగవలసినచో మీకు ఎవరు ఏమి ఈయఁగలరు? అయినను యథాశక్తిసమర్పణము శాస్త్రచోదితమే కదా? తమరు నా రాజ్యములో నర్ధభాగమునుస్వీకరించి వినియోగింపవలయును” అని ప్రార్థించెను. పన్‌హాజీసింగు “నీగురుభక్తికి ఆనందము. ఆరాజ్యభాగమును నీవేపరిపాలించి ధనమును భగవద్భాగవతసేవయందువినియోగింపుము. నీకు శ్రీకృష్ణభగవానుఁడు దివ్యమంగళవిగ్ర

హాముతో దర్శనమొసంగి రక్షించును" అని చెప్పి ద్వారకాపురమునకుఁ బోయెను.

గుమాన్‌సింగు గుర్వాజ్ఞాప్రకారము శ్రీహరిసేవ సేయుచు ఒకటి రెండు మాసములు గడచిన తరువాత గురువును జూడకుండ నుండలేక రాజ్యమును మంత్రికి అప్పగించి రాణితో బయలుదేఱి ద్వారకానగరమునకుఁ బోయెను. అప్పటికి షహాజీ మఠమునఁ గూరుచుండి శ్రీహరిస్మరణము సేయుచుండెను. రాజు ఆచార్యునిఁ జూచినవెంటనే సకళత్రుఁడై పాదములమీఁద వ్రాలి బాష్పోదకములచే గురుపాదములను అభిషేకించెను. షహాజీ తోడనే ఆదరముతో రాజును రాణిని లేవనెత్తి ఆశీర్వదించి ప్రీతివచనములాడి కూర్చుండఁబెట్టి హరిభజనముగావించి ఆనందము గొలిపెను. ఇట్లు కొంతసేపు అయిన తరువాత గురుశిష్యులిరువురును యమునానదికిఁ బోయి స్నానమాడి కృష్ణాలయమునకుఁ బోయి స్వామిని దర్శించి అచ్చట నున్న భాగవతులతోఁ గొంతసేపు భగవద్గుణకీర్తనము చేసి మఱలి మఠమునకు వచ్చి భగవన్నివేదితాన్నమును భుజించి శ్రీహరిభజనము ప్రారంభించిరి. ఇట్లు కొన్నిదినములు గడచిపోయిన తరువాత నొకనాఁడు గుమాన్‌సింగునకు శ్రీకృష్ణభగవానుఁడు సాక్షాత్కరించి అభయమిచ్చి చనెను.

మఱికొన్ని దినములు గడచిన తరువాత రాజు సకళత్రుఁడై స్వస్థలమునకు బయలుదేఱెను. మార్గవశమున అరణ్యములో ఇరువురును పాదచారులై పోవుచుండఁగా నొక తస్కరుఁడు ఆయుధహస్తుఁడై వచ్చి ఎదుట నిలిచెను. వానినిఁ జూచి రాణి భీతిల్లఁగా రాజు "దేవీ, ఏల భీతిల్లెదవు. గురూపదేశమును ఇంతలోనే మఱచితివా? మన యెదుటనే నిలిచియున్న వ్యక్తియందు తస్కరబుద్ధి నేల చేసెదవు! ఈశ్వరుఁడీ ప్రపంచమునందు అంతటను నిండియున్నాఁడే. తస్కరుఁడను పేరు ఆతని దేహమునకే కాని ఆత్మకు చెందదు. అట్లే రాజు రాణి అను పేరులు మన దేహములకే కాని ఆత్మకుఁ జెందదు ఆయాత్మయు యాత్మలును ఉపాధిచే భిన్నములై యున్నవి; గాని వేఱుగాదు. అట్టిచో ఆతనిం గాంచి నీవేల భయపడెదవు? ఒక్కమాఱు భగవంతుని రూపమును స్మరింపుము వెంటనే నీకు ఈవ్యామోహముపోయి జ్ఞానజ్యోతి ప్రకాశించును" అని చెప్పెను. రాణి అట్లే చేసి నిర్భీకచిత్తయయ్యెను.

అంతట చోరుఁడు రాజదంపతులను సమీపించి ఆయుధములను క్రిందఁ బాఱవేసి పాదములమీఁద వ్రాలి "ఇంతవఱకును నేను అనేక దుష్కృత్యములను జేసితిని ; కాని నన్ను ఇట్లు రక్షించినవారు లేరు. మీరే నాకుఁ దల్లియుఁ దండ్రియును. నాయెడల మీరు అభేదప్రతిపత్తిని బ్రకటించితిరి! గావున దాని స్థిరము చేసి నాకు జ్ఞానోపదేశము సేసి తరింపఁ జేయవలయును" అని ప్రార్థించెను.

అంతట రాజు తస్కరునిఁ బోదివి పట్టి "వత్సా, భయము వలదు. నీయెడల భగవంతునకుఁ గృప గలిగినది. నీవు సదా శ్రీహరిని ధ్యానింపుము భగవన్నామస్మరణతో నీతాపత్రయము తొలఁగిపోవును సంసారదుఃఖములు దరిఁ జేరవు" అని వానినిఁ బంపివేసి తాను తననగరమునకుఁ బోయెను. తస్కరుఁడును తన గృహము చేరకొని అదిమొదలు సకల దుర్వృత్తులను విడిచి ఇంద్రియములను జయించి సదా శ్రీహరిని ధ్యానించుచుఁ గొన్నిదినములు అయినతరువాత గురుపుంగవునిఁ జూడఁగోరి తగునుపాయనములతో బయలుదేఱెను. రాజు తస్కరుని జూచి చాల ఆదరించెను. ఆచార్యవందనాదికములు ముగిసిన తరువాత తస్కరుఁడు "స్వామీ, తమ కరుణచే నేను పవిత్రుఁడనైతిని" అని విన్నవించెను. రాజు వానిని "ద్వారకానగరమున బ్రహ్మానందపరవశులై యుండు పన్‌హాజీస్వాములను ఆశ్రయింపుము." అని పంపివేసెను. యుక్తసమయమున వాఁడుపోయి పన్‌హాజీ నాశ్రయించెను పన్‌హాజీ వానికి శ్రీకృష్ణమంత్రమును ఉపదేశించి విధానము నెఱింగించెను. మఱియు నిట్లనేకులకు ముక్తిమార్గమును ఉపదేశించెను. పన్‌హాజీయు రాజును, రాణియు, తస్కరుఁడును జీవితములను శ్రీహరిసేవయందుఁ గడపి అవసానమున హరిసాయుజ్యమును బడసిరి.

మ. దహరాకాశనివాసమౌ పరము నాత్మజ్ఞాను లీక్షించి ప్ర
త్యహముం గాంతురు గాక నేనల యశోదాబాలలీలాసుధా
లహరీవీచిపరంపరం గదిసి క్రొన్నిగ్గారఁగఁ గ్రీడించు స
న్మహన ప్రౌఢిఁ జెలంగు డెందమున నానందంబు సంధించెదన్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 55.)

74. స్పర్శభాగవతుఁడు.

శ్లో॥ ఇదం శరీరం పరిణామపేశలం, పతత్యవశ్యం శ్లథసంధిజర్జరం
కిమౌషధైః క్లిశ్యసి మూఢ దుర్మతే, నిరామయం కృష్ణరసాయనం పిబ.

(ముకుందమాల. శ్లో. 31.)

పండరిపురమున నొకబ్రాహ్మణుఁడు ఉండెను. ఆతఁడు సదా శ్రీ పాండురంగని సేవించుచుఁ గాలము గడుపుచుండెను. ఒకప్పుడు ఆతఁడును భార్యయుఁ గలిసి నిశ్చలచిత్తముతో ధ్యానింపఁగా రుక్మిణీదేవి సాక్షాత్కరించెను. బ్రాహ్మణదంపతులు ఆమెకు సాష్టాంగదండప్రణామములు అర్పించి పూజించి అనేకవిధముల వినుతించిరి. రుక్మిణి సంతుష్టచిత్తయై "మీభక్తికి ఆనందమైనది. మీకేమి కావలయును?" అని యడిగెను. బ్రాహ్మణుఁడు "తల్లీ, సంసారసాగరమువలనఁ గ్రుంగిపోవుచున్నాను. ఉద్ధరింపుము" అని ప్రార్థించెను. రుక్మిణి బ్రాహ్మణుఁడు ధనముకోరుచున్నాఁడని యెఱింగి పరుసవేదినిచ్చి "దీనిని తాఁకించినచో ఇనుము బంగారమగును. జాగ్రత్తగా వాడుకొనుము" అని చెప్పి తిరోహితయయ్యెను. బ్రాహ్మణుఁడు అమందానందకందళితహృదయారవిందుఁడై పరుసవేదిని భార్యకు ఇచ్చి "రుక్మిణీదేవి యనుగ్రహమువలన మన దరిద్రము తొలఁగిపోయినది. ఈపరుసవేదివలన మనకు ఇఁక సంసారము స్వర్గము అగును దీనిని జాగ్రత్తగా వాడుము. ఈరహస్యమును ఎవరికినిఁ దెలియనీయకుము" అని చెప్పెను.

ఆతని భార్య భర్తయాజ్ఞానుసారముగ వలసినపుడెల్ల పరుసవేదిని తాఁకించి ఇనుము బంగారముగాఁ జేసికొని వలసినసంభారములన్నిఁటిని సమకూర్చుకొనుచుండెను. బ్రాహ్మణుఁడు యథాప్రకారముగ విరక్తుని వలె పండరినాథుని సేవించుచుండెను

ఒకనాఁడు ఆబ్రాహ్మణుని భార్యయగు కమలాబాయి జలాహరణార్థము చంద్రభాగకుఁ బోవుచుండెను. మార్గమధ్యమున ఆమెతో నామదేవుని భార్యయగు కమలాబాయి "ఏమమ్మా! ఎప్పుడు చూచినను మీరిట్లు కష్టపడుచున్నారు. నీభర్త సదా పాండురంగని సేవించుచుండును గదా? ఆతఁడు మీకేమియు నీయలేదా! అట్లు ఈయనివానిని ఏల అట్లు పూజించెదరు?" అనియడిగెను. నాభర్తకు నిస్పృహ మెండు

ఆతనికి మోహాన శక్తితక్క ఘటియేయాన శక్తియు లేదు" అని రాధాదేవి బదులు చెప్పెను. "నీభర్త ఫలమును నీయని వృక్షమునకు నీళ్లుపోసినట్లు చేయుచున్నాఁడు. నాభర్త ఒక్క సంవత్సరము సేవించునప్పటికి రుక్మిణీదేవి సాక్షాత్కరించి పరుసవేదినిచ్చె దానియాధారంబున మేము ఏలోపమును లేకుండ జీవించుచున్నాము" అని కమలాబాయి మఱలఁ బలికెను. అదివిని రాధాబాయి ఆశ్చర్యపడి "వదినే, నాభర్త సంసారమునకు ఏమియు సంపాదింపక యున్నాఁడు. ఒకమాఱు పరుసవేదిని బదులిచ్చెదవేని వలసినంతబంగారము చేసి మరల ఇచ్చివేసెదను. బ్రతికి యున్నంతకాలము నీయుపకారమును మఱువ" నని ప్రార్థించెను. కమలాబాయి ఆప్రార్థనలకు కరగి పరుసవేదిని ఇచ్చెను.

రాధాబాయి పరుసవేదితో చాల బంగారము చేసికొని భోజనము లైనతరువాత పరుసవేది నీయవచ్చెను. "ఇపుడు తొందర లేదు. వంటకు వేళ యైనది" అని తలంచి పరుసవేది నొకచో దాఁచి వంట ప్రారంభించెను వంట ముగియునప్పటికి నామదేవుఁడు పూజాదికములు అన్నియు ముగించుకొని వచ్చెను. రాధాబాయి పంచభక్ష్యపరమాన్నములను వడ్డింపఁగా నామదేవుఁడు అబ్బురపడి "ఇది యంతయు నెట్లు వచ్చె"నని యడిగెను. రాధాబాయి "అది యంతయు మీకు ఏల? వలసినంత ఆనందముతో భుజింపుఁడు" అని బదులు పలికెను, "ఇందలి రహస్యము నెఱింగించినఁగాని నేను భుజింప"నని నామదేవుఁడు పట్టుపట్టఁగా రాధాబాయి చేయునది లేక అంతయుఁ దెలిపి పరుసవేదిని దెచ్చి చూపెను. నామదేవుఁడు వెంటనే ఊర్ధ్వశ్వాసముతోఁ బరువెత్తుకొని పోయి దానినిఁ జంద్రాభాగలోఁ బడవేసి వచ్చి అన్నము తినెను. ఇది విని రాధాబాయి "కమలాబాయికి నేను ఏమి చెప్పుదు" నని గోలుగోలున ఏడ్వసాగెను.

ఇదియిట్లుండఁగా కమలాబాయి రాధాబాయి పరుసవేదిని దెచ్చి యంతకును ఈయకుండుటఁ జూచి సందేహించి ఆమె ఇంటికిఁబోయి సంగతిసందర్భములు అన్నియు విని తెల్లవోయి ఆమెతోఁగూడ కంటికి మంటికి నేకధారగా ఏడువసాగెను. కొంతసేపటికి ఈవార్త ఆమెభర్తకుఁ దెలిసెను. వెంటనే ఆతఁడు పరుగుపరుగున వచ్చి "నాకొంప తీసితివి. నాపరుసవేదిని నాకు ఇమ్ము" అని నామదేవుని ఖణాయించి పలికెను.

అందులకు నామదేవుఁడు "నీవు విరాగినని చెప్పుకొనుచున్నావు. అట్టి నీకు ఈపరుసవేది ఏల?" యని యడుగఁగా అతఁడు "ఇది యంతయు నాకుఁ దెలియదు. నాపరుసవేదిని ఈయవేని కస్తుపడియుండెదను" అని ఆతఁడు పలికెను. నామదేవుఁడు "ఇఁక నీతఁడు వదలఁడు." అనితలంచి చంద్రభాగకుఁ బోయి అందు మునిగి గుప్పెఁడు రాళ్లను దీసి ఇందు నీపరుసవేది ఏదో తీసికొనుము" అని ఆబ్రాహ్మణునిముందు పోసెను.

తోడనే బ్రాహ్మణునకు జ్ఞానోదయ మయ్యెను. అంతట నాతఁడు కాళ్లమీఁద వ్రాలి ప్రార్థింపఁగా నామదేవుఁడు మంత్రోపదేశము చేసెను. ఆబ్రాహ్మణుఁడు ఆచార్యుని నియమము ప్రకారము బ్రతికియున్నంతకాలమును ఈశ్వరుని సేవించి అవసానమున సాయుజ్యముక్తినిఁ బడసెను. పరుసవేది సంబంధమువలన ఆబ్రాహ్మణునకు స్పర్శభాగవతుఁడు అని పేరువచ్చెను.

శ్లో. తత్త్వం బ్రువాణాని పరం పరస్తాత్, మధు క్షరంతీవ సతాం ఫలాని,
ప్రావర్తయ ప్రాంజలి రస్మి జిహ్వే, నామాని నారాయణ గోచరాణి.

(ముకుందమాల. శ్లో. 30.)

---

75. హరిపాలదాసుఁడు.

శ్లో. కృష్ణార్పణం చేసిన కృంగ్యమాన
ముష్ణ స్మృతా దోహమహాంధకారం,
పుష్ణాతు నః ప్రాప్యదయైకసింధోః
కృష్ణస్య కారుణ్యకటాక్షలీలః.

(కృష్ణకర్ణామృతము. ఆ. 3. ప. 9.)

ఒకపట్టణమున హరిపాలదాసుఁడు అను నొకభక్తుఁడు ఉండెను. ఆతనికిఁ బూర్వార్జితమైనవిత్తము లెక్కలేనంతగా నుండెను. ఆతఁడు సర్వకాలసర్వావస్థలయందును శ్రీహరినిఁ బూజించుచు భాగవతులను దీనులను వస్త్రాన్నసంతర్పణలం గావించుచుండెను. కట్లు కొంతకాలము జరుగునప్పటికి ఆతనియింటనున్నధనమంతయు నైపోయెను. అయినను యథాప్రకారముగ భాగవతులను దీనులను ఆతనియింటికి అన్నవస్త్రములకై వచ్చుట మానలేదు.

అది చూచి యాతఁడు "వీరినిఁ బొమ్మనఁజాలను. అన్నము పెట్టుటకును జాలను. ఏమి సేయుదును!" అని చాలఁ దడవు చింతించి తుదకు చౌర్యమువలన ధనము సంపాదించి యథాపూర్వముగ భాగవతార్చనము సేయ నిశ్చయించుకొని యొకనాఁడు కత్తికటారి మున్నగు ఆయుధములను గైకొని మార్గము గాచెను. ఇదియంతయు గనిపెట్టుచున్న శ్రీమన్నారాయణుఁడు వర్తక వేషము ధరించి అనేకాభరణములను అలంకరించుకొని లక్ష్మిని వెంట నిడుకొని హరిపాలుఁడు ఉన్న దిక్కునకు వచ్చెను. వారినిఁ జూచి హరిపాలుఁడు పొంగిపోయి సమీపమునకు రానిచ్చి "నిలువుఁడు. ప్రాణములమీఁద ఆశకలదేని మీ శరీరములమీఁది ఆభరణములను అన్నిటిని అక్కడ నుంపుఁడు. లేకున్న బుఱ్ఱలు ఎగురవేసెదను" అని పలికెను. అదివిని ఆదంపతులు భయభ్రాంతులవలె నటించుచు "ఓయీ, మా ప్రాణముల నేల తీసెదవు! కొంచెము తాళెదవేని మా యాభరణములను అన్నిటినిఁ దీసి యిచ్చెదము" అని పలికి క్షణములో సకలాభరణములను ఇచ్చి పోయిరి. హరిదాసుఁడు మహానందముతో ఆ యాభరణముల నన్నిటిని ఇంటికిఁ గొనిపోయి క్రమక్రమముగా నొకటొకటి చొప్పున విక్రయించి యథాపూర్వముగ భాగవతారాధనము సాగించుచుండెను.

ఇట్లు కొన్ని దినములు గడచిపోయిన తరువాత శ్రీహరి హరిపాలుని యెడలఁ జాల ననుగ్రహముకలవాఁడై యొకనాఁడు ఆతనికి సాక్షాత్కరించి అభయమిచ్చెను. అది చూచి లక్ష్మి "నన్ను మాటిమాటికిని ఆక్షేపించెదవు; గాని నీవు చేయుచున్న పని ఏమి సరసముగా నున్నది? ఆతఁడు మన ప్రాణములు తీయుటకు సిద్ధపడెను. మన యాభరణముల నన్నిటిని హరించెను. అట్టివానికి ఏమని సాక్షాత్కరించితివి? ఇదియేమి బాగున్నది? లోకములో అనేక భాగవతులు నిర్మలచిత్తులై నిష్కళంక ప్రవర్తనులై సదా నిన్ను ధ్యానించుచు నున్నారు. వారికి దర్శన మీయవు. కలనైన వారి యూసు నెత్తవు. తప్పిదారియైన వానినిఁ దలంచవు. నీవు ఎప్పుడును ఇట్లే చేసెదవు" అని చెప్పెను. అందులకు శ్రీహరి మందహాసము గావించి "నీవు చెప్పినందులకు నాకు సంతోషమే; గాని నీవు సంగతిసందర్భములు ఏమియు గమనించుట లేదు. కేవలము బాహ్యప్రవర్తనమును జూచి నీవు హరిపాలుఁడు క్రూరుఁడు అని పలుకుచు

న్నావు; గాని ఆతని చిత్తశుద్ధిని నీవు గ్రహించుటలేదు. ఆతఁడు లుబ్ధులను దోచి భాగవతార్చనముసేయుచున్నాఁడు. సోదాచూడదలంతువేని నాతో రమ్ము" అని బదులు చెప్పెను. లక్ష్మి అందులకు అంగీకరించెను. తోడనే శ్రీహరి భాగవతవేషము ధరించి లక్ష్మితోఁగూడ హరిపాలుని ఇంటిముంగిట సాక్షాత్కరించి "గోవిందా" యని ఉచ్చస్వరముతోఁ బలికెను

ఆధ్వనిని వినిన వెంటనే హరిపాలుఁడు వీథిలోనికి వచ్చి వారికి అర్ఘ్యపాద్యములు ఇచ్చి పూజించి మృష్టాన్నతృప్తులం గావించి "మీ రెచ్చట నుండి ఎచ్చటకుఁ బోవుచున్నారు" అని ప్రశ్నించెను. అందులకు శ్రీహరి "మహాత్మా, ఏమి చెప్పుదును? నేను వర్తకుఁడను. ఈమె నా గృహిణి. మేము వర్తకస్థానమునుండి మాయూరు పోవుచుండఁగా మార్గమధ్యమున నొక చోరుఁడు మమ్ము అడ్డుకొని మాయాభరణముల నన్నిటిని హరించెను. అప్పటినుండియు మేము ఇట్లు ఉన్నాము" అని చెప్పి వర్తకరూపముఁ బాల్చెను. తోడనే హరిపాలుఁడు వారినిఁ జూచి గడగడ వడఁకిపోవుచు పాదములమీఁద వ్రాలి "మహాత్ములారా, మీ యాభరణములను దొంగిలించిన దొంగను నేనే రక్షింపుఁడు" అని తన యుదంతము నంతను విన్నవించెను. అది విని లక్ష్మి ఆశ్చర్యచకితయై "నేను పొరపడితిని" అనియెను. అపుడు శ్రీహరి దివ్యమంగళవిగ్రహుఁడై సాక్షాత్కరించి "వత్సా, నీకు ఏమియు భయము వలదు. నిన్ను బరీక్షించుటకై మేము ఈరూపములతో వచ్చితిమి. నీవు మా యంతరంగభక్తులలో నొకఁడవై యున్నావు. నీకు ఏలోపమును గలుగదు. మేము ఇచ్చిన వస్తువులవలన నీవు చాలఁగాలము భాగవతారాధనము చేయఁగలవు" అని చెప్పి లక్ష్మితోఁగూడఁ దిరోహితుఁడయ్యెను. హరిపాలదాసుఁడు బ్రతికియున్నంతకాలమును భగవద్భాగవతారాధనము గావించి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను.

మ "అఖిలాశాపశమైన సాహది నవ్యోంబైన మోహాంధకా
రము కారుణ్యకటాక్షవీక్షణవిభారాశిక్ నివారించి నె
య్యమునం బ్రోచు దయాపయోధి ఘనబృందారణ్యకర్మంది బృం
దమనోలోచనసాధుసేవధి ప్రమోదం బొప్ప నెల్లప్పుడుక్."

(కృష్ణకర్ణామృతము. ఆ. 3. ప. 9.)

7౬. రోహిదాసచాంభారు

శ్లో. త్రిభువనసరసాభ్యాం దీప్తభూషాపదాభ్యాం
దృశిదృశి శిశిరాభ్యాం దివ్యలీలాకుచాభ్యాం
అశరణశరణాభ్యా మద్భుతాభ్యాం పదాభ్యా
మయమయ మనుకూజద్వేణు రాయాతి దేవః.

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. శ్లో. ౫0.)

గంగాసమీపమున నొక గ్రామమునందు రోహిదాసచాంభారు అను నొక చండాలుఁడుండెను. ఆతఁడు యుక్తవయస్కుఁడై కులవృత్తిలో ప్రవేశించిన తరువాత పూర్వజన్మార్జితపుణ్యలేశమున శ్రీహరియందు అనన్యసాధారణమగు భక్తి కలిగెను. అది మొదలుకొని యాతఁడు అనుదినమును ప్రాతఃకాలమున, తొలుతఁ గుట్టిన పాదరక్షను ఒకచోటఁ దాఁచి తరువాతఁ గుట్టినవాని నమ్ముకొని జీవించుచుండెను. ఇట్లు అనుదినమును మిగిల్చిన పాదరక్షలను భాగవతులకు సమర్పించుచుండెను. భాగవతులు దీనులు బీదలును మున్నగువారు కోరినచో వారి జీర్ణపాదరక్షలు నుచితముగ బాగుచేసిఇచ్చుచుండును. పాదరక్షలను గుట్టునపుడు గూడ ఆతఁడు హరినామస్మరణమును మాని యెఱుఁగఁడు.

ఆతఁడు తన కుటీరమునకు ఎదుటనున్న విశాలస్థలమున తులసి మున్నగు పావనవృక్షములును, అనేక విధములగు పుష్పలతలను బెంచి దానికి నందనవనము అని పేరు పెట్టి ప్రతిదినమును శ్రీహరినిఁ బూజింప నువ్విళులూరుచుండును. ఇట్లుండ నొకరాత్రి స్వప్నమున శ్రీహరి ఆతనికి సాక్షాత్కరించి సాలగ్రామము నిచ్చిపోయెను. వెంటనే రోహిదాసు మేల్కాంచి శ్రీహరికటాక్షమువలన ఆనందానందహృదయుఁడై ఒక తోలుపెట్టెను తయారుచేసి సాలగ్రామమునందు ఉంచి పూజ ప్రారంభించెను. పుష్పములు తక్కఁ దక్కుంగల పూజాసామగ్రియంతయు చర్మమయమే. పాత్రలు చర్మములు. పీఠము చర్మము. ఇట్లు సకల వస్తువులను చర్మముతో స్వయముగఁ దయారుచేసికొని ఆతఁడు శ్రీహరి పూజఁ బ్రారంభించెను.

ప్రథమదినమున చల్దిగుడుచుట మానివేసి యాతఁడు పూజఁ బ్రారంభించెను; గాని సగము పూజ యగు నప్పటికి ఆఁకలి విజృంభించి

కడుపు మాడ్చివేయసాగెను. అప్పుడు అతఁడు "నేఁడు అవివేకకృత్యమును
జేసితిని. ఆఁకలి నన్ను దహించి వేయుచున్నది. అగుటచే నా మనస్సు
శ్రీహరినుండి చలించుచున్నది. భగవంతునకు మనస్సు ప్రధానముగాని
శరీరముగాదు; గావున నేను మనస్సును స్వాధీనము చేసికొన్నచో భ
గవంతుఁడు చద్ది యన్నమును భుజించినను కోపగింపఁడు" అని నిశ్చ
యించుకొని మఱునాఁడు మొదలుకొని ప్రాతఃకాలమునందే లేచి
స్నానము చేసికొని భగవంతుని ప్రార్థించి భగవన్నివేదితము అగు చద్ది
గుడిచి శ్రీహరినిఁ బూజించుటకుఁ బ్రారంభింపఁ దొడఁగెను.

ఒకనాఁడు ఆగ్రామపురోహితుఁడు ఏదో పనిమీఁద నందనవనము
చెంతకువచ్చి రోహిదాసునుబిలిచెను. తోడనే భయభక్తులతోఁ బోయి
బ్రాహ్మణునకు మ్రొక్కి తాము వచ్చిన పని ఏమి యని యడిగెను. ఆబ్రా
హ్మణుఁడు నందనవనమునఁ దులసిమొక్కలు ఉండుటఁ గాంచి, కోప
ఘూర్ణితమనస్కుఁడై తానువచ్చిన పనిఁ దెలుపకయే "నీవు తులసినిఁ
బెంచుచుంటివటరా" యని గర్జించుచుఁ బలికెను. అది విని రోహి
దాసు వినయవినమితదేహుఁడై "మహానుభావా, ఏల కోపపడెదరు?
తులసిమొక్క నేనంటిన అపవిత్రమగునా? నేనంటినదానిని మిమ్ము
తాకుఁడన లేదే? ఇఁక మీకేమి బాధ? శ్రీహరిని మేము కొలువఁ దగి
నప్పుడు శ్రీహరికిఁ బ్రియమైన తులసిని మేము తాఁకఁగూడదా? అని
యడిగెను. దానిమీఁద సందేహించి నీవు శ్రీహరినిగూడఁ బూజించు
చున్నావటరా? యని బ్రాహ్మణుఁడడిగెను. "అవును మహాప్రభూ" యని
రోహిదాసు వృత్తాంతము అంతయు నెఱింగించెను.

అది విని బ్రాహ్మణుఁడు మఱింత మండిపడి, "దుర్మార్గుఁడా, నీవు
సాలగ్రామమును గూడ ముట్టుకొంటివా? దానిని తోలుసంచిలోఁ
గూడ నుంచితివా? తోలుసంచిలోని నీటితో దానికి అభిషేకము చేయు
చున్నావా? పవిత్రమగు ఆసాలగ్రామమును తోలుముక్కమీఁదనుంచు
చున్నావా? తుచ్ఛుఁడా, ఇదంతయు నీకు ఎవరు ఉపదేశించినారురా?"
యని కటము లదురఁ బలికెను. అందులకుఁగూడ రోహిదాసు కోపిం
పక, జంకక, "స్వామీ, సాలగ్రామమును నాకు ఏబ్రాహ్మణుఁడును ఈయ
లేదు. నేను నర్మదానదికిఁ బోయి తీసికొని రాలేదు. శ్రీహరియే నాకు
స్వప్నమున సాక్షాత్కరించి ఇచ్చిపోయెను. దానిని భక్తితో నేను

పూజించుకొనుచున్నాను. మేము శ్రీహరినిఁ బూజించుకొనఁగూడదా ? మిమ్ము పూజచేయింపవలసినదని కోరలేదు. నిర్బంధపెట్టలేదు. మీ వేదములను జెప్పుఁడనలేదు. వినలేదు. నాకుఁ దోఁచినట్లు నేను పూజ చేసికొనఁగూడదా? నాయింట నున్నది తోలు. తోలుపాత్రయందలి జలముతో నభిషేకముచేసిన శ్రీహరి యంగీకరింపఁడా ? శ్రీహరి తోలుపీఁటమీఁద నాసీనుఁడు కాఁడా? తోలుసంచిలో విశ్రమింపఁడా? తోలుచేతితో తాఁకుటకు మాత్రము అభ్యంతరము లేదా ? స్వామీ, ఈశ్వరుఁడు చిత్తశుద్ధినిమాని బాహ్యాడంబరమునే మెచ్చునా? స్వర్ణవిగ్రహమునన్న శ్రీహరి మంటిబొమ్మయందు లేఁడా; శ్రీహరి ప్రపంచమునం దంతటను ప్రతివస్తువునందును వ్యాపించియున్నాఁడని బ్రాహ్మణులే యంగీకరింతురు. అయినచో శ్రీహరి మాయందు లేఁడా? మాయందు ఉండినచో మైలపడని జగన్నాథుఁడు నేను పూజించిన మైలపడునా? మీకోపోద్రేకములవలన అల్లంటును; గాని తోలులోమాత్రము భగవంతుఁడు లేఁడా?" యని ప్రత్యుత్తరము చెప్పెను.

ఇది వినుటవలన బ్రాహ్మణునకు ఆపాదమస్తకమును క్రోధాగ్నితో నిండిపోయెను. "చూడుము, నిన్నేమి చేయించెదనో" యని యా బ్రాహ్మణుఁడు మాఱుపలుకఁ జాలక అట్లే నిలిచిపోయెను. ఇంతలో శ్రీహరి గరుడవాహనారూఢుఁడై వచ్చి రోహిదాసునకు దర్శనము ఇచ్చెను. రోహిదాసు భయసంభ్రమములతో వలగొని సాష్టాంగనమస్కారములు ఆచరించి వినుతింపు నుండఁగా శ్రీహరి ఆతనిని జేరఁదీసి శిరంబు మూర్కొని "వత్సా, నీభక్తికి మెచ్చితిని. నీవు నాయంతరంగభక్తుఁడనైతివి. నీకు అవసానమున మోక్షము నిచ్చెదను" అని తిరోహితుఁడు అయ్యెను. ఇదియంతయుఁ జూచుచున్న బ్రాహ్మణుఁడు నిర్విణ్ణుఁడై బుద్ధి తెచ్చుకొని "రోహిదాసా, సంగతిసందర్భములు తెలియక నిన్ను ఆడరానిమాటలు అడిగితిని. క్షమింపుము." అని బతిమాలికొని అనేకవిధములఁ గొనియాడెను. "నీయనుగ్రహముచే నాకు శ్రీహరిదర్శనము గలిగినది. నీఋణమును నేను అనేకజన్మములు ఎత్తినను తీర్చుకోఁజాల" నని మఱియుఁ గొనియాడెను. రోహిదాసు బ్రతికియున్నంతకాలమును ఇట్లే కాలము గడపి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసెను.

శా. క్రీడాభూషణధారులై యశరణశ్రేయశ్శరణ్యంబులై
చూడం జూడఁగఁ జల్లనై సొగసులై చోద్యంబులై దేవతా
చూడారత్నములైన పాదములరా సొంపొంది వేణుధ్వనుల్
జాడల్ దెల్పఁగ నీఁడెనీఁడె యన నాస్వామిన్ విలోకించెదన్."

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 80.)

---

77. నరహరి.

శ్లో. "జాగృహి జాగృహి చేత, శ్చిరాయ చరితార్థతాం ప్రసత్ర.
అనుభూయతా మిద మిదం, పురః స్థితం పూర్ణ నిర్వాణమ్."

(కృష్ణకర్ణామృతము. ఆ. 3. ప. 64.)

పంఢరిపురమున నరహరిభక్తుఁడు అనునొక స్వర్ణకారుఁడు ఉండెను. ఆతఁడు బంగారపుఁబనిలో అద్వితీయుఁడు అని పేరువడసెను. విశేషించి శివభక్తుఁడు. శివునికంటె మఱియొక దైవము లేఁడని ఆతని నమ్మకము. తన ఇంటికి సమీపమునందే యున్న అద్వితీయాలయమున నున్నపండరినాథుఁడు దేవుఁడు గాఁడనియు వైష్ణవులచే స్థాపింపఁబడిన కేవలశిలావిగ్రహము అనియు, దానినిఁ బూజించుటకంటె అవివేకము లేదనియు ఆతఁడు తఱుచు చెప్పుచుండెను. లోకమంతయు మాయలో మునిఁగిపోవుచున్నది. ఎతఁడు దైవమో అతనిని విడిచి ఏది కేవలశిలావిగ్రహమో దానిని లోకము పూజించుచున్నది. అయ్యో. కుంభీపాకనరకమునఁగూలఁబడుచున్న యీ అమాయికలోకమును ఉద్ధరించుమహాత్ములు ఎందును లేరా?" యని యాతఁడు తహతహపడుచుండును. "హరహరా, ఈ వైష్ణవులు లోకమునకు ఎంత ద్రోహము చేయుచున్నారు." అని మాటిమాటికిని చింతించుచుండును. ఇట్టి భావోద్రేకముగలవాఁడగుటచే వాఁడు ఎప్పుడును పాండురంగని దర్శించి యెఱుఁగఁడు.

ఆయూర నరహరి యింటిప్రక్క గొప్పధనికుఁ డగు నొకసత్రకుఁడు ఉండెను. ఆతఁడు అనేకవ్యాపారములలోఁ బ్రవేశించి లెక్కలేనంతధనమును సంపాదించెను. దేవేంద్రవైభవమును అనుభవించుచుండెను: గాని సంతానముమాత్రము కలుగలేదు. దానినిమిత్తము ఆతఁడు అనేకదినములు ఎదురుచూచెను గాని ప్రయోజనము కలుగదయ్యెను. తుదకుఆతఁడు పాండురంగని సందర్శించి, "స్వామీ, నాకు సంతానము

నిచ్చెదవేని నీకు రత్నాలమొలత్రాడు సేయించి ఇచ్చెదను." అని మ్రొక్కుకొనెను. పిదప ఆతని యనుగ్రహమువలన వెంటనే ఆతనిభార్య గర్భవతియై నవమాసములు మోసి ఒక శుభముహూర్తమున కుమారునిఁగనియెను.

వర్తకుఁడు తనకు సంతానము కలిగినది; గావున మ్రొక్కు చెల్లింపఁదలఁచి రత్నాలమొలత్రాడు చేయుటకు తగినపనివాఁడు ఎవఁడాయని యోచింపసాగెను. ఆతఁడు ఒకరిద్దఱు మిత్రులచెంతఁ బ్రస్తావన సేయఁగా వారు నరహరికంటెఁ దగినవాఁడు లేఁడని చెప్పిరి. అందులకు నల్లెయని వర్తకుఁడు బంగారమును రత్నములను గొని నరహరి చెంతకుఁ బోయి సంగతి యంతయు నెఱింగించెను. అదివిని నరహరి "అయ్యా, నాకు తగినమజూరీ ఇచ్చెదరుగావున ఆవస్తువు చేయుటకు నాకు ఏమియు అభ్యంతరములేదు గాని నేనుపండరినాథుని ఎప్పుడును జూచి యెఱుఁగను; గావున మీరుపోయి కొలతను దీసికొనిరండు. పాండురంగనిఁ జూడనని నాకు వ్రతము ఉన్నది" అని చెప్పెను. వర్తకుఁడు ఆశ్చర్యచకితుఁడై "ఓ ..., నీమాటలు చాల వింతగానున్నవి. శ్రీమన్నారాయణుఁడగు పండరినాథునిఁ జూడనని వ్రతముదాల్చిన నీకంటె అవివేకులు గలరా?" అని పలికెను. ఈమాటలకు నరహరికిఁ గోపము వచ్చెను. "అది యేమి మాట! 'లోకోభిన్నరుచిః' అనుట మీరెఱుఁగనిదియా? కైలాసనాథుఁడే దేవుఁడని నేను విశ్వసించెదను" అని స్వర్ణకారుఁడు మునికోపముతో జవాబు చెప్పెను. "నీవిశ్వాసముతో నాకేమియుఁ బని లేదు." అని చెప్పి వర్తకుఁడు స్వయముగఁ బోయి పండరినాథుని మొలకొలత తెచ్చి ఇచ్చిపోయెను.

నరహరి అన్నినాఁటికి మొలత్రాడు కడుఁజిత్రముగాఁ జేసి వర్తకునకు వర్తమానము పంపి "నా వ్రతము మీకుఁ దెలిసియే యున్నది. మీ రిది పట్టుకొనిపోయి దీనిని ఉపయోగింపుఁడు" అని ఇచ్చివేసెను. వర్తకుఁడు వస్తువు చాల సంతసముగా నుండుటకు మిత్రుల సలహా పట్టుకొనిపోయి స్వామికి అలంకరించెను; గాని నాలుగు అంగుళములు పొడవు తక్కువ అయ్యెను. వర్తకుఁడు వచ్చి ఆసంగతిఁ జెప్పఁగా నరహరి లోపముఁ బూర్తిచేసి ఇచ్చెను. వర్తకుఁడు మరల అలంకరింపఁగా రెండు అంగుళములు పెద్దది అయ్యెను. అయినగాని తనవలనసరిచేసినను ఇట్లే

హెచ్చుతగ్గులు వచ్చెను. తుదకు వర్తకుఁడు నరహరినిఁ జూచి "ఇది యేమో వింతగానున్నది. నీవు వచ్చినగాని ఇది సరిపోవునట్లు తోఁచుటలేదు" అనియెను. నరహరి వెంటనే బయలుదేఱిపోయి కండ్లకు గంతలు కట్టుకొని గర్భాలయము సొచ్చి పండరినాథుని విగ్రహమును దడవి చూడఁగా నది ఐదుముఖములు, పునుకపేరులు, జటాజూటము మొన్నగు చిహ్నములు గల ఈశ్వరవిగ్రహముగాఁ దోఁచెను. నరహరి "ఇది ఈశ్వరవిగ్రహము గాని విష్ణువిగ్రహముగాదు" అని నిశ్చయించుకొని ఆనందముతో గంతలు విప్పుకొని చూచునప్పటికి విగ్రహము పూర్వరూపముతోడనే యుండెను. తోడనే నరహరి ఘూత్కారములు సేయుచు మఱల గంతలు కట్టుకొని తడవిచూడఁగా మఱల శివవిగ్రహముగాఁ దోఁచెను. మఱల నరహరి గంతలు విప్పుకొని చూచునప్పటికి విగ్రహము పూర్వమువలెనేయుండెను. ఇందలి యర్థము నెఱుఁగఁజాలక నరహరి క్రిందునుమీఁదును జూచుచుండఁగా పండరినాథుఁడు హరిహరరూపముతో సాక్షాత్కరించి ఆదరముతో నరహరినిఁ జేరఁదీసి, లాలించి "వత్సా, నీచిత్తశుద్ధికి మెచ్చితిని. నేను త్రిమూర్త్యాత్మకుఁడను. భక్తుని భావన లనుసరించి నేను మూఁడుమూర్తుల రూపములలో నొకరూపమును దాల్చుచుందును. నిన్ను నాయంతరంగభక్తులలోఁ జేర్చుకొనియున్నాను. నీకు సలోకములును గలుగఁబోవు" అని వచించి మఱలఁ యథారూపముఁ దాల్చెను. నరహరి వెంటనే ఆనందకందళితచిత్తుఁడై పండరినాథునకు ప్రదక్షిణము చేసి "శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే, శివస్య హృదయం విష్ణుర్విష్ణోశ్చ హృదయం శివః" అని సాష్టాంగవందనము లాచరించి మొలత్రాటిని అలంకరించెను. ఇదియంతయుఁ జూచి వర్తకుఁడు మున్నగువారు ఆశ్చర్యచకితులై నరహరిని అనేకవిధములఁ గొనియాడిరి. నరహరి బ్రతికియున్నంతకాలమును యథాపూర్వముగ నీశ్వరపూజఁ గావించి అవసానమున సాయుజ్యము గని బడసెను.

చ. వెనుకటివేళలం దనుభవించిన జన్మశతంబు లెట్లు నే
డును భ్రమ మోసపోవక గడుం దెలివొంగుము డెందమా చిరం
తనతపముల్ ఫలించి స్ఫురితస్థితి నున్నది కృష్ణరూపమై
[illegible] లీలామహా. (కృష్ణకర్ణామృతము. ఆ.3.ప.61.)

78. గణేశ నాథుఁడు.

శ్లో. "యాని త్వచ్చరితామృతాని రసనాలేహ్యాని ధన్యాత్మనాం
యేవా శైశవచాపలవ్యతికరా రాధాపరాధోన్ముఖాః,
యావా భావిత వేణుగీతగతయో లీలాముఖాంభోరుహే
ధారావాహికయా వహంతు హృదయే తాన్యేవతాన్యేవమే"

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. శ్లో. 106.)

ఉజ్జయినీ నగరమునకు సమీపమున నున్న అరణ్యమున గణేశనాథుఁడు అను నొకభాగవతోత్తముఁడు సమస్తకామములను విడిచి సంతతహరినామస్మరణతత్పరుఁడై యుండెను. అతని యాహారము కందమూలఫలములు. కౌపీనమునుమాత్రమే యాతఁడు ధరించును గణేశనాథుఁడు తఱచుగ పంఢరిపురమునకుఁ బోయి పాండురంగని సేవించుచుండును.

ఒకనాఁడు గణేశనాథుఁడు పాండురంగని సమీపమున హరిగుణకీర్తనము సేయుచుండఁగా శివాజీమహారాజు స్వామిని సేవించుచు వచ్చెను. వచ్చిన పని యెల్ల ముగిసిన తరువాత శివాజీ భాగవతులసందఱను జూచుచు రాగాఁ గణేశనాథునికీర్తనలు హృదయము నాకర్షించెను. అగుట నాతఁడు అచ్చటఁ గూర్చుండి భక్తిశ్రద్ధలతో నాగానమును విని గణేశనాథునియెడలఁ జాల భక్తిభావము దాల్చెను. శివాజీ అంతకుఁ బూర్వము మనోహరమైన యొక గొప్పమంచమును హంసతూలికాతల్పమును జేయించెను. దానిమీఁద నింతవఱకు నాతఁడు శయనింపలేదు. "ముందు గణేశనాథుని దానిమీఁద శయనింపఁజేయవలయును" అని తలంచి శివాజీ "మహాత్మా, మీరొకమాఱు నాకోటకు దయచేయవలయును" అని ప్రార్థించెను. గణేశనాథుఁడు శివాజీహృదయము తనయెడల నిర్మలభక్తిపరీతమై యుండుట గ్రహించి వల్లెయని యంగీకరించెను.

పంఢరినాథుని సేవించుకొని యిరువురును బయలు దేఱిరి. మార్గమధ్యమున గణేశనాథుఁడు బొమ్మరాళ్లను గొన్నింటనిఏరి తనసంచిలో వేసికొనెను. అది చూచి శివాజీ వాని ప్రయోజన మేమని యడుగఁగా నాతఁడు శ్రీరామనామమును లెక్కించుటకు" అని బదులు పలికెను. నుఱికొంత సేపటికి వారు గమ్యస్థానము చేరుకొనిరి.

శివాజీ గణేశనాథునిఁ జాల నాదరముతోఁ బూజించి నిద్రాసమయమున నూత్న తల్పమును జూపి సెలవుఁ బడసి వెడలిపోయెను. గణేశనాథుఁడు మఱికొంతసేపు హరినామస్మరణము గావించుకొని పిదప సంచిలోని బొమ్మరాళ్లను హంసతూలికాతల్పమునఁ బఱచి వాని మీఁద శయనించి నిదురవోయెను. తెల్లవాఱక పూర్వమే శివాజీ గణేశనాథుఁడు శయనించిన చోటికి వచ్చెను. అంతకుఁ బూర్వమే భాగవతుఁడు లేచి హరిస్మరణ చేయుచుండెను. శివాజీ వందనసమర్పణమును ఆశీర్వాదస్వీకారమును జేసి తల్పముమీఁద బొమ్మరాళ్లుండుటఁ జూచి నివ్వెరపడి "మహాత్మా, ఇదియేమి?" యని ప్రశ్నించెను. గణేశనాథుఁడు శివాజీ నివ్వెరపాటు నారసి మందహాసము గావించి ఇట్లు అనియెను.

"వత్సా, అట్లుల నివ్వెరపడెదవు? లోకమునందలి ప్రకృతులు అన్నియు పరస్పరభిన్నములై యున్నవి. "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" అని శ్రీకృష్ణభగవానుఁడు ఆనతిచ్చెను. నాయాశ్రమధర్మములను నీవు అనుసరింతువేని నీయేర్పాటులు అన్నియుఁ జెడుటయు నీవు రాజ్యభ్రష్టుఁడ వగుటయు సిద్ధము. అట్లే నేనుగృహస్థాశ్రమధర్మములను అనుసరింతునేని నరకమునఁ గూలఁబడియెదను. హంసతూలికాతల్పముమీఁద శయనించుటకంటె ఐహికసుఖములలో మిన్నయైనది ఏమున్నది? గాని ఆ సౌఖ్యమును అనుభవించితినేని ఇఁక నామనస్సు నాకు స్వాధీనము గాదు. ఇఁక నేను చెడుట యెంతసేపు? కావుననే నాతల్పమున రాలు పఱిచితిని. నిర్మలచిత్తుఁడవగు నీవు కోరుటచేఁ ద్రోసివేయఁజాలక పోయితిని; గాని మఱియొకరు కోరినచో నేను తల్పమునే తాఁకను. ఆశ్రమధర్మముల నతిక్రమించుట మహాపాతక మనుట నీకుఁ దెలియనిది గాదుకదా! వత్సా, నరకమును దలంచుకొనిన ఏవనిహృదయము ప్రకృతులు గాదు! ఇది తెలిసియుండియు నన్ను ఇట్లు ప్రశ్నించెద వేల?"

ఇది విని శివాజి ఆశ్చర్యచకితుఁడయ్యెను. పిదప గణేశనాథుఁడు "వత్సా! నీసపర్యలవలన మాకు ఆనంద మైనది, నీవుచేపట్టినకార్యము మహోత్కృష్టము. దేవతలకుఁగూడ ఆచరణీయము. నీసదసద్వివేచనా

సామర్థ్యము అద్వితీయమైనది. ఈమహాకార్యమువలన నీజన్మము సఫలమైనది. రాజ్యతంత్రమున నీకుఁ దెలియని రహస్యములు లేవు. నేను చెప్పవలసినది ఏమి కలదు? నీకార్యము ఎంత యుత్కృష్టమో అంతగా నపాయబంధురము. కనుగలిగి ప్రవర్తింపుము. ఆర్యధర్మమును రక్షింపుము. ఈకార్యమునఁ గృతకృత్యుఁడ వైతి వేని యోగిజనలభ్యమగు మోక్షము నీకుఁ గరతలామలకము అగును" అని హితబోధ చేసి ఆశీర్వదించి, తనదారిం బోయెను.

పిదప అనేకులు అరణ్యమధ్యమున నున్న గణేశనాథుని చెంతకుఁ బోయి అతనివలన ఉపదేశమును బొంది భక్తిజ్ఞానవైరాగ్యవంతులైరి. ఇట్టివారిసంఖ్య దినదినమును బెరుగుచుండుటఁ గాంచి యోర్వఁజాలని మూర్ఖులు కొందఱు "నీవు ఇంద్రజాలము చేసి ఇందఱ సంసారములను గూలఁద్రోయుచున్నావు. నీవు నిజముగా భాగవతాగ్రేసరుఁడ వేని జంగమములకు వలెనే స్థావరములకుఁ గూడ ఉపదేశించి నీమహిమఁ జూపుము" అనిపలికి ఎదుర నున్న ఒకవృక్షమునుఁ జూపిరి. గణేశనాథుఁడు వారిసందేహములను బాపఁదలఁచి ఆవృక్షమును తాఁకి తారకమంత్రమును ఉపదేశించి, వారు తెచ్చినపదార్థములను ఆచెట్టుమీఁద నుంచెను. క్షణములో చూచుచుండఁగానే ఆపదార్థములు మాయమైపోయెను. మఱియు చెట్టునందుఁగల కొమ్మలు అన్నియుఁ వాడిపోయెను. అదిచూచి ఆదుష్టులు లజ్జితులై అతని పాదములమీఁద వ్రాలి క్షమింపఁ బ్రార్థించి అతనివలన నుపదేశముఁ బడసి తరించిరి.

ఒకనాఁడు వేదవిదులైన బ్రాహ్మణులు అచ్చటకు వచ్చి "మేము అగ్రజాతివారము. మేము ఒకరికి ఉపదేశింతుముగాని ఇతరులవలన ఉపదేశమును బొందువారము కాము. ఒకరిచే నమస్కరింపించుకొందుము గాని ఒరులకు నమస్కరింపము" అని పలికిరి. గణేశనాథుఁడు మీరిట్లు చెప్పుట తగదు. బ్రహ్మజ్ఞానము లేనివాఁడు బ్రాహ్మణుఁడు కాఁడు. ఆత్మస్తోత్రము చేసికొను బ్రాహ్మణునికన్న హరిభక్తిగలిగియుండు చండాలుఁడు గూడ నుత్తముఁడు. భాగవతుల కటాక్షవీక్షణమునకుఁ బాత్రములై రాళ్లకుఁ గూడ మోక్షము లభించును" అని చెప్పి అచ్చటనున్న రాళ్ల దెసఁ జూచెను. తోడనే అవి తటాలున ఆకసమునకు ఎగిరిపోయెను. అదిచూచి ఆబ్రాహ్మణులు బుద్ధి తెచ్చుకొని అతనివలన నుపదేశమును బడసిపోయిరి.

గణేశనాథుఁడు జీవితమంతయు నిట్లే కడపి అవసానమున శ్రీహరిసాయుజ్యముఁ బడసెను.

సు. "అలరున్ ధన్యుల కేకథామృతము జిహ్వన్ లేహ్య మేబాల్యచా
పలముల్ రాధకు నెయ్యపుంగినుక నాపాదించు నేయందముల్
మెలయున్ మోమున వేణుగానకలనన్ వేమాఱు నాదివ్యచ
ర్చలె నామానసవీథి వేఁగెదను ధారాళంబుగాఁ నిల్వఁగన్."

(కృష్ణకర్ణామృతము. ఆ.1 . ప. 106.)

---

79. జోగాపరమానందుఁడు.

శ్లో. "నఖనియమితకంఠా న్పాండవస్యందనాశ్వా
ననుదిన మభిషించ న్నంజలిస్థైః పయోభిః,
అవతు వితతగాత్రస్తోత్రనిష్ఠ్యూతమాళి
ర్దళనవిధృతరశ్మి ర్దేవకీపుణ్యరాశిః."

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. శ్లో. 47.)

ఒక గ్రామమున జోగాపరమానందుఁడు అను నొక భక్తాగ్రేసరుఁడు ఉండెను. ఆతఁడు ఐహికసుఖవిముఖుఁడై సంసారము అసారమని దానిని విడిచి ఏకాకియై జీర్ణవస్త్రమును దాల్చి భిక్షాన్నమును గుడుచుచు సదా భగవద్గీతాపారాయణము సేయుచునుండును. ఆతనికి భగవద్గీతయందు తక్క మఱియే గ్రంథమునందును భక్తిలేదు. శ్లోకమునకు ఒకసాష్టాంగనమస్కారము చేయుచు ఆతఁడు భగవద్గీతనుపారాయణము సేయును.

ఒకనాఁడు ఒక వర్తకుఁడు జోగాపరమానందుఁడు సాష్టాంగనమస్కారపూర్వకముగ భగవద్గీతను పారాయణముసేయుచుండఁగా వచ్చి కూర్చుండెనుగాని ఈసంగతిమాత్రము భక్తుఁడు ఎఱుఁగఁడు. ఆతఁడు సాష్టాంగనమస్కారములను జేయుచునే యుండెను. ఇంతలో చూచుచుండఁగా ఆకస మంతయు మేఘములు గ్రమ్మి, నిలిచియుండఁగాముసలధారగా వర్షము ప్రారంభించెను. ఆవర్షమునకు జోగాపరమానందుఁడును, వర్తకుఁడునుగూడఁ దడిసిపోయిరి. వర్తకుఁడు వానదెబ్బకుఁ దాళఁజాలక చాల బాధపడెను; గాని భక్తుఁడు అదియేమియు నెఱుఁ

గఁడు. ఆవర్షమువలన నేలయంతయు బురద యైపోయెను. అయినను భక్తుఁడు ఆమోఁకాలిలోతు బాడిలోనే సాష్టాంగవందనములు చేయుచు యథాపూర్వముగ భగవద్గీతా పారాయణము సాగించుచుండెను.

ఇది చూచి వర్తకుఁడు "ఈతఁడు అందఱు భక్తులవంటివాఁడు కాఁడు. కేవలము నిస్పృహాయు నిశ్చలత్వమును గల మహానుభావుఁడు. ఈతని దర్శనమువలన నేఁడు నాజన్మము పావనమైనది. నాపాపములు అన్నియుఁ బటాపంచలై పోయినవి. వాణిజ్యనిమిత్తము పోవుచున్న నాకు నాపూర్వపుణ్యవశమున కాకతాళీయన్యాయమున ఈమహానుభావుని దర్శనభాగ్యము గలిగినది. బ్రహ్మానందపరవశుఁడై ఈతఁడు తాను ధరించిన వస్త్రమును తనశరీరమును గూడఁ బంకిలములై యుండుట గమనించుటలేదు. ఇట్లే యుండిన ఈతని దేహమునకు అపాయముసంభవించి భగవత్కైంకర్యమునకు అభ్యంతరము కలుగవచ్చు" నని తలంచి గుఱ్ఱముమీఁద నున్న మూటలలో నొకటి విప్పి అందలి అమూల్యమగుపీతాంబరమునుదీసి తెచ్చి "మహానుభావా! మీరు ధరించిన వస్త్రమంతయు పంకిలమై యున్నది. అట్లుండిన జబ్బు చేయును. ఈపీతాంబరమునుస్వీకరించి ఈ సేవకునియెడల ననుగ్రహముఁ జూపవలయును" అని ప్రార్థించెను. అదివిని జోగాపరమానందుఁడు "ఓయీ, నీభక్తికి ఆనందమైనది. మాకు జీర్ణవస్త్రమును భిక్షాన్నమునే కాని ఇతరమును స్వీకరించుటతగదు. నీవు చూపిన భక్తియేచాలును. కావున నీవస్త్రమును నీవే కొనిపొమ్ము" అని ప్రత్యుత్తరమిచ్చెను; గాని వర్తకుఁడు అందులకు అంగీకరింపలేదు. "మహానుభావా, కుటుంబజంబాలపటలమునఁ బడి ఇద్ద అద్దఱఁగానక పరితపించుచుండ నాబోఁటి వారిపై మీరు అనుగ్రహము చూపకున్న నెట్లు?" అనిబలవంతమున నాతని యొడలు కడిగి పీతాంబరమునుగట్టి తన మార్గమునఁ బోయెను. భాగవతుఁడు వర్తకునిఁ గాదనఁ జాలక అంగీకరించి అమూల్యమగు పీతాంబరము పంకిలమై చెడిపోవు ననుభయముచే సాష్టాంగవందనములు మాని నిలిచియే నమస్కరించుచు గీతాపారాయణము చేయసాగెను. ఇట్లుకొంత సేపు అగునప్పటికి జోగాపరమానందునకుమనస్సు చలించెను. ఆయాసమువచ్చెను. ఆఁకలిపుట్టిదహింపఁదొడఁగెను. ఇదంతయుఁ జూచి "నేఁడు నేనెంత మూర్ఖుఁడనైతిని. ఈపట్టుపీతాంబరమును స్వీకరించుటవలననే నాకిట్టి గతి తటస్థించి

నది" అని నిశ్చయించుకొని దీనికిఁ దగినప్రాయశ్చిత్తముసకై యోచింపసాగెను.

ఇంతలో నొకరైతు పొలములో దున్నుట పూర్తిచేసికొని నాగటిని భుజముపై నిడుకొని ఎద్దును దోలుకొని ఇంటికిఁ బోవుచుండెను. జోగాపరమానందుఁడు ఆతనిని దగ్గరకు రమ్మని పిలిచి "నీకు ఈపీతాంబరమును ఇచ్చెదను. నీయెద్దును నాకు ఒక క్షణము ఎరవు ఇమ్ము" అని యడిగెను. కర్షకుఁడు అందులకు అంగీకరింపఁగా భక్తుఁడు కాడినియెద్దుమెడలకుఁ గట్టి తన్ను దానికిఁ గట్టుకొని ఎద్దును పరువెత్తించెను. ఈవిపరీతమునుజూచి బెదరి ఎద్దు తోఁచినతట్లుఁ బరుగులెత్తెను. ఒక గడియలో ముండ్లకంపలు రాళ్లు మున్నగునవి గీచుకొనిపోవుటవలన శరీరమంతయు రక్తమయమై జోగాపరమానందుఁడు పూచినమోదుగువృక్షమువలెనయ్యెను అప్పుడు ఆతఁడు "నేను చేసిన పనికి తగినప్రాయశ్చిత్తమైనది" అనియానందించి హరిస్మరణము ప్రారంభించెను. తోడనే శ్రీహరి గజేంద్రునిరక్షించినప్పటివలె వచ్చి ఆతని మేను నిమిరి యథాపూర్వముగఁ జేసి "వత్సా ఏల యిట్టి ఘోరమును జేసితివి అన్నా, దేహమును ఎంత కష్టపెట్టితివి?" అనియూరడించి అభయమిచ్చి తిరోహితుఁడయ్యెను. పిదప జోగాపరమానందుఁడు జీవితమంతయు హరిభజనమునఁ గడపి అవసానమున ముక్తినిబడసెను.

మ. తలఁ దోత్రంబు ధరించి పగ్గములు దంష్ట్రశ్రేణిఁ గీలించి యు
గ్గలికన్ మేనిగడించి పార్థరథకంఖాణంబులన్ దోయిటన్
జలముల్ సల్లి సఖాళి మై నివురుచున్ రక్షించు నా దేవకీ
లలనాపూర్వఫలంబు నన్నుఁ గని కాలంగా నగాఁ జేయుతన్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 48.)

---

80. బాలభక్తులు.

శ్లో. సంసారే కింసారం, కంసారేశ్చరణకమలపరిభజనం,
జ్యోతిః కి మంధకారే, య దంధకారే రనుస్మరణం.

(కృష్ణకర్ణామృతము. ఆ. 80. ప. 21.)

మాధవసింగు అను రాజునకు గుణవతీబాయి అనురాణి యుండెను. వారిరువురును గూడ సహృదయ అనుదాది ఉపదేశమువలన భక్తాగ్రేసరులైరి. వారికి శ్రీమంతుఁడు లక్ష్మీకాంతుఁడు అను ఇరువురు కుమారులు గలిగిరి. వారిని పెంచుటకు సహృదయ నియమింపఁబడెను.

మాటలాడ నేర్చినది మొదలు రాజపుత్త్రులు తమదాది శ్రీకృష్ణవిగ్రహమునకుఁ బూజసేయుం జూచి తాముగూడ చెరియొక విగ్రహమును సంపాదించి విధివిధానములు తెలియకపోయినను దాది చేసినట్లే పూజసేయసాగిరి. ఒకనాఁడు దాది వారు పూజసేయుటఁ జూచి "వీరికి పుట్టుకతోడనే హరిభక్తియలవడినది" అని సంతసించి రెండుస్వర్ణవిగ్రహములను జేయించి యిచ్చి "నాగురువు ఫలానామఠమునను న్నాఁడు. మీరు ఆతనిచెంతకుఁ బోయి ఉపదేశమును బొందుఁడు" అనిచెప్పెను. వారులట్లు పోయి ఆయోగికి తమసంగతి యంతయు విన్నవించిరి. అందులకు ఆతఁడుఆశ్చర్యచకితుఁడై శ్రీకృష్ణమంత్రమును ఉపదేశించి పూజావిధానమును దెలిపెను.

కొన్నాళ్లు గడచిపోయిన తరువాత బాలకులు ఇరువురును తల్లిదండ్రులవద్ద సెలవుఁబడసి తీర్థయాత్రలు సేవించుటకుఁ బోయిరి. ఒకనాఁడు ఒకనగరమున సాయంకాలము వీరు రాజోద్యానవనమునందలి చెఱువుగట్టుమీఁదఁ గూరుచుండి శ్రీకృష్ణవిగ్రహములకుఁ బూజలుసేయుచుండిరి. అప్పుడువిహారము నిమిత్తము అచ్చటకు వచ్చిన రాజపుత్త్రికలు పూజాంతమువఱకును అచ్చటనుండి వారి హరిభక్తికిని సౌందర్యసౌకుమార్యలావణ్యములకును మిగుల నానందించి తమ మార్గమునఁ బోయిరి; గాని రాత్రి వారికి నిద్రాహారములు సహింపవయ్యెను. "ఎప్పుడు తెల్లవాఱు నెప్పుడు వారిని జూతు" మని వారికిఁ దహతహ పుట్టెను. తుదకు ఎట్లో తెల్లవాఱెను. వెంటనేవారు కార్యములను దీర్చుకొని ఉద్యానవనమునకుఁ బోయి రాజపుత్త్రులవద్దఁ గూరుచుండిరి.

ఇట్లు నలువది దినములు గడచెను. రాజపుత్త్రికలకు "ఇఁక అంతిపురము విడిచి బైటికిఁ బోరాదు" అని యాజ్ఞయయ్యెను. వారు రాజపుత్త్రులను వారిచెంత నున్న శ్రీకృష్ణవిగ్రహములను జూడకుండ నుండలేక వారిని అంతఃపురమునకు భిక్షకు ఆహ్వానించిరి. ఇట్లు వారము దినములు గడచినపిదప ఒకనాఁడు రాజపుత్త్రులు కృష్ణవిగ్రహములను

అంతిపురమున నుంచి బైటకుఁ బోయిరి. ఇఁక నొక గడియ యైనతరువాత రాజు "కొమార్తెల అంతిపురమున పరపురుషులను బ్రవేశింపనీయరాదు" అని యాజ్ఞాపించెను. అది విని రాజపుత్త్రులు తమ కృష్ణవిగ్రహములను బంపవలసినదని రాజపుత్త్రికలకు వర్తమానము చేసిరి; గాని వారు "మేము వానిని విడిచి యుండఁజాలము" అని ప్రత్యుత్తర మంపిరి. అది విని రాజపుత్త్రులు ఆవిగ్రహములను విడిచి యుండఁజాలక కృష్ణునిఁ దలంచి విచారించుచుండఁగా "వత్సలారా! మీకు విచారము వలదు. నేను కొన్నిదినములు రాజపుత్త్రికలను తృప్తిపఱిచి మఱల మీచెంతకు వచ్చెద" నని ఆకాశవాణి వినఁబడెను. అది విని వారు ఊరడిల్లిరి.

నాఁటి రాత్రి శ్రీకృష్ణుఁడు ఆపట్టణపురాజు స్వప్నమున సాక్షాత్కరించి "వత్సా, నీకొమార్తెలు భక్తిజ్ఞానవైరాగ్యబంధురలై యున్నారు. వారికిఁ దగినవరులు నీ యుద్యానవనమున ఉన్నారు. తొలుత నీవు నీభార్యతోడను నీపుత్త్రికలతోడను ఆతని గురువువలన ఉపదేశమును బొంది పిదప నీకొమార్తెలను వారికిచ్చి పెండ్లి సేయుము" అని యానతిచ్చెను.

మఱునాఁడు రాజు రాజపుత్త్రులను బరీక్షింపఁ దలఁచి "ఇచ్చటికి మీరు ఏల వచ్చితిరి? నేను ఎవఁడను" అని యడిగెను. అందులకు వారు ఇట్లు చెప్పిరి. "ఓ రాజా, నీవు అడుగఁ దగినది అడిగితివి. "నీవు, నేను" అను పేరులు ఆత్మలకే గాని శరీరములకుఁ జెందవు; కావున నీవు రాజవు కావు. భగవంతుని అనంతాంశములలో ఒక అంశమవు" ఇది విని యాతఁడు పరమానందభరితుఁడై "నాకు జ్ఞానమును ఉపదేశింపుఁడు" అని కోరెను. అందులకు "మాయాచార్యుని ఆశ్రయింపుము" అని వారు బదులు చెప్పిరి. రాజు భార్యతోడను పుత్త్రికలతోడనుగూడి ఆరాజపుత్త్రులవెంట వారిగురువుచెంతకుఁ బోయి ఆశ్రయించెను. ఆచార్యుఁడు వారిభక్తికి మెచ్చిఅందఱకును శ్రీకృష్ణమంత్రమునుఉపదేశించి "నీకొమార్తెలను ఈరాజపుత్త్రులకు ఇమ్ము" అని నియమించెను.

ఆరాజు ఆచార్యానుమతిని తన కొమార్తెలను ఆరాజపుత్త్రులకు ఇచ్చి వివాహము చేసెను. బాలభక్తుల తలిదండ్రులను ఉత్తమోత్తమలును సంగవర్జితులై శ్రీకృష్ణునిఁ బూజించి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసిరి. శ్రీమంతుఁడు రాజుగను లక్ష్మీకాంతుఁడు యువ

రాజుగను కొంతకాలము ధరాపాలనము చేసి భగవద్భాగవతులను అర్చించి పాకుగూడ అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసిరి.

ఉ. "సారము కంసవైరిపదసారసచారుతరార్చనంబు సం
సారమునందు సింధురసన్మతి గాఢతమాంధకార ని
స్తారము వీనికిం దగినసద్గురుసేవయు కారణంబుగా
కారయ నింతకంటెను శుభావహమైన విశేష మున్నదే."

(కృష్ణకర్ణామృతము. ఆ. 2. ప. 80.)

---

81. సు ర దా సు.

శ్లో. "కరకమలదళదళితలలితతరవంశీ, కలనినదగళదమృతఘనసరసిదేవే,
సహజరసభరభరితదరహసితవీథీ, సతతవహదధరమణిమధురిమణిలీయే."

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. శ్లో. 52.)

మథురాపురమున సురదాసుఁడు అను నొక భాగవతోత్తముఁడు ఉండెను. ఆతఁడు జాత్యంధుఁడు అయినను వగవక సదా భగవంతుని స్మరించుచు "శ్రీహరీ, నాకు అంధత్వము ప్రాప్తించినదని విచారింపను. మనోమోహములగు ప్రాపంచికవృత్తములను అరసి చెడిపోకుండుటకు ఈయంధత్వమే నాకు మంచిదైనది" అని యాతఁడు సంతోషించుచు చుండును.

ఒకనాఁడు ఆతఁడు ఒకని సాయంబున దేవాలయమునకుఁబోయి స్వామియెదుట నిలిచి,—

శా. "బాలున్ మోహనవేషశీలు మురళీపాండిత్యశీలున్ దయా
లోలున్ సాంద్రఘనాఘనానళివిసీలున్ గోపకన్యానుత
శ్రీలావణ్యపయోవిశాలు నవనీరజాయతాక్షిప్రభా
జాలున్ సర్వకళాలవాలు నతివాంఛం గొల్తు నానెమ్మదిన్.

శా. ఎందే నవ్వనిమాళిఁ గాంచు గుహవాజీంద్రంబు వర్తించు దా
నెందే నెవ్వనియానరీతి హరిమత్తేభంబు గాంక్షించుఁ దా
నెందే నెవ్వని మంద మారొగ్గుచు భూతేశాశ్వముం బొంగునా
బృందారణ్యసురద్రుసాంద్రవని నాకృష్ణున్ మదిన్ గొల్చెదన్."

(కృష్ణకర్ణామృతము. ఆ. 3. ప. 14-16.)

అని రాలు కఱఁగునట్లు పాడి శ్రీకృష్ణుని వినుతించెను. అంతట శ్రీకృష్ణుఁడు అతనికి దృష్టి నిచ్చి దివ్యమంగళవిగ్రహుఁడై ఎదుట సాక్షాత్కరించెను. తోడనే సురదాసుఁడు ప్రదక్షిణముచేసి శ్రీహరి పాదముల మీఁద వ్రాలి బాష్పోదకముచే పాదములను గడిగి "రుక్మిణీకాంతా! ఆదిమధ్యాంతరహితుఁడగు నీలీలలు అనంతములు. అవాఙ్మానసగోచరంబులు. అంతటను నిండియున్న నిన్ను గ్రహింపలేక లోకమంతయు నీ మాయయందు గూలిపోవు చున్నది. నీయనుగ్రహము వలననే నాకు నీయెడల భక్తి కుదిరినది. అంతకును నీవే మూలమవు. అనంతా! నాకు దృష్టి ఇచ్చి నీవిరాడ్రూపమును జూచిన ఈకండ్లకు నన్యపదార్థమును చూచుటకు నాకు ఇష్టము లేదు. గావున మఱల యథాపూర్వముగ నాదృష్టిని దగ్గించివేయుము" అని ప్రార్థించెను. తోడనే శ్రీకృష్ణుఁ డంతర్హితుఁ డయ్యెను. సురదాసుని చూపుగూడఁ బోయెను. మఱల నాతఁడు వెంటవచ్చిన మనుష్యునిసాయంబున ఇంటికిఁ బోయెను.

సురదాసుఁడు అనేకకీర్తనములను రచించి అనేకులకుఁ జెప్పెను. ఆకీర్తనములయందు భక్తిరసము పొంగిపొరలిపోవుచుండును. అనేక గాయకులు ఆపాటలయందలి పాండిత్యమును జూచి అబ్బురపడుచుందురు.

ఆ దేశమునేలు రాజు ఆస్థానమున గంధర్వులకుఁ గూడ శృంగభంగము సేయఁగల గాయకులు అనేకులు కలరు. ఆరాజు తఱచు గానసభలను జేయించి సంగీతమును విని యానందించుచుండును. ఆవిద్వాంసులలో నొకఁడు పాడిన నల్లరాళ్లు కరఁగిపోవును. ఆతని పాట విని రాజు ఒకనాఁడు "విద్వాంసుఁడా, నేను అనేకగాయకుల గానమును విని యున్నాను; గాని నీయంత సమర్థుని జూచి యెఱుఁగను" అని కొనియాడెను.

అందులకుఆతఁడు "ప్రభూ, మన్నింపవలయును. మధురాపురమున సురదాసుఁడు అనునొకభాగవతోత్తముఁడుగలఁడు. ఆతఁడుపాడినమోడులు చిగురించును. శిలలు కఱఁగును. ఆకీర్తనలు విన్నవారికిహరిభక్తి యొదవి మోక్షము కరతలామలక మగును" అని విన్నవించెను. రాజు "అయినచో ఆతని గానమును వినవలయును" అని తలంచి మంత్రిని

గాయకులను బంపి ఆతనిరప్పించి దేవిడీవద్దకు వచ్చినతరువాత ఎదురేఁగి సగౌరవముగఁ గొనివచ్చి అర్ఘ్యాసనమిచ్చి "మహానుభావా, తమకీర్తిని విని ముగ్ధుఁడనై యున్నాను. తమునలన శ్రీహరికీర్తనములనువినితరింపఁగోరుచున్నాను." అనికోరెను. సురదాసుఁడు సల్లెయని సంగీతము ప్రారంభించెను. తోడనే శ్రీకృష్ణుఁడు సాక్షాత్కరించి తాండవము ప్రారంభించెను. అందఱును అబ్బురపడిచూచుచుండఁగా సురదాసుఁడు పాటఁజాలించెను. శ్రీకృష్ణుఁడు అంతర్హితుఁడు అయ్యెను. రాజు సురదాసుని జాలఁ బూజించెను. రాణి "మేము ఈతనివలన సంగీతము వినఁగోరుచున్నాము" అని ప్రార్థించెను. రాజు అంగీకరించి భాగవతుని రాణివాసమునకుఁబంపెను. అచ్చట నాతఁడు పాడుచుండఁగా సత్యభామ సాక్షాత్కరించి పాటవినసాగెను. తోడనే సురదాసునకుఁ జూపు వచ్చెను. ఆతఁడు సత్యను పొగడఁదొడఁగెను. ఇది యిట్లుజరుగుచుండఁగా శ్రీకృష్ణుఁడు సాక్షాత్కరించి సత్యభామను సురదాసుని దనలోనైక్యము జేసికొని అంతర్హితుఁడు అయ్యెను.

చ. లలితకరాంగుళీదళదళన్మురళీమధురస్వరామృతో
జ్జ్వలసుసితమనోజ్ఞసహజస్మితకందళచంద్రచంద్రికా
సలలితశోణగోష్ఠముఖనాసితచారుముఖాంబుజంబునన్
[illegible] నానమానసమహాగృహవీథి మెరుంగఁ [illegible]న మయ్యొడున్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 52.)

---

82. క మ లా క రుఁ డు.

చ. పలుగు పగాను భక్తజనవత్సల నీచరితంబు మెచ్చుకా
పలుగు పగాను నీబిగుదు బ్రహ్మమునంటికిరి కాన పూర్తి
పలుగు పగాను నాయకితవార్ధికిఁ జెప్పవుగా మనంబులోఁ
దలుతు మె కా నిరంతరము దాశరథీ కరుణాపయోనిధీ.

(దాశరథీశతకము. ప. 57.)

పంఢరిపురమున కమలాకరుఁడు అను ఒకభక్తుఁడుఉండెను.ఆతనికి భగవద్భాగవతారాధన మనిన చాల ఆనందము.ఆతనిభార్యపేరు సుమతి. ఆతనికి పద్మాకరుఁడు అను ఐదేండ్ల కుమారుఁడుగలఁడు. వారు గూడకమలాకరునివలెనే భగవద్భాగవతసేవాధురంధరులు.సంతతహరినామస్మరణపరాయణులు.

యథాపూర్వముగ కమలాకరుఁడు ఒకనాఁడు పద్మాకరునితోఁ గూడ చంద్రభాగానదికిఁబోయి స్నానసంధ్యాద్యనుష్ఠానము లన్నియుఁ దీర్చుకొనివచ్చి భిక్షాటనము నిమిత్తము ఊరిలోనికి బయలు దేఱెను. ఒకచోట భాగవతాగ్రేసరులగు నివృత్తిదేవుఁడు, జ్ఞానదేవుఁడు, సోపానదేవుఁడు,ముక్తాబాయి, నామదేవుఁడు, గోరాకుంభారు,రాకాకుంభారు, కూర్మాకుంభారు,చోకామేళుఁడు,కబీరుదాసు మున్నగువారుకూర్చుండి భగవద్భజనము సేసికొనుచుండిరి. కమలాకరుఁడు వారినిఁ జూచి సాష్టాంగవందనములు ఆచరించి వినుతించి "మహానుభావులారా! నా పూర్వార్జిత పుణ్యమువలన మిమ్ము సందర్శింపఁ గలిగితిని. నేఁడు నా యొక్కయు, నాకుమారునియొక్కయు జన్మములు సార్థకములైనవి. స్వాములవారు కరుణించి మాయింటికిని, నాభార్యజన్మము పవిత్రముగ సేయవలయును" అని ప్రార్థించెను. అది విని నామదేవుఁడు "మీ భక్తికి ఆనందము. మీయాదరము మాకు ఆనందమునుగొల్పెడి. మేము సంఖ్యలో అధికులమైయున్నాము.మాకు ఆతిథ్యము ఇచ్చుట కష్టము" అని మాఱుపలికెను. స్వాములు అందులకు సందేహింపఁ బనిలేదు. పంఢరినాథుఁడును రుక్మిణియు నాకుఁ దలిదండ్రులై యున్నారు. వారి యనుగ్రహము ఉన్నన్ని దినములు నాకు ఏలోపమును లేదు; గావున ఈదాసునిఁ గరుణింప వలయును" అని కమలాకరుఁడు మఱలఁ బ్రార్థింపఁగా,జ్ఞానదేవాదులు మాఱు పలుకఁజాలక "అట్లే వచ్చెదము. మీరు ముందు నడువుఁడు" అని చెప్పిరి.

కమలాకరుఁడు వెంటనే ఇంటికిఁబోయి సంగతియంతయు సుమతికి ఎఱింగించెను. తోడనే ఆమె పొరుగు ఇంటికిఁ బోయి కావలసిన పదార్థములు అన్నియు అప్పు తెచ్చి పాకము చేయుట ప్రారంభించెను; గాని వంటకట్టెలు తక్కువ అయ్యెను.అంతట సుమతి కుమారుని బిలిచి

"నాయనా,పిడుకలు గొనిరమ్ము" అని పంపెను. ఆతఁడు పిడుకలు విప్పునపుడు నల్లత్రాఁచు కఱచుటవలన ఎలుఁగెత్తి ఏడ్చుచుఁ బడిపోయెను. ఆరోదనధ్వని విని సుమతి పరుగుపరుగునఁబోయి స్థితిగతులు అన్నియుఁ దెలిసికొని ఒక నిముసము విచారించి భాగవతార్చనము చేయవలసి యుండుటచే ఆవిచారమును ఎట్లో దిగమ్రింగుకొని బాలుని కళేబరమును దెచ్చి ఇంటిలో నొకమూలనుంచి చంద్రభాగానదికిఁ బోయి మఱల స్నానము చేసివచ్చి వంటఁ బూర్తిచేసెను.

ఇంతలోఁ గమలాకరుఁడు భాగవతులనుగొనివచ్చి సమస్తమును సిద్ధముగా నుండుటచే వారికి అర్ఘ్యపాద్యాదులిచ్చి పూజించి పాదోదకమును స్వీకరించి పదార్థములు వడ్డించిన తరువాత "భుజింపవలయును" అని ప్రార్థించెను. నామదేవుఁడు యథాపూర్వముగ శ్రీకృష్ణుని స్మరించెను; గాని తలఁచునపుడెల్ల సాక్షాత్కరించు శ్రీకృష్ణుఁడు సాక్షాత్కరింపఁడాయెను. నామదేవుఁడు మఱల స్మరించెను; ధ్యానించెను; ప్రార్థించెను. ఎలుఁగెత్తి యాహ్వానించెను; గాని ఎంతచేసినను ప్రయోజనము కలుగలేదు. అందులకు ఆశ్చర్యచకితుఁడై ఆతఁడు దివ్యదృష్టిం జూచి సకలమును గ్రహించి కమలాకరునిం జూచి "భాగవతాగ్రేసరా, మీకుమారుని ఇందాఁక చూచితిని. ఆతఁడును భాగవతాగ్రేసరుఁడై యున్నాఁడు; గావున భుజించుటకు ఆతనింగూడఁ గొనిరమ్ము" అని పలికెను. అందులకు కమలాకరుఁడు ప్రత్యుత్తరము చెప్పకపూర్వమే సుమతి "మహాత్ములారా, బిడ్డఁడు ఇపుడే నిద్రించినాఁడు. తమరు ప్రసాదమును స్వీకరింపుఁడు. నిద్రమేల్కాంచిన తరువాత ఆతనికి అన్నముఁ బెట్టెదను" అని బదులు చెప్పెను. "తల్లీ,అట్లుగాదు. లేపి తీసికొనిరమ్ము" అని జ్ఞానదేవుఁడు మఱల చెప్పెను. సుమతి లోనికిఁ బోయి వచ్చి "మహానుభావా,ఆతనికి గాఢ నిద్రపట్టినది.ఎంతలేపినను లేచుటలేదు" అని బదులు పలికెను. మఱల నామదేవుఁడు పాండురంగనిఁ బ్రార్థించెను. తోడనే శ్రీహరి ప్రత్యక్షమై "నీయభిప్రాయమే" మని యడిగెను. "కమలాకరుని కుమారుఁడు మాతో భుజింపవలయును." అని జ్ఞానదేవుఁడు ప్రార్థించెను. "అట్లె యగును" అని పాండురంగఁడు తిరోహితుఁ డయ్యెను.

ఇంతలో పద్మాకరుఁడు నిద్రితునివలె లేచి కూర్చుండి "అమ్మా, మంచినీళ్లు కావలయును" అని కేక వేసెను. తోడనే సుమతి మహానంద భరితయై పరుగెత్తికొనిపోయి ఎత్తుకొని వచ్చి దాహమిచ్చి, భాగవతా గ్రేసరుల పాదములమీఁద వ్రాలించి సాష్టాంగదండములు చేయించెను. జ్ఞానదేవాదిభాగవతులు చాల నానందించి పద్మాకరుని దీవించిరి. అపుడు నామదేవుఁడు భాగవతులకు అంతఱకును జరిగిన సంగతియంతయు నెఱింగించి "సుమతీదేవియు, కమలాకరుఁడును, పద్మాకరుఁడును శ్రీహరి అంతరంగభక్తశిఖామణులు. వారి యాతిథ్యమును స్వీకరించుటవలన మనము నేఁడు తరించితిమి. శ్రీహరి మనయెడల నిట్టి బరిపూర్ణకరుణాళువాలుఁ డగును" అని చెప్పెను. భాగవతులు అంతఱును హర్షించిరి. కమలాకరుఁడును, సుమతియు, పద్మాకరుఁడును భాగవతులకు అనేక సాష్టాంగవందనములు అర్పించిరి. జ్ఞానదేవుఁడు ఆమువ్వురకును శ్రీకృష్ణమంత్రమును ఉపదేశించి పూజావిధానములు ఎఱింగించి భాగవతులతోఁ గూడి వెడలిపోయెను.

మఱియొకనాఁడు కమలాకరుఁడు కుమారుని వెంట నిడుకొని భిక్షాటనమునకు బయలు దేఱెను ఈసమయమున పాండురంగఁడు వృద్ధబ్రాహ్మణవేషముతో వచ్చి సుమతీదేవినిఁ జూచి "తల్లీ, నన్ను ఆఁకలి దహించివేయుచున్నది. తాళఁజాలను" అని కూలఁబడెను. సుమతీదేవి వెంటనే పొరుగింటికిఁ బోయి పదార్థములను దెచ్చి అతిశీఘ్రముగా పాకము చేసి ఆతనికిఁ బెట్టెను. భోజనము చేసిన వెంటనే వృద్ధుఁడు ఆయాసముతోఁ బండుకొనెను. సుమతీదేవి చెంతఁగూరుచుండి కాళ్లు పట్టసాగెను. ఇంతలో కమలాకరుఁడు ఇంటికి వచ్చెను. సుమతి సంగతి యంతయు నెఱింగింపఁగా కమలాకరుఁడు వంటసేయుటకు సుమతినిఇంటిలోనికిఁ బంపివేసి తాను వృద్ధునకు సేవఁజేయఁదొడఁగెను. వంట శీఘ్రముగనే ముగిసెను; గానిమేల్కాంచునందాఁక నీతనిపాదములను ఒత్తవలె నని కమలాకరుడునిశ్చయించుకొనెను. తుదకు వృద్ధుఁడు లేచు నప్పటికి రెండు జాముల రాత్రి యయ్యెను. అప్పటివఱకునుగూడ ఇంటివారు భుజింపకుండఁ దన్ను సేవించుచుండుటం జూచి ఆతఁడు నిజరూపముతో సాక్షాత్కరించి అభయమిచ్చెను. కమలాకరుఁడును, సుమతియు,

పద్మాకరుఁడును బ్రతికి యున్నంతకాలమును భగవద్భాగవతారాధన ము గావించి అవసానమున ఈశ్వరసాయుజ్యమును బడసిరి.

చ. చిరతరభక్తి నొక్క తులసీదళ మర్పణసేయువాఁడు ఖే
చర గరుడోరగప్రముఖ సంఘములో వెలుఁగుక్ సదా భవ
త్సుఖరదరవిందపాదములఁ బూజ లొనర్చినవారికెల్లఁ ద
త్పర మరచేతిధాత్రిగద దాశరథీ కరుణాపయోనిధీ.

(దాశరథీశతకము. ప. 35.)

---

83. జంబుదాసు.

శ్లో. పశుపాలబాలపరిషద్విభూషణం
శిశురేష శీతలవిలోలలోచనః,
మృదులస్మితార్ద్రవదనేందుసంపదా
మదయన్మదీయహృదయం విగాహతే.

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. శ్లో. 71.)

ఒక గ్రామమున జంబుదాసు అను నొక పంటకాపు ఉండెను. అతఁడు శాంతముగ వ్యవసాయము చేసికొని జీవయాత్ర గడుపుకొనుచు సదా శ్రీహరినామస్మరణతత్పరుఁడై యుండును. భగవద్భాగవతార్చన మనిన నాతనికి మహానందము. పొలములోఁ బనిచేసికొనుట, ఊరిలోనికి వచ్చి భాగవతాగ్రేసరులను సేవించుట తక్క నాతఁడు అన్య మెఱుఁగఁడు.

ఒకనాఁటి రాత్రి దొంగలు వచ్చి ఆతని పసులకొట్టములో నున్న రెండుఎడ్లను దోలుకొనిపోయిరి. అదిచూచి శ్రీహరి "నాభక్తుఁడు ఎడ్లు లేమి దున్నకొనుటకుఁ జాలఁ జిక్కువడును" అని తలంచి వెంటనే వెను కటిఎడ్లను బోలిన రెండునిర్మించి కొట్టమునఁ గట్టివేసి వాని ముందు

గట్టివేసిపోయెను. మఱునాఁడు ప్రాతఃకాలము ఇదియేమియు నెఱుఁగని జంబుదాసు కొట్టములో నున్న పశువులను విప్పి పొలమునకుఁ దోలుకొనిపోయి యథాప్రకారముగ దున్నుకొనెను. అది చూచి దొంగలు “నిన్నటిరాత్రియే గదా మనము ఈతని యెడ్లను దొంగిలించుకొని పోయితిమి. మనలను వంచించి మఱల నీతఁడు తన యెడ్లను దోలుకొని పోయెనా యేమి? ఈయెడ్లు మనము తోలుకొని పోయినవే. ఏమియు సందేహము లేదు” అనుకొని వెంటనే ఇంటికిఁ బోయి చూడఁగా రాత్రి దొంగిలించుకొని వచ్చినయెడ్లు కట్టు కంబములవద్ద యథేచ్ఛగ మేయుచుండెను అందులకు వాండ్రు పరమాశ్చర్యచకితులై “ఈయెడ్లు వేఱు, ఆయెడ్లు వేఱు. వానినిఁ గూడ నేఁటిరాత్రి దొంగిలింతము” అని నిశ్చయము చేసికొనిరి. అనుకొనిన ప్రకారము వారు ఆరాత్రి ఆ యెడ్లనుగూడ దొంగిలించుకొనిపోయిరి. శ్రీహరి యథాపూర్వముగ జంబుదాసు పసులకొట్టములో ఎడ్లను సృజించి కట్టివేసి వెడలిపోయెను.

మఱునాఁడు జంబుదాసు యథాప్రకారముగ ఎడ్లను దోలుకొని పోయిదున్నసాగెను. చోరులు చూచి మఱలఁ దెల్లవోయి ఇంటికిఁ బోయి చూడఁగా రెండుకాళ్లయెడ్లును మేయుచునే యుండెను. నాఁటిరాత్రి మఱల జంబుదాసు ఇంటనున్న ఎడ్లనుగూడఁ దోలుకొనిపోయిరి. ఇట్లు ఎన్నిమారులు చేసినను జంబుదాసు పసులకొట్టములో రెండు ఎడ్లును ఉండుచునే వచ్చెను. అది చూచి దొంగలు ఏమియు అర్థముగాక, చాల సేపుఆలోచించి జంబుదాసు శ్రీహరిస్మరణ సేయుటఁ జూచి “ఇది వేష మని మనము తలంచితిమి; గాని శ్రీహరి ఆతనికిఁ బ్రత్యక్షుఁడై వమని తోఁచుచున్నది. శ్రీహరిపనిగాకున్న ఇట్లేల సంభవించును” అనినిశ్చయించుకొని జంబుదాసు నింటకిఁ బోయి ఆతని పాదములమీఁద వ్రాలి జరిగిన దంతయు నెఱింగించి క్షమింపఁ బ్రార్థించిరి. ఆమాటలను విని జంబుదాసుకొంతతడవు నిశ్చేష్టుఁడై తుదకు “శ్రీహరీ, గోపాలకృష్ణా, నా నిమిత్తము నీవుఎంత శ్రమనొందితివి? ఈక్షుద్రునిమీఁదిఅనుగ్రహమువ లన ప్రతిదినమును అర్ధరాత్రి అసహ్యమగుపసులకొట్టములోఁజొచ్చి ఎంత

బాధపడితివోగదా! ముకుందా, మురమర్దనా! నాకొట్టములో ఎప్పటికప్పుడు క్రొత్తపశువులను నిర్మించుటకు దొంగలమీఁది యనుగ్రహము గూడఁ గారణముగదా ? అయినచో వారికి చౌర్యబుద్ధినే లేకుండఁజేయక ఏల దానిని దోహదమొనరించితివి? నీమాయలు ఎవరికి ఎఱుక? నిన్నుదెలియ నెవనికిశక్యము?" అని అనేకవిధముల శ్రీహరిగుణకీర్తనము సేయసాగెను.

అంతట శ్రీహరి దివ్యమంగళవిగ్రహముతో సాక్షాత్కరించెను. తోడనే జంబుదాసు ప్రదక్షిణనమస్కారము లాచరించి "శ్రీహరీ,అక్రూరవరదా,నీవుఅంతటను నిండియున్నావు. నీకుఁదెలియనిది లేదు. ఆనందాతిరేకముచే నాకంఠము రుద్ధమగుచున్నది. నీగుణములఁ గీర్తింపఁజాలకున్నాను.అయినను నాహృదయము నీకుఁదెలియనిది కాదు"అని యూరకుండెను. శ్రీహరి అందులకుఁ బరమానందభరితుఁడై జంబుదాసునిఁ గౌఁగిలించుకొని "వత్సా, నీభక్తిజ్ఞానవైరాగ్యములకు మెచ్చితిని. నీవు నాయంతరంగభక్తులలోనగ్రేసరుఁడవు.నీకు కావలసిన వరము వేడుము" అని యానతిచ్చెను.

అందులకు జంబుదాసు చేతులు జోడించుకొని మోకారించి నిలిచి "నారాయణా, మునిజనదుర్లభమగు నీదర్శన మొసంగి నన్ను చేపట్టితివి. ఇంతకంటె నేను కోరఁదగినది ఏమున్నది? అయినను నీవిశ్వరూపము సర్వకాలసర్వావస్థలయందును నాచూపులకు లక్ష్యమైయుండునట్లు అనుగ్రహింపుము" అని ప్రార్థించెను. భగవంతుఁడు నట్లే యని తిరోహితుఁడయ్యెను. ఇదియంతయుఁ జూచుచున్న దొంగలు తటాలున జంబుదాసు పాదములపైఁబడి "మహాత్మా, నీప్రభావము ఎఱుంగఁజాలకపోయితిమి. మమ్ము రక్షింపవలయును" అని ప్రాధేయపడిరి. జంబుదాసు వారిని ఆదరముతో లేవనెత్తి తత్వము నెఱింగించి శ్రీకృష్ణమంత్రమునుఉపదేశించి పూజావిధానమునుఁదెలిపి భగవన్నివేదితాన్నముతో సంతృప్తులం గావించి పంపివేసెను. వారు తలుచు వచ్చి గురుదర్శన

ముచేసికొనిపోవుచుండిరి. జంబుదాసుఁడును, దొంగలును గూడ బ్రతికి యున్నంతకాలమును త్రికరణశుద్ధిగా భగవద్భాగవతులనర్చించి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బడసిరి.

చ. వికవికనవ్వుచున్ నుదుట వ్రేలుకురుల్ నునుపాలబుగ్గలుం
జికిలిమెఱుంగుమాపు రహిఁ జెందఁగ నాననశీతలద్యుతిం
బ్రకటితగోపశాబకసభానవభూషణమై చెలంగు బా
లకుఁడు మదీయమానసతలంబున నిల్చెను సొంపు నించుచున్.

(కృష్ణకర్ణామృతము. ఆ. 1. ప. 71.)

శ్రీమహాభక్తవిజయము.

ద్వితీయభాగము.

శివభక్తులు.

84. సుందరమూర్తినాయనారు.

దక్షిణ దేశమున తిరునావలూరు అను దివ్యక్షేత్రమున శడయ నాయనారు అను ఒక ఆదిశైవుఁడు ఉండెను. అతని భార్యపేరు ఇశై జ్ఞానమ్మ. ఇరువురును యుక్తమార్గమున కాలముగడపుచుండిరి. కొన్ని దినములకు జ్ఞానమ్మ గర్భవతియై నవమాసములు మోసి ఒక శుభ ముహూర్తమున కుమారునిఁ గనియెను. పిదప ఆదంపతులు కుమారుని మిగుల గారాబముతోఁ బెంచుకొనుచు సుందరమూర్తినాయనారు అని నామకరణము చేసిరి; గాని ఆబాలుని ఊరివారందఱును "నంబియా రూరివారు" అని పిలుచుచుండిరి.

ఒకనాఁడు సుందరమూర్తి వీధిలో నాడుకొనుచుండఁగా ఆన గరము నేలు నరసింగమునాయనారు అనురాజు ఆబాలునిఁ జూచి ప్రేమించి ఆతని తండ్రినిఁ బిలిచి "ఈతనిఁ జూచిన నాకు ఆనందముగా నున్నది కొన్నిదినములు ఈతనిని నాచెంత నుంచుకొందును" అనియెను. శడయనాయనారు వ్యతిరేకము సెప్పలేక వల్లెయనఁగా రాజు సుందర మూర్తిని గొనిపోయెను. రాజుగారి ఇంటికిఁ బోయినను సుందరమూర్తి బ్రాహ్మణధర్మమును విడువక వేదవేదాంగముల నభ్యసించి మహాపం డితుఁడై కొన్నిదినములకు యువకుఁడై వివాహయోగ్యుఁ డయ్యెను.

శడయనాయనారు కుమారునకు వివాహకాలము సమీపించిన దని ఎఱింగి పుత్తూరు అనుగ్రామమున ఒక్కచక్కని కన్యను కుదిర్చి ముహూర్తకాలమునకు పెండ్లికొడుకగు సుందరమూర్తి నలంకరించి సబంధుమిత్రుఁడై పుత్తూరునకు తరలివెళ్లెను. అచ్చట పెండ్లికొమార్త తండ్రియగు షడంగవిశ్వాచారి వారిని ఎదుర్కొని సగౌరవముగ

నూరిలోనికిఁ గొనిపోయి చక్కని ఇంట విడియించెను.

పెండ్లివారు అందఱును సకలసన్నాహములును జేసికొనుచుండఁగా నొక వృద్ధబ్రాహ్మణుఁడు వచ్చి సుందరమూర్తినిఁ జూచి "నీకును నాకును ఒక వివాదము ఉన్నది. దానినిఁ దీర్చినఁగాని నీవు పెండ్లిచేసికొనఁగూడ" దని పలికెను. అది విని అందఱును ఆశ్చర్యపడిరి. బ్రాహ్మణుఁడు బ్రాహ్మణునకు సేవకుఁడుఅగుట ఏయుగమునందైనను గలదా!" యని సుందరమూర్తి యడిగెను. "అదియంతయు నాకుఁ దెలియదు. నీతాత తనవంశపరంపరగా నాకు సేవసేయుటకు అంగీకరించి వ్రాసి యిచ్చిన పత్రము నావద్దనున్నది నీవు సేవచేసితీరవలెను"అని వృద్ధుఁడు పట్టుపట్టెను. సుందరమూర్తి పత్రము చూపుమనఁగా వృద్ధుఁడు "చీటి చూపిన ఒప్పుకొందువా? వీరు అందఱును తగవుచెప్పవలయునా?" అని మఱల నడిగెను. సుందరమూర్తి అందులకు జవాబు చెప్పకయే చీటిలాగికొనుటకుఁ బ్రయత్నముసేయుఁగా వృద్ధుఁడు "అన్యాయము, అన్యాయము" అని పాఱిపోఁదొడఁగెను. సుందరమూర్తి వెంటఁబడెను.

కొంతదూరము పోవునప్పటికి వృద్ధుఁడు ఆయాసమువలన ఆఁగిపోయెను. వెంటనే సుందరమూర్తి బలవంతముగ అతని చేతనున్న చీటిని గుంజుకొని "బ్రాహ్మణునకు సేవచేయుట ఏటి న్యాయము?" అని దానిని చించివేసెను. అంత ఈఅన్యాయముచూడుండు అని వృద్ధుఁడు బొబ్బలుపెట్టఁగా పదుగురు బ్రాహ్మణులు వచ్చి అభయమిచ్చి సంగతి యంతయు విని "నీవెచ్చటివాఁడవు" అని యడిగిరి. నానివాసము తిరువెణ్ణైనల్లూరుఅని వృద్ధుఁడు చెప్పెను. ఈతగవు అక్కడనే తీర్చుకొందమని సుందరమూర్తి చెప్పెను. అందఱును బయలుదేఱిరి.

తిరువెణ్ణైనల్లూరున బ్రాహ్మణులు అందఱును సమావేశమై ఈ విషయమును విచారణప్రారంభించి "సుందరమూర్తి కాగితము చింపివేసెననుటవలన ప్రయోజనము లేదు. బ్రాహ్మణునకు బ్రాహ్మణుఁడు దాస్యముచేయుట లోకవిరుద్ధము. కావున నీవు ఇప్పుడు నీవాదమునకు ఏమయిన ఆధారములు ఉన్నచోఁ జూపవలయును"అని వృద్ధునిఁగోరిరి. వృద్ధుఁడు మఱలఁ గాగితమును జూపెను. అందు ఇట్లు ఉండెను. "తిరునావలూరున ఉండు ఆదిశైవుఁడగు ఆరూరాఖ్యుఁడు అను నేను తిరు

వెణ్ణెనల్లూరున ఉండుపిచ్చివాని వంశపారంపర్యముగ దాస్యము చేయుటకు త్రికరణశుద్ధిగా నంగీకరించి ఈపత్రము వ్రాసియిచ్చుటయైనది" ఇదిచదివి వారందఱును "ఇది లోకధర్మమునకు కేవలమువ్యతిరేకముగ నున్నను పత్రముపుట్టియున్నది గావున ఇది తప్పదు. సుందరమూర్తి వృద్ధునకు సేవచేయవలెను" అనిరి. సుందరమూర్తి అంగీకరించెను. అప్పుడు బ్రాహ్మణులలో నొకఁడు "అయ్యా, మీ దీగ్రామమే యని చెప్పుచున్నారు. మిమ్ము ఇచ్చటఁ జూచినవారు ఎవరును లేరు. మీవృత్తాంతము ఏమో చెప్పుఁడు"అనియెను.అందఱును అవుననిరి వృద్ధుఁడు "నాయింటికి రండు. చెప్పెద" నని ముందు దారి తీసెను. అందఱును బయలుదేఱిరి. వృద్ధుఁడు శివాలయము సమీపించి "ఇదే నాయిల్లు" అని అందుఁ బ్రవేశించి మాయమయ్యెను.అందఱును ఆశ్చర్యచకితులై నిశ్చేష్టులైరి.సుందరమూర్తి వెంటనే ఆలయముసొచ్చి అనేకవిధములఁ బ్రార్థింపఁగా మహేశ్వరుఁడు పార్వతీసహితుఁడై నందివాహనారూఢుఁడై సాక్షాత్కరించి "వత్సా, తొల్లి నీవు నాభక్తుఁడవు. నిన్నురక్షించుటకు నేను ఇట్లు చేసితిని. ఇఁకమీఁద నీవు నామీఁద పద్యములు అల్లి పాడుము" అని నియమించి అంతర్హితుఁడయ్యెను. సుందరమూర్తి ఈశ్వరాజ్ఞాప్రకారము పద్యములు ప్రారంభించెను. ఇట్లుండఁగా చాల దినములు గడచిపోయెను. అచ్చట సుందరమూర్తికొఱకు నిశ్చయింపఁబడిన కన్యక సుందరమూర్తిమీఁదనే మది నిలిపి నిరుత్సాహమువలనను నిరాశవలనను శుష్కించి ఈశ్వరసాన్నిధ్యము చేరెను.

సుందరమూర్తి తిరునావలూరు తిరుతిగైయూరు మొదలగు గ్రామములకుఁ బోయి అచ్చటచ్చట వెలసియున్నమహేశ్వరులను పద్యములతో వినుతించి సిద్ధవటమునకుఁబోయెను.అచ్చట తిరువదిపరమేశుని స్తుతించుట యైన తరువాత సుందరమూర్తికి గాఢనిద్ర వచ్చెను. అపుడు పరమేశ్వరుఁడు వృద్ధబ్రాహ్మణరూపముతో వచ్చి తనపాదములు సుందరమూర్తి శిరమునకుఁ దగులునట్లు పెట్టి శయనించెను. కొంతసేపటికి సుందరమూర్తి మేల్కొని బ్రాహ్మణుఁడా, నాశిరముపై నీకాళ్లు పెట్టుట తగునా?" యనఁగా వృద్ధుఁడు "ఓయీ,వార్ధకమువలన నాకు కన్నులు సరిగఁ గాన్పింపవు" అని పలికెను. సుందరమూర్తి మఱియొకచోటికి బోయి శయనించెను. వృద్ధుఁడు తొల్లిటియట్లే చేసెను. మఱల సుందర

మూర్తి మేల్కాంచి "మఱల నిదియేమి? బ్రాహ్మణుఁడా" యనఁగా వృద్ధుఁడు "నన్నెఱుఁగవా?" యని పలుకుచు తిరోహితుఁడు అయ్యెను. అంతట సుందరమూర్తి లేచి కూరుచుండి పరమశివుఁడే తన్ను అనుగ్రహించుటకు అట్లు వచ్చెనని తెలిసికొని చాల నొచ్చుకొని గతజలసేతు బంధనము వెట్టిపని యని నిశ్చయించుకొని తిరువడిపరమేశుని పద్య లహరితో నభిషేకించి అచ్చటనుండి తిరుమాక్కళి, తీర్థనగరు, చిదంబర ములకుఁ బోయి అచ్చటచ్చట వెలసియున్న మహేశ్వరులను అనేక పద్యములతో వినుతించెను.

ఇట్లుండఁగా "నీవు కమలాలయమున నున్న నాయొద్దకు రావలయును" అను నొక అశరీరవాణి వినఁబడియెను తోడనే సుందరమూర్తి బయలుదేఱి కొల్లడము అనఁబడు నదిని దాఁటి జ్ఞానసంబంధమూర్తినాయనారు ఉద్భవించిన స్థలము గావున బ్రహ్మపురము ప్రవేశింపరాదని పొలిమేరలో నుండియే సాంబునినుతించి ఆస్వామి సాక్షాత్కరింపఁగా పద్యకుసుమములతోఁ బూజించి అట కదలి తిరుకోల్కా, తిరుప్పూకూరులకుఁ బోయి మహేశ్వరులను స్తుతించి కావేరిలో స్నానమాడి మాయూరమునకును అంబర్మాగాళమునకును తిరుప్పుగలూరికిని బోయి కమలాలయమును సమీపించెను. కమలాలయమున వెలసియున్న వల్మీకనాథుఁడు "నాపరమభక్తుఁడైన సుందరమూర్తి వచ్చుచున్నాఁడు. మీరందఱును ఎదురుపోయి తోడుకొనిరావలసిన" దని ఊరివారందఱకును జెప్పఁగా వారు అట్లే చేసిరి.

సుందరమూర్తి మహావైభవముతో నూరిలోఁ బ్రవేశించి యథావిధిగ వల్మీకనాథుని త్యాగేశ్వరుని దర్శించి పద్యములతో వినుతించెను. ఆయూరివారు అదిమొదలు సుందరమూర్తిని పరమశివునిగా భావించి పూజింపసాగిరి. సుందరమూర్తియు ప్రతిదినమునువల్మీకనాథునిదర్శించి సేవించుచుండెను. ఆగ్రామమున పరవయను నొక తరుణగణికయుండెను. ఆమె పార్వతీదేవిపరిచారికలలో నొకతె. కమలిని యను పేరుగలది. అదియు ననుదినమును స్వామిని సేవింప వచ్చుచుండెడిది. ఒకనాఁడు సుందరమూర్తియు పరవయు స్వామిని సేవించుటకు ఒక్క నిముసము నందే వచ్చిరి. హఠాత్తుగా వారికి ఒకరిపై నొకరికి మోహోదయము అయ్యెను. పిదప సుందరమూర్తి పరవమీఁది హృదయమును ద్రిప్పి

కొనఁజాలక వేయికాళ్లమండపమునఁ గూరుచుండి పరవను స్వాధీనము చేయుమని వల్మీకనాథుని గూర్చి తపస్సు ప్రారంభించెను. ఇంతలో సూర్యుఁడు అస్తమించెను.

పరవయు ఇంటికిఁబోయి సుందరమూర్తికొఱకు వేదనపడసాగెను. అప్పుడు వల్మీకనాథుఁడు ఊరివారందఱితోడను "రేపు ఉదయము పరవకును సుందరమూర్తికిని వివాహము సేయవలసిన"దని నియమించి అట పరవచెంతకును ఇట సుందరమూర్తిచెంగటకును బోయి "మీకిరువురకును వివాహము అగు"నని చెప్పిపోయెను. ఊరివారు ఈశ్వరుని ఆదేశము చొప్పున సుందరమూర్తికిని పరవకును మహావైభవముతో వివాహము గావించిరి. సుందరమూర్తి పరవయింటికిఁ బోయి ఐహిక సుఖసాగరమున ఈఁదులాడసాగెను.

ఒకనాఁడు సుందరమూర్తి పరవతోఁగూడ వల్మీకనాథుని సేవించుటకుఁ బోయెను. అపుడు ఆలయమున ఉన్న దేవాశ్రమమునఁ గల దేవాశ్రమము అను సహస్రస్తంభమంటపమున అనేకమందిభక్తులు కూరుచుండియుండిరి. వారినిఁజూచి సుందరమూర్తి "వీరిని ఎట్లు సేవింపఁగలుగుదును?" అని చింతించుచుండఁగా వల్మీకనాథుఁడు ఆతని భావవీథిని సాక్షాత్కరించి "పద్యములతో వీరిని వినుతింపుము. నీయభీష్టము నెఱవేఱును." అని యానతిచ్చెను. సుందరమూర్తి వల్మీకనాథునివలన గురుపరంపర నెఱింగి ఆభక్తగణమును వినుతించెను.

గుండయూరు అను నొక గ్రామమున గుండయూరువారు అను నొక వెలమ యుండెను. ఆతఁడు సంపన్నుఁడు కావున పరవకును సుందరమూర్తికిని గావలసిన భోజనపదార్థములను బంపుచుండెను. ఇట్లుండఁగా నొకసంవత్సరము పంటలు సరిగా పండవయ్యెను. అప్పుడు గుండయూరువారు "వ్రతము నెట్లుకొనసాగించుకొందును"అని విచారించుచుండఁగా ఈశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి "నీకు చింతవలదు. సుందరమూర్తికిఁ బంపుటకు నీకుఁ గొదవయుండదు" అని చెప్పిపోయెను. గుండయూరువారు తెల్లవాఱిన పిదప లేచిచూడఁగా ధాన్యాదికములగు సకలభోజనపదార్థములును గుట్టలుపడియుండెను. ఆపదార్థములను సుందరమూర్తి యింటికిఁ జేర్చుటకుఁ దగినంతమంది కూలీలు దొరకుట కష్టమని భావించి గుండయూరువారు సంగతి యంతయు సుంద

రమూర్తి కెఱింగించెను. 'అంతయు ఈశ్వరుఁడే చేయును' అని సుందరమూర్తి చెప్పఁగా వెలమ ఇంటికిఁ బోయెను మఱునాఁడు ఉదయము లేచి చూచునప్పటికి సుందరమూర్తియిల్లువాకిండ్లును ఊరును గుండయూరి వారియింటనుండిన పదార్థములతోఁ నిండియుండెను. అందులకు పరవ ఆశ్చర్యచకితయై "ఎవరికిఁగావలసిన పదార్థములు వారు కొనిపోవచ్చును" అనియాజ్ఞాపించెను. ఊరివారందఱును మహానందముతోఁ ఎవరికి కావలసినవి వారు తీసికొనిరి.

ఒకప్పుడు తిరునాట్యత్తాన్ గుడినుండి కోట్పులినాయనారు వచ్చి తనగ్రామమునకు రావలసినదని ప్రార్థింపఁగా సుందరమూర్తి బయలుదేఱెను. కోట్పులినాయనారు మహావైభవముతోఁ నెదురుకోలు సలిపి సుందరమూర్తిని దనగ్రామమునకుఁ గొనిపోయెను. అచ్చట కోట్పులినాయనారు యుక్తవయస్సున నున్న తన కొమార్తల నిరువురను బెండ్లియాడవలయు నని ప్రార్థింపఁగా అందులకు నిరాకరించి అక్కడనుండి తరువలివలయను స్థలమునకుఁ బోయెను. అప్పటికి పరవకు ఫాల్గునోత్తరమనుఉత్సవమునకుఁ బోవుటకు ధనము అవసర మయ్యెను, సుందరమూర్తి ధనసంపాదనార్థము బయలుదేఱి మార్గమధ్యమున శివభక్తులు కానిపింపఁగా నచ్చటఁ గూరుచుండి ఆయాసవశమున అచ్చట నిద్రించెను. తలక్రిందకు ఏమియు లేకపోవుటచే రెండు ఇటికలను దెచ్చి యుపయోగించుకొనెను. మఱల మేల్కాంచి లేచి చూచునప్పటికి శివభక్తులు కానిపింపరైరి. తలక్రింద నున్న ఇటికలు రెండును బంగారపు ముద్దలైయుండెను. అందులకు ఆశ్చర్యపడి సుందరమూర్తి పరమశివునిఁ బద్యములతోఁ వినుతించెను.

పిదప సుందరమూర్తి అనేకదివ్యస్థలములు సందర్శించి ఆయా స్థలములయందెల్ల తన అనర్ఘళకవితాలహరినిఁ బ్రవహింపఁజేసి లోకులను అద్భుతానందరసనిమగ్నులం గావించెను. తిరుముదుకూడు అనుస్థలమున సుందరమూర్తి దేవుని స్తుతింపఁగా స్వామి పండ్రెండువేలసువర్ణములు ఇచ్చెను. "శివా, ఈధనము అంతయు కమలాలయము సేరుట ఎట్లు?" అనియడుగఁగా "దీనిని ఇచ్చట నదిలోఁబడవేయుము. పోయి కమలాలయమునందలి చెరువులో వెదకికొనుము" అని అశరీరవాణి వినఁబడియెను. సుందరమూర్తి అట్లు చేసి పరవ ఇంటికిఁ బోయెను.

మఱియొకప్పుడు సుందరమూర్తి మఱల శివస్థలములను సేవింప బయలుదేఱెను. మార్గమధ్యమున నొకచోట సుందరమూర్తికి అన్నపానములు దొరకవయ్యెను. ఆశ్రమను లెక్కచేయక అతఁడు ఎట్లో పోవుచుండఁగా పరమశివుఁడు భక్తుని స్థితిగతుల నెఱింగి బ్రాహ్మణవేషముతో మార్గమధ్యమున నిలిచి ఒకపందిలిని గల్పించి అన్నపానీయములతో వేచి యుండెను. కొంతతడవునకు సుందరమూర్తి అచ్చటకు వచ్చెను. వృద్ధబ్రాహ్మణుఁడు సుందరమూర్తిని బిలిచి "ఓయీ, నీవు ఆఁకటఁ గడు బడలియున్నావు. కావున ఈ ప్రసాదమును భుజించి ఈతీర్థమును ద్రావుము" అని అన్నోదకములను జూపెను. సుందరమూర్తి భక్తగణములతోఁగూడ ఆపదార్థములను సేవించి గాఢనిద్రాముద్రితుండయ్యెను. మఱల నాతఁడును భక్తగణమును మేల్కాంచి చూచునప్పటికి పందిలియు వృద్ధబ్రాహ్మణుఁడునుగూడ మాయమైపోయి యుండెను. అది చూచి "ఇది ఈశ్వరునిలీల. మనలను క్షుత్తు నుండి రక్షించుటకు ఇట్లు చేసె"నని అందఱును ఆనందించి పరమేశ్వరుని పద్యసహస్రములతోఁ బ్రస్తుతించెను.

అతఁడు అక్కడనుండి బయలుదేఱి అనేకదివ్యస్థలములను సేవించి పక్షితీర్థమును జేరెను. అచ్చట భోజనసమయమునకు పరిచారకులు వచ్చి వంటచేయుకుండుటచే సుందరమూర్తి యొకచోఁ గూరుచుండి ఆఁకట నకనకమాడుచునే పద్యశతములతో స్తోత్రము సేయుచుండఁగా ఈశ్వరుఁడు ఆనందించి వృద్ధబ్రాహ్మణరూపముతో వచ్చి "మహానుభావా, నీకవిత అతిమధురముగ నున్నది. నిన్ను జూచిన నాకుఁ జాల నానందముగనున్నది; గాని నీవు ఆఁకొనియున్నట్లు తోఁచుచున్నది. కదలకుండ ఒక్కగడియ యిక్కడనే కూర్చుండి యుందువేని ఈబ్రాహ్మణుల యిండ్లకుఁ బోయి అన్నము యాచించి తెచ్చెదను" అని చెప్పిపోయెను. సుందరమూర్తి వృద్ధబ్రాహ్మణునిమాటలను విని యానందించుచుఁ గూర్చుండియుండఁగా అతఁడు అన్నము గొనితెచ్చి ఎదుటఁ బెట్టెను. సుందరమూర్తి భోజనము ప్రారంభించెను. అంతలో వృద్ధుఁడు అంతర్హితుఁడు అయ్యెను. అదిచూచి సుందరుఁడు సాంబశివుఁడే ఈవేషముతో వచ్చెనని ఎఱింగి మఱలఁ గవితాలహరిని బ్రవహింపఁ జేసెను. అక్కడనుండి

బయలుదేఱి ఆసేతుహిమాచలం బగు ఆర్యావర్తమునఁ గల సకలశివ క్షేత్రములను దర్శించి తిరువట్టూరు చేరుకొనెను.

కైలాసగిరిపై పార్వతీదేవిపరిచారికయు సుందరమూర్తిని మోహించియున్నదియు నగు అనిందిత అనునది భూమిమీఁద ఆదిత్యుఁడు అను వెలమకు 'సంకిలి' అనుపేరితో కొమార్తయై పుట్టెను. ఆమె వివాహయోగ్య కాఁగా తలిదండ్రులు మనబిడ్డకుఁ దగినవరుఁడు ఎవఁడు అని యోచింపసాగిరి. ఇది యెఱింగి సంకిలి తన్నొకవేళ తలిదండ్రులు సామాన్యునకు ఇచ్చి పెండ్లిచేయవచ్చునని యోచించి "మీరు నాతో చెప్పకుండ వరాన్వేషణము సేయుచున్నారు. మీరు చేసిన పెండ్లి నేను అంగీకరించుదానను గాను. నేను పరమశివభక్తాగ్రేసరుని దక్క నన్యునిఁ బెండ్లియాడను. మీరు అట్టివానినిఁ దీసికొని రాఁజాలరు; గావున నేను తిరువట్టూరునకుఁ బోయి స్వామిసన్నిధిఁ గాచియుండి వరుని వెదకుకొనెద" నని చెప్పెను. తలిదండ్రులు ఆమె మాటలను విని ఇతరులకుఁ దెలియనీయక హృదయమునందే యుంచుకొనిరి. ఇట్లుండఁగా సమీపగ్రామవాసియొకఁడు సంకిలిరూపరేఖావిలాసములను విని తనకు ఈయవలసినదని ఆమె తండ్రికి వర్తమానము చేసెను. అతఁడు వీలుపడదు అనియెను. వచ్చినవారు తిరిగిపోయిరి. ఇలు చేరినవెంటనే వచ్చినవారును పంపినయాతఁడునుగూడ చనిపోయిరి. అదివిని సంకిలితండ్రి "ఈమెను శివభక్తుఁడె గాని అన్యుఁడు పెండ్లియాడఁదగఁడు." అని నిశ్చయించుకొని ఆమెను తిరువట్టూరికిఁ గొనిపోయి ఆలయమున ఒక గది యేర్పాటు చేసి "నీవు ఇందు వసించుచు స్వామిని సేవించుకొనుచుండుము" అని చెప్పి స్వామిసన్నిధికిఁ బోయి "ఈశ్వరా, మాబిడ్డను రక్షింపుము" అని ప్రార్థించి కొమార్తను విడువలేక స్వగ్రామమునకు వెడలిపోయిరి. సంకిలి అచ్చట అనుదినమును పుష్పమాలలు గ్రుచ్చి వానితో స్వామిని సేవించుచుండెను.

ఒకనాఁడు సుందరమూర్తి స్వామిని సేవించుటకుఁ బోయినపుడు సంకిలి పుష్పమాలికలను జేఁబూని స్వామిని సేవించుటకు వచ్చెను. ఆమెను జూచిన వెంటనే సుందరమూర్తి ముగ్ధుఁడై స్వామి సన్నిధికిఁ బోయి "ఈశ్వరా! క్షమింపుము. నిన్ను పుష్పమాలికలు సమర్పించి సేవింపవచ్చిన కన్యపై నాకు మోహముగలిగినది. ఆమెను బెండ్లియాడ

కుండ నేను బ్రతుకఁ జాలను. గావున అంతయు నీవు ఏర్పాటు చేయ వలయును" అని ప్రార్థించెను. ఈశ్వరుఁడు సుందరమూర్తికి ధైర్యము చెప్పి సంకిలి కలలో సాక్షాత్కరించి "నాభక్తులలో అగ్రేసరుఁడు అగు సుందరమూర్తి నిన్ను మోహించియున్నాఁడు. ఆతనిని పెండ్లియాడి సుఖింపుము" అని నియమించెను. అదివిని సంకిలి "స్వామీ, సుందర మూర్తి సంగతి నీకుఁ దెలియనిది గాదు; ఆతఁడు పరవ అను వారకాంతకు వశుఁడై యున్నాఁడు. ఇఁక నన్ను జూచునా?" యని యడుగ ఈశ్వరుఁడు "నీకట్టివిచారము వలదు. అది నేను చక్కఁజేసెదను. నీవు వకుళవృక్షముక్రిందికి రమ్ము. అచ్చట వివాహము నెఱవేఱును" అని చెప్పి సుందరమూర్తికిఁ గూడ ఈవిషయమును ఎఱింగించెను.

యుక్తసమయమున సంకిలియు సుందరమూర్తియు వకుళవృక్షము చెంతకు వచ్చి ఆవృక్షమునకు ప్రదక్షిణనమస్కారములు ఆచరించి "మనము బ్రతికియున్నంతకాలము ఒండొరులను బాసియుండఁ గూడదు" అని బాసచేసికొని పెండ్లియాడిరి. సుందరమూర్తి సంకిలితోఁ గొన్నిదినములు సుఖించినపిదప వల్మీకనాథుని దర్శింపవలయునని కోరి బయలుదేఱెను; గాని సంకిలికి ఇచ్చిన మాటను దప్పుటచే వెంటనే కండ్లుపోయెను. అయినను పట్టినపట్టు విడువఁగూడదని పరిజనుని సాయంబున బయలుదేఱెను. మార్గమధ్యమున ఆతఁడు అనేక శివక్షేత్రములకుఁ బోయి అచ్చటచ్చట వివిధనామములతో వెలసియున్న సాంబమూర్తిని పద్యసహస్రములతో వినుతించి కండ్లు ఈయవలసినదని ప్రార్థించెను; గాని ప్రయోజనము లేకపోయెను. ఏకామ్రేశ్వరుఁడుమాత్రము కనికరించి ఎడమకన్ను ఒసంగెను. అందులకు ఆనందించి మఱల బయలుదేఱి మార్గమధ్యమున మఱికొన్ని శివక్షేత్రములను సేవించియు ఫలముగానక తిన్నగ వల్మీకనాథుని సన్నిధిఁ జేరి స్వామీ! దాసుని గరుణింపుమని ప్రార్థింపఁగా కుడికన్ను ఇచ్చెను. అంతట మహానందభరితుఁడై అనేక పద్యములతో స్వామిని నుతించి దేవాశ్రయము అను సహస్రస్తంభ మంటపమునఁ బోయి కూర్చుండి నౌకరును జూచి "మేము వచ్చుచున్నాము అని పరవతోఁ జెప్పిరమ్ము" అని వర్తమానము చెప్పెను. నౌకరుపోయి అట్లే చెప్పఁగా ఆమె "మీయజమానుఁడు ఇక్కడకు రానక్కరలేదు. తిన్నగ తిరువట్టూరికిఁబోయి సంకిలిపాద

సేవచేసికోవచ్చును" అని తిరస్కరించెను. అందులకు విచారభరితుఁడై సుందరమూర్తి ఈశ్వరునిఁ బ్రార్థించి, స్వామి సాక్షాత్కరింపఁగా "మహేశ్వరా, నీకుఁ దెలియనిది యేమియు లేదు. సకలభూతాంతర్యామివై యున్న నీకు పరవ నాయెడలఁ జూపిన తిరస్కారము తెలియనిదిగాదు. పరవను సుముఖురాలినిఁ జేయకపోయితివేని నేను బ్రతుకఁజాలను" అని విన్నవించెను. ఈశ్వరుఁడు భక్తుని యభీష్టమును నెఱవేర్పఁగోరి శైవ బ్రాహ్మణరూపముతోఁ బోయి సుందరమూర్తి స్థితిగతులు అన్నియు నెఱింగించి భక్తుని రక్షింపవలయునని చెప్పెను; గాని పరవ తిరస్కరించెను. తోడనే వల్మీకనాథుఁడు నిజరూపముతో నెదుట నిలిచి "ఏమిచెప్పెదవు?" అనియెను. పరవ భయభ్రాంతయై స్వామిపాదములు మీఁద వ్రాలి "క్షమింపుము. నీయాజ్ఞను ఎన్నఁడును జవదాఁటి ఎఱుఁగను" అని పాదములను బాష్పోదకముతోఁ గడిగెను. పరమేశ్వరుఁడు పరవను లేవనెత్తి భయము నొందని చెప్పి అంతర్హితుఁడు అయ్యెను.

వల్మీకనాథుఁడు సంగతి యంతయు నెఱింగింపఁగా సుందరమూర్తి పరమానందభరితుఁడై పరవ యింటికిఁ బోయెను. పరవయు నాతనికి నెంతో యాదరముతో స్వాగతమిచ్చి గౌరవించెను. సుందరమూర్తి పరవతో యథాపూర్వముగ ననంతసుఖములను బడయసాగెను.

ఒక గ్రామమున కలికామనాయనారు అను ఒక శివభక్తుఁడు ఉండెను. ఆతఁడు చాల గొప్పవాఁడు. సుందరమూర్తి పరమేశ్వరుని దూతకృత్యమునకు నియమించెనని విని క్రోధఘూర్ణితుఁడై సుందరమూర్తిని నిందింపసాగెను. సుందరమూర్తి అది తెలిసి "కలికామనాయనారు కోపమును బోఁగొట్టుము" అని వల్మీకనాథునిఁ బ్రార్థించెను. అంతట ఈశ్వరుఁడు కలికామనాయనారునకు తీవ్రమైన శూలరోగమును గలిగించి వృద్ధబ్రాహ్మణరూపముతో నతని చెంతకుఁ బోయి "దీనిని సుందరమూర్తినాయనారు నిర్మూలింపఁగలఁడు. ఆతనికిఁ దెలుపుము" అనిచెప్పెను; గాని ఆతఁడు "నేను పాపాత్ముఁడగు సుందరమూర్తినిఁ జూడఁజాలను" అని బదులు చెప్పెను. అంతట పరమేశ్వరుఁడు సుందరమూర్తిచెంతకు వచ్చి "నీవుపోయి కలికామనాయనారు శూలరోగమును నిర్మూలింపుము" అని నియమించెను. తోడనే సుందరమూర్తి "వైద్యము చేయుటకువచ్చుచున్నాను" అని వార్తనంపెను. ఆవార్త నాలకించి

కలికామనాయనారు "వీని మొగము చూడరాదు" అను సంకల్పముతోఁ బొడుచుకొని చనిపోయెను. ఇది తెలియనిసుందరమూర్తి తిన్నగ నటకుఁబోయి జరిగినది యెల్లయుఁ దెలిసికొని "ఇట్టి మహాత్ముఁడు చనిపోయె నిఁక నేనెందులకు?" అని పొడుచుకొనుటకు ఖడ్గమును ఎత్తెను. అంతట పరమశివుని అనుగ్రహమువలన కలికామనాయనారు జీవించి లేచి సుందరమూర్తిని బట్టుకొని ఆత్మహత్యనుండి మరలించెను. పిదప నొకరినొకరు కౌఁగిలించుకొని స్వామిసన్నిధికిఁబోయి ఎవరిగ్రామమునకు వారుపోయిరి. చేరదేశాధీశ్వరుఁడైన చేరమాన్ పెరుమాళ్ నాయనారు సుందరమూర్తినిఁ జాలదినములనుండి చూడవలయుననియున్నవాఁడు; గావున నొకనాఁడు బయలుదేఱి కనులాలయమునకుఁ బోయెను. అట వారిరువురును సమావేశమైనపుడు ఒకరినొకరు కౌఁగిలించుకొని శ్రీనమస్కారములు గావించుకొని ప్రియము నెఱపుకొని మహానందముతో వల్మీకనాథుని సన్నిధికిఁ బోయిరి. స్వామిని సేవించుట యైన తరువాత సుందరమూర్తి చేరమాన్ పెరుమాళ్ నాయనారును పరవ ఇంటికిఁ గొనిపోయి ఆతనికిని ఆతనిపరివారమునకును జాలదినములు విందుచేసి పిదప దివ్యక్షేత్రదర్శనమునకై చేరమాన్ పెరుమాళ్లతో బయలుదేఱి అనేకస్థలములు సేవించి అచ్చటచ్చట వివిధనామములతో వెలసియున్న పార్వతీపతిని సేవించి పద్యజాలములతో వినుతించిరి. తిరుచ్చ్ఛోళి అను స్థలమున సాంబుని పద్యములతోఁ బ్రస్తుతించుచుండఁగా ఈశ్వరుఁడు వృషభారూఢుఁడై వచ్చి "నేను ఉండునది ఇక్కడఁ గాదు. కానప్పేరున" అని చెప్పెను. పిదప సుందరమూర్తి చేరమాన్ పెరుమాళ్లుతోఁ గానప్పేరునకుఁ బోయి స్వామిని నుతించి రామేశ్వరము మున్నగు సకల దివ్యస్థలములను సేవించుకొని తుదకు కనులాలయము చేరుకొనెను.

ఇట కొన్నిదినములు గడచిన తరువాత చేరమాన్ పెరుమాళ్లు "మీరు మాయింటఁ గొన్నిదినములు వసించి నాకుటుంబమును పావనము సేయవలయు" నని ప్రార్థింపఁగా సుందరమూర్తి వల్లె యనెను. పిదపఇరువురును బయలుదేఱిపోవుచుండఁగా మార్గమున పంచనదము కాన్పించెను. చేరమాన్ పెరుమాళ్లు సుందరమూర్తినిజూచి "స్వామీ! నాహృదయము పంచనదమునకుఁ బోయి స్వామిని సేవింపఁగోరుచున్నది" అని చెప్పెను. మధ్యమున కావేరీనది కూలంకషమై ప్రవ

హించుచుండుటయు దానిని దాఁటుటకు దోనె మున్నగు సాధనములు ఏవియు లేకుండుటయుఁజూచి సుందరమూర్తి పరమేశ్వరుని ప్రార్థించెను. తోడనే కావేరి మార్గమును ఇచ్చెను. అచ్చట నున్నవారు అందఱునుఆశ్చర్యచకితులై తమప్రభావమును గొనియాడుచుండఁగా సుందరమూర్తియు చేరమాన్ పెరుమాళ్లును పంచనదమునకుఁబోయి స్వామిని సేవించుకొని అచ్చటచ్చటఁ గల పుణ్యక్షేత్రములను అన్నిఁటిని సేవించికొనిరి. చేరమాన్ పెరుమాళ్లు సుందరమూర్తితోఁ గూడ తన పట్టణముచేరుకొనెను. చేరమాన్ పెరుమాళ్లు మంత్రిసామంతాదులు మహావైభవముతో తమరాజును సుందరమూర్తిని నగరుప్రవేశపెట్టిరి. చేరమాన్ పెరుమాళ్లు సుందరమూర్తినిఁ దనఅంతఃపురమునవిడియించెను.

అచ్చట సుందరమూర్తికిఁ జాలగౌరవము జరిగెను. కొంతకాలము గడచిన తరువాత సుందరమూర్తి హృదయము వల్మీకనాథుని సేవింపఁ గోరసాగెను. ఈసంగతి నెఱింగించి సుందరమూర్తి పయనముకాఁగా చేరమాన్ పెరుమాళ్లు పోవలదని వారిని అనేకవిధములఁ బ్రార్థించెను; గాని ప్రయోజనము లేకపోయెను. అంతట పెరుమాళ్లు సుందరమూర్తి నాయనారును ఇంట నుంచిరండు అని పరిజనులకు రత్నాభరణాదులు అనేకములు ఇచ్చెను. వారిని ముందిడుకొని సుందరమూర్తి బయలుదేఱెను. మార్గమధ్యమున ఈశ్వరుఁడు కిరాతనాయకవేషమునుదాల్చి ప్రమథులను కిరాతులనుగాఁ జేసికొని వచ్చి పరిజనులచే సుందరమూర్తి కొనిపోవుచున్న రత్నాభరణాదులను గొల్లగొట్టించుకొనిపోయెను. అందులకు విచారింపక సుందరమూర్తి తిన్నగ నడచిపోయి తిరుమురుగంపూండి అనుగ్రామము తగులఁగా అందలి దేవాలయమునకుఁబోయి జరిగినదంతయు స్వామికి విన్నవింపఁగా ఈశ్వరుఁడు "నీ నిర్భీతచిత్తమునకు సంతసించితిని" అని ఆభరణములు అన్నియుఁ దెచ్చియిచ్చెను. పిదప అనేకపద్యములతో స్వామిని మఱల వినుతించి సుందరమూర్తిరత్నాభరణాదులను బట్టించుకొని మఱల బయలుదేఱి కమలాలయముచేరుకొని ఆభరణములు అన్నియుఁ బరవకు ఇచ్చి సుఖముగ నుండెను.

ఇట్లు కొంతకాలము జరిగినతరువాత మఱల పెరుమాళ్లనుజూడ వలయునని సుందరమూర్తికి తలంపు గలిగెను. పరవకు ధైర్యము చెప్పి

ఆవెంటనే ఆతఁడు బయలుదేఱెను. మార్గమధ్యమున నొక గ్రామములో ఒకయింట మంగళధ్వనులును ఒకయింట రోదనధ్వనులును మిన్నుముట్టుచుండెను. సుందరమూర్తి అందులకుఁ గారణమేమని అడుగఁగా దగ్గఱనున్న బ్రాహ్మణులు "ఈయింటివారి పిల్లవాఁడును ఆయింటివారి పిల్లవాఁడును ఒకనాఁడు చెఱువునకు స్నానమునకుఁ బోయిరి. కొంతసేపు ఈఁదులాడిన తరువాత అందొకబాలుని మొసలి ఎత్తుకొనిపోయెను. నేఁడు రెండవబాలునకు ఉపనయనము జరుగుచున్నది. చనిపోయిన బాలుని తలిదండ్రులు 'బ్రతికియున్నచో మనవానికిఁ గూడ నేఁడు ఉపనయనము చేసికొందుముగదా?' అని విచారించుచున్నారు" అని చెప్పిరి. అంతలో వారు అచ్చటకువచ్చి సుందరమూర్తికి నమస్కరించి "మహాత్మా, ఏలినవారి దర్శనమునకు రావలయునని తలంచుచుండఁగా మాకు ఇట్టి యాపదసంభవించినది. తుదకు మీరు మాగ్రామమునచ్చుదనుక మిమ్ముఁ జూడఁజాలకపోయితిమి" అని పలికిరి. అది విని సుందరమూర్తి ఇట్టి విపత్సమయములోఁ గూడ తనయెడల అట్టి భక్తిశ్రద్ధలు చూపుచున్న ఆదంపతుల జ్ఞానమునకు ఆనందించి "మీపిల్లవాఁడుచనిపోయిన చెఱువు చూపుఁడు" అని యడిగెను. తోడనే వారు నాయనారును అచ్చటకుఁ గొనిపోయిరి.

సుందరమూర్తి చెఱువుగట్టుమీఁదఁ గూరుచుండి ఈశ్వరుని ప్రార్థింపఁగా మొసలి ఆపిల్లవానిని దెచ్చి గట్టుమీఁదఁ బడవేసిపోయెను. నిద్రపోయి లేచినవానివలె ఆ బాలుఁడు నలుగెలఁకులఁ జూచి పోయి తల్లిదండ్రులను గాఁగిలించుకొనెను. తల్లిదండ్రులును మహానందభరితులై కుమారుని సుందరమూర్తిపాదములమీఁదఁ బడవేసి తామును వ్రాలి అనేకవిధములఁ గొనియాడి ఇంటికిఁ దీసికొనిపోయి చాల గౌరవించిరి. సుందరమూర్తి నాఁడే ఆబాలునకుఁగూడ ఉపనయనమును జేయించెను.

పిదప సుందరమూర్తి చేరమాన్ పెరుమాళ్లునగరమునకు బయలుదేఱెను. ఈవార్త వెంటనే అచ్చటఁ దెలిసిపోయెను. అంతట పెరుమాళ్లు మహావైభవముతో సుందరమూర్తినాయనారును దననగరమునకుఁ గొనిపోయెను. కొన్నిదినములు అచ్చట నుండి సుందరమూర్తి మహోదయమను గ్రామమునకుఁ బోయి అచ్చట సృత్తరూపముగ పర

మేశ్వరునిఁ బ్రార్థింపఁగాఁ గైలాసమున నిండుకొలువున్న మహేశ్వరుఁడు బ్రహ్మకును విష్ణువునకును "మీరు పోయి సుందరమూర్తిని తెల్ల యేనుఁగు మీఁదఁ గొనిరండు" అని యాజ్ఞాపించెను. వారును అట్లే మహోదయమునకుఁ బోయి సంగతియంతయు నెఱింగింపఁగా సుందరమూర్తి ఆనందముతో ఏనుఁగు నెక్కెను.

అందఱును బయలుదేఱిరి. సుందరమూర్తి "పెరుమాళ్లు నాతో రాకపోయెనే" యని అనుకొనుచుఁ బోవుచుండెను. అది తెలిసి పెరుమాళ్లు తన భద్రాశ్వము నధిరోహించి మహోదయమునకుఁ బోయి ఆకాశమునఁ బోవుచున్న సుందరమూర్తినిఁ జూచి తన గుఱ్ఱమునకుఁ జెవులో పంచాక్షరి నుపదేశించెను. తోడనే గుఱ్ఱము ఆకాశమునకు ఎగిరి సుందరమూర్తి అధిష్ఠించిన శ్వేతగజముతోఁ గలిసికొనెను. ఇది చూచి పెరుమాళ్లు నమ్మిన భటులు తమ ప్రభువు నిశ్చియుండఁ జాలక కత్తులతోఁ బొడుచుకొని వెంట బయలుదేఱిరి. కొంతసేపటికి వారందఱును కైలాసము చేరుకొనిరి. సుందరమూర్తి నిరభ్యంతరముగా లోపలకుఁ బోయెను. పెరుమాళ్లు పోవుటకు వీలు లేకయ్యె. పరమేశ్వరుఁడు సుందరమూర్తినిఁ గౌఁగిలించుకొని ఆదరించెను. సుందరమూర్తి కోరఁగా పరమేశ్వరుఁడు పెరుమాళ్లను లోనికిఁ గొనిరండు అని భటులకు ఆజ్ఞాపించి వచ్చిన తరువాత నాతనిని గణాధిపతులలో నొకనింగాఁ జేసెను. సుందరమూర్తి పరమేశ్వరుని యాదరము నొందుచుండెను.

---

85. నేత్రేశనాయనారు.

శ్లో. "బ్రహ్మైవాహమిదం జగచ్చ సకలం చిన్మాత్రవిస్తారితం
సర్వం చైతదవిద్యయా త్రిగుణయాశేషం మయా కల్పితం,
ఇత్థం యస్య దృఢా మతి స్సుఖతరే నిత్యే పరే నిర్మలే
చండాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురు రిత్యేషా మనీషా మమ."

(మ. పంచకము.)

తొండైనాడునందు ఉడుప్పూరు అను గ్రామమున నాగఁడు అను బోయఱేఁడు ఉండెను. ఆతని భార్య పేరు దత్త. వారికి ఏమిటను కొదువ లేదు; గాని సంతానములేని కొఱఁత అనివార్యమై యుండెను. ఆదంపతులు ఇరువురును తుదకు నిశ్చితమనస్కులై సుబ్రహ్మణ్యస్వామిని అనేక

విధముల నర్పింపసాగిరి. అగుట దత్తకొలఁదిదినములయందే గర్భవతియై నవమాసములు మోసి శుభముహూర్తమున నొకపుత్రునిఁ గనియెను. తలిదండ్రులు ఆబాలునకు తిన్నఁడు అని పేరుపెట్టి చాల గారాబముతోఁ బెంచుకొనుచుండిరి.

నాతఁడు యుక్తవయస్సునఁ దిన్ననికి విలువిద్య నేర్పింపఁదొడఁగెను. యౌవనము వచ్చునప్పటికిఁ దిన్నఁడు బోయలకు వలయు సకల విద్యలయందును జాణ యయ్యెను. అపుడు నాగఁడు తనకు ముసలితనము పూర్తిగ వచ్చుటనెఱింగి రాజ్యభారమును దిన్ననిపైనుంచెను.

ఒకనాఁడు తిన్నఁడు నాముఁడు, కాముఁడు అను నిరువురు సహచరులతోఁ వేఁటకుఁ బోయెను. వారు గొప్పజంతువులనిమిత్తము అరణ్యమంతయు వెదకుచుండఁగా నొకచో నొక పంది వారికంటఁ బడియెను. తోడనే తిన్నఁడు దానిని వెంబడించెను. ఒకటిరెండుగడియలలోఁ బందిఅలసటవలన ఏమైనఁ గానిమ్మని ఒక చెట్టుక్రిందఁ బడిపోయెను. తిన్నఁడు వెంటనే దానిని ఖడ్గముతో రెండుఖండములుచేసి చంపివేసెను. అప్పుడు నాముఁడును, కాముఁడును "దొరా! ఆఁకలి యధికముగానున్నది. సహించుట కష్టముగుచున్నది. దీనిని ఇచ్చట కాల్చికొని తిందము. సెలవు దయచేయుము" అని పలికిరి తిన్నఁడు అంగీకరించెను. అంతట తిన్నఁడు ముందునడువ నాముఁడును కాముఁడును బందిని మోసికొని అచ్చటకు సమీపమున నున్న సువర్ణముఖీనదీతీరమునకుఁ బోయిరి. అచ్చటకు కాళహస్తి పర్వతమును దానిమీఁది దేవాలయమును స్పష్టముగాఁ గాన్పించుచుండెను. తిన్నఁడు అది యేమని యడుగఁగా నాముఁడు "అది యొకపర్వతము. దానిమీఁద నున్నది గుడి. అందు దేవుఁడు ఉన్నాఁడు" అని పలికెను. "అట్లయిన నచ్చటికిఁబోయి చూచివత్తము ర"మ్మని తిన్నఁడు నామునితోఁ గూడ పర్వతముమీఁదికిఁ బోయెను. కాముఁడు పందిచెంతఁ గాపుండెను.

ఆలయద్వారములు తెఱచి లోపలకుఁ బోఁగా తిన్ననికి పుష్పములతోఁ బూజింపఁబడిన ఈశ్వరవిగ్రహము కంటఁబడెను. తోడనె ఆతని చిత్తవృత్తి జీవితము అంతయు మాఱిపోయెను. ఒక్కదూకున తిన్నఁడుపోయి ఈశ్వరవిగ్రహమును కౌఁగిలించుకొని "ఈశ్వరా! ఈమహారణ్యమధ్యమున నీవు ఒక్కఁడవు ఏల యుంటివి? నీకు ఆహారము ఎట్లు

"వచ్చుచున్నది?" అని యిట్లు చంటిపిల్లల నడిగినట్లు అడిగి "నాముఁడా! దేవుఁడు ఆఁకలిగొనియున్నాఁడు. ఆహారము తెత్తము రమ్ము" అని మఱలఁ గ్రిందికి బయలుదేఱెను. నాముఁడు అందులకు ఆశ్చర్యపడ సాగెను. తిన్నఁడు ఈశ్వరునివిడిచి ముందునకుఁ బోవుటకు సాహసింపఁ జాలక ఎట్లో పోయెను.

అప్పటి కప్పుడే కాముఁడు పందిని పరిశుభ్రముగఁ గాల్చియుంచెను. తిన్నఁడు మంచిమాంస మంతయుఁ దీసి తక్కినదానిని అవ్వలకుఁ బాఱజిమ్మివేసెను అదిచూచి కాముఁడు నిర్విణ్ణుఁడు కాఁగా నాముఁడు "మిత్రుఁడా! ఏమి చెప్పుదును ? మన యేలికకు మతి పోయినది. దేవునకుఁ బెట్టుటకై ఈమాంసము కొనిపోవుచున్నాఁడు" అని పలికెను. అందులకు మఱింత స్తబ్ధుఁడై కాముఁడు నామునివలెనే మాఱు పలుకక తేనివెంట బయలుదేఱిపోయెను. తిన్నఁడు ఈశ్వరపూజకుఁగాను పూవులుకోసి వానిని తన జుట్టున నుంచుకొనియు అభిషేకము సేయుటకు సువర్ణముఖీజలములను పుక్కిట నుంచుకొనియు మాంసమును జేతులతోఁ గైకొనియు ఆలయము ప్రవేశించెను.

నాముఁడును కాముఁడును తమయజమానుని పనులు అన్నియు అతిజాగ్రత్తతోఁ బరికించుచుండిరి. తిన్నఁడు తొలుత ఈశ్వరునిమీఁద నున్నపూవులను తన పాదరక్షలతో తొలఁగించి నోటిలోని నీటిని యుమిసి యభిషేకము గావించి "ఈశ్వరా, ఇది చాల మంచిమాంసము. ఇది యదృష్టపూర్వమగు నొక గొప్ప పందిమాంసము. స్వీకరింపవలయు" నని ప్రార్థించి "ఈశ్వరుని దొంగలు దోచుకొనిపోకుండుటకు సాయుధుఁడనై నేను ద్వారమునఁ గాపుండెదను" అని నిశ్చయించుకొని అట్లు చేసెను.

మఱునాఁడు తిన్నఁడు దేవునకు మాంసము తెచ్చుటకు వేఁకువజామున లేచి అరణ్యమునకుఁ బోయెను. మఱికొంతసేపటికి అనుదినమును కాళహస్తీశ్వరుని బూజించు మహాత్ముఁడగు శివకేసరి అర్చించుటకువచ్చి గర్భాలయమున మాంసపుముక్కలును, ఎముకలు నుండుటఁగాంచి తెల్లవోయి "ఇవి యిక్కడ కెట్లు వచ్చినవి?ఎవ రిచ్చుటకు వచ్చియిట్టి యనుచితకార్యములను జేయుచున్నారు?"అనిచాలసేపు వగచి తుదకు చేయునది లేక ఆలయమంతయు శుభ్రము చేసి అభిషేకము

చేసి వేదమంత్రములతో పూజించి కాళహస్తీశ్వరునకు నైవేద్యము చేసి ఆనందభరితాంతరంగుఁడై యింటికి వెడలిపోయెను.

ఇంతలో తిన్నఁడు నోట నీరును, శిరమునఁ బూలును, చేత మాంసమును ఇడుకొని వచ్చి విగ్రహామునీఁది పూలను తన పాదరక్షలతో తొలఁగించి నోటిలోని నీటితో నభిషేకించి మాంసమును ఎదుటనుంచి "దేవుఁడా, నేఁడు చాల మంచిమాంసము దొరకినది. మాకాముఁడు చక్కఁగా కాల్చినాఁడు. నేను కొఱికి రుచిచూచి తెచ్చితిని. నీవు అవశ్యము భుజింపవలయు నని ప్రార్థించి మఱల యథాపూర్వముగ క్రూరజంతువులు ఏమియు రాకుండఁ జేయుటకై బయటకుఁ బోయెను.

మఱునాఁడు మఱల నిట్లే జరిగెను. ఇట్లే అయిదాఱుదినములు గడచెను ఏడవనాఁడు తిన్నఁడు మాంసమునిమిత్తము అరణ్యమునకుఁ బోయినతరువాత శివకేసరి వచ్చి "ఈశ్వరా, నీవృత్తమంతయు విపరీతముగ నున్నది. ప్రతిదినమును ఎవరో కిరాతులు వచ్చి ఇచ్చట తమ చిత్తమువచ్చినట్లు అమాంగళ్యములు అన్నియుఁ జేయుచున్నారు. వాంత్రను ఎట్లు సైరించుచున్నావు?" అని పలుక ఈశ్వరుఁడు సాక్షాత్కరించి "వత్సా, నీకు సందేహాము వలదు. నాకు ఆఱుదినముల క్రిందట నొక బోయభక్తుఁడు లభించెను. ఆతని భక్తి యచంచలమై యున్నది భక్తిక్రీతుఁడ నగు నేను భక్తులు ఏమి సమర్పించినను స్వీకరింపవలయునుగదా! ఆతఁడు మాంసము నర్పించినను అది ఆతని చిత్తశుద్ధిప్రభావమువలన నాకు అమృతాయమానమైయున్నది. నీవు నాశిరమున నిడినపుష్పమున నాతఁడు తనపాదరక్షలతోఁ దొలఁగించుచున్నాఁడు. ఆకృత్యము బుడుతఁడు తలదన్నిన తండ్రికి ఎంత యానందముఁ గూర్చునో నాకు అట్లున్నది. నీవు ఇప్పుడు నావెనుక డాఁగియుండుము. ఆతని భక్తిని నీవుచూడఁగలవు" అని పలికెను. శివకేసరి ఆశ్చర్యచకితుఁడై అట్లే చేసెను

కొంతసేపటికి తిన్నఁడు యథాపూర్వముగ మాంసము జలము పూలు తెచ్చుచు ఆలయము బైటనుండియే దేవుని కంటినుండి రక్తము కారుచుండుటఁ గాంచి తటాలున లోనికివచ్చి పుష్పాదికముల నచ్చటఁ బాఱవేసి కంటి ననేకపర్యాయములు తుడిచెను; గాని ప్రయోజనము లేకపోయెను. తిన్నఁడు కొంతతడ వేమియుఁ దోఁచక స్తబ్ధుఁడైయుండి,

అంతలో బైటకుఁ బోయి అనేకమూలికలను దెచ్చి చికిత్స చేసెను; గాని వానివలనఁగూడ లాభము లేకపోయెను. అంత తిన్నఁడు "ఇది పని గాదు" అని తనకంటి నొకదానిని పెఱికి ఈశ్వరునికంటిమీఁదఁ బెట్టెను. తోడనే ఆకన్ను అతుకుకొనిపోయి రక్తధార కట్టుబడెను. గాని మఱల రెండవకన్ను స్రవింపసాగెను. తిన్నఁడు అది చూచి "నాకేమియు భయము లేదు. నాకు చికిత్స తెలిసియే యున్నది" అని యనుకొని రెండవకన్ను పెఱుకుకొనుటకు అమ్ము నెత్తి కంటిమీఁదఁ బెట్టెను. తోడనే ఈశ్వరుఁడు సాక్షాత్కరించి "నిలువుము కన్నప్పా, నీభక్తికి మెచ్చితిని. ఇంత నిశ్చలమైన భక్తి నే నిదివఱకుఁ జూచియెఱుఁగను. చాలఁగాలము పంచాగ్నిమధ్యమున నిలిచి తపస్సు చేసిన మునుల చిత్తముకంటె నీ చిత్తము అతిశుద్ధమైనది. నాహృదయమునకు సంపూర్ణానందము గలిగించినవాఁడవు నీవు ఒక్కఁడవే" అని ప్రశంసించెను. తోడనే దేవతలు పుష్పవర్షము గురిసిరి. గంధర్వులు పాడిరి. కిన్నరులు ఆడిరి. మునులు కొనియాడిరి. శివకేసరి ఆశ్చర్యచకితుఁ డయ్యెను. తిన్నని ఈశ్వరుఁడు కన్నప్పా యని పిలిచెను; గావున ఆతఁడు కన్నప్పనాయనారని పిలువబడెను. నేత్రేశనాయనారు అనునది సంస్కృతనామము.

---

86. అమర్నీతినాయనారు.

చోళదేశమున నొక గ్రామమున అమర్నీతినాయనారు అను నొకవైశ్యకులతిలకుఁడు ఉండెను. ఆతనియింటఁ గల ధనమును ఎవరును ఏవిధముగను లెక్కింపఁజాలరు. అతఁడు అంత ధనవంతుఁడు అయ్యును లోకసామాన్యమువలె ప్రవర్తింపక సదా పరమేశ్వరపాదములను స్మరించుచు సత్కార్యములను జేయుచు నుండెను. ఆతఁడు తిరునల్లూరు అనుక్షేత్రమున ఒకమఠమును గట్టించి అందు ఎందఱు శివభక్తులు వచ్చినను లేదనక అన్నవస్త్రముల నిచ్చి పూజించుచుండెను.

ఒకనాఁడు పరమశివుఁడు అమర్నీతినాయనారు చిత్తశుద్ధిని బరీక్షింపఁదలఁచి బ్రహ్మచారివేషముతో నచ్చట సాక్షాత్కరించెను. అమర్నీతినాయనారు బ్రహ్మచారిని అల్లంతదూరమునందే గాంచి భక్తిశ్రద్ధలతో ఎదురేఁగి అర్ఘ్యపాద్యము లిచ్చి తోడ్కొనివచ్చి సుహాదరముతో స్వాగత మిచ్చెను. బ్రహ్మచారి నీవు శివభక్తులనందఱను విశే

సాదరముతో కౌపీనాదికములు ఇచ్చి సన్మానించుచున్నా వని వని వచ్చితిని"అనియెను. అమర్నీతి అందులకు వినతుఁడై "స్వామీ, మీరు సెలవిచ్చినది యథార్థము. ఇచ్చట బ్రాహ్మణసమారాధనము అవిచ్ఛిన్నముగా జరుగుచున్నది. తామును ఇచ్చటనే భుజింపవచ్చును"అని ప్రార్థించెను. బ్రహ్మచారి వల్లె యని యంగీకరించి "నాచెంత పైగా రెండు కౌపీనములు ఉన్నవి. ఒకటి నీచెంత నుంచుము. నాకూడ నుండునది వర్షాదికములచేఁ దడిసిపోవునేని ఇది యుపయోగించు"మని ఒక కౌపీనమును ఇచ్చి స్నానార్థము కావేరికిఁ బోయెను.

అమర్నీతి ఆకౌపీనమును అతిభద్రమైన స్థలమున ఉంచి మఠియొక పనిమీఁదఁ బోయెను. స్నానమునకు వెడలిన బ్రహ్మచారి అమర్నీతి జాగ్రత్తపఱచిన కౌపీనమును మాయము చేసి తన చెంత నున్న కౌపీనమును తడిపి కొంచెము సేపటికి మఠమునకు వచ్చెను. వచ్చిన బ్రహ్మచారి అమర్నీతిని బిలిచి "నావద్ద నున్న కౌపీనము తడిసిపోయినది. నీకిచ్చినది తెమ్ము" అనఁగా అమర్నీతి తెచ్చుటకుఁ బోయి పెట్టినచోటఁ గానక మఠమంతయు, వెదకిగూడ గానక మ్లానాననుఁడై వచ్చి "స్వామీ, నాదురదృష్టమువలన దేవరవారు నాచేతికిచ్చిన కౌపీనము కాన్పింపకున్నది. మఱియొక కౌపీనము తెచ్చితిని. అది కోకలోనుండి గాని పంచెలోనుండి గాని చింపఁబడినదికాదు. ఇందులకే నేయఁబడినది." అని విన్నవించెను.

అది విని బ్రహ్మచారి క్రోధతామ్రాక్షుఁడై "నీసంగతి నాకుఁ దెలిసినది. భక్తులవద్ద నుండు మంచివస్తువులను హరించుటకే నీవు ఈమఠమును ఏర్పఱిచితివి; గాని అన్యము గాదు. నీవు కోమటి వని యెఱింగియు నేను మోసపోయితిని" అని గద్దించి పలికెను. అమర్నీతి నాయనారు గడగడవడఁకుచు "స్వామీ! ఆగ్రహపడవలదు. రత్నాభరణాదులు కోరినన్ని యొసంగెదను. పుచ్చుకొని నన్ను మన్నింపుఁడు" అని వేఁడుకొనఁగా బ్రహ్మచారి నాకు రత్నాభరణాదులు అక్కఱలేదు. నా కౌపీనమునకు సరియైన తూనికగల కౌపీనమును ఇమ్ము" అనియెను. అమర్నీతినాయనారు అందులకు అంగీకరించి త్రాసు తెచ్చి బ్రహ్మచారి యొద్దనున్న కౌపీనమును ఒక పళ్లెములో నుంచి తాను తెచ్చిన కౌపీనమును రెండవదానిలో నుంచెను; గాని మఠమునందున్న కౌపీనము

లను అన్నిటిని బెట్టినను సరిపోదయ్యెను. అంతట నాయనారు బ్రహ్మచారి యనుజ్ఞఁబడసి మఠమునఁగలసకలవస్త్రములను సకలాభరణములను ఉంచి యుఁ బ్రయోజనము గానక తుదకు "మేము నిక్కమైన శివభక్తుల మైతిమేని మాతో సరిపోవుగాక" యని పలికి పంచాక్షరిని జపించుచు తన కుమారునితోడను భార్యతోడను త్రాసులో నెక్కెను. తోడనే త్రాసు సరిగానిలిచెను. అపుడు ఈశ్వరుఁడు నిజస్వరూపముతో సాక్షాత్కరించి "వత్సా, నీభక్తినిఁ బరీక్షించుటకు ఈ బ్రహ్మచారివేషముతో వచ్చితిని. నీకంటె నాకు అంతరంగభక్తులు లే"రని చెప్పుచు చూచుచున్నవారందఱును అబ్బురపడుచుండ అమర్నీతినాయనారును, ఆతనికుమారుని భార్యను దనతోఁ గొనిపోయెను.

---

87. చండీశ్వర నాయనారు.

శ్లో. "తత్త్వన్నశ్వర మేవ విశ్వమఖిలం నిశ్చిత్య వాచా గురో
ర్నిత్యం బ్రహ్మ నిరంతరం విమృశతా నిర్వ్యాజశాంతాత్మనా,
భూతం భావిచ దుష్కృతం ప్రదహతా సంవిన్మయేపావకే
ప్రారబ్ధాయ సమర్పితం స్వవపురిత్యేషామనీషామమ." (మనీషాపంచకము.)

చోళదేశమున నొక గ్రామమున కాశ్యపసగోత్రుఁడగు యజ్ఞశర్మయను బ్రాహ్మణునకు పవిత్ర యను భార్యయందు విచారశర్మ యను కుమారుఁడు కలిగెను. విచారశర్మ కారణజన్ముఁడగుటచే అయిదుసంవత్సరములు నిండక పూర్వమే వేదవేదాంగములయందు అసామాన్యపండితుఁడయ్యెను; గాని ఈసంగతి యేరికినిఁ దెలియదు. ఏడవసంవత్సరమున యజ్ఞశర్మ కుమారునకు ఉపనయనముచేసి గురువుచెంగట విద్యాభ్యాసార్థము అప్పగించెను.

విచారశర్మ సంగతి యంతయు గురువుచెంగట వెల్లడియయ్యెను. గురువు సంతచెప్పుటకుఁ బ్రారంభింపఁబోవుచుండఁగనే ఆతఁడు వేదముల నన్నిటిని ఏకరువు పెట్టెను. పాఠము చెప్పుటకుఁ దలంచుచుండఁగనే శాస్త్రముల నన్నిటినిఁ జింతన చేసెను. ఇది చూచి గురువు నిర్విణ్ణుఁడై కొంతవడికిఁ దెలిసి "సరస్వతీపురుషావతారమవు. నీదర్శనమువలన నేను

ధన్యుఁడ నైతిని" అని విచారశర్మను కౌఁగిలించుకొని ఆనందబాష్పములతో నాతని మూర్ధము నభిషేకించెను.

విచారశర్మ సకలవిద్యల నెఱింగినవాఁడు అయినను గురుశుశ్రూషనిమిత్తము అచ్చటనే యుండెను. ఒకనాఁడు ఆతఁడు గురువునకు సమిత్కుశలు తెచ్చుటకు బయలు దేఱెను. మార్గమధ్యమున పశువులం బాలము తోలుకొనిపోవు పసులకాపరులు ఆతనితోఁ గలిసికొనిరి. కొంతదూరము పోవునప్పటికి అందొక యావు మందనుండి విడివడి పోయెను. పసులకాపరి వెంటనే పోయి కఱ్ఱ విఱుగునట్లు దానినిఁ జావమోది మఱల మందలోఁ గలిపెను. విచారశర్మ అదిచూచి "శివుని యాజ్ఞచే గోవులు భూలోకమున అవతరించినవి. వాని సర్వాంగముల యందును దేవతలు వసించియున్నారు. పంచగవ్యము శివునకు అభిషేకద్రవ్యము. గోమయము ఈశ్వరచిహ్నమగు విభూతికి మూలము. ఇట్టి పూజ్యములగు ఆవులకు ఎట్టి గతి పట్టెను?" అని చింతించి తటాలున వాని చెంతకుఁబోయి "మూర్ఖుఁడా! ఆవులను గొట్టి ఎందులకు పుట్టగతులు లేకుండఁ బోయెదవు? ఆవులను మేపుట మీవలనఁ గాదు. పొండు. నేనే వానిని మేపి యజమానుల కప్పగించుచుందును" అని పలికెను. వాండ్రు వల్లెయని పసులను విడిచిపోయిరి.

యజమానుల యనుజ్ఞను బొంది విచారశర్మ పశువులను మణ్ణియేటియొడ్డునకుఁ దోలుకొనిపోయి ఏపుగాఁ బెఱిగిన పచ్చికబయళ్లలో మేపుచు, నిర్మలములగు ఏటినీళ్లు త్రాగించుచు ఎండ తీక్ష్ణముగా నుండునపుడు చెట్లనీడలయందు విశ్రమింపఁజేయుచు, చక్కఁగాఁ గాపాడి సాయంత్రమునకు ఇండ్లకుఁ దోలుకొనిపోసాగెను. ఇట్లొక పక్షముదినములు గడచునప్పటికి ఆవులన్నియు బలిసి మనోహరముగ నుండెను. మఱియు శేరుపాలిచ్చు ఆవు నాలుగుశేర్ల పాలును, కుంచెఁడు పాలిచ్చు ఆవు నాల్గుకుంచముల పాలును ఈయసాగెను. ఈయద్భుతమును గాంచి పసులయజమానులు ఆశ్చర్యచకితులును, ఆనందకలితులునై విచారశర్మను అనేకవిధములఁ గొనియాడసాగిరి.

మఱియొక పక్షము గడచునప్పటికి ఆవులనువిడిచి విచారశర్మయు విచారశర్మను విడిచి ఆవులును ఉండఁజాలని స్థితి వచ్చెను. రాత్రియంతయు కొట్టములలోఁ గడపి మఱునాఁడు ప్రాతఃకాలమున విచారశర్మను

జూచిన వెంటనే ఆవుల కన్నిటికిని కనులనుండి బాష్పధారయు స్తనములనుండి క్షీరధారయు అవ్యాహతముగఁ గురియసాగెను. అదిచూచి శర్మ "ఈయావులకు క్షీరములు అధిక మగుచున్నవి. వ్యర్థముగా నేల పోనీయవలయును?" అని తలఁచి మణ్ణియేటియొడ్డున ఇసుకలింగము గావించి పూజింప నిశ్చయించుకొనెను. ఈనిశ్చయముతో నాతఁడు కడవలు తెచ్చి పొదుగులక్రింద నుంచి స్తనములను దాఁకిన వెంటనే క్షీరములు కురిసి క్షణములో కడవలు నిండిపోయెడివి. శర్మ ఆపాలతో ఆయిసుకలింగమునకు అభిషేకము గావించి వివిధములగు పత్రపుష్పములతోఁ బూజించి పాలనే నివేదించుచుండెడివాఁడు. ఈశ్వరుఁడు ఆయిసుకలింగమునందే సన్నిధిసేసి శర్మ పూజలు ఆనందముతో గ్రహింపసాగెను. ఆవులు అన్నియు కొట్టములు చేరినతోడనే యజమానులకు యథాపూర్వముగ పాలు ఇచ్చుచుండెడివి.

శివపూజ యీతీరునఁ గొన్నిదినములు జరిగినవెనుక విచారశర్మ యొకనాఁడు మణ్ణియేటియొడ్డున యథాపూర్వముగ పూజ గావించుచుండఁగా గ్రామస్థుఁ డొకఁడు చూచి సంగతిసందర్భములు గ్రహింపకయే గ్రామమునకుఁ బోయి "విచారశర్మ మీయావుల నన్నిటినిఁ బాలు పితికి ఆపాలను ఇసుకలోఁ బోసి యాడుకొనుచున్నాఁడు" అని చెప్పెను. బ్రాహ్మణులు ఇది విని యధికారి చెంతకుఁ బోయి ఫిర్యాదుచేసిరి. అధికారి విచారశర్మ తండ్రి యగు యజ్ఞదత్తుని రప్పించి "బ్రాహ్మణుల హోమధేనువుల పాలను పితికి నీ కుమారుఁడు ఇసుకలోఁ బోసి యాటలాడుచున్నాఁడు" అని మందలించిరి. ఇది విని యజ్ఞదత్తుఁడు విచారపూరితహృదయుఁడై విచారశర్మప్రవర్తనమును బరీక్షింపఁదలఁచి వెనుకనే పోయి అడవిలో నొకచోట డాఁగుకొనెను. విచారశర్మ యథాప్రకారము ఇసుకలింగము గావించి పాలు గైకొని పత్రపుష్పములను దెచ్చి పూజ ప్రారంభించెను. యజ్ఞదత్తుఁడు అది చూచి శర్మ తన కడుపుచెడఁ బుట్టెనని కోపఘూర్ణితహృదయుఁడై ఒక్కదూకున ముందునకు ఉఱికి చేతనున్న దుడ్డుకఱ్ఱతో "పాపము, నిర్భాగ్యుఁడా" యని పడమోది నానాదూషణవాక్యములనాడెను. విచారశర్మచిత్తముపరమశివునియందు లీనమైయుండుటచే నివియేవియు నాతనికిఁ దెలియవయ్యెను అదిచూచి యజ్ఞదత్తుఁడు తనకొడుకు మొండికెత్తెనని భావించి క్షీర

భాండములనువన్ని వేసెను. శర్మ అప్పటికిఁ దెలివొంది జరిగిన దంతయు గ్రహించి యజ్ఞదత్తుఁడు తన తండ్రియైనను శివాపరాధము గావించెను; గావున దండ్యుఁడని ఎదుట నున్న కఱ్ఱతీసి కాళ్లు విఱుగఁ గొట్టఁదలఁచి విసరఁగా అది ఖడ్గమై కాళ్లను నఱికివేసెను. వెంటనే పరమేశ్వరుఁడు ఉమాసహితముగ వృషభవాహనారూఢుఁడై సాక్షాత్కరించి విచారశర్మను అనేకవిధముల లాలించి "ఇఁక నేనే నీకుఁ దండ్రిని. నీకు చండీశ్వరత్వము నిచ్చితి" నని ఆదరించెను. వెంటనే దేవతలు పూలవాన గురిసిరి. వేదఘోషములు చెలరేఁగెను. శివగణములు నాట్యము చేసెను. శర్మ చండేశ్వరపదవి నధిష్ఠించెను. యజ్ఞదత్తుఁడు శివద్రోహముచేసినను చండీశ్వరనాయనారువలన దెబ్బతినియెను; గావున ఈశ్వరసాయుజ్యమును బడసెను.

---

88. నీలకంఠనాయనారు.

చిదంబరమున ఒక కులాలయువకుఁడు ఉండెను. ఆతఁడు సత్యనిరతుఁడు. శివపూజాధురంధరుఁడు. శివభక్తులను ఆదరించుటయందు అత్యాసక్తిగలవాఁడు. సంసారమున నుండియు ఆత్మానాత్మవివేకము గలిగి వర్తించువాఁడు. ఆతఁడు ప్రతిదినమును సంసారమునకు వలయు ధనము ఎన్నికుండలు అమ్మిన వచ్చునో అన్నికుండలనే చేసి విక్రయించి జీవించుచుండెను ఆతఁడు తఱచుగ పరమేశ్వరునకు నీలకంఠనామము వచ్చుటకుఁ గారణమైన క్షీరసాగరమథనగాథను అందఱకును జెప్పుచుండును. ఆకారణమువలన ఆతనికి తలిదండ్రులు పెట్టిన పేరు పోయి "నీలకంఠుఁడు" అని పేరు వచ్చెను.

ఒకనాఁటిరాత్రి నీలకంఠుఁడు ఒక వేశ్యయింటికిఁబోయి సుఖించి ప్రాతఃకాలమున నింటికి వచ్చెను. అతిబుద్ధిమంతురాలగు ఆతనిభార్య ఆసంగతి కనిపెట్టి అందులకు ఏమియు ననక యథాపూర్వముగ అన్నముపండి పెట్టి, రాత్రి ఆతనితోఁ గూడ ఒక గదియందే శయనించియు ఆతఁడు సంగమాపేక్షతో రాఁగా "వలనుపడదు" అని ఖండితముగాఁ బలికెను. నీలకంఠుఁడు 'ఈమె సరస మాడుచున్నది' అని తలంచి మందహాసముతో ఆమె చేయిపట్టుకొనుటకు సమీపింపఁగా ఆమె వెనుకకుఁ

బోయి "నన్ను తాకిన నీలకంఠుని పాదము ఆన" అని పలికెను. అది విని నీలకంఠుఁడు తొలుత రిచ్చవడి పిదప మాఱుపలుకక యొకచో నిశ్చింతతో శయనించెను. ఆమెయు మఱియొకచోట నిర్విచారముతోఁ బరుండెను.

అది మొదలుకొని వారు ఇరువురును ఒకరి నొకరు తాకక తక్కంగల సమస్తకార్యములను ఐకమత్యము గలిగి నిర్వర్తించు కొనుచు శివపూజ గావించుకొనుచుండిరి. వారికి ఒకరి నొకరు తాక వలయు నను సంకల్పమే లేకుండఁబోయెను. ఇట్లు చాలఁగాలము గడ చెను. వా రిరువురును గూడ వృద్ధులై పోయిరి. ఏ పొరపొచ్చెములును లేకుండఁగనే వారు ఇంతకాలమును గడపిరి. ఈదీర్ఘకాలములో వారు శివపూజను ఒక్కదినమున నైనను అశ్రద్ధచేయ లేదు. శివభక్తుల నా దరించుట మాన లేదు. కులవృత్తిని మాన లేదు; గాని వా రిరువురును ఒకరినొకరు తాఁకికొనరు అను సంగతిమాత్రము పరికిని దెలియదు.

పరమశివుఁడు వారినిఁ బరీక్షించి వారి మహిమమును లోకుల కందఱకును ఎఱుకపఱుపవలయు నని సంకల్పించి యొకనాఁడు శివ యోగివేషముతో వారియింటికి వచ్చెను. ఆదంపతులు ఇరువురును గూడ నాతని సత్కారరముతోఁ ఇంటిలోనికిఁ గొనిపోయి చాల గౌర వించి వినీతులై "నేఁడు మాయింట భిక్ష స్వీకరింపవలయు నని ప్రార్థిం చిరి. యోగి వారు కొంచెముసేపు బతిమాలిన తరువాత నందుల కం గీకరించి "ఈభిక్షాపాత్రమును నీవు జాగ్రత్తచేసి యుంపుము ఇది నా కు పరమాదరపాత్రమైనది. దీనినివిడిచి నేనుఉండఁజాలను. నీవు విశ్వా సపాత్రుఁడవుగాఁ గాన్పించుచున్నావు; కావున నీచేతి కిచ్చుచున్నాను. ఇది మృత్పాత్రమే యైనను కనకపాత్రముకంటెను మహార్హమైనది. రత్నములకంటెనుగూడ మూల్యమైనది. ఇది నాప్రాణపదము. జాగ్రత్త గాదాచుము అని ఇచ్చి స్నానము చేసివచ్చెద" నని చెప్పిపోయెను.

నీలకంఠుఁడు ఆపాత్రను అతిజాగ్రత్తయైనస్థలమున నుంచి యో గికి వలయు సకలపదార్థములను సేకరింపఁజొచ్చెను. యోగి ఒక గడియ యైనతరువాత ఆపాత్రను మాయముచేసి స్నానాదికమును నిర్వర్తిం చుకొని ఇంటికి వచ్చెను. నీలకంఠుఁడును ఆతనిభార్యయు యోగిని ఆద రముతోఁదీసికొనివచ్చి కూర్చుండఁబెట్టిరి. అపుడు యోగి పాత్రను

దెమ్మనఁగా నీలకంఠుఁడు లోనికిఁ బోయెను; గాని పాత్ర ఉంచినచోట లేకుండుటఁ గాంచి భయభ్రాంతుఁడై కాలుగాలిన పిల్లివలె ఇల్లంతయు పరువులెత్తుచు వెదకి ఎంతకును గాన్పింపకపోవుటచే విసిగి ఏమయినను సరియే యని యోగిచెంతకు వచ్చి చేతులు జోడించుకొని "క్షమింప వలెను. భిక్షాపాత్ర ఉంచినచోట లేదు. అంతటను వెదకితిని; గాని కాన్పింపదయ్యెను. ఏమయినదో తెలియదు. నాభార్యగూడ వెదకినది. క్షమించి మమ్ము రక్షింపవలయును. ఆజ్ఞయిచ్చితిరేని తమ చిత్తము వచ్చిన పాత్రను క్షణములోఁ దయారుచేసి యిచ్చెదను" అని యనేక విధములఁ బ్రార్థించెను.

అదివిని యోగి క్రోధతామ్రాక్షుఁడై "నీవు బుద్ధిపూర్వకముగ నాభిక్షాపాత్రమును హరించితివి. నీవు శివపూజాధురంధరుఁడ వనియు, శివభక్తుల నారాధించు సత్పురుషుఁడవనియు విని వచ్చి మోసపోయితిని. నీవు కోటిపాత్రలను జేసియిచ్చినను దానికి సరిరావు. పదికోట్ల సువర్ణ పాత్రములైనను నేను పుచ్చుకొనువాఁడను కాను. నీవు ఎఱుఁగ నను చున్నావు; గావున నీభార్యచేతిని బట్టుకొని గుండములో దిగి స్నానము చేసి వచ్చి సత్యము పలుకుము. అట్లయిన నిన్ను క్షమింతును"అనియెను. నీలకంఠుఁడు మఱల నాతని పాదములమీఁద వ్రాలి "మహాత్మా! తమ యాజ్ఞకు ఎదుగునభ్యంతరము లేదు; గాని కొండొకకారణమువలన నేను నాభార్యను దాఁకను. నే నొక్కఁడను స్నానము చేసి సత్యము పలికెదను" అని ప్రత్యుత్తర మిచ్చెను. యోగి అందులకు అంగీకరింపక "నీపని యిట్లు గాదు. చిదంబరమునందలి బ్రాహ్మణుల సభలో నీవిష యము తెలిపెద"నని యోగి బయలుదేఱెను. నీలకంఠుఁడు నిశ్చింతతో నాతని వెంబడించెను. యోగి చెప్పిన దంతయు విని బ్రాహ్మణులు 'వారి భిక్షాపాత్రను ఇమ్ము. లేకున్న వారు నియమించినట్లు భార్యచేతిని బట్టు కొని గుండములో మునిగి శపథము సేయుము' అని చెప్పిరి. నీలకంఠుఁడు మాఱువలుకక భార్యను రప్పించి ఒక వెదురుతెచ్చి ఒక కొన భార్య కిచ్చి రెండవకొన తాను పట్టుకొని గుండములో దిగఁబోయెను. గాని యోగి అందులకు అంగీకరింపక 'వెదురు వలదు. ఒకరిచేతి నొకరు పట్టుకొనవలయు'నని యఱచెను. అపుడునీలకంఠుఁడు "ఇఁకఁదాఁచుట వలనఁ బ్రయోజనములేదు" అని నిశ్చయించుకొని తమ శపథకారణ

మును బహిరంగముగ నుపన్యసించెను. అది విని అందఱు నాశ్చర్యపడి చూడఁగా నచ్చట యోగి కాన్పింపఁడయ్యెను ఇంతలో ఆకాశమునుండి యొక్కమాట వినఁబడియెను. పైకిఁజూడఁగా ఉమాసహితుఁడగు శంకరుఁడు వృషభారూఢుఁడై ఆకసమున నిలిచి "నీలకంఠా! నీవు నిక్కముగ నాభక్తుఁడవు. నీభార్య నాభక్తురాలు" అని అందఱును జూచు చుండ నీలకంఠుని ఆతనిభార్యను జేతులతో నెత్తి వృషభముమీఁద నెక్కించుకొని కైలాసమునకుఁ బోయెను. అచ్చటివా రెల్లరును నీలకంఠునియొక్కయు ఆతనిభార్యయొక్కయు శివభక్తికిని శివుని భక్తపరతంత్రతకును అబ్బురపడుచు వెడలిపోయిరి.

---

89. జ్ఞానసంబంధమూర్తినాయనారు.

శ్లో. "ప్రాతస్స్మరామి హృదిసంస్ఫురదాత్మతత్వం
సచ్చిత్సుఖం పరమహంసగతిం తురీయం,
యత్స్వప్నజాగరసుషుప్తి మవైతి నిత్యం
తద్బ్రహ్మ నిష్కళ మహంనచ భూతసంఘః."

(ప్రాతఃస్మరణత్రయము.)

చోళదేశమునందలి శియ్యాళి అనుస్థలమున నొకగ్రామమునందు శివపాదహృదయుఁడు అను నొక బ్రాహ్మణుఁడు ఉండెను. ఆతనికి భగవతి యను భార్య కలదు. వారిరువురును సర్వకాలసర్వావస్థలయందును భక్తిశ్రద్ధలతో పరమశివునిఁ గొలుచుచునుండిరి. వారికి సాంసారికమగు విచారము తక్క మఱియేవిచారమును లేదు. అగుటచే వారు అందులకై చిరకాలము వేచియుండియు ఫలము గానక ద్రోణీశ్వరుని బృహినాయికను గొలువసాగిరి.

కొలఁదిదినములు గడచునప్పటికి భగవతి గర్భవతియయి నవమాసములు మోసి చక్కని కుమారునిఁ గనియెను. యుక్తసమయమున శివపాదహృదయుఁడు కుమారునకు జాతకర్మాదికమును నెఱవేర్చి చాల గారాబముతోఁ జూడసాగెను. శిశువు పరమశివుఁడు తన్ను భూలోకమున పుట్టించినందులకు మిగుల వగచుచు తఱుచు అంబా యని ఏడువసాగెను. ఒకనాఁడు శివపాదుఁడు కుమారుని ఇంటనుంచి స్నానమాడు

టకై తటాకమునకుఁ బోయెను. బాలుఁడు వెంటఁబడియెను. అది చూచి శివపాదుఁడు బాలుని బుజముమీఁద నెక్కించుకొనిపోయి తీరమునఁ గూర్చుండఁబెట్టి తాను తటాకమున దిగెను. కుమారుఁడు శివవియోగమును సైపఁజాలక అంబా యని ఏడువఁదొడఁగెను. అది చూచి సహింపఁజాలక పరమేశ్వరుఁడు పార్వతితోఁగూడ నచ్చటకు వచ్చి పార్వతిచే బాలునకు పాలు ఇప్పించెను తాను లాలించెను. ఇంతలో శివపాదుఁడు స్నానము చేసి పరమశివుని ధ్యానించి పరమశివుఁడు వచ్చి బాలుని లాలించుట మున్నగునవి ఎఱింగి పైకి వచ్చి "వత్సా' నీకిపుడు పాలిచ్చినవారు ఎవరో చూపుమనియెను. బాలుఁడు వ్రేలితో పైకిఁ జూపఁగా నచ్చట పార్వతీపరమేశ్వరులు వృషభవాహనారూఢులై యుండిరి. అపుడు బాలుఁడు వేదసారమును ఎఱింగి లోకులుజ్జీవింపవలయు నని తలంచి ద్రవిడభాషలో వృత్తరూపముగా విరచించెను. అది చూచి అందఱును ఆశ్చర్యపడిరి. దేవతలు పుష్పవర్షము గురిసిరి. బాలునకు జ్ఞానసంబంధమూర్తి అని పేరు కలిగెను. అపుడు పార్వతీపరమేశ్వరులు ద్రోవికిఁబోయిరి జ్ఞానసంబంధమూర్తినాయనారు వెంట బయలు దేఱెను శివపాదుఁడు ఈయద్భుతమును గాంచి ఆశ్చర్యచకితుఁడై పరమేశ్వరుని వినుతించుచు వెనుక బయలు దేఱెను. బ్రాహ్మణులు అందఱును అబ్బురపాటుతో నితరము తెలియక అట్లే యుండిరి. జ్ఞానసంబంధుఁడు కొంతసేపు పరమశివుని వినుతించి ఇంటికి మఱలఁగా శివపాదుఁడు ఆతని నెత్తుకొని బయలుదేఱెను.

తరువాత నాయనారు అనేకబ్రాహ్మణుల ప్రార్థనముమీఁద తిరువనిప్పళ్ళి, తలచ్చంగాడు, తిరువలంపురం, పల్లవనీశ్వరం, తిరుచ్చాక్కాడు, తిరువెణ్కాడు, తిరుముల్లైవాయిల్ మొదలగు వివిధస్థలములకుఁ బోయి అందందు వెలసియున్న పరమశివుని వృత్తజాలంబులతో వినుతించి, మఱల స్వస్థలము చేరుకొనెను.

నీలకంఠయాప్పాణుఁడు అను గాయకుఁడు భార్యయగువిరవితోఁ గూడ నాయనారును సేవించుటకు బయలుదేఱెను. నాయనారు ఎదురు చనఁగా పాణుఁడు సాష్టాంగనమస్కారములు ఆచరించెను. పిదప ముప్వురును దేవాలయమునకుఁ బోయిరి. నాయనారు తాను రచించిన కొన్నివృత్తములను పాడఁగా పాణుఁడు వానిని వీణమీఁద వాయించి

"స్వామీ, మీరు రచించిన వృత్తములను వీణియమీఁద వాయించు టకు నాకు అనుజ్ఞనీయవలయును" అని ప్రార్థించెను. నాయనారు అం దులకు అంగీకరించెను పాణుఁడు అదిమొదలు ఆవృత్తముల నన్నిటిని వీణమీఁద పాడుచు లోకులను ఆనందింపఁజేయుచుండెను.

నాయనారు నటనసభాపతిని సేవింపవలయు నని చిదంబరము నకుఁ బోయెను. అచ్చట అర్చకులు, బ్రాహ్మణులు మున్నగువారునా యనారును జాలగౌరవించిరి. పిదప నాయనారు భగవత్సన్నిధికిఁ బో యి వృత్తములతో వినుతింపఁగా పాణుఁడు వానిని అన్నిటిని వీణమీఁ దవాయించి, నాయనారును ప్రార్థించి తన జన్మస్థల మగు తిరువెక్క త్తంపులియూరునకుఁ గొనిపోయెను.

నాయనారు, తండ్రి భుజములు నొప్పివలన బాధపడుచుండుటఁ గాంచి తప్పటడుగు లిడుచు నడువఁదొడఁగెను. మారణపాడి అను గ్రామమునకుఁ బోవుచుండఁగా మార్గమధ్యమున నొకయూరిచెంత నాతని కాళ్లు నొప్పి మెత్తెను. అప్పటికి సాయంత్రము అగుటచే వా రాయూరున మకాము చేసిరి.

నాఁటిరాత్రి పరమశివుఁడు మారణపాడిలో నున్న బ్రాహ్మణులకు స్వప్నమున సాక్షాత్కరించి "ఇక్కడకు జ్ఞానసంబంధమూర్తినాయనా రు వచ్చుచున్నాఁడు. ఆలయములో ముత్యాలగొడుగు, పల్లకి మున్న గునవి కలవు. వానిని గొనిపోయి నాయనారును గొనిరండు" అని చెప్పి ఇక్కడ నాయనారునకుఁ గూడ స్వప్నమున "మారణపాడిబ్రాహ్మణు లు ముత్యాలపాలకి మున్నగునవి తెచ్చుచున్నారు. వానిలోఁ బొమ్ము" అని ఆజ్ఞాపించెను. మఱునాఁడు ఉదయము నాయనారు అనుచరులకు స్వప్నవృత్తాంతము నెఱింగించి బయలుదేఱి కొంతదూరము పోవున ప్పటికి బ్రాహ్మణులు ఎదురువచ్చి పల్లకిలో గూర్చుండఁజేసి మహావైభవ ముతోఁగొనిపోయిరి. నాయనారు అచ్చట స్వామిని సేవించి వృత్తము లతో వినుతించుచు కొన్నిదినములు ఉండి, అక్కడ నుండి బయలుదేఱి, తిరునెల్వెణ్ణై, తిరుప్పళువూరు, తిరుచ్చేంజలూరు, తిరుప్పనందాళ్, ము న్నగుశివక్షేత్రములను దర్శించి స్వామిని పూజించి వృత్తజాలములను గుఱిపించి తుదకు స్వస్థలము చేరుకొనెను. ఆతని తల్లి యగు భగవతి మిగుల నానందించెను.

శివపాదుఁడు యుక్తసమయమున కుమారునకు ఉపనయనము గావించి, వేదములను జెప్పుటకు గురువు నేర్పఱిచెను. నాయనారు వేదవేదాంగములను సమస్తకళలను అతిస్వల్పకాలమునందే అభ్యసించెను. అనేకబ్రాహ్మణులు వచ్చి అనేకసందేహముల దీర్చుకొని నాయనారు పరమశివుని అపరావతార మని వినుతించుచుండిరి. వాగీశనాయనారు జ్ఞానసంబంధుని మహిమ విని సేవించుటకు వచ్చెను. నాయనారు ఎదురుపోయెను. పిదప నిరువురు స్వామిసన్నిధికిఁబోయి సేవించి ఇంటికి వచ్చిరి. వాగీశుఁడు జ్ఞానసంబంధునియింట కొంతకాలము ఉండి, వృత్తములతో నాతనిని వినుతించెను. పాణుఁడు ఆవృత్తములను వీణమీఁద వాయించి అందఱకును ఆనందము గలిగించెను.

ఒకనాఁడు జ్ఞానసంబంధుఁడు భక్తులు, బ్రాహ్మణులు మున్నగువారు అనేకులు పరివేష్టించియుండఁగా "ఈ ద్రావిడదేశమునఁ గల సకలక్షేత్రములను దర్శించి అచ్చటచ్చట వెలసియున్న పరమశివుని సేవింప బయలుదేఱుచున్నాను" అని చెప్పెను. అదివిని శివపాదుఁడు, "కుమారా, నేను నిన్ను అనేకవ్రతములుచేసి కంటిని. లేకలేక వరప్రసాదమునఁ గలిగిన నిన్ను విడచి నేను ఎట్లు ఇక్కడ నుండగలను కావున నీతో నేనుగూడ వచ్చెదను. గొనిపొమ్ము" అని యడుగఁగా నాయనారు అందులకు సమ్మతించెను. అంతట నొక శుభదినమున అందఱును బయలుదేఱిరి. తొలుత వారు కావేరీనదికి ఉత్తరమునఁగల శివక్షేత్రములను సేవించిరి. నాయనారు తిరుప్పాచ్చిలాశ్రమము చేరువగాఁ బోవుచుండఁగా నొకరాజు వచ్చి పాదములమీఁదఁ వ్రాలి "మహానుభావా, నాకు లేకలేక ఒక్క కొమార్త గలిగినది. యౌవనముతోఁగూడ నామె నొక పిశాచము ఆవహించెను. ఎందఱో మంత్రవాదులు వచ్చిరి; గాని ఏమియుఁ బ్రయోజనము కలుగదయ్యెను. అంతట నేను విసిగి స్వామిసన్నిధికి నాకొమార్తను బంపివేసితిని; గాని ఇంతవఱకును ఆమెపై స్వామికి అనుగ్రహము కలుగలేదు. ఇంకను ఆమె అట్లే పీడితయగుచున్నది. దేవరవారువచ్చి నాకొమార్తను నన్ను కరుణింపవలయును" అని బహుభంగుల ప్రార్థించెను. రాజు దైన్యమునుజూచి నాయనారు అంగీకరించెను. రాజాజ్ఞచే రాజపురుషులు క్షణములో పట్టణమును శృంగారించి మహావైభవముతో ఎదురువచ్చి నాయనారును గొనిపోయిరి.

నాయనారు అక్కడకు వెళ్లునప్పటికి రాజుకొమార్తె క్రిందఁబడి దొరలుచుండెను. ఆమెను జూచి నాయనారు దయార్ద్రహృదయుఁడై "రాజపుత్రికను గరుణింపు"మని నృత్తజాలములతో స్వామిని వినుతించెను. వినుతి పూర్తియగునప్పటికి రాచకన్నె నిద్రించి లేచినదానివలె లేచి తండ్రి చెంతకుఁ బోయి కౌఁగిలించుకొనియెను. రాజు పరమానందభరితుఁడై నాయనారునకు తాను మ్రొక్కి కొమార్తచేత మ్రొక్కించి చాల వినుతించెను. నాయనారు అక్కడనుండి యనేకశివస్థలములను దర్శించి కొడిమాడచెంగున్నూరికిఁ బోయెను. అచ్చటఁ గూడ నచ్చినవారికి అందఱకును జ్వరములు ప్రారంభించి చాల బాధపెట్టెను. అంతట నాయనారు స్వామిని నృత్తజాలములతో ప్రార్థింపఁగా వారు నిరామయులగుటయేగాక దేశమునందలి రోగములు అన్నియుఁ గూడ నిర్ధూమధామములయిపోయెను. నాయనారు అక్కడనుండి చోళదేశమునకు దారితీసెను.

నాయనారు తొలుత త్రిశిరపురము (తిరుచునాపల్లి), జంబుకేశ్వరము మొదలగు స్థలములను దర్శించుకొని తరువాత తిరుపలంజులి భట్టీశ్వరములకుఁ బోయెను. నాయనారు ఎండవలన బాధపడుచుండుటఁ జూచి ఒక శివభూతము ముత్యాలగొడుగును తెచ్చి ఆకసమున నిలిచి పరమశివుఁడు నన్ను బంపెనని చెప్పెను. ఆమాట విని కూడనున్నవారందఱును నాయనారుమహిమను సన్నుతించిరి. అక్కడనుండి అందఱును తిరువరైయూరుమీఁదుగా తిరువావడుదురై గ్రామమునకు వచ్చిరి. అచ్చట శివపాదుఁడు "కుమారా, నేను యాగము చేయు కాలము సమీపించినది. ధనము కావలయును" అని చెప్పెను. అంతట నాయనారు పరమశివుని వినుతింపఁగా నొక శివభూతము అనంతధనము తెచ్చి ఎదుటనుంచి "పరమశివుఁడు ఈధనమును పంపె" నని చెప్పెను. ఆధనముతో శివపాదుఁడు మహావైభవముతో యాగము చేసెను.

అందఱును మాయూరము మున్నగు క్షేత్రములను సేవించి నీలకంఠయాప్పాణుని తల్లి పుట్టినిల్లుగల ధర్మపురమును జేరిరి. పాణుని బంధువులు అందఱును ఎదురువచ్చి మహావైభవముతో గ్రామమునకుఁ దోడుకొనిపోయిరి. పాణుఁడు అక్కడ నాయనారుచేసిన నృత్తములను వీణెమీఁద వాయించి అందఱ నానందపెట్టెను. నాయనారు అక్కడనుండి బయలుదేఱి తిరుచ్చాత్తమంగమునకుఁ బోయి అచ్చట

నాయనారునింట విందు కుడిచి పిదప తిరునాగక్కారోణగ్రామమునకును తిరుచ్చెంగాట్టంగుడికిని బోయి అందు చిఱుత్తొండనాయనారునింట విందు కుడిచి ఆతనిని వృత్తములతో వినుతించి వానిని పాణునిచే వీణియమీఁద వాయింపించెను. అక్కడనుండి తిరుమరుగలమను స్థలమునకుఁ బోయిరి. నాయనారు దేవాలయమునకుఁ బోవునప్పటికి ఒక కోమటి పాము కఱువఁగా చనిపోయెను. అందులకు అతనితో నున్న యువతి ప్రక్కనుబడి ఏడ్చుచుండెను. అనేక విషవైద్యులు వచ్చి పని చేసిరి; గాని ప్రయోజనము కలుగకయ్యెను. నాయనారు వచ్చి సంగతి ఏమని యడుగఁగా "స్వామీ, ధాముఁడు అను నాతండ్రికి మేము ఏడుగురము కొమార్తెలము. మాతండ్రి నీకు నాకొమార్తెనిచ్చెద" నని సర్వదష్టుఁడైన ఈతనిని ఆశపెట్టి దుర్బుద్ధియై అన్నమాట చెల్లింపక మాపెద్ద అక్కను మఱియొకనికిఇచ్చి పెండ్లిచేసెను. ఈతఁడు "ఇదినీకు ధర్మము కాదనఁగా నాతండ్రి రెండవపిల్ల నిచ్చెద" నని చెప్పి మరల మోసము చేసి ఆమనుగూడ మఱియొకనికి ఇచ్చెను నాతండ్రి తుదకు నిర్దయుఁడై ఈతనికి ఆశపెట్టియు నా అక్కలనాలుగురను అట్లు ఇతరులకేఇచ్చి పెండ్లిచేసెను. తుదకు నన్నిచ్చెద ననియెను. ఇంటివద్దనున్నచో నన్నుగూడ నన్యునకు ఇచ్చునని భయపడి నేను ఈతనిం బెండ్లియాడఁ దలఁచి ఈతనితో ఇలువెడలివచ్చితిని ఇక్కడ నీతఁడు ఇట్లయ్యెను" అని ఘోరముగా విలపింపసాగెను అంతట నాయనారు ఆమెను విలపింప వలదని చెప్పి మృత్యుంజయుని వృత్తజాలముతో వినుతింపఁగా ఆ వైశ్యుఁడు లేచి కూర్చుండెను. ఆకన్యకవలన సంగతి యంతయు విని ఆవైశ్యుఁడు పరమభక్తితో నమస్కరించెను నాయనారు వారిని ఆశీర్వదించి వధూవరులై మెలంగుఁడు అని హితోపదేశము గావించిఅక్కడ నుండి బయలుదేఱి తిరుప్పుగలూరు సమీపమునఁ బోవుచుండెను. అప్పుడు మురుగనాయనారు అను నాతఁడు వచ్చి సవైభవముగాఁ దీసికొనిపోయెను. అంతట వాగీశనాయనారు తిరువాలూరును సేవించుకొని వచ్చుచున్నాఁడని కలకలం బుప్పతిల్లెను. జ్ఞానసంబంధుఁడు ఆతనికి ఎదురుగఁబోయెను. ఇరువురును గలిసికొనిరి. ఒకరినొకరు వందనస్తోత్రాదులచే గారవించుకొనుట యైనతరువాత వాగీశునిచేతిరువాలూరి వైభవమును విని జ్ఞానసంబంధుఁడు అచ్చటికిఁ బోయికొన్నిదినములు వల్మీక

నాథుని సేవించి మఱల వాగీశునిచెంతకు వచ్చెను. అక్కడకు నీలక్క నాయనారును చిరుతొండరనాయనారును వచ్చిరి. అందఱును మహానందముతో కాలము గడుపసాగిరి.

ఇట్లు కొన్నిదినములు జరిగినతరువాత వాగీశనాయనారును, జ్ఞానసంబంధనాయనారును, మురుగనాయనారును అక్కడనుండ నియమించి, నీలక్కనాయనారును చిరుతొండనాయనారునుస్వస్థలములకుం బో నియమించి, తాము అక్కడగల సకలశివక్షేత్రములను సేవించుటకు బయలుదేరిరి. తొలుత నాటి తిరువంబరమునకుం బోయి అక్కడనుండి తిరుకడయూరికిం బోయిరి. అచ్చట వారిని గుగ్గులుకలశనాయనారు ఎదురువచ్చి తిరువరట్టానమునకుం గొనిపోయి తనయింట విందు పెట్టెను. అచ్చట వారు ఇరువురును చెరియొకమఠమునందును తమ తమ శిష్యులతో నివసించిరి.

శియాళినుండి కొందఱు బ్రాహ్మణులు వచ్చి దయచేయవలయునని ప్రార్థించిరి. అందులకుజ్ఞానసంబంధుఁడు స్వామి సెలవు పుచ్చుకొని వచ్చెదనని చెప్పి దర్శించి ప్రార్థింపఁగా నారాత్రి శ్రోణీశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి "నీయిచ్చవచ్చినట్లుపోయి క్షేత్రములను సేవించుకొనుము" అని సెలవిచ్చెను. మఱునాఁడు సంబంధుఁడు బ్రాహ్మణులను పిలిచి శివక్షేత్రములను సేవింపఁ దోణీశ్వరుఁడు అనుజ్ఞ నిచ్చెను. మీరు పొండు అని చెప్పెను. వారు వెడలిపోయిరి. వాగీశుఁడును సంబంధుఁడునుతిరువీళిమిళలగ్రామమునందుండఁగా ఘోరమైనక్షామము సంభవించెను. జనసామాన్యమే గాక శివభక్తులుగూడ లెక్కలేనంతమందిచనిపోసాగిరి. అదిచూచి నాయనారులు ఇరువురునుసహింపలేక స్వామసన్నిధికేఁబోయి ప్రార్థింపఁగా దర్శన మిచ్చి "ఈక్షామము పోవునంతవఱకు నేను ధనమిచ్చెదను. దానితో మీరు అన్నార్తులను రక్షింపుఁడు" అని ఆనతిచ్చెను. వాగీశునకు పడమటి బలిపీఠమునందును, సంబంధునకు తూర్పుబలిపీఠమునందును అసంఖ్యధనము దొరకెను. అంత నిరువురును నిరంతరాన్నదానము ప్రారంభించిరి;గాని వాగీశుని మఠమునందువలె సంబంధుని మఠమున సంతతము నన్నము లభింపదయ్యెను. సంబంధుఁడు కారణ మేమని పరివారమునుఅడుగఁగా "స్వామీ, వాగీశులు ఇచ్చునాణెములు త్వరగా మాఱుచున్నవి.

మీరు ఇచ్చిన నాణెములు మారక మిచ్చి బతిమాలిన గాని ఎవరును పుచ్చుకొనుట లేదు. ఈకారణమువలన మనకు సామానులు వెంట వెంటనే సమకూడుట లేదు" అని చెప్పిరి. సంబంధుఁడు అపుడు "వాగీశుఁడు మహానుభావుఁడు. అతనితో నేను సాటియా?" అను కొని తన మొహిరీలుగూడ ఏఆటంకములును లేకుండ మారునట్లు అనుగ్రహింపవలయునని వృత్తజాలముతో పరమశివుని వినుతించెను. తోడనే అట్లయ్యెను. అప్పటినుండియు వాగీశుని మఠమునందును, సంబంధుని మఠమునందును సమానముగ అన్నదానము జరుగ సాగెను.

కొన్నిదినములకు క్షామము తొలఁగిపోయెను. నాయనారులు ఇరువురును శివక్షేత్రములను దర్శించుకొనుచు వేదారణ్యమునకు వచ్చిరి. అచ్చట వేదారణ్యేశ్వరస్వామి ఆలయద్వారము వేదము లర్చించినదినముమొదలు మూసికొనిపోయియుండుటచే భక్తులు మఱియొక ద్వారమును ఏర్పాటు చేసికొనిరి. సంబంధుఁడు అది చూచి వాగీశునితో "మహానుభావా, మనము ఆద్వారమున లోనికిఁ బోవుట తగదు; ఈద్వారము తెఱవఁబడునట్లు దేవరవారు వృత్తజాలముతో వినుతింపవలయు" నని కోరెను. వాగీశుఁడు అట్లే చేయఁగా తోడనే తలుపులు తెఱువఁబడెను. "వారిరువురును కైలాసమునుండి వచ్చిన మహానుభావులు" అని భక్తులు ఎల్లరును తలంచిరి. కొంతసేపటికి సేవ ముగియఁగా వారిరువురును ఇవ్వలకు వచ్చిరి. వాగీశుఁడు "తలుపులు మూయఁబడునట్లు దేవరవారు ప్రార్థింపవలయును" అని సంబంధుని కోరెను. సంబంధుఁడు వృత్తజాలముతో వినుతింపఁగా తోడనే ద్వారము పిహితమయ్యెను.

వాగీశుఁడును, సంబంధుఁడును ఒకరినొకరు పొగడుకొనుచు నిద్రింపఁగా స్వప్నమున స్వామి సాక్షాత్కరించి, "నాదర్శనము తిరువామూరున నగును" అని చెప్పి పోవుచుండెను. అంతట వాగీశుఁడు "అట్లుగాదు. నిలువుము" అని వెంటఁబడెను. అంతట స్వామి నిలిచి సేవ యొసఁగెను. అపుడు సంబంధుఁడుగూడ పోయి సేవించెను. మఱునాఁడు ఇరువురును తిరువామూరునకుఁబోయి దర్శనముచేసికొని వృత్తజాలముతో వినుతించి మఱల వేదారణ్యమునకు వచ్చి చేరిరి.

శైవమతస్థుఁడగు పాండ్యరాజు దైవదుర్విపాకమువలన జైనమతమునఁ బ్రవేశించె. "యథా రాజా తథా ప్రజా" యను నార్యోక్తి యథార్థము గదా! జనులు ఎల్లరునుగూడ జైనులైరి. రాజుభార్యయు, చోళరాజుకొమార్తెయు నగు మహిళానాయికయు, మంత్రియగు కులచ్చిరైనాయనారును మాత్రము శైవమతమును విడువక ఎవరికినిఁ దెలియకుండ తమ మతధర్మములను నెఱవేర్చుకొనుచుండిరి. ఇంతలో వారికి జ్ఞానసంబంధుఁడు శైవమతోద్ధారణమునకై యవతరించెనని తెలియవచ్చెను. తోడనే ఇరువురును వారినిఁ బ్రార్థించి తీసుకొనిరావలసిన దని రాయబారుల నంపిరి. వారు వచ్చి చెప్పవలసిన వన్నియుఁ జెప్పిరి. సంబంధుఁడు వాగీశునితోఁ బ్రయాణ మయ్యెను; గాని వాగీశుఁడు "మహానుభావా, మీరు ప్రాయమున బాలురై యున్నారు. జైనులు కడు దుర్మార్గులు. వారివలన ఏమి కీడు మూడునో యని శంకించుచున్నాను" అనెను. సంబంధుఁడు 'మనకు అట్టి సందేహము వలదు. పరమశివుని అనుగ్రహము ఉన్నంతకాలమును ఎట్టి యాపదయు మనలను సమీపింపఁ జాలదు' అని పలికి 'మీరు ఈచోళరాజ్యమునందే యుండుఁడు. నేను పోయి అంతయుఁ జక్క జేసికొని వచ్చెదను.' అనిచెప్పి ఆతనిని అచ్చట నిలిపివేసి తాను వేదారణ్యేశ్వరుని ఒకమాఱు సేవించి వృత్తములతో నుతించి పాండ్యదేశమునకు బయలుదేఱి మధురానగరమును సమీపించెను.

అచట జైనులకు దుస్స్వప్నములు, దుశ్శకునములు, దుర్నిమిత్తములును దోఁచసాగెను. అదిచూచి జైనమతప్రముఖు లందఱును ఒకచోఁ గూడి విచారణలు ప్రారంభించిరి. ఇది యిట్లుండఁగా సంబంధుఁడు వచ్చుచున్నాఁడని మహిళానాయికకుఁ దెలియవచ్చెను. తోడనే ఆతని నెదుర్కొని తీసుకొనివచ్చుటకు తగిన ఏర్పాటులు చేయవలసిన దని ఆమె మంత్రికిఁ దెలిపెను. మంత్రి పరివారమును వెంటఁబెట్టుకొని స్వయముగా నెదురేగెను. రాణి సుందరేశ్వరస్వామి సన్నిధికిఁ బోయి సేవించి అచ్చట సంబంధుని రాకకు ఎదురు చూడసాగెను.

అట సంబంధుని ముందు పరమతహృదయభేదిని మున్నగు వివిధ వాద్యములు మ్రోగుచుండెను. 'పరమతవేదండకంఠీరవులు వేంచేయుచున్నారు. దుర్మతనిర్మూలనస్వామి విచ్చేయుచున్నారు' అని పరివా

రము బరాబరులు చేయుచుండిరి. సంబంధుఁడు ముత్తెములపల్లకి నెక్కెను. పరిజనులు ముత్తెముల గొడుగును పట్టి నడచుచుండిరి. కులచ్చిరైనాయనారు ఆతనిని ఎదుటఁ జూచి సాష్టాంగపడి లేవక అట్లే యుండెను. అది చూచి పరులు ఈసంగతి చెప్పఁగా సంబంధుఁడు పల్లకిదిగివచ్చి మంత్రిని లేవనెత్తి ఆదరముతో కౌఁగిలించుకొని "పరమశివుఁడు మహిళానాయికను సర్వదా రక్షించును" అని యాశీర్వదించెను. అందులకు మంత్రి పరమానందభరితుఁడై "ఈపాండ్యమండలమున జైనమతమునిండి యున్నది. దేవరవారు దానిని నిర్మూలించి, శైవమతమును నెలకొల్పి ఎల్లపుడును ఈ దేశమున ఇతరదుర్మతములు ఏమియుఁ బ్రవేశింపకుండునట్లు అనుగ్రహింపవలయును" అని ప్రార్థించెను.

మధుర ఎట్టయెదుటఁ గాన్పించెను. అది చూచి సంబంధుఁడు "పరమశివుని హాలాస్య మేది?" యని ప్రశ్నింపఁగా మంత్రిగారు "ఆగోపురమే" యని చూపించెను. తోడనే సంబంధుఁడు సాగిలఁబడి మ్రొక్కి లేచెను. పిదప నగరము సొచ్చి సుందరేశ్వరస్వామి ఆలయమునకుఁ బోయిరి. మహిళానాయిక వారినిఁ జూచియు సిగ్గుపెంపున ఎదుటకుఁ బోఁజాలక మస్తకన్యస్తహస్తయై యొకప్రక్క నిలువఁబడెను. మంత్రి నాయనారునకు ఆమెను జూపెను. సంబంధుఁడు ఆదెసకు వెళ్లెను. మహిళానాయిక అపుడు సాష్టాంగము ఆచరింపఁగా సంబంధుఁడు ఆమెను లేవనెత్తి "శివానుగ్రహము కలుగుగాక" అని దీవించెను. ఆమె ఆతనిని అనేకవిధముల వినుతించెను. తరువాత మంత్రి జ్ఞానసంబంధుని ఒకచక్కని మఠమునఁ బ్రవేశపెట్టెను.

అప్పుడు జైనులు సంబంధుని రాక విని గుండెపగులగా అందఱును ఒకచోఁ గూడి ఆలోచించికొని రాత్రి రాజుచెంతకుఁ బోయి 'శియ్యాళినుండి బ్రాహ్మణబాలకుఁడు ఒకఁడు శైవమతోద్ధరణము నిమిత్తము వచ్చియున్నాఁడు" అని చెప్పిరి. అందులకు రాజు కోపపడి "ఇపుడు మనము ఏమిచేయవచ్చు" నని యడిగెను. "సెలవయినచో రాత్రి మంత్రబలమువలన ఆతఁడు ఉండు మఠమును భస్మము చేసెదము. అది చూచి ఆతఁడు పాఱిపోవును" అని చెప్పిరి. రాజు అందులకు అంగీకరించెను. రాణి 'ఏల మీరిట్లు చింతాక్రాంతులై యున్నారు.' అని యడుగఁగా రాజు 'మనపురమునకు శైవుఁ డొకఁడు వాదించు

టకు వచ్చియున్నాఁడు; అందులకు ఇట్లు ఉన్నా' నని చెప్పెను. అందులకు ఆమె 'మనకు ఈవిచారము ఏల? వాదములో ఏమతమువారు నెగ్గిన మనము ఆమతము నవలంబింతము' అని చెప్పి తన మేడకుఁ బోయి కులచ్చిరై నాయనారును రప్పించి 'మెలకువ గలిగియుండుము. జైనులు దౌర్జన్యములు చేయవచ్చును' అని చెప్పెను. మంత్రి వల్లెయనెను.

జైనాచార్యులు మంత్రములతో నగ్నిని ఉపాసించిరి; గాని అగ్ని పంచాక్షరీజపపరాయణుఁ డగు సంబంధుఁడు ఉన్నచోటికిఁ బోఁజాల దయ్యెను. అంతట 'రాజు ఈవృత్తాంతమును వినినచో మనలను నిందించును' అని తలంచి వారు ఆయగ్నినిఁ గొనిపోయి సంబంధుఁడు ఉన్న మఠముచుట్టును ప్రజ్వలింపఁ జేసిరి. పరిజనులు అగ్నినిఁ జూచి చెప్పిరి; గాని నాయనారు 'ఇది రాజానుమతమున జైనాచార్యులు చేసియుందురు' అని నిశ్చయించి 'అగ్నినిఁ బురికొల్పుదునేని రాజు క్షణములో భస్మీకృతుఁడగును; గాని అట్లయిన మహిళానాయికకు ఉపద్రవము సంభవించును' అని యోచించి ఆతఁడు 'ఈయగ్ని రాజునకు ఉష్ణరోగమై బాధించుగాక' యని శపించెను. వెంటనే ఆయగ్ని పాండ్యరాజును బాధింపసాగెను.

ప్రాతఃకాలమున లేచునప్పటికి ఉష్ణరోగ మంకురించి క్షణములో విజృంభించి బాధింపసాగెను. రాణియు కులచ్చిరై నాయనారును ఆ బాధను జూచి 'ఇది జైనులు చేసిన అక్రమమునకు ఫలము' అని నిశ్చయించికొని 'ప్రభూ, మన నగరమునకు శైవమతోద్ధారకుఁ డగు మహాత్ముఁడు ఒకఁడు వచ్చియున్నాఁడు. ఇది జైనులు ఆతనికి చేసిన కీడునకు ఫలము. ఆతని నాశ్రయించెదమేని ఇది క్షణములో నివృత్తి యగును' అని చెప్పిరి. రాజు అది విని 'అట్లయిన ఆతనిని రప్పింపుఁడు. ఈరోగము నాతఁడు నివృత్తిచేయునేని ఆతనిని శరణు వొందెదను' అని పలికెను.

'మంత్రియు మహిళానాయికయు వెంటనే సపరివారముగా బయలుదేఱి నాయనారునకు సాష్టాంగదండప్రణామము లాచరించి జైనులు గతరాత్రి చేసిన అక్రమమునకుఁ గొంతతడవు వగచి కోటలో జరిగిన వృత్తాంతమంతయు నెఱింగించివచ్చి కరుణింపుఁడు'అని ప్రార్థిం

చిరి. సంబంధుఁడు అందులకు అంగీకరించి పరివారము ముత్యముల గొడుగులు పట్టి బరాబరులు చేయుచుండ ముత్యముల పల్లకిమీఁద బయలుదేఱెను. రాణియు మంత్రియు పాదచారులై ఆతనిని మహా వైభవముతోఁ గోటలోనికిఁ దీసికొని వచ్చిరి. నాయనారుం జూచిన తోడనే రాజునకు ఉష్ణవేగము కొంచెము తగ్గెను. అంత నాతఁడు నాయనారు మహాత్ముఁడని నిశ్చయించి లేచి నమస్కరించి రత్నాసనమున నుపవిష్టునిఁ గావింపఁజేసెను. అపుడు సంబంధుఁడు "రాజా, ఉత్కృష్టమగు శైవమతమును మేము పూజించుచున్నాము. నీవు శైవమతమును విడిచి జైనమతమును అవలంబించితివి. సంకుచితచిత్తుఁడవు; గావున వాదోపవాదములవలన నీవు ఏమతము మంచిదో గ్రహింపఁజాలవు; పరీక్ష చేసి చూచి గ్రహింపుము. నీవు ఇపుడు క్రూరరోగమువలన బాధపడుచున్నావు. జైనులను రప్పింపుము. నీజాడ్యమును జైనులు తొలంగింతురేని జైనమతమునందే యుండుము. మేము తొలంగింతుమేని శైవమతము నవలంబింపుము" అని పలికెను. పిదప కొంతసేపటికి రాజాజ్ఞచే జైనాచార్యులు వచ్చిరి. వారు శైవుఁడు రత్నాసనముమీఁదఁ గూరుచుండుటఁ జూచి యోర్వఁజాలక "మతవాదములో నీతని నోడించి అధోలోకమునకుఁ ద్రొక్కివేసెదము గాక" అని నిశ్చయించుకొని వాదోన్ముఖులైరి. అపుడు రాజు వారినిఁ జూచి "నేనిపుడు క్రూరవ్యాధివలన బాధపడుచున్నాను దీనిని మీరిపుడు తొలంగింపఁగలరేని నేను జైనుఁడనై యుందును. లేకున్న శైవాచార్యులగు శ్రీజ్ఞానసంబంధ నాయనారు వచ్చియున్నారు. వారు తొలఁగింతురేని శైవుఁడ నయ్యెద" నని పలికెను. జైనాచార్యులు పన్నిదము బాగుగ నున్నదని అందులకు అంగీకరించి మంత్రతంత్రములను బ్రయోగించిరి; గాని ఎంతసేపటికిఁ బ్రయోజనము కలుగలేదు. అంత రాజు సంబంధుని దెసకు జూచెను. రాజు ఇంగితము నెఱింగి సంబంధుఁడు పంచాక్షరి జపించి రాజునకు విభూతి నిచ్చెను. తోడనే నిరామయుఁడును వజ్రకాయుఁడు నయ్యెను. అందులకు మంత్రియు, రాణియుఁ బరమానందమును బొందిరి. రాజు ఏమి చెప్పెద రని జైనులు ప్రశ్నించెను. "ఇంకను గొన్ని పరీక్షలను చూడవలయు" నని జైనులు కోరిరి. రాజు వల్లెయని యంగీకరించెను.

"మేము మాదైవముయొక్క గుణగణములను ఒక పత్రమున

వ్రాసెదము. మాదైవముగుణగణములను మీారు వ్రాయుఁడు. రెండును అగ్నిలో బడవేయుదము. ఎవరి పత్రము మండిపోకుండునో వారిమతము ఉత్కృష్టము" అని యొక జైనాచార్యుఁడు పలికెను. సంబంధుఁడు అందులకు అంగీకరించెను. ఉభయపక్షములవారును అట్లు వ్రాసిరి. వానిని రాజు అగ్నిలోఁ బడవేసెను. చూచుచుండఁగనే జైనులపత్రము బూడిద యైపోయెను. సంబంధునిపత్రము అట్లే యుండెను. మంత్రియు మహిళానాయికయు చాల నానందించిరి. రాజునకు నాయనారు మీాఁది భక్తి యధిక మయ్యెను.

జైనులు అంతటితో నూరకుండ లేదు. "మేము ఇంకను పరీక్ష యిచ్చెదము. మనల ఉభయులును చెరియొక పత్రమును వ్రాసెదము. వానిని వైఘునదిలో విడువవలయును. ఎవరి పత్రము ఏటికి ఎదురీదునో వారిమతము శ్రేష్ఠము" అని మఱియొక జైనాచార్యుఁడు అనియెను. సంబంధుఁడు అందులకు అంగీకరించెను. ఉభయపక్షములవారును చీట్లు వ్రాసి రాజుచేతికి ఇచ్చిరి. ఓడిపోయినవారికి శిక్ష యేమని యడుగఁగా జైనులు "ఓడినవారిని కొఱత వేయుఁడు" అనిపలికిరి. అంతటనందఱును వైఘునదికిఁ బోయిరి. రాజు రెండు చీట్లను నదిలో విడిచెను. చూచుచుండఁగా జైనుల పత్రము సముద్రముదెసకు కొట్టుకొనిపోయెను. శైవులపత్రము ధూమశకటమువలె నిరర్గళముగ ఏటికి ఎదురీదసాగెను. అది చూచి జైనులు భయభ్రాంతులైరి. పంకతనము జూపిన జైనులను, ఎనిమిదివేలమందిని రాజు కొఱత వేయించెను. తక్కిన జైనులు అందఱును శైవమతము నవలంబించిరి. రాజుగూడ పరమభక్తితో నాయనారునకు సాష్టాంగదండప్రణామము లర్పించి, "పతితుఁడను. రక్షింపుఁడు" అని ప్రార్థించెను. నాయనారు దీవించి రాజునకు అపుడే శైవమతదీక్షనిచ్చెను. మంత్రియు మహిళానాయికయు ఆనందసాగరమునఁ దేలియాడుచు నాయనారునకు సాష్టాంగప్రణామములు సమర్పించి అనేకవిధములఁ వినుతించిరి. అంతట నాయనారు, రాజు, రాణి, మంత్రి మున్నగువారిని వెంటనిడుకొని సుందరేశ్వరుని ఆలయమునకుఁ బోయి సేవించెను. రాజు నాయనారును అక్కడనుండి సవైభవముగఁ గొనిపోయి మఠములోఁ బ్రవేశపెట్టెను. శివపాదుఁడు, తన కుమారుఁడు పాండ్యమండలమునందలి జైనుల నోడించి అక్కడ శైవమతమును

ప్రతిష్ఠించె నని విని వచ్చి కుమారునిఁజూచి పరమానందభరితుఁడై అక్కడనే యుండెను.

కొన్నిదినములు అక్కడ నుండి పిదప నాయనారు తిరునెల్వేలి మున్నగు శివక్షేత్రములను సేవించుటకు బయలుదేఱెను. రాజు, రాణి, మంత్రియు ఆతని వియోగమును సైపలేక వెంట బయలుదేఱిరి. ఆపోవుట పోవుటగా తిన్నగ రామేశ్వరమునకుఁ బోయి నాయనారు అక్కడనుండియే లంకయందు వేంచేసియున్న పరమశివుని నృత్తజాల ముతో వినుతించి అక్కడనుండి కులచ్చిరై నాయనారు జన్మస్థలమగు మణమేర్కుడికిం బోయి అచ్చటి స్వామిని సేవించుచు కొన్ని దిన ములు ఉండి "మేము చోళమండలమునకుఁ బోవలసియున్నది. మీరు మధురకుఁ బోయి శైవమతము నుద్ధరించుచుండుఁడు" అని చెప్పి యొప్పించి పంపివేసి తానపుడు చోళదేశము మార్గము బట్టెను.

మార్గమధ్యమున నొక నది యడ్డము వచ్చెను. అది కూలం కషముగఁ బ్రవహించుచుండుటచే చేయునది లేక పడవవాండ్రు పడ వలను గట్టివేసి ఇండ్లకుఁ బోయిరి. అంతట నాయనారు భక్తుల నంద అను వానిపై నెక్కించి పిదప తానెక్కి, ఎదుటఁ గాన్పించుచున్న తిరుక్కొళంబూదూరుస్వామిని వినుతించుట ప్రారంభించెను. తోడనే పడవ అవ్వలిగట్టునకుఁ బోయి చేరుకొనెను. నాయనారు తిరుక్కొళం బూదూరులో కొన్నిదినములు ఉండి స్వామిని సేవించి, బయలుదేఱి శంఖకాహళాదిబిరుదములను పరిజనులు వాయించుచు బరాబరులు చేయుచుండ బౌద్ధుల నివాసమగు బోధిమంగళము సమీపించెను. బౌద్ధులు అందులకు సమ్మతింపక "మీరు వాదించి మామతమును జయింపుఁడు; లేదేని ఊరక పొండు. అంతవఱకును మీబిరుదులను వాయింపనీయము" అని పలికిరి. నాయనారు వాదించుటకు అంగీక రించెను. బుద్ధనంది అనుబౌద్ధాచార్యుఁడు మహారోషముతో సంబం ధుని జయించుటకు బయలుదేఱెను. అపుడు నాయనారు శివుని విను తించెను.తోడనే పిడుగుపడి దేహముతుకాతుకలుకాఁగా బుద్ధనంది మరణించెను. శైవులు హరహరయని వీరశంఖముల నూఁదిరి. అల్లక ల్లోలముగావించిరి. అంతట బౌద్ధులు తర్కశాస్త్రప్రవీణుఁడగు సార బుద్ధుఁడను మఱియొక యాచార్యుని వాదమునకు సిద్ధము చేసిరి.

అంతట ఉభయపక్షములవారికిని తీవ్రమగు వాదము ప్రారంభమయ్యెను. కొంతతడవు వాదించి తుద కాతఁడు 'ఓడితి' నని యంగీకరించి 'శరణు' అని నాయనారు పాదములమీఁద వ్రాలెను. తక్కిన బౌద్ధులు గూడ నట్లే చేసిరి. అప్పుడు నాయనారు "మీ మతము కూనుమతము అయిపోయినది; గావున శ్రేష్ఠమైన శైవమతము నవలంబింపుఁడు" అని బౌద్ధులకు ఆదేశించెను. బౌద్ధులు అంగీకరించి వెంటనే శైవులయిరి.

తరువాత సంబంధుఁడు తిరుక్కడైయూరికి వచ్చెను. అక్కడ స్వామి సేవ యైన తరువాత వాగీశుఁడు తిరుప్పూందురుత్తి యను గ్రామమున నున్నాఁడని తెలిసెను. తోడనే సంబంధుఁడు ముత్యాలపల్లకిమీఁద బయలుదేఱెను. వాగీశుఁడు వాద్యఘోషములు విని సంబంధుఁడు వచ్చుచున్నాఁడని యెఱింగి ఎదురువచ్చి పల్లకిదండిని మోయసాగెను. తిరుప్పూందురుత్తి చేరినతరువాత సంబంధుఁడు 'వాగీశనాయనారు ఎక్కడ నున్నా' రని యడుగఁగా నప్పుడు ఆతఁడు ఎదురుగ వచ్చి "దాసుఁడు ఇంతవఱకును దేవరవారి పల్లకి మోసి ధన్యతఁ గాంచినాఁడు" అని పలికెను. తోడనే సంబంధుఁడు పల్లకి దిగి వచ్చి వాగీశుని కౌఁగిలించుకొనియెను. ఇరువురు నొకరికొకరు ఏకకాలమున నమస్కారములు ఆచరించుకొని, ఒండొరుల వినుతించికొని మఠమునఁ బోయిరి. అక్కడ సంబంధుఁడు తాను పాండ్యమండలమునఁ జేసినదంతయుఁ జెప్పెను. వాగీశుఁడు తాను తొండమండలమునఁ జేసిన దంతయు నెఱింగించెను. సంబంధుని యనుజ్ఞను బడసి వాగీశుఁడు పాండ్య మండలమునకుఁ బోయెను. సంబంధుఁడు కావేరికి ఉత్తరముననున్న శివక్షేత్రములను దర్శించి అక్కడనుండియే శియ్యాళికిం బోయి స్వామిని సేవింపసాగెను

అక్కడ కొంతకాలము ఉండి సంబంధుఁడు భక్తులతోడను తండ్రియగు శివపాదునితోడను తొండమండలమునకు బయలుదేఱి తిరుప్పాదిరిపులియూరు, తిరువీధి, తిరుక్కోవెలూరు, తిరువణ్ణామల మొదలగు క్షేత్రములకుఁ బోయి తిరువొత్తూరు చేరెను. అక్కడ నొక శివభక్తుఁడు వచ్చి "స్వామీ, నేను స్వామి నిమిత్తము తాటిచెట్లను పెంచుచున్నాను. అవి యన్నియు మగచెట్లయిపోయినవి; శైవమతము మంచిది అయినచో ఆమగచెట్లు అన్నియు ఆఁడుచెట్లు కావలయును.

అని జైనులు ప్రగల్భములు గొట్టుచున్నారు. ఆమీఁద దేవరచిత్తము” అని విన్నవించి యూరకుండెను. వెంటనే సంబంధుఁడు స్వామిని వృత్తములతో వినుతింపఁగా మగచెట్లు అన్నియు ఆఁడుచెట్లు అయి, పిందెలతోడను, గెలలతోడను ప్రకాశింపసాగెను. అంతట జైనులు అందఱును సంబంధుని శక్తికి పరమాశ్చర్యచకితులై “ఇట్టి మహాత్ముని యెదుట బౌద్ధమతము నిలువఁజాల”దని తలంచి ఆతని నాశ్రయించి శైవులైరి. పిదప సంబంధుఁడు కాంచీపురముమీఁదుగా తక్కుంగల శివక్షేత్రములను సేవింపఁబోవుచుండఁగా మార్గమధ్యమున తిరువాలంగాడు అను గ్రామముతగిలెను. అది కారక్కాలమ్మ శిరస్సుతో నడచిన స్థలము; గావున తాను పాదములతో త్రొక్కఁగూడ దని సమీపము నుండియే ధ్యానించి ఆరాత్రి అక్కడ శయనించెను. రాత్రి అచ్చటి పరమశివుఁడు సంబంధునకు స్వప్నమున సాక్షాత్కరించి “నన్ను వృత్తములతో వినుతింపవా?” యని ప్రశ్నించెను. సంబంధుఁడు తోడనే మేల్కాంచి వృత్తజాలములను వెల్లివిరియునట్లు గావించెను. మఱునాఁడు అక్కడనుండి బయలుదేఱి తిరుప్పాచూరు మున్నగు క్షేత్రములను సేవించి, కాళహస్తి చేరి స్వామిని సేవించి కన్నప్పనాయనారును వినుతి చేసి అచ్చట నివసించియుండియే ఉత్తరకైలాసము కేదారేశ్వరము మున్నగు దివ్యస్థలములను సన్నుతించి, పిదప ననేకస్థలములు సేవించుకొనుచుఁ బోయి, తిరునట్టూరు చేరికొని స్వామిని సేవించుచుండెను.

మైలాపురమున శివభక్తుఁడును అధికధనవంతుఁడు నగు శివమిత్రుఁడు అను నొకవైశ్యకులజుఁడు ఉండెను. అతనికి సమస్తమును గలవు; గాని సంతానముమాత్రము లేదయ్యెను. అందులకు వగచి ఆతఁడు పరమభక్తితో శివునిఁగూర్చి తపస్సు చేయఁగా కొన్నిదినములకుఁ గొమార్తె గలిగెను. ఆమె పార్వతివలె మనోమోహినియై యుండెను. తలిదండ్రులు ఆమెకు పుష్పవతియని పేరు పెట్టిరి. ఆమె శుక్లపక్షచంద్రునివలె దినదినప్రవర్ధమానయై రంభవలె త్రిలోకసుందరి యయ్యెను. శివమిత్రుఁడు ఆమెను జూచి “ఈమె వివాహయోగ్యయై యున్నది. ఈమెను పెండ్లియాడుటకుఁ దగు వరుఁడు ఎచ్చటను గాన్పింపఁడు. ఏమి చేయుదును?” అని చింతించుచుండఁగా కొందఱు

బందుగులు జ్ఞానసంబంధనాయనారు పాండ్యమండలమునఁ జేసిన అద్భుతకృత్యములను జెప్పి వినుతించిరి. అది విని శివమిత్రుఁడు "మీ రందఱు నుండఁగాఁ జెప్పుచున్నాను. నేనును, నా కొమార్తయు, నా సర్వధనమును జ్ఞానసంబంధనాయనారునకుఁ జెందిపోయితిమి" అని పలికెను.

ఒకనాఁడు పుష్పవతి చెలికత్తెలతోఁ బూవులు కోయుచుండఁగా పాము కఱచి చనిపోయెను. శివమిత్రుఁడు నాబిడ్డను బ్రతికించిన వారికి నాధనమంతయు నిచ్చెద" నని ప్రకటించెను. దానిమీఁద ననేకులువచ్చి పనిచేసిరి; గాని ప్రయోజనము లేకపోయెను. తుదకు శివమిత్రుఁడు "నాకొమార్తె జ్ఞానసంబంధనాయనారునకు అర్పితయయ్యెఁగదా? ఆమెను దహనము చేసి అస్థులను, భస్మమును జాగ్రత్తచేసి, జ్ఞానసంబంధనాయనారు ఇక్కడకు వచ్చినపుడు సమర్పించెదను" అని తలంచుకొని అట్లే చేసి బూడిదను అస్థులను భద్రము చేసెను.

పిదపఁ గొన్నిదినములకు సంబంధుఁడు తిరువట్టూరునకు వచ్చె నని తెలిసి శివమిత్రుఁడు, మైలాపురమునుండి తిరువట్టూరుదాఁక పూలపందిళ్ళు వేయించి భక్తజనులను వెంటనిడుకొని సంబంధునిఁ గొనిరావలయునని బయలుదేఱెను. అప్పుడే నాయనారు మైలాపురమునకు బయలుదేఱెను. ఇరువురును మార్గమధ్యమున సమావేశమై ఒకరి నొకరు చాల నాదరించుకొని మైలాపురము చేరుకొనిరి. అందఱును కపాలేశ్వరుని ఆలయమునకుఁ బోయిరి. శివమిత్రుని యుదంతమంతయు మార్గమధ్యమున వినియున్నాఁడు: గావున సంబంధుఁడు శివమిత్రునిఁ జూచి "నీకుమార్త అస్థులను బూడిదను దెప్పింపుము" అని యాజ్ఞాపించెను. శివమిత్రుని యాజ్ఞవలన పుష్పవతి చెలికత్తెలు అస్థులబరిణను ముత్యాలపల్లకిలో నుంచి తెచ్చిరి. సంబంధుఁడు ఆబరిణను దెఱచి స్వామి సన్నిధి నుంచి "మృత్యుంజయా, భక్తురాలి ననుగ్రహింపుము" అని ప్రార్థించి "పుష్పవతీ రమ్ము" అని పిలిపించెను. తోడనే ఆబరణి నుండి పుష్పవతి పూర్వాధికశోభతో లేచి వచ్చెను. ఈయద్భుతమును జూచి అందఱు నాశ్చర్యచకితులై సంబంధుని అనేకవిధములఁ గొనియాడిరి. దేవతలు పుష్పవృష్టిఁ గురిసిరి. అచ్చర లాడిరి. కిన్నరులు పాడిరి. దేవదుందుభులు మ్రోసెను.

పిదప శివమిత్రుఁడు తాను నిశ్చయించుకొనిన దంతయు నెఱింగించెను. అందులకు నాయనారు "నీకొమార్త బ్రతుకుటకు ఈశ్వరుఁడే సర్వకారణుఁడై నను నేను నిమిత్తమాత్రుఁడ నైతిని; గావున పుమ్పవతి నాకు నీకువలెనే బిడ్డ యైనది. ఆమెను నేను పెండ్లియాడుట తగదు" అని తిరస్కరించెను. అంతట శివమిత్రుఁడు చేయునది లేక ఆమెను కన్యకామఠమున అప్పగించెను. కొన్నిదినములు అయినతరువాత ఆమె సిద్ధి పొందెను. పిదప సంబంధుఁడు మైలాపురమున కొంతకాలము ఉండి అక్కడ నుండి తిరువామూరు, అచ్చరపాక్కము, పక్షితీర్థము, మొదలగు దివ్యస్థలములు సందర్శించి చిదంబరమునకుఁబోయి శియ్యాళినుండి తండ్రిమున్నగువారు రాఁగా వారితోఁ గలిసి శియ్యాళికిఁ బోయెను. మురుగనాయనారు, నీలనక్క నాయనారు మున్నగువారు ఈవృత్తాంతము నెఱింగి శియ్యాళికి కుటుంబములతోఁ గూడ వచ్చి వసించి జ్ఞానసంబంధుని సేవింపసాగిరి.

తండ్రియగు శివపాదుఁడు అప్పటికి కుమారునకు పదునాలుగేండ్లవయస్సు వచ్చియుండుటఁ జూచి, ఇదియే వివాహమునకు యుక్తవయస్సు అని నిశ్చయించి "పెండ్లిచేసికొనుము" అనిచెప్పెను; గాని నాయనారు నిరాకరించెను. అప్పుడు అచ్చటనున్న బ్రాహ్మణులు అందఱును నమస్కరించి "దేవరవారు వేదాగమములను స్థాపించుటకు అవతరించినారు; వేదాగమప్రకారము వివాహము చేసికొనుట ధర్మము" అని విన్నవించిరి. సంబంధుఁడు అందులకు అడ్డుచెప్పలేక వల్లెయని యంగీకరించెను.

తిరునల్లూరు అనుగ్రామమున నంబాండారునంబి అను మహాత్మునకు ఒక కొమార్త యుండెను. బ్రాహ్మణులు ఆమెయే జ్ఞానసంబంధునకు అన్నిటను దగిన కన్య యని నిశ్చయించి అడుగుటకు తిరునల్లూరునకుఁ బోయిరి నంబాండారునంబి వారి యాగమనమునకు కారణము నెఱింగి పరమానందభరితుఁడై తన కన్యను సంబంధునకు ఇచ్చుటకు అంగీకరించి లగ్ననిశ్చయము గావించి పంపెను. యుక్తసమయమున వివాహ మయ్యెను. మానవులును దేవతలును కూడ ఆనందించిరి. పిదప నాయనారు నుతింపఁగా పరమశివుఁడు ఆకాశవాణి వాక్యములతో "నీవును, నీభార్యయు, నీపెండ్లికి వచ్చిన భక్తులును మీయెదుట నున్న

జ్యోతిలో ప్రవేశింపుఁడు" అని యానతిచ్చెను. చూడఁగా ఎదుట శివసన్నిధిమొదలు ఆకాశమువఱకు జ్యోతి సాక్షాత్కరించియుండెను. అపుడు భార్యాసహితుఁడై శ్రీజ్ఞానసంబంధనాయనారు అగ్రేసరుఁడు కాఁగా అచ్చట గలభక్తు లెల్లరును ఆజ్యోతిలో ప్రవేశించి శివసాయుజ్యమును పొందిరి.

---

90. వాగీశ నాయనారు.

తిరుమున్నైప్పాడి దేశమునఁ గల తిరువామూరిలో వెలమజాతివాఁడగు పుగళనారు అను నతఁ డొకఁ డుండెను. ఆతని భార్యపేరు మాదినియారు. ఆమె కొన్నిదినములకు గర్భము దాల్చి ఒకకొమార్తను గనియెను. మఱికొంతకాలమునకు ఒకకుమారుఁడుగూడ గలిగెను. వారు కొమార్తకు 'తిలకవతి' యనియు, కుమారునకు 'మరునీక్కియరు' అనియుఁ బేరులు ఉంచి మిగుల గారాబముతోఁ బెంచుకొనుచుండిరి. తలిదండ్రులు విద్యాభ్యాసము నిమిత్తము గురునికటమునకుఁ బంపఁగా మరునీక్కియరు స్వల్పకాలమునందే సకలవిద్యలను నేర్చి తలిదండ్రుల నానందసాగరమున నోలలాడించెను.

ఇంతలో తిలకవతి యుక్తవయస్కురాలై వివాహయోగ్య యయ్యెను. ఈసంగతి విని "కలిప్పగయారు" అను సైన్యాధిపతి ఆమెను తనకు ఇచ్చి పెండ్లిచేయవలసిన దని మాట్లాడుటకుఁ గొందఱ నంపెను. వారు పోయి మాట్లాడఁగా పుగళనారు కలిప్పగయారు శివభక్తుఁడును, తమ కులములోఁ బేరుపొందినవాఁడును, అన్నివిధములఁ దనతో బాంధవము నందుటకుఁ దగినవాఁడును అయియుండుటఁ జూచి తిలకవతిని ఆతనికి ఇచ్చుటకు అంగీకరించి లగ్ననిశ్చయము గావించి రాయబారులను గారవించి పంపివేసెను; గాని నిశ్చితదినమునాఁటికి శత్రువులతో యుద్ధము పొసఁగుటచే కలిప్పగయారు యుద్ధరంగమునకుఁ బోయెను.

ఇచ్చట వృద్ధాప్యమువలన పుగళనారు చనిపోయెను. ఆతని భార్య సహగమనముచేసెను. మరునీక్కియరును, తిలకవతియు తలిదండ్రుల

మృతికి విచారించుచుండఁగా బంధువులు అందఱును వచ్చి విచారము ఉడిపి మృతులకుఁ జేయవలసిన ఉత్తరక్రియలు అన్నియు నెఱవేర్చిరి. ఇంతలో కలిప్పగయారు యుద్ధరంగమున అనేక శత్రువీరులను దునుమాడి తాను ఒఱఁగెను. ఆవార్త తెలిసి తిలకవతి, "మన తలిదండ్రులు నన్ను ఆయనకు ఇచ్చి పెండ్లిచేయుటకు నిశ్చయించిరి. ఇంతలో వివాహము కాక పూర్వమే వారు వీరమరణము పొందిరి. వారితోడనే నేనుబోయెదను." అని తత్ప్రయత్నములు చేయఁగా మరునీక్కయరు "అక్కా, తలిదండ్రులు పోయినప్పటినుండియు నిన్నే తలిదండ్రులుగా భావించుచుంటిని. అట్టిచో నీవు గూడ ఇహలోకమును విడిచి నన్ను దిక్కులేనివానినిగాఁ జేసిపోయెదవా?" అని దీనముగఁ బలికెను. తమ్ముని దైన్యముఁ జూచి తిలకవతి ఆత్మహత్యకు సాహసింపఁజాలక యూరకుండెను. పిదప మరునీక్కయరు "దేహము లశాశ్వతములు. కూడ వచ్చునది ఏమియు లేదు" అని నిశ్చయించుకొని విరాగియై కలధనముతో సత్రములను సావళ్లు, బావులు, చెఱువులు, తోటలు మున్నగువానిని నిర్మించి ఇంక నిట్లే అనేకధర్మకార్యములను జేయుచుండెను; గాని ఉత్తమమైన మతమిది యను జ్ఞానముమాత్రము ఆతనికి లేదయ్యెను.

ఆ కారణముచే నాతఁడు ఆసేతుహిమాలయ మగు భరతఖండమంతయుఁ జూచి వచ్చుటకుఁ బ్రయాణమైపోయి మార్గవశమున పాటలీపుత్రనగరము చేరి అచ్చట జైనుల ప్రభావమును జూచి జైనమతమే ఉత్కృష్ట మని నిశ్చయించుకొని, ఆమతాచార్యుల నాశ్రయించి జైనమతగ్రంథములను జదివెను. సహజముగ నాతఁడు వివేకసంపన్నుఁ డగుటచే జైనమతమును స్వల్పకాలముననే ఆమూలాగ్రముగ నవగాహనము చేసికొనెను. జైనులు ఆతని ప్రజ్ఞకు ఆశ్చర్యచకితులై ఆతనిని దము యాచార్యునిఁగా ఏర్పఱచుకొనిరి. ఇట తిరువామూరులో నున్న తిలకవతి పరమశివునియెడల భక్తి యతిశయింపఁగా గరుడనది ఉత్తర తీరమున నున్న తిరువీధియను వీరట్టానక్షేత్రమునకుఁ బోయి ప్రతిదినమును అరుణోదయము కాకమున్నే లేచి కాల్యములు నిర్వర్తించుకొని స్వామి ఆలయమునకుఁ బోయి ఊడ్చి గోమయముతో అనులేపనము చేసి పూలుగోసి తెచ్చి ఇట్లుకైంకర్యమును చేయుచుండెను. ఇట్లుండఁగా నామెకు తన తమ్ముఁడు జైనమతము నవలంబించెనని తెలిసెను. అందు

లకు ఆమె చాల విచారించి పరమశివుని ధ్యానించి "పరమేశ్వరా, నాత మ్ముఁడు అధఃపతితుఁడై పోయియుండుటఁ జూచియు చేయూఁత నిచ్చి రక్షింపకుండుట నీకుఁదగునా?" యని ప్రార్థింపఁగా ఈశ్వరుఁడు "మరు నీక్కియరు తొలిజన్మమున గొప్ప తపస్సు చేసెను; గాని అందొక తప్పి దము వచ్చుటచే నాతనికి స్వల్పకాలము దుష్టమతమునను౦డవలసివచ్చి నది. పరకుము శీఘ్రముగనే ఆతఁడు నన్నాశ్రయించును. అందులకు కాలము సమీపించుచున్నది. ఆతనిని శూలవ్యాధిచే బాధించితన్మూల మున మంచిమార్గమునకుఁ ద్రిప్పెద" నని అనుగ్రహించెను. తెల్లవారి లేచునప్పటికి మరునీక్కియరు తీవ్రమగు శూలవ్యాధిచే బాధపొంద సాగెను.

మరునీక్కియరునకు జైనులు ధర్మసేనుఁడు అని నామకరణము చేసిరి. తమ మతాచార్యుఁడగు ధర్మసేనుఁడు శూలరోగముచే పీడితుఁ డగుచుండుటఁ గాంచి మందులు ఇచ్చియు, మాకులు ఇచ్చియు, మంత్ర తంత్రములు ప్రయోగించియు. చాల సేవ జేసిరి; గాని ప్రయోజనము కలుగదయ్యెను. అంతేగాక జైనులు ఉపచారములు చేసినకొలఁదిని ధర్మసేనునకు బాధ యధికము కాసాగెను.

తుదకు ఆతఁడు "నాయక్క ఉపచారమువలనఁ గాని యీరో గము కుదురదు" అని నిశ్చయించుకొని, ఒకచారునిఁ బంపి "సకలము నెఱింగించి ఆమెను తీసికొనిరమ్ము" అని చెప్పెను. వాఁడుపోయి అంత యుఁ జెప్పఁగా తిలకవతి "నీచులగు జైనుల స్థలమును నేను అడుగిడఁ జాల" నని బదులు చెప్పెను. చారుఁడు ఈసంగతి నెఱింగింపఁగా ధర్మ సేనుఁడు, "శ్రేష్ఠమైన మాహేశ్వరమతమును విడిచి ఈజైనమతము నవలంబించుటచే నాకీబాధ కలిగెఁ గాఁబోలు" ననుకొని తన చెంత నున్న జైనసాంప్రదాయపు పరికరములను అన్నిటిని విడిచివేసి ఎట్లో తిరువీధికి వచ్చి తిలకవతి పాదములమీఁద వ్రాలి "రక్షింపుము" అని ప్రార్థించెను. అపుడు ఆమె ఈశ్వరుఁడు ఆనతిచ్చిన కాలము ఆసన్నమైన దని నిశ్చయించుకొని పంచాక్షరితో మంత్రించి విభూతి నిచ్చి తమ్ముని ఆలయమునకుఁగొనిపోయి స్వామికిఁ బ్రదక్షిణనమస్కారములు చేయిం చెను. వెంటనే ఆతనికి మహేశ్వరానుగ్రహమువలన అనర్గళమైన కవి తాధార పొడసూపెను. ఆప్రవాహమును విడిచి ఆతఁడు పరమేశ్వరుని

వృత్తజాలములతో వినుతింపఁగా చేతితో తీసివేసినట్లు శూలరోగము నివృత్తి యయ్యెను. అపుడు పరమేశ్వరుఁడు ఆకాశవాణిరూపమున "నీవు నామహిమ నెఱింగి నన్ను తేవారములతో వినుతించితివి; గావున నీకు వాగీశుఁడు (నావుక్కరశు) అను బిరుదునామము నిచ్చుచున్నాను. ఇఁక నీవు వాగీశుఁడు అనియే వ్యవహరింపఁబడుదువు" అని చెప్పెను. అది విని వాగీశుఁడు "పరమశివా, అజ్ఞానాంధకారకూపమున కూలియున్న నన్ను నిర్హేతుకజాయమానకటాక్షమువలన రక్షించిన నిన్ను ఏమని వర్ణింపఁగలను" అని మఱల వృత్తజాలములతో వినుతించి ఆనందాతిరేకమువలన నృత్యము గావించెను. పిదప నాతఁడు ఇదివఱకు అవలంబించినను జైనమతము నీచాతినీచ మని యుక్తులతో సమర్థించుచు శైవమతాచారములను యథావిధిగా ననుష్ఠించుచు అనేకులను సన్మార్గమునకుఁ ద్రిప్పి ఉజ్జీవింపఁ జేయసాగెను.

పాటలీపుత్రమున నున్న జైనులకు ఈసమాచారము వినవచ్చెను. వారికి అందఱకును గూడ చాల కోపము వచ్చెను. "మన దేవుఁడు ఆశూలరోగమును మాన్పఁజాలక పోయెను. మహేశ్వరుఁడు కుదిర్చెను, గావున నిఁక ధర్మసేనుఁడు మనలను ఉన్మూలించు" నని జైనులు అందఱును వగచి కూడఁబలుకుకొని పల్లవరాజుసన్నిధికిఁ బోయి "మహారాజా, ఇంతవఱకును మనకు ఆచార్యుఁడై యున్న ధర్మసేనుఁడు నిష్కారణముగ మహోత్కృష్టమగు జైనమతమును విడువఁగోరి శూలరోగము బాధించుచున్న దని బొంకి, మన దేవుఁడు కుదుర్పఁజాలకపోయె నని ప్రకటించి తిరువీథి నున్న తన అక్కయగు తిలకవతి చెంతకుఁ బోయి మహేశ్వరునిఁ గొలిచి శూలరోగము పోయిన దని చెప్పుచు వాగీశుఁడు అనిపేరుపెట్టుకొని జైనమతమును అనేకవిధముల నిందించుచున్నాఁడు" అని చెప్పిరి. రాజు చాల మండి వాగీశుని శిక్షింపఁ దలఁచి, "భటులను బంపి తెప్పింపుము" అని మంత్రికి ఆజ్ఞాపించెను.

మంత్రి భటుల నంపక తానే స్వయముగఁ బోయి "రాజాజ్ఞయైనది. రావలసినది" అని ప్రార్థింపఁగా వాగీశుఁడు సర్వమునకును మృత్యుంజయుఁడు ఉండఁగా నా కేమి భయము!" అని నిర్భయుఁడై మంత్రితోఁగూడఁ బోయి రాజు నెదుట నిలిచెను. రాజు జైనుల సలహా చొప్పున నాతనికి నిర్బంధకారావాసశిక్షను విధించెను. భటులు

అగ్నిమయములగు గోడలు గల క్తైదులో నాతనిం బెట్టిరి. గొప్పనేరము లనుచేసినవారి నుంచుటకు ఆ కారాగృహము నిర్మింపఁబడెను. అందు మానవుఁడు ప్రవేశించినచో రెండు దినములయందే భస్మమైపోవును; గాని వాగీశుఁడు అకలంకమహేశ్వరభక్తుఁడు గావున నాతనికి ఆగది మలయమారుతభరిత మగు పుష్పవనమువలె నుండెను. భటులు వెడలిపోయిన వెంటనే ఆతఁడు పరమశివుని ధ్యానించుటయందుఁ బ్రవృత్తుఁ డయ్యెను. ఏడుదినములు గడచిన తరువాత "ఆతఁడు ఎట్లు ఉన్నాఁడోచూచిరండు" అని రాజు భటుల కాజ్ఞాపించెను. వాండ్రుపోయి చూచి "నిశ్చింతతో మహేశ్వరధ్యానమున లీనుఁడై యున్నాఁడు" అని చెప్పిరి. రాజు అందులకు ఆశ్చర్యపడి జైనులతో నాలోచించి "విషపానముచేయింపుఁడు" అని భటులకు ఆజ్ఞాపించెను. వాగీశుఁడు మృత్యుంజయుని ధ్యానించి నిశ్చింతతో ఆవిషమును ద్రాగెను; గాని ఆతఁడు చావలేదు. ఆతఁడు చచ్చునంతదనుక ప్రయత్నింపవలసినదే యని జైనాచార్యులును, రాజును కూడఁ బలుకుకొనిరి. రాజు ఏనుఁగుచే త్రొక్కించెను; గాని ఆయేనుఁగు ఆతనిం ద్రొక్కక ప్రదక్షిణము చేసి ప్రక్కనిలిచెను. "చంపుము" అని మావటివాఁడు అంకుశముతో బొడిచెను. తోడనే అది వీరభద్రావతారము దాల్చి మావటివానిని క్రిందఁబడవేసిచంపి మఱియు కాన్పించిన జైనుల నందఱను బొట్టలుచించి చంపసాగెను. కొందఱు జైనులు దానికంటఁ బడక తప్పించుకొని రాజునెదుటకుఁ బోయి "ప్రభూ, వాఁడు మున్ను నేర్చికొనిన జైనమంత్రముల సాయమున బ్రతికియున్నాఁడు. వానిం దప్పక కడతేర్పవలయును" యని మొఱపెట్టిరి. ఇందులకు ఉపాయము ఏమని రాజడుగఁగా "బండరాతితోఁ జేర్చి కట్టి సముద్రములోఁ బడవేయవలయు" నని వారుచెప్పిరి. రాజు అట్లు చేయించెను. సముద్రములో పడిన వెంటనే బండరాయి తెప్ప యయ్యెను. కట్లు విడిచిపోయెను. అలలు ఆతనిని తిరుప్పాదిరిప్పులియూరుక్షేత్రమునకుఁ గొనిపోయెను.

అంతట ప్రమథులు హరహర యని ఘోషించుచు వచ్చి ఆతనిం దీరమునకుఁ జేర్చి, పాటలీశ్వరస్వామి యాలయమునకుఁ గొనిపోయిరి. నాయనారును స్వామిని అనేకవృత్తములతో వినుతించి, అక్కడనుండి బయలుదేఱి, తిరుమాణికులి మున్నగు శివక్షేత్రములను సేవించుచు

తిరువీథిని సమీపించెను. అప్పుడు తిరువీథియందున్న భక్తులెల్లరును వాగీశుఁడు అక్కడనుండి వెడలినది మొదలుకొని నాఁటివఱకును జరిగిన దంతయు నెప్పటికప్పుడు వినియున్నారు; గావున మహావైభవముతో నెదురేగి పురమునఁ బ్రవేశపెట్టిరి. వాగీశుఁడు పరమభక్తిశ్రద్ధలతో స్వామిని సేవించుచు వినుతించుచు నుండెను.

ఇట్లుండఁగా అట వాగీశుని జైనులసలహాలచొప్పున బాధించిన పల్లవరాజు వాగీశుని మహిమలను విని పశ్చాత్తప్తుఁడై తిరువీథికి వచ్చి వాగీశుని కాళ్లమీఁదఁ బడి ప్రార్థించి, శరణు జొచ్చి శైవమతము నవలంబించి, వాగీశుని, తిలకవతిని సేవింపసాగెను. ఆతఁడు అంతటితో నూరకుండక పాటలీపుత్రమున నున్న జైనమఠమును బడఁగొట్టి, యా రాళ్లతో తిరువీథిలో స్వామికి గోపురమండపములను గట్టించెను.

పిదప నాయనారు అనేకశివస్థలములను దర్శించి, తిరుత్తూంగానైమాడము అనుక్షేత్రమునకుఁబోయి స్వామిని నృత్తములతో వినుతించి "స్వామీ, జైనమతాచారములను కొన్నినాళ్లు సేయుటచే నపవిత్రమైన ఈదేహముతో జీవించియుండుట దాసునకు ఇష్టము లేదు: గావున త్రిశూలవృషభాంకములను నాభుజములయందుంపుము" అని ప్రార్థింపఁగా పరమశివుఁడు ఆతని భక్తిజ్ఞానవైరాగ్యములకుమెచ్చి, ప్రమథులలో నగ్రేసరునిఁ బంపి "ఆతని కోరికను నెఱవేర్పుము" అని నియమించెను. ఆతఁడు వచ్చి అట్లే చేసెను. అక్కడనుండి నాయనారు తిరువరత్తర, కనకసభ మున్నగు స్థలములకుఁబోయి చిదంబరము చేరుకొనెను. ఇట్లు ఉండఁగా నాతనికి శియ్యాళియందలి జ్ఞానసంబంధమూర్తినాయనారు ప్రభావము వినవచ్చెను. వెంటనే ఆతఁడు శియ్యాళికి బయలుదేఱిపోయి సంబంధుని గలిసికొని చాల నానందముతో నుండెను.

పిదప వాగీశుఁడు చోళమండలమునందలి శివస్థలములను దర్శింపనెంచి సంబంధునివలనను స్వామివలనను సెలవుబడసి, తిరువాఢుదురై, తిరువిడమరుదూరు మొదలగు శివస్థలములకుఁ బోయి, తిరుచ్చత్తిముత్తము అనుచోటికిఁ జని యుండఁగా స్వామి స్వప్నమున "తిరునల్లూరికి రమ్ము" అని చెప్పెను. ఆయాజ్ఞాప్రకారము వాగీశుఁడు అచ్చటకుఁ బోఁగా స్వామి, "నీకోర్కెను దీర్చెద"నని చెప్పి శిరముపై తనచరణముల నుంచెను. అంతట వాగీశుఁడు మహానందభరితుఁడై బహుభం

గుల వినుతించి అటనుండిఅనేకస్థలములకుఁబోయి సేవించుకొని, మఱల తిరునల్లూరునకుఁ జేరుకొనెను.

తాగళూరు అను గ్రామమున అప్పూదియడిగళ్ నాయనారు అను మహాత్ముఁడు ఒకఁడు ఉండెను. ఆతఁడు వాగీశునియందున్న భక్తి వలన కుమారులకు అందఱకును వాగీశులు అనిపేళ్లు పెట్టెను. మఱియు నాతఁడు త్రవ్వించిన నూతులకును, వేయించిన తోఁటలకును, నిర్మించిన తటాకములకును ఇంకను ఇట్టి ధర్మకార్యములకు అన్నిటిమీఁదను "వాగీశుని ధర్మము" అని వ్రాయించెను. ఇది యంతయు విని వాగీశుఁడు ఆ గ్రామమునకుఁ బోయెను. అప్పూదియడిగళ్ నాయనారు వాగీశుని సగౌరవముగ ఇంటికిఁ గొనిపోయి విందునకు ఉండవలయునని ప్రార్థించెను ఆతఁడు అందులకుఅంగీకరింపఁగా నిముసములో వంటయయ్యెను. అప్పూదియడిగళ్ నాయనారు పెద్దవాగీశునకు 'తోఁటకుఁబోయి ఆకులు కోసికొనిరమ్ము' అని యాజ్ఞాపించెను. ఆతఁడు ఆకు కోయుచుండఁగా పాము కఱచెను. వెంటనే యాతఁడు ఆకులు తెచ్చి ఇంటఁ బడవేసి, జరిగిన యంతయుఁ దలిదండ్రులకు ఎఱింగించి ఒక మూలయింటికిఁ బోయి పరుండి ప్రాణములు విడిచెను ఈసంగతి తెలిసినచో వాగీశుఁడు భుజింపఁడు అని వృద్ధదంపతులు రహస్యముగా నుంచి వాగీశుని భోజనమునకు లెమ్మని చెప్పిరి. ఆతఁడు భోజనమునకు వచ్చి పరమేశ్వరానుగ్రహమువలన గలిగిన దివ్యదృష్టివలన సంగతియంతయు గ్రహించి శవమును తన యెదుట తెచ్చియుంచునట్లు ఆజ్ఞాపించి వృత్తజాలముతో పరమశివునిఁ బ్రార్థించెను తోడనే పెద్దవాగీశుఁడు నిద్రించి లేచినవాని వలె లేచి కూర్చుండెను. "స్వామీ, ప్రొద్దు పోయినది భుజింపుఁడు" అని వృద్ధదంపతులు అదేపనిగ ప్రార్థించుటవలన వాగీశుఁడు మాఱు పలుకకుండ భుజించి అక్కడనుండి వెడలిపోయెను.అనేకశివస్థలములను దర్శించి ఆతఁడు తిరువాలూరికిఁ జేరుకొనెను. అచ్చట మున్ను నమినందియడిగళ్ నాయనారు నీటితో దీపములు పెట్టెను. వాగీశుఁడు ఆతని ప్రభావమును వృత్తజాలములతో వినుతించుచు అచ్చటఁ గొన్ని దినములు ఉండెను. వాగీశుఁడు జ్ఞానసంబంధమూర్తినాయనారును కలిసి అనేకశివస్థలములను దర్శించి అనేకాద్భుతకృత్యములను గావించిరి.

తరువాత వాగీశుఁడు పడదళి యను స్థలమునకుఁ బోయెను.

అచ్చటి శివలింగమును జైనులు దాఁచియుంచిరి. అది తెలిసి వాగీశుఁడు "స్వామీ, దర్శన మిచ్చి రక్షింపుము" అని ప్రార్థించెను. నాఁటిరాత్రి స్వామి ఆయూరి నేలు రాజునకు స్వప్నమున సాక్షాత్కరించి "నన్ను జైనులు ఫలానిస్థలమున దాఁచియుంచినారు. వాగీశనాయనారు నాదర్శనము నిమిత్తము వేచియున్నాఁడు. నీవు జైనులను నాశనము చేసి నాకు ఆలయమును నిర్మింపుము" అని చెప్పి తాను మఱుగుపడియున్న స్థలము నెఱింగించెను. రాజు మేల్కాంచి స్వప్నవృత్తాంతమును మంత్రులకు ఎఱింగింపఁగా వారు 'స్వామి యాజ్ఞను తప్పక నెఱవేర్పవలయు'ననిరి. రాజు పోయి వెదకింపఁగా శివలింగము దొరకెను. దానిని దాఁచినారన్న కోపముతో రాజు జైనుల నందఱను ఏనుఁగు కాళ్ల క్రిందఁద్రొక్కించి చంపించి గుడి కట్టుటకు శిల్పులకు సెలవు ఇచ్చెను. శిల్పులు అతిస్వల్పకాలములోనే ఆలయమును తయారు చేసిరి. రాజు వాగీశునిచే నిశ్చయింపఁబడిన శుభదినమున సంప్రోక్షణాదికముఁ జేయించి స్వామి నందుప్రతిష్ఠ సేయించెను. వాగీశుఁడు అచ్చట మహానందముతో కొన్నిదినములు వసించెను.

ఆతఁడు అక్కడనుండి బయలుదేఱి, జంబుకేశ్వరము, త్రిశిరపురము మున్నగుస్థలములను సేవించి ముందున కరుగుచుండఁగా నొకచోట తీరని యాఁకలి యయ్యెను. దానిని దీర్చుకొనుటకు ఉపాయము గానక వాగీశుఁడు తడబడుచు పోవుచుండఁగా ఈశ్వరుఁడు అది తెలిసి కాయలతోడను, ఫలములతోడను నిండిన యొకతోఁటను నిర్మించి అన్నము మొదలగు ఆహారపదార్థములను ముందిడుకొని అక్కడఁ గూరుచుండి విశేషశ్రమతో వచ్చుచున్న వాగీశునిఁ గాంచి,—"మహానుభావా, నీవు ఆఁకలిచే మలమలమాడుచున్నట్లు తోఁచుచున్నది. దయయుంచి ఈసరోవరమున స్నానమాడి ఈయన్నము భుజించి పొమ్ము" అని బతిమాలెను. వాగీశుఁడు చాల నానందించి స్నానము చేసి ఆయన్నము దిని తిరుప్పంజీలికిఁ బోయెద నని బయలుదేఱెను. వృద్ధబ్రాహ్మణుఁడు "నేనుగూడ ఆగ్రామమునకు వచ్చెద" నని చెప్పి, వెంట బయలుదేఱి, ఆగ్రామము సమీపమున తిరోహితుఁడు అయ్యెను. వాగీశుఁడు హఠాత్తుగ వృద్ధుఁడు మాయమగుటఁ గాంచి ఆతఁడు పరమేశ్వరుఁడు అని నిశ్చయించుకొని అనేకవిధముల వినుతించి, తిరుప్పంజీలికిఁ బోయి స్వా

మిని దర్శించి సేవించి, వినుతించి, తరువాత అరుణాచలము, కాంచీపుర ము, పక్షితీర్థము, తిరువాన్మియూరు, తిరువట్టూరు, తిరువాలంగాడు మొదలగు క్షేత్రములను దర్శించి సేవించి, కాళహస్తి వెళ్లి, స్వర్ణముఖీ నదియందు స్నానమాడి, గిరిప్రదక్షిణాదికము నిర్వర్తించుకొని స్వామిని సేవించి అచ్చోట కొన్నిదినములు ఉండి మరల బయలుదేరెను.

ఆతనికి ఉత్తరకైలాసమున నున్న పరమశివుని దర్శింపఁ గుతూహలము గలిగెను ఆయూహతో నాతఁడు కాశీనగరము మున్నగు క్షేత్రములను దాఁటి కొంతదూరముపోవునప్పటికి చీలమండలవఱకును పాదములు అరిగిపోయెను. పిదప చేతులతో నడువఁగా మణిబంధముల వఱకును చేతులు అరిగిపోయెను. తరువాత వక్షస్థలముతోఁ గొంత దూరము నడచునప్పటికి వక్షముగూడ నరిగిపోయెను. పిమ్మట వీఁపుతోఁ గొంతదూరము ప్రాఁకునప్పటికి వీఁపుగూడ నరిగిపోయెను. వాగీశుఁడు ఇఁకఁ జేయునది లేక ఉత్తరకైలాసమును జేరఁజాలక పోయితినిగదా యని దుఃఖించుచుఁ బడియుండెను. అప్పుడు పరమశివుఁడు అచ్చట నొకతటాకమును గల్పించి తాను మునివేషముఁదాల్చి, నాయనారు ఎదుట నిలిచెను. నాయనారు ఆతనిం గాంచి మ్రొక్కి, తన సంగతి యాద్యంతముగఁ జెప్పెను. అంతట మునిరూపధరుఁడగు ఈశ్వరుఁడు "ఉత్తరకైలాసమును జూచుట మానవమాత్రులవలనఁ గాదు. వెనుదిరిగి పొమ్ము" అని చెప్పెను. వాగీశుఁడు "ఉత్తరకైలాసము చూచినఁగాని నేను వెనుదిరిగిపోను" అని బదులు చెప్పెను. ఆతని దీక్షకు మెచ్చి పరమేశ్వరుఁడు వెంటనే తిరోహితుఁడై అశరీరవాక్యముతో "వాగీశా, లెమ్ము" అనెను. ఆమాట వినఁబడఁగానే శరీరము యథాపూర్వముగ గాఁగా వాగీశుఁడు లేచి నిలిచి ఈశ్వరుని వినుతించెను. మరల ఈశ్వరుఁడు అశరీరవాక్కుతో "ఈతటాకమున స్నానముచేసి పంచనదమునకుఁబోయి నన్ను ఉత్తరకైలాసమునఁ జూచినట్లే అక్కడఁ జూడు" మని యాజ్ఞాపించెను వాగీశుఁడు వెంటనే లేచి పంచాక్షరిని జపించి ఆసరోవరమున మునిఁగి తాను పంచనదమునందలి యొకతటాకతీరమున నుండుటఁగని పంచనదక్షేత్రమే కైలాసగిరిగను అచ్చట నున్నవారు ప్రమథులుగను మునులుగను గాన్పింపఁ బ్రమథగణపరివేష్టితుఁడై యున్న పార్వతీపతిని గాంచి మహానందభరితుఁడై సేవించి, కన్నులుమూసికొని కొంతసేపటికి

దెలుపఁగా కైలాసము మాయ మయ్యెను. అందులకుఁ జాల చింతిం చుచు వాగీశుఁడు అచ్చటనే కొన్నిదినములు ఉండెను.

పిమ్మట నాతఁడు అనేకశివస్థలములను సేవించి జ్ఞానసంబంధమూ ర్తినాయనారుతో కలిసికొని తాను చోళమండలమునఁ జేసిన దంత యు నెఱింగించి, సంబంధుఁడు పాండ్యమండలమున జేసిన దంతయు విని, ఒకరి నొకరు వినుతించుకొని, ఎవరిస్థలములకు వారు పోయిరి.

ఒకప్పుడు పరమశివునకు వాగీశుని వైరాగ్యమును బరీక్షింప సం కల్పము గలిగెను. అంత నాతఁడు వాగీశుఁడు ఆలయమున కైంకర్యము సేయుచుండఁగా అంతటను నవరత్నములను బుట్టించెను. వాగీశుఁడు వానిని గమనించి చూడకయే చెత్తతోఁ బాటు తుడిచి పాఱవేసెను. మఱియొకనాఁడు శివుఁడు వాగీశుని ముగ్ధునిఁ గావించిరమ్మని రంభాదుల నంపెను. వారందఱు సవైభవముగ వచ్చి యనేకవిధములఁ బ్రయత్నించి రిగాని ప్రయోజనము కలుగలేదు. అది చూచినవా రందఱును అత్యా శ్చర్యచకితులై వాగీశుని మిగులఁ గొనియాడిరి. పరమశివుఁడును మిగు ల నానందించెను. వాగీశుఁడు ఇట్లు అచంచలభక్తుఁడై యెల్లప్పుడును పరమశివుని సేవించుచు అవసానమున శివసాయుజ్యమును బడసెను.

---

91. కారక్కాలమ్మ.

చోళదేశమునందలి కారక్కాలు అను గ్రామమున ధనదత్తుఁడు అను వైశ్యుఁడు ఉండెను. ఆతనికిఁ బుణ్యవతి యను నొక కొమార్త పుట్టెను. ఆతఁడు తన బిడ్డ యుక్తవయస్కురాలైనపిదప పరమదత్తుఁడు అను వైశ్యునకిచ్చి ఏకపుత్రిక యగుటచే ఆమెను విడిచియుండఁజాలక తన ఇంటిప్రక్క నొక పెద్దమేడను గట్టించి అందు అల్లునిఁ గొమా ర్తను బ్రవేశపెట్టి విశేషధనమునుఁగూడ నిచ్చెను. పరమదత్తుఁడు ఆధనముతో వర్తకము ప్రారంభించి విశేషధనము నార్జింపసాగెను. పుణ్యవతి తన కింత భాగ్య మున్నదిగదా యని గర్వింపక శివునిఁ బూజిం చుచు శివభక్తుల నాదరించుచు నుండెను.

ఇట్లుండ నొకనాఁడు వర్తకవ్యవహారము విషయమున పరమద

త్తుని దర్శనమునకు వచ్చిన యొకఁడు రెండు గొప్పమామిడిపండ్లను నజరు ఈయఁగా పరమదత్తుఁడు వానిని భార్యచెంతకుఁబంపెను. ఆమె వానిని జాగ్రత్తచేయఁబోవుచుండఁగా నొక శివభక్తుఁడు క్షుధార్తుఁడై వచ్చెను. పుణ్యవతి ఆతనికి అన్నము వడ్డించి కూర యేమియు లేకపోవుటచే ఒక మామిడిపండు వడ్డించెను. భక్తుఁడు కడుపునిండ భుజించి వెడలిపోయెను. కొంత సేపటికి పరమదత్తుఁడు భోజనమునకు వచ్చెను. పుణ్యవతి మిగిలిన పండును వడ్డింపఁగా దత్తుఁడు దానిని భుజించి "ఇది చాల మధురముగా నున్నది. ఇంకొకటి తెమ్ము" అనెను. పుణ్యవతి మాఱుపలుకఁజాలక లోపలకుఁబోయి పరమశివుని ధ్యానించుచు విచారింపసాగెను. అంతట నీశ్వరుఁడు కరుణించి ఆమెచేత నొకపండు ఉండునట్లు చేసెను. అందుల కామె యాశ్చర్యపడుచు దానిని వడ్డింపఁగా దత్తుఁడు భుజించి "ఇది అపూర్వమాధుర్యము గలిగియున్నది. ఇది దివ్యఫలముగా నున్నది; గాని ఈలోకమునకు సంబంధించినది గాదు. ఇది నీకు ఎట్లువచ్చినది?" అని యడిగెను. పుణ్యవతి జరిగినదంతయుఁ జెప్పఁగా దత్తుఁడు ఆమాటలను నమ్మఁజాలక ఆమెయెడల సంశయము గలవాఁడై "అట్లయిన మఱియొకపండు గొనిరమ్ము" అని పలికెను. తోడనే పుణ్యవతి చేతిలో మఱియొకపండు ఉండెను. ఆమె దానిని భర్తచేతిలో నుంపఁగా వెంటనే మాయ మయ్యెను. అంతట దత్తుఁడు "ఈమె సామాన్యస్త్రీగాదు. ఈమెతోఁ గాపురము చేసిన కీడుమూడును" అని నిశ్చయించుకొని ఆసంగతి బయల్పడనీయక కాలము గడుపుచుండెను.

ఒకప్పుడు విదేశమునకు వర్తకము నిమిత్తము పోయివచ్చెద నని బయలుదేఱిపోయి విశేషవిత్తము సంపాదించి తిన్నగ ఇంటికిఁ బోక పాంఢ్యదేశమునకుఁ బోయి అచ్చట ధనవంతుఁడగు నొక వైశ్యుని కొమార్తను బెండ్లియాడి యచ్చటనేయుండెను. మఱియు నాతఁడు కొన్నినాళ్లకు కొమార్తగలుగఁగా పుణ్యవతి యని పేరు పెట్టి మొదటిభార్యను దలంచుకొనుచు నుండెను.

పరమదత్తుని వృత్తాంత మంతయు బందుగులకుఁ దెలియవచ్చెను. అంతట వారు "అతఁడు ఇంక నిచ్చటకు రాఁడు. మనమో పుణ్యవతిని దీసికొని అచ్చటకుఁ బోవుట మంచి"దని భావించి, సకలము నామెకెఱిం

గించి ఆమెను వెంటఁబెట్టుకొని పరమదత్తుఁడు ఉన్నచోటికిఁ బోయి
ఒకయింట బస చేసిరి. అది చూచి పరమదత్తుఁడు భార్యను బిడ్డను
వెంట నిడుకొని వచ్చి పుణ్యవతికి సాష్టాంగనమస్కారము లాచరించి
"మీయనుగ్రహముచే సుఖముగాఁ గాలము గడపుచున్నాను. ఈదా
సునిమీఁద నెప్పుడు నిట్టి యనుగ్రహమును జూపుచుండవలయును"
అనిప్రార్థించెను ఆశ్చర్యచకితులై పుణ్యవతి ప్రక్కకుఁ దొలఁగఁగా బందు
గులు "భార్యకు ఇట్లు నమస్కరించుట తగునా?" యని ప్రశ్నించిరి.
అది విని యాతఁడు "ఈమె సహజము మీకుఁ దెలియదు. ఈమె మానవ
వరూపము దాల్చిన లోకజనని గాని వేఱుగాదు. తెలిసిన తరువాత
నామెతోఁ గాఁపురము సేయుట అధఃపతనమునకుఁ గారణమని ఎఱింగి
నేను ఇట్లు ఇక్కడ నుంటిని. ఆమె నామమే సంసారమున మునిఁగియు
న్నపుడుగూడ నన్ను బవిత్రము సేయు నని భావించి నాకొమార్తకు
పుణ్యవతి యని యామెపేరు ఉంచుకొంటిని" అని బదులు చెప్పెను.
అపుడు పుణ్యవతి "పరమేశ్వరా, నాభర్త యానందముకొఱకు నేను
ఇట్లు అలంకారములు ధరించి సుందరిగా నుండఁగోరితిని. నాభర్త నన్ను
దిరస్కరించెను; గావున ఇఁక నాకు ప్రేతశరీరమును దయచేయుము"
అని ప్రార్థించెను. తోడనే ఆమె మేనునున్న ఆభరణములు అన్నియు
దుల్లిపోయెను. శరీరమునందలి రక్తమాంసములు మాయమైపోయెను.
అస్థిపంజరముమాత్రము నిలిచెను. అది చూచి బందుగులెల్లరును పుణ్య
వతి సాక్షాల్లోకజననియే యనియు లోకమును రక్షించుట కామె యిట్లు
అవతరించె ననియు నిశ్చయించుకొని ఆమెకు సాష్టాంగదండప్రణామము
లర్పించి యెవరి యింటికి వారు పోయిరి. పరమదత్తుఁడు తనయింటికిఁ
బోయెను.

అంతట పుణ్యవతి "ఇఁక నిక్కడ నెందులకు?" అని యూహించి
కైలాసమునకు బయలుదేఱెను పరమశివుని యనుగ్రహమువలన ఆమె
వాయువేగమనోవేగములఁబోయి కైలాసమును సమీపించెను. అప్పుడు
ఆమె "ఇది కైలాసపర్వతపాదభూములు. ఇక్కడ కాళ్లతో నడువఁగూ
డదు" అని భావించి శిరముతో నడచి కైలాసగిరిమీఁదికిఁ బోయెను.
ఆమెను పార్వతీదేవి చూచి మిగుల నాశ్చర్యపడి పరమశివునకుఁ జూపి
"ఆమహాత్మురాలిచరిత్రము అద్భుతముగా నున్నది. నాకుఁ దెలుపవల

యును అని కోరెను. "ఆమె మనలను సంతతమును వినుతించుచుండు అంబ. ఆమె కోరి యిట్టిదేహమును బొందెను" అని శివుఁడు చెప్పెను. ఇంతలో పుణ్యవతి పార్వతీపరమేశ్వరులనుసమీపింపఁగా, శివుఁడు"తల్లీ! రా" అని ఆదరవచనములు ఆడెను. పుణ్యవతి ఆపురాణదంపతులకు మ్రొక్కి, 'తండ్రీ' అని మ్రొక్కెను. పరమశివుఁడు ఆనందించి 'నీకు ఏమివరము కావలయును?' అని యడిగెను. అంతట నామె "పరమేశ్వరా, నాకు పునర్జన్మ లేకుండునట్లు అనుగ్రహింపుము. ఒకవేళ పునర్జన్మ ఘటించెదవేని నీనామమును స్మరించుచు నీగుణములను గీర్తించుచు నృత్యసమయమున ఆనందించుచు నుండునట్లు అనుగ్రహింపుము" అని ప్రార్థించెను. పరమశివుఁడు "పుణ్యవతీ, నీవు దక్షిణదేశమునందలి తిరువాలంగాడులో వసించుచు నానృత్యముఁ జూచుచు నన్ను వినుతించుచుండుము" అని ఆజ్ఞాపించెను. పుణ్యవతి వెంటనే తలతో నడచి తిరువాలంగాడు చేరి శివుఁడు ఆనతిచ్చినట్లే చేయుచు శివానందమున మైమఱచి యుండుచుండెను.

92. బాలభక్తనాయనారు.

చోళదేశమునందలి తిరుచ్చెంగాట్టంగుడియనుగ్రామమున బాలభక్తుఁడు అను నొక మహామద్రబ్రాహ్మణుఁడు ఉండెను. ఆతఁడు అశ్వవిద్యయందును, శస్త్రవిద్యయందును, విశేషించిఆయుర్వేదమునందును మహానిపుణుఁ డయ్యెను. ఆతనికి వేదసారము గ్రహింపఁ దలంపు గలిగెను. ఆయూహతో నాతఁడు పరమశివుని ధ్యానించుచుఁ గీర్తించుచు నుండఁగా శివుఁడే పరమేశ్వరుఁ డని యాతనికి విశ్వాసముదోఁచెను. ఎప్పుడు ఇట్టినమ్మకము కలిగెనో అప్పటినుండియు ఆతఁడు శివభక్తులను బూజించుచు మృష్టాన్నదానాదులచే వారిని సంతృప్తులంగావింపఁ జొచ్చెను. బాలభక్తునకుఁ దొల్లిటి పేరు పరంజ్యోతి.

ఆతఁడు చోళరాజు నాస్థానమున ముఖ్యసేనాని యుద్యోగము నిర్వహించుచుండెను.ఆతఁడు ఒకప్పుడు ఉత్తరదేశమునకుఁబోయిఅచ్చటఁ గొందఱు రాజులను జయించి అసంఖ్యధనమును గజాశ్వాదులను దెచ్చి తన రాజునకు సమర్పించెను. అపుడు మంత్రి రాజుతో "పరం

జ్యోతియన సామాన్యునిగాఁ దలంపఁగూడదు. అతఁడు అచంచల శివభక్తుఁడు. నిజముగ అవతారపురుషుఁడు" అనిచెప్పెను. అదివిని రాజు "అయ్యో, తెలియక ఈమహానుభావుని వలనఁ బనిగొంటినిగదా?" యనివగచి అసంఖ్యధనము నిచ్చి పరంజ్యోతిపాదముల మీఁద వ్రాలి "స్వామీ, దాసుని అపరాధముక్షమించి ఈధనమును స్వీకరించి సతతమును పరమశివునిబూజించుచు శివభక్తులనుఆరాధించుచు లోకముయుజ్జీవింపఁజేయుచుండుఁడు" అని పలికెను పరంజ్యోతి వల్లెయని యాధనము నుగైకొని ఇంటికిఁబోయి అచ్చట వెలసియున్న పరమశివునిబూజించుచు భార్యయైన తిరువెంగాడునంగై యను నామెతోఁగూడి పరమశివుని శివభక్తులను బూజించుచు నుండెను.

కొన్నిదినములు గడచినతరువాత తిరువెంగాడునంగై గర్భవతియై గణపతిప్రసాదమున ఒకకుమారునిఁ గనియెను. తలిదండ్రులు బిడ్డకు శ్రీయాళుఁడు అనిపేరుపెట్టి మిగుల గారాబముతోఁ బెంచుకొనుచు అయిదవయేట అక్షరాభ్యాసము గావించిరి. అప్పుడు జ్ఞానసంబంధమూర్తినాయనారు మార్గవశమున నచ్చటకు వచ్చి శ్రీయాళునివృత్తముతో వినుతించెను.

ఒకప్పుడు పరమశివుఁడు పరంజ్యోతిని పరీక్షింపఁ దలంపు గలిగెను. అంతట నాతఁడు ఒక జంగమువేషము ధరించి వచ్చెను. పరంజ్యోతియింటిదాసి "యజమానులు ఆరాధనార్థము జంగములం గొనివచ్చుటకు పోయియున్నారు. ఇప్పుడే వచ్చెదరు. దయచేయుఁడు" అనెను; గాని అతఁడు అందులకు సమ్మతింపలేదు. అంతలో పరంజ్యోతి భార్యయగుతిరువెంగాడునంగై అచ్చటకువచ్చి అట్లేప్రార్థించెను గాని జంగము "నేను పురుషులు లేనిచోట నుండను. నేను గణపతియాలయమున నుందును. నాయనారు వచ్చిన తరువాత నాసంగతిఁ దెల్పుఁడు" అని చెప్పి గణపతి ఆలయమునకుఁ బోయి ఒకచెట్టుక్రిందఁ గూర్చుండెను. పరంజ్యోతి ఊరంతయు వెదకెను గాని యొక్క జంగము అయినను అతనికి గాన్పింపలేదు. అంతటఁ జేయునదిలేక అతఁడు ఇంటికి రాఁగా భార్య జరిగినదంతయు నెఱింగించెను. పరంజ్యోతి అపుడు మహానందముతో గణపతిఆలయమునకుఁ బోయి జంగముని ఆరాధనకు దయచేయవలయు నని ప్రార్థించెను.

జంగము, "నేను నీయాహ్వానము నంగీకరించెదను; గాని నాకొక నియమము ఉన్నది. ఆఱు నెలల కొకసారి నేను పశువును వండించుకొని తిందును. నేఁడు ఆదినము; కావున నీవు పశువును వండించి పెట్టఁగలవా!" అని యడిగెను. పరంజ్యోతి తనకుఁ జాల పశువులు ఉన్నవనియు అట్లే చేయించెద ననఁగా "నాయభిప్రాయము నీకుఁ దెలియలేదు. పశువు అనఁగా నాలుగు కాళ్ల పశువుగాదు. రెండు కాళ్ల నరపశువు. అది యొకటే ఆకుటుంబమునకు భాగ్యాధారమై యుండవలెను. అయిదేండ్ల ప్రాయమున నుండవలెను. తల్లి పట్టుకొని యుండఁగా తండ్రి ఖండింపవలెను. ఎవరును విచారింపఁగూడదు. మహానందముతో నుండవలెను. తిను వారిని తిట్టఁగూడదు. అట్లయిన నేను నీయింట విందు స్వీకరించెద"నని జంగము బదులు చెప్పెను. "నాయింట నట్టిపశువు గలదు. మీరు కోరినప్రకారము చేసెదను. దయచేయుఁడు" అని పరంజ్యోతి మఱల ప్రార్థించెను. జంగము అంగీకరించి బయలు దేఱెను.

పరంజ్యోతి ఇంటికి వచ్చి సంగతి అంతయు నెఱింగించెను. ధర్మవతి అట్టి బాలుఁడు ఎక్కడ దొరకు ననఁగా 'మన పిల్లవాఁడే అన్నిటికిఁ దగియున్నాఁడు' అని పరంజ్యోతి చెప్పెను. ధర్మవతి ఆనందముతో నంగీకరించి బాలుని స్నానముచేయించి పట్టుకొనఁగా పరంజ్యోతి ఖండించెను శిరస్సు పనికిరాదని విసర్జించి ధర్మవతి తక్కిన అవయవములనన్నిటిని వండెను. వంటయయిన తరువాత పరంజ్యోతి ప్రార్థింపఁగా జంగము భోజనశాలకు వచ్చెను. ధర్మవతి వడ్డించెను. 'ఇందు తలకాయమాంసము ఉన్నట్లు తోఁచదు' అని జంగము అనఁగా 'పనికిరాదని మానివేసితి' నని ధర్మవతి చెప్పెను. దాసి, 'అది చాలదేమోయని శిరస్సుగూడ వండితిని', అని తెచ్చి వడ్డించెను. జంగము 'తోడు లేక నేను భుజింపను; గావున రెండవజంగమును గొనిరమ్ము' అని పలుకఁగా పరంజ్యోతి 'ఊరంతయు వెదకితిని. ఎందును గాన్పింపలేదు' అనియెను. జంగము 'నీవే ర'మ్మనఁగా పరంజ్యోతివచ్చి కూర్చుండెను. 'నీకొడుకును గూడఁ దీసికొనిరమ్ము' అని మఱల జంగము పలికెను. 'వాఁడు ఇప్పుడు వచ్చుటకు వీలులే'దనఁగా 'వీథిలోనికిఁబోయి పిలువుము. వాఁడు రాకున్న నేనుభుజింప'నని జంగము అనెను. అంతటచేయునదిలేక ధర్మవతి వీథిలోనికిఁబోయి పిలువఁగా శ్రీయాళుఁడు పరుగుపరుగున వచ్చెను. ధర్మ

వతి కుమారుని ముద్దిడుకొని తీసికొనివచ్చి పరంజ్యోతికి ఇచ్చెను. ఆతఁడును ఆనందముతో ముద్దిడుకొని "జంగము సెలవైనది రమ్ము" అని భోజనశాలలోనికి దీసికొనివచ్చిచూడఁగా జంగము అదృశ్యుఁడు అయ్యెను. వడ్డించినమాంసముకూడ కనఁబడదాయెను. అంతట పరంజ్యోతి జరిగినదానికి ఆశ్చర్యమును తనకుమారుఁడు మఱల బ్రతికినందులకు ఆనందమును జంగము భుజింపకుండఁ బోయినందులకు విచారమును బొందుచుండఁగా, ఈశ్వరుఁడు పార్వతీసహితుఁడై వృషభారూఢుఁడై ఆకాశమున దర్శన మొసంగి సంగతియంతయు వివరించి చెప్పి తనతో నెల్లపుడు నుండుటకు పరంజ్యోతిని, ధర్మవతిని, శ్రీయాళుని, దాసియగు చందనవతిని కైలాసమునకు గొనిపోయెను.

---

93. చేరమాన్ పెరుమాళ్ నాయనారు.

మలనాడున రాజధాని యగు మహోదయ మను మాఱుపేరు గల కొడుంగోళూరిలో గుమహోదయుఁడను మాఱుపేరుగల చేరమాన్ పెరుమాళ్లు అను నాతఁడు శైవమతమును అభివృద్ధిచేయుటకు చేరవంశమున అవతరించెను. దైవకృపవలన ఆతనికి బాల్యమునందే శివభక్తి యలవడి కాలక్రమమున వృద్ధి యయ్యెను. తుదకు ఆతఁడు పరమశివుఁడు స్వతంత్రుఁడు అనియు మానవులతోఁ గూడ తక్కిన వారందఱును అస్వతంత్రులు అనియు శివపూజయే తారక మనియు నిశ్చయించి ఇఁక సంసారమున నుండినచో చెడిపోవుట నిశ్చయమని సిద్ధాంతము చేసికొని, రాజకార్యములను విడిచి తిరువంజక్కళ మను శివస్థలమునకుఁ బోయి శివపూజాధురంధరుఁడై యుండెను.

ఆ దేశమునకు చెంగప్పగుఁడు అను నాతఁడు రాజు. ఆతఁడును బాల్యమునందే పురాకృతసుకృతపరిపాకమున సత్యాసత్యవివేకము నెఱింగి మోక్షము సంపాదింపవలయు ననియు నది యోగాభ్యాసము వలన లభ్యమగు ననియు నిశ్చయించుకొని రాజ్యమును విడిచి అరణ్యమునకుఁ బోయెను. అపుడు మంత్రులు రాజులేని రాజ్యము చెడిపోవు

నని గ్రహించి తమరాజు మఱల నెట్లును సింహాసనము నధిష్ఠింపఁడని నిశ్చయించుకొని తిరువంజక్కళమున నున్న చేరమాన్ పెరుమాళ్ళు చెంతకుఁ బోయి సంగతిసందర్భములు అన్నియు నెఱింగించి "సింహాసనమును స్వీకరింపవలెనని ప్రార్థించిరి. అంతట నాతఁడు "సింహాసనము నలంకరించినచో విషయసౌముఖ్యము గలుగును. ఇఁకఁ జెప్పవలసినది ఏమున్నది? ననుబోలు నిర్లిప్తునకు రాజ్యాధిపత్యము అంగీకార్యముగాదు. అయినను మీప్రార్థనమును నాకు నేను త్రోసివేయఁజాలను. స్వామికి సకలమునునివేదించెదను. స్వామియాజ్ఞ చొప్పున వర్తింతము" అని నాఁటి సాయంత్రము పూజాసమయమున స్వామి యెదుట నంతయు విన్నవించెను. రాత్రి స్వామి స్వప్నమున సాక్షాత్కరించి "నీవు లోకము నుజ్జీవింపఁజేయుటకు అవతరించితివి. రాజ్యాధిపత్యము వలన ప్రజలు స్వాధీన ముగుదురు. అపుడు నీవు శైవాగమమును వ్యాపింపఁజేయవచ్చును" అని పలికెను. మఱునాఁడు పెరుమాళ్లు స్వామి ఆజ్ఞను వెల్లడించి మంత్రులమాటల నంగీకరించెను.

శుభముహూర్తమున మంత్రులు పెరుమాళ్లును సింహాసనము నధిష్ఠింపఁజేసి పట్టబంధనమహోత్సవము నెఱపి ఏనుఁగుమీఁద నూరేగించుచు మహోత్సవమును బయలుదేఱఁదీసిరి. కొంతదూరము వెళ్లునప్పటికి ఒక చాకలవాఁడు నెత్తిమీఁద మట్టితట్టను బెట్టుకొని వచ్చుచుండెను. తొలుత వర్షముకురియుటచే మన్నుకరఁగి వాని శరీరమంతయునిండి పిదప నెండకాయఁగా ఎండి తెల్లనై రజకుని భస్మానులిప్తుఁడగు మహేశ్వరునివలెఁ గనఁబడఁ జేసెను. అంతట పెరుమాళ్లు ఆచాకలవాఁడు మహేశ్వరుఁడుగా కాన్పింపఁగా ఏనుఁగు దిగివచ్చి "స్వామీ, సేవకుని అనుగ్రహించినందులకు వందనములు" అని మ్రొక్కెను. అది చూచి రజకుఁడు తెల్లవోయి కొంత తడవునకు జ్ఞానమురాఁగా "ప్రభూ, నేను చాకలవాఁడను. ఏలినవారి దాసుఁడను. ఇట్లు తమకు ధర్మమా?" యని తత్తఱపడసాగెను. "దేవరవారిట్లు సేవ ప్రసాదించినారు. దాసుఁడు అంతకే ఆనందించుచున్నాఁడు" అని పలికి ఉత్సవమును ముందునకు నడపుకొని పోయెను. ప్రజలు ఆతనిభక్తి శ్రద్ధలను జూచి అత్యాశ్చర్యపడిరి. అప్పటినుండియు పెరుమాళ్లు అనేకవిధముల శైవమతమును వృద్ధి చేయసాగెను.

పెరుమాళ్లు అనేకశివస్థలములను దర్శించి అందందు వెలసియున్న పరమశివుని సేవించి స్వస్థలముఁ జేరుకొనెను. ఒకప్పుడు మధురయందు అవతరించియున్న సోమసుందరేశ్వరుఁడు తన అంతరంగభక్తులలో అగ్రేసరుఁడగు బాణభద్రునకు సకలైశ్వర్యములనొసంగఁదలఁచి ఒకరాత్రి స్వప్నమున సాక్షాత్కరించి నీకు సకలైశ్వర్యములను ఒసంగఁదలఁచితిని. చేరమాన్ పెరుమాళ్లు పేర నొక చీటి నిచ్చెదను దానిని గొనిపోయి అతనికిమ్ము. సకలమును నెఱవేర్చును" అని చెప్పి యొకచీటి నిచ్చెను. మఱునాఁడు బాణభద్రుఁడు ఆచీటినిఁ గైకొని పెరుమాళ్లు చెంతకుఁ బయలుదేఱెను. పెరుమాళ్లు బాణభద్రుఁడు వచ్చుచున్నాఁడని విని పురము బైటకు ఎదురేగి సవైభవముగా నాస్థానమునకుఁగొనివచ్చి రత్నాసనమునఁగూర్చుండఁజేసి అర్ఘ్యపాద్యాదిక మిచ్చి పూజించి ఆగమనకారణ మడిగెను. అపుడు బాణభద్రుఁడు మాఱుపలుకక చీటి సీయఁగా పెరుమాళ్లు చదువుకొనిమహానందభరితుఁడై "సోమసుందరేశ్వరస్వామికి నేఁటికి నామీఁద అనుగ్రహము గలిగినదా?"యని కొనియాడుచు చీటిసంగతి మంత్రులకు ఎఱింగించి "కోశమున సకలమును బాణభద్రుని యింటనుంచిరండు" అని ఆజ్ఞాపించెను. మఱియు బాణభద్రుఁడు మధురకుఁ బోయెద ననఁగా పెరుమాళ్లు "స్వామీ, రాజ్యముగూడ స్వీకరించి దాసునిసేవ నంగీకరింపవలయుననిప్రార్థించెను. అందులకు బాణభద్రుఁడు "రాజ్యమును స్వీకరించుటకు పరమశివుని యనుజ్ఞ లేదు." అని చెప్పి వెడలిపోయెను.

ఒకనాఁడు పెరుమాళ్లు చిదంబరమున కనకసభాపతినిఁ బూజించునపుడు "నేఁడు స్వామి నూపురధ్వని వినరాదయ్యెను. ఇఁక నీపాడు జీవన మెందులకు?" అని కటారితోఁ బొడుచుకోఁబోఁగా స్వామి తటాలున సాక్షాత్కరించి "వత్సా, త్వరపడవలదు. సుందరమూర్తి నాయనారు వృత్తజాలముతో వినుతించుచుండఁగా ఆకవితామాధుర్యమునకు పరవశుఁడనై జాలము చేసితిని" అని పలికి సాహస ముడిపెను.

పిదప పెరుమాళ్లు సుందరమూర్తినాయనారును జూడఁగోరి తిరువాలూరికిఁ బోయి సేవించి ఆతనితోఁగూడి అనేకశివస్థలములను దర్శించి తుదకు ఆతనిని వెంటనిడుకొని కొడుంగోళూరికి వచ్చి చేరుకొనెను. సుందరమూర్తి కొన్నిదినములు అక్కడనుండి తరువాత తిరు

వాలూరికిఁ బ్రయాణము కాఁగా పెరుమాళ్లు భాండాగారమునఁ గల సకలధనరాసులను ఇచ్చి పంపించెను.

మఱియొకమాఱు శివస్థలములను సేవించుచు మార్గవశమున సుందరమూర్తి కొడుంగోళూరికి వచ్చెను పెరుమాళ్లు ఎదురేఁగి మహా వైభవముతోఁ బట్టణమునకుఁ గొనివచ్చి చాల నాదరించి మంచి బసలోఁ బ్రవేశపెట్టి విందులుచేసెను. ఒకనాఁడు భక్తిపరవశుఁడై సుందరమూర్తి వృత్తజాలముతో నుతించుచుండఁగా కైలాసమునుండి తెల్లని యేనుఁగువచ్చి ఎదుట నిలిచెను. "నీవు కైలాసమునకు రమ్ము" అను అశరీరవాక్యముగూడ వినవచ్చెను. వెంటనే సుందరమూర్తి ఏనుఁగు నెక్కెను. ఆవెంటనే ఏనుఁగు కైలాసమునకు బయలుదేఱెను. అది చూచి పెరుమాళ్లు ఇఁక జాలము చేసినఁ బ్రయోజనము లేదని తటాలున గుఱ్ఱము నెక్కి దానిచెవిలో పంచాక్షరి నూఁదఁగా అదిగూడ ఏనుఁగువెనుక కైలాసమునకు బయనము సాగించెను. అది చూచి పెరుమాళ్లు ననుచరులలో ఆతనియెడల అవ్యాజభక్తిగలవారు ఆతని వియోగమును సహింపఁజాలమని ఆత్మహత్య గావించుకొనిరి.

పెరుమాళ్లు సుందరమూర్తితోఁ గైలాసమునకుఁబోయెను. ఇరువురును ద్వారమువద్ద వాహనములు దిగిరి. ప్రమథులు వచ్చి సుందరమూర్తిని స్వాగతమిచ్చి లోనికిఁ గొనిపోయిరి; గాని పెరుమాళ్లును దౌవారికులు అడ్డగించిరి. సుందరమూర్తి అది చూచి పరమశివుని దగ్గఱకుఁ బోయిన తరువాత "స్వామీ, మహానుభావుఁడగు చేరమాన్ పెరుమాళ్లునాయనారు ద్వారమున వేచియున్నాఁడు; సెలవు ఈయవలె"నని ప్రార్థించెను. అంతట పరమశివుని అనుజ్ఞనుబడసి ప్రమథులు ద్వారమున నున్న పెరుమాళ్లును లోపలకుఁ గొనిపోయిరి. పెరుమాళ్లు స్వామికి సాష్టాంగనమస్కారములు ఆచరించినపిదప స్వామి "ఎందులకు వచ్చితివి ఇక్కడకు?" అని అడిగెను. అందులకు పెరుమాళ్లు "స్వామీ! సుందరమూర్తినాయనారును ఎడఁబాసి యుండలేకయు, ఈ దాసుఁడు రచించిన స్తోత్రవృత్తములు సమక్షమున వినిపింపవలయు ననియు విశేషించి దేవరవారిని దర్శించి జన్మసాఫల్యమును బడయవలయుననియు వచ్చితిని" అనిచెప్పెను పరమశివుఁడు పెరుమాళ్లుకవితామాధుర్యమునకు చాల మెచ్చి గణాధిపత్యము నొసంగి ఆదరించెను.

94. కలిక్కామనాయనారు.

చోళదేశమునందలి తిరుప్పెరుమంగలము అను గ్రామమున కలిక్కామనాయనారు అను నతఁడు ఒకఁడు ఉండెను. కులమున ఆతఁడు వెలను. చోళరాజులకు ఆతని వంశమువారు సేనాధిపతులుగా నుండిరి. అది యాకుటుంబమునకు పారంపర్యాధికారమై యుండెను. కలిక్కామనాయనారు గొప్పశూరుఁడు. అనేకయుద్ధములలో జయముబడసిన వీరాధివీరుఁడు. మఱియు అచంచలశివభక్తుఁడు ఆతఁడు తిరుప్పుంగూరి శివాలయమునకు అనేకధర్మకార్యములు చేసెను.

సుందరమూర్తి పరవ అనువారి కాంత ఇంటికి దౌత్యము చేయుటకు పరమశివునిఁ బంపియుండెను. ఆవార్త కర్ణాకర్ణిగా కలిక్కామనాయనారునకుఁ దెలిసెను. అదివిని కలిక్కామనాయనారు దండతాడితభుజంగము రీతి ఆగ్రహమహోగ్రుఁడై "ఈనీచుఁడు ఒడలు తెలియక క్రిందుమీఁదెఱుంగక పరమేశ్వరుని తుచ్ఛురాలగు వారసతియింటికి దౌత్యమునకు పంపునా! వీనిని ఏమిచేసినను పాపములేదు. ఇఁక వీఁడు ఎందునకును బనికిరాఁడు. వీని మొగముచూచిన పాపమగును" అని నిశ్చయించుకొని "పరమశివా", ఆనీచుఁడు బుద్ధిలేక పంపెననుకొందము; గాని నీవు ఆపనికి ఎట్లు అంగీకరించితివి! ఎట్లు పోయితివి? అతిశుద్ధములగుభక్తుల అంగణములు త్రొక్కుటకు సందేహించు నీవు పడుపుకత్తెయింటికి ఎట్లు పోయితివి!" అని యిట్లు అనేకవిధముల ననుకొనసాగెను. మఱియు సుందరమూర్తిమీఁద చాల నసూయవహించెను.

ఈసంగతి సుందరమూర్తి గ్రహించి పరమశివునకు విన్నవించెను. పరమశివుఁడు వారిరువురకును సఖ్యము చేయనెంచి, కలిక్కామనాయనారునకు తీవ్రమగు శూలరోగమును కలిగించెను. ఆబాధను తాళఁజాలక శివుని స్తుతింపఁగా స్వప్నమున సాక్షాత్కరించి, 'సుందరమూర్తివలన నీవ్యాధి మాపుమాయఁగలదు' అని పలికెను. అదివిని కలిక్కామనాయనారు "ఈశ్వరా, నీవు సర్వశక్తుఁడవు. నీవు కుదుర్పవలసిన వ్యాధిని ఒక నీచునివలన కుదుర్పఁజూచుట భావ్యముగాదు. వానిచే నీబాధను తొలఁగించుకొనుటకంటె నేను ఈబాధను అనుభవించు

టయే మంచిది” అని పలికెను. ఈమాటలు వినుచునే పరమశివుఁడు తిరోహితుఁడు అయ్యెను.

వెంటనే శివుఁడు సుందరమూర్తి స్వప్నమున సాక్షాత్కరించి “కలిక్కామనాయనారు శూలరోగముచే బాధపడుచున్నాఁడు. నీవు పోయి ఆబాధను తొలఁగింపుము” అనిచెప్పి అంతర్హితుఁడు అయ్యెను.

సుందరమూర్తి వెంటనే బయలుదేఱి తిరుప్పెరుమంగళమును సమీపించి“శూలరోగము కుదుర్చుటకు వచ్చుచున్నాను”అని కలిక్కామనాయనారునకు వార్తనంపెను. ఆవృత్తాంతమును విని కలిక్కామనాయనారు ‘ఆయపాత్రునిఁ జూచుటకంటె మరణము మేలు’ అని నిశ్చయించుకొని కటారితోఁ బొడుచుకొని ప్రాణములు విడిచెను. కొంతసేపటికి సుందరమూర్తి అక్కడకు వచ్చెను. అందఱను నిశ్శబ్దముగా నుండ నియమించి కలిక్కామనాయనారుభార్య సుందరమూర్తికి స్వాగత మిచ్చి ఆదరించెను. అపుడు సుందరమూర్తి ‘ఈయాదరము లిప్పుడు వలదు. తొలుత కలిక్కామనాయనారును జూపవలయును’ అనెను. పరిచారకులు అందులకు ‘వారు నిద్రించుచున్నారు” అని చెప్పిరి; గాని సుందరమూర్తి “అయినను వారిని నేను ఇప్పుడే చూడవలయును”అని పట్టుపట్టెను. చేయునదిలేక వారు ఆతనిం జూపిరి. అంతట సుందరమూర్తి సకలమును జూచి “కలిక్కామనాయనారు లేనిభూలోకమున నుండఁగూడదు” అని నిశ్చయించుకొని చనిపోవుటకు తానుగూడ పొడుచుకొనఁబోయెను. అంతట హఠాత్తుగ ఈశ్వరుఁడు సాక్షాత్కరించి సుందరమూర్తి చేయి పట్టుకొని కలిక్కామనాయనారును బ్రతికించి తిరోహితుఁడు అయ్యెను.

పిమ్మట నాయనారులు ఇరువురును ఒకరి కొకరు నమస్కరించుకొని చాలా నాదరించుకొని గౌరవించుకొనిరి. సుందరమూర్తి కలిక్కామనాయనారు ఇంట విందు కుడిచి ఆతనిం దనయూరికిఁ గొనిపోయి విందు పెట్టెను.

పిదప కలిక్కామనాయనారు బ్రతికియున్నంతకాలమును శివపూజాధురంధరుఁడై యుండి అవసానమునశివసాయుజ్యమునుబడసెను.

95. సద్వస్తునాయనారు.

చేదిదేశమున తిరుక్కోవలూరు అను గ్రామమున మెయ్‌ప్పొరు నాయనారు అను నొకయాతఁడు ఉండెను. ఆతఁడు మలయమహానాడునకు ప్రభువు. వేదశాస్త్రముల గుప్తార్థముల నెఱింగినవాఁడు. మఱియు శివభక్తుల యుదయమే సద్వస్తువు అనితలంచువాఁడు; కావున నాతనికి సద్వస్తునాయనారు అని పేరువచ్చెను. ఆతఁడు రాజ్యపాలనమున ఏలోపమును లేకుండునట్లు నడచెను. శివక్షేత్రములయందు అక్రమములును, లోపములును లేకుండునట్లు ఏర్పాటు చేసెను. శివభక్తులను నిరంతరము సేవించును. శివపురాణములయందు ఆతనికి చాల నాసక్తి యుండెను.

ఒకప్పుడు ముక్తినాథుఁడు అను నొక ఇరుగుపొరుగు రాజు యుద్ధమునకు వచ్చి కోట ముట్టడించెను. సద్వస్తునాయనారును సంకోచింపక సకలమును సన్నద్ధము గావించుకొని ఎదిరించెను. పోరు ఘోర మయ్యెను. ఇరువాఁగులవారును చాల పట్టుదలతోఁ బోరసాగిరి. నాలుగైదు దినములు గడచునప్పటికిముక్తినాథునకు జయించుటకష్టమనితోఁచెను. అంత నాతఁడు మోసము చేసి జయము బడయనెంచి శివభక్తునివలె విభూతిని జడలను కాషాయాంబరములను దాల్చి బాకును పుస్తకమువలెఁ గట్టుకొని నిశీథమునఁ గోటదెసకు బయలుదేఱెను.

సద్వస్తునాయనారు శివభక్తులను అత్యంతాదరముతోఁ బూజించుట యెఱుంగుదురు; గావున భటులు తలుపులు తెఱవకయే ఆతని నెట్లో కోటలోఁ బ్రవేశపెట్టిరి. "ఇఁక మనము కోటలోఁ బాగావేశితి మని యానందించుచు నాతఁడు కవాటములు అన్నియు దాఁటి రాజు శయనించియున్న మేడచెంతకుఁబోయెను. రక్షకపురుషులు 'రాజు గాఢనిద్రం దవిలియున్నాఁడు' అని చెప్పిరి; గాని 'వలనుపడదు. నిలిచియుండఁగా మేము సద్వస్తునాయనారుం జూడవలెను. వారికిపుడు మేము యుద్ధములోజయముబడయుటకుమంత్రోపదేశముచేయవలసియున్నది. అందులకు ఇదియే సమయ'మని జంగమవేషధారి యగు ముక్తినా

థుఁడు పలుకఁగా రక్షకభటులు నిజము కాఁబోలు ననుకొని లోపలకుఁ బోనిచ్చిరి.

అప్పుడు సద్వస్తునాయనారు రాజు రాణితో నేకశయ్యపైఁబరుండి యుండెను; గాని రాణి అప్పటికింకను మేల్కొనియున్నది; గావున తటాలున లేచి నమస్కరించి భర్తను లేపెను. సద్వస్తునాయనారును లేచి ఎదుట సాక్షాత్పరమశివునివలె నిలిచియున్న జంగమునిఁ జూచి సాష్టాంగ దండప్రణామములు ఆచరించి 'దాసుఁడు ఆజ్ఞలకై వేచియున్నాఁడు' అని పలికెను 'శివాజ్ఞచే ఈయుద్ధమున జయము కలుగుటకై నీకొక మంత్రమును ఉపదేశించుటకు వచ్చితిమి. నీవును మేమును దక్క నిక్కడ మఱియెవ్వరు నుండఁగూడదు.' అని జంగమము చెప్పెను. రాజు రాణిని పంపివేసి 'ఇంకేమి?' యనెను. 'నీవు నాకు సాష్టాంగపడి భగవంతుని ప్రార్థింపుము' అని జంగము ఆజ్ఞాపించెను. రా జట్లే చేసెను. తోడనే ముక్తినాథుఁడు ఆయుధమును విప్పి సద్వస్తునాయనారును నఱికెను.

రాజు ముఖ్యానుచరులలో దత్తుఁడనువాఁడు ఒక్కఁడు. ఆతఁడు జంగము అసహాయముగ అంతఃపురము సొచ్చుటఁ జూచి అనుమానించి వెంట వచ్చి తలుపుచాటున నక్కియుండెను; గావున ఈపని జరిగిన వెంటనే కటారిదూసి జంగముపైఁబడి పొడువఁబోయెను అంతట సద్వస్తునాయనారు, 'వలదు, వలదు. నాకు సంగతి యంతయు నిప్పుడు బోధపడినది అయినను ముక్తినాథుఁడు ఇప్పుడు జంగమవేషధారియై యున్నాఁడు; గావున ఆతనియందు కొంచెమైనను శివాంశ యుండకపోదు. నాకిది యకాలమరణమే యైనను నాకు సద్గతి కరతలామలక మగును. ఇట్టి యుపకారమును జేసిన ముక్తినాథునకు నీవు అపకారములుచేయ వలదు' అని యాజ్ఞాపించెను. రాజాజ్ఞను జవదాఁటఁ జాలక దత్తుఁడు మాఱుపలుకక యూఱకుండెను. అపుడు రాజు మఱల 'దత్తుఁడా, నీవలెనే ముక్తినాథుఁడు చేసిన పనిని మనవారు అనేకులు చూచి యుందురు. వారందఱును ఈతనిని సంహరించుటకు వేచియుందురు. అట్టిది ఏమియు జరుగకుండ నీతనిని కోట దాఁటించిరమ్ము' అని చెప్పెను. దత్తుఁడు అట్లే యని ముక్తినాథుని వెంట నిడుకొని బయలుదేఱెను. దారిలో రక్షకభటులు అనేకులు ముక్తినాథునిఁ బొడువఁబో

యిరి; గాని దత్తుఁడు రాజాజ్ఞను దెలిపి వారి నందఱను వారించెను. ముక్తినాథుఁడు కోట దాఁటిపోయెను. దత్తుఁడు అపుడు వెనుకకు మఱలి తనకొఱకు నిరీక్షించుచున్న సర్వస్తునాయనారు చెంతకు వచ్చి సంగతి యంతయు నెఱింగించి, ఆతని యాజ్ఞచే బాకు లాగివేసెను. తోడనే ప్రమథులు సర్వస్తునాయనారు ఆత్మను శివలోకమునకుఁ గొనిపోయిరి. పరమశివుఁడు దానిని తన అనంతతేజస్సులో లీనము చేసికొనెను.

96. ఎరిభక్తనాయనారు.

కొంకణదేశమున రాజధానియగు కరువూరునందు ఎరిభక్తనాయనారు అను నొక మహాత్ముఁడు ఉండెను. ఆతఁడు శివాగమములను బాగుగఁ జదువుకొనెను. శివభక్తులను సేవించుటయనినను శివపురాణములనుజదువుట యనినను వినుటయనినను అతనికి ఎంతో ప్రీతి. ఆతఁడు ఆయుధవిద్యలోఁ జాల నిపుణుఁడగుటచే శివభక్తులకు ఏమయిన నాపదలు సంభవించునెడల నెట్టి సాహసకార్యమునైనను జేసి వారిని రక్షించును.

ఆగ్రామమున శివకామియాండారు అను మఱియొక శివభక్తుఁడు ఉండెను. ఆవృద్ధుఁడు అనుదినమును స్నానసంధ్యాద్యనుష్ఠానములను నిర్వర్తించుకొని పూలుకోసి మాలలు కట్టి స్వామికి సమర్పించుచుండును. ఒకనాఁడు ఆతఁడు పుష్పమాలికలను ఆలయమునకుఁ గొనిపోవుచుండఁగా ఆపట్టణము నేలు కీర్తిచోళమహారాజుగారి పట్టపుటేనుఁగు ఆదారిన బోవుచు వృద్ధుని చేతిలో నున్న పూలసజ్జను తొండముతో నూడఁబెఱికికొని నలిపి వేసి దూరముగా బాఱవేసెను. అది చూచి శివకామియాండారు ఆగ్రహమహోగ్రుఁడై ఆయేనుఁగును గొట్టుటకు వెనుకఁ బరువెత్తెను; గాని దానితో సరిగ పరుగెత్తఁజాలక నూలుఁబడి పోయెను.

అది చూచి ఎరిభక్తనాయనారు త్రిశూలమును ధరించి శీఘ్రముగఁ బోయి శివకామియాండారు నోదార్చి "మిమ్ము పీడించిన ఏనుఁగు ఎట్లు పోయినది?" అని యడుగఁగా ఆవృద్ధుఁడు అది పోయిన దిక్కు చూపెను. తోడనే ఎరిభక్తుఁడు మనోవేగముతోఁ బోయి ఏనుఁగును

దాఁకెను. అది వెనుదిరిగి ఎదిరించెను. వెంటనే ఎరిభక్తుఁడు దాని తొండమును నఱికి అంతలో చిత్రవధ గావించెను. ఏనుఁగు క్రిందఁబడి గీపెట్టుచు మరణింపఁగా దానిమీఁద నున్నమావటివాఁడు ఒకఁడును రౌతులు ఇరువురును తటాలున క్రిందికి దుమికి నాయనారుపైఁ బడిరి; గాని ఉత్తరక్షణమునందే నాయనారు వాండ్రను సంహరించి కోపముతీఱక గ్రుడ్లు ఎఱ్ఱఁజేసి పడిపోయిన శవములమీఁదఁ బరవళ్లు ద్రొక్కసాగెను.

ఈవార్త రాజునకుఁ దెలియవచ్చెను. వెంటనే యాతఁడు "పట్టపుటేనుఁగును జంపిన అల్పాయుష్కుఁడు ఎవఁడురా!" అని యఱచుచు పదుగురు వీరులను వెంట నిడుకొని అక్కడకు వచ్చెను. అప్పటి కింకను ఎరిభక్తుఁడు వీరభద్రావతారము దాల్చి పరవళ్లు ద్రొక్కుచుండెను. అది చూచి కీర్తిచోళమహారాజు "ఈతఁడు మానవమాత్రుఁడు కాఁడు. వీరభద్రుని యంశమున జనించినశివయోగి. భద్రగజమును ఎవఁడో సామాన్యమానవుఁడు చంపె ననుకొంటిని. తగినంతకారణము లేకుండ నీతఁడు భద్రగజమును జంపియుండఁడు" అని శాంతించి వీరులను వెనుకకుఁ బంపివేసి గుఱ్ఱము దిగివచ్చి దూరమునుండియే నమస్కరించి "మహాత్మా, కారణము లేనిదే శివయోగులు ఆగ్రహపడరు. తమయాగ్రహము ఏనుఁగును, మావటివానిని, రౌతులను జంపుటతోఁ దీఱియుండకున్నచో ఈదాసునిఁగూడ సంహరింపుఁడు" అని చెంతకుఁ బోయెను. అపుడు ఎరిభక్తుఁడు కొంచెము శాంతించి జరిగిన సంతయు నెఱింగించెను. రాజు అది విని "ఎంతపనిజరిగినది. లేకున్న శివయోగికి ఇంతటి యాగ్రహ మేలవచ్చును? ఈక్షుద్ర భద్రగజము స్వామికైంకర్యమునకు భంగము గలిగించినది; గావున దీనికి ఈశిక్ష తగియే యున్నది. మావటివాఁడును, రౌతులును ఏనుఁగు దౌర్జన్యము చేయుచుండఁగా జూచుచు నూరకున్నారు; గాన వాండ్రకుఁగూడ తగినశిక్షయేయైనది; గాని ఏనుఁగు చేసిన పాపము ఇంకను దీఱలేదు. నేనుగూడ మరణించినఁగాని అదిపోదు" అని తలంచి రాజు "నన్నుగూడ సంహరించి మీకోపము రూపముననున్న ఏనుఁగుచేసిన పాపమును తొలఁగింపుఁడు" అని మొలలోని కత్తినిఁ దీసి శివయోగికి అందించెను; గాని ఆతఁడు అందుకొనఁ డయ్యెను. రాజు విన

లేదు అని మఱల నట్లే చెప్పెను. అపుడు ఎరిభక్తుఁడు, "రాజు హృదయము చాల సున్నితమైనది. అది పశ్చాత్తాపముచే దహింపఁబడుచున్నది. ఇప్పుడు ఈకత్తిని బుచ్చుకొనకున్నచో నీరాజు ఆత్మహత్య గావించుకొనును" అని భావించి దానిని చేకొని "నీభక్తిని ఎఱుంగక నేను త్వరపడితిని; గావున శిక్షగా నన్ను సంహరింపుము" అని త్రిశూలమును అందించెను; గాని రాజు దాని నందుకొనలేదు. "ఇతఁడు సంశయగ్రస్తుఁడైనాఁడు. ఇది ఘాతనివలనఁగాదు" అని తలంచి ఎరిభక్తుఁడు తన్నుదాఁ బొడుచుకొనుటకు శూలము నెత్తెను అప్పుడు పరమశివుఁడు అశరీరవాక్కులతో 'సాహసమువలదు. మీభక్తినిఁబరీక్షించుటకు నేను ఇట్లు చేసితిని' అనిపలికెను. ఎరిభక్తుఁడును రాజును ఆశ్చర్యపడిరి. ఇంతలో ఏనుఁగును, మావటివాఁడును, రౌతులును లేచిరి. పూలసజ్జ చక్కని పూలదండలతో నిండియుండెను. ఇది యంతయుఁ జూచి అందఱు నబ్బురంపడిరి. అంతట ఎరిభక్తుఁడును, రాజును ఒకరికొకరు మ్రొక్కుకొని కౌఁగిలించుకొని స్వామి కోవెలకుఁ బోయి సేవించిరి. శివకామియాండారు పూలసజ్జను గైకొని ఆలయమునకుఁ బోయెను. మావటివాఁడు రౌతుల నెక్కించుకొని ఏనుఁగునుదోలుకొనిపోయెను. అందఱును రాజును ఎరిభక్తుని నుతించుచు వెడలిపోయిరి. ఎరిభక్తనాయనారు బ్రతికియున్నంతకాలము నిట్లు ప్రవర్తించి అవసానమున శివసాయుజ్యమునుబడసెను.

---

97. గుగ్గులుకలశనాయనారు.

చోళదేశమున తిరుక్కడయూరు అను గ్రామమున కలశుఁడు అను నొక బ్రాహ్మణుఁడు ఉండెను. అతఁడు యుక్తవయస్కుఁడైనది మొదలు ఆగ్రామమున నున్న వీరట్టానమనుగుడియందు వేంచేసియున్న పరమశివుని అనుదినమును గుగ్గిలముతో ధూపము వేయుచు బూజించుచుండెను. ఈకారణమువలననే ఆతనికి గుగ్గులుకలశనాయనారు అను పేరు వచ్చెను.

ఆతఁడు ఇట్లు కొలఁదిదినములు చేయునప్పటికి ఇంట నున్న ధనమంతయు నైపోయెను. అది చూచి యాతఁడు ఏమి వచ్చినను శివపూజ

మానఁగూడదు" అని నిశ్చయించుకొని ఒక్కొక్క మాన్యము నేయమ్ముచు ఆక్రయధనముతో యథాపూర్వముగ గుగ్గిలమును సంపాదించుచు శివపూజ జరుపుచుండెను. మఱికొన్ని దినములు గడచునప్పటికి మాన్యములే గాక అమ్ముటకు మఱియేవస్తువును గూడ లేకపోయెను. ఇంట భార్యాపుత్రులు అన్నములేక మలమలమాడసాగిరి. నాలుగైదురోజులు ఉపవాసములు చేసిన తరువాత ఆతని భార్య తన కంఠమున నున్న మంగళసూత్రమును దీసియిచ్చి "దీనిని విక్రయించి ధాన్యముకొని తిసికొనిరండు" అని భర్తకు ఇచ్చెను. అదిగొని నాయనారు బజారునకుఁ బోవుచుండఁగా నొక వర్తకుఁడు విక్రయించుటకు గుగ్గిలపుమూటలను భుజములమీఁద నిడుకొని ఎదురుగ వచ్చుచుండెను. నాయనారు అదిచూచి "ధాన్యమును గొనుటకంటె దేవునకు ఉపయోగింపవచ్చును; గావున గుగ్గిలము గొనుటయే మంచిది" అని భావించి ఆమంగళసూత్రమును ఇచ్చివేసి ఆవర్తకుని చెంతనున్న గుగ్గిలపుమూటలను గైకొని ఆలయమునకుఁ బోయి యథాప్రకారముగ ఈశ్వరుని బూజింపసాగెను.

ఇంట నాతని భార్య ఎంతసేపటికి భర్త ధాన్యము పట్టుకొని రాకయుండుటఁ జూచి క్షుద్బాధవలన మఱింత పీడింపఁబడఁజొచ్చెను. పిల్లలు గోలుగోలున ఏడువసాగిరి.

సాయంత్రమయ్యెను. అంధకారముగూడ నావరించెను. జాముఁరాత్రి యయ్యెను. అప్పటికిఁగూడ భర్తయింటికి రాకుండుటఁజూచి భార్య చేయునదిలేక విచారించుచు పరుండెను. రెండుజాములరాత్రియైన తరువాత పరమశివుఁడు ఆమెకు స్వప్నమున సాక్షాత్కరించి "మీకు భాగ్యమునొసంగితిని" అని చెప్పి తిరోహితుఁడు అయ్యెను. వెంటనే ఆమె మేల్కాంచి చూడఁగా ఇల్లంతయు పప్పు, బియ్యము, బెల్లము, నేయి మున్నగు ఆహారపదార్థములతోడను ధనధాన్యములతోడను నిండియుండెను. అందులకు ఆమె మహానందభరితయై వెంటనే వంటచేసి బిడ్డలకు అన్నము పెట్టి తాను భుజించెను. అట నీశ్వరుఁడు "ఆఁకలి గొనియున్నావు. ఇంటికిఁబోయి భుజించిరమ్ము" అని నాయనారునకు జెప్పెను. ఆయాజ్ఞ చొప్పున ఆతఁ డింటికిఁబోయి అంతయుఁ జూచి ఆశ్చర్యచకితుఁడు అయి "ఈభాగ్యమంతయు నెట్లు వచ్చినది" అని యడుగఁగా నామె అంతయుఁ

జెప్పెను. అందులకు ఆతఁడు ఆనందించి పరమశివుని చాల వినుతించెను.

ఇక్కడ నాయనారును ఆతని భార్యయు అనంతైశ్వర్యము గలిగినను గర్వింపక లేనిపోని దుర్గుణములను దఱిజేరనీయక శివుని శివభక్తులను అనేకవిధముల నాదరించుచు వారిని మృష్టాన్నసంతృప్తులంగావించుచు నుండఁగా తిరుప్పనందాళ్ అను స్థలమున నున్న శివలింగము ఒఱఁగియుండుటఁ జూచి ఆనగరమును ఏలు రాజు దానిని సరి చేయఁదలఁచి శిథిలమైయున్న ఆలయమును బడఁగొట్టించి లింగమును దీయుటకు ఊరిలోనున్న బ్రాహ్మణులకు సెలవు ఇచ్చెను; గాని ఎంతఱు బ్రాహ్మణులు పట్టినను ఆలింగము కదలదయ్యెను. పిదప రాజు లింగమునకు మోకుత్రాళ్లు కట్టించి ఏనుఁగులచే లాగించెను. అయినను ప్రయోజనము కలుగలేదు. "ఇది యెట్లు సాధ్య మగును." అని రాజు ఏమియుఁ దోఁచక విచారింపసాగెను. ఎవరును ఉపాయము సెప్పలేకయుండిరి.

ఈసంగతి గుగ్గులుకలశనాయనారునకుఁ దెలియవచ్చెను. ఆచిత్రము ఏమో చూచిరావలయునని ఆతఁడుఆయూరుపోఁగా త్రాళ్లతో లాగఁబోయిన ఏనుఁగులును మనుష్యులును మూర్ఛిల్లి పడియుండుటఁ గానవచ్చెను. అపుడు నాయనారు 'నేను గూడ కొంచెము ప్రయత్నించెదను' అని తలంచి మీఁద నున్న ఉత్తరీయమును లింగమునకుఁ గట్టి లాగెను. తోడనే లింగము లేచి వచ్చెను. అది చూచుచున్న రాజును ప్రజలును "ఈతఁడు భక్తిరజ్జువుచే ఇట్లుచేయఁగలిగె" నని ఎఱిఁగిఆతనిం జాల గౌరవించి, అనేకవిధముల వినుతించి, మఱల యథాపూర్వముగ నాయనారు సాయంబున శివప్రతిష్ఠ గావించిరి.

పిదప నాయనారు కొన్నిదినములు అచ్చట నుండి అనేకులను ఉజ్జీవింపఁజేసి స్వస్థలముఁ జేరుకొనెను. కొన్నిదినములకు వాగీశనాయనారును జ్ఞానసంబంధమూర్తినాయనారును అచ్చటకు వచ్చిరి. వారిని ఆతఁడు అనేకవిధములఁ బూజించి బ్రతికియున్నంతకాలమును అనేక ధర్మకార్యములను జేసి అవసానమున శివసాయుజ్యమును బడసెను.

98. దండియడిగళ్ నాయనారు.

చోళదేశమున తిరువాలూరు అను గ్రామమున దండియడిగళ్ అను నొక నాయనారు ఉండెను. ఆతఁడు పుట్టుగ్రుడ్డి, అయినను మనస్సున శివుని ధ్యానించుచు అంతరంగదృష్టిచే పరమశివుని దర్శించుచు ఆయూర నున్న శివాలయమునకుఁ బడుచు లేచుచుఁ బోయి స్వామిని వినుతించి వచ్చుచుండెను.

ఆగ్రామమున నున్నవారు అందఱును జైనులు. వారు ఆశివాలయము వెనుకనున్న తటాకమును కొంతవఱకు పూడ్చివేసిరి. దండి అందులకు సహింపలేక తనవారితో నెన్నిసారులు చెప్పినను ప్రయోజనము లేకపోవుటఁజూచి తానే చెఱువునకు ఇవ్వలియొడ్డున నొక స్తంభమును బాతి రెంటికిని పెద్దత్రాడు కట్టి ఆత్రాడుపట్టుకొని చెఱువులో దిగి జైనులు పోసిన మట్టిని గంపలో నెత్తుకొని మఱల త్రాడుసాయంబున తిరమునకు వచ్చుచుఈతీఱున స్వామికైంకర్యముచేయుచుండెను.

అది చూచి ఆయూరున నున్న జైనులు 'అంధుఁడా, ప్రాణములకు ఆశలేదా, ఎందులకు అట్టిపనిఁ జేసెదవు? ప్రాణాపాయకరమైనపని ఏల చేసెదవు? మానుము' అని పలికిరి. అందులకు నాయనారు 'ఇది పరమేశ్వరునకుఁ బ్రీతికరమైన కార్యము. నేను ఎట్లు మానఁగలను?' అని సమాధానము ఇచ్చెను. అంతట జైనులు 'వీనికిఁ గన్నులు లేనట్లు చెవులు గూడ లేవు?' అనిరి. 'నాకు కన్నులు నున్నవి. చెవులు నున్నవి. మీకే లేవు.' అని నాయనారు పలుకఁగా 'నీకు కన్నులు ఉండుటయే నిజమేని మేము ఈయూరనుండము' అని పలికి పోయిరి.

నాఁటిరాత్రి దండికి స్వప్నమున పరమశివుఁడు సాక్షాత్కరించి 'దండీ, చింతింపకుము. నీకు కన్నులు ఇచ్చితిని. జైనుల నందఱను అంధులనుఁగాఁ జేసితిని' అని పలికి ఆయూరి రాజునకుఁగూడ స్వప్నమున నగపడి 'జైనులు నాయనారునకు అడ్డు తగులుచున్నారు. నీవు నాయనారునకు సహాయము చేయుము' అని యాజ్ఞాపించెను.

మఱునాఁడు రాజు నాయనారు దర్శనమునకు వచ్చి ఏమి సెలవు? అని అడిగెను. అంతట నాయనారు రాజును చెఱువుదగ్గఱకుఁ గొని

పోయి 'జైనులను రప్పింపుము' అనెను. రాజు భటులకు ఆజ్ఞాపించెను. భటులు రాజాజ్ఞను దెలుపఁగా జైనులు అందఱును అంధులైరి; గావున పడుచు లేచుచు ఎట్లో అచ్చటకు వచ్చిరి. రాజు 'మీరు పలికిన శపథము ప్రకారము ఊరువిడిచి పొండు' అని యాజ్ఞాపించెను. అంతట దురభిమానదూషితులగు జైనులు గుడ్డితనమువలన బాధపడుచునే ఇతరగ్రామములకుఁ బోయిరి; గాని అనేకజైనులు దండిని ఆశ్రయించి 'మమ్ము రక్షింపుము' అని ప్రార్థించి శైవులైరి. వెంటనే వారికి అంధత్వము తొలఁగిపోయెను. దండి బ్రతికినంతకాలమును శివకైంకర్యముచేసి తుదను శివసాయుజ్యమును బడసెను.

---

99. ఇయఱ్పగైనాయనారు.

చోళదేశమునందలి కావేరీపట్టణమున నొక నాయనారు ఉండెను. ఆతనిపేరు ఇయర్పగై నాయనారు. ఆతఁడు గృహస్థాశ్రమమున నుండియు తామరాకుమీఁది నీటిచుక్కవలె దేనిని అంటక విభూతిధారులయిన ఎల్లవారికిని అడిగిన దెల్ల నున్నంతవఱకు లేదనక సకలము నిచ్చుచు వారి సంతోషము పరమశివుని అనుగ్రహకారణమని నిశ్చయించి ఆ ప్రకారము నడచుకొనుచుండెను.

నాయనారు ఉన్నపదార్థములలో నేది యడిగినను ఇచ్చుట ఎల్లరకును జూపవలయు నని భావించి పరమశివుఁడు ఒకనాఁడు శైవాచార్యరూపముతో వచ్చి ఇంటి యెదుట నిలిచెను. నాయనారు ఆతనిం గాంచి పరమానందముతో స్వాగత మిచ్చి లోనికిఁ గొనిపోయి 'మహాత్ములు ఊరకరారు. మీరు వచ్చిన కారణము నెఱింగింపఁగోరినాను' అని వినయముతో బలికెను. అపుడు ఆతఁడు 'అయ్యా, నీవు ఉన్నపదార్థములలో అడిగినదానిని లేదనకుండ నిచ్చువాఁడవు అని తెలిసికొని నిన్నొకవస్తువు కోరుటకు వచ్చితిని' అనియెను. నాయనారు ఆనందించి 'సెలవిండు. తమరు ఏమికోరినను నాదగ్గఱ నున్నచో తప్పక ఇచ్చెదను' అని మఱలఁ బలికెను. ఆగంతుకుఁడు 'నీభార్యను గోరివచ్చితి' నని సందేహములేకుండఁ బలికెను. 'ఇచ్చితి' నని మాటయిచ్చి నాయనారు

ఈసంగతిభార్యకు ఎఱింగించెను. ఆమె తొలుత దిచ్చవడెను; గాని వెంటనే భర్తదీక్షను స్మరించి వల్లె యని యంగీకరించెను. 'ఈయూరు దాఁటులోపల నీబంధువులు అందఱును నన్ను అడ్డుకొనకుండ నీవు వెంట రావలె' నని బ్రాహ్మణుఁడు కోరెను. వల్లెయని ఖడ్గము చేఁబూని వెంట బయలుదేఱెను. కొంతదూరము పోవునప్పటికి ఆతని బందుగులు అందఱును అడ్డువచ్చి ఎదిరించిరి. 'నాభార్యను త్రికరణశుద్ధిగా నిచ్చితిని. మీరు అడ్డుపడఁగూడదు' అని నాయనారు వారించెను; గాని వారు వినక 'బుద్ధిలేక నీవు ఇచ్చినను మేము అంగీకరింతుమా! ఈయపకీర్తి నీయొక్కనితోఁ బోవునది గాదు' అని కత్తులు తీసిరి. నాయనారు ఒక్కఁడే అందఱతోఁ బోరను గలియఁబడెను. ఒకగడియలో ఎదురుకొనినవారు అందఱును మడిసిరి. నాయనారు నిశ్చింతతో భార్యను ఆగంతుకుని వెంటఁదీసికొని బయలుదేఱెను.

కొంతదూరము వెళ్లినతరువాత ఆగంతుకుఁడు 'నీవు పోవచ్చును' అని నాయనారునకు అనుజ్ఞనిచ్చెను. నాయనారు పోవుచుండఁగా ఆగంతుకుఁడు మఱలఁ బిలిచెను. నాయనారు వెళ్లునప్పటికి బ్రాహ్మణుఁడు అదృశ్యుఁడు అయ్యెను. అదిచూచి, నాయనారు ఆశ్చర్యచకితుఁడై ఇటునటు చూడఁగా పరమశివుఁడు వృషభవాహనారూఢుఁడై పార్వతీసహితుఁడై ఆకసమున సాక్షాత్కరించెను. వారినిఁ జూచి భార్యాభర్తలిరువురును మ్రొక్కి వినుతించిరి. అపుడు పరమేశ్వరుఁడు 'మీరిరువురును ఇఁక భూలోకమున నుండఁ దగదు. మాతో రండు' అని వారిని కైలాసమునకుఁ దీసికొనిపోయెను. ఇది చూచినవారు ఎల్లరును ఆశ్చర్యచకితులై నాయనారుమాహాత్మ్యమును చాల వినుతించిరి. పరమేశ్వరునిఁ జూచిరి; గావున నాయనారుతోఁడి యుద్ధమున నిహతులైనవారు అందఱునుగూడ కైలాసమునకుఁ బోయిరి.

100. మారనాయనారు.

ఇళయాంకుడి అను గ్రామమున మారనాయనారు అను నొక పంటకాపు ఉండెను. ఆతఁడు అనుదినమును అనుష్ఠానములు అన్నియుఁ

దీర్చికొని మహేశ్వరపూజఁ గావించి వచ్చిన శైవమహాజనులను అత్యాదరముతో గౌరవించి పంచభక్ష్యపరమాన్నములతోఁ దృప్తులం గావించుచుండును. ఆతఁడు అట్లు చేసినకొలఁదిని పాడిపంటలు వృద్ధియై కుబేరునివలె అత్యంతధనవంతుఁడు అయ్యెను.

ఒకప్పుడు పరమశివుఁడు ఆతని శివపూజాధురంధరత్వమును శైవార్చనానిరతియుఁ బరీక్షింపఁదలఁచి సంపదయంతయుఁదొలఁగిపోవునట్లుచేసి దారిద్ర్యము గలిగించెను. ఆతఁడు శైవార్చనమునిమిత్తము భూములు అన్నియు అమ్మివేసెను. భార్య నగలను మంగళసూత్రమును గూడ నమ్మివేసెను. ఇఁక విక్రయించుటకు వస్తువు లేదయ్యెను. అప్పు అంతకుమున్నే పుట్టుట లేదయ్యెను. ఒకనాఁడు ఆతఁడు ఏమియు లేక ఏమి చేయనుం దోఁపక చింతింపసాగెను. అప్పటికి జామురాత్రి యయ్యెను. ఆకసమంతయు మసుములతోడను మెఱుములతోడను భయంకరమైయుండెను. అట్టిసమయమున నొక వృద్ధబ్రాహ్మణుఁడు వెదకుకొనుచు నాతని యింటికి వచ్చి అన్నము పెట్టుఁడు అని కోరెను. నాయనారు ఆతని నాదరముతో ఇంటిలోనికి దీసికొనిపోయి తుడిచి ఒకచోఁ గూర్చుండఁ బెట్టి భార్యచెంతకుఁ బోయి "ఒక శివభక్తుఁడు వచ్చియున్నాఁడు. అన్నము కోరుచున్నాఁడు. ఏమి యుపాయము" అని యడిగెను అందులకు ఆమె "ఇంటిలో నేమియు లేదనుట మీకుఁ దెలియనిదిగాదు. చేనిలో చల్లిన విత్తనములు మొలకలు వచ్చినవి గొనిరండు. ఎట్లో కష్టపడి అన్నమువండెదను. కూరకొఱకు ఏతోటకూరయైనను దెండు" అని చెప్పెను. ఆతఁడు ఆమాటలు విని ఆవానలోఁ దడియుచునే పోయి భార్యకోరినవి తెచ్చి యిచ్చెను.

ఆమె వానిని యుక్తరీతిని వచనము చేసి భర్తకు ఎఱింగించెను. ఆతఁడు పిలుచునప్పటికి బ్రాహ్మణుఁడు పగుండియుండెను. మారనాయనారు లేపఁగా వృద్ధుఁడు పరమశివుఁడై లేచెను. అది చూచి నాయనారును, భార్యయు నాశ్చర్యపడుచుండఁగా పరమశివుఁడు వృషభారూఢుఁడై పార్వతీసహితుఁడై నిజదర్శన మొసంగి "మీరిక భూలోకమున నుండవలదు. కైలాసమునకురండు" అని వెంటనిడుకొనిపోయెను.

101. మూర్తినాయనారు.

పాండ్యదేశమునందలి మధురానగరమున మూర్తినాయనారు అను నొకవైశ్యుఁడు ఉండెను. ఆతఁడు చాల ధనవంతుఁడు అయ్యు అందఱివలె దుష్ప్రవర్తకుఁడుగాక సన్మార్గమున నడచుచు ప్రతిదినమును ఆనగరమున వెలసియున్న సోమసుందరేశ్వరస్వామికి మంచిగంధమును సమర్పించుచు కాలము గడపుచుండెను. ఇట్లుండఁగా ఒకరాజు దండెత్తి వచ్చి ఆపట్టణమునేలురాజును జయించి రాజ్యమును స్వాధీనపఱుచుకొని మధురానగరసింహాసనము నధిష్ఠించి ప్రజాపాలనము ప్రారంభించెను. ఆతఁడు శుద్ధజైనుఁడు. అగుటచే ఒక మాసములో అనేకజైనులు వచ్చి ఆనగరమునఁ బ్రవేశించి తొల్లిటివారిని అనేకులను తమమతమునఁ గలుపుకొనిరి. కొందఱు జైనమతము హీనమతమని యెఱింగి అందుఁ బ్రవేశింపఁజాలక లేకున్న రాజువలన బాధలు వచ్చునని తలంచి ఇచ్చవచ్చినచోటికి లేచిపోయిరి. మూర్తినాయనారు మాత్రము జైనులలోఁ గలియక ఇతరగ్రామములకుఁ బోక అచ్చటనే యుండి యథాపూర్వముగ స్వామికి మంచిగంధమును సమర్పించుచుండెను.

జైనాచార్యులు మూర్తినాయనారుసంగతి రాజునకు విన్నవించిరి. రాజు ఆతనికి మంచిగంధపు చెక్కలు అమ్మకుండునట్లు వర్తకులకు ఆజ్ఞాపించెను. నాయనారు నాఁడు బజాఱు అంతయు అనేకపర్యాయములు తిరిగెను; గాని ఎవరును మంచిగంధపుచెక్కలు ఆతనికి ఈయలేదు. అగుటచే నాతఁడు విచారించుచు సోమసుందరేశ్వరుని సన్నిధికిఁ బోయి తటస్థించినది అంతయు స్వామికి విన్నవించి అంతలో నొక ఆలోచనము తోఁపఁగా "ఏల విచారము" అని తలంచి తనచేతులనే సానమీఁద నఱుగఁదీయసాగెను. కొంతసేపటికి ఎముకలు బయలుపడి కొంతవఱకును అఱిగిపోయెను. రక్తము ఆలయ మంతయు గ్రమ్మెను.

అపుడు పరమశివుఁడు ఆతని భక్తికి మెచ్చి సేవానిరతికి ఆనందించి "సాహసము చాలును లెమ్ము నిన్ను హింసించిన రాజు చనిపోవును. నీవు రాజ వగుదువు పిదప జైనాచార్యుల సాయంబున శైవమతమును ఉద్ధరింపుము" అని అశరీరవాక్కులతోఁ బలికెను. అది విని

మూర్తినాయనారు తటాలున లేచి నిలువఁగా చేతులు యథాప్రకారముగ నుండెను. "పరమశివుని తలంపునకు అభ్యంతర మేమి గలదు" అని తలంచుచు ఆతఁడు ప్రాకారములు దాఁటి వీథిలోనికి వచ్చెను.

శివుని ఆజ్ఞాప్రకారము జైనరాజు చనిపోయెను. ఆతని యనంతరము సింహాసన మెక్కుటకు ఇతని సంబంధమైనవారు ఎవ్వరును లేక పోవుటచే "పట్టపుటేనుఁగునకు గంతలుకట్టి వదలుదము. అది యెవ్వరినిఁ దనమూఁపుమీఁద నెక్కించుకొని తీసికొనివచ్చునో వారినే ప్రభువుగా అభిషేకము చేయుదము" అని మంత్రులు అట్లే ఏనుఁగును విడిచిరి. అంత నాయేనుఁగు వీథులు అన్నియుఁ దిరుగుచు సోమసుందరేశ్వరుని ఆలయముబైట నిలిచియున్న మూర్తినాయనారు చెంతకు వచ్చి మ్రొక్కి వీఁపుమీఁద నెక్కించుకొని కోటలోనికి గొనిపోయెను. మంత్రులు అందులకు చాల నానందించి నాయనారును దింపి పట్టాభిషేకప్రయత్నములు సేయుచుండఁగా "ముందు మీరు శైవమతమునఁ జేరుఁడు" అని నాయనారు ఆజ్ఞాపించెను. మంత్రులు అట్లే చేసిరి. అపుడు నాయనారు "నాకు విభూతియే పట్టాభిషేకమునకు వలయు సాధ్రి. రుద్రాక్షలే ఆభరణములు. జటాజూటమే కిరీటము. మీరు వానినిఁ గుఱించి ప్రయత్నింపవల" దని శుభముహూర్తమున సింహాసనము నధిష్ఠించి రాజ్యమును బాలింపఁదొడఁగెను. నెలదినములయందే పట్టణమున నున్నవారు అందఱును శైవమతము నవలంబించిరి. పిదప మూర్తినాయనారు బ్రతికియున్నంతకాలమును శైవమతమును వృద్ధిచేసి శైవులనర్చించి శివపూజాధురంధరుఁడై యుండి అనేక ధర్మకార్యములను గావించి అవసానమున శివసాయుజ్యమును బడసెను.

---

102. నందనారు.

చోళదేశమున ఆదనూరులో నందనారు అను నొక పంచముఁడు ఉండెను. ఆతఁడు పూర్వపు ప్రభువులవలన నొసఁగఁబడి పరంపరగా వచ్చుచుండిన భూమిని పండించుకొనుచు శివధ్యానతత్పరుఁడై లముగఁ డపుచుండెను. ఆభూమి ఈశ్వరునకు భేరి, మృదంగము మున్నగువాద్యములకును, వీణియకు తీగలు మున్నగువానిని ఇచ్చుచుండుట

కై ఒసంగఁబడినది. ఆతఁడు తనకులవృత్తి చేయుచు తీఱిక యైనపుడెల్ల శివాలయము ఎదుటకుఁబోయి నిలిచి పరమశివుని ధ్యానించుచుండును.

ఆతఁడు అనేకశివస్థలములకుఁ బోయి ఇట్లే స్వామిని సేవించి అచ్చటచ్చట తోఁటలు తటాకములు మున్నగువానిని బ్రతిష్ఠించెను. ఒకప్పుడు ఆతఁడు చిదంబరమునకుఁ బోయి పరమశివుని సేవింపఁగోరెను. అంతలోనే ఆతఁడు "ఏమి లాభము? చండాలుఁడనగు నన్ను లోనికిఁబోనీయ"రని నిరాశుఁడయ్యెను; గాని యాతని యాశ సమూలముగ పోలేదు. తుదకు ఆతఁడు "ఎట్లయినను చిదంబరమునకుఁ బోవలయు"నని నిశ్చయించుకొనెను; గాని రేపు రేపు అని చాలదినములు గడపెను.

ఎట్టకేలకు ఆతఁడు చిదంబరమునకుఁ బోయెను. ఊరిబైటనే యుండవలసివచ్చుటచే నాతఁడు అక్కడనే యుండి నటరాజస్వామిని వినుతింపఁజొచ్చెను. నాఁటిరాత్రి స్వామి యాతని స్వప్నమున సాక్షాత్కరించి "రేపు బ్రాహ్మణులు సకలమును సన్నద్ధముగావింతురు. నీవు అగ్నిగుండములో నుఱుకుము. బ్రాహ్మణుఁడవయ్యెదవు తరువాత నీయిచ్చవచ్చినట్లు నన్ను సేవింపవచ్చును" అని చెప్పి. బ్రాహ్మణులకుఁ గూడ స్వప్నమునందే "రేపు పురద్వారము చెంగట అగ్నిగుండమును ఏర్పరుపుఁడు. పంచముఁడగు నందనారు అందు ఉఱికి బ్రాహ్మణుఁడగును. ఆతనికి మీరు సేవలు చేయుఁడు" అని నియమించెను.

ఈశ్వరాజ్ఞచొప్పున బ్రాహ్మణులుసకలసన్నాహములను నెఱవేర్చి ఆసంగతి నందనారునకు ఎఱిఁగించిరి. నందనారు ఈశ్వరాదేశముచొప్పున అగ్నిగుండములో నుఱుకఁగా వెంటనే విభూతి రుద్రాక్షలు,జటాజూటమును గల బ్రాహ్మణశ్రేష్ఠుఁడై ఒడ్డునకు వచ్చెను. తోడనే బ్రాహ్మణులు ఆతని ననేకవిధముల గౌరవించి నటరాజస్వామి ఆలయమునకుఁ గొనిపోయిరి. నందనారు అచ్చట స్వామిని సేవించుచు చూచుచుండఁగనే స్వామిలో నైక్యమై అదృశ్యుఁడు అయ్యెను. బ్రాహ్మణులు అందఱును ఆతనిని గుఱించి అనేకవిధములఁ జెప్పుకొనుచు ఇండ్లకుఁ బోయిరి. నందనారు చిదంబరము పోవుటకు రేపు రేపు అని కొన్నిదినములు గడపెను; గావున ఆతనికి అపరనారగన్ననాయనారు అని మారుపేరు వచ్చెను.

103. అరివాట్టనాయనారు.

చోళదేశమున గణమంగల మనెడి గ్రామమున దాయఁడు అను నొక వెలను యుండెను. ఆతఁడు సేనాధిపతుల వంశములోఁ బుట్టెను. ఆతఁడు భాగ్యవంతుఁడు అయ్యును గర్విగాక సదా పరమశివునిధ్యానించుచు సన్నబియ్యమును కాయగూరలును స్వామికి యాలయమునకుఁ గొనిపోయి స్వామికి సమర్పించి ప్రతిదినమును ఈతీరునఁ గైంకర్యము చేయుచుండెను.

ఇట్లు కొన్నిదినములు గడచునప్పటికి ఆతనికి దారిద్ర్యముసంభవించెను. కూలిచేసిన గాని జీవయాత్ర జరుగని స్థితి వచ్చెను. అయినను ఆతఁడు స్వామికైంకర్యమును మానలేదు. సన్నబియ్యము లేకున్నను ముదుకబియ్యమును, కాయగూరలు లేకపోయినను ఆకుకూరలును స్వామికి ఆతఁడు భక్తితో సమర్పించుచుండెను. కొన్నిదినములకు బియ్యము లేకపోగా ఆకుగూరలను మాత్రమే సమర్పించెను. మఱికొన్నిదినములకు అదియు లేకపోఁగా మంచినీళ్లుమాత్రమే సమర్పింపసాగెను.

ఒకనాఁడు ఆతఁడును భార్యయు చాలఁ గష్టపడి పొలములుతిరిగి ఏవో ఆకుగూరలు సంపాదించుకొని గుడికి పోవుచుండఁగా చాల దినములనుండి అన్నము తినుట లేదు; గాన దాయఁడు కన్నులుతిరిగి పడిపోయెను. భార్య పరిచర్య చేయఁగా కొంతసేపటికి ఆతనికి తెలివి వచ్చెను. అప్పుడు ఆతఁడు గంపలోని ఆకుగూరలన్నియు చెదరిపోయి యుండుటఁ గాంచి "ఇవి ఈశ్వరునకు సమర్పింపరాదు" అని నిశ్చయించుకొని "ఇంతకష్టపడి సంపాదించిన వస్తువులు ఈశ్వరునకు సమర్పించుటకు వీలులేకపోయె; నిఁక నీబ్రతుకు ఏల" అని ఆతఁడు మొలలోని కైజారు తీసి పొడుచుకొనఁబోయెను. తోడనే పరమశివుఁడు పార్వతీసహితుఁడును వృషభవాహనారూఢుఁడునై సాక్షాత్కరించి ఆతనిని వారించి "మీభక్తికి మెచ్చితిని ఇఁక మీరు భూలోకమున నుండనేల" అని వారిని కైలాసమునకుఁ గొనిపోయెను. చెదిరిపోయిన వస్తువులు దేవునకు నివేదింపనర్హములు కావని వానిని వదలిపెట్టెను; గావున ఆతనికి అరివాట్టనాయనారు అని మాఱుపేరు గలిగెను.

104. మానక్కంజార్ నాయనారు.

కంచారూరిలో మానక్కంజార్ నాయనారు అను నొక వెలమ యుండెను. అతని వంశమువారు అంగళురు సేనాధిపతులు. ఈతఁడు అచంచలశివభక్తుఁడు. ఆతనికి సకలము నుండెను; గాని సంతానము లేద య్యెను. అందులకు ఆతఁడు చాలకాలము నిరీక్షించి తుదకు ఈశ్వరుని గుఱించి తపస్సు చేసెను. కొన్ని దినములకు పరమశివుని అనుగ్రహము వలన ఆతనికి ఒక కుమార్తె కలిగెను.

ఆమె తలిదండ్రులు మిగుల గారాబముతోఁ బెంప శుక్లపక్షచంద్రు నివలె దినదినప్రవర్ధమానయై యుక్తవయస్కురాలయ్యెను. యౌవనము ప్రాపించునప్పటికి ఆమె సుందరియు, విదుషియు, విశేషించి, శివభక్తు రాలు నయ్యెను. మానక్కంజార్ నాయనారుకొమార్తకు వివాహము చేయఁదలఁచి వరాన్వేషణము ప్రారంభింపఁగా కలికాముననాయనారు ఈసంగతి తెలిసికొని ఆమెను తనకు మాట్లాడుటకు రాయబారుల నంపెను. యుక్తసమయమున వారు కంచారూరికిఁ బోయి శుభగాక నెఱింగింపఁగా మానక్కంజార్ నాయనారు సంతోషముతో నంగీ కరించెను.

కలికాముననాయనారు మహానందముతో బంధువుల నందఱను వెంట నిడుకొని మహావైభవముతో తరలివచ్చెను. నాఁడు ఒక శైవా చార్యుఁడు మానక్కంజారునాయనారు ఇంటికి వచ్చెను. నాయనారు ఆతనిని చాల నాదరించి లోనికిఁ దీసికొనిపోయి ఆతిథ్యము స్వీకరింపఁ గోరఁగా "మీయింట జరుగఁబోవు కార్యము ఏది?" అని ఆగంతుకుఁడు అడిగెను. పెండ్లి అని నాయనారు చెప్పఁగా ఆబ్రాహ్మణుఁడు "వధువు నిచ్చుటకుఁ దెమ్ము" అనెను. నాయనారు తేఁగా "ఈమె శిరోజములను నాకిచ్చెదవేని నీయింట నాతిథ్యము స్వీకరించెద"నని బ్రాహ్మణుఁడు మొం మోటము విడిచి పలికెను. తోడనే నాయనారు ఆనందముతో కత్తెర తెచ్చి కొమార్త శిరోజములను కత్తిరించి యీయఁగా బ్రాహ్మణుఁడు పుచ్చుకొని ఆకాశమున వృషభారూఢుఁడై ఉమాశంకరుఁడై నిలిచెను. మానక్కంజారు నాయనారు అప్పుడు శంకరుఁడువచ్చెనఁ దెలిసికొనఁ జాలకపోయితినే యని వగచి సాగిలఁబడి మ్రొక్కి అనేకవిధముల విను

తించెను. అందులకు ఆనందించి పరమశివుఁడు ఎప్పుడును దనచెంత నుండి తననామమును ఉచ్చరించుటకై నాయనారును దనతోఁ దీసికొని పోయెను. అది బంధువులు అందఱును ఆశ్చర్యాతిరేకముచే మైమఱచిరి.

అట కలిక్కామనాయనారు విడిదిలో నీవార్త విని పెండ్లివారి యింటికివచ్చి అకేశయైయున్న వధువు నారసి "అకేశను పెండ్లియాడుట శాస్త్రవిరుద్ధము" అని ఆమెను బెండ్లియాడుటకు నిరాకరించెను. అంతట పరమశివుఁడు "వత్సా, నీకు అట్టిసందేహము వలదు" అని అశరీరవాక్కుతోఁ బలికెను. మఱలఁ జూడఁగా వధువు యథాపూర్వముగ సకేశియై యుండెను. పరమేశ్వరునకు తనయందు అనుగ్రహమున్నందునకు ఉప్పొంగుచు కలిక్కామనాయనారు ఆమెను పెండ్లియాడెను.

---

105. ఆ నా య నా య నా రు.

పర్త దేశమునందలి మంగళూరు అను నొక గ్రామమున ఆనాయనాయనారు అను నొక యాదవకులజుఁడు ఉండెను. ఆతనికి శివపూజయనినను శైవార్చన యనినను శివపురాణాగమాదులను వినుట యనినను పరమప్రీతి. ఆతనికి పిల్లనగ్రోవియూఁదుటయందు చాల నేర్పు గలదు. ఆతఁడు ప్రతిదినమును తోడి గొల్లపిల్లవాండ్రతో అడవికిఁ బశువులను దోలుకొనిపోయి మేపుచు పిల్లనగ్రోవి యూఁదుచుండును.

ఒకనాఁడు ఆతఁడు ఒక మఱ్ఱిచెట్టుక్రింద వేణువులో పంచాక్షరిని వాయింపఁదొడఁగెను. ఆ గానమాధుర్యమును గ్రోలి పశువులు పరవశములై నెమఱువేయుట మాని చెంతఁ జేరి వినసాగెను. గొల్లవాండ్రు చేష్టలు దక్కి యుండిరి. పాములు, వ్యాఘ్రములు, సింహములు, గజములు మున్నగు క్రూరజంతువులు, లేళ్లు, దుప్పులు, జింకలు, నెమిళ్లు మున్నగునవియు సహజవైరమును మఱచి యొకచోఁ జేరి ఆనందముతో వినసాగెను. కిన్నరకింపురుషవిద్యాధరాదులు విమానారూఢులై ఆకసమున నిలిచి వినసాగిరి.

అప్పుడు పరమశివుఁడు ఉమాసహితముగ వృషభారూఢుఁడై ఆకసమున సాక్షాత్కరించి, ఆనాయనారును బిలిచి, "వత్సా, నీగానము

త్రిలోకములయందును గూడ నత్యద్భుతమై యున్నది. నారదతుంబు రాదులుగూడ నిట్లు పాడఁజాలరు. నీగానమును వినకుండ మేము ఉండఁజాలము; గావున మాతో కైలాసమునకు రమ్ము" అని యాతనిం గైలాసమునకుఁ గొనిపోయిరి. అది చూచుచున్న పనులకాపరులు ఆశ్చర్య చకితులైరి.

---

106. త్యాగరాజు.

ఖరహరప్రియ - రూపకము.

పల్లవి

రామనీసమాన మెవరు రఘువంశోద్ధారక॥ రామ॥

అనుపల్లవి.

భామా మరువంపు మొలక భక్తియను పంజరపు చిలుక॥ రామ॥

చరణము.

పలుకు పలుకులకు తేనె-లొలుకుమాటలాడు సోద

రులుగల హరి త్యాగరాజ-కులవిభూషణమృదు-సుభాష॥ రామ॥

చోళదేశమునందలి పంచనదము అను పుణ్యక్షేత్రమున రామ బ్రహ్మము అను నొక బ్రాహ్మణుఁడు ఉండెను. ఆతఁడు భక్తిజ్ఞానవైరాగ్యములు కలవాఁడై శ్రీరామచంద్రుని సదా భజించుచు ఐహికభోగాభిలాషి గాక కలదానితో తృప్తిపడుచు కాలము గడపుచుండెను. ఆతని భార్యపేరు శాంత. ఆమె పేరునకుఁ దగినట్లు శాంతస్వరూపిణి. పతి మాటను జవదాఁటి యెఱుఁగని పతివ్రత. శ్రీరామనామస్మరణము నెప్పుడును మాని యుండని భక్తురాలు. ఈతీరున ఆదంపతులు ఇరువురును పరస్పరప్రేమతోఁ గాలము గడపుచుండఁగా, కొన్ని దినములకు ఇరువురు కుమారులు కలిగిరి. పెద్దవానికి జప్యేశుఁడు అనియు, చిన్నవానికి త్యాగరాజు అనియు పేరులు పెట్టఁబడెను. రామబ్రహ్మము వారిని మిగుల గారాబముతోఁ బెంచుచు యుక్తసమయములయందు అక్షరాభ్యాసము

చౌలోపనయనాదులను గావించి, విద్యాభ్యాసార్థము గురునికటమునకుఁ బంపెను; గాని జప్యేశునకు విద్య యంత లేదు. ఆతనికి ఆటపాటలయందును, అల్లరిచేయుటయందును గల ఆసక్తి మఱియెందును లేదు. అందులకుఁ దోడుగ నాతఁడు మందబుద్ధి. త్యాగరాజు అట్లుగాదు. ఆతఁడు ఎప్పుడును ఆటపాటలయందును అట్టివిషయములయందును గాలము బుచ్చి యెఱుఁగఁడు. కుశాగ్రబుద్ధి యగుటచే గురువు చెప్పినది యెల్ల వెంటనే గ్రహించుచు సర్వకాలసర్వావస్థలయందును శ్రీరామచంద్రుని ధ్యానించుచు అచిరకాలమునందే విద్యను ముగించి ఇంటికిఁ జేరుకొనెను.

జప్యేశుఁడు యథాపూర్వముగ ఆటపాటలయందే కాలము గడపుచుండెను. త్యాగరాజు వాని మార్గమునఁ బోక దేవతార్చనము నిమిత్తము తండ్రికి పుష్పాదికముల నందిచ్చుచు వీలయినప్పుడెల్ల ఆగ్రామమున గల వీణ వేంకటదాసు అను విద్వాంసునిచెంత సంగీతవిద్య నభ్యసించుచు ఉండెను. కొలఁదిదినములయందే ఆతనికి సంగీతసాహిత్యములయందు అఖండవైదుష్య మలవడెను. అప్పుడు శ్రీరామచంద్రుని దివ్యగాథలను ఇరువదినాలుగువేఁ కీర్తనలుగా రచింపవలయునని సంకల్పించి త్యాగరాజు తొలుత "గిరిరాజసుతాతనయ" అను కీర్తనముతో గణపతిప్రార్థనము గావించెను. తోడనే గణపతి సాక్షాత్కరించి "నీయభీష్టము నెఱవేఱును" అని చెప్పి తిరోహితుఁడు అయ్యెను. అందులకు త్యాగరాజు పరమానందభరితుఁడై "నిన్నేభజనసేయువాఁడ" "జగదానందకారక" "దుడుకుగల" "ఎందఱోమహానుభావులు" "కనకనరుచిరా" అను అయిదుకీర్తనలతో శ్రీరాముని వినుతించెను.

కొన్ని దినములు గడచినతరువాత రామబ్రహ్మము తన కుమారులకు ఇరువురకును వివాహములు చేసి కొలఁదిదినములకే స్వర్గమునకుఁ బోయెను. పిదప అల్లరిచేయుటయందు ప్రసిద్ధుఁడైన జప్యేశుఁడును, భక్తిజ్ఞానవైరాగ్యబంధురుఁడు అగు త్యాగరాజును ఒకరితోనొకరికి సయ్యోధ్య లేకపోవుటచే విభక్తులయిరి. ఇంటిలో సగముభాగమును, తండ్రిపూజించు శ్రీసీతారామలక్ష్మణభరతశత్రుఘ్నాంజనేయ విగ్రహములును త్యాగరాజునకు వచ్చెను. త్యాగరాజు ఆవిగ్రహములను అలంకరించి పూజించి "కొలువైయున్నాఁడే" "కొలువమరెగదా"

యను కీర్తనలతో వినుతించెను. ఇట్లుండఁగా ఆచార్యుఁడు లేనిదే మోక్షముకలుగ దని తలంచి అతఁడు మహాభక్తుఁడు అగు నారదుని ప్రార్థించెను శీఘ్రమే నారదుఁడు సన్యాసివేషముతో వచ్చి నిలిచెను. త్యాగరాజు చాల ఆదరించినపిదప సన్యాసి "భక్తశేఖరా, నీవు శ్రీరామచంద్రుని మీఁద రచించిన కీర్తనములను వినవలయు నని వచ్చితిని. నాకోరికదీర్పుము" అని కోరెను. త్యాగరాజు ఆతఁడు నారదుఁడే అని గ్రహించి "రామా నిన్నే" "శ్రీనారద" "నారద గురుస్వామి" "వర నారద" అనుకీర్తనములను గానము చేసెను. నారదుఁడు తన్నుగ్రహించినందులకు అబ్బురపడుచు ఆతని గానవై పుణ్యమునకు మిగుల ఆనందించి తారకమంత్రమును ఉపదేశింపఁగా త్యాగరాజు పరమానంద భరితుఁడై "ఎంతభాగ్యమో" "ధ్యానమే" "ముమ్మూర్తులు" "సందేహమును తీర్పుము" అనుకృతులను బాడి నారదుని ఆనందపఱిచెను. అంతట నారదుఁడు "స్వరార్ణవము" అను నొక గ్రంథమును ఒసంగి అంతర్హితుఁడు అయ్యెను.

అదిమొదలు త్యాగరాజు అనేకసందర్భములయందు విసుగు విరామములు లేకుండ భక్తిపరవశుఁడై రచియించిన కృతులకు లెక్క లేదు. ఆతఁడు వాగీశనాయనానునకు శంకరుఁడు ప్రత్యక్షమయిన యాక్షేత్రమునఁగల దక్షిణకైలాస మను ఆలయమునకు భార్యతోఁ గూడ ప్రతిదినమును పోయి దినమునకు లక్షయు నెనుబదివేలపర్యాయములు రామనామమును స్మరించి భగవంతునకు సమర్పించుచువచ్చెను. భక్తిలేని నరులను గాంచి ఆతఁడు పరితాపపడుచు ననేక కృతులను నిర్మించెను. ఆతని కీర్తనలను ఆలకించి అనేకులు ఐహికసుఖాశ వీడి మోక్షేచ్ఛులై శ్రీరామచంద్రునిఁ గొలువసాగిరి. దక్షిణకైలాసమున తొంబదియాఱుకోట్ల రామనామములను జపించి ముగించిననాఁడు శ్రీరామచంద్రుఁడు సీతాలక్ష్మణభరతశత్రుఘ్నాంజనేయాదులతో సాక్షాత్కరించి అభయ మీయఁగా త్యాగరాజు ఆనందపరవశుఁడై కొంత తడవునకు తెలివి తెచ్చుకొని శ్రీరామచంద్రునకు అనేకసాష్టాంగములు ఆచరించి "నన్నువినాసుఖము" "శ్యామసుందరాంగ" మున్నగు అనేకకృతులను రచించెను. అది మొదలు ఆతఁడు తాను శయనించుటకు పూర్వము పాలు పండ్లు, పంచదార, మున్నగు వస్తువులను

శ్రీరామవిగ్రహము సన్నిధి నుంచి "ఆరగింపవే" "విడెముసేయవే" మున్నగు కృతులతోఁ బ్రార్థించి శయనింపసాగెను. మఱునాఁటిప్రాతఃకాలము చూచునప్పటికి పెట్టిన వస్తువులుసగము సగమే ఉండసాగెను. అది చూచి త్యాగరాజు, ఆనందవివశుఁడై భగవచ్ఛేషమును అతి భక్తితో స్వీకరించుచుండెను.

ప్రతిసంవత్సరము నాతఁడు పెక్కుసారులు బ్రాహ్మణసంతర్పణలు సేయుచుండువాఁడు. ఆతని శ్రోత్రకీర్తనలను వినుటకు వచ్చువారి సంఖ్య ఇంతింతని చెప్పుటకు అలవిగాదు జప్యేశుఁడు కారణము లేకయే త్యాగరాజు సేయు ఉత్సవములకును,సంతర్పణములకును అనేక విఘ్నములను గలుగఁ జేయుచుండువాఁడు. ఒకనాఁడు ఆతఁడు అంతటితో నూరకుండఁజాలక త్యాగరాజు అర్చించు శ్రీసీతాలక్ష్మణభరతశత్రుఘ్నాంజనేయసహితమగు శ్రీరామవిగ్రహమునుకొనిపోయి కావేరీనదిలో బాఱవేసెను. అది తెలిసి త్యాగరాజు నిద్రాహారములను మాని "అన్యాయముసేయకురా" "నాయెడవంచన" "మరియాదగాదుర" "మరియాదగాదయ్య" "ఎందుదాగినాఁడో" "చేరరావదేమిరా" మున్నగు అనేకకీర్తనలను బాడుచుఁ బ్రార్థింపఁగా, శ్రీరాముఁడు త్యాగరాజు దీక్షను ఒకసంవత్సరము పరీక్షించి కావేరీనది ఇసుకలో దొరకెను. త్యాగరాజు నాఁడు బ్రహ్మానందభరితుఁడై ఆవిగ్రహములను ఇంటికిఁ గొనివచ్చి సంప్రోక్షణచేసి"రఘువీరరణధీర""ముద్దుమోము" "అలకలల్లలాడ" "శ్రీరామ జయరామ" మున్నగుకీర్తనలతోఁ గొనియాడి తన అన్న మంచిమార్గమునకు రావలెనని శ్రీరామునిఁ బ్రార్థించెను. వెంటనే రాముఁడు అట్లు అనుగ్రహించెను. అదిమొదలు జప్యేశుఁడు తమ్మునితోఁగూడి రామభజనము చేయసాగెను.

ఒకనాఁడు త్యాగరాజు భార్యయు ధర్మసంవర్ధనీదేవియు ఏదో మాట్లాడుకొనుచుండిరి. ఇంతలో త్యాగరాజు లోనికి వెళ్లెను. అది చూచి దేవి వెంటనే తిరోహిత యయ్యెను. అప్పుడు ఆతఁడు "నీవెవరితో మాట్లాడుచున్నావు"అని యడిగి భార్యవలనఁ బ్రత్యుత్తరమును బడయక ఇంతలో అంతయుఁ దెలిసికొని "తఱిని తెలిసికొంటి" "అంబ నిన్ను కన్న తల్లి" "నన్నుకన్నతల్లి" మున్నగు కీర్తనలను బాడి సంగతి యంతయుఁ బ్రకటపఱిచెను.కొంతకాలమైన తరువాత త్యాగరాజునకు

కళత్రవియోగము తటస్థించెను. అప్పుడు ఆతఁడు ఆమె సుగుణములను దలంచుకొని "తొలిజన్మమున" "ఏపాపము" అను కీర్తనములను రచించెను.

ఒకప్పుడు తంజావూరురాజు త్యాగరాజును దన యాస్థానమునకు రమ్మని వర్తమానము చేసెను; గాని త్యాగరాజునకు నరులను వినుతించి వారి యనుగ్రహము నాసించుట ఇష్టము లేదు; గావున నాతఁడు "నిధి చాలసుఖమా రాముని సన్నిధిసేవ సుఖమా" యను కీర్తనపాడి మనస్సును మఱలించుకొని యూరకుండెను. అట రాజు త్యాగరాజు తనయాజ్ఞను జవదాఁటినందులకు కుపితుఁడై నిర్బంధముతో రప్పింపఁ దలఁచెను. ఈదౌర్జన్యమునకు ఫలముగా వెంటనే ఆతనికి శూల ప్రారంభించి చాల తీవ్రముగ బాధింపసాగెను. అపుడు రాజు కన్నులు తెఱచి "ఇది పెద్దలయెడల అపరాధము సేయుటవలన సంభవించిన" దని యెఱింగి వినీతవేషముతోఁ బోయి పాదములమీఁద వ్రాలి ప్రార్థింపఁగా త్యాగరాజు రాముని ప్రార్థించి ఆబాధ లేకుండఁజేసి పంపివేసెను.

పిదప త్యాగరాజు తిరుపతికిఁబోయి శ్రీనివాసమూర్తిని దర్శించుటకు ఆలయమునకుఁ బోయెను; గాని స్వామికి తెర వేయఁబడియుండెను. "నాపురాకృతపాపము ఇట్లు అడ్డు వచ్చినది" అనితలఁచి "తెరతీయఁగ రాదా" యను కీర్తన పాడఁగా వెంటనే తెర తెగి పడిపోయెను. పిదప నాతఁడు వేంకటేశ్వరుని సేవించి స్వస్థలమునకు మఱలఁగా కోవూరు అను శైవస్థలమున నివసించియున్న సుందరేశమొదలియారు అను శైవభక్తుఁడు ఒకఁడు వచ్చి ప్రార్థించి తనయూరికిఁ గొనిపోయెను. త్యాగరాజు ఆతనియింట వారముదినములు నివసించియుండి ఆతనివలన ప్రార్థితుఁడై పరమశివునిమీఁద "కోరిసేవింప" "నమ్మివచ్చిన" "శంభో మహాదేవ"అని యిట్లు కొన్నికీర్తనములు రచించి అక్కడనుండి బయలుదేఱెను. పోవునపుడు మొదలియారు, "ఈమహానుభావునకు ధనకాంక్ష లేదు; గావున ప్రత్యక్షముగా నిచ్చినఁ బుచ్చుకోఁడు"అని తలంచి ఆతనిపెట్టెలో వేయిరూపాయలను బోసి పల్లకిలోనుంచి ఆతని ముఖ్యశిష్యులకు ఈసంగతి నెఱింగించి భద్రముని చెప్పి పంపివేసెను.

మార్గమధ్యమున అర్ధరాత్రమున కొందరు చోరులు వచ్చి తుప్పలవెనుక నిలిచి వారిమీఁదికిఱాళ్లు రువ్వసాగిరి.అదిచూచి శిష్యులు

భీతిల్లఁగా త్యాగరాజు "భీతిల్లవలదు. చోరులకు మనవద్ద దొరకునది ఏమియు లేదు. శ్రీరామునికటాక్షము మనపైఁగలదు" అని పలికెను. కొంతసేపయినతరువాత రామలక్ష్మణులు ఇరువురును రాజకుమారరూపములతో వచ్చి చోరులపై బాణవర్షమును గురిసి పాఱద్రోలి వెడలి పోయిరి. చోరులు వారి సౌందర్యమును జూచి ముగ్ధులై వచ్చి త్యాగరాజునకు మ్రొక్కి "మహానుభావా, ఇంతవఱకును మీపాలకి ముందు వెనుకల నిలిచి మాపై బాణవర్షమును గురిసిన రాజకుమారులను జూపి పుణ్యము కట్టుకొనుఁడు. మేము మీవద్దనున్న లిబ్బిని దొంగిలింపవచ్చిన చోరులముగాన వారినిఁ జూచినపిదప మామనస్సు తిరిగి పోయినది. వారినిఁ జూపినఁ గాని మేము బ్రతుకఁజాలము" అని ప్రార్థించిరి. అదివిని త్యాగరాజు దివ్యదృష్టితో సంగతియంతయు గ్రహించి "మీభాగ్యమే భాగ్యము. వారు రామలక్ష్మణులు. అప్రయత్నముగ వారిని దర్శింపఁగలిగిన మీరు అదృష్టవంతులు" అని పలికి "వాచామగోచరమే" మున్నగు కీర్తనలను బాడి భగవంతుని వినుతించెను. పిదప చోరులు త్యాగరాజునకు శిష్యులై నాఁటినుండి క్రూరత్వమును మాని కేవలము సాత్త్వికులై రామభజనము ప్రారంభించిరి.

వారందఱును అక్కడనుండి బయలుదేఱి వచ్చుచు నొక యగ్రహారము చేరిరి. అచ్చట నొక దేవాలయముచెంత ననేకులు గుంపులుగూడి యుండిరి. త్యాగరాజు శిష్యులలో నొకఁడు అచ్చటకుఁ బోయి అడుగఁగా, వారిలో నొకఁడు "ఒకబ్రాహ్మణుఁడు నిన్నరాత్రి జాము అగునప్పటికి భార్యాపుత్రులతో నీగ్రామము చేరిరి. పులిమున్నగు దుష్టమృగములకు జంకి అగ్రహారమునందలివారు ఎవ్వరును వారెంతపిలిచినను తలుపులు తీయలేదు. అంతట వారు విసిగి దేవాలయమున నుందమని ఇచ్చటకువచ్చి చూడఁగా ఆలయద్వారము లోపల గడియ వేయఁబడియుండెను. అప్పుడు ఆబ్రాహ్మణుఁడు గోడదాఁటి లోనికిఁబోయి తలుపు తెఱచెద నని భార్యాపుత్రులను ద్వారముచెంత నుంచి మఱియొకచోట గోడదుమికెను. అతఁడు ఎక్కడఁ దుమికెనో అచ్చట లోపలఒక పెద్దబావియున్నది. దైవదుర్విపాకమువలన నాతఁడు ఆబావిలోఁ బడి చనిపోయెను. అంతట ఆతనియిల్లాలు భర్తయెంతకును రాకుండుటఁ గాంచి యేదో విపత్తు సంభవించెనని భావించి రాత్రియంతయు నదే

పనిగదుఃఖించెను. తెల్లవాఱినతరువాత ఇదివిని ఊరిలోనివారందఱును ఇచ్చటకు వచ్చిరి. నూతిలో నున్న ఆబ్రాహ్మణుని పైకితీసితిమి ఆబ్రాహ్మణి భర్తమీఁదఁబడి విలపించుచున్నది. ఇదిసంగతి" అనిచెప్పెను. శిష్యుఁడు ఈవృత్తాంతము త్యాగరాజునకు ఎఱింగించెను. వెంటనే త్యాగరాజు అచ్చటకుఁ బోయి "నాజీవాధార"అను కీర్తనపాడి ప్రార్థించుచుండఁగా ఆబ్రాహ్మణుఁడు నిద్రపోయినవానివలె లేచి కూరుచుండెను. అందఱును త్యాగరాజు మహిమ నారసి ఆశ్చర్యచకితులైరి. పిదప ఆబ్రాహ్మణుఁడు త్యాగరాజు సెలవుబడసి తిరుపతికిఁ బోయెను.

ఒకప్పుడు త్యాగరాజు శ్రీరంగమునకుఁ బోయెను. అచ్చట నాతఁడు రంగనాథుని దర్శించి సేవించి కీర్తనలతో వినుతించి అచ్చట నుండి బయలుదేఱి మధ్యార్జునము, గోవిందపురము, నాగపురములకుఁ బోయి మహాలింగస్వామిని, బోధేంద్రస్వామిని, శ్రీధరవెంకటేశ్వరుని, కాయారోహణస్వామిని సేవించి తుదకు స్వస్థలమగు పంచనదక్షేత్రము చేరికొనెను.

గోవిందదాసు అను నొక సంగీతవిద్వాంసుఁడు పంచనదమున త్యాగరాజు నిమిత్తము ఎదురుచూచుచు నుండి ఆతఁడు వచ్చినవెంటనే తనయాగమనకారణము నెఱింగించి, అనుజ్ఞను బొంది పాడి తన సంగీత విద్యాప్రావీణ్యమును గనఁబఱిచెను. త్యాగరాజు చాల నానందించి ఆతనిని దీవించి పంపెను. పిదప నొక బ్రాహ్మణుఁడు కాశీనుండి రామేశ్వరమునకుఁబోవుటకు వచ్చుచుండఁగా శ్రీరాముఁడు ఒకనాఁటి రాత్రి ఆతనికి "పంచనదక్షేత్రమున నాయంతరంగభక్తుఁడగు త్యాగరాజు ఉన్నాఁడు. ఆతనిని సేవించి పొమ్ము" అని స్వప్నమునఁ జెప్పెను. ఆబ్రాహ్మణుఁడు అట్లే చేసెను. త్యాగరాజు అది విని పరమాశ్చర్యచకితుఁడై "దాశరథే" అను నొకకీర్తనము రచించి ఆనందించెను.

త్యాగరాజు ప్రహ్లాదవిజయము, నౌకాచరిత్ర, మున్నగు కొన్ని గ్రంథములను వ్రాసి యెనుబదియేండ్ల వయస్సున "జ్ఞానమొసఁగ రాదా" "ఇదిసమయముగాదా" యని రెండు కీర్తనములను రచించి పాడెను. శ్రీరామచంద్రుఁడు నాఁటిరాత్రి స్వప్నమున సాక్షాత్కరించి

'సన్యసింపుము. నేఁటి కెనిమిదవ దినమున నీకు మోక్షము నొసఁగెద' నని చెప్పెను.

త్యాగరాజు అట్లే చేసెను. కలియుగము ౪౯౪౮ సంవత్సరములు గడచినపిదప పరాభవసంవత్సర పుష్యబహుళపంచమినాఁడు ఆతఁడు పాంచభౌతిక దేహమును విడిచి శ్రీహరిసాయుజ్యమును బడసెను. మరణ సమయమున ఆతని కపాలము బ్రద్దలు చేసికొని, దివ్యతేజస్సు ఆకసమునకు నిర్గమించెను. అదిగాంచి అందఱును ఆశ్చర్యచకితులైరి.

త్యాగరాజు ఆంధ్రుఁడు. ఆతనివలననే కర్ణాటకగానము భూమిపై నిలిచినది. ఆతఁడు చేసిన కృతులు అన్నియు సంస్కృతమునందును ఆంధ్రమునందును ఉన్నవి. ఆతని కృతులను పాడియే దాక్షిణాత్యులు అనేకులు నేఁటికిఁగూడ జీవయాత్ర గడుపుచున్నారు. ఎప్పటికినిఁగూడ దక్షిణభారతదేశమున గాయకులకు త్యాగరాజకృతులే శరణ్యములు. ఆతని సమాధి కావేరీతీరమున ఇప్పటికినిఁ గలదు.

శంకరాభరణము-దేశాది.

పల్లవి.

ఎందుకు పెద్దలవలె బుద్ధియ్యవు - ఎందుబోదునయ్య రామయ్య॥ ఎం॥

అనుపల్లవి.

అందఱివలె దాఁటిదాఁటిన చరిత - అందరానిపండాయెనుగదరా॥ ఎం॥

చరణము.

వేదశాస్త్రతత్త్వార్థములఁ దెలిసి - భేదరహిత వేదాంతము తెలిసి।
నాదవిద్యమర్మంబులను దెలిసి - నాథత్యాగరాజనుత నిజముగ॥ ఎం॥

---

107. ధశావంతుఁడు.

శ్లో॥ "అర్థ మనర్థం భావయ నిత్యం, నాస్తి తత స్సుఖలేశ స్సత్యం,
పుత్రా దపి ధనభాజాం భీతిః, సర్వ త్రైషా విహితా రీతిః."
(6. గోవిందద్వాదశమంజరికాస్తోత్రము.)

కాశీనగరమున దశావంతుఁడు అను నొక వర్తకుఁడు ఉండెను. ఆతని పూర్వులు విశేషధనమును సంపాదించి ఇచ్చి పోయిరి. దశావంతుఁడు గూడ పూర్వులు చేసిన వర్తకమునే చేయుచుండెను; గాని

పూర్వులకును ఈతనికిని జాల భేదము ఉన్నది. పూర్వులు ఎట్లయినను ధనము నార్జించుటయే ప్రధానము అని నమ్మి చరించిరి. దశావంతుఁడు అట్లు గాక వర్తకులు చేయు మాయల నన్నిటిని విడిచి యథార్థముగను స్వల్పలాభమునకును క్రయవిక్రయములు సేయుచు ఐహికసుఖముల యెడల నిస్పృహ వహించి ఆముష్మికఫలాపేక్షుఁడై యుండెను. ఆతఁడు సంసారమునందు ఉన్నను తామరాకుమీఁది నీటిచుక్కవలె ఎందును అంటక భక్తివైరాగ్యబంధురుఁడై భగవద్భాగవతార్చనము సేయుచుఁ గాలము గడపుచుండెను.

ఆతనికి అయిదుగురు కుమారులు ఉండిరి. వారందఱును యుక్త వయస్కులును, వ్యవహారపరిజ్ఞాతలును అయిరి. దశావంతుఁడు "సంసారభారము నంతను కుమారుల మీఁద నుంచుటకు యోచించుచుండఁగా వారు అయిదుగురును ఆనగరమును ఏలు రాజు సన్నిధికిఁ బోయి "ప్రభూ, ఏలినవారు సావధానముగఁ జిత్తగింపవలయును. మాతాత ముత్తాతలు అపారధనము నార్జించి పోయినారు. మాతండ్రి దానిని వృద్ధిచేయ కున్న మానె నిలిపినఁ జాలును; గాని మాకష్టసుఖములను ఇంచుకయు యోచింపక సాధువులని, సజ్జనులని, భాగవతులని, సమారాధన లని, అన్నవస్త్రాదిదానములని అనేకవిధములను వెచ్చించివేయుచున్నాఁడు. ఇంట నున్న ధనపేటికలు అనేకములు ఖాళీ యైనవి. ఇఁక కొలఁదిదినములు ఇట్లే జరిగినచో మాకుఁ గుండయు గట్టియుఁ జేతికి వచ్చును; గావున మహాప్రభూ, మాతండ్రియధీనమున నున్న ధనము మాస్వాధీనము చేయుము" అని ప్రార్థించిరి. రాజు దశావంతుని రావించి ఇది యంతయు నెఱింగించి "ధనము అంతయు, నీవు పాడుచేయుచున్నావు. ఇది నీస్వార్జితము కాదు. కావున నీచిత్తము వచ్చినట్లు వెచ్చించుటకు వీలులేదు. సొమ్ము అంతయు నీ కుమారుల స్వాధీనము చేయుము. వారు నీకు గ్రాసవాసాదులకు లోపము లేకుండ మనోవృత్తి రూపముగా సంవత్సరమునకు ఇంత యని కొంత సొమ్ము ఇచ్చుచుందురు" అని పలికెను.

ఇది విని దశావంతుఁడు మందహాసము గావించి "రాజా, భూపతి సకలధర్మముల నెఱింగినవాఁడై యుండవలయు నని పెద్దలు

శాసించినావు. అది నీయెడల వ్యర్థమైనట్లు తోఁచుచున్నది. ఆకొండికి వాండ్రు యుక్తాయుక్తపరిజ్ఞానము లేక ధనమును గుఱించి తగాదా చేయ నీ విట్లు తీర్పు చెప్పెదవా ? సంసారముకంటె జీవునకు భయంకరశత్రువు లేదు. అట్టిచో సంసారమునకు ఎల్ల మూలమగు ధనమును గుఱించి వివరింపవలసిన దేమున్నది ? అట్టి ధనమును ఇంతచిన్నతనమునందే ఆకొండికవాండ్ర కిచ్చిన ముందేమి జరుగునో యోచింపవలదా ? యౌవనమదమువలనను, ధనగర్వము వలనను వాండ్రు సకల దుష్కార్యములను జేసి చెడిపోరా ? ఆపాపము అంతయు నీకు తగులుకోదా ? ఏల యిట్టి యేర్పాటు చేసెదవు ? బుద్ధిని కానిత్రోవలను ద్రొక్కనీయక బాగుగ యోచింపుము" అని పలికెను.

ఈమాటలు వినుటవలన రాజునకు కోపము వచ్చెను. దశావంతుఁడు నిజమైన విరాగికాఁడు. రాజతిరస్కారముచేసినపాపాత్ముఁడు. అని నిశ్చయించుకొని యాతఁడు తలారులను జూచి "ఈదంభవ్రతుని కట్టి కొనిపోయి నదిలో పాఱవేయుఁడు" అని యాజ్ఞాపించెను. తలారులును రాజాజ్ఞప్రకారముఁ గావించిరి దశావంతుఁడు నదిలోఁగా వేయఁబడిన వెంటనే కట్లు ఊడిపోయెను భక్తవత్సలుఁడగుపాండురంగఁడు కూర్మరూపియై వీఁపుమీఁద నెక్కించుకొని దశావంతుని నది యంతయు త్రిప్పసాగెను. ఇది చూచి గూడవచ్చినప్రజలు ఎల్లరును ఆశ్చర్యచకితులై మాటలాడఁజాలకపోయిరి. రాజభటులు వడివడిగఁ బోయి ఇది యంతయు రాజునకు ఎఱిఁగించిరి. రాజును ఆశ్చర్యచకితుఁడై అచ్చటకు వచ్చి కొంతతడవు మాటలాడఁజాలక ఎట్టకేలకు తెప్పిరిలి "దశావంతా, నీవు నీటిమీఁద నెట్లు తేలియాడుచున్నావు?" అని యడిగెను. అందులకు దశావంతుఁడు మందహాసము గావించి ఇట్లు పలికెను.

"రాజా, నీవు తత్వమెఱుంగనివాఁడవు; గావున నిట్లు పలుకుచున్నాఁడవు. ఇందు నాప్రజ్ఞ యేమియు లేదు. అంతయుఁ బరాత్పరుఁడు చేయుచున్నాఁడు. ఎవని చింతామాత్రమున ఈప్రపంచ మంతయు పుట్టి, పెఱిగి గిట్టుచున్నదో, ఎవని లీలలు అనంతములును, అవాఙ్మానసగోచరములు నై యున్నవో, ఎవనిఁ దెలిసికొనుటకు సనకసనందనాదులు గూడ శాశ్వతతపోనిష్ఠాగరిష్ఠులై యున్నారో, నిర్మలభక్తితో స్మరించినంతమాత్రమున మానవులకు ఎవఁడు మోక్షము నొసంగుచు

న్నాఁడో, భక్తపరాధీనుఁడగు ఆపుండరీకవరదుఁడు కూర్మరూపియై నన్ను వీఁపు మీఁద నెక్కించుకొని నదియంతయు సంచరించుచు న్నాఁడు.''

''జనులారా, ఈకాన్పించుచున్న దంతయు క్షణభంగురము. సంసారము అసారము. తనువులు బుద్బుదప్రాయములు. సంసారమునఁ గూలి అన్యమెఱుఁగక యుండువానికి పరము లేదు. దారపుత్త్రాదిబంధు భావములు అన్నియు అజ్ఞానవిలసితములు. ఒకరితో నొకరి కేమియు సంబంధము లేదు. అట్టి యెడలఁ బరుల నిమిత్తము పరమునకు చెడు వానికంటె అజ్ఞాని యుండఁడు గదా? జీవోపహతులకు పాండురంగఁడు ఆధారభూతుఁడై యున్నాఁడు ; కావున మీరందఱును ఆతని పాదపద్మములను ఆశ్రయించి తరింపుఁడు.''

ఇది వినఁగనే రాజునకు జ్ఞానము వచ్చెను. కూడవచ్చిన వారికి తత్త్వము బోధపడెను. వెంటనే అందఱును ప్రార్థింపఁగా కూర్మరూపియగు భగవంతుఁడు దశావంతుని తీరమునకుఁ దెచ్చి విడిచెను. రాజును, ప్రజలును, కుమారులును, బ్రహ్మరథముపట్టి దశావంతుని పట్టణమునకు గొనిపోయిరి. రాజును, కుమారులును, ప్రజలలో ననేకులును, దశావంతునివలన జ్ఞానోపదేశము బడసిరి. దశావంతుఁడు బ్రతికియున్నంత కాలమును అనేకులకు జ్ఞానోపదేశము చేసి అవసానమున ఈశ్వరసాయుజ్యమును బడసెను.

శ్లో. ''బద్ధేనాంజలినా నతేన శిరసా గాత్రైస్సరోమోద్గమైః
కంఠేన స్వరగద్గదేన నయనేనోద్గీర్ణబాష్పాంబునా,
నిత్యం త్వచ్చరణారవిందయుగళధ్యానామృతాస్వాదినా
మస్మాకం సరసీరుహాక్ష సతతం సంపద్యతాం జీవితమ్.''

(ముకుందమాల. 20.)

---

108. సంతోబా.

శ్లో. "తమసి రవి రివోద్యన్మజ్జతా మంబురాశౌ
ప్లవ ఇవ తృషితానాం స్వాదువర్షీవ మేఘః,
నిధిరివ విధనానాం దీర్ఘతీవ్రామయాణాం
భిషగివ కుశలం నో దాతు మాయాతు శౌరిః."

(కృష్ణకర్ణామృతము. ఆ. 3. శ్లో. 97)

ఒక గ్రామమున సంతోబా యను నొకవర్తకుఁడు ఉండెను. ఆతఁడు తన సంసారకృత్యములను అన్నిటిని మామూలుగ నిర్వహించుకొనుచు శ్రీహరిధ్యానము తప్పక యుండెను. ఒకనాఁడు ఒకచోట తుకారామస్వామి హరిభజనము సేయుచుండఁగా నీతఁడు వినియెను. తోడనే వైరాగ్య మతిశయించెను. ఆవెంటనే సంతోబా యింటికి వచ్చి లక్షలకొలఁదిగ నున్న ధనమంతయు బీదలకుఁ బంచియిచ్చి కాషాయ వస్త్రములను ధరించి అరణ్యమునకుఁ బోయి నిర్జనస్థలమునఁ గూర్చుండి హరిధ్యానము ప్రారంభించెను.

సంతోబా తల్లి కుమారుని మనసు త్రిప్పుటకు అనేకవిధముల సొంతముగాఁ బ్రయత్నించి ప్రయోజనము గానక "తల్లీ, సకలాభరణములను ధరించుకొందువేని నీవు రంభవలె నుందువు. నీవు చక్కఁగ నలంకరించుకొని అడవికిఁ బోయి నీభర్త పాదములమీఁద వ్రాలి ప్రార్థింపుము. అట్లయిన నీకోరిక నెఱవేఱును" అని కోడలికిఁ జెప్పెను. కోడలు వల్లె యని అత్తగారు చెప్పినప్రకారము చక్కఁగ నలంకరించుకొని అరణ్యమునకుఁ బోయెను.

సంతోబా భార్యను జూచి మందహాసము గావించి కూర్చుండ నియమించి "కాంతా, కుసుమమువలె నీవు సుకుమారురాలవు. అత్తింటను పుట్టినింటను గూడ నెన్నఁడును కష్టములను ఎఱుఁగవు. పూలలోఁ బెఱిగిన నీవు ఈగాఢారణ్యమునకు ఏలవచ్చితివి? గతమునకు జింతించినఁ బ్రయోజనము లేదు. త్వరగ నింటికిఁ బోయి సుఖముండుము" అని పలికెను. అందులకు ఆమె "నాథా, మీయాజ్ఞను నేనెన్నఁడును జవదాఁటి యెఱుఁగను. ఇఁకముందుగూడ జవదాఁటఁ జాలను. మీరు

పొమ్మనినఁ బోదును. ఉండు మనిన నుందును. మీరెంతవిరాగులు అయినను మీరు నాకు భర్తలు కాకపోరు. నేను మీపదదాసిని కాకపోను. మేఘమును విడిచి మెఱపును, చంద్రునివిడిచి చంద్రికయు, సూర్యుని విడిచి ప్రకాశమును ఉండఁజాలనట్లు పతిని విడిచి సతి యుండఁజాలదు. మిమ్ము విడిచి నేను ఎట్లు ఉందును? నాకిట్లు ఆజ్ఞాపించుట మీకు ఏమి ధర్మముగ నున్నది?" అని బదులుపలికెను. సంతోబాకు ఆనందముకలిగెను. అంతట నాతఁడు "సాధ్వీ,నీపలుకులకు ఆనందమైనది; గాని ఒకసంగతి వినుము. నీవు నాతో నిచ్చట నుండుటకు ఏమియు అభ్యంతరము లేదు. భార్యాభర్త లిరువురును అరణ్యమున నుండుట వానప్రస్థాశ్రమ మనఁబడును; గాని నేను జీర్ణవసనములను ధరించియుండఁగా నీవు చీని చీనాంబరములను ధరించియుండిన నెట్లు? నీవు ధరించియుండిన సకలాభరణములను, జీనాంబరములనువిడిచి కాషాయాంబరములను ధరించి కందమూలఫలాశనముతోఁ గాలము గడపెదవేని ఇక్కడ నుండుటకు ఎట్టి యభ్యంతరమును లేదు" అని చెప్పెను.

ఆమె తోడనే ఆభరణములను, చీనాంబరములను విడిచి కాషాయ వస్త్రములను ధరించి పల్లకిలో ఆభరణాదుల నిడి "ఇంటికిఁ బొండు" అని బోయీలకు ఆజ్ఞాపించెను. బోయీలు ఆశ్చర్యచకితులై మాఱుపలుకఁజాలక తిన్నగ వచ్చినదారినే పోయిరి. పిదప ఆమె భర్తృచరణముల నంటి "చిన్నతనమునందే మీపాదముల నాశ్రయించితిని. ఇఁక బ్రతికియున్నంతకాలమును నేను మీపాదములను విడిచియుండను. ఇఁక నాజ్ఞాపింపుఁడు. నావలన మీచిత్తమువచ్చిన సేవలు గొనుఁడు" అని పలికెను. "సమీపగ్రామమున మన బందుగులు ఉన్నారు. నీవు ఆగ్రామమునకుఁ బోయి ఎవరేమనినను చలింపక సగమురొట్టెను సంపాదించి తెమ్ము. ఎవరిచ్చినను సగమురొట్టెకంటె నధికము తేకుము" అని సంతోబా యాజ్ఞాపింపఁగా వల్లె యని యామె వెంటనే బయలుదేఱి పోయెను.

ఆగ్రామమున సంతోబా సోదరి యుండెను. కాషాయాంబరములను ధరించి వచ్చి "వాసుదేవా" యని పలికి గుమ్మమున నిలిచియున్న వదినెగారిని జూచి యామె తొలుత నిర్విణ్ణయై కొంతతడవు మాటలాడఁజాలక పిదప నట్లో తెఱపిచేసికొని తటాలునవచ్చి కౌఁగిలించుకొని ఇది

యేమి వదినెయని గ్రుచ్చిగ్రుచ్చి యడిగెనుగాని ఏమియు బ్రయోజనము లేకపోయెను. రొట్టె యనుమాటతక్క సంతోబాభార్య మఱేమియుఁ బలుకలేదు. తుదకు విసిగిపోయి సంతోబాసోదరి గోధుమపిండి నేయి, పంచదార, వీనితోఁ జేయఁబడిన రొట్టెలను దెచ్చి, వదినెగారు "ఇవి పనికిరావు. మీయన్నగారు వీనిని అంగీకరింపరు" అని యెంత చెప్పుచున్నను వినక ఆమె కోకచెంగునకుఁ గట్టి పంపివేసెను. మఱియొకయిల్లాలు సంతోబాభార్య కోరిన ప్రకారము మామూలు రొట్టెలో సగము ఇచ్చిపంపెను.

సంతోబా సోదరి యిచ్చిన రొట్టెలను జూచి "ఇవి మనకేల? నిర్బంధించి యిచ్చినది; గావున మఱల ఇచ్చివేసిరమ్ము" అని పంపివేసెను. ఆతనిభార్య పల్లె యని పోయి ఇచ్చివేసి వెనుదిరిగెను. ఇంతలో మార్గమధ్యమున నున్న నది అమాంతముగ పొంగి మార్గమును అరికట్టెను. అదిచూచి యామె "పండరినాథా, నాభర్త నేను వెడలిన గాని భుజింపఁడు. ఈయేరు ఇట్లు పొంగియున్నది. ఏమి చేయుదును?" అని విచారింపసాగెను. అపుడు పండరినాథుఁడు ఒక పల్లెవానివేషము తో వచ్చి "తల్లీ! ఏల వగచెదవు! నన్ను నీకడుపునఁ బుట్టిన బిడ్డగా ఎంచుకొనుము. నాభుజములపైఁ గూర్చుండుము. నిముసములో నిన్ను అవ్వలియొడ్డునఁ గూర్చుండఁబెట్టెదను" అని పలికెను. ఆమె యందుల కు అంగీకరింపఁగా పల్లెవానివేషమున నున్న పాండురంగఁడు ఆమెను భుజముమీఁద నెక్కించుకొని క్షణములో నవ్వలియొడ్డునకుఁ జేర్చెను.

పల్లెవానికిఁ జాలఁ గృతజ్ఞతఁజూపి ఆమె భర్తచెంతకుఁ బోయి జరిగిన దంతయు నెఱింగించెను. అదివిని సంతోబా, "కాంతా, నీయ దృష్టము నేమని చెప్పఁగలను? పల్లెవేషముతో భగవంతుఁడు నీకు దర్శ న మొసంగెను. నేనేమి పాపాత్ముఁడనో నాకు దర్శన మివ్వకపోయెను; గావున పాండురంగఁడు నాకుసాక్షాత్కరించునంతదనుక నేనునిద్రాహా రముల నొల్లను" అని వ్రతము పట్టెను. ఈవ్రతము నెఱింగిన పాండురంగఁడు సమీపగ్రామమునందలి యొకవర్తకుని స్వప్నమున సాక్షాత్కరించి "వర్తకుఁడా, నీవు పోయి అరణ్యమధ్యమున నున్న సంతోబాకు రొట్టెలను ఇచ్చిరమ్ము" అని చెప్పి అదృశ్యుఁ డయ్యెను. వర్తకుఁడు నిద్రమేల్కాంచి ప్రాతఃకాలమునందే రొట్టెలనుతయారుచేసి

కొని అరణ్యమునకుఁబోయినంతో బానుదర్శించి జరిగినదంతయు నెఱింగించి "ఈరొట్టెలను స్వీకరింపవలయు" నని ప్రార్థించెను. నీకు సాక్షాత్కరించిన పాండురంగఁడు నాకుగూడ సాక్షాత్కరించినఁగాని నే నే రొట్టెల నొల్లనని తిరస్కరించెను. చేయునదిలేక వర్తకుఁడు తనదారిం బోయెను.

పాండురంగఁడు సంతోబా చిత్తశుద్ధికిని, దృఢదీక్షకును మెచ్చి రుక్మిణీసహితుఁడై సాక్షాత్కరించెను. అపుడు సంతోబా పరమానందభరితుఁడై పరమేశ్వరుని వలగొని మ్రొక్కి, "శ్రీహరీ, సనకసనందనాదులకుఁ గూడ అలభ్యమైన దివ్యదర్శనమువలన నాపాపములు అన్నియు భస్మపటలమై పోయినవి. అన్నియు బాగుగనేయున్నవి గాని నీ దివ్యరూపసందర్శనమువలన యుత్కంఠచే నాకు గాద్గద్యము వొడముచున్నది. ఇఁక నిన్ను వినుతింపఁజాలను" అని పాదములమీఁద వ్రాలి కరుణింపుము అని ప్రార్థించెను. "నీవు నాయంతరంగభక్తుఁడవైతివి. నిన్ను విడిచి నేను ఉండను" అని అభయ మిచ్చి పాండురంగఁడు తిరోహితుఁ డయ్యెను. అది మొదలు సంతోబా మహానందముతో హరిభజనము జేయుచు భిక్షాన్నము భుజించుచు గాలము గడుపసాగెను.

ఒక సమీపగ్రామమున నొక బ్రాహ్మణుఁడు భార్యమీఁద కోపము వచ్చినప్పుడెల్ల "నేను సంతోబావలె విరాగినై యరణ్యమునకుఁ బోయెద" నని బెదరించుచు ఆమెవలన వలసిన వెల్లఁ జేయించుకొనుచుండెను. ఒకనాఁడు ఆబ్రాహ్మణి సంతోబా భిక్షకు వచ్చినపుడు సకలము నెఱింగించి ఉపాయము సెప్పవలయునని ప్రార్థించెను. అందులకు సంతోబా "నీచిత్తము వచ్చినట్లు చేసికొనుము. అని చెప్పుము" అని నియమించెను. ఆమె యట్లేచేసెను. అదివిని బ్రాహ్మణుఁడు "ఇఁక నిచ్చట నుండిన నిదిలోకువసేయు" నని చింతించి ఒక చెంబును ఒక వస్త్రమును మాత్రము గైకొని సంతోబాచెంతకుఁబోయి "నేను విరాగినై మీశరణు బొందవచ్చితిని" అని ప్రార్థించెను. సంతోబా అందుల కంగీకరించి "తటాకమునకుఁబోయి జలము గైకొనిరమ్ము.అచ్చట అపుడపుడు చోరులు సంచరించుచుందురు; గావున నీఇత్తడి చెంబు నిచ్చట నుంచి సొరకాయబుఱ్ఱతో తీసుకొనిరమ్ము" అని పంపెను. ఆబ్రాహ్మణు

నకు చెఱువునుండి గురుసన్నిధికి వచ్చునప్పటికి తీఱని ఆఁకలి బాధింపసాగెను. ఆసంగతి విన్నవింపఁగా సంతోబా తినుమని చెప్పి వెఱ్ఱిపుచ్చకాయ నిచ్చెను.

ఒక కాయ నోటఁ బెట్టుకొనునప్పటికి విపరీతపు చేదువలన నోరు చెడిపోయెను. "ఇఁక నేను తినఁజాలను. నాకు రుచ్యమైన పదార్థమును ఈయవలసిన" దని బ్రాహ్మణుఁడు కోరెను. "నీవు నిక్కముగా విరాగివికావు. వేషధారివి. సంగతియంతయు నెఱింగింపుము" అని సంతోబా కోరఁగా నాతఁడు అంతయు నెఱింగించెను. "నీకిట్టి దౌర్జన్యము తగదు" అని బ్రాహ్మణునకు బుద్ధిచెప్పి ఆతనిని గ్రామమునకుఁ గొనిపోయి భార్యాభర్తల కైక్యము సంఘటించి తనదారింబోయెను.

ఒకప్పుడు ఆషాఢశుద్ధఏకాదశినాఁడు పంఢరిపురమున జరుగు మహోత్సవమును చూచుటకు అనేకభాగవతులు బయలుదేఱి సంతోబాయున్న అరణ్యమార్గమున వచ్చిరి. అచ్చట భీమానదియు మఱియొకనదియు సంగమించును. అపుడు ఆనది కూలంకషమై ప్రవహించుచుండుటఁ జూచి భాగవతులు అందఱును "ఱేపే మహోత్సవము. నది ఇట్లున్నది. ఏమి సేయుదుము" అని చింతించుచుండఁగా సంతోబా అచ్చటకు వచ్చి "మీరేల చింతించెదరు! భవార్ణవమును దాఁటించు శ్రీహరికి ఈనదిని దాఁటించుట లెక్కయా? రండు నావెంట" నని ముందు బయలుదేఱెను. భక్తులందఱును ఆతని ననుసరించిరి. నది మోకాలి లోఁతు అయ్యెను. అంతయు నైనతరువాత సంతోబా పాండురంగఁడు మహాకూర్మమై నదిని దాఁటునపుడు తమ పాదముల క్రింద నుండుట యెఱింగి అనేకవిధములఁగొనియాడి బ్రతికియున్నంత కాలమును ఇట్లే అనేకులకు మోక్షమార్గమును జూపి అవసానమున శ్రీహరిసాయుజ్యమును బొందెను.

మ. "అడవిం జీఁకటిఁ బోవువాని కుదయం బైనట్టిసూర్యాకృతిన్
జడధిం గ్రుంగఁగ నావదగ్గతిన యోజం జేదకున్ లిబ్బిచో
ప్పడురీతిం దృషచేర్పఁగా జడిమొగుల్ సైకొన్నచందాన నా
పృడరన్ మాన్పెడువైద్యు నట్లు హరి డాయన్ వచ్చి నన్ బ్రోచుతన్."

(కృష్ణకర్ణామృతము ఆ. 3. ప. 97)

109. జగన్మిత్ర నాగనాథుఁడు.

శ్లో. "జిహ్వే కీర్తయ కేశవం మురరిపుం చేతో భజ శ్రీధరం
పాణిద్వంద్వ సమర్చ యాచ్యుతకథా శ్శ్రోత్రద్వయ త్వం శృణు,
కృష్ణం లోకయ లోచనద్వయ హరే ర్గచ్ఛాంఘ్రియుగ్మాలయం
జిఘ్ర ఘ్రాణ ముకుందపాదతులసీ మూర్ధం నమాధోక్షజమ్."

(ముకుందమాల. 16. శ్లో.)

వైద్యనాథపురమున నాగనాథుఁడు అను బ్రాహ్మణుఁడు ఒకఁడు ఉండెను. ఆతఁడు సంసారమున నున్నను తామరాకుమీఁది నీటిబిందువువలె నెందు నంటక సంతతము భగవద్భాగవతారాధనము సేయుచు సుఖముగాఁ గాలము బుచ్చుచుండెను. ఆతనికి అందఱును ఇష్టముగా నుండుటవలన జగన్మిత్రుఁడు అను పేరువచ్చెను.

ఆపురమునఁ గల కొందఱు దుర్మార్గులు మొదటినుండియు నాగనాథుఁడు అనిన అనిష్టముగనుండిరి. నాగనాథుఁడు ఎవరిజోలికినిఁ బోవువాఁడు కాకున్నను అకారణజగచ్ఛత్రువులు అగువారికి కారణములు అవసరము లేదుగదా? ఆదుర్మార్గులలో నొకఁడు ఒకరాత్రి రెండుజాముల వేళ నాగనాథుని ఇంటికి అగ్గిపెట్టెను. తోడనే అగ్ని ఇల్లంతయు వ్యాపించి భగభగ మండసాగెను. భగవన్నామస్మరణము గావించుకొనుచున్న నాగనాథుఁడు అది జూచియు "సంసారబంధములలో నొక్కటొకటే అయాచితముగను, అప్రయత్నముగను వదలిపోవుచున్నవి" అని యానందింపసాగెను; గాని చిటచిట ధ్వానములను ఆలించి ఇరుగు పొరుగువారు అందఱును లేచి వచ్చి "మహానుభావునకు ఎంత చిక్కువచ్చె" నని విచారించుచు ఆర్పుటకు అవకాశము లేకపోవుటచే ఏమియుఁ జేయఁజాలక అట్లే చూచుచు నిలువఁబడిపోయియుండిరి. వారికి గుమ్మమునకు ఎదుట ఆయనంతప్రకాశమునఁగూరుచుండి చిఱుతలు వాయించుచు హరిభజనము సేయుచున్న నాగనాథుఁడు కాన్పించెను. ఆతనిం గాంచినతోడనే వారికి ఆశ్చర్యమును భయమును గూడ నొక్కమాఱు కలిగెను. 'ఈమహాత్ముఁడు అగ్నిలోఁబడి చనిపోవునుగాఁబోలు'నని కొందఱును, "ఆహా, ఈభక్తుని మాహాత్మ్యము. అగ్ని ఇంతతీవ్రముగ విజృంభించుచున్నను, ఒక్క నలుసైనను ఆతనిమీఁదఁ బడుట లేదు"

అని మఱికొందఱును జెప్పుకొనసాగిరి; గాని నాగనాథుఁ డేమియు జంకక అట్లే యుండెను. భగవన్నియామకమువలన ఆతని యాలుబిడ్డలు గాఢనిద్రాముద్రితులై యేమియు నెఱుంగకయుండిరి. ఇదియంతయుఁ జూచి అగ్గిముట్టించిన దుర్మార్గులు పశ్చాత్తాపపడి సంగతి యంతయు నెఱింగించి నాగనాథుని పాదములమీఁద వ్రాలి శరణము గోరిరి. నాగనాథుఁడు వారు చేసిన పనికిఁ గోపింపక జ్ఞానబోధ గావించి శ్రీకృష్ణ మంత్రమును ఉపదేశించి పంపివేసెను.

కొన్నిదినములు గడచిన తరువాత ఆగ్రామమునవసించువారందఱునువచ్చి "మహాత్మా, మీ యర్హతకుతగకున్నను మీకుటుంబసంరక్షణమునకుఁ గొంతభూమి నేర్పాటు చేసెదము. అనుగ్రహించి తమరు అంగీకరింపవలయును" అని ప్రార్థించిరి. అందులకు ఆతఁడు అంగీకరింపక "ఆభూమిని నేను ఏమి చేసికొందును? నేను ఉంఛవృత్తిచే జీవించువాఁడను ఈశ్వరానుగ్రహమువలన నేను ఉంఛవృత్తిచేసికొనుచునే అతిథులను బూజించుచు తరించుచున్నాను. నానిమిత్తము మీరుభూమి నొసంగఁబనిలేదు" అని బదులు చెప్పెను. గ్రామవాసులు అంతటఁ జేయునది లేక నాగనాథుని పేరిట నొక గ్రామమును ప్రతిష్ఠించి దాని మీఁదివచ్చుబడిని ధర్మకార్యములయందు వినియోగింపసాగిరి.

ఇట్లుండఁగా ఆగ్రామముల నేలు అధికారి మాఱిపోయి ఆతని స్థానమున నొక తురుష్కుఁడు వచ్చెను. ఆతఁడు నాగనాథునిపేర ధర్మకార్యములకు ఏర్పఱుపఁబడిన భూములను తానాక్రమించుకొనెను. ఊరివారందఱును అట్లుచేయవలదనియు వానినియథాప్రకారముజరుగ నీయవలసినదనియుఁ బ్రార్థించిరి; గాని యవనుఁడు అందులకు అంగీకరింపక నాగనాథుని రప్పించి "నీవు జగన్మిత్రుఁడవని పిలిపించుకొనుచున్నావు; మొదటినుండియు మాకు బెబ్బులి కులదైవమై యున్నది. మహారణ్యమునకుఁ బోయి నీవుఒకవ్యాఘ్రమును గొనివచ్చెదవా సరే, లేకున్న నీపేరధర్మార్థము ఏర్పడిన భూములకు ప్రథమమునుండియుఁ బన్నుగట్టి నీవలన వసూలు చేసెదను" అని గద్దించి పలికెను.

నాగనాథుఁడు వల్లె యని మహారణ్యమునకుఁ బోయి పండరినాథుని ధ్యానించెను తోడనే పాండురంగఁడు వ్యాఘ్రరూపియై వచ్చి సాక్షాత్కరించెను. అంతట నాగనాథుఁడు వ్యాఘ్రరూపియగు

భగవంతుని వలగొని అనేకవిధముల వినుతించి "శ్రీహరీ, నీవు తురుష్కుని ప్రార్థనమునంగీకరింపవలయును" అనికోరెను. పండరినాథుఁడు అందులకు అంగీకరింపఁగా నాగనాథుఁడు వ్యాఘ్రముమెక్కు తన యుత్తరీయమును జుట్టబెట్టి గ్రామమునకు బయలుదేఱెను. మార్గమధ్యమునఁ దారసిల్లినవారందఱును గజగజ వడఁకి పోవసాగిరి. పట్టణమునందలివారు తటాలున ఇండ్లలో దూఱి తలుపులు మూసికొనసాగిరి. ఇట్లుండఁగా నాగనాథుఁడు పులితో కోటగుమ్మము సమీపించెను.

భయాతిరేకమువలన కావలివాండ్రు కోటతలుపులు బిగించిరి. అదిచూచి వ్యాఘ్రేశ్వరుఁడు,గుండెలవియునట్లుఅఱచి రెండుచఱపులు చఱచి తలుపులు పగులఁ గొట్టెను. తోడనే ఇరుదెసలనున్న భటులు తోఁచినట్లెల్లఁ బాఱిపోయిరి. నాగనాథుఁడు వారికి అందఱకునుధైర్యముగొలిపి నగరుచెంగటికిఁ గొనిపోయెను.

నగరి వాకిలిగూడ మూయఁబడియే యుండెను. వ్యాఘ్రేశ్వరుఁడు తొల్లిటివలె మఱలఁ దలుపులు పగులఁగొట్టి లోపలఁ బ్రవేశించెను. ఇదివిని తురుష్కుఁడు భయభ్రాంతుఁడై యొకమూల నొదిగికొనెను. నాగనాథుఁడుఆతనియెదుటకుఁబోయి"నీకులదైవమువచ్చెను. ఏల మూలఁగూర్చుందువు?" అని ప్రశ్నించెను. అది వినితురుష్కుఁడు ఎట్లో ధైర్యము చిక్కబట్టుకొని వచ్చి నాగనాథుని పాదములమీఁద వ్రాలి "మహాత్మా, నీ ప్రభావమును ఎఱుంగక మోసపోయితిని. నన్ను క్షమింపవలయును"అనిప్రార్థించెను. తోడనే వ్యాఘ్రేశ్వరుఁడు శాంతించెను. తురుష్కునకు ధైర్యము పూర్ణముగఁగలిగెను. అగుట నాతఁడు మఱల చేతులు జోడించుకొని నాగనాథుని యెదుట నిలిచి "మహానుభావా, శ్రీహరి నీయెడల నింతటి యనుగ్రహము సూపునని యెవరును ఎఱుంగరు. పులిని ఎప్పటియట్ల అరణ్యమున విడిచి వచ్చి మమ్ము అందఱను గరుణింపుము" అని ప్రార్థించెను. తురుష్కుని ప్రార్థనము ప్రకారము నాగనాథుఁడు పులిని అరణ్యమున విడిచివచ్చెను.పట్టణమునందలివారు ఎల్లరును అతని కెదురేఁగి మహాగౌరవముతోఁగొని వచ్చిరి. నాగనాథుఁడు అధికారియగుతురుష్కునకును ప్రజలలోననేకులకును జ్ఞానమును శ్రీకృష్ణమంత్రమును ఉపదేశించి బ్రతికియున్నంత కాలమును ఇట్లే గడపి అవసానమున ఈశ్వరసాయుజ్యమునుబడసెను,

శ్లో. "శ్రీమన్నృసింహవిభవే గరుడధ్వజాయ, తాపత్రయోపశమనాయ భవౌషధాయ,
తృష్ణాది వృశ్చికజలాగ్నిభుజంగరోగ, క్లేశవ్యయాయ హరయే గురవే నమస్తే.
(శ్రీలక్ష్మీనరసింహస్తోత్రము. 25. శ్లో.)

---

110. సాత్త్వికరాజు.

శ్లో. "అహిమకరకరనికరమృదుమృదితలక్ష్మీ, సరసతరసరసిరుహ సదృశదృశి దేవే
వ్రజయువతి రతికలహవిజయ నిజలీలా, మదముదిత వదనశశిమధురమణిలీయే."
(51. 1. కృష్ణకర్ణామృతము.)

జగన్నాథక్షేత్రమున సాత్త్వికరాజు అను ఒక భూపాలుఁడు ప్రజాపాలనము గావించుచుండెను. ఆతఁడు సంసారమున నుండియు తామరాకుమీఁది నీటిచుక్కవలె నెందు నంటక సదా శ్రీహరిని ధ్యానించుచు రాజభావముతోఁ గాక సేవకభావముతోఁ బ్రజల నేలుచుండెను.

అలవాటు చొప్పున నాతఁడు ఒకనాఁడు స్వామిని దర్శించుటకు ఆలయమునకుఁ బోయెను. అప్పటికి నైవేద్యము జరుగుచుండుటచే ఆలయద్వారములు మూయఁబడియుండెను. రాజు తలుపులు తెఱువఁబడునంతదనుక ఊరక కూర్చుండనేల యని పాచికలను దెప్పించి మంత్రిసామంతాదులతో జూదము ప్రారంభించెను.

కొంతసేపటికి ఆలయమున జగన్నాథస్వామికి నైవేద్యము చేయుట ముగిసెను. అర్చకులు వచ్చి కొందఱు దేవుని దర్శించుటకు ఇది వేళయని తెలిపిరి. కొందఱు భగవత్ప్రసాదమును ఈయఁబోయిరి; గాని జూదమువలన పరవశుఁడై యుండుటవలన రాజు స్వామిప్రసాదమునకు ఎడమచేతిని జాచెను. అర్చకులు ప్రసాదమును ఎడమచేత నిడఁగూడదని తిరిగిపోయిరి. రెండుజాములు అగునప్పటికి రాజునకు జూదముమీఁద విరక్తి పుట్టెను. ఆతఁడు ఆట మానివేసి "నేఁడు స్వామిదర్శనమునకు ఇంకను జాల మేల?" యని ప్రశ్నించెను. అపుడు చెంతనున్న సేవకులు సంగతియంతయు విన్నవించిరి. అది విని రాజు కొంతతడవు నిరుత్తరుఁడై పిదప "అకటా! నేనెట్టి దురదృష్టవంతుఁడను. చింతామణిని విడిచి గాజుఫలకనుఁ గైకొన్న నాబుద్ధి నేమని

నిందించుకొందును ? ” అని కొంతసేపు చింతించి స్వామిని సేవించుకొని ఇంటికిఁ బోయెను.

రాత్రి రాజు శయ్యమీఁదఁ బరుండి ఏమియుఁ దోఁపక “జూదమాడిన ఈచేతిని ఛేదించుకొనుటకంటె ఇందులకుఁ బ్రాయశ్చిత్తము లే” దని నిశ్చయించుకొని మంత్రిని రావించి “నెలదినముల నుండి నిశీథమున ఒకభూతము వచ్చి కిటికీరంధ్రమునుండి లోనికిఁ జేయి చాచి నన్ను బాధించుచున్నది. నేఁడు నీవు ఈగదిలో నుండి భూతము చేయి చాచినవెంటనే దానిని నఱకివేయుము” అని యాజ్ఞాపించెను. మంత్రి వల్లె యనెను. పిదప రాజు బైటకుఁ బోయి గవాక్షమునకుఁ దిన్నగ నిచ్చెన వేసికొని లోనికిఁ జేయి చాచెను. తోడనే మంత్రి భూతము అని తలంచి ఆచేతిని నఱకివేసెను.

రాజు మహానందముతో నిచ్చెన దిగి గదిలోనికిఁ బోయి మంత్రినిఁ గౌఁగిలించుకొని “మహానుభావా, నాకు మంచి యుపకారముచేసితి”వని కొనియాడెను. మంత్రి యథార్థము నెఱింగి విచారింపఁ దొడఁగఁగా రాజు సంగతులన్నియు బోధించి యాతని నూరడించి తమ కుడిహస్తమును పల్లకియం దునిచి స్వామి యాలయమునకుఁ గొనిపోయిఅర్చకులను జూచి “నేను స్వామి సన్నిధికి వచ్చుటకుఅర్హుఁడనుగాను. మీరు ఈహస్తమునుఁ గొనిపోయి స్వామి సన్నిధి నుంచి నన్ను రక్షింపఁ బ్రార్థింపుఁడు” అని విన్నవించెను.

అర్చకులు అట్లే చేసి ప్రసాదము గొనివచ్చి రాజునకు ఇచ్చిరి. తోడనే రాజు కుడిచేయి యథాపూర్వముగ వచ్చెను. మహానందముతో రాజు ప్రసాదమును రెండుచేతులతోడను గ్రహించి భక్షించెను. అచ్చటి వారెల్లరును ఈయద్భుతమునుఁ గాంచి పరమాశ్చర్యచకితులై రాజు ననేకవిధములఁ గొనియాడిరి. సాత్వికరాజు బ్రతికియున్నంతకాలము శ్రీహరినిఁ బూజించి యవసానమున సాయుజ్యము గైకొనఁబడసెను.

చ. “రతికలహమ్మునన్ సతుల రాయిడిఁ జేసి ఒయించి మించు న
ద్ధతిఁ గనిపించలేనగవు నందము గుల్కెడుమోముఁదమ్మిచే
నతులవిభాతభానుకిరణాప్తవికస్వరభాస్వరాంబుజా
యతనయనద్వయిం జెలఁగు నామధురగ్యుతి లీన మయ్యెడిన్.”

(51, 1. కృష్ణకర్ణామృతము.)

శ్రీమహాభక్తవిజయము

తృతీయభాగము.



శ్రీ విశిష్టాద్వైత

గురుపరంపరాప్రభావము.

పీఠిక.

ఇది దక్షిణదేశమున నవతరించిన శ్రీవైష్ణవగురువుల చరిత్రము. "పిన్బళగియ పెరుమాళ్ జీయర్" అను ప్రాచీనుఁడగు వైష్ణవాచార్యుఁడు ప్రప్రథమమున ద్రవిడదేశీయులకు ఉపయోగించునట్లు ఈగ్రంథమును ద్రావిడభాషలో రచించెను. తరువాత మఱికొంతకాలమునకు అనంతాచార్యుఁడు అను విద్వచ్ఛిఖామణి "ప్రపన్నామృత" మను పేరుతో నీచరిత్రమును సంస్కృతభాషలో వ్రాసెను. మఱియొక ఆచార్యుఁడుగూడ సంస్కృతభాషలో "దివ్యసూరిచరిత్ర" మను మఱియొక గ్రంథమును వ్రాసెను.

ఒక శతాబ్దము క్రిందట మంగళగిరినివాసి యగు నంబూరి కేశవాచార్యుఁడు ఈచరిత్రమును తెనుఁగుబాసలో ప్రబంధరూపమున నొనర్చెను. దీనికి "ఆచార్యసూక్తిముక్తావళి" యని పేరు. ఇతనికి సమకాలికుఁడగు వంగల సీతారామాచార్యుఁడు "ఆచార్యరత్నహార" మనుపేరుతో నాంధ్రమున మఱియొక గ్రంథమును వ్రాసెను; గాని పైనిఁ బేర్కొనఁబడిన ద్రవిడసంస్కృతభాషలయందు నిబద్ధములైన గ్రంథములును, ఆంధ్రభాషలో వ్రాయఁబడిన గ్రంథములును ఆభాషలయందు కొంచెమేనిఁ బాండిత్యము కలవారికే గాని సామాన్యులకు గ్రాహ్యములు గావు. ఆంధ్రులును, శ్రీరామానుజసిద్ధాంత భక్తులును, పాండిత్యము లేనివారు నగు స్త్రీపురుషులకు ఉపయోగించునట్లు తేటతెనుఁగున ఈగురువుల చరిత్రమును ఎవ్వరును వ్రాసియున్నట్లు కానము,

ఈనడుమ నాప్రియమిత్రులు, చెన్నపురినివాసులు నగుశ్రీయుత వావిళ్ల! వేంకటేశ్వరశాస్త్రిగారు చిరకాలమునుండి ప్రోత్సహించుచుండుటంజేసి పామరులకుఁగూడఁ దెలియునట్లు సులభశైలిని ఈగ్రంథమును వ్రాయ నారంభించితిని. దీనికి “విశిష్టాద్వైతగురుపరంపరాప్రభావము” అని పేరు. ఇది ప్రపన్నజనులకు మతవిషయికజ్ఞానమును గలిగించి, గురువుల జ్ఞాననిష్ఠ, భగవదుపాసనాపద్ధతి, పరమభక్తి మున్నగువానినిఁ దెలిపి, ఇతరజనవైలక్షణ్యమును గలిగించును. పండితులు ఇందలి తప్పులను సవరింతురుగాక.

విజయనగరము. 12—7—1918.

ఇట్లు విన్నవించు, బుధవిధేయుఁడు,
మేడేపల్లి. వేంకటరమణాచార్యులు.

భూమిక.

శ్రియఃపతి, శ్రీవైకుంఠనివాసి, అఖిలహేయప్రత్యనీకుఁడు, సకలకల్యాణగుణాకరుఁడు, అవాప్తసమస్తకాముఁడు, శ్రీమదనంతగరుడవిష్వక్సేనాదినిత్యసూరిపరిషన్నిషేవ్యమాణుఁడు, అఖిలమంగళస్వరూపుఁడగు సర్వేశ్వరుఁడు వేదములవలనను, మహర్షులవలనను, ఆళ్వారులవలనను, ఆచార్యులవలనను, ఏకకంఠముగఁ బ్రతిపాదింపఁబడిన ప్రభావాతిశయముగల పరమపదమందు ఆనందైకార్ణవమగు తిరుమామణిమంటపమున పర్యంకవిద్యాదిప్రద్యోతితానవద్యమాహాత్మ్యముగల దివ్యస్థానమంటపమున ఉభయవిభూతికార్యనిర్వాహమును నడపుటకు తగిన సన్నివేశము గల దివ్యసింహాసనముపై వేంచేసియుండి, నిరవధికతేజోరూపము, సదైకరూపము, నిత్యసిద్ధపరమేష్ఠ్యాది పంచోపనిషన్మయము, స్వానురూపము, చిన్మయమై ప్రకాశించెడు కిరీటాదినూపురాంతమైన దివ్యస్రగ్వస్త్రాభరణములచే విభూషితము, దివ్యాయుధదేదీప్యమానము, నిరతిశయసౌందర్యసౌకుమార్యలావణ్యయౌవనాద్యపరిమితగుణనిధి అగు దివ్యమంగళవిగ్రహముతో విశిష్టుఁడై శ్రీభూమినీళాదిదివ్యమహిషీజనసమేతుఁడై నిత్యముక్తబృందానవరతపరిచర్యమాణచరణనళినుఁడై ఉభయవిభూతినిర్వాహకుఁడై నిరతిశయానందయుక్తుఁడైయుండి, అనంతగరుడవిష్వక్సేనాదినిత్యసూరులను, లబ్ధకైంకర్యపరులైన ముక్తులను ఆనందింపఁజేయుచు నిత్యముక్తులవలె సంసారిచేతనులును, తన్ననుభవించి తదనుభవజనితప్రీతికారితాశేషశేషత్వైకరతిరూపనిత్యనిరవద్యనిరతిశయానందరూపకైంకర్యమను మహాసంపత్తును బడసి సుఖించుటకు ప్రాప్తికలిగియుండియు తదప్రాప్తిచే సంసారదుఃఖార్ణవనిమగ్నులయి తానొసఁగిన కళేబరముచె తన్నారాధింపక సముధలుతో

యుటకిచ్చిన కత్తితో ఆవుతోఁక కోసినట్లు, ప్రవాహము దాఁటుట కిచ్చిన తెప్పతో దరిచేరక ప్రవాహవేగమున సముద్రములోఁ బడినట్లు దుర్విషయాసక్తులయి తనకు దూరభూతులయి చెడిపోవుచుండుటఁ జూచి చింతించి మనుపరాశరప్రభృతులను ఈవిభూతియందుఁ బుట్టించి వారివలన ఈసంసారులు బాగుపడుటకు శాస్త్రమునుఁ బ్రవర్తింపఁజేయఁగా దానియందు విశ్వాసము లేక విపరీతజ్ఞానము కలవారై "నేను సమర్థుఁడను, స్రక్చందనవనితాదిసకలభోగముల ననుభవించువాఁడను, బలవంతుఁడను, కృతకృత్యుండను, ధనవంతుఁడను, నాతోసమానుఁడు ఎవ్వఁడుకలఁడు" అని స్వస్వాతంత్ర్యరూపాత్మాపహారమహాపాపం బొనర్చి యనాదికర్మవాసనాదోషదూషితాంతఃకరణులయి అమార్గమందు ప్రవర్తింపఁగాఁ జూచి పరమకారుణికుఁ డగు భగవంతుఁడు ఎటులైనను సంసారుల నుద్ధరింపవలె నని సంకల్పము గలవాఁడై భూలోకమందు మనుష్యసజాతీయుఁడై రామకృష్ణాదిరూపముగా నవతరింపఁగా నీచేతనులాసురభావమునవలంబించి తనయందుఁ దగినభక్తివిశ్వాసములనుచూపకఅవమానించిఅధోగతికభిముఖులయియుండఁగనుంగొని శ్రీవత్సకౌస్తుభవైజయంతీవనమాలాపంచాయుధానంత గరుడవిష్వక్సేన ప్రభృతులంజూచి మీరేఁగి భూలోకమందు ద్రవిడదేశములో కావేరి, తామ్రపర్ణి, కృతమాల మున్నగు నదులయొడ్డున మీకు ఇష్టమగు చోట్ల ఇష్టములగు వర్ణములయందు జనించి సర్వచేతనుల నుద్ధరింపుఁడని ఆజ్ఞాపింపఁగా భగవదాజ్ఞ శిరసావహించి వారందఱు సరోభూతమహదాహ్వయాదిదివ్యనామములచే నాళ్వారులయి లోకమందు అవతరించి సర్వాధికారమగు ద్రావిడదేశమును సాంగోపాంగముగా లోకోపకారార్థమయి రచించిరి. దానిని పైన వివరించుచున్నాను.

విజయనగరము.
12—7—1918.

ఇట్లు,
మేడేపల్లి. వేంకటరమణాచార్యులు.

ॐ

శ్రీ మహాభక్తవిజయము

తృతీయభాగము.

111. పొయిగైయాళ్వారు.

(సరోయోగి.)

పొయిగైయాళ్వారు (సరోయోగి) ద్వాపరయుగమునందు సిద్ధార్థినామసంవత్సరమున, ఆశ్వయుజమాసమున, శుక్లపక్షమున అష్టమీమంగళవారమునాఁడు శ్రవణనక్షత్రమున కాంచీపురమందున్న యథోక్తకారిస్వామి సన్నిధి నొక తామరకొలనులో తామరసపుష్పమునందు సర్వేశ్వరుని పాంచజన్యాంశమున అవతరించి చెప్పతరము గాని జ్ఞానభక్తివైరాగ్యములు కలవారై ఆశ్రితులను ఉజ్జీవింపఁజేయుచు నుండిరి.

వీరి నిత్యతనియ:—శ్లో. కాంచ్యాం సరసి హేమాబ్జే జాతం కాసారయోగినం,
కలయే యశ్శ్రియఃపత్యే రవిం దీపమకల్పయత్.

తిరునక్షత్రతనియ:—తులాయాం శ్రవణే జాతం కాంచ్యాం కాంచనవారిజాత్,
ద్వాపరే పాంచజన్యాంశం సరోయోగిన మాశ్రయే.

---

112. పూదత్తాళ్వారు.

(భూతయోగి.)

పూదత్తాళ్వారు (భూతయోగి) పొయిగైయాళ్వారు అవతరించిన మఱునాఁడు నవమితోఁ గూడిన ధనిష్ఠానక్షత్రమునందు సము

ద్రతీరమందున్న తిరుక్కడల్మల్లై (మల్లాపురము) అను దివ్యతిరుపతి యందు మాధవీకుసుమము (బండిగురివిందపుష్పము)న సర్వేశ్వరుని గదాంశమునఅవతరించి భగవదనుగ్రహముచేపొందఁబడిన పరమభక్తి పరమజ్ఞానపరమభక్త్యాదులు కలవారై సర్వేశ్వరుని కంతరంగభక్తులై యుండిరి.

నిత్యతనియ:— శ్లో. మల్లాపురవరాధీశం మాధవీకుసుమోద్భవం,
భూతం నమామియో విష్ణో ర్జ్ఞానదీప మకల్పయత్.

తిరునక్షత్రపుతనియ.—తులాధనిష్ఠాసంభూతం భూతం కల్లోలమాలినః,
తీరే ఫుల్లోత్పలే మల్లాపుర్యా మిాడే గదాంశజమ్.

---

113. పేయాళ్వారు.

(మహాయోగి.)

నందకాంశసంభూతులయిన పేయాళ్వారు (మహాయోగి) పూదత్తాళ్వారు జనించినమాసమునందే శతతారానక్షత్రముతోఁగూడిన దశమినాఁడు దివ్యదేశములలో నొకటియైన మైలాపురము (మయూరపురము) అను పట్టణమునందు మాధవస్వామి ఆలయసమీపముననున్న కోనేటిలో వికసించిన యెఱ్ఱకలువపూవునందు అవతరించి లోకులు తన్నుభ్రాంతుఁడు (వెఱ్ఱివాఁడు) అని వ్యవహరించునట్లు భగవంతునియందు ఒడ లెఱుంగని భక్తికలవారై యుండిరి.

ఇట్లు అయోనిసంభూతులయిన యీముగ్గురు ఆళ్వారులును ప్రత్యేకముగా మూఁడు దివ్యదేశములయందు అవతరించి ఒకరు మఱియొకరిని ఎఱుఁగనివారై ఈశ్వరుని పూర్ణకృపచే రాజసతామసరహితులయి భగవద్దాస్యరసమం దతిశయితప్రీతిగలిగి జననము మొదలు భగవద్గుణములనే ధారకముగాఁ గలవారై భగవద్గుణానుభవముచే కాలక్షేపము సేయుచు భగవద్విముఖులయిదుర్విషయాసక్తులగుసంసారులతోఁ దమకు సహవాసము దుస్సహమని తలంచి వీరిని దిద్దవలెనని దయబూని ఒకనాఁడు ఉన్నగ్రామమునందు మరుసటిదినమున ఉండక

గ్రామైకరాత్రముగా దేశాటనము జేయుచున్నకాలమున సర్వేశ్వరుఁడు వీరిద్వారా సంసారిచేతనులకు అజ్ఞానాంధకారమును పోఁగొట్టి తనయందు జ్ఞానభక్తులు కలిగించుటకు సంకల్పించి యొకనాఁడు రాత్రి ఈముగ్గురును మూఁడు దిక్కులనుండి వచ్చి యదృచ్ఛగా తిరుక్కోవలూరు (దేహళీనగరము) అనుగ్రామమునందు ప్రవేశించి శయనింపస్థలము వెదకుచు నొక భాగవతోత్తముని ఇంటి యరుఁగుమీఁద మొదటపూదత్తాళ్వారును, మఱికొంతసేపటికి పొయిగై ఆళ్వారును, తరువాత పేయాళ్వారును వచ్చి చేరి ముగ్గురుగూడి ఒకరివృత్తాంతము నొకరికిఁ జెప్పుకొనుచు నిష్టగోష్ఠి నుండఁగా వారి యొక్క పరీక్షించు బుద్ధితో నాస్థలము వారి ముగ్గురికి చాలనంత ఇరుకుఅగునట్లుచేసెను.

అప్పుడు వారు ఇంతవఱకును లేని యీసంకటమునకుఁ గారణమేమని యోచించి జ్ఞానదృష్టిచే వీక్షింపఁగా గరుడవాహనారూఢుఁడు, శంఖచక్రాదిదివ్యాయుధోపేతుఁడు, శ్రీవత్సలాంఛితవక్షస్థలుఁడు, లక్ష్మీసమేతుఁడు అగుశ్రీమన్నారాయణుఁడు వారికన్నులకు సాక్షాత్కరించెను అట్లు అగుపడిన ఆసర్వేశ్వరుని కన్నులార సేవించి వారు ఆనందపరవశులై మాటిమాటికి ప్రదక్షిణనమస్కారములు ఆచరించుచు భక్త్యుద్రేకము కలవారై స్తుతించిరి. అట్టి భగవదనుగ్రహమువలన పుట్టిన ప్రీత్యతిశయము వారిలోపల నణఁగక పైకి స్తోత్రరూపముగా వెలువడెను. ఇట్లు వీరు మువ్వురును భగవంతుని స్తోత్రరూపమైన మూఁడు అందాదిప్రబంధములను (అందాది=అంతాది. మొదటిపద్యముయొక్క కొనపదము రెండవపద్యమునకు మొదటిపదమైయుండును. ఇదియొకరీతి ముక్తపదగ్రస్తము. ఇట్టికవనము తెలుఁగులోఁ గాని సంస్కృతములోఁ గాని తఱుచుగా కానరాదు) సాధించిరి. అందు పొయిగైయాళ్వారుసాధించిన ప్రబంధమునకు—

"వైయందగళియా వార్కడలే నెయ్యాగ వెయ్యకదిరోన్ విళక్కాగ-శెయ్య శుడరాగియా నడిక్కే శూట్టినేన్ శొన్మాలై ఇడరాழி నీంగవే యెన్ఱు" అనుపాశురముమొదటిది. దీనికి సరియైన తెలుఁగుపద్యము.

క. ధారుణి ప్రమిదగ వారా,నిధము స్నేహపూరముగను వనజాతహితుం
డారోపితదీపముగా, నారతి నిడి సూక్తిమాల హరి కర్పింతున్.

పూదత్తాళ్వారు సాదించిన అందాది ప్రబంధమునకు మొదటి పాశురము—

" అన్బేతగళియా ఆర్వమే నెయ్యాగ ఇన్బురుగుశింద్దై ఇడుతిరిమానంబురుగి ఞానచ్చుడ ర్విళక్కేత్తినేన్ నారనార్కు ఞానత్తమిపురిందినాన్ "

క. మనమును ప్రమిదగ భక్తిని, ననుపగు నెయిగాఁగ ప్రేమ నధికోజ్జ్వలమై
తనరెడు చిత్తము వత్తిగ, ఘనదీపము నెత్తి తిప్పుడు కమలాక్షునకున్.

పేయాళ్వారు సాదించిన అందాదిప్రబంధమునకు మొదటి పాశురము—

" తిరుక్కండేన్ పొన్మేనికండేన్ తిగళ్మరుక్కవణి నరముం కండేన్ శెరుక్కిళరుం పొన్నాళి కండేన్ ఎన్నాళివణ్ణా న్పాలిన్ను"

క. కంటిని నురమున లక్ష్మిని, గంటిని కనకంబుమేను కమలాక్షునకున్
గంటిని కరయుగమును నేఁ, గంటిని చక్రాబ్జములను కమలాక్షునకున్.

ఇట్లు మొదటివారైన ఈయాళ్వారులు ముగ్గురును ఋగ్యజుస్సామ వేదముల సారాంశముల నెత్తి అందాదిప్రబంధరూపముగా రచియించి సంసారుల కుపదేశించి వారి అజ్ఞానమును దొలఁగించి బహుకాలము తమ మహిమ నీభూలోకమునందు వ్యాపింపఁజేసి తుదకు శ్రియఃపతి ఆజ్ఞచొప్పున వైకుంఠమునకు వేంచేసిరి.

114. తిరుమళిశై యాళ్వారు.

(భక్తిసారులు.)

ఈయాళ్వారు కృష్ణునివలెనొకరికిఁ బుట్టి మఱియొకరి బిడ్డయనిపించుకొనెను. ఎట్లన, అత్రి, భృగువు, వసిష్ఠుఁడు, భార్గవుఁడు, ఆంగీరసుఁడు మొదలయినమహాత్ములుపూర్వకాలమందు బ్రహ్మయొద్దకుఁబోయి: తాము స్థిరముగా నివసించి తపస్సు చేసికొనుటకు ఉత్తమ మయిన పుణ్యక్షేత్ర మొకదానిని ఈభూలోకమందు నిరూపించి చెప్పవలయునని ప్రార్థించిరి. వారిప్రార్థనమును మన్నించి విశ్వకర్మను రావించి,

గయొక పెద్ద త్రాసు చేయించి, దానిలో భూమండల మంతయు నొక వైపునను: మఱియొకవైపున “తిరుమళిశై” అను పుణ్యక్షేత్రమును ఉంచి తూపింపఁగా తిరుమళిశైయున్నవైపు త్రాసు మొగ్గెను. అగుటచే దానికి మహీసారక్షేత్రమని పేరుపెట్టి అందు నిత్యవాసము చేయుఁడని వారికి ఉపదేశించెను. అది మొదలుకొని ఆఋషులు అందఱును, అచ్చట నివసించి తపస్సు చేసికొనుచుండిరి. ఈమహీసారక్షేత్రమునకు విదేహాభవనక్షేత్ర మని నామాంతరము కలదు ఇదికాంచీపురమునకు తూర్పుదిక్కున నున్నది.

అట్లు ఈదివ్యదేశములో నివసించుచున్నమహాత్ములలో నొకఁడైన భార్గవమహర్షి ఆకాలమందు సర్వేశ్వరు నుద్దేశించి దీర్ఘసత్ర మను నొకయాగమును ఆరంభించి చేయుచుండఁగా నతనిభార్య గర్భము ధరించెను. కాలక్రమమున నెలలు నిండినతరువాత పుష్యమాసమందు మఖానక్షత్రయుక్తపుణ్యదినమున భృగుపత్ని ఆకారము లేనియొక మాంసపుముద్దను కనెను. భార్గవుఁడు ఆతని భార్యయు దానినిఁ జూచి ఉత్సాహము చెడినవారై ఆమాంసపు ముద్దను అనాదరముతో నొక వేపతుప్పలో విడిచి పెట్టిరి. పిదప లోకమాత యగు శ్రీమహాలక్ష్మి యనుగ్రహముచే నామాంసపిండము మనుష్యాకృతి నొంది అవయవస్ఫుటతకలది యయి సజీవమయిన శిశువై క్షుత్పిపాసాదిబాధలచే స్తన్యము నభిలషించుచు విజనమైన వనమందు ఏడ్వసాగెను. అపుడు మహీసారక్షేత్రాధిపతి యగుసర్వేశ్వరుఁడు అచటి కేతెంచి కరుణారసమును చిలుకు తన చల్లని చూపులచే నాశిశువును ఆఁకలిదప్పులు పోవునట్లు కటాక్షించి తన అప్రాకృతదివ్యమంగళవిగ్రహమును జూచి ఓదార్చి స్వస్థానమునకుఁ బోయెను. అంతట నీయాళ్వారు భగవద్విరహమును సహింపలేక మఱల రోదన మారంభించెను. ఖడ్గుఁడు(తిరువాళన్) అను బెత్తపని చేయువాఁడొకఁడు బెత్తములు కోయుటకు ఆయరణ్యమునకుఁబోయి శిశురోదనధ్వనిని విని నల్గడలను వెదకి యొక బెత్తపుతుప్పలో నప్పుడు ఉదయించిన సూర్యునివలె ప్రకాశించుచున్న ఈశిశువును గని సంతసిల్లి యెత్తుకొని తన యింటికిఁ దీసికొనిపోయి పిల్లలులేని తన భార్యచేతికిచ్చెను. అపుడు ఆమె పెన్నిధి దొరకిన పేదవలె మిగుల హర్షమునొంది ఆపిల్లవానియందు పుత్రప్రీతినిఁ జేయుచు ముద్దుగాఁ బెం

చుచుండెను. గొడ్రాలైన ఆమెకు స్తనములయందు పాలుపడెను; కాని ఈయాళ్వారు స్తన్యపానాదికమందు ఆశలేనివాఁడై భగవద్గుణైకధారకుఁడయి యేడ్చుటయు మాటలాడుటయు మాని మలమూత్రవిసర్జనముకూడ లేనివారై స్ఫుటములగు నవయవములతో బెత్తువానియింటఁ బెరుగుచుండెను.

ఇట్లుండఁగా తిరుకురిశగ్రామనివాసి, నాల్గవజాతియందు పుట్టినవాఁడు,ప్రాజ్ఞుఁడు,సంతతిలేనివాఁడు అగుఒకవృద్ధుఁడు ఈయద్భుతవార్త నువిని. బాగుగ కాచిన పాలు పట్టుకొని భార్యతోఁ గూడ ప్రాతఃకాలమున నొకనాఁడు. వీరి యింటికి వచ్చి అప్రాకృతదివ్య తేజస్సుగల ఆశిశువునుజూచి ఆశ్చర్యపడి ఈక్షీరము లారగింపు మని పలుమాఱు ప్రార్థింపఁగాఆళ్వారు వారియందలి కృపాతిశయముచే నాపాలు త్రాగెను. ఇట్లు అనుదినమును ఆవృద్ధదంపతులు తెచ్చెడు పాలను ఇతఁడు ఆరగించుచుండెను.కొంతకాలము గతించిన తరువాత ఈయాళ్వారు ఒకదినమున ఆవృద్ధదంపతుల అభిప్రాయము నెఱింగి నేను త్రాగఁగా మిగిలినపాలను మీరుఈదినమున పుచ్చుకొనుఁడు; మీకొక మంచి పుత్త్రుఁడు జనించునని చెప్పెను.వారు అటుల గావింపఁగా ఇరువురును బూర్ణయౌవనము గలవారుఅయిరి. పిమ్మట నాతని భార్య గర్భవతియై పదిమాసములు నిండఁగా విదురునివలె మహాప్రాజ్ఞుఁడగు నొక కుమారునిఁగనెను. అతనికి వారు కణికృష్ణుఁ డని పేరు పెట్టి పెంచి, విద్యాభ్యాసనకాలమున సకలవిద్యలు నేర్పిరి.

అమృతమువంటి సర్వేశ్వరునిదయచేతృప్తినొందియున్న ఈభక్తిసారుఁడు అన్నపానాదులయందు ఆశలేనివాఁడై పితృగృహమునఁ బెరుగుచున్న కాలమునభగవద్ధ్యానతత్పరుఁడై యుండెను. ఋషిపుత్త్రుఁడైనవాసనచే యమనియమాదులతోఁ గూడిన అష్టాంగయోగము నభ్యసింప రుచిగలవాఁడై దానికి ధ్యేయవస్తువు సర్వజగత్కారణభూతుఁడైన శ్రీమన్నారాయణుఁడే యని నిశ్చయించెను. శాక్యోలూక్యాదిబాహ్యమతములను శైవమాయావాదన్యాయవైశేషికాదికుదృష్టిమతములను నిరసించి భగవద్విశేషకటాక్షపాత్త్రుఁడయి సర్వేశ్వరుఁడు తన దివ్యాత్మస్వరూపమును, తదాశ్రయమగు జ్ఞానశక్త్యాదికల్యాణగుణములను, దివ్యమంగళవిగ్రహమును, శంఖచక్రాది దివ్యాయుధములను,

దివ్యమహిషీజనమును, దివ్యసూరిసంఘమును, భోగవిభూతియగు పరమపదమును ప్రకృతిపురుషకాలాత్మకమగులీలావిభూతియొక్క సృష్టిస్థితిసంహారములనుకనపఱుపఁగాఁజూచి పరిపూర్ణజ్ఞానము కలవాఁడై శ్రీమన్నారాయణుఁడేసకలజగత్కారణుఁడు అనియు చిదచిత్తు లతనికి ప్రకారములు అనియు అతఁడు ప్రకారి యనియు జీవాత్మలందఱు అతనికి శేషభూతులనియు అతఁడు సర్వశేషి యనియు నెఱింగి సర్వభూతాంతరాత్మయగుసర్వేశ్వరుని సర్వదేశసర్వకాలసర్వావస్థలయందును ధ్యానించుచు తిరువల్లిక్కేణియందున్నగజేంద్రసరస్తీరమందు యోగాభ్యాసనిరతుఁడయి చిరకాలము నివసించెను.

ఇట్లున్నకాలమందు ఒకనాఁడు ఇతఁడు బొంతను కుట్టుచుండఁగా రుద్రుఁడు పార్వతితోఁగూడి విమానము నెక్కి అంతరిక్షమందు సంచరించుచు వీరిని చూచెను. అపుడు ఈతఁడు రుద్రునీడ తనపైఁ బడకుండ దూరముగా తొలఁగిపోయెను. అది పార్వతిచూచి ఇతఁ డెవఁడు అని యడిగెను.అందులకు శితికంఠుఁడు"ఈతఁడు ఒక మహానుభావుఁడు.మనలను లక్ష్యపెట్టువాఁడుకాఁడు"అనిచెప్పినను వినక పార్వతి"అట్టివానిని మనము అవశ్యము చూడవలయును;గాన క్రిందికి దిగుటకు విమానము నాజ్ఞాపింపుము" అని భర్తను వేఁడెను. అపుడు వారిరువురును భక్తిసారునివద్దకు వచ్చి నిలువఁబడఁగా అతఁడు వారిని కన్నెత్తిచూడక ఉదాసీనుఁడై యుండఁగా రుద్రుఁడు"నిన్ను మేము చూచుటకుఇచ్చటకు వచ్చియుండఁగా నీవిట్లు మమ్ము అలక్ష్యముగా సేయఁదగునా?"యనెను. అది విని తిరుమళిశైయాళ్వారు "మిమ్ము చూచుటవలన నాకేమి ప్రయోజనము?" అని పలికెను. శివుఁడు "నీకేదేని వరము ఇచ్చుటకు వచ్చితి"మనెను. "మీవలన నేను అభిలషించునదేమియు లే"దనిభక్తిసారుఁడు ప్రత్యుత్తరమియ్యఁగా పినాకినీకడకు మారాక వమ్ము కాఁగూడదు. ఏదేని కోరుమనినిర్బంధింప "సామర్థ్యము ఉన్నయెడల మోక్షము నిమ్ము" అనెను. "నేను మోక్షము నీయఁజాలను. శ్రీమన్నారాయణుఁడుఒకఁడే మోక్షప్రదాత"అని పార్వతీపతి బదులుచెప్పెను. "నేఁడు మృతుఁడు అగువానిని రేపటివఱకును బ్రతికింపఁగలవా?" యని మఱల భక్తిసారుఁడుఅడుగఁగా"అది కర్మానుగుణముగాజరుగును. నేనందులకు ఏమియుఁ జేయఁజాలను" అని కపర్ది బదులుచెప్పెను. అంతట భక్తిసా

రుఁడు "నాసూదివెంట దారము తప్పకుండ వచ్చునటుల వరము ఇమ్ము" అని పరిహాసపూర్వకముగా నడుగఁగా ప్రమథనాథుఁడుకుపితుఁడై లలాటనేత్రముతోఁ జూచెను. ఆనేత్రమునుండి పైకివెడలిన అగ్నిజ్వాలలు లోకమంతనుదహించుటకు సిద్ధమయియుండఁగానింతలో భక్తిసారుఁడు తనకుడికాలిలో నున్ననేత్రమును దెఱచెను. వెంటనే అంతకంటె భీషణతరమయిన యగ్ని బయలుదేఱి శంభుఫాలనేత్రాగ్నిని మ్రింగివేసెను. అది చూచి శివుఁడు ఆశ్చర్యపడి అతనిమాహాత్మ్యమును శ్లాఘించి భక్తిసారుఁడుఅనిపేరుపెట్టి "అంబరీషునిచే దూర్వాసుఁడు అవమానమును పొందినట్లు ఈతనిచే నవమానింపఁబడితి" నని తలంచుచు స్వస్థానమునకుఁ బోయెను.

ఆళ్వారు తిరిగి యోగప్రణిధానపరుఁడై యుండఁగా నొకనాఁడు శుక్తిహారుఁడు అను ఖేచరుఁ డొకఁడు వ్యాఘ్రవాహనము నెక్కి ఆకాశమందు పోవుచుండెను. అపుడు ఆళ్వారుయోగప్రభావముచే నావ్యాఘ్రము ఆకాశమునుండి నడువఁజాలక స్తబ్ధమయ్యెను. అపుడు ఆఖేచరుఁడు ఇట్లు అగుటకుఁ గారణము అరయుఁగోరి క్రిందికిదిగి యోగములో నున్న ఆళ్వారుని గాంచి ఆశ్చర్యపడి వ్యాఘ్రవాహనము దిగి అతనిసద్దకు వచ్చి "భార్గవమునీంద్రుఁడా, ఆబొంతను కప్పుకొనుట మాని దివ్యపటనిర్మితమైన ఈకవచమును ధరింపుము" అని యొక కవచము నిచ్చెను. ఆళ్వారు దానిని నిషేధించి స్వసంకల్పజనిత మగు నొకరత్నకవచము నాతని కీయఁగా ఆఖేచరుఁడులజ్జించి తన కంఠమునందు ఉండుహారమును పైకిఁదీసి "దీనిని జపమాలికగా వినియోగింపుము" అని యిచ్చెను. భక్తిసారుఁడు తన కంఠమునందు ఉన్న పద్మాక్షమాలికను దీసి నవరత్నహారముగాఁ జేసి యొసంగెను. అది చూచి ఖేచరుఁడు వీరి యోగసిద్ధికి మిగుల ఆశ్చర్యచకితుఁడై "మీరు మహానుభావులు. పరిపూర్ణులు. నాపరిహాసమును క్షమింపుఁడు" అని క్షమాపణఁ గోరుచు నమస్కరించి ఇచ్చవచ్చినచోటికిఁబోయెను.

పూర్వమందు భక్తిసారులుత్రాగఁగా మిగిలినక్షీరమునుఁదాగిన శూద్రవృద్ధదంపతులకు కుమారుఁడై పుట్టిన కణికృష్ణుఁడు అనువాఁడు శ్రీమన్నారాయణునియందును, తద్భక్తులయిన భక్తిసారులయందును, అపారమగు భక్తికలవాఁడై భగవదనుగ్రహముచేతను, భక్తిసారునిఅను

గ్రహము చేతను, సకలశాస్త్రములయందును బూర్ణజ్ఞానము గలవాఁడై కవనమందు అసదృశుఁడై కవిశిరోమణియని బిరుదుపొందెను. భక్తిసారుని పాదపద్మములకు పరిచర్య చేయఁగోరి అతఁడు తిరువెక్కాలో యోగనిరతుఁడై యున్నాఁడనువార్తవిని అచ్చటకుఁబోయి అతని సన్నిధిలో సర్వవిధకైంకర్యములను జేయుచుండెను. ఆగ్రామమునందు అర్చారూపముతో వేంచేసియున్న శేషశాయిస్వామియొక్క కోవెలలో సమ్మార్జన కైంకర్యమును జేయుచున్న ఒక వృద్ధదాసినిఁ జూచి దాని భక్తిశ్రద్ధలకు మెచ్చుకొని కణికృష్ణుఁడు ఆదాసియెల్లకాలముభగవత్సన్నిధిని కైంకర్యముచేయుటకు తగిన శరీరదార్ఢ్యము కలదియై యుండవలయు నని తన కవనముతో శేషశాయిస్వామిని ప్రార్థింపఁగా దానికిక్రొత్తయౌవనము లభించెను. ఆవార్త విని ఆపట్టణము నేలు పల్లవరాయఁడు అను రాజు కణికృష్ణునిఁ దన ఆస్థానమునకు రప్పించి "నీకు కావలసినంతధనమును, వస్త్రాలంకారములను ఇచ్చెదను; నేనెప్పుడును ముసలితనము నొందక పడుచుతనముతో నుండునట్లు నాపై నొకప్రబంధమును రచింపు" మని ప్రార్థించెను. అందులకు కణికృష్ణుఁడు "శేషశాయియైన శ్రీమన్నారాయణుని, ఆతనిభక్తులను స్తుతించుట కలవాటుపడిన నాజిహ్వ పామరుఁడు, ధనమత్తుఁడు నగు నీవంటివానిని స్తుతించుట కిష్టపడదు. నీవిచ్చు ధనము, వస్త్రములు, నగలు మొదలగువానియందు నాకు లక్ష్యము లేదు" అని తిరస్కారముగా పలికెను. ఆమాటలు విని రాజు మిక్కిలి ఆగ్రహము కలవాఁడై "నావిషయమయి కవిత్వము చెప్పుటయందు ఇష్టము లేనివానికి నాదేశమునందు నివసించుట యెట్లు ఇష్టమగును? కావున నీవిఁక ఒక క్షణమైనను నాపట్టణమునందు ఉండకూడదు" అని కఠినముగా పలుకఁగా విని కణికృష్ణుఁడు "నీవెంత? నీరాజ్యమనఁగా నెంత? నిన్నెవ్వఁడు లక్ష్యముసేయును? సర్వలోకరక్షకుఁడగు సర్వేశ్వరునిచే పరిపాలింపఁబడు మహాపృథివి మాకు నివసించుటకు ఉన్నది. నీకు భయపడువారముకాము చూడుము. ఇదిగో ఈక్షణమున నీగ్రామమును విడిచి స్థలాంతరమునకుఁ బోవుచున్నార" మని నిర్లక్ష్యముగాఁ జెప్పి భక్తిసారుని సన్నిధికి వచ్చి, తనకును, రాజునకును జరిగిన ప్రసంగమును దెలియఁజేసి, "ఎచ్చటికైనఁ బోవుటకు దాసున కాజ్ఞ ఈయవలయు" నని ప్రార్థించెను. అందులకు ఆళ్వారు "కణికృష్ణుఁడా, నీవు లేనిచోట నేను

మాత్ర మెందులకు నివసింపవలెను? ఈశేషశాయిస్వామి సన్నిధిలో ననుజ్ఞ పొంది నేనును నీవెంట వచ్చెదను" అని చెప్పి శేషశాయిస్వామి ఆలయమునకుఁ బోయి స్వామికి సాష్టాంగదండప్రణామము సమర్పించి జరిగినవృత్తాంతము నంతయును స్వామితో విన్నవించి, "ఓజగన్నాయకా, నీభక్తులకు ఉండరాని చోట నీకును విడువతగినదియే; గావున నీవును మావెంట రమ్ము" అని ప్రార్థించెను. శేషశాయిస్వామి భక్తపరాధీనుఁడు; గావున వెంటనే శేషశయ్యను చుట్టి చంకఁ బెట్టుకొని శ్రీమహాలక్ష్మి వెనువెంట రాఁగా భక్తిసారకణికృష్ణుల వెన్నుదన్నిపోయెను.

అంతట అర్చకులు, పరిచారకులు, స్వామికి పూజసేయుటకు కోవిలతలుపులు తీసి అచట స్వామినిఁ గానక భయమును ఆశ్చర్యమును పొంది తొందరగా రాజువద్దకుఁ బరుగిడి ఆవృత్తాంతమును జెప్పిరి. అది విని రాజు ఆశ్చర్యముతో నులికిపడి "ఇది యేమి వింత ఆలయమునందు స్వామి లేకపోవుటకు కారణమేమి" అని మంత్రుల నడుగఁగా వారు "నీవు కణికృష్ణునివిషయమై అపరాధము చేసితివి. ఆతఁడు శేషశాయిస్వామికి అంతరంగభక్తుఁడు; ఆతనిని నీవు దేశమునుండి వెళ్ళఁగొట్టఁగా భక్తునివియోగము సహింపలేక స్వామికూడ ఆతనివెంట వెళ్లిపోయి యుండవచ్చును" అని చెప్పిరి. దానిమీఁద రాజు, "తన అపచారమువలన ఇంతమట్టుకు సంభవించిన" దని భయముతో గడగడవడఁకుచు దేహామంతయు చెమ్మటలు క్రమ్మఁగా, కాళ్ళు తడబడఁగా పాదచారియై బయలుదేఱి పోయిపోయి అచ్చటచ్చట వెదకి కొనకొనక మార్గమునందు భక్తిసారకణికృష్ణుల వెనుక లక్ష్మితో వేంచేయుచున్న సర్వేశ్వరునిఁ జూచి అడ్డముగాఁ జని అతని పాదములపైఁ బడి "ఓజగన్నాథుఁడా, నేనపరాధిని. నాతప్పు క్షమింపుము. కణికృష్ణునియందు దేవరవారికి ఉన్నప్రేమాతిశయము నే నెఱుఁగక యిట్లు ఆతనివిషయమయి అపచారము చేసితిని. నాతప్పు మన్నించి తిరువెక్కాలో ఎప్పటివలె వేంచేసియుండుటకు సమ్మతింపుము" అనియనేకవిధముల వేఁడుకొనఁగా భక్తవత్సలుఁడైన ఆశ్రియఃపతి "రాజా, నీవు నావిషయమయి ఏమియు అపచారము చేయలేదు; నీయపరాధమును క్షమించువాఁడను నేను గాను. నాప్రియభక్తుఁడైన భక్తిసారునియెడ నీవు అప్రియ మొనర్చితివి; ఆకారణమువలన నతఁడు నీమీఁద కోపము కలవాఁడై నీదేశము నుండి వెడలిపోయెను. అతని నెడఁబాసి

యుండలేక నేనును అతనివెంటఁ బోవుచున్నాను" అని ఆనతిచ్చెను. రాజు అపుడు పెయ్యవెంట ఆత్రముతోఁ బోవు ఆవువలె కణికృష్ణుని వెనుకఁ బోవుచున్న తిరుమఴిశైయాళ్వారునకు అడ్డముగాఁ బోయి వారిపాదములపైఁ బడి "దాసుని అపరాధమును క్షమించి తిరువెక్కాకు వేంచేయుఁడు" అని ప్రార్థించెను. అందులకు ఆళ్వారు "నీ నేరమును గాచువాఁడను నేనుకాను" అని నిషేధించెను. అత్తఱి రాజు మిక్కిలి కోపముతో తిరిగి చూడక అందఱకును ముందు నడచుచున్న కణికృష్ణుని అడ్డగించుకొని ఆతని పాదములపైఁ బడి దాసుని ప్రథమాపరాధమును క్షమింపుమని రెండుపాదములు రెండుచేతులతోఁ గట్టిగాఁ బట్టుకొని వదలక మొఱ్ఱపెట్టఁగా కణికృష్ణుఁడు దయార్ద్రుఁడై "ఓ భూవరా, నీవు నారాజ్యమునందు ఉండకూడదని నాకు ఉత్తరువు చేసితివి; గావున ఇంకొకదేశమునకుఁ బోవుచున్నాను. నన్నేల ఇపుడు అడ్డగించుకొనెదవు" అని బదులు చెప్పెను. రాజు పట్టినపాదములను విడువలేదు. ఆతఁడు మఱల 'దాసుఁడు మూఢుఁడై పలికిన పలుకులను తమరు పాటింపవలదు; ఎప్పటివలె తిరువెక్కాలో వేంచేసియుండుఁడు' అని ప్రార్థించెను. అందులకు పరమసాత్త్వికుఁడు అగుకణికృష్ణుఁడు సమ్మతించి మఱల తిరువెక్కాకువచ్చెను. అప్పుడు అతనివెంట తిరుమఴిశైయాళ్వారును, ఆతనివెంట లక్ష్మీసమేతుఁడగు శేషశాయిస్వామియును వేంచేసి ఎప్పటివలె తిరువెక్కాలో స్థిరపడిరి. తన భక్తుఁడు చెప్పినట్లు చేసెను; గావున ఆ శేషశాయిస్వామికి 'యథోక్తకారి' అని పేరు కలిగెను.

అట్టి యథోక్తకారి సన్నిధియందు తిరుమఴిశైయాళ్వారు కణికృష్ణునితోఁ గూడ కొన్నాళ్లు నివసించి పిమ్మట తిరుక్కుడంద (కుంభకోణము) అను దివ్యదేశమునకుఁ బోయి అచ్చట వేంచేసియుండు శార్ఙ్గపాణిస్వామిని సేవించు కోరిక గలవారై యథోక్తకారిసన్నిధి నుండి బయలుదేఱి పోవుచు మార్గమధ్యమందు పెరుంబులియూరు (బృహద్వ్యాఘ్రపురము) అను ఒక దివ్యదేశమును జేరిరి. అచట ఈతిరుమఴిశైయాళ్వారు మేదరవానివేషముతో బ్రాహ్మణవీథివెంబడి వచ్చుచుండఁగా నాసమయమందు వీథి అరుఁగులమీఁద వేదము చదువుచున్నబ్రాహ్మణులు ఇతనిం జూచి శూద్రుఁడని భావించి శూద్రసమీపమందు వేదముచదువఁగూడదని అధ్యయనము మానివేసిరి. పిదప చదువు

నపుడు ఆబ్రాహ్మణులకు అవతలిభాగము జ్ఞాపకమురాదయ్యెను. అపుడు వారందఱు పరమభక్తుఁడగు ఈతనియందు శూద్రదృష్టిచేయుటచే అపరాధుల మైతిమని తలంచి క్షమాపణ చెప్పుకొనఁగా ఆళ్వారు వారు చూచుచుండఁగా నొక నల్లవస్త్రగింజను దెచ్చి గోటితో ఒలిచి చూపింపఁగా నపుడు వారికి *తరువాతి భాగము స్మృతికి వచ్చెను.

ఈయాళ్వారు ఆయూరిలో నున్న కోవెలకుఁ బోయి ప్రదక్షిణమాచరించుచుండఁగా అందుండు అర్చావిగ్రహము ఆతఁడు ఎట్లు తిరిగినఅట్లుతిరుగుటకు ఆరంభించెను. అర్చకులు ఆవింతనుచూచి చెప్పఁగా నచ్చటి బ్రాహ్మణులు కొందఱు వచ్చి ప్రత్యక్షముగాఁ జూచి పరమాశ్చర్యము నొందిరి. ఆతని అమానుషమాహాత్మ్యమును కనిపెట్టి ఆకాలమందు ఆగ్రామములో యాగముచేయుచున్న బ్రాహ్మణుఁడు ఒకఁడు యాగసభయందు వీరికి అగ్రపూజయొసంగెను. అచ్చట నున్న బ్రాహ్మణులు కొందఱు అసూయాదిష్టులై రాజసూయయాగమునందు శ్రీకృష్ణునకు అగ్రపూజ నిచ్చినధర్మపుత్రుని శిశుపాలుఁడు నిందించినట్లు నిందింపసాగిరి. ఆకారణముచే ఆదీక్షితుఁడు వారొనర్చిన భాగవతాపచారమునకు మనసునందు నొచ్చుకొని ఆళ్వారును శరణుపొందఁగా దీక్షితునకు భగవద్భక్తివివృద్ధి చిత్తశాంతిని నిందకులయిన వారికి భయము కలుగఁజేసి అచ్చట దేవీభూషణాయుధపరివారముతో సర్వేశ్వరుని సాక్షాత్కరింపఁజేసి తననక్షస్థలమందు జ్వాలామయమగు సుదర్శనమును కనుపఱిచెను. ఆధూర్తులు అందఱును అట్టి మహిమకు ఆశ్చర్యపడి భయభక్తులతో ఆళ్వారునకు దండప్రణామములుచేసి తమ అపరాధము సహింపవలెనని క్షమాపణము వేఁడుకొనిరి. ఆళ్వారు వారియపరాధమును క్షమించి శ్రీమన్నారాయణుఁడే పరతత్త్వమనియు, భాగవతులు పరమపూజ్యులు అనియు ఉపదేశించి దీక్షితునకు యాగఫలము పూర్ణముగా సిద్ధింపవలె నని అనుగ్రహించి అచట నుండి కుంభకోణమునకు వేంచేసిరి. అచట అర్చారూపముతో వేంచేసియున్న ఆరావముదును (అత్రృప్తామృతము) సేవించి ఎల్లజనులు చదువుకొని ఉజ్జీవించునట్లు ఆస్వామివిషయమయి సకలవేదాం

* యజుర్వేదము. కా. 1. ప్ర. 8. అ. 9. మ. 1, నైరృతం చరుం పరివృత్త్యై గృహే కృష్ణానాం వ్రీహీణాం నఖనిర్భిన్నం.

తార్థములను ప్రతిపాదించు తొంబదియాఱు పాశురములతోఁ గూడిన "నాన్ముగన్ తిరువందాది" అను ఒక దివ్యప్రబంధమును, ఉపనిషత్సారమగు నూటయిరువదిపాశురములు గల "తిరుచ్ఛందవిరుత్తము" అను ఒకదివ్యప్రబంధమును రచించి లోకమునకు ఉపకారమొనర్చెను. ఇతఁడులోకమునందు రెండువేలయేనూఱుసంవత్సరములు వేంచేసియుండి పిమ్మట భగవదాజ్ఞచే పరమపదమునకు వేంచేసెను.

నిత్యతనియ.— శక్తిపంచమయవిగ్రహాత్మనే శుక్తికారజత బుద్ధిహారిణే,
ముక్తిదాయకమురారిపాదయో ర్భక్తిసారమునయే నమోనమః

తిరునక్షత్రతనియ. పుష్యాయాం మకరే మాసే చక్రాంశం భార్గవోద్భవం,
మహీసారపురాధీశం భక్తిసార మహం భజే.

---

115. పెరియాళ్వారు.

(విష్ణుచిత్తుఁడు.)

శ్లో. "శాదాత్వాక ప్రతిఘలద్భగవత్పరత్వం
విస్తీర్యహాంసహ్యకధంద్రజయీ గజేన,
గచ్ఛన్ ప్రియాదుపగతే గరుడేన నాథే
శ్రేణాసిసం ఏచ తూతిప్త నమోస్తు తస్మై."

భరతఖండపు దక్షిణదిగ్భాగమున నున్న పాండ్యదేశమునందలి దివ్యదేశములలోఁ బ్రసిద్ధిగాంచిన శ్రీవిల్లిపుత్తూరు(ధన్విన్యపురము)అనునొక గ్రామముకలదు. పెరియాళ్వారు ఈగ్రామమున నవతరించెను. ఈగ్రామమునందు వేంచేసియున్న శ్రీవటపత్రశాయి అను అర్చావతారస్వామి ఆలయమున పరిచారకుఁడైన ముకుందాచార్యుఁడు ఈతని తండ్రి. తల్లిపేరు పద్మ. బోధాయనసూత్రము. యజుశ్శాఖ. ఈతఁడు పురశ్శిఖుఁడు (నడినెత్తిని జుట్టుఉంచుకొను వైష్ణవశాఖలోనివాఁడు). తలిదండ్రులు యుక్తకాలమున జాతకర్మాదిసంస్కారములనుఁ గావించి విష్ణుచిత్తుఁడు అని పేరుపెట్టిరి. ఏడవయేట నుపనయనము చేసి వేదాది విద్యలు గరపిరి; గాని విద్యావిశేష మబ్బలేదు. ఈతఁడు విద్యలేనివాఁడైనను బాల్యమునుండియు శ్రీమన్నారాయణునియందును, భాగవతుల

యందును అధికభక్తిగలవాఁడై ఆగ్రామమందు వేంచేసియున్న వటపత్త్ర శాయిస్వామిని నిత్యము సేవించుచు చతుర్వేదసారమయిన తిరుమంత్త్రార్థమును (అష్టాక్షరీమంత్త్రార్థమును) తన మనస్సునం దెల్లకాలము మననము సేయుచు చూచువారికి శరీరమును ధరించిన భగవద్భక్తివలె కనిపించుచుండిరి.

ఒకనాఁడు పెరియాళ్వారు వటపత్త్రశాయిస్వామిని సేవింపఁ బోయి ఆస్వామిశరీరమందు అవతరింపఁబడిన తోమాలికలం జూచి "ఇవి ఈస్వామి శరీరమున నుండుటకు ఎంత పుణ్యము చేసినవో, ఈ మాలికలను కట్టి స్వామికి సమర్పించినవారు ఎంతటి భాగ్యశాలురో, అట్టిభాగ్యము లభించుటయే గదా శరీరముఁడున్నందులకు ఫలము?" అని తలపోయుచు నింటికి రాఁగా పూర్వము శ్రీకృష్ణస్వామికి పుష్పమాలికలను సమర్పించి ధన్యుఁడైన మాలాకారుని చరిత్త్రము స్మృతికి వచ్చెను. అప్పటినుండియు తానును మాలాకారునివలె స్వామికి పుష్పకైంకర్యముచేయుటయే పరమపురుషార్థము అని నిశ్చయించి తన పూర్వులు సంపాదించిన సారవత్తరమయిన యొకభూమిలో సంపెఁగ, పొన్న, జాజి,మల్లె, చామంతి, గులాబీ, మాలతి, పారిజాతము మొదలగు నానావిధపుష్పవృక్షములను, తులసి, దమనము, మరువము నాటించి కాలక్రమమునఁ బెద్దపూఁదోఁటగా పెంచి ఆపువ్వులను ప్రతిదినమును స్వయముగా తానే కోసి పలు తెఱఁగుల పూలదండలు మిక్కిలి నేర్పుతోఁ గట్టి, సాయంప్రాతఃకాలములయందు వటపత్త్రశాయికి సమర్పించుచుండెడివాఁడు.

ఇట్లు పెరియాళ్వారు పరమభక్తితో వటపత్త్రశాయికి పుష్పమాలికాకైంకర్యము సలుపుచున్న కాలమందు పాండ్యదేశమునకు రాజధానియైన మధురలో రాజ్యము చేయుచున్న వల్లభదేవుఁడు అను పాండ్యవంశపురాజు ఒకనాఁటి రాత్త్రి తన పరిపాలనమును గుఱించి ప్రజలుఅనుకొనుమాటలను ప్రచ్ఛన్నముగా వినఁగోరి మాఱువేషముతో మధురాపురివీథులలోఁ దిరుగుచు నొక యింటి అరుఁగుమీఁద గాఢనిద్రను జెందియున్న ఒక బ్రాహ్మణునిఁ జూచి అతనియొద్దకుఁ బోయి చేతతోతట్టిలేపి "నీవెవ్వఁడవు? ఈయర్ధరాత్త్రియందు ఇచట నేల యొంటిగా పరుండియున్నావు?" అని ప్రశ్నించెను. "అయ్యా, నేను పర

దేశపుబ్రాహ్మణుఁడను. కాశికిఁబోయిగంగాస్నానము చేసికొని సేతుస్నానేచ్ఛచే రామేశ్వరమునకుఁబోవుచు నిచ్చటకు వచ్చుసరికి సాయంకాలమయిచీఁకటిపడినందున ప్రయాణము చేయఁజాలక ఈగ్రామము చేరుకొని యీయింటియరుఁగుమీఁద విశ్రమించితి” నని విప్రుఁడు మాఱు పలికెను. రాజు అది విని“భూసురోత్తమా, నీవు అనేకదేశములుతిరిగి వచ్చుటచేత గొప్ప జ్ఞానమును సంపాదించినవాఁడవై యుందువు. నీకు అనేకవిషయములు తెలిసియుండవచ్చును. నీకుఁ దెలిసినవానిలో సారమైన యొకవిషయమును నాకు విన్పింపుము”అని ప్రార్థింపఁగా ఆబ్రాహ్మణుఁడు, తన్ను అడిగినవాఁడు రాజు అని తెలియఁజాలకపోయినను ఎవ్వఁడో పరమార్థమును దెలిసికొనుట కభిలషించుపెద్దమనుష్యుఁడని యూహించి—

శ్లో. “వర్షార్థ మష్టౌ ప్రయతేత మాసాన్ నిశార్థ మర్థం దివసం యతేత,
వార్ధక్యహేతో ర్వయసా నవేన పరత్ర హేతో రిహ జన్మనా చ.”

అనుశ్లోకమును జదివెను. రాజు అది విని ఆశ్లోకతాత్పర్యమును గ్రహించి “పరలోకము సంపాదించుటకు దగిన ధర్మము నాచరింపక ఆయువు నంతయు వ్యర్థముగాఁ గడపి మోసపోయితి”నని పరితాపము నొంది తన నగరికిఁ బోయి, సర్వశాస్త్రార్థవేది, అధిగతపరమార్థుఁడు, భగవద్భక్తుఁడు నగు శెల్వనంబి అను తన పురోహితుని పిలిపించి ఆతనితో తన అభిప్రాయమును జెప్పి బ్రహ్మవిష్ణుమహేశ్వరాదులలో నెవ్వఁడు పరుఁడో, ఎవ్వని నుపాసించిన మోక్షము సిద్ధించునో, ఆయంశము నిశ్చయపఱుచు నుపాయము చెప్పుమని యడిగెను. అందులకు ఆతఁడు ఆలోచించి రాజు కొలువుకూటమున నొక స్తంభమును నాటించి దాని కొనను బంగరునాణెముల సంచిని వ్రేలఁగట్టించి “ఈలోకమునందు ఏమతస్థుఁడైనను పరతత్త్వమిది యని యుక్తులతో నుపపాదించి సిద్ధాంతము చేసి నన్ను ఒప్పించుటకు తగిన సామర్థ్యముగలవాఁడు ఈవరాల మూటను పుచ్చుకొనఁ నర్హుఁడు అని యెల్లదేశములకుఁ బ్రకటనపత్రికల నంపు” మని ఉపదేశించెను. అందులకు వల్లభదేవరాజు మిక్కిలి బాగున్న దని సంతోషించి తనపురోహితుఁడు చెప్పినట్లు కావించెను.

అంతట ఆప్రకటనపత్రికలనుఁ జూచుకొని బౌద్ధులు, శైవులు, కాపాలికులు, శాక్తేయులు, పాశుపతులు, మాయావాదులు, వైశేషి

కులు, సాంఖ్యులు మొదలుగాఁగల నానాబాహ్యమతస్థులలో పేరు పొందిన సిద్ధాంతవేత్తలు తమతమ శిష్యగణములతో బయలుదేఱి మధురకు వచ్చి రాజస్థానమును నిండిపోయిరి.

అట్టియెడ శ్రీవిల్లిపుత్తూరులో వటపత్రశాయిస్వామికి నిరంతరము మాలాకైంకర్యమొనర్చుచు భగవచ్చింతాపరాయణుఁడై వీతరాగుఁడై యున్న పెరియాళ్వారునకు ఆస్వామి యొకనాఁటిరాత్రిస్వప్నమందు సాక్షాత్కరించి "ఓయి విష్ణుచిత్తుఁడా, మధురాపురము నేలు వల్లభదేవుఁడు పరతత్త్వనిర్ణయముఁ జేయింపఁగోరి తన ఆస్థానమంటపమునందు ఒకవిద్యాశుల్కగ్రంథిని వ్రేలగట్టించి యున్నాఁడు. నానామతసిద్ధాంతవేత్తలు అనేకులు తమతమ మతములను స్థాపించుకొని ఆధనగ్రంథిని గొని పోవలయు నని మధురకుఁ బోవుచున్నారు. నీవు ఈవేకువజామున లేచి ఆగ్రామమునకుఁ బోయి వారి కుత్సితమతసిద్ధాంతములనెల్ల ఖండించి ప్రతివాదులను నోరెత్తనీయక మన విశిష్టాద్వైతసిద్ధాంతమును స్థాపించి రమ్ము"అని ఆజ్ఞాపించెను.వటపత్రశాయిస్వామి యిట్లు ఆజ్ఞాపింపఁగా పెరియాళ్వారుస్వామి దివ్యమంగళవిగ్రహమును గన్నులార సేవించి పెక్కుమారులు సాగిలఁబడి మ్రొక్కి కండ్లయందు ఆనందబాష్పములు, శరీరమునందు పులకలు విస్తరింపఁగా భక్తినమ్రుఁడై —

శా. "స్వామీ, నన్ను నితఃపురాపఠితశాస్త్రగ్రంథజాత్యంధు నా
రామక్ష్మాఖననక్రియాఖరఖనిత్రగ్రాహితోద్యత్కిణ
స్తోమాస్నిగ్ధకరున్ భవద్భవనదాసున్ వాదిగాఁ బంపుచో
భూమీభృత్సభనోటమైన నయశంబున్ మీకు రాదే హరీ.

మ. గృహసమ్మార్జనమో జలాహరణమో శృంగారపల్యంకికా
వహనంబో వనమాలికాకరణమో వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్రధృతియో ప్రాగ్దీపికారోపమో"
నృహరీ వాదము లేల వేరె యితరుల్ నీలెంకలుం బాత్రముల్."

(90, 91 ప. 2. ఆ. ఆముక్తమాల్యద.)

"నన్నేలినవాఁడా,పుట్టిననాఁటనుండియు చదువెట్టిదో యెఱుఁగక జ్ఞానమందు గ్రుడ్డివానివలె నుండి బొరిగ పట్టుకొని పూఁదోటనేల త్రవ్వఁగా చిరకాలమునుండి చేతులు కాయలు కాచియున్ననన్ను

పండితులతో వాదింపుమని రాజసభకుఁ బొమ్మన్నచో నచట నాకుఁ గలుగు పరాభవము దేవరవారిది కాదా? నేనెక్కడ! పండితులతో వాదమెక్కడ? ప్రాజ్ఞులగు నీయితరదాసులం బంపఁగూడఁదా?" అని విన్నవింపఁగా స్వామి అతని భక్తికి మిగుల మెచ్చుకొని "ఓయి విష్ణుచిత్తుఁడా! నీవు లేశమును భయపడకుము. వాదసమయమందు నేను నీజిహ్వాగ్రమందుండి సకలశాస్త్రజ్ఞానమును, యుక్తిపాటవమును, వక్తృత్వశక్తినిఁ గలిగించెద. నీవు వాదమందు ప్రతివాదుల నందఱను జయింపఁగా నాసొమ్ముమూట తెగి నీముందర పడును. ఆరాజు నీకు పాదానతుఁడు అగును" అని ప్రత్యుత్తరము ఇచ్చెను. అపుడు పెరియాళ్వారు "ధన్యోస్మి" యని భగవదాజ్ఞనుశిరసావహించి స్వామి పరివారముతో మధురకుఁ బోయి వల్లభదేవుని ఆస్థానమును సమీపింపఁగా నారాజు ఈతని నెదుర్కొని అర్ఘ్యపాద్యాదిసముచితసత్కారములుసలిపి ఉన్నతసింహాసనాసీనుం గావించెను. అంతట విష్ణుచిత్తుఁడు, భగవద్దత్తప్రజ్ఞావిశేషంబు గలవాఁడగుటచే నుత్తరోత్తరోక్తి సంతానంబునఁ బ్రతివాదుల నెదిరించి క్రమక్రమముగా వారి వారిమతముల నుండెడు అసంగతములను వారిచే నొప్పించి వానిని అన్నింటిని ఖండించి శ్రీమన్నారాయణుఁడే పరుఁడు అనియు, ఆతఁడే ఉపాస్యుఁడు అనియు, ఆతఁడే మోక్షప్రదాత యనియు సిద్ధాంతీకరించెను. అంతట విద్యాశుల్కగ్రంథి స్వయముగా తెగి నేలఁగూలెను. ప్రతివాదులు అందఱును విస్మితచిత్తులయిరి. వల్లభదేవుఁడు, పెరియాళ్వారి సామర్థ్యమునకు భగవన్మహిమంబునకు సంతసించి ఆళ్వారు నేనుఁగుమీఁద నెక్కించి మధురాపట్టణపు వీథులయందు ఊరేగించి పెద్దయుత్సవము గావించెను. తనకుమారుఁడు గొప్పఅభ్యుదయమొంది వాహన మెక్కి వీథిలో నుత్సవముతో నేఁగుచుండఁగా ముచ్చటతోఁ జూడవచ్చు తలిదండ్రులవలె శ్రీయు, శ్రియఃపతియు గరుడవాహనారూఢులై అట్టి అభ్యుచ్ఛ్రియదశలో నున్న పెరియాళ్వారునకు దర్శన మొసంగిరి. దివ్యాభరణభూషితము, శ్రీవత్సకౌస్తుభవనమాలావిరాజితము, దివ్యాస్త్రపుష్పితచతుర్భుజము, లక్ష్మీవిరాజితవక్షస్థలము నగు శ్రీమన్నారాయణుని దివ్యమంగళవిగ్రహము కన్నులకఱవుదీర సేవించి ఆనందపరవశుఁడై "ఆతఁడు సర్వరక్షకుఁడు; మనమందఱము నాతనిచే

రక్షింపఁబడువారము" అను జ్ఞానము భక్తిపారవశ్యముచే మాఱఁగా ఆసర్వేశ్వరుని శరీరశోభకు లక్ష్మికి, దివ్యాభరణములకు, దివ్యాయుధములకు దుష్టులగువారి దృష్టిదోషముతగులు నని భయపడి తా నెక్కిన ఏనుఁగుమీఁద వ్రేలవేసిన గంటలే తాళములుగాఁ జేసికొని "పల్లాండు పల్లాండు పల్లాయిరత్తాండు పలకోడినూరాయిరం, మల్లాండతిణ్డోళ్ మణివణ్ణా వున్ శేవడి శెవ్వి తిరుక్కాప్పు" అని ప్రారంభించి పదునొకండుపాశురముల చేత స్వామికి మంగళాశాసనము చేసెను. అంతట ఆరాజును,ఆతనిపురోహితుఁడగు శెల్వంనబియు పెరియాళ్వారుమూలముగా తమకుఁగూడ సర్వేశ్వరుని సేవలభించె నని మిక్కిలి సంతోషించిరి. రాజసభయందు పరతత్త్వనిర్ణయము చేసి నాకు సంతోషము గలిగించితివి; గావున నీకు నేను పట్టర్ పిరాన్ (భట్టనాథుఁడు) అను బిరుదునామమును ఇచ్చితిని. ఈపేరుతో ఇంకను కొంతకాలము నాయపరమూర్తియగు వటపత్రశాయికి మాలాకైంకర్యము సేయుచు వేదాంతార్థప్రతిపాదకములు అయిన దివ్యప్రబంధములను రచియించి జీవాత్మలను దిద్దుచునుండి తుదను నాసన్నిధికి రమ్మని శ్రీమన్నారాయణుఁడు ఆళ్వారునకు ఆజ్ఞాపించి అంతర్ధానమునొందెను. ఆళ్వారు వల్లభదేవుఁ డొసఁగిన ధనము తెచ్చి వటపత్రశాయికి సమర్పించెను. ఇతఁడు కృష్ణుని యందు భక్తిగల మాలాకారుని కైంకర్యము అవలంబించుటవలన కృష్ణభక్తికలవాఁడై కృష్ణుని సౌశీల్యసౌలభ్యాదిగుణములు అతిమానుషచేష్టలు, బాల్యలీలలు మొదలగువానిని అనుభవించి ఆయనుభవమును నన్నూటడెబ్బదిరెండుపాశురములతోఁగూడిన యొకదివ్యప్రబంధమును సాధించెను. దానికి "పెరియాళ్వార్ తిరుమొళి" అని పేరు. ఇతఁడు గరుడాంశచే జనించెను. సర్వేశ్వరునియందు పెద్దభక్తికలవాఁ డగుటచే పెరియాళ్వారు అని పేరు కలిగెను.

తిరునక్షత్రపు తనియ:—మిథునే స్వాతిజం విష్ణో రథాంశం ధన్వినః పురే,
ప్రపద్యే శ్వశురం విష్ణో ర్విష్ణుచిత్తం పురశ్శిఖమ్.

నిత్యతనియ:—గురుముఖ మనధీత్య ప్రాహ వేదా నశేషా
న్నరపతి పరిక్లృప్తం శుల్క మాదాతు కామః,
శ్వశుర మమరవంద్యం రంగనాథస్య సాక్షా
ద్ద్విజకులతిలకం తం విష్ణుచిత్తం నమామి.

116. ఆండాళ్.

(గోదాదేవి).

శ్లో. "దేవస్య మహిషీం దివ్యా మాదౌ గోదా ముపాస్మహే,
యన్మౌళిమాలికాం ప్రీత్యా స్వీకరోతి స్వయం ప్రభుః"

పూర్వోక్తచరిత్రగల పెరియాళ్వారు పాండ్యరాజసభలో జయముగొని తన నివాసగ్రామమయిన శ్రీవిల్లిపుత్తూరునకు వచ్చి యెప్పటి యట్ల వటపత్రశాయికి పుష్పకైంకర్యము ఒనర్చుచుండెను ఇట్లుకొంత కాలము జరిగినతరువాత, జనకరాజు యజ్ఞశాలకట్టింపఁదలఁచిభూమిని దున్నుచుండఁగా నాగలికి తగిలిన పెట్టెలో నావిర్భవించిన సీతవలె పెరియాళ్వారు తులసీకాననభూమి త్రవ్వుచుండ నొకనాఁడు:—

శ్లో. "తదా ఖనిత్రనస్త్రేణ విష్ణుచిత్తే మహాత్మని,
తులసీవృక్షమూలస్య ఖననం చ ప్రకుర్వతి,
లక్ష్మ్యంశా ల్లోకరక్షార్థం గోదా భూమ్యా స్తతోఽజని."

అనినట్లు ఒక బాలిక భూమినుండి ఆవిర్భవించెను.విష్ణుచిత్తుఁడు ఆబాలికను జూచి ప్రమోదభరితాంతరంగుఁడై ఆబిడ్డ నింటికిఁ గొని పోయి పెంచుమని తనభార్యచేతికి ఇచ్చెను.మఱియుఆమెకు గోదాదేవి యని పేరుపెట్టెను. గోదాదేవి చంద్రకళవలె దినదినప్రవర్ధమానయగుచు నసమానలావణ్యము గలిగి లోకులనేత్రముల కానంద మొసంగెను. చిన్ననాఁటనుండియు నామెకు భగవద్భక్తి విశేషముగనుండెను. ఆమె శ్రీమన్నారాయణునికిఁదక్క-ప్రాకృతమనుష్యుని ఎట్టివానినిఁగూడఁ బెండ్లియాడనని ప్రతిజ్ఞపట్టెను.ఆమెచెలులు పరిహాసమునకు ఇతఁడునీకు మగఁడుఅగుననినుడివినచో మూర్ఛిల్లుచుండెడిది.తనతండ్రివటపత్రశాయిస్వామికొఱకు కట్టిపెట్టిన పుష్పమాలికలనుమొదట తానొకపరి తన కొప్పుపైధరించి, బావిలోసౌందర్యమునుచూచుకొనితిరుగ నాపూలదండ నెప్పటియట్లతండ్రికితెలియకుండపూలసజ్జలో నుంచుచుండెడిది.ఇట్లు అనేకదినములు జరుగఁగా నొకనాఁడు ఆమెమాలికను కొప్పునఁజుట్టుకొనుట తండ్రికంటఁబడెను. ఆళ్వారు పుత్రికాప్రేమచే నామెనేమియు నన

లేక "అమ్మా, స్వామికిఅర్పింపందగిన పూలదండనీవిట్లు ధరించుట యుచితముగునా?" అనినుందలించి ఆదివసమున స్వామికి మాలికాసమర్పణముమానెను. నాఁటిరాత్రివటపత్రశాయి పెరియాళ్వారునకుస్వప్నమున సాక్షాత్కరించి మాల్యములు సమర్పింపకపోవుటకు కారణమేమనియడిగెను. అందులకు ఆళ్వారు "స్వామీ, ముగ్ధయగు నాబాలిక బాల్యచాపల్యముచే నామాలికలను ధరింపఁగా, చూచి యవి నిర్మాల్య మయ్యెనని పరిహరించితిని; మఱియొకటి కట్టి సమర్పించుట కవకాశముచిక్కదయ్యెను; క్షమింపుము" అని విన్నవించెను. అదివిని స్వామి చిరునగవుతో "ఓయీ, ఆమెసంగతి యెఱుంగనివాఁడవు అగుటచే నీవు ఇట్లుఒనర్చితివి. ఆమె రక్షణార్థమయి యీలీలావిభూతియందు ఈలోకరూపముతో నవతరించిన లక్ష్మి. నీవు కృతపుణ్యుఁడవగుటచే నీయింట నవతరించినది. ఇప్పటినుండి నీవు నిర్మించుమాలికలను మొదట నామె కొప్పున నలంకరించి పిమ్మట మాకుఁ దెమ్ము. ఆమె తాల్చిన మాలికయే మాకుఁ గోరఁదగినది. ఆమెకొప్పుతో సంపర్కము నొందనిమాలికలనుమేమొల్లము" అని పలికెను. అదిమొదలు పెరియాళ్వారు ఆమెయెడల పుత్రిక యను ప్రాకృతాభిమానము విడిచి పరదేవతాభావమును జూపఁదొడఁగెను. ఇట్లు క్రమక్రమముగా గోదాదేవి సంప్రాప్తయౌవనయై పతిసంయోగసులభ మగు వయస్సునొంది గోపికలవలెకృష్ణునియం దత్యంతానురాగము కలదియైయహర్నిశములు తత్ప్రాప్తికై ధ్యానించుచుండెను. కృష్ణుఁడవతరించిన మధురాపట్టణము, ఆతఁడు పెరిగిన బృందావనము, గోపికలతో నాతఁడు జలక్రీడ లాడిన యమున మొదలగు వానివద్దకుఁబోవుటకుఁ దనకు శక్తిలేక కృష్ణసంశ్లేషముకొఱకు గోపాంగనలు కాత్యాయనీవ్రత మాచరించి రని విని, వారి ననుకరించి, ధనుర్మాసములో ముప్పది రోజులును వేఁకువజామున లేచి తోడిబాలికలతో స్నానము చేసి వటపత్రశాయిస్వామి వేంచేసియుండుకోవెల నందగోపుని గృహముగను, అందుండు స్వామిని కృష్ణునిగను, తోడిచెలులు అందఱును గోపికలుగను, తాను ఒక గోపాంగనగను భావించి ఆస్వామిని ధూపదీపనైవేద్యాదులతో నిత్యము నారాధించుచు దినమున కొక్కొక్క గాధను ద్రావిడభాషలో (శ్లోకముగా) రచించి స్వామి సన్నిధిని విన్నవించుచు నామె వ్రతము చేసెను.

ఇట్లు భగవత్సంశ్లేషముకొఱకు త్వరపడుచున్న గోదాదేవి యొక నాఁడు తన తండ్రిగారిని నూటయెనిమిది దివ్యతిరుపతులలో వేంచేసి యున్న స్వాముల విగ్రహసౌందర్యమును కల్యాణగుణములను వర్ణించి చెప్పుమని ప్రార్థింపఁగా ఆళ్వారు అందఱను వర్ణించిచెప్పెను. అపుడు గోదాదేవి శ్రీరంగమందు వేంచేసియున్న శ్రీరంగనాయకుని లోకోత్తరసౌందర్యమును విని ఆస్వామియందు అనురక్తయయ్యెను. అది కని పెరియాళ్వారు అర్చారూపముతో వేంచేసియున్న రంగనాథస్వామికిని తన పుత్రికకును పాణిగ్రహణమెట్లు జరుగు నని ఆలోచించి వ్యాకులాంతఃకరణుఁడై వటపత్రశాయితో విన్నవింపఁగా నాశౌరి "యీమెను శ్రీరంగనాయకుని సన్నిధికిఁ గొనిపొమ్ము" అని యాజ్ఞాపించెను. అంతలో రంగనాథుఁడు పెరియాళ్వారునకు స్వప్నమున సాక్షాత్కరించి "నీవు చింతింపకుము. నీపుత్రికను నేను పెండ్లియాడెద" నని చెప్పెను. మఱునాఁడు ఛత్రచామరవాహనాదులతో వచ్చి రంగనాథుని పరిజనులు తండ్రితోఁ గూడ గోదాదేవిని స్వామి ఆజ్ఞచొప్పున శ్రీరంగమునకు తోడుకొనిపోయిరి. ఆదినమున రంగనాథుని అర్చావిగ్రహమునకును, గోదాదేవికిని విధ్యుక్తముగా పాణిగ్రహణముజరిగెను. ఇంతలోగోదాదేవి పెరియపెరుమాళ్లను సేవించుటకు గర్భాలయములోనికిఁ బోయి జనులు చూచుచుండఁగా నాస్వామిలో లీనయయ్యెను. అది చూచి విష్ణుచిత్తుఁడు ప్రీతివిషాదములతోఁ గూడుకొన్నవాఁడై యుండఁగా రంగనాథుఁడు "నీవు వగవకుము. సముద్రునివలె నీవు నాకు మామవైతివి" అని శ్లాఘించి తిరుప్పరివట్టము. తోమాల, శ్రీ శఠగోపము మొదలగు వానితో సత్కారములు చేయించి పంపెను. పెరియాళ్వారు శ్రీవిల్లిపుత్తూరునకు మఱలివచ్చి యెప్పటియట్లు వటపత్రశాయిస్వామికి పుష్పకైంకర్యము ఒనర్చుచుండెను. ఈగోదాదేవికి ఆండాళ్ (భక్తులనేలు కొనునది) అనియు, శూడికొడుత్తాళ్ (స్వామికి తాను చుట్టుకొనిన మాలికలు ఇచ్చునది) అనియు నామద్వయము కలదు. ఈమె రచించిన ప్రబంధములు. 1. తిరుప్పావై (ముప్పది పాశురములు కలది); 2. నాచ్చియార్ తిరుమొழி (నూటనలువదిమూఁడు పాశురములు గలది).

తిరునక్షత్రపుతనియ:— శ్లో. కర్కటే పూర్వఫల్గున్యాం తులసీకాననోద్భవాం,
పాండ్యే విశ్వంభరాంగోదాం వందే శ్రీరంగనాయకీమ్.

నిత్యతనియ:—శ్లో. నీళాతుంగ స్తనగిరితటీసుప్త ముద్బోధ్య కృష్ణం
పారార్థ్యం స్వం శ్రుతిశతశిర స్సిద్ధ మధ్యాపయంతీ,
స్వోచ్ఛిష్టాయాం స్రజ నిగళితం యాబలాత్కృత్య భుఙ్క్తే
గోదా తస్యై నమ ఇద మిదం భూయ ఏవాస్తు భూయః.

---

117. శ్రీకులశేఖరాళ్వారు.

శ్లో “ఘుష్యతే యస్య నగరే రంగయాత్రా దినే దినే,
తమహం శిరసా వందే రాజానం కులశేఖరమ్.”

పూర్వకాలమందు కేరళదేశమునందున్న కొల్లి అను పట్టణమును చేరవంశజుఁడగు దృఢవ్రతుఁడు అను రాజు పరిపాలించుచుండెను. ఆరాజు సకలైశ్వర్యములు కలవాఁడై యున్నను, సంతానము లేక దుఃఖించి, శ్రీమన్నారాయణుని గూర్చి చిరకాలము తపస్సు ఒనరించెను. సర్వేశ్వరుఁడు తపస్సునకు మెచ్చి ప్రత్యక్షమై ‘తప్పకుండ నీకొక కుమారుఁడు జనించు’ నని ఆనతిచ్చి అంతర్ధానము నొందెను. తరువాత కొంతకాలమునకు ఆదృఢవ్రతుని భార్య భగవదనుగ్రహముచే గర్భవతియై నెలలు నిండఁగా మాఘశుక్లద్వాదశీశుక్రవారమునాఁడు పునర్వసునక్షత్రమందు ప్రకాశమానుఁడగు ఒక కుమారునిఁ గనెను. రాజు పుత్రుఁడు పుట్టె నన్న శుభవార్త విని ఆనందభరితుఁడై స్నానముచేసి బ్రాహ్మణోత్తములకు తన ఉత్సాహమునకు తగినట్లు అనేక మహాదానము లొనరించి పుత్రునకు విధ్యుక్తముగా జాతకర్మాది సంస్కారములు ఒనరించి కులశేఖరుఁడు అని నామకరణము చేసెను. మఱియు కాలక్రమమున పిల్లవాఁడు ఎదుగుచుండఁగా ఆయాకాలములయందు చేయవలసిన అన్నప్రాశనాదికర్మలనుగూడ చేసెను. పిదప రాజు కుమారునకు పదియేండ్లప్రాయమున నుపనయనము చేసి విద్యాభ్యాసమునిమిత్తము గురుకులమునకుఁ బంపెను. సూక్ష్మబుద్ధియగు నాచిన్నవాఁడు శీఘ్రకాలములో నాలుగువేదములను, సకలశాస్త్రములను, ధనుర్వేదమును, మల్లవిద్యను అభ్యసించి గొప్పవాఁడయ్యెను. మఱియు రాజ్యపరిపాలనమునకు ఉపయోగించు నీతిశాస్త్రమున అతి

నిపుణుఁడు అయ్యెను. దృఢవ్రతుఁడు అట్టి కుమారునిఁజూచి, మిక్కిలి సంతోషించి, తగిన కులశీల వయోరూపములుగల యొక రాజకన్యకను వివాహముచేసి రాజ్యము ఆతనికి అప్పగించి కృతకృత్యుఁడై తపస్సు చేసికొనుటకు భార్యతో వనమునకుఁ బోయెను.

కులశేఖరాళ్వారు రాజ్యము నంతయు నిష్కంటకముఁ గావించి, కోశదండములను వృద్ధి నొందించుచు బలవంతులు బలహీనులను పీడింపకుండ ధార్మికుఁడై రాజ్యమును పాలించుచుండెను. మఱియు శ్రీరామునివలె బ్రాహ్మణులకు అనేకగోవులను ఒసంగుచుండెడివాఁడు.

సర్వేశ్వరుఁడు శ్రీ వైకుంఠమునుండి సేనముదలియాళ్వారును ఇతనియొద్దకుఁ బంపి ఇతనికి పంచసంస్కారములను, మంత్రోపదేశమును చేయించి, పరతత్త్వమును బోధించు సకలార్థములను ఉపదేశము చేయించెను. శ్రియఃపతి ఇతనిని కేవల సత్త్వనిష్ఠుఁ డగునట్లు అనుగ్రహించి తన స్వరూపగుణవిభూతులను కనుపఱిచెను. ఆకారణమువలన ఈయాళ్వారునకు జ్ఞానభక్తివైరాగ్యములుఉప్పొంగి రాజ్యపాలనమునందును రాజ్యభోగానుభవమునందును వైముఖ్యము కలిగెను. భగవద్విముఖులగు నిత్యసంసారులతో సహవాసము ఇతనికి దహింపఁబడుచున్న గృహమునందలి ఉనికివలె అతిదుస్సహ మయ్యెను.

ఇతఁడు దేహసంబంధులను పరిత్యజించెను. రాజ్యము భగవద్భాగవతకైంకర్యమున ఉపయోగించునట్లు ఎఱింగి దానిని భాగవతాధీనము గావించి విభీషణునివలె శ్రీరామపాదారవిందములయందు శరణాగతిఁ జేసెను.

అవతారములలో శ్రీరామావతారమునందును, అర్చావతారములలో శ్రీవేంకటేశ్వరునియందును, ఇతఁడు అపరిమితమైన భక్తి కలిగియుండెను. ఇందుకు తార్కాణగా ఇతఁడు శ్రీరామవిషయమై నూటనాలుగుపాశురములతోఁగూడిన "పెరుమాళ్ తిరుమొழி" అను నొక దివ్యప్రబంధమును రచించి లోకమునకు అనుగ్రహించెను. దానిలో నాతఁడు తిరువేంగడముడైయాన్ విషయమై తనకుఁగల అపారభక్తిని పదిపాశురములలో వెల్లడిచేసెను. అందులో నొకపాశురము నీదిగువ నుదాహరించుచున్నాను.

"ఆనాద శెల్వత్తరంబై యర్ గళ్ తరశూళ, వానాళుం శెల్వముధ్ మణ్ణరశుం యాన్వేండేన్, తేనార్ పూం శోలై తిరువేంగడచ్చునైయిల్, మీనాయ్ పిరక్కుం విదియుడైయే నావేన్"

(4. తిరుమొళి. 2. పాశు.)

"రంభ మొదలగు నప్సరసలు నన్నుచుట్టుకొని సేవింపఁగా స్వర్గరాజ్యమునుఏలుకొనుటయు, భూలోకరాజ్యము నేలుకొనుటయు నేనపేక్షింపను. మకరందపూర్ణములగు పుష్పోద్యానములుగల తిరుమలయందున్న బావులలో చేపనయి పుట్టుట అను మహాభాగ్యము నపేక్షించెదను.

ఒకనాఁడు ఈతఁడు శ్రీరంగక్షేత్రమాహాత్మ్యమునుచదివించివిని శ్రీరంగనాథుని నిత్యకైంకర్యముచేయుచు నెల్లకాలము శ్రీరంగమందే నివసించుటకు నిశ్చయించి ప్రతిదినము శ్రీరంగమునకుఁ బోవుటకు ప్రయాణసన్నాహములు చేయించుచు"మనమందఱమును గలిసి శ్రీరంగమునకుఁబోదము. సిద్ధముగానుండుఁడు" అని పురజనులకుఁ దెలుపుచు తనపట్టణమునందు చాటింపించుచుండెను. అది చూచి మంత్రులు "ఈతఁడు శ్రీరంగమునకుఁ బోయినయెడల శ్రీరంగనాథుని విగ్రహసౌందర్యమున మగ్నుఁడయి అచటనే యుండును. మఱల స్వదేశమునకు వచ్చి స్వరాజ్యమును చూడఁడు"అనిఆలోచించుకొని, శ్రీరంగయాత్రకుఏదో మిష పెట్టి ప్రతిదినమును విఘ్నము గలిగింపసాగిరి. కులశేఖరుఁడు అష్టాదశపురాణములను, ఇతిహాసములను, వైష్ణవపండితులవలన విని వాని సారమును చక్కఁగా గ్రహించి ముకుందుఁడే పరతత్వమని నిర్ణయించి "ముకుందమాల" అను నొకస్తోత్రమును రచించెను. అదియెల్లరకును నిత్యమునుప్రాతఃకాలమున చదువుకొనఁదగినది. కులశేఖరాళ్వారు రాజ్యమందును, ఐశ్వర్యమందును, లేశమును మమకారము లేక దినమునందు కొంచెముకాలమే రాజ్యవ్యాపారములనుజూచుచు తక్కినకాలమంతయును పరమసాత్త్వికులయిన భాగవతోత్తములతో గలిసి భగవంతునిదివ్యలీలలను,దివ్యావతారములనుగీర్తించుచు తనకంటెముందు అవతరించిన ఆళ్వార్లు సాధించిన దివ్యప్రబంధములను అనుసంధానము చేసికొనుచు నిత్యము శ్రీవైష్ణవగోష్ఠితోఁ గాలము గడపుచుండెడివాఁడు.

ఇట్లు కులశేఖరాళ్వారు సర్వకాలసర్వావస్థలయందును భాగవతగోష్ఠియందే కాలము గడపుచుండుటచే రాజ్యవ్యాపారములకు భంగము కలుగు నని యెంచి మంత్రులు అతనికి వైష్ణవులయెడల ద్వేషబుద్ధి పుట్టింప నూహించి, అతని దేవతార్చన పెట్టెయందున్న స్వామి రత్నహారమును దీసి దాచి, "దానిని మీతో సహవాసముచేయు శ్రీవైష్ణవులు కుట్రచేసి అపహరించి" రని యొకనాఁడు చెప్పిరి. ఆమాటలను విని ఆళ్వారు మిక్కిలి పరితాపమును పొంది "శ్రీవైష్ణవులు ఇట్టి ద్రోహము ఎంతమాత్రమును చేయువారు కారు. మీరిట్టి పాపమునకు ఒడిగట్టుకొనివారిపై ఈనిందను మోపితిరి. మీమాటనువిని కొందఱు లోకులు పరమపావనులయిన భాగవతోత్తములయందు సంశయము కలవారగుదురు. మీమాటలు నమ్మఁదగినవి గావని నే నిపుడు ఉపేక్షించినయెడల రాజు భాగవతపక్షపాతముచేత మంత్రులమాటలను నిరాకరించె నని లోకము నన్ను నిందించును; గావున ఇందువలన లోకులకు గలుగు సందేహమును ప్రమాణముతోఁ బోఁగొట్టవలెను" అని పలికి పాములవానిచే ఒకకృష్ణసర్పమును దెప్పించి దాని నొక కుండలో నుంపించి తన చేతియుంగరము నందు విడిచి "మీరు ఈయుంగరమును తీయఁగలఁగుదురేని మీమాట నమ్మెదను" అని మంత్రులతోఁ జెప్పెను. అందులకు మంత్రులు మొగములు వ్రేల వేసికొని యొక మూలకుఁ బోయిరి. అప్పుడు ఆళ్వారు సభవారినిఁజూచి "ఈనీచులు నిష్కారణముగా భాగవతులమీఁద నింద నారోపించినారు. ఈకుండలోని యుంగరమును నేను దీసెదఁ జూడుఁడు" అని నిర్భయముగ దానిని బైకిఁ దీసెను. తాఁకినను సర్ప మేమియుఁ జేయదయ్యెను. అది చూచి సభాసదులందఱు ఆశ్చర్యపడి ముక్కులమీఁద వ్రేళ్లిడుకొని ఆళ్వారు భాగవతభక్తికి మిగుల సంతోషించిరి.

ఇతఁడు దృఢమగు రామభక్తి కలవాఁడు అగుటచే నొకకాలమున రామాయణార్థమును వినుచుఁ గాలము గడుపుచుండెను. ఒకనాఁడు అరణ్యకాండ కథను వినుచు ఖరదూషణయుద్ధములో—

శ్లో. "చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణాం,
ఏకశ్చ రామో ధర్మాత్మా కథం యుద్ధం భవిష్యతి."

అనుశ్లోకముయొక్క అర్థమును విని ఒక్క రాముఁడు పదునా
లుగు వేలమంది రాక్షసులతో నెట్లు యుద్ధము చేయఁగలఁడని భయ
పడి గుండె బాదుకొనుచు రామప్రేమపారవశ్యమున నొడలెఱుఁగక
రామునకు యుద్ధమున సాహాయ్యముచేయుటకు కవచము, ఖడ్గము
మొదలగువానిని ధరించి, చతురంగబలముతో జనస్థానముదిక్కు పరు
గిడసాగెను మంత్రులు అదిచూచి ఇతని నెట్లయిన మళ్లింపవలయునని
ఆలోచించి కొందఱు వైష్ణవుల నెదురుగాఁ బంపిరి. వారపుడు కుల
శేఖరాళ్వారునిఁగాంచి "మీరు పోవలసిన అవసరము లేదు. ఇదివఱకే
రాముఁ డారాక్షసుల నందఱను క్షణములో సంహరించి వేసినాఁడు.
విజయము బడసిన భర్తను జూచి సీత ఆనందముతో కౌఁగిలించుకొని
నది." అని చెప్పఁగా విని సంతోషించి ఆవైష్ణవులకు తన మేననున్న
భూషణములను దీసి కానుకగా నిచ్చి పురమునకు మఱల వచ్చెను.

రామాయణపురాణము యథాప్రకారము సాగుచుండెను. ఆపౌ
రాణికుఁడు ఆళ్వారు రామభక్తిని బాగుగ నెఱుఁగును; గావున రా
మునకు సంభవించు అపజయములను, ఆపదలను జెప్పక అట్టి కథాభా
గములను విడిచిపెట్టుచుండెడువాఁడు. అతఁ డొకనాఁడు పనిమీఁద
గ్రామాంతరమునకుఁ బోవుచు పురాణము చెప్పుటకు తన కుమారుని
నియమించెను. ఆబాలుఁడు తండ్రివలె రాజుసంగతి నెఱుఁగని ముగ్ధుఁ
డు; గావున గ్రంథములో నున్నదానిని ఉన్నట్లు చెప్పసాగెను. ఒకనాఁడు
పురాణము చెప్పుచుండఁగా అరణ్యకాండమునందలి—

శ్లో. "జహార రావణ స్సీతాం బుధః ఖే రోహిణీమివ" అనుశ్లోక
మును జదివి రావణుఁడు సీతను హరించె నని చెప్పెను. అది విని కుల
శేఖరాళ్వారు తోఁకత్రొక్కినత్రాచువలె మండిపడుచు లేచి "ఎట్టె
ట్టూ? దురాత్ముఁడగు రావణుఁడు జగన్మాత యగు సీతను హరించెనా?
ఇదిగో చూడుఁడు. ఈక్షణమందే సముద్రమును దాఁటి లంకఁ జొచ్చి
నాబాణాగ్నిచే లంకను భస్మీభూతముగావించి సపుత్రామాత్యబాంధవ
ముగా రావణుని సంహరించి సీతను దెచ్చి స్వామికి అర్పించెద నని
ప్రతిజ్ఞచేసి ధనుర్బాణములను ఖడ్గమును ధరించి లంకాభిముఖుఁడై
సముద్రములో నుఱికెను. వెనుక చతురంగసైన్యములుబయలుదేఱెను.
ఈవింతను చూచుటకు దేవతలు విమానములతో నంతరిక్షమందు

ఉండిరి. క్రిందనుండి చూచుచుమనుష్యులు ఎల్లరును హాహాకారములు చేయసాగిరి. అట్టి సమయమున కరుణాసముద్రుఁడు, భక్తపరాధీనుఁడు నగు శ్రీరామచంద్రుఁడు సీతాలక్ష్మణసహితుఁడై ఆళ్వారునకు సాక్షాత్కరించి. "ఓయి కులశేఖరా, నేను ఉండఁగా నీకు ఎందులకు ఈశ్రమ? దారపుత్రాదిసహితుఁడైన రావణుని ఇప్పుడే యుద్ధమున సంహరించి సీతను దీసికొని వచ్చినాను. ఇదిగో సీతను చూడుము" అని పలికెను. ఆళ్వారు అప్పుడు సీతారామలక్ష్మణులను సేవించి బ్రహ్మానందభరితుఁడయ్యెను. పిదప రామాయణపురాణము యథాపూర్వముగఁ బ్రారంభమయ్యెను.

ఇట్లు కులశేఖరాళ్వారు మఱికొంతకాలము రాజ్యము పాలించుచునకు పరమవిరాగియై దృఢవ్రతుఁడు అనుతనకుమారునకు రాజ్యము నొప్పగించి శ్రీవైష్ణవసంఘముతో శ్రీరంగమును సేవించుటకు బయలు దేఱెను. అచ్చట కొంతకాలము ఉండి తిరుమల, కాంచి, తిరుక్కణ్ణపురము, తిరుమాలిరుంజోలై, (వానాద్రి) శ్రీముష్ణము మొదలగు దివ్యదేశములను సేవించి నమ్మాళ్వారు అవతరించిన తిరునగరికి బోయి ఆసమీపమున నున్న బ్రహ్మదేశపురమను దివ్యదేశమందు వేంచేసియున్న స్వామిని సేవించుచు నచట కొంతకాలము నివసించి, కులశేఖరాళ్వారు తన అఱువదియేడవయేట ఆక్షేత్రమునుండి శ్రీవైకుంఠమునకు వేంచేసెను.

తిరునక్షత్రతనియ:—కుంభేపునర్వసౌ జాతం కేరళే కోళపట్టణే,
కౌస్తుభాంశంధరాధీశం కులశేఖర మాశ్రయే.
నిత్యతనియ:—ఘుష్యతే యస్యనగరే రంగయాత్రా దినేదినే,
తమహం శిరసావందే రాజానం కులశేఖరమ్.

---

118. తిరుప్పాణియాళ్వారు

(యోగివాహుఁడు.)

శ్లో. శ్రీలోకసారంగమహామునీంద్ర స్కంధాధిరూఢం కలయామి నిత్యం,
కళంకహీనం కమనీయభక్తిం కవీశ్వరం గాయకసార్వభౌమమ్.

తిరుప్పాణియాళ్వారుదుర్మతిసంవత్సర కార్తికమాసములో రోహిణీనక్షత్రముతోఁ గూడిన పూర్ణిమనాఁడు శ్రీరంగమునకు దగ్గఱ నున్న చూళాపురము అనుఉఱైయూర్ (ఇదితి చినాపల్లితోఁ గలిసియున్నది) గ్రామముతో సంబంధించిన వరిపొలములో వరివెన్నునుండి శ్రీవత్సాంశమున నవతరించెను.

శ్లో. అథ తత్ర కులే౽ంతిమేకమాదమహోరస్స్థలలాంఛనాంశజః,
సముజాయత పాణిసంజ్ఞకః సుకవిః కార్తికమాసి పైగభే.

అనినట్లు వీరయోనిసంభూతుఁడై అవతరించెను. బాల్యమందు స్వల్పకాలము అంత్యకులమున పెరిగెను. ఎట్లన? పూర్వజన్మపాపలేశము ననీచమైన పంచమవర్ణమందుజనించినను భగవద్భక్తి, జ్ఞానము, వైరాగ్యము గలవాఁడై యున్న ఒకమాలదాసరి ఉఱైయూర్ వరిమళ్లలోనుండి తనగ్రామమునకు భార్యయు తానును పోవుచు నొక వరిమడిలో బాలసూర్యునివలె ప్రకాశించుచున్న యీశిశువును జూచి బిడ్డలు లేకచింతిలుచున్న తనకు భగవంతుఁడు నిర్హేతుకకృపచే నీకుఱ్ఱని అనుగ్రహించెనని అపారమైన ఆనందమును పొంది రెండు చేతులతో నెత్తికొని తన భార్యచేతికి ఇచ్చెను. ఆభాగ్యవతియు పదినెలలు మోసి కన్నకొడుకునందువలె నతిప్రేమ గలదియయి యెత్తుకొని యింటికి తీసికొనివెళ్లి తన జాతిస్త్రీలచే స్తన్యమును ఇప్పింపఁగా ఆశిశువు నోరు తెఱవలేదు. అందులకు ఆదంపతులు ఆశ్చర్యపడి పరిశుద్ధమగు గోక్షీరము తెప్పించి ఇవ్వఁగా శిశువు ఆప్యాయముతోఁ ద్రాగెను. అదిమొదలుకొని వారు ఆవుపాలు పోసి పిల్లవానిని పెంపసాగిరి.

ఇట్లు మాలదాసరియింటఁ బెరుగుచున్న తిరుప్పాణియాళ్వారు సర్వేశ్వరానుగ్రహమువలన ప్రహ్లాదునివలె బాల్యమునుండియు భగవంతునియందు భక్తియు, ఇతరవిషయములయందు విరక్తియు గలవాఁడై విష్వక్సేనునియనుగ్రహమువలన పొందఁబడినపంచసంస్కారములుగలవాఁడై సర్వార్థములను ఎఱింగెను. ఇతఁడు ఎల్లప్పుడును వీణాపాణియైభగవన్నామసంకీర్తనముచేయుచు కాలక్రమమున తన్ను పెంచినమాలదాసరియింట నివాసముమాని కావేరీతీరముఁజేరి, ప్రతిదినము తెల్లవాఱుజామున కావేరిలో స్నానము చేసి అతిపావనమైన శ్రీరంగభూమిని తనపాదములతో త్రొక్కఁ గూడదని తలంచి శ్రీరంగవిమాన

మునకు ఎదురుగా దూరమున నిలిచి భగవద్గుణానుభవము సేయుచు భగవంతుని లీలలు పాడుచు కాలముగడపుచుండెను.

ఇతని గానము అప్రాకృతదివ్యగానము అగుటవలన అప్సరసలు, గంధర్వులు మొదలగు ఖేచరులు అంతరిక్షమున విమానములమీఁద నిలిచి వినుచుండెడివారు. ఇతఁడు తలుచుచు రంగనాథునిపై పాటలు పాడుచు రంగనాథుని ధ్యానించుచు తన్మయుఁడై మేను మఱచి యుండెడివాఁడు. కావేరికి స్నానార్థము వచ్చు బ్రాహ్మణులు అందఱును ఇతఁడు పంచముఁడు అని భావించి "దూరముగా తొలఁగిపొమ్ము" అని కేకలు వేయుచుండిరి. అప్పుడెల్ల నీతఁడు భగవద్ధ్యానపరవశుఁడై యొడలెఱుంగనిస్థితిలో నుండుటచే ఆబ్రాహ్మణులు రాళ్లు రువ్వసాగిరి. శిలాఘాతములవలన గాయములై రక్తము స్రవించుచున్నను ఈతఁడు బాహ్యజ్ఞానములేక అట్లే ధ్యానసమాధియందు ఉండెడివాఁడు. బ్రాహ్మణులు విసరిన రాళ్లు శ్రీరంగమునందు రంగనాథస్వామిని బాధింపసాగెను. ఒకనాఁడు స్వామి లలాటమునుండి రక్తము హెచ్చుగా స్రవింపసాగెను. అది విని ఆ దేశమును పాలించు రాజు వచ్చి, తనవలన నిట్లు సంభవించెనేమో యని శంకించి, భయమును, దుఃఖమును పొందెను. ఇది యిట్లు జరుగుచుండఁగా రంగనాయిక రంగనాథునిఁ జూచి "నాథా, పరమభాగవతశిఖామణియగు తిరుప్పాణియాళ్వారు తన గానరసముచే చిరకాలమునుండి మనలను మిగుల రంజిల్లఁజేయుచున్నాఁడు. ఆతఁడు మహానుభావుఁడు; భక్తాగ్రగణ్యుఁడు; అట్టివానిని దూరముగా నుండనిచ్చుట నాకు భావ్యముగా కానవచ్చుట లేదు. ఆతనిని మన సన్నిధికి రప్పించి పాడించి విననలయు నని నాకు మనసగుచున్నది." అని విన్నవింపఁగా స్వామి, "ప్రాణనాయికా, ఆభక్తుని గుఱించి నీకింత చింతయేల? ఇదిగో ఇప్పుడే ఆతనిని ఇచ్చటకు రప్పించెద"నని ఆనతిచ్చి సారంగయోగి అను నాతనికి స్వప్నమున సాక్షాత్కరించి "నాప్రియభక్తుఁడు అగు తిరుప్పాణియాళ్వారు నీచుఁడు అని తలంపక దగ్గఱకు వెళ్లి నేను రమ్మంటి నని చెప్పుము. ఆతఁడు సంకోచించి రాకున్నచో రెండుచేతులతో నాతనిని బలవంతముగా నెత్తుకొని ఇక్కడకు తీసికొని రమ్ము" అనియాజ్ఞాపించెను. అంతట సారంగయోగి మేల్కాంచిధన్యుఁడనై తినని సంతోషించి ప్రాతఃకాలమందు లేచి కాల్యకృత్యములను నిర్వ

ర్గించుకొని తిరుప్పాణియాళ్వారుసన్నిధికిఁ బోయి సాష్టాంగదండప్ర ణామము లాచరించి రంగనాయకుని ఆజ్ఞయైనదని విన్నవించెను. అందులకు ఆతఁడు, "నేను పంచముఁడను, పావనమైన శ్రీరంగక్షేత్రమును నాకాళ్లతో నెట్లు త్రొక్కుదును" అని తన నైచ్యమును దెలియఁజేసి సంకోచించుచుండఁగా సారంగయోగి ఇది రంగనాథుని ఆజ్ఞ. మనము ఉభయులము తప్పక మన్నింపవలయు" నని దృఢముగఁబలికెను. అంతట తిరుప్పాణియాళ్వారు భగవత్పరతంత్రుఁడై యూరకుండఁగా సారంగయోగి ఆతనిని తనభుజములపై నెక్కించుకొని బయలుదేఱెను ఆతివాహకపురుషులు ముక్తపురుషుని శ్రీవైకుంఠమునకు తీసికొనివెళ్లునట్లు ముందు శ్రీవైష్ణవులు దివ్యప్రబంధముల ననుసంధించుచుండఁగా వెనుక వేదాధ్యేతలు వేదమునుబఠించుచుండఁగా మహావైభవముతో సారంగయోగి తిరుప్పాణియాళ్వారును రంగనాయకుని సన్నిధికి తీసికొనివెళ్లిరి. అప్పుడు ఆళ్వారు సన్నిధిఁగన్న పేదవలె నానందభరితుఁడై శేషతల్పమునందు శయనించిన పెరియపెరుమాళ్లను తిరుముఖమండలము మొదలుకొని తిరువడివఱకును సకలావయవసౌందర్యమును కన్నుల కఱవుదీఱ సేవించి అనుభవించి అత్యనుభవముచలనఁగలుగు ప్రేమనుసూచించు నొక ద్రావిడప్రబంధమును పదిపాశురములతో రచించి స్వామి సన్నిధిని విన్నవించెను. ఆ ప్రబంధముపేరు "అమలనాదపిరాణ్"

ఇట్లు తనయందు అపారభక్తిగల తిరుప్పాణియాళ్వారునందు రంగనాథుఁడు నిర్హేతుకానుగ్రహముగలవాఁడై చుట్టును నిలిచియున్నవారు చూచుచుండఁగా తన పాదపద్మములయందు ఆతనిని లీనముచేసికొనెను. ఈయాళ్వారు ఏఁబదిసంవత్సరములు ఈవిభూతియందు ఉండిరి.

తిరునక్షత్రపుతనియ:—శ్లో. వృశ్చికే రోహిణీజాతం శ్రీపాణిం నిచుళాపురే,
శ్రీవత్సాంశం గాయకేంద్రం మునివాహన మాశ్రయే.

నిత్యతనియ:—శ్రీలోకసారంగ మహామునీంద్ర స్కంధాధిరూఢం కలయామి నిత్యం,
కళంకహీనం కమనీయభక్తిం కవీశ్వరం గాయక సార్వభౌమమ్.

119. తొండరడిప్పొడియాళ్వారు.

(విప్రనారాయణుఁడు.)

శ్లో. "చోళక్షితౌ ధనుషి మాసి చ జ్యేష్ఠతారే
యః ప్రాదురాస మురజిద్వనమాలికాంశః,
రంగేశకేళిసఖమార్గ్యవిశిఖండ్విజేంద్రం
భక్తాంఘ్రిరేణు మనఘం త్మగుణం ప్రపద్యే."

చోళదేశమునందు మండంగుడి యను నొకగ్రామముకలదు. అందు సదాచారియు, దేవతాగురుభక్తుఁడును అగు ఒకపురశ్శిఖబ్రాహ్మణుఁడు నివసించుచుండెను. ఆతనిభార్య గుణవతియు, రూపవతియునై యుండెను. ఈదంపతులు ఉభయులు సంతానములేనివారై పుత్రునికొఱకు సర్వేశ్వరు నారాధింపఁగా వారికి ప్రభవసంవత్సరమార్గశిరకృష్ణచతుర్దశినాఁడు జ్యేష్ఠానక్షత్రమున భగవంతుని వనమాలాంశమున నొకపుత్రుఁడు ఉదయించెను. అత్యద్భుతతేజస్సుగల ఆపుత్రునిఁజూచి తల్లిదండ్రులు పరమానందభరితులై విధ్యుక్తముగా జాతకర్మాదిసంస్కారములు గావించి, శ్రీమన్నారాయణుని కటాక్షమున పుట్టినవాఁడు గావున 'విప్రనారాయణుఁడు' అని నామకరణముచేసిరి. కాలక్రమమున ఆచిన్నవాఁడు పెద్దవాఁడై గురువులచెంత సాంగోపాంగములగు వేదములను జదివి పండితుఁడయ్యెను. విష్వక్సేనుఁడు ఆతనికి పంచసంస్కారములు ఒనర్చి మంత్రార్థమును బోధించిరి. ఆకారణముచే నాతఁడు భక్తిజ్ఞానవైరాగ్యబంధుఁడై వివాహముమాని, స్వగ్రామమును విడిచి శ్రీరంగము ప్రవేశించెను. తొల్లి మాలాకారుఁడు శ్రీకృష్ణునకు ఒక పుష్పమాలికను సమర్పించి కృతార్థుఁడు అయ్యెను; గావున సర్వకైంకర్యములలో పుష్పకైంకర్యము భగవంతునకు ఎక్కువ ప్రీతినిఁ గలుగఁజేయునదియని నిశ్చయించి తొండరడిప్పొడియాళ్వారు శ్రీరంగమునకు దగ్గఱగా నతిరమ్యమగు నొక పుష్పోద్యానమును వేయించి పెరియాళ్వారువలె నిత్యము రంగనాథస్వామికి పుష్పకైంకర్యము చేయసాగెను. మఱియు నాతఁడు ప్రతిదినము శ్రీవైష్ణవగృహములయందు భిక్షాన్నమును సంపాదించి జీవించుచుఁ జితేంద్రియుఁడై పూఁదోఁటయందు దేవినిర్మింపఁబడిన పర్ణశా

లయందు నివసించుచు రాత్రింబగళ్లు తెలివిలేక తోఁటపనియే సేయుచుండెను.

ఇట్లుండ కావేరీనదికి ఉత్తరపుదిక్కుననున్న కరంబనూరు అను గ్రామమునందు నివసించునదియు దివ్యాంగనాంశమునఁ బుట్టినదియు నగు దేవదేవి యను నొక వేశ్య యొకనాఁడు సఖులతో చోళరాజును సేవింపఁబోయి అచ్చట నృత్యగీతాదులు ఒనరించి రాజును సభ్యులను ఆనందింపఁజేసి,మఱలివచ్చుచు మార్గాయాసమును బోఁగొట్టుకొనుటకు విప్రనారాయణునిపుష్పోద్యానమున సఖులతోఁ బ్రవేశించినల్లెడలఁదిరుగుచు తోఁటసొబగు చూచి ఆనందించుచు చల్లనిగాలి ఆవటించుచు నొక వృక్షచ్ఛాయయందు విశ్రమించెను. అప్పుడు విప్రనారాయణుఁడు ద్వాదశోర్ధ్వపుండ్రములను ధరించి నిర్మలవస్త్రధారియై కంఠమున తామర పూసలదండలను, తులసిమాలికలను దాల్చి, పూలమొక్కలకు గొప్పు త్రవ్వుచు ఉండెను. దేవదేవి ఆతనిం గాంచి మ్రొక్కెను; గాని ఆతఁడు చూచియుఁజూడనట్లు ఊరకుండెను. అది చూచి దేవదేవి తన అక్కగారిం గాంచి "అక్కా, ఇతఁడు వెఱ్ఱివాఁడా, నపుంసకుఁడా? లోకమును మోహింపఁజేయఁగలసౌందర్యవతినై యున్న నన్నుఁజూచియు నీతఁడు వికారము పొందకయున్నాఁడు. ఏల?" అని యడుగఁగా, ఆమె "నీవు తలంచునట్లు ఇతఁడు వెఱ్ఱివాఁడును, నపుంసకుఁడును గూడఁ గాఁడు. మఱేమన? మహావిరాగి రంగనాథునికైంకర్యమున అత్యాసక్తికలవాఁడు. లక్షరూపాయలు ఇచ్చినను నీదెసఁజూడఁడు. ఇతఁడు లోకములోనున్న పురుషుల వంటివాఁడు కాఁడు" అని ప్రత్యుత్తరమిచ్చెను. అందులకు దేవదేవి "వెఱ్ఱిదానా, వాతాంబుపర్ణాశనులై ఊర్ధ్వరేతస్కులై తపముసేయు యోగులుసైతము నాసౌందర్యమును జూచి మోహించి వ్రతములను విడిచిపెట్టిరి. ఇతఁడు అన నేపాటి? మనోహరమైన యిట్టి పూఁదోఁటలో నొంటరిగానున్న నవయౌవనుఁడైన యితనిని వశపరచుకొనుట యేపాటి పని?" అని మఱల పలికెను. ఇదివిని ఆమె అక్కయగు అలివేణి చెల్లెలి సాహసపుఁ బల్కులకు ఆశ్చర్యచకితయై "నిజముగా నీవు ఇతనిని లోఁబఱచుకొనఁగలిగితివేని నేను ఆఱుమాసములు నీకు దాస్యము చేసెదను" అని ప్రతినపట్టెను. అందుమీఁద దేవదేవి అక్కా, "అట్లే కానిమ్ము. చూడు నామహిమ" అని చెప్పి, తన ఆభరణములను వస్త్రములను ఇంటికిఁ

బంపి వేసి, స్నానమాడి, కాషాయాంబరము ధరించి, ఊర్ధ్వపుండ్రములనుదాల్చి, అతివినయముతో విప్రనారాయణునివద్దకు వచ్చి, సాగిలంబడి మ్రొక్కి, కన్నులనీరు నించుచు విపదంబుధియందు కూలినదానివలె దొంగయేడ్పులు ఏడ్చుచు, నతిదీనముగా నెదుటనిలువంబడెను. అంత ఆళ్వారు ఆమెను జూచి మనస్సుకరుగంగా "నీవు ఎవ్వరిదానవు? ఇచ్చటకేల వచ్చితివి? నీదైన్యమునకు కారణ మేమి? నీవృత్తాంతమును సవిస్తరముగా నెఱింగింపుము" అని ప్రశ్నించెను. అందులకు ఆమాయలాడి "స్వామీ, దేవరవారితో నాదురవస్థ యేమని విన్నవింతును! నేను ఈశ్రీరంగమునకు సమీపమున నున్న కరంబనూరులో వసించు వేశ్యను. నాపేరు దేవదేవి. లోకములో స్త్రీజన్మమే నీచమైనది. అందును వేశ్యాజన్మము మఱియు నీచమైనది. వాఁడు కురూపి, వాఁడు నిత్యరోగి అనకుండ ధనమిచ్చువానితో నెల్ల బోవుట మాకులమున ఆచారము. ఎంత సుందరుఁడైనను ధనహీనుని విడువవలెను. మనస్సునకు ఇష్టమయిన పురుషుని పొందఁ గోరినచో ధనలాభము లేదని తల్లి బాధించును; కావున ఎంతకాలము బ్రతికినను ఇట్టి నీచపు బ్రతుకేకదా యని వైరాగ్యము గలదాననై స్వగృహమును, స్వజనమును విడిచి, పరమభాగవతోత్తములగు దేవరవారు నియమించు కైంకర్యమును చేయుచు నిచట నివసించుటకు వచ్చితిని" అని బదులు చెప్పెను. తొండరడిప్పొడియాళ్వారు దానిమాటలు యథార్థములు అని నమ్మెను. పాపము దీనముగా వేఁడుచున్నది అని కనికరించెను. తోఁట పనులకు కొంచెము సాయము చేయునని ఆశపడెను. ఈనమ్మకముతోడను, ఈకనికరముతోడను, ఈఆశతోడను ఆతఁడు దానిని అంగీకరించి చేర్చుకొని నిత్యమును తాను తెచ్చుకొను భిక్షాన్నముతో దానిని పోషింపసాగెను. దేవదేవి ఆళ్వారుఆశను నిరాశను జేయక తోఁటపనులలో నాతనికి చాలసాయపడసాగెను. కొన్నిదినములకు "ఈమె నిష్కపటముగా నాకు సేవ చేయుచున్నది. దీనిని విడువఁగూడదు. ఈమెయందు రంగనికి అనుగ్రహముకలిగింపవలెను"అనిఆళ్వారుతలంచుకొనియెను.

ఒకనాఁడు సాయంకాలము ఉఱుము మెఱుములతో గాలివాన వచ్చెను. ఆళ్వారు పర్ణశాలలోఁ గూరుచుండి కాషాయాంబరమును గప్పుకొని కూర్చుండెను. అప్పుడు దేవదేవి సగము తడియుచు నాతని

కెదుట చూరుక్రింద నిలిచియుండెను. ఆళ్వారు హఠాత్తుగ నామెను గాంచి "ఏల యిచ్చటఁ దడియుచున్నావు? లోపలకు రమ్ము. నేను హరిదాసుఁడను. నీవును హరిదాసురాలవు. ఇట ఎంచవలసిన భేదమేమియు లేదు. లోనికి వచ్చి కూర్చుండుము" అని పలికెను. ఆమాటకే ఎదురుచూచుచున్న దేవదేవి సంకోచించుచున్న దానివలె తక్కుచుఁ దాఁగుచు లోనికిఁ బోయి ఆతనియెదుటఁ గూరుచుండి "స్వామీ, దేవరవారికి పాదసేవ చేయుటకు దాసురాలికి ఆజ్ఞ యొసఁగుఁడు" అని పలుకుచు పాదములమీఁదఁ జేయి వేసెను. వెంటనే ఆళ్వారుహృదయము చెడిపోయెను. దేవదేవి కరస్పర్శవలన నాతనికి అపూర్వసౌఖ్యము కలిగెను. ఇన్నిదినములనుండి శ్రీరంగనాయకుని సేవించుచున్నను ఆతనికింతటి సౌఖ్యము ఎప్పుడును కలుగలేదు. అగుట నాతఁడు దాసురాలికి సెలవు ఇచ్చెను.

ఇఁక నాసందర్భమునందలి విషయముల నన్నిటిని వివరించుటకంటె పర్యవసానమును దెల్పుట మంచిది. విప్రనారాయణుని గతి వక్రమార్గమును బట్టెను. ఆతఁడు ఇంతవఱకును బాటించిన బ్రహ్మచర్యవ్రతము బూదిలోఁ బోసిన పన్నీరు అయిపోయెను. దైవవంచితుఁడై ఆతఁడు ఆక్షణమునందే లోలుఁడై దేవదేవి పదదాసుఁడు అయ్యెను.

ఇట్లు విప్రనారాయణుఁడు దేవదేవితోఁ గూడి విషయసుఖములు అనుభవించుచు బాల్యమునుండియు అతిభక్తితోఁ జేయుచున్న కైంకర్యమును విడిచెను. స్నానసంధ్యాద్యనుష్ఠానములకునున్న జుట్టెను. పూర్వము అంతనిష్ఠాపరుఁడై జితేంద్రియుఁడై యున్న తాను ఇప్పుడిట్లు అయినందులకు లోకులు ఆక్షేపించిపోదురేమో యను సిగ్గును భయమును గూడ విడిచెను. చేతిలోని సొమ్ము అంతయు నైపోయెను. అపుడు దేవదేవి తల్లి వచ్చి—

ఉ. "అల్లుని యమ్మగారికిపు డాఁకలి గాదొకో యింటికేమియుం
జిల్లరవెచ్చసచ్చములు జీరలు నంపవు తోడివేడ్కఁ గాం
త్రెన్నను బండుగ న్దగవు లీయఁగ దాకి తలంపవీవు చేఁ
జెల్లగ రొక్కమీక ధరఁ బిల్తురె ? వారసతుల్ విటావళిన్.

సీ. నీపట్టెతిరుమణి నీతిరుచూర్ణంబుగణికకు వెండిబంగారు లౌనె?
నీపుట్టగోచియు నీకావివేష్టువ ల్వారకాంతకు పట్టుచీరలౌనె?

నీముష్టికూడదయు నీతులసీసరులు వేశ్యకు పండుగు వేట్కలౌనె?
నీవేదశాస్త్రముల్ నీసంధ్యజపములు, లంజెసానికి బంజాలగము లగునె?
గీ. పెట్టి నోపితివా యెప్పటట్లైయుండు
పెట్టలేకున్న విచ్చేయు పెందలకడ
మొదలరోయింతులకు నొక్క ముడుపె కాక
నీసదాచార మేలయ్య దాసరయ్య. (102, 103. వైజయంతీవిలాసము.)

అని నిష్ఠురము లాడి యిలు వెడలఁగొట్టెను; గాని విప్రనారాయణుఁడు దేవదేవిని విడిచి పోఁజాలక సొమ్ము నివ్వలేక విరహవేదన నొందుచు దాని యింటియరుఁగుమీఁద పండుకొని యుండెను.

ఆళ్వారు ఇట్లు దురవస్థలో నుండుట రంగనాయిక యెఱింగి "ప్రాణవల్లభా, మనకు అంతరంగభక్తుఁడైన యీతనిని మీతలఁపు మఱపించి ప్రాకృతసుఖాసక్తునిఁ గావించుట ధర్మమా? సర్వమోహకమయిన మీమాయకు ఇతనిని లక్ష్యముచేయుట మీకు తగునా?" అని భర్తతోఁ బలికెను. అందుపై రంగనాథుఁడు ఆమెమాటలు విని "ఇతఁడు వనమాలికాంశమున జనించినాఁడు. తామరాకునకు నీళ్లు అంటనట్లు ఇతని మనస్సునకు రాగమలము లెవ్వియు నంటవు. నేనొక లీల నలుపఁదలఁచియిట్లు చేసితిని. ఇంకను మఱియొక లీలఁ జేసెదఁజూడుము" అని ఆనతిచ్చి, తానొక బ్రహ్మచారి వేషముదాల్చి, కోవెలలో నున్నతన ఆరాధనపాత్రలలో నొక బంగారుగిన్నెను పట్టుకొని ఆవేశ్య నివసించు గ్రామమునకుఁ బోయి దాని యింటి తలుపుతట్టి దేవదేవి తల్లినిఁబిలిచి "నేను విప్రనారాయణుని శిష్యుఁడను. నాపేరు అళగియమణవాళదాసుఁడు. మాగురువుగారు ఈబంగారుగిన్నెను నీకు ఇమ్మని చెప్పి పంపఁగావచ్చితిని" అని పల్కెను. అది విని వేశ్యమాత దానిం గైకొని "అయ్యో! ఇది వారు ఇప్పుడే పంపవలయునా? మాకేమి కొఱఁత? వారుమాకు నిత్యము దర్శన మొసఁగి మాపిల్లను సంతోషపెట్టినఁ జాలును. నీ విపుడు పోయి వారిని శీఘ్రముగా నిచ్చటకు రమ్మనుము" అనిబదులు చెప్పెను. శిష్యుఁడు దానియింటి అరఁగుమీఁద బండుకొనియున్న విప్రనారాయణుని జూచి "అయ్యా, మిమ్ము దేవదేవి రమ్మనిచెప్పినది. అది మీకొఱకు బెంగపెట్టుకొని ఊరంతయు వెదకుచున్నది." అని చెప్పెను.

ఈమాటలకు విప్రనారాయణుఁడు పొంగి లోపలకుఁబోయి దేవదేవి దాని తల్లియుఁ జూపు అధికాదరమునకును, మాయమాటలకును ఉబ్బిపోయి దేవదేవితో మునుపటివలె సుఖముగా నుండెను.

మఱునాఁడు ప్రాతఃకాలము అర్చకులు, పరిచారకులు, కోవెల తలుపులు తెఱచి, ఆరాధనమునకుఁ బ్రారంభింపఁగా అయిదవ బంగారపుగిన్నె కాన్పింపదయ్యెను. అందుపైని వారు కోవెల అంతయు వెదకి అడుగవలసినవారిని అడిగి కానక యావృత్తాంతమును పై అధికార్లకుఁ దెలియఁజేసిరి. వారు రాజుతోఁ జెప్పఁగా రాజు ఆఅర్చకులనే దండింప సాగెను. ఆసమయమున దేవదేవిదాసి యొకతె అక్కడకు దైవికముగా వచ్చి యాఅల్లరిఁ జూచి "నిన్నరాత్రి విప్రనారాయణుఁడు ఒకబంగారుగిన్నెను దెచ్చి యిచ్చినాఁడు. మీరుపోయి వానియిల్లు శోధింపుఁడు అని చెప్పఁగా వారు ఆవృత్తాంతము రాజునకుఁ దెలియఁజేసి ఆతని ఉత్తరువు మీఁద దేవదేవియిల్లు శోధించిరి. గిన్నెదొరకెను. రాజభటులు దేవదేవితోఁగూడ విప్రనారాయణుని రాజసమ్ముఖమునకుఁ గొనితెచ్చినిలిపిరి రాజు వారి వృత్తాంతమును విచారించి ఉభయులను చెఱసాలలో నుంచెను.

అపుడు శ్రీరంగనాయిక "ఇఁక నీలీల చాలించి ఆతనిని నీకృపాపాత్రునిఁ గావింపుము" అని విన్నవించెను. అది విని స్వామి నిచుళాపురము నేలుచుండెడి రాజునకు స్వప్నమున సేవ సాదించి "ఓరాజా, విప్రనారాయణునకు ప్రారబ్ధకర్మ మనుభవింపఁజేయుటకు నేనె బంగారుగిన్నెను వేశ్యకిచ్చి ఇతనిని శిక్షించితిని. ఇతఁడు నిర్దోషి. ఈవేశ్యాధనము నాకక్కఱలేదు. దానికే ఇచ్చివేయుము. ఇతఁడు మాకు మునుపటివలె పుష్పకైంకర్యము చేయును; గావున విడుదల చేయుము" అని సెలవిచ్చెను. ఆరాజు తెల్లవాఱిన వెంటనే లేచి రంగనాథుఁడు తనకు ఆజ్ఞాపించినప్రకారము అందఱితోఁ జెప్పి ఆశ్చర్యపడి విప్రనారాయణుని రావించి నమస్కరించి బహువిధముల సత్కరించి క్షమాపణ చేసికొనెను. ఆళ్వారును తాను లోఁగడ చేసిన అకృత్యమునకు పశ్చాత్తాపపడి యెప్పటియట్ల వైరాగ్యము వహించి స్వామికి పుష్పమాలా కైంకర్యము ప్రారంభించెను.

ఇతనికి రంగనాథుఁడు "తొండరడిప్పొడి (భక్తాంఘ్రిరేణువు)" అని బిరుదనామమును బ్రసాదించెను. ఇతఁడు తిరువడి, ఇళైయపెరుమాళ్లు(లక్ష్మణస్వామి), నమ్మాళ్వారు మొదలగు వారివలె భగవత్పాదారవిందములయందు తక్క ఇతరవిషయములయందు అభిరుచిలేక యుండెను. మఱియు 'తిరుప్పళ్లియెళుచ్చి' (నిద్రను లేపుట), 'తిరుమాలై' అను రెండు ప్రబంధములను రచించి లోకము నుజ్జీవింపఁజేసెను. చిరకాలము ఈలీలావిభూతియందు ఉండి తుదకు ఈతఁడు రంగనాథుని తిరువడిని జేరెను.

దేవదేవియు జ్ఞానభక్తివైరాగ్యములు కలది యయి బంగారు గిన్నెతో తన ఆస్తినంతను శ్రీరంగనాథునకు సమర్పించి, పరమపదము నొందెను.

తిరునక్షత్రతనియు:— శ్లో. కోదండే జ్యేష్ఠనక్షత్రే మండంగుడిపురోద్భవం,
చోళోర్వ్యాం వనమాలాంశం భక్తపద్రేణు మాశ్రయే.
నిత్యతనియు.— శ్లో. తమేవ మత్వా పరవాసుదేవం రంగేశయం రాజవదర్హ-
ణీయం, ప్రాబోధకీం యోఽకృత సూక్తిమాలాం భక్తాంఘ్రిరే[illegible]ం భగ-
వంత మీడే.

---

120. తిరుమంగైయాళ్వారు.

(పరకాలుఁడు)

శ్లో. "[illegible],
ఉన్నతప్రతిమాతేభ కుంభసంభేద విభ్రమమ్.
నాదప్రసభసంత్రస్త శైవశాక్యాదిసద్గవం,
పరకాలమృగేంద్రం త్వాం ప్రపద్యేఽచ్యుతనందనమ్"

సర్వసంపత్సమృద్ధ మయిన చోళదేశమునందు బిల్వారణ్యమను మాఱుపేరుగల పరిరంభపుర మను నొకపట్టణము కలదు. దానికి సమీపమున తిరుక్కురయలూరు (కమలాపూర్ణపురము) అను గ్రామము

ఒకటి యున్నది. ఆయూరిలో శూద్రకులమున నీలుఁడను వాఁడు ఒకఁడు ఉండెను. ఇతఁడు శైవమతప్రవర్తకులలో ప్రధానుఁడు. ఇతనికి చోళదేశపురాజు తనరాజ్యములో నొక పరగణాయగు తిరువాలినాఁడు అను కొంతదేశముపై నధికారము ఇచ్చి, దానిపైకము వసూలుచేయుటకునియమించెను. ఆకారణమున నీతనికి 'తిరువాలినాడుడైయార్' అనుపేరు వచ్చెను. అతని పూర్వపుణ్యవశమున శ్రీమన్నారాయణుని పంచాయుధములలో ముఖ్యమైన శార్ఙ్గముయొక్క అంశముచేనొక

కాలంబునకార్తికశుక్లపూర్ణిమా గురువాసరమునాఁడుకృత్తికానక్షత్రమందుఒకకుమారుఁడు జనించెను. ఆపుత్రునకు తలిదండ్రులు నీలుఁడు అని పేరుపెట్టిరి. ఆకుఱ్ఱవాఁడు కాలక్రమమున భగవత్కృపచేవృద్ధినొంది, సకలశాస్త్రములయందును ధనుర్విద్యయందును, శస్త్రవిద్యయందును, రాజ్యతంత్రమునందును, అతినిపుణుఁడు అయ్యెను. ఇంతలో నతని తండ్రియగు తిరువాలినాడుడైయార్ కాలధర్మము నందెను. అతఁడు చేయుచున్న ఉద్యోగమునకు తగినవారు ఎవరైన ఉన్నారాయని ఆలోచించి చోళభూపతి ఈనీలునకు రమ్మని వార్తనంపెను ఇతఁడు పోయి రాజసందర్శనము చేయఁగా నాతఁడు యీతని శరీరసౌష్ఠవమును, ఆజానుబాహువులను, విశాలవక్షస్థలమును జూచి ఈతని శౌర్యము, ధైర్యము,పరాక్రమము మొదలగు నాత్మగుణములను పైవారు చెప్పఁగా విని, మిక్కిలి మెచ్చుకొని, ఆయుద్యోగమును ఇచ్చెను; గాని నీలుఁడు యౌవనవంతుఁడు అయినది మొదలు విషయసుఖములయందు ఆసక్తిగలవాఁడై స్త్రీలోలుఁ డయ్యెను.

ఆపరిరంభపట్టణమునకు క్రోశమాత్ర దూరమున శ్వేతహ్రాదమను నొక సరస్సు గలదు. అది నిత్యము వికసించిన తామరపువ్వులు, కలువపూవులు మొదలగువానిచే నిండి మిక్కిలి రమణీయముగా నుండును. స్వర్గమునుండి ప్రతిదినము అప్సరసల సమూహము అచ్చటకు వచ్చి, జలక్రీడ లాడుచు, పద్మములు కోయుచు, వినోదములు సలుపుచు నుండును. ఒకనాఁడు ఆ యప్సరసలతో వచ్చిన పదిసంవత్సరముల వయస్సుగల బాలికయొకతె కలువపూవులనుగోయుచు వెనుకచిక్కెను. దానివారందఱును దానిని తోడుకొనిపోవుట మఱచి తొందఱగా స్వర్గమునకుఁ బోయిరి. అంతట నాచిన్నది దివ్యరూపమునువిడిచి, మానుష

రూపమును ధరించి, ఒంటరిగా నాసరస్తీరమునందు సంచరింపసాగెను. పరిరంభ పట్టణనివాసి, వైద్యుఁడు నగు ఒకవైష్ణవుఁడు తిరువాన్గూరిలో వేంచేసియున్న స్వామిని సేవించి మఱలి వచ్చుచు దైవికముగా నాసరస్సు దగ్గఱకుఁ బోయి ఆచిన్నదానినిఁ జూచెను. అంత నాతఁడు దానిపై వాత్సల్యము కలవాఁడై "ఓపిల్లా, నీవు ఎవ్వరిదానవు? ఇచట నేకాకినినై యెందులకు తిరుగుచున్నావు?" అని అడిగెను. అందులకు ఆబాలిక తనవృత్తాంత మాతనికిఁ దెలియఁజేసి "మీయింటికి నన్ను దీసికొనిపోయినయెడల తప్పక వచ్చెద" ననెను. పిల్లలు లేని ఆవైద్యుఁడు ఆకన్యకమాటలు విని మిగుల సంతోషించి, దానిని వెంటఁ బెట్టుకొని యింటికిఁ బోయి భార్యకుఁ జూపఁగా నామెయు గొడ్రాలగుటచే బిడ్డలకొఱకు తపించుచున్నది గావున ఆచిన్నదానికి కన్నకూఁతురుకంటె నధికముగా అత్యంతప్రేమతో సంరక్షింపసాగెను. ఆదంపతులు ఆబాలికకు కుముదవల్లి యని నామకరణము చేసిరి. కొన్నాళ్లకు ఆచిన్నది శుక్లపక్షచంద్రరేఖవలె దినదినప్రవర్ధమాన యయి సంప్రాప్తయౌవన అయ్యెను ఆమెతండ్రి ఈమెను ఎవ్వరికిచ్చి వివాహము చేయుదు నని విచారింపసాగెను. ఇంతలో కొందఱు చారులు పోయి, కుముదవల్లి రూపగుణలావణ్యములను వర్ణించి చెప్పఁగా విని తిరుమంగైయాళ్వారు ఆవైద్యుని యింటికిఁ బోయి ఆచిన్నదానిని స్వయముగా చూచి ముగ్ధుఁడై తన కిమ్మని అడిగెను. ఆ దంపతులు అతనికి ఆపిల్ల నిచ్చుటకు సమ్మతించిరి; గాని యామె "పంచసంస్కారపరుఁడగు వానిని గాని ఇతరుని నేను పెండ్లియాడను. ఇది నాప్రతిజ్ఞ" అని తన నిశ్చయము తెలిపెను. ఆళ్వారు తోడనే తిరునరైయూరిలో వేంచేసియున్న నంబిసన్నిధిని పంచసంస్కారములను పొంది ద్వాదశోర్ధ్వపుండ్రములను ధరించి వచ్చెను. అది చూచి మఱల కుముదవల్లి, "దినమునకు ఒక వేయిమంది వైష్ణవులకు సాపాటు పెట్టుచు వారి పాదతీర్థము, తళిహప్రసాదము స్వీకరించుచు నొక సంవత్సరము మీరు నియమము జరిపినయెడల మిమ్ము భర్తగా నంగీకరించెదను. లేకున్న మీకోరిక సిద్ధింపదు" అనెను. ఆళ్వారు అందులకు సంతోషముతో నంగీకరించి—

శ్లో. "ఆరాధనానాం సర్వేషాం విష్ణో రారాధనంపరం,
తస్మాత్పరతరం ప్రోక్తం తదీయారాధనం నృప."

అనినట్లు అతిప్రీతితో తనకుఁ గల ధనము అంతయు భాగవతా రాధనమునకు వ్యయపఱిచి చేతిలో ధనము లేనపుడు రాజుగారి ధనముగూడ ఖర్చుపెట్టెను. చోళరాజు కొందఱివలన ఈవృత్తాంతము నెఱిఁగి "మాకు నీవు ప్రతిసంవత్సరము చెల్లింపవలసిన సొమ్ము క్రమముగా చెల్లింపలేదు. ఈఉత్తరువు చూచినవెంటనే మాకు నీవు బాకీ ఉన్న పైకమంతయు ఈమనుష్యునిద్వారా పంపవలయును" అని ఆజ్ఞ వ్రాసి భటులనంపెను. వారు రాజు నాజ్ఞచొప్పున తిరుక్కురయలూరికి వచ్చి ఆళ్వార్లచర్య లెల్లను కన్నులారఁ జూచి ఆయన ధైర్య సాహసములకు శ్రీవైష్ణవతదీయారాధనకు మిక్కిలి ఆశ్చర్యపడి నయ భయములతో "రాజధనము చెల్లింపుము. లేకున్న నీకు హాని కలుగు" నని యెన్నోవిధములఁ జెప్పిరి; గాని యాతఁడు వినక వారికి సరియైన ప్రత్యుత్తరము చెప్పక వారి నవమానించి పంపెను. వారు పోయి జరిగిన సమాచారమును రాజుతోఁ జెప్పిరి. అది విని రాజు మంచిమాటలతో నతఁడు లొంగఁడు అని నిశ్చయించి, బలిష్ఠులైన సైనికుల నిచ్చి యొక సేనాధిపతిని "తిరుమంగయాళ్వారును కాలుసేతులు విఱిచికట్టి, బలాత్కారముగా తీసికొనిరమ్ము" అని ఆజ్ఞాపించెను. అంతట సేనాధిపతి చతురంగబలముతో బయలుదేఱి వెళ్లి ముట్టడింపఁగా ఆళ్వారు తన సైన్యముతో నాతని నెదిరించి పాఱఁదోలెను. అంతట రాజు దండతాడితభుజంగమువలె గుండెపడుచు తాను స్వయముగా అఖండ సైన్యముతో భూమి గ్రక్కదల నరుదెంచి ముట్టడించెను; గాని ఆళ్వారు రాజునుగూడ నోడించెను. అంతట రాజు ఆళ్వారుతో కొంతతడవు ద్వంద్వయుద్ధము చేసి ఆతని ధైర్యసాహసపరాక్రమములకు మిక్కిలి సంతోషించి "నీతో నాకిఁక వైరము వలదు; నీవు నావిషయమునఁ జేసిన అపకారమును స్మరింపను ఇంక నాయొద్ద అనుకూలముగానుండుము. నేను దైవము సాక్షిగా చెప్పుచున్నాను" అని చెప్పి తన పట్టణమునకుఁ బోయెను. ఆళ్వారు రాజుమాటను నమ్మి, అతనియొద్దకుఁ బోఁగా "మన పైకము ఇచ్చునంతదనుక ఈతనిని విడువ వలదు" అని మంత్రికి ఆజ్ఞాపించెను. మంత్రియు ఆళ్వారును ఒక దేవాలయమున కైదుచేసెను. ఆళ్వారు ఆగుడిలో మూఁడుదినములు ఉపవాసము చేసెను. మూఁడవ నాఁటిరాత్రి సర్వేశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి, "నీవు

రాజునకు ఇవ్వవలసిన దండనద్రవ్యమును ఇచ్చెదఁ గాంచీపురమునకు రమ్ము" అని చెప్పెను. అపుడు ఈతఁడు రాజమంత్రికి ఈవార్త తెలిపి అతనితోఁ గాంచీపురమునకుఁ బోయి కరుణాకరుఁడైన వరదరాజస్వామి కృపచే ధనము ఉన్నతావు గనుఁగొని, రాజునకు బాకీయున్న ధనము చెల్లించి, శేషించిన సొమ్ముతో భగవద్భాగవతారాధనము సాగించెను. రాజమంత్రి, ఆధనమును దీసికొనివెళ్లి, రాజు నెదుట నుంచి, వరదరాజస్వామి ప్రసన్నుఁడై ఆళ్వారునకు ధనము నిచ్చిన సంగతి తెలుపఁగా రాజు, ఆశ్చర్యచకితుఁడై "ఆహా, ఆపదలో ద్రౌపదికి వస్త్రముల నిచ్చినట్లు స్వామి ఆమహానుభావునకు ధనమిచ్చె" ననుకొని, "ఆయన సామాన్యులు కారు. సర్వేశ్వరునకు అంతరంగభక్తులు. ఆయన యెడల మనము అపరాధము చేసితిమి" అని ఆళ్వారును రప్పించి, పాదములమీఁద వ్రాలి, "నాయపరాధములను క్షమింపుఁడు" అని వేఁడుకొని, బహువిధముల సత్కరించి పంపెను. మఱియు రాజు ఆళ్వారును మూఁడుదినములు పస్తు పెట్టించిన పాపము పోవుటకు ఆతని వలనఁ బుచ్చుకొనిన ధన మంతయు దేవబ్రాహ్మణసంతర్పణముకొఱకు వినియోగపఱిచెను.

కంచివరదరాజస్వామి యిచ్చిన సొమ్ముగూడ నైపోవుటచే ఆళ్వారు కొంత పరివారమును గూర్చుకొని దారులు కొట్టసాగెను. ఆళ్వారు కొన్నిదినములకు ఒక మహారణ్యము ఉనికిపట్టుగాఁ జేసికొని అర్ధరాత్రమున బయలుదేఱి, పట్టణములు, పల్లెలు, సొచ్చి, వైష్ణవులు కాని ధనవంతులయిండ్లకు కన్నములు త్రవ్వి, దోచుకొనుచు అనుదినము వైష్ణవార్చనము చేసి తప్పక కుముదవల్లికిఁ బ్రియము కూర్చుచుండెను.

ఆళ్వారు, ఒకనాఁటిరాత్రి ఆకాశము మేఘములచేఁ గప్పఁబడి గాఢాంధకారపూరితమై యుండఁగా నొకవైష్ణవుని తిరుమాళిగలోఁ జొరఁబడుటకు సమయమునకై యింటిపంచను పొంచియుండి ఆయింటి యజమానురాలు వాకిటిలో వెండిపళ్లెమును తోముచుండఁగా తటాలున దానిని గుంజుకొని పాఱిపోయెను. అందులకు ఆయిల్లాలు "అస్మద్గురుభ్యో నమః" యని లోపలికిఁ బోయి భర్తకు ఈసమాచారమును ఎఱింగించెను. అది విని ఆవైష్ణవోత్తముఁడు "మన సొత్తు సద్వని

యోగ మయ్యెను. ఇందులకు వగవకుము. పళ్లెము నెత్తుకొనిపోయిన యాతఁడు తిరుమంగై యాళ్వారు; గాని అన్యుఁడు కాఁడు. ఆతఁడు రిక్తుఁడగుటచే ఈవిధముగా ధనము ఆర్జించి, శ్రీవైష్ణవారాధనము చేయుచున్నాఁడు. నీవు ఇపుడు కేకలు పెట్టితివేని శ్రీవైష్ణవకైంకర్యమునకు భంగము చేసినదానవు అగుదువు" అని పలికెను. ఆమాటలు ఆళ్వారు విని తొందరగా ఆవైష్ణవుని యెదుటకుఁ బోయి పాదములపై వ్రాలి, "స్వామీ, ఇది శ్రీవైష్ణవుల తిరుమాళిగ యని తెలియక దాసుఁడు అపచారముచేసినాఁడు క్షమింపుఁడు"అని వేఁడుకొనియెను.

ఇట్లు ఊళ్లు దోఁచి, మార్గమునఁ బోవువారినిఁ గొట్టి, ధనము ఆర్జించి ఆళ్వారు చేయుచున్న శ్రీవైష్ణవారాధనమునకు శ్రీరంగనాథుఁడు మెచ్చి, యెట్లయిన నాతనిం గృతార్థుం జేయఁగోరి, ఒకనాఁడు ఎక్కడను ఎవ్వరును దోఁచుకొనుటకు లేకుండఁ జేసి తాను రంగనాయికయు, పెండ్లికొడుకు పెండ్లికూఁతుండ్ర వలె నలంకరించుకొని, సపరివారముగను, వాద్యములతోడను, తిరుమంగై యాళ్వారు చౌర్యమునకు కాచుకొనియున్న అరణ్యమున బయలుదేఱెను. తిరుమంగై యాళ్వారు "మూఁడు జాములు కావచ్చినది. ఇంతవఱకును ఒకబాటసారియైనను రాలేదు. ఇంటిలో సోలెఁడు బియ్యమైనను చేతిలో నొక్క దమ్మిడియైనను లేదు. రేపు కైంకర్యము జరుగు ఉపాయము తోఁచుట లేదు" అని చింతించుచు పొడుగైన చెట్టెక్కి నాలుగుదిక్కులకలయఁ జూడఁగా నొకవైపున పెండ్లివారు కాన్పించిరి. ఆళ్వారు వెంటనే చెట్టు దిగి ఈలలువేసి తనవారినందఱను ఒక్కచోటికి రప్పించి దోచుకొనుట సిద్ధముగా నుండెను. ఇంతలో నచ్చటకు పెండ్లివారు వచ్చిరి. ఆళ్వారు సెలవు పొంది పరివారమును దోఁపుడు ప్రారంభించెను. ఆళ్వారు వధూవరులచెంతకుఁ బోయి వస్త్రాభరణముల నన్నిటిని ఒలిచి పుచ్చుకొని వరుని వ్రేల నున్న యుంగరముఁ దీయఁబోయెను; గాని అదిబిగిసియుండుటచే రాదయ్యెను. అపుడు ఆళ్వారు "దీనిని పల విడువనుయును! ఇది విడుగుటకు వైష్ణవోత్తములనా పాలుపడకపోవును" అని యోచించి కిటుక్కున వరునివ్రేలు కొఱికి ఆయుంగరము లాగుకొనెను. అపుడు వరుఁడు "నన్కలియనో" అని పలికెను. ఆకారణమువలన తిరుమంగై యాళ్వారునకు "కలియన్" అను పేరు కలిగెను. అపుడు ఆళ్వారు

"ఈయుంగరము రాకుండ నీవు మంత్రము కట్టితివా?" అని యడుగఁగా వరరూపముతో నున్నరంగఁడు "ఆమంత్రమును నీకును ఉపదేశించెదను. ఇటురమ్ము" అని చేరఁబిలిచి, సర్వలోకమునకు అభయ మొసఁగు తన కరకమలము నాతనికి శిరస్సునందు ఉంచి, సకలవేదసంగ్రహమయి, బహుదుఃఖములను గలిగించు సంసారమును దొలఁగించునదియయి, ఐహికైశ్వర్యము, కైవల్యము, మోక్షము మొదలగువానిని ఒసంగునది యయి, శిష్టపరిగ్రహ యుక్తమయి, యొప్పు పెరియతిరుమంత్రమును ఉపదేశించి, ఆక్షణమునందే ఆమంత్రముచేఁ బ్రతిపాదింపఁబడిన దివ్యరూపమును ధరించి, అనంతవిష్వక్సేనాది నిత్యసూరులు, బ్రహ్మాదిదేవతలు సేవింపఁగా పెరియపిరాట్టితో గరుడవాహనారూఢుఁడై తిరుమంగైయాళ్వారునకు దర్శన మిచ్చెను. అపుడు ఆళ్వారు స్వామి దివ్యమంగళవిగ్రహమును కన్నులార సేవించి, పులకితగాత్రుఁడై మాటిమాటికి దండప్రణామములు సమర్పించుచు ఆనందసాగరమున మునిఁగి, కొంతతడవునకు "నాయపరాధమును క్షమింపుము" అని ప్రార్థించెను. మఱియు, భగవదనుగ్రహమువలనఁ గలిగిన ఆనందము లోపల పట్టక ద్రావిడప్రబంధరూపముగా పైకి వచ్చెను. తిరుమంగైయాళ్వారు రచించిన దివ్యప్రబంధములు ఆఱు—

1 పెరియతిరుమొழி (ఇందులో వీరు భరతఖండము నందున్న దివ్యదేశము లన్నిటికి స్వయముగాఁ బోయి అచ్చటచ్చట వేంచేసియున్న భగవద్విగ్రహములను సేవించి, వదేసి పాశురములతో ఆపెరుమాళ్లను కీర్తించిరి. ఇది నాలాయిర ప్రబంధములలో హెచ్చు భాషాకాఠిన్యము గల ప్రబంధము).	1084 పాశురములు.
2 తిరుక్కుఱుందాండగము (చిన్నదండకము)	20 పాశురములు.
3 తిరునెడుందాండగము (పెద్దదండకము)	30 పాశురములు.
4 తిరువెళుక్కూఱ్ఱిరుక్కై	1 పాశురము.

5 శిరియతిరుమడల్		40 పాశురములు.
6 పెరియతిరుమడల్		78 పాశురములు,
	మొత్తము	1253 పాశురములు.

శీఘ్రముగను, చిత్రముగను, మధురముగను, విస్తరముగను, కవనము చెప్పుటయందు అసాధారణశక్తియుండుటవలన ఇతనికి "చతుష్కవి" అను బిరుదు వచ్చెను.

ఇతఁడు సకలదివ్యదేశములను సంచరించుచు పెరియతిరుమొழி రచించుకాలమున "నాలుకవిప్పెరుమాళ్" (చతుష్కవిస్వామి) కలియర్ (కలిఘ్నులు), ఆలినాడర్ (తిరువాలిదేశమునకు అధిపతి), పరకాలన్ (శత్రువులకు యమునివంటి వాఁడు), మంగై వేందర్ (తిరుమంగకు రాజు) మొదలగు బిరుదులు ఉద్ఘోషించుకొనుచు చోళదేశమునకు విచ్చేయఁగా ఆకాలమందు గొప్ప ద్రావిడకవి యగు "సంబంధుఁడు" అనునాతనిశిష్యులు వచ్చి, "మాగురువుగారు ఉన్నచోట మీరు చతుష్కవిబిరుదమును వహించుట తగదు" అని పలికిరి. అపుడు ఆళ్వారు ఆతనితో వాదించుటకు ఆతఁడు ఉన్నచోటికిఁ బోయెను. ఆయూరివారు అందఱును వీరశైవులు. అచట నొకవిష్ణ్వాలయ మైనను, శ్రీవైష్ణవగృహమైనను లేదు. దగ్గఱ తిరువారాధనము లేకపోవుటచే ఈయాళ్వారునకు వాగ్విజృంభణము లేకపోయెను ఆళ్వారు ఇందులకు ఏమిసేయుదునని చింతించుచుండఁగా దైవికముగా నొక వైష్ణవస్త్రీ కాన్పించెను. ఆమె నడిగి ఒక భగవద్విగ్రహమును బుచ్చుకొని ఆతఁడు సంబంధుని యొద్దకుఁబోఁగా నాతఁడు ఒక పద్యము రచించి చదివెను. ఆకవనము సలక్షణముగా లేదని ఆళ్వారు ఆక్షేపించెను. "మీరు ఎట్లు చెప్పెదరో చూచెదను. ఒక పద్యము చేయుఁడు" అని సంబంధుఁడు కోరెను. అపుడు ఆళ్వారు,—

"ఒరుకుఱళాయిరునిలమ్ మూవడిమణ్ వేణ్డియులగనైత్తు
మీరడియాలొడుక్కి ఒన్నుం తరుగవే నామావలియై చ్చిఱైయిల్
వైత్తతాడాళన్, తాళణైవీర్ తక్కకీర్తియరుమఱైయిన్ తిరళ్నా
న్గుం వేళ్వియైందుం అంగంగళ్వై యాఱు మిశైగళేళుమ్ తెరువిల్మ
లివిళముం శిరక్కుం కాళిచ్చీరామవిణ్ణగరే శేర్మినరే"

(పెరియతిరుమొழி. ప.౧౦. తిరు. ౪.)

అను పాశురము మొదటఁగల ఒకతిరుమొళిని చదివి, దాని కొన నున్న,—

'శెంగమలత్తయనసైయమరై యోల్ కాళిచ్చీరామవిణ్ణగరేఁ,
శెంగణ్మాలై అందముత్తడవయల్ శూళావినాడఁ అరుళ్మారిఅరట్టముక్కి
యడైయూర్ శీ,యంకొంగుమలర్ కుళలియర్ వేళ్కంగై వేందఁకొత్త
వేల్వరకాలఁ, శంగముగత్తమిళ్మాలై పత్తుం వల్లాన్ తడంకడల్ శూళు
లగుక్కు తలైవర్ తామే"

(3 పది—10 పాశురము, పెరియతిరుమొళి.)

అను పాశురమును చదువఁగా విని ప్రత్యుత్తరము చెప్పుటకుఁ గాని, కవిత్వము చెప్పుటకుఁ గాని శక్తిలేనివాఁడై, సంబంధుఁడు "ఇట్టి వారు ఇంకొకరు కలరా?" అని ఆశ్చర్యపడి, "స్వామీ, 'చతుష్కవిశిఖామణి' అను బిరుదు మీకే తగును. ఇతరులకుఁ దగదు" అని శ్లాఘించి, నమస్కరించి పోయెను.

మఱికొంతకాలమునకుతిరుమంగైయాళ్వారు రంగనాథస్వామికి ప్రాకారములు, మంటపములు, గోపురములు మొదలగునవి కట్టించుటకు ఆలోచించి, "ధనము సంపాదించు ఉపాయము ఏమున్న?" దని పరిజనుల నడుగఁగా వారు, "నాగపట్టణమునందు బౌద్ధాలయములో నొక బంగారువిగ్రహ మున్నది. దానిని ఎట్లయిన మాయోపాయముచే హరించి తెచ్చి ముక్కలుగా చితుకఁగొట్టి, కరగించి, ఆబంగారము నమ్మి, ఆసొమ్ముతో పని చేయింపవచ్చు" నని చెప్పిరి. ఆళ్వారు పరిజనులు చెప్పినట్లే చేసి ప్రాకారాదులను కట్టించెను. ఇట్లు పరకాలుఁడు రంగనాథునకు శాశ్వతకైంకర్యము చేసి, కొంతకాలము శ్రీరంగమందు నివసించి, పిమ్మట తిరుక్కురుంగుడికి వేంచేసి అచ్చట నున్న నిన్నసంబి, ఇరుందనంబి, కిడంనంబి, తిరుప్పార్కడల్ నంబి, తిరుమలై నంబి అను పంచనంబులను సేవించుచు నుండి అచ్చటనే విష్ణులోక్యమును పొందెను. ఇతఁడు ఈవిభూతియందు నూటఅయిదుసంవత్సరములు వేంచేసియుండెను.

తిరునక్షత్రపుతనియ.—శ్లో. వృశ్చికే కృత్తికాజాతం చతుష్కవిశిఖామణిం,
షట్ప్రబంధకృతం శార్ఙ్గమూర్తిం కలిహ మాశ్రయే.

నిత్యతనియ.— శ్లో. కలయామి కలిధ్వంసం కవిలోకదివాకరం,
యస్య గోభిః ప్రకాశాభి రావిద్యం నిహతం తమః.

---

121. నమ్మాళ్వారు.

(శఠకోపులు)

122. మధురకవియాళ్వారు.

శ్లో. "హస్తస్థనాశద్వితయం ప్రపద్యే, [illegible]గినాగార్భ్యసముదారకీర్తిం,
మాధుర్యసంశ్లిష్టకవిత్వయుక్తం, మహాత్మసంభావితబుద్ధిభక్తమ్."

పాండ్యదేశమందు ఉన్న కురుకానగరమునకు పశ్చిమమున కోసుదూరమున కోళూరు అను దివ్యదేశము కలదు. ఆయూరిలో సామశాఖీయుఁడగు నొక పురశ్చార బ్రాహ్మణుఁడు ఉండెను. అతఁడు మహావిద్వాంసుఁడు; భగవద్భక్తుఁడు. అతని పేరు నారాయణుఁడు. అతని పూర్వపుణ్యవశమున శ్రీసేనమొదలియాళ్వారి గణాధిపతులలో నొకఁడగు కుముదుఁడనువాని అంశమున ఈశ్వరసంవత్సరచైత్రశుక్లచతుర్దశీ శుక్రవారమునాఁడు నొక కుమారుఁడు జనించెను. అతనికి తలిదండ్రులు మధురకవి యని పేరుపెట్టిరి. అతఁడు బాల్యమందు వేదవేదాంగముల నభ్యసించి, మహాభక్తుఁడై తీర్థయాత్రాటనము చేయసాగెను. అష్టాంగయోగనిరతుఁడై కొంతకాలము బదరికాశ్రమమందు తపస్సు చేసెను. అతని యవతారము వకుళాభరణ (నమ్మాళ్వారు) భాస్కరోదయమునకు అరుణోదయము వంటిది. ఇట్లు మధురకవి నిరంతరము దివ్యదేశసందర్శనకుతూహలుఁడై తిరుగుచుండెను.

నమ్మాళ్వారు అవతారము.

శ్రీవైకుంఠమందు లక్ష్మీసమేతుఁడై వేంచేసియున్న శ్రీమన్నారాయణుఁడు ఒకకాలమందు తన యెదుట బద్ధాంజలియై నిలువఁబడియున్న

అనంతుని కటాక్షించి భూలోకమందు అనాదికర్మవాసనాపరవశులై జననమరణాదిదుఃఖముల నొంది బాధపడుచున్న జీవాత్మలను ఉద్ధరించుటకు తిరుక్కురుగూరను దివ్యదేశమునందు ఈ విష్వక్సేనుని అవతరింపఁ జేయఁబోవుచున్నాను; గనుక నీవు ముందుగాఁబోయి ఆతిరుక్కురుగూరిలో నొకచింతచెట్టుగాఁ బుట్టియుండుము" అని ఆజ్ఞాపించెను. అనంతుఁడు శ్రియఃపతి ఆజ్ఞను శిరసావహించి, తత్క్షణమే భూలోకమునకు వచ్చి మధురకవియాళ్వారు అవతరించిన సంవత్సరమునందే చైత్రమాసమున పాండ్యదేశమధ్యస్థమగు తామ్రపర్ణీనదీతీరమందు ఉన్న కురుగూరిలో భగవంతుని అర్చావతారమూర్తియగు ఆదిప్పిరాణ్ (ఆదినాథుఁడు) సన్నిధికి ఉత్తరభాగమందు నిద్రతింత్రిణీ (రాత్రి ఆకులు ముడువని చింతచెట్టు) రూపముతో నవతరించి చూచువారికి సుందరముగాఁ బెరుగుచుండెను.

సర్వసంపదలతో నిండిన తిరుక్కురుగూరిలో నాకాలమందు ధనాఢ్యుఁడు, దాత, భాగవతాగ్రగణ్యుఁడు, పరమధార్మికుఁడు నగు విభూతినాథేంద్రుఁడు అను నొక ఉత్తమశూద్రుఁడు ఉండెను. ఆతని కుమారుఁడు ధర్మధను డనువాఁడు. ఆ ధర్మధనునకు చక్రపాణి అను పుత్రుఁడు పుట్టెను. వాని కొడుకు అచ్యుతుఁడు. వానికి పోత్కారి అనువాఁడు జనించెను. పోత్కారికి కారి అనువాఁడు పుత్రుఁడు. కారికి యౌవనము నిండఁగా పోత్కారి, తనగ్రామమునకు కొంతదూరమందు ఉన్న పరిశారము అను విష్ణుస్థలమునకుఁబోయి అచట తుల్యాభిజాత్యముకల వంశమందు పుట్టిన ఉడయనంగి అను నొక పడుచును తనకుమారునకు పెండ్లిచేసెను. కారి, భార్యతోఁ గూడ కొంతకాలము అత్తవారియింట నుండి, కురుకానగరమునకు తిరిగి వచ్చుటలో మార్గమధ్యమునందున్న తిరుక్కురుంగుడికిఁ బోయి అచ్చట వేంచేసియున్న తిరుక్కురుంగుడినంబి అను అర్చామూర్తిని సేవించి, "స్వామీ, నాకొకపుత్రుఁడు పుట్టునట్లు కటాక్షింపు" మని ప్రార్థించెను. అందులకు ఆస్వామి, ప్రసన్నుఁడై "నేనే నీగర్భమందు అవతరించెద" నని చెప్పెను. కారి మహానందభరితుఁడై స్వామిచెంత సెలవు గైకొని భార్యతోఁ దిరుక్కురుగూరు ప్రవేశించి, గృహస్థసౌఖ్యమును అనుభవించుచుండెను.

ఇట్లు కొంతకాలము గడచిన పిమ్మట కారి భార్య యగు ఉడయ నంగ భగవదంశ తన గర్భమందు ప్రవేశింపఁగా గర్భవతి యయి, పది మాసములు మోసి, ప్రమాదిసంవత్సరవైశాఖశుక్లపూర్ణిమాదినమున విశాఖానక్షత్రమందు ఒక శిశువును గాంచెను. కారి, సుపుత్రజనన వార్తను విని, ఆనందపరవశుఁడై స్నానము చేసి, బ్రాహ్మణోత్తములకు గోభూహిరణ్యాదిదానముల నొసంగి, శిశువునకు విధ్యుక్తముగా జాతకర్మాదుల నొనరించి, మారుఁడు అని నామకరణము చేసెను.

ఇట్లు జనించిన శిశువు బాలసూర్యునివలెఁ బ్రకాశించుచున్నను లోకములోని పిల్లలవలె కన్నులు తెఱచి చూచుట, నోరు తెఱచి యేడ్చుట, స్తన్యపానము చేయుట, కాలుసేతులు కదలించుట మొదలగున విలేక మొల్లప్పుడును, యోగాభ్యాసపరుఁడై భగవద్గుణానుభవము సేయుచుండు మహాయోగివలె కనఁబడసాగెను. ఇట్టి స్థితిలో నున్న శిశువును జూచి తల్లి తత్త్వము తెలిసికొనలేక ఉత్సాహభంగమును పొంది దుఃఖించుచు ఈవృత్తాంతమును భర్తకు తెలియఁజేసెను. అంతట కారి వచ్చి చిత్తరువులో నున్నబొమ్మవలె నిశ్చలుఁడై యున్న పుత్రునిఁ జూచి ఆతని దేహమందున్న అప్రాకృతదివ్యతేజస్సును గ్రహించి, ఈపిల్లఁడు భగవదంశసంభూతుఁడుగాని సామాన్యుఁడు కాఁడని యెంచి, సమయోచితములైన మాటలతో భార్యకు దుఃఖోపశమనము చేసి కొలువుకూటమునకుఁ బోయి తనపుత్రుని అద్భుతచరిత్రమును గూర్చి మంత్రులతో ఆలోచించెను. వారు "సర్వజ్ఞుఁడు సర్వశక్తుఁడు నగు ఆసర్వేశ్వరునకే యీశిశుతత్త్వము తెలియఁగలయును. మనుష్యులమైన మనకు తెలియ శక్యముకాదు; కావున నీబిడ్డని యెత్తుకొనిపోయి ఆదినాథుని సన్నిధిలో నుంచి ప్రార్థించిన యెడల నిజము బయలుపడును" అని చెప్పిరి. అంతట కారియు భార్యయు ఆపిల్లవానిని ఉయ్యాలలో నుంచి మోసికొనిపోయి ఆదినాథుని సన్నిధిలో నుంచిరి. అపుడు తల్లిదండ్రులు దగ్గఱ నున్నవారును అత్యాశ్చర్యము నొందునట్లు ఆపిల్లవాఁడు ఉయ్యాలనుండి క్రిందికి దిగి మెల్లఁగా ప్రాకుచు ఆస్వామి కోవెలకు ఉత్తరభాగమున పెరుగుచున్న చింతచెట్టు క్రిందికిఁ బోయి పద్మాసనమునఁ గూరుచుండి కన్నులు మూసికొని యోగము చేయుట ప్రారంభించెను. అపుడు అచ్చటివారు అందఱును "ఇతఁడు భగవంతుఁడు" అని నిశ్చయించిరి.

'సుజ్ఞానఘనపూర్ణత్వాత్ త్రింత్రిణీమూలసంశ్రయః, బాల ఆషోడశాబ్దాత్తు మూకభావం గమిష్యతి' అన్నట్లు ఆచింతచెట్టుక్రిందనే కూర్చుండి పదునాఱువత్సరములు యోగనిష్ఠుఁడై యుండి ఆళ్వారు కన్ను తెఱచెను; గాని యెవ్వరిదెసకును జూడలేదు. ఎవ్వరితోడను మాటాడలేదు.

పైని చెప్పఁబడిన మధురకవియాళ్వారు తీర్థయాత్ర చేయుచు పోయిపోయి తిరువయోధ్యఁ జేరెను. అచ్చట స్వామిసేవ చేయుచున్న సమయములో నొకనాఁటిరాత్రి జలశంకానివృత్తికొఱకు పైకివచ్చి ఆళ్వారు దక్షిణపువైపున నొక అప్రాకృతదివ్యతేజస్సును జూచెను. అతఁడు 'ఈతేజస్సు ఏమైయుండవచ్చును? ఎచ్చటనైన గ్రామములు దహింపఁబడుచున్నవా! లేక వనాగ్నియా!' అని తనలో తాను బహుభంగుల చర్చించుకొని, ఆరాత్రి నిద్రించెను. రెండుమూఁడు దినములు యథాపూర్వకముగా రాత్రులయందే ఆ తేజస్సు మఱలఁ గాన్పింపఁగా ఆళ్వారు 'ఇది అప్రాకృతదివ్యతేజస్సు; గాని ప్రాకృతతేజము కాదు. దీని కారణమును నేను పరీక్షించెదను' అని నిశ్చయించుకొని పగలంతయు నిద్రించి రాత్రులయందు ఆ తేజస్సు కాన్పించు దిక్కునకు అభిముఖముగా నదులు, పర్వతములు, అరణ్యములు మున్నగువానిని లెక్కసేయక ప్రయాణము సేయుచు మార్గమధ్యమందు తారసిల్లు పుణ్యక్షేత్రములను శోధించుచు నడచినడచి కొన్నాళ్లకు తిరుపతికి వచ్చి చేరి, అచ్చట శ్రీవేంకటేశుని సేవించి, ఎప్పటివలె రాత్రులయందు ఆ దివ్యతేజస్సును జూచుచు శ్రీరంగము చేరెను. అతఁడు, శ్రీరంగనాథుని సేవించి అచ్చటనుండి మఱల బయలుదేఱి నడుమనడుమ దివ్యదేశములను సేవించుచు క్రమముగా తామ్రపర్ణితీరము చేరి, శ్రీవైకుంఠము అనఁబడు దివ్యదేశమునందున్న స్వామిని సేవించి, ఆనదికి దక్షిణదిక్కుననుండు తిరుక్కురుగూరు సమీపింపఁగా అంతకు పూర్వము కానవచ్చుచుండు ఆదివ్యతేజస్సు కానరాదయ్యెను. అంతట మధురకవి, నిదానించి నాలుగుదిక్కులు చూచి, తిరుక్కురుగూరిలో వేంచేసియుండు ఆ ...గాకోవెలనుండి ఆ తేజస్సు బయలుదేఱుచున్నదని ఊహించి, బోయి ఆ పెరుమాళ్లను సేవించి, కోవెలకు ప్రదక్షిణముగా చింతచెట్టుక్రింద సూర్యసమాన తేజస్సుతో ప్రకాశించు

చున్న నమ్మాళ్వారు సాక్షాత్కరించెను. అపుడు మధురకవి అచ్చట గుమిగూడియున్న జనులను జూచి, ఇదేమి వింత? అని అడుగఁగా కారియు, ఆతని భార్యయు ఆళ్వారు వృత్తాంతమును సవిస్తరముగాఁ జెప్పిరి. అది విని మధురకవి, పరమానందభరితుఁడై ఆనందబాష్పములు కన్నులవెంబడి స్రవింపఁగా పులకితమైన దేహముతో ఆళ్వారు సమీపమునకుఁ బోయి, సాష్టాంగదండప్రణామము లాచరించి, 'వీరికి చైతన్యము కలదా. వినుటకు చెవులు ఉన్నవా!' అని పరీక్షించుటకు ఒక గుండురాతిని ఆతని యెదుట పెద్దచప్పుడు అగునట్లు దొర్లించెను. నమ్మాళ్వారు అపుడు ఆధ్వని చైతన్యము విని కన్నులు తెఱచి చూచెను. **అంతట** మధురకవి 'వీరికి ఉన్నదో లేదో' అని సందేహించి—

'శెత్తత్తిన్ వయిత్తిలే శిఱియదు పిఱందాల్, ఎత్తైత్తిన్ఱు ఎంగే కిడక్కుమ్' అని ప్రశ్నించెను. దీనికి అర్థము. శెత్తత్తు=అచిత్తుయొక్క, వయిత్తిలే=కడుపులో, శిఱియదు=చిన్నది, పిఱందాల్=పుట్టినయెడల, ఎత్తైత్తిన్ఱు=దేనిని తిని, ఎంగేకిడక్కుమ్=ఎక్కడ నుండును? అనఁగా: అచిత్తు దేహము, దానియందు పుట్టిన చిన్నవస్తువు, అణుపరిమాణము గు ఆత్మ; దేహమందుండు ఆత్మ, దేనిని తిని ఎక్కడ నుండును? అందులకు ఆళ్వారు 'అత్తైత్తిన్ఱు అంగే కిడక్కుమ్' దానిని తిని అక్కడనే పడియుండును. అని ప్రత్యుత్తరము ఇచ్చెను. అనఁగా 'శరీరగతములైన సుఖదుఃఖములు అనుభవించుచు శరీరముననే ఆశ్రయించియుండును' అని అర్థము.

అందులకు మధురకవి మిక్కిలి ఆనందించి, 'అడిగినదానికి సరియైన ప్రత్యుత్తరము చెప్పెను. వీరు మనుష్యమాత్రులు కారు. చేతనుల నుద్ధరించుటకు పరమపదమునుండి వచ్చిన పరమపురుషుఁడు' అని నిశ్చయించుకొని, పలుమారులు సాగిలఁబడి దండప్రణామములు సమర్పించి చేతులు జోడించుకొని నిలిచి—

శ్లో. "పద్మాసనోపవిష్టం వరపదయుగళనివిష్టచైతన్యం,
పరతత్త్వబోధముద్రం పరమాచార్యం పరాంకుశం వందే."

అని బహుభంగుల వినుతించి, ఆతని తిరువడిగళ్లు అ…
సకలకైంకర్యముల నాచరించుచు తదేకానుభవతత్పర…

ఆసమయమందు వైకుంఠనివాసియగు శ్రీమన్నారాయణుఁడు శంఖచక్రాదిదివ్యాయుధోపేతుఁడై లక్ష్మీసమేతుఁడై గరుడవాహనారూఢుఁడై యేతెంచి సేవ సాదించి, తన స్వరూపగుణవిభూతిచేష్టితములను గనుపఱిచి, వాని ననుభవించుటకు దివ్యజ్ఞానము నిచ్చెను. అంతట ఆపరాంకుశయోగి, సర్వేశ్వరుని దివ్యాత్మస్వరూపమును దానిఁ బ్రకాశింపఁజేయు దివ్యమంగళవిగ్రహమును కల్యాణగుణములను అనుభవించి తదనుభవజనితప్రీతి లోపల నిముడక పైకి పొంగెనో అన్నట్లు ఋగ్యజురథర్వణసారభూతములగు 'తిరువిరుత్తము' 'తిరువాశిరియము' 'తిరువందాది' అను మూఁడు ప్రబంధములను సామవేదసారమైన 'తిరువాయిమొழி' అను ప్రబంధమును రచించి అనన్యప్రపన్నుఁడగు మధురకవియాళ్వారు మొదలగువారికి అర్థానుభవపూర్వకముగా నుపదేశించి సకలచేతనులనుజ్జీవింపఁ జేసెను. అది మొదలు వైకుంఠమునుండి అనంతగరుడవిష్వక్సేనాదినిత్యసూరులు బ్రహ్మాది దేవతలు, సనకసనందనాదిదివ్యర్షులు తింత్రిణీవృక్షముకడకు ఏతెంచి మహాప్రభావసంపన్నుఁడు పరభక్తిపరజ్ఞానపరమభక్తిసంపన్నుఁడు, ప్రపన్నజనకూటస్థుఁడు నగు పరాంకుశమునీంద్రుని దర్శించి, సామగానసరూపమగు తిరువాయిమొழிని వినుచుండెడివారు. మధురకవిసూరి 'కణ్ణినుణ్ శిఱుత్తాంబు' అను నొక దివ్యప్రబంధమును పరాంకుశయోగివిషయమున రచియించి యమ్మహాత్ముని ప్రభావంబును చరమపర్వనిష్ఠులగు సాత్త్వికులకుఁ దెలియఁజేసి అర్చారూపమగు అతని విగ్రహమును కురుకాపురియందు ప్రతిష్ఠించి కొఱంతలేవియు లేకుండ ఉత్సవములు జరుపుచు తద్బిరుదాంకితగాథలం బాగడుచు విజయకాహళము లూఁదింపఁగా ద్రవిడకవీశ్వరుఁడు అగు కంబనాథునిశిష్యుఁడు ఒకఁడు వచ్చి "మాగురువు కంబకవీశ్వరుని మీ వకుళాభరణుఁడు జయించినఁగాని ... వీరకాహళములు ఊఁదింపఁ గూడ" దని నిరోధించెను. అందులకు మధురకవి నీవిట్లు పలుకుట న్యాయమైనను మాశఠగోపకవీంద్రులు ఈపుస్తకమును విడిచి ఎక్కడకును వచ్చువారు కారు. అమ్మహాత్ములు రచించిన దివ్యప్రబంధములలోని
దిప్పి ... పాశురమును గొనిపోయి మీశంఖఫలకమందు ఉంపుము. ఆఫల
అచ్చుటకుఁ ... శురమును వహించెనేని అస్మదాచార్యులు అక్కడకువచ్చి
వచ్చునట్లు ... యించినట్లు అగును." అని చెప్పి:—

"కణ్ణిన్ కచ్ఛివిత్తై, నణ్ణిం మనమ్ముడైయార్,
ఎణ్ణుం తిరునామన్, తిణ్ణం నారణమే"

అను పాశురమును ఎత్తి ఒక పత్రముమీఁద వ్రాసి యిచ్చిన వాఁడు అది పట్టుకొనిపోయి, తన గురువునకు ఈవృత్తాంతమును దెలిపి ఆపాశురము వ్రాసిన పత్రమును శంఖఫలకముమీఁదనుంచఁగా దక్షిణ మధురావాసులగు మూఁడువందల ద్రావిడపండితులు కంబకవీంద్రునితో ఆశంఖఫలకం బెక్కిరి. అపుడు వాగ్దేవతాధిష్ఠిత మగుఆశంఖఫలకము నమ్మాళ్వారుపాశురము వ్రాసియున్న తాళపత్రమును మాత్రము వహించి, తక్కినవారి నందఱను గ్రిందఁబడునట్లు చేసెను. అగుట కంబకవి మిక్కిలి భీతిల్లి నమ్మాళ్వారును, తన మనస్సులో ధ్యానించుచు ఇట్లు నుతించెను.

"ఈ యాడువతో కరుడ ర్కిదగ, యిరవిక్కిదిర్ మిన్మిని యాడువదో
నా యాడువతో పురుముప్పులిముడ్, నరకేసరియు న్నడై యాడువదో
పే యాడువతో నచ్ఛగూర్వశియుడ్, పెరుమా నడిశేర్ వకుళాపరణన్
ఒరాయిరమామఱైయిన్ తమిళ్, లొరుశొల్ పొఱువోవులకిల్ కవియే."

"గరుడునకు, ఈఁగకును; సూర్యునకు, మెఱుఁగుడుపురుగునకును; కుక్కకు, పులికిని; నక్కకు, సింహమునకును; సుందరియైన ఊర్వశికి, దయ్యమునకును ఎంత అంతరమున్నదో లోకములోని కవులకవిత్వమునకును, వేదమును ద్రావిడభాషారూపముగా రచించిన నమ్మాళ్వారుకవిత్వమునకును, అంత అంతరమున్నది."

మధురకవి, నమ్మాళ్వారు సాధించిన దివ్యప్రబంధములయందు ఉండు వేదాంతసారార్థమును స్వయముగా ననుభవించి, ఆనందము నొందుచు పరులకు ఉపదేశించుచు, రాత్రింబవళ్లు ఎడతెగక నమ్మాళ్వారుల చరణారవిందములను ఆరాధించుచు నుండెను. కురుగూరిలో వేంచేసియున్న ఆదిప్పిరాన్ (ఆదినాథస్వామి) ప్రసాదించిన పొగడపూదండ ధరించుటచే వకులాభరణుఁడు అనియు, పరమతములనునిరసించుటచే పరాంకుశుఁడు అనియు, శత్రులను మఱుగుపఱుచుటచే శఠగోపుఁడు అనియు, నమ్మాళ్వారునకు నామములు కలిగెను. ఆతఁడు, తల్లిదండ్రులగు ఉభయనంగకును కారికిని పరమపదము అనుగ్రహించి, మధురకవితో, భగవద్గుణానుభవముచేయుచుకొంతకాలమ్ము తత్ప్రభూతి

యందు ఉండి, మఱికొంతకాలమునకు ఆతఁడు, "ఈ దేహబంధమును బాపి మోక్షము ననుగ్రహింపు"మని సర్వేశ్వరుని ప్రార్థించి, ఆతనికటాక్షమువలన పరమపదమునకు వేంచేసెను. మధురకవియాళ్వారును, నమ్మాళ్వారి దివ్యప్రబంధములను లోకమున వ్యాపింపఁజేసి, పిమ్మట మఱికొంతకాలమునకు పరమపదము నలంకరించెను.

నమ్మాళ్వారి తిరునక్షత్రపుతనియ—శ్లో. వృషభేతు విశాఖాయాం కురుకాపురికారిజం,
పాండ్యదేశే కలేరాదౌ శఠారిం సైన్యపం భజే.

నిత్యతనియ:—శ్లో. మాతాపితాయువతయ స్తనయా విభూతి
స్సర్వం యదేవ నియమేన మదన్వయానాం,
ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామం
శ్రీమ త్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా.

మధురకవియాళ్వారి తిరునక్షత్రపు తనియ—
శ్లో. మేషే చిత్రాసముద్భూతం పాండ్యదేశే గిరాంశజం,
శ్రీపరాంకుశసద్భక్తం మధురకవి మాశ్రయే.

---

123. యామునాచార్యులు.

చోళదేశమందు వీరనారాయణపురమను నొకగ్రామము కలదు. నాథముని అను నొక వైష్ణవోత్తముఁడు అచ్చట వేంచేసియుండెను. ఆతని కుమారుఁడు ఈశ్వరముని. ఈశ్వరమునికి ధాతసంవత్సర ఆషాఢ శుక్లపూర్ణిమాబుధవాసరమున, ఉత్తరాషాఢానక్షత్రమునందు పరమపదనాథుని సింహాసనాంశమున నొక కుమారుఁడు జనించెను. తండ్రి కుమారునకు చేయవలసిన సంస్కారములు అన్నియుఁ జేసి, తన తండ్రియాజ్ఞచొప్పున "యమునైత్తురైయవర్" (యామునాచార్యుఁడు) అని నామకరణము చేసెను. క్రమముగా పెరుగుచున్న యామునాచార్యునకు కాలము తప్పకుండ తండ్రి, అన్నప్రాశనము, చౌలము, ఉపనయనమ్ము జేసి, ఆకాలమందు మహాపండితుఁడై యున్న మహాభాష్యభట్టగారియొద్దకు వేదశాస్త్రాధ్యయనము చేయుటకు పంపెను.

ఈతఁడు అతిసూక్ష్మబుద్ధి కలవాఁడు. ఏకసంథాగ్రాహి. గురువు ఒక దినమునందు తనకు పాఠముచెప్పిన గ్రంథమునంతయును మఱునాఁడు ఒప్పఁజెప్పఁగల ధారణగలవాఁడు. అది చూచి ఆగురువు మిక్కిలి ఆశ్చర్యపడెను. ఇతరబాలకులు ఒకసంవత్సరములో నేర్వఁగలవిద్య, నీతఁడు ఒక మాసమునందు నేర్చెను. ఇట్లు యామునాచార్యుఁడు పదిసంవత్సరముల ప్రాయమునకు లోపున సకలశాస్త్రములయందును అతినిపుణుఁడు అయ్యెను. పిమ్మట కొన్నినాళ్లకు ఆచోళదేశము నేలు రాజుయొక్క పురోహితుఁడగు ఆక్కియాళ్వాన్ అను నొక బ్రాహ్మణుఁడు ఆకాలమందున్న పండితులనందఱను శాస్త్రవాదమునజయించి, విద్వజ్జనకోలాహలుఁడు అను బిరుదమును పొంది, తనచే జయింపఁబడిన స్వదేశపుపండితులవలన కప్పము పుచ్చుకొనుటకు రాజువలన అధికారపత్రమును పొందెను. ఒకనాఁడు అతఁడు యామునాచార్యుని గురువు అగు ఆక్కియాళ్వాను తనకు ప్రతిసంవత్సరము ఈయవలసిన అరియప్పన మీయవలయు నని ఒక యుత్తరము వ్రాసి, భటునిచేతికి ఇచ్చిపంపెను. అదిచూచి యామునార్యుని గురువు దరిద్రుఁడు అగుటచే ఆసమయమునందు ధనము ఈయఁజాలక దైన్యము నొందెను. అప్పుడు యామునాచార్యుఁడు తనగురువుదుర్దశకు మిగుల చింత నొంది ఆభటుని చేతి చీటి నందుకొని, పదిముక్కలుగా చింపి పాఱవేసి, మఱియొకపత్రముమీఁద—

శ్లో. "నపుంసకం కవయస్తు కేవలం న పుమాం నలులింత్రవాంగాం,
అపి తు ప్రతివాదిమస్తక ప్రకటాటోపవిపాటనక్షమాః."

అని యొకశ్లోకము వ్రాసి, ఆదూతచేతికి ఇచ్చి పంపెను. రాజపురోహితుఁడు అగు ఆక్కియాళ్వాన్ జరిగిన వృత్తాంత మంతయు దూతవలన నెఱింగి, ఆశ్లోకార్థమును రాజునకు వివరించి, తనతో వాదించుటకు యామునాచార్యుని రప్పింపవలసిన దని కోరెను. దానిమీఁద రాజు, మహావిద్వాంసుల గౌరవమునకు తగిన ఒక పల్లకిని తన ఉద్యోగులచే పంపి, యామునార్యుని రమ్మని ప్రార్థించెను. అందులకు అంగీకరించి యామునాచార్యుఁడు, ఆపల్లకి నెక్కి, రాజసన్నిధికిఁ బోయి—

శ్లో. "ఆశైలా దద్రికన్యాచరణకిసలయన్యాసధన్యోపకంఠా
దారక్షోనీతసీతాముఖకమలసముల్లాసహేతోశ్చ సేతోః,
ఆ చ ప్రాచ్యప్రతీచ్యక్షితిధరయుగలా దర్కసోమావతంసా
న్మీమాంసాశాస్త్రయుగ్మశ్రమవిమలమనా మృగ్యతాం మాదృశోఽన్యః."

అను బిరుదశ్లోకమును చదివెను. అది విని ఆక్కియాళ్వాను మిక్కిలి అసహనముకలవాఁడై యామునాచార్యునితో వాదించుటకు సిద్ధపడెను.

ఆసమయమందు భగవద్భాగవతభక్తిగల రాజభార్య వాదోన్ముఖులయిన పండితుల నిద్దఱను గాంచి భర్తను బిలిచి, "ప్రాణవల్లభా, వీరిరువురలో నెవరు వాదమున గెలుతురో చెప్పఁగలరా?" అని యడిగెను. రాజు పురోహితుఁడు గెల్చుననియెను. రాణి బాలుఁడు అగు యామునాచార్యుఁడు గెలుచు ననెను. "అట్లయిన నేను నీకు అర్ధరాజ్యమును ఇచ్చెదను; లేకున్న నీవు నాఆజ్ఞకు లోఁబడి యుండవలెను." అనియెను. రాణి అంగీకరించెను.

అపుడు రాజపురోహితుఁడు యామునాచార్యునిఁ జూచి "నీవు విద్వాంసుఁడవైనను బాలుఁడవు. నాతో వాదించుటకు తగిన శక్తి గలవాఁడవు కావు; గావున నీకుఁ దోఁచిన మూఁడులౌకికవాక్యములను బలుకుము. నేను వానిని ఖండించెదను. లేకున్న నేను పలికెదను. నీవు ఖండింపుము. జయించినవాఁడు వీఁగిపోయినవానితలను పాదముతో తన్నవలయును" అని పలికెను. యామునాచార్యుఁడు ఈప్రతిజ్ఞకు అంగీకరించి —

"నీతల్లి గొడ్రాలు కాదు"
"ఈరాజు సార్వభౌముఁడు"
"రాజమహిషి పతివ్రత"

అని మూఁడు వాక్యములను పలికెను.

అప్పలుకులనువిని రాజపురోహితుఁడు ప్రత్యుత్తరముచెప్పుటకు ఏమియు తోఁచక తలవంచుకొని మూఁగవానివలె నూరకుండెను. అంతట రాజమహిషి బాలుఁడైనను యామునాచార్యునియుక్తిచాతుర్యమునకు మిక్కిలి సంతసిల్లి, దిగ్గున లేచి వచ్చి, గ్రుచ్చి కౌఁగిలించుకొని ముద్దాడి "నమ్మైఆళ వందీరో"(మమ్మేలుకొనుటకు వచ్చితివా?) అని పలి

కెను. ఆకారణమువలన ఆతనికి ఆళవందార్ (రక్షాగతుఁడు) అని పేరు వచ్చెను. యామునాచార్యుని అసాధారణబుద్ధిచాతుర్యమునకు మెచ్చుకొనిన రాజు వివాదసమయమునందు యామునాచార్యుఁడు గెల్చినచో భార్యకు ఇచ్చెద ననిన అర్ధరాజ్యమును భార్య ప్రార్థనమీఁద యామునాచార్యునకు ఇచ్చెను. దైవకృపచే నీవిధమున యామునాచార్యుఁడు రాజ్యపదము నొందెను. ఇంతలో నాతని తండ్రియగు ఈశ్వరముని పరమపదము నలంకరించెను. ఇతనికి నలుగురు పుత్త్రులు పుట్టిరి.

యామునాచార్యుఁడు ఇట్లు రాజ్యపదస్థుఁడై సకలభోగముల ననుభవించుచుండఁగా ఇతని తాతగారి శిష్యుఁడగు మణక్కాల్‌నంబి (శ్రీరామమిశ్రుఁడు) అనువైష్ణవోత్తముఁడు ఒకఁడు ఆతనివృత్తాంతమును విని సంతోషించి, "ఈమహానుభావుఁడు ఇంత పండితుఁడై యున్నను విశిష్టాద్వైతసిద్ధాంతస్థాపకుఁడుగా నుండుట మాని కేవలము రాజ్యభోగములయందు ఆసక్తికలవాఁడై యున్నాఁడు. ఇది ప్రాజ్ఞునకు తగదు. పరమార్థమందు బుద్ధి పుట్టింపవలయు" నని ఆలోచించి ఒకనాఁడు ఆతనినిఁ జూడఁబోయెను; గాని ద్వారపాలకులు లోనికిఁబోనీయరైరి. అంతట ఆతఁడు యామునాచార్యుని దర్శన మెట్లు అగును? అని చింతించి ఏమియు తోఁచక తుదకు వంటవానితో స్నేహము చేసి, దినదినము ఉస్తికూర తెచ్చి ఈయసాగెను. వంటవాఁడు దానిని జాగ్రత్తగా వండి వడ్డింపఁగా యామునాచార్యుఁడు అత్యాదరముతో దానిని భక్షింపసాగెను.

ఇట్లు ఆఱుమాసములు గడచెను; గాని శ్రీరామమిశ్రుని కోరిక నెఱవేఱలేదు ఆతఁడు ఆలోచించి నాలుగుదినములు ఆకూర నిచ్చుట మానివేసెను. యామునాచార్యుఁడు ఆకూరరుచి మఱచెను; గావున "నేఁడేల వండవైతివి?" అని యొకనాఁడు అడుగఁగా వంటలవాఁడు "ఎవ్వఁడో యొకవృద్ధవైష్ణవుఁడు ఇన్నిదినములు ఇచ్చుచుండెడివాఁడు. ఏమి కారణముననో నాలుగుదినములనుండి తెచ్చి యిచ్చుటలేదు" అనిబదులు చెప్పెను. "ఈసారి ఆతఁడు వచ్చినచో నాచెంతకుఁ గొనిరమ్ము" అని యామునాచార్యుఁడు చెప్పెను. "ఈపాటికి నా ప్రశంస వచ్చియుండును" అని భావించి శ్రీరామమిశ్రుఁడు ఎప్పటియట్లు ఆకూర పట్టుకొని యామునాచార్యుని పాకశాల కరుగ పాచకుఁడు ఆతనిని రాజుసన్నిధికిఁగొని

పోయెను. యామునాచార్యుఁడు శ్రీరామమిశ్రునకు ఎదురుగా వచ్చి, సాష్టాంగదండప్రణామము లాచరించి, యథోచితముగా సత్కరించి, సముచితాసనాసీనుం గావించి, "మీరెందులకు వచ్చితిరి?" అని అడిగెను. అందులకు శ్రీరామమిశ్రుఁడు "నేనునిస్పృహుఁడను. ఏప్రయోజనము నపేక్షించియు మీచెంతకు వచ్చినవాఁడను గాను. మీతాతయగు నాథముని నాయొద్ద నొక నిక్షేపమును ఉంచి, మీ కిమ్మని చెప్పి పరమపదమునకుఁ బోయెను. అది శ్రీరంగమున నున్నది. అచ్చటకు వచ్చినచో మీది మీకు ఇచ్చెద" నని బదులు పలికెను. యామునాచార్యుఁడు అందులకు ఆనందించి అంగీకరించి శ్రీరంగమునకు బయలు దేఱిపోయెను. అచట శ్రీరామమిశ్రుఁడు యామునాచార్యుని శ్రీరంగనాయకుని సన్నిధికిఁ గొనిపోయి, దేవుని పాదారవిందయుగళమును జూపి "ఇదియే మీతాత మీకిమ్మని నాకు ఇచ్చిపోయిన నిక్షేపము" అని చూపెను. యామునాచార్యుఁడు అపు డానందపరవశుఁడై కొంత తడవునకు "ఆహా, ఇట్టి పరమప్రాప్యవిషయమును విడిచి, ఇంతకాలమును క్షుద్రభోగములయందు ఆసక్తుఁడనై కాలమును వ్యర్థపుచ్చితిని. బుద్ధికి మోసము వాటిల్లె" నని దుఃఖించి విరక్తుఁడై పెద్దకుమారునకు రాజ్యమును అప్పగించి తాను సన్న్యసించెను.

ఇతఁడు రచించిన గ్రంథములు:—1 సిద్ధిత్రయము, 2 ఆగమప్రామాణ్యము, 3 పురుషనిర్ణయము, 4 చతుశ్లోకి, 5 గీతార్థసంగ్రహము, 6 స్తోత్రరత్నము. 7 మాయావాదఖండనము.

వీరిశిష్యులు:—

పెరియనంబి (మహాపూర్ణులు), తిరుక్కోట్టియూర్ నంబి (గోష్ఠీపూర్ణులు), పెరియతిరుమలనంబి (శ్రీశైలపూర్ణులు), తిరుక్కచ్చినంబి, (కాంచీపూర్ణులు), తిరుమాలై యాండాన్ (మాలాధరులు) మొదలగు వారు కలరు. కొంతకాలమునకు తరువాత వీరు అయిదుగురు శ్రీభగవద్రామానుజులవారికి ఆచార్యులు అయిరి. వీరిలో పెరియనంబిగారు, ఆళవందారు ఆజ్ఞచొప్పున శ్రీరామానుజులవారికి పంచసంస్కారమును ప్రసాదించిరి.

ఇట్లు శిష్యపరంపరతో సిద్ధాంతప్రవచనము చేయుచు ఆళవందారు శ్రీరంగమునందు వేంచేసియుండఁగా, నొకనాఁడు మణక్కాల్ నంబి (శ్రీరామమిశ్రుఁడు) వచ్చి "మీతాతయగు నాథముని తన శిష్యులలో ముఖ్యుఁడయిన "కురుగైకావలప్పన్" అను వైష్ణవునకు యోగము నుపదేశించి "దీనిని మాపౌత్రుఁడు అగుయామునేయునకు ఉపదేశింపు"మని ఆజ్ఞయిచ్చెను. కాఁబట్టి మీరు ఇపుడు ఆస్వామిసన్నిధికిఁ బోయి, మీతాత ఆజ్ఞానుసారముగా ఆయోగమును ఉపదేశము పొంది రండు" అని చెప్పెను. ఆళవందారు అందులకు సమ్మతించి, కురుగైకావలప్పన్ యోగాభ్యాసము చేయుచున్న స్థలములకు వెళ్ళి, వారితో తన అభిప్రాయమును తెలుపఁగా అతఁడు "మీరు నానిర్యాణదినమునాఁటికి సరిగా నాయొద్దకు వచ్చితిరేని నేను దానిని మీకు ఉపదేశించెద" నని ప్రతిజ్ఞ చేసి, తననిర్యాణతిథి యెప్పుడు సంభవించునో ఆకాలము నొకపత్రముమీఁద వ్రాసి, ఆళవందారుచేతికి ఇచ్చెను. అందులకు ఆళవందారు సంతోషించి మఱల శ్రీరంగమునకు వచ్చెను. కొంతకాలము గడచిన తరువాత యామునాచార్యుఁడు కురుగైకావలప్పన్ చెప్పిన గడువు జ్ఞాపకమునకు తెచ్చికొని పత్రికను విప్పి చూడఁగా అతఁడు పరమపదించుదినము నాఁడే అయ్యెను. అగుటచే యామునాచార్యుఁడు అంతదూరము పోవుటకు అవకాశము లేకపోవుటచే చేయునది లేక ఊరకుండెను. నాఁటినుండియే విశిష్టాద్వైతసిద్ధాంతమునకు యోగాభ్యాసము నివారింపఁబడెనని యొక సాంప్రదాయము కలదు. యామునాచార్యుఁడు ఈలోకమున నూటయిరువదిసంవత్సరములు వేంచేసియుండి అవసానమున పరమపదము అలంకరించెను.

ఇతనికాలమునందే శ్రీమన్నారాయణుని ఆజ్ఞచొప్పున శ్రీఅనంతాళ్వాను విశిష్టాద్వైతసిద్ధాంతనిర్వాహమునకు రామానుజుఁడయి అవతరించెను.

తిరునక్షత్రపుతనియ.—శ్లో॥ శుచౌ మాస్యుత్తరాషాఢా జాతం యామునదేశికం,
శ్రీరామమిశ్రచరణ సరోజాశ్రిత మాశ్రయే.

నిత్యతనియ.—యత్పదాంభోరుహధ్యానవిధ్వస్తాశేషకల్మషః,
వస్తుతా ముపయాతోఽహం యామునేయం నమామ్యహమ్.

124. ఇళైయాళ్వారు.

(శ్రీభగవద్రామానుజాచార్యులు.)

శ్లో. ''యో నిత్య మచ్యుత పదాంబుజయుగ్మ రుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే,
అస్మద్గురో ర్భగవతో౽స్య దయైకసింధో
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే.''

తూర్పుసముద్రమునకు పశ్చిమపు దిక్కున తుండీరమండలము అను దేశము కలదు. ఆదేశమున భూతపురి (శ్రీపెరుంబూదూరు) అను నొక గ్రామము కలదు. అందు వేదవేదాంగములను చదివినవాఁడు, దేవబ్రాహ్మణపూజకుఁడు, మహాభాగవతోత్తముఁడు, హారీతగోత్రోత్పన్నుఁడు అగు ఆసూరి కేశవయజ్వ అను పేరుగల ఒక శ్రీవైష్ణవోత్తముఁడు నివసించుచుండెను ఆతని భార్యపేరు కాంతిమతి. ఆదంపతులిద్దఱును చిరకాలము సంతానములేనివారై, పుత్రోత్పత్తికొఱకు ఎల్లపుడు భగవంతుని ప్రార్థించుచుండెడివారు.

ఆతఁడు ఒకపుడు చంద్రగ్రహణము రాఁగా భార్యతోఁ గూడి సముద్రస్నానమును, కైరవిణీస్నానమును జేసి, పార్థసారథిస్వామిని సేవించి, పుత్రులకొఱకు పార్థసారథి నుద్దేశించి పుత్రకామేష్టి చేసెను. అంతట పార్థసారథి ప్రసన్నుఁడై స్వప్నమందు సేవసాదించి, నేను నీకు పుత్రుఁడనై పుట్టఁగల''నని అభయ మొసంగెను. ఇట్లు పార్థసారథివలన వరమును బొంది, సంతసించి తన భార్యతోఁగూడ కేశవయజ్వ స్వగ్రామము చేరెను. పిమ్మట కొన్నిదినములు గడచిన తరువాత కాంతిమతి గర్భము ధరించి, పదిమాసములు మోసి, అదితి వామనమూర్తినిఁ గన్నట్లు, కౌసల్య శ్రీరామచంద్రుని కన్నట్లు, పింగళసంవత్సర చైత్ర శుక్లపంచమినాఁడు ఆర్ద్రానక్షత్రయుక్త కర్కటకలగ్నమున కోటిసూర్యప్రకాశమానుఁడగు నొక పుత్రునిఁ గనియెను. ''అనంత ప్రథమం రూపం లక్ష్మణశ్చ తతః పరం, బలభద్ర స్తృతీయస్తు కలౌ కశ్చిద్భవిష్యతి''అన్నట్లు, మొదట శ్రీవైకుంఠమందు అనంతులుగా వేంచేసియున్నవారే లక్ష్మణస్వామి అయి జనించిరి. తరువాత ద్వాపరమందు ఆయనే

బలరాములై పుట్టిరి. వారే కలియుగమందు ఎవ్వరో అయి పుట్టఁగల రని రామానుజావతారము పురాణములయందుసూచింపఁబడినది. ఇది గాక నమ్మాళ్వారుగూడ తిరువాయిమొழிలో—

"పొలిగ పొలిగ పొలిగ పోయిత్తు వల్లుయిర్ చాపమ్, నలియు నగరముం నైందనమనుక్కిఙ్గియూవొన్ను మిల్లై, కలియుం కెడుం కండుకొళ్ళిన్ కడల్వణ్ణన్ భూతంగళ్ మణ్మేల్, మలియప్పుగుందిశై పాడి యాడి యుళితరక్కండోమ్"

(5 పది 2 తిరువాయిమొழி.)

"మంగళాశాసనము, మంగళాశాసనము, మంగళాశాసనము. సకలాత్మల పాపము పోయినది. నరకముకూడ నశించును. యమునకు ఈలోకమందు అవకాశము లేదు. కలియుగముకూడ నశించును. సముద్రవర్ణుని భూతములు భూమిమీఁద సమృద్ధిగాఁ బ్రవేశించి అంతటను తిరుగుచు ఆడుట, పాడుట, చూచినారము" అను పాశురమునందు శ్రీరామానుజావతారము సూచన చేసెను.

ఇట్లు ఉదయించిన ఆకుమారునిఁ జూచి తలిదండ్రులు మిక్కిలి ఆనందించిరి. సత్పురుషులు అతిహర్షము నొందిరి. అపుడు కాంతిమతి సోదరుఁడగు శ్రీశైలపూర్ణార్యుఁడు (పెరియతిరుమలనంబి) మేనల్లుఁడు పుట్టె నను శుభవర్తమానమును విని మహానందముతో భూతపురికివచ్చి తేజోరాశి యగు ఆశిశువును వీక్షించి, నిత్యసూరులలో నొకఁడుఇట్లు పుట్టె నని నిశ్చయించెను. పండ్రెండవరోజున కేశవయజ్వ, బంధువుల నందఱను రావించి, బారసాల మహావైభవముగా చేసి, పెరియతిరు మలనంబిచే చక్రాంకితము చేయించి, "రామానుజుఁడు" అని నామకరణము చేసెను. శిశువును జూచినవారు అందఱును ఇతఁడు శేషుఁడా, సైన్యనాథుఁడా యని ఊహించిరి. కాలక్రమమున పిల్లవానికి అన్నప్రాశనము, చౌలము, ఉపనయనము చేసి, కేశవయజ్వ తాను స్వయముగా వేదమునుపదేశింపఁదొడఁగెను. మఱియు రామానుజుఁడు స్వల్పకాలమునందే వేదవేదాంగములను జదువఁగా కేశవయజ్వ ఆతనికి సమావర్తనవ్రతము చేయించి, పదునాఱవయేట వివాహము చేసి,

మఱికొంతకాలమునకు విష్ణుసాయుజ్యము నొందెను. అంతట రామానుజముని పితృశోకమును జ్ఞానముచే మఱలించి, పితృకార్యమును శ్రద్ధతో నెఱవేర్చి, ఆగ్రామముననే కొంతకాలము భార్యతోఁ గూడ నివసించి యుండెను. అంతట సర్వశాస్త్రములను జదివి లోకోత్తరపాండిత్యమును సంపాదింపవలయు నని అభిలాషగలవాఁడై ఆతఁడు, యాదవప్రకాశుఁడు అను నొక మహాపండితుఁడు కాంచీపురమున ఉన్నాఁడు అని జనులవలన విని, అతనివద్ద శాస్త్రాధ్యయనము చేయుటకు భార్యతోఁగూడ కాంచీపురమునకుఁ బోయి అచట నివసించెను. నాఁటినుండియు ప్రతిదినము రామానుజుఁడు యాదవప్రకాశుని దగ్గఱకుఁబోయి శాస్త్రము చదువుచుండెను. యాదవప్రకాశుఁడు "ఈతఁడు అనంతుఁడు" అని నిశ్చయించెను.

ఆకాలమున రామానుజుని పినతల్లికుమారుఁడు అగు గోవిందభట్టరుగూడ శాస్త్రాధ్యయనము చేయుటకు యాదవప్రకాశుని చెంతకుఁ బోయెను.

ఒకనాఁడు యాదవప్రకాశుఁడు, "తస్య యథా కప్యాసం పుండరీక మేవ మక్షిణీ" అను ఛాందోగ్యశ్రుతిలో కప్యాసం అను పదమునకు మర్కటపృష్ఠము అని అపార్థము చెప్పి, సర్వేశ్వరుని నేత్రములు ఆతీరున నుండు నని సమర్థించెను. అపుడు యాదవప్రకాశునకు తలయంటుచున్న రామానుజుఁడు కేవలము అనుచిత మైన ఆయర్థమును విని, మిక్కిలి పరితాపము నొంది, కన్నీరు పడువఁగా వెచ్చని కన్నీటిచినుకు ఒకటి యాదవప్రకాశుని తొడమీఁదఁ బడి చురుక్కుమనెను. అంతట నాతఁడు ముఖము ఎత్తి తత్తఱముతోఁ జూచి "నీకన్నులనుండి ఇట్లేల వేఁడినీటిబిందువులు ఉరలె"నని ప్రశ్నించెను. అందులకు రామానుజుఁడు "భగవద్విషయికమైన శ్రుతికి సరసమైన అర్థమును విడిచి, ఇట్లు మిక్కిలి అసందర్భమగు అర్థమును చెప్పుట అపచార మని నామనస్సులో శోకము కలుగుటవలన కన్నీరు జాఱె" నని బదులు చెప్పెను. దాని మీఁద "ఈశ్రుతికి నీవు ఎట్లు అర్థము చెప్పెద" వని గురువు అడిగెను.

1. "కం జలం పిబతీతి కపిః=ఆదిత్యః, తేన అస్య తే=వికాస్యతే ఇతి కప్యాసమ్. కపి అనఁగా జలమును త్రాగువాఁడు సూర్యుఁడు; ఆతనిచే వికసింపఁజేయఁబడినది."

2. "కం=జలం,పిబతీతి కపిః=నాళం;తస్మిన్ ఆస్తే ఇతికప్యాసమ్." "నాళముతోఁ గూడినది" కోసివేయఁబడినను నాళముతోఁ గూడిన పద్మమునకు శోభ హెచ్చుగా నుండును.

3. "కం=జలం; అసభువి అపిపూర్వకః. ఉదకమందు ఉన్నది"

ఈమూఁడువిధములైన వ్యుత్పత్తులను బట్టి, తేలిన అర్థ మే మనఁగా?

'గంభీరాంభస్సముద్భూతసుమృష్టనాళరవికరవికసిత పుండరీకదళామలాయతేక్షణః'లోతైననీటిలోఁపుట్టినదియు మంచి కాఁడతోఁగూడినదియు,సూర్యకిరణములచే వికసింపఁ జేయఁబడినదియు అగు తెల్లతామరపూవుయొక్క రేకులవలె విశాలములైన నేత్రములు గలవాఁడు' అని రామానుజుఁడు అర్థము చెప్పఁగా విని యాదవప్రకాశుఁడు తాను చెప్పిన అర్థముకంటె నిది సరసముగా నుండుటవలన అతిమాత్సర్యము కలవాఁడై కోపించి "నేను చెప్పిన అర్థమును నీవు ఒప్పుకొనలేదు; గావున నేను చెప్పు చదువుమాత్రము నీకెట్లు పనికివచ్చును? కావున నేటినుండి నీవు చదువుకొనుటకు నావద్దకు రానక్కఱలేదు. పొమ్ము" అని పలికెను. రామానుజుఁడు అట్లే ఆతని యొద్దకు వెళ్లుట మానివేసెను.

కొన్ని దినములు గడచిన పిదప యాదవప్రకాశుఁడు రామానుజుని ఎట్లయిన చంపవలయు నని దుర్బుద్ధిగలవాఁడై "నేను శిష్యులతోఁ గాశికిఁబోవుటకు సిద్ధపడియున్నాను; గావున నీవుగూడ నావెంట రావలె" నని గోవిందభట్టరుద్వారా రామానుజునకు వార్తనంపెను. అందులకు సమ్మతించి రామానుజుఁడు యాదవప్రకాశునితో బయలుదేఱి కాశికిఁ బోవుచుండఁగా గోవిందభట్టరు ఈకుట్ర నెఱిఁగినవాఁడు; గావున తన అన్నతో నీరహస్యమును దెలుపుటకు సమయము నిరీక్షింపసాగెను. అంతట వింధ్యాటవిలో ప్రవేశించునప్పుడు జలస్పర్శకై రామానుజుఁడు దూరముగాఁ బోవునపుడు గోవిందభట్టరు రహస్యము నంతను రహస్యముగాఁ జెప్పి, ఒక అడుగైనను ముందునకు రావలదని ఉపదేశించెను. అంతట ఇళైయాళ్వారు గురువు దురాలోచనమునకు చాల చింత నొంది, వింధ్యాటవిలో నొక చెట్టుక్రింద గూర్చుండి విచారింపసాగెను. ఆసమయమున ధనుర్ధరుఁడైన ఒక కొండవాఁడు భార్యతోఁ గూడ రాఁగా చూచి, రామానుజుఁడు కొంత కలఁత తేఱి "అయ్యా,

మీరు ఎచ్చటనుండి వచ్చుచున్నారు? ఎచ్చటకుఁ బోయెదరు?" అనిఅడిగెను. అందులకు ఆతఁడు "ఉత్తరదేశమునందలి సిద్ధాశ్రమమునుండి బయలుదేఱి వచ్చుచున్నాము. కాంచికిఁ బోయెదము" అని బదులు చెప్పెను. "నేనును కాంచీపురమునకుఁ బోవలసియున్నది. నన్ను మీ వెంట తీసికొని పొండు" అని ప్రార్థింపఁగా ఆభిల్లదంపతులు అంగీకరించి రామానుజుని వెంటఁబెట్టుకొని బయలుదేఱిరి. వారు వింధ్యారణ్యము దాఁటి కొంతతడవు పోయి, అలసిపోవుటవలన నిరాహారులై ఒకచెట్టు క్రింద పరుండిరి అర్ధరాత్రమున ఆవ్యాధుని భార్య "దాహము అధికమగుచున్నది; గావున నీళ్ళు తెచ్చి పెట్టు" మని భర్తను కోరెను. అది విని కొండవాఁడు "సమీపమునందే ఒక మంచినీళ్లబావి యున్నది; గాని ఈచీఁకటిలో నేను అచ్చటకుఁ బోఁజాలను. తెల్లవాఱిన తరువాత మంచినీళ్లు త్రాగవచ్చును. అంతవఱకును పండుకొమ్ము" అని బదులు చెప్పెను. రామానుజుఁడు ఆదంపతుల సంభాషణము విని "అయ్యో, నాకు పరమోపకారులయిన వీరి విషయమున నేనిపుడు ఏమియు చేయలేకపోయితిని. ఈదేశపరిచయము లేకపోవుటచే నీళ్లు ఎక్కడనున్నవో నాకు తెలియదు" అని మనస్సులో మిక్కిలి పరితాపము నొందుచుండఁగా నింతలో తెల్లవాఱెను అపుడు కాలకృత్యములు తీర్చుకొని రామానుజుఁడు తిరిగి ప్రయాణము చేయుటకు ఆదంపతులకొఱకు చూడఁగా వారు కానరారైరి. అపుడు రామానుజుఁడు మిక్కిలి ఆశ్చర్యపడి, మఱినాలుగు అడుగులు నడచిపోయి అచ్చట నొక నూయి, తోఁట, కొందఱు మనుష్యులు నుండుట చూచి, "ఈ యూరుపేరు ఏమి?"అని అడిగెను. అందులకు ఆమనుష్యులు ఇది కాంచీపురము అని పలికిరి. అది విని రావణవధవార్త వినిన సీతవలె మిక్కిలి సంతోషించి ఆవ్యాధదంపతులు వరదరాజస్వామియు, పెరుందేవితాయారు నని నిశ్చయించి వారికి తనయందున్న అసాధారణకటాక్షమునకు రామానుజుఁడు అతివ్యామోహమును చెందెను. రామానుజుఁడు, వ్యాధదంపతులు కనఁబడి అంతర్ధానమును పొందిన అభిప్రాయమును దెలిసికొని, ఆదినము మొదలు వరదరాజస్వామి తిరుమంజనార్థము ఆశాలకూపమునుండి తీర్థమును తీసి అనుదినము సమర్పించుచుండెను.

ఇట్లు యాదవప్రకాశుఁడు శిష్యసంఘముతో వింధ్యారణ్యము

నుండి కదలిపోవుచు గోవిందభట్టరుని జూచి రామానుజుఁడు ఎక్కడ నున్నాఁడని అడుగఁగా ఆతఁడు "నేను ఆతనినిఁ జూడలేదు" అని ప్రత్యుత్తరము చెప్పెను అపుడు అతఁడు తన శిష్యులను నాలుగు దిక్కులకును పంపి వెదకించి ప్రయోజనము గానక "రామానుజుఁడు ఒంటరియై పోయినాఁడు. ఈయడవిలో నాతనికి ఏమి కీడుమూఁడునో" యని దుఃఖము నభినయించి, కాశికిఁ బోయెను. ఒకనాఁడు గోవిందభట్టరు గంగలో స్నానము చేయుచుండఁగా యాదవప్రకాశుఁడు మాయపన్ని, ఆతని చేతిలో నొక లింగము పడునట్లుచేసెను. గోవిందభట్టరు అది చూచి ఆశ్చర్యపడి, ఇది యేమని చూపింపఁగా యాదవప్రకాశుఁడు "గంగాధరుఁడు నీయెడల విశేషకటాక్షమును చూపి తనంతట తాను నీచేతిలో ప్రవేశించెను; గాన నీవు శివమతస్థుఁడవు కావలయు" నని చెప్పెను. అందులకు అతఁడు సమ్మతించి, శైవుఁడు ఆయెను. ఆతని చేతిలో లింగము పడుటవలన యాదవప్రకాశుని శిష్యులు అందఱును ఆతనిని "ఉళ్లంగైకొణర్ందనాయనార్" అని పిలువసాగిరి. యాదవప్రకాశుఁడు గంగాస్నానము చేయుచు కాశిలో కొంతకాలము నివసించి తన శిష్యపరివారముతో జగన్నాథము మొదలగు దివ్యదేశములను సేవించుకొనుచు కొలఁదిదినములలో స్వస్థల మగు కాంచీపురము చేరుకొనెను.

ఇంతలో ఉళ్లంగైకొణర్ందనాయనారు "ఈలింగమును ఉచిత స్థలమున ప్రతిష్ఠచేసి వచ్చెద" నని యాదవప్రకాశునిచెంత సెలవు గైకొని మధురమంగలము అను స్వగ్రామము చేరి అచట నుండెడు విద్వాంసుల నందఱను రావించి, తనచేతిలో పడిన లింగమును అచ్చట ప్రతిష్ఠ చేయించి మహాశివభక్తుఁడై యుండెను. ఇతని భక్తికి మెచ్చి కాళహస్తీశ్వరుఁడు ఒకరాత్రి స్వప్నమున సాక్షాత్కరించి "నీవు నా వద్దకు రావలయును" అని చెప్పెను. అంతట ఇతఁడు శివాజ్ఞచొప్పున కాళహస్తికిఁ బోఁగా అచ్చటి అధికారులు అందఱును ఇతనిని చాల గౌరవించి, ఆస్థలమునకు ధర్మకర్తగా నిర్ణయించి, మొహరుదస్కతులు ఇతని అధీనము చేసిరి.

అనంతరముయాదవప్రకాశుఁడు కాంచీపురమున రామానుజునిఁ జూచి ఆశ్చర్యచకితుఁడై "నీవు వింధ్యాటవిలో కానరాకపోవుటచే

నీవిషయమున మఱియొకలాగున తలంచి శోకించితిని. దైవకృపచే నీవు మఱల నిచ్చట కనఁబడుటచే బ్రహ్మానంద మైనది" అని పలికెను.అందులకు రామానుజుఁడు "వింధ్యాటవిలో దారి తప్పి తెన్నుగానక తహతహపడుచుండఁగా ఎవరో వ్యాధదంపతులు కాన్పించి నన్ను కాంచీపురసమీపమున విడిచిపెట్టి అదృశ్యులైరి." అని బదులు చెప్పెను. గురువు "ఇతని చరిత్ర లోకాతీతముగాఁ గాన్పించుచున్నది" అని అబ్బురంపడి మఱల యథాపూర్వముగా ఆతనికి పాఠములు చెప్పసాగెను.

ఈసమయమున ఇరువురు శ్రీవైష్ణవులు కాంచీపురమునుండి శ్రీరంగమునకుఁ బోయి రంగనాథుని సేవించి ఆళవందారు సన్నిధికి వెళ్లి సేవింపఁగా "మీయూర విశేషములు ఏమి?" యని యాతఁడు అడిగెను. అందులకు వైష్ణవులు ఇట్లు చెప్పిరి.

"శ్రీపెరుంబూదూరునుండి వచ్చి రామానుజుఁడు అను నతఁడు మా గ్రామనివాసియగు యాదవప్రకాశుఁడు అను ఏకదండిసన్యాసివద్ద కొంతకాలమునుండి వేదాంతశాస్త్రము చదువుచున్నాఁడు. ఒకనాఁటి పాఠమందు "సత్యంజ్ఞానమనంతంబ్రహ్మ" అను శ్రుతికి యాదవప్రకాశుఁడు "అసత్యజడ పరిచ్ఛిన్నములనుండి వ్యావృత్తము" అని అర్థము చెప్పఁగా, రామానుజుఁడు "గుణయోగము చెప్పవలసియుండఁగా నిట్లు వ్యావృత్తి చెప్పఁగూడునా?" అని శంకించెను. గురుఁడు అందులకు అంగీకరింపక ధిక్కరించెను. మఱియొకనాఁడు "యథాకప్యాసం పుండరీక మేవ మక్షిణీ" అను శ్రుతికి యాదవప్రకాశుఁడు కేవలానుచితార్థమును జెప్పఁగా రామానుజుని కన్నులనుండి ఉష్ణమగు దుఃఖబాష్పబిందువు జాఱి గురువు తొడమీఁదఁ బడి చుఱుక్కు మనెను. అది చూచి గురుఁడు ఏమని యడిగెను. శిష్యుఁడు "సద్యోవికసితమైన తామరపూవువలె నుండెడు పరమపురుషుని నేత్రములు, అని అర్థము చెప్పవలసియుండఁగా మీరు అపార్థమును చెప్పుటవలన నాకుదుఃఖము కలిగె" నని చెప్పెను.

ఇట్లు సవిస్తరముగా ఆవైష్ణవులు చెప్పినది విని ఆళవందారు—

శ్లో "అసంత ఏవాత్ర హి సంభవంతి హసంతికాయా మివ హవ్యవాహాః,
అత్రైవ సంతో యది సంభవంతి తత్రైవ లాభ స్సరసీరుహాణామ్."

"కుంపటిలో నిప్పు ఉన్నట్లు ఈసంసారములో అసత్పురుషులు

ఉండుట సహజము. ఒకానొకచో సత్పురుషులు పుట్టినయెడల కుంప టిలో తామరపూవు పుట్టినట్లు ఆశ్చర్యకరముగా నుండును."

అనినట్లు ఈయుగమందు ఇట్టిమహానుభావుఁడు అవతరించుట ఆశ్చర్య మని మిక్కిలి సంతోషించి ఎట్లయినవారి నొకమాఱు సేవించి రావలె నని ఆశతో సపరివారముగా కాంచీపురమునకుఁ బోయెను. అపుడు అచట నున్న తిరుక్కచ్చినంబి (శ్రీకాంచీపూర్ణుఁడు) మొదలగు శిష్యులు ఆళవందారును చాల గౌరవించి వరదరాజస్వామి సన్నిధికిఁ గొనిపోయి శ్రీశఠగోపము, తిరుప్పరివట్టము, తీర్థము, ప్రసాదము నిప్పించి, సత్కరించిరి. ఆ పరునాఁడు ఆళవందారు కోవెలకు వచ్చి పేరరుళాళప్పెరుమాళ్లను (వరదరాజస్వామి) పెరుందేవితాయారును సేవించి కోవెలకు ప్రదక్షిణముగావచ్చుచు తనకెదురుగా విద్యార్థిసంఘముతో యాదవప్రకాశుఁడు వచ్చుచుండుటఁ గాంచి "వీరిలో శ్రీరామానుజుఁ డెతఁ?" డని తిరుక్కచ్చినంబి నడిగెను. అపుడు ఆతఁడు, "పుటము పెట్టిన బంగారువంటి దేహచ్ఛాయ, ప్రసన్నగంభీరమగు ముఖము, ఆకర్ణాంత విశాలనేత్రములు, ఆజానుబాహువులును గలిగియున్న యాతఁడే" అని వ్రేలితోఁ జూపి చెప్పెను. ఆళవందారు, కన్నులనుండి ఆనందబాష్పములు కురియ చాలసేపు నేత్రపర్వముగఁ జూచి "ఆముదల్వనివర్" ఈమహాపురుషుఁడు మనసిద్ధాంతమును ఉద్ధరింపఁగలనాఁడు అగుఁ గాక యని సంకల్పించి—

శ్లో. "యస్య ప్రసాదకలయా బధిర శ్శృణోతి
పంగుః ప్రధావతి జవేన చ వక్తి మూకః,
అంధః ప్రపశ్యతిసుతం లభతే చ వంధ్యా
తం దేవమేవ వరదం శరణాగతోఽస్మి."

అన్నట్లు "ఓవరదా, భక్తులకు వరముల నిచ్చువాఁడవు; గావున మహానుభావుఁడగురామానుజుని దర్శనప్రవర్తకుఁడగునట్లు కటాక్షించి అడియేనికి వరముకృపచేయుము" అని వరదరాజస్వామిసన్నిధిని ప్రపత్తి చేసి శిష్యగణముతో తిరుగ శ్రీరంగమునకుఁ బోయెను.

మఱికొన్ని దినములు గడచిన తరువాత కాంచీపురము నేలు రాజు కొమార్తెను బ్రహ్మరాక్షసుఁ పట్టుకొని పీడింపసాగెను. నానా దేశములనుండి పిలిపింపఁబడిన మాంత్రికులు అనేకులు పిశాచమును వెడలఁ

గొట్టలేక మఱలిపోయిరి. రాజు యాదవప్రకాశుని ప్రార్థింపఁగా నాతఁడు ఒక శిష్యుని "నేను వదలిపొమ్మన్నా నని బ్రహ్మరక్షస్సుతోఁ జెప్పిరమ్ము" అని పంపెను. శిష్యుఁడు పోయి అట్లే చెప్పఁగా, ఆపిశాచము "ఆతనిని నేనే పొమ్మన్నా"నని చెప్పు మనెను. ఆమాటలు విని యాదవప్రకాశుఁడు కోపము తెచ్చుకొని, స్వయముగా నచ్చటకుఁ బోయి ఉచ్చాటనమంత్రములను జదువ నారంభించెను. అంతట ఆ బ్రహ్మరక్షస్సు "నేను నీమంత్రములకు భయపడువాఁడను కాను. నే నింతకంటె మహత్తరములగు మంత్రముల నెఱుఁగుదును. నీపూర్వజన్మవృత్తాంతమునుగూడ నే నెఱుఁగుదును. వినుము చెప్పెదను. నీవు పూర్వజన్మమందు మధురాంతకపు చెఱువునద్ద నున్నపుట్టలో ఉడుమవై ఉండువాఁడవు. ఒకప్పుడు కొందఱు శ్రీవైష్ణవులు శ్రీరంగమునుండి తిరుమలకుఁ బోవుచు మార్గవశమున అచట బసచేసి భగవత్ప్రసాదమును సాపడి భోజనపాత్రలను పరిహరింపఁగా నందుండు మెతుకులను భక్షించుటచే నీకిట్టి విద్వజ్జన్మము లభించినది. నేను వేదవేదాంగములను చదువుకొనిన బ్రాహ్మణులవంశమునందు జనించినవాఁడను. యాగముచేయుటలో సంభవించిన మంత్రలోపక్రియాలోపములవలన నాకు ఈబ్రహ్మరక్షోజన్మము కలిగినది." అని చెప్పెను. 'మఱి నీవు ఎట్లుపోదువు' అని యాదవప్రకాశుఁడు అడుగఁగా 'నీశిష్యులలో నొకఁడగు రామానుజుఁడు నాశిరముమీఁద పాదము నుంచి పొమ్మన్నచోఁ బోయెద' నని పిశాచము బదులు చెప్పెను. రామానుజుఁడు అట్లు చేయఁగా పిశాచము ఆతని తిరువడిని కన్నుల నద్దుకొని మాఱుపలుకక తానుపోవుచున్నట్లు గుఱుతుగా రాజద్వారమున నున్న పెద్దరావిచెట్టును విఱిచివేసి, రాజపుత్రికను విడిచిపెట్టి వెంటనే పోయెను. దీనివలన యాదవప్రకాశునకు రామానుజుని మీఁద నున్న అసూయామాత్సర్యములు నూఱింతలు పెరిగిపోయెను; గాని సంతోషమును బ్రకటించి అందఱ యెదుటను రామానుజుని శ్లాఘించెను.

ఒకనాఁడు ఆళవందారు కాలక్షేపసమయమునందు "ఇలింగత్తిట్ట పురాణత్తీరుమ్" అను పాశురమునకు వ్యాఖ్యానమును సాదించుచు "నా అనంతరము ఈవిశిష్టాద్వైతదర్శనమును నిర్వహించువారు ఎవ్వరో" అని విచారించిన అంతలో రామానుజుఁడు జ్ఞప్తికి వచ్చెను.

అంతట నాతడు "ఆతనిని యాదవప్రకాశునివద్దనుండి విడఁదీసి మన పక్షమునకు త్రిప్పుకొను ఉపాయము ఎద్ది? నేను వరదుని సన్నిధిలో చేసిన ప్రపత్తి, ఇంతవఱకును ఫలింపదయ్యెను" అనిచింతించి తిరిగి వరదుని ప్రార్థించెను.

అనంతరము యాదవప్రకాశుఁడు ఒకనాఁడు రామానుజునకు పాఠము చెప్పుచు "సర్వంఖల్విదం బ్రహ్మ""నేహనానాస్తికించన"అను శ్రుతులకు అద్వైతపరముగా జీవబ్రహ్మములకు ఐక్యముప్రతిపాదింపఁగా రామానుజుఁడు ఆయర్థము నిరసించి విశిష్టాద్వైతపరముగా అర్థము చెప్పెను. అందులకు అతఁడు మిగుల కోపించి "ఇటుమీఁద నీవు నా వద్దచదువుటకు రావలదు. నీబుద్ధికి తగిన ఉపాధ్యాయునిఁజూచికొమ్ము" అని చెప్పెను. రామానుజుఁడు యాదవప్రకాశునివద్ద చదువు మాను కొని తల్లిగారి ఆజ్ఞాప్రకారము తిరుక్కచ్చినంబి నాశ్రయించి, ఆతని నియమనమువలన ఎప్పటియట్ల వరదరాజస్వామికి తిరుమంజనకైంక ర్యము చేయుచుండెను.

పిదప రామానుజుఁడు యాదవప్రకాశునివద్ద చదువుమానివేసె నని విని యామునాచార్యుఁడు వరదరాజస్వామి సన్నిధిలో తానుచేసిన ప్రపత్తి ఫలించె నని సంతోషించి, పెరియనంబిని పిలిచి, "నీవు సాదించిన స్తోత్రరత్నమును రామానుజుఁడు వినునట్లు చేసి నీవద్దకు వచ్చునట్లు ప్రయత్నింపు"మనిఆజ్ఞాపించెను. పెరియనంబి యామునాచార్యుని ఆజ్ఞను శిరసావహించి కాంచీపురమునకుఁ బోయి రామానుజుఁడు వరద రాజస్వామికి తిరుమంజనము తెచ్చి సమర్పించెడి సమయమున స్వామి సన్నిధిని ఆస్తోత్రరత్నము ననుసంధించుచు,—

శ్లో. "స్వాభావికానవధికాతిశయేశితృత్వం
నారాయణ త్వయి న మృష్యతి వైదికః కః,
బ్రహ్మా శివ శ్శతమఖః పరమ స్స్వరాడి
త్యేతేఽపి యస్య మహిమార్ణవవిప్రుష స్తే."

అను శ్లోకమును చదివెను. రామానుజుఁడు దానిని విని, పర మాశ్చర్యము నొంది పెరియనంబి పాదములపైఁ బడి సాష్టాంగదండ ప్రణామములు సమర్పించి "స్వామీ, ఈశ్లోకము సమర్పించిన మహనీయులు ఎవ్వరు? వారిని దాసుఁడు సేవించుకొనుట యెట్లు సంభ

వించును" అని పలికెను. పెరియనంబి, "ఈశ్లోకమును రచించినవారు శ్రీవైష్ణవదర్శనస్థాపకులగు ఆళవందారు. వారు శ్రీరంగమున వేంచేసి యున్నారు. వారు ఇపుడు మీరు నావెంట శ్రీరంగమునకు వచ్చిన యెడల వారి దర్శనము మీకు లభించును" అని చెప్పెను. వెంటనే రామానుజుఁడు మహాసంతోషముతో ఆళవందారును సేవించుటకు పెరియనంబివెంట శ్రీరంగమునకు బయలుదేఱెను. వీరిరువురును అతి శీఘ్రముగా శ్రీరంగమునకుఁ బోవుచుండఁగా మార్గములో కావేరీనది యిసుక తిన్నెమీఁద వైష్ణవజనసంఘము కాన్పించెను. రామానుజుఁడు ఇదేమి అని యడుగఁగా "ఆళవందారు నేఁటి ప్రాతఃకాలము తిరునాఁడు అలంకరించినారు. వారికి శ్రీవైష్ణవులు చరమసంస్కారము చేయఁ బోవుచున్నా"రని చెప్పెను. అది విని రామానుజుఁడు "యామునాచార్యులు లీలావిభూతియందు ఉండఁగా సేవింపఁజాలక పోయితిని" అని మిక్కిలి దుఃఖించి, వారి చరమదేహము నైన సేవించెదనని పెరియనంబితో దగ్గఱకు వెళ్లగా ఆతనికి కుడిచేతి మూఁడు వ్రేళ్లు ముడఁగియుండుట చూచి ఇదేమని అచ్చటివారిని అడుగఁగా వారు "కారణ మేమో మాకుఁ దెలియదు. ఆళవందారు సజీవులు అయియున్న కాలమున నిట్లు లేదు. ఇందులకు కారణ మేమో మాకు తెలియదు" అని చెప్పిరి. అపుడు రామానుజుఁడు "యామునాచార్యులవారు తమ తిరువుళ్లమందు ఏమో సంకల్పించుకొని ఇట్లు వ్రేళ్లుముడుచుకొని యుండి రని నిశ్చయించి, వారి తిరువుళ్లమును బాగుగా నెఱిఁగిన శిష్యులను కొందఱ నడుగఁగా వారు శ్రీవిష్ణుపురాణమును రచించి లోకమునకు పరతత్త్వమును ప్రకాశింపఁజేసిన పరాశరులవారి తిరునామము యోగ్యులైనవారికి ఒకరికి ఉంచవలె ననియు, వ్యాససూత్రములకు విశిష్టాద్వైతపరముగా భాష్యము రచింపవలయు ననియు, నమ్మాళ్వారు సాదించిన తిరువాయిమొழிకి వ్యాఖ్యానమును చేయువలయు ననియు తఱుచుగా ఆచార్యులవారు మాతో ఆనతిచ్చుచుండెడివారు" అని చెప్పిరి. అపుడు రామానుజుఁడు "ఆచార్యకృప పూర్ణముగా నున్నయెడల దాసుఁడు ఆమూఁడుపనులను తప్పక నెఱవేర్పఁగలఁడు" అని దృఢముగాఁ బలికెను. వెంటనే యామునాచార్యుని మూఁడువ్రేళ్లును చక్కఁగా సాగి తొల్లిటివలె నుండెను. అది చూచి

అక్కడనున్న శ్రీవైష్ణవులు అందఱును ఆశ్చర్యము నొంది "ఇఁకమీఁద దేవరవారే దర్శనప్రవర్తకులు కాఁగల" రని రామానుజుని మంగళాశాసనము చేసిరి.

అనంతరము రామానుజుఁడు పెరియనంబికి దండము సమర్పించి ఆళవందారు సేవ తమకు దొరకునట్లు అనుగ్రహింపని శ్రీరంగనాథుని సేవింపకయే మఱల కాంచీపురమునకు వచ్చి తిరుక్కచ్చినంబితో ఈ వృత్తాంత మంతయు విన్నవింపఁగా నాతఁడు ఆచార్యవియోగమునకు అతిదుఃఖితుఁడై తిరువధ్యయనమును యథావిధిగా నాచరించెను. రామానుజుఁడు తిరుక్కచ్చినంబియెడల భక్తికలవాఁడై ఆతని తిరువడి నాశ్రయింపఁదలఁచి ఒకనాఁడు తనయింట నానావిధభక్ష్యములతో తళిహ చేయించి, ఆతనిని సాపాటునకు పిలిచెను. ఆతఁడు స్నానసంధ్యాద్యనుష్ఠానములు ఆచరించి, వరదరాజస్వామి సన్నిధికిఁ బోయి తీర్థశఠగోపములను స్వీకరించి, బయలుదేఱెను. రామానుజుఁడు మఱియొకమార్గమున ఆతనిం బిలువఁబోయెను. దారిలో నుభయులు కలియలేదు. ఇంతలో తిరుక్కచ్చినంబి రామానుజుని తిరుమాళిగకు వచ్చి సాపడి సన్నిధి కైంకర్యమునకు విలంబ మయ్యె నని శీఘ్రముగాఁ బోయెను. రామానుజుని భార్య ఆతఁడు సాపాటు చేసిన తళిహను కఱ్ఱతో దూరముగా పరిహరించి,అచట గోమయముతో శుద్ధిచేసి,మఱల స్నానముచేయఁబోయెను. ఇంతలో రామానుజుఁడు వచ్చి ఎందులకు స్నానముచేయుచున్నావని భార్య నడిగెను. తిరుక్కచ్చినంబి వచ్చి ఆరగించి వెళ్లెననియు ఆతఁడు ఆరగించిన ఆకును కఱ్ఱతో ఎత్తి పాఱవేసితి ననియు శూద్రుని యెంగిలి శుద్ధి చేయుటచే మైలపడితిని; గావున స్నానము చేయుచున్నానని యు నామె చెప్పెను. అది విని రామానుజుఁడు తనకోరిక నెఱవేఱనందులకు మిక్కిలి పరితాపము నొంది, భార్యమీఁద కోపించెను. ఆతఁడు భార్యను విడుచుటకు ఎంచిన మూఁడు నేరములలో నిది మొదటిది.

నాఁడు రామానుజుఁడు తిరుక్కచ్చినంబి యింటికిఁబోయి జరిగిన అపరాధమును క్షమింపు మని వేఁడుకొని "స్వామీ, దాసునిమనస్సులో కొన్ని సంకల్పములు ఉన్నవి. అవి నెఱవేఱునట్లు అనుగ్రహింపు మని వరదునితో విన్నవించి అందులకు ఆనసర్వేశ్వరుఁడు ఆన

లిచ్చు ప్రత్యుత్తరమును దాసునకు కటాక్షింపవలయు"నని ప్రార్థించెను. అందులకు అంగీకరించి తిరుక్కచ్చినంబినాఁటిరాత్రి ఏకాంతసేవాసమయమందు గుణానుభవము చేసి ప్రార్థింపఁగా వరదరాజస్వామి "నేనే పరతత్త్వము. భేదమే వాస్తవము. ప్రపత్తియే ఉపాయము. అంతిమస్మృతి అవసరము లేదు. దేహావసానమందు మోక్షము సిద్ధించును. పెరియనంబి శ్రీపాదము నాశ్రయింపుము. ఈయాఱు వార్తలను రామానుజునకు తెలియఁజేయుము" అని చెప్పెను. మఱునాఁడు స్వామి దివ్యసూక్తులను నంబి, రామానుజునకుఁ దెలుపఁగా నాతఁడు మిక్కిలి ఆనందించెను.

అంతట శ్రీరంగమున నున్న ఆళవందారు శిష్యులగు వైష్ణవోత్తము లందఱును దర్శనస్థాపనమునకు రామానుజుని శ్రీరంగమునకు తీసికొని రావలయు నని పెరియనంబిని ప్రార్థించిరి. ఆతఁడును కుటుంబసహితుఁడై మధురాంతక మనుదివ్యస్థలమునకుఁ బోవునప్పటికి శ్రీరంగమునకే బయలుదేఱి వచ్చుచున్న రామానుజుఁడు ఎదురుపడెను. రామానుజుఁడు వినయముతో "స్వామీ, అపుడు ఇపుడు అనక దేవరవారు శ్రీఆళవందారు సన్నిధిలో గ్రహించిన పరమార్థమును దాసునకు అనుగ్రహింపవలయు" నని ప్రార్థింపఁగా పెరియనంబి వల్లె యని అచ్చటికోవెలలో పంచసంస్కారములను జేసి, తిరుమంత్రమును ఉపదేశించెను. మఱునాఁడు ఇరువురును బయలుదేఱి కాంచీపురము ప్రవేశించిరి. అచ్చట పెరియనంబి, రామానుజుని యింటియందే ఉండి, ఆతనికి ద్రావిడవేదము, బ్రహ్మసూత్రములు, రహస్యములు మొదలగునవి ఉపదేశింపసాగెను.

అట్లు కాలక్షేపములు జరుగుచుండఁగా ఒకనాఁడు రామానుజుఁడు తనకు తల అంటిన వైష్ణవునకు చలిదిఅన్నము ఉన్నచో పెట్టుము అని భార్యకు ఆజ్ఞాపించెను; గాని ఆమె లేదని బదులు చెప్పెను. రామానుజుఁడు ఆమాటను విశ్వసింపక చలిదికుండ ముట్టుకొని స్వయముగా చూడఁగా నందు ఇద్దఱుముగ్గురకు సరిపడు అన్నము ఉండెను. అక్కతన ఆతఁడు ఆమెకుదానిని జూపి ఆవైష్ణవునకు స్వయముగా అన్నము పెట్టి నాఁటినుండి ఆమెమీఁద చాల కోపము వహించెను. ఆమెను విడుచుటకు ఇది రెండవకారణము. మఱియొకనాఁడు పెరియనంబి

భార్యయు రామానుజుని భార్యయు నీళ్లుతోడుకొనుటలో నంబిభార్య నీళ్లు రామానుజునిభార్యతోడు బిందెమీఁదపడెను. అందులకు కోపించి రామానుజుని భార్య నంబిభార్యను కొట్టఁబోయెను. అదిచూచి పెరియ నంబి భార్యమీఁద చాల కోపపడి ఆమెను దీసికొని ఇంటిలోనివారికి ఎవ్వరికిని తెలియకుండ శ్రీరంగమునకు వెడలిపోయెను. పిదప రామానుజుఁడు స్నానసంధ్యాద్యనుష్ఠానములు అన్నియుఁ దీర్చుకొని, స్వాచార్యుని సేవించుటకు అతఁడు నివసించు భాగమునకుఁ బోయి వారచ్చట లేకపోవుట చూచి తనభార్యతోడి కలహమును భరింపలేక వారు వెడలిపోయినా రని విని ఇది మూఁడవ అపరాధముగా గణించి, భార్యను బిలిచి, "నీవు నావిషయమున ముమ్మారు అపచారపడితివి. ఇఁక నీతో నాకు సహవాసము వలదు" అని తత్క్షణమే ఆమెను పుట్టినింటికి పంపివేసి, వరదరాజస్వామి సన్నిధికిఁ బోయి ఆస్వామినే ఆచార్యునిగా వరించి త్రిదండసన్న్యాసమును స్వీకరించెను ఆతనికి వరదరాజస్వామి "రామానుజముని" అని తిరునామమును కటాక్షించి, "ఇతనిని మధురలో ప్రవేశ పెట్టిరమ్ము" అని తిరుకచ్చినంబికే ఆజ్ఞాపించెను.

అనంతరము రామానుజుఁడు "ఆళవందారు కృపవలన మనస్సంకల్పములు అన్నియు నెఱవేఱినవి. ఇటుపైని వారి ఆజ్ఞానుసారముగా మన విశిష్టాద్వైతసిద్ధాంతమును ప్రవర్తింపఁజేయుటయే ముఖ్యమైనపని అయియున్నది. ఇందులకు సమర్థుఁడగు సహాధ్యాయుఁడు ఒకఁడు నాకు కావలెను. నాహితముఁ గోరువాఁడు, విరక్తుఁడు, శుద్ధమైన శాస్త్రజ్ఞానముకలవాఁడునగు గోవిందభట్టరు నాకు ఇపుడు దొరకినయెడల నాకోరిక సిద్ధించును; గాని ఆతఁడు ఇపుడు అన్యమతమందు ప్రవేశించియున్నాఁడు. ఆతనిని మన మతములోనికి త్రిప్పి తీసికొనిరాఁగలుగు వారు ఎవరు ఉన్నారు?" అని తలంచి "ఈపనికి మహాపండితుఁడైన తిరుమలనంబి తగినవాఁడు" అని నిశ్చయించి, ఒక వైష్ణవునిచే ఆతనినిపిలిపించి "స్వామీ, చెడిపోయిన గోవిందభట్టరును ఎట్లయిన దిద్ది దేవరవారి శ్రీపాదదాసునిగా చేసికొనవలయు" నని కోరెను.

కందాడై ముదలియాండాన్, కూరత్తాళ్వార్ అను శ్రీవైష్ణవులు ఇద్దఱు రామానుజుఁడు యత్యాశ్రమమును స్వీకరించె నను వార్తవిని

అతిప్రీతితోఁ గాంచీపురమునకుఁ బోయి, రామానుజుని సేవించి "మాకు పంచసంస్కారములను కృపచేయవలయును" అని ప్రార్థించిరి. అంతట రామానుజుఁడు వారి కోరిక నెఱవేర్పఁగా వారు కృతార్థులై ఒకక్షణమైనను స్వాచార్యుఁడగు రామానుజుని విడువక సర్వదా కైంకర్యము చేయుచు మధురయందే యుండిపోయిరి.

యాదవప్రకాశుని తల్లి, సర్వకాలము వరదరాజస్వామిని సేవించుచుండుటవలనను తిరుక్కచ్చినంబికటాక్షమువలనను రామానుజునితోఁ దఱుచు మాట్లాడుచుండుటవలనను, శ్రీరామానుజమునిసిద్ధాంతమునందు ప్రీతికలదియయి తన కుమారుఁడుగూడ ఈసిద్ధాంతము నవలంబించినయెడల కృతార్థుఁడు అగు నని తలంచుచు హస్తిగిరిసోపానములు ఎక్కుచుండఁగా "అది మంచిది అది మంచిది" అను ఉపశ్రుతి వినఁబడెను. అంతట నామె కుమారుని యొద్దకుఁబోయి తనయభిప్రాయమును, తాను విన్న ఉపశ్రుతిని, తెలియఁజేసి, "నాయనా, నీవును రామానుజులవారి పాదముల నాశ్రయించి, వారివలెనే శిఖాయజ్ఞోపవీతములను ధరించి త్రిదండసన్న్యాసివి కమ్ము" అనినొక్కి చెప్పఁగా యాదవప్రకాశుఁడు లోఁగడ రామానుజుఁడు తనవద్ద చదువుచున్న కాలమున సమర్థించి చెప్పినఅర్థములు మనస్సున నాటియుండుటవలనను, వింధ్యారణ్యమందు అసహాయుఁడై యున్న అతనికి పెరుందేవితోఁ వరదరాజస్వామి కిరాతరూపమున సాక్షాత్కరించి అనుగ్రహించిన సమాచారమును వినియుండుటవలనను, బ్రహ్మరక్షస్సువలన ఆతని మాహాత్మ్యమును, తన పూర్వజన్మవృత్తాంతమును విని యుండుట వలనను, తల్లిచెప్పిన మాటలయందు గురికలవాఁడై 'తల్లీ, నీవు చెప్పినట్లు యతిరాజుల నాశ్రయించి, త్రిదండసన్న్యాసమును స్వీకరించుటకు ఇప్పుడు నాకున్న దోషమును పోఁగొట్టుకొనవలయును. ఆదోషము భూప్రదక్షిణము చేసినఁ గాని నివర్తింపదు. వార్ధకావస్థలో నున్న నేనిపుడు భూప్రదక్షిణ మెట్లు చేయఁగలను?' అని విచారముతోఁ నుడివెను. ఆరాత్రి పేరరుళాళప్పెరుమాళ్లు (వరదరాజస్వామి) ఆతనికి స్వప్నమందు సాక్షాత్కరించి "ఒకసారి యతిరాజులకు ప్రదక్షిణము చేసినయెడల నీదోషములు అన్నియు తొలఁగిపోవును. వేఱుగ భూప్రదక్షిణముచేయనక్కఱ

లేదు" అని ఆజ్ఞ యిచ్చెను. ఆమాటలయందు విశ్వాసము లేక, ఆతఁడు 'వరదరాజస్వామి తిరువుళ్ల మెట్లున్నదో కనుఁగొను' మని తిరుకచ్చి నంబిని ప్రార్థించెను. నంబి, యాదవప్రకాశుని విన్నపమును స్వామి సన్నిధిలో విన్నవించెను. అందులకు పెరుమాళ్లు తాను తొలిదినమున స్వప్నమున కనఁబడి నియమించిన విషయమును మఱల ఆనతిచ్చెను. మఱునాఁడు తిరుకచ్చినంబి ఆవిషయము యాదవప్రకాశునకు తెలియఁజేసెను. అంతట నాతఁడు ఇది వరదుని ఆజ్ఞయే యని నమ్మకము గలవాఁడై రామానుజుని సన్నిధికిఁ బోయి ఆతని చరణారవిందములకు సాష్టాంగదండప్రణామములు సమర్పించి తాను కన్నకలను తిరుకచ్చి నంబి ఆనతిచ్చినవిషయమును విన్నవించి, ప్రదక్షిణముచేసి అనుగ్రహ పాత్రుఁడై శిఖాయజ్ఞోపవీతములను పరిగ్రహించి త్రిదండసన్న్యాసి అయ్యెను. అప్పుడు యతిరాజు ఆతనికి "గోవిందజియ్యరు" అని పేరు పెట్టి పంచసంస్కారములచే పరిశుద్ధి నొందించి ఆతఁడు రచించిన 'యతి ధర్మసముచ్చయ' మను గ్రంథమును కటాక్షించెను ఇట్లు కృతార్థుఁడైన గోవిందజియ్యరు కొంతకాలము భగవద్గుణానుభవముచేయుచు ఆచార్య సన్నిధిలో నివసించియుండి అనంతరము పరమపదమును బొందెను.

ఇట్లు యతిరాజు కాంచీపురమందు వేంచేసియుండఁగా రంగనాథుఁడు ఆతనిని తనసన్నిధికి రప్పించుకొనఁదలఁచి వరదరాజస్వామికి ఒక శ్రీముఖము నంపెను. అందులకు వరదరాజస్వామి "ప్రియవస్తువునందు అపేక్ష యెల్లవారికి తుల్యముగా నుండును; గావున మేమును మీవలెనే రామానుజుని విడువలేము" అని ప్రత్యుత్తరము నంపెను. రంగనాథుని సన్నిధియందు వేంచేసియుండు పెద్దలందఱును ఎట్లయిన యతిరాజును శ్రీరంగమునకు తీసికొనిరావలయు నని నిశ్చయించుకొని, ఆలోచించి, గానవిద్యావిశారదుఁడగు తిరువరంగప్పెరుమాళరయరు ఇందులకు తగినవాఁడని ఎంచి ఆతనిం బిలిచి "కాంచీపురమునకుఁబోయి వరదుని సన్నిధియందు గానవిద్యాసైపుణ్యమును జూపి యతిరాజు నిచ్చుటకుఁ గొని రావలయును" అని బోధించి పంపిరి. ఆతఁడును మంచిదని కాంచికిఁ బోయి వరదుని సేవించి దేవగానముతో పాడ నారంభించెను. ఆగాన రసమునకు వరదుఁడు మిక్కిలి లోలుఁడై సంతోషించి "నీగానమునకు

మెచ్చితిని. నీకేమి కావలసినను ఇచ్చెదను" అని పలికెను. అరయరు "రామానుజులవారిని నాతో శ్రీరంగమునకుఁ బంపవలయు" నని కోరెను. వరదుఁడు మాట తప్పలేక అందులకు అంగీకరించెను.

పిదప రామానుజుఁడు అరయరుతో తనసన్నిధికి వచ్చుచున్నాఁడని విని రంగనాథుఁడు పెరియనంబిమున్నగు వారిని ఎదురుపంపి మహావైభవముతో స్వాగతము ఇప్పించెను. అపుడు యతిరాజు పరమానంద భరితుఁడై రంగనాథుని సేవించి తిరుప్పిరియట్టము శ్రీశఠకోపము మొదలగు మర్యాదలను పొంది అది మొదలుకొని రంగనాథుని ఆజ్ఞాప్రకారము దేవాలయాధికారమును వహించి ఏలోపమును లేకుండ శ్రద్ధతో కైంకర్యము చేయసాగెను.

ఒకపుడు దేశాటనము చేయుచు అక్కడక్కడనుండి పండితులను వాదమున జయించుచు గొప్పప్రతిష్ఠవహించిన (కాండూరు) యజ్ఞమూర్తి అను ఏకదండసన్యాసియొకఁడు శ్రీరంగమునకువచ్చి రామానుజునితో వాదించి పరాజితుఁడై శిఖాయజ్ఞోపవీతములను ధరించి త్రిదండసన్యాసమును స్వీకరించి రామానుజునివలన పంచసంస్కారములను పొంది సకలసంప్రదాయగ్రంథములను చదివి రామానుజుని శిష్యులలో గొప్పవాఁడు అయ్యెను. అతనికి పేరరుళాళప్పెరుమాళ్ 'ఎంబెరుమానార్' అని పేరు వచ్చెను.

పిదపరామానుజుఁడు సకలదివ్యదేశములయందును వేంచేసియున్న పెరుమాళ్లకుమంగళాశాసనములు చేసిబౌద్ధక్షపణకజైనాదిమతస్థులను వాదమందు జయించిస్వమతమును విస్తరింపఁజేసిరి. వీరిముఖ్యశిష్యుఁడు కూరత్తాళ్వాన్. రామానుజుఁడు ఈశిష్యుఁడు సన్నిధినుండి వ్రాయఁగా బ్రహ్మసూత్రములకు శ్రీభాష్యమును రచించెను. వేదాంతసారము, వేదాంతదీపము, వేదార్థసంగ్రహాము, శ్రీరంగగద్యము, వైకుంఠగద్యము శరణాగతిగద్యము, ఎనుబదిరెండువార్తలు అనునవి ఇతని తక్కిన గ్రంథములు. రామానుజుఁడు మతమును ప్రవర్తింపఁజేయుటకు మహాపండితు లయినడెబ్బదినలుగురను సింహాసనాధిపతులనుగా ఏర్పఱిచెను.

కొనకు చేయవలసిన ఏర్పాటులు అన్నియు చేసి శిష్యులకు చెప్పవలసిన బుద్ధులు చెప్పి, శ్రీరంగనాథుని సన్నిధికిఁ బోయి సేవించుకొని

తనకు నిత్యవిభూతివాసము కటాక్షింపు మని ప్రార్థించి పింగళసంవత్సర మాఘశుక్ల దశమినాఁడు శ్రీరామానుజుఁడు వైకుంఠధామమునకు వేంచేసెను.

ఈయన లీలావిభూతియందు ఉన్న కాలము నూటయిరువది సంవత్సరములు.

పాండురంగక్షేత్రమాహాత్మ్యము.

శ్లో. సంసారవృక్ష మఘబీజ మనంతకర్మ
శాఖాయుతం కరణపత్ర మనంగపుష్పం
ఆరుహ్య దుఃఖజలధౌ పతితో దయాళో
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబం.

(9. శ్రీలక్ష్మీనరసింహస్తోత్రము.)

శౌనకాదిమహర్షులు నిఖిలపురాణవ్యాఖ్యానవైఖరీసమేతుం డగు సూతునిం గాంచి "మహాత్మా, క్షేత్రము, తీర్థము, దైవతమును జేరిన ప్రదేశము ఏది?" అని యడిగిరి. "ఈయర్థమును దొల్లి పరమేశ్వరుఁడు కుమారస్వామికి ఎఱింగించెను. దానిని వేదవ్యాసమహామునీంద్రుఁడు నాకుఁ దెలిపెను. నేను మీకుఁ దెలిపెదను" అని సూతుఁడు వారికి ఇట్లు చెప్పఁదొడఁగెను.

పూర్వము ఒకప్పుడు అగస్త్యాదిమహామునీంద్రులును, కుమారస్వామి మున్నగువారును, తీర్థక్షేత్రమూర్తులుగల ప్రదేశమును దెలుపవలయునని పరమేశ్వరునిఁ గోరిరి. ఈవిషయమునే మున్నొకపుడు పార్వతి గూడ నడిగియుండెను. అపుడు పరమేశ్వరుఁడు అందఱును వినుచుండ నిట్లు చెప్పెను. భీమరథీనదికి దక్షిణదిగ్భాగమున పాండురంగక్షేత్రము గలదు. అందు సకలసుగుణములకు నాలవాల మగు పుండరీకుఁ డను నొక బ్రాహ్మణుఁడు గలఁడు. ఆతఁడు సంపన్నుఁడయ్యు వైభవములను ఆసింపఁడు. ఐహికసౌఖ్యములనిన కంటగించుకొనును. అంతటివిరాగి, అంతటచిత్తశుద్ధిగల మహాత్ముఁడు మఱియొకఁడు ఎందునుఁ ఉండఁబోఁడు. ఆతని భార్యయు భర్తవలెనే సుగుణమణిగణభూషితురాలు. అన్నివిధముల నామె పుండరీకునకుఁ దగిన యిల్లాలు.

ఇంటఁ బరిచారకు లెందఱు ఉండినను పుండరీకుఁడు తలిదండ్రులకు స్వయముగ సకలోపచారములు సేయును. అతిథులను బూజించును. భగవద్భాగవతారాధనము గావించి తలిదండ్రులకు భోజనంబిడి, ఇంకను గౌరవింపవలసినవారు అందఱు నైనతరువాత నాతఁడు భుజించును. అతని భోజనమయినఁ గాని అతని భార్య ఎన్నఁడును భుజించి యెఱుఁగదు.

ఇట్లు కొన్ని దినములు జరుగునప్పటికి పుండరీకుని తలిదండ్రులు పరమపద మలంకరించిరి. పుండరీకుఁడు వారికిఁ జేయవలసిన యౌర్ధ్వదైహిక క్రియల నన్నిటిని ముగించి కొన్నిదినములకు సంతానము గాంచి ఏమిటను లోపము లేదని జనులు కొనియాడుచుండ ఈశ్వరకారుణ్యము నపేక్షించి యొకచోఁ బర్ణశాల నిర్మించుకొని పత్నితోఁ గూడ నందు వసించి తపస్సమాధినిష్ఠాగరిష్ఠుఁ డయ్యెను కొన్నిదినములకు శ్రీహరి యాతని భక్తిజ్ఞాన వైరాగ్యములకు ఆనందించి కటివిన్యస్తహస్తుఁడై సాక్షాత్కరించి "వత్సా, నీచిత్తశుద్ధికి మెచ్చితిని. నీకు ఏమి వరము కావలయునో కోరుకొనుము" అని చెప్పెను. అందులకు పుండరీకుఁడు ఆనందకందళితహృదయారవిందుఁడై "శ్రీహరీ, నేను అజ్ఞుఁడను. నీవు సకలమును దెలిసినవాఁడవు. నీమాహాత్మ్యము, నీలీలలు, బ్రహ్మాదులకుఁ గూడఁ దెలియునవి కావు అట్టిచో నిన్ను నుతించుటకు నేనెంతటివాఁడను? దేవతలకుఁగూడ దుర్లభదర్శనుఁడ వగు నీవు సాక్షాత్కరించుటకంటె నాకికఁ గావలసిన దేమున్నది? అయినను నీవుకోరుకొనుమంటివి; గావున వినుము. నీవిపుడు నాకు ఎట్టిరూపముతో నిచ్చట సాక్షాత్కరించితివో ఆరూపముతోడనే ఇచ్చట నుండి ఈప్రదేశమును తీర్థక్షేత్రమూర్తులుగలదానినిగాఁ జేసి అనుగ్రహింపుము" అని కోరెను. శ్రీహరి కేవలము నిష్కామమునకు పరమావధి యగు ఈవరమునకుఁ బరమానందభరితుఁడై "ఇది పండరిపురము అనునామాంతరముతో నీపేర పాండురంగక్షేత్రము అని ప్రసిద్ధి వహించును. నిన్ను అనుగ్రహించిన నేను పాండురంగఁడను పేరుతో నిచ్చట నిట్లే పశ్చిమాభిముఖుఁడనై యుందును. ఈభీమరథీనది తీర్థరాజమై వెలయును. ఈతీరున నిది తీర్థము, క్షేత్రము, దైవతమునుగల దివ్యస్థలమై యొప్పారును" అని యానతిచ్చెను. పుండరీకుని ప్రార్థనము చొప్పున నచ్చట వెలసిన పాండు

రంగఁడు ప్రాతఃకాలమున నెట్టినివాఁడును, మధ్యాహ్నమున తెల్లని వాఁడును, సాయాహ్నమున నల్లనివాఁడునై త్రిమూర్తిస్వరూపుఁడై తేజరిల్లుచుండును. ఆత్రిమూర్తిస్వరూపుని మహాత్ములు పూజించుచుందురు. అచ్చట వేంచేసియున్న పాండురంగని షోడశోపచారములతో నర్చించువారికి సకలైశ్వర్యములును, అవసానమున మోక్షమునుగలుగును; గాని ప్రథమమున తీర్థమూర్తిని దర్శించి సేవింపనివారికి ఏఫలమును గలుగదు. పద్మతీర్థతీరమున అశ్వత్థరూపులై వెలయు నరనారాయణులను దేవతలు సర్వకాలములయందును అర్చించుచుందురు; గాన ఆపావనవృక్షములనుగూడ బూజింపవలయును. అచ్చటఁ గుంపలతీర్థము గలదు. అందు అవగాహనము సేయువారు సకలపాపములనుండియు విముక్తు లగుదురు. ఆక్షేత్రమున భీమానది గలదు. అందు నృసింహతీర్థము గలదు. అచ్చట నృసింహమూర్తి ముప్పదిరెండుకరములతో వెలసియున్నాఁడు; గావున దానికి ఆపేరు వచ్చినది. అచ్చటనే అగస్త్యతీర్థము గలదు. మఱియు గణపతితీర్థము, కౌమోదకీతీర్థము, కలశతీర్థము, సోమతీర్థము, బ్రహ్మతీర్థము, చక్రతీర్థము మున్నగు దివ్యతీర్థము లచ్చట ననేకములు గలవు. వానియందు స్నానము చేయువారిపాపములు అన్నియు పంచబంగాళమై పోవును. మఱియు తమ పితృదేవతలకును దమకునుగూడ మోక్షము సిద్ధించును.

తొల్లి నిగమశర్మయను నొక బ్రాహ్మణుఁడు పీఠికాపురమున వేశ్యాలంపటుఁడై సంచరించుచుండెను. కొన్నిదినములకు వారకాంతలు ఆతని ధనమంతయుఁ దోచుకొని లక్షాధికారియగు వానిని భిక్షాధికారినిఁ జేసిరి. అయినను ఆతఁడు వేశ్యలను విడువఁజాలక దొంగతనముచేసి ధనము తెచ్చి వాండ్రతోఁ గ్రీడించుచుండెను. కొంతకాలమునకు అదియు సాగకపోవుటచే తుదకు కట్టెలు అమ్ముకొని జీవింపసాగెను.

కొంతకాలమైనతరువాత నిగమశర్మ అచ్చటకు కొలఁదిదూరమున నున్న తన అక్కయింటికిఁ బోయెను. ఆతఁడు వేశ్యాలంపటుఁడైన పిదప భార్యను విడిచి పెట్టఁగా ఆమె అడుపడుచు నింటికి వచ్చి తలదాఁచుకొనెను. ఆతని తలిదండ్రులుగూడ కొమార్తె యింటికిఁ జేరుకొనిరి. అట్లు నిర్భాగ్యుఁడై వచ్చిన నిగశర్మను సోదరి చాల నాదరించి అభ్యం

గనము సేయించి అందఱ పం_క్తిని షడ్రసోపేతమగు అన్నము నిడి భోజన మైన తరువాత రహస్యస్థలమునకుఁ గొనిపోయి బుద్ధిచెప్పి జాగ్రత్త మసలు కొమ్ము అని చెప్పెను. ఆమె యాజ్ఞాప్రకారము ఆతఁడు అచ్చట తలిదండ్రులను సేవించుచు భార్యను సంతోషపఱచుచు భావ మఱఁదికి చేదోడువాదోడుగా నుండెను.

కొలఁదిదినములు జరుగునప్పటికి ఆతని మనస్సు మఱల పీఠికా పురమునందలి వారకాంతలమీఁదికిఁ బోయెను.తోడనే యాతఁడు ఒక నాఁటిరాత్రి సోదరి నగల నన్నిటిని హరించి పాఱిపోయెను; గాని మార్గ మధ్యమున కొందఱు చోరులు అడ్డుపడి ధనమంతయు దోచుకొని ఆతనిని మెత్తగ మర్దించి తమ మార్గమునఁ బోయిరి. ఆతఁడు లేచుట కైన శక్తిలేక పడియుండఁగా నొక కర్షకుఁడు పొలమునకుఁ బోవుచు నాతనిం గాంచి కనికరించి తన యింటికిఁ గొనిపోయి అన్నవస్త్రాదులు ఇచ్చి ఆదరింపసాగెను. కర్షకుఁడు కర్షకపత్నియుఁ జేయు సేవలవలన నిగమశర్మ కొలఁదిదినములయందే దేరికొనెను. మఱలఁ దొల్లిటివలె స్ఫుర ద్రూపి యయ్యెను. తోడనే కర్షకపత్నికి ఆతనియెడల మోహోదయం బయ్యెను.అది యెఱింగి నిగమశర్మపరమానందభరితుఁడై యామెతో రహస్యముగ క్రీడింపసాగెను. ఒకనాఁడు ఆగ్రామమునందలి వారెల్లరు ను గ్రామదేవతయుత్సవమున మునిఁగియుండిరి. నాఁటిసాయంకాలము కర్షకపత్నియు, నిగమశర్మయు 'ఈరహస్య మేమి?' యని ఏరికినిఁ దెలియ కుండ బయలు దేఱి రాత్రియంతయు అతిశీఘ్రంబుగ నడచి తెల్లవాఱు నప్పటికిఁ జాలదూరమునఁ గల యొక బోయపల్లెఁ జేరి బోయవృత్తిచే జీవించుచు సుఖంపసాగిరి. కొన్నిదినములకు వారికి ఒక కుమారుఁడు కలిగెను.

పిదప నిగమశర్మకు పశ్చాత్తాపము కలిగెను. 'విప్రుఁడనై పుట్టిన నాకు ఈకర్మమేల? శూద్రస్త్రీని తగుల్కొని వచ్చినదేగాక ఆమెయందు సంతానమును గూడఁ బడసిన నాకు ఇంక ఉత్తమజన్మము లేదు. రౌర వాదినరకములే శరణ్యములు' అని చింతించి యాతఁడు తన ప్రియు రాలితోఁ జెప్పకయే యొకరాత్రి తోఁచినట్లు బయలుదేఱిపోయి తెల్ల వాఱునప్పటికి నృసింహతీర్థముఁ జేరి మనోవైకల్యమువలన నిద్రాహార ములను విడిచి కృశించి యచ్చటఁ బ్రాణములను విడిచెను. వెంటనే య

మదూతలు వచ్చి వానినిఁ దీసికొని పోవుచుండఁగా నృసింహమూర్తి సుదర్శనము వచ్చి యమదూతలను బారఁదోలెను. నిగమశర్మకు ఈశ్వర సాయుజ్యము సంభవించెను. అట్టి పాపాత్మునకు సాయుజ్యముక్తి యెట్లు కలిగెనని నారదుఁడు అడుగఁగా పరమేశ్వరుఁడు 'అది పాండురంగని విహారప్రదేశము తీర్థము, క్షేత్రము, దైవము గల ప్రదేశమునఁ జని పోయినచో నెట్టిపాపికైనను మోక్షము కరతలామలక మగును' అని ప్రత్యుత్తర మిచ్చెను.

పాండురంగక్షేత్రమున ఎట్టిజంతువైనను ఈశ్వరానుగ్రహము నకుఁ బాత్రము కాఁగలదు. ఇందులకు ఉదాహరణముగ నొక ఇతిహాసము కలదు.

పూర్వము ఒకప్పుడు శ్రీకృష్ణుఁడు భీమరథీతీరమున వేణుగానము చేయుచు రాసక్రీడ సలుపుచుండెను. అప్పుడు ఒకయావు గానామాధుర్యమునకుసొక్కి పాలుకురియుచుండఁగా వాయువశమున పాలచుక్క లుకొన్ని శ్రీకృష్ణభగవానుని శిరమునఁ బడియెను. ఆకారణమువలన ఆగోవు అవసానమున సుశీల యను పేరుతో నొక భాగవతోత్తమునకుఁ గొమార్తయై పుట్టెను. తలిదండ్రులు ఆమెకు యుక్తవయస్సువచ్చిన తరువాత యోగ్యుఁడగు నొకవరుని వెదకి తెచ్చి వివాహము గావించిరి. సుశీలయెంత సుగుణవంతురాలయినను, ఎంత సుందరియైనను, భర్తకు ఆమెయనిన చాలకోపముగను అసహ్యముగను ఉండసాగెను. అతఁ డామెదెసకుఁ జూచుట మానివేయుటయే గాక అన్నవస్త్రములు గూడ సరిగనీయక బాధపెట్టసాగెను. సుశీల అందులకు వగవక 'నాభర్త, ఇహసౌఖ్యములను లెక్కింపకున్న బాధలేదు; గాని పరమునకైన నాశించుటలేదు. నేనేమి చేయఁగలను' అని విచారించుచుండెను.

ఒకనాఁడు ఒక బ్రహ్మచారి సుశీల యింటికి వచ్చి 'తల్లీ, ఆఁకలి బాధించుచున్నది. అన్నము పెట్టి రక్షింపుము' అని ప్రార్థింపఁగానామె 'ఓయీ, నీవు ఎచ్చటివాఁడవు? ఎందుఁ బోయెదవు?' అనియడిగెను. "నేను కొందఱు వటులతోఁ బండరినాథుని సేవించుకొనుటకై పాండురంగక్షేత్రమునకు బయలుదేఱితిని. ఇప్పుడే ఇక్కడకు వచ్చితిని. నాస్నేహితులు తెచ్చికొనిన యన్నము మిగులుటవలన దానిని దినిముందునకుఁ బోయిరి. నేను తెచ్చికొనినది అయిపోవుటవలనను క్షుద్బాధ

పీడించుటవలనను ఇట్లు వచ్చితిని” అని బ్రహ్మచారి మాఱుపల్కెను. అది విని సుశీల ‘అయ్యో, నేనేమి చేయఁగలను? నే నిప్పుడే భుజించితిని. కొంచెము అన్నము మిగిలినది. స్త్రీభుక్తశేషమును, అందును స్వల్పము నగు అన్నమును నీకెట్లు పెట్టుదాన?’ నని కటకటంబడఁగా నాతఁడు ‘తల్లీ, నీకు చింతవలదు. ఆయన్నమే త్వరగ పెట్టుము. లేకున్న నాప్రాణములు పోవును’ అని త్వరపెట్టెను. సుశీల తుదకుఁ జేయునది లేక బ్రహ్మచారిని ఇంటిలోనికిఁ గొనిపోయి అన్నము పెట్టెను.

అది భుజించి బ్రహ్మచారి ‘తల్లీ, నీవు పెట్టిన యన్నము భుజించుటవలన నాయాఁకలి పెఱిగిపోయినది. ఇంకను ఏమయిన నున్నచో పెట్టుము’ అనియెను. సుశీల తన భర్త గ్రామాంతరమున కరుగునపుడు మూటకట్టియిచ్చిన యన్నము పట్టుకొని పోకుండుటచే దానిని నప్పుడే చూచి బ్రహ్మచారికిఁ బెట్టెను. అదితిని ‘ఇంకను కావలె’ నని బ్రహ్మచారి పలికెను. అంతట సుశీల భర్తకొఱకు దాఁచియుంచిన పిండివంటలను బెట్టెను. బ్రహ్మచారికి అప్పటికిని ఆఁకలి తీరదయ్యెను. అపుడు సుశీల ఆశ్చర్యచకితయై, అగ్నిదేవునిఁ బ్రార్థింపఁగా వంటయిల్లంతయు సకలపదార్థములతోడను నిండిపోయెను. సుశీల పరమానందభరితురాలై ఆపదార్థములను అతనికి వడ్డింపసాగెను. బ్రహ్మచారి యెంతతిన్నను ఆపదార్థములు తఱుగకుండుటఁ జూచి నిజరూపముతో నవఁగా శ్రీకృష్ణమూర్తియై యెదుట నిలిచెను. సుశీలయు మహాశ్చర్యచకితయై కృష్ణభగవానుని వలగొని అనేకవిధముల మ్రొక్కి నిలువఁగా కృష్ణుఁడు ‘రమణీ, నీవు పెట్టిన భుక్తశేషమునకు పరమానందభరితుఁడనైతిని. పాతివ్రత్యమాహాత్మ్యమువలన దేవత లందఱును నీయాజ్ఞలను క్షణములో నెఱవేర్చుచున్నారు.

ఒక నగరమున నొక బ్రాహ్మణపుత్రుఁడు స్వధర్మములను విడిచి వేశ్యాలంపటుఁడై పాండురంగక్షేత్రమున నుండెను. ఆతఁడు నాప్రసాదమును స్వీకరించుటవలన నాసన్నిధిని వసించియుండుటవలనను మఱల బ్రాహ్మణుఁడై పుట్టి నిన్ను పెండ్లియాడినాఁడు. నీపాతివ్రత్యమే నీభర్తను మఱల సన్మార్గమునకు దెచ్చును. నీవు నన్ను జూచితివిగదా యని గర్వింపక తొల్లిటివలెనే పతిభక్తి గలిగి నన్ను సేవించుచుండుము’ అని యాదేశించి తిరోహితుఁ డయ్యె. ఇది జరిగిన మఱుదినముననే సుశీల

భర్త ఇంటికి వచ్చెను. తోడనే యాతని చిత్తవృత్తి మాఱిపోయెను. అంత నాతఁడు తన ప్రథమప్రవర్తనమునకుఁ జాల చింతించి భార్యను క్షమింపఁ బ్రార్థించి ఆమెతోఁ గూడ పాండురంగని బూజించుచు సుఖముగ నుండెను.

ఒకపుడు ఒక కాకి పండరినాథుని ఆలయమున కెదుట నున్న రావిచెట్టుమీఁద వసించుచుండెను. ఒకనాఁడు ఆలయమునందలి బలిపీఠము అన్నము చెదరియుండుటచే అసహ్యమై యుండఁగా ఆ కాకి ఆయన్నమును దిని ఆస్థలమును శుభ్రపఱిచెను.

పండరిపురమున నొక తటాకమున నొక హంస యుండెను. అది గ్రీష్మకాలమున వేఁడిమికిఁ దాళఁజాలక ప్రాతఃకాలమునందే జలకమాడి పాండురంగని గర్భాలయము సొచ్చి రెక్కలు విదిర్చుకొనఁగా వాని కంటియున్న జలము పాండురంగని శిరమునఁ బడెను.

పాండురంగని పరిచారికలలో నొకతె యొక చిలుకను పెంచుకొనుచుండెను. ఒకనాఁడు పరిచారిక స్నానము చేయుటకై ఆభరణములను దీసి యొడ్డున నుంచి జలములో దిగెను. అపుడు చిలుక హఠాత్తుగ ముత్యాలహారమును ముక్కునఁ గఱచుకొని పాండురంగని గర్భాలయము సొచ్చి ఫలభ్రాంతిచే ముత్యములను చిదుపఁబోగా హారము తెగి ముత్యములు చెదరి ఆలయమంతయు వ్యాపించి ఎంతో సౌందర్యమును గలిగించెను.

ఒక యెలుక పాము తఱుముకొని వచ్చుటచే పాండురంగని గర్భాలయము సొచ్చెను. పాముగూడ దాని వెంటరాఁగా దాని నెత్తిన మాణిక్యము ధగధగ మెఱయుటచే పాండురంగని సన్నిధియంతయుఁ బ్రకాశవంత మయ్యెను.

ఒక తేనెటీగ మధువు సంపాదించుటకు బయలుదేఱి గర్భాలయముసొచ్చి పాండురంగని మెడలోని హారమునందలి పూవుమీఁద వ్రాలి మధువును గ్రోలెను.

ఈరీతున పాండురంగని సేవించిన కాకి, హంస, చిలుక, పాము, తేనెటీఁగ ఈ యైదును సుశీలకు అయిదుగురు కుమారులై పుట్టినవి. సుశీలయు ఆమె భర్తయు బ్రతికియున్నంతకాలమును కుమారులకును ఇంకను ఇతరులకు అనేకులకును జ్ఞానోపదేశము గావించి అవసానమున

ఈశ్వరసాయుజ్యమును బడసిరి. వారి కుమారులు గూడ అట్లే బ్రతికి యున్నంతకాలమును పాండురంగని సేవించి, అనేకులకు తత్త్వోపదేశము గావించి, శ్రీకృష్ణమంత్రము నుపదేశించి తరణోపాయము సెప్పి అవసానమున సాయుజ్యముక్తినిఁ బడసిరి.

మున్ను విద్యాధరుఁ డొకఁడు విద్యాధరస్త్రీలతో విమానారూఢుఁడై విహారార్థము బయలుదేఱి పాండురంగని యాలయము మీఁదుగాఁ బోవుచుండఁగా క్షేత్రపాలకుఁడు కినిసి విమానముతోఁ గూడ వానిని క్రిందికి ఈడ్చివేసెను. విద్యాధరుఁ డపుడు సంగతి యంతయు నెఱిఁగి పాండురంగని సేవింపఁగా స్వామి ఆతనికి అభయ మిచ్చి పంపివేసెను.

ఒక బోయ జింకమీఁద బాణము విడువఁగా నది పరుగెత్తుకొని వచ్చి, సంగమతీర్థమున నుఱికి ప్రాణములఁ బాసి దివ్యదేహమును బడసి ఆకసమునకు ఎగిరిపోయెను. అది చూచి బోయ ఆశ్చర్యచకితుఁడై తాను గూడ నం దుఱికి ప్రాణములను బాసి ముక్తినిఁ బడసెను.

మున్ను పాండవులు ధౌమ్యుని యానతిచొప్పున పండరిపురము నకుఁ బోయి పాండురంగని సేవించి రాజ్యవైభవములం గాంచి అవసానమున మోక్షమును బొందిరి.

సుశర్మ యను పాపాత్ముఁ డొకఁడు గ్రీష్మకాలమున పద్మతీర్థమున స్నానముచేయుటకు దిగి హఠాత్తుగ నీటిలో మునిఁగి చనిపోయెను. యమకింకరులు వానిని యముని యెదుటకుఁ గొనిపోయిరి. చిత్రగుప్తుఁడు వాఁడు చేసినపనులు అన్నియుఁ జదివి చెప్పెను. అతఁడు చేసినవన్నియు పాపకృత్యములేయైనను తుదకు పాండురంగక్షేత్రమునందలి పద్మతీర్థమునఁ జనిపోవుటచే "వీఁడు స్వర్గమునకుఁ బోఁదగినవాఁడు" అని యముఁడు వానిని విమానముమీఁద స్వర్గమునకుఁబంపివేసెను. సుశర్మ స్వర్గమునఁ జాలఁ గాలము నుహేంద్రవైభవము ననుభవించి క్షీణపుణ్యుఁడై సుకీర్తియను పేరున భూమిమీఁద నొక రాజై పుట్టి, అనేక సత్కార్యములను గావించి పాండురంగని సేవించి అవసానమున సాయుజ్యమోక్షమును బడసెను.

పరమేశ్వరుఁడు మఱల నిట్లు చెప్పెను. నేను శ్రీహరిచే నుపదేశింపఁబడిన సిద్ధమంత్రమును జపించుచు సిద్ధేశ్వరుఁడు అను పేరుతో

పాండురంగక్షేత్రమున వసించియున్నాను. బలరామునకు కృష్ణుఁడు ఈమంత్రమును ఉపదేశించెను. రుక్మిణీదేవిగూడ ఈమంత్రమును జపించుచుండును. దీనిని నూఱుమారులు జపించినవారికి మోక్షము కరతలామలక మగును.

తొల్లి, నేను త్రిపురాసురులను సంహరించుటకై భీమాకృతిం దాల్చి, కదన మొనర్చినపుడు నాయొడలినుండి చెమ్మట పుట్టి నదియై మహావేగముసఁ బ్రవహింపసాగెను. పాండురంగక్షేత్ర పాలుఁడు దానిని ఆపఁజాలక శ్రీకృష్ణునిఁ బ్రార్థింపఁగా నాతఁడు సాక్షాత్కరించి "భీమాకృతిం దాల్చియున్న పరమేశ్వరుని శరీరమునుండి పుట్టితివి; గావున భీమరథినాఁబరఁగుదువు. వేగము నుపసంహరించుకొనుము" అని శాసించెను. అది యట్లే యయ్యెను; ఆభీమరథియందు స్నానముచేసి పాండురంగని దర్శించువారికి మోక్షము సిద్ధించును.

అగస్త్యుని శిష్యులలో ప్రయుతుఁడు అనుమునియొకఁడు కలఁడు. ఆతనికి అయుతుఁడు నియుతుఁడు అని యిరువురు కుమారులు గలరు. వారు అగస్త్యమునీంద్రు నతిభక్తితోఁ గొలుచుచుండిరి. అగస్త్యుఁడు వారియెడల మిగులఁ బ్రీతుఁడై వీరికిఁ దగిన కన్యలను దెచ్చి వివాహముసేయవలయునని తలంచి వీరికిఁదగు కన్యలు బ్రహ్మదేవుని కొమార్తలగు గాయత్రీసావిత్రులు తక్క నన్యలు గారని నిశ్చయించి సత్యలోకమునకుఁ బోయి తన రాకకుఁ గల కారణమును బ్రహ్మ కెఱింగించెను. బ్రహ్మ యడ్డు సెప్పక ఆతని కోర్కెను నెఱవేర్చెను. అగస్త్యుఁడు ఆకన్నియలను వెంట నిడుకొని వచ్చి సంగతి నెఱింగింపఁగా అయుతుఁడు గృహస్థాశ్రమము స్వీకరించుట కంగీకరింపఁ డయ్యె. అగస్త్యుఁడు ఆకన్యలనిరువురను నియుతునకే పెండ్లిచేసి "నీవు నాయానతి నతిక్రమించితివి; గావున ఇచ్చటనుండి వెడలిపొమ్ము" అని అయుతునిఁ బంపివేసెను. అయుతుఁడు అచ్చటనుండి హిమాచలసమీపమునకుఁ బోయి ఘోరతపస్సు ప్రారంభించెను. ఆతని తపోగ్నివలన లోకములు తల్లడిల్లఁ దొడంగఁగా ఇంద్రుఁడు కపటబ్రాహ్మణవేషముతో అచ్చటకు వచ్చి కూర్చుండెను. అయుతుఁడు ఇంద్రు నాదరించి ఆతిథ్యమిచ్చి నీవృత్తాంత మేమని యడుగఁగా "నేనుతీర్థయాత్ర సేయఁదలఁచి తిరుపతి, శ్రీరంగము సేవించితిని. పాండురంగక్షేత్రమునకుఁ బోవుచున్నాను. నీచరిత్ర చెప్పు"

మిని యింద్రుఁ డడిగెను. అయుతుఁడు తన వృత్తాంతము నెఱింగింపఁగా ఇంద్రుఁడు "ప్రయుతుఁడు నాకు బాల్యస్నేహితుఁడు. నీవు నామిత్రుని కుమారుఁడవు. నీదర్శనమువలన నాకు పరమానంద మైనది. నాయనా! గుర్వాజ్ఞ నేల యతిక్రమించెదవు? పోయి గృహస్థాశ్రమమునఁ బ్రవేశింపుము" అని బోధించెను; గాని అయుతుఁడు అంగీకరింపలేదు. ఇంద్రుఁడు 'ఈపని కామధేనువువలనఁ గాని సాధ్యపడదు' అని తలంచి స్వర్గమునకుఁ బోయి కామధేనువు నంపెను. అయుతుఁడు 'ఈయావు ఇందాఁక వచ్చిన తీర్థయాత్రాపరునిదై యుండు' నని తలంచి దానిని తోలివేసెను.

అంతట కామధేనువు సమీపమునందలి వాధూలముని చెంతకుఁ బోయి తన సంగతి యంతయుఁ జెప్పఁగా ఆతఁడు కోపించి అయుతుని చెంతకుఁ బోయి నీవు కప్ప వగు మని శపించెను. అయుతుఁడు భయభ్రాంతుఁడై పాదములమీఁద వ్రాలి శాపాంతమును వేఁడఁగా వాధూలముని 'ఓయీ, నీవు పాండురంగక్షేత్రమునకుఁ బోయి నృసింహతీర్థమున నృసింహసన్నిధి నుండుము. అచ్చట నీకు ఎప్పుడు ఆఁడుకప్పయందు సంతానము గలుగునో అప్పుడు శాపాంత మగు' నని చెప్పెను. అయుతుఁడు నృసింహతీర్థమును జేరి వెంటనే కప్ప యై పోయెను.

ఒకరాజపుత్రి నృసింహతీర్థమున స్నానమాడుటకు వచ్చి యొకకప్పను దీసి యొక వృద్ధబ్రాహ్మణుని మీఁద విసరెను. బ్రాహ్మణుఁడు అలిగి 'నీవు కప్పవగుదువుగాక' అని యామెను శపించెను. వెంటనే ఆమె ఆఁడుకప్ప కాఁగా అయుతుఁడు దానియందు సంతానముఁ బడసెను. వెంటనే వారిరువురును శాపములను బాసి శ్రీహరిసాయుజ్యమును బొందిరి. పాండురంగక్షేత్రమును సేవించినవారు ఎట్టి పాపాత్ములు అయినను సులభముగా ముక్తినిఁ గొందురు.

---

125. పుండరీకుఁడు.

శ్లో. "అంధస్య మే హృతవివేకమహాధనస్య, చోరైర్మహాబలిభిరింద్రియనామధేయైః,
మోహాంధకారకుహరే వినిపాతితస్య, లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్"

(15. లక్ష్మీనృసింహస్తోత్రము.)

లోహదండకనగరమున జహ్నువు అను నొక బ్రాహ్మణోత్తముఁడు కలఁడు. ఆతఁడు సర్వకాలసర్వావస్థలయందును, శ్రీమన్నారాయణుని పాదకమలములను ధ్యానించుచు సత్కర్మల నాచరించుచు తాపత్రయమును, ఈషణత్రయమును వర్జించి శ్రీహరినిఁ బూజించుచును గాలము గడుపుచుండెను. ఆతని భార్యపేరు సాత్యకి. ఆమె ఆతనికి అన్నివిషయములయందును తగిన యిల్లాలు.

ఆదంపతులకు లేకలేక చాలకాలము తీవ్రతపము సేసిన వెనుక నొక కుమారుఁడు కలిగెను. ఆతఁడు తేజశ్శాలి యగుటఁ గాంచి జహ్నువు పుండరీకుఁడు అని నామకరణము సేసి చాలఁ బ్రేమతోఁ జూచుకొనుచుండెను. సాత్యకి కుమారుని మిగుల గారాబముతోఁ బెంచుచు బుద్ధులు గఱపుచుండెను. ఆదంపతులు పుండరీకునకు ఎనిమిదియేండ్లప్రాయమున ఉపనయనమును, ఇరువదియేండ్ల ప్రాయమున చక్కని కన్యనుదెచ్చి వివాహమును గావించి ఆనందింపసాగిరి.

పుండరీకుఁడు సకలవిద్యలయందును అసమానపండితుఁ డయ్యెను, దుర్వృత్తులు ప్రారంభించెను. సాత్యకి గఱపిన బుద్ధులు పెడతలం బట్టెను. పుండరీకుఁడు తుదకు వేశ్యాలోలుఁ డయ్యెను. ఆతఁడు పెండ్లాముసంగతి ఆలోచింపలేదు. తలిదండ్రులవిషయముల గమనింపలేదు. భోజనసమయమునఁ దప్ప తక్కంగల యెల్లసమయములయందును ఆతఁడు వేశ్యావాటిక విడిచి వచ్చుట మానివేసెను.

జహ్నువును, సాత్యకియు, కుమారుని బుద్ధిని మఱలించుటకుఁ బెక్కుపాయములను బ్రయోగించిరి; గాని ప్రయోజనము లేకపోయెను. వేశ్యాసంపర్కమువలని దోషములను జెప్పినను, పుండరీకుఁడు వారియాజ్ఞను బాలింపలేదు. మీఁదుమిక్కిలి తోఁకత్రొక్కిన త్రాఁచువలె మండిపడుచు లేచి 'ఎందుల కెందుల కని యూరకొన్నకొలఁదియు మేఱమీఱుచున్నారు. మీచిత్తము వచ్చినట్లు మీ రేడ్వుఁడు; అందులకు నాయభ్యంతర మేమియు లేదు; గాని నాప్రస్తావనతో నేవలసిన యవసరము మీకు ఏమియు లేదు' అని గద్దించి పలికి, అంతటితో నూరకుండక చింతబరికెలతో వారిని మోది తన భార్యను వెంట నిడుకొని మఱియొకచోటికిఁ బోయెను.

జహ్నువును, సాత్యకియు తమ పూర్వపాపములు ఇట్లు ఫలించె నని కుందుచు ఎందేనిఁ బోయి కాలము గడపుటకు యోచింపసాగిరి. ఇంతలో కొందఱు కాశికిఁ బోవుచు మార్గవశమున లోహదండనగరమునకు వచ్చి జహ్నువు నింట బసచేసిరి. ఆతఁడు వారి సంకల్పమును దెలిసికొని భార్యతోఁ జెప్పి యొప్పించి కాశికి బయలుదేఱెను.

కొలఁది దినములు గడచిన తరువాత పుండరీకునకుఁ గూడ కాశికిబోవలయు నను సంకల్పము కలిగెను. అంతట నాతఁడు విశేషధన మిచ్చి వారకాంతల నందఱను ఒప్పించి రెండుగుఱ్ఱములను గొని ఒకదానిపై భార్య నెక్కించి రెండవదానిపై దా నెక్కి హుటాహుటి నడకలతోఁ బయనము సాగించెను. జహ్నువును, సాత్యకియు, ముందు పోయినను, వృద్ధులగుటచే మెల్లఁగ నడచి పోవుచుండిరి. పుండరీకుఁడు అట్లు గాక నుంచి గుఱ్ఱములమీఁదఁ బోవుచుండుటచే ఒకటిరెండుదినములయందే వారినిఁ గలసికొని వారు విశేషశ్రమ ననుభవించుటఁ జూచుచుండియు ఏమియు మాటాడక గుఱ్ఱము నడాయించి ముందునకుఁబోయి కాశికి సమీపమునఁగల కుక్కుటమున్యాశ్రమము చెంగట విడిసెను.

కుక్కుటముని పరాశరాదులవలె తపోనిష్ఠుఁడై యుండు ముని కాఁడు. ఆతఁడు ప్రాతఃకాలము లేచినది మొదలు రాత్రి శయనించు వఱకుఁ జేయు పని మాతాపితృశుశ్రూష. పుండరీకుఁడు ఈపనియందు నిద్రాహారములే గాక నిత్యకృత్యములగు స్నానసంధ్యాద్యనుష్ఠానములను గూడ లెక్కసేయలేదు. మాతాపితృదేవతలకంటె నిఁక గొప్ప దేవత లెందుగలరు? కుక్కుటముని చాల గొప్పవాఁడని విని పుండరీకుఁడు మూఁచిన స్థ మునిని పోయి "అయ్యా, ఇచ్చటికిఁ గాశీనగరమెంత దూరమున్నది?" అని యడిగెను. కుక్కుటముని "నేను కాశీనగరము అను శబ్దమునే వినలేదు. అది యెచ్చట నున్నదో ఎంత దూరమున నున్నదో నాకు దెలియదు." అని బదులు చెప్పెను.

ఇది విని పుండరీకుఁడు తొలుత నాశ్చర్యపడి, పిదప "ఇన్ని యేండ్లు గడచినవి. ముని నని పేరు పెట్టుకొని ఆశ్రమము నేర్పఱుచుకొంటివి. ఏమి ఫలము? పరమపావనమగు కాశీనగరము పేరే యెఱుంగవు. తటాకమున మహిషము ఎంతకాలము ఉన్నను, పద్మసౌరభము గ్రహింపఁ

జాల నట్లు ఇంత సమీపమున నుండియు నీవు గంగామాహాత్మ్యము నైన నెఱుంగఁజాలకపోయితివి. ఇఁక నిచ్చట నుండరాదు. నిన్ను గాంచిననే సకల పాపములును జుట్టఁబెట్టుకొనును" అని చివాలున లేచి తనభార్య యున్నచోటికిఁ బోయెను.

రెండుజాముల రాత్రివేళ పుండరీకునకు నిద్రాభంగ మయ్యెను. అగుట నాతఁడు లేచి కూర్చుండి అదియు నిదియు యోచించుకొను చుండఁగా, మలినరూపిణులగు ముగ్గురుస్త్రీలు కుక్కుటమున్యాశ్రమము సొచ్చిరి. వారెనిఁ జూచి పుండరీకుఁడు తొలుత పిశాచభ్రాంతిచే భయ కంపితుఁడై కిక్కురుమనకుండ గూర్చుండెను. ఇంతలో ఆస్త్రీలుమువ్వు రును కుక్కుటముని పర్ణశాలను ఊడ్చి అలికి ముగ్గులు పెట్టి ఆశ్రమ మంతటను నీళ్లు చల్లి మునిచెంగట సెలవు గైకొని చూచుచుండఁగా తటిల్లతలవలె మెఱసిపోవు దేహములతోడను గూడిన రమణీమణులై వెనుదిరిగిరి.

వారు సమీపించిన తరువాత పుండరీకుఁడు వారినిఁ బిలిచి "ఇందాఁక మీరు అట్లు పోవునపుడు ఘోరాకారిణులయి యుంటిరి. ఇపుడు దేవతాస్త్రీలకంటె నధికముగా మెఱసిపోవుచున్నారు. ఇందుల కును, అందులకును గారణ మేమి" యని ప్రశ్నించెను. అది విని యులి కిపడి ఆమూవురలో నొకతె ఈతని దిక్కు మొగంబై "దుర్మార్గుఁడా, పాపాత్ముఁడా, నీయెదుట నిలువఁదగదు" అని తన వారిని వెంటనిడుకొని బయలుదేఱెను. అంత పుండరీకుఁడు తటాలున లేచి ఆమె పాదములు మీఁద వ్రాలి "దేవీ, ఈదీనుని రక్షింపవలయును. నాకు పశ్చాత్తాపము కలిగినది. నాపాపముల నన్నిటిని దహించి నన్ను పరిశుద్ధునిఁ జేయుము. తొలుత నీవెవరో ఎఱింగింపుము" అని దీనముగఁ బ్రార్థించెను.

అపుడు ఆమె కరుణార్ద్రహృదయయై, "ఓరీ, నీయంతటి పాపాత్ముఁడు ఇఁక నీజగంబున లేఁడు. అయినను, నీపూర్వపుణ్యవశమున నీవు ఈకుక్కుటముని ఆశ్రమము త్రొక్కితివి, అగుటచే నీపాపములు అన్నియుఁ దొలఁగిపోయినవి; గావుననే మమ్ము చూడఁగలిగితివి. ఇఁక మా వృత్తాంతముల నెఱింగించెద వినుము. ఆమె సరస్వతి; ఈమె యమున; నాపేరు గంగ. మేము మువ్వురమును ప్రతిదినమును మాయందు అవ

గాహనముసేయు వారి సకలపాపములను హరించి వానిని మేము పొందుదుము. ఆపాపములవలననే మాదేహములు మొదట నీవు చూచినట్లు మలినములును, ఘోరములును అయి యుండును. ఈకుక్కుట మహామునికి సేవలు సేసి మేము ప్రతిదినమును మేము ఆమహాపాతకములను తొలంగించుకొనుచుందుము. ఈమహాముని అనవరతమును మాతాపితలను బూజించుచుండును. అంతకంటె నీతఁడు సేయుతపస్సు ఏమియు లేదు. అంతకంటె నీతఁ డేమియు నెఱుంగఁడు. కేవలము మాతాపితృపూజవలననే ఈతఁడు మహర్షికులతిలకులు ఎవ్వరును పొందఁజాలని మహిమను గాంచి యున్నాఁడు. మామహాపాతకములను ఈతఁడు తక్క నన్యులు తొలంగింపఁజాలరు. మాతాపితృశుశ్రూషయందు అంత మాహాత్మ్యము ఉన్నది. నీవు మాతాపితలను కొట్టి తిట్టి, మఱియు సకలవిధములను అవమానపఱిచిన దురాత్ముఁడవు. మాతాపితృశుశ్రూష తక్క మఱేదియు నీపాపములను దొలంగింపఁజాలదు. నీయదృష్టము వలన నీకు మాదర్శన మైనది. ఇప్పుడైనను బుద్ధి తెచ్చుకొని తలిదండ్రులను బూజింపుము" అని చెప్పి, తనవారిని వెంట నిడుకొని వెడలి పోయెను.

పుండరీకుఁడు ఇది విని వెంటనే కుక్కుటముని చెంగటకుఁ బోయి పాదములమీఁద వ్రాలి అపరాధమును క్షమింపఁ బ్రార్థించి ఆశీర్వచనముఁ బడసి పత్నితోఁ గూడ గుఱ్ఱములమీఁద మఱల వెనుకకుఁ బోయి తలిదండ్రులను వెదకి పట్టుకొని వారికి సాష్టాంగనమస్కారములు ఆచరించి వారిని గుఱ్ఱములమీఁద ఎక్కించి కాశికిఁ బయలు దేఱెను. జహ్నువును, సాత్యకియు పుండరీకుఁడు మఱల సన్మార్గమునకు వచ్చెను గదా యని మిగుల నానందింపసాగిరి. పుండరీకుఁడు యుక్తసమయమున కాశీ నగరమునఁ బ్రవేశించి అచ్చటఁ దలిదండ్రులు చేయవలసిన కృత్యములనన్నిటని సాంగముగాఁ జేయించి వారిని అతిభక్తితో కుక్కుటముని కంటె అధికముగా శుశ్రూషింపసాగెను.

తొల్లి, వృత్రాసురుఁడు దేవేంద్రుని జయింపఁగోరి పాతాళమున తపస్సు చేయుచుండఁగా ఇంద్రుఁడు అది యెఱింగి అచ్చటకుఁ బోయి వాని తలను వజ్రాయుధముతో ఖండించెను. అపుడు వృత్రాసురుఁడు "తపస్సమాధినిష్ఠుఁడనై యుండఁగా నీవు నాశిరస్సును ఖండించితివి;

గావున భూమిమీఁద ఇటుకవై పడియుండుము” అని శపించి ప్రాణములను విడిచెను. వెంటనే ఇంద్రుఁడు,—

శ్లో. “శ్రీమత్పయోనిధినికేతన చక్రపాణే, భోగీంద్రభోగమణిరాజితపుణ్యమూర్తే,
యోగీశశాశ్వతశరణ్య భవాబ్ధిపోత, లక్ష్మీనృసింహ మమ దేహికరావలంబం.”
(1. లక్ష్మీనృసింహస్తోత్రము)

అని ప్రార్థింపఁగా శ్రీహరి “నీకు విచారము వలదు. నీవు పుండరీకాశ్రమమున ఇటుకవై యుందువు. ఒకప్పుడు నీమీఁద నేనునిలుతును. అపుడు నీకు శాపాంత మగును” అని చెప్పెను. వెంటనే ఇంద్రుఁడు పుండరీకాశ్రమమున ఇటుకయైపోయెను.

శ్రీహరి పుండరీకుని మాతాపితృశుశ్రూషకు మెచ్చి పుండరీకుని అనుగ్రహించి వచ్చెద నని లక్ష్మికిఁ దెలిపి పుండరీకుకుని యెదుట దివ్యమంగళవిగ్రహుఁడై నిలిచెను. పుండరీకుఁడు ఆతనింగాంచియు,ఆతఁడు మహావిష్ణువు అని యెఱింగియు, చేయుచున్న మాతాపితృసేవను మానలేక దగ్గఱ నున్న ఇటుకను ముందునకు విసరి “నేను వచ్చునంత వనుక ఆయిటుకపై కూర్చుండుము” అని పలికెను. తన పని తాను చేయసాగెను. శ్రీహరి అచంచల మగుపుండరీకుని మాతాపితృభక్తికి ఆనందించి, మందహాసముతో ఇటుకమీఁద నిలిచెను. ఆయిటుక వృత్రాసురునిచే శపింపఁబడిన దేవేంద్రుఁడు గావున తొల్లి శ్రీహరిచేసిన సమయము చొప్పున శ్రీహరి తనపై నెక్కిన వెంటనే నిజరూపమును బడసి శ్రీహరికి మ్రొక్కి సెలవు గైకొని తన నగరమునకుఁ బోయెను.

పుండరీకుఁడు కొంతసేపటికి తలిదండ్రుల సేవను ముగించుకొని తటాలున శ్రీహరి పాదకమలములకు అనేకవందనములు అర్పించి“ అపరాధిని; రక్షింపుము” అని ప్రార్థించెను. శ్రీహరి పుండరీకునిఆదరముతో లేవనెత్తి “వత్సా, నీమాతాపితృభక్తికి మెచ్చితిని. నీకేక నెందునుకొదువ యుండఁబోదు. వలయువర మిచ్చెద వేఁడుకొనుము” అని పలికెను. పుండరీకుఁడు పరమానందభరితుఁడై మఱల ననేకవిధముల వినుతించి “శ్రీహరీ, నీసాక్షాత్కారలాభమును బడసినపిదప కోరవలసినవరములు ఉండవు. అయినను, విఠ్ఠల్ అను పేరుగల ఇటుకపై నిలిచితివి; గావున, విఠలమూర్తి అను పేరుతో నీవు శాశ్వతముగా నిచ్చట వసించి యుండవలయును. నిన్ను దర్శించువారిసకలపాపములును దర్శనమాత్ర

ముననే భస్మపటలము గావలయును. ఈప్రదేశము పుండరీకపురము (పండరిపురము) అని నాపేరుతో వెలయునట్లు నీవు పుండరీకవరదుఁడ వనియు, పాండురంగఁడ వనియు పిలువఁబడునట్లును అనుగ్రహింపవలయును. మఱియు ఇచ్చట సర్వోత్కృష్టమైన తీర్థము ఉండునట్లు అనుగ్రహింపవలయును" అని ప్రార్థించెను. వల్లె యని శ్రీహరి యంగీకరించెను. ఆమధ్యాహ్నముననే త్రిలోకములయందును గల సకలనదులును వచ్చి అచ్చటఁ ద్రవ్వఁబడిన తీర్థమునఁ బ్రవేశించెను.

లక్ష్మీదేవి శ్రీహరి విశ్లేషమునకు ఓర్వఁజాలక అచ్చటకు వచ్చి ఆతని యెడమప్రక్క నిలిచెను. దేవేంద్రుడు మయునిఁ బిలిచి "భూలోకమునకుఁ బోయి విష్ణుచక్రము మధ్యగల పండరిపురమున విఠల్ అను ఇటుకపై శ్రీహరి వెలసియున్నాఁడు. నీవు అచ్చట గోపురప్రాకారములును, మహోన్నత మగు ఆలయమును అందమైన నగరమును నిర్మింపుము" అని యాజ్ఞాపింప మయుఁడు అట్లే సకలమును నెఱవేర్చెను.

పండరిపురము తీర్థము, క్షేత్రము, దైవము గల దివ్యప్రదేశమై వెలయుచున్నది. అంతకంటె గొప్పస్థలము లేదు.

శ్రీమహాభక్తవిజయము.

చతుర్థభాగము.

దేశభక్తులు.

లోకమాన్యబాలగంగాధరతిలకు.

బొంబాయిరాజధానియందలి రత్నగిరి యను పట్టణమున గంగాధరరామచంద్రతిలకు అను నొక గొప్ప పండితుఁడు ఉండెను. ఆతఁడు మహారాష్ట్రుఁడు; చిత్పావనబ్రాహ్మణుఁడు; గణితశాస్త్రమునందును, ఆంగ్లేయభాషయందును, ఆతనిపాండిత్యము అసమానము. ఆతని బోధనాశక్తి అనుపమానము. ఆతఁడు సర్కారులో అసిస్టంటు డెప్యూటీ యెడ్యుకేషనల్ ఇన్‌స్పెక్టరు అను గొప్పపదవి వహించి పేరు నడసెను. మనబాలగంగాధరతిలకునకు ఆతఁడు జనకుఁడు.

తిలకు క్రీస్తుశకము ౧౮౫౬ సంవత్సరము జూలై ౨౩-వ తేదీని అవతరించెను. తండ్రికి తిలకునెడల చాల ప్రేమగలదు. తిలకు పసితనంబుననే తండ్రివద్ద ఆంగ్లభాషను, మహారాష్ట్రభాషను నేర్చుకొని పదునాఱవయేట తండ్రినిఁ గోలుపోయెను. అంతట మేనమామయు, పినతండ్రియు, నాతనిం జేరఁదీసి విద్యాబుద్ధులు గఱపింపసాగిరి. వారిపోషణమున ఆతఁడు ఇంగ్లీషుభాషలో బి. యే. పరీక్షలో జయమంది తన ఇరువదిమూఁడవయేట న్యాయశాస్త్రపరీక్ష (యల్, యల్, బి) లో నుత్తీర్ణుఁడు అయ్యెను. న్యాయశాస్త్రమును జదువునపుడు తిలకునకు ఆగరుకరు అను నతనితోఁ జెలిమి గలిగెను. వారిరువురును ఎపుడును ఒక చోటనే వసించియుండి ఏకాభిప్రాయులై చరింపఁజొచ్చిరి.

తిలకునకు సేవకవృత్తి యనినఁ జాలతలనొప్పి. తన తండ్రి సర్కారులో నౌకరీ చేసినను ఆతనికి అది యిష్టము లేదు. ఒకపుడు ఆతఁడు ఆగరుకరుతో నీవిషయము ప్రస్తావించెను. ఇరువురును తుదకు "సర్కారులో నౌకరీచేయఁగూడదు. దేశసేవచేయువలయును. సకలదాసముల

బాలగంగాధరతిలకు.

ఫ క్త :—774.

యందును విద్యాదానము ఉత్తమము; గావున ప్రజలకు విద్యగఱపుటకు పాఠశాల ప్రారంభింపవలయును" అని నిశ్చయించుకొనిరి. ఇది విని వారి తోడివారు సంగతిసందర్భముల నెఱుఁగఁజాలక వారిని ఎగతాళిసేయఁ జొచ్చిరి. అయినను వారు అందులకు చలింపలేదు.

విష్ణుకృష్ణచిపళూణకరు అను నాతఁడు మహాకవి. ఆతఁడు మహారాష్ట్రభాషలో అనేక చంపూకావ్యములను వ్రాసి ప్రసిద్ధి వడసెను. ఆతఁడు దొరతనమువారివలన చిక్కులుపడి విముక్తుఁడై వచ్చిన పిదప పాఠశాలను స్థాపింపవలయునని తలపోయసాగెను. ఇది విని తిలకును, ఆగరుకరును మహానందభరితులై ఆతనితోఁ జేరి మాటాడిరి. వారికి మాటలు కలిసెను. ఇంతలో యం, బి, నామజోషి యను నాతఁడును వీరితోఁ జేరెను. తుదకు తిలకు, చిపళూణకరు, నామజోషి, ఈముువ్వురును గలిసి పూనానగరమున 2-1-1880 సంవత్సరమున నూత్నపద్ధతులతో ఆంగ్లేయపాఠశాలను స్థాపించి స్వల్పవేతనములు గైకొనుచు తామే నడుపసాగిరి. కొలఁదిదినములయందే ఆగరుకరు ఎంఏపరీక్షలో జయమంది కలిసికొనెను. వి. యస్ ఆప్టె యను నాతఁడుగూడ వారికి బాసట యయ్యెను.

ఒక్కపాఠశాలనుస్థాపించుటతోఁ వారికితృప్తికలుగలేదు. వారందఱును వార్తాపత్రికలనుప్రారంభించి దేశములో విజ్ఞానమును వెదచల్లవలయు నని నిశ్చయించుకొనిరి. ఈనిశ్చయముతోఁ చిపళూణకరు రెండు ముద్రాక్షరశాలలను గొని ఒకదానికి "ఆర్యభూషణము" అనియు, రెండవదానికి 'చిత్రశాల' యనియు పేరులు పెట్టెను. వెంటనే "కేసరి" అను పత్రిక మహారాష్ట్రభాషయందును, "మరాటా" యను పత్రిక ఇంగ్లీషు భాషయందును ప్రారంభింపఁబడెను. చిత్రశాల చిత్రపుస్తకములనేర్పుటకు ఏర్పఱుపఁబడెను. అది అనేకవిఘ్నములకు లోనయ్యెను; గాని తుదకు అన్నిటిని గడచి నిలిచెను.

ఇట్లుండఁగా కోల్హాపురరాజగుశివాజీరావు పరిభవింపఁబడెను. అది అన్యాయ మగుట తెలిసికొని తిలకును ఆగరుకరును రాజును పరిభవించిన వారిని గుఱించి కఠినముగ వ్రాసిరి. దానిమీఁద రాజద్రోహమును మోపి దొరతనమువారు వారిని ఇరువురను న్యాయస్థానమునకు ఈడ్చిరి. ఈయభియోగము విచారింపఁబడుచుండఁగా చిపళూణకరు

స్వర్గమునకుఁ బోయెను. వెంటనే తిలకు ఆగరుకరులకు మూఁడునెలల విడిక్కైదు విధింపఁబడెను. అయినను ఆప్టి, నామజోషి ఈయిరువురును జంకక తమ మిత్రుల కార్యములను దామే నిర్వహింపసాగిరి. ప్రజలు అందఱును తిలకును, ఆగరుకరును నిర్దోషులు అనియు, ప్రజాసౌఖ్యము నిమిత్తము పాటుపడుమహానుభావులు అనియు ఎఱింగి పాఠశాలకు అనేకవిధముల సాయపడఁజొచ్చిరి. కారాగారమునుండి విముక్తుఁడైన తరువాత సర్వకార్యములను స్వయముగ నిర్వహింపసాగెను. ఆప్టియు, ఆగరుకరును విద్యావిషయికములను చక్కబెట్టఁజొచ్చిరి.

వీరు తాము స్థాపించిన పాఠశాల శాశ్వతముగ ప్రజోపయోగము సలుపుచుండునది కావలయు నని భావించి దక్షిణహిందూస్థాన విద్యాసంఘమును స్థాపించిరి. అందు అచిరకాలమునందే వి. బి. కేల్కారు, ధారప, యస్. గోలు, గోకులకృష్ణుఁడు, భాను, పతంకరు మున్నగు విద్వాంసులు చేరిరి. అందఱును శాశ్వతసభ్యులుగ నుండవలయు నని నియమించికొని 1885 సంవత్సరమున ఫెర్గుసన్ కలాశాలను స్థాపించి స్వయముగ నుపాధ్యాయులై సకలమును తమచేతులమీఁదనే నిర్వహింపసాగిరి. ప్రతిసభ్యుఁడును ఇరువదిసంవత్సరములు అందుఉపాధ్యాయత్వము వహింపవలయు నని వారునిర్ణయించుకొనిరి. కలాశాలానిర్మాణమునకు స్థలమునిచ్చిదానిపోషణమునకుఁగూడదొరతనమువారు ద్రవ్యసహాయమును జేయుచుండిరి. కొలఁదికాలమునందే నవీనాంగ్ల పాఠశాలయు, ఫెర్గుసన్ కాలేజీయు వృద్ధి పొందెను.

కొన్నిదినములు గడచిన తరువాత భారతసంఘములను సంస్కరింపవలయు నని ఆగరునకు సంకల్పము కలిగెను; గాని తిలకునకు ఇది కిట్టినది గాదు. భారతసంఘమున దోషములు లేవని యాతని యభిప్రాయము. ఇదిముఖ్యకారణముగను మఱికొన్నికారణములవలనను వారికి మనస్పర్థలుజనించెను. వెంటనే తిలకు విద్యాలయముతోడి సంబంధమును వదలుకొనెను. ఆగరుకరు కేసరిపత్రికను విడిచి "సుధాకర" అను క్రొత్తపత్రికను ప్రారంభించెను. కేసరిని తిలకు చేపట్టెను. ఆతనియనుజ్ఞ చొప్పున కేల్కారు కేసరి, మరాటాపత్రికలకు అధిపతియై నిర్వహింపఁ దొడఁగెను. తిలకు ఆసంఘమును విడిచినవెంటనే పతంకరును, నామజోషియు గూడ విడిచి వచ్చిరి.

తిలకు విద్యాసంఘమునువిడిచి తన్మూలమున బోధనమును గూడ మానుటవలన విద్యార్థులకు చాల విచారము గలిగెను. తిలకువంటిప్రేమ గల ఉపాధ్యాయుని, దేశభక్తి అవతారమనిచెప్పఁదగిన దేశికుని పండొలిచి చేతిలోఁ బెట్టునట్లు సకలవిషయములను వివరించిచెప్పు బోధకుని విడువలేకవిడువలేక వారు చాల తహతహపడిరి. గణితశాస్త్రమున తిలకును మించినవారు ఎందును గానిపింపలేదు. ఆతఁడు విజ్ఞానసర్వస్వమని అనేకులు కొనియాడసాగిరి.

ఇట్లు ఉండఁగా బంగాళాదొరతనములో నొక క్రొత్తచట్టము ఏర్పఱుపఁబడుటకుఁ బ్రయత్నములు జరుగసాగెను. తిలకు దానికి ప్రతిఘటించి నిలిచెను. ఏమన? ఆతనికి ఇంగ్లీషువారుగాని మఱియితరు లెవరైనఁగాని భారతీయులమతమువిషయమున నధికారులు అగుట ఇష్టము లేదు. ఈకారణమువలనపునహాలో రెండుకక్షులుఏర్పడెను. తిలకుపూర్వాచారపరాయణులకక్షలోఁ జేరెను. మఱియునాతఁడుఅటు కలాశాలను విడిచిన వెంటనే ఇట్లు న్యాయశాస్త్రమును బోధించి పాఠశాల ప్రారంభించెను. ప్లీడరీపరీక్షకు చదువుచెప్పు పాఠశాలలను అంతవఱకు దేశీయు లెవరును స్థాపించియుండలేదు. ఈసమయమున కేల్కారు కలాశాలలో కార్యభార మెక్కువయైన కారణమున మరాటాపత్రికాధిపత్యమును విడిచిపెట్టెను. కొలఁదిదినములయందే గోకులకృష్ణుఁడును కేల్కారును గలిసి ఆర్యభూషణముద్రాలయమును దాము పుచ్చుకొనిరి. కేసరీ మరాటాపత్రికలు తిలకు ఆధిపత్యముక్రిందకు వచ్చినది మొదలు ఆపత్రికలకు పాఠకులు ఎక్కువైరి; గాని ఈసమయమున నాతనికి కారాగారశిక్ష విధింపఁబడెను.

కారాగారమున నీతఁడు సర్వదా ఋగ్వేదమును భగవద్గీతలను జదివి "ఓరయన్, లేక, ది. ఆంటిక్విటి ఆఫ్ వేదాస్"అను నొకగొప్ప గ్రంథమును వ్రాసెను. గ్రీకు దేశపురాణ్యులును, భారతదేశపురాణ్యులును గలిసియున్నపుడు ఋగ్వేదము రచింపఁబడెనని తిలకు అందు అనేకకారణములను జూపుచు నిర్ణయించెను. ఆతని గ్రంథములను మాక్సుముల్లరు మున్నగు విదేశీయపండితులు అనేకులు ఆశ్చర్యముతో వినుతించిరి. మొదటినుండియు రాజకీయవిషయములయందు ఈతఁడు కాంగ్రెసుపక్షమునఁ బనిచేసెను. 1893వ సంవత్సరమున మహమ్మదీయులకును, భార

తీయులకును కలహములుసంభవించెను. ఈతఁడు ఆకలహముల నడఁపఁ
ప్రయత్నించుచు దీనికంతకును దొరతనపుటుద్యోగస్థులే కారకులు అని
నిర్భయముగా తన పత్రికలలోఁ బ్రకటించెను. దానిమీఁద బొంబాయి
గవర్నరు మున్నగు నుద్యోగులు ఈతనిని భయపెట్టిరి; గాని ప్రయోజ
నము లేకపోయెను. ఇది యైనతరువాత నాతఁడు పాఠశాలలయందు
బాలురకు బోధింపఁబడు గ్రంథములు సర్వాసహ్యములుగా నున్నవని
ఆందోళనము ప్రారంభించెను. మఱియు నాతఁడు మహారాష్ట్రయువకుల
హృదయసీమలయందు దేశాభిమానబీజములను నాటుటకై గణపతి
మహోత్సవమును శివాజీమహోత్సవమును బ్రారంభించెను.

వీరపూజ దేశీయులను బాగుసేయు సాధనములలో నొకటి.
ఈకాలమున మన దేశీయులు వీరులు, దేశాభిమానులును గావలయు
నను నెడల పూర్వవీరుల చరిత్రలను జదువుటయు, వారినిఁ బూజించు
టయు తప్పక ఆచరింపవలసినవిధులు. ఈసంగతి నెఱింగియే తిలకుమహా
శయుఁడు శివాజీమహోత్సవమును ప్రారంభించెను. శివాజీ మహారాష్ట్ర
దేశమును ఉద్ధరించి దానికి విశ్వవిఖ్యాతిని గలిగించినవాఁడు; గావున
మహారాష్ట్రులు అందఱును తిలకు పదాంకములు ననుసరించి శివాజీనిఁ
బూజింపఁదొడగిరి. కొలాబాజిల్లాలోని రైగాడుకోటలో శివాజీసమాధి
శిథిలప్రాయమై యుండెను. దానిని బాగుచేయుటకు ధనము కావలయు
నని కోరుచు తిలకు శివాజీ మహిమను కేసరిపత్రికలో నుగ్గడించుచు
వ్రాయఁగా అచిరకాలమున ఇరువదివేలరూపాయలు సమకూడెను.
తోడనే ఆపని పూర్తిచేయఁబడెను.

1895-వ సంవత్సరమున పునహానగరమునసమావేశమయినభార
తదేశీయమహాసభాకార్యనిర్వహణమునకుఁ గాను తిలకు కార్యదర్శిగా
నేర్పఱుపఁబడెను. ఆతఁడు తత్సంబంధమైన పనులను అతిజాగ్రత్తతో
చేయించుచుండఁగా దేశీయమహాసభగూడు మంటపమునందే భారత
సంఘసంస్కరణసభగూడ సమావేశమగునని తెలియవచ్చెను. తోడనే
తిలకు తన పనికి రాజీనామా ఇచ్చివేసెను.

మఱుసంవత్సరమున బొంబాయిరాజధానిలో గొప్ప కఱవు తట
స్థించెను. అపుడు తిలకు కఱవుచట్టములో నిర్ణయింపఁబడినప్రకారము
ద్రవ్యము నిమ్మని దొరతనమువారి నడుగుచు అప్పుడు చేయవలసిన

కృత్యములను సూచించెను; గాని ఏమియు ప్రయోజనము కలుగలేదు. అన్నములేక అనేకజనులు మాడిపోఁజొచ్చిరి. అపుడు తిలకు పునహా వర్తకులవలన చాలసాయమును బడసి ఈ మోపహతులకు అన్నము దొరకునట్లు చేసెను.

బొంబాయిరాజధానిలో మహామారిజాడ్యము ప్రవేశించెను. దానివలన అనేకులు మృత్యువువాతఁ బడసాగిరి. ప్రభుత్వోద్యోగులుతగిన సౌకర్యములను గలిగింపఁబూనిరి; గాని పునహాలో దొరతన పునౌకరులు ప్రజలను అనేకవిధముల హింసింపసాగిరి. అది చూచి సహింపలేక తిలకు వారిదౌర్జన్యమును వెల్లడించుచు ఆయుర్వేదౌషధ శాలలనుస్థాపించి అనేకులకు సేవసేయ సాగెను. నగరములోనివారు అనేకులు ఊరు విడిచి లేచిపోయినను ఈతఁడు మాత్రము జంకలేదు. ఇట్లు ఈతఁడు అనేకవిధములఁ బాటుపడుచుండఁగా దొరతనమువారు ఈతనిమీఁద రాజద్రోహమును మోపి శిక్షించిరి.

తిలకుకర్మయోగి. ఆతనికిఁ గ్రియలతోనే కాని మాటలతోఁ బని లేదు. ఆతనికి భగవద్గీత యనినఁ బరమప్రీతి. "పనిచేయుము. ఫలముకొఱకు ఎదురుచూడకుము." ఇదియే యాతనిసిద్ధాంతము. ఆతఁడు నిర్దోషుల ఆర్తధ్వనుల నాలకింపలేఁడు. బరోడాలో డబ్ల్యు, ఎస్, బాపట్ అను నాతఁడు లంచము పుచ్చుకొనెనని కేసు వచ్చెను. తిలకు అతనివిషయమున చాల పాటుపడి సాయము చేసెను. కొన్నిదినములకు తిలకురాజద్రోహముచేసె నని బొంబాయి ప్రధానన్యాయస్థానమున అభియోగము తేఁబడెను. ఆఱుగురు తెల్లదొరలు పంచాయితీగా నేర్పడిరి. అందు అయిదుగురు తిలకు అపరాధి యని చెప్పిరి. న్యాయాధికారి తిలకునకు పదునెనిమిదిమాసములకారాగారశిక్ష విధించెను. తిలకు కారాగారములో నుండఁగా జర్మనుదేశీయుఁడును మహాపండితుఁడును అగు మాక్సుముల్లరు మొదలగువారు పనిచేయఁగా కొలఁది దినముల యందే ఆతఁడు విడువఁబడెను.

ఇంతలో సూరతునగరమున దేశీయమహాజనసభ కూడెను. అందు అతివాదులకును మితవాదులకును వివాదము కలిగెను. ఆతఁడు మితవాదుల వలలోఁ జిక్కక వారియాటలు సాగనీయక చాల పనిచేసెను.

అప్పుడు సభలో చాలగందరగోళము గలిగెను. తిలకుమున్నగు జాతీయ నాయకులు దేశీయమహాజనసభను అప్పుడు విడిచిపెట్టిరి.

ఇంతలో నాతఁడు మఱలఁ గేసరీపత్రికలో రాజద్రోహవిషయములను వ్రాసెనని మఱల విచారింపఁబడి ఏడుసంవత్సరములు బర్మాదేశమునందలి మాండలే కోటలో కారాగారశిక్ష ననుభవింపఁ బంపఁబడెను. అచ్చట నాతఁడు కాలమును వ్యర్థముగఁగడుపక సదా భగవద్గీతలు సదువుచు "ఓరియన్" అనుగ్రంథమును విస్తరింపజేసి దానికి "వేదిక్,క్రానాలజీ" అనఁగా: వేదకాలమును దెలుపునది అని పేరుపెట్టెను. "ఆర్యుల ఉత్తరధ్రువనివాసము" అను గ్రంథమునుగూడ పెంపుచేసెను. "గీతారహస్యము" అను గొప్పమహారాష్ట్రగ్రంథమును వ్రాసెను. టాడ్ హంటరుమహాశయుని గణితశాస్త్రమున అర్థముకాని విషయములకును స్థలములకును వివరణములు వ్రాసెను. జర్మనీ, ఫ్రెంచి, పాలీ భాషలనుగూడ అభ్యసించెను. తుదకు ఇతఁడు ౧౯౧౪ వ సంవత్సరము జూన్ ౧౭ తేదీని విడుదల జేయఁబడి పునహానగరమున వచ్చి చేరుకొనెను.

పిదప ఆతనికి షష్టిపూర్తిమహోత్సవము జరుపఁబడెను. అపుడు మహారాష్ట్రులు తమ దేశభక్తునకు లక్షరూపాయలు బహుమతిచేసిరి. అప్పుడు తిలకు కొన్నిఉపన్యాసములు ఇచ్చెను. దానిమీద దొరతనము వారు "శాంతికి భంగము కలిగింపకుండ నుండుటకుఁ గాను ఇరువదేసి వేలరూపాయల జామీనులు ధనికులు, మర్యాదగలవారునగు ఇరువురు పెద్దమనుష్యులవలన ఈయవలసినదని విధించిరి గాని అది బొంబాయి ప్రధానన్యాయస్థానమున అవసరము లేదని తీర్మానింపఁబడి కొట్టివేయఁబడెను.

పిదప భారతదేశమున అనిబిసెంటు భారతస్వపరిపాలనమును గుఱించి తీవ్రాందోళము ప్రారంభించెను.ఆసందర్భమును బురస్కరించుకొని తిలకుమహామహుఁడు ౧౯౧౮ ఏప్రియలు నెలలో భారతదేశపు స్థితిగతులను ఆంగ్లదేశమున వివరించుటకు బయలుదేఱెను. ఆతనివెంట విపినచంద్రపాలు, మున్నగు దేశభక్తులు గూడ బయలువెడలిరి. తొలుత వీరికిఅందఱకును రహదారీచీట్లు ఒసఁగఁబడెను గాని వారు ప్రయాణమై సింహళమునకుఁ బోయి అచ్చట ఓడనెక్కఁ బోవుచుండఁగా "జా

తీయభంగకరమగు నుద్యమము నిమిత్తము ఇక్కడకు రాను వీలులేదు" అనిలండనునందలియుద్ధమంత్రివర్గమువారు వారిప్రయాణమునకు నిరోధములు గలిగించి వెనుకకుఁ బంపివేసిరి. ఆరాయబారివర్గము స్వస్థలములు చేరికొనినతరువాత భారతీయులకు వ్యతిరేకముగఁ బనిచేయుడాక్టరు నాయరు అను మళయాళ దేశీయునకు లండనునకుఁ బోవుటకు దొరతనమువారు రహదారీచీటి నొసంగిరి. అందులకు దేశమునందు అంతటను అసమ్మతి చూపఁబడెను. "ఇచ్చినచో ఉభయపక్షములవారికిని రహదారీ చీట్లు నిచ్చుట ధర్మము. మానినచో ఉభయులకును మానుట ధర్మము; గాని ప్రజాశయసాఫల్యము నిమిత్తము పనిచేయు దేశభక్తుని ప్రయాణమును నిరోధించి 'దేశమునకు వ్యతిరేకముగఁ బనిచేయుచున్న మహానుభావుఁడు' అని ప్రజలచే నమ్మఁబడుచున్న నాయరుమహాశయునకు సెలవిచ్చుట ధర్మము గాదు" అని ప్రజలు చెప్పినమాటలను దొరతనమువారు పెడచెవినిఁ బెట్టిరి.

బొంబాయి రాజధానీపాలకులు యుద్ధసందర్భములను బురస్కరించుకొని యొక సభ చేసి దేశీయప్రముఖుల నందఱను సభకు ఆహ్వానించిరి. అందు తిలకుమహాశయుఁడు హిందూదేశము యుద్ధసందర్భమున చేయుసహాయమును గుఱించి యుపన్యసించుచు "హిందూదేశమునకు స్వపరిపాలనము నిచ్చుటకును, హిందువులు ధనబలసహాయము చేయుటకును అవినాభావసంబంధము ఉన్నది" అని చెప్పఁబోవుచుండఁగా గవర్నరు మాటాడవలదని నిరాకరించెను. అపుడు తిలకు ఆత్మగౌరవము గలవాఁడు; గావున వెంటనే సభవిడిచిపోయెను. అతనితోఁగూడ కేల్కారు, బొమ్మంజీ, హార్నిమన్, యమునాదాసు, ద్వారకాదాసుగార్లు గూడ సభవిడిచి పోయిరి. ఆసభలో గవర్నరు స్వపరిపాలనమును గుఱించి ఆందోళనము చేయుచున్న దేశభక్తులను తూలనాడెను.

తుదకు తిలకుమహాశయునకు ఇంగ్లండునకు పోవుటకు రహదారీచీటి నొసంగిరి. తనయెడల అన్యాయపు వ్రాతలువ్రాసి లండన్ టైమ్సు విలేఖరి వెలంటైను చిరోలు అను యూరోపియనుమీఁద మాననష్టపు దావాచేయుటకు తిలకు పయనమయ్యెను. ఈసందర్భమున దొరతనమువారు ఈషరతులను ఏర్పఱిచిరి."వ్యాజ్యెము ముగియఁగనే తిరిగి స్వదేశమునకు రావలెను. యూరపునందున్నంత కాలమును రాజకీయవిష

యములను గుఱించి నోరెత్తఁగూడదు" ఈషరతులను తిలకు వ్రాసి ఈయవలయునని దొరతనమువారు కోరిరి.

చేయునది లేక తిలకు అందుల కంగీకరించి అక్టోబరు నెల ఆఖరున ఇంగ్లండు చేరెను. ఇచ్చటి ఆంగ్లేయులకును ఆంగ్లదేశమునందలి ఆంగ్లేయులకును భేద ముండు నని యాతఁడు భావించెను. ఎందుల కుండదు? ఇక్కడివారు భారతభూమియొక్క సారవత్తను, భారతీయుల సాత్వికతనుజూచి పక్షపాతమునకును, విశేషించి అత్యాశకును పాల్పడ కమానరు. అక్కడివారిలో అధికారులయందును, ఇక్కడ నౌకరీచేసి వెళ్లినవారియందును తప్ప తక్కినవారియందు ఔదార్యమునకు కొదువ యుండదు. భారతదేశమునకు సంబంధించిన ఫలానుభోగమున వారికిగూడ భాగము ఉన్నను ప్రత్యక్షసంబంధము లేకపోవుటచే ప్రకృతిధర్మము వారియెదుట తిరస్కృతము గాదు. ఈయభిప్రాయముతో తిలకు ఇంగ్లండుచేరెను. ఏమయిన నేమి? ఎట్లయిన నేమి? ౧౯౧౮ వ సంవత్సరమున ఏప్రియల్ నెలలో బయలుదేరిన తిలకు అక్టోబరులో గాని అక్కడ చేరుకొనలేకపోయెను.

యుక్తసమయమున తిలకు విలంటైను చిరోలుగారిమీఁద దావా చేసెను; గాని "న్యాయ మెటు లున్నను వ్యాజ్య మీతనికిఁ బ్రతికూల మయ్యెను." ఈ దావావిషయమున నాతఁ డంతగా పని చేయలేదు.

తిలకునుగుఱించి ఇంగ్లాండున దుర్భావము లధికముగానుండెను. "బ్రిటిషువారియెడల ద్వేషమును పూనినవాఁడు. బ్రిటిషుసామ్రాజ్య విచ్ఛేదనమునిమిత్తము పూనికతో నున్నవాఁడు." అని యాతనిని గుఱించి అక్కడ షిరోలుగారి వ్రాతలు కొంతవఱకు అభిప్రాయమును పుట్టించియుండెను. ఇందులకు ఇండియాదొరతనమువారి చర్యలుగూడ కొంతవఱకును తోడయ్యెను. అన్నివిధములను ఈతని తత్వ మక్కడ దుర్గ్రాహ్యమై యుండెను. అయినను గొప్ప విద్వాంసుఁడును, స్వార్థపరతలేని నాయకుఁడును గావున ఆతఁడు తన మార్గమును నిష్కంటకము చేసికొనుటకుఁ బ్రారంభించెను.

"రాజకీయమును గుఱించి నోరెత్తగూడదు" అని దొరతనము వారు ఈతనినోటికి తాళము వేసియుండిరిగదా? ప్రప్రథమమున తిలకు మాంటాగుగారితో కలిసికొని స్థితిగతు లన్నియు చూపి ఆ తాళమును దీయించుకొనియెను. దీనితో మూగవానికి అపారవాగ్ధాటి కలిగిన ట్లయ్యెను.

తిలకు ఇంక నిద్రాహారములను గమనించుకొనలేదు. పార్లమెంటుసభ్యుల నందఱను ప్రత్యేకప్రత్యేకముగ దర్శించి సంగతు లన్నియు వారికి బోధించెను. ప్రజలకు అనేకసభలలో భారతదేశముయొక్క నిజస్థితిని హృద్గతము గావించెను. లేబరుపక్షమువారిని తన పక్షమున గలిపికొనియెను. ఇందులకై యాతఁడు అనేకలక్షల కరపత్రములను బంచిపెట్టెను. ఈకొననుండి యాకొనవఱకును దిరిగి దేశమునం దంతటను అనేక గంభీరోపన్యాసముల నిచ్చెను.

ఇది యిట్లు జరుగుచుండఁగా ఇక్కడ భారతదేశమున ఢిల్లీనగరమున భారతజాతీయమహాసభ జరిగెను. "జాతీయమహాసభపక్షమున కొందఱు ప్రతినిధులు ఇంగ్లాండునకుఁ బోయి దేశముయొక్క స్థితిగతుల నక్కడివారికి విశదము చేయవలయు ననియు, ఈవర్గమునకు తిలకు అధిపతిగా యుండవలయు ననియు పార్లమెంటులో అపుడు ప్రవేశ పెట్టఁబడిన మాంటుఫర్డుసంస్కరణశాసనమును పరిచూచుటకు ఏర్పఱుపఁబడిన జాయింటు కమిటీవారియెదుట సాక్ష్య మీయవలయు ననియు అందు తీర్మానింపఁబడెను." దీనితో తిలకునకు అనంతబలము వచ్చెను. ఇప్పుడు తిలకు ఇంగ్లండుదేశమున 30 కోట్ల భారతీయులకు ప్రతినిధిగా నిలిచియుండెను.

భారతజాతీయమహాసభ తిలకునెడల చూపిన విశ్వాసము అపాత్రన్యస్తము కాలేదు. మహాసభ దేనిని విధించెనో తిలకు దాని నంతను అనుకొనినదానికంటె అధికముగను చక్కగను నెఱవేర్చెను. జాయింటుకమిటీవారియెదుట నతఁడు గంభీరమగు నుపన్యాసము నిచ్చి అడ్డసవాళ్లు వేసి సాక్షిని పడఁగొట్టుటకు వారికి అవకాశము లేకుండఁ జేసెను. "సంపూర్ణస్వరాజ్యమునకు దేశ మిపుడు అర్హమై యున్నది. రాజ్యాంగములో కావలసిన సంస్కరణముల నన్నిటిని నిర్ణయించుకొనుటకు మాకే (ప్రజలకే) అధికార ముండవలయును." అని యీ

తఁడు వారికి దృఢముగా బోధించెను. సాక్షి యెంతవాఁ డయినను ఆకమిటీవారు అడ్డసవాళ్లను గుఱిపించి విసివించి వేసెడివారు; గాని తిలకు నొక్కఁడు నొక్క ప్రశ్నయైన వేయఁజాలకపోయెను. ఒక్కఁడును పట్టుదలకైన నాతనిని ప్రతిఘటింపఁ జాలకపోయెను.

ఇంగ్లండు దేశమున లండనునగరమున "ఇండియా" అని యొక వారపత్రిక గలదు. హిందూదేశముయొక్క స్థితిగతులను ఇంగ్లండులో ప్రకటించి అక్కడివారికి ఈ దేశమునెడల అభిముఖ్యమును, సద్భావమును గలిగించుటకు అది ప్రారంభింపఁబడెను. దానికి వ్యయపడు ధనమంతయు మనదేశమునుండియే పంపఁబడుచుండెను; గాని దానిని నడుపువారు మాత్రము ఆంగ్లేయు లగుటచే జాతీయసభయొక్క ఆజ్ఞలు ఉల్లంఘింపఁబడుచుండెడివి. "జాతీయమహాసభపక్షమున ప్రకటింపఁబడు పత్రిక తదా దేశములను తదాశయములను వెల్లడింపవలయును. అట్లు కానినాఁడు ఈపత్రికకు జాతీయమహాసభనుండి యెట్టి సాహాయ్యమును కలుగఁగూడ"దని తిలకు వాదించెను. పత్రికాధిపతి మొదట ఇందుల కంగీకరింపలేదు; గాని జాతీయమహాసభ తిలకు వాదము నంగీకరించుటచే తుదకు లొంగక తప్పినది గాదు.

ఇది యిట్లుండఁగా ప్రపంచమును అల్లకల్లోలపఱిచిన మహాయుద్ధము చల్లాఱెను. సంధినియమములను నిశ్చయించుటకు ప్యారిసునగరమున "సంధిసభ"యను పేరున గొప్పసభ యొకటి జరుపుటకు నిశ్చయమయ్యెను ఆసభకు భారతదేశప్రతినిధిగా వెళ్లుటకు తన కవకాశమీయవలసిన దని తిలకు అనేకవిధముల అధికారులను కోరెను; గాని వారు అంగీకరింపలేదు. అంతటితో నిరుత్సాహపడక అంతట నాతఁడు "ఊరకుండుట మంచిదికా"దనితలఁచి భారతదేశముయొక్క స్థితిగతులను వివరముగ విశదీకరించి భారతదేశమునకు స్వరాజ్యము నిచ్చుట ఆంగ్లేయుల విధి" యని యొక గొప్ప కరపత్రమును తయారుచేసి దానిని తత్సభాధ్యక్షునకుఁ బంపెను.

ఈతీరున తిలకు ఆంగ్లదేశమున నూర్గురకైన సాధ్యపడని గొప్పకార్యము నొక్కఁడు నిర్వహించి ౧౯౧౯-వ సంవత్సరము నవంబరునెలలో మరలి స్వదేశమునకు వచ్చెను. తిలకు ఇంగ్లండులో నున్నంతకాలమును ఇక్కడ ప్రజలకు నిమిష మొక మహాయుగముగా

నుండెను. అక్కడ తిలకు నిమిష మొక్క యుగమంత విలువగలదాని నిగా భావించి పనిచేసెను.

తిలకు ఇంగ్లండులో నున్నపుడు ఏబిల్లును గుఱించిన విచారణలో జాయంటుకమిటీయెదుట సాక్ష్య మిచ్చెనో అది (మాంటుఫర్డు సంస్కరణములబిల్లు) ఆతఁడు భారతదేశమునకు వచ్చి కొలఁదిదినములకే చట్టమయి జార్జిచక్రవర్తి యనుమతిని బడసెను. ఎవ రెన్ని చెప్పినను పాలకులు పాలితుల యభిప్రాయములను పాలింపలేదు. తిలకు ఈశాసనము నిష్ప్రయోజన మనియెను. పార్లమెంటు ఏమి యిచ్చినను "సంపూర్ణస్వరాజ్యమునిమిత్తము ప్రజలు పూర్ణమైన కృషిచేయవలయు"నని తిలకు ప్రజలకు బోధించెను. అమృతసరమున జరిగిన జాతీయ మహాసభలో తిలకు సంస్కరణశాసనమును బహిష్కరింపవలయు నని వాదించెను; గాని గాంధిగారు అందులకు అంగీకరింపలేదు. "శాసనమును మనము పరిగ్రహింపవలెను. దొరతనమువారికి సాయపడవలయు" నని వారు వాదించిరి. తీవ్రవాదప్రతివాదములు జరిగెను. "తునితగవుగాళ్ల" తీవ్రప్రయత్నమున రాజీ కుదిరెను. "సంస్కరణ శాసనము ఆశాభంగమును గలిగించినది; అయినను ప్రజలు దానిని ఉపయోగించి ఇంకను సంపూర్ణస్వరాజ్యప్రాప్తినిమిత్తము పనిచేయవలెను" అని తుదకు మహాసభలో తీర్మానింపఁబడియెను. తుదకు గాంధిగారికి మాత్రము తమవాదము తప్పు అని మార్చుకొనక తప్పినది గాదు.

౧౯౨౦వ సంవత్సరమధ్యమున తిలకుమహాశయునకు దేహారోగ్యము చెడియెను. వ్యాధి ప్రబలునప్పటి కాతఁడు బొంబయినగరమున సర్దారుగృహమున నుండెను. ఒక దినముకంటె యొక దినము స్థితి విషమింపఁదొడఁగెను. మహాసమర్థు లగు వైద్యు లనేకులు పనిచేసిరి; గాని ఇఁక ప్రయోజనము లేదని నిరాశ గలిగెను. పునహా యంతయు స్పెషలురైళ్లలో వచ్చి బొంబయి చేరెను. గంధి, మున్నగు ప్రముఖు లనేకులు తిలకుపాదములను కనిపెట్టుకొనియుండిరి. తుదకు "యదాయదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత, అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం" మను గీతావాక్యమును స్మరించుచు లోకమాన్య బాలగంగాధరతిలకు కైలాసమునకుఁబోయెను.

నాఁడు బొంబయి పునహాలు సర్దారుగృహమువద్దనే యుండెను. అయిదులక్షలమంది ప్రజలు లోకమాన్యుని దర్శించుటకు వచ్చిరి. వీథి యంతయు క్రిక్కిరిసిపోయెను. రాకపోక లాగిపోయెను. సర్దారుగృహ మునుండి ఉదయముననే బయలుదేరిన శవము సమీపమునందే యున్న శ్మశానమును చేరునప్పటికి ఒంటిగంట యయ్యెను. దొరతనమువారు ఎవరికిని ఎప్పుడును అంగీకరింపని స్థలమున తిలకుశరీరమును దహనము చేయుట కనుజ్ఞ నిచ్చిరి. ఒకపార్శీమహాశయుఁడు చితికి సరిపడినన్ని మంచిగంధపుదుండ్లను సమర్పించెను.

ఈసమయమున లజపతిరాయి పంజాబుమెయిలుదిగి రొజుకొ నుచు వచ్చెను; గాని ఎవరు వచ్చినను ఏమి లాభము? లోకమాన్యుని పాంచభౌతికశరీరము పంచభూతములలో కలిసిపోయెను. ఆతని యాత్మ పరమాత్మలో లీన మయ్యెను; గాని ఆమూర్తి, ఆతేజోరాశి ఇం కను కనులయెదుట నిలిచియే యున్నది. ఆగంభీరవాగ్గుంభనము ఇంకను చెవులలో అమృతమును వర్షించుచు నవశక్తిని సంఘటించుచునే యున్నది.

---

127. మోహనదాసకరంచంద్ గాంధి.

శ్లో. "తుంగత్వ మితరా నాద్రౌ నేదం సింధా వగాధతా,
అలంఘనీయతా హేతు రుభయా తన్మనస్విని."

(శిశుపాలవ. ౨. సర్గ ౪౯. శ)

గాంధి ౧౮౬౯ వ సంవత్సరము అక్టోబరునెల ౨ వ తేదీని గుజ రాతీదేశమున జన్మించెను. వర్ణమున ఆతఁడు వైశ్యుఁడు. మతమున జైనుఁడు. ఆతని తండ్రి, తాతముత్తాగు పూర్వులు అందఱును సంస్థాన ములయందు దివానులుగా పని చేసిరి. గాంధి తండ్రి కొన్నిదినములు బొంబాయిదొరతనమువారి సభలో సభ్యుఁడుగా గూడ నుండెను. తం డ్రి చాల నీతిమంతుఁడు. ఎదుటివాఁడు తప్పుచేసినపుడు నిర్భయముగా నెత్తిఁగించును. తల్లికి దైవభక్తి మెండు. సదాచారములను ఎప్పుడును

ఆమె విడిచి యెఱుఁగదు. తల్లిదండ్రులసుగుణములు గాంధియందు పూర్తిగ అంకిత మయ్యెను.

గాంధి ప్రాథమికవిద్యను భారతదేశమునందే చదివి పిదప లండనునకుఁ బోయెను. ఆతని తల్లి తొలుత ఆతఁడు ఇంగ్లాండునకుఁ బోవుటకు అంగీకరింపలేదు. "నేను మద్యము త్రాగను. మాంసమును ముట్టను. స్త్రీలను స్పృశింపను" అని ఒక జైన పురోహితునియెదుట శపథము తాల్చిన పిదప ఆమె కుమారుని ప్రయాణము నంగీకరించెను. గాంధి ఎప్పుడును శపథమును దప్పలేదు. ఆతఁడు ఇంగ్లాండులో మెట్రిక్యులేషనుపరీక్షయందు నెగ్గి బారిష్టరుపరీక్షలో విజయముఁ బడసి బొంబాయికి వచ్చి ప్రధానన్యాయస్థానమున పని ప్రారంభించెను. పిదప ౧౮౯౩ వ సంవత్సరమున నాతఁడు ఒక వ్యాజ్యెములో పనిచేయుటకు నేటాలునకుఁ బోయి అక్కడనుండి ట్రాన్సువాలుకుఁబోయెను. చాల కష్టముమీఁద గాంధి నేటాలుప్రధానన్యాయస్థానమున బారిష్టరుగాఁ జేర్చుకొనఁబడెను. అచ్చట నున్న భారతీయు లందఱును గాంధిసుగుణ సంపత్తినిఁ జూచి అచ్చట నుండవలసిన దని ప్రార్థించిరి. ఆతఁడు అట్లే చేసి ఆ దేశమున భారతీయులకు సంభవించు అన్యాయములు ఇక్కట్టులు మున్నగువానిని తొలఁగింపుఁడు అని దొరతనమువారికి అనేకము లయిన అర్జీలను వ్రాసెను. దొరతనమువారు కొన్నిటిని తొలఁగించిరి. ఆ దేశీయులు ఎల్లరును ఆతనిభాషాపాండిత్యమునకు చాల మెచ్చుకొనిరి. ఇంతలో నేటాలుదొరతనమువారు ఆసియాఖండమువారిని బహిష్కరించుటకు ఒక చట్టమును చేసిరి. గాంధి చాలా పాటుపడి ఆశాసనమును తొలఁగించివేసెను; గాని భారతీయులకు పార్లమెంటులో అధికారము లేకుండఁ జేసిన శాసనము నిమిత్తముగూడఁ జాలఁ బనిచేసియు లాభము గనలేకపోయెను.

నేటాలునందలి తమకడగండ్లను భారతదేశమున ఎల్లరకును తెలుపవలసిన దని అచ్చటి భారతీయులు గాంధిని ఇచ్చటకుఁబంపిరి. ఆతఁడు ఇక్కడకు వచ్చి చేయఁగల పనులు అన్నియుఁ జేసెను. ఈసందర్భమున గాంధి దక్షిణాఫ్రికాయందలి ఆంగ్లప్రముఖులను క్రూరత్వము, నిరంకుశత్వము, దుర్నీతి, మున్నగు దుర్గుణములను ఆరోపించి నిందించుచున్నాఁడు అను అసత్యతంత్రీవార్తలు దక్షిణాఫ్రికాకు పంపఁబడెను.

దానిమీఁద అచ్చటి ఆంగ్లేయులు మండిపడిరి. ఈసమయమునందే కుటుంబసహితముగా గాంధి నేటాలునకుఁ బ్రయాణమయ్యెను. ఆతని వెంట ననేక భారతీయులు వెళ్లిరి.వారు ఓడకదలినవెంటనే 'గాంధిఅచ్చటి తెల్లకూలీలమీఁద పోటీకి నల్లకూలీలను తెచ్చుచున్నాఁడ'ని అసత్య వార్తలుపంపఁబడెను. దీనితో నచ్చటియూరపియనులకోపము పూర్తి యయ్యెను. రేవు అధికారి కొన్నిదినములవఱకును ఓడను రేవులోనికి రాకుండ నిషేధించెను; గాని ఈనిషేధము త్వరలోనే పోయెను. గాంధి స్టీమరుదిగుచున్నాఁడని తెలిసి ఆతనినిజూడ తెల్లవారుకోపారుణాస్యులై అనేకులు రేవులోనికి వచ్చిరి. పోలీసుఇన్స్పెక్టరు "అపాయము రావచ్చును. మీరు ఓడదిగవలదు" అని చెప్పెను; గాని గంధి అందులకు అంగీకరింపలేదు. "తెల్లవారు నీతిమంతులు అనియుధర్మాత్ములు అనియు నానమ్మకము. నేను పట్టణములోనికి ఇప్పుడే పోయెదను" అని గాంధి సాహసించి ఓడదిగెను. తోడనే ఆగుంపు ఆతనిమీఁదఁబడినది. అపుడు పోలీసుసూపరింటెండెంటుభార్యవచ్చి గొడుగుచాటుపెట్టి ఆతనిని ఒక భారతీయవర్తకుని ఇంటిలోనికిఁ గొనిపోయెను. ఇంతలో నామెగుంపు వచ్చి నిరపరాధుఁడగు వర్తకుని ఇల్లు పాడుచేయు నని తలంచి పోలీసు కానిస్టేబులు వేషము వేసి గాంధిని తప్పించెను. కొలఁదిదినములలో కలవరము తగ్గినతరువాత ఓడను రేవులోనికి రానీయక నిషేధము చేసిన ఉద్యోగి వచ్చి "మీసంగతి తెలియక నేను అట్టిపని చేసితిని. క్షమింపవలసిన" దని ప్రార్థించి ఒక అరగంటలో చనిపోయెను.

౧౮౯౯వ సంవత్సరములోదక్షిణఆఫ్రికాలో బోయరుయుద్ధము ప్రారంభ మయ్యెను. అపుడు గాంధి యుద్ధములో గాయపడిన సేనకు సేవచేయుటకు భారతీయులను ఒక గుంపుగా చేర్చి "మా సేవను అంగీకరింపవలసినది" అని దొరతనమువారిని కోరఁగా వారు అంగీకరించిరి. ఆసమయమున గాంధి చేసిన సేవకుమెచ్చి ఆదొరతనమువారు ఒకపతకమును బహుమానము చేసిరి.

ఇట్లుండఁగా గాంధికి చాలజబ్బు చేసెను.స్థానము మార్పవలయు నను సంకల్పముతో నాతఁడు భారతదేశమునకుఁ బ్రయాణము అయ్యెను.అప్పుడు నేటాలునందలి భారతీయులు గాంధికి ఒకబంగారుపళ్లెమును, ఆతని భార్యకు సువర్ణాభరణములను గానుక పెట్టిరి; గాంధి వానిని స్వీక

రింపక "ఎప్పుడైన భారతసంఘమునకు తీరని ఇబ్బంది వచ్చినచో అపుడు ఉపయోగించుటకు వీనిని జాగ్రత్త సేయుఁడు"అని చెప్పి భారత దేశమునకు వచ్చి కొన్నిదినములుఅయినతరువాత బొంబాయి ప్రధాన న్యాయస్థానములో పని ప్రారంభించెను.

కొన్నిదినములకు చేంబర్లేను ఇంగ్లాండునుండి రాజ్యాంగము సందర్భమున దక్షిణాఫ్రికాకు ప్రయాణమయ్యెను.అప్పుడు నేటాలులో నున్న భారతీయులు "చేంబర్లేనుగారు ఇక్కడకు వచ్చుచున్నారు.వారికి మేము విజ్ఞాపనము సమర్పింపఁదలఁచినాము. అందులకు మీరు ఉండ వలయును; గావున వెంటనే రావలసిన"దని తంత్రివార్త నంపిరి.గాంధి వెంటనే వెడలిపోయెను; గాని విజ్ఞాపకవర్గములో ఆతనిని దొరతనము వారు చేర్పరైరి. "మీరే ఈపనిని నిర్వహించుకొనుఁడు" అని గాంధి భారతీయులకుఁ జెప్పెను. వారు తొలుత "మీరులేకున్న మేము మానివేసెద" మని తొలుత పట్టుపట్టిరి; గాని తుదకు సాధక బాధకముల నెఱిం గించిన తరువాత అట్లే చేసిరి; అయినను వారి బాధలు అంతకంతకుఁ బెరిగిపోసాగెను అది చూచి వారు "మీరు ఇక్కడ నుండకున్న మేము అనాథుల మయ్యెదము. దయతో ఇచ్చటనే యుండుఁడు" అని కోరఁగా నాతఁడు అట్లు చేసెను. నేటాలులో టోహాన్సుబర్గు అను నొక నగరము కలదు. ఒకపుడు ఆనగరమున భారతీయులు విశేషముగ నున్న వీథులలో ప్లేగు విజృంభించెను; గాని పురపారిశుద్ధ్యసంఘము వారు జోక్యము కలి గించుకొనరైరి. భారతీయులు అనేకులు చనిపోసాగిరి అది చూచి గాంధి స్వయముగ ఔషధసౌకర్యములనుగలిగించి అనేకులనుమృత్యువువాఁత నుండి రక్షించెను. దొరతనమువారు "ప్లేగు గాంధిచెప్పినపుడు ప్రవేశిం పలేదు. తీవ్రముగఁగూడ లేదు" అని చెప్పిరి; గాని గాంధిని మాత్రము చాల మెచ్చుకొనిరి.ఆసంవత్సరము భారతీయులకునుపురపారిశుద్ధ్యసంఘ ముువారికిని వివాదలు సంభవించెను. ఈవ్యాజ్యెములో గాంధికి చాల ధనము దొరకెను; గాని దానిని ఆతఁడు భారతీయుల సౌకర్యముల నిమి త్తమే ఖర్చుపెట్టెను.

భారతీయులసంగతి ఆంగ్లేయులసంగతి భారతీయులకును దెలిసినఁ గాని వారికి పొత్తు కలియదని భావించి గాంధి "ఇండియన్ ఒపినియన్" అను నొక పత్రికను ప్రారంభించెను. అందు ఇంగ్లీషు, గుజరాతీ, హిందీ,

అరవభాషలో వ్యాసములు వ్రాయించుచుండెను; గాని కొన్నిదినములు కడచినతరువాత ఇంగ్లీషు గుజరాతీలు మాత్రమే నిలుపఁబడెను. గాంధి పత్రికకొఱకు అహోరాత్రములు చాల పాటుపడెను; గాని దానితో నాతనికి ఎట్టి ఆర్థికసంబంధమును లేదు. దాని నిమిత్తము ఆతఁడు ఎంత పాటుపడినను అభివృద్ధికి రాలేదు. అందులకు ఆతఁడు దీర్ఘముగ యోచించి పట్టణమునుండి కొనిపోయి పల్లెలోఁ బెట్టినచో బాగుగనుండునని తలంచి నేటాలుకొస్తుకోష్టురైలునకు సమీపమున ఫోనిక్సు అను ప్రదేశమున నూఱు ఎకరముల భూమినిఁ గొని ఇండ్లు కట్టించి మఱల పత్రికాప్రచారమును ప్రారంభించెను.

ఇంతలో నేటాలునందలి ప్రజలు దొరతనముమీఁద తిరుగఁబడిరి. దానడఁచుటకు సాయపడఁదలఁచి గాంధి భారతీయులను గొందఱను జేర్చుకొనెను. పిదప దొరతనమువారి ఆజ్ఞనుబొంది అతఁడు గాయపడినవారిని మోసికొనిపోవుటయందును, వైద్యోపచారములుచేయుటయందును చాల పనిచేసెను. ఈసందర్భమున నాతఁడు అనేకకష్టములను పొందెను; గాని ఆతఁడు పరిగణింపలేదు ఇదియంతయు శాంతించిన తరువాత నాతఁడు జొనార్సుబర్గులో మఱల బారిష్టరీపనిప్రారంభించెను.

దక్షిణాఫ్రికాదొరతనమువారికి భారతీయులమీఁది అసూయ గంటగంటకుఁ బెరిగిపోవుచునే యుండెను. వారు, భారతీయుల నీతిని, మతమును, ఆత్మగౌరవమును, మానవత్వమును గూడ మంటఁగలుపునట్టియొక క్రూరశాసనము జేయఁబూనిరి. గాంధి అపుడు హెచ్, ఓ, అల్లి అనునాతనితోఁ గలిసి ఇంగ్లండునకుఁ బోయి అచ్చటి పెద్దలతో మాటాడెను. తొలుత ఇంగ్లాండుదొరతనమువారు ఆశాసనమును ప్రస్తుతము అమలుపెట్టవలదని నిర్ణయించిరి; గాని యీనిరోధము నిలిచినది గాదు. తుదకు శాసనమునిశ్చయమయ్యెను. గాంధి అపుడు భారతీయులకు సంగతులన్నియు బోధించి "మేము ఈశాసనమునకు లోఁబడము" అని దొరతనము వారిని ఎదిరించెను. దానిమీఁద దొరతనము నిర్దయత్వము వహించి గాంధిని ఆతని అనుచరులను కైదులోఁ బెట్టిరి. పిదప జనరలు స్మట్సు అనునతఁడువచ్చి "కొలఁదిదినములలో శాసనము రద్దుపడునట్లు చేసెదము. ప్రకృతము ఈకల్లోలముమాన్పుఁడు" అనిరాజీ కోరెను. గాంధి శాంతుఁడౌటచే నమ్మి అంగీకరించెను; గానిస్మట్సువిశ్వాస

ద్రోహము చేసెను. ఆతఁడు శాసనమును రద్దుచేయక పోవుటయేగాక ఇంకను భారతీయులకును కొన్ని తీరని ఇబ్బందులు గలిగించెను. భారతీయులు అంతటను "గాంధి ధైర్యమును తన తోడి దేశీయులనుగూడ విడిచి దొరతనములో కలిసిపోయినాఁడు" అని దూషింపసాగిరి. అయినను గాంధి చలింపక హాజీహబీబ్ సాహెబుతోఁ గలిసి ఇంగ్లాండునకుఁ బోయి స్థితిగతులన్నియు బ్రిటీషుదొరతనమునకు ఎఱిఁగించెను ఎంత చేసినను తుదకు ఆతని ప్రయత్నములు అన్నియు కానఁగాచిన వెన్నెలవలె వ్యర్థములయ్యెను. అంత నాతఁడు మఱల నేటాలు చేరుకొని మఱల కల్లోలము ప్రారంభించి శాసనము నెదిరించెను. చాలగందరగోళము జరిగినవెనుక తుదకు ఆతని ప్రయత్నములు కొంతవఱకును ఫలించెను.

ప్రపంచమునందు అంతటనుగల నిర్లిప్తులలో గంధి అగ్రేసరుఁడు అని చెప్పవచ్చును. ఒకప్పుడు ఒకపఠాను గాంధినికొట్టెను. ఆదెబ్బతో నాతని ప్రాణములు పోవలసినదే. అంత దెబ్బకొట్టినను గాంధి వాని మీఁద అభియోగము తేలేదు. ఇటీవల దొరతనమువారే ఆపఠానుని శాసనధిక్కారము చేసినందులకు దేశాంతరవాసశిక్ష విధించి భారత భూమికి పంపిరి. ఆతఁడు ఇక్కడకు వచ్చిన తరువాత "మీరు జంకవలదు. మీమార్గము మిగుల నుత్కృష్టమయినది నేను మీయాజ్ఞలను నెఱవేర్చుటకు సిద్ధముగా నున్నాను" అని గాంధికి జాబువ్రాసెను.

ఒకప్పుడు గాంధి భారతీయుల పక్షమున దొరతనముతో పోరాడి శిక్షింపఁబడెను. రక్షకభటులు ఆతనిని కైదునకుఁ గొనిపోవుచుండఁగా ఆతనికొమార్తకు చాల జబ్బుగానున్నదని వార్త వచ్చెను. "బిడ్డకు భయము లేదు. ఇచ్చటి భారతీయులను విడిచి పోఁజాలను" అని యాతఁడు ఏమియుచలింపలేదు. కైదులోఁ బెట్టిన తరువాత భార్యకు గొప్పరోగము వచ్చినదనియు, బ్రతుకుట దుర్ఘట మనియు తంత్రీవార్త వచ్చెను. "అపరాధమును చెల్లించెదవేని నిన్ను విడిచిపెట్టుదుము. పోయి భార్యనుజూడవచ్చును" అని దండనాధికారి చెప్పెను; గాని ఆతఁడు "నేను ఇక్కడనుండి వెడలి పోయిన యెడల భారతీయులు అధైర్యము వహింతురు; గావున నేను పోను" అని ఆతఁడు అందులకు నిరాకరించెను. ఆతఁడు కైదులోనికిఁ బోయెను. అంతకుఁబూర్వమే ఆతని పెద్దకుమారుఁడు

గూడ కైదులో నుండెను. చిన్నకుమారుఁడు ఇట్టికష్టములు అనుభవిం పవలయునని గాంధి ఆతనినిఁ గూడ వెంటనిడుకొని పోయెను.

ఒకప్పుడు గాంధియు మఱికొందఱు భారతీయులును కైదులోఁ బెట్టఁబడిరి గాంధికి మాత్రము మంచియాహారము నిచ్చి దొరతనము వారు తక్కినవారికందఱకును చాల చెడ్డఆహారమునివ్వసాగిరి. అందు లకు గాంధి యంగీకరింపక "అందఱకును సమానముగ నాహారము ఇండు" అని నలువదిరోజులు పోరాడెను. తుదకాతఁడు ఆప్రయత్నము లోఁగూడ జయించెను.

ఆతఁడు దక్షిణాఫ్రికాలోను, భారతదేశమునందును, ఇంకను అనేకోత్కృష్టకార్యములను జేసెను. అవియన్నియు నిచ్చట వర్ణించిన గ్రంథవిస్తరమగును అతఁడు చేసిన పనులు అన్నియుఁ దెలిసికొనఁదలఁ చువారికి ఇంకను అనేకగ్రంథములు గలవు. మఱి మూఁడు విషయము లనుమాత్రము ఇట నుదాహరింతును.

చాంపరాణ్ జిల్లాలో భారతీయులకును, యూరోపియనులకును తగాదాలు వచ్చెను. భారతీయవ్యవసాయదారులను యూరోపియను ధనికులు అనేకవిధముల బాధింపసాగిరి. అపుడు గాంధి అచ్చటకుఁబో యి వానిని తొలఁగించుటకు ప్రయత్నములుప్రారంభించెను. ఇంతలో భారతదేశపుదొరతనమువారు ఒకసంఘమును ఏర్పఱిచి విచారణలు జరిపించి కొంతవఱకు సౌకర్యములను గలిగించిరి.

అహమ్మదాబాదులో అఱువదిబట్టలునేయు యంత్రాలయములు గలవు. అందు పదివేలకూలివాండ్రు పనిచేయుచుండిరి. అప్పుడు లోక మునంతను తలక్రిందులు చేయుచున్న ఐరోపామహాసంగ్రామమువలన ఆహారపదార్థములవెలలును, వస్త్రములవెలలును చాల పెరిగిపోవుటచే జీతములు చాలక ఆకూలివాండ్రు మూఁడవవంతు జీతము హెచ్చుచే యవలసినదని తమ యజమానులను గోరిరి. వారు అంగీకరింపరైరి తుదకు గాంధికిఁగూడ పని గలిగెను ఆతఁడు వచ్చి యంత్రాలయాధికా రులతో మాట్లాడెను; గాని ఎన్నివిధముల ప్రయత్నించినను ప్రయోజ నము లేకపోయెను. తుదకు గాంధి "కూలిజనులు కోరినట్లు చేయునంత వఱకును నేను భుజింప" నని శపథము దాల్చెను. యంత్రాలయాధి కారులు మొదటిరోజున హేళనము చేసిరి. రెండవరోజున బింకములు

తోలిరి. మూఁడవరోజున తహతహలాడి తుదకు గాంధి చెప్పినట్లు అంగీకరించిరి. గాంధి అప్పుడు తన వ్రతమును ఉపసంహరించుకొనెను.

౧౯౧౭ వ సంవత్సరమున గుజరాతీదేశమునందలి కెయిరాజిల్లాలోని పంటలు చెడిపోయెను. రూపాయలో నాల్గవవంతుపంటయైనను పండలేదు. బీదరైతులు "పన్నులు చెల్లించుటకు మీఁదటి వఱకును వాయిదా ఇవ్వవలయును" అని కోరిరి; గాని బొంబాయిదొరతనమువారునిరాకరించిరి. మఱల ఈరూపమున గాంధికి పనిగలిగెను. ఆతఁడు సంగతులుఅన్నియు విచారించి కెయిరాప్రజలకు సాత్వికనిరోధవ్రతమును బోధించెను. తోడనే రెండువందలరైతులు "మేము పన్నులుచెల్లింపము. మమ్ముమీరేమి జేసినను అనుభవించుటకు సిద్ధముగా నున్నాము" అని ప్రకటించిరి. సాత్వికనిరోధకులసంఖ్య దినదినమును పెరిగిపోయెను. దొరతనమువారు కొందఱ ఆస్తులను జప్తుచేసిరి; గాని తుదకు గాంధితో రాజీపడి రైతుల పద్ధతి నంగీకరించిరి.

ప్రపంచ మంతయు నలముకొనిన ఐరోపామహాసంగ్రామము యొక్క వేఁడిమి యింకను తగ్గలేదు. ఆంగ్లేయులకు చాలమంది జనులును, ధనమును కావలసివచ్చెను. భారతీయులలో పక్షము లేర్పడెను. దొరతనమునకు ఏవిధముగను సాహాయ్యము చేయఁగూడ దని కొందరు పట్టుపట్టిరి గాంధి వారికి వ్యతిరేకముగ నిలిచి దేశమంతయు సంచరించి సైన్యములో అనేకవీరులను జేర్పించెను. అసంఖ్యధనమును గూడ సమకూర్చెను.

ఈసాహాయ్యము ఆంగ్లేయులకు సంజీవి యయ్యెను. దీని యాధారమున వారు విజయమును బడయ నారంభించిరి. ౧౯౧౭-వ సంవత్సరము ఆగస్టు ౨౦దవ తేదీని కామన్సుసభలో యుద్ధమున అనంత సాహాయ్యమును జేయుచున్న భారతీయులకు బాధ్యతాయుతస్వపరిపాలనము నొసంగవలయు ననియు అందులకు మొదట నేర్పరుపవలసిన విధానము ఏదో నిర్ణయించుటకు అప్పుడు భారతదేశమునకు సెక్రెటరీ యగు మాంటాగూగారును, రాజప్రతినిధి యగుచెమ్సుఫర్డు ప్రభువును దేశ మంతయు తిరిగి విచారణ చేసి ప్రజాభిప్రాయము నెఱింగి నివేదికమును పంపవలయు ననియు అధికారులు ప్రకటించిరి.

ఇందులకనుగుణముగ మాంటేగూమంత్రి హిందూదేశమునకు వచ్చి రాజప్రతినిధితో పర్యటనము ప్రారంభించెను.

ఈసమయమున గాంధి యొక ప్రణాళికను తయారుచేయించి అందు సూచింపఁబడిన విధమున హిందువులకు పరిపాలనాబాధ్యత నీయవలసిన దని దేశీయు లందఱిచేతను ఆప్రణాళికమీఁద సంతకములు చేయించి ప్రతిష్ఠలమునందును దానిని మంత్రిపుంగవున కిప్పించెను. దేశీయు లందఱును ఆప్రణాళిక ననుసరించియే తమ కధికారముల నీయవలసిన దని దృఢముగఁ గోరిరి.

మంత్రియు రాజప్రతినిధియు ఇట్లు సంచారము చేయుచుండ ఒక దెస భారతప్రభుత్వమున క్రూరశాసననిర్మాణమునకు పునాదులు ప్రారంభింపఁబడెను. రౌలటుదొర యాజమాన్యమున నొక సంఘము దేశమునందలి విప్లవసంఘములను గుఱించి విచారణ చేసియుండెను. దాని నాధారపఱుచుకొని ప్రభుత్వమువారు శాసనసభలో రౌలటుబిల్లును ప్రవేశపెట్టిరి. అన్నికక్షులకు చేరిన ప్రతినిధులును దాని నెదిరించిరి. దేశమంతయు వద్దువద్దని గగ్గోలుపడెను; గాని అధికారుల పట్టుదలవలన ఇదివఱకున్న అనేకనిరంకుశశాసనములకు తోడుగ రౌలటుబిల్లు రౌలటుశాసన మయ్యెను.

ఈసందర్భమున గాంధి చాల పనిచేసెను. దేశమంతయు తిరిగి శాంతనిరోధము నవలంబింపవలయు నని ప్రజలకు బోధించెను. దీని ననేకు లామోదించిరి. అంతటను అల్లరులు ప్రారంభ మయ్యెను. శాంతమును వదలఁగూడ దని గాంధి గట్టిగ బోధించెను; గాని మూకచెలరేగిన తరువాత అది యొక దారిని పోవు నని చెప్పుట కవకాశము లేదుగదా? దొరతనము ప్రజలకు శిక్షలు విధింపఁజొచ్చెను. ఈసమయమున గాంధి ఢిల్లీకి బ్రయాణ మయ్యెను. అప్పుడు పాంచాలదేశము నేలు లెప్టినెంటుగవర్నరు "మైకేలు ఓడ్వయరు" అను నాతఁడై యుండెను. నిరంకుశమున కీతఁడు జంగమరూపము. ప్రజాపీడనమున కీతఁడు ముందంజ. ఇతరపరగణాలలో ప్రకటింపఁబడు పత్రికలు పాంచాలమునకు రాగూడ దని మొట్టమొదట శాసించిన యాప్రభువు గాంధిని పంజాబులో నడుగపెట్టఁగూడ దని నిషేధించెను; గాని గాంధి యందులకు అంగీకరింపక రైలెక్కెను. సరిహద్దులో వెనుకకు పోవలసిన

దని అధికారులు చెప్పిరి. గాంధి బండి దిగనందున ఆతఁ డున్నపెట్టెను తొలగించి అధికారులు రైలును నడుపుకొనిపోయిరి.

ఈసంగతి పంజాబులో తెలిసి పోయెను. వెంటనే అంతటను అల్లరులు చెలరేఁగెను. అధికారులు క్రూరశిక్షలు ప్రారంభించిరి. అమృతసరమున డయ్యరు అను సేనాధిపతి తన యాజ్ఞలను జనదాఁటి రని చెప్పి జలియన్‌వాలాబాగు అను తోటలో సభకూడియున్న రెండువేల జనులమీఁద ఆగ్నేయాస్త్రమును పురికొల్పెను. ఇక చెప్పవలసిన దేమున్నది? అనేకులు వికలాంగు లయిరి. అనేకులు మృతిపొందిరి. దేశమంతయు హాహాకారములు గావించెను. గాంధి ఇట్టి క్రూరకృత్యములను గావించిన అధికారులను శిక్షింపవలయు నని—ఉద్యోగములనుండి తొలగింపవలయు ననియు అంతమాత్రమే చాలు ననియు చెప్పెను. దేశ మంతయు ఆతని మాట ననువదించెను; గాని ప్రయోజనము కలుగలేదు. ఆంగ్లదేశమున ఆయాంగ్లేయులకు గొప్ప బహుమానములుగూడ ఈయఁబడెను.

పిదప మాంటాగూచమ్స్‌ఫర్డుదొరలు దేశ మంతయు తిరిగి నేర్చుకొనిన విషయములను పురస్కరించుకొని యొక సివేదికను తయారు చేసిరి. దానితో దేశమున పక్షములు బయలుదేరెను. చక్రవర్తిగారు ఆబిల్లును శాసనము చేసి సందేశమును పంపుటతో కక్షలు దృఢపడెను. గాంధి దొరతనమువారి పక్షమున నిలిచెను. కాంగ్రెసులో ఈశాసనమును అంగీకరించుటా? మానుటా? అను విషయము చర్చకు వచ్చెను. తిలకు వద్దనెను. గాంధి కావలె ననియెను. దీర్ఘచర్చ జరిగినమీఁదట గాంధివాదమునకు నెగ్గెను.

గాంధివద్ద నొక విచిత్రమైన గుణ మున్నది. తన యిష్టమును ననుసరించి ప్రజలు నడువవలయును. పరాజయము స్వయముగ ననుభవించిన గాని తనవాదము నాతఁడు విడువఁడు. ఎదుటివారు ఎంతయనుభవపూర్వకముగ చెప్పినను వారి వాదము అరణ్యరోదనము కావలసినదే. అయితే ఈ తన నిరంకుశచర్యను గాంధి చమత్కారముగ కప్పిపుచ్చుకొనఁగలఁడు.

కాంగ్రెసులో గాంధివాదము నెగ్గెను; గాని శాసనము అమలులోనికి వచ్చిన తరువాత తిలకువాదము మంచి దయ్యెను. గాంధికి

తన యభిప్రాయము మార్చుకొనవలసివచ్చెను. ఈపరాజయము రాకుండ ఆతఁడు తిలకువాదము నంగీకరించియుండినచో "శాసనము మంచిదా చెడ్డదా?" యను విచారణమున గడచిపోయిన అమూల్య మగు కాలమున మఱికొంత పని జరిగియుండును.

ఖిలాఫత్తు విషయమున జరిగిన యక్రమమును పురస్కరించుకొని గాంధి దొరతనముమీఁద తిరుగఁబడెను. అప్పుడీతఁడు సహాయ నిరాకరణవ్రతమును ప్రారంభించెను. కలకత్తాలో జరిగిన కాంగ్రెసు యొక్క ప్రత్యేకసమావేశమున గాంధి చెప్పిన సూత్రములు స్థిరపఱుపఁబడియెను. అవి యివి.

౧. అందఱును దొరతనమువా రిచ్చిన బిరుదములను విడువవలెను.

౨. న్యాయవాదు లందఱును తమ వృత్తిని విడిచి దేశసేవ ప్రారంభింపవలెను.

3. విద్యార్థులు దొరతనమువారి పాఠశాలలను విడిచి జాతీయ పాఠశాలలలో చేరవలెను. లేకున్న చదువుమానివేసి దేశసేవ చేయవలెను.

౪. శాసనసభల నందఱును బహిష్కరింపవలయును. ఎవఁడును అభ్యర్థులై నిలువఁగూడదు. ఎవరును ఓట్లు నీయఁగూడదు

౫. హిందువు లందఱును స్వదేశవ్రతమును అవలంబించి విదేశవస్తువులను బహిష్కరింపవలయును.

దేశము బాగుపడుటకు ఈసిద్ధాంతములు మంచివే; గాని యివి ఆచరణమున నిలువలేదు. ప్రారంభమున విద్యార్థులు చురుకుదనము చూపిరి; గాని తరువాత వెనుదీసిరి. శాసనసభా బహిష్కారము వ్యర్థమైనది. న్యాయవాదులు ప్రారంభమున కొందరు—చాల తక్కువమందిమాత్రమే వృత్తి మానిరి; గాని యేయొక్కరిద్దరో తప్ప తక్కినవారందఱును చివరకు మఱల వృత్తిలో ప్రవేశించిరి. బిరుదుల విషయముగూడ ఇట్లే పరిష్కార మయ్యెను. స్వదేశీవ్రతము బంగాళావిభజన సమయమునందుకంటె అధికముగ జరుగలేదు.

తరువాత మూడుమాసములకు నాగపురమున జాతీయమహాసభ జరిగెను. అక్కడగూడ గాంధికే విజయము గలిగెను. చిత్తరంజ

నదాసువంటి ప్రముఖులు అనేకులు ఆమార్గమునఁ బడి ప్రయాణము ప్రారంభించిరి.

దేశమున రాజతిరస్కారము ప్రబలినది. అనేకదోషములమీఁద అనేకులు చెరసాలలకేగిరి. దొరతనమువారు కేవలము ప్రతిష్ఠనే ముఖ్యముగా చూచుకొని పనిచేసి ప్రజల యాదరమును పూర్తిగా గోలుపోయిరి.

పిదప గాంధి ఒక కోటిరూపాయలును ఇరువదియైదు లక్షల రాటములును కాంగ్రెసుపక్షమునకు కావలె నని చెప్పెను. కాంగ్రెసువారి లెక్కలలో ఇరువదియైదు లక్షల రాటములును నిండిపోయెను. సొమ్ముగూడ వసూలయ్యెను; గాని ఫలము గలుగలేదు. ద్రవ్య మంతయు అక్రమమార్గములలో ఖర్చయ్యెను. రాటములలో నూటికి తొంబయి మూల కూర్చుండెను.

తరువాత కాంగ్రెసు అహమ్మదాబాదులో జరిగెను. అప్పటికి స్వరాజ్యము వచ్చు ననియు స్వరాజ్యము వచ్చిన పిదపనే అహమ్మదాబాదులో కాంగ్రెసు జరుగు ననియు గాంధి చెప్పెను; గాని అట్లు జరుగలేదు. కాంగ్రెసు వలంటియరులకు అసభ్యపనులు నియమింపఁబడెను. స్వరాజ్యము రాకుండుటకు గాంధి ఏమేమో కారణములు చెప్పెను; గాని అవి అతుకలేదు.

తరువాత గాంధి శాసనోల్లంఘనమునకు పూనుకొనెను. అందులకు కొన్ని షరతులను సూచించి అవి నెఱవేరిననే శాసనోల్లంఘనము ప్రారంభింపవలె నని తన యనుచరులకు చెప్పెను; గాని గుంటూరు మన్నగ్రామ ప్రాంతములలో కొందఱు తొందరపడి కారాగారములకుఁ బోయిరి. గాంధి మొదట బార్డోలీ తాలూకాను ఇందులకు తయారుచేసి తన ఆశ్రమవాసులకు అందఱకును అప్పగింతలు చేసి బయలుదేరెను; గాని చౌరాచౌరంలో అల్లరులు, దౌర్జన్యము జరిగె నని మఱల వెనుకకు వచ్చెను. తాను తయారుచేసిన బార్డోలీలో అల్లరులు జరుగకున్నను ఆయుద్యమమును ఏల మానెనో ఆతఁడు సరియైన కారణములను చెప్పలేదు. కొలఁదిదినముల కాతఁడు అహమ్మదాబాదులో విచారింపఁబడి ఆరుసంవత్సరముల విడిఖైదు విధింపఁబడెను. ఇప్పుడు ఆత

నికి నోబిలు బహుమానము వచ్చినదనియు, ఈ డిసెంబరు ౧౯౨౩ లో విడిచెద రనియు వదంతిగా నున్నది.

---

128. డాక్టర్. యస్, సుబ్రహ్మణ్య అయ్యరు.

సుబ్రహ్మణ్యఅయ్యరుమహాశయుఁడు ౧౮౪౨ వ సంవత్సరమున మధురజిల్లాలో నవతరించెను. ఆతఁడు తొమ్మిదవయేట మిషనుపాఠశాలలో ఇంగ్లీషువర్ణములను నేర్చుకొని పిదప కృష్ణస్వామి సెట్టిచే ప్రారంభింపఁబడిన పాఠశాలలో ఇంగ్లీషు చదివెను. ఆతఁడు యుక్తసమయమున ఇంగ్లీషు భాషాపరీక్షలో నెగ్గి మధురడిప్యూటీకలెక్టరు కార్యస్థానమున గుమాస్తాగాఁ బ్రవేశించెను: గాని కొలఁదిదినములయందే జిల్లా కలెక్టరు కార్యస్థానమునకుఁ బోయి చేరుకొనెను.

అచ్చటనుండఁగా నాతఁడు న్యాయవాది పరీక్షకుఁ జదివి ఆ సంవత్సరము ఆపరీక్షకుఁ జదివినవారందఱయందును ప్రథముఁడుగా నెగ్గెను: గాని ఆతఁడు జిల్లా జడ్జియగు కాటనునకు సలాముచేయకపోవుటచే ప్లీడరుసనదు రాదయ్యెను. అయినను ఆతఁడు కలెక్టరువలన పబ్లికు ప్రాసిక్యూటరుగా ఏర్పఱుపఁబడి కలెక్టరు ఆఫీసునకు వచ్చెను. పిదప నాతఁడు మెట్రిక్యులేషనుపరీక్ష మున్నగువానిలో గెలిచి తుదకు ౧౮౬౮ సంవత్సరములో బి. యల్, పరీక్షలో నాఱితేఱెను. కొన్నిదినములు హైకోర్టు అఫిషియల్ రిపోర్టరుగా నుండిపిదప ఆఱుమాసములు మధుర తహస్సీలుదారుగాఁ బనిచేసెను. అప్పుడు ఆతఁడు హైకోర్టువకీలుగా నంగీకరింపఁబడెను.

మఱికొన్నిదినములకు ఆతఁడు మధుర మునిసిపలు కౌన్సిల్లరుగను, లోకలుబోర్డులో సభ్యుఁడుగను ఏర్పఱుపఁబడెను. ఈసమయమునందే ఆతఁడు ౧౦ వేల రూపాయలు చందాచేసి మధురలో నొకతోఁట వేయించెను. దానికి ఆతనికుటుంబమునుండి ౪ వేలుచందా వేయఁబడెను. గుడిచుట్టుగూడ మఱియొకతోఁట వేయించెను. ౧౮౮౩వ సంవత్సరములో దేవస్థానపులెక్కలు సరిగానుంచుట లేదని ఆతఁడు దేవస్థానపు సంఘముమీఁద ౪౦ వేలరూపాయలకు దావా తెచ్చి అందు

గెలిచెను. వెంటనే మధురపౌరులు ఆతనిని దేవస్థానపుసంఘములో నొక సాంఘికునిగా ఏర్పఱిచిరి అదిమొదలు ఆతఁడు దేవస్థానముల విషయమున చాల శ్రద్ధతీసికొనుచున్నాఁడు. ధర్మరక్షణసభకు అధ్యక్షుఁడై ఆతఁడు చేయుచున్న సేవ అత్యద్భుతము. అది యాతఁడు జీవితకాలమంతయు నెఱవేర్పఁ గంకణముకట్టుకొన్న ఘనకార్యము.

౧౮౭౫వ సంవత్సరములో ఏడవఎడ్వర్డు ప్రభువు యువరాజుగా నున్నపుడు భారతదేశమునకుఁ జూడవచ్చి మధురకుఁగూడ నరిగెను. అపుడు సుబ్రహ్మణ్య అయ్యరు మధురపౌరులపక్షమున ప్రభువునకు స్వాగతపత్రమును సమర్పించెను మఱియు నాతఁడు ఆయుత్సవమునకు చందాచేసిన సొమ్ములో ౧౪ వేల రూపాయలు మిగులగా వానితో వైఘనదిమీఁద వంతెన గట్టించెను ౧౮౮౪ సంవత్సరములో మద్రాసు గవర్నరు అగు గ్రాంటుడఫ్‌దొర మధురకుఁ బోయినపుడు సుని అయ్యరు మునిసిపలు వైసుప్రెసిడెంటుగా గవర్నరునకు స్వాగతపత్రమును సమర్పించెను. అపుడు గవర్నరు అతని శక్తిసామర్థ్యములను గుర్తెఱిఁగి మద్రాసు శాసనసభలో అనధికారసభ్యునిగా ఏర్పాటు చేసెను.౧౮౭౭వ సంవత్సరములో జరిగిన లిట్టను ప్రభువుగారి డిల్లీదర్బారులో నాతని కొకయోగ్యతాపత్రము ఒసఁగఁబడెను.

౧౮౮౮వ సంవత్సరములో ఆతనికి గవర్నమెంటు ప్లీడరు పదవి ఆక్టింగుగా నొసఁగఁబడెను. ఈపదవినిఁ బడసిన భారతీయులలో ఆతఁడే ప్రథముఁడు. ఈతఁడు నాగేశ్వరఅయ్యరు అనునాతనిమీఁది ఫోర్జరీ కేసులో చాల పనిచేసెను. తిరుపతి మహాంతు కేసులోఁ గూడఁ బని చేసెను.

ఇతఁడు దొరతనమువారి సేవలో నున్నను ఎప్పుడును న్యాయపథమునందే యుండెడివాఁడు; గాని ఇతరులవలెన్యాయమైనను,అన్యాయమైనను దొరతనము పక్షమునందే యుండువాఁడు కాఁడు. ఆతఁడు తనయుద్యోగకాలము అంతయు ప్రజలకు సౌకర్యములను గలిగించుట యందే గడపెను. ఆతఁడు౧౮౭౭వ సంవత్సరములో మధురలో క్షామనివారకసంఘము నెదుట, భూస్వాములవలన రహితులకు సంభవించుచున్న కష్టములు పోవునట్లు చట్టములు నిర్మింపవలయునని వాదించెను.

మునిసిపాలిటీలయందును లోకలు బోర్డులయందును ఉద్యోగుల సంఖ్యను తగ్గించి అనుద్యోగులసంఖ్యను హెచ్చింపవలయునని గూడ ఆతఁడు చాలపని చేసెను. లార్డురిపన్ ప్రభువు తీర్మానముమీఁద సలహాలు చెప్పుటకు మద్రాసు దొరతనమువారు అధికారానధికారులతో నొకసంఘమును ఏర్పఱిచిరి. ఆసాంఘికులలోఁ జాలమంది ఏర్పఱిచిన నివేదికముతో సుబ్రహ్మణ్యయ్యరు అంగీకరింపక నిర్భయముగను, బాహాటముగను తనయభిప్రాయమును దెలిపెను. భారతదేశీయమహాసభ ఉదయించినపుడు మన అయ్యరు ప్రముఖత్వమును వహించి దానివికాసమునకుఁ జాలపని చేయఁదొడఁగెను. ఆమహాసభ ప్రప్రథమమున బొంబాయిలో సమావేశమయినపుడు ఆతఁడు స్థానిక, సామ్రాజ్యశాసనసభలలోఁ గలలోపములను, చేయవలసినమార్పులను స్పష్టముగఁ బ్రకటించెను. ఈమహాసభ రెండవసమావేశము కలకత్తాలోఁ గూడినపుడు ఈతఁడు హిందూదేశదారిద్ర్యమును గుఱించిన తీర్మానమును బలపఱిచెను. ఇతఁడు మద్రాసు ప్రధానన్యాయస్థానములో జడ్జీ అగునంత దనుకను, ఆ యుద్యోగమునుండి విరామము పొందిన తరువాతను దేశీయమహాసభ సాధింపఁబూనిన విషయములలోఁ జాల పాటుపడఁ దొడఁగెను ఆ మహాసభ మద్రాసులోఁ గూడినపుడు (౧౯౧౪వ సంవత్సరములో) ఈతఁడు ఆహ్వానసంఘాధ్యక్షుఁడుగ నుండెను ఇతఁడు మద్రాసుశాసనసభలో అనధికారసభ్యుఁడుగా ఏర్పఱుపఁబడిన రెండుపర్యాయములునుగూడ అనధికారసభ్యులకుసౌకర్యములు చాలతక్కువగానుండెను. తీర్మానములను ప్రతిపాదించుటకును, ప్రతిపాదింపఁబడినవానిని గుఱించి వ్యాఖ్యానము చేయుటకును గూడ అధికారము లేకుండెను. ౧౮౮౬వ సంవత్సరములో నితఁడు మలబారులోనిరహితుల బాగుకొఱకుముదరా యిచ్చుటకుఁగాను ఒకబిల్లును శాసనసభలో నుంచెను. దీనివలనఆరహితులకు ఆదేశమున సేద్యములో లేనిభూమిని బాగుచేసి వ్యవసాయము చేయుటకు ప్రోత్సాహము కలిగెను.

౧౮౮౫వసంవత్సరమున నీతఁడు మద్రాసువిశ్వవిద్యాలయములో సభ్యుఁడుగా నేర్పఱుపఁబడెను. అందీతఁడు ౧౯౦౭వ సంవత్సరమువఱకు పనిచేసెను. భారతీయులలో విద్యాలయము వైసుచాన్సెలరు పదవిఁ బొందినవారిలో నీతఁడే ప్రథముఁడు. డాక్టరు అనుబిరుదమును బడసిన

భారతీయులలోఁ గూడ నితఁడె ప్రథముఁడు. ౧౮౯౬-వ సంవత్సరమున కానొ్వకేషను సందర్భమున నీతఁడు ఒసఁగిన ఉపన్యాసము విద్యావిషయికములగు మహోపదేశములతో నిండియున్నది. ౧౮౯౫వ సంవత్సరమున ఈతఁడు ముత్తుస్వామి అయ్యరుస్థానమున మధురలో జడ్జిగా నియమింపఁబడెను; అట్టి ముత్తుస్వామయ్యరుపదవి గ్రహించి ఆతనివలెగొప్పవాఁడనిపించుకొనుట సులభమైన పనిగాదు. ౧౮౯౯, ౧౯౦౩, ౧౯౦౬ సంవత్సరములలో నీతఁడు మద్రాసుప్రధానన్యాయస్థానములో ప్రధానన్యాయమూర్తిపదవి ఆక్టింగుగా నిర్వహించెను. ౧౯౦౦వ సంవత్సరమున సర్ బిరుదముతో నీతఁడు అలంకరింపఁబడెను. ౧౯౦౭వ సంవత్సరము నవంబరు ౧౩వ తేదిని ఈతఁడు ఆరోగ్యము చెడుటవలన ఉద్యోగమును వదులుకొనెను. ఈతఁడు ఉద్యోగము నిర్వహింపవలసినకాలములో ఎనిమిదిమాసములు తక్కువ యగుటవలన వేయిరూపాయలు రావలసిన ఉపకారవేతనము ౮౮౦ రూపాయలే వచ్చుచున్నవి.అపుడు చెన్నపురి దొరతనమువారు ఈతని సామర్థ్యమును జాల పొగడుచు వ్రాసిరి.

ఉద్యోగానంతరము ఈతఁడు మద్రాసులోసముద్రతీరమునఁ గల మందిరమున నివసించుచు అనేకపనులు చేయసాగెను. అందు కంజీవరమున, సాంఘికవిషయములనుగుఱించి పూర్వాచారపరాయణుల అభిప్రాయములను సమకూర్చుటకు ఒకపరిషత్తు ఏర్పఱిచెను. అందీతఁడు అనేకకృత్యములు చేసెను. ఇటీవల కొంతకాలము ఆతని నేత్రములకు బాధకలిగెను; గాని తరువాత బాగుపడెను.

ఇతఁడు విద్యను ముగించి గొప్పపదవులను బొందుటకు పెక్కు పేదవిద్యార్థులకు చాల సాహాయ్యముచేసెను. దక్షిణభారతదేశములో విద్యాధికులై యున్న వారందఱును, కీర్తిశేషులగు వి. కృష్ణస్వామయ్యరును, పి. ఆర్. సుందరఅయ్యరును తమ అభివృద్ధినిగుఱించి ఈతని యెడల ఎంతకృతజ్ఞులై యున్నదియు తెలిసికొనియే యున్నారు.

ఇతఁడు చేసినపనులు ఇంకను అనేకములుగలవు. వాని నన్నిటిని ప్రదర్శించుటకు ఇక్కడ స్థలములేదు. ౧౯౧౭ సంవత్సరమున మద్రాసు గవర్నరు, హోమురూలు ఉద్యమమునునిందించుచు, దానివిషయమున తమజీవితములను ధారవోయుచున్న అనిబిసెంటు,వాడియా,అరండేలు

గార్లకు నిర్బంధావాసము విధించెను అపుడు మనసుబ్రహ్మణ్యయ్యరు హఠాత్తుగ రంగమున కుఱికి ప్రభుత్వమువారి అనాలోచితకృత్యమును విమర్శింపఁ దొడఁగెను. హోమురూలు విషయమున నీతఁడు చూపు చున్న ఉత్సాహము అత్యద్భుతము. నేఁడు ఈతఁడు వయస్సున వృద్ధుఁ డయ్యును, ఉత్సాహమునందును, కార్యములయందును తరుణవయస్కుఁడై వీరవిహారము గావించుచున్నాఁడు. ఈతఁడు ఇటీవల వ్రాసిన కొన్ని యుత్తరములు అనుబంధములోఁ జూపఁబడినవి. ఈ మహా మహుఁడు ఇంకను చిరకాలము బ్రతికి భారతీయులకందఱకును మార్గ దర్శకుఁడై భారత దేశస్వపరిపాలనమును సాధించునట్లు చేయుటకు పర మేశ్వరుని ప్రార్థించుచున్నాము.

---

1. అనుబంధము.

బిసెంటునకు నిర్బంధావాసశిక్ష విధింపఁబడినపుడు డాక్టర్ సుబ్రహ్మణ్య అయ్యరు మహాశయుఁడు దేశీయులకు ఇట్లు వ్రాసెను:—

అస్మద్దేశీయులకు.—

శ్రీ చెన్నపురి గవర్నరుగారు తమశాసనసభయం దొసంగినయుప న్యాసమును మనసుందఱమును చదివితిమి. హోమురూలు విధానము నడంచుటకు యత్నములు చేయఁబడునను సూచనము అందు గాన్పిం చినది. స్వకీయ మగునట్టి గాని, వంశానుగతమగునట్టి గాని, పలుకు బడిగలవారందఱును ఈయత్నములందు తమకు తోడ్పడవలయు ననిరి. నేను బాధ్యత నెఱింగిన ప్రజాసేవకుఁడను. రాష్ట్రమున నున్నతన్యాయ స్థానపదవినిఁ బడసియుంటిని. చక్రవర్తిచే పరిగణింపఁబడి గౌరవింపఁ బడితిని. నావిశ్వవిద్యాలయమున మన్ననలను బడసితిని. వయోవృద్ధుఁ డను. విషయనిర్ధారణము జాగరూకత నభ్యసించినవాఁడను. పరిపక్వ మగు విషయనిర్ధారణదక్షతను గలవాఁడను; గాన నేను ప్రత్యుత్తర మిచ్చుచుంటిని. నేను నాభావమును దొరతనమువారికి స్పష్టపఱుచుట నాకు ముఖ్యకర్తవ్యముగ నున్నది.

నేను న్యాయాసనము నధిష్ఠించుటకు పూర్వము దేశీయమహా సభా సంబంధిని. నాకు స్వరాజ్యవిషయమును, హోమురూలువిషయ

మును నూతనములు గావు. దేశాభివృద్ధికిని, సామ్రాజ్యస్థిరత్వమునకును గూడ త్వరలో హిందూదేశమున స్వపరిపాలనావిధానము నేర్పఱుచుట యత్యవసరమని నేను నమ్ముచున్నాను. నేను చిరకాలమునుండి నమ్ముచుంటిని గతమాసమున దేశీయమహాసభ వారు ఆజ్ఞాపించినచందమున న్యాయశాస్త్రవ్యతిరేకము కానట్టియు, విజ్ఞానప్రద మగునట్టియు నాందోళనము జరుపుట యవసరము. ఇండియాహోమురూలునకు గౌరవాధ్యక్షపదవిని నేను సంతోషపూర్వకముగ స్వీకరించితిని. చురుకుగ దీక్షతో పనిచేయుటకు తగినయారోగ్యస్థితియందు ఇపుడు లేకుండుట గౌరవపదవికి మాత్రమే అంగీకరించితిని. నేను ఇపుడు వెనుదీయఁజాలను. ఈలీగు న్యాయసమ్మతముకాదని ప్రకటింపఁబడినను నేను నా పదవికి రాజీనామాను ఇచ్చువాఁడనుగాను ఈనిశ్చితమువలన తటస్థించు శిక్షలను భరించుటకు సంసిద్ధుఁడను. ఐహికప్రభుత్వములు అన్నియు ఏసర్వేశ్వరుని హస్తంగతములో అట్టి జగదీశ్వరుఁడు మానవకోటికి ఒసంగిన స్వేచ్ఛాధికారమును కోరవలయునని భారతమాతకు ఆజ్ఞాపించు తరుణమాసన్నమైనది. యుద్ధానంతరమున సామ్రాజ్యపునర్నిర్మాణమను పదములతో దేశీయమహాజనసభ వారు నిరూపించిన స్వపరిపాలనమును కోరుటకు అదను కలిగినది. హోమురూలును గోరుట మతవిధియును పౌరధర్మమును గూడ నగునని నేను విశ్వసించుచున్నాను; గాన నేను ఈవిధిని నిర్వర్తించెదను. మీరందఱు నిట్లే చేయఁదగునని అస్మద్దేశీయులరగు మిమ్ముల నందఱను కోరుచున్నాను.

ఎస్. సుబ్రహ్మణ్యము, కే, సి, ఐ, ఎల్, ఎల్, డి.

రిటైర్డు ఆక్టింగు ఛీఫ్ జస్టిసు, చెన్నపురి హైకోర్టు.

---

2. అనుబంధము.

బిసెంటుదొరసానికి పుస్తకముల విక్రయమువలన చాలధనము వచ్చుచుండెనుగాని దొరతనమువారు ఆమె పుస్తకములను విక్రయింపఁగూడదని శాసించిరి అపుడు డాక్టరు సుబ్రహ్మణ్యఅయ్యరు హిందూపత్రికలో నిట్లు వ్రాసెను.

బిసెంటునకు విధింపఁబడిన నిర్బంధావాససమాచారము దుఃఖ

కరమే గాక క్రిజలసంతృప్తులగుదురనుటకు గూడ సందేహము లేదు. ఈమెకు ఇట్టిశిక్ష విధింపఁబడుటవలన భారతజాతికి కలుగునష్టము ఎల్లర కును విదితమే; కనుక ఈవిషయమును చర్చించుట నాయుద్యమము గాదు. దొరతనమువారియుత్తరువువలని ఫలితముల నించుక విచారింప వలసి యున్నది.

తమ గ్రంథముల విక్రయించినధనమువలన నీమె యిదివఱలో కాలక్షేపము చేయుచుండెను వర్తమానమున గ్రంథవిక్రయప్రచార ములను దొరతనమువారు నిరోధించిరి. దొరతనమువారి యాజ్ఞల నీమె తిరస్కరించినయెడల జరిమానా, మూఁడుసంవత్సరముల కారాగార నివాసము నీమెకు విధింపఁబడును. ఇంతియగాక, అనేకుల నీమె పోషిం చుచున్నది. పైగా నీమెధనము నిలువచేసికొను స్వభావముకలది గాక చేతపైకము పడుటయే తడవుగ నాధనమును ప్రజలప్రంద వినియోగ పఱుచును. భారతీయులవిషయమున నీమె తన జీవితమును ధారవోసి యున్నది; గాన నిట్టితరుణమున నీమెకు ధనసహాయ మొనర్చుట మనవిధి. కృతజ్ఞతాపూర్వకముగ మన మొకనిధిని ఏర్పాటు చేసి, తన్నిధిద్రవ్య మును బంధవిముక్తి యగువఱకు బిసెంటుగారి ఖర్చులక్రింద వినియోగ పఱుపవలయును. ఈమె, నిధి ద్రవ్యమునుండి కాసైనఁ బుచ్చుకొనక పోవచ్చును. అట్లు జరిగినచో, నిధియందలి ద్రవ్యమును, మఱియొక కార్యమునకు వినియోగింపవచ్చును. భారతదేశమున కీమె యొనర్చిన సేవాసూచకమగు స్మరణచిహ్నము నొకదానిని నెలకొల్పవచ్చును.

న్యూయిండియాపత్రికకు సంబంధించినయొకచిన్నవిషయమును ఇచట వివరించుటయప్రస్తుతముగాదు. ఈపత్రికగతమూఁడుసంవత్సరము లయందును విపరీతముల నెన్నిటినో పుట్టించెను. నెల 1-కి 2, 3 మూఁడు వేలరూపాయలు నష్టము వచ్చుచుండినను ఇంతకాలమువఱకు పత్రిక నడుపఁబడినది. మొత్తమున పత్రికానిర్వహణమున మూఁడులక్షల రూపాయలు వ్యయమైనవి. వాడియా, ఆరండేలుగార్లుగూడ బిసెంటు గారివలెనే దుర్దశయం దున్నారు. బిసెంటుగారివలె వీరివిషయమున గూడ భారతీయులు కృతజ్ఞతతో చరించుట యావశ్యకము.

3. అనుబంధము.

ఈనెల 3వ తేదీని కామన్సుసభలో జరిగినవిషయములను గూర్చి తత్క్షణమే ప్రత్యుత్తర మొసంగుట అవసరమని గుర్తించుటచే నేను ఈలేఖను వ్రాయ సమకట్టితిని. ఈవిషయము పైకి వ్యక్తిసంబంధముగ కానవచ్చును; గాని కొంచెము యోచించిన నిది ప్రజాక్షేమమునకు సంబంధించినదని సుబోధకము కాకపోదు. నేను ప్రెసిడెంటు విల్సనుగారికి వ్రాసినలేఖను గుఱించి హాక్సుగారడిగిన ప్రశ్నకు మాంటేగ్యూగారొసఁగినప్రత్యుత్తరమును గూర్చియే నేను నుడువఁబోవుచున్నాను. ఇందును గుఱించి వార్తాపత్రికలలోను, అందు ముఖ్యముగ ఆంగ్లోయిండియను పత్రికలలోను తీవ్రమగు చర్చ జరుగుచున్నను ఇందు నాకు సంబంధించిన విషయములను నేను విమర్శింపఁ బూనుకొనలేదు. ఈవిషయమున కొన్నివారములకు పూర్వము న్యూయిండియాపత్రికలో ప్రకటనములు గావింపఁబడుటవలనను, అవియన్నియు పుస్తకరూపముననిప్పుడు వెలువడుటచేతను, అస్మద్దేశీయులకు నూతనవిషయములను నేనేమియు తెలుప నక్కఱ లేదని యింతవఱకును మిన్నకుంటి; కాని హాక్సుగారి ప్రశ్నకు మనకార్యదర్శిగారొసంగిన ప్రత్యుత్తరము నన్నీయుత్తరమును లిఖింపఁ బ్రేరేపించినది. ఇంతకు బూర్వము గత డిసెంబరుమాసమున మాంటేగ్యూరాజప్రతినిధి గార్లు మదరాసునగరమునకు వచ్చినపుడు జరిగినసంగతులను గూర్చియు, 8-2-18వ తేదీ చెన్నపురి ప్రభుత్వకార్యదర్శివద్దనుండి వచ్చినయుత్తరమును గూర్చియు నించుక తెలుపవలసియున్నది.

మాంటేగ్యూ రాజప్రతినిధి గార్లను సందర్శించుట.

మాంటేగ్యూ రాజప్రతినిధిగార్లను సందర్శించుటకు నియుక్తులైన వారిలో నేనొకఁడనని అనేకులకు తెలియును. నేను నియమితకాలమునకు ప్రభుత్వమువారి గృహమునకుఁ బోయి నాకేర్పఱుపఁబడిన స్థలమున నాసీనుఁడ నైన తోడనే రాజప్రతినిధిగారు తీవ్రముగ సంభాషణము నారంభించుటచే నేను విభ్రాంతమానసుఁడ నైతిని. నా లేఖతో సంబంధించిన ప్రముఖులను గూర్చియు,నన్నుగూర్చియు వారు

పలికిన వాక్యములను ప్రకటించుటయందు నేను ఎట్టి రహస్యమును బయలుపఱుచుట లేదు. ఆసంభాషణము రహస్యమని ఎవరును తలంపరు.

ప్రథమముననే రాజప్రతినిధిగారు ఆగ్రహావేశపరవశులై నేను విల్సనుగారికి వ్రాసినలేఖను గుఱించి మాటాడిరి. నన్ను వారు న్యాయదృష్టితో తిలకింపలేదనియు, నన్ను వారు తూలనాడిరనియు నేను అనుకొనవలసివచ్చినది ఏలనన: నేను అచ్చట రాజకీయవిషయములను చర్చింపఁబోయి యుంటిని; గాని ప్రెసిడెంటు విల్సనుగారికి నేను లిఖించిన కమ్మకై రాజప్రతినిధికి జవాబొసంగ సంసిద్ధుఁడనై పోలేదు. ఈవిధముగ నాకస్మికముగ నన్నెదుర్కొనుట రాజప్రతినిధికి తగదని నేను పలుకక నాకప్పుడు తోఁచినవిధమున వారి ప్రశ్నలకు ప్రత్యుత్తర మొసఁగియేయుంటిని. నే నాలేఖ వ్రాసినప్పుడు నిష్కపటహృదయముతో నేవర్తించితి ననియు, శ్రీచక్రవర్తిగారి స్నేహితులును, మిత్రమండలి వారి సంగ్రామాశయములతో నేకీభవించినవారును అగు అమెరికాప్రెసిడెంటుమూలముననే ఆసమయమున హోమురూలర్లకు క్షేమము గలుగునని అభిప్రాయము నాకు ఉండెననియు నేను వారితో నుడివితిని. అప్పటిపరిస్థితులు ఈవిధముగ నున్నవి హోమురూలు సమితియందున్న నలుగురు ప్రముఖులలో ముగ్గురు, అనఁగా: అధ్యక్షురాలగు బిసెంటుదొరసానిగారును, కార్యదర్శియగు ఆరండేలుగారును, కోశాధికారియగు వాడియాగారును, నిర్బంధావాసశిక్షపాలు కాఁబడిరి. ఆనరరీఅధ్యక్షుఁడనగు నన్నుగూడ స్థానికప్రభుత్వమువారీవిధముననే శిక్షింతురని వదంతి యెల్లయెడల ప్రబలముగా నుండెను; గావున అప్పుడిచ్చటకు వచ్చి, మఱల తమస్వదేశమగు అమెరికాకు పోవనున్న హోచ్నరుగారియొక్కయు, వారి సతియొక్కయు ఆగమనమువలన లాభమునందఁ దలఁచి, వీరి కమెరికాఖండమున, భారతదేశమునకు ఉపకారము చేయఁగల స్నేహితులు అనేకులు ఉండుట గ్రహించి, వీరు బిసెంటుప్రభృతుల విమోచనమునకై కృషి పలుపఁగలరను విశ్వాసముతో ఆలేఖను రచించి వారిమూలమున విల్సనుగారికి అందఁజేసితిని. ఆలేఖయం దీదేశప్రభుత్వము నెడలఁగావింపఁబడిన దోషారోపణముల నన్నిటికిని తగిన నిశ్చితనిదర్శనములు గలవనియు, అవసరమగు నెడల వంగదేశమున నిర్బంధశిక్ష ననుభవించు

చున్నవారి హృదయనిర్భేదకములగు కడగండ్లను గూర్చి నావద్దనున్న లేఖలను అధ్యక్షున కంపెదనని వ్రాసితిని.

మదరాసు ప్రభుత్వ కార్యదర్శి లేఖ.

ఈవిషయమై యింక నెక్కుడు విపులముగ వ్రాయనవసరము లేదు. కార్యదర్శిగారి సముఖమున, వారి అనుమతిని, వారిపక్షమున, రాజప్రతినిధిగారు నావర్తనము నెడల తమ అసంతృప్తిని వ్యక్తపఱిచిరని ఇచట నుడివినం జాలును. పిమ్మట నా లేఖనుగూర్చి ఇండియను, మదరాసు ప్రభుత్వములకు ఎట్టిసంభాషణ జరిగినదో నాకేమియు తెలియదు; గాని చెన్నపురి ప్రభుత్వ కార్యదర్శియొద్దనుండి మాత్రము నాకీ లేఖ వచ్చినది.

సెయింటు జార్జికోట
చెన్నపట్టణము 8-2-1918

అయ్యా!

అమెరికాసంయుక్తరాష్ట్రాధ్యక్షునకు మీరు వ్రాసిన లేఖయొక్క అచ్చుప్రతులు ఆలోచనసభాసమేతులగు గవర్నరుగారికి అంపఁబడినవి. మెయిలుద్వారా పంపినయెడల ఆ లేఖ గమ్యస్థానము చేరదను నుద్దేశముతో హేన్రీహిచ్నరుగారును, వారిసతియు ఈ లేఖ వ్రాయఁబడిన కొలఁదిదినములలోపుననే అమెరికాకుఁ బోవుచుండుటచే వారిద్వారా నీలేఖను మీరుపంపిరని తెలియుచున్నది. ఆయుత్తరమున ౨౮ జూను ౧౯౧౭ అను తేదీ యున్నది ఈవిషయమున రాజప్రతినిధిగారును, కార్యదర్శిగారును ప్రశ్నించి, మిమ్ము చీవాట్లు పెట్టిరని గవర్నరుగారికిని, వారిసభకును ఎఱింగింపఁబడినది. ఈస్థితిగతులలో మీపై నిక నెట్టి చర్యను నడుపకుండుటకు గవర్నరుగారును, వారి సభవారును నిశ్చయించిరి.

ఇట్లు
లయోనల్ డేవిడ్సను,
ఆక్టింగు ప్రధానకార్యదర్శి.

మాంటేగ్యూగారు ఎత్తువారిచేతిబిడ్డ.

ఈయుత్తరమువలన ఈవిషయము నంతము నొందినదని యెల్లరును దలఁచిరి; గాని దురదృష్టవశమున సంగ్రామమంత్రివర్గమువారి నాయకత్వ

మున మనసామ్రాజ్యమునకును, హిందూదేశమునకును, అపాయకరముగ పరిణమించుపరిస్థితులు ఏర్పడుచున్నవి. మనకార్యదర్శి ప్రప్రథమమున నెట్టి ఆశయాపూరితుఁడైనను, భారతభూమియందు అడుగిడినతోడనే ఇచ్చటి నిరంకుశాధికారులవలలోఁ దగుల్కొనినాఁడు. ఆంగ్లోయిండియనులును, సిడెంహాము పక్షమువారును, ఈతఁడు చక్రవర్తిమంత్రికిఁ దగినబాధ్యతా గౌరవములతో వర్తింపఁజాలఁడనియు, అచ్చటివారియిష్టానుసారము ఎత్తువారిచేతి బిడ్డఁడై వర్తించుననియు గ్రహించిరి. జూను 3 వ తేదీని జరిగిన విషయములను బట్టి ఈసారాంశము తెలుచున్నది.

భావిచర్యానిరోధపరిత్యాగము.

విల్సనుగారికి వ్రాయఁబడిన లేఖను మంత్రివర్గమువారు తమకు కొలఁదికాలము క్రిందటనే పంపిరని రాజప్రతినిధిగారు నాతోఁ జెప్పియున్నారు; గావున కార్యదర్శిగారికి అప్పటికి ఈవిషయమై తెలిసియుండకపోదు. ఒకవేళ వారికి దీనినిగుఱించి తెలియదనుకొనినను రాజప్రతినిధిగారు నాయెడలఁ గావించిన నిందకు వారుకూడ అంగీకరించిరి. చెన్నపురి ప్రభుత్వప్రధానకార్యదర్శి యుత్తరువుమాంటెగ్యూ రాజప్రతినిధిగార్ల అనుమతిలేక వెలువడియుండదు 3 వ తేదీని పార్లమెంటులో జరిగినవిషయమై నాపై నెట్టి చర్యను దీసికొనినను అందులకు నేను అంగీకరించుచున్నాను. నామాతృదేశమునకైన ఎట్టి శిక్షనైన నేనాహ్వానింతును. ఈవిషయము నాదేశమునకు అంతకును సంబంధించినది. ఇందులకు నేను స్వార్థత్యాగముతో వర్తింపననువు దొరకుట నాఅదృష్టమే; గాని వేఱొండుగాదు. నిర్బంధావాసమైనను, ద్వీపాంతరవాసమైనను, మఱి యెట్టి శిక్షయైనను నాకు భయకారకము కాఁజాలదు. ఈప్రపంచగౌరవముల నాశింపని వయసునందు భారతదేశస్వరాజ్యసంపాదనమునకై అధికారనిరంకుశమువారిచేఁ బడుటకంటె నాకు వేఱొండు గౌరవము లేదు.

నిరంకుశాధికారపరిపాలనాఫలితముగ వాటిల్లనున్న అపాయమునుండి బ్రిటిషుసామ్రాజ్యమును సంరక్షించి భారతదేశము నుద్ధరించుటకై గతవత్సరమున నిర్బంధావాసశిక్షలు దేవతలవలన నుద్దేశింపఁబడిన

వని తలంచెదను. ఈకార్యము దేశమందంతటను ఉత్సాహమును పుట్టించినది. ఇప్పుడు మఱల దేశము నిద్రావస్థయందున్నది. మఱల దానిని మేల్కొల్పుటకు నాయొక్కలఁ గావింపఁబడు చర్య కారణభూతమగునేని నేను ధన్యుఁడను. నా దేశీయులు ఈవిషయమును గ్రహించి బ్రిటిషు సామ్రాజ్యాధీనమైన స్వరాజ్యము భారతదేశమునకు లభ్యమగునటుల శాస్త్రసమ్మతాందోళనము కావించెదరు గాక.

కాక్సుగారి ప్రశ్నకు ఉత్తరమొసంగునపుడు కార్యదర్శిగారు ఉపయోగించిన మర్యాదాహీనమగుభాష స్వీయపక్షసంతృప్తికొఱకై కావింపఁబడిన తంత్రముయొక్క ఫలితమని నా అభిప్రాయము; గాని ఆతఁడు ఈ దేశమున నున్నప్పుడు నన్ను నిందించినవిషయము నచ్చటివారికెఱుకపఱచి తన నిష్పాపత్యమును వ్యక్తపఱచి యున్నచో ఎంతబాగుండును? గాని విల్సనుగారికి లేఖసంపుటలో లజ్జాకరవిషయ మెద్దియు లేదు.

సర్ బిరుద విసర్జనము.

నావిషయమున నెట్టిచర్యజరుపవలయునని మాంటేగ్యూగారి మానసమున నున్నదో నాకు తెలియుటలేదు. వారు నా సర్ బిరుదమును తొలఁగింప నెంచినచో ఆవిషయమున వారితో నాకంటె నెక్కుడు మనఃపూర్వకముగ నంగీకరించువారు వేఱొకరు ఉండఁజాలరు. ఈ దేశమునందు బిరుదములు వ్యక్తుల యిష్టములేకయే యొసఁగఁబడుచుండును. నామరణానంతరమున నెట్టిప్రభుత్వమువారికి తిరిగి యొసంగవలసిన యాబిరుద చిహ్నములను ఇప్పుడే సంతోషపూర్వకముగ ప్రభుత్వమువారికిచ్చివేసెదను.

నా సర్ బిరుదచరిత్రము.

ఈబిరుదము నేను దేశమునకుఁ గాని, ప్రభుత్వమువారికిఁ గాని చేసినసేవాఫలితముగ నాకు లభింపలేదు. నేనుధనవ్యయముచేసి దీనిని గడింపలేదు. ౧౮౯౯ వ సంవత్సరము ఆగష్టునెలలో సర్ ఆర్థరుకాలిన్సు

గారు ప్రధానన్యాయమూర్తిపదవినుండి తొలఁగి పోయిన పిమ్మట వారి స్థానమున నేను తాత్కాలికముగా పనిచేసితిని. ఈపదవిని నాకు శాశ్వతముగ నొసంగనిచ్ఛలేకపోవుటచే మామూలుప్రకారముగ ప్రభుత్వము వారు నాకు సర్ బిరుదము నొసంగి సంతృప్తి పఱుపఁజూచిరి. ఇది సామాన్యముగ జరుగువిషయమే. పిమ్మట నేను పళనికొండలపై నా స్వగృహమున నుండఁగా నీబిరుదుచిహ్నములు నేవిధముగ నందుకొందువని నాకు తెలియఁజేయఁబడెను. పోస్టుద్వారా పంపుఁడని నేను ప్రత్యుత్తర మొసఁగితిని. ఇది అధికారులకు రుచింపలేదు; గాన యొక ప్రాతఃకాలమున జిల్లాకలెక్టరువచ్చి నాకు ఆబిరుదుచిహ్నముల నొసంగి వెడలి పోయెను

బిరుదముల నిజస్థితి.

ఈబిరుదముల నిజస్థితిని గుఱించి స్వీడనుదేశచరిత్రమునం దిట్లు వ్రాయఁబడినది. ఆదేశమున మొట్టమొదట బిరుదములుప్రవేశముగాంచినప్పుడు ఇరువురుస్నేహితులకు బిరుదములు ఒసంగఁబడెను. వారు ఇరువురును అన్యోన్యానందము గావించుకొనిన పిమ్మట అందొకఁడు ఇట్లు అనియెను. "సోదరుఁడా, ఈబిరుదముల మూలమున నీవు ఎంతపొడవైతివి? కావున పాశ్చాత్యదేశములనుండి దిగుమతియైన వస్తువులలో నీబిరుదములకంటె నెక్కుడు మోసము లేదు. మర్యాదగలవారెల్లరును వీనినుండి తొలఁగుటకు యత్నింపవలెను."

నా ఉపకారవేతనము.

నాయుపకారవేతన విషయమునఁ గూడ నేను ఈవిధముగనే జవాబు ఈయఁగలవాఁడను. నాదేశాదాయమునుండియే నాయుపకారవేతన మొసంగఁబడుచున్నది మఱియు నివి పార్లమెంటువారి అనుమతి నొసంగఁబడుచున్నది; గాన ఆపార్లమెంటు శాసనమువలననేదక్క ఇతర విధముల దానిని తొలఁగించుట అసంభవము.

ఈయుపకారవేతనమును కోల్పోవుటకు నేనెంతమాత్రమును వెనుదీయను. ఈవిషయమున నన్ను బెదరించు ఆంగ్లోయిండియనుపత్రి

కలు ఈయుపకారవేతనము తీసివేయఁబడిన నాకు సన్యాసిసంఘము నుండి సహాయమురాఁగల దని యెఱుఁగవలయును. ఈసంఘము దివ్య జ్ఞానసమాజము కాదని నేను చెప్పవలసియున్నది..

సర్ జె. డి. రీసుగారు.

నాయుత్తరము వృద్ధత్వజనితమగు బుద్ధిమాంద్యఫలితమని రీసు గారు పలికిన వాక్యమును గూర్చి యించుక చెప్పవలసియున్నది. ఈతని వాక్యములు అసత్యములని నేను మున్మాటికిని చెప్పఁగలను. నాధీశక్తి యిప్పటి కంటె నెక్కుడు తీక్ష్ణముగ నెప్పుడును లేదు. కామన్సు సభలో నీసభ్యుని జీవితము మొదటినుండి నేటివఱకును సద్బుద్ధిని వ్యక్తపఱిచి యుండలేదని చెప్పక తప్పదు.

యస్. సుబ్రహ్మణ్య అయ్యరు.

'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము. చెన్నపురి. 1923.

ఆంధ్ర గ్రంథములు.

		ప్రతి 1-కి రూ.	అ.
అచ్చ తెనుగు రామాయణము, శుద్ధప్రతి	....	1	4
అధ్యాత్మరామాయణము, ప్రాచీనప్రతి	....	1	0
అనంతునిఛందము, ఛందోదర్పణము	....	0	14
అనిరుద్ధచరిత్రము, కనుపర్తిఅబ్బయామాత్యప్రణీతము		0	8
అప్పకవీయము, నూతనముద్రితము	....	2	8
,, విమర్శనము మాత్రము	....	0	8
అంబరీషోపాఖ్యానము, సటీక (భాగవతము)	....	0	4
ఆముక్తమాల్యద, వావిళ్ల. రామస్వామిశాస్త్రిగారి వ్యాఖ్యానముతో మేలుకాకితములమీఁద చక్కఁగ మరలముద్రించి యున్నారము	....	3	8
ఆంజనేయదండకము, హనుమద్దండకము	....	0	2
ఆంధ్రభాగవతము, పోతనామాత్యప్రణీతము, ఇదివఱకుముద్రితమైనప్రతులకన్న అన్నివిధముల బాగుగనున్నది	....	6	0
డిటో అత్యుత్తమప్రతి, రెండుసాల్యములు	....	8	0
శ్రీమదాంధ్రభారతము-పద్యకావ్యము:—			
7 సంపుటముల ప్రతి	....	15	12
3 సంపుటముల ప్రతి	....	15	0
ఆది, సభాపర్వములుగల సంపుటము	....	2	4
ఆరణ్యపర్వము ,,	...	2	4
విరాటోద్యోగపర్వములు ,,	....	2	4
భీష్మద్రోణపర్వములుగల సంపుటము	....	2	4
కర్ణశల్యసౌప్తిక స్త్రీపర్వములు	....	2	4
శాంతిపర్వము	....	2	4
ఆనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వములుగల సంపుటము		2	4

ఆంధ్రగ్రంథములు.

	ప్రతి 1-కి రూ.	అ.
ఆదిపంచకము, ఒకటేసంపుటము	6	8
యుద్ధపంచకము స్త్రీపర్వము ,, ...	4	4
శాంతిసప్తకము ,, ...	4	4
ఆంధ్రభారతవిమర్శనము, మల్లాదిసూర్యనారాయణశాస్త్రి	0	8
ఆంధ్రభాషాభూషణము	0	2
ఆంధ్రభాషార్ణవము, అట్టబైండు ...	0	12
ఆంధ్రనామసంగ్రహము, ఆంధ్రనామశేషము, సాంబనిఘంటువు టీకానుక్రమణికా సహితము	0	12
డిటో కాలికోబైండు	1	0
ఆంధ్ర చంద్రాలోకము, సటీక	0	8
ఆనందరంగరాట్ఛందము	1	8
ఉత్తరరామాయణము, కంకంటిపాపరాజప్రణీతము చక్కనికూర్పు	2	4
కవికర్ణరసాయనము, మాంధాతచరిత్ర	1	8
కళాపూర్ణోదయము, గళసరికాకలితములు	2	4
కాశీఖండము, చక్కనిక్రొత్తకూర్పు	1	8
కుచేలోపాఖ్యానము, సటీక, (భాగవతములోనిది)	0	4
డిటో గట్టుప్రభువుకృతము	0	6
కృష్ణరాయవిజయము, కుమారధూర్జటికృతము	0	8
గజేంద్ర మోక్షము, సటీక, చక్కనికూర్పు	0	8
గోపీనాథరామాయణము, 2 సంపుటములు, శ్రీమద్రామాయణమునకు సరియైనపద్యము, కవనముమిక్కిలిసొంపు, పీఠిక అతివిపులము	5	8
జైమినిభారతము, అశ్వమేధపర్వము, చక్కనికూర్పు	1	0
నరసభూపాలీయము, అట్టబైండు	0	10
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశస్కంధములు, శ్రీశతఘంటము, వేంకటరంగశాస్త్రికృతము	6	8
డిటో 3 వాల్యములు	7	0

ఆంధ్రవచనగ్రంథములు.

		ప్రతి 1-కి రూ.	అ.
ద్వాదశోపనిషత్తులు, సంస్కృతమునకు సరియైన తెలుగువచనము	....	3	0
పంజాబుఅల్లరి, సహాయనిరాకరణోద్యమము, దేశీయమహాసభవారిచే నిర్మింపబడిన కమిటీవారిరిపోర్టు ననుసరించి ఆంధ్రప్రజాసంఘము వారిచే చిత్రపటములతో ప్రకటింపబడినది	....	0	8
తిలకుగారి సెక్యూరిటీకేసు, ఉపన్యాసములు	....	0	14
మదనమోహన మాళవ్యగారి జీవితము, పంజాబుఅల్లరి		0	8
శ్రీవివేకానందవిజయము	....	1	12
ప్రాచీనదేశ చరిత్రలు	....	1	12
భారతరమణీమణులు, ప్రథమభాగము	....	0	12
డిటో రెండవభాగము	....	0	8
శ్రీమహాభక్తవిజయము	....	4	0
హితోపదేశము, సులభశైలి	....	0	12
సంగ్రహరామాయణము, శ్రీశేషాద్రిశర్మకృతము	....	0	10
సంగ్రహభారతము ,,	....	1	0
సంగ్రహభాగవతము ,,		(అచ్చగుచున్నది.)	
దశకుమారచరిత్రము, ఎనముచింతల సంజీవరాయశాస్త్రిది		1	8
యజుర్వేదకథాసంగ్రహము	....	0	8
మదనకామరాజుకథలు, చక్కనికూర్పు	....	0	14
భోజకాళిదాసకథలు, 1-వ భాగము	....	0	12
వక్కనుపూర్వకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము	....	1	8
సంస్కృతనాటకకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము		1	4
భోజునికథలు	....	0	8
విక్రమార్కునికథలు	....	0	8
బేతాళునికథలు	....	0	8
పరమానంద శిష్యులకథలు	....	0	3
వైద్యులకథలు	....	0	4
తాతాచార్యులకథలు	....	0	6
నలుగురుమంత్రులకథలు	....	0	4